కీర్తనలు

అన్నమయ్య కీర్తనలు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం

గురు దక్షిణామూర్తి

గురు వేదవ్యాస మహర్షి

గురు శుక మహర్షి

గురు నారద మహర్షి

గురు వాల్మీకి మహర్షి

గురు శ్రీకృష్ణ

శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ

గురు బాబాజి

గురు గౌతమ బుద్ధ

గురు ఆదిశంకరాచార్య

గురు రామానుజాచార్యులు

గురు జ్ఞానేశ్వర్

గురు రవిదాస్

గురు కబీర్ దాస్

గురు చైతన్య మహా ప్రభువు

గురు నానక్

గురు రాఘవేంద్ర స్వామి

గురు వీరబ్రహ్మేంద్ర స్వామి

యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి

గురు లాహిరి మహాశయ

గురు రామకృష్ణ పరమహంస

అమ్మ శారదా దేవి

గురు వివేకానంద

గురు సాయిబాబా

గురు అరబిందో

గురు రమణ మహర్షి

గురు యోగానంద

గురు భక్తివేదాంత ప్రభుపాద

గురు మళయాళ స్వామి

గురు విద్యాప్రకాశానందగిరి

గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని గీతా దీక్ష వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) గీతా దీక్ష వారి వెబ్ సైట్: http://geetadeeksha.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో గీతా దీక్ష వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

గీతా దీక్ష వారి వెబ్ సైట్:

http://www.geetadeeksha.com

అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజూ పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

అన్నమయ్య

కీర్తనలు

1. అంతయు నీవే హరి పుండరీకాక్ష
2. అన్నమయ్య – అనుయాయులు
   (పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, తరిగొండ వెంగమాంబ)
3. "అ ఆ ఇ ఈ" లలో అన్నమయ్య
4. అన్నమయ్య అధ్యాత్మ చింతన
5. పొడవుకు పొడవైన పురుషోత్తమా
6. ఏలుకో శృంగార రాయ

– అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

సతీ సమేత అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

Address :

Flat No.5; Plot 61,

Siddardha Apartments,

Siddardha Nagar,

Hyderabad - 500 038, A.P, India

E-Mail : deekshitulu_a@yhaoo.com

Mobile : 9393021360

Website: http://www.geetadeeksha.com/

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



అంతయు నీవే హరి పుండరీకాక్ష

ఎన్నుకొన్న
అన్నమయ్య సంకీర్తనలకు

అవతారిక మరియు భావ వివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

అంతయు నీవే హరి పుండరీకాక్ష

మొదటి ప్రచురణ
అక్టోబర్ 2012

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :
కె. వి. ఆర్
98495 79345

అంకితము

శ్రీహరి పాదపద్మములకు

భక్తితో

కం ॥ హరి చరణములకు భక్తిని
మురిపెంబుగ బూనినేను మ్రొక్కుచుదీనిన్
సరగున అంకితమిత్తును
తరియింపగ 'అమరవాది' తరముల వరుసల్

అన్నమయ్య – అనుయాయులు

అన్నమయ్య "భక్తి" కీర్తనలు

విషయ సూచిక

క్ర.సం.	కీర్తన	పేజి
1.	అంగనకు విరహమే సింగారము	129
2.	అంగనలాల మనచేనాడించుకొనె గాని	87
3.	అంజినీదేవి కొడుకు హనుమంతుడు	31
4.	అంజలి రంజలి రయంతే	173
5.	అడియనడియ నయ్య యఖిలలోకైకనాథ	35
6.	అచ్చుతు గనియెడి నామము గలిగినయట్టి	01
7.	అతడితడా వెన్నంతట దొంగిలినాడు	09
8.	అన్నిటిపై నున్నట్టు హరిపై నుండదు మనసు	95
9.	అతని నమ్మలేరల్పమతులు భూమి	157
10.	అభయదాయకుడవదె నీవే గతి	73
11.	అప్పడైన హరి యెక్కేనదివోతేరు	33
12.	అతడేపో మా యేలిక అతడే జగన్మూలము	03
13.	ఆది విష్ణువీతడే యటరమ్మా	41

14.	ఇంతటాహరినే కాని యెందునను గాననన్ను	123
15.	ఇందులోననే నెవ్వరిబోలుదు	155
16.	ఇతని కితడే కాక యితరులు సరియా	115
17.	ఇహమెట్లో పరమెట్లో ఇకనాకు	121
18.	ఇవియే పో ప్రద్యుమ్న యిహపరసాధనము	183
19.	ఈడనిందరికి నేలికైవున్నాడు	85
20.	ఈతని నెరుగకుంటే నిలస్వామిద్రోహము	89
21.	ఉప్పవడముగావయ్యా వుయ్యాలమంచము	51
22.	ఎత్తరే యారతులు యియ్యరే కానుకలు	201
23.	ఎన్నిమహిమలవాడె ఈ దేవుడు	91
24.	ఎవ్వరుగాననివాడు యీ యశోదగనెనట్టె	71
25.	ఎవ్వరి భాగ్యం బెట్టున్నదో	127
26.	ఏమీనెరుగ నిమమ్ము నెక్కుడు	93
27.	ఒకరిగానగ నొడబడదుమనసు	83
28.	కదిసి యాతడు మమ్ముగాచుగాక	05
29.	కరేణకింమాం గృహీతుంతే	47
30.	కలశాపురముకాడకాచుకున్నాడు	109

31.	కలిగె మాకిదే కైవల్య సారము	195
32.	కేశవ దాసినైతి గెలిచి తనన్నిటాను	65
33.	కౌసల్యనందనరామా కమలాప్తకులరామ	107
34.	కుందనంపుమై గొల్లెతతా	169
35.	కొల్లునునవ్వేరు నిన్ను గోవిందుడా	19
36.	కోడెగాడు గదవమ్మ గోవిందరాజు	15
37.	ఘనుడాతడాయితడు కలశాపురముకాడ	143
38.	చక్కని సరసపుశిశువు	55
39.	చూచిమోహించకుందురా సురులైన నరులైన	119
40.	చిరునవ్వు మెఱుగారు సిగ్గుల మోము తోడ	49
41.	చెల్లె నీ చేతలు నీకే చేరి మేడె గుడిదానా	187
42.	చేకొని కొలువరో శ్రీనరసింహము	37
43.	జగములేలే వాడవు జనార్దనుడవు	43
44.	తగుమునులు ఋషులు తపములు సేయగ	69
45.	తలలేదు తోకలేదు దైవమా నీ మాయలకు	179
46.	తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైన పొలము	29
47.	దాసోహమను బుద్ధి తలచరు దానవులు	147
48.	దేవ నీ పక్షపాతమే తిరిగే లోకాలవెల్లో	81
49.	దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ	141
50.	నమోనమోదశరథ నందన మమ్మురక్షించు	181

51.	నరుడాయాతడు ఆదినారాయణుడు గాక	07
52.	నరులార నేడేవో నారసింహ జయంతి	11
53.	నాపాలిఘన నిధానమవు నీవే	67
54.	నారాయణుడ నీనామము మంత్రించివేసి	149
55.	నారాయణుని శ్రీనామమిది	191
56.	నాలం వా తవ నయవచనం	53
57.	నిద్దిరించి పాలజలనిధి వలెనే	133
58.	నీవు జగన్నాథుడవు నేనొక జీవుడ	99
59.	నెయ్యములల్లో నేరేళ్ళో	171
60.	పరమవివేకులాల బంధువులాల	185
61.	పసులుగాచేటి కోల పసుపుజేల	167
62.	పేరునారాయణుడవు బెంబాడి చేతలు	113
63.	ప్రలపనవచనై: ఫలమిహి కిం	177
64.	బోధింపరే యెరిగిన బుధులాల పెద్దలాల	145
65.	భక్తినీపై దొక్కటె పరమసుఖము	151
66.	భూమిలోన గొత్తలాయ బుత్రోత్సవమది	153
67.	మంచివాడవంతేపో మాధవరాయా	13
68.	మలసి చూడరో మగసింహము	131
69.	మా దురితములు వాపి మమ్ముగాచుటరుదా	125
70.	మొల నూలి గొల్లెత మురియుచును	163

71.	మేలుకొనవే	61
72.	యెన్నిమారులు యిట్టె నీ పనులు	59
73.	రామ కృష్ణ నీవు నీవు నందే రాజ్యమేలుచుందువు	39
74.	రారా! చిన్నన్నా! రారోరి చిన్నవాడ	135
75.	లంపుగుబ్బల గొల్లెతల లంజకాడనీ	57
76.	వారిధిశయనవో వటపత్ర పరియాంక	25
77.	వారివారి భాగ్యములు వ్రాసివున్నవి నొసళ్ళ	103
78.	వినవమ్మ జానకి నీ విభుడింతసేసినాడు	101
79.	విష్ణుడొక్కడే విశ్వాత్మకుడు	117
80.	వీడెవోలక్ష్మీపతి వీడెవో సర్వేశుడు	45
81.	వైష్ణవుల సొమ్ము నేను వారు నీ సొమ్ము	27
82.	వేడుక కాడితడు విట్ఠలేశుడు	17
83.	వేదపట్టి యికనేమి వెదకేరు చదివేరు	79
84.	వోవో రాకాసులాల వొద్దు సుండీ వైరము	137
85.	శంకమ నీవు సాక్షి చక్రమ నీవు సాక్షి	97
86.	శిష్టరక్షణమును దుష్ట నిగ్రహమును	139
87.	శిన్నెక తేవే శెలువుని తా	165
88.	శ్రీ వేంకటేశ్వరుడు శ్రీయలమేల్మంగతోడ	21

89.	సతితోడ సారె సారెకు సరసములాడుకొంటా	23
90.	సదానందము సర్వేశ్వర నీ-	105
81.	సర్వేశ్వరా నీతో సరియెవ్వరు	111
92.	సమమతినని నీవే చాటుదువు	189
93.	సిన్నవాడవని నమ్మసెల్లదు నిన్ను	175
94.	సీతాసమేతరామ శ్రీరామ	77
95.	సుతుని నరకుని జంప జూచినాడవు సుమ్మీ	161
96.	స్వతంత్రుడవు నీవు సరిలేని దొరవు	193
97.	హరియవతారమీతడు అన్నమయ్య	159
98.	హరి నీవే సర్వాత్మకుడవు	63
99.	హరికృష్ణ మేలుకొను ఆదిపురుషా	75
100.	హరిహరి యిందరికి నబ్బురముగాని యిది	197
101.	హరి హరి నీ మాయమహిమ	199

ప్రార్థన

కం॥ శ్రీమన్నారాయణుపై
నామది యిటు నిల్చుటెల్ల నరహరికృపయే
ఏమరి భవసాగరమున
నే మరువక దిద్దుమయ్య నిగమ సువేద్యా!

ఉ॥ శ్రీవనితామనోహరుడు చిన్మయరూపుడు శేషశాయియున్
భూవిభుడౌ పరాత్పరుని పున్నెము కొల్లయివాని మెచ్చుచున్
దావతిజెప్పినాడనవతారిక తోడుత భావసంగ్రహం
బీవిధి వేంకటేశ్వరుడ! యేమని నీదయనుగ్గడించెదన్?

కం॥ అవతారంబులు పదియట
అవిరళముగ వాటిదాల్చి ఆర్తుల సఖులన్
అవనిని బ్రోచినవైనము
అవలీలగనట్టి కథలె హరికథలాయెన్

సీ॥ బొరియ గప్పలు జేర వుదధిమీనంబీద
నింగిపక్కియెగురనెపమెవండు?
చీమకుదోమకు చిరుతకు కరికిని
పాముతేళ్ళకు నొప్పు పసయెవండు?
నరులందు సురులదు నానాయసురులందు
భావాలగల్పించు మతి యెవండు?
జన్మాంతరంబుల సతమతంబులజేసి
కర్మదీర్పించెడి ఘనుడెవండు?

ఆ.వె॥ ఇందుగలడు 'చూడ' నందులేడా? యని
సందియమ్ము వలదు సర్వమతడె
ఇందు రవి నయనుని ఈరీతి కీర్తించి
శ్వాస ఆగుటైన సమ్మతంబె.

తే॥ రోమకూపములందున లోకములను
దాల్చి పోషించి రక్షించు తండ్రియెవడు?
సవితు దర్శించగా జ్ఞాన చక్షువేది?
దాని తెరిపించు గురువెక్కడని వెదుకను?

చం॥ పదియవతారముల్ బడసి పంకజనాభుడు ధర్మరక్షణన్
ముదముగ జేసె; పాడె తను పుణ్యుడు అన్నమ వేల కీర్తనల్
పదునుగ, వేయినామముల స్వామిని సంస్తుతిజేసె, పేర్మితో
ఇదెగొని వేయికీర్తనల నెంచితిరా పదిసంపుటంబులన్

శా॥ కాయంబేటికి గొల్వకున్న హరి నీ కావ్యాలు నాకేటికిన్?
ప్రాయంబేటికి పాడకున్న మది సంభావించి యాశ్రీపతిన్?
ధ్యేయంబేమిటి జన్మనెత్తిమనిషై దీనోద్ధరున్ జేరకన్
న్యాయంబే? యిది నాదు బోధ వినుడీ నారాయణున్ మ్రొక్కుడీ

ఆ.వె॥ వేయి కీర్తనములు పేర్చితినొకచోట
సంపుటమ్ములు 'పది' చక్కనాయె
అన్నమయ్యకిదియె హారతి శ్రీహరీ!
జన్మ అయినదయ్య! సార్థకంబు

మ॥ ఎరుగన్ స్తోత్రము జేయలేను తపముల్ హెచ్చాయె నజ్ఞానమే
యెరుగన్ వేదము శాస్త్రధర్మ విధులన్ యేపూజలున్ రావు, నా-
కరువై దీక్షితులన్నపేరు మిగిలెన్ అబ్బోసి!! వింతే సుమీ!
బరువున్ మోయగలేను వేంకటపతీ! పాపోపశాంతీయవే.

సీ॥ కామక్రోధములడ్డి కట్టేయ జూచిన
నన్నొదలరేయందు విన్నపముగ
రంభాది భామల రతిగోల నాకేల
తిరుమల నాఆత్మ తిరుగవలెను
చిత్రగుప్తుడు నన్ను శిక్షింపబోయిన
కేల్మొక్కి చూపుదు కీర్తనములు
దండధరుడు బట్టి దండించదలచిన
ఆర్తితో పాడెదనన్నమయ్య

ఆ.వె॥ జన్మపీకులాట చదువుల చెరలాట
మరల మరులగోల పాపహేల,
వింత ఆటచాలు వేంకటనగవిభో!
బక్కపాణినయ్య! పగయిదేల?

ఉ॥ చాలదు చాలబోదనుచు చాలతెరంగుల చింత చావకన్
చాలనకుండ వేసరితి సంపదకై హరిబాటనొగ్గితిన్
చాలని, కుంటిజేసినను చావుయిదేనని నచ్చజెప్పి, రే!!
చాలుర నన్ను జేరుమని సద్గురు డన్నమదారిబెట్టె, పో!

మత్తకోకిల :
ఏమిభాగ్యము! యెంత చిత్రము మేమనందునుయెన్నడో
ఏమిపూజలు సేసినాడనొ ఈ విశిష్ఠత దక్కెరా
వేమరొవిధులన్ నుతించగ విష్ణుదేవుడు మెచ్చగా
ఓ మహాత్ముడ! అన్నమార్యుడ వూరడిల్లెద నీ స్మృతిన్.

ముందుమాట

వేయి నామాలదేవుడు; వేయి రూపాలదేవుడు; వేయి మోముల దేవుడు; వేయి కన్నులదేవుడు; వేయి పాదముల దేవుడని వేదము వేనోళ్ళ పొగిడే దైవము పురుషోత్తముడు. ఆ విశ్వరూపుని అన్నమాచార్యులవారు ముప్పది రెండు వేల కీర్తనలు పాడి మెప్పించి తరించారు. ఆరువందల సంవత్సరాలయినా అన్నమయ్య కీర్తన వినినిదే వేంకటరమణునికి వేకువ కాదు. స్వామి సేవకై వేచిన వేల్పులు వేసరి, వేంకటనాథా! నీదేవేరులనైనా వేడుక జేయవయ్యా! అని వేడుకొంటున్నారు.

వేంకటేశ్వరా! అనంతమైన నీ భక్తుల త్రొక్కిసలాట తట్టుకొనే శక్తి నాకు లేదయ్యా! అర్భకుడిని అంటూనే నా బోంట్లు సందు దొరికితే ఒక్క రెప్పపాటు కాలమైనా చూడాలని వువ్విళ్ళూరే అందం ఆ శ్రీనివాసునిది. స్వామి సాన్నిధ్యం సాధ్యంకాదని నేనొకపనిచేశాను. రోజుకొక్కక్క కీర్తన చొప్పున అన్నమాచార్యులవారి కీర్తనలను పాడి, మధించి, దాని భావ వివరణ వ్రాస్తాను. ఆ కీర్తనకు ఉపోద్ఘాతంలాంటి అవతారికను జోడిస్తాను. ఆవిధంగా నూరు కీర్తనలయ్యాక కంప్యూటర్‌లో భద్రపరుస్తాను. ఆ విధంగా కీర్తనల సంపుటములు ఒకదాని తరువాత ఒకటిగా తొమ్మిది పూర్తి అయినవి.

ఇదిగో మీ చేతిలో వున్న ఈ సంపుటము పదియవది దీనితో వేయి కీర్తనలు పూర్తి అవుతాయి. వేయి నామముల వేంకటేశ్వరుని వేయి కీర్తనలతో వేడుకోవటం నిజంగా వేల జన్మల వేసరిన వెడగు బడగునకు వేడుకే. ఈ సందర్భంగా నేను విన్నవించే ఈ ముందుమాట నా మనస్సులోని మాటయై మీ ముందున్నది.

రోజులో ఒక్క గంట సమయం ఈ మూడింటిలో ఒక్క పనికి కేటాయించండి. 1) భగవంతుని గురించి వినండి. 2) భగవంతుని (ఏ పేరుతో పిలిచినా పర్వాలేదు) ప్రార్థించండి. 3) భగవంతునిపై వ్రాయండి. ఏ పనిచేసినా కర్తవ్య భావనతో చేయండి కర్తృత్వ భావనతో కాదు. అంటే అది నా బాధ్యత అనుకొని చేయండి. కానీ నేనే దీన్ని చేయగల మొనగాణ్ణి అనే గర్వంతో చేయకండి. అనవసరమైన మాటలు, పనులు, ఆలోచనలు

వదిలేయండి. హలో, హాయ్, బుల్‌షిట్... ఇత్యాది వూతపదాలు మానివేసి 'హరీ' అనండి 'సాయి' అనండి 'శివా' అనండి, 'శ్రీరాం' అనండి మీలో వచ్చే మార్పుకి మీరే ఆశ్చర్యపోతారు. దూషణ భూషణలు (తిట్లూ, పొగడ్తలు) దేహానికే నాలోనివాడికి (అంతర్యామికి) కాదు అని గ్రహించండి. చివరి శ్వాసవరకు ఇట్లా వుండగలిగితే 'మోక్షం' అనేది సాధ్యమే. ఇందులో సందేహం లేదు. కాని తమాషా యేమిటంటే దేహమే మనం అనుకొని భ్రమతోనే వుంటాము. అరిషడ్వర్గాలవశమై అవస్థలు పడుతుంటాం. ఇందుకు ఆ శ్రీపతి మాయ ముఖ్యకారణం. దాన్ని జయించడం యెవరి తరమూ కాదు.

దానికి పెద్దలు ఒక వుపాయం చెప్పారు. అదే శరణాగతి. ఆ స్వామిని శరణుజొచ్చి "అన్యధాశరణం నాస్తి త్వమేవ శరణం మమ" (నీవేతప్ప ఇత: పరంబెరుగ) అని నిత్యమూ వేడుకోవాలి. అప్పుడే ఆ శ్రీహరి నిన్ను ఆ శరణాగతుల "క్యూ"లో చేర్చుకొంటాడు. అది చేంతాడంత "క్యూ". మీవంతు యెప్పుడొస్తుందో తెలియదు. రావడమైతే గ్యారంటీ. కానీ అప్పటిదాకా నీభక్తి నిలుస్తుందా? ఈలోపుగా యెన్ని ఆశల పల్లకీలు!! యెన్ని నిరాశల నిస్సత్తువలు!! యెన్ని భ్రమలు, యెన్ని కన్నీళ్ళు!! యెన్ని వువ్విళ్ళు!! చెప్పలేము. తుకారాం వంటి భక్తులే "వున్నావా? అసలున్నావా? వుంటే కళ్ళు మూసుకున్నావా! ఈలోకం తీరు చూడకున్నావా?" అని నిగ్గదీశారు. మరి మనలాంటి అర్భకులు ఆయన శోధనలను తట్టుకోగలరా? నూరు నోములఫలం ఒక్క రంకుతో పోయినట్లు ఆయనతో ఆడే ఈ వైకుంఠపాళి ఆటలో నిచ్చెనల నెక్కించేది ఆయనే... పాములతో కరిపించి క్రిందికి దించేది ఆయనే. ఎవరి అదృష్టం ఎలావుంటుందో ఎవరికీ తెలీదు. ఒక్కటేదారి. అదే శరణు మహానుభావా! అనడమే.

చిన్న పిల్లలు ఆటలలో అనేకరకములైన చేష్టలతో, మాటలతో, పెద్దలవలె ఆరింద మాటలు మాట్లాడుతూ పెద్దవారికి వినోదం కలిగిస్తారు. వారి ఆటలలో నిజము లేదని వారికి నిజంగా తెలియదు. వారు తాము చేసేది నిజమే అనుకొంటారు. అవునా? పరమాత్మకూడా అలాగే మన వెంపర్లాట, సుఖదు:ఖ భ్రాంతిని జూచి నవ్వుకొంటుంటాడు. ఒకాయన స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకొని గొప్ప విందు ఇస్తాడు. ఇప్పుడు చూడండి.

నిన్న ఆ స్థలమూ వాడిది కాదు. ఇల్లూ వాడిదికాదు. రేపు ఆ రెండూ వాడివి అవునో కాదో తెలియదు. ఇప్పుడు మాత్రమే వాడివి. రేపు వాడేవుండకపోతే ఇల్లేమిటి వాకిలేమిటి? రాజులు కట్టించిన కోటలు నిలిచాయా? జమీందారుల భూములు నిలిచాయా? కానీ ఒక పోతన నిలిచాడు, ఒక అన్నమయ్య నిలిచాడు, కృష్ణరాయని కీర్తి నిలిచింది. అందుకని మంచిని పెంపొందించండి.

అయితే ఇదీ ఒకనాటికి కాలగర్భంలో కలిసిపోతాయి. ఎ.డి. 5000 నాటికి నేడు వినిపించే ఏ పేరూ వినిపించదు. అవునా? అందుకే వేదాంతులు కీర్తికోసం కూడా పాకులాడరు. వారు ముక్తిని కోరుకొంటారు. జననమరణాల చక్రవ్యూహంనుండి విముక్తిని కోరుకొంటారు. పరమాత్మలో ఐక్యం కావాలని కోరుకొంటారు. అది అంత సులభసాధ్యం కాదు. తుది శ్వాసదాకా యే భ్రమలకూ లొంగక, నాకు నీవుతప్ప ఇంకేమీ వద్దు, నీవే నాకు దిక్కు అని వుండగలమా? మీరు అవునంటే ఆ దేవదేవుడూ అవునంటాడు. ఇది జరిగేపనేనా? ఏమో... యెవరికేది ప్రాప్తమో ఏడుకొండల వాడికి కాక యెవరికి తెలుసు?

ఈ పదియవ సంపుటిలో కూడా 101 కీర్తనల నందించి 1009 కీర్తనలు పూర్తిచేయాలని నా ఆశ. ఇది మోకాళ్ళపర్వతం. నావల్ల అవుతుందా ప్రభూ! అని రోజూ నిద్రలేస్తూనే... అర్ధిస్తుంటాను.

ఇది ఒక మహాయాగము. మంత్రమూ తంత్రమూ, మడి ఆచారము, శమము దమమూ, శక్తియుక్తీ లేని నాబోటి సామాన్యుడు ఈ బరువు మోయగలడా? తూర్పున వేగుచుక్క దర్శనం కోసం రాత్రంతా నిద్రలేక నిద్రరాక యెదురు తెన్నులు చూచిన బడుగునకు తెల్లవారు జామున ఆవేగుచుక్క దర్శనంతో ఆశ చిగురించినట్లు రోజులు గడుస్తున్నకొద్దీ మెల్లిమెల్లిగ నా గమ్యం కూడా దగ్గరవుతోంది.

ఒక కీటకము తనచుట్టూ ఝుంకారముతో తిరిగిన భ్రమరాన్ని చూచి భయంతో కూడిన విభ్రమకు లోనై దాన్నే ధ్యానిస్తూ కొన్నాళ్ళకి అది కూడా భ్రమరం అయిపోతుందట. ఇది ప్రకృతి సిద్ధాంతం. దీన్నే భ్రమర

కీటకన్యాయం అంటారు పెద్దలు. నిత్యమూ హరినే స్మరిస్తూ 32,000 కీర్తనలు చెప్పి హరి సాయిజ్యం పొందారు అన్నమాచార్యులవారు. ఇది 600 ఏళ్ళ క్రిందటి చరిత్ర. అంత దీక్షగాని హరికృపగాని లేని అర్భకుణ్ణి నేను. అయినా అనునిత్యం అన్నమయ్య కీర్తనలలో గడిపినందున నాకూ కీర్తనలు వ్రాయగలశక్తి వచ్చింది. అయస్కాంతంతో ఇనుపముక్కను అనేక మార్లు రాపాడిస్తే ఇనుపముక్క కూడా ఒక చిన్న అయస్కాంతమవుతుంది. ఇది "సైన్సు" చెప్పే సత్యం. అట్టి ఇనుపముక్క అయస్కాంతశక్తి అల్పమూ, పరిమితమూ కూడా. కీర్తన రాగమేమిటో తెలియని అజ్ఞాని సృజనాత్మకత కూడా చెప్పుకోదగ్గది కాదు. అయినా? హరికృపకిది ఉదాహరణయే కదా!

అందాల హరి గొలిచిన అన్నమాచార్యుడా!
అందించితివయ్య! ముక్తినన్నమాచార్యుడా! **॥పల్లవి॥**

పాపడిగా గొన్నాళ్ళు పడుచుపిచ్చి కొన్నాళ్ళు
పాపపు పని కొన్నాళ్ళు పగరగులుట గొన్నాళ్ళు
పాపలతో గొన్నాళ్ళు పలుభ్రమలతో గొన్నాళ్ళు
పాపముడుగ జేరితి హరిబాట నన్నమార్యుడా! **॥అందాల॥**

అమరిన కీటక మొండు అదె భ్రమరంబయినట్లు
అమలుడవగు నీవైతిని అన్నమాచార్యుడా
అమరని వెస నాకేటికి? అసురత్వము బోద్రోలుము
అమరవాది నయ్య! నేను అన్నమాచార్యుడా! **॥అందాల॥**

అదె శ్రీవేంకటనగమున అలమేలుమంగ గూడి
ముదమారగ వరాలిచ్చి మురహరి గోవిందుడు
ఇదిగో అవతారికలు ఇదె భావ వివరణలు
అదె నీకీర్తనల జడి అన్నమాచార్యుడా! **॥అందాల॥**

ఈవిధంగా కీర్తన వ్రాయగలిగేశక్తి వచ్చినా, నాకు అన్నమాచార్యులవారి కీర్తనలు వివరించడమే ఇష్టం. నాముక్తి మార్గం అదే. ఈ విధంగా

నాజీవితమూ ఇంకా కొంతమందికి వుపయోగపడుతుంది. ఇంతకంటే హరిసేవయేమంటుంది చెప్పండి.

ఇక చిట్టచివరిగా "అంతయు నీవే హరి పుండరీకాక్ష" గురించి. ఇంతవరకు 909 అన్నమయ్య కీర్తనలకు అవతారికల వంటి ఉపోద్ఘాతాలను, భావవివరణల వంటి తాత్పర్య వివరములను అందించాను. ఈ పదియవ సంపుటములో కూడా 101 అన్నమయ్య భక్తి శృంగార, అధ్యాత్మ కీర్తనలను అందించాలని నా సంకల్పం. దీనితో 1009 కీర్తనలు చేయాలనే నా సంకల్పం నెరవేరుతుంది. శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్ష వీక్షణం నాపై వుంటే నా సంకల్పం నెరవేరుతుంది.

ఎటుజూచినా శ్రీహరియే, దేంట్లోనైనా శ్రీహరే, ఏదైనా శ్రీహరే. ఈభావనతో శ్రీహరి శరణాగతులై జీవిస్తే... త్రికరణ శుద్ధితో వుండగలిగితే మన బాగోగులు ఆయనే చూసుకొంటాడు.

ఇది సత్యం. పున: పున: సత్యం



అంతయు నీవేహరి పుండరీకాక్ష

సంపుటి: 4 కీర్తన : అచ్చుతుఁ డనియెడి నామము గలిగినయట్టి
సంఖ్య : 104 పుట : 70 రాగం: సామంతం

సామంతం

1 అచ్చుతుఁ డనియెడి నామముగలిగినయట్టి నీవెకాక
కుచ్చి నీకు నేశరణని కొలిచితి గురుతుగఁ గావఁగదే ॥ పల్లవి॥

అణురూపగు మశకములోపల నణఁగిన నీకంటే
గుణించి యెంచి చూచినను కొంచె మింక నేది
ప్రణుతింపంగ బ్రహ్మాండకోట్లు భరియించు నీకంటే
గణనకు నెక్కుడు నీవేకాక ఘన మిఁక నేది ॥అచ్చు॥

దాకొని జగములు పుట్టించుబ్రహ్మకు తండ్రివి నీవే
కైకొని చదువులఁ దెలిసిచూడ రక్షకు లిఁక మరి వేరీ
యేకోదశముగ వటపత్రమున యీఁదేటి నీకంటే
దీకొని పలికిన కాలంబుల కొనదేవుఁడు మఱి వేఁడీ ॥అచ్చు॥

శ్రీవేంకటమున వరము లొసఁగేటి శ్రీపతి నీకంటే
తావునఁ గన్నులఁజూడఁగఁ బ్రత్యక్షదైవము మరివేఁడీ
వేవేలకు వైకుంఠవిభుఁడవై వెలసిన నీకంటే
భావించి చూచిన నంతరంగమునఁ బరోక్షదైవము మరివేఁడీ॥అచ్చు॥

అవతారిక:

శ్రీమన్నారాయణుని స్తుతిస్తున్నారు అన్నమాచార్యులవారు. 'కుచ్చి' అంటే కుచించుకుపోయి, లేక బాగా తగ్గిపోయి అని అర్థం. అచ్చుతుడంటే 'చ్యుతి' లేక నాశనమెరుగనివాడు. "ఓ ప్రభూ! అచ్చుతుడనేపేరుగల నీవు కాక, రక్షించే వారెవరు వున్నారు? అణకువతో నిన్ను శరణని కొలిచితేచాలు. ఈ మాటే గుర్తుగా మమ్ము గావగదే!" అంటున్నారు భక్తిని ప్రకటించాలి అంటే శరణాగతిని మించిన ఉపాయము లేదు. ఈ కీర్తన

వివరణ అనుకున్నంత తేలికకాదని పల్లవి చదవంగానే అర్థం అయింది. అయితేనేమి ఆదిలోనే ఆదిదేవునితో అంతయు నీవేహరి పుండరీకాక్ష! అన్నాము కదా! ఇంకా భయమెందుకు? పదండి ముందుకు.

భావ వివరణ:

ఓ దేవదేవా! అచ్చుతుడు (అచ్యుతుడు) అనే పేరుగల నీవు తప్పించి, మాకు మరొక దిక్కులేదు. నీకు నేను కుచ్చి (వినమ్రుడనై) నీవే శరణని కొలిచితిని. నన్ను గురుతుగ (నన్నే లక్ష్యముగా) కావగదే (రక్షింపు తండ్రీ)

అణురూపములోనున్న (అత్యల్ప పరిమాణముగల) మశకము (దోమ) లోపలకూడా అణగియున్న నీకంటే లెక్క కట్టటానికి, కొంచెమింకనేది (అల్ప ప్రాణియేదీ?) ప్రణుతింపగా (కీర్తించగా) అనంత కోటి బ్రహ్మాండములను నీ వుదరములో భరిస్తున్నావు. గణనకు నెక్కిన (ప్రసిద్ధుడైన) దెవరు? ఎవ్వరూ లేరయ్యా!

దాకొని (అవ్యక్తుడవై) జగములనన్నింటినీ సృజించు పరమేష్ఠి అయిన బ్రహ్మదేవుని సృజించి నీవు ఆయనకు తండ్రిగారైనావు. ఆనాడు సోమకుడు అనే రాక్షసుడు ఆయన దగ్గరనుంచి చదువులను (వేదములను) కాజేస్తే నీవు కైకొని (పూనుకొని) వాడిని చంపి, వాటిని కాపాడినావు. నీకంటే రక్షకులెవరు?

ఏకోదకముగా (ఒక్క నీరు తప్ప ఇంకేమీ లేనట్లుగా) వున్నప్పుడు, వటపత్రశాయివై (ఒక్క మఱ్ఱియాకుపై పవ్వళించిన శిశువు వలె యీదేటి (తేలిన) నీకంటే దీకొని పలికిన (ధైర్యంగా చెప్పాలంటే) కాలంబుల కొనదేలిన (యుగాంతాలలో కూడావుండే) దేవుడు మఱివేఁడి (ఇంకలేడయ్యా!)

శ్రీవేంకటాద్రి మీద వెలసి వరములనొసగే శ్రీపతీ! నీకంటే తావున గన్నుల జూడ (నెలకొని చూడాలంటే) ఇంకొక ప్రత్యక్షదైవము లేనేలేడు. వేవేలకు (వేలకొద్దీ శరణాగతుల కొరకు) వైకుంఠపతివై ఈ తిరుమలలో వెలసిన నీకంటే అంతరంగమున (మానసాకాశమున) భావించి చూచిన (భావనలో నిలిపి సందర్శించిన) ఇంకమరి యొక పరోక్షదైవము (ఇంద్రియములకు గోచరింపని పరమాత్మ) మరి వేఁడీ (ఇంకాయెవ్వరున్నారు?)

సంపుటి: 4 కీర్తన : ఆతడేపో మాయేలిక ఆతడే జగన్మూల
సంఖ్య : 109 పుట : 73 రాగం: మాళవి

మాళవి

2 ఆతఁడేపో మాయేలిక ఆతఁడే జగన్మూల–
మాతఁడే శ్రీవేంకటాద్రియందు మీఁదిదైవము ॥ పల్లవి॥

కమలవాసినియైన కాంతఁ బెండ్లాడినాఁ (నవాఁ?)డు
కమలములో బిడ్డఁ గన్నవాఁడు
కమలాప్తునిలోనఁ గలిగి మెరయువాఁడు
కమలనాభుఁడేపో కలుగుమాదైవము ॥ఆత॥

జలధి బంధించి లంక సంహరించినవాఁడు
జలధిచొచ్చినదైత్యుఁ జంపినవాఁడు
జలధిసుతునకు వరుస బావైనవాఁడు
జలధిశయునుఁడేపో చక్కని మాదైవము ॥ఆత॥

కొండ గొడుగుగనెత్తి గోవులఁగాచినవాఁడు
కొండవంటి రాకాసిఁ గొట్టినవాఁడు
కొండలకు నెక్కుడైనగురుతు శ్రీవేంకటాద్రి
కొండరూపు దానేపో కోరిన మాదైవము ॥ఆత॥

అవతారిక:

అన్నమాచార్యులవారి ఈ కీర్తన అర్థం కావాలంటే పురాణాలమీద మంచి పట్టు వుండితీరాలి. ఆతడే జగన్మూలమైన శ్రీవేంకటాద్రిమీది దైవము అని కీర్తిస్తున్నారు. ఈ స్వామి కమలాప్తుడైన సూర్యునిలోని వెలుగై దీప్తించువాడు. ఈయన జలధిసుతునకు బావగారు అంటున్నారు. మరి ఆబావమరిది యెవరో? ఈయన కొండవంటి రాకాసిని కొట్టినవాడట. మరి ఆ రాకాసియెవరో? శ్రీవేంకటాద్రి కొండరూపు తానేపో అంటున్నారు.

అంటే ఏయిటి? భావవివరణ చదివితే అన్నీ పూసగుచ్చినట్లు అర్థమవుతాయి మరి.

భావ వివరణ:

ఆతడే (ఆ శ్రీవేంకటేశ్వరుడే) పో మాయేలిక (ప్రభువు). ఆతడే జగమునకు మూలకారణము. ఆతడే శ్రీవేంకటగిరిపై వెలసిన దైవము.

ఆతడెటువంటివాడో తెలియునా? కమలములో వసించు కాంతను బెండ్లాడినవాడు. కమలములో బిడ్డను (బ్రహ్మదేవుని) గన్నవాడు (కన్నతండ్రి). కమలాప్తుడైన సూర్యునిలో గలిగి (నెలకొని) వెలుగులు జిమ్మేవాడు. అటువంటి కమలనాభుడే పో మాకున్న దైవము.

ఇంకా చెప్పాలంటే, ఆయన జలధిని బంధించినవాడు (సేతువును సాగరముపై నిర్మించిన శ్రీరాముడు). లంక (లంకిణి) అను రాక్షసిని సంహరించినవాడు (చంపించినవాడు). ఆయనే జలధి జొచ్చిన దైత్యుని (వేదములను అపహరించి సముద్రంలో దాగిన సోమకాసురుని) చంపిన శ్రీమన్నారాయణుడు కూడా ఆయనే. జలధిసుతునకు (క్షీరసాగర మథనమున పుట్టిన చంద్రునికి) వరుస బావ (అతని యొక్క సోదరి శ్రీలక్ష్మిని పెండ్లాటుచేత వరుసకు బావ) అయినవాడు. అటువంటి క్షీరసాగరముపై పవ్వళించు స్వామియే పో మా దైవము.

ఇంతేకాక తన శ్రీకృష్ణావతారమున ఈయనే కొండను (గోవర్ధన పర్వతమును) గొడుగువలె చేతబట్టుకొని గోవులను, గోకులమును రక్షించినాడు. ఈతడే కొండవంటి రాకాసిని (రాక్షసి పూతనని) గొట్టినవాడు (చనుబాలుత్రాగు నెపముతో సంహరించినవాడు). కొండలకు నెక్కుడైన (కొండలలో అత్యంత శ్రేష్ఠమైన) శ్రీవేంకటాద్రిపైన కొండరూపములో వున్నాడు (ఆ వేంకటాద్రి పడుకొని వున్న స్వామి శిరస్సును స్ఫురింపజేస్తుంది). తానేపో (ఆ శ్రీవేంకటేశ్వరుడే పో) మా దైవము.

సంపుటి: 4 కీర్తన : కదిసి యాతడు మమ్ముగాచుగాక
సంఖ్య : 445 పుట : 299 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

3 కదిసి యాతఁడు మమ్ముఁగాచుఁగాక
అదె యాతనికె శరణంటే నంటి నేను ॥ పల్లవి॥

యెవ్వని వుదరమున నిన్నిలోకములుండు
యెవ్వని పాదము మోచె నిల యల్లను
యెవ్వఁడు రక్షకుఁ డాయ నీ జంతుకోట్లకు
అవ్విభునికి శరణంటే నంటి నిప్పుడు ॥కదిసి॥

సభలో ద్రౌపదిఁగాచె సర్వేశుఁ డెవ్వఁడు
అభయహస్త మొసంగె నాతఁ డెవ్వఁడు
ఇభవరదుఁ డెవ్వఁడు యీతనికే వొడిగట్టి
అభినవముగ శరణంటే నంటి నిప్పుడు ॥కదిసి॥

శరణుచొచ్చిన విభీషణుఁ గాచె నెవ్వఁడు
అరిది యజునితండ్రి యాతఁడెవ్వఁడు
యిరవై శ్రీవేంకటాద్రి యెక్కి నాతఁడితఁడే
అరసి యితనికే శరణంటే నంటి నిప్పుడు ॥కదిసి॥

అవతారిక:

అదె యాతనికె శరణంటే నంటి నేను అనిపాడుతున్నారు, అన్నమయ్య. ఇదే ఈనాటి తెలుగులో అయితే 'అతనికే శరణంటూ నంటిని' అనే మాటను వుపయోగిస్తాము. ఈ కీర్తన కూడా యెన్నో పురాణ గాథలతో ముడిపెట్టబడియున్నందున మంచి పురాణ వాఙ్మయపరిచయం వున్నవారికి మాత్రమే ఈ కీర్తనలోని లాలిత్యము అర్థమవుతుంది.

"ఎవని పాదము మోచె నిలయల్లను" అంటే ఎవ్వని పాదము భూమినంతా కొలిచింది అని అర్థం. అవును ఎవరి పాదం భూమిని కొలిచిందో తెలుసా?

భావ వివరణ:

ఆతడు (ఆ శ్రీహరి) కదిసి (మాకు దగ్గరయై) మమ్ము గాచుగాన (రక్షిస్తాడు కాబట్టి), నేను అదె (అందుచేతనే) ఆయనకే 'శరణంటేనంటి' (శరణు మహాప్రభో! అన్నాను.)

మేము మామూలు సాధారణమైనవాడిని ఆశ్రయించాలనుకొన్నారా యేమి? ఇన్నిలోకములు (ఈ పదినాలుగు భువనాలు) యెవ్వని వుదరములో (కడుపులో) నున్నవో, ఇలయెల్లను యెవ్వని పాదము మోచెన్? (ఈ భూమినంతా యెవరి పాదము కొలిచింది? (మనపొట్టి వామనమూర్తి). కోట్లాది జంతువులు విచక్షణా రహితంగా ఒకదాన్నొకటి చంపుకొంటూనే వుంటాయి. మరి వాటికి రక్షకుడెవడు? అవి ఇంకా యెందుకు జీవిస్తూనేవున్నాయి? వాడే జగద్విభుడు, వాడే నారాయణుడు. ఇప్పుడే నేను ఆయనకు శరణు మహాప్రభో! అన్నాను.

ఆరోజు, నిండు సభలో వస్త్రములూడదీసి దుశ్శాసనుడు ద్రౌపదిని వివస్త్రను చేయబోతే అక్షయముగా వలువలిచ్చి అభయ హస్తము నిచ్చిన ఆతడెవ్వరు? ఆ సర్వేశ్వరుడెవరు? ఇభవరదుడెవ్వడు (ఆనాడు కారడవి కొలనులో తన కాలునుపట్టి పీడిస్తున్న మొసలి నుండి తనను రక్షించుకోలేక "నీవే తప్ప నిత:పరంబెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్ అని రోదిస్తున్న గజేంద్రుని హుటాహుటివెళ్ళి రక్షించినదెవ్వరు?) ఆతనికే అభినవముగ (కొత్తగా) ఒడిగట్టి (నిశ్చయుడనై) శరణు మహాప్రభో! అన్నాను.

ఎంత నచ్చజెప్పినా వినక, శ్రీరామపత్ని సీతను చెరబట్టి కులఘాతకుడైన అన్న రావణాసురుని త్యజించి శరణుజొచ్చిన విభీషణుని రక్షించినదెవరు? అరిది (దుర్లభుడైన) అజునకు (బ్రహ్మదేవునికే) తండ్రియైన వాడెవరు? ఇంకెవరండీ... ఇదిగో ఇరవుయై (ఇక్కడ నెలకొని) ఈ శ్రీవేంకటాద్రిని యెక్కిన ఈయనే ఆయన... ఆయనే యీయన. అరసి (అది గ్రహించి) నేను ఇప్పుడు ఈయనకే "శ్రీవేంకటేశవమ్ శరణం ప్రపద్యే"... అని వేడుకొన్నాను. శరణంటేనంటినయ్యా!

సంపుటి: 2 కీర్తన : నరుడా యీతడు ఆదినారాయణుడు గాక
సంఖ్య : 497 పుట : 336 రాగం: సాళంగనాట

సాళంగనాట

4 నరుఁడా యీతఁడు ఆదినారాయణుఁడు గాక
ధరణిఁ గీరితి కెక్కె దశరథసుతుఁడు ॥ పల్లవి॥

యీతఁడా తాటకిఁ జంపె నీ మారీచసుబాహుల
నీతఁడా మదమణఁచె నిందరుఁ జూడ
యేతులకు హరువిల్లు యీతఁడా విరిచి యట్టె
సీతఁ బెడ్లియాడెను యీ చిన్న రాముఁడా ॥నరుఁ॥

చుప్పనాతి ముక్కుగోసి సోదించి దైత్యులఁ జంపి
అప్పుడిట్టె వాలినేసినాతఁ డీతఁడా
గుప్పించి కోఁతుల నేలి కొండల జలధిగట్టి
కప్పి లంక సాధించె నీ కౌసల్యానందనుఁడా ॥నరుఁ॥

రావణాదులను జంపి రక్షించి విభీషణుని
భావించయోధ్య నీతఁడు పట్ట మేలెను
శ్రీవేంకటేశుఁ డితఁడే సృష్టి రక్షించె నితఁడే
యీవల మాపాలనున్న యీ రామచంద్రుఁడా ॥నరుఁ॥

అవతారిక:

విశిష్టా ద్వైతమత ప్రచారకుడైఅన్నమాచార్యులవారు వూరూరా తిరిగి తన కీర్తనలను వినిపించి మరీ విష్ణుతత్త్వం ప్రబోధించారు. ఆ రోజుల్లో రామాలయంలేని వూరు వుండేదికాదు. ఏవూరికెళ్తే ఆవూరి శ్రీరామునిపై కీర్తన చెప్పేవారు. ప్రతి కీర్తనలోనూ రామకథను ఆద్యంతం గానం చేయడం ఆయన ప్రత్యేకత. బహుశా ఆ వూరిలో సంస్కృత పండితులెక్కువమంది వుంటే కీర్తన గీర్వాణిలో చెప్పేవారేమో. అందుకనే అన్నమయ్య సంస్కృత కీర్తనలు

యెక్కువగా శ్రీరామునిపైనా నృశింహునిపైనా వున్నాయని నాకు అనిపిస్తుంది. అందుకే... ఓ నరులారా! ఈతడు ఆదినారాయణుడు దశరథసుతునిగా ధరణిలో కీర్తిని పొందాడు... అంటున్నారు.

భావ వివరణ:

ఓ నరులారా! ఈతడెవరనుకొన్నారు? ఆదిదేవుడైన ఆదినారాయణుడు. గాక (అయితే) ధరణిన్ కీరితికెక్కె (భూలోకంలో పేరుపొందినది మాత్రం) దశరథ సుతుడైన శ్రీరామచంద్రమూర్తి అనే సుమా! (మరి ఆయన చేసిన ఘనకార్యాలు అట్లున్నవి).

ఈయన తాటకి అనే రాక్షసిని సంహరించాడు. ఇందరుజూడ (విశ్వామిత్రుని యాగమును చూచుటకు వచ్చిన ఇంత మంది చూస్తుండగా) ఈయన దాని కొడుకులైన మారీచ సుబాహుల మదమును అణచినాడు. ఈచిన్నారి రాముడు, ఏతులకు (ఉద్ధతితో) శివధనస్సును విరిచి అట్టే (అవలీలగా) సీతను పెండ్లాడినాడు.

ఈయన లక్ష్మణుని ప్రేరేపించి 'చుప్పనాతి' అని పేరువడ్డ శూర్పనఖ ముక్కు చెవులను కోయించినాడు. సోదించి (వెదకి వెదకి) రాక్షసులను సంహరించినాడు. ఆ తరువాత రావణాసురునివంటి వాని మదమణచిన వాలిని ఒక్క అమ్ము వేసి మట్టుబెట్టాడు. ఆ మహానుభావుడే ఈ చిన్నారి రాముడా!! కుప్పించి యెగిరే కోతులను ఒక సేనగా నడిపించిన నాయకుడా!! అవునయ్యా! ఈ కౌసల్యానందనుడే జలధిగట్టి (సముద్రముపై సేతువును నిర్మించి రావణునిపై దండెత్తి స్వర్ణలంకను సాధించినాడు.

ఆనాడావిధంగా రావణుని సంహరించాక ఆ లంకను రావణుని తమ్ముడైన విభీషణునికే పట్టము గట్టిన ధర్మమూర్తి ఈయన. తమ కోసల రాజధాని అయోధ్యా నగరానికి పట్టాభిషిక్తుడై పరిపాలించాడు. ఆనాటి త్రేతాయుగానంతరం ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడై తదనంతరం ఈ కలియుగంలో ఇతడే కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడై ఈ సృష్టిని రక్షిస్తున్నాడు. ఈ శ్రీరామచంద్రుడే మా పాలనున్నాడు (మా పాల దైవమై వున్నాడు).

సంపుటి: 4 కీర్తన : అతడితడా వెన్నలంతట దొంగిలినాడు
సంఖ్య : 6 పుట : 4 రాగం: లలిత

లలిత

5 అతఁడితఁడా వెన్న లంతట దొంగిలినాఁడు
యేతులకు మద్దులు రెండిలఁ దోసినాఁడు ॥ పల్లవి॥

యీతఁడా దేవకిగన్నయింద్రనీలమాణికము
పూతకిచన్ను దాగి పొదలినాఁడు
యీతఁడా వసుదేవుని యింటలో నిధానము
చేతనే కంసునిఁ బుట్టచెండుసేసినాఁడు ॥అతఁ॥

మేటియైనగొంతిదేవిమేనల్లుఁ డీతఁడా
కోటికిఁ బడెగెగాను కొండ యెత్తెను
పాటించి పెంచే యశోదపాలి భాగ్య మీతఁడా
వాటమై గొల్లెతలను వలపించినాఁడు ॥అతఁ॥

ముగురువేలుపులకు మూలభూతి యీతఁడా
జిగి నావులఁ బేయలఁ జేరి కాచెను
మిగుల శ్రీవేంకటాద్రిమీఁదిదైవ మితఁడా
తగి రామకృష్ణావతార మందె నిప్పుడు ॥అతఁ॥

అవతారిక:

ఈ వెన్నలు దొంగిలించే గొల్లపిల్లవాడు ఆ తిరుమలేశుడా!! రెండు మద్ది చెట్లను ఇతడు వుద్ధతితో తోసినాడు అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో వాడిన భాష తెలుగునుడికారములతో బహు పసందుగా వుంది. ఈయన కంసుని పుట్టచెండుసేసినాడు అంటున్నారు. అంటే బంతిలా ఆడుకొన్నాడన్నమాట. అదేవిధంగా "కోటికి బడెగె గాను కొండయెత్తెను" అంటే జగత్ప్రసిద్ధుడై గోవర్ధనము అనే కొండను యెత్తినాడు అని అర్థం

చెప్పుకోవాలి. ముగురు వేల్పులకు మూలభూతి అంటే బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు మూలకారణమైన పరమపురుషుడు ఈ బాలుడు అని కీర్తిస్తున్నారు. ఇప్పుడాయన యెత్తినది రామకృష్ణావతారమట. అంటే?

భావ వివరణ:

ఆహా! యేమిటీవింత!! అతడు (ఆదిదేవుడైన పరమాత్మ) ఇతడా (ఈ బాలుడా). వీడు వెన్నలనన్నింటినీ రేపల్లెలో దొంగిలించినాడు. ఏతులకు (ఉద్ధతితో) తమ పెరటిలో బహుకాలమునుంచివున్న రెండు మద్ది చెట్లను ఇల తోసినాడు (నేలపై పడతోసినాడు).

ఈతడు ఆ దేవకీదేవి గర్భవాసము నుండి జన్మించిన ఇంద్రనీల మాణిక్యము. మానవకాంతగా వచ్చిన పూతన అనే రాక్షసి చనుబ్రాలు తాగి పొదలినాడు (వర్ధిల్లినాడు). ఈతడు ఆ వసుదేవుని ఇంట వెలసిన నిధానము (పాతర వంటి నిధి). తన మేనమామయైన కంసుని చేతనే (ప్రాణాలతో) పుట్టచెండుసేసినాడు (బంతి ఆట ఆడుకొన్నాడు).

ఈ బాలుడే పెరిగి పెద్దవాడై పాండవుల తల్లి గొంతిదేవికి (కుంతీదేవికి) మేనల్లుడై అత్తా అనిపిలిచి ఆమెకు అభయమొసగినాడు. ఇతడే "కోటికిన్ పడెగెగాను కొండయెత్తెను" (జగత్ ప్రసిద్ధమైన గోవర్ధనపర్వతమును యెత్తి తన చిటికిన వ్రేలిపై నిలబెట్టాడు). పాటించి (ఆదరించి) పెంచిన తల్లి యశోదాదేవికి ఇతడు భాగ్యమై, మరు జన్మలో కూడా వకుళాదేవియైన ఆమెకు బిడ్డ శ్రీనివాసుడై అమ్మా అని పిలిచాడు. గోపికలను వాటమై (మరిగి) వలపించుకొనినాడు.

ఈతడు, ఆ ముగ్గురు వేలుపులకు (త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు) మూలభూతి మాలకారణమైన పరమపురుషుడు. అయినా జిగి (వెలుగులు జిమ్మి) ఆవులను పెయ్యలను కాచినాడు. మిగుల (అధికుడై మిగిలిపోయి) శ్రీవేంకటాద్రిపైని వేంకటేశ్వరుడు కూడా ఇతడేనా? అవునయ్యా! నిజము. ఇప్పుడు బలరామకృష్ణుల అవతారమెత్తిన ఈ బాలుడే ఆ పరమాత్మ.

సంపుటి: 4 కీర్తన : నరులార నేఁడువో నారసింహజయంతి
సంఖ్య : 310 పుట : 208 రాగం: ముఖారి

ముఖారి

6 నరులార నేఁడువో నారసింహజయంతి
సురలకు నానందమై శుభము లొసఁగెను ॥ పల్లవి॥

సందించి వైశాఖశుద్ధ చతుర్దశి శనివార-
మందు సంధ్యాకాలమున నౌభళేశుఁడు
పొందుగాఁ గంభములోనఁ బొడమి కడపమీఁద
కందువ గోళ్ళఁ జించెఁ గనకకశిపుని ॥నరు॥

నరమృగరూపము నానాహస్తముల
అరిది శంఖచక్రాది ఆయుధాలతో
గరిమఁ బ్రహ్లాదునిఁ గాచి రక్షించి నిలిచె
గురుతరబ్రహ్మాండ గుహలోనను ॥నరు॥

కాంచనపుగద్దె మీఁద గక్కనఁ గొలువైయుండి
మించుగ నిందిరఁ దొడమీఁదఁ బెట్టుక
అంచె శ్రీవేంకటగిరి నాదిమపురుషుండై
వంచన సేయక మంచివరాలిచ్చినదివో ॥నరు॥

అవతారిక:

ఒకానొక నృసింహ జయంతి సందర్భంగా అన్నమాచార్యులవారు చెప్పిన కీర్తననాస్వాదించండి. "ఓనరులారా! నేటిదినముననే స్తంభములో నరసింహుడు వుదయించి హిరణ్యకశిపుని తుదముట్టించి దేవతలకు శుభములను ఆనందమును యొసగినాడు" అని, ఆయన ప్రహ్లాదుని రక్షించిన వైనం కీర్తిస్తున్నారు. శ్రీవేంకటగిరి ఆదిమ పురుషుడైన ఆ ఏడుకొండలవాడే ఈయనైనందువలన వంచన సేయక మంచి

వరాలిస్తాడు అని అంటున్నారు. ఈ ఔభళేశుడు (అహోబల నరసింహుడు) గురుతరమైన బ్రహ్మాండ గుహలో వెలసినాడట.

భావ వివరణ:

ఓ నరులారా! నేడే నృసింహ జయంతి. ఈ నరసింహ జయంతి నాడే ఆయన స్తంభమున వెలసి హిరణ్యకశిపుని వధించి సురులకు ఆనందము కలిగించి శుభములనొసగినాడు.

ఈ ఔభళేశుడు (అహోబలేశ్వరుడు) సందించి (పూని) వైశాఖ శుద్ధ చతుర్దశినాడు, శనివారము రోజున సంధ్యా సమయమున ఆవిర్భవించినాడు. చక్కగా ఆ హిరణ్యకశిపుని వరముల ననుసరించియే కంభములో పొడమి (స్తంభములోనుంచి పుట్టాడు కాబట్టి యే తల్లిదండ్రికి పుట్టనివాడైనాడు). ఒక కడపమీద వాడిని చంపాడు (కాబట్టి ఇంటా బయటా కాని చోటనే వాడు చచ్చాడు). కందువ (సామర్థ్యంతో) తనవాడియైన గోళ్ళతో (యే ఆయుధముతోను వాడికి చావులేదు కాబట్టి) చీల్చి ఆ కనకకశిపుని (హిరణ్య కశిపుని) వధించినాడు.

ఈయనయెట్లా వున్నాడో ఒకసారి చూడండి. ఈయనది నరమృగరూపము (తల సింహానిది శరీరము నరునిది), నానాహస్తములు (చాలా చేతులు వున్నందున నరుడు కూడా కాదు). అరిది (ఉపయోగింపబడని) శంఖచక్రములు ఆయన హస్తభూషణములుగా వున్నవి. గరిమ (అద్భుతముగా) తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని కాపాడి రక్షించి నిలిచినాడు. ఎక్కడ? బ్రహ్మాండమైన ఈ అహోబలం కొండ గుహలో నిలిచినాడు.

ఎట్లా నిలిచాడో గమనించండి. ఆ దనుజుని వధానంతరం వెంటనే బంగారు గద్దెపై (సింహాసనముపై) మించుగ (వున్నతముగా) ఇందిరను (శ్రీలక్ష్మిని) తన తొడపై కూర్చుండబెట్టుకొని కొలువైయున్నాడు. ఈయనే అంచె (ఆ తరువాత) శ్రీవేంకటగిరి మీద ఆది పురుషుడు శ్రీవేంకటేశ్వరుడై నిలిచాడు. వంచన సేయక (నమ్మిన తన భక్తులను వంచించక) మంచి మంచి వరములనిస్తున్నాడు. అదిగో ఆయనకు మ్రొక్కండి.

సంపుటి: 14 కీర్తన : మంచివాడవంతేపో మాధవరాయా
సంఖ్య : 237 పుట : 138 రాగం: దేసాళం

దేసాళం

7 మంచివాఁడవంతేపో మాధవరాయా
మంచుమాయ మాఁడుకూరి మాధవరాయా ॥ పల్లవి॥

మోనాననుండిన నన్ను ముట్టి వేఁడుకొనేనంటా
మానమేలంటేవోయి మాధవరాయా
నేనా సారెకు వచ్చి నీతో నెదురాడేదాన
మానవుగా మాఁడుకూరి మాధవరాయా ॥మంచి॥

యోగసక్యానకే మాఇల్లుచొచ్చి వచ్చేవు
మగనాలిఁ గదవోయి మాధవరాయా
బగి వాయక కూచుండి పైఁ దొడవేసేవు నీ –
మగువనా మాఁడుకూరి మాధవరాయా ॥మంచి॥

వోపనన్నాఁ బోనీవు వొడివట్టి తీసేవు
మాపుదాఁకా నేలోయి మాధవరాయా
కోపుగా శ్రీవేంకటాద్రిఁ గూడి చూపేవా నీయెమ్మె
మాపైనే మాఁడుకూరి మాధవరాయా. ॥మంచి॥237

అవతారిక:

మాడుకూరు అనే గ్రామములో వెలసిన మాధవరాయనిపై సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈయన మంచివాడే, కాని మంచుమాయగాడట. మంచువలె చల్లనైనవాడే కాని మాయగాడట. నాయిక మానమునంటి వేడుకొంటాడట. ఇక మౌనంగావుండటం ఆవిడవల్ల యేమవుతుంది చెప్పండి. మహానుభావా! నేను మగని చాటు 'మగనాలి' నన్నా వినిపించుకోడట. నేను 'ఓపను'

అన్నాకూడా వదలడట. శ్రీవేంకటాద్రిపై కూడా 'యెమ్మెలు' చూపిస్తున్నావా నామీద అంటున్నారు. కొంచెం తికమకపెట్టే కీర్తనే ఇది. శృంగార భక్తిని రుచి చూడండి.

భావ వివరణ:

ఓ మాధవరాయా! నీవు మంచివాడవు. అంతే... నేను నీకు నిజమే చెబుతున్నాను. మాడుకూరిలో వెలసిన మాధవరాయా! నీవు చల్లే మాయలు మంచు మాయలు. మంచు అస్థిత్వమువలె, నీ వలపు మాయ అస్థిరమైనది.

మోనాన వుండి నన్ను (నేను మౌనంగా వుంటే) ముట్టి వేడుకొంటావు (నన్ను తాకుతూ బ్రతిమిలాడతావు). నా మానము నంటి మరీ మాటలు కలుపుతావు. నేను నీయెదుటకు వచ్చి నా మౌనం వదలి నీతో యెదురుమాట్లాడేదాకా, మానవుగా (వదలిపెట్టవు కదా!) ఓ మాడుకూరి మాధవరాయా! నీతో వేగటం కష్టమే స్వామీ!

ఎగసక్కెములు (పరాచికాలు) ఆడుకొంటూ మా ఇంట్లో దూరుతావు. నేను మగనాలిని (మగనిచాటు పెళ్ళాన్ని) అన్నా నన్ను విడిచిపెట్టవు. బగివాయక కూర్చుండి (నాపక్కనే కూర్చుండి) తొడపై చేతులు వేస్తావు. ఇదేమి అఘాయిత్యము? నేనేమి నీ మగువనా? (పెండ్లామునా?) ఓ మాడుకూరి మాధవరాయా! ఇదేమన్నా మర్యాదగా వున్నదా ప్రభూ!

స్వామీ! నీ చిలిపి చేష్టలకు నేను ఓపను (తాళను) అన్నా, నన్ను పోనియవు. ఒడిసిపట్టి ఆక్రమింతువు. మాపుదాకా (చీకటిపడేదాకా చీకాకు పెడతావు). ఇట్లా అయితే యెట్లు ముడిపడుతుంది? కోపుగా (అందముగా) శ్రీవేంకటాద్రిమీద కూడి నీవే వేంకటేశ్వరుడవై నీ యెమ్మెలు (వన్నెలు) మాపైన చూపిస్తున్నావా? ఓ మాడుకూరి మాధవరాయా! మేము చరితార్థులమైనాము ప్రభూ!

సంపుటి: 14 కీర్తన : కోడెకాడు గదవమ్మ గోవిందరాజు
సంఖ్య : 95 పుట : 57 రాగం: దేశాక్షి

దేశాక్షి

8 కోడెకాఁడు గదవమ్మ గోవిందరాజు
వేడుక మోవులతేనె విందారగించీని ॥ పల్లవి॥

కొలువు కూటములోన గోవిందరాజు వాఁడే
పలుమారుఁ జెలులతోఁ బందేలాడీని
నిలువుల మేడమీఁద నిలిచి గోవిందరాజు
వలపులు చల్లుచును వసంతాలాడీని ॥కోడె॥

కోరి కేళాకూళిలోన గోవిందరాజు వాఁడే
సారె నింతులతో నీరు చల్లులాడీని
తూరుచు సింగారపుఁ దోటలో గోవిందరాజు
సైరణ లేకందరితో జాజరలాడీని ॥కోడె॥

గోముల శ్రీవేంకటాద్రి గోవిందరాజు వాఁడె
రామలతోడుతను సరసమాడీని
గామిడై పాన్పుపైఁ గూడి కందువ గోవిందరాజు
మోములు చూచందరితో ముచ్చటలాడీని. ॥కోడె॥95

అవతారిక:

నిఘంటువు సాయం లేకపోతే ఈ కీర్తన వివరించడం దాదాపు అసాధ్యమే. కోడె వయసుగాడైన గోవిందరాజు వేడుకతో అధరామృతాల నాస్వాదిస్తుంటాడట. నిలువుల మేడమీద నిలిచివుంటాడట. కేళాకూళి అంటే జలక్రీడలని అర్థం. అవంటే మహా ఇష్టంట ఆయనకి. సైరణలేక జాజరచల్లుతాడట. రామలతో సరసాలాడతాడట. మోములు చూచి అందరితో ముచ్చట్లాడతాడట. పాన్పుపై గామిడై కూడినాడట.

ఒకటారెండా? దాదాపు అన్నీ తెలియని తెలుగుమాటలే. తెలివిగా భావవివరణ చదివేద్దాం. పదండి ముందుకు. ఇంతకీ ఈ కీర్తన తిరుపతిలోని గోవిందరాజ స్వామిపైననే సుమండీ.

భావ వివరణ:

ఓ భామలారా! ఈ గోవిందరాజస్వామివున్నాడే, ఈయన కోడెగాడు గదమ్మా (కోడెవయసువాడు కదుటమ్మా!) ఈయన వేడుకతో భామల మోవితేనెలు (అధరామృతములను) విందారగించీని (విందువలె నాస్వాదిస్తాడు).

ఈ గోవిందరాజస్వామి తన కొలువుదీర్చియున్నాడు. కానీ తన చెలులతో (ఇద్దరు భామలు భూదేవి శ్రీదేవిలతో) పందేలాడీని (పందెములు కాస్తున్నాడు). ఆయన నిలువుల మేడల మీద (ఎత్తయిన మేడలమీద) నిలిచి అందరినీ పరికిస్తుంటాడు. తన చెలియలతో వలపులు చల్లుతూ వసంతోత్సవం చేసికొంటాడు (హోలీ ఆడుతుంటాడన్నమాట).

ఆ గోవిందరాజస్వామికి ఇంకొక ఇష్టమైన ఆట వున్నది. అదే కేళాకూళి (జలక్రీడ). బహు కోరికతో ఆయన జలక్రీడను ఇంతులతో (స్త్రీలతో) నీరు చిమ్ముతూ చల్లులాడీ (చల్లుతూనే వుంటాడు). ఆయన శృంగార వనములో తూరుచు (దూరిపోయి) సైరణ లేక (ఆపటం అనేదే లేకుండా) జాజరలాడీని (వున్నట్టుండి వెనుక నుండి నీళ్ళు చిమ్మటం లాంటి కొంటె పనులు చేస్తుంటాడు).

ఈ గోవిందరాజస్వామే, గోముల (సౌకుమార్యంతో) శ్రీవేంకటాద్రిపై రామలతో (స్త్రీలతో) సరసములాడీని (సరసములాడుతున్న) శ్రీవేంకటేశ్వరుడు కూడా అయివున్నాడు. గామిడై (సర్వశ్రేష్ముడై) ఈ గోవిందరాజస్వామి తన శయ్యపై, కందువ గూడి (సమర్థుడై కూడి) మోములు చూచి (వారి అందమైన మొగములను తదేకంగా చూస్తూ) ముచ్చటలాడుతుంటాడు. (ఇన్ని చేస్తూ కూడా శరణాగతులను ఒక కంట కనిపెడుతూనే వుంటాడు సుమా!)

సంపుటి: 14 కీర్తన : వేడుక కాడితడు విట్ఠలేశుడు
సంఖ్య : 590 పుట : 340 రాగం: రామక్రియ

రామక్రియ

9 వేడుకకాఁ డితఁడు విట్ఠలేశుఁడు
వీడని పొందులు సేసీ విట్ఠలేశుఁడు ॥ పల్లవి॥

వెన్నదిన్న మదమున వెలఁదులుఁ దానును
వెన్నెలలో నాడీ నిదె విట్ఠలేశుఁడు
పన్ని రతుల కింతులఁ బాంచజన్యరవమున
సన్న సేసి పిలిచీని సారె విట్ఠలేశుఁడు ॥వేడు॥

ఆసపడి కొలువులో నాడువారి మీఁదట
వేసీ విరులఁ గొని విట్ఠలేశుఁడు
వేసరక పదారువేలు సతులయిండ్లా
సేసవెట్టి పెండ్లాడీఁ జేరి విట్ఠలేశుఁడు ॥వేడు॥

మెల్లనె గందమిచ్చేటి మెలుతను గాఁగిలించి
వెల్లవిరిగాఁ గూడె విట్ఠలేశుఁడు
యిల్లిదె శ్రీవేంకటేశుఁ డితఁడె తానై వుండి
యెల్లగాఁ గోనేట వరాలిచ్చె విట్ఠలేశుఁడు ॥వేడు॥ 590

అవతారిక:

వేడు కాడంటే నేటి పరిభాషలో 'జల్సారాయుడు' అన్నమాట. అట్లాంటి ఈ విట్ఠలేశుడు వీడని పొందులు సేసీ – నంటున్నారు అన్నమాచార్యులవారు. మెలత యొకతె మెల్లగా గంధమియ్యబోయిందట. ఈ విట్ఠలేశుడు వూరకుంటాడా? వెల్లవిరిగా ఆమెను కౌగలించి కూడినాడట. ఆ సంతోషంలో కోనేటి ఒడ్డున యెల్లగా వరాలిచ్చేస్తున్నాడట. అంతే కాదండీ ఈ విట్ఠలేశుడే ఆ శ్రీవేంకటేశ్వరుడూనూ అంటున్నారు.

పండరంగి విట్ఠలునిపై చక్కటి సరస శృంగార కీర్తన ఇది. ఇదే బ్రహ్మానందం. అవునా?

భావ వివరణ:

ఓ భక్తులారా! ఈ విట్ఠలేశుడు గొప్ప వేడుకకాడు (విలాసపురుషుడు). ఈయన వీడని పొందులు సేసి (విడుపులేని రతి కూటములు గల శృంగార పురుషుడు).

ఈ విట్ఠలేశుడు వెన్నలనారగించి. అటు పిమ్మట సంతోషముతో పండువెన్నెలలో వెలదులతో (రమణులతో) ఆడీని రాసక్రీడల దేలినాడు. రతుల కొరకు ఈయన ఇంతులను, పన్ని (పన్నుగడతో) పాంచజన్య శంఖానాదము సంకేతముగా, సారెకు (ప్రతిసారీ) సన్నసేసి (సైగజేసి) పిలిచీని (పిలుస్తాడు). ఎంత టక్కరివాడో చూడండి.

ఈ విట్ఠలేశుడు ఆసపడి (వ్యామోహము కలవాడై) అంతమంది స్త్రీల గుంపులోనున్న ఆడువారిపై కూడా విరులవేసి (పూవులను జల్లి) తన వశము చేసికొంటాడు. వేసరక (విసుగు అనే మాటలేక) పదియారువేలమంది సతుల ఇండ్లలో, సేసవెట్టి (అక్షతలు జల్లి) మరీ వారిని పెండ్లాడినాడు. (ఇందులో పెండ్లాడాలనే కోర్కె ఇంతులదే సుమా!) స్వామికి యేనాడు, యెవరిపైనా, యే కోరికా వుండదు. ఎందుకంటే ఆ దేవదేవుడు నిరంజనుడు, అవునా?

ఈ కొంటె కోణంగి ఇంకా యేమిచేస్తాడో తెలుసా? తనకు గంధము పూస్తున్న పడతులను మెల్లగా సందిటజేర్చి వెల్లవిరిగా (విజృంభించి) కూడి ముచ్చట దీరుస్తాడు. ఇల్లిదే (ఇదే) శ్రీవేంకటాద్రిపై శ్రీ వేంకటేశుడైన ఇతడే నేడు ఈ కోనేటి ఒడ్డున విట్ఠలేశుడై యెల్లగా వరాలచ్చి (అంతులేని వరములనను గ్రహించుచున్నాడు).

సంపుటి: 14 కీర్తన : కొల్లున నవ్వేరు నిన్ను గోవిందుడా
సంఖ్య : 333 పుట : 193 రాగం: మనోహరి

మనోహరి

10 కొల్లున నవ్వేరు నిన్ను గోవిందుఁడా
గొల్లెతల నేమనేవు గోవిందుఁడా ॥ పల్లవి॥

యేపున నీసుద్దులెల్ల యిట్టె యశోదతోడ
గోపిక లాడుకొనేరు గోవిందుఁడా
తీపుల నీచేఁతలెల్ల తేట తెల్లమాయనిదే
కోపగించఁ జెల్లదిఁక గోవిందుఁడా ॥కొల్లు॥

సిసువవై యాడువారి చీరలు దీసినందుకు
కొసరి తిట్టేరు నిన్ను గోవిందుఁడా
పసులఁగాచేచోట భామలు విందు దెచ్చిరి
కుసిగుంపు సేయకుమీ గోవిందుఁడా ॥కొల్లు॥

వాడలసతుల నొక్కవావిగానే సేసితివి
కోడెల నావులఁ గాచేగోవిందుఁడా
యీడనే శ్రీవేంకటాద్రి నిరవై శ్రీసతితోడఁ
గూడి లోలుఁడ వైతివి గోవిందుఁడా. ॥కొల్లు॥ 333

అవతారిక:

"గోవులను కాచే గోవిందుడా! నిన్ను చూచి ఈ రేపల్లె గొల్లభామలు గొల్లుమని నవ్వారయ్యా! వాళ్ళనేమనగలము?" అంటున్నారు అన్నమాచార్యులవారు. నీ కోపాలు యికపై చెల్లేట్లులేవు. మరి నీవు వాళ్ళ చీరెలెత్తికెళ్ళిపోతే మళ్ళీ నిన్నే తిడుతున్నారు, అంటున్నారు. ఈ గోవిందుడు గొల్లవాడలోనున్న సతులనందరినీ ఒక్కవావిగానే చేశాడట. అంటే యేమిటో తెలుసా? ఆ గోవిందుడు, వరుసకు వదినా మరదళ్ళయిన

ఇద్దరిని కూడితే వారు ఏమవుతారు? ఒకేవావి కదా! అంటే అక్కా చెల్లెళ్ళేకదా! అదన్నమాట సంగతి. ఇంతా చేసిన ఆ శ్రీసతిలోలుడేనట.

భావ వివరణ:

ఓ గోవిందుడా! ఈ గొల్లెతలను (గొల్లభామలను) యేమనేవు (నీవేమి అనగలవు?) నీసంగతులు చెప్పుకొంటూ వాళ్ళు గొల్లుమని నవ్వుకొంటున్నారు చూశావా?

ఓ గోవిందుడా! నీ సుద్దులెల్లా (ముచ్చట్లనన్నియు) ఈ గోపికలు నీ తల్లి యశోదమ్మతో యేపున (వున్నవీ లేనివీ కల్పించి యెక్కువగా) చెబుతున్నారు. నీ తీపుల చేతలెల్లా (నీవు పెట్టిన యాతనలు చిలిపి పనులు) అన్నియునూ తేటతెల్లమాయె (బట్టబయలైపోయాయి). ఓ గోవిందుడా నీ అలుకలు చెల్లవిక.

ఇంత చిన్న పిల్లగాడివి స్త్రీలు స్నానమాడువేళ వారి చీరలెత్తుకుపోతావా? అందుకనే వారు నిన్ను కొసరి తిట్టేరు (కసురుకొని తిట్టిపోశారు). గోవిందుడా! ఇదేం పనయ్యా! అయినా నీచేతలు వారిని మురిపించినాయేమో కానీ, ఆ భామలు ఇప్పుడు నీవు పశువులు కాచే చోటికి విందు భోజనాలు తీసుకొనివచ్చారు. ఓ గోవిందుడా! ఇంకా వారిని కుసిగుంపు సేయకుమీ. (శ్రమపెట్టవద్దు స్వామీ!)

నీ లీల నెరుంగ మాకు శక్యమా ప్రభూ! ఈ గొల్లవాడలోని సతులనందరినీ రతిదేల్చి, వారిని ఒకేవావితో (ఒకే చుట్టరికపు వరుసతో, సవతులైనందున అక్క చెల్లెలి వరుసతో) కలిపినావు. కోడెలను ఆవులను కాచే గోవిందుడా! గోవర్ధన గిరినెత్తిననాడే నీవు పరమాత్ముడవని వారికి తెలిసిపోయింది. ఓ గోవిందుడా! నేడు ఈ కలియుగంలో శ్రీవేంకటాద్రిపై శ్రీసతితో నిరవై (నెలకొనినవాడవై) ఆమెను కూడి ఆమెకు లోలుడవైతివి (స్వాధీనుడవైతివి).

సంపుటి: 14 కీర్తన : శ్రీ వేంకటేశ్వరుడు శ్రీయలమేల్మంగతోడ
సంఖ్య : 240 పుట : 150 రాగం: సాళంగనాట

సాళంగనాట

11 శ్రీవేంకటేశ్వరుఁడు శ్రీయలమేల్మంగతోడ
కోవిదుఁడై విహరించీ కోడతిరుణాళ్లు ॥ పల్లవి॥

వెల్లవిరిగా వీధుల వెన్నెలలు గాయఁగా
చల్లని పూవులవాన జడి మించఁగా
వొల్లనే సతులు దన్ను వుగ్గళించి పొగడఁగా
కొల్లలాడీ వలపులు కోడతిరుణాళ్లు ॥శ్రీవేం॥

ఆటల పాటలవాఁడు అండనే వినిపించఁగా
పాటించి యారగింపులు పైపైఁ జేయఁగా
గాఁటముగ వీడెములు గందములు నందుకొంటా
కోటిభోగాలు భోగించీ కోడతిరుణాళ్లు ॥శ్రీవేం॥

చేరి పన్నీరు కప్రము శిరసునఁ గులుకఁగా
వూరక యిందరు కొలువులు సేయఁగా
యీరీతి శ్రీవేంకటేశుఁ డిందరుసతులఁ గూడి
కోరికలు వెదచల్లీ కోడలిరుణాళ్లు. ॥శ్రీవేం॥240

అవతారిక:

'కోడతిరుణాళ్ళు' అంటే వసంతోత్సవ అని అర్థం. శ్రీవేంకటేశ్వరుడూ ఆయన దేవేరి అలమేల్మంగ వసంతోత్సవంలో పాలుపంచుకొంటున్నారట. ఆ దృశ్యాన్ని కళ్ళకు కట్టిస్తున్నారు అన్నమాచార్యులవారు. స్వామి వసంతాలు చల్లుటయేకాదు శృంగారవనంలో కోవిదుడై విహరిస్తున్నాడట. అంటే ఆరితేరినవాడై వసంతాలాడుతూ విహరిస్తున్నాడన్నమాట. అసంఖ్యాకమైన సుందరాంగులతో ఆ శ్రీవేంకటేశ్వరుడు కోరికలు వెదచల్లే

కోడతిరునాళ్ళు ఆడుతున్నాడట. 'కప్రము' అంటే కర్పూరము అని అర్థం. పన్నీరు కర్పూరము బాగా కలిపి తలమీద పోసేవారట ఆ రోజుల్లో.

భావ వివరణ:

శ్రీవేంకటేశ్వరుడు శృంగారపురుషుడు. తన దేవేరి అలమేల్మంగతో ఆయన కోవిదుడై (ఆరితేరిన నేర్పరివలె) కోడతిరుణాళ్ళు (వసంతోత్సవము) జరుపుకొంటూ విహరించీ (విహరించుచున్నాడు.). ఆ వైనం తిలకించండి.

ఆ తిరువీధులలో వెన్నెల వెల్లివిరిసి కాస్తున్నది. ఎవ్వరూ చల్లకనే పూవులవాన జడి (జల్లు) లాగా కురుస్తున్నది. ఆ వసంతోత్సవంలో పాల్గొంటున్న స్త్రీలందరూ తనను వుగ్గళించి పొగడగా (తన పక్షాన ఉత్తేజ పరుస్తూ పొగుడుతుంటే) ఆ దేవదేవుడు ఆమె వలపులను కొల్లలాడీ (అపహరించాడు). స్వామి కోడతిరుణాళ్ళు అంత చూడ ముచ్చటగా వున్నది.

కొంతమంది అక్కడ ఆడుతున్నారు (నృత్యం చేస్తున్నారు). కొంతమంది మధురంగా గానం ఆలపిస్తున్నారు. వారు అండనే (ఇంటిలోనే) వున్నారు, మరి అంత జోరుగా వసంతాలాడితే ఆలిసిపోయి ఆకలివేస్తుంది కదా! స్వామి అప్పుడు పాటించి (ఆదర పూర్వకంగా కాసేపు విశ్రాంతినిచ్చి) పైపై ఆరగింపులు (తేలికపాటి ఆహారం) తీసికొనినాడు. గాటముగా (అధికముగా) వీడెములు తాంబూలములను స్వీకరించాడు. గంధము పూతలు గ్రహించాడు. కోటి భోగాలు (అసంఖ్యాకమైన భోగములను) భోగించాడు. ఆ వసంతోత్సవం కన్నుల పండువగా వున్నది.

ఆహా!! ఎంత అద్భుతమైన దృశ్యమది!! వారి (స్వామివారు ఆయన దేవేరి) శిరసున (తలమీద) చేరి (స్త్రీలందరూ కలిసి) పన్నీటిలో కలిపిన కప్రము (కర్పూరమును) గులకగా (కుమ్మరించగా) వీరంతా స్వామివారి కొలువుకూటమిలో చేరారు. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుడు ఇంతమంది సతులగూడి (సుందరాంగులతో కూడి) వసంతాలాడుతుంటే స్వామిపై కోరిక కలుగనిదెవరికి చెప్పండి. ఆ విధంగా ఆ మనోహరుడు కోరికలు వెదచల్లుతుండే కోడతిరుణాళ్లు ఆడుతున్నాడు.

సంపుటి: 14 కీర్తన:సతితోడ సారెసారెకు సరసములాడుకొంటా
సంఖ్య : 376 పుట : 218 రాగం: కాంబోది

కాంబోది

12 సతితోడ సారెసారెకు సరసములాడుకొంటా
తతితోడనారగించీ తగునె యీదేవుఁడు ॥ పల్లవి॥

ఒక్కమాటె వంటలెల్లా నొద్దనుండి వడ్డించి
మిక్కిలినలసె నలమేలుమంగ
చెక్కులఁ జెమటగారఁ జేరి యీపె వడ్డించఁగా
చొక్కి చొక్కి యారగించీఁ జూడరె యీదేవుఁడు ॥సతితో॥

పాఱి పాఱి బంగారుపళ్ళెములు వెట్టించి
మీఱి బుసకొట్టె నలమేలుమంగ
జాఱిన తురుముతోడఁ జవులాకె యడుగఁగ
ఆఱడి గూరలు మెచ్చీనంతలో నీదేవుఁడు ॥సతితో॥

వాలిన రాజసముతో వంటసాలలోననే
మేలిమిఁ గూచున్న దలమేలుమంగ
యీలోనె శ్రీవేంకటేశుఁడీపెఁ దానునారగించి
తాలమిఁ గాఁగిటఁగూడె దక్కక యీదేవుండు ॥సతితో॥ 376

అవతారిక:

అన్నమాచార్యులవారి వొక్కొక్క కీర్తనకు వొక్కొక్క ప్రత్యేకత వుంటుంది. ఇందులో చూడండి తన ముద్దుల సతితో ముచ్చట్లాడుకుంటూ మాటి మాటికీ సరసాలాడుతూ చాలా ఇష్టంగా భోజనం చేస్తున్నాడట ఆ దేవదేవుడు. తన చెక్కిళ్ళపై చెమటలు కారిపోతుంటే, సడలిన తనకొప్పును సవరించుకోలేక అలమేల్మంగమ్మ, తిప్పలు పడుతుంటే ఆహా! ఓహో! అని మెచ్చుకొంటూ ఆరగిస్తున్నాడట స్వామి. ఈలోనే అమ్మవారు కూడా ఆరగించి తాలిమితో

యీదేవుని కౌగిట కరిగిపోయిందట. ధన్యోస్మి. ఏమి ఆ పదకవితాసౌరభం!! ఏమి ఆ కల్పనా చాతుర్యం!! ఏమని పొగడుదునయ్యా! అన్నమయ్యా!

భావ వివరణ:

సారెసారెకు (మాటిమాటికీ) సతితోడ (తన భార్యతో) సరసములాడుకొంటూ (చలోక్తులు విసురుతూ) ఈ దేవదేవుడు తగు తతితోడన్ (తగినంత ప్రీతితో) ఆరగించీ (భుజించుచున్నాడు). ఆ వైనం వినండి.

జగముల తల్లి అలమేలుమంగ తను ఆయనకిష్టమని చేయించిన వంటకాలన్నింటిని ఒక్కటీ వదలకుండా వడ్డించింది. అందుచే ఆ తల్లి మిక్కిలి అలిసిపోయినది. ఆమె చెక్కుల జెమట (చెక్కిళ్ళపై శ్రమవలన చెమట) కారిపోతున్నది. ఆమె చేరి స్వయముగా వడ్డించుచునేయున్నది. ఈ దేవుడు చొక్కి చొక్కి (పారవశ్యముతో) ఆరగించుచున్నాడు. ఈ అద్భుత దృశ్యం మీ మనోనేత్రాలతో చూచి తరించండి.

ఈ తల్లి, పాఱిపాఱి (తడవ తడవకూ) వంటకాలన్నీ బంగారు పళ్ళెరములలో పెట్టించి, అలసటతో మీఱి బుసకొట్టీ (పెద్దగా నిట్టూర్చింది) అలమేల్మంగమ్మకు ఆ పరిశ్రమవలన తురుము (సిగకొప్పు) సడలి పోయింది (వదులై విడిపోబోతున్నది). అయినా ఆమె కొప్పు సవరించుకొంటూనే, చవులడుగగా (వంటలెలావున్నాయండీ... అని అడుగుతుంటే) ఈ దేవుడు ఆఱడి (మించి) అంతలో (పూర్తిగా తినకుండానే) కూరలు మెచ్చీ (కూరలు యెంత బాగున్నాయి. ఆహా!! యేమి రుచి అని మెచ్చుకొన్నాడు).

ఆ తల్లి అటుపిమ్మట, వాలిన రాజసముతో (మిక్కిలి అతిశయించిన రాచఠీవితో) మేలిమి వంటసాలలో (స్వర్ణమయమైన ఆ వంటశాలోనే) తానూ భుజించుటకు కూర్చున్నది. ఈలోనె (ఈరీతిగా) శ్రీవేంకటేశ్వరుడు మరియు అలమేల్మంగ, ఆరగించిరి. ఆపై, తక్కక (తప్పకుండా) ఈ దేవదేవుడు తాలిమి (ఉత్సాహముతో) ఆ దేవిని కౌగిట కూడెన్.

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం

సంపుటి: 4 కీర్తన : వారిధిశయన వో వటపత్రపరియంక
సంఖ్య : 465 పుట : 314 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

13 వారిధిశయన వో వటపత్రపరియంక
గారవాన మేలుకొని కన్నులు దెరవవే ॥ పల్లవి॥

ఘనయోగిహృదయపుకమలాలు వికసించె
వొనర విజ్ఞానసూర్యోదయమాయ
మును జీవపరమాత్ములజక్కవలు గూసె
వనజాక్ష మేలుకొని వాకిలి దెరవవే ॥వారిధి॥

కలుషములనేటిచీఁకట్లెల్లఁ బెడఁబాసె
నలువంక వేదకీరనాదము మ్రోసె
అలరి యితరధర్మాలనేటిచుక్కలు మాసె
జలజాక్ష మేలుకొని సతిమోము చూడవే ॥వారిధి॥

కపటరాక్షసనేత్రకలుహారములు మోడ్చె
యిపుడే సుకర్మముల యెండలు గాసె
అపురూప శ్రీవేంకటాద్రీశ మేలుకొని
నిపుణుఁడ యిందిరయు నీవు మమ్ముఁ గానవే ॥వారిధి॥465

అవతారిక:

"వటపత్రపరియంక" అంటే మఱ్ఱియాకు తల్పముగా శయనించువాడని అర్థం. జక్కువలు అంటే చక్రవాక పక్షులు. కల్హారము అంటే తెలుపు రంగు మిళితమైన ఎఱ్ఱనికలువపూవు. తేలిక అని భ్రమ కలిగించే క్లిష్టమైన కీర్తన ఇది. వటపత్రశాయియైన జలధిశయన ఆదినారాయణునిపై అన్నమాచార్యులవారు చెప్పిన అద్భుతమైన కీర్తన ఇది. ఆయన యోగీశ్వరుల హృదయకమలాలలో వుంటాడు.

అన్య మతధర్మములను నక్షత్రాలు మాసిపోవునట్లు చేసే పూర్యోదయం అవుతుంది ఈయన నిదుర మేలుకొంటే. కపటులైన రాక్షసుల కన్నులనే కల్హారములు మ్రోడువారిపోతాయట. అంటే రాక్షసులు నశిస్తారని అర్థం.

భావ వివరణ:

ఓ వటపత్రపరియంకా! (మఱ్ఱియాకు శయ్యగా పరుండిన వాడా!) వారిధిశయనా! (క్షీరసాగరముపై శయనించు దేవా!) గారవాన (మంగళప్రదుడవై) మేలుకొని కన్నులు తెరవవయ్యా!

ఓ ప్రభూ! నిన్ను జూచి ఘనులైన యోగేశ్వరుల హృదయ కమలములు వికసించినవి, యెందుకంటే వారిలో నిన్ను గూర్చిన విజ్ఞాన సూర్యోదయమైనది కదా! ఆ విజ్ఞాన సూర్యోదయమున జీవాత్మ పరమాత్మ అనే జక్కువలు (చక్రవాక పక్షులజంట) ఆనందముగ కూసినవి. (అంటే ఆ జంట నిజానికి తామొక్కటే అని కూస్తూన్నాయి అని భావము). ఓ వనజాక్షా! (పద్మనయనా!) నీ వైకుంఠద్వారపు వాకిలి తలుపులు తెరిపించి నిదురమేలుకొనవయ్యా!

ఓ జలజాక్షా! నీవు మేలుకొంటే దుర్మార్గము అనే చీకట్లన్నీ తొలగిపోతాయి నలుదెసలా చతుర్వేదములనెడి కీరములు (చిలుకలు) నాదముతో రవళిస్తాయి. ఈ లోకంలోవున్న వేద-విహిత ధర్మములన్నియు నింగిలోని చుక్కలవలె (నక్షత్రముల తీరుగా) అదృశ్యమవుతాయి. ఓ దేవా! నిదురమేల్కొని ఒకపరి నీసతి మోమును పరికించుము.

ఓ దేవదేవా! నీవు మేలుకొంటే, కపటులైన రాక్షసుల నేత్రకలుహారములు (కన్నులనే లేత ఎఱుపురంగు కలువపూలు) మోడ్చె (ముడుచుకుపోతాయి). సుకర్మములు (వేదయుక్తమైన పనులు) అనే ఎండలుకాస్తాయి. అపురూపుడవైన శ్రీవేంకటేశ్వరా! నీవు నిదుర మేల్కొని ఇందిరాదేవితో కూడి నిపుణుడవై మమ్ము రక్షించి పరిపాలింపుము తండ్రీ!

సంపుటి: 4 కీర్తన: వైష్ణవులసొమ్ము నేను వారు నీసొమ్ములింతే
సంఖ్య : 185 పుట : 124 రాగం: సాళంగనాట

సాళంగనాట

14 వైష్ణవులసొమ్ము నేను వారు నాసొమ్ములింతే
విష్ణుఁడ నీవెట్టైన వివరించుకోవయ్యా ॥ పల్లవి॥

నెఱి నీబంటనా హరి నీకంటె బలువులైన-
తఱి నీదాసులకే నే దాసుఁడగాక
గుఱుతెరుఁగుదునా నేఁ గోరి యింతకతొల్లి
గుఱుతు చూపిన మాగురువునేకాక ॥వైష్ణ॥

ముంచి నీకు మొక్కేఁగాక ముందే నీశరణులు
పెంచి పాదాలు నా నెత్తిఁబెట్టిరయ్య
పొంచి నీవేడ నేనేడ బుజముల ముద్రవెట్టి
సంచితమై సేసినట్టిసంబంధమేకాక ॥వైష్ణ॥

శ్రీవేంకటేశ నీసేవే సేసేఁగాక నేడీ-
సేవకుఁ దెచ్చెను వారిసేవేకాదా
భావమొక్కటిగా నాకుఁ బట్టిచ్చిరి నిన్ను వారు
ఆవలీవలికిఁ బరమార్థమేకాక ॥వైష్ణ॥ 185

అవతారిక:

విశిష్టాద్వైత మత దీక్ష స్వీకరించిన అన్నమాచార్యులవారు, బుజములపై శంఖచక్రముల ముద్రలు ధరించారు. తిరునామం నుదుటిపై ధరించారు. వైష్ణవ సిద్ధాంత ప్రచారకులై రోజుకి, కనీసం ఒక్క కీర్తన శ్రీవేంకటేశ్వరునిపై చెప్పారు. ఈ నాటికీ నాబోటి అనామకులను సైతం ఆ నామం అనుమానం లేకుండా రక్షిస్తున్నది. ఎందుకంటే.. వైష్ణవులంతా స్వామివారి సొమ్ము. అందుకే అన్నమయ్య "ఓ విష్ణుడా! నీవు యెట్లా అన్వయించుకొనినా

పర్వాలేదు, నేను వైష్ణవుల సొత్తును. వారు నీసొత్తు" అని తేల్చిపారేశారు. స్వామీ! నిన్ను నాకు ఆ వైష్ణవులు పట్టిచ్చారయ్యా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ విష్ణుదేవా! నేను వైష్ణవదీక్షను స్వీకరించినందున వైష్ణవుల సొమ్మునైతిని. మరి ఆ వైష్ణవులు నీసొమ్ము. అనగా నీదాసులైన వైష్ణవులకు నేను దాసుడను. ఆ విధంగా నేను నీకు చెందినవాడినే. దీనిని నీవెట్లు వివరించుకొనినా నీఇష్టమే.

ఓ హరీ! నెఱి (న్యాయంగా) నీబంటునయ్యేవాడినే కాని, నీదాసులువున్నారే వారికి వారి బలంతోపాటు నీ బలంకూడా తోడవటం వల్ల, వారు నీకంటే బలవంతులు. అటువంటప్పుడు నాకెప్పుడూ యెదురుగా వుండేవారి దాస్యం చేయుట నాకు మంచిది కదా! నేను ఇంతకు పూర్వం నిన్నెరుగను. తొల్లి (మొట్టమొదట) మా గురువులే నీ గుర్తులు చూపించితే నిన్ను గుర్తుపట్టగలిగాను. లేకపోతే నీవెవవరవో నాకేమి తెలుసు?

ఓ విష్ణుదేవా! నేను వేరే నీకు మొక్కవలసిన పనిలేదు. ఎందుకంటే, ఇంతకు ముందే నీశరణము పొందిన మా గురువులు నీపాదాలను మానెత్తినయెప్పుడో పెట్టేశారయ్యా! మాకు వైష్ణవ దీక్షనిచ్చింది అట్లాగే కదా! ఆ దీక్షే లేకపోతే నీవు యెక్కడ మేము యెక్కడ? మా రెండు భుజముల మీద నీ శంఖ చక్రముల ముద్రలు వేశారు. మాగురువులావిధంగా మన సంబంధాన్ని సంచితము చేశారు (కూడబెట్టారు) గానీ (లేకపోతే) నీవు నాకెట్లు తెలిసేవాడివి?

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ నాడు నేను నీసేవచేస్తున్నమాట నిజమే. కానీ నేను మొదట వారిని సేవించినందువల్లనే, నేను నిన్ను సేవించటం అన్నది జరిగింది. నాకు వారు భావమొక్కటిగా (అన్యధా శరణం నాస్తి అను ఒకే ఒక భావనతో) నిన్ను నాకు మాగురువులు పట్టిచ్చారు. అందువల్లనే మాకు ఆవలీవల పరమార్థము (ఇహపరములు రెండిటి పరమార్థము దక్కినది). కాక నేను నిన్నెట్లెరుంగుదునయ్యా!

సంపుటి: 4 కీర్తన : తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైన పొలము
సంఖ్య : 52 పుట : 35 రాగం: సామంతం

సామంతం

15 తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము ॥ పల్లవి॥

నిండినట్టిమడుగులనీరువంకపొలము
కొండలు మోఁచినపెద్దగొబ్బరపుఁబొలము
అండనే పొలమురాజులుండేటిపొలము
చెండివేసి మాకులెల్లా సెలగినపొలము ॥తిమ్మి॥

ఆసపడి వరదానమడిగినపొలము
బాసలతోఁ గడు నెత్రుపట్టమైనపొలము
రాసికెక్కే మునులకు రచ్చైనపొలము
వేసరక నాఁగేట వేగిలైన పొలము ॥తిమ్మి॥

మంచి గురుతైన రావిమానిచేనిపొలము
వంచిన గుఱ్ఱముఁ దోలే వయ్యాళిపొలము
యెంచఁగ శ్రీవేంకటేశు నిరవైనపొలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటిపొలము ॥తిమ్మి॥52

అవతారిక:

ఇది అత్యద్భుతమైన దశావతారవర్ణన కీర్తించే అన్నమాచార్య కీర్తన. ఎంతో మేధాశక్తి వుంటేనే కాని ఈ కీర్తన అర్థంకాదు. తిమ్మన్న అంటే వేంకటేశ్వరుడు తిమ్మిరెడ్డి అంటే పరమాత్మ అయిన శ్రీవేంకటేశ్వరుడు. బొమ్మిరెడ్డి అంటే జీవాత్మయైన అంతర్యామి అంటే క్షేత్రజ్ఞుడు. దిష్టమైన పొలము అంటే (భాగ్యముకొద్దీ సంప్రాప్తించిన సాగుచేయదగిన మాగాణి వంటి క్షేత్రము లేక శరీరము). మా భాగ్యము కొద్దీ ఆ శ్రీవేంకటేశ్వరుడు మాకు ఈ దేహాన్నిచ్చి మాజీవాత్మకు ఒప్పగించి "వొరే దీనిని సక్రమంగా సాగుచేసుకోండిరా" అన్నాడు... ఇదీ ఈ కీర్తన పల్లవి. ఇకపై ఓపికగా చదివి భావ వివరణ నాస్వాదించండి.

భావ వివరణ:

తిమ్మిరెడ్డి (పరమాత్మ) మాకు దిష్టమైన (మా భాగ్యముననుసరించి) ఒక పొలము (క్షేత్రము) సాగుచేసికొనమని, బొమ్మిరెడ్డికి (అంతర్యామియైన క్షేత్రజ్ఞునికి) ఒప్పగించినాడు. ఇక చూసుకోండి ఎన్నిరకాల పొలములు సాగులోకి వచ్చాయో.

"నిండినట్టి మడుగుల నీరువంక పొలము" – ఎప్పుడూ నిండుగా నీరువుండే చోట నీట్లో వుండేదేహము.. (అంటే మత్స్యావతారము.) "కొండలు మోచిన పెద్దగొబ్బరపు పొలము" నిస్వార్థముగా పరులకోసం పెద్ద కొండను మోసిన దేహం... (అంటే తాబేలు లేక కూర్మావతారం.) "అండనే పొలము రాజులు వుండేటి పొలము" సూకరములుండే దేహము– (అంటే వరాహావతారము). "చెండివేసి మాకులెల్లా చెలగిన పొలము". మాలిన్యమును లేక పాపమును చెండాడి విజృంభించిన దేహము – (అంటే నరసింహావతారము).

"ఆస పడి వరదానము అడిగిన పొలము" యాచించి వరమును పొందిన దేహము – (అంటే వామనావతారము). "బాసలతో కడునెత్రుపట్టమైన పొలము" ప్రతిజ్ఞ పట్టి ఎంతో నెత్తురు పారించిన దేహము – (అంటే పరశురాముడు). "మునులకు రచ్చై రాసికెక్కిన పొలము" మునులకు రక్షణయై విఖ్యాతిగాంచిన దేహము – (అంటే శ్రీరామావతారము). "వేసరక నాగేట వేగిలైన పొలము" విసుగులేక నాగలి ధరించు ఉద్రేకియైన దేహము – (అంటే బలరామావతారము).

"మంచి గురుతైన రావిమాని చేని పొలము" అశ్వత్థవృక్షం క్రింద మంచి ప్రసిద్ధినొందిన దేహము – (అంటే బుద్ధావతారము). "వంచిన గుఱ్ఱము దోలే వయ్యాళిపొలము" అణుకువ గలిగిన గుఱ్ఱమునెక్కి విహారముచేసిన దేహము – (అంటే కల్కి అవతారము). "యెంచగ శ్రీవేంకటేశు నిరవైన పొలము" ప్రసిద్ధికెక్కిన శ్రీవేంకటేశ్వరుడై నెలకొనిన దేహము. మరి ఆ అద్భుతమైన పొలము యెట్లాంటిదంటే లోకులందరూ దానిని పంచుకొని, శరణని బ్రతుకుతున్నారు. అవును కదా!

సంపుటి: 4 కీర్తన : అంజినీదేవి కొడుకు హనుమంతుడు
సంఖ్య : 272 పుట : 182 రాగం: మాళవి

మాళవి

16 అంజినీదేవికొడుకు హనుమంతుఁడు
సంజీవినిదెచ్చినాఁడు సారె హనుమంతుఁడు ॥ పల్లవి॥

కలశాపురముకాడ కదలీవనాల నీఁడ
అలవాఁడె వున్నవాఁడు హనుమంతుఁడు
అలరుఁ గొండలకోనలందలిగుహలలోన
కొలువు సేయించుకొనీఁ గోరి హనుమంతుఁడు ॥అంజి॥

పసలుగా జంగవెట్టి పండ్లగుత్తి చేతఁబట్టి
అసురలనెల్లఁ గొట్టీ హనుమంతుఁడు
వసుధఁ బ్రతాపించి వడిఁ దోఁక గదలించి
దెసలెల్లాఁ బాలించీ దివ్యహనుమంతుఁడు ॥అంజి॥

వుద్దవిడి లంకచొచ్చి వుంగరము సీతకిచ్చి
అద్దివో రాము మెప్పించె హనుమంతుఁడు
అద్దుక శ్రీవేంకటేశు కటుబంటై వరమిచ్చి
కొద్ది మీర సంతోసాలే గుప్పీ హనుమంతుఁడు ॥అంజి॥272

అవతారిక:

కలశాపురంలో వెలసిన హనుమంతునిపైచక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అంజినీదేవి కుమారుడైన ఈ రామబంటు సారెగా సంజీవని పర్వతం తీసికొని వచ్చాడు, అంటున్నారు. సారెగా అంటే పెట్టుబడిగా అని అర్థం చెప్పుకోవాలి. ఉద్ద విడి అంటే చాలా గొప్పగా అని భావించవచ్చును. ఈయన ఆయుధం ఏమిటో తెలుసా? 'పండ్లగుత్తి' అంటే ముళ్ళలాంటి పొలుసులున్న గద అన్నమాట. ఆయనతోక కదులుతున్నట్లు భావించగలిగిన ఈ పదకవితాపితామహుడు నిజంగా ధన్యజీవి

భావ వివరణ:

ఓ ప్రజలారా! అంజినీదేవి కుమారుడైన ఈ హనుమంతుడు, రామలక్ష్మణులను రక్షించుటకు సారెగా (పెట్టుబడిగా.. లేక... అర్పణగా) సంజీవినీ పర్వతము తీసికొని వచ్చినాడు.

అల (అదిగో) కలశాపురం అనే ఈ వూరిలో కదలీవనాల నీడ (అరటి తోటల చల్లని నీడలలో) వున్న వాడే హనుమంతుడు. ఈ మహానుభావుడు యెక్కడో కొండల కోనలలో వున్న గుహలో వెలసి, కోరి తన భక్తుల ద్వారా కొలువు చేయించుకొనినాడు. ఈ హనుమంతుడు ఈ రీతిని అలరుచున్నాడు.

పసలుగా (మృదువుగా) జంగవెట్టి (కాళ్ళఅంగజూచి), పండ్లగుత్తి (ముళ్ళవంటి పండ్లు వున్న గదను) చేతిలో పట్టుకొని రాక్షసులనందరినీ ఈ హనుమంతుడు చావబాదినాడు. దివ్యత్వముగల ఈ హనుమంతుడు, ప్రతాపించి (ప్రతాపమును చూపి) తనతోకను వడిన్ కదలించి (వేగముగా వూపి) పాలించీ, దెసలెల్లా (దిక్కులన్నీ ఏలుచున్నాడు).

ఆనాడు త్రేతాయుగంలో ఈయన యేమి చేశాడో తెలుసా? వుద్దవిడి (చాలా గొప్పగా) లంకలోకి చొచ్చి (దూరి) శ్రీరాముద్రికయైన వుంగరమును సీతాదేవికిచ్చి అద్దివో (అదిగో) ఆయన శ్రీరామచంద్రుని మెప్పించినాడు. ఈనాడు కలియుగంలో, అటు (ఆ తిరుమల శిఖరాలపై) శ్రీవేంకటేశ్వరునకు బంటై తన భక్తులకు వరమిచ్చి కొద్దిమీర (అశేషముగా) సంతోషములను గుప్పించుచున్నాడు. ఈ స్వామిని సేవించి తరించండి.

సంపుటి: 4 కీర్తన : అప్పుడైన హరియెక్కె నదివో తేరు
సంఖ్య : 35 పుట : 24 రాగం: పాడి

పాడి

17 అప్పుఁడైనహరి యెక్కె నదివో తేరు
యిప్పుడు తిరువీధుల నేఁగీ తేరు ॥ పల్లవి॥

సముద్రాలమీఁదఁ దోలె సర్వేశ్వరుఁడు తేరు
భ్రమయ జరాసంధుపై ఁ బరపెఁ దేరు
తిమురుచు రుక్మకువై ఁ దిరుగఁ దోలెఁ దేరు
ప్రమదాన సృగాలునిపై ఁ దోలెఁ దేరు ॥అప్పఁ॥

కమ్మి యక్రూరుఁడు దేఁగా కంసునిపై నెక్కెఁ దేరు
బమ్మరపో దంతవక్త్రుపైఁ దోలెఁ దేరు
దుమ్ములుగా సాల్వునిపై దొడ్డగాఁ దోలినతేరు
దొమ్మి రుక్మిణిపెండ్లికిఁ దోలినట్టితేరు ॥అప్పఁ॥

మీఱి హంసడిచికులమీఁదఁ దోలినట్టితేరు
తూఱి సంధిమాటలకుఁ దోలినతేరు
ఆఱడి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడి
చూఱలుగొన నెక్కెను శోభనపుతేరు ॥అప్పఁ॥35

అవతారిక:

శ్రీవేంకటేశ్వరుని తేరు (రథము) తిరుమల తిరువీధులగుండా వూరేగిపోతున్నది. పరవశించిన అన్నమాచార్యులవారు ఆ హరి యేయే సందర్భాలలో నాలుగు అశ్వముల పూన్చి తను తోలే రథమునేకాక పరులు తోలే రథములను కూడా యెప్పుడెక్కాడో పునశ్చరణ చేసికొంటున్నారు ఈ కీర్తన ద్వారా. పురాణవాఙ్మయము బాగాపరిచయంవుంటేకాని ఈ ప్రయత్నం సిద్ధించదు. సృగాలుడు అనేవాడు నక్క రూపంలోవుండే రాక్షసుడు (నరకాసురుడేమో!!) ఇవన్నీ అటువంచి "హంసడిచికుల మీదన్ తోలినట్టితేరు" అన్న చరణంలో నాకేమీ పాలుపోలేదు. స్వామి తనశత్రువుపై యుద్ధానికి రథంపై వెళ్ళాడని తెలుస్తూనే

వున్నది. హంస అంటే శివుడు లేక విష్ణుడు. ఆయనపై ఆయనే యుద్ధానికి వెళ్ళడు కదా! కాబట్టి ఆ మాటకు అర్థం శివభక్తుడైన బాణాసురుడని భావించాను. ఇక చదవండి. నేనూ బ్రహ్మోత్సవాలలోనే దీన్ని వివరిస్తున్నాను.

భావ వివరణ:

అదిగో ఈ విశ్వమునకంతటికీ అప్పుడు (తండ్రి) అయిన శ్రీహరి, తేరు యెక్కెను (రథము) పైయెక్కినాడు. ఇప్పుడు ఈ తిరుమల తిరువీధులలో ఈ రథము పోతున్నది. కనుల పండువుగా చూచి తరించండి.

ఒకప్పుడు ఈ సర్వేశ్వరుడు తన తేరును సముద్రాలమీద తోలినాడు. (అర్జునునికి తన ఆదినారాయణుని రూపం చూపాలని తన రథముపై శ్రీకృష్ణుడు వైకుంఠం తీసికొని వెళ్ళాడు). జరాసంధుడు భ్రమించి మతిపోగొట్టుకునేట్లు రథం తోలాడీయన. (వాడి అక్షౌహిణీ సైన్యమూ నశించేది). తిమురుచు (ఉద్రేకముతో) రుక్మకుపై (రుక్మిపై) తిరగబడితోలిన రథము ఇదే (రుక్మిణీ స్వయంవరంలో). ప్రమదాన (సంతోషముతో) సృగాలునిపై (నక్కరూపంలో వున్నరాక్షసునిపై) తోలిన రథము ఇదే (బహుశా నరకాసురుడు అయివుండవచ్చు).

అక్రూరుడు తీసికొనిరాగా కమ్మి (విజృంభించి) కంసునిపై దండెత్తిన తేరు ఇదే, (ఈ రథముపైననే అక్రూరునికి శ్రీకృష్ణుడు భగవంతుడని అర్థమైంది). దంతవక్త్రుడు భ్రమచెంది నిస్తేజుడగునట్లు శ్రీకృష్ణుడు తోలిన రథము ఇదే, (శ్రీహరిద్వారపాలకుడైన విజయుడే వీడై పుట్టాడు). ఈ రథముపైననే శ్రీకృష్ణుడు దుమ్మురేగునట్లు సాల్వునితో యుద్ధం చేశాడు. (అంబను కాదన్నదీ సాల్వుడే). రుక్మిణీకళ్యాణము సందర్భంగా రుక్మిణితోలిన రథం ఇదే, (శ్రీకృష్ణుడు శిశుపాలుని చిత్తుచేశాడీ రథంపైనుండే)

మీఱి (విజృంభించి) శివుడు రక్షణగా వచ్చిన బాణుని శ్రీకృష్ణుడు ఓడించినదీ రథముపైననే (ఉషాపరిణయం దీని తరువాతనే జరిగింది). సంధిమాటలు తూఱి (విఫలమై) భారతయుద్ధం జరిగినప్పుడు శ్రీకృష్ణపరమాత్మ, పార్థసారథియైనదీ రథముపైననే (భగవద్గీతకు వేదిక ఈ రథమే). నేడు శ్రీవేంకటేశ్వరుడు, అలమేల్మంగను ఆరడిన్ (మించి) కూడ, చూఱలుగొని (ఆదరణపొంది) ఎక్కిన శోభనపు తేరు (కళ్యాణప్రదమైన రథము) ఇదే. (చూచి తరించండి).

సంపుటి: 4 కీర్తన : అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ
సంఖ్య : 416 పుట : 279 రాగం: బౌళి

బౌళి

18 అడియ నడియనయ్య యఖిలలోకైకనాథ
తడతాఁకులతాపత్రయము మానుపుటకు ॥ పల్లవి॥

శరణు శరణు వోసర్వేశ్వర నీకు
మరణభయములెల్ల మానుపుటకొఱకు
మొరయొ మొరయొ నీకు ముకుంద మాధవ
దురితములన్నియుఁ దొలఁగించుటకు ॥ఆడియ॥

దండము దండము నీకు దైవశిఖామణి
పండియుఁ బండని మతి పాకముసేయు కొరకు
అండనే దాస్యము దాస్యము నీకు నేనైతి
నిండు నీకరుణ నాపై నించేటి కొరకు ॥అడియ॥

అభయ మభయము శ్రీయాదినారాయణ
వుభయకర్మము నాకు నూడుచుట కొరకు
విభుఁడ శ్రీవేంకటేశ వినుతిసేసెద నిన్ను
శుభములన్నియు మాకుఁ జూపేటి కొరకు ॥అడియ॥416

అవతారిక:

అద్భుతమైన శరణాగతి వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అడియను అడియను అయ్యా! అంటే నీదాసాను దాసుణ్ణి ప్రభూ! అని అర్థం. ఈ లోకంలో మూడు విధములైన తాపత్రయములు జీవిని బాధిస్తున్నవి. అవే అధ్యాత్మికము, ఆధిభౌతికము మరియు ఆధిదైవికము. ఇవి తడతాకుతుంటాయి... అంటే తత్తరపడేట్లు చేస్తాయి. ఓ అఖిలలోక నాయకా! శరణు దండము దండము, అభయం అభయం అని వేడుకొంటున్నారు. మరి ఆ శ్రీవేంకటేశ్వరుడు అనుగ్రహిస్తే అన్నీ శుభములే కదా!

భావ వివరణ:

ఓ అఖిలలోకైక నాథా! (లోకములన్నింటికీ ఒకే ఒక నాయకుడవైన శ్రీహరీ!) నేనునీ, అడియను అడియను అయ్యా! (దాసానుదాసుడను తండ్రీ!) నాకు తడతాకులు (తత్తరపాటు) కలిగించే తాపత్రయములను మాన్పుటకు నీకు మ్రొక్కెదను.

ఓ సర్వేశ్వరా! నిన్ను శరణుచొచ్చెదను. నా మరణభయముల నెల్ల (నశింపజేయు శంకలనన్నీ) మాన్పుటకు శరణు వేడెదను. ఓ ముకుందా! మాధవా! నా దురితములన్నింటినీ (పాపములన్నీ) తొలగించుటకు మొరవెట్టుచున్నాను.

ఓ దైవశిఖామణీ! (దేవతలందరిలో తలమానికమైన స్వామీ!) పండియుపండని నామతి (పరిపక్వము అయిందీ అనలేము, పరిపక్వము కానిదీ అనలేము - అట్టి నా మనస్సును) పాకముసేయుట కొరకు (పరిపక్వత నొందించుటకు) దండము దండము (అనేక నమస్కారములు), అండనే (నిన్నాశ్రయించి) నీకు దాస్యము చేయువాడనైతిని. నీ కరుణ నాపై నింపి నన్ను అనుగ్రహించుటకు నీదాసుడనైతినయ్యా!

ఓ శ్రీ ఆదినారాయణా! నా ఉభయ కర్మములను (సంచిత కర్మలు ప్రారబ్ధ కర్మలు అనే రెండు రకముల కర్మలను) వూడుచుటకు (తొలగిపోవునట్లు చేయుటకు) నీ అభయమును వేడెదను. నాకు అభయమునిమ్ము. ఓ శ్రీవేంకటపతీ! నిన్ను వినుతి చేసెదనయ్యా! (ప్రార్థించెదను ప్రభూ!) మాకు శుభములన్నింటినీ చూపుటకు నిన్ను యెల్లవేళలా ప్రార్థించెదను తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : చేకొని కొలువరో శ్రీనరసింహము
సంఖ్య : 567 పుట : 381 రాగం: సాళంగనాట

సాళంగనాట

19 చేకొని కొలువరో శ్రీనరసింహము
శ్రీకరమగు నిదె శ్రీనరసింహము ॥ పల్లవి॥

వెడలేటివూర్పుల వేఁడిమి చల్లీ
చిడుముడికోపపు శ్రీనరసింహము
గడగడవడఁకేటిగండస్థలములు
జెడలు గదలిచీ శ్రీనరసింహము ॥చేకొ॥

వంకరగోళ్లవైపులు వెదకీ
చింకచూపులను శ్రీనరసింహము
హుంకారంబుల నుదధులు గలఁచీ–
నంకెల శ్రీపతియగు నరసింహము ॥చేకొ॥

వదనము దిప్పుచు వడి నసురమేను
చిద్రుపలు చేసెను శ్రీనరసింహము
అదివో శ్రీవేంకటాద్రి యెక్కి యిటు
చెదరక నిలిచెను శ్రీనరసింహము, ॥చేకొ॥567

అవతారిక:

అన్నమాచార్యులవారికి భజన అంటే ప్రత్యేకమైన ప్రీతి అని నా నమ్మకం. ఉగ్రనరసింహునిపై వారు చెప్పిన ఈ భజన మీ మనస్సులను ప్రక్షాళన చేస్తుంది. నిశితమైన వర్ణన అంటే (మైన్యూట్ డిస్క్రిప్షన్) అది యెలావుంటుందో ఇది వింటే తెలుస్తుంది. తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని చిత్రహింసలు పెట్టి ఈ స్తంభములో వాడిని (శ్రీహరిని) చూపించకపోతే స్వయంగా, తనే ప్రహ్లాదుని చంపేస్తానన్నాడు హిరణ్యకశిపుడు. ఆవేశం

కట్టలు తెంచుకొని, పగిలిన స్తంభంలోంచి వెడలివచ్చిన ఆ శ్రీనరసింహుడు యెలావున్నాడయ్యా! అంటే... "శరణు శరణు సురేంద్ర సన్నుత శరణు) శ్రీసతివల్లభా"! అని ప్రార్థించండి.

భావ వివరణ:

ఓ భక్తులారా! ఇదే శ్రీనరసింహము. ఈ దేవదేవుని చేకొని (పూనుకొని) కొలువరే (మ్రొక్కి సేవించండి). ఈ నరసింహము మనకు శ్రీకరుడు (శుభములనొసగు మహానుభావుడు).

ఈ శ్రీనరసింహము చిడుముడికోపమువాడు (తొట్రుపాటు కలుగజేసే కోపధారి). చూడండి తన కోపము చేత వెడలేటివూర్పుల (బయల్వెడలు ఉచ్ఛ్వాస నిస్వాసములతో) వేడిసెగల నెట్లా వెదజల్లుతున్నాడో గమనించండి. ఆయన గండస్థలము (రెండు చెక్కిళ్ళూ) ఉద్రేకంతో గడగడమని వణుకుతున్నాయి. అందుచేత ఈ శ్రీనరసింహము యొక్క జడలు (జూలు) పైకి క్రిందికి కదలుచున్నది.

ఈ శ్రీనరసింహము వంకరలు తిరిగిన పంజాగోళ్ళతో వాటివైపు చూసుకొంటూ (రక్తం అంటినదోలేదోనని) చింక చూపులు (భీతహరిణేక్షణములతో) చూస్తున్నాడు. ఈ శ్రీనరసింహము యొక్క హూంకారమునకు, వుదధులు (సాగరములు అన్నియును) కలచీ (కల్లోలమైపోతున్నాయి.) ఈ స్వామి అంకెల శ్రీపతి (తన ప్రియసతి శ్రీలక్ష్మిని తన తొడపైననే కూర్చుండబెట్టిన శ్రీనాథుడు.

ఈస్వామి తనతొడపైనున్న హిరణ్యకశిపుని మేను (శరీరాన్ని) తన వదనము వడి తిప్పుచూ (తన మొగమును వేగంగా అటూ ఇటూ కదలించుచూ) చిద్రుపలు చేసెను. (చిన్న చిన్న ఖండములుగా చేసినాడు). ఇంత ఘోర భీభత్సం చేసిన ఈ శ్రీనరసింహము చెదరక (ఏమాత్రమూ చలించక) అదివో శ్రీవేంకటాద్రినెక్కి యిటు (ఈవిధముగా) శ్రీవేంకటేశ్వరుడై నిలిచియుండి, మనబోంట్లను అనుగ్రహిస్తున్నాడు.

సంపుటి: 3 కీర్తన: రామకృష్ణ నీవు నందే రాజ్యమేలుచుండుదువు
సంఖ్య : 432 పుట : 291 రాగం: లలిత

లలిత

20 రామకృష్ణ నీవు నందే రాజ్య మేలుచుండుదువు
యేమిసేసే విక్కడ నీ యిరవుకే పదవే ॥ పల్లవి॥

లంక విభీషణు నుంచ లక్ష్మణుని నంపినట్టు
అంకె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు
వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు
వేంకటాద్రిపొంతనుండ వేగ మమ్ము నంపవే ॥రామ॥

ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁగపుల నిండ్ల కంపినట్టు
వానర గోపికలొద్ది కుద్ధవుని నంపినట్టు
నునుపు శేషాద్రినుండ నన్ను నంపవే. ॥రామ॥

పెండిలికిఁ బరుషలఁ బిలువఁగ నంపినట్టు
అండనే ముందరఁ గంత కంపినయట్టు
వెండియు శ్రీవేంకటేశ వేఁట వచ్చి మరలితి–
వుండ(డు?) చోటనుండి నన్ను వూడిగాన కంపవే. ॥రామ॥432

అవతారిక:

ఓ శ్రీరామా! శ్రీకృష్ణా! నీవూ నీవు అక్కడ క్షేమంగా ప్రజలనేలుకోండయ్యా! ఇక్కడ ఈ కలియుగంలో మీరేం చేస్తారు? మీ మీ చోట్లకి (అయోధ్యకీ ద్వారకకీ) పదవే... అని చమత్కరిస్తున్నారు అన్నమయ్య. మీరు అక్కడకు పోయి, నన్ను మాత్రం వేంకటాద్రికీ, శేషాద్రికీ శ్రీవేంకటేశ్వరుని వూడిగం చేయమని కాస్త అనుగ్రహంతో పంపండయ్యా! విభీషణుణ్ణి, సుగ్రీవునీ, హనుమంతుని, గరుత్మంతుని,

ఉద్ధవుని, వానరసేనను యెక్కడికెక్కడికో పంపారు కదా! అట్లాగే నన్నూ తిరుమలలో వుండరా అని పంపించండి అంటున్నారు. "అండనే ముందర కంత కంపినయట్లు" – అంటే యేమిటి? చదవక తప్పదు... భావవివరణ.

భావ వివరణ:

ఓ శ్రీరామా! శ్రీకృష్ణా! నీవున్ అందే రాజ్యమేలుచుండుదువు (నీవూ నీవూ అక్కడే ప్రజారంకముగా రాజ్యమేలుచుందువు). ఇక్కడ యేమిసేసేవు? నీ ఇరవుకు (మీమీ స్థానాలకు) నీవు అయోధ్యకు నీవు ద్వారకకు, పదవే (వెడలుడయ్యా!)

లంకలో విభీషణుని వద్దకు లక్ష్మణుని పంపి పట్టాభిషిక్తుని చేయించినట్లున్నూ, సుగ్రీవునికి కిష్కింద నేలుటకు పంపినట్లున్నూ, వాయునందనుడైన హనుమంతుని సంజీవని తెచ్చుటకు పంపినట్లున్నూ, మమ్మల్ని కూడా వేంకటాద్రి పొంతనుండి (దాపున నుండుటకు) నియోగించరాదా ప్రభూ!

నీ కిరీటమును తెమ్మని ఆనాడు గరుత్మంతుని పంపినట్లున్నూ, పట్టాభిషేకానంతరము అయోధ్య నుండి వానరసేనను తిరిగి కిష్కింధకు పంపివేసినట్లున్నూ, వేదన చెందుచున్న గోపికలవద్దకు ఓదార్చి హితబోధ చేసిరమ్మని నందవ్రజమునకు ఉద్ధవుని పంపించినట్లున్నూ, అనుపు శేషాద్రి నుండి (శేషాద్రినుండమని ఆనతీయుచూ) నన్ను కూడా పంపించరాదా తండ్రీ!

నీ పెండ్లి పద్మావతితో జరుగుతుంది చూచుటకు విచ్చేయుడని పరుషలను (నీ భక్తులను) పిలువనంపినట్లున్నూ, అండనే కంతకు అంపినట్లు ముందరే నన్ను కూడా పంపించు స్వామీ! (పెండ్లిలో ఉప్పు పప్పు బియ్యమూ ఒక పెట్టెలో పెట్టి తీసికొనిపోయి మగపెండ్లివారికి అందిస్తారు. ఆ పనికి ఆంతరంగికులను నియోగిస్తారు. దాన్ని కంతకు పంపడం అంటారు.) వెండియు (మరియు) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వేటకు వెళ్తే తిరుమలను చూసుకోవటానికి నీవూడిగపువాడిగా నన్ను వుంచుకోరాదా తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : ఆదివిష్ణు వీతఁడే యటరమ్మా.
సంఖ్య : 193 పుట : 130 రాగం: లలిత

లలిత

21 ఆదివిష్ణు వీతఁడే యటరమ్మా
ఆదిగొని భూభార మణఁచీనోయమ్మా. ॥ పల్లవి॥

చందురునుదయవేళ సవరేతిరి కాడ
కందువ దేవకి బిడ్డఁ గనెనమ్మా
పొందుగ బ్రహ్మాదులు పురుఁటింటి వాకిటను
చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా. ॥ఆది॥

వసుదేవునియెదుట వైకుంఠనాథుఁడు
సిసువై యవతరించి చెలఁగీ నమ్మా
ముసిముసినవ్వులతో మునులకు ఋషులకు
యిసుమంతవాఁ డభయమిచ్చీనమ్మా. ॥ఆది॥

కన్నతల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి
అన్నిటా రాకాసిమూఁక అణఁచీనమ్మా
వున్నతి శ్రీవేంకటాద్రినుండి లక్ష్మీదేవితొడ
పన్ని నిచ్చకల్యాణాలఁ బరిగీనమ్మా. ॥ఆది॥193

అవతారిక:

భూభారాన్ని తగ్గించడానికి భువిపై అవతరించిన ఆదివిష్ణువే ఈ కృష్ణుడు అని ఆ అవతార విశిష్టతను కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు.

సవరేతిరి అంటే అర్ధరాత్రి అని అర్థం. సిసువు అంటే శిశువు అని అర్థం. కన్నతల్లిదండ్రుల కర్మబంధాలను పటాపంచలు చేశాడట ఆయన. రాకాసి మూకలు అంటే రాక్షసులగుంపు అని అర్థం. ఈ కృష్ణయ్యే కలియుగంలో శ్రీవేంకటాద్రిపై అలమేల్మంగమ్మతో వెలసి నిత్యకళ్యాణాల

చక్రవర్తియై శోభలీనుతున్నాడు అంటున్నారు. 'ఆదికొనుట' అంటే కన్నువేయటం అని అర్థం.

భావ వివరణ:

ఓ అమ్మలారా! ఈతడే ఆదివిష్ణువట. ఈ మహానుభావుడు, ఆదిగొని (కన్నువేసి... అంటే... నిశ్చయించుకొని) భూభారము నణచినాడమ్మా!

చందురునుదయవేళ (చంద్రుడు వుదయించుచున్న సమయమున) సవరేతిరి కాడ (అర్థరాత్రి తరుణమున) దేవకీదేవి, కందువ బిడ్డ గనెనమ్మా! (సామర్థ్యముగల శిశువునకు జన్మనిచ్చింది. బ్రహ్మాది దేవతలు అప్పుడు పొందుగా (ఉద్ధతితో) ఆ పురిటింటి గుమ్మంలో నిలబడి ఆ బాలుని స్తోత్రించినారోయమ్మా!

అనంతరం వైకుంఠనాథుడైన శ్రీమన్నారాయణుడు వసుదేవుని యెదుట సిసువుగ (శిశువుగా) అవతరించి చెలగీనమ్మా (కనువిందుజేయు చున్నాడమ్మా!) అప్పుడు ఆ యిసుమంత శిశువు ముసిముసినవ్వులు విరజిమ్ముతూ తనను చూడవచ్చిన మునీశ్వరులకు ఇకపై భయమువలదు అని వారికి అభయమునొసగినాడు ఓయమా! ఏమి ఆశ్చర్యము!!

అప్పుడా శిశువు తన కన్నతల్లిదండ్రులకు వారి గతజన్మల పుణ్య విశేషమును వివరించి తను వారి గర్భమున జన్మించిననూ వారి కర్మఫలము వలన తన బాల్యమును జూచు అదృష్టము వారికి లేదనీ, తిరిగి తను పెద్దవాడయ్యాక జీవితాంతము తనతోనే గడుపుదురని వివరించి వారికి కర్మపాశము నుండి విముక్తి కలిగించెను. ఆ బాలుడే అన్ని విధములైన రాకాసి మూకలను చీల్చి చెండాడినాడు. నేడు ఆతడే శ్రీవేంకటాద్రిపై లక్ష్మీదేవితో నుండి, వున్నతముగా పూని నిత్యకళ్యాణములు జరుపుకొంటూ, పరగీనమ్మా! (వెలయుచున్నాడమ్మా!).

సంపుటి: 3 కీర్తన : జగములేలేవాడవు జనార్దనుడవు
సంఖ్య : 229 పుట : 153 రాగం: ముఖారి

ముఖారి

22 జగము లేవాఁడవు జనార్దనుఁడవు
తగ నీవారమై (మే?) నేము ధర నెట్టుండినాను, ।। పల్లవి।।

గతి నీవు మతి నీవు కాణాచిచోటు నీవు
సతమై యన్నిటికిని సాక్షివి నీవు
చతురత వలసితే జరతుము కొలుతుము
తతి నేము సేసినతప్పులు లోఁగొనవే. ।।జగ।।

తల్లియుఁ దండ్రివి నీవు దాత దైవమవు నీవు
యెల్లవారికిఁ బరము నిహము నీవు
మల్లడి నొక్కొకవేళ మఱతుము తలఁతుము
చల్లఁగా మానేరములు సైరించుకొనవే. ।।జగ।।

దరి నీవు దాపు నీవు దయామూర్తివి నీవు
పరగ శ్రీవేంకటేశ పతివి నీవు
విరివిగా నేమైనా వేఁడుదుము నుతింతుము
శరణుచొచ్చితి మిఁక క్షమియించుకొనవే. ।।జగ।।229

అవతారిక:

జనుల 'అర్దన' (వేడికోలు) వినేవాడు జనార్దనుడు. "దేవా! నీవు జనార్దనుడవై జగము లేలుతుంటే, మేము నీవారమై, నీదాసులమై ఈలోకంలో పూనికతో వుంటామయ్యా!" అని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. మా తల్లియు దండ్రియును దాతయునూ నీవే ప్రభూ! "అన్యధా శరణం నాస్తి" అని నిన్ను ఆశ్రయించినాము. మాకు నీవే దిక్కు. అసలు సంగతి యేమిటంటే, అవతారికలో కనుపించినంత తేలిక కాదు, దీని భావము. అంతు చిక్కని, చిక్కుముళ్ళు చాలావున్నాయి, అంటే నన్ను నమ్మండి. "కాణాచి" అంటే

యేమిటో? చదవండి. రెండేళ్ళ క్రితం ఇదే కీర్తన నేను చేయలేకపోయాను, నేడు చేయగలుగుతున్నాను. ఇదే స్వామి 'దయ' అంటే.

భావ వివరణ:

ఓ జనార్దనా! నీవు జగములు (పదినాలుగు భువనములను) పరిపాలించు బ్రహ్మాండనాయకుడవు. నేము (మేము) ఈ ధరన్ (భూమిపై) తగన్ (తగినట్లు) నీవారమై (నీ పరివార భృత్యులమై) నెట్టుండినాము (పూనికతోయున్నాము).

ప్రభూ! నీవే మాకు గతివి (దిక్కైన ఆధారానివి). నీవే మాకు మతివి (మంచీ చెడు విచక్షణ కలిగించే మేధస్సువి). నీవే మాకు కాణాచియైన చోటువు (చిరకాలవాసస్థానమైనవాడవు... అందుచేతనే మన ఆత్మలన్నింటికీ ఆ పరమాత్మ చిరంతనుడు). అన్నిటికీ నీవే సతమైన (శాశ్వతమైన) సాక్షివి (ఆయన నిష్పక్షపాతమైన సాక్షీభూతుడు). మాకు అప్పుడప్పుడు చతురత వలసితే (తెలివితేటలు అతి అయిపోయి) నిన్ను జరతుము (నిందించెదము). తరువాత నీవే దిక్కని కొలుతము (కాళ్ళు పట్టుకొంటుంటాం). తతి (అసాధారణంగా) మేము చేయుచున్న తప్పులను మన్నించుము తండ్రీ!

ఓ దేవా! నీవే మాకు తల్లివి, తండ్రివీ నీవే. మా ప్రాణదాతవు పరమాత్మవూ నీవే. నీవు ఆత్మరూపువవైననూ అందరికీ నివాసస్థానమైన వాడవు. మాకు ఇహమున కోర్కెలు దీర్చి, పరమున మోక్షమునిచ్చేవాడవు నీవే. మల్లడి (నీతో పోట్లాడి) ఒక్కొక్కవేళ నిన్ను మఱచిపోయి తలుచుకోను కూడా తలుచుకోము. మా నేరములను చల్లగా (నెమ్మదిగా) సైరించి కొనవే (క్షమించి మమ్మల్ని కాపాడవయ్యా!)

ఓ జగన్నాథా! నీవు మా దరిదాపువు (సమీపములోనే వున్న గమ్యానివి). అంతులేని దయాస్వరూపుడవు. నీవు విలసిల్లిన శ్రీవేంకటపతివి. ఏదియేమైనా మేము నిన్ను విరివిగా (విస్తృతముగా) వేడుకొని నుతించెదము. నిన్ను శరణుచొచ్చితిమి. ఇక క్షమించుకొనవే (మమ్మల్ని క్షమించి అనుగ్రహించుము తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : వీఁడివో లక్ష్మిపతి వీఁడివో సర్వేశుఁడు
సంఖ్య : 402 పుట : 271 రాగం: రామక్రియ

రామక్రియ

23 వీఁడివో లక్ష్మీపతి వీఁడివో సర్వేశుఁడు
వీఁడివో కోనేటిదండవిహరించేదేవుఁడు. ॥ పల్లవి॥

కొండ గొడగుగ నెత్తి గోవులఁ గాచె నాఁడు
కొండవంటిదానవునిఁ గోరి చించెను
కొండ శ్రీవేంకట మెక్కి కొలు వున్నాఁ డప్పటిని
కొండవంటి దేవుఁ డిదే కోనేటికఱుతను. ॥వీఁడి॥

మాఁకులమద్దులు దొబ్బి మరి కల్పభూజమనే-
మాఁకు వెరికి తెచ్చెను మహిమీఁదికి
మాఁకుమీఁద నెక్కి గొల్లమగువలచీర లిచ్చి
మాఁకులకోనేటిదండ మరిగినాఁ డిదివో. ॥వీఁడి॥

శేషునిపడగెనీఁడఁ జేరి యశోదయింటికి
శేషజాతి కాళింగుఁ జిక్కించి కాచె
శేషాచలమనేటి శ్రీవేంకటాద్రిపై
శేషమై కోనేటిదండఁ జెలఁగీని దేవుఁడు. ॥వీఁడ॥402

అవతారిక:

తాళ్ళపాకలో వెలసిన 'కోనేటిరాయనిపై' చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. వీడివో (వీడే) లక్ష్మీపతి, వీడే సర్వేశ్వరుడు అని కీర్తిస్తున్నారు. భావ వివరణనంతా చదివాక మీకు అంతులేని ఆనందం కలుగుతుందని నాకు ప్రగాఢ విశ్వాసము. శేషాచలమనేటి శ్రీవేంకటాద్రిపై శేషమై కోనేటిదండ చెలగీని దేవుడు - అంటే యెన్నైనా అర్థములు చెప్పవచ్చును. ఈ స్వామి తీయటి నీటి బావి. తోడుకున్న వారికి తోడుకొన్నన్ని నీళ్ళు. అవునా?

భావ వివరణ:

ఓ ప్రజలారా! వీడివో (ఈతడే) లక్ష్మీపతి, వీడివో సర్వేశుడు (సర్వమునకు ప్రభువు), ఈతడే ఈ కోనేటి ఒడ్డున విహరించే దేవదేవుడు. ఈయన ఘన కార్యములనాకర్ణించండి.

పూర్వం ఈయన కొండను గొడుగుగనెత్తి (నంద వ్రజమున గోవర్ధన పర్వతమును తన చిటికిన వ్రేలిపై గొడుగువలె యెత్తి గోకులమును రక్షించినాడు). కోరి, కొండవంటి దానవుని (శకటాసురుని) చించెను (ముక్కలు ముక్కలు చేశాడు). అప్పటిని (మరల) ఈ కలియుగంలో శ్రీవేంకటగిరి అనే కొండనెక్కి కొలువు దీరియున్నాడు. నిజముగా ఈ స్వామి ఇదే ఈ కోనేటి కఱుతను (ఒడ్డున... అని... భావిస్తున్నాను) కొండవంటి అండయైయున్నాడు.

పూర్వం ఈయన మద్దిమాకులను (రేపల్లెలో నందుని ప్రాంగణమున వున్న రెండు మద్ది చెట్లను) దొబ్బి (త్రోసివేసి) కూల్చినాడు (మద్దిచెట్లవలెనున్న గంధర్వులకు శాపవిమోచనం కలిగించాడు). ఈ శ్రీకృష్ణుడే స్వర్గలోకంనుండి కల్పవృక్షము అను మాకును (దేవవృక్షమును) వెరికి (పెకలించి) మహిమీదకు (భూలోకానికి) తెచ్చెను. ఈయనే గొల్లమగువల చీరెలెత్తుకొనిపోయి మాకుమీదనెక్కి (యమునానది ఒడ్డునవున్న చెట్టునెక్కి వారు శరణన్న తరువాత తిరిగి ఇచ్చినాడు. ఇదిగో నేడు ఈ కోనేటి ఒడ్డున మాకుల మధ్య మరిగినాడు (పరిచితమవుచున్నాడు).

వసుదేవుడు బాలకృష్ణుని యమునానది దాటిస్తుంటే కుండపోతగా వానవచ్చింది. అప్పుడు శేషుడు తన పడిగెలను గొడుగులాకప్పినాడు. స్వామి ఆ పడిగెల నీడలో యశోద ఇంటికి చేరినాడు. శేషజాతి సర్పమైన కాళింగు శిరసుల ద్రొక్కి రక్తం కక్కించి అతను శరణన్నాక కరుణించి విడిచిపెట్టాడు. ఇదే దేవుడు శేషాచలము అనే శ్రీవేంకటాద్రిపైనున్న కోనేటిదండ (కోనేటి ఒడ్డున) చెలగీనీ దేవుడు (శ్రీవేంకటేశ్వరుడై శోభిల్లుతున్నాడు).

సంపుటి: 6 కీర్తన : కరేణ కిం మాం గృహీతుం తే
సంఖ్య : 171 పుట : 123 రాగం: ఆహిరి

ఆహిరి

24 కరేణ కిం మాం గృహీతుం తే
హరే ఫణిశయ్యా సంభోగ ॥ పల్లవి॥

జలే తవ సంచరణ మిహాధస్
స్థలే భవనం తవ సంతతం
బలే రూప ప్రకటన మతులా
చలే స్థానం చల చల రమణా ॥కరేణ॥

పదే భువన ప్రామాణ్యం తవ
హ్రదే ప్రచురణవిహరణ మిదం
ముదేమునీనాం మోహనం తనుం
మదే తవ నర్మ చ మాం విసృజ. ॥కరేణ॥

స్మరే విజయ స్తవ విమలతురగ
ఖురే రతిసంకుల రచన
పురే తవ విస్ఫురణం వేంకట
గిరే:పతే తే ఖేలాఘటిత. ॥కరేణ॥171

అవతారిక:

సరస శృంగార కీర్తన గీర్వాణిలో వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. నా అదృష్టం కొద్దీ ఇది శ్రీమన్నారాయణుని దశావతార కీర్తన. అక్కడక్కడా ప్రతిపదార్ధమునకు గాక భావార్ధమునకు ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. నేను తెలుగు దశావతార కీర్తన వివరిస్తే ప్రతిపదార్ధ వివరణకే ప్రాముఖ్యతనిస్తాను. కానీ సంస్కృతంలో ప్రతి పదార్ధ

వివరణ నా శక్తికి మించినపని. ఎందుకంటే గీర్వాణిలో నా పాండిత్యం అమావాస్యనాటి చంద్రుడు. అదండీ సంగతి. "ఓ శ్రీహరీ! ఫణీంద్రశయ్యపై సంభోగానందమందుకొనే నీ కరములు నన్ను అనుగ్రహించకుండుట యెందులకు?" – ఇది పల్లవి మరిదింతే...

భావ వివరణ:

ఓ శ్రీహరీ! ఫణిశయ్యా సంభోగా! (ఫణీశుడైన ఆదిశేషుడు శయ్య (పడక) అయి వుండగా, ఆ శయ్యపై సంభోగించుటకు ఆయత్తమైనవాడా!) నీ కరములు నన్ను అనుగ్రహించకుండా యుండుటెందులకు ప్రభూ!

సముద్రమునందు నీయొక్క సంచలన మిట్టిది (మత్స్యావతారము); నీవు అడుగున నీపైన భువనములు వున్నవి (కూర్మావతారము); ఉన్నతమైన బలప్రకటన జరపురూపమొప్పినది (వరాహావతారము); కొండగుహలలో చరించు సింహముఖరూపివి (నరసింహావతరాము);

నీపదములతో భువన ప్రమాణములను కొలిచితివి (వామనావతరాము); గొప్ప మడుగులో (తీర్ధములలో) నీయొక్క ప్రసిద్ధమైన విహారములు (యాత్రలు) జేసితివి (పరుశురామావతారం); మునులకు సైతం ఆనందమునిచ్చు మోహన రూపుదైతివి (శ్రీరామావతారము); నీయొక్క ఔన్నత్యమునకు నన్ను విడనాడితివి (బుద్ధుని అవతారము).

నీయొక్క విజయ చిహ్నమైన తెల్లని గుఱ్ఱపు గిట్టల నడక రతి సల్లాప సంకేతములైనవి (కల్కి అవతారము); ఓ శ్రీవేంకటగిరినాథా! సృష్టిలో నీ ప్రకాశముతో నీయొక్క ఆట నాడించు నీ కరములతో నన్నేల పరిగ్రహించవు తండ్రీ!

సంపుటి: 6 కీర్తన : చిఱునవ్వు మెఱుఁగారు సిగ్గుల మోముతోడ
సంఖ్య : 54 పుట : 46 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

25 చిఱునవ్వు మెఱుఁగారు సిగ్గుల మోముతోడ
మరగె నిన్నలమే ల్మంగ నాచారి. ॥ పల్లవి॥

నిలువుఁదురుము మీఁది నెమలిపాదపుడాలు
తొలి మెఱుంగుల మించి దొలఁకఁగాను
అలరుచు నినుఁ జూచి అప్పుడె వెరగువడి
మలయుచు నలమేలుమంగ నాచారి. ॥చిఱు॥

పరగునీమెడ సరపణులవుయ్యాలలో
ఉరుటు మురిపమున నూఁగుచును
గిరికొన్న తమకాన కిందుమీఁదెఱుఁగక
మరచె మే నలమేలు మంగనాచారి. ॥చిఱు॥

కంచము గని మోవి కమ్మఁదేనే లారగించి
లంచముగఁగస్తూరి లప్పలు రాల
యెంచఁగఁ దిరువేంకటేశుఁడు నీ పాఁపసజ్జ
మంచమెక్కె నలమేల్మంగనాచారి. ॥చిఱు॥

అవతారిక:

అలమేల్మంగ నాంచారి మీద అన్నమాచార్యులవారు చెప్పిన సరస శృంగార కీర్తన నాస్వాదించండి. వైష్ణవుల పరిభాషలో దేవిని నాంచారి అంటారు. నాచారి అని కూడా అంటారు. అందులో అమ్మవారి కొన్ని ఆభరణాల పేర్లను గానంచేస్తున్నారు. నెమలిపాదపుడాలు, సరపణలవుయ్యాలలు, మంచమున కలంకరించిన పాపసజ్జలు– ఇత్యాదివి నేటి కాలంలో లేనందువల్ల కొన్ని మన వూహాతీతం. ఊంజల్‌సేవ

సందర్భంగా పాడిన కీర్తన అయివుంటుంది. "సిగ్గులు చిందించే చిరునవ్వు మెఱుపులొలికే మోముగల, ఈ అలమేల్మంగనాచారి నిన్ను మరగెనయ్యా తిరుమలేశా!" అంటున్నారు. నేటితరం వారికి ఈ భాషే ఒక తమాషా జాగ్రత్తగా చదవండి.

భావ వివరణ:

ఓదేవదేవా! నీ దేవేరి అలమేల్మంగ నాచారి నిన్ను మరగె (ఆశించుచున్నది). మనోహరమైన ఆ నాచారి (దేవి) సిగ్గుల చిరునవ్వు మెఱుగార (మెరపులు కురిపిస్తున్న) మోముతో (వదనముతో) శోభలీనుచున్నది.

ఆమె, నిట్టనిలువుగానున్న తురుము (సిగకొప్పు) మీద "నెమలి పాదపుడాలు" ధరించినది. అది తళతళ మెరుగులను మించి (అధికముగా) దొలకె (చిందించుచున్నది). ఆ దేవి వెరగువడి (అత్యధికమైన ఆశ్చర్యముతో మలయుచున్నది (నీకొరకు ఆరాటపడుచున్నది). ఆమె జగజ్జననియైన అలమేల్మంగనాచారి.

ప్రభూ! నీ మెడలో "సరపణులు" వుయ్యాలలూగుచున్నవి. ఉదటు మురిపెమున (గొప్ప మురిపెముతో) వూగుచున్న వాటిని, గిరికొన్న తమకాన (తారా స్థాయికి చేరిన పారవశ్యముతో) కింద మీదెరుగక (ఆశగా చూడవచ్చునో చూడ కూడదో తేల్చుకోలేక) ఆ అలమేల్మంగ నాచారి, మేను మరచె (తన తనువును తానే మరచినది స్వామీ!)

దేవా! కంచము మోవిగని (తేనెలూరు మధురాధరమును) గాంచి లంచముగా కమ్మని తేనెలారగించితివి. అప్పుడు దేవి అలదుకున్న కస్తూరిలప్పెలుగా రాలిపడినది. ఆపైన ఓ శృంగారరాయా! యెంచగా తిరువేంకటేశుడైన నీవు అలమేల్మంగ నాచారితో నీ "పాపసజ్జ మంచమునెక్కి" ఆదేవిని నీ సరసశృంగారముల నలరించితివి. (ఓ జగద్రక్షకా! భావాతీతమైన మిమ్ముభావించుట బావిలో కప్పవంటి నా తరమా!! నా అశక్తతకు అజ్ఞానానికి మన్నించి నీవు అలా నవ్వుతూనే వుండు ప్రభూ!)

సంపుటి: 6 కీర్తన: ఉప్పవడము గావయ్యా ఉయ్యాలమంచముమీద
సంఖ్య : 102 పుట : 74 రాగం: కాంబోధి

కాంబోధి

26 ఉప్పవడము గావయ్యా ఉయ్యాలమంచముమీఁద
గొప్ప గొప్ప కన్నుల గోవిందరాజా. ॥ పల్లవి॥

పవ్వళించే వీడ వచ్చి పాయనినీయలపెల్ల
మువ్వంకమేనితోడ ముచ్చట దీఱ
నవ్వేటి శ్రీసతిచూపు నాటినచిత్తపుమేన
క్రువ్వనికలువదండై గోవిందరాజా. ॥ఉప్ప॥

నిద్దిరించే వీడ వచ్చి నిలుచున్నయలపెల్ల
ప్రొద్దువొద్దునకుఁ దీర భోగీంద్రుపై
యిద్దరుసతులు నీకు నేచినతాళగతుల
గుద్దేటిపాదములతో గోవిందరాజా. ॥ఉప్ప॥

మెండుగ మేలికొంటివి మించిన కౌఁగిటిలోన
కొండుకపాయపుసిరి కోపించంగా
ఉండవయ్యా సుఖలీల నుడివోనిప్రియముతో
కొండలకోనేటిరాయ గోవిందరాజా. ॥లలల॥

అవతారిక:

'ఉప్పవడము' అవటం అంటే రాజీకి రావడం అన్నమాట. ఉయ్యాలమంచం మీద నీకు నీ దేవేరుల మాట వినక తప్పదు. గొప్ప గొప్ప కన్నులున్న గోవిందరాజువి నీవు. అయినా సరే, అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తనలో వేంకట మకుటం లేకపోవటం విశేషమే.

ఇటువంటి శృంగార కీర్తనల భావవివరణలో చిక్కేమిటంటే "యద్భావం

తద్భవతి" – అంటే నీ భావన నీ భావానుగుణ్యంగానే వుంటుంది. కొండల కోనేటిరాయుడే ఈ గోవిందరాజు అంటున్నారు. కొండుకపాయపుసిరి అంటే చిన్నపిల్లవంటి శ్రీదేవి, కోపించిందట స్వామిపైన... యెందుకో? జాగ్రత్తగా చదివి భావించి పరవశించండి.

భావ వివరణ:

ఓ గోవిందరాజా! నీ విప్పారిన గొప్ప గొప్ప నయనాలు నీ భావములను తెలుపుతూనే వున్నాయి. నీవు ఈ ఉయ్యాలమంచము మీద భూదేవి, శ్రీదేవి సమేతుడవై వూగుచున్నావు. ఇప్పుడైనా, ఉప్పవడము గావయ్య (రాజీ మార్గానికి రావయ్యా!)

ఓ గోవిందరాజా! ఈ వైపునకు వచ్చి నీ అలసట దీరునట్లు ముచ్చట దీరగా, మువ్వంకమేనితో (మూడు అవస్థలను పొందుతున్న దేహముతో) నిదురించవయ్యా! చిరునవ్వులొలుకు శ్రీసతి చూపులు నీ చిత్తముపై నాటుకొంటుండగా నీ వామె మెడలో క్రువ్వని కలువదండైనావు (వాడని కలువపూలహారమైనావు స్వామీ!)

ఈడ వచ్చి ప్రొద్దు వొద్దునకు (పూట పూటకు) నిలుచున్న అలుపెల్లదీర (అలసట యంతయు దీరునట్లు) భోగీంద్రునిపై (ఆదిశేషునిపై) విశ్రాంతిగా నిదురించవయ్యా! నీకు భూదేవి, శ్రీదేవి అను ఇద్దరు భార్యలు, యేచిన తాళగతుల (అతిశయించిన తాళానుగుణముగా) గుద్దేటి పాదములతో తన సతులను తనపాదములతో తేలికపాటి తాడనములిచ్చుచున్నాడు. ఈ గోవిందరాజస్వామి చిలిపి చేష్టలేమని వర్ణింతుము?

ప్రభూ! నీవు మెండుగా (మేలుగా) మేలుకొనినది కూడా, కొండొక ప్రాయపుసిరి కౌగిటిలోననే (లేబ్రాయపు చిన్నదైన శ్రీదేవిని గాఢాలింగనముననే) ఆమె నిదుర చెడి ఆమె నీపై కోపించినదాయెను. అయినదేమో అయినదని ఆమెను వూరడించి ఉడివోని ప్రియమున (తరగని అనురాగముతో) సుఖలీల (సుఖముగా) వుండవయ్యా! ఓ గోవిందరాజా! నీవే కొండలకోనేటిరాయుడవు.

సంపుటి: 6 కీర్తన : నాలం వా తవ నయవచనం
సంఖ్య : 157 పుట : 113 రాగం: రీతిగౌళ

రీతిగౌళ

27 నాలం వా తవ నయవచనం
చేలం త్యజ తే చేటీ భవామి ॥ పల్లవి॥

చల చల మమ సంసర్ప్టనే కిం
కులిశహృదయ బహుగుణవిభవ
పులకిత తనుసంభృత వేదనయా
మలినం వహామి మదం త్యజామి. ॥నాలం॥

భజ భజ తే ప్రియాభామాం సతతం
సుజన స్త్వం నిజసుఖ నిలయ
భుజ రేఖా రతి భోగిభవసికిం
విజయాభవ మద్విధిం వదామి. ॥నాలం॥

నయ నయ మా మనునయనవిధం తే
ప్రియకాంతాయాం ప్రేమభవమ్
భయహర వేంకటపతే త్వం మ-
త్ప్రియో భవసి శోభితా భవామి. ॥నాలం॥

అవతారిక:

జయదేవకవి స్ఫూర్తితో చాలామంది గీర్వాణలో శృంగార కీర్తనలు రచించారు. అన్నమాచార్యులవారు సాళ్వ నరసింహరాయలు కొలువులో వున్నప్పుడూ అసంఖ్యాకమైన సరసశృంగార కీర్తనలు చెప్పారు వేంకట మకుటంతో రాజుగారి ఆస్థానంలో విద్వత్ గోష్ఠులు జరిగే తరుణంలో పాండితీ ప్రదర్శనకు కవులు సంస్కృతంలో కవిత్వం చెప్పేవారేమో

అనిపిస్తుంది. ఈ కీర్తనలో నిందాస్తుతిని ఇతివృత్తంగా యెన్నుకొన్నారు. నాయిక విరహోత్కంఠితయై స్వామిని నిందిస్తున్నది. దెప్పి పొడుస్తున్నది. చివరికి రాజీకి రాక తప్పలేదు. నీవు నా ప్రియుడివైతే నేనూ శోభిస్తాను కదయ్యా! అంటున్నది.

భావ వివరణ:

నీయొక్క నయవంచనతో కూడిన మాటలు ఇక చాలించవయ్యా! ముందు నా పైట కొంగును విడిచిపెట్టు. నీదాసినౌదునులే. నన్ను వదలిపెట్టు.

ఓ కులిశహృదయా! (కఠినహృదయుడా!) నీకు నాతో పొత్తు యెందులకు? చాలు చాలు. పో పొమ్ము. ఓ బహుగుణ విభవా! (అనేక గుణములు పుణికి పుచ్చుకున్నవాడా!) చాలు చాలు పో పో. నేను పులకించిన గాత్రము (శరీరం) వలన పొందిన వేదన యొక్క మాలిన్యమును ధరించియున్నాను. ఇక నా అహమును విడనాడి నీకు వశమైతిని.

నీవు యెల్లప్పుడూ నీ వలపుకత్తెనే స్మరిస్తుంటావు. నీవు గొప్పవాడివి కదా! గొప్పవాళ్ళకి స్త్రీ వ్యసనం సహజమేలే. పైగా నీవు బ్రహ్మానందానికి నిలయుడవట కదా! నీ భుజములపై రతికూటముల చిహ్నములు కొట్టవచ్చినట్లు కనబడుతూనే వున్నాయి కదా! పోనీలే. నీకు అంతా విజయమేలే. నా తిప్పలు నీకెందుకు పట్టాయి గనుకా!

నన్ను బుజ్జగించే విధానమును కూడా కాస్త నీవు తెలుసుకోకూడదటయ్యా! నీ ప్రియకాంతకే నీవలపులనందించుకో. మధ్యలో నిన్ను కాదన్న వాళ్ళెవరు? నాకేమి పట్టింది? భయహరుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నా ప్రియుడవైనచో నేను కూడా శోభించెదను కదా! స్వామీ!

సంపుటి: 6 కీర్తన : చక్కని సరసపు శిశువు
సంఖ్య : 151 పుట : 109 రాగం: కన్నడగౌళ

కన్నడగౌళ

28 చక్కని సరసపు శిశువు
పెక్కుమాయల పెనుశిశువు ॥ పల్లవి॥

చిమ్మెడి విషములు చేఁపినరొమ్ములు
కొమ్మని యిచ్చినఁ గుడిచేని
బొమ్మరపోవఁడు పూతకిఁ బొరిగొని
అమ్మరో గయ్యాళి శిశువు ॥చక్కని॥

చుట్టమువలెనే సుడిగాలినిఁ గని
బెట్టుగఁ గౌఁగిట బిగించేని
పుట్టఁడు వొడమఁడు బూమెలే చేసీ
పట్టరే పసి బాల శిశువు. ॥చక్కని॥

పాదము చాఁచటు బండి జాతురకు
ఆదిగొనుచు తా నలరీని
వేదవేద్యుఁడగు వేంకటగిరిపై
మోద మందిన మున్నిటిశిశువు ॥చక్కని ॥

అవతారిక:

పెక్కు మాయలపెను శిశువు అని శ్రీకృష్ణ పరమాత్మను కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. పల్లవి తేలికగా వుంటే చరణాలు మరణాలే అన్నమయ్య కీర్తనలలో. స్వామి మున్నిటి శిశువుట అంటే అనాదియైన శిశువు. బొమ్మర పోవడు అంటే దిమ్మతిరిగేట్లు చేయడమన్నమాట. "పుట్టడు వొడమడు బూమెలే చేసీ" అంటే ఏమిటి? తేలికగా కనిపించే అతి క్లిషమైన కీర్తన ఇది. సాధ్యమైనంత పొందికగా దీని భావవివరణ కూర్చాను.

భావ వివరణ:

ఓ ప్రజలారా! శిశువు (పొత్తిళ్ళ బాలుని) వలె వున్న ఇతడు చక్కని, సరసమైన (లలితమైన) వాడు. చాలా మాయలు నేర్చిన గొప్ప శిశువు ఈతడు. ఈయన లీలలు వినండి.

ఒకనాడు పూతకి అనే రాక్షసి అందమైన యువతి వలెవచ్చి విషములు చిమ్మెడి రొమ్ములలో పాలు చేపిన (చేపినవని) కొమ్మని (త్రాగునాయనా!) అని ఇచ్చిన వెనువెంటనే, కుడిచేని (పీల్చినాడు). బొమ్మరపోవడు (దిమ్మదిరగిన) ఆ రాక్షసి పారిగొనినది (నశించినది). అమ్మరో! (అయ్యబాబోయ్) వీడు గయ్యాళి శిశువు (రండగొండి పిల్లవాడు).

ఒకనాడు తృణావర్తుడు అనే రాక్షసుడు సుడిగాలి రూపంలో చుట్టపు చూపుగా అనుకోకుండా వున్నట్లుండి వచ్చాడు. వచ్చి, బెట్టుగ కౌగిట బిగించేని (అతిశయించి కౌగిటిలో బిగించినట్లు చుట్టేశాడు). అప్పుడు వీడు మాత్రం తక్కువవాడా? బూమెలే చేసీ (మోసాన్ని మోసంతోనే వంచాడు). పైగా వాడు పుట్టడు వొడమడు (పుట్టుకే లేని మగాడు). (పసిబాల శిశువుగా) వున్నంతమాత్రాన పట్టరే! (వీనిని పట్టుట సాధ్యమా?)

ఒకనాడు శకటాసురుడు అనే రాక్షసుడు 'బండి' రూపంలో వీడిని చంపాలని వచ్చాడు. అప్పుడు, ఆదిగొని (వాడిపై కన్నువేసి) తాను (ఆ శిశువు) అటు పాదము చాచి, జాతురకు నలరీని (మిక్కిలి చాతుర్యంతో అతిశయించి) బండిని ఒక్కతన్ను తన్ని ముక్కలు ముక్కలు చేసి శకటాసురుని చంపేశాడు. ఎందుకంటే ఆ శిశువు యెవ్వరనుకొన్నారు? వేదవేద్యుడు (వేదముల చేతనే తెలియశక్యమైన) దేవదేవుడు. శ్రీవేంకటాద్రి మీద సంతోషంగా వున్న శ్రీవేంకటేశ్వరుడే ఈ మున్నిటి శిశువు (అనాదియైన మట్టియాకు శిశువు).

సంపుటి: 6 కీర్తన : లంపుగుబ్బ గొల్లెతల లంజకాఁడ నీ
సంఖ్య : 127 పుట : 92 రాగం: ఆహిరి

ఆహిరి

29 లంపుగుబ్బ గొల్లెతల లంజకాఁడ నీ
యింపులే వెదకంబట్టీ నెట్లరా వోరి! ॥ పల్లవి॥

చెప్పరానివేడుకల సిగ్గులనే నిన్నాళ్లు
ఉప్పతిల్లుం గోరికల నుంటిం గాని
ఇప్పు డింతనిలువలే నేమిసేతు నీచిత్త
మెప్పుడు గాని రాదో యెట్లరా వోరి ॥లంపు॥

చిల్లర సింగారాలు చెలులు సేయఁగ నేను
వొల్లనని యిన్నాళ్లు నుంటిం గాని
మల్లెపూవువంటి నన్ను మాసినచీరతోడ
నిల్లు వెళ్లకుండఁ జేసి తెట్లరా వోరి! ॥లంపు॥

కమ్మనిపానుపున నీకౌఁగిటిలో నిన్నాళ్లు
ఉమ్మగింపుమేనితో నుంటిం గాని
దిమ్మరిసేఁతలతోడి తిరువేంకటేశ! నీ
యెమ్మె లింకా మానలే వెట్లరా వోరి. ॥లంపు॥

అవతారిక:

జానపద బాణీలో సాగే గొల్లెతల సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అతిశయించిన మమకారంతో నాయిక నిందిస్తుంటుంది, చనువుగా. అన్నమయ్య కాలంలో జానపదులు వాడిన కొన్ని మాటలు నేటి నిఘంటువులలో లభించుటలేదు. ఉదాహరణకి "లంపు గుబ్బ గొల్లెత" "లంపు" అంటే "దొంగమేత", "గుబ్బలు" అంటే స్తనములు. దీనికి సమన్వయమెట్లా సాధ్యం. 600 ఏళ్ళక్రితం జానపదుల వాడుక భాషలో

"లంబము" అనే మాటను "లంపు" అనేవారేమో. ఆ మాటకు దీర్ఘమైన లేక పొడవాటి అని అర్థం. అదండీ సంగతి 'లంజకాడు' అంటే 'విటుడు' అని ప్రతిపదార్థ వివరణ కావాలనే త్యజించుట క్షంతవ్యము.

భావ వివరణ:

ఓరీ!! (ఔరా!) లంపు గుబ్బ గొల్లెతల (ఉన్నత స్తన గిరులున్న గొల్ల భామల) లంజకాడ! (విటుడా!) నీ ఇంపులెల్లా (నీకు వేటిమీద మోజుయెక్కువో) వెదకంబట్టె (తెలిసిపోయింది) యెట్టరా? (ఇట్లా అయితే ఎట్లాగునరా!)

ఓరీ!! చెప్పశక్యంకాని కోరికలు ఉప్పతిల్లినా (చెలరేగినా) నేను సిగ్గుచే చితికియున్నాను. కాని ఇప్పుడింక నిలువరింపనసాధ్యమై పోవుచున్నది. నేనేమి సేయ గలనురా? నీకు నాపై మనస్సెప్పుడు పుడుతుందో చెప్పలేం. ఇట్లా అయితే యెట్టారా? (యెలాగునరా!)

ఓరీ!! నా చెలికత్తెలు ఇంతకాలమూ నేను నీ కంటికి నదురుగా వుండాలని యేవేవో చిల్లర సింగారాలు (సామాన్యమైన అలంకరణులు) చేసేవారు. నేను కూడా వాటిని వొల్లనని (వద్దని) తిరస్కరించేదాన్ని. కానీ నీకోసం పడిగాపులు కాసీ కాసీ, మల్లెపూవువంటి నన్ను మాసిన చీరెతో ఇంటికి అంటిపెట్టుకొని పోయేట్లు చేశావు కదరా! ఇట్లా అయితే యెట్లారా?

ఓరీ! నీ కమ్మని పాన్పుపై (మధురమైన శయ్యపై) నీ సందిట, వుమ్మగింపుమేనితో (త్రెళ్ళు దేహంతో) వున్నాను. కానీ ఓ తిరుమల నాయకా! నీ దిమ్మర సేతల (మత్తులో ముంచే నీ చిలిపి సేతలతో) నీ యెమ్మెలు మానవు (విలాసవంతమైన సయ్యాటలను వదలవు). నీతో యెట్టారా?

సంపుటి: 6 కీర్తన : యెన్ని మారులు యిట్టె నీపనులు
సంఖ్య : 58 పుట : 43 రాగం: సామంతం

సామంతం

30 యెన్ని మారులు యిట్టె నీపనులు
ఇన్ని మాయలు నన్ను నేఁచనేఁటికిరా. ॥ పల్లవి॥

నీళ్లే నమలేవు నీలోనె సన్నల
వేళ్లే చూపేవు వెలుపలికి
పేళ్లె తప్పేవు బిరుసుగ, నింతేసి
గోళ్ల రాచేవు కోపమేఁటికిరా. ॥యెన్ని॥

మేనె దాఁచేవు మెస్తిర గొడ్డలి
నానం బెట్టేవు నయముననే
పోని తెరువుల పోకులఁ బోయేవు
కానిరా యేటివంకలు తిద్దవశమా. ॥యెన్ని॥

చేరి కపటాలె చేసేవు యిఁకనైనా
సారెం బరువులు చాలించరా
ధీరుండవుగాన తిరువేంకటపతి
కూరి మెఱిఁగి నన్నుఁ గూడితి విపుడూ. ॥యెన్ని॥ 58

అవతారిక:

ఇదికూడా జానపదుల శైలిలో కొనసాగే దశావతార కీర్తన. నా అభిప్రాయంలో ఇది బహుక్లిష్టమైనది. ఎందుకంటే కొన్ని మాటలకు యే నిఘంటువులోనూ అర్థ వివరణ సూచన ప్రాయంగా కూడా లభించలేదు. అది ఏ అవతార వివరణో వూహించగలుగుట వలన భావసమన్వయం ఆవశ్యకమైనది. అంటే. ఉదాహరణకి "పెళ్లె తప్పేవు బిరుసుగ" అంటే వరాహవతారంతో సమన్వయపరచుటెట్లు సాధ్యం. యేటివంకలు తిద్దవశమా?

అంటే కృష్ణావతారంతో యెట్లా ముడిపెట్టాలి? దీని అర్థం ఏమిటో ఎలా తెలుస్తుంది? ఓ దేవదేవా! అన్నమయ్య ఈ కీర్తన పల్లవిలో అన్నమాట నిజం చేస్తున్నావు కదటయ్యా! "ఇన్ని మాయల నన్ను నేచనేటికిరా". అంటే ఏమిటో తెలియాలంటే ఏమిటి చేయాలి? మీకు తెలుసునని నాకు తెలుసు.

భావ వివరణ:

నీ పనులు (నీవు చేసే లీలలు) యెన్ని మారులు? (ఎన్ని విధములో) చెప్పుట యెట్లు సాధ్యము? నన్ను ఇన్ని మాయలతోన్ చేయనేటికిరా? (అతిశయించుట యెందులకయ్యా?)

ఒకసారి నీలోనే నీళ్ళు నములుతుంటావు (మత్స్యావతారము); ఇంకొకసారి వెలుపలికి వచ్చి సన్నల (సైగలతో) వేళ్ళను చూపింతువు (కూర్మావతారము); ఇంకొకసారి, బిరుసుగ పేళ్లె తప్పేవు (కాఠిన్యంతో వేగిపోతూ తపించిపోయేవు)... అనగా (వరాహావతారం). ఇంకొకసారి, ఇంతేసి గోళ్ళ రాచేవు (ఇంతింత పొడుగువున్న గోళ్ళతో చీరివేసెదవు. కోపమేటికిరా? కోపమెందులకయ్యా? (నరసింహావతారం).

ఒకసారి, మేనెదాచేవు (చూడటానికి పొట్టి పిల్లవాడిలావున్నా, భూనభాంతరములు నిండిపోగల శరీరాన్ని దాచివుంచినావు)... అనగా (వామనావతారం).; మెస్తిర గొడ్డలి నయముననే నానం బెట్టేవు (బాగా పదునైన పరశువును బాగా రక్తంలో నానబెట్టినావు)... అనగా (పరశురామావతారము); పోని తెరువుల పోకల బోయేవు (చొరరాని కీకారణ్యములబట్టి పోయేవు)... అనగా (శ్రీరామవతారం); కానిరా, యేటివంకలు తిద్దవశమా (కానీయవయ్యా! వంకరటింకరగా పోయే ఏరుయొక్క మార్గాన్ని కట్టడి చెయ్యగలమా? ... అనగా (శ్రీకృష్ణావతారపు గోపీలోలత్వం).

ఒకసారి, చేరి కపటాలే చేసేవు (పురసతులను మోసగించినావు)... అనగా (బుద్ధావతారము). ఇకనైనా సారెం పరువులు చాలించరా (ఇప్పటికైనా, మాటిమాటికీ పరుగులు తీసే అలవాటు మానుకోవయ్యా!)... అనగా (కల్కి అవతారము); ధీరోదాత్తుడవు కావున ఓ తిరువేంకటేశ్వరా! కూరిమి యెరిగి నన్ను కూడితివి. ఇప్పుడు నీమాయలను మెచ్చక యెలా వుండగలను ప్రభూ!.

సంపుటి: 4 కీర్తన : మేలుకొనవే
సంఖ్య : 21 పుట : 375 రాగం: భూపాలం

భూపాలం

31 మేలుకొనవే
భూలలనాధిప భోగిశయన ॥ పల్లవి॥

లేదు వేదవిధి లేశమును
మేదిని భరమై మించినది
పాదుపడదు చూపరకు భువి
గాదిలిసుతుపై గనలె జనకుఁడు ॥మేలు॥

కనకము చవి చెడెఁ గడుఁగడును
ఘనసృపబాధలు గదిమినవి
దనుజుల కతివలు దలఁకెదరు
ఎనయ బలాధికులెవ్వరు లేరు ॥మేలు॥

అసుర సతుల పుణ్యము ఘనము
కస (సి?) మసఁగెడి కలికాలమహిమ
పసగల వేంకటపతి యిఁకను
వసుధలోని నెవ్వగలుడుపఁగను ॥మేలు॥21

అవతారిక:

అన్నమాచార్యులవారు చెప్పిన ఒక మేలుకొలుపు కీర్తననాస్వాదించండి. 600 సంవత్సరాల క్రితం పరిస్థితి ఇంత ఘోరంగావుంటే నేడు యెవరికివారే యమునాతీరే అనే రోజుల సంగతి చెప్పేదేముంది? కన్నకొడుకులపై తండ్రి కక్షకడుతున్నాడు. బంగారం బంధువైపోయింది. ఆడది అసురులవంటి వారి చేతిలో అల్లాడిపోతుంది. "కసిమసగెడి కలికాలం" మహిమ యేం చెప్పగలం? ఒక్క శ్రీవేంకటేశుడే వసుధలోని

పగను నెవ్వగలడు అంటున్నారు. భావవివరణతో పరిస్థితి ఇంకా బాగా అర్థమవుతుంది. అవునా?

భావ వివరణ:

ఓ భూలలనాధిప! (భూసతీరమణా!) భోగిశయనా! (శేషతల్పశాయీ!) మేలుకొనవే. (నీవు సృష్టించిన ఈలోకం యెంత ఘోరంగా వున్నదో ఒకసారి పరికింపుము).

వేదువిధి లేశమును లేదు (ఎవ్వడూ వేద విధానములను పాటించుట లేదు). భూమి మీద భరమై మించినది (అతిశయము యెక్కువైపోయింది). చూపరులకు భువిపాదుపడదు (కాళ్ళకింద భూమి కనపడదు. అంటే అంత పొగరుబట్టి వుంటారు). ప్రేమించవలసిన కన్నకొడుకుపైన తండ్రే కనలె (మండిపడుతుంటాడు).

కనకము చవిచెడెన్ కడునేకడున్ (బంగారమునకు వుండవలసిన నిబద్ధతతో కూడిన మక్కువ వుండదు. అనగా ప్రతివాడూ బంగారం కోసం వెంపర్లాడుతుంటాడు). గొప్పవాళ్ళయిన నృపుల (పరిపాలకుల) బాధలు గదిమినవి (భయపెడుతునవి). దనుజులకు (రాక్షసులవంటి మగవారి దౌర్జన్యాలకు) అతివలు (స్త్రీలు) తలకెదరు (భయపడుతుంటారు). లోకంలో ఈ పరిస్థితిని ఎనయు బలాధ్యులు (సవరించగల దిట్టలు) యెవ్వరూ లేరు.

కాని అసురసతులు (దుర్మార్గుల భార్యలు) ఘనమైన పుణ్యములు చేస్తుంటారు. కలికాల మహిమ (కలియుగ ప్రభావముచేత) కసమసగెడి (పాపము విజృంభిస్తుంటుంది). హతవిధీ!! ఇక గత్యంతరం యేమిటి? పసగలవేంకటపతి (సర్వ సమర్థుడైన శ్రీవేంకటేశ్వరుడు) ఇకను (ఇకపై) వసుధలోని పగను, నెవ్వగలడు (ఆపద తప్పించగలడు.)

సంపుటి: 4 కీర్తన : హరి నీవే సర్వాత్మకుడవు
సంఖ్య : 441 పుట : 297 రాగం: దేశి

దేశి

32 హరి నీవే సర్వాత్మకుడవు
యిరవగు భావన యియ్యగదే ॥ ॥ పల్లవి॥

చూడక మానవు చూచేటి కన్నులు
యేడనేవైనా యితరములు
నీడల నింతా నీ రూపములని
యీడువడని తెలి వియ్యగదే ॥ ॥హరి॥

పారక మానదు పాపపు మనసిది
యీరసములతో నెందైనా
నీరజాక్షయిది నీమయమేయని
యీ రీతుల తల పియ్యగదే ॥ ॥హరి॥

కలుగక మానవు కాయపు సుఖములు
యిలలోపలగల వెన్నైనా
అలరిన శ్రీవేంకటాధిప నీకే
యిలనర్పితమను యిహమియ్యగదే ॥ ॥హరి॥441

అవతారిక:

మనం వేరు, పరులు వేరు అనే భావనవుండటం వల్లనే మనం కొందరిని ప్రేమిస్తాం, కొందరిని ద్వేషిస్తాము. కానీ శరీరాలు వేర్వేరైనా ఆత్మలన్నిటికి మూలకారణం పరమాత్మ అనే తత్త్వం తెలిసినవాడు సర్వాత్మకుడైనవాడు శ్రీహరి ఒక్కడే అని తెలిసికొని ఎవ్వరినీ ద్వేషించడు. ఓ దేవదేవా నాకు కూడా అటువంటి భావనే ఇయ్యవయ్యా! అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ ప్రపంచంలోవున్నవన్నీ నీ అర్పణ కొరకే

స్వామీ! అంటున్నారు. ఈ భావవివరణ వ్రాసేటప్పుడు నాకు కలిగిన తృప్తి నేను మాటలలో వర్ణించలేను.

భావ వివరణ:

ఓ శ్రీహరీ! నీవే సర్వాత్మకుడవు (అన్ని ఆత్మలకు మూలమైనవాడవు). నాకునూ అట్టి నీవే అన్ని ఆత్మలలోగలవనె ఇరవగు భావన (సుస్థిరమైన అభిప్రాయమును) ఇయ్యగదే (ఈయవయ్యా!)

నాకు చూడాలనే కోరిక కలిగితే చాలు నా కన్నులు దేన్ని పడితే దాన్ని చూస్తాయి. ఇతరములు (అనవసరమైన ఇతర విషయములన్నింటినీ, యేడ నేవైన (యెక్కడైనా యేమైనా) చూస్తాయి. అవి చూడటం మానవు. నీడలన్ (నీ ఆశ్రయంలో) అన్నీ నీ ప్రతిరూపాలే అనునట్టి, ఈడువడని (చెడిపోని) తెలివి (జ్ఞానమును) ఈయగదే (ఇమ్ము ప్రభూ!).

నేను నాకళ్లుమూసుకున్నా నన్ను చెడగొట్టే ఇంకొకటుంది. అదే నా మనస్సు. పాపచింతనతో కూడిన నా మనస్సు అనవసరమైన వాటిమీద పారక మానదు (ప్రసరించక వదలదు). ఈ రసములతో యెందైనా యెవరికైనా యెన్నో పాపపు ఆలోచనలే వస్తాయి. ఓ నీరజాక్షా! ఈ రసములు కూడా నీమాయలే (నీవలననే కలిగినవి) అనునట్టి తలపును ఇయ్యగదే (ఈయరాదటయ్యా!)

ప్రభూ! నా కళ్ళూ మనస్సు ఒక్కసారి విజృంభించాయంటే, నా కాయము (దేహము) వున్నదే అది తగులుకొంటుంది. దానికెప్పుడూ సుఖం కావాలి. దానికి ఒక సుఖం చాలదు. ఎన్నయినా కావాలి కావాలి అనే అంటుంటుంది. దానికి ఈ ప్రపంచమంతా ఇచ్చినా చాలదు. అలరిన శ్రీవేంకటాధిప (ఏడు కొండలపై శోభించుచున్న) ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ ప్రపంచంలో వున్నవన్నీ నీకు అర్పితమైనవే అనే ఇహము (ఈ ప్రాపంచిక జ్ఞానమును) ఇయ్యవయ్యా తండ్రీ!.

సంపుటి: 2 కీర్తన : కేశవదాసి నతి గెలిచితి నన్నిటాను
సంఖ్య : 432 పుట : 325 రాగం: సింధుభైరవి

సింధుభైరవి

33 కేశవదాసి నైతి గెలిచితి నన్నిటాను
యీ శరీరపు నేరాలికనేల వెదక ॥ ॥ పల్లవి॥

నిచ్చలు కోరికలియ్య నీనామమే చాలు
తెచ్చి పునీతుచేయ నీతీర్థమే చాలు
పచ్చిపాపాలణచ నీ ప్రసాదమేచాలు
యెచ్చు కొందు వుపాయాలు ఇకనేల వెదక ॥ ॥కేశవ॥

ఘనుని చేయగను నీ కైంకర్యమే చాలు
మొనసి రక్షించను నీ ముద్రలే చాలు
మనిషి కావగ తిరుమణి లాంఛనమే చాలు
మెనసెను దిక్కుదెస ఇకనేల వెదక ॥ ॥కేశవ॥

నెలవైన సుఖమియ్య నీ ధ్యానమేచాలు
అల దాపుదండకు నీ యర్చనే చాలు
యిలపై శ్రీవేంకటేశ యిన్నిటా మాకు కలవు
యెలమి నితరములు యికనేల వెదక ॥ ॥కేశవ॥

అవతారిక:

తనని తాను కేశవునికి 'దాసి' వలె భావించుకొని అన్నమాచార్యులవారు పాడుతున్న చక్కటి కీర్తననాస్వాదించండి. స్వామీ నేను నీవే దిక్కని నమ్మిన దాసిని. నాలో లోపాలు లేవని నేరాలు లేవని నేనను. కానీ అవన్నీ నేను ఈ మానవశరీరం ధరించటం చేత దేహానికి ప్రకృతి సిద్ధమైన నేరాలు. వాటిని ఈనాడు యెంచినందువలన వుపయోగమేమి వుంటుంది? నేను నీ నామ సంకీర్తనతో బ్రతుకుతున్నాను, నీ అర్చన, దాస్యము, కైంకర్యములతో

వైష్ణవ దీక్షలో బ్రతుకుతున్నాను నాకు ఇతరములేవీ వద్దు, వద్దు, వద్దు. అంతే... అంటున్నారు.

భావ వివరణ:

ఓ కేశవా! నేను నీదాసినైతిని. అందుచేత అన్నిటా (ఇహపరములు రెంటినీ) గెలిచితి (సాధించగలిగాను). నేను, నాలో లోపాలు లేవని కాని నేరాలు చేయని వాడిని అనిగాని అనలేను. కాని అవి యీ శరీరపు నేరాలు నేను మానవ శరీరధారినైనందువలన దానికి సహజమైన నేరాలు. ఇక వాటిని వెదకనేల? అయినా వాటిని యెదుర్కొనటానికి నా ప్రయత్నాలు నేనూ చేస్తున్నాను.

నేను సదా నీ నామస్మరణతోనే బ్రతుకుతాను. నా కోరికలు తీర్చుటకు అది చాలదా? నీ తీర్థమైన చోటునే వుంటాను. నన్ను నిర్మలుని చేయటానికి అది చాలదా? నేను చేసే పచ్చిపాపాలు బాహాటంగా కనిపిస్తున్న పాపకర్మలు. అణగద్రొక్కుటకు నీ ప్రసాదము చాలదా? ఎచ్చుకొందు వుపాయాలు (ఎక్కువ తక్కువ కిటుకులు) అవసరమా? అక్కర్లేదు నిన్ను నమ్మితే చాలు.

నీకైంకర్యము (శరణాగతి) చాలు నేను ఘనుడను అనిపించుకొంటాను. నీ ముద్రలు (రెండు భుజములపైన ధరించే శంఖ చక్రముద్రలు) చాలును. మొనసి (పూని) అవే నీ ఆయుధాలవలెనే నన్ను రక్షిస్తాయి. మనిషి కావగ (రక్షించి కాపాడుటకు) నేను నానొసట ధరించే నీ తిరుమని లాంఛనము (పంగనామాలు) చాలును వాటితోనే నా మార్గము వెలుగులీనుతున్నది.

ఓ ప్రభూ! నీ దాస్యము నెలవైన (సుప్రతిష్టమైన) సుఖమునిస్తుంది. అలదాపుదండకు (ఆపైన తోడు నీడై కాపాడుటకు) నేను చేసే నీ అర్చనయే చాలును. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇన్నిటా (ఇన్ని విధములైన) నీసేవలు మాకు వున్నవి కదా!) ఎలమి (మా వికాసమునకు) ఇలపై అన్యములైన వుపాయముల వెదకుటెందులకు? నీవు మాకు చాలును తండ్రీ!

సంపుటి: 1 కీర్తన : నాపాలి ఘన నిధానమవు నీవే నన్ను
సంఖ్య : 108 పుట : 74 రాగం: శుద్ధ సావేరి

శుద్ధసావేరి

34 నాపాలి ఘన నిధానమవు నీవే నన్ను
నీపాల నిడుకొంటి నీవే నీవే ॥ పల్లవి॥

ఒలసి నన్నేలే దేవుడవు నీవే యెందు
తొలగని నిజబంధుడవు నీవే
పలుసుఖమిచ్చే సంపదవు నీవే, యిట్టే
వెలయ నిన్నియును నీవే నీవే ॥నాపాలి॥

పొదిగి పాయని యాప్తుడవు నీవే, నాకు-
నదన తోడగు దేహమవు నీవే
మదమువాపెడినా మతియు నీవే, నాకు
వెదక నన్నియును నీవే నీవే ॥నాపాలి॥

యింకా లోకములకు నెప్పుడు నీవే యీ
పంకజభవాది దేవపతివి నీవే
అంకిలి వాపగ నంతకు నీవే, తిరు
వేంకటేశ్వరుడవు నీవే నీవే ॥నాపాలి॥

అవతారిక:

నిధానము అంటే పాతరలో దాచివుంచిన సొమ్ము. "నాయందు నిధానమువలె సమయానికి, నీపాల (పట్ల) వుంచుకొని ఆదుకొంటావు. నా దిక్కూ మొక్కూ వేరెవరున్నారు తండ్రీ! నీవే నీవే" అని ఏడుకొండలూ దిగి స్వయంగా శ్రీనివాసుడే దిగివచ్చేలా ఆలాపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఆపదలో ఆదుకునేవాడే నిజమైన బంధువు. ఆ విధంగా చూస్తే బంధువులు బండ్ల కొద్దీ వుంటారు కాని నిజబంధువు ఆ

స్వామి తప్ప యెవ్వరూ వుండరు. అంకిలి వాపగ (ఆపద తొలగించ) నంతయు నీవే నీవే అంటున్నారు. మన అదృష్టం కొద్దీ ఈ అమృతధారలో తడిసే భాగ్యం కలుగుతున్నది. అవునా?

భావ వివరణ:

ఓ దేవదేవా! నాపాలి (నాకు లభించిన) గొప్ప నిధానమవు నీవే (పెద్దలు దాచివుంచిన పాతర నీవే). అందుకనే నిన్ను నాపాలన్ ఇడుకొంటి (నా పక్షాన అట్టేపెట్టుకొన్నాను). నీవే నీవే నాకు ఇంకెవ్వరూ వద్దు ప్రభూ!

ఒలసి (చేరి) నన్ను యేలునట్టి దైవము నీవే. నా బంధువులందరూ నా కష్టంలో నన్ను వదిలేశారు. కానీ నన్ను విడువని నిజమైన బంధువు నీవే. సంపదలనాసించేది సుఖమునిస్తాయని. కాని మా సంపదలు అనేక ఇబ్బందులనిస్తాయి. కాని నీవు మాత్రం అనేక సుఖములనిచ్చే సంపదవు. ఈ విధంగా ఇన్ని రకములైన భాగ్యముల నిచ్చే వాడవు నీవే నీవే.

ఆప్తుడు అంటే ఐశ్వర్యము వలె అదుకొనే సన్నిహితుడు. అయితే ఐశ్వర్యమునకుండే దుర్గుణమేమంటే అది యెప్పుడు విడిచిపెట్టి పోతుందో యెవ్వరికీ తెలియదు. కానీ ఓ శ్రీహరీ! నీవు పొదిగినట్లుగా యెన్నడూ వదలిపెట్టని ఆప్తుడవు. నేను చచ్చేదాకా నాతోడువుండే దేహములాగ నీవూ అదనతోడవు (అవసరమైన తోడువు). స్వామీ! నా మదము (అహంకారమును) బాపెడి మతియు (వివేకము) నీవే. పరికించి చూసే సర్వస్వమూ నీవే, నీవే నయ్యా!

ఇంకా చెప్పాలంటే... నాకే కాదు, ఈ లోకముల కన్నింటికీ యెప్పుడూ ఆధారము నీవే. (ఇన్ని లక్షల అంతరిక్షగాములల్లో ఒక్కటి తగిలినా మన 'భూమి' గతేమిటో చెప్పండి.) సృష్టి స్థితిలయలు పర్యవేక్షించే బ్రహ్మాదిదేవతల పతియు (యేలికవూ) నీవే. మాకు అడుగడుగునా అంకిలియే (ఆపదలే). దానిని తొలగించాలంటే ఇతరులకు సాధ్యమా? ఓ తిరువేంకటేశ్వరా! నీవేనయ్యా! నీవే సమర్థుడివి. ఇంకెవ్వరివల్లా కాదు తండ్రీ!

సంపుటి: 2 కీర్తన: తగు మునులు ఋషులు తపముల సేయగ
సంఖ్య : 315 పుట : 213 రాగం: ధన్యాసి

ధన్యాసి

35 తగు మునులు ఋషులు తపములు సేయఁగ
గగనము మోచియుఁ గర్మము దెగదా. ॥ పల్లవి॥

ధరణీధర ముందరధర నగధర
చిరకౌస్తుభధర శ్రీధరా
కరిఁ గాచితి కాకముఁ గాచితి నీ-
కరుణకుఁ బాత్రము గలదిదియా. ॥తగు॥

భవహర మురహర భక్తిపాపహర
భువన భారహర పురహరా
కవిసినవురుతనుగద్దను మెచ్చితి-
వివల నీదయకు నివియా గురుతు. ॥తగు॥

శ్రీవేంకటపతి శేషగరుడపతి
భూవనితాపతి భూతపతి
గోవుల నేలితి కోఁతుల నేలితి
పావనపుఁగృపకుఁ బాత్రము లివియా. ॥తగు॥315

అవతారిక:

ముల్లోకాలలోను శ్రీహరిని వేడని వారెవరు? ఎంతోమంది ఋషులు, మునులు యెన్నెన్నో తపములు చేశారు ఆకాశాన్ని అందుకొనేంత కీర్తిని సంపాదించారు. కాని వారి కర్మములు పరిపక్వంచెంది తెగితేకాని వారికి నీ కృప కలుగదు. నీకృప వారికి యేజన్మలోనైనా యేక్షణాననైనా కలుగవచ్చును. అజ్ఞానంతో వారు నీకు అపకారం చేసినా వారు యెంత హీనస్థితిలోవున్నా పరిగెత్తి వారిని చేరి వారిని అక్కున చేర్చుకొంటావు. అన్నీ నీ అభయానికి పాత్రములే. కరిగాని, కాకిగాని, వుడతగాని, గద్దగాని, ఆవులుగాని, కోతులుగాని.. ఒక్కటనేమిటి యేదయినా నీ సంతతే, నీదే అనే కరుణ

చూపిస్తావు. అందుకే నీవు జగత్పితవు అంటున్నారు అన్నమాచార్యులవారు. సాధ్యమైనంత వివరించటానికి ప్రయత్నించాను.

భావ వివరణ:

ఓ దేవదేవా! అనేకమంది ఋషులు, మునులు తగిన విధములుగా నీకోసం తపములనాచరించారు. కాని అందరికీ నీకృప కలిగిందా? ఆకాశాన్ని కొనే కీర్తి సంపాదించవచ్చు గాక! కాని కర్మము దీరక (పరిపక్వముకాక) నీకృప సిద్ధిస్తుందా?

ఓ భూరమణా! మందరగిరిధరా! నగధరా! (గోవర్ధనధారీ); ప్రఖ్యాతి చెందిన కౌస్తుభమణిని ధరించినవాడా! శ్రీధరా! (శ్రీకాంతా!) నీలీలలనేమని వర్ణించను ప్రభూ! అలనాడు కరిని రక్షించావు (గజేంద్ర వరదుడు), కాకిని రక్షించావు (కాకాసురుని శిక్షింపబూనియు శరణంటే రక్షించాడు శ్రీరాముడు). నీ కరుణకు పాత్రులవ్వాలంటే హీనాధికములైన యేదైనా అర్హమే.

ఓ భవహరా! (పుట్టుక లేక చేయగల దేవా!) మురహర! (ముర అను అసురుని నిర్జించిన దేవా!) భక్త పాపహరా, ప్రపంచమున పాపుల భారమును నివారించువాడా! పురహరా! (త్రిపురాసురులను హరించినవాడా!) నీ దయకు అర్హత యెవ్వరికైనా కలుగవచ్చును. ఆనాడు నీ రామావతారంలో, కవిసిన వుడుతకు (పరుగులు పెట్టి తన శరీరానికి ఇసుకను అంటించుకొని సేతువుపై విదిలించి సేతు నిర్మాణానికి తనదవంతు కృషి చేసిన ఒక చిన్ని ఉడుతకు మోక్షమిచ్చావు). గద్దయైన గరుత్మంతుని నీవాహనం చేసికొని గరుడ గమనుడవయ్యావు. వాటిని మెచ్చావు. అవల (ఆవిధంగా) వాటి జాతి మొత్తం ఈనాటికీ నీ గుర్తులను తమ శరీరంపై ధరించియున్నాయి.

ఓ శ్రీవేంకటాచలపతీ! శేషాద్రివాసా! గరుడాద్రివాసా! భూధరా! భూతపతీ! (సర్వ భూతముల ఆధారా!) నీ పావనమైన కృపకు పాత్రాపాత్ర భేదము లేదు. అందరికీ జీవనాధారమైన గోవులను కాచి గోవిందుడివైనట్లే, నిరుపయోగమైన కోతులకు కూడా క్రమశిక్షణ నేర్పి రామదండు చేశావు. ఎనలేని కీర్తినిచ్చావు. కరుణామూర్తీ! ఇంతకంటే యే నిరూపణలు కావాలి తండ్రీ, నీవు కరుణాంతరంగుడవు.

సంపుటి: 2 కీర్తన : ఎవ్వరుc గాననివాcడు యశోద గనె నట్టె
సంఖ్య : 316 పుట : 213 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

36 ఎవ్వరుc గాననివాcడు యశోద గనె నట్టె
పవ్వళించే బ్రహ్మతండ్రి బాలుcడయ్యె నట్టె ॥ పల్లవి॥

ఘనయోగీంద్రులమతిc గట్టువడనట్టివాcడు
పనిలేక రోలc గట్టువడినాcడట్టె
తనియ సురలకు పాదము చూపనట్టివాcడు
మొనసి బండిమీcద మోపినాc డట్టె. ॥ఎవ్వ॥

అమృతము చేతc దచ్చి అందరికిచ్చినవాcడు
తమితో వెన్న దొంగిలెc దానె యట్టె
గుమురై దేవదానవకోటికిc జిక్కనివాcడు
భ్రమసి గోపికలపాలc జిక్కినాc డట్టె. ॥ఎవ్వ॥

యిందుc గలc డిందులేcడనెంచి చూపరానివాcడు
అందమై రేపల్లెవాడ నాడీనట్టె
అంది కృష్ణావతారముయినట్టిదేవుcడే
యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలిచె నట్టె. ॥ఎవ్వ॥316

అవతారిక:

ఒకరోజు యశోదకు కృష్ణయ్య అల్లరి వినిపించడం లేదేమిటబ్బా! అని కొడుకును రహస్యంగా చూద్దామని మెల్లిగా నక్కి చూసిందట. అక్కడ పడుకొన్నది ఆవిడ కొడుకా? ఆయన, పరమేష్ఠితండ్రి, ఆదినారాయణుడు. కొంచెం తెరుచుకొనియున్న ఆస్వామినోట్లోంచి లోకాలన్నీ కనిపిస్తున్నాయట. దిమ్మతిరిగి పోయిందావిడకి. ఆయన ఎవ్వరూచూడలేని శ్రీమన్నారాయణుడు. భయంతో చేతులు జోడించిందా గొల్లది. చటుక్కున లేచి "అమ్మా"! అన్నాడు.

అంతా కలలాగా మరచిపోయింది ఆ వెఱ్ఱితల్లి. అన్నమాచార్యులవారి ఈ అద్వితీయ కీర్తనకి ఈ పిట్టకథే మూలభూతి. దీనిని భావించి తరించండి.

భావ వివరణ:

ఆహా! ఏమి ఈ యశోద భాగ్యము! ఎవ్వరూ గాననివాడు (అగోచరుడై యెవ్వరికీ కనుపించని పరమాత్మ) ఈమె పొత్తిళ్ళలో పవ్వళించినాడే!! ఈ దేవదేవుడే, పితామహుడైన బ్రహ్మకే కన్నతండ్రియా? అట్టె (అతిసులువుగా) బాలుడయ్యెను. ఏమి ఆశ్చర్యము.

ఘనులైన యోగీశ్వరుల మదిలోకూడా కట్టుబడనివాడు, ఓహో! ఈనాడు రేపల్లెలో ఒక పనిలేని రోటికి కట్టబడినాడే!! సుకుమారమైన ఆయన పాదములెలావుంటాయో చూడాలని తహతహలాడే దేవతలకు తన అరిపాదములను చూపనట్టిదేవుడు ఈరోజు రేపల్లెలో ఒక కొయ్య బండికి చూపించి సూటిగా తన్నాడే!! ఏమి ఆ శకటాసురుని అదృష్టము!!

అమృతము కొరకై క్షీరసాగరమును చిలికించి, నిస్వార్థంగా దేవతలందరికీ పంచిపెట్టించిన పురుషోత్తముడు, తానే తమితో (ఆసక్తితో) గోపికల ఇండ్లలో వెన్నదొంగిలించుచున్నాడే!! గుమురై (గుమిగూడిన) దేవదానవ కోట్లకు కూడా చిక్కని శ్రీమన్నారాయణుడు, నేడు బృందావనమున గొల్లభామలకు భ్రమకలిగినవానిలా చిక్కినాడే!! ఏమివింత!

ఇందుగలడు, ఇందులేడు అని ఇదమిద్ధంగా యెంచి చూపశక్యముకాని సర్వాతర్యామి ఈ రేపల్లెవాడలలో యెంత అందముగా ఆడుచున్నాడో చూడండి. ఆనాడు (ద్వాపరయుగమున) కృష్ణావతారమునంది పైలీలలన్నీ చేసినట్లే నేటి కలియుగంలో, యిందున (ఈ తిరుమలలో) శ్రీవేంకటాద్రి నెక్కి శ్రీవేంకటేశ్వరుడై నిలిచియున్నాడే!! ధన్యోస్మి తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : అభయదాయకుడ వదెనీవే గతి
సంఖ్య : 420 పుట : 283 రాగం: బౌళిరామక్రియ

బౌళిరామక్రియ

37 అభయదాయకుఁడ వదె నీవే గతి
యిభరక్షక నను నిపుడు గావవే ॥ పల్లవి॥

భయహర దైతేయభంజన కేశవ
జయ జయ నృసింహ సర్వేశ్వరా
నియతము మాకిదె నీపాదములే గతి
క్రియగా మమ్మేలి కింక లుడుపవే. ॥అభ॥

బంధవిమోచన పాపవినాశన
సింధురవరదా శ్రితరక్ష
కంధరవర్ణుఁడ గతి నీనామమె
అంధకారముల నణఁచి మనుపవే. ॥అభ॥

దైవశిఖామణి తతచక్రాయుధ
శ్రీవేంకటగిరి శ్రీరమణా
సావధాన నీశరణ్యమే గతి
వేవేలకు నావిన్నప మిదియే. ॥అభ॥420

అవతారిక:

శ్రీమన్నారాయణునిపై శ్రావ్యమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. సర్వులకు అభయప్రదాతవైన ఓ గజేంద్రవరదా! నీవే నాకు దిక్కు. ఇప్పుడు నన్ను రక్షించరాదా స్వామీ! అని వేడుకొంటున్నారు. "కింకలుడపవే" – అంటే కినుకదూరం చేయవయ్యా అని అర్థం. కోపము అనే

వ్యాధిని పోగొట్టమని భావన. కంధరవర్ణుడు అంటే నీలమేఘశ్యాముడని అర్థం. తతచక్రాయుధము అంటే వ్యాపించే స్వభావంగల సుదర్శన చక్రం ఆయుధముగాగలవాడని అర్థం. ఇట్లా అడుగడుగునా అర్థాలు తెలియని మధురమైన కీర్తన ఇది. సావధానుడు – అంటే యేమిటో వూహించండి.

భావ వివరణ:

ఓ ఇభరక్షకా! (గజేంద్రవరదా!) ఇపుడు నన్ను రక్షించగా నీవే దిక్కు. నీవు అభయప్రదాతవు. దీనజనోద్ధారకుడవు. నన్ను కాపాడుము తండ్రీ! ఓ భయహరా! నీవు దైతేయభంజనుడవు (అసురాంతకుడవు); కేశీయను రాక్షసాంతకుడవు. సర్వేవ్వరుడవైన ఓ నృసింహా! జయము జయము. మీకు ఇదే నియతము (నియమము). నీచరణములే గతి. క్రియగా (అదేపనిగా) మమ్ము పరిపాలించి మా కింకలుడపవే (మానవులమైన మాకుండే దుర్గుణమైన కోపమును నిర్మూలింపుము ప్రభూ! తన కోపమె తన శత్రువన్నారు కదా!

భవ బంధములను సడలించు పాపవినాశనా! నీవు సింధురవరదుడవు (గజేంద్రవరదుడవు) శ్రీతరక్షకుడవు (ఆశ్రయించినవారిని రక్షించే వాడవు). కంధరవర్ణుడవు (నీమేఘశ్యాముడవు). ఓదేవదేవా! అట్టి నీనామమే మాగతి మా అజ్ఞానాంధకారమును అణచి మనుపవే (రక్షించవయ్యా!)

ఓ దైవశిఖామణీ! తతచక్రాయుధ (వ్యాపించు శక్తిగల చక్రాయుధా!) శ్రీవేంకటేశ్వరా! సావధానుడవైన (హెచ్చరికతోవుండె) నీ శరణ్యమే మాగతి. వేవేల విధములైన నా విన్నపములు ఇవియే ప్రభూ!

సంపుటి: 3 కీర్తన : హరి కృష్ణ మేలుకొను ఆదిపురుషా
సంఖ్య : 543 పుట : 365 రాగం: భూపాళం

భూపాళం

38 హరి కృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరవాత నా మోము తప్పకిటు చూడు. ॥ పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడి నాడను
చాలు నిఁక నిద్దురలు చద్దికూళ్ళపొద్దు-
వేళాయ నాతండ్రి వేగ లేవే, ॥హరి॥

కను దెరవు నాతండ్రి కమలాప్తుఁ డుదయించె
వనిత మొకమజ్జనము వడిఁ దెచ్చెను
మొనసి మీతండ్రి యిదె ముద్దాడఁ జెలఁగీని
దనుజాంతకుండ యిఁకఁ దగ మేలుకోవే. ॥హరి॥

లేవె నాతండ్రి నీలీలలటు వొగడేరు
శ్రీ వేంకటాద్రిపతి శ్రీరమణుఁడా
దేవతలు మునులుఁ జెందిననారదాదులు
ఆవలనుఁ బాడేరు ఆకసమునందు. ॥హరి॥543

అవతారిక:

మధురాతి మధురమైన మేలుకొలుపు కీర్తన నాస్వాదించి తరించండి. అన్నమాచార్యులవారి ఋణం తీరదని అనిపిస్తున్నది కదా! నా తండ్రి మేలుకోరా నా అన్న మేలుకో అని యెన్నిసార్లు బ్రతిమిలాడుతున్నారో చూడండి. జన్మకి ఇట్లాంటికీర్తన ఒక్కటి చాలదా? కొసమెఱుపు యేమిటంటే "వనిత మొకమజ్జనము వడిదెచ్చెను" అనే చరణం నందగోపుడు రేపల్లె గొల్లవారికి యేలిక కదా! వాళ్ళ పనిమనిషి వాళ్ళ

అబ్బాయి పళ్ళుతోముకోవడానికి గోరువెచ్చని నీళ్ళు తెచ్చి సిద్ధంగా వున్నదట. మొకమజ్జనము అంటే ముఖమును నీళ్ళతో కడుగుకొనుట.

భావ వివరణ:

ఓ ఆదిపురుషా! హరీ! కృష్ణా 'మేలుకో నాన్నా! తరువాత తప్పకుండా నా మోము (ముఖమును) ఇటుచూడు. (నా మాట విను తండ్రీ!)

నా యన్న మేలుకొనరా! బడినాడను (నీతో కూడి ఆడుకొందామని) అదే నీతోడి బాలలు మెల్లనే (మన వసారాలో) నిలుచుని నిన్ను పిలిచేరు. లే తండ్రీ! ఇక నిద్దురలు చాలును కన్నా! చద్దికూళ్ళ పొద్దువేళాయె (చద్ది యన్నం తినే వేళయింది నాన్నా!) నా తండ్రీ! వేగ లేవే (తొందరగా లేచిరావయ్యా!)

అదిగోచూడు... కమలాప్తుడుదయించె (కమలబాంధవుడైన సూర్యభగవానుడు ఉదయించినాడు) నా తండ్రీ! కన్నులు తెరువమయ్యా! మొకమజ్జనకు (నీ ముఖము కడుగుకొనుటకు నీళ్ళను) వనిత (పనిపిల్ల) వడి దెచ్చెను (శ్రీఘ్రముగా తీసికొచ్చింది). ఇవే నీతండ్రి నందగోపుడు, మొనసి (పూనుకొని) చెలగి ముద్దాడ (గబగబా ముద్దులు పెట్టుకొందామని) యెదురు చూస్తున్నాడయ్యా! ఓ దనుజాంతకా! (పూతన వంటి రాక్షసులను అంతమొందించినవాడా!) ఇక మేలుకోవయ్యా!

నా తండ్రీ! నీవు చేసిన నీ లీలలన్నింటినీ వొగడేరు (పొగడుచున్నారయ్యా!) లేవె (లేచిరావయ్యా!) ఇప్పుడు నీవు ఈ తిరుమల వేంకటకృష్ణయ్యవు, శ్రీదేవీ వల్లభుడవు. అదిగో చూడవయ్యా! ఆవలను (నీవాకిటి బయట) దేవతలు, మునులు, నారదాది భక్తులు సుప్రభాతమును పాడుచున్నారు. ఆకాశములో యెంత గుంపువున్నదో చూడు తండ్రీ! ఇంతమందికి నీ దర్శనం కావాలంటే యెంత సమయం పడుతుంది? లే నాన్నా!

సంపుటి: 3 కీర్తన : సీతాసమేత రామ శ్రీరామ
సంఖ్య : 516 పుట : 347 రాగం: సాళంగనాట

సాళంగనాట

39 సీతాసమేత రామ శ్రీరామ
రాతి నాతిఁజేసిన శ్రీరామ రామ. ॥ పల్లవి॥

ఆదిత్యకులమునందు నవతరించినరామ
కోదండభంజన రఘుకులరామ
ఆదరించి విశ్వామిత్రుయాగము గాచినరామ
వేదవేదాంతములలో వెలసినరామ. ॥సీతా॥

బలిమి సుగ్రీవునిపాలినిధానమ రామ
యిల మునుల కభయమిచ్చినరామ
జలధి నమ్ము మొనను సాధించినరామ
అలరు రావణదర్పహరణ రామ. ॥సీతా॥

లాలించి విభీషణుని లంకయేలించినరామ
చాలి శరణాగతరక్షక రామ
మేలిమి శ్రీవేంకటాద్రిమీఁద వెలసినరామ
తాలిమితో వెలయు ప్రతాపపురామ. ॥సీతా॥516

అవతారిక:

శ్రీరామచంద్రమూర్తిపై చక్కటి భజననందిస్తున్న అన్నమాచార్యులవారి ఈ కీర్తన నాస్వాదించండి. బహు సులభమైన దీనిలో ఒకే ఒక్క మెలిక 'ఆదరించి విశ్వామిత్రుయాగము గాచిన రామా' అనే చోట వున్నది. ఇక్కడ ఆదరించడం అంటే సమున్నతమైన గౌరవం అన్నమాట. శ్రీరాముడు పరమాత్మే కదా! ఆయనకి తెలియనిదొక్కటీ వుండదు. అయినా ఏమీ తెలియని అమాయకుడిలా విశ్వామిత్రునికి గురుస్థానం ఇచ్చి ఆయన చెప్పినదంతావిని ఆయన

యాగరక్షణ చేసి 'రాముడు మంచి బాలుడు' అనిపించుకొన్నాడు. ఇది బహుశా వావిలిపాడు వీరరాఘవునిపై చెప్పిన కీర్తన కావచ్చును.

భావ వివరణ:

సీతాసమేతుడవు (సీతాదేవితో ఒకే సింహాసనమును అధిష్టించియున్న) రాముడవు అయిన శ్రీరామా! శిలవలె అచేతనస్థితిలోవున్న నాతి అహల్యకు చేతనత్వము ప్రసాదించిన రామచంద్రమూర్తివి నీవే.

ఓ శ్రీరామా? నీవు ఆదిత్య కులమున (సూర్యవంశమున) అవతరించినవాడవు; కోదండ భంజనుడవు (శివ ధనస్సును విరిచిన రఘురాముడవు). విశ్వామిత్రునకు నీ గురుస్థానమును ప్రసాదించి, వినయశీలివైన శిష్యుడవై అనేక అస్త్రములను విద్యలను స్వీకరించి ఆయన యాగరక్షణ నెపమున దానవ దమనకు పునాది వేసితివి. వేదవేదాంతముల మూలపురుషుడవైన తారకరాముడవుగా వెలసిన శ్రీరామబ్రహ్మం నీవే.

ఓ శ్రీరామా! అలనాడు నీ బలమేమిటో సుగ్రీవుని కన్నులకు కట్టించి వానిని తిరిగి నిలబెట్టినవానిపాలి నిధానమవు (ఐశ్వర్యమైతివి); రాక్షసులచే వేధించబడుచున్న మునులకు జనస్థానమున అభయమిచ్చి రాక్షసుల పీడ తొలగించితివి. సేతువును నిర్మించదలచి నయమున నీకు లొంగని సాగరుని అమ్ము మొనకుదెచ్చి వానిని సాధించితివి. దర్పముతో (గర్వముతో) కన్నుమిన్ను గానని రావణుని గర్వమును హరించిన రామభద్రుడవైతివి.

అన్న మరణమునకు తానే కారణమని రోదించుచున్న విభీషణుని ఓదార్చి లంకకు యేలికను చేసితివి. కావలసినవారికి కావలసినంత శరణ్యమునొసగి రక్షించితివి. నేడు బంగారు శిఖరముల బోలిన తిరుమల శిఖరములపై శ్రీవేంకటేశ్వరుడవై చేరితివి. నీవే తాలిమితో (అనుపమ క్షమను ప్రదర్శించు) ప్రతాపపు రాముడవై (వీరరాఘవుడవై) వెలసితివి. నీవే రాజారాముడవు తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : వేదవట్టి యిక నేమి వెదకేరు చదివేరు
సంఖ్య : 535 పుట : 359 రాగం: సాళంగనాట

సాళంగనాట

40 వేదవట్టి యిఁక నేమి వెదకేరు చదివేరు
వేదాంతవేద్యుఁడైన విష్ణుని నెఱఁగరా. ।। పల్లవి।।

తోలె నదె గరుడనిఁ దొడఁగి బాణునిమీఁద
వాలెను కంసునిమీఁద వడి నెగసి
కేలుచాఁచి చక్రమునఁ గెడపె శిశుపాలు
వేలుపుల రాయఁడైన విష్ణుని నెఱఁగరా. ।।వేద।।

తొక్కెను బలీంద్రునిఁ దొల్లి పాతాళానఁ గుంగ
మొక్కలాన జల ధమ్ము మొనకుఁ దెచ్చె
పక్కన బ్రహ్మాండము పగులించెఁ బెనువేల
వెక్కనపుదైవమైన విష్ణుని నెఱఁగరా. ।।వేద।।

భేదించె రావణాదిభీకరదైత్యులనెల్ల
నాదించె శంఖమున నున్నతజయము
సేదదేర నిపుడును శ్రీవేంకటాద్రిమీఁద
వీది వీది మెరసేటి విష్ణుని నెఱఁగరా. ।।వేద।।535

అవతారిక:

"వేదవట్టు" అంటే వేద ప్రవచనము చేయటం. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు వేదము తెలిసిన పండితులతో అంటున్నారు 'ఇంకా యేమి వేదప్రవచనాలు చేస్తారు? యేమి వెదుకుతారు? యేమేమి చదువుతారయ్యా! మీకీ మాత్రం తెలియదా? వేదాంత వేద్యుడు విష్ణువుగాక వేరెవరున్నారు?'. ఈ కీర్తనలో జలధమ్ము అంటే 'జలధియమ్ము' అని భావించాలి. పెనువేలు అంటే బొటనవ్రేలని అర్థం.

అనంతకోటి బ్రహ్మాండాలను తన బొటన వేలికింద నొక్కివేయగలడట ఈ విశ్వరూపుడు మరేమనుకొన్నారు?

భావ వివరణ:

ఓ అయ్యలారా! యిక వేదవట్టి (వేదప్రవచనములు చేసి) యేమి వెదకెదరయ్యా! యేమి చదివేరు? వేదాంతము ద్వారా, వేద్యుడు (తెలియదగినవాడు) యెవరు? విష్ణువే కదా! ఈ సంగతినెరుగరా? ఏమి వింత!!

మీరు ఆయన కృష్ణావతారం గురించి వినలేదా? ఆ శ్రీకృష్ణుడు అదె గరుత్మంతునిపైనెక్కి తోలె (వెడలినాడు). బాణాసురనెదుర్కొని చిత్తుచేశాడు. వడి (వేగముగా) కంసునిపై నెగసి (దండెత్తి) వాలెను (మీదపడ్డాడు). కేలుచాచి (చేయిచాచి) చక్రాయుధాన్ని అందుకొని శిశుపాలుని కెడపె (పడవేసెను). అట్టి లీలలు చేసిన వేలుపులరాయుడు (దైవశిఖామణి) యైన విష్ణువునెరుగరా? ఏమి ఆశ్చర్యము!

ఈయన తొల్లి (కృతయుగంలో) బలీంద్రుని (బలి అను దానవేంద్రుని) పాతాళమునకు క్రుంగునట్లు తలపై కాలుంచి త్రొక్కెను. ఈయన త్రేతాయుగములో మొక్కలాన (శౌర్యముతో) జలధిని (సాగరమును) అమ్ముమొనకు దెచ్చే (బాణముయొక్క మొనకు) తెచ్చి శరణాగతుని చేసెను. పక్కన భవిష్యత్తులో ఈయన తన పెనువేల (బ్రొటనవేలితో) బ్రహ్మాండమునే పగులించె బ్రద్దలు కొడతాడు. ఓ అయ్యలారా! వెక్కసపు దైవమైన (సర్వాధికుడైన దేవుడు) విష్ణువునెరుగరా?

ఈయనే శ్రీరాముడై రావణుడు మొదలైన భయంకర దైత్యులను సంహరించాడు. తన పాంచజన్యశంఖమును వున్నతముగ పూరించి జయధ్వానములు చేసెను. యుగయుగాలలో ఇవన్నీ చేసి అలసిన శ్రీమహావిష్ణువు ఈ కలియుగంలో సేదతీరుటకు (విశ్రాతికి) శ్రీవేంకటాద్రిమీద శ్రీ వేంకటేశ్వరుడై నిలిచినాడు. అదిగో తిరు వీధులలో మెరసేటి (కాంతులు వెదజల్లుతున్న) ఈ విష్ణుదేవుని ఎరుగరా? ఏమి విచిత్రం!!

సంపుటి: 3 కీర్తన : దేవనీపక్షపాతమో తిరిగేలోకులవెల్తో
సంఖ్య : 422 పుట : 284 రాగం: నారాయణి

నారాయణి

41 దేవ నీపక్షపాతమో తిరిగేలోకులవెల్తో
శ్రీవిభుఁడ నీవేకాదా చిత్తములోనయ్యా. ॥ పల్లవి॥

దివములు సరియే దినరాత్రులును సరే
యివల సుఖదు:ఖాలు హెచ్చుకుందులేలయ్యా
భవములు సరియే ప్రాణములు సరియే
భువిఁ బుణ్యపాపముల భోగము వేరేలయ్యా. ॥దేవ॥

విని కిందరి కొకటే విషయాలు నొకరీతే
మునిఁగేటిజాతిభేదములివేలయ్యా
అనయముఁ జూపొక్కటే ఆఁకలియు నొకటే
పెనఁగేటిగుణముల పెక్కు జాడ లేలయ్యా. ॥దేవ॥

అంతరాత్మ నీవొక్కడ వన్నిటా శ్రీవేంకటేశ
చింతలు వేవేలైన సిలుగేలయ్యా
యింక నేసీ నీమాయ లిందుకే నీశరణంటే
కాంతుఁడ న న్నిందుకే కాచితివి నేఁడయ్యా. ॥దేవ॥422

అవతారిక:

అన్నమాచార్యులవారి కీర్తనలలో పల్లవి చాల చిక్కులు తెచ్చిపెడుతుంటుంది. "ఓ దేవదేవా! శ్రీకాంతుడా! పైకి చూడటానికి జరిగేవన్నీ నీకు పక్షపాత బుద్ధి వున్నదా అనే భ్రమ కలిగిస్తాయి. లేకపోతే అనుక్షణం భ్రమల లోనే వుండే ఈ లోకులలోని 'వెల్తి' (తక్కువ భాగ్యమో, యెక్కువ భాగ్యమో) యెందుకు కలుగుతున్నాయి? మరి మా అందరి చిత్తములో అంతర్యామివి నీవొక్కడివే అయితే ఈ హెచ్చుతగ్గులెందుకు వస్తున్నాయి?" మా శారీరక ధర్మాలు ఒక్కటే శారీర దారుధ్యాలు వేరు,

వినేది ఒకటే అర్థమయ్యేది వేర్వేరు, ఆకలి వొకటే అరుగుదల వేర్వేరు. ఒకడిది మంచి గుణం ఒకడిది చెడ్డగుణం యెందుకిలా? యేమిటి నీ మాయ?

భావ వివరణ:

ఓ దేవదేవా! నీ పక్షపాత వైఖరియో లేక తిరిగేలోకుల వెల్తియో (భ్రమలకు లోనయ్యే లోకుల యొక్క భాగ్యప్రాప్తిలోని విభేదమో) తెలియకుండా వున్నది. మా అందరి చిత్తములో అంతర్యామిగా నీవే వుండగా ఓ శ్రీవిభుడా! ఇలా యెందుకు ఒకరు గొప్ప ఒకరు తక్కువ అవుతున్నారు?

దేవా! ప్రపంచంలో మానవులందరికీ రేయింబవళ్ళు ఒక్కలాగే వుంటాయి కదా? మరి వారి సుఖదు:ఖాలు ఒకేలా యెందుకుండటంలేదు? హెచ్చుతగ్గులెందుకు? అన్ని జీవుల భవము (పుట్టుక) ప్రాణములు ఒక్కటే కదా? మరి లోకంలో పాపపుణ్యములనుభవించడంలో తేడా యెందుకు వస్తున్నది?

ప్రభూ! అందరి వినికి (వినేశక్తి) ఒక్కటే... విషయాలు (విషయములపై ఆసక్తీ) ఒక్కటే, మరి, మునిగేటి (అంతులేని) జాతిభేదము యెందుకు కలుగుతున్నది. అనయము (నిరంతరం) మన చూచే శక్తి ఒక్కటే... ఆకలిదప్పులూ ఒక్కటే కాని మనలో పెనవేసుకొన్న గుణాలలో తేడాలన్నీ యెందుకు వుంటున్నవి?

ఓ శ్రీవేంకటేశ్వరా! మా అందరిలోనూ అంతర్యామిగా చరించేది నీవొక్కడివే, మరి మాకు వేర్వేరు చింతలు, వేర్వేరు చిలుగులు (ఉపద్రవములు) యెందుకు కలుగుతున్నాయి? ఏమిటి నామాయ? ఏమిటీ విచిత్రం? అందుకే నీకు శరణు అంటున్నాను. ఓ అయ్యా! అందుకే నీవు నన్ను నిరంతరం కాపాడుతున్నావు తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : ఒకరిగానగ నొడబడదు మనసు
సంఖ్య : 534 పుట : 359 రాగం: సాళంగనాట

సాళంగనాట

42 ఒకరిఁ గానఁగ నొడఁబడదు మనసు
సకలముహరియని సరిఁదోఁచీని. ॥ పల్లవి॥

అంతరాత్మ శ్రీహరి యతఁ డొకఁడే
జంతువులన్నియు సమములే
బంతులఁ బాత్రాపాత్రము వెదకిన
అంతట హరిదాస్యమేపో ఘనము. ॥ఒక॥

జగమును నొకటే చైతన్య మొకటే
తగినపంచభూతము లొకటే
నగుతా నెదిరిని నన్నును నెంచిన
మొగి నాపై హరిముద్రలె ఘనము. ॥ఒక॥

కారు స్వతంత్రులు కడపట నొకరును
యీరీతి నౌఁగాము లిఁక నేలా
శ్రీరమణీపతి శ్రీవేంకటేశుఁడే
కారణము శరణాగతియే ఘనము. ॥ఒక॥534

అవతారిక:

హరిహరుల మధ్య అంతరం యెలా సాధ్యం? రెండూ పరమాత్మ రూపాలే. రక్షణ భారం హరిదైతే లయం చేసే బాధ్యత హరుడిది. ఇది పురాణాలు నొక్కి వక్కాణిస్తున్నా, కొందరు అజ్ఞానులు హరిహరదూషణ చేసి పాపం మూట కట్టుకుంటున్నారు. జగమున నున్నది చైతన్యమొక్కటే అని హితబోధ జేస్తున్న అన్నమాచార్యులవారిని ఆలకించండి. 'సకలము హరిమయమని సరిదోచీని' అంటున్నారు. ఈసృష్టిలో ఆపరాత్పరుడు తప్ప యెవ్వరూ స్వతంత్రులు కారు. అందరూ ఆయన ఆజ్ఞానువర్తనులే. ఇక ఔగాములేల అంటున్నారు. అంటే

మేలుచేసేదెవడు? కీడుచేసేదెవడు అన్నీ ఆ నామాలవాడే, మనిషి మానవత్వంలేకపోతే జంతువే కదా! రెండుకాళ్ళ జంతువు.

భావ వివరణ:

ఓ ప్రజలారా! నా మనస్సు ఒకరిన్ (వేరే ఇంకొకరిని) కానగ (దర్శించుటకు) ఒడబడదు (అంగీకరించదు). నాకు సకలము హరియని సరిదోచీని (సరిగా అనిపిస్తున్నది). అయినా సత్యమేమిటో వినండి.

మన అందరిలో అంతరాత్మ రూపంలో వున్న శ్రీహరి ఒక్కడే. జంతువులు అన్నియూ సమానమే. మనస్సు అనేది ఒకటి వుండుటచేత మనిషి మేలైన జంతువయ్యాడు. తన మనస్సులో శ్రీహరిని నిలపగలిగితే పాత్రత (యోగ్యత) కలుగుతుంది. లేకపోతే వాడూ యోగ్యతలేని ద్విపాదపశువే కదా! వంతుల (పంతముతో) వెదకితే అపాత్రుడైన ద్విపాదపశువును పాత్రుడైన ఘనుని చేయగలిగిన దేమిటి? హరిదాస్యమే..పో. (కేవలం శ్రీహరిదాసునిగా జీవించటమే).

ఈ జగత్తంతా ఒక్కటే. ఇందులో వుండే చైతన్యము (కదిలేశక్తి) కూడా ఒక్కటే. పంచభూతములు (భూమి, నీరు, కాంతి, గాలి మరియు ఆకాశము) ఏదో ఒక రూపంలో ప్రతిదాంట్లో వున్నాయి. వుండాలి కూడా. కాబట్టి అవి కూడా ఒక్కటే. మరి అటువంటి పాంచభౌతిక శరీరధారినైన నన్ను ఘనుని చేసిందెవరు? నాపైన వున్న ఈ హరిముద్రలే (శంఖ చక్ర ముద్రలు, తిరునామము). నగుతా (నవ్వుతూ) యెదురుగా అవి లేకుంటే నాలో లెక్కించుటకు ఇంకా యేమున్నది?

ఒకసారి ఆలోచించండి. మనం కావాలనుకొని పుట్టామా? కావలసినప్పుడు కావలసినచోట కావలసిన విధంగా చావగలమా? కడపట (చివరికి) ఒక్కడికైనా ఆ స్వాతంత్రం (ఛాయిస్) వున్నదా? మరి ఇంతోటి దానికి "ఔగాము" లేల? (మేలైనదేమిటి కీడైనదేమిటి?) మనకి మేలు జరిగినా హరివల్లనే, కీడు జరిగినా హరివల్లనే. అన్నిటికీ కారణం శ్రీపతియైన వేంకటేశ్వరుడే. మరి అలాంటప్పుడు ఈ పగయెందుకు? ద్వేషమెందుకు? ఆయనను శరణంటే అదే ఘనము కదా!

సంపుటి: 4 కీర్తన : ఈడనిందరికి నేలికైవున్నాడు
సంఖ్య : 289 పుట : 194 రాగం: శుద్ధవసంతం

శుద్ధవసంతం

43 ఈడ నిందరికి నేలికై వున్నాఁడు
వాడల రేపల్లె వాఁడా వీఁడు ॥ పల్లవి॥

భారపువుట్లపాలుఁ బెరుగులు
వారలు వట్టినవాఁడా వీఁడు
కోరి గొల్లెతల కొలనిలోపల
చీరలు దీసిన శిశువా వీఁడు ॥ఈడు॥

ఆవులఁ బేయల నందరియిండ్ల
వావిరిఁ గాచిన వాఁడా వీఁడు
వావు లొక్కటిగా వనితలఁ గూడి
వేవేలు నేర్చిన విటుఁడా వీఁడు ॥ఈడు॥

అరుదై శ్రీవేంకటాద్రిమీఁద నుండి
వరము లిచ్చేటి వాఁడా వీఁడు
మరిగెనలమేల్మంగతో మమ్మేలె
సరసుఁడై వుండే జాణా వీఁడు ॥ఈడు॥

అవతారిక:

ఈ తిరుమలలో అందరికీ యేలికయైవున్న ఈ భగవానుడూ అలనాడు రేపల్లె వాడలలో అల్లరి కిట్టయ్య ఒక్కరేనా? వాడా వీడు!! అని ఆశ్చర్యపోతున్నారు అన్నమాచార్యులవారు. అలవాటు ప్రకారం (రామకథ – కృష్ణ కథ– దశావతారాల కథ చెప్పటం ఆయన మానుకోలేని అలవాటు) కృష్ణ లీలలు గానం చేస్తున్నారు. ఆ రేపల్లె చిత్‌చోరుడే ఈ

అలమేల్మంగపతి కూడా. అవునా? ఆ జాణా వీడు... అంటున్నారు. ఎన్నిసార్లు పాడినా తనివి తీరని కృష్ణగానామృతం వినండి.

భావ వివరణ:

ఈడు ఇందరికి యేలిక (ప్రభువై) వున్నాడే. ఆనాడు వాడల రేపల్లె వీధులలో తిరిగిన వాడే (ఆ గొల్లపిల్లవాడే), వీడా? అదెలా సాధ్యం?

భారపువుట్ల మీద (బరువైన వుట్లలో వున్న) పాలు పెరుగులు వారలు వట్టినవాడు (ధారలుగా కార్పించి యేడిపించిన ఆ కొంటె కోణంగియేనా) వీడు (ఈ శ్రీవేంకటేశ్వరుడు), ఏమిచిత్రం!! కోరి కావలెనని (పొరబాటున కాదు) గోపికల చీరెలను కొలను గట్టున దీసి దాచి వాళ్ళ మానం మంట గలిపిన శిశువు గుర్తున్నాడా? వాడా వీడు!!

బ్రహ్మదేవుడు రేపల్లెలోని ఆవులను పెయ్యలను గోపాలురను మాయంచేస్తే తానే అవన్నీ అయిపోయి రేపల్లెలో ఒక్కరికీ తెలియకుండా నడిపి బ్రహ్మకు బుద్ధివచ్చేట్లు చేసినది ఇతడేనా? ఆ తరువాత ఆ పరమేష్టిని మన్నించి వావిరిగాచిన (ఉత్కృష్టుడై రక్షించిన)వాడా, వీడు (ఈ శ్రీనివాసుడు). వావులొక్కటిగా (వావీవరుసా లేకుండా) తల్లీకూతుళ్ళిద్దరినీ తన ప్రియురాండ్రను చేసికొన్న, వేవేలు నేర్చిన (అనేక రతిమర్మాలు నేర్చిన) ఆ విటుడా, వీడు (ఈ వేంకటరమణుడు) ఆహా!!

అరుదైన శ్రీవేంకటాద్రిమీద కొలువై వుండి అనేక వరములొసగే ఆ శ్రీవేంకటేశ్వరుడు వీడా (ఈ శ్రీకృష్ణుడా), వీడేనా? మరిగే (అనురాగంతో తలమునకలయ్యే) అలమేల్మంగతో మమ్ము యేలునట్టి సరసుడై వుండే ఆ జాణా (జగజ్జెట్టియా) వీడు (ఈ శ్రీకృష్ణుడు)?

సంపుటి: 1 కీర్తన : అంగనలాల మనచే నాడించుకొనెగాని
సంఖ్య : 454 పుట : 304 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

44 అంగనలాల మనచే నాడించుకొనెఁ గాని
సంగతెఱిఁగిన నెరజాణఁ డితఁడే ॥ పల్లవి॥

వొడలులేనివాని కొక్కఁడే తండ్రాయఁ గాని
తడయక పురుషోత్తముఁ డితఁడే
బడబాగ్నిజలధికిఁ బాయ కల్లుఁడాయఁ గాని
వెడలించె నమృతము విష్ణుఁ డితఁడే ॥అంగ॥

పులిగూడు దిన్నవాని పొందొక్కటే సేసెఁగాని
నలువంక లక్ష్మీనాథుఁ డితఁడే
చలికిఁ గోవరివానిసరుస బావాయఁ గాని
పలుదేవతల కెల్ల ప్రాణబంధుఁ డితఁడే ॥అంగ॥

యెక్కడో గొల్లసతుల కింటిమగఁ డాయఁ గాని
తక్కక వెదకే పరతత్వ మితఁడే
మిక్కిలి శ్రీవేంకటాద్రిమీఁద మమ్ము నేలెఁ గాని
తక్కక వేదముచెప్పే దైవ మీతఁడే. ॥అంగ॥

అవతారిక:

"ఓ అంగనలారా! ఈ పిల్లాడు ఇట్లా మనచేత ఆడింపబడుతున్నాడు కాని అసలు సంగతి తెలుసుకొంటే ఇతడే గొప్ప నెరజాణమ్మా!" అని ఆలాపిస్తున్నారు మన అన్నమాచార్యులవారు. ఇందులో వున్న ప్రహేళికలు (చిక్కు ప్రశ్నలు) జాగ్రత్తగా సమాధానాలు ఆలోచించి భావవివరణతో సరిజూసుకోండి. ఇదొక 'క్విజ్ ప్రోగ్రాం' అన్నమాట. తినబోయేముందు ఇది రుచి చూడండి... పులిగూడు దిన్నవాడెవడు? వాని పొందొక్కటేసేనుగాని..

అంటే యేమిటి? ఆలోచించండి. ఎక్కడో గొల్లసతులకు ఇంటిమగడయ్యిందెవరు? చలికిఁ గోవరివాడెవడు? అనుకున్నంత తేలికకాదు అని తెలుసుకోండి, మరి.

భావ వివరణ:

ఓ అంగనలారా (రమణుల్లారా!) ఈనాడు ఈయన మన చేత ఆడించబడుతున్నాడు. కాని, సంగతెరిగిన (అసలు విషయం తెలుసుకొంటే) ఇతడే గొప్ప నెరజాణ (అన్నీ తెలిసిన చతురుడు).

ఒడలు లేనివానికి (శరీరం లేనివాడికి) ఒక్కడే, తండ్రియైన వాడు (ఎవరు? (మన్మథుని తండ్రియైన శ్రీహరి). తడయక ఆలస్యములేక రక్షించే పురుషోత్తముడు కూడా ఇతడే. బడబాగ్నిని తనలో దాచుకున్న సముద్రునికి, పాయక (కోరి) అల్లుడైన వాడే, కాని అమృతాన్ని అందించినవాడు. ఈయనే విష్ణువు.

ఈయన పులిగూడుతిన్నవాని పొందొక్కటే చేశాడు (భిక్షాటన చేసి ఆ భిక్ష భుజించేవాని స్నేహం చేసేవాడు)... అంటే (పరమశివుని మిత్రుడైన శ్రీహరి). అయినా ఈయన భిక్ష యెత్తడండీ. ఎందుకంటే అష్టైశ్వర్యములున్న లక్ష్మీదేవికి మగడండీ ఈయన. ఈయన చలికిన్ కోవరి వాని బావ. అంటే చల్లదనాన్నిచ్చే చంద్రునికి బావగారు అయిన శ్రీకాంతుడు. అంతేకాదు దేవతలందరికీ ప్రాణబంధువు.

ఎక్కడో రేపల్లెలో వున్న గొల్లపడుచులకి "ఇంటి మగడు" ఒకే ఇంటిపేరుండేట్లు చేసిన మగడు. యోగులందరూ తక్కక (వెనుదీయక) వెదకే పరతత్వము (పరబ్రహ్మ) ఇతడే. ఇవన్నీ అటుంచి శ్రీవేంకటాద్రి మీద వెలసి మమ్మల్ని యేలే దేవుడు ఈయనే. కానీ వేదాలన్నీ శ్లాఘించే పరాత్మరుడు కూడా ఈ దేవుడే.

సంపుటి: 3 కీర్తన : ఈతని నెఱగకుంటేనిల
సంఖ్య : 536 పుట : 360 రాగం: లలిత

లలిత

45 ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము
ఘాతల నేఱు గుడిచి కాలువ పొగడుట. ॥ పల్లవి॥

హరిపాదముననే యడఁగె లోకములెల్ల
హరినాభినే పొడమి రదివో బ్రహ్మాదులు
హరినామము వేదాల కాదియు నంత్యము నాయ
హరిదాసులే వశిష్ఠాదు లిందరును. ॥ఈత॥

విష్ణుఁడే యమృత మిచ్చె విష్ణుఁడే ధరణి మోఁచె
విష్ణువాజ్ఞ నడచేది విశ్వమింతాను
విష్ణుచక్రమున దైత్యవీరులెల్లా నడఁగిరి
విష్ణువుముఖమునందే విప్రులు జనించిరి. ॥ఈత॥

పరమపుశ్రీపతివే భారతరామాయణాలు
పరమాత్ముఁ డితఁడే పలుజీవులయందెల్లా
పరము చేచేతఁ జూపె పట్టి శ్రీవేంకటేశుఁడు
పరమానంద మొసఁగు భక్తులకు నితఁడు. ॥ఈత॥536

అవతారిక:

జగద్భర్త నారాయణుడు. మనకు భోజనమిచ్చి అది అరిగేశక్తినిచ్చి పుట్టినదాది తుది శ్వాసదాకా రక్షించేది పురుషోత్తముడే. ఆయన గురించి తెలియకపోవటం కన్న స్వామి ద్రోహం వుంటుందా. లౌకికంగా చూచినా మనకు వుద్యోగం ఇచ్చి, నెలనెలా జీతం ఇచ్చి పోషిస్తున్న మన యజమాని గురించి తెలుసుకోనివాడు ద్రోహియే కదా! అన్నమాచార్యులవారిలో కవి దీనిని నిరసిస్తూ ఏటినీరు తాగి కాలువనీళ్ళను పొగడటం అంటే ఇదే...

అని దెప్పిపొడుస్తున్నారు. ప్రతి జీవిలోనూ అంతర్యామిగా వున్న ఈ శ్రీవేంకటేశుడే పరము చేచేత పట్టి జూపె అంటున్నారు.

భావ వివరణ:

ఓ భక్తులారా! ఈతని (ఈ నారాయణుని) యెరుగకుంటే (తెలియకపోతే) ఇల (భూమిపై) ఇంతకంటే స్వామిద్రోహం మరియొకటుంటుందా? ఘాతల (దెబ్బతిన్నవాడు దీనావస్థలో) నీటినీళ్ళ తాగి ప్రాణం నిలబెట్టుకొని, కాలువలో నీళ్ళు బాగుంటాయి అని పొగడటంలాంటిదే... ఇది కూడా అవునా?

విశ్వంలోని పదునాలుగు భువనాలూ ఈ శ్రీహరిపాదం కిందనే వున్నాయి. ఒక్క తొక్కుడుతో అన్నీ చితక్కొట్టగలడు. అంతెందుకు సృష్టికర్త బ్రహ్మ మొదలైన వారంతా ఆయన నాభి (బొడ్డు) లోంచి పుట్టినవారేకదా! అసలు జ్ఞానానికి మూలమైన వేదముపుట్టిందే శ్రీహరి నామములోనుంచి వేదాంతము కూడా ఆయనే కదా! వశిష్ఠుడు మొదలైన సప్తఋషులు యెవ్వరనుకున్నారు? వారంతా హరిదాసులే.

ఆయన మహిమనెంతని పొగడగలం చెప్పండి? దేవతలు అమరులవటానికి కారణమైన అమృతం తెప్పించింది ఆయనే కదా! ఆదివరాహమై ఈ భూమిని మోసినవాడు శ్రీహరే కదా! రోజుకి 24 గంటలు, సంవత్సరానికి 365 రోజులు 6 గంటలు (దాదాపుగా) సమయంపట్టేట్లు ఈ భూమి ఒక గొప్ప సమయపాలన గతి నిర్దేవంతో నడుస్తున్నదే అదెవరివల్ల జరుగుతున్నది? రాక్షసులనందరినీ సుదర్శన చక్రంతో అడ్డగించినదెవరు? నేటికీ వేదవిజ్ఞానం విస్తరింపచేస్తున్న విప్రులు జన్మించింది కూడా ఆయన ముఖంలోనుంచే కదా!

భారత రామాయణాది పురాణవాఙ్మయం పుట్టిందే శ్రీహరి కథామృమును విస్తరింపజేయుటకు కదా! సర్వ జీవులయందున్న పరమాత్ముడు అంతర్యామీ ఈ దేవదేవుడే కదా! నేడు శ్రీవేంకటేశుడై పరము (మోక్షమును) చేనేతపట్టి (అభయవరద హస్తాలతో పట్టి) చూపుతూ భక్తులకు పరమానందమునిస్తున్న ఏడుకొండల యేలికయై భక్తులని అనుగ్రహిస్తున్నది ఈతడే కదా!

సంపుటి: 4 కీర్తన : ఎన్నిమహిమలవాడె యీ దేవుడు
సంఖ్య : 177 పుట : 119 రాగం: హిందోళవసంతం

హిందోళవసంతం

46 ఎన్నిమహిమలవాఁడె యీ దేవుఁడు
కన్నులపండువలెల్లాఁ గదిసిన ట్టుండెను ॥ పల్లవి॥

పోలింప కర్పూరకాపు పురుషోత్తమునికి
యే లీ నుండెనని యెంచి చూచితే
పాలజలనిధిలోనఁ బవళింపఁగా మేన
మేలిమి మీఁగఁడంటిన మెలుపుతో నుండెను ॥ఎన్ని॥

తట్టుపునుఁగుకాపు దైవశిఖామణికి
యెట్టుండె నని మరి చూచితే
చిట్టకాన రేపల్లెలో చీఁకటితప్పు సేయఁగా
అట్టిరాత్రులు మేన నంటిన ట్టుండెను ॥ఎన్ని॥

అలమేలుమంగతోడ నట్టె సొమ్ము ధరించఁగ
యేలమి శ్రీవేంకటేవు నెంచి చూచితే
కలిమిగల యీ కాంత కౌఁగిటఁ బెనఁగఁ గాను
నిలువెల్లా సిరులై నిండిన ట్టుండెను ॥ఎన్ని॥

అవతారిక:

ఈ తిరుమలేశుడు యెన్ని మహిమలు గలవాడె! అని ఆశ్చర్యపడుతున్నారు అన్నమాచార్యులవారు. ఆ మహిమలన్నీ కన్నులపండువగా శోభిల్లుతున్నాయని అంటున్నారు. అన్నమయ్యకి ఈ మధురమైన భావలహరియెలా వస్తుందా అనిపించి, ఏడుకొండలవాడే ఆ భావలహరిని ఆయనలో యెగసిపడేలా చేస్తాడు అని సమాధానపడ్డాను. శ్రీమహాలక్ష్మియైన అలమేల్మంగ ఈ స్వామి కౌగిట్లో కరిగే తరుణంలో

ఆవిడ ఒంటిమీద నగలన్నీ ఈయనకు అంటుకున్నాయట. భళి భళీ! నీ వూహ భావాతీతమయ్యా! అన్నమయ్యా!

భావ వివరణ:

ఈ దేవదేవుడు యెన్ని మహిమలు కలవాడో యేమని చెప్పగలను? అవి కన్నులపండుగలై అన్నీ నన్ను దగ్గరై అలరించుచున్నవి.

ఈస్వామికి కర్పూరపు వంటిపై మెత్తారు. ఆపలింప (ఆరంగారంగవేసిన) ఆకాపు ఈ పురుషోత్తమునికి ఎలావున్నదంటే... పాలసముద్రములో, పవ్వళించినందున అలల తాకిడికి అంటిన లేతలుంగారు రంగు మీగడ బాగా అంటుకొని మెలపుతో (మెత్తినట్లుగా) వున్నది.

పునుగుపిల్ల నుంచి తీసిన సుగంధద్రవ్యము తట్టుపునుగు. దేవతలందరిలో శిఖామణి (తలమానికమైన) ఈ స్వామికి నిమజ్జనానంతరం తట్టు పునుగు కాపు వేస్తారు (మెత్తుతారు). మరి పరికించి చూచితే అది యెట్లా వుంటుందంటే... చిట్టకాన (శృంగారలీలగా) అలనాడు రేపల్లెలో ఈ శంగారరాయుడు అనేక "చీకటి తప్పులు" సేసినందున ఆ రాత్రులన్నీ ఈయన వంటిపై ఒకదాని తర్వాత ఒకటి అంటుకొని, అందాలమేనిపై ఆ తట్టు పునుగుకాపు ఇంకా అందము పెంచుతున్నది. నేడు అలమేల్మంగతో చేరిన ఈ మహానుభావుడు అట్టె (అదిగో) యెలావున్నాడంటే... కలిమికాంత (శ్రీమహాలక్ష్మియైన) ఆదేవిని ఈ శ్రీవేంకటేశ్వరుడు బిగి కౌగిట జేర్చగా, పెనగులాడెడి, ప్రేయసి ఒంటిపై నగలన్నీ ఈ చిలిపి శ్రీనావాసునికి అటుకొన్నవా అన్నట్లుంది. అందుచేతనే ఈయనకు నిలువెల్లా సిరులై (నగలై) నిండిపోయినవా అన్నట్లుంది. ఇకపై చెప్పే శక్తి నాకు లేదు తండ్రీ!

సంపుటి: 1 కీర్తన :ేమియునెఱగని పామరులను మమ్ము
సంఖ్య : 162 పుట : 109 రాగం: ఆహిరి

ఆహిరి

47 ఏమీ నెఱఁగని మమ్ము నెక్కువసేసి
పామరుల దొడ్డఁజేసె భాష్యకారులు ॥ పల్లవి॥

గతచన్న వేదాలు కమలజునకు నిచ్చి
నాతనికరుణచేత నన్నియుఁ గని
గతిలేకపోయిన కలియుగమున వచ్చి
ప్రతిపాలించఁ గలిగె భాస్యకారులు ॥ఏమీ॥

లోకమెల్ల వెల్లిఁబోఁగా లోననే సురలఁగాచి
ఆకుమీఁదఁ దేలినయతనికృప
కాకరిమతములెల్ల గాలి ఁబుచ్చి పర మిట్టే
పైకొనఁగఁ గరుణించె భాస్యకారులు ॥ఏమీ॥

పంకజపుఁజేయి చాఁచి పాదపుఁబర మిచ్చిన
వేంకటేశుకృపతోడ వెలయఁ దానే
తెంకనే వొడయవరై తిరుమంత్రద్వయాన
పంకమెల్లఁ బోఁగడిగె భాష్యకారులు ॥ఏమీ॥

అవతారిక:

భాష్యకారుడు అంటే వ్యాఖ్యానం చేసేవాడు అని అర్థం. భగవంతుని లీలలను గురించి సోదాహరణంగా వ్యాఖ్యానించి, భక్తిని పెంపొందింపజేస్తారు భాష్యకారులు. వైష్ణవ పరిభాషలో రామానుజాచార్యుల బిరుదు అది. అన్నమాచార్యులవారి ఈ కీర్తనలో తన గురువుని కీర్తిస్తూ మా భాస్యకారులు మమ్మల్ని దొడ్డవాడిని చేశారు. నిజానికి మేము పామరులమే. ఏమీ యెఱగని మమ్ము "అన్నమాచార్యులవారి"ని చేసి యెక్కువ చేసి అనుగ్రహించారు

అంటున్నారు. "గతచన్న" అంటే కోల్పోబడిన... లేక... కోల్పోయిన అని అర్థం. ఇట్లా సూటిగ నిఘంటువులో దొరకని చాలామాటలున్నాయి, ఈ కీర్తనలో.

భావ వివరణ:

ఈ భాష్యకారులు (రామానుజాచార్యులవారు) ఏమీ యెరుగని పామరులమైన (అజ్ఞానులమైన) మమ్ము ఆచార్యపదవితో దొడ్డవానిని (గొప్పవానిని) చేశారు.

గతచన్న (గతించిపోయిన, లేక, కోల్పోయిన) వేదాలను కమలజునకు (పద్మసంభవుడైన బ్రహ్మకు) తిరిగి ఇచ్చిన ఆతని (శ్రీహరి) దయవలన అన్నియు నెఱిగి, గతిలేని (సక్రమమైన ధర్మ మార్గంలేని) కలియుగంలో వచ్చి (అవతరించి) ప్రతిపాదించగలిగె (నిరూపించగలిగెను... అంటే భగవంతుని సాక్షాత్కరింపజేసెను) ఈ భాష్యకారులు.

లోకమెల్ల (భూలోకమంతా) వెల్లన్‌పోగా (జలప్రవాహంలో మునిగిపోగా) లోననే (తనలోనే) దేవతలకు ఆశ్రయం కల్పించి చిన్నారి శిశువురూపంలో ఒక మఱ్ఱి ఆకుపై తేలియుండిన ఆదినారాయణుని దయనుపొంది, కాకరిమతమ ఉలెల్ల (వ్యర్థమైన మతములను) గాలిబుచ్చి (గాలికెగిరిబోవునట్లు చేసి) ఇట్టే పరము (మోక్షమార్గము) పైకొనగా (కలుగునట్లు) చేసినవారే ఈ భాష్యకారులు.

పంకజపు చేయిజాచి (కమలములవలె కోమలమైన తన చేతులను చాచి) తనపాదములను చూపించి మోక్షమార్గం ఇచ్చిన శ్రీవేంకటేశ్వరుని కరునారసవృష్టితనపై కురియగా, తెంకనే (సుస్థిరముగా) ఉడయవరై వైష్ణవాచార్యుడై అవతరించారు. ఆపైన తరుమంత్రద్వయముతో (పవిత్రమైన రెండు మంత్రములతో) మా పాపపంకిలమునంతా ఈ భాష్యకారులు తొలగించినారు.

సంపుటి: 4 కీర్తన : అన్నిటిపైనున్నట్లు హరిపై నుండదు మతి
సంఖ్య : 124 పుట : 83 రాగం: నారాయణి

నారాయణి

48 అన్నిటిపై నున్నట్లు హరిపై నుండదు మతి
కన్నులఁ బ్రహ్లాదువలె కనుఁగొను టరుదా ॥ పల్లవి॥

పులుగు నర్చిం చొకఁడు పూఁచెనాగత మెరిఁగి
వెలసి ఘనుఁడనంటా విఱ్ఱవీఁగీని
జలజాక్షుపాదములు సారె నర్చించేటివారు
ఇలలోనఁ బరమార్థ మెరుఁగుట యరుదా ॥అన్ని॥

మానివోడ నమ్మొకఁడు మహాజలధి దాఁటి
నానార్థములు గూర్చి నటియించీని
శ్రీనాథుపాదములు చేకొని నమ్మినవాఁడు
పూని భవవార్ధి దాఁటి పుణ్యమందు టరుదా ॥అన్ని॥

దీపమువట్టి యొకఁడు తెగనిచీఁకటిఁ బాసి
చూపుల నన్నిటిఁ గని సుఖమందీని
చేపట్టి పరంజ్యోతి శ్రీవేంకటేశు భక్తుఁ
డోపి ముక్తి కడగని వున్నతుఁడౌ టరుదా ॥అన్ని॥

అవతారిక:

ప్రహ్లాదునికి అందరిలోనూ హరియే కనుపించేవాడు. అన్నిటిలో వున్నది హరియే అని దృఢముగా నమ్మిన వానికే అది సాధ్యము. వారి వారి అభీష్టాలు నెరవేరుటతో మానవులు రకరకాల సాధనలను చేస్తారు. ప్రాపంచిక విషయాలలో కడతేరటం యేమంతకష్టం కాదు. శ్రీహరి శరణాగతుఉ వైకుంఠమ ఏ పొందగలరు; భవసాగరాన్ని సునాయాసంగా

తరించగలరు; ముక్తిని కూడా పొందగలరు, ఎందుకంటే వారు పరంజ్యోతియైన శ్రీవేంకటేశ్వరుని భక్తులు కదా! అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

అయ్యో! మతి (నామనస్సు) అన్నిటిపైన వున్నట్లు హరిపై నుండదు. ఏమి దౌర్భాగ్యము!! భక్త ప్రహ్లాదునివలె ఆ శ్రీహరిని కన్నుల యెదుట ప్రత్యక్షం చేసికొనుట అరుదా (అసంభవమా?) ఏమాత్రమూ కాదు.

ఇదివరలో ఒకడు గరుత్మంతుని అర్చించి ఆయన అనుగ్రహంతో ఆగతము (జరుగబోవునది) తెలిసికొని తానే ఘనుడనని విఱ్ఱవీగినాడు. అతడే అట్లయిన, ఆ గరుత్మంతుని అధిపతియైన జలజాక్షుడు శ్రీహరిపాదముల నర్చించువాడు, ఇలలో పరమార్థము నెరుగుట ఒక గొప్ప విషయమా?

మానివోడ (కొయ్యతో చేసిన ఓడ) నెక్కి మహాసముద్రములను దాటి రకరకములైన సంపదలను పొందుటకు అనేక నటనలు చేస్తాడు ఒకడు. వాడికే అటువంటి విశిష్టత కలిగితే ఇక శ్రీనాథుని పాదముల నాశ్రయించినవాడు భవసాగరమును దాటి పుణుడగుట అరుదా (అసంభవమైన విషయమా?) ఏమాత్రమూ కాదు.

ఒకానొకడు దీపమును తన చేత ధరించి తెగని చీకటి (అంతులేని అంధకారమును) అధిగమించి తన కళ్ళతో అన్నీ చూడగలిగి సుఖములననుభవించాడు. అటువంటప్పుడు పరంజ్యోతి అయిన శ్రీవేంకటేశ్వరుని భక్తుడు, ఓపి (ఓపికతో) ముక్తిని పొంది సర్వోన్నతుడవటం అరుదా (అసంభవమా?) ఏమాత్రం కాదు.

సంపుటి: 15 కీర్తన : శంకమ నీవు సాక్షి చక్రమ నీవు సాక్షి
సంఖ్య : 169 పుట : 112 రాగం: బౌళి

బౌళి

49 శంకమ నీవు సాక్షి చక్రమ నీవు సాక్షి
వంకలాడ భుజముల వ్రాసుకొంటి మిమ్మును ॥ పల్లవి॥

నారాయణా యని యిట్టె నరకములు తరించితి
శ్రీరామా అని పొందితి జీవన్ముక్తి
దూరించి గోవిందా యని తోలితి పాపము లెల్ల
ధీరుఁడనై వళుకెల్ల తిద్దుకొంటి నిదిగో ॥శంకమ॥

దామోదరా అని తొల్లి దాటితి దు:ఖము లెల్ల
వామనా అని కర్మములు వంగఁ దొక్కితి
భూమిరమణా యని పుటుగులు గెలిచితి
వేమరు నితరులకు వెరవ నే నింకను ॥శంకమ॥

హరి యచ్చుతా యని ఆపదల నణఁచితి
పురుషోత్తమా యని పుణ్యము లెల్లా మీఱితి
అరుదైనా శ్రీవేంకటేశ యని లోకముల మించితి
తొరలి సంసారపుదూరు చక్కఁబెట్టితి ॥శంకము॥

అవతారిక:

"వంకలాడ" అంటే వంకరలు దిద్దగా అని అర్థం. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో తన భుజములపై వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ముద్రింపజేసికొన్న శంఖ చక్రముద్రలతో "మిమ్మల్ని సాక్షులుగా నాభుజములపై వ్రాయించుకొంటిని" అంటున్నారు. ఎట్లా వ్రాయించుకొన్నారంటే "వంకలాడ" వ్రాయించుకొన్నారట. ఆపైన, విష్ణునామ సంకీర్తన మధురాతి మధురంగా చేస్తున్నారు. ఆశ్రీహరి నామ సంకీర్తన "తొరలి సంసారపు దూరు చక్కబెడుతుందట. కీర్తన పాడినవారికి విష్ణునామ పారాయణ పుణ్యం

దక్కుతుందని విడిగా చెప్పనక్కరలేదు కదా! అన్నట్లు వళుకు – అంటే తగవు అని అర్థం.

భావ వివరణ:

ఓ శంకమా (పాంచజన్య శంఖమా!) నీవే మాకు సాఓఇ. ఓ చక్రమా! (సుదర్శన చక్రమా!) నీవే మాకు సాక్షి. నేను విష్ణువునకు చెందిన వాడనని మిమ్మును (మిమ్మల్ని) నా భుజములపై వంకలాడ (వంకరలు దిద్దగా) వ్రాయించుకొంటి (కాల్చి వాతలవలె ముద్రింపజేయించుకొంటిని). కనుక మీరే నాకు చెఱపలేని సాక్ష్యము.

నేను మా ఆచార్యుల కృప జేత వైష్ణవుడనై ఎట్లా తరించానో చెప్తాను వినండి. నేను "నారాయణా" అని యెలుగెత్తి అనగానే నరకద్వారములను దాటి నాను. శ్రీరామా అని చెప్పగానే జీవన్ముక్తిని పొందాను. దూరించి (ఉద్యుక్తుడనై) గోవిందా గోవిందా అని గొంతెత్తి యని నేను చేసి కొనిన అశేష పాపాలను తోలివేశాను. ఇదివో నేను ఆ విధంగా ధీరుడనై (విద్వాంసుడనై) వళుకెల్లా (మత్సరమునంతా) దిద్దుకొంటి సవరించుకొంటిని.

దామోదరా అని తనివిదీరా పలికి, నా తొల్లిటి (ఇదివరకు నాకున్న) దు:ఖములను తొలగించుకొంటిని. వేమనా అనే విష్ణు నామమును పలికి నేను చేసిన కర్మల వంగదొక్కితి (అణగద్రొక్కితిని). భూరమణా అనే నామము చెప్పి పుటుగులు (జన్మల చక్రవ్యూహమును) గెలిచితిని. నేను ఇక ఇతరములకు (మానవమాత్రులైన అధిపులకు) వేమరు వెరవను (ప్రతిదానికీ భయపడను).

"హరి అచ్యుతా" అనే నామోచ్చరణతో నేను నా ఆపదలనన్నింటినీ అణచివేశాను. పురుషోత్తమా అని పుణ్యముల నెల్లా మీఱితి (అతిశయించితిని). శ్రీహరి నామాలలో అరుదైన నామము శ్రీవేంకటేశ. ఆ నామము నిరంతరం నా నాలికపై నుండగా లోకముల మించితి (సర్వశ్రేష్ముడనైతిని) తొరలి (ఈమారు) సంసారపు దూఱు (ప్రాపంచిక లంపటములను) చక్కబెట్టితి (సరిజేసుకొంటిని). ఇది నా ఘనత కాదు తండ్రీ! నీ అపారమైన కరుణయే కారణము.

సంపుటి: 2 కీర్తన : నీవు జగన్నాథుఁడవు నే నొక జీవుఁడ నింతే
సంఖ్య : 169 పుట : 113 రాగం: భైరవి

భైరవి

50 నీవు జగన్నాథుఁడవు నే నొక జీవుఁడ నింతే
నీవలె ననుభవించ నే నెంతవాఁడను ॥ పల్లవి॥

వైకుంఠ పదమేడ వడిఁగోర నెంతవాఁడ
యీ కడ నీ దాసుఁడనౌ టిది చాలదా
చేకొని నీ సాకారచింత యేడ నే నేడ
పైకొని నీ డాగుమోచి బ్రదికితిఁ జాలదా ॥నీవు॥

సొంపుల నీ యానందసుఖమేడ నే నేడ
పంపు శ్రీవైష్ణవసల్లాపన చాలదా
నింపుల విజ్ఞాన మేడ నేఁ దెలియ నెంతవాఁడ
యింపుగా నీకథ వినుటిదియే చాలదా ॥నీవు॥

కైవల్యమందు నీతో కాణాచి యాడనాకు
శ్రీవేంకటాద్రిమీఁది సేవ చాలదా
యీవల శ్రీవేంకటేశ నీ విచ్చిన విజ్ఞానమున
భావించి నిన్నుఁ బొగడే భాగ్యమే చాలదా ॥నీవు॥

అవతారిక:

"ప్రభూ! నీవు పరమాత్మవు, జగన్నాథుడవు. మరి నేనో? ఒక జీవుడను. ఈ సృష్టిలో సర్వమూ నీదే. నీవలె అన్నీ అనుభవించే హక్కు నాకెక్కడిదయ్యా!" అని వినమ్రులై కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. నీ కైవల్యం పొందగలిగే అర్హత నాకున్నదా స్వామీ? పోనీలేవయ్యా! ఈ తిరుమలో నీసేవాభాగ్యం దక్కితే చాలు నాకు. నీవు నాకిచ్చిన ఈ కొద్దిపాటి విజ్ఞానంతో నిన్నే భావించి నిన్నే కీర్తిస్తూ బ్రతుకుతాను అది చాలునాకు

అంటున్నారు. ఇక మనమైతే, అట్లాంటి కోరిక కోరుకోవాలనే కోరిక కలుగని కొరగాని కొరకరాని కొయ్యను నేను.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు జగన్నాథుడవు. పరమాత్మవు. మరి నేనో, ఒక జీవుడను, నీవు సర్వ భోక్తవు. నీవలె అనుభవించుటకు నేనెంతవాడను ప్రభూ! నీవు వైకుంఠము9నీయగల సమర్థుడవె. కాని నీవు వైకుంఠమెక్కడ నేనెక్కడ? దాన్ని కోరే అర్హత నాకున్నదా? అయితే అయిందిలే స్వామీ! ఇక్కడ నీదాసుడను అనిపించుకొంటే నాకదే పదివేలు. కొంతమంది నిన్ను సాకారంగా ప్రత్యక్షం చేసికొనవలెనని కోరుకుంటారు. కానీ నేనెక్కడ నీసాకార దర్శనమెక్కడ! ఏదో ఈ వైష్ణవదీక్షలో నీతిరునామము, ఒంటిపై శంఖచక్ర చిహ్నములు నాకుచాలునయ్యా! ఇట్లా పైకొని (నా శరీరంపై దాల్చిన) వాటితో బ్రతికితే అది చాలు నాకు.

సొంపైన నీ బ్రహ్మానందానుభవంతో కలిగే సుఖము నాకు సాధ్యమా తండ్రీ! అదెక్కడ నేనెక్కడ? కానీలే- నాకు నీ వైష్ణవ సల్లాపములు (ప్రవచనములు) చాలును. ఇంపైన విజ్ఞానము (భగవంతుని గురించి జ్ఞానము) కోటికొక్కడికి దక్కుతుంది దాన్ని తెలుసుకోవటానికి నేనెంత వాడను ప్రభూ! ఏదో నీకథాశ్రవణంతో నా బ్రతుకును గడిపేస్తాను నాకది చాలును.

కైవల్యము అంటే నీతో వుండిపోయే భాగ్యం పొందటమే. ఆమోక్షస్థానమే చిరకాల వాస స్థానము (కాణాచి) అదెక్కడ, నేనెక్కడ? ఇదిగో నీవేంకటాద్రి మీద నీసేవ నాకుండగా అనవన్నీ నాకెందుకయ్యా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇకపై నీవు ఇచ్చిన ఈ విజ్ఞానంతో భాలించి నిన్ను కీర్తిస్తూ బ్రతికేస్తాను. నాకు ఆ భాగ్యం చాలు. ఇంకేదీ వద్దుగాకవద్దు.

సంపుటి: 2 కీర్తన : వినవమ్మ జానకి నీవిభుడింతేసేసినాడు
సంఖ్య : 462 పుట : 311 రాగం: రామక్రియ

రామక్రియ

51 వినవమ్మ జానకి నీవిభుఁ డింతసేసినాఁడు
యెనసి యీరఘురాముఁ డిఁక నేమి సేసునో ॥ పల్లవి॥

వానరులదండు గూడి వారధి కొండలఁ గట్టె
ఆని లంక చుట్టిరా నదే విడిసె
కోనలఁ ద్రికూటమెక్కె గొడగులన్నియుఁ జెక్కె
యేనెపాన రఘురాముఁ డిఁక నేమిసేసునో ॥విన॥

కోరి ఇంద్రజిత్తుఁ జంపె కుంబకర్ణు నిర్జించె
గోరదానవులనెల్ల కూలఁగుమ్మెను
మారణహోమము నేనె మతకమింతాఁ జెరిచె
యీరసాన రఘురాముఁ డిఁక నేమిసేసునో ॥విన॥

లావున రావణుఁ జంపె లంక విభీషణు కిచ్చె
చేవల నోసీత నిన్నుఁ జెకొనెను
భావించి శ్రీవేంకటాద్రిఁ బట్టము దాఁ గట్టుకొనె
యీవలనావల నాతఁ డిఁక నేమిసేసునో ॥విన॥462

అవతారిక:

ఇటువంటి కీర్తన నభూతో న భవిష్యతి అని గట్టిగా చెప్పగలను. ఎందుకంటే గతంలో "ఓ సీతమ్మ తల్లీ! నను బ్రోవమని చెప్పవే" అని మొరబెట్టిన వారున్నారు. తల్లీ! నీవు సాక్షాత్తు లక్ష్మీదేవివమ్మా! అని కీర్తించినవారున్నారు కాని తానే ఒక రామదూత కపియై శ్రీరాముని శత్రు నిర్మూలనం సీతమ్మకు వర్ణించి వివరించటం యెన్నడూ యెరుగము. అన్నమాచార్యుని కృపచేత ఈ కీర్తన రూపంలో ఆలోటు తీరింది. "ఓ జానకమ్మా! మీ ఆయన యేమి చేశాడో వినవమ్మా! ఈయనగారు తిరుమల కొండలెక్కాడు. ఇకపై యేమిచేస్తాడో తెలియకుండావున్నది"

అంటున్నారు, నభవిష్యతి- అని ఎందుకన్నానంటే ఈ తెలుగు పాండిత్యం వున్న మొనగాడెవడండీ...

భావ వివరణ:

ఓ జానకీదేవీ! ఇది వినవమ్మా! నీ విబుడు (నీభర్తయైన శ్రీరాముడు) ఇంసేసినాడు, ఇన్ని వీరోచితకార్యములను చేసినాడు. ఈ రగురాముడు, ఎనసి (పూని) ఇకన్ యేమిసేసునో!! ఇంకా ఏమిచేస్తాడో యేమో!!

నీ భర్త వానరదండు (కపులసేనతో) కూడి కొండలతో వారధిగట్టె (సేతువును నిర్మించినాడమ్మా!) ఆపైన ఈ లంక చుట్టిరా (చుట్టూతా) అదే తన సైన్యంతో విడిసె (విడిది యేర్పరచుకొనినాడు) అదిగో ఆ లోయలవైపునుంచి చిత్రకూట పర్వతమునెక్కినాడు. ఆయనశక్తిసామర్థాల గురించి చెవులు కొరుక్కున్నవారి గొడుగులన్నిటికీ (గొణుక్కోవటాలకన్నింటికీ) చెక్కె (చెక్కినట్లు సమాధానమిచ్చాడు. ఈ రఘురాముడు ఇకపై యేనెపానటేమిసేసునో!! (దేనికోసం యేమిచేస్తాడో చెప్పలేము తల్లీ!)

కోరి ఇంద్రజిత్తుని జంపె (సీతాపరహరణంలో అతని పాత్రయేమీ లేకపోయినా, వాడు రావణుని ఆత్మజుడు కావున లక్ష్మణునితో చంపించాడు). అనేక వానరులను మూకొమ్మడిగాచంపాడని కుంభకర్ణుని తెగవేసినాడు. ఘోరమైన దానవులను కూలగమ్మె (కూలవేసినాడు). మతకమంతా జెరిచి (రాక్షసమాయను పటాపంచెలము చేసెను). రణరంగంలో మారణహోమం (మృత్యుహోమం) చేశాడు ఈ రఘురాముడు, ఈరసానవున్నాడు (కోపముచేత వివశుడైయున్నాడు. ఇంకాయేమిసేసునో!!

ఆపైన రావణాసురుని లావున (ధైర్యముతో) చంపెను. లంకానగరానికి విభీషణుని పట్టాభిషిక్తునిచేశాడు. ఓ సీతా! ఆయన ఇక నిన్న చేవల చేకొనును (వశమై చేపట్టును). భావించి (ఆశ్రీరాముడే ఈ శ్రీవేంకటేశ్వరునిగా యెంచి) తాను శ్రీవేంకటాద్రిని, పట్టము కట్టుకొన్నాడు (పట్టాభిషిక్తుడయ్యాడు). ఈవల నావల (ఇక్కడ తిరుమలలోను అక్కడ అయోధ్యలోను) అతడు ఇక నేమిసేసునో!! ఎవరు చెప్పగలరు?

సంపుటి: 2 కీర్తన : వారివారి భాగ్యములు వ్రాసివున్నవి నొసళ్ల
సంఖ్య : 270 పుట : 181 రాగం: రామక్రియ

రామక్రియ

52 వారి వారి భాగ్యములు వ్రాసి వున్నవి నొసళ్ల
ధీరతతో నేది మేలో తెలుసుకోరో ॥ పల్లవి॥

అట్టే కొందరు మతము లన్నియు నేకమని
పట్టవర్ధనము నెత్తిఁబెట్టి చూపిరి
జట్టిఁ గొఁదరు జీవులు జంగమే లింగముగాని–
పుట్టుగెల్లా భస్మమని పూసుక చూపిరి ॥వారి॥

కొంద రేమియును లేదు కొట్టఁగొన లయమని
అంది వట్టిలలాటశూన్యము చూపిరి
కందువఁ గొందరు లక్ష్మీకాంతుఁ డంతరాత్మయని
ముందే నామము శ్రీచూర్ణమునుఁ బెట్టి చూపిరి ॥వారి॥

చెలఁగి దిష్ట మిపుడు శ్రీవేంకటేశుఁడు
అలమేలుమంగపతి యై యున్నవాఁడు
యిలవీర నీదాసుల కిట్టిభాగ్య రేఖలు
వలసినవారికెల్లా వ్రాసినాఁ డితఁడు ॥వారి॥270

అవతారిక:

"ఎంత మాత్రమున నెవ్వరు తలచిన అంతమాత్రమె నీవు" అనే అన్నమాచార్యుల వారి కీర్తనలో అన్న విషయాన్నే ఈ కీర్తనలోనూ ప్రస్తావిస్తున్నారు. ఎవరి భాగ్యంయెట్లా వుంటుందో వారి నొసటిపై విధాత వ్రాసి భూమిపైకి పంపిస్తాడని పెద్దవాళ్ళు చెబుతారు. ఎవరికేది మేలో ఏమిచెయ్యాలో ఎవరికివారే ధైర్యంతో ఆలోచించి తెలుసుకోవాలి అని అంటున్నారు శ్రీవేంకటేశుని దాసుల భాగ్యరేఖలు మాత్రం వారికెట్టాకావాలో

అట్లా వ్రాస్తాడట.. ఆవిధాత. ఎందుకని? ఆయన దిష్ట అందుకని. దిష్ట అంటే అదృష్ట ప్రదాత అని చెప్పుకోవచ్చును. ఇది జటిలమైన కీర్తన అని విడిగా చెప్పనక్కరలేదు కదా!

భావ వివరణ:

ఓ ప్రజలారా! వారి భాగ్యములు (ఎవ్వరికి ప్రాప్తించెడి భాగ్యములు) వారి నొసళ్ళ (అవ్వారి నుదుటి భాగములలో) వ్రాసివున్నవి, (విధాత చేత పుట్టుకనాడే వ్రాయబడినవి). ఈ విషయాన్ని ధీరతతో తెలుసుకోరో! (ధైర్యంతో తెలుసుకోండయ్యా!) ఈ ప్రపంచంలో వేర్వేరు మతస్థులు వేర్వేరు నమ్మకాలతోవుంటారు.అ ట్టె (అదేవిధంగా) కొందరు మతములన్నియు ఏకమని (ఒక్కటేనని) పట్టవర్ధనము (నొసటిపై ధరించు ఒకరకమైన బొట్టు) నెత్తిబెట్టి (నుదుట ధరించి) చూపిరి. జట్టి (నిర్ణయించి) కొందరు జీవులు, జంగమే (శివుడే) లింగమ రూపంలో వుంటాడని జీవితాంతంలో పుట్టుకలన్నీ బూడిదయ్యేవేనని నమ్మి తమ శరీరమంతా భస్మము వ్రాసుకొని జీవిస్తారు. అది వారి నమ్మకం మనమెలా కాదనగలము? కొందరు శూన్యవాదులున్నారు. వారు పాపపుణ్యాలు రెండూ లేవంటారు. అసలు భగవంతుడే లేడు అంటారు. కొట్టకొనలయము (చిట్టచివరికి చావు తప్పదు కాబట్టి, మంచివాడు చెడ్డవాడు ఇద్దరూ చావక తప్పదు కనుక, ఏమీ అవసరంలేదని, వట్టి లలాటము (బోసిగావున్న నుదురుతో బొట్టులేకుండా శూన్యముగావున్న నొసలు) చూపిరి. కందువ (సామర్థ్యంగల) కొందరు లక్ష్మీపతియైన శ్రీహరియే అంతరాత్ముడని తమ నొసటిపై ఎచూర్ణము (తిరుచూర్ణము, పంగనామాలుగా ధరించి చూపిరి.

ఇప్పుడు శ్రీవేంకటేశ్వరుడు దిష్టము వలె (అదృష్టప్రదాతగా) చెలగి (అతిశయించగా) సిరులరాణియైన అలమేల్మంగమ్మ పతియైయున్నవాడు. అందుకని 'యిల' (ఈలోకంలో) వీర (వీరే... అంటే... అదేవీ ఆవిడ భర్తా) నీదాసులకు (హరిదాసులకు) ఇట్టి భాగ్యరేఖలు, వారికెల్లా వలసిన విధముగా (వారు కోరిన విదముగా) ఇతడు విధాత రూపంలో వారి భాగ్యం వారి నొసళ్ళపై వ్రాస్తాడు.

సంపుటి: 2 కీర్తన : సదానందము సర్వేశ్వర నీ-
సంఖ్య : 369 పుట : 248 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

53 సదానందము సర్వేశ్వర నీ-
పదారవిందముపై భక్తి ॥ పల్లవి॥

నయనానందము నరులకు సురలకు
జయమగు హరి నీసాకారము
నయమగుశ్రవణానందము వినినను
క్రియగలిగిననీకీర్తనము ॥సదా॥

చెలఁగి యందరికి జిహ్వానందము
పలుమరుఁ గొనునీప్రసాదము
నలుగడ దేహానందము బుధులకు
బలునీపాద ప్రణామములు ॥సదా॥

ధరఁ బరమానందము నీదాస్యము
గరిమల శ్రీవేంకటవిభుఁడా
నరహరి నిత్యానందము నినుఁ దగ-
నరవిరిఁ జేయసమారాధనము ॥సదా॥369

అవతారిక:

ప్రతిజీవీ సంతోషం కోసమే జీవిస్తాడు. సంతోషంకోసమే వెంపర్లాడతాడు. అయితే రేయింబవళ్ళలాగా, సంతోషమూ దు:ఖమూ రెండూ సదా (కలకాలంవుండేవి కావు) వస్తుంటాయి పోతుంటాయి. మరి సదానందము (యెప్పుడూ ఆనందాన్నిచ్చే) దేమిటి? ఆ సర్వేశ్వరుడి పాదారవిందములపై భక్తి అని అంటున్నారు అన్నమాచార్యులవారు. నయనానందము, శ్రవణానందము, జిహ్వానందము, దేమానందము,

పరమానందము, నిత్యానందము- యేమిటేమిటో వివరిస్తున్నారు విని తరించండి. జ్ఞానము అంటే ఇదే సుమా!

భావ వివరణ:

ఓ సర్వేశ్వరా! నా పదారవిందములపై భక్తి (నీపాదపత్మములపై అచంచలమైన భక్తిప్రపత్తి) సదానందము (సర్వకాలసర్వావస్థలయందు ఆనందమునొసగునది).

నరులకు సురులకు నయనానందమయుయేది? (కన్నులకు ఆనందము నొసగునదేమిటి?) శ్రీహరీ! సర్వులకు జయము నొసగే నీసాకార (ఆకారముతో కూడిన) రూపముకంటే నయనానందకరము మరొకటి లేదు. ఇక వినినను (వినుటకు) నయముగ (స్వాంతనము కలిగించే) శ్రవణానందము (చెవులకు ఆనందకరమైనది) యేది? క్రియగలిగిన (పూనిక గలిగిన) నీ నామసంకీర్తనము మాత్రమే ఆ శ్రవణానందము నీయగలదు.

జిహ్వా (నాలుక) కలిగించే ఆనందమువల్ల నేనరులు దేనినైనా భుజించగలుగుతున్నారు. చెలగి (అతిశయించి) అందరికీ అట్టి జిహ్వానందము కలిగించునది) యేదీ? యెన్నోసార్లు స్వీకరించే ఆస్వామి ప్రసాదమే జిహ్వానందకరము. ఇక లుధులకు (బుద్ధిమంతులకు) దేహమునకు ఆనందము కలిగించునదేది? నలుగడ (అనిచోట్లలో) బలమైన నీపాదములకు జేయు ప్రణామములు (సాష్టాంగవందనములే) దేహానందము గరిమల (మహిమగల) శ్రీవేంకటేశ్వరుడా! ధరలో (భూలోకంలో) పరమానందమునొసగునదేది? నీకు చేసే దాస్యమే (భృత్యునిగా జీవించుటే) ఓనరహరీ! నిత్యానందము (ప్రతిరోజూ ఆనందము) నొసగునదేది? తగునట్లు అరవిరి (వినమ్రులై ముకుళిత హస్తములతో) జేయు నీసమారాధనమే నిత్యానందములు.

సంపుటి: 2 కీర్తన : కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
సంఖ్య : 275 పుట : 185 రాగం: సాళంగనాట

సాళంగనాట

54 కౌసల్యానందనరామ కమలాప్తకులరామ
భాసురవరద జయపరిపూర్ణ రామ ॥ పల్లవి॥

మునుప దశరథరాముఁడవై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
వెనుకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటిని ॥కౌస॥

సుప్పనాతి శిక్షించి సొరిది రుషులఁ గాచి
అప్పుడే ఖరదూషణాదులఁ గొట్టి
చొప్పుతో మాయామృగము సోదించి హరియించి
కప్పి హనుమంతు బంటుఁగా నేలుకొంటిని ॥కౌస॥

సొలసి వాలి నడఁచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంక సాధించి
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించీ
చెలఁగితి వయోధ్యలో శ్రీవేంకటేశుఁడా ॥కౌస॥275

అవతారిక:

కౌసల్యానందనుడైన శ్రీరాముని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. సూర్యవంశతిలకుడైన ఈయన శోభాయమానమైన వరములనిస్తాడట. పరిపూర్ణమైన జయమునిస్తాడట. ఇదివరలో చెప్పినట్లే ఇదికీర్తనే కాక రామాయణ పునశ్చరణ కూడా. అన్నమయ్యకు రామకథ ఆదినుంచి చెప్పటమే అలవాటు. ఈ రాముడు అనుమతి పరశురామునిచేగైకొనెనట. అంటే.. దుష్టశిక్షణకు అనుమతిని పొందాడన్నమాట. నాయనా! నా

అవతార లక్ష్యం పరిసమాప్తమయింది, దుష్ట క్షత్రం నశించి ధర్మరక్షణ క్షాత్రానికి తెరలేచింది, ఇక ధర్మరక్షణ భారం నీదే అని అనుమతినిచ్చాడట రామునికి పరశురాముడు.

భావ వివరణ:

కౌసల్యానందనుడవైన (కౌసల్యాదేవికుమారుడవైన) రామా! నీవు కమలాప్తకుల (సూర్యవంశమున జన్మించిన) రామచంద్రుడవు భాసురవరదుడవు (శోభాయమానమైన వరములననుగ్రహించువాడవు). పరిపూర్ణమైన జయమునిచ్చు రామయ్యవు.

మునుపు (ఇదివరలో) నీవు దశరథరాముడవై తమ్ముల మువ్వురితో జన్మించావు. తాటకను సంహరించి విశ్వామిత్రుని జన్నము (యజ్ఞమును) గాచినావు (రక్షించినావు) వెనుకొని (తదనంతరము) శివధనస్సును విరిచి సీతాదేవిని పెండ్లాడినావు. పరశురామునిచే అనుమతిగైకొని దుష్టశిక్షణకు శ్రీకారం చుట్టితివి. అవతారావిష్కరణకు పూనుకొన్నావు.

చుప్పనాతి అని పేరుగాంచిన శూర్పనఖను శిక్షించి స్త్రీయని వదలినావు. సొరిది (ఆక్రమములో) అనేక మంది ఋషులను రక్షించినావు. ఆవెనుక ఖరదూషణాదులను సంహరించితివి. చొప్పుతో (ఆవిధముగా) మాయామృగమును (మాయలేడిని) సోదించి హరించితివి (వెదకి సంహరించితివి. హనుమంతునికప్పి (బ్రాహ్మణునివలె వచ్చిన హనుమంతుని గుర్తించి బంటుగా నేలుకొంటివి.

సొలసి (పరిక్రమించి) వాలిని అడచితివి (సంహరించితివి) సుగ్రీవుని గూడుక (కూడుకొని) జలధిని బంధించి సేతువును నిర్మించి, లంకను జయించితివి. వెలయ (అతిశయించి) రావణాసురుని గెలిచి విభీషణునికి మన్నింపుతో లంకారాజ్యప్రదానము చేసితివి. ఆపై అయోధ్యలో పట్టాభిషిక్తుడవైనావు. ఓ శ్రీవేంకటేశ్వరా! అదయ్య నీరామ గాథ. ఇది విని తరించామయ్యా!

సంపుటి: 2 కీర్తన : కలశాపురముకాడ గాచుకున్నాడు
సంఖ్య : 216 పుట : 145 రాగం: మాళవి

మాళవి

55 కలశాపురముకాడc గాచుకున్నాఁడు
వలసినవరాలిచ్చి వాయునందనుఁడు ॥ పల్లవి॥

మాయాబిలముచొచ్చి మగుడి యంబుధిలోని-
చాయాగ్రహముc జంపి చయ్యన దాఁటి
ఆయెడ లంకిణిc గొట్టి యంతలో జానకిఁగని
వాయువేగానవచ్చిన వాయునందనుఁడు ॥కల॥

కడలిదరినుండిన కపులతోc గూడుకొని
వడదీరఁగా మధువనము చొచ్చి
బడి రామునికి సీతాపరిణామమెల్లాc జెప్పె
వడిగలవాc డితఁడు వాయునందనుఁడు ॥కల॥

రావణాదిరాక్షసుల రామునిచే సాధింపించి
ఆ విభుని సీతc గూర్చి అయోధ్యనుంచె
శ్రీవేంకటేశుc గొల్చి శిష్టరక్షణమునకై
వావిరి నిలుచున్నాఁడు వాయునందనుఁడు ॥కల॥216

అవతారిక:

కలశాపురములో వెలసిన హనుమంతునిపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. వాయుసుతుడైన ఈ హనుమంతుడు తన భక్తులకు కావలసిన వరములనిస్తున్నాడు. ఆయన అందుకోసమే కాచుకొనివున్నాడు అంటున్నారు. ఆ హనుమంతుడు సీతను రామచంద్రుని కలిపి అయోధ్యనుంచే శ్రీవేంకటేశుని గొల్చి శిష్టరక్షణకై వావిరి నిలుచున్నాడట. అంటే 'అధికుడై" నిలుచున్నాడట. పనిలోపనిగా హనుమంతుని ప్రతాపాన్ని వివరించే రామాయణ అంతర్గత కథలను వుటంకిస్తున్నారు.

భావ వివరణ:

ఈ వాయునందనుడైన హనుమంతుడు, కలశాపురము వద్ద కాచుకొని యున్నాడు (నిరీక్షించుచున్నాడు). శ్రీరామ భక్తులకు, తనను నమ్మిన భక్తులకు ఆయన లెక్కకు మించిన వరములను అనుగ్రహించుచున్నాడు.

సీతాన్వేషణ సమయంలో మాయాబిలం (గుహ)లో ప్రవేశించిన వానరులు దిక్కుతోచక అల్లాడుతుంటే, ఆపద్బాంధవుడై ఆదుకొన్నదీ హనుమంతుడే. మగుడి (తదనంతరం) అంబుధి దాటే సమయంలో 'సింహిక' నీడ వలె తననాక్రమించి రామకార్య విఘాతమునకు వొడిగడితే దానిని చంపివేశాడు. లంకలో లంకిణిని ఒక్క గుద్దుతో మట్టి కరిపించాడు. అంతలో జగన్మాత జానకీదేవిని అశోకవనంలో చూచి రామకార్యం నెరవేర్చి వాయువేగాన తిరిగివచ్చి కపివర్యుల ప్రాణాలు నిలబెట్టాడు. ఈ వాయునందనుడు జగజ్జెట్టి.

ఆపైన కడలి దరి నుండిన కపులతో (సముద్రం ఒడ్డున తనకోసం నిరీక్షిస్తున్న వానరులతో) గూడుకొని (కలసి) వడదీరగ (అలసటనుపశమించుటకు) మధువనము ప్రవేశించి నానా అల్లరి చేశాడు. అటు పిమ్మట సత్వరమే రామునికి సీతాదేవి పరిణామము (వర్తమానము) నెల్లా వివరించాడు. ఈ వాయునందనుడు వడిగలవాడు (చాలా వేగము కలవాడు).

ఆ వెనుక జరిగిన రామరావణ యుద్ధంలో ఈయన పాత్ర మరువలేనిది. రావణాది రాక్షసులనందరిని రామునిచేత సాధింపించినవాడు (నెగ్గుటకు దోహదపడినవాడు) ఈయనే. ఆ విభునికి (శ్రీరామచంద్రునకు) సీతను గూర్చి (కలిపి) అయోధ్యలోవుంచి (పున: ప్రతిష్ఠించినాడు). నేడు ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరుడై నిలిచిన తన రాముని గొల్చుచున్నవాడై ఈనాటి ఆవశ్యకతననుసరించి శిష్ట రక్షణకై (సన్మార్గులను సంరక్షించుచూ) ఈ వాయునందనుడు కలశాపురములో వావిరి (అధికుడై) నిలుచునియున్నాడు. ఈ స్వామిని సేవించి తరించండి.

సంపుటి: 2 కీర్తన : సర్వేశ్వరా నీతో సరియెవ్వరు
సంఖ్య : 303 పుట : 203 రాగం: ముఖారి

ముఖారి

56 సర్వేశ్వరా నీతో సరి యెవ్వరు
పూర్వపువారు చెప్పఁగాఁ బూఁచి కొలిచిఏఁగాని ॥ పల్లవి॥

చేరి వేదములు నిన్నుఁ జెప్పఁగా వినుటేకాని
నీరూపము దర్శించేవార లెవ్వరు
ధారుణిలో నీ యవతారాలే చూచుట
ధీరత నీమహిమలు తెలిపేవారెవ్వరు ॥సర్వే॥

భూమివాకరిఁ జూచి నిన్నుఁ బూజలు సేయుటగాని
కామించి నీతో మాటాడే ఘను లెవ్వరు
దీమసాన నీదాసుల ద్రిష్ట మెరుఁగుటగాని
యీమేర నీదైవిక మెరిఁగేనా రెవ్వరు ॥సర్వే॥

వరములు నీవియ్యఁగా వచ్చి సేవించుటగాని
కెరలి నీమూర్తి వెదకేవా రెవ్వరు
హరి శ్రీవేంకటేశా నీకరుణవారౌటగాని
ఆరసి నిన్ను సుద్దులడిగేవా రెవ్వరు ॥సర్వే॥

అవతారిక:

భూమి మీద ఇంతమంది 'దేవుడు' అని కొలిచే వాడిని చూసిందెవరు? పోనీ ఆ దేవుడి మాటలను విన్నదెవరు? పూర్వము వారు చెప్పగా ఔనేమో అనుకోవడమే కాని ఆయన అనుభవం పొందినవాడెవడు? సర్వేశ్వరుడైన ఆయనతో సరియైనవారు లేరు. ఆయననుంచి ఏవో వరాలు ఆశించి సేవించే వారేగాని ఆయనను తెలుసుకోవాలని వెదకేవారేలేరు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఇదికూడా తేలిక అనిపించే అతి

క్లిష్టమైన కీర్తన. ఈ కీర్తన పాడినప్పుడు ఆచార్యులవారి మనోభావాలు సులభగ్రాహ్యం అనిపించుటలేదు. జాగ్రత్తగా పరిశీలిద్దాం.

భావ వివరణ:

ఓ సర్వేశ్వరా! నీతో సరియైన వారలెవ్వరు? పూర్వపువారు (మా పెద్దలు) చెప్పగా ఔనేమో నని పూచి (ప్రయత్నపూర్వకంగా) కొలుస్తున్నాను. కానీ నిన్ను తెలుసుకోలేకున్నాను.

ప్రభూ! వేదము నీగురించి వర్ణించగా వినుటయే కాని నీ రూపమును దర్శించినవారలెవ్వరు? ధారుణి (భూలోకంలో) నీయవతారాలను చూచిన వారు ఆయా యుగాలలో వున్నారేమో గాని ధీరతతో (గాఢమైన నమ్మకంతో) నీ మహిమను తెలిసినవారెవ్వరు?

దేవా! ఈ భూమి మీద వున్న మాతోడి మానవులనుచూచి వారుచేసినట్లే నిన్ను పూజిస్తున్నాను. నిజానికి కావాలని ప్రయత్నించి నీతో మాట్లాడిన మానవమాత్రుడెవడు? అంతటి ఘనులెవ్వరైనా ఉన్నారా? దీమసాన (నేర్పుతో) నీదాసులయొక్క ద్రిష్టము (అదృష్టము) యెంతగొప్పదో తెలుసుకోవటమేకాని, యీమేర (వైపున) నీ దైవికము (దివ్యశక్తిని) యెరిగే వారెవరున్నారు? అనుభవేక వేద్యమైన నీ మహిమ తెలియుటెట్లు సాధ్యము?

దేవా! నీవు కోరిన వరములిస్తావనే ఆశతో దూరభారమునెంచక నీవద్దకు వచ్చి సేవించేవారేగాని, కెరలి (అతిశయించి) నీ మూర్తిని (దివ్యమంగళ రూపాన్ని) వెదకే వారెవ్వరున్నారు? ఓ శ్రీహరీ! ఓ శ్రీవేంకటేశ్వరా! అంతా నీ కరుణ పొందాలనుకొనేవారే కాని, నిన్ను అరసి (నీపై దృష్టి సారించి) నీ సుద్దులు (నీపుణ్యకథలు) అడిగేవారెవ్వరు? (వినాలని తహతహలాడేదెవరు?) హతవిధీ! నేటి పరిస్థితి ఇంకా ఘోరంగా వున్నది తండ్రీ!

సంపుటి: 2 కీర్తన :పేరు నారాయణుడవు బెంబాడిచేతలు నీవి
సంఖ్య : 162 పుట : 109 రాగం: సాళంగనాట

సాళంగనాట

57 పేరు నారాయణుఁడవు బెంబాడిచేఁతలు నీవి
నోరు మూసుకున్నఁ బోదు నున్ననినీసుద్దులు ॥ పల్లవి॥

వేసులు మాకుఁ జెప్పె విన భారతముగాఁగ
మోస నీపాలముచ్చిమి మొదలుగాను
రాసికెక్క శుకుఁడు రవ్వగాఁ బొగడఁజొచ్చె
ఆసలఁ బరకాంతల నంటిననీసుద్దులు ॥పేరు॥

రంతున వాల్మీకి చెప్పె రామాయణముగాను
సంతగాఁ దాటకాదులఁ జంపినదెల్లా
అంతకముందె నారదుఁ డవి దండెమీటి చెప్పె
యింతటా వేఁటాడి జీవహింసలు సేసినది ॥పేరు॥

వేడుక నజుఁడు చెప్పె వేదముగా నీవు దొల్లి
వోడక మీనై కొన్నాళ్ళుండితివంటా
తోడనే సప్తరుషులు తొల్లియునుఁ జెప్పి రదె
యీడనే శ్రీవేంకటాద్రి నిరవైతి వనుచు ॥పేరు॥162

అవతారిక:

నారాయణుడు అంటే నరశరీరమును పొందు భగవంతుడు అని అర్థం. ఈయన పేరు నారాయణుడు కాని ఈయన చేతలు మాత్రం బెంబాడి చేతలు. బెంబేలెత్తిపోయే పనులు చేస్తాడట ఆయన. ఆ నున్నని సుద్దులు నోరుమూసుకుంటే మాయమైపోవు. యుగయుగాలుగా అవి ప్రచారమవుతూనే వుంటాయి. భారతం వ్రాసిన వేసులు (వ్యాసులవారు), భాగవతం చెప్పిన శుకుడు, రామాయణ కావ్యకర్త వాల్మీకి, వాటిని అంతకుముందె గానంచేసి నారదుడు శ్రీహరి లీలలు పొగిడారు. సప్తఋుషులు కూడా తిరుమలలో

ఆయనను సేవిస్తూనేవున్నారుకదా! నీకథలు యెన్నని చెప్పగలము యెంతని చెప్పగలం, అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

ఓదేవదేవా! నీపేరు నారాయణుడు. అంటే నరరూపం ధరించినవాడవు. కాని నీ చేతలు (పనులు) బెంబాడి చేతలు. (బెంబేలెత్తించే పనులు). నున్నని నీ సుద్దులు (మనోహరమైన నీ కథలు) నోరుమూసుకున్నన్ పోదు (ఇంకొకరికి చెప్పనంతమాత్రాన తెలియకుండాపోవు). ఎందుకంటే యుగానికి ఒకడు పుట్టి వాటిని ప్రచారం చేస్తూనే వుంటాడు.

ద్వాపరయుగంలో వేసులు (వేదవ్యాసులవారు) పుట్టి మాకు వినుటకు భారతగాధను చెప్పినారు. నీవు పాలు వెన్న దొంగిలించటం, మోసంతో యుద్ధంలో పాండవులకు సాయం చేయటం మొదలైన కథలన్నీ చదివాం. రాసికెక్క (ప్రసిద్ధుడైన) శుకమహర్షి రవ్వగా (నాణ్యమైన విధమున) ఆసల (వ్యామోహంతో) నీవు పరకాంతలనంటిన సుద్దులు (పరాయిస్త్రీల పొందునాసించితివని కథలు కథలుగా) బొగడ జొచ్చె (కీర్తించాడు). అదే భాగవతమై జగత్ప్రసిద్ధమైనది.

త్రేతాయుగంలో వాల్మీకి మహర్షి సంతగా (వల్లెవేసినట్లు) నీవు రామచంద్రునిగా తాటక మొదలైన రాక్షసులను జంపినదెల్లా రామాయణములో రంతున (పెద్దగా ధ్వనించునట్లు) చెప్పినాడు. (అంతకు ముందే (కృతయుగారంభంలోనే) నారదుడు బ్రహ్మమానసపుత్రుడై అవతరించి దండె మీటి (మహతి అనే తన వీణను మీటుతూ) నీవు వేటాడి జీవహింస (దుష్టసంహారం) చేస్తావని, యింతటా (ఈలోకమంతా) చాటినాడు.

అసలు వేదకాలంలోనే అజుడు (బ్రహ్మ) వేదమువలె నీవు మీనై కొన్నాళ్ళుండితివంటా మత్స్యపురాణంలో నీ చేతలన్నీ వోడక (వదలక) కీర్తించాడు. తోడనే (దానితోపాటే) తొల్లియును (అనాదిగా) సప్తఋుషులు, యీడనే ఈ తిరుమల శిఖరాలమీద, ఈ శ్రీవేంకటాద్రిపై ఇరవైతివని (నెలకొంటివని) అనుచూ అదె (ఆ మాటనే) చెప్పిరి. మరి ఈ నాటికీ మేము తెల్లవారింది మొదలు నీపై పాడుతున్నామంటే... అది వారందరి చలువవల్లనే తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : ఇతని కితడేకాక యితరులు సరియా
సంఖ్య : 405 పుట : 273 రాగం: నాట

నాట

58 ఇతని కితఁడేకాక యితరులు సరియా
మితి లోకా లితనిమేనిలోనేకావా ॥ పల్లవి॥

కమలనాభుని భయంకర కోపముతోడ
రమణ వేరొకరివరంబులు సరియా
తమితోడఁ దల దుంచి తగినవరము లిచ్చె
అమరఁగ నరకాసురాదులకు నితఁడు ॥ఇత॥

కరివరదుని పేరుగలసిన తిట్లతో
పరదేవతలమంత్రపఠనలు సరియా
నిరతి శిశుపాలునినిందకు శిక్షించి
పరలోక మిచ్చినట్టిభావము వినరా ॥ఇత॥

చలిమి శ్రీవేంకటేశు శరణాగతితోడ
బలిమి మించిన బ్రహ్మపట్టము సరియా
నొలిసిన ధ్రువునకు వున్నతలోక మిచ్చె
అలబ్రహ్మలోకమున కదె మీఁ దెఱఁగరా ॥ఇత॥

అవతారిక:

అనుగ్రహించుటలో ఇతనికితడే సాటి. లోకాలన్నీ ఈయనలోనే వున్నాయి కనుక ఇతనికి మరొకరు సరియెట్లగుదురు? అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈయన కోపగించినా అన్యదేవతల అనుగ్రహంకంటే నయమే; ఈయనకు నిందకూడా పరదేవతల మంత్రపఠనకన్నామేలు చేస్తుంది; ఈయన శరణాగతి బ్రహ్మపట్టముకంటే బలమైనది. ఈ నా మాటలు నోటిమూటలు కావు సాక్ష్యంకూడా వున్నది.

నరకాసురుడు, శిశుపాలుడు, ధ్రువుడు... వీళ్ళంతా సాక్షులే అని తన వాదనను వినిపిస్తున్నారు. అన్నమయ్య వైష్ణవ పక్షపాతి అనిపించినా ఆయనవాదన అమోఘం. హరి మురిసెడి కీర్తనములు అమ్మకుచెల్లా!!

భావ వివరణ:

ఓ భక్తులారా! ఇతనికితడే సాటి. ఇతరులు ఈతని సరియౌదురా? పరిమితిలేని లోకములన్నియును ఇతని మేనిలోనివే (దేహంలో వున్నాయి) కావా? (వున్నవి కదా! అని అర్థం)

ఆ పద్మనాభుని భయంకరమైన కోపముతో, అన్యదేవతల వరదానములకంటే మంగళమే జరుగుతుంది. వారి వరములు ఈయన ఆగ్రహంతో సమానం కాదు. ఎందుకంటే నరకాసురుడి విషయంలో యేం జరిగిందో చూడండి. తమితో (ఆసక్తితో) శ్రీకృష్ణుడు నరకుని తల తెగనరికినా ఆయన వరప్రభావముచే నరకచతుర్దశి ఒక పండుగై జత్రసిద్ధమైనది. కాబట్టి ఈ శ్రీహరి అమరిన ఆగ్రహమే గొప్ప మేలు చేస్తుంది.

కరివరదుడు (గజేంద్రరక్షకుడు) అయిన శ్రీహరి పేరుతో జతకలిసిన వారినిందలే మనకు అధికమైన మేలు కలుగజేస్తాయి. పరదేవతల మంత్ర పఠనం హరినింద చేసే పాటి మేలు కూడా చేయదు. నిరతి (విశేషంగా) శిశుపాలుడు శ్రీకృష్ణుని తిట్టీ తిట్టీ చివరికి మేలే పొందాడు కదా! శిశుపాలుని శిరస్సు సుదర్శన చక్రంతో తెగిక్రిందపడ్డా వాడికి హరిద్వార-పాలకపదవీ వైకుంఠ ప్రాప్తి దక్కాయి కదా!

చలిమి (చల్లని) శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో, మించిన (శ్రేష్ఠమైన) బ్రహ్మపట్టము (బ్రహ్మపదవి) కూడా సరిపోదు. ఒలిసిన ధ్రువునకు (తనకు కావలసిన ధ్రువునకు) శ్రీహరి ఉన్నత లోకాలిచ్చాడు. ఎందుకంటే బ్రహ్మలోకముపైనున్న ధ్రువమండలాన్ని స్థిరలోకంగా తన భక్తునికిచ్చాడు ఆ నారాయణుడు. నేటికీ పలువురికి మార్గదర్శకమయ్యాడు ఆ చిన్నారి బాలుడు.

సంపుటి: 2 కీర్తన : విష్ణుడొక్కడే విశ్వాత్మకుడు
సంఖ్య : 345 పుట : 232 రాగం: నాట

నాట

59 విష్ణుఁ డొక్కఁడే విశ్వాత్మకుఁడు
వైష్ణవమే సర్వంబును ॥ పల్లవి॥

పరమేష్ఠి సేయు బ్రహ్మాండసృష్టియు
హరునిలోని సంహారశక్తి
పరగఁగ నింద్రుని పరిపాలనమును
అరిసిచూడ శ్రీహరిమహిమ ॥విష్ణుఁ॥

యిలఁబంచభూతములలో గుణములు
అల నవగ్రహవిహారములు
తలకొను కాలత్రయధర్మంబును
అలరఁగ నారాయణునిమహిమలే ॥విష్ణుఁ॥

అంతటఁ గలమాయావిలాసములు
పొంతఁ బరమపదభోగములు
మంతుకునెక్కి నమరిసమస్తమును
యింతయు శ్రీవేంకటేశుమహిమలే ॥విష్ణుఁ॥

అవతారిక:

ఈ విశ్వమే తన ఆత్మవలె వున్న సర్వేశ్వరుడు విష్ణువు ఒక్కడే. సృష్ఠిలో సమస్తమూ ఆయనచే, ఆయన కొఱకు ఆయనదే అయివున్నది. అందుకనే సర్వమూ వైష్ణవమే అంటున్నారు అన్నమాచార్యులవారు. హరుడు, విరించి, సురపతీ... వారివారి బాధ్యతలను శ్రీహరిమహిమవల్లనే నెరవేరుస్తున్నారు. పంచభూతాలు, నవగ్రహాలు, త్రికాలములూ, నారాయణుని మహిమవల్లనే తమ ధర్మం నెరవేరుస్తున్నాయి. ఆఖరికి

పరమపదప్రాప్తి దక్కాలన్నా తిరుమలేశుని దీవెన వుండాల్సిందే. ఇంతయూ శ్రీవేంకటేశుమహిమ అంటున్నారు.

భావ వివరణ:

అనంతమైన ఈ విశ్వమంతా, అణురూపుడై ఆత్మరూపుడై విలసిల్లుతున్నది విష్ణువు మాత్రమే. స్థావరజంగములన్నింటిలో అనగా కదలికవున్న వాటిల్లోను కదలిక లేనివాటిల్లోనూ కూడా ఆ విశ్వాత్మకుడే. సర్వమూ వైష్ణవమే (విష్ణువునకు సంబంధించినదే).

పరమేష్ఠి (బ్రహ్మదేవుడు) బ్రహ్మాండమున సృష్ఠి వ్యాపారము చేయుచున్నాడు. హరునిలోని సంహారశక్తి చేత జీవకోటి నశించుచున్నది. పరగగా (ఒప్పుగా) ఇంద్రుడు జగత్పరిపాలనా బాధ్యత చేపట్టినాడు. ఆయన క్రింద వివిధ దేవతలు వివిధ శాఖలను నిర్వహింతురు. హరునికి కూడ కాలుడు, యముడు, నవగ్రహములు, భూతపిశాచగణములు ఇత్యాదివి లయకార్యమున సహకరించును. అరసి చూడ (పరికించి చూడగా) ఈ నియమబద్ధపాలనమెల్లా శ్రీహరి మహిమయే అనుననది సుస్పష్టము.

విశ్వరచనా నిర్వహణములలో పంచభూతములదే (భూమి, గాలి, నీరు, కాంతి, ఆకాశము) ప్రధానపాత్ర. ఆ పంచభూతముల గుణములన్నియు నిబద్ధతతోవున్న కారణము విష్ణువే. నవగ్రహముల విహారము (గమనకు) నియంత్రింపజేయుచున్నదీ విష్ణువే. భూత, వర్తమాన భవిష్కాలములను కాలత్రయమందురు. తలకొను (పూనుకొను) ఆ కాలధర్మములను నియంత్రించుచున్నదీ ఈ నారాయణుని దివ్య మహిమయే.

అంతటగల (ఈజగమునందంతా నెలకొన్న) మాయ విష్ణుమాయ. దాని విలాసము (తీరు) తెలియుట యెవరికీ సాధ్యముకాదు. పరమపదభోగము యెవరికి, యెప్పుడు, యెలాదక్కుతుందో, యే పొఒత (యెక్కడైనా) తెలియలేరు. మంతుకునెక్కిన (ప్రసిద్ధికెక్కిన) సమస్తమూ శ్రీవేంకటేశ్వరుని మహిమవల్లనే ఆస్థితిలో వున్నవని తెలుసుకోండి. దాన్ని తెలుసుకోటానికే ఒక జీవితకాలం చాలదు.

సంపుటి: 2 కీర్తన:చూచి మోహించకుందురా సురలైన నరులైన
సంఖ్య : 403 పుట : 272 రాగం: తెలుగు కాంబోది

తెలుఁగు కాంబోది

60 చూచి మోహించకుందురా సురలైన నరులైన
తాచి నీవు ముందరఁ బ్రత్యక్షమైనను ॥ పల్లవి॥

భాగీరథి పుట్టినపాదపద్ములు
భోగపు మరునిజన్మభూమి నీతొడలు
యోగపు నవబ్రహ్మలుండిన నీనాభి
సాగరకన్యకలక్ష్మి సతమైనవురము ॥చూచి॥

అందరి రక్షించేటి అభయహస్తము
కంద నసురలఁజంపే గదాహస్తము
సందడిలోకముల యాజ్ఞాచక్రహస్తము
చెంది ధ్రువు నుతియించఁజేయుశంఖహస్తము ॥చూచి॥

సకలవేదములుండే చక్కనినీమోము
వొకటై తులసిదేవివుండేటిశిరసు
ప్రకటనపు మహిమలఁ బాయనినీరూపము
వెకలిశ్రీవేంకటాద్రివిభుఁడ నీభావము ॥చూచి॥

అవతారిక:

జగన్మోహనుడైన ఈ వేంకటేశ్వరుడే కళ్ళముందు ప్రత్యక్షమైతే మోహించని వాడెవడన్నావుంటాడా? వాడు నరుడాసురుడా అనే తేడానేవుండదు. అందరూ చేష్టలుడిగి అలా చూస్తూనే వుండిపోతారు... నఖశిఖ పర్యంతం, ఇదిగో ఈ భావమునే అన్నమాచార్యులవారు మధురమైన కీర్తనవలె నావిష్కరిస్తున్నారు. "ప్రకటపు మహిమల బాయని నీరూపము వెకలి శ్రీవేంకటాద్రి విభుడ నీ భావము" – అని అంటున్నారు. ఆయన భావము ఆయన రూపంలోనే పాయని మహిమలను ప్రకటిస్తున్నదని అర్థం. భావాలను వివరించటానికి మాటలక్కరలేదు చూపులు చాలు కదా! జాగ్రత్తగా చదవండి మరి.

భావ వివరణ:

ఓ దేవదేవా! తాచి (పూనుకొని) నీవు యెవరికన్నులముందైన ప్రత్యక్షమైతే, నిన్ను చూచి సురులైనా, నరులైన మోహించి తీరుతారు. జగన్మోహనుడవైన నిన్ను చూచి మోహించకుండుట యెట్లు సాధ్యము?

నిన్ను ఆపాదమస్తకం వొకసారి చూచే భాగ్యం దక్కితే ఆ జన్మ తరించదా? అదిగో నీ పాదపద్మాలు... పవిత్రమైన భాగీరథి (గంగాదేవి) పుట్టినిల్లు అదేకదా! అవిగో నీతొడలు.. జీవులకు భోగాసక్తిని కలిగించే మరునికి (మన్మధునికి) జన్మభూమి నీవూరువులే. అదిగో నీ నాభి, చతుర్ముఖుడే కాక యోగమున నిష్ణాతులైన నవబ్రహ్మలకు (భృగువు, పులస్త్యుడు, పులహుడు, అంగీరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వశిష్ఠుడు, మరీచి – తొమ్మిదిమందిని నవబ్రహ్మలు అంటారు. వీరినుంచి రకరకాల జీవులు సృష్టించబడ్డాయి). ఇక జగద్విఖ్యాతమైన సాగరపుత్రిక లక్ష్మికి సతమైన (శాశ్వతమైన స్థానము నీ వురము (వక్షస్థలము).

ఇక నేడు మా దగ్గరకు వస్తే... అదిగో ఆ నడుముపైనున్న అభయహస్తము నీ శరణాగతులకు భయపడకండి మీకు నేనున్నాను అని అభయమిస్తున్నది. అందరినీ రక్షిస్తున్నది. అసురులను కందునట్లు (తపించునట్లు) చేయు నీగద (కౌమోదకము) నీహస్తములలో కానవచ్చుచున్నది. నీ ఆజ్ఞాచక్రము, నీ ఆజ్ఞపైలోకములను సందడించగల (తత్తరబెట్టగల) నైపుణ్యమున్న దివ్యాయుధము. అది అదిగో నీ కుడిచేతిలోనున్నది. ధ్రువునికి నీ దారి చూపుటకు నినదించిన పాంచజన్య శంఖము, అదే నీ యెడమ చేతనున్నది.

ప్రభూ! సకల వేదములకు నెలవైన నీ ముద్దులొలుకు చక్కని వదనము అదిగో. తులసీదేవికి ఒకేఒక స్థిరనివాసమైన నీ శిరస్సు అదే కన్నులకు విందుజేయుచున్నది. ఆవిధంగా అనేక మహిమలను ప్రకటించుచున్న పాయని (విడువలేని) నీ దివ్యమంగళ విగ్రహము ఏ భావముతో చూస్తే ఆ భావముతో కనబడుతున్నది. వెకలి శ్రీవేంకటేశా! (ఆసక్తిని కలిగించు ఓ ఏడుకొండలవాడా!) శరణాగతులకు చల్లనిచూపులే, కుత్సితులకు క్రూరంగా కనుపిస్తాయి. అదే అత్యద్భుతం తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : ఇహమెట్టో పరమెట్టో ఇక నాకు
సంఖ్య : 461 పుట : 311 రాగం: సాళంగనాట

సాళంగనాట

61 ఇహమెట్టో పరమబెట్టో ఇఁక నాకు
సహజమై హరియే శరణము నాకు ॥ పల్లవి॥

చిత్తమిది యొకటే చింత వేనేలసంఖ్య
పొత్తుల హరిఁదలఁచఁ బొద్దులేదు
జొత్తుల కన్నులు రెండు చూపులైతే ననంతాలు
తత్తరించి హరిరూపు దగ్గరి చూడలేదు ॥ఇహ॥

చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష
యీతల హరిఁ బూజించ నిచ్చ లేదు
జాతి నాలిక వొకటే చవులు కోటానఁగోటి
రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు ॥ఇహ॥

వీను లివి రెండే వినికి కొలఁదిలేదు
పూని హరిభక్తి విన బుద్ధి లేదు
యీనటన శ్రీవేంకటేశుఁ డిటు చూచినను
తానే యేలె నిఁకఁ దడఁబాటు లేదు ॥ఇహ॥461

అవతారిక:

నాకు ఇహలోకంతోకాని, పరలోకంతోకాని పనిలేదయ్యా! నా సహజగుణం ఒక్కటే. అది హరియే దిక్కని శరణాగతితో జీవితాంతం గడుపుట, అంటున్నారు అన్నమాచార్యులవారు. మానవజీవితం అన్నాక... మనస్సులో చింతలు తప్పవు, అనవసరమైన వాటినుంచి చూపులను మరల్చలేము, చేతులతో ఏవేవో వ్యర్థమైన పనులు చేస్తూనేవుంటాము, దేన్నిపడితే దాన్ని లొట్టలేసుకొని తింటాననే దౌర్భాగ్యపు నా నాలుకవున్నది,

ఉన్నవి రెండే అయినా అంతేలేకుండా అన్నీ వినే చెవులున్నాయి. ఇవన్నీ భ్రష్ట పట్టిస్తూనేవున్నాయి. హరిభక్తి మీద బుద్ధినిలవటం లేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! శరణు మహాప్రభో శరణు... అంటున్నారు.

భావ వివరణ:

ఓ మానవులారా! ఇక నాకు ఇహమెట్టో (ఇహలోకంలో ఏమవుతుందో) పరమెట్టో (ఊర్ధ్వలోకాలలో ఏమవుతుందో) పనిలేదు. నాకు సహజమైన (సహజసిద్ధంగా నిజాయితీగల) శరణాగతి హరియే (శ్రీహరి మాత్రమే).

నాది యెంత విచిత్రమైన పరిస్థితి అంటే... నాకున్న చిత్తము (మనస్సు) ఒక్కటే కాని దానికున్న చింతలు మాత్రం వేవేలు (వేలసంఖ్యలో వున్నాయి). నేను పెట్టుకొన్న పొత్తులతో (సంగత్వంతో) హరిని తలచుటకు పొద్దులేదు (తీరికేలేదు), జొత్తులకన్నులు (ఎట్టబారిన కళ్ళు) రెండే, కాని అవి చూచే చూపులకు అనవసరమైన వ్యాపకాలు మాత్రం అనంతం. కాని తత్తరించి (ఆరాటపడి) హరిని దగ్గరనుంచి చూడాలని మాత్రం వాటికుండదు.

నా ఈ చేతులు చూశారా! నాకున్నవి రెండే చేతులు. కాని ఇవి చేసే చేష్టలున్నాయే, అవి లక్షోపలక్ష (అనేక లక్షలు). కాని ఈతల (ఇటుచూస్తే) శ్రీహరిని పూజించాలంటేమాత్రం ఈ చేతులకి ఇచ్చలేదు (కోరిక పుట్టదు). ఇక, జాతి నాలిక (అతిసామాన్య ఔన్నత్యంగల నాలిక) నాకూ ఒక్కటే వున్నది. కాని దానికి కావలసిన చవులు (రుచులు) మాత్రం కోటానుకోట్లు. కాని రీతి (విధాయకంగా) హరినామాన్ని వుచ్చరించటానికి (అనుటకు) వేళలేదు (సమయం దొరకడంలేదు).

వీనులివి రెండే (నాకున్న చెవులు రెండు మాత్రమే). కాని ఇవి వినాలనుకొనే మాటలకి అంతుపొంతులేదు. వాటికి పూనికతో హరిభక్తి గురించి వినండి అంటే వాటికి బుద్ధిలేదు. ఇట్లాంటి నటన (నడవడితో) వున్న నన్ను శ్రీవేంకటేశుడు, ఇటుచూచి, తానే పోనీలే వీడు అర్భకుడు అని జాలిపడి యేలె నన్ను (స్వీకరించి పాలించాడు). అమ్మయ్య! ఇక తడబాటు (తత్తరబాటు) లేదు. ఆయన రక్షణలో బ్రతికేస్తున్నాను. భయం వదిలేశాను.

సంపుటి: 2 కీర్తన : ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను
సంఖ్య : 463 పుట : 312 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

62 ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను
కొంత నాకుఁ తదెలుపరో గురువులాల ॥ పల్లవి॥

తనువూ హరియే తలఁపూ హరియే
వినికి మనికియును విష్ణుడే
కనుఁగొనుచూపులు కమలనాభుఁడే
యెనసి జీవునిశక్తి యేడనేడ నున్నదో ॥ఇంత॥

లోకమెల్ల మాధవుఁడే లోనెల్లఁ గేశవుఁడే
వాకును కర్మము శ్రీవైకుంఠుఁడే
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుఁడే
యీకడ నే ననువాఁడ నేడ నుండువాఁడనో ॥ఇంత॥

వెనకను కృష్ణుఁడే వెస ముం దచ్చుతుఁడే
కొనమొదలు నడుము గోవిందుఁడే
యెనయఁగ శ్రీవేంకటేశుమయ మింతాను
అనుగు నాస్వతంత్ర మది యేడనున్నదో ॥ఇంత॥463

అవతారిక:

"అంతయు నీవేహరి పుండరీకాక్ష" అని అన్నమాచార్యులవారు హరి శరణాగతి తెలిపారు. ఇప్పుడీ కీర్తనలోనూ "ఇంతటా హరినే (శ్రీహరియే)... కాని (అంతేకాని) నన్ను యెందుననుగాన" అంటున్నారు. "గురుతుల్యులైన పెద్దలారా! ఇప్పుడు కొంత నాకు దెలుపరో (నాక్కొంచెం వివరంగా చెప్పండయ్యా!)" అంటున్నారు. పుట్టిన దేహానికి పెరుగుట తరుగుట మరణించుట యే శక్తివలన జరుగుతున్నది? ఆ శక్తి యెక్కడుంది? "నేను" అని పిలుచుకుంటున్నవాడు యెక్కడవున్నాడు?

మొదలు, నడుము, కొన - అన్నీ గోవిందుడే. వెనుకా వాడే, ముందునా వాడే అచ్చుతుడు. ఇంతాను (ఇదంతా) శ్రీవేంకటేశుని మయము. ఇక నా స్వతంత్రం యెక్కడుందయ్యా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ గురువులాల! (గురు పుంగవులారా!) కొంత నాకు దెలుపరో (నాకు కొంచెము వివరించండయ్యా!) ఇంతటా హరినే (ఈ సృష్టిలోని ఇదంతా శ్రీహరియే వున్నాడు). కాని (అంతేకాని) నన్ను యెందునను గానను.

తనువు పుట్టినదాది పెరిగి, ముసలిదై నశిస్తున్నది. దీంట్లో శ్రీహరి వుండకపోతే అది సాధ్యమా? కనుక తనువు హరియే. ఒక క్షణంలో లెక్కించలేనన్ని ఆలోచనలలో హరిలేడనగలమా? కనుక తలమపులోనూ హరియే. వినికి (శ్రవణశక్తి), మనికి (జీవనాధారమూ) విష్ణువే. కనుగొనుచూపులలో కూడా కమలనాభుడైన హరివుండబట్టే అంతగొప్ప దృష్టిజ్ఞానం కలుగుతున్నది. ఎనసి (వ్యాపించు స్వభావముగల) జీవుని శక్తి ఏయేరూపాలలో వుంటుందో యెవరికి తెలుసు?

ఈలోకమంతా మాధవుడే. లోనెల్లా (నాలో అంతా) మాధవుడే, వాకును కర్మము (చేయించిన కర్మయు) వైకుంఠుడే (విష్ణువే). చేకొని (నిర్వహించి) మా చైతన్యము (చేతనాశక్తి) అంతా శ్రీనారాయణ మూర్తియే. ఈకడ (ఇదిట్లయిన) 'నేను' అనేవాడు నాలో యెక్కడున్నాడో కదా! ఎందుకంటే చేతనలేని సుషుప్తి (గాఢనిద్ర)లో నాగురించిన జ్ఞానమే నాకులేదే. మరి అప్పుడు ఆ 'నేను' ఏడీ. ఎవరన్నా తట్టి లేపగానే, నన్నెందుకు లేపావు అంటున్నానే... ఎవడా 'నేను'?

నా వెనుకనున్నదీ కృష్ణుడే. ముందరవున్నదీ కేశవుడే. నామొదలు, మధ్య, తుది గోవిందుడే. ఆ విధంగా నన్నంతా ఆవరించి అచ్యుతుడే అయి వున్నాడు అతిశయించగా, ఇదంతా శ్రీవేంకటేశుని మయమే. ఇటువంటి పరిస్థితుల్లో నేనేం చేసినా, నేనేం ఆలోచించినా, నేనేం మాట్లాడినా నేను కర్తనా? కానే కాదు. నా అనుగు స్వతంత్రము (నాకు ప్రియమైన స్వేచ్ఛ) యేదీ? లేనే లేదు.

సంపుటి: 3 కీర్తన : మా దురితములు వాపి మమ్ము గాచు టరుదా
సంఖ్య : 434 పుట : 292 రాగం: బౌళి

బౌళి

63 మా దురితములు వాపి మమ్ము గాచు టరుదా
శ్రీదేవిరమణుడ శ్రీ వేంకటేశ ॥ పల్లవి॥

అంబరీషు పైకొన్న ఆపదలన్నియు బాపి
వెంబడి గాచే నీచే పెనుచక్రము
అంబరాననున్న ధ్రువు నజ్ఞానమెల్ల బాపి
పంబి నీచేతనుండిన పాంచజన్యము ॥మా దురిత॥

పక్కన జరాసంధు బలమెల్ల నుగ్గాడి
నిక్కము మధురనిల్పే నీచే గద
తొక్కి హిరణ్యకశిపు దునిమి ప్రహ్లాదు గాచే
నిక్కి నిక్కి మెరిసేటి నీ ఖడకగము ॥మా దురిత॥

వెడ రావణుని జంపి విభీషణుని గాచే
చిడుముడి పడక నీచే శార్ఙము
యెడమీక శ్రీ వేంకటేశ నేడు నన్ను గాచె
బడిబడి నీ నామపఠన నేడిదిగో ॥మా దురిత॥434

అవతారిక:

ఓ శ్రీదేవివల్లభా! శ్రీవేంకటేశ్వరా! నీకు అన్ని ఆయుధాలు వున్నాయి కదా! ప్రభూ! మా పాపములను బద్దలుకొట్టి మమ్మల్ని కాపాడవయ్యా! అంటున్నారు అన్నమాచార్యులవారు. శ్రీహరి సుదర్శన చక్రము, పాంచజన్య శంఖమూ, కౌమోదకి గద నందకము అనే ఖడ్గము, శార్ఙము అనే ధనస్సు యెన్నెన్నో ఘనకార్యాలు చేశాయి ఇదివరలో. ఇప్పుడు ఈ కలియుగంలో మా పాపాలే మా పాలిటి రాక్షసులు. వీళ్ళని నిర్మూలించటానికి నీ ఆయుధాలతో పనిలేదు, నీ నామపఠనం చాలు. అదే బడిబడి (దృఢమైన) దై మమ్మల్ని రక్షిస్తుంది అంటున్నారు. పంబి అంటే అతిశయించి అని అర్థం.

భావ వివరణ:

శ్రీదేవీ వల్లభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! మా దురితములు (పాపములు) వాపి (నిర్మూలించి) మమ్మున్ కాచుట (రక్షించుట) అరుదా? (అంత అపూర్వమైన విషయమా తండ్రీ!)

ఇదిగో నీచే (నీచేతిలోనున్న) ఈ పెనుచక్రము (గొప్ప సుదర్శన చక్రము) నీ భక్తుడు అంబరీష మహారాజుపై ఆగ్రహించిన దుర్వాసమునికి బుద్ధిచెప్పి, పైకొన్న ఆపదలను బాపి వెంటనే రక్షించింది కదా! మరి, నీ వామహస్తముననున్న శంఖము కనిపిస్తున్నదే... దానిపేరు పాంచజన్యము. దానిధ్వని పామరుల అజ్ఞానం మాన్పి నీవైపు త్రోవచూపిస్తుంది. అదిగో అంబరాన (ఆకాశంలో) ధ్రువతారయై కాంతులు జిమ్ముతున్న నీ బాలభక్తుడు ధ్రువుని అజ్ఞానం తొలగించి, నీచేత పంబి (అతిశయించి) వున్నది.

అదిగో నీచేతిలోనున్న "గద" దానిపేరు కౌమోదకము. అది నీ శత్రువులను దంచి నుగ్గాడుతుంది (తుత్తునియలు చేస్తుంది). ఆనాడు నీపక్కలో బల్లెమువలె మాటిమాటికి మధురపై దండెత్తి నీకు చీకాకు కలిగించుచున్న కంసుని మామగారు... జరాసంధుని అనేకసార్లు బలహీనుని చేసిన పిమ్మట నీచేతిలో నిక్కము (స్ఫుటంగా) మెరయుచున్నది. అదిగో నీచేతిలో నిక్కి నిక్కి (తొంగిచూస్తూ) మెరిసే ఖడకగము (ఖడ్గము). దానిపేరు నందకము. ఆనాడు నీవు నృసింహుడవై హిరణ్యకశిపుని చీల్చి సంహరించి ప్రహ్లాదుని కాచినప్పుడు వాని అనుచరులు మూకుమ్మడిగా నీపై బడితే నీనందకం వారిని చీల్చి చెండాడినది. నేడు నీ చేతిలో మెరుస్తున్నది.

అదిగో సమీపమున నీచేత మెరయు నీ ధనస్సు. దానిపేరు శార్ఙము (సారంగము) అదే త్రేతాయుగంలో నీవు శ్రీరామచంద్రమూర్తివైనప్పుడు వెద (వేదించు) రావణాసురుని నిర్జించి నీ భక్తుడు విభీషణుని రక్షించి, చిడుముడి పడక (కలతపడకుండా) చేసినది. ఓ శ్రీవేంకటేశ్వరా! నేడు కలియుగంలో ఇదిగో, యెడమీక (విశ్రాంతికూడా తీసికొనకుండా) నన్ను (నాబోటి ఆర్తులను...) బడిబడి (దృఢముగా) కాపాడుతున్న గొప్ప ఆయుధం. దానిపేరు "ఓం నమో వేంకటేశాయ" – ఆ నామపఠనమే నన్ను అనుక్షణం రక్షిస్తున్నది.

సంపుటి: 2 కీర్తన : ఎవ్వరి భాగ్యంబెట్టున్నదో
సంఖ్య : 43 పుట : 29 రాగం: భైరవి

భైరవి

64 ఎవ్వరిభాగ్యం బెట్టున్నదో
దవ్వు చేరువకు తానే గురుతు ॥ పల్లవి॥

పరమమంగళము భగవన్నామము
సురులకు నరులకు శుభకరము
యిరవుగ నెఱిగిన యెదుటనె ఉన్నది
వరుసల మఱచిన వారికి మాయ ॥ఎవ్వరి॥

వేదాంత సారము విష్ణుభక్తియిది
ఆదిమునులమత మయినది
సాధించువారికి సర్వసాధనము
కాదని తొలగినకడుశూన్యంబు ॥ఎవ్వరి॥

చేతి నిధానము శ్రీ వేంకటపతి
యేతల జూచిన నిందరికి
నీతియు నిదియే నిజసేవకులకు
పాతకులకు నది భవసాగరము ॥ఎవ్వరి॥

అవతారిక:

ఎవరి అదృష్టం యెలావుంటుందో యెవరు చెప్పగలరు? అని పాడుతున్న అన్నమాచార్యులవారిని ఆలకించండి. "దవ్వు చేరువకు తానే గురుతు" అంటే, యెవ్వడు ఆయనకు దూరమైనవాడో, యెవరు దగ్గరవాడో తానే తెలిసినవాడు. ఇంకెవరికీ తెలియదు అని అర్థం. ఆనాడు శిశుపాలుడి తల నరికాడు కాని వాడు ఆయన నమ్మిన ద్వారపాలకుడు. "బావా! యెప్పుడు వచ్చితీవు" అని ధుర్యోధనుణ్ణి ఆప్యాయంగా పలుకరిస్తాడు. కాని తొడలు విరగకొట్టించి

చంపించాడు. మరి మనబోటి వారేం చేయాలి? సత్ప్రవర్తనతో, శరణాగతితో, స్థిరభక్తితో, ఆ ఏడుకొండలవాడిని సేవించడం. అట్లా చేయనివారి గతి యేమిటి? భవసాగరంలో కొట్టుమిట్టాడటమే.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఎవ్వరి భాగ్యం (అదృష్టము) యెట్లా వుంటుందో, యెవ్వరు చెప్పగలరు? "దవ్వు చేరువకు తానే గురుతు" (ఆ సర్వేశ్వరునకు ఎవ్వరు దూరమో? ఎవ్వరు దగ్గరవారో? ఎవరు చెప్పగలరు?)

భగవన్నామసంకీర్తనము పరమమంగళకరమైనది. అది నరులకే కాదు సురులకు (దేవతలకు) కూడా శుభప్రదమైనది. ఇరవుతో నెరిగిన (సమూలంగా తెలిసికొంటే), అది యెదుటనే వున్నది. అంటే దాని ఫలితం ప్రత్యక్షంగా కనబడుతుంటుంది. వరుసల మరచిన (దేవుడెవరు జీవుడెవరు అనే క్రమము మరచినచో) వారికి మాయ (వారు మాయకు లోనై తామే అధికులమని హిరణ్యకశిపునివంటి భ్రష్ఠులైపోతారు).

వేదము విష్ణువును కీర్తిస్తుంటే... వేదాంతము యొక్క సారము విష్ణు భక్తిని ప్రతిపాదిస్తున్నది. ఆదికాలమునాటి మునులయొక్క మతము కూడా విష్ణుభక్తియే. సాధనతో విష్ణుభక్తిని పెంపొందించుకొంటే వారికి సర్వమూ సాధ్యమవుతాయి. విష్ణుని కాదని తొలగిన (దుర్యోధనుడు తనకి కృష్ణుడు వద్దు, కాని కృష్ణుని యాదవ సేన కావాలని కోరుకున్నాడు) కడు శూన్యము (ఏదీ దక్కదు) మిగులుతుంది.

శ్రీవేంకటేశ్వరుడు చేతిలోవున్న నిధానము (నిధివంటివాడు.) ఏతలజూచిన (ఏవిధంగా చూచినా) ఇందరికి (ఈ జీవకోటికి) నీతియు (ధర్మవంతమైనది) ఆ దేవదేవుని శరణాగతియే. నిజసేవకులకు (అసలైన హరిదాసులకు) ఇదియే దిక్కు. మరి పాతకులకు (పాపాత్ములకు) అది భవసాగరమున (సంసార సాగరంలో) మునక. ఇంతవరకు అందులో మునిగినవాడు తేలలేదు. తేలడు.

సంపుటి: 21 కీర్తన : అంగనకు విరహమే సింగారమాయ
సంఖ్య : 415 పుట : 277 రాగం: చారుకేశి

చారుకేశి

65 అంగనకు విరహమే సింగారమాయ
చెంగట నీవేయిది చిత్తగించవయ్యా ॥ పల్లవి॥

కలికి నిన్ను తలచి గక్కున లోలో కరగి
జలజల చెమరించి జలకమాడే
బలు తమకాన నీకు పక్కన నెదురువచ్చి
నిలువున కొప్పు వీడి నీలి చీర గప్పెను. ॥అంగన॥

సుదతి నిన్ను చూచి సోయగపు సిగ్గులను
పొదలి చెక్కుల దాకా పూసె గంధము
మదన మంత్రములైన మాటల మర్మము సోకి
ముదురు పులకలను ముత్యాలు గట్టెను. ॥అంగన॥

గక్కున కాగిట నిన్ను కలసి ఈ మానిని
చొక్కి చంద్రాభరణపు సొమ్ములు వెట్టే
అక్కున శ్రీ వేంకటేశ అలిమేలుమంగ నీకు
దక్కి సరసములను తలబాలు వోసెను. ॥అంగన॥

అవతారిక:

నీ అంగన (అలిమేల్మంగ)కు విరహతాపమే గొప్ప సింగారమయ్యిందయ్యా శ్రీనివాసా! ఆమెను సమీపించి నీవే యిది గమనించవయ్యా! అని నచ్చచెబుతున్నారు అన్నమాచార్యులవారు. అమలిన శృంగారంతో జగతికి ఆదిదంపతులను కీర్తించటం మధురభక్తి క్రింద పెద్దలు తార్కాణించారు. వారు యౌవన ప్రాంగణంలోని ప్రేయసీ ప్రియులు కాదు, శృంగార సామ్రాజ్యాన్ని యేలే సామ్రాట్టు, సామ్రాజ్ఞి.

అమ్మవారికి ముదురు పులకల ముత్యాల సరాలు పేర్చిన పదకవితాపితామహునికి జోహారు అనకుండా యెలవుండగలము చెప్పండి. శృంగారాన్ని గోప్యత కొంతకప్పాలనే నా ఉద్దేశ్యము కూడా.

భావ వివరణ:

ఆహా! ఈ అంగనకు (యువతికి) తను పొందే విరహమే సింగారమై (గొప్ప అలంకరణ వలె) భాసించుచున్నది. ఓ ప్రభూ! చెంగట (ఆమెను చేరి) నీకు నీవే ఇది చిత్తగించవయ్యా (అర్థం చేసికొనుమయ్యా!)

ఈ కలికి (యువతి) లోలో నిన్ను దలచి గక్కున (వెంటనే) కరగి (పరవశించి) జలజల చెమటతో జలకమాడినట్లయినది. నీకు యెదురువచ్చినప్పుడు బలవత్తరమైన తమకాన, నిలువున కొప్పు (నిట్టనిలువుగానున్న సిగకొప్పు) ముడివీడి, నీలిచీరె గప్పెను (నల్లని వస్త్రము వంటికి కప్పినట్లుండెను).

ఈ సుదతి (యువతి) నిన్ను చూచినదే తడవుగా ఎరుపెక్కిన చెక్కిళ్ళను తెలియకుండా దట్టముగా గంధమును పూసినది. మదనమంత్రములవంటి నీ నర్మగర్భమైన మాటల భావము భామ మనస్సును తాకి శరీరము పులకలుదేరినది ఆ పులకల విస్తరింపు ముత్యాల వానవలె దట్టముగా నాక్రమించెను.

అంతలో నీవా మానినిని కౌగిట జేర్చితివి. అలసిన ఆమె నీ మెడలోని చంద్రహారమువలె భాసించినది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ దేవి అలమేలుమంగ ఆపై నీ అక్కున దక్కి (సందిట జిక్కి) తన సరస సల్లాపములను తలంబ్రాలు పోసి నిన్ను మురిపించి తానునూ మురిసినది.

ఓ జగజ్జననీ జనకులారా! మిమ్మట్లు భావించగల ఆచార్యులవారిదే భాగ్యము. వారి కృపవలన మేమూ ధన్యులమైతిమి కదా!

సంపుటి: 1 కీర్తన : మలసీ చూడరో మగ సింహము
సంఖ్య : 13 పుట : 9 రాగం: హిందోళ

హిందోళ

66 మలసీ చూడరో మగ సింహము
అలవి మీరిన మాయల సింహము ॥ పల్లవి॥

అదివో చూడరో ఆదిమపురుషుని
పెదయౌభళము మీది పెనుసింహము
వెదకి బ్రహ్మాదులు వేదాంత తతులు
కదిసి కానగలేని ఘనసింహము ॥లలల॥

మెచ్చిమెచ్చి చూడరో మితిమీరినయట్టి
చిచ్చురకంటితోడి జిగి సింహము
తచ్చిన వారధిలోన తరుణి కౌగిట జేర్చి
నచ్చిన గోళ్ళ శ్రీనరసింహము ॥లలల॥

బింకమున చూడరో పిరితియ్యక నేడు
అంకపు దనుజ సంహార సింహము
వేంకటనగముపై వేదాచలముపై
కింక లేక వడి పెరిగిన సింహము ॥లలల॥

అవతారిక:

మలసి చూడరో (ఉద్యమించి చూడండయ్యా!) అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎవరిని చూడాలి? ఈ మగసింహమును. అది మామూలు మగ సింగము కూడా కాదు అలవి మాలిన మాయల సింగమట. అహోబల నృసింహునిపై చెప్పిన ఈ కీర్తనలో యెన్నో తెలియని విశేషాలున్నాయి. జాగ్రత్తగా చదివి ఆకలనం చేసికొనండి. చిచ్చురకంటితో అంటే అగ్నిని కురిపిస్తున్న కన్నులతో, జిగి సింహము

మెరిసిపోతున్న సింహమట. వేంకటగిరి (తిరుమల) లోనూ వేదాచలంలో (అహోబలం) లోనూ వున్నదొక్కరేనట. ఈయన, కింక లేక (కోపమును విడనాడి) వడి పెరిగిన సింహమట. అంటే యేమిటో!

భావ వివరణ:

ఓ భక్తులారా! ఈ మగసింహము (మొండెము మగవాడు, తల సింహపుది అయిన నరసింహుడు) కనువిందు చేయుచున్నాడు. ఈయనను చూడరో (చూడండయ్యా!) ఈయన అలవిమీరిన (అశక్యమైన) మాయల సింహము (లీలలు కలిగిన నరసింహుడు).

అదిగో ఈ ఆదిపురుషుని చూడండయ్యా! ఈయనే నారాయణుడు, ఈయన ఇప్పుడు పెదయౌబళమున (అహోబలమునందు) పెనుసింహము (పెద్ద నరసింహుని) వలెనున్నాడు. బ్రహ్మాది దేవతలుగాని వేదాంత తతులు (వేదవేదాంగములు) గాని, వెదకి (ఆయనకోసం గాలించినా) కదిసి కానలేని (సరిగ్గా కనుగొనలేకపోయిన) నరసింహము.

ఈ జిగిసింహము (కాంతులు వెదజల్లు నృసింహుడు) చిచ్చర కంటితో (అగ్నిశిఖలు వెదజల్లు ఫాలనేత్రముతో వుజ్వలముగా ప్రకాశించుచుండగా మితిమీరియున్నాడు (అతిశయించినాడు). మెచ్చి మెచ్చి (బాగుగా కీర్తించుచూ) చూడరో (ఈ స్వామి దర్శనం చేసికోండి). తచ్చిన (కిక్కిరిసియున్న) వారధిలోన (నది రెండు ఒడ్డులను కలుపు వంతెనలో) నచ్చిన తరుణిని (తన హృదయేశ్వరి అయిన శ్రీలక్ష్మిని) గోళ్ళతో గిలిగింతలిడుచున్న నృసింహుని చూడండి.

ఈయన ఉగ్రనరసింహుడే, కాని భక్తవత్సలుడు. నేడు పిరుదియ్యక (భయపడక) బింకమున చూడరో (ధైర్యంగా చూడండయ్యా!) దనుజుని (హిరణ్యకశిపుని) అంకమున (ఒడిలో) కూర్చొనబెట్టుకొని సంహరించాడు. ఈ నృసింహుని కొలవండి. ఈయన కింకలేక (కోపమును వుపసంహరించుకొని) వడి పెరిగెను (త్వరగా ప్రీతిపాత్రుడైనాడు). తిరుమలవేంకటేశ్వరుడు ఈయనే అహోబల నరసింహుడు ఈ దేవుడే.

సంపుటి: 5 కీర్తన : నిద్దిరించి పాల జలనిధివలెనే
సంఖ్య : 343 పుట : 233 రాగం: మధ్యమావతి

మధ్యమావతి

67 నిద్దిరించి పాల జలనిధివలెనే
వొద్దిక శ్రీరమణునికి వొత్తరే పాదములు ॥పల్లవి॥

వేగుదాఁకా చిత్తగించి విద్యలెల్ల నాదరించి
బాగుగా కృపారసము పంచి పంచి
యేగతిఁ బవ్వలించెనో యెట్ల భోగించెనో
యోగీంద్రవరదుని పూఁచరే వుయ్యాలను ॥నిద్ది॥

వాలుఁకన్నుల రెప్పల వడదాఁకి తనుతావి
చాలుకొన్న వూర్పులు చల్లి చల్లి
నీలవర్ణపుగుణము నెరపుచు నొకయింత–
కాలము కన్నులఁ దిప్పక (ప్పీఁగ?) ప్పరే దోమతెర ॥నిద్ది॥

సరుగన యోగనిద్ర చాలించి లోకమెల్లఁ
కరుణించ తలచి వేంకటగిరిపై
అరుదుగ సకలలోకారాధ్యుడయి మించి (చీ?)
విరివి నాలవట్టాలు విసరరే సతులు ॥నిద్ది॥

అవతారిక:

పరమాత్ముడైన శ్రీమన్నారాయణునికి వుయ్యాలలూపుతూ మధురమైన కీర్తనతో నిద్రబుచ్చుతున్నారు అన్నమాచార్యులవారు. ఉప్పునీటి సముద్రాలు ఉవ్వెత్తు తరంగాలతో భీకరంగావుంటే క్షీరసాగరం అలలు లేకుండా ప్రశాంతంగా వుంటుందట. ఈ దేవదేవుడు పాలజలనిధి వలెనే నిద్దిరించీ... ఈయనకి ఒద్దికతో పాదాలు ఒత్తండమ్మా! అని శ్రీదేవికి భూదేవికి చెబుతున్నారు. "సకల లోకములచే ఆరాధ్యుడై అతిశయించుచున్న ఈ శ్రీరమణుని ఓ సతులారా ఆలవట్టములు విసరండమ్మా!" అంటున్నారు.

"స్వామి మధ్య మధ్య కళ్ళు తిప్పుతున్నాడు, దోమతెర సరిగా కప్పండి" అంటున్నారు. తినబోతూ రుచియెందుకు? ఆస్వాదించండి.

భావ వివరణ:

ఓ తల్లులారా! (శ్రీదేవి, భూదేవి) ఈ శ్రీరమణుడు పాలజలనిధివలెనే (క్షీరసాగరము మాదిరి) ప్రశాంతంగా (వువ్వెత్తు తరంగాలు లేక వున్నట్లు, నిశ్చలంగా నిద్రిస్తున్నాడు). ఈయనకు ఒద్దికతో (అణుకువతో) పాదములను వొత్తండమ్మా!

వేగుచుక్క కనుపించేదాకా ఈయన నిద్రపోడు. మాబోటివారి విద్యలెల్లా ఒకపక్క ఆలకిస్తూనే మమ్మల్ని తరింపజేస్తుంటాడు. మాలోవున్న శరణార్థులపై అమితదయాళువై కృపారసమును పంచిపంచీ ఇంకా అలిసిపోతాడు. పాపం ఎట్లా పడుకొన్నాడో చూడండమ్మా! ఈ యోగీంద్రవరదుడు ఎట్లు భోగించేనోకాని ఆయన వుయ్యాల నెమ్మదిగా వూచరే (వూపండమ్మా!) అప్పుడుగాని ఆయన నిద్రించడు.

స్వామి, వాలు కన్నులరెప్పలు అరమోడ్చి నిద్రిస్తున్నాడు. మీ ఒంటి వేడిమి ఆయన ఒంటికి తాకి నిద్రాభంగం కావచ్చునమ్మా! చూడండి నిద్రలో కూడా చాలుకొన్న వూర్పులు చల్లిచల్లీ (అతిశయించిన నిట్టూర్పులు) యెలా విడుచుచున్నాడో! ఆయన భక్తుల బాధలు యెప్పుడూ వుండేవే. ఈ నీలవర్ణుని గుణం మీకు తెలుసుకదమ్మా!! ఆయనకు నిద్రపట్టదు. కొంచెంసేపు ఆ కళ్ళమీద వెలుతురు పడకుండా దోమతెరకప్పి కళ్ళు తిప్పకుండా జాగ్రత్తపడ్డారంటే నెమ్మదిగా నిద్రపడుతుందమ్మా!

ఇంకాసేపట్లో మళ్లీ సుప్రభాతం అంటూ తగులుకొంటారు. వీళ్ళు వచ్చేలోగా కాస్త నిద్రపట్టితే బాగుండును. ఈ వేంకటగిరిపై సరుగున (వెంటనే) యోగనిద్ర చాలించి లోకాన్నంతా కరుణించాలని ఆయనకెప్పుడూ ఆరాటమే. సకలలోకారాధ్యుడైన ఈ శ్రీవేంకటేశ్వరుడు అరుదుగ మించీ (అపూర్వమైన ఔన్నత్యంకలవాడు) ఓ సతులారా! ఈ స్వామి సుఖంగా నిద్రించుటకు ఆలవట్టములు (వింజామరలు) విరివి విసరరే (కాస్తగట్టిగా వీయండమ్మా!)

సంపుటి: 10-2 కీర్తన : రారా చిన్నన్నా రారోరి చిన్నవాఁడ
సంఖ్య : 82 పుట : 00 రాగం: ఝుంఝూటి

ఝుంఝూటి

68 రారా చిన్నన్నా రారోరి చిన్నవాఁడ
రార ముద్దులాఁడ రారోరి బాలకృష్ణ ॥ పల్లవి॥

కిందిచూపుల గిలిగించి ఆల-
మంద గొల్లెతల మరిగించి
సందడి వలపించి జవరాండ్లవూర
విందె వైనయట్టి వేడుకకాఁడ ॥రారా॥

కొదలుమాఁటలనె గొణఁగుచు భూమి
సుదతుల శిగ్గులు చూరాడి
చిదుగుచేఁతలనె చెనకుచుముద్దుఁ
బెదవిచవులు చూపిన జాణకాఁడ ॥రారా॥

కలికితనముననె కరఁగించి కాచె
చెలుల కాఁగిటనె చెలఁగి
లలనామణియైన లకిమమ్మఁ
గలసుక శ్రీవేంకటనాథుఁడైనవాఁడ ॥రారా॥

అవతారిక:

అన్నమయ్య మనుమడు, చినతిరుమలాచార్యులవారు చెప్పిన బాలకృష్ణునిపై మధుర కీర్తన వినండి. ఈయన కీర్తనలు జానపదుల శైలిలో జనప్రియంగా వుంటాయి. గిలిగించి అంటే చక్కిలిగింతపెట్టటం. అయితే, కింద చూపులు చూచే ఆవులమందకు గిలగించడమేమటి? అంటే మనం గిలిగింతలు పెడితే పాపాయిలెలా సంతోషిస్తారో రేపల్లెలో ఆవులు కూడా కృష్ణను చూచి సంతోషంతో పరవశించాయన్నమాట. ఆ

పిల్లాడు కొదలుమాటలు రహస్యంగా గొణుగుతాడట. దానికి ఆడాళ్ళంతా సిగ్గుతో చితికిపోతారట. ఈ చినతిరుమలయ్య అచ్చం తాతగారే. కవిత్వంలోనూ అదే చలాకీతనం. భావ వివరణ చదివి పరవశించండి.

భావ వివరణ:

మా చిన్నన్నా!! రారా! ఓ చిన్నవాడా! రారా! ఓరి బాలకృష్ణా! నిన్ను ముద్దాడెదను రారా!

నీ లీలలను యేమని వర్ణించమయ్యా! నువ్వు, కిందిచూపుల ఆలమంద (అలవాటుప్రకారం క్రిందికి చూస్తూవెళ్ళే ఆవులమందకు) గిలిగించేవు (పులకరింపు కలుగచేస్తావు... అంటే... సంతోషపెడతావు). గొల్లెతల మరగించేవు (గోపికలను విరహంతో వేపుతావు). వూర జవరాండ్రను (జవ్వనులైన మీవూరి ప్రియురాండ్రను) బాహాటంగానే వలపు ముగ్గులోకి దింపుతావు. కృష్ణా! నీవు విందవైనయట్టి (సంతోషపరచు) వేడుకాడవు (భోగివి).

కృష్ణా! నీవు కొదలు మాటలనే (లోపభూయిష్టమైన మాటలను) గొణుగుచు (రహస్యంగా పలుకుచూ) సుదతుల శిగ్గులు (స్త్రీల సిగ్గును) చూరాడేవు (చితుకునట్లు చేసెదవు), కొంటె వేషాలు వేస్తూ మధురాధరముల రుచి చూపిన జాణకాడవు (రసిక శేఖరుడవు).

ప్రభూ! నీవు చెలుల కౌగిళ్ళలో చెలగి (అతిశయించి) నీ కలికితనముల (నేర్పరితనమున) పరవశింపజేసెదవు. నేడు ఈ తిరుమల శిఖరాలపై లలనామణియైన లకిమమ్మ (లక్ష్మిదేవి)ని కలిసినవాడవై మా ఆరాధ్యదైవమైన శ్రీవేంకటేశ్వరుడవైనావు.

సంపుటి: 15 కీర్తన : వోవో రాకాసులాల వొద్దు సుండి వైరము
సంఖ్య : 140 పుట : 93 రాగం: గౌళ

గౌళ

69 వోవో రాకాసులాల వొద్దు సుండి వైరము
దేవుని శరణనరో తెలుసుకోరో ॥ పల్లవి॥

జగములో రాముఁడై జనియించె విష్ణుఁ డిదె
అగపడి లక్ష్మి సీత యయి పుట్టెను
తగు శేషశంకచక్ర దైవసాధనము లెల్ల
తగిలి లక్ష్మణ భరత శత్రుఘ్నులయిరి ॥వోవో॥

సురలు వానరు లైరి సూర్యుఁడు సుగ్రీవుఁడు
మరిగి రుద్రుఁడు హనుమంతుఁడాయెను
సరుస బ్రహ్మదేవుఁడు జాంబవంతుఁడైనాఁడు
వెరవరి నలుఁడే విశ్వకర్మ సుండి ॥వోవో॥

కట్టిరి సేతు వప్పుడే ఘను లెల్లా దాఁటిరి
ముట్టిరి లంకా నగరమును దళము
అట్టి శ్రీవేంకటేశుఁ డాతఁడే యీతఁడై
వొట్టుచు వరము లిచ్చె వొనర దాసులకు ॥వోవో॥

అవతారిక:

పెదతిరుమలాచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో రాక్షస స్వభావం కలిగినవారిని హెచ్చరిస్తున్నారు. ఒరే రాకాసుల్లారా! మీకు మాతో వైరము వద్దురా. మేము ఈ ఏడుకొండలవాడిని శరణని హాయిగా వున్నవాళ్ళం. మీరూ అదేపని చేయండి. ఆ నాడు త్రేతాయుగంలో మీ రావణాసురుని చంపటానికి ఆ విష్ణువు తన పరివారంతో సహా భూమ్మీద అవతరించి మిమ్మల్నందరినీ మట్టికరిపించాడు. దుష్ట శిక్షణాకార్యక్రమం పూర్తిచేసికొని

నేడు తన శరణాగతులకు అంతులేని వరములనిస్తున్నాడు. మీరంతా మీ ప్రవర్తన మార్చుకోండిరా! అంటున్నారు.

భావ వివరణ:

ఓరోరీ! రాక్షసులారా! సన్మార్గులతో వైరము (శతృత్వం) వద్దు సుండీ (సుమా!) ఈ శ్రీవేంకటేశ్వరుడే దేవుడు (భగవంతుడు). ఈ సంగతి తెలుసుకోండిరా! ఈ దేవదేవుని శరణు అనండిరా!

(ఈయనే ఆదిదేవుడైన శ్రీమహావిష్ణువు. రావణుడు నరులను వానరులను తన కాలిగోటికి సరిరారని భావించి, బ్రహ్మను వరములడిగేటప్పుడు దేవ, దానవ, యక్ష, కిన్నెర, కింపురుష మొదలైన వారితో తనకు మృత్యువు రాకూడదన్నాడు. వాడిని చంపటానికి విష్ణువు తన పరివారంతో సహా భూమిపై నర వానరులుగా తల్లి కడుపులద్వారా పుట్టి వాడిని నిర్జించాడు. వాళ్ళంతా యెవరెవరు యెలా పుట్టారో తెలుసుకొని ఆనందించండి.)

ఆ శ్రీమహావిష్ణువు భూమిపై రామునిగా జన్మించాడు. అగపడి (తానూ సిద్ధమై) లక్ష్మీదేవి సీతయై పుట్టింది. ఆయన పరివారమైన ఆదిశేషుడు, సుదర్శన చక్రము, పాంచజన్య శంఖమూ ఆ రాముని సోదరులు లక్ష్మణుడు, భరతుడు మరియు శత్రుఘ్నులవలె జన్మించారు.

ఆ శ్రీహరి పరివారమంతా రాముని పరివారంగా యెలా వానరజన్మలెత్తారో తెలిసి ఆనందించండి. సూర్యుడే సుగ్రీవునిగా అవతరించాడు. రుద్రుడు (శంకరుడు) మహా బుద్ధిమంతుడైన హనుమతుడయ్యాడు. బ్రహ్మదేవుడు భల్లూకపతియైన జాంబవంతునివలె అవతరించాడు. వారధిని నిర్మించిన నలుడే దేవశిల్పి విశ్వకర్మ సుమా!

ఆ తరువాత కథ మీ అందరికీ తెలిసిందే కదా! వారంతా రావణ వధ కోసం ఘనులై అప్పుడే సేతువును కట్టి, దాటి, లంకానగరమును ముట్టిరి (ముట్టడించిరి). ఆ తిరుమల శ్రీవేంకటేశ్వరుడె ఈనాడు, ఇక్కడ శ్రీరామచంద్ర మూర్తిగా వెలసి ఒనర (ఒప్పునట్లుగా) తనదాసులకు ఒట్టుచు (శపథముతో) అనేక వరములిస్తున్నాడు. రాండర్రా! మీరు వచ్చి ఈయనను ఆశ్రయించండి.

సంపుటి: 2 కీర్తన : శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
సంఖ్య : 258 పుట : 175 రాగం: పాడి

పాడి

70 శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాఁడు. ॥ పల్లవి॥

హరి కృష్ణావతార మందినయంతలోనే
పరమమునుల కెల్ల భయముడిగెను
తెరలి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి
సిరులమించినయట్టి శ్రీజయంతినాఁడు. ॥శిష్ట॥

గోవిందుఁడు వసుదేవుకొడుకైనయప్పుడే
గోవులు రంకెలు వేసె గొల్లపల్లెను
నోవితోడఁ గంసునికి నూరునిండెఁ జూడఁగానె
చేవలుమీరినయట్టి శ్రీజయంతినాఁడు ॥శిష్ట॥

నారాయణుఁడు భువి నరుఁడు దాఁ గాఁగానే
మేరఁ బాండవు లెచ్చిరి మేనవావిని
కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుఁడు
చేరువనే మెరయఁగ శ్రీజయంతినాఁడు. ॥శిష్ట॥258

అవతారిక:

ఒకానొక శ్రీకృష్ణ జయంతి సందర్భంగా అన్నమాచార్యులవారు వినిపించిన కీర్తననాలకించండి. "శిష్టరక్షణమును, దుష్టశిక్షణమును భగవంతుడు శ్రీజయంతినాడు ఒకే సమయంలో సృష్టించె" అంటున్నారు. మునులను రక్షించాడు, దానవులను భక్షించాడు. గోవులను మేపాడు, కంసుని వేపాడు. పాండవులు యెచ్చిరి, కౌరవుల పనిదీరె అని కృష్ణావతారవైశిష్ట్యాన్ని కీర్తిస్తున్నారు. శ్రీవేంకటేశుడు కూడా ఆయన చేరువనే మెరసినాడట. గతంలో ఇటువంటి కీర్తనలు చూచినా దేని మాధుర్యం దానిదే.

భావ వివరణ:

ఓ భక్తులారా! ఈ శ్రీజయంతినాడు (శ్రీకృష్ణాష్టమినాడు) ఆ భగవంతుడు, శిష్టరక్షణము (మంచివారిని రక్షించుట), దుష్టనిగ్రహము (చెడ్డవారిని నిరోధించుట) ఒక్కవేళనే (ఒకే సమయంలో) సృష్టించెన్ (సిద్ధింపజేశాడు).

శ్రీహరి కృష్ణావతారమును పొందినప్పుడు పరమ మునీంద్రులకు అందరికీ దానవుల భయము వుడిగెను (అణగిపోయినది). తెరలి (కలతపడిన) దైత్యుల గుండెలు, అత్తరి (అప్పుడు) దిగులుచొచ్చె (దిగులుతో దిగాలుపడ్డాయి). ఈ శ్రీజయంతి సిరులుమించిన (వైభవములతిశయించిన) పండుగ అవటంచేత ఈనాడు అంతా జయమే.

ఆ గోవిందుడు వసుదేవుని కొడుకైనప్పుడే గొల్లపల్లెను (గోకులమునందున్న) గోవులన్నీ సంతోషంతో రంకె వేసినవి. ఎందుకంటే వాటికి భగవంతుడు తమ మూపురాలను ప్రేమగా నిమరటానికి రాబోతున్నాడని తెలిసిపోయింది. అక్కడ మధురలో కంసునికి నోవితోడ (వేదనతో) చూడగానే (యోగమాయ హెచ్చరిక విని జరిగింది చూడగా) భయంతో నూరునిండె (నూరేళ్ళు నిండాయి). ఈ శ్రీజయంతినాడు చేవలు మీరినయట్టి (అందరికీ ధైర్యంకలిగినట్టి ఈరోజున) కంసాదులకు కన్నీళ్ళొచ్చాయి.

నారాయణుడు భువిపై తాన్ నరుడు కాగానే (అవగానే) మేం (క్రమముగా) మేనవావిని (మేనరికపు బంధుత్వమునందు) పాండవులు యెచ్చిరి (బలోపేతులయ్యారు). కౌరవులు (దుష్టరాజసమూహంగల కురుసేన) పనిదీరె (పనిముగిసినది). ఈ శ్రీజయంతినాడు ఆ కృష్ణలీల సంకేతముగా, శ్రీవేంకటేశుడు ఈ తిరుమల శిఖరాలపై కమ్మి మెరయగా (వ్యాపించి మెరిసిపోగా) చేరువనే (ఇక్కడే) పండుగ పరిమళించింది.

సంపుటి: 2 కీర్తన : దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ
సంఖ్య : 518 పుట : 348 రాగం: నాట

నాట

71 దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ
కేరలీఁ బంతముల సుగ్రీవనారసింహము. ॥ పల్లవి॥

నిక్కినకర్ణములతో నిట్ట చూపుగుడ్లతో
మిక్కుటమైన పెద్దమీసాలతోడ
వెక్కసపునోరితోడ వెలయుబుగ్గలతోడ
క్రిక్కిరిసీ నవ్వుల సుగ్రీవనారసింహము. ॥దొర॥

చల్లునూరుపులతోడ సంకుఁజక్రములతోడ
మొల్ల మైనసహస్రకరములతోడ
తెల్లనిమేనితోడ దిండైనపిరుఁదుతోడ
కెల్లరేఁగీఁ గరుణ సుగ్రీవనారసింమము. ॥దొర॥

విరులపాదాలతోడ వెలయుసొమ్ములతోడ
తిరమైనకోటిసూర్యతేజముతోడ
విరులదండలతోడ వేడుక శ్రీవేంకట-
గిరిమీఁద వెలసె సుగ్రీవనారసింహము. ॥దొర॥518

అవతారిక:

సహజత్వం వుట్టిపడేలా వర్ణనలు కీర్తనలో జొప్పించటం అన్నమాచార్యుల వారికి వెన్నతోపెట్టిన విద్య. ఆయన నరసింహుని వర్ణిస్తుంటే మనకళ్ళయెదుట ఆ స్వామి నిలుచున్నట్లే వుంటుంది. "దొరతనంతోడ, తొడపై శ్రీసతితోడ ఈ సుగ్రీవనరసింహుడు పంతములకేరలీ" అంటున్నారు. ఈయన కంఠము సుగ్రీవమట. అందంగావున్న కంఠస్వరం అన్నమాట. ఈయన పాదాలు

పువ్వుల్లా వున్నాయట. వేంకటగిరి మీదనున్న సుగ్రీవనరసింహుని కీర్తించండి అంటున్నారు.

భావ వివరణ:

దొరతనముతోడ (సర్వేశ్వరుని ఠీవితో) తనతొడపై శ్రీదేవితో ఈ సుగ్రీవనారసింహుడు (చక్కటి కంఠధ్వనిగల నరసింహుడు), కేరడి పంతములవాడు (మిక్కుటమైన పట్టుదలగలవాడు).

ఈయన యెలావున్నాడో చూడండి. ఇతను నిక్కిన కర్ణములతో (నిక్కపొడుచుకొనిన చెవులతో) నిట్టచూపుగుడ్లతో (మిడిగుడ్లతో). దట్టమైన పెద్దమీసాలతో, వెక్కసపు (భీతినిగొలుపు) నోటితోను, వెలయు (మెరయుచున్న) బుగ్గలతోను, క్రిక్కిరిసిన నవ్వులతోనూ (దట్టమైన నవ్వులు చిందించుచూ) ఈ సుగ్రీవ నారసింహుడు దర్శనమొసగుచున్నాడు.

ఈయన చల్లునూరుపులతో వున్నాడు (వెలువడునప్పుడు విస్తరించుచున్న నిశ్వాసములతో వున్నాడు.) ఈ చతుర్భుజుని, రెండుచేతులలో శంఖచక్రములన్నవి. అధికముగ వేయి కరములతో ఈ స్వామి వెలసియున్నాడు. ఈయన తెల్లని మేనితో (దేహంతో) దిండ్లవంటి పిరుదులతోనున్నాడు. ఈయన కెల్లురేగిన (పెల్లుబికిన) కరుణ మూర్తీభవించినట్లున్నాడు. ఈ సుగ్రీవనారసింహుని చూచి తరించండి.

ఈ దేవదేవుడు విరులవంటి (పుష్పములవలె సున్నితమైన) పాదములను కలిగియున్నాడు. విరివిగానున్న సొమ్ములు (ఆభరణములతోనున్నాడు). తిరమైన (స్థిరమైన) కోటి సూర్యులకాంతితో వెలుగొందుచున్నాడు. మెడలో ఈ స్వామి అనేక పుష్పహారములను ధరించియున్నాడు. వింతగా ఈ సుగ్రీవనారసింహుడు వేడుకతో శ్రీ వేంకటగిరిమీద వేంకటేశ్వరుడై వెలసియున్నాడు. ఈ స్వామిని చూచి భక్తితో మొక్కండి.

సంపుటి: 2 కీర్తన : ఘనుడాతడా యితడు కలశాపురముకాడ
సంఖ్య : 302 పుట : 204 రాగం: గుండక్రియ

గుండక్రియ

72 ఘనుఁడాతఁడా యితఁడు కలశాపురముకాడ
హనుమంతుఁ డితఁడా అంజనాతనయుఁడు. ॥ పల్లవి॥

పెడచేత లోచేత బెరసి కొందరిఁ గొట్టె
అడరి దానవుల హనుమంతుఁడు
బెడిదంపుఁ బెనుదోఁక బిరబిరఁ దిప్పి మొత్తె
అడఁగ మాల్యవంతు హనుమంతుఁడు ॥ఘను఼॥

దాకాల మోఁకాలఁ దాటించెఁ గొందరి
ఆకాశవీధినుండి హనుమంతుఁడు
పైకొని భుజములఁ బడఁదాఁకెఁ గొందరి
ఆకడ జలధిలోను హనుమంతుఁడు. ॥ఘను఼॥

ఆరుపుల నూరుపుల నందరిఁ బారఁగఁ దోలె
ఔరా సంజీవికొండహనుమంతుఁడు
మేరతో శ్రీవేంకటాద్రిమీఁదిదేవునిబంటు
ఆరితేరినబిరుదు హనుమంతుఁడు. ॥ఘను఼॥ 302

అవతారిక:

కలశాపురంలో తనయెదుటనున్న ఘనమైన హనుమంతుని యెదుట అన్నమాచార్యులవారు ఈ కీర్తనను వినిపిస్తున్నారు. ఆనాడు లంకలో రాక్షసమూకనుయెట్లు చీల్చి చెండాడినాడో వర్ణిస్తున్నారు. నేటి మన దుస్థితి యేమంటే అచ్చతెలుగు కీర్తనకి, సంకరతెలుగులో వివరణ ఇచ్చుకోవలసిన వస్తున్నది. "ఆరుపుల నూరుపులనందరి బారగ దోలె"... ఆయన హూంకారముతో కూడిన గట్టి నిశ్వాసవదిలి అందరూ కకావికలై

పారిపోయేట్లు చేశాడట. ఇట్లా అడుగడుగునా తేలికగా తెలియని తెలివైన తెలుగు తికమకలు దిట్టంగావున్నాయి ఈ కీర్తనలో.

భావ వివరణ:

ఆనాడు లంకలో అన్ని ఘనకార్యములను చేసిన ఆ ఘనుడైన హనుమంతుడు ఆతడా, యితడు (ఈ కలశాపురంలో మనయెదుటనున్న ఆంజనేయుడు). ఏమి ఆశ్చర్యము!

ఈయన సీతాన్వేషణలో లంకలోని రాక్షసులను యెట్లు చితక్కొట్టాడో వినండి. ఆయన తన మోచేతితో కొందరిని కుమ్మి చంపాడు. కొందరిని చేతిలోపలి భాగంలో నొక్కి చంపాడు. అడరి (ఆ విధంగా అతిశయించి) ఆ హనుమంతుడు దానవులను చంపాడు. అప్పుడు మాల్యవంతుడనే రాక్షసుడు ఆయనపైకి వెళ్ళాడు. బెడిదంపు (భయంకరమైన) పెనుతోక (పెద్దతోకతో) బిరబిర తిప్పి అణిగిపోయేట్లు మొత్తి వాడిని ఆ హనుమంతుడు చంపేశాడు.

తన దాకాలు (దాగు+కాలు) కాలివెనుక భాగంతో) తో తన్ని కొందరిని, మోకాలితో కుమ్మించి కొందరిని తాటించినాడు (కొట్టినాడు), ఆ హనుమంతుడు. ఇదంతా ఆయన ఆకాశవీధిలోనే చేశాడు. ఆ కడ (అప్పుడు) కొందరిని పైకొని (మీదపడి) భుజములతోపడదోసి జలధిలో చంపేశాడు. హనుమంతుని మారణకాండనేమని వర్ణింతుము?

అనంతరం ఆ హనుమంతుడు "ఆరుపుల నూరుపుల నందరి బారగదోలె" (తన హూంకారముతో కూడిన గట్టి నిస్వాసముతో అందరినీ చిందరవందరగా పారిపోయేట్లు చేశాడు. ఔరా సంజీవి కొండను తెచ్చిన ఈ హనుమంతుడు జగజ్జెట్టి. మేరతో (ఆ క్రమంలో) వేంకటాద్రిమీది దేవుడైన వేంకటేశ్వరుని బంటు అనే ఆరితేరిన బిరుదుతో ఈ హనుమంతుడు శోభించుచున్నాడు.

సంపుటి: 2 కీర్తన : బోధింపరే యెరిగిన బుధులాల పెద్దలాల
సంఖ్య : 58 పుట : 39 రాగం: బౌళి

బౌళి

73 బోధింపరే యెరిఁగినబుధులాల పెద్దలాల
శ్రీధరునిమాయలలోఁ జిక్కితిమి నేము. ।। పల్లవి।।

దైవమును నొల్లము ధర్మమును నొల్లము
దావతిసంసారముతో తగులేకాని
భావపుభవబంధాలభయమూ నెరఁగము
వేవేలు విధులే కాని వేగిలేచి నేము. ।।బోధిం।।

ముందు విచారించము మొదల విచారించము
పొందేటిసతులతోడిభోగమేకాని
చెందినమనసులోనిచింతలను బాయము
మందపుమదమే కాని మాపుదాఁకా నేము. ।।బోధిం।।

పరమూఁ దడవము భక్తిఁ దడవము
అరిది ధనముమీఁది ఆసలేకాని
ఇరవై శ్రీవేంకటేశుఁ డేలుకొనెఁ దానే నన్ను
నిరతి నెరఁగనైతి నే నించుకంతాను. ।।బోధిం।।58

అవతారిక:

"ఓ పెద్దలారా! మేము శ్రీధరుని మాయలో చిక్కుకుపోయామయ్యా! దిక్కు తెలీటంలేదు. మాకు యేమి చెయ్యాలో చెప్పండయ్యా!" అంటున్నారు జాలిగా అన్నమాచార్యులవారు. దేవుణ్ణి నమ్మం, ధర్మం ఒప్పుకోము, భవబంధాలలో అల్లాడిపోతున్నాం. ముందు విచారించము, మొదల విచారించము యెంతసేపూ వనితాభోగమే. మందపుమదమే మాపుదాకా, పరము వద్దంటాము. భక్తిసున్నా. ఏమిటీ దౌర్భాగ్యం!! తేలికగా కనుపించే క్లిష్టమైన కీర్తన ఇది. జాగ్రత్తగా చదవండి.

భావ వివరణ:

ఓ పెద్దలారా! బుధులారా! (పండితులారా!) మీరు అన్నీ యెరిగినవారు కదా! నాకు బోధింపరో (బోధపరచండయ్యా!) నేము (మేము) శ్రీధరుని మాయలలో చిక్కుకుపోయాం.

మేము దేవుని వొల్లము (అంగీకరించము). ధర్మమునంగీకరించము. దావతి సంసారముతో (దు:ఖభాజన ప్రపంచపు) తగులే (అనుబంధములే) కాని, భవబంధాల భయంలేనేలేదాయెను. అనేక మార్గాలనవలంభిస్తాము కాని, వేగిలేచేము (ప్రతిదానికీ తొందరే). మాకేమి చేయాలో తెలియుటలేదు.

మాకున్న ఇంకొక దురలవాటు ముందుగా విచారించము (కార్యము ప్రారంభమునకు ముందుగ ఆలోచన చేయము). మొదల విచారించము (కార్య ప్రారంభమునందును ఆలోచించము). మాకు లభించిన భామలతో భోగాసక్తే కాని ఇంకొక ఆలోచనేవుండదాయెను. ఈ వ్యవహారాలవల్ల మనస్సులో యెప్పుడూ దిగుళ్ళే, ఆలోచనలే. వాటిని బాయము (వదలము). మాపుదాకా (ముసలివాళ్ళమై జవసత్వాలు వుడిగేదాక) మందపు మదమే (దట్టమైన గర్వమే...) కాని మరొకటి లేదు. మేము భ్రష్టులమైపోయాము.

అవన్నీ అటుంచి, పరము (మోక్షము) అంటే యేమిటో తడవము (చలించము) భక్తి గురించిన ఆలోచనేలేదు. అరిది ధనముపై ఆసలే (అరుదుగా లభిస్తుందని ధనముపై వ్యామోహమే)... కాని భగవంతుని మాటే తలవము. ఇట్లా చాలాకాలం గడిచింది. ఒకనాడు శ్రీవేంకటేశునికి ఈ జీవిపై దయపుట్టింది. ఆయన ఇరవై (నా తలపులలో నెలకొని) తానే నన్ను యేలుకొనె. నేను ఇంచుకంతా, నిరతినెరుగనైతి (కొంచెము కూడా అత్యాశ లేక) జీవించుట ప్రారంభిచితిని. ఆ విధంగా ధన్యుడనైతిని.

సంపుటి: 2 కీర్తన : దాసోహమనుబుద్ధిదలచరు దానవులు
సంఖ్య : 5 పుట : 4 రాగం: నాట

నాట

74 దాసోహ మనుబుద్ధిc దలcచరు దానవులు
యీసులకే పెనcగేరు యిప్పుడూc గొందరు. ॥ పల్లవి॥

హరిచక్రముదూషించేయట్టివారే యసురలు
అరయc దామేదైవమన్న వారు నసురలే
ధర నరకాసురుcడు తానే దైవమని చెడె
యిరవై యిది మానరు యిప్పుడూc గొందరు. ॥దాసో॥

పురుషోత్తమునిపూజపొంతc బోరు అసురలు
సరవి విష్ణుని జపించనివారు నసురలే
హిరణ్యకశిపుcడును యీతని నొల్లక చెడె
ఇరవై యీతని నొల్ల రిప్పుడూc గొందరు ॥దాసో॥

సురలును మునులును శుకాదియోగులును
పరమము శ్రీవేంకటపతి యనుచు
శరణని బ్రదికేరు సరి నేcడు వైష్ణవులు
యెరపరికానc బొయ్యే రిప్పుడూc గొందరు. ॥దాసో॥5

అవతారిక:

దానవులు దేవతలు అక్కచెల్లెళ్ళ పిల్లలే కాని వారి మధ్య ఎంత అంతరం వున్నదంటే ఒకరు చెడుకు వుదాహరణైతే, ఇంకొకరు మంచికి మారుపేరు. హరికి సురులు శరణాగతులైతే, అసురులు హరి విరసులు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు దానవులకు హరికి దాసోహమనే బుద్ధివుండదని, వారు అసూయకే అలవాటుపడ్డవారని, అందుకనే చెడిపోయారని అంటున్నారు. తన వాదనని సోదాహరణంగా

నిరూపిస్తున్నారు కూడా. అసురులు అట్లావుంటే, సురులు మునులు హరి శరణాగతులు.

భావ వివరణ:

దానవులు (రాక్షసులు) దాసోహమనుబుద్ధి (శరణాగతిని) దలచరు (ఒప్పుకోరు). ఇప్పుడు (ఈ కలియుగంలో) కొందరు మానవులు, ఈసులకే (అసూయతో) పెనగేరు (ఒకరితో నొకరు కొట్లాడుచున్నారు).

అసురులంటే వేరేవరో కాదు. విష్ణుదేవుని చక్రాన్ని దూషించేవారంతా అసురులే. అరయ (పరిశీలించి చూచిన) తామే దైవమని అహంకరించినవారెవరైనా అసురులే. విష్ణువు భూకాంతలపుత్రుడు నరకుడు. వాడు అసురుడై లోక కంటకుడైనాడు. హరి వానిని సంహరిస్తాడు కావున భూదేవి హరిని వాడినంతము చేయవద్దని వేడుకొంది. "నేను చంపను వీడిని నీవు చావు అని తిట్టే దాకా వాడు చావడు" అని వరమిచ్చాడు విష్ణువు. ఆ నరకాసురుడు తానే దైవమని లోకకంటకుడయ్యాడు. వాడికోసం భూదేవి అంశతో పుట్టిన సత్యభామతో కృష్ణుడైన హరి తమపుత్రునే చంపించాడు. ఈరోజుల్లో నరుల్లో కూడా నరకాసురులు కోకొల్లలు.

అసురులు పురుషోత్తముని పూజదగ్గరకే పోరు. విష్ణుని జపించనివారంతా అసురులే. కృతయుగమున హిరణ్యకశిపుడు కూడా హరి నొల్లక అంతమైనాడు. ఈ కలియుగంలో కూడా కొందరు యీతని (ఈ దేవదేవుని వొల్లరు (అంగీకరించరు).

దేవతలు, మునులు, శుకుడు మొదలైన యోగులు పరమము మోక్షప్రదాత శ్రీవేంకటేశ్వరుడే అని శరణాగతితో బ్రతుకుచున్నారు. సరి (అదట్టుండగా) నేడు వైష్ణవులు కూడా కొందరు "యెరపరికాన" (రోత కలిగి) పొయ్యేరు (ద్వేషముతో జీవించుచున్నారు).

గమనిక : ఆచార్యులవారి భావన ఇదేనేమోనని నా ఊహ. నా ఆశ.

సంపుటి: 2 కీర్తన : నారాయణుడ నీనామమె మంత్రించివేసి
సంఖ్య : 494 పుట : 332 రాగం: సామంతం

సామంతం

75 నారాయణుఁడ నీ నామము మంత్రించివేసి
పారేటియీజంతువులభ్రమ విడిపించవే. ॥ పల్లవి॥

మదనభూతము సోఁకి మగువలుఁ బురుషులు
అదన విరిదలలై యంగమొలలై
పెదవి నెత్తురు వీర్చి పెనుగోళ్ళఁ జించుకొంటా
కొదలు కుత్తికలనుఁ గూసేరు జీవులు. ॥నారా॥

పంచభూతములు సోఁకి భ్రమసి యజ్ఞానులై
పొంచి హేయములు మన్నుఁబూసుకొంటాను
అంచెల వీడెపురస మందు నిందు గురియుచు
యెంచి ధనముపిశాచాలిట్టైరి జీవులు. ॥నారా॥

తమితోడ మాయాభూతము సోఁకి బహుజాతి–
యెముకలుఁ దోలు నరా లిరవుచేసి
నెమకి శ్రీవేంకటేశ నిన్నుఁ జేర కెక్కడైన
తముఁ దా మెరఁగరింతటాఁ జూడు జీవులు. ॥నారా॥494

అవతారిక:

'పారేటి' జీవులు అంటే జీవనసంగ్రామంలో కకావికలై పరుగులు పెడుతున్న జీవకోటి (మనబోటివాళ్ళం) అన్నమాట. ఎందుకు వీళ్ళంతా పరుగులు పెడుతున్నారు? భ్రమకులోనైనందువల్ల. స్త్రీ మీద భ్రమ, ధనంమీద భ్రమతో, మాయ అనే భూతంపట్టి వాళ్ళు పరమాత్మ అంశ అనే జ్ఞానం లేక 'నేను' అంటే ఎముకలు నెత్తురు మాంసం నరాలు వున్న 60 కిలోల దేహం అనుకొంటున్నారు. మరి ఇక వాళ్ళు నారాయణుడైన

శ్రీవేంకటేశ్వరుని చేరితే ఏమవుతుంది? తామెవరో తెలుసుకోగలుగుతారు.

భావ వివరణ:

ఓ శ్రీమన్నారాయణుడా! నీనామమును "మంత్రించి" ప్రయోగించినచో, పారేటి (జీవనయానంలో పరుగులు పెడుతున్న) యీ జంతువుల భ్రమలన్నీ విడిపించవే (తొలగించవయ్యా!)

ఈ జీవులకు 'మదన భూతము' సోకినది (మన్మథుడు అనే భూతం పట్టుకొన్నది). ఆడామగా అనే వివక్ష లేక విరిదలలై (తొలగిన విచక్షణ కలవారై) అంగమొలలై (దిగంబరులై) పెదవులు రక్తాలు చిమ్మేదాకా వీర్చి (చిమ్మించి) గోళ్ళతో గీరి, కొదలి (అతిశయించి) అవతలివారి పొందుకోసం గొంతుకలు కోసుకునే దాకా తెగిస్తారు. ఎంత దౌర్భాగ్యం!!

ఈ జీవులకి ప్రకృతిలో నున్న పంచభూతములు సోకి వశులను చేసికొని భ్రమలకు గుఱిచేసి అజ్ఞానులను చేస్తున్నవి. మన్ను పూసుకొనేవాడు ఒకడైతే తాంబూల రసాస్వాదనతో బ్రతికేవాడు ఇంకొకడు. ధనపిశాచి పట్టి జీవులు ఇట్టైరి. ఉచ్ఛము నీచమూ లేదు. ధనంకోసం చేయరాని పనులు చేస్తారు. ఎంత హేయమైన బ్రతుకులు!!

తమితోడ (అతి ఆసక్తిగల) ఈ జీవులకు భూతం పట్టింది. దానిపేరు "మాయా భూతము". దానివల్ల ఈ జీవుడు వాడెవరో తెలుసుకోలేకున్నాడు. ఓ శ్రీవేంకటేశ్వరా వాడు 'నేను' అనుకొంటున్నది తన దేహాన్ని అనేభ్రమలో వున్నాడు. దేహంలోని తోలు, నరాలు, యెముకలు వాడి జాతి అని అనుకొంటున్నాడు. నేను అంటే జీవుడు. వాడు నిజానికి పరమాత్మ ప్రతిరూపమే. కానీ మాయవాడిని ఆవరించి, అజ్ఞానియై అనేక భ్రమలకులోనై అరిషడ్వర్గ పీడితుడై దాని పర్యవసానంగా జననమరణాల విషవలయంలో చిక్కాడు. వీడికి ఏడుకొండలవాడి దయకలిగేదాకా ఈ భ్రమలు తప్పవు.

సంపుటి: 2 కీర్తన : భక్తి నీపై దొకటె పరమసుఖము
సంఖ్య : 322 పుట : 218 రాగం: శుద్ధవసంతం

శుద్ధవసంతం

76 భక్తి నీపైదొకటె పరమసుఖము
యుక్తిచూచిన నిజం బొక్కటే లేదు. ॥ పల్లవి॥

కులమెంత గలిగె నది కూడించు గర్వంబు
చలమెంత గలిగె నది జగడమె రేఁచు
తలఁపెంత పెంచినాఁ దగిలించు కోరికలు
యెలమి విజ్ఞానంబు యేమిటా లేదు. ॥భక్తి॥

ధన మెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుఁ జక్కందనంబు మోహములు రేఁచు
ఘనవిద్య గలిగినను కప్పుఁ బైపై మదము
యెనయఁగఁ బరమపద మించుకయు లేదు. ॥భక్తి॥

తరుణు లెందరుఅయిన తాపములు సమకూడు
సిరులెన్ని గలిగినను చింతలే పెరుగు
యిరవయిన శ్రీవేంకటేశ నినుఁ గొలువఁగా
పెరిగె నానందంబు బెళకు లిఁకలేవు. ॥భక్తి॥322

అవతారిక:

ప్రభూ! పరమసుఖమిచ్చేది ఈ ప్రపంచంలో యేదన్నా వున్నదంటే అది నీపై కలిగిన భక్తి మాత్రమే. అయితే ప్రాపంచిక సుఖాలు మాత్రమే అవసరం అనుకొన్నంత కాలమూ భక్తి రుచి మనిషి గ్రహించలేడు. యుక్తాయుక్త విచక్షణ వున్న వారికి నిజమైన సుఖము ఒక్క భక్తియేనని తెలుస్తుంది. శ్రీవేంకటేశ్వరుని కొలిచిన ఆనందము పెరగటమే కాదు

ఆపైన ఇక బెళకులుండవుట. కులము, ధనము, పేరు ప్రతిష్ఠలు, విద్యావైశిష్ట్యమూ... యేవీ శ్రీహరి భక్తికి సాటిరావంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! మాకు నీపై భక్తియొక్కటే పరమ సుఖము (దైవికమైన సౌఖ్యమును) ప్రసాదించును. యుక్తి జూచిన (విచక్షణతో పరికించిన) ఆ పరమసుఖము ఒక్కటే నిజమైనది. మరియేదియును లేదు.

ఎవ్వరి"కులమై"నా యెంతగొప్పదైనా ప్రయోజనమేమిటి? దానివల్ల గర్వం పెరుగుతుంది, అంతేకద! జగడమెందుకువస్తుంది? యెంత 'చలము' (ద్వేషము) వుంటే, అది అంత వస్తుంది. 'తలపు' అధికమయిందంటే కోరిక తగులుకొంటుంది. అవన్నీ పీడిస్తున్నవాడికి యెలమి (అతిశయించిన) విజ్ఞానము (భగవత్సంబంధమైన జ్ఞానము) యెలాకలుగుతుంది?

ఇంకొక వింత యేమిటంటే ధనమెంత పెరుగుతుంటే లోభత్వం అంత యెక్కువవుతుంది. స్త్రీ పురుషులలో సౌందర్యమెక్కువైతే మోహము వారిపై పెరుగుతుంది. పోనీ విద్య వలన కూడా మంచి జరుగదు. భక్తిలేనివాడికి యెంత విద్యవున్నా అది మదమును పెంచటానికి తప్పించి ఇంకెందుకు ఉపయోగిస్తుంది? ఎనయగ (అవన్నీ వృద్ధిచెందివున్నచోట) పరమపదము ఇంచుకయినా సాధ్యంకాదు.

తరుణులు (స్త్రీలు) యెంతమందివున్నా పురుషులకు మదనతాపము కలుగుతూనే వుంటుంది. ఏమాత్రం తగ్గదు. సిరిసంపదలెన్నివున్నా చింతలు (దిగులు) పెరుగుతుందేకాని తరుగదు. స్థిరమైన శ్రీవేంకటేశ్వరా! నిన్ను కొలిచినయెడల ఆనందము పెరుగుతూనే వుంటుంది. వారికి బెళకులు (చలించిపోవుటలు) లేవు (వుండవు).

సంపుటి: 3 కీర్తన : భూమిలోన గొత్తలాయ బుత్రోత్సవ మిదివో
సంఖ్య : 17 పుట : 12 రాగం: రామక్రియ

రామక్రియ

77 భూమిలోనఁ గొత్తలాయఁ బుత్రోత్సవ మిదివో
నేమపు కృష్ణజయంతి నేఁడే యమ్మా ॥ పల్లవి॥

కావిరి బ్రహ్మాండము కడుపులోనున్నవాని
దేవకి గర్భమున నద్ధిర మోచెను
దేవతలెల్ల వెదకి తెలిసి కాననివాని
యీవల వసుదేవుఁడు యెట్టు గనెనమ్మా. ॥భూమి॥

పొడవుకుఁ బొడవైన పురుషోత్తముఁడు నేఁడు
అడరి తొట్టెలబాలుఁడాయ నమ్మ
వుడుగక యజ్ఞ భాగమొగి నారగించేవాఁడు
కొడుకై తల్లిచన్నుగుడిచీనమ్మా. ॥భూమి॥

పాలజలధియల్లుండె(డై?) పాయకుండేయాతనికి
పాలవుట్లపండుగ బాఁతే (తా?) యనటే
ఆలరి శ్రీవేంకటాద్రి నాటలాడనే మరిగి
పేలరియై కడు పెచ్చుపెరిగీనమ్మా ॥భూమి॥ 17

అవతారిక:

శ్రీకృష్ణజయంతి పర్వదినాన అన్నమాచార్యులవారు వినిపించిన కీర్తన ఇది. "ఓ అమ్మలారా! మనం అంతా నియమంతో జరుపుకొనే కృష్ణజయంతి వేడుక నేడు నందుని ఇంట పుత్రుడుదయించాడనె వుత్సవం భూమిపై ప్రతియేడూ జరుపుకొంటున్నా అది యెప్పటికప్పుడు కొత్తలాయె" అంటున్నారు అన్నమాచార్యులవారు. ఆ అల్లరి కృష్ణుడు శ్రీవేంకటాద్రిపై ఆటలాడుట మరిగిపేలరియై కడుపెచుపెరిగీనమ్మా! అంటున్నారు. అంటే

యేమిటి? 'పేలరి' అంటే వదరుబోతు అని అర్థం. వాగుడుకాయ అన్నమాట. మరి "బాత్రేయనటే" అంటే....?

భావ వివరణ:

ఓ అమ్మలారా! ఇదివో ఈ పుత్రోత్సవము (పుత్రుని పుట్టుక సందర్భంగా చేయు పండుగ) భూమిపై కొత్తలాయ (ఎప్పటికప్పుడు కొత్తగానే వుంటుంది). నేడే అట్టి కృష్ణజయంతి. ఇది నేమపు పండుగ (నియమం ప్రకారం జరిపే పండుగ).

కావిరి బ్రహ్మాండము (అనంత నిశీధిలో యెడతెగక విస్తరించే విశ్వము) తన బొజ్జలో దాచుకొన్న ఈ విశ్వరూపుని కంసుడి చెల్లెలు దేవకీదేవి తన గర్భమున మోసిందమ్మా! అద్దిర! (అదిరా... ఎంతంటే) దేవతలంతా త్రిభువనాలు వెదకినా కనబడని 'పరమాత్మ' యీ యాదవరాజు వసుదేవుడికి యెట్లా కనుపించాడో కదా!

ఆ దేవదేవుని లీలలు చెప్పలేమమ్మా!

పొడవుకు బొడవైన (ఉన్నతోన్నతుడైన) ఈ పురుషోత్తముడు నేడు, అడరి (అతిశయించి) తొట్టెలో బాలుడు (ఉయ్యాలలో శిశువు) యైనాడమ్మా! ఈ ప్రపంచంలో యెక్కడ యే యజ్ఞం జరిగినా ఆ యజ్ఞభోక్త (యాగఫలములో మొదటిభాగం ఈయనకే అర్పిస్తారు. దానిని ఆయన వుడుగక (వదలక) నారగించీ (స్వీకరిస్తాడు). అట్టి యజ్ఞపురుషుడు, కొడుకై చనుబాలుత్రాగుతున్నాడే... ఆహా! ఏమిఈ పరమాత్ముని లీల.

ఈయన యెవరో తెలుసునటే? క్షీరసాగరునికి స్వయంగా అల్లుడు. పైగా ఆయన నివాసస్థానంకూడ పాలసముద్రమే. అటువంటి వాడికి పాలవుట్లు తెంచేపండుగ 'బాతేయనటే' (ప్రేమకలిగిందటనే?) ఎంతెంత మనం పండుగ చేసికొంటే అదే ఆయనకు పండుగ. ఇవన్నీ ఆవిశ్వాత్మునికెందుకమ్మా? నేడు ఈ తిరుమలలో ఆలరి (అల్లరిపిల్లవాడే) శ్రీవేంకటాద్రిపై ఆటలాడమరగినాడు. పేలరియై (అతివాగుడుకాయయై) ఈ పిల్లవాడు కడుపెచ్చుపెరిగీనమ్మా (తెగ విజృంభిస్తున్నాడమ్మా!)

సంపుటి: 3 కీర్తన : ఇందులోననే నెవ్వరిబోలుదు
సంఖ్య : 581 పుట : 390 రాగం: పాడి

పాడి

78 ఇందులోన నే నెవ్వరిఁబోలుదు
అంది నీవాఁడ నేననుకొంటిఁజుమ్మీ ॥ పల్లవి॥

జలజనాభ నీ శరణనువారలు
అల నారదసనకాదులు
కెలన మరియు నీ కింకరవర్తులు
తెలిసినబ్రహ్మాదిదేవతలు ॥ఇందు॥

నోరార హరి నిను నుతించువారలు
చేరువనుండేటిశేషాదులు
ధారుణిలో నీదాసాన(ను?) దాసులు
మారుతిముఖ్యులు మహామహులు ॥ఇందు॥

బడి నీచే ముక్తివడసినవారలు
సుడిగొనుమునిజనశుకాదులు
కడఁగిన శ్రీవేంకటపతి నీవే
తడవి నన్ను దయదలఁచుమీ ॥ఇందు॥581

అవతారిక:

శ్రీమన్నారాయణుని ఆశ్రయించేవారిలో మూడు రకాలవారుంటారు. నారదమహర్షివంటి శరణాగతులు, ఆదిశేషునివంటి దాసులు, శుకమహర్షివంటి జీవన్ముక్తులు. వీరందరి ఆశయం ఒకటే అయినా అవలంభించిన మార్గాలలో భిన్నత్వమున్నది. ఇందులో నేనెవ్వరి బోలుదును స్వామీ! అని ప్రశ్నిస్తున్నారు అన్నమచార్యులవారు. నేనుమాత్రం నీవాడను అనుకొంటూనే బ్రతుకు వెళ్ళమారుస్తున్నానని

అంటున్నారు. తడవి నన్ను దయచూడుము ప్రభూ! నవవిధ భక్తిలో యేదోఒక విధమున తనను కడతేర్చుమని బ్రతిమిలాడుతున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఈ క్రిందివారిలో నేనెవ్వరి బోలియున్నానో తెలుపుము ప్రభూ! అంది (స్థిరపడి) ఇంతవరకు నేను నీవాడనే అని అనుకొంటున్నాను సుమా!

ఓ జలజనాభా! (పద్మనాభా) ఆనాటి నారదుడు సనకసనందనాది ఋషులు కెలన (దిక్కు) నీవే అన్నారు. వారు నీ శరణాగతులు. శరణని నిన్ను ఆశ్రయించినవారు. మరియు తెలిసిన (విఖ్యాతులైన) బ్రహ్మాదిదేవతలు నీ కింకరవర్తులు (భృత్యులు) వీరంతా ఆవిధముగా నీ శరణాగతులై నిశ్చింతగానున్నారు.

ఓ శ్రీహరీ! ఆదిశేషుడు నీ చేరువనే వుండి నీకు పానుపువలె సేవించుచు, నోరార (వేయినోళ్ళతో) నిన్ను కీర్తించుచు నీవాడైనాడు. మారుతి (ఆంజనేయుడు) మొదలైన మహామహులు ఈ ధారుణిలో (భూమిపై) నీదాస్యమును తరించే మార్గముగా నెంచుకొన్నారు. వారంతా నీ దాసానుదాసులుగావుండి నీ భక్తులకు యెన్నో వుపకారాలు చేస్తున్నారు.

ఓ పరమపురుషా! శుకమహర్షి భారతము వ్రాసిన తన తండ్రి వ్యాసునివలె, తను కూడా భాగవతము వినిపించి బడి (శీఘ్రముగా) నీచే ముక్తిని బడసినాడు. వారంతా సుడిగొను (చుట్టుకొని) నీవద్దనే వుండే జీవన్ముక్తులు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే నన్ను కడగి (యత్నించి) తడవి (గ్రహించి) దయదలచవయ్యా! ఎందుకంటే నేను నీవాడను తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : అతని నమ్మలే రల్పమతులు భువి
సంఖ్య : 533 పుట : 358 రాగం: వసంతవరాళి

వసంతవరాళి

79 అతని నమ్మలే రల్పమతులు భువి
నతఁ డాద్యుఁడు పరమాత్ముఁడు ॥ పల్లవి॥

సకలలోకపతి సర్వేశ్వరుఁడట
వొకఁడిఁక దొర మరి వున్నాఁడా
ప్రకటించఁగ శ్రీపతియే దాతట
వెకలి నియ్యఁ గొన వేరేకలరా. ॥అత॥

దివిజవందితుఁడు దిక్కుల హరియట
యివల మొక్క సురలిఁక వేరీ
కవ నంతర్యామి కరుణాకరుఁడట
వివిధభంగులను వెదకఁగనేలా. ॥అత॥

వేదాంగుఁడు శ్రీవేంకటపతియట
ఆదిమతము లిఁక నరసేదా
యేదెస నెవ్వరి కెప్పుడుఁ గలఁ డితఁ-
డీదేవుఁడె మన కిహపర మొసఁగ. ॥అత॥533

అవతారిక:

శ్రీహరి పరమాత్మ, ఆదిదేవుడు. కొందరు అల్పమతులు. ఈ సత్యమును నమ్మలేక చెడిపోతున్నారు. సర్వలోకపతి శ్రీపతియేనని తెలియకున్నారు. అందరి దిక్కూ ఆ దివిజవంద్యుడేనని అరయలెకున్నారు. వేదాంగములచే నేర్చి భావించవలసిన శ్రీవేంకటేశ్వరుని శరణని ఇహపరములను సాధించలేకున్నారు. కనుక మొదటి మెట్టు నమ్మం,

చివరిమెట్టు శరణాగతి మధ్యలో అన్నీ నమ్మకాన్ని సడలించే జారుడుమెట్లే. కానీ భయపడకండి... కరివరదుని శరణని పరమునెరిగే దారి నరయండి.

భావ వివరణ:

భువిని (ఈభూమిమీద) అల్పమతులు (తెలివతక్కువవారు) ఆతని (ఆ శ్రీహరిని) నమ్మలేరు, (లేనేలేడంటారు). నిజమేమిటంటే అతడు ఆద్యుడు (అన్నిటికి ఆదియైనవాడు), పరమాత్ముడు.

ఆయన సకలలోకపతి, సర్వేశ్వరుడూ అతడేనట. ప్రకటించగ (వెల్లడిజేయగా) మరి దొర (మరివేరొక అధిపతి) వొకడిక (ఇంకావొకడు) వున్నాడా? శ్రీపతి యొక్కడే దాతట. వెకవినియ్యగా (ప్రత్యక్షమీయగ) వేరొకరు కొనన్ (చిట్టచివర) కలరా?

అన్ని దిక్కులయందును మొక్కుటకు ఆదిక్పాలకులుంటారు. ఆ దివిజులందరికీ వంద్యుడు (పూజింపదగినవాడు) శ్రీహరియే. ఇవల (ఇటువైపున) ఇంకా అన్యులైన సురలేరీ? ఆక్రమించిన అంతర్యామి యెల్లరకు హరియే. ఆయన కరుణాకరుడట. మనలోనేవుండు వానిని, వివిధ భంగులను (రకరకములైన మార్గములలో) వెదకగనేలా (వెదుకుటెందులకు?)

శ్రీవేంకటేశ్వరుడు వేదాంగుడు (వేదములే అంగములుగా గలవాడు). ఆయన శరణాగతితో నేను ఆయన నాశ్రయించితిని (విశిష్టాద్వైతినైతిని). అటువంటప్పుడు "ఆది మతములికనరసేదా? (తొల్లిటి మతములను గురించి ఆలోచించుటెందులకు?) ఏదెస నెవ్వరి కెవ్వడుగలడు? (ఏ దిక్కుయైనా ఈ లోకంలో యెవ్వరికెవరున్నారు? అందరూ మధ్యలోవచ్చి మధ్యలో పోయేవారే కదా!) మనకు ఇహము, పరమునొసగెడివాడు ఈ దేవుడే. ఇంకెవ్వరూ లేరు, వుండరు.

సంపుటి: 2 కీర్తన : హరియవతారమితడు అన్నమయ్య

సంఖ్య : 100 పుట :67 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

80 హరియవతార మీతఁడు అన్నమయ్య
అరయ మాగురుఁ డీతఁ డన్నమయ్య ॥ పల్లవి॥

వైకుంఠనాథునివద్ద వడిఁ బాడుచున్న వాఁడు
ఆకరమై తాళ్లపాక అన్నమయ్య
ఆకశపు విష్ణుపాదమందు నిత్యమై వున్నవాఁడు
ఆకడీకడఁ దాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

క్షీరాబ్ధిశాయి నిట్టే సేవింపుచు నున్నవాఁడు
ఆరితేరి తాళ్ళపాక అన్నమయ్య
ధీరుఁడై సూర్యమండలతేజమువద్ద నున్నవాఁడు
ఆ రీతులఁ దాళ్లపాక అన్నమయ్య ॥హరి॥

యీవల సంసారలీల యిందిరేశుతో నున్నవాఁడు
ఆవటించి తాళ్లపాక అన్నమయ్య
భావింప శ్రీవేంకటేశుపాదములందె వున్నవాఁడు
ఆ (హా)వ భావమై తాళ్లపాక అన్నమయ్య ॥హరి॥100

అవతారిక:

తాళ్లపాక పెదతిరుమలాచార్యులవారు తన తండ్రి అన్నమాచార్యులవారిని కీర్తిస్తూ చెప్పిన కర్ణపేయమైన కీర్తననాస్వాదించండి. అన్నమయ్య శ్రీహరి అవతారమని చెబుతున్నారు. తన గురువు కూడా అన్నమయ్యయేనంటున్నారు. వైకుంఠవాసమునొందిన తనతండ్రి నిత్యమూ క్షీరాబ్ధిశయనుని సేవించుటలో

ఆరితేరియున్నాడట. శ్రీవేంకటేశ్వరుని పాదముల చెంత తన హావభావములను ప్రకటిస్తూ అన్నమయ్య నేటికీ వున్నాడట.

భావ వివరణ:

ఈ అన్నమయ్య స్వయముగా శ్రీహరి అవతారమే. ఈయనే మాకు జన్మనిచ్చి శ్రీహరి భక్తియు నొసగిన గురుపుంగవులు.

వైకుంఠనాథునివద్ద ఆకరమై (స్థానమును పొందిన వాడై) ఈ తాళ్ళపాక అన్నమాచార్యులవారు వడి (వేగముగా) హరిని కీర్తించుచు పాడుచున్నారు. ఆకాశవీధిలో విష్ణుని పాదపద్మముల చెంత ఈయన నిత్యమై (శాశ్వతుడై) వున్నాడు. ఈ తాళ్ళపాక అన్నమయ్య ఆకడ (ఆ వైకుంఠసీమలోను) ఈ కడ (తిరుమల శిఖరాలచెంతను) హరి సేవలోనే గడుపుతున్నారు.

ఆరితేరిన (నిష్ణాతులైన) ఈ తాళ్ళపాక అన్నమయ్య, క్షీరసాగరశయనుడైన శ్రీహరిని ఇట్టే సేవింపుచూ వున్నవాడు. అదే ఆయనకు నిత్యకృత్యమైనది. సూర్యమండలపు దివ్యతేజస్సుతో వెలుగులు జిమ్మే చోట అన్నమయ్య ధీరుడై తేజో మూర్తియైయున్నాడు.

ఈవల (ఈ కలియుగంలో) సంసారలీల ప్రకారం ఇందిరానాథునితో ఈ తాళ్ళపాక అన్నమయ్య ఆవటించి (పొందికతో) యున్నవాడు. భావించిచూడగా శ్రీవేంకటేశ్వరుని పాదపద్మముల చెంతనే తన హావభావములను ప్రకటించుచు తేజోరూపుడై ఈ అన్నమాచార్యులవారు హరిసేవలో వున్నారు.

సంపుటి: 5 కీర్తన : సుతుని నరకుని జంప జూచినాడవు సుమ్మీ

సంఖ్య : 66 పుట : 45 రాగం: పాడి

పాడి

81 సుతుని నరకునిఁ జంపఁ జూచినాఁడవు సుమ్మీ
మతి నన్నుఁ దలఁచక మానిన నీకాన ॥ పల్లవి॥

ఎత్తుక నీతోడఁబట్టు హిరణ్యకశిపుని
నెత్తురు దాగితి సుమ్మీ నేఁడే రాకుంటే
ఉత్తలాన నేడనైనా నుండుదువో యని భీతి
బిత్తరముగాఁ బెట్టితి పెట్టరాని యాన ॥సుతుని॥

కప్పుక మేనమామ కంసుని ప్రాణానకు
తప్పినవాఁడవు సుమ్మీ తడసితేను
ఇప్పుడిట్టే నీవు రాని యీరసానఁ బ్రియములు
చెప్పలేక పొడిచితి చెడుగైన యాన ॥సుతుని॥

సిరుల మేన మరఁది శిశుపాలు నీ విట్టే
పొరిగొంటివి సుమ్మీ పోయితే నీవు
తిరువేంకటేశ నిన్నుఁ దివిరి కూడి (డే?) వని
కరుణఁ బెట్టితి నీకుఁ గపటాన నాన ॥సుతుని॥

అవతారిక:

పరంధాముని నిందాస్తుతితో ప్రార్థించిన భక్తాగ్రేసరులు కోకొల్లలు. బాధతాళలేక నిందించినా అది స్తుతితోనే ముగుస్తుంది. ఈ కీర్తన ప్రత్యేకత యేమంటే అన్నమయ్య. వ్యావహారిక దృష్టిలో 'కొడుకు'ను చంపిన క్రూరుడు, 'అన్నను' చంపిన అతి జిత్తులమారి, మేనమరిదిని చంపిన కఠినుడు నన్ను కాపాడతాడో లేదోనని యేవేవో ఒట్లు పెట్టి నన్ను కాపాడమని వేడుతున్నాను ఇవన్నీ 'కపటపు ఆనలే' ప్రభూ! ఎలాగైనా

నీదయ పొందాలనే నా 'ప్రయత్నం' అంటున్నారు పరమాత్మతో. ఇటువంటి కీర్తన మనసును కరిగిస్తుంది.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు కఠినాత్ముడవు. నీసుతుడైన నరకుని (వాడు శ్రీహరికీ భూదేవికి, హిరణ్యాసుర వధానంతరం పుట్టిన కొడుకు) చంపజూచి, వాడిచావు వాడి తల్లి అంశతో జన్మించిన సత్యభామ చేతితో జరిపించావు). నన్ను దయతలచక మానితే నీకు 'ఆన' (ఒట్టే సుమా!)

నీవు నరసింహుడవై హిరణ్యకశిపుని చీల్చి చంపి వాడినెత్తురు నేలరాలరాదని వాడి నెత్తురు త్రాగినావు. ఇంతాజేసి వాడు నీతోడబుట్టిన అన్నయే కదా! వాడు చెల్లెలుదితి కొడుకైతే, నీవు అక్క అదితి కొడుకువి. ఉత్తలాన (తొందరపాటుతో) యెక్కడైనా నాకోసం పొంచివున్నావేమోనని భీతిచే బిత్తరజెంది పెట్టరాని 'ఆన' బెట్టితినయ్యా! నన్ను క్షమించు. నీవు నన్ను చంపితే అంతకంటే నేకోరునదేమున్నది తండ్రీ!

నీవు మేనమామను చంపిన గొప్ప మేనల్లుడవని అందరూ యెరిగినదే కదా! మామూలుగా చంపవచ్చును కదా! వాడిని (కంసుని) ఆకాశవాణిద్వారా హెచ్చరికపంపి మేనల్లుళ్ళని చంపిన క్రూరుడన్న పాపం అంటగట్టి, వాడిని ప్రాణానకు తప్పినవాడవు (ప్రాణాలు తీసినవాడవు). ఈరసార (కొద్దిగా ఈర్ష్యతో) ప్రియములు చెప్పలేక, తొందరపడి ఇప్పుడు నేను యేవేవో 'ఆన'లు (ఒట్లు) పెట్టేను. అంతే స్వామీ! వాటిని లెక్కజేయకు.

స్వయముగ నీ మేనమరిది శిశుపాలుని సుదర్శన చక్రంతో పొరిగొంటివి (తలనరికేవు). సభలో తరిమితరిమి చంపినావు. అందుకు నూరుతిట్లు నిన్ను తిట్టినపాపము వాడి చేత చేయించావు. పోయితే నీవు (ఇకపోతే నీవు) తిరువేంకటేశ్వరుడవై తివిరి (ప్రయత్నముతో) నన్ను కూడేవని (అనుగ్రహింతువని) నీకు కపటపు ఆనలు పెట్టాను స్వామీ! నన్ను కరుణతో చూస్తే చాలు తండ్రీ! నీకు ఆనలు పెట్టే ధైర్యం నాకెక్కడిది ప్రభూ!

సంపుటి: 5 కీర్తన : మొలనూలి గొల్లెత మురియుచును
సంఖ్య : 372 పుట : 252 రాగం: శుద్ధదేశి

శుద్ధదేశి

82 మొలనూలి గొల్లెత మురియుచును
వలవంతఁ దిరిగీని వాడవాడలను ॥ పల్లవి॥

సంపెఁగలతురుముతో చల్లలమ్మీనిదివొ
వంపుమోము గొల్లెత వాడలను
యింపులకోరికె తో నిందిరాపతి యెదుట
జంపుల నటనలతో సాళగింపుచును ॥మొలనూ॥

నొసలికస్తూరితోఁ గన్నుల నవ్వీనిదివో
వసివాడు గొల్లెత వాడలను
కసరుచు హరిమీఁదికాఁకల కోపముతో
యెసరుఁజెమట గోర యెమ్మెలఁ జిమ్ముచును ॥మొలనూ॥

చెలవంపుటుంగరాల చెయి వీచీనిదివో
వలపుల గొల్లెత వాడలను
కలికియై తిరువేంకటవిభుకౌఁగిట
అలసిన నటనల నల్లంతనేఁగుచును. ॥లలల॥

అవతారిక:

ఆ గొల్లెత మొలనులు (స్త్రీలు ప్రత్యేకముగా ధరించు మొలత్రాడు) ధరించినదై మురిపెముతోనున్నదట. ద్విగుణీకృతమైన అందంతో ఆమె వాడవాడలా విరహవేదనతో తిరుగుతున్నదట. ఆమె సంపెంగపూలు కొప్పులో తురిమింది. నొసటిమీద కస్తూరీ తిలకం ధరించింది. ఉంగరాల చేతిని విలాసంగా వూపిందట. తరువాత వేంకటపతి సందిట నర్తించి

అలసినదట. ఇది సరస శృంగార కీర్తన. అన్నమాచార్యులవారి శృంగార భక్తి నభూతో నభవిష్యతి.

భావ వివరణ:

మొలనూలు (స్త్రీలు ధరించునట్టి మొలత్రాడు) ధరించిన ఆ గొల్లెత (గొల్లభామ) మురియుచును (సంతోషంతో మురిసిపోతూ) వాడవాడలా (పల్లెలోని తన పేటంతా) వలవంత దిరిగీని (మదనవేదనతో తిరుగుచున్నది).

ఆ గొల్లెతవంపు మోము గొల్లెత (గుండ్రని ముఖముగల గొల్ల భామ). ఆమె చల్లలమ్ముతుంది. ఆమె తలలో సంపెంగపూలు ధరించినది. ఆమె ఇందిరాపతియైన శ్రీకృష్ణుని వలచినది. మధురమైన కోరికలతో రగులుచున్న ఆమె కదలాడుచున్న 'చెంపసరాలు' ధరించి కలివిడిగా ఆ గొల్లవాడంతా తిరుగుచున్నది.

ఆమె తన నొసట (నుదురుపై) కస్తూరి తిలకమును ధరించినది. తన కన్నులతోనే ఆమె మనోహరంగా నవ్వుతున్నది. వాడ అంతా కలియతిరుగటచే వసివాడిన (అలసిన). ఆమె ముఖము నీరసముగానున్నది. హరిమీద (కృష్ణునిపై) కసరుచు (విసుగుకొనుచు) కాకకోపముతో (మండించే క్రోధముతో) ఆ గొల్లెత, యెసరుజెమట (వేడిచెమటను) చిమ్ముచున్నది.

వలపులను చిందిచుచున్న ఆ గొల్లెత వాడ అంతా కలయతిరుగుచున్నది. చెలువంపుటుంగరములను (సొగసైన అంగుళీయకములను) వేళ్ళకు ధరించిన ఆమె తన చేయి (చేతిని) ఇదిగో ఎలా వీచుచున్నదో చూడండి. ఆమె కలికియై (అందాలరాసియై) శ్రీవేంకటేశ్వరుని కౌగిట కరగి నర్తించుచు అటూఇటూ యేగుచు (నడచుచు) మిక్కిలి అలసినది.

సంపుటి: 5 కీర్తన : శిన్నెక తేవే శెలువుని తా
సంఖ్య : 268 పుట : 183 రాగం: మేచబౌళి

మేచబౌళి

83 శిన్నెక తేవే శెలువుని తా
వెన్నలు సవిగొను వెన్నుని తా ॥ పల్లవి॥

మూటల్ మాటల్ మూరల్ బారల్
బాటల్ సదివే బాపలు తా
వేటల్ వీపుల్ వేలుపు గుడుపుల్
తేటలు మరగిన దేవుని తా ॥శిన్నెక॥

వాకుల్ చీకుల్ వాదుల్ పోదుల్
సోకపు తొల్లిటి సుద్దుల్ తా
పోకులు లోకుల్ పొగడఁగ మనిపెడి
కేకిగరుల తల కిష్ణుని తా ॥శిన్నెక॥

బగ్గుల్ నగ్గుల్ బావుల్ సొరె (ర?) గా
దగ్గర వెరపగు తపసుల తా
సిగ్గుల్ వాపెడి శ్రీ వేంకటపతి–
నగ్గపు సొమ్ములయాతని తా ॥శిన్నెక॥

అవతారిక:

జానపదుల బాణీలో కొనసాగే అన్నమాచార్యులవారి కీర్తననాస్వాదించండి. ఒక గోపిక ఇంకొక గోపికను శిన్నెక అనిపిలిచి తన చెలికాడైన 'కిష్ణుని' (కృష్ణుని) తీసికొని రమ్మని వేడుకొంటున్నది. వాడు వెన్నల నారగించేవెన్నుడట. ఆతనిని తెమ్మంటున్నది. ఈ కీర్తనలో తా అని ప్రతిచరణం ముగిసినందువలన 'తా' అనునది తాళము కోసం తాలద్యోతకమని తోచుచున్నది. చరణములలో కొన్ని మాటలు ధ్వని

ప్రధానమైనవి. కావున చిందేసే ఆటకు ప్రత్యేకించినవే. కీర్తన ప్రతిపదార్థం అసంభవమని నా భావన.

భావ వివరణ:

ఓ శిన్నెకా! (చిన్నక్కా!) శెలువుని (చెలికాడైన ఈ శ్రీకృష్ణుని) తేవే (నాయెదుటకు తీసికొనిరావే). ఈతడెవరో తెలియునా? చిన్నప్పుడు ఇంటింటా వెన్నదొంగతనం చేసి, చవిగొన్న (రుచి మరిగిన) వెన్నుడు (శ్రీకృష్ణుడు).

ఈ అల్లరి పిడుగుకు ఆనాడు, మాటలు మూటలుగా వుండేవి. అవి బారలు, మూరలు (బారెడు మూరెడు మాటలు... అంటే... పెద్దగా ఆరిందలా మాట్లాడేవాడు.) బాటలు సదివే బాపలు తా (వేదపండితులమని విఱ్ఱవీగే బ్రాహ్మణులకు హితోపదేశము చేశాడు.) వేలుపు కుడుపులు (దేవతల కివ్వవలసిన నైవేద్యము) ఇవ్వలేదని అలిగిన దేవేంద్రుడి దేవతల వీపులు సాపుచేసి వేటాడినాడట. ఎందుకంటే ఈయన తేటలు మరిగిన దేవుని తా (ప్రసన్నత అతిశయించిన దేవదేవుడట).

ఈ చరణానికి అన్నమయ్య భావన సులభగ్రాహ్యము కాదు. నా భావన నా స్ఫురణయే..)

తొల్లిటి సోకపు సుద్దులు (దేవతల తొలినాటి కష్టములు) తొలగించుటకు కేకిగరులతల కిష్ణుడు (నెమలి పింఛమును తలపై ధరించిన శ్రీకృష్ణుడు, లోకులు పొగడగ పోకులు (లీలలు) ప్రదర్శించాడు.

దుర్మార్గులు పెట్టు అంతరాయములు పోయి వెఱపగు తాపసుల (భీతిల్లిన మునుల) దగ్గరయై ప్రశాంతముగానున్నారు. దివ్యాభరణములు ధరించిన శ్రీవేంకటేశ్వరుడు భక్తుల సిగ్గులు బాపెడి పరమపురుషుడు.

సంపుటి: 5 కీర్తన : పసులు గాచేటి కోల పసపుజేల
సంఖ్య : 96 పుట : 66 రాగం: ముఖారి

ముఖారి

84 పసులు గాచేటి కోల పసపుఁ జేల
పొసఁగ నీకింతయేల బుద్ధుల గోల ॥ పల్లవి॥

కట్టిన చిక్కపు బుత్తి కచ్చకాయల తిత్తి
చుట్టిన పించెపుఁబాగ చుంగుల సోగ
ఇట్టి సింగారము సేయ నింత నీకుఁ బ్రియమాయ
వెట్టి నీచేఁతల మాయ విట్టలరాయ ॥పసులు॥

పేయలఁ బిలుచుకూఁత పిల్లఁగోవి బలుమోఁత
సేయరాని గొల్లెతల సిగ్గులచేఁత
ఆయెడలఁ దలపోఁత యమున లోపలి యీఁత
వేయరాని మోపులాయ విట్టలరాయ ॥పసులు॥

కొంకులేని పొలయాట కూరిములలో తేట
అంకెల బాలులతోడి యాట పాట
పొంకపు తుత్తురు కొమ్ము పొలుపైన నీ సొమ్ము
వేంకటనగము చాయ విట్టలరాయ. ॥పసులు॥

అవతారిక:

విఠ్ఠల దేవుని విట్టలరాయా అని సంభోదిస్తూ గొప్ప జానపదకీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఇదివరలో ఇటువంటి కీర్తన నాస్వాదించినప్పటికీ దీని ప్రత్యేకత యేమంటే చాలా మాటలు యధాతధంగా నిఘంటువులలో దొరకవు. "పసపు జేల" అంటే ఏమిటి? పసుపురంగు చేలము అని అర్థం చేసికోవాలి, అంటే పీతాంబరుడైన కృష్ణుడు, దూడలను కాచే ఈ విట్టలరాయుడు వింతకూతవేసి ఆ దూడల్ని

తన దగ్గరకు పిలుస్తాడట. ఎంతని చెప్పను? గొప్ప వర్ణన. మీరే రుచి చూడండి.

భావ వివరణ:

ఈ విట్టలరాయుడు (విఠ్ఠలుడు) యెలావున్నాడంటే ఈతడు పసుపుజేల (పీతాంబరము) కట్టిన శ్రీకృష్ణుడు ఇతని చేతిలో పసులుగాచే కోల (ముల్లుకఱ్ఱ) వుంటుంది. స్వామీ! పొసగ (అతిశయించుటకు) నీకింత బుద్ధుల గోల యెందుకయ్యా!

ఇతడు తన బుత్తి (భోజనము) చిక్కములో (చిన్న వుట్టిలో) కట్టి తెచ్చుకొన్నాడు. గచ్చకాయల తిత్తి (గచ్చకాయరంగులో వుండె తన వుంగరాల జుట్టును కుచ్చులుగా కట్టుకొన్నాడు. చుట్టిన తలపాగలో నెమలిపించము గుచ్చి అలంకరించుకొన్నాడు. ఇటువంటి సింగారము నీకు ఇంత ప్రియమా విట్టలరాయా! నీచేతలు యెంతవెట్టి (పనికిమాలిన) వో చెబుతాను, వినవయ్యా!

ఈ విట్టలరాయుడు తన ఆవు పేయలను (దూడలను) ఒక వింతయైన 'కూత'తో పిలిచి ఒకచోట చేరుస్తాడు. అతని పిల్లఁగోవి (మురళి) బలు మోత (పెద్ద ధ్వని చేస్తుంది). అతడు గొల్లెతలతో చేయరాని సిగ్గుల చేతలు చేస్తాడు. ఆపైన యమునాతటిలో అతని లీలలు తలపోతలు వేయరాని మోపులు (ఆరోపణలకు) దారితీశాయి.

కొంకులేని (ఏమాత్రమూ జంకులేని) అతని పొలయాట (రాసలీల) కూరిములలో తేట (ప్రణయమాధుర్యపు తేట). అంకెల బాలులతోటి (తన ఈడు గొల్ల బాలురతో) నిత్యమూ ఆటపాటలతో కాలక్షేపం చేస్తాడు. ఈ వేంకటాద్రి నీడలోని విట్టలరాయా! నీ పొలుపైన సొమ్ము (ఒప్పయిన ఆభరణం) యేమిటో తెలుసునా స్వామీ? నీ పొంకపు తుత్తురుకొమ్ము (నీ అందమైన తూతూ ధ్వనిచేసే శృంగనాదము). దానినే కొందరు "కొమ్ముబూర" అంటారు.

సంపుటి: 5 కీర్తన : కుందణంపుమై గొల్లెత తా–
సంఖ్య : 92 పుట : 63 రాగం: ఆహిరి

ఆహిరి

85 కుందణంపుమై గొల్లెత తా–
నెందును బుట్టని యేతరి జాతి ॥పల్లవి॥

కప్పులు దేరేటి కస్తురి చంకల
కొప్పెర గుబ్బల గొల్లెత
చప్పుడు మట్టెల చల్లలమ్మెడిని
అప్పని ముందట హస్తిణిజాతి ॥కుంద॥

దుంప వెంట్రుకల దొడ్డతురుముగల–
గుంపెన నడపుల గొల్లెత
జంపుల నటనలఁ జల్లలమ్మెడిని
చెంపల చెమటల చిత్తిణిజాతి ॥కుంద॥

వీఁపున నఖములు వెడవెడ నాఁటిన
కోపపుఁ జూపుల గొల్లెత
చాఁపున కట్టిగఁ జల్లలమ్మెడిని
చాఁపేటి యెలుగున శంకిణిజాతి ॥కుంద॥

గారవమున వేంకటపతి కౌఁగిట
కూరిమిఁ బాయని గొల్లెత
సారెకు నతనితో చల్లలమ్మెడిని
భారపుటలపుల పద్మిణిజాతి ॥కుంద॥

అవతారిక:

కావ్యనాయికలను శృంగారశాస్త్రం నాలుగురకాలుగా వర్ణించింది. పద్మినిజాతి స్త్రీ, హస్తిణి, చిత్తిణి, శంకిణి అని చెప్పబడిన వీరిలో ప్రతి యువతి తన శారీరక, మానసిక లక్షణాలను బట్టి ఆ జాతికి చెందిన స్త్రీగా నిశ్చయింపబడినది. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు నలుగురు గొల్లెతలను ఆ విధంగా విభజించి బంగారు శరీరఛాయతోనున్న గొల్లెత తానెందును

బుట్టని యేతరిజాతి చిన్నది అంటున్నారు. అంటే యేమిటి? సరసశృంగారంకాస్త గూఢంగా వుంటే అందం కదా! భావవివరణ జాగ్రత్తగా చదవండి. కొసమెరుపేమంటే, నలుగురికీ ఆ నల్లనివాడంటే వుల్లములో జల్లే.

భావ వివరణ:

కుందణంపుమై (బంగారు శరీరచ్ఛాయగల) గొల్లెత (ఆ గొల్లభామ) తాను యెందును (ఏజాతిలోనూ) పుట్టని యేతరిజాతి (అతిశయముగల స్త్రీ). అనగా వూహాసుందరి.

కప్పులుదేరేటి కస్తూరి (నల్లని కస్తూరీ పరిమళముగల) బాహు మూలములామె ప్రత్యేకత. ఆమె కొప్పెర గుబ్బల (వున్నత కుచయుగళము) గల గొల్లెత. ఆమె చల్లలమ్ముటకు పోతుంటే ఆమెమట్టెల చప్పుడు ప్రతిధ్వనిస్తుంది. అప్పనిముందట (హరియెదుట) ఆ హస్తిణీజాతి గొల్లెత నడయాడుచున్నది.

ఆమె తల వెంట్రుకలు, దుంపలు కట్టి (కుచ్చులు కట్టి) పెద్ద కొప్పుతో వున్నది. ఆమె నడుస్తుంటే గుంపెనగా (అట్టహాసముగా) వుంటుంది. ఆమె కదులుతుంటే ఆమె చెవులకు దరించిన జంపులు (చెంపసరములు) నర్తించుతాయి. చల్లలమ్ముటకు ఆమె మధురానగరంలో నడుస్తుంటే శ్రమవల్ల ఆమె చెంపలు చెమటను చెమరించుచున్నవి. ఆమె తప్పకుండా చిత్తిణీజాతి స్త్రీయే సుమా!

ఇదిగో ఈ గొల్లెతను చూడండి. ఉద్రేకమున ఈమె వీపుపై నఖక్షతములను సైతము జేయగలదు. ఈమె చూపులే చురచురమనునట్లు కోపాగ్నితో వుంటాయి. ఆమె నడుస్తుంటే పరుగెడునట్లుంటుంది. ఈమె చల్లలమ్ముటకు చాపేటి యెలుగున (పెద్ద గొంతుతో కేకలు వేస్తూ అమ్ముతుంది). ఈ జవ్వని శంకిణిజాతి గొల్లెత.

ఈ గొల్లెతను చూశారా? ఈమె అతిశయించిన గారవము (గౌరవము)తో శ్రీవేంకటేశ్వరుని కౌగిటిని యెన్నడు విడువదు. తిరుమలేశునిపై ఆమె యెనలేని కూరిమి (వలపు) కలిగి వుంటుంది. ఈ గొల్లెత యెప్పుడు చల్లలమ్ముటకు పోయినా తనవెంట ఆ రమణుడే వుండాలని ఆశపడుతుంది. ఆమె భారపు (అధికమైన) అలసటను (శ్రమను) తట్టుకోలేదు. ఆమె ఆయనకు ప్రియమైన పద్మినీజాతి స్త్రీ.

సంపుటి: 5 కీర్తన : నెయ్యములల్లో నేరేళ్ళో
సంఖ్య : 179 పుట : 123 రాగం: దేసాళం

దేసాళం

86 నెయ్యములల్లోనేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో ॥పల్లవి॥

పలచని చెమటల బాహుమూలముల-
చెలమలలోనాఁ జెలువములే
థళథళమను ముత్యపుఁ జెఱఁగు సురటి
దులిపేట నీళ్ళతుంపిళ్ళో ॥నెయ్యము॥

తొటతొటఁ గన్నులఁ దొరిగేటి నీళ్ళ
చిటి పొటి యలుకల చిరునగవే
వటఫలంబు నీ వన్నెల మోవికి
గుటుకలలోనా గుక్కిళ్ళో ॥నెయ్యము॥

గరగరికల వేంకటపతి కౌఁగిట
పరిమళములలో బచ్చనలు
మరునివింటి కమ్మనియంప విరుల-
గురితాఁ కులినుపగుగ్గిళ్ళో ॥నెయ్యము॥

అవతారిక:

జానపదులు కోలాటములాడుతూ పాడే మధురమైన కీర్తన అన్నమాచార్యులవారి ద్వారా ఆస్వాదించండి. అల్లోనేరేడు పళ్ళవలె మధరములైన నెయ్యములు (స్నేహములు) ఒయ్యన (తిన్నగా) వువ్విళ్ళురు చున్నవి. ఇది ఆట ప్రధానమైన కీర్తన. బాహుమూలములలో పలచని చెమటల గురించి వర్ణించగలిగిన సత్తా అన్నమయ్యకు మాత్రమే వున్నదని

వేరే చెప్పక్కరలేదు. ఇది సుగ్రాహ్యము అనుకోవడానికి వీలులేని కీర్తన. జాగ్రత్తగా చదివితేకాని అర్థంకాదు, మరి.

భావ వివరణ:

మా నెయ్యములు (స్నేహము) అల్లోనేరేడు పండ్లవలె మధురమైనవి. ఒయ్యన (తిన్నగా) వువ్విళ్ళూరెడి మా అనుబంధం దినదిన ప్రవర్ధమానమవుగాక!

బాహుమూలములలో పరిఢవిల్లిన లే చిత్తడి చెమటల చెలమలలో అందములు అలంకార ప్రాయమైనవి. ఈ నృత్యమువలన చెమట ఇంకా అధికమై, థళథళమను (తళతళమని) మెరయు ముత్యములను చెరగు సురటి (విసనకఱ్ఱ), దులిపేటి నీళ్ళతుంపరల వలె వున్నవి.

ఈ గోవిందుడు తన విరహంతో ఆమెనెంత బాధిస్తున్నాడంటే, ఆమె కన్నులనుండి తొటతొటమని కన్నీరు కురియుచున్నది. ఆమె అది తాళలేక అలుక వహించినది. ఆ చిటిపొటి (చిన్న చిన్న) అలుకలు చివరికి చిరునవ్వులై రావిపండురంగులోనున్న నీ వన్నెల అధరమునాస్వాదించి గుక్కిళ్ళువేయుచూ (గుటకలు మింగించినది). అలుకలు మరింత మధురమైనవి.

ఓ గరగరికల (నిర్మలుడవైన)వేంకటేశ్వరా! నీ కౌగిటిలో పరిమళములు వెదజల్లు మీ ఒంటిపై పూతలు ఒండొరులకు ఎలా వున్నాయంటే మన్మథుని వింటినుండి వెలువడిన కమ్మని పుష్పబాణములు కూడా గురిగా తాకునట్లు మీపై వేసిన ఇనుప గుగ్గిళ్ళవలెనున్నవి.

సంపుటి: 5 కీర్తన : అంజలిరంజలిరయం తే

సంఖ్య : 289 పుట : 197 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

87 అంజలిరంజలిరయం తే
కిం జనయసి మమ ఖేదం వచనై: ॥పల్లవి॥

మాం కిం భజసే మయా కింతే
త్వం కోవా మే తవ కాఽహం
కిం కార్యమితో గేహే మమ తే
శంకాం వినా కిం సమాగతోసి ॥అంజలి॥

నను వినయోక్తేర్న యోగ్యాఽహం
పున: పునస్త్వం పూజ్యోసి
దినదిన కలహవిధినా తే కిం
మనసిజజనక రమారమణ ॥అంజలి॥

దైవం బలవత్తరం భువనే
నైవ రోచతే నర్మ మయి
ఏవమేవ భవదిష్టం కురు కురు
శ్రీవేంకటాద్రి శ్రీనివాస. ॥అంజలి॥

అవతారిక:

చక్కటి సంస్కృత కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. నాయిక శ్రీవేంకటేశ్వరునిపై అలిగింది. నీకు దండంపెడతాను నన్నెందుకు

మాటలతో ఏడిపిస్తావు. అని రుసరుసలాడిందామె. నీవెవరివి? నేనెవరిని? పోపోవయ్యా! అని పోట్లాడింది. కాని ఆయన లేకుండా క్షణం వుండలేదామె. చివరికి నీ ఇష్టం మహాప్రభో! అని లొంగిపోయింది.

భావ వివరణ:

నీకు ఈ నమస్కారములు, వందనములు. నాకు నీ మాటలతో యెందుకు దు:ఖమును కలిగిస్తున్నావు?

దేవా! నన్నెందుకు తలచెదవు? నాతో నీకేమిటి? నీవెవరవు? నీకు నేనేమవుతాను? నీవు నాకేమవుతావు? నా ఇంట్లో నీకేమి పనివున్నదయ్యా? నాపై నీకు శంకలేకుంటే ఇక్కడికెందుకు వచ్చావు?

ఓ మనసిజ జనకా! (మన్మధునికి తండ్రీ) నీ వినయపు మాటలకు నేను యోగ్యురాలనా? కానయ్యా! నీవు మరల మరల పూజింపదగిన వాడివైయున్నావు. దినదినమూ జరిగే ఈ కలహాలతో నీకేమి పనిలే? ఓ రమారమణా! నేను దీనితో విసిగిపోయాను.

భువనములో దైవమే బలవత్తరమైనది. నాయందు నీవంచనలు నాకు రుచించవు. పోనీలే, నీకేది ఇష్టమో అదేచేయుము. ఓ వేంకటాద్రిపైనున్న శ్రీనివాసా! నేనేమనగలను?

సంపుటి: 5 కీర్తన : సిన్నవాడవని నమ్మసెల్లదునిన్ను
సంఖ్య : 15 పుట : 11 రాగం: భైరవి

భైరవి

88 సి (చి)న్న వాఁడవని నమ్మ సెల్లదు నిన్ను
సిన్నైన యాటదెల్ల సిక్కు సీరై పోయను ॥పల్లవి॥

అవుర బాలకిసునరాయఁడ నీవు సంటిపాలు
సవులంటా నెత్తురెల్ల సప్పరించఁగా
కవకవ నవ్వి నవ్వి కన్నులు దేలగిలఁగ
సవరన్ని (ని) యాటదెల్ల సప్పుసారై పోయను ॥సిన్న॥

రారా గోపాలకిసునరాయ నీవదె గొల్ల–
వారి మగుపల సూవు (పు) వల్లె వేయఁగా
సూరఁబోయె రేపల్లె సొక్కని యా గుబ్బెతల–
సేరలంతల కన్నుల సిన్ని సిన్ని సిగ్గులు ॥సిన్న॥

కిన్నెర వెంకటగిరి కిసునరాయఁడ నీవు
వన్నెలుగ వీది వీది వాయించఁగా
మిన్ను దాఁకి లోకానకు మేఁటియైన లకిమమ్మ
నిన్ను సేరి సరుగన నిలుసుండే సొక్కెను ॥సిన్న॥

అవతారిక:

జానపదుల బాణీలో సాగిన కృష్ణలీలామృతం వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తనలో ఆయన వాడిన బాలకిసున రాయడు, సిక్కుసీరై పోయను, సప్పుసారైపోయను వంటి మాటలు జానపద సాహిత్యంలో వుంటాయేమోకాని నేటి తెలుగు పాఠకులకు సుపరిచితాలు కాదు. ఈ బాలకృష్ణుని చిన్నవాడని నమ్మటానికి వీలులేదట. నేడు ఈ వెంకటగిరి కిసునరాయడు వీధివీధిలో కిన్నెర వాయిస్తుంటే లకిమమ్మ

ఆయనను సేరి సరుగున నిలుసుండిందట. ఈ పాటికి మీకూ కొంత బుర్రకెక్కింది కదా!

భావ వివరణ:

ఓ కిసునరాయా! (కృష్ణరాయా!) నిన్ను చిన్నవాడవని నమ్మసెల్లదు (నమ్మకూడదు). సిన్నైన యాటదెల్లా (యుక్తవయసు వచ్చిన ప్రతి ఆడపిల్లా) నీమూలంగా, సిక్కు సీరై పోయను (సిగ్గుతో చితికిపోయింది).

అవుర బాలకిసునరాయడ (ఔరా! బాలకృష్ణరాయా!) నీవు సంటిపాలు (స్తన్యము) రుచిగావుంటుందని పూతన స్తనము చప్పరించి నెత్తురంతా పీల్చేస్తే అది కవకవ (వికటంగా) నవ్వినవ్వి కళ్ళు తేలేసింది. సవరని యాటదెల్ల (అందమైన ఆ యువతి పూతన) సప్పుసారైపోయను (చచ్చి శవమై పోయింది).

ఓ గోపాల కృష్ణరాయా! నీవు అదిగో ఆ గొల్లవాడలో మగువల చూపులు వల్లెవేయగా (చూపులతో చూపులు కలిపి చిలిపి సంకేతాలీయగా), సూరబోయె రేపల్లె (సిగ్గుతో రేపల్లె చితికిపోయింది). గుబ్బలవంటి కుచగిరులున్న గొల్లెతల చేరడేసి కన్నులు 'సిన్ని సిన్ని సిగ్గులు' చిమ్మినవి.

ఓ వేంకటగిరి కిసునరాయ (వేంకట కృష్ణరాయా!) నీవు వన్నెలుగ (అందముగా) వీధివీధిలోనూ కిన్నెర (వీణ) వాయించగా అది, మిన్నుదాకి (ఆకాశంలో మారుమ్రోగి) జగదేకసుందరియైన 'లకిమమ్మ' (లక్ష్మీదేవి) నిన్నుచేరి సరుగున (నీ పక్కన) నిలుసుండే సొక్కెను (నిలబడి యుండగానే పరవశంతో నిద్రించినది).

సంపుటి: 5 కీర్తన : ప్రలపనవచనై: ఫలమిహకిం
సంఖ్య : 39 పుట : 27 రాగం: శుద్ధ వసంతం-రచ్చెతాళం

శుద్ధవసంతం-రచ్చెతాళం

89 ప్రలపనవచనై : ఫలమిహకిం
చల చల కుడ్యక్షాళనయా కిం ॥పల్లవి॥

ఇతర వధూ మోహితం త్వాం ప్రతి
హితవచనై రీహితు మిహ కిం
సతతం తవానుసరణమిదం మమ
గతజల సేతూకరణ మిదానీం ॥ప్రలప॥

వికలవినయ దుర్విటం త్వాం ప్రతి
సుకుమారార్థస్తుత్యా కిం
ప్రకటబహల కోపనం మమ తే
సకల చర్విత చర్వణమేవ ॥ప్రలప॥

శిరసా నతసుస్థిరం త్వాం ప్రతి
విరసాలాపన విధినా కిం
తిరువేంకటగిరి దేవ త్వదీయ-
విరహవిలపనం వృథాచరణం ॥ప్రలప॥

అవతారిక:

అద్భుతమైన సంస్కృత కీర్తననావిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు. కృష్ణుని మాయమాటలు నమ్మి మోసపోయాననుకొని చింతిస్తున్న నాయిక నిర్వేదంతో అంటున్న పలుకులివి. ఎందుకు ప్రేలాపనలవంటి మాటలు

మాట్లాడతావు. దానివల్ల యేమిలాభం? పోపోవయ్యా! అని ఆవిడ విసుక్కొంటున్నది. నీకు నమస్కరించినందువల్ల ప్రయోజనమేమిటి అనేంత నిస్పృహకు లోనైంది ఆమె.

భావ వివరణ:

ప్రేలాపనలవంటి మాటల వలన ప్రయోజనమేమిటి? పోపోవయ్యా! పో గోడను నీళ్ళతో కడిగినందువలన ప్రయోజనమేమిటి?

ఇతర వధూటీమణులయందు వ్యామోహము గలిగిన నీకు హితవు బోధించాలని చూడటం ఎంత అవివేకమైన పని? నిన్నే నమ్ముకొన్న నన్ను కల్లబొల్లి కబుర్లతో ప్రసన్నురాలను చేయాలని చూచెదవు, యెందుకు? గతజలసేతుబంధనము వలన కలిగే ప్రయోజనమేమిటి?

నీవు కపటివి. కపట వినయములు. నీవు దుర్మతివైన విటుడవు. నీకు సున్నితమైన స్తుతులవలన ప్రయోజనమేమిటి? నాయందు గొప్ప క్రోధమును ప్రకటిస్తున్నావు. ఇదంతా చర్విత చరణమే.

నీయందు స్థిరమైనట్టి నా నమస్కారములు, విరసాలాపనలు అవుతుంటే... యేమి ప్రయోజనము కలుగుతుంది? ఓ తిరువేంకటగిరి దేవా! నీయందు విరహవేదన నిష్ప్రయోజనమవుతున్నది ప్రభూ!

సంపుటి: 4 కీర్తన : తలలేదు తోకలేదు దైవమానీ మాయలకు
సంఖ్య : 368 పుట : 247 రాగం: కన్నడగౌళ

కన్నడగౌళ

90 తల లేదు తోఁక లేదు దైవమా నీమాయలకు
తెలిసియుఁ దెలియక తిరిగేము నేము ॥పల్లవి॥

తను వేఁటిదో యీ తలపోఁత లేఁటివో
యెనయు సంసార సుఖ మిది యేఁటిదో
వెనక ముం దేఁటిదో వివేక మెరఁగక
దినదినమును నేమో తిరిగేము నేము ॥తల॥

పుట్టు గిది యెక్కడో పోయేటి దెక్కడో
ఇట్టె యీ సిరులెల్లా నెక్కడెక్కడో
మట్టులేని హరినిర్మాణ చక్రములోన
దిట్టలమై యేమేమో తిరిగేము నేము ॥తల॥

నేరు పేదో నేర మేదో నిలిచిన దొకటేదో
వూరకే నీదాసులమై వున్నారము
చేరి నన్నేలినయిట్టె శ్రీవేంకటేశ్వర
గారవించి కరుణించి కావఁగదవే ॥తల॥368

అవతారిక:

చక్కటి వైరాగ్య దీపికవంటి కీర్తననావిష్కరిస్తున్న అన్నమాచార్యులవారిని ఆలకించండి. "ఓ దైవమా! నీమాయలకు తలతోక వుండవయ్యా! మేము మాత్రం తెలియనివాటిని తెలుసునని, తెలిసినవాటిని తెలియవని తలపోస్తూ తిరుగుతుంటాము. మాకు దేంట్లోనూ నేర్పులేదు. మాకు తెలిసిందల్లా నీ దాసులుగా వుండటం. మమ్మల్ని యెలాగో వొకలాగ ఒడ్డునపడవెయ్యవయ్యా! కరుణించు" అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీ మాయలకు (లీలలకు) తలలేదు తోకలేదు (ఆరంభం యెప్పుడు జరుగుతుందో తెలియదు. ఎప్పుడు పూర్తి అవుతుందో తెలియదు). నీమాయ ఆవరించినంతసేపూ, పిచ్చిపట్టినట్లు తెలిసీ తెలియక యేవేవో భ్రమలలో పడి, తిరుగాడుతూనే వుంటాము.

మా అంత పిచ్చివాళ్ళున్నారా ప్రభూ! మా ఈ శరీరం యెట్లా వచ్చిందో మాకు తెలియదు. దీనికి ఆలోచనలెలావస్తున్నాయో తెలియదు. సంసార సుఖము యెట్లా వుంటుందో తెలియదు. వెనక ముందేటిదో వివేకమెరుగము (పూర్వజన్మలో నేనెవరినో తెలియదు. మళ్ళీ నేను చచ్చాక యేమవుతానో తెలియదు). బ్రతికున్నంతకాలమూ ప్రతిరోజూ యేమో తిరుగుతూనే వుంటాము. ఏమిటి నీమాయ?

తల్లి కడుపులో యెప్పుడు యెలా పడ్డామో తెలియదు. ఏ క్షణాన గుటుక్కుమని కన్ను మూస్తామో తెలియదు. నాకు ధనమెలా వచ్చిందో, యెన్నాళ్ళుంటుందో, వున్నట్లుండి యెప్పుడు పోతాయో తెలియదు. శ్రీహరియొక్క ఈ "నిర్మాణ చక్రములో" మట్టు లేకుండా (పొందిక లేకుండా) తిరుగుతూనే వున్నాము. విచిత్రమేమంటే అట్లా తిరుగుతున్నా మేమే దిట్టలము (సమర్థులము) అని అనుకొంటుంటాము.

నీ కృపతో చివరికి ఒకనాటికి నాకు జ్ఞానోదయమయింది. నేర్వవలసిన దేమిటో తెలిసింది. ఇక నాకు నేర్పుతోను పనిలేదు. నిలిచినది వొక్కటేననే నేర్పు యేదో అది నా స్వంతమయింది. ఇక వూరకనే నీ దాసులమై వున్నారము. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే నన్ను వెదకి చేరుకుని నన్ను యేలినావు. ఇక నన్ను విడువకు. గారవించి కరుణించి కావగదవే (మన్నించి కరుణతో రక్షించుము తండ్రీ!) నాకు నీవే దిక్కు.

సంపుటి: 4 కీర్తన : నమో నమో దశరథనందన మమ్ముంరక్షించు
సంఖ్య : 301 పుట : 202 రాగం: మాళవశ్రీ

మాళవశ్రీ

91 నమో నమో దశరథనందన మమ్ము రక్షించు
కమనీయ శరణాగతవజ్రపంజరా ॥పల్లవి॥

కోదండదీక్షాగురుండ రామచంద్ర
ఆదిత్యకుల దివ్యాస్త్రవేది
సోదించుమారీచునితలగుండుగండ
ఆదినారాయణ యసురభంజనా ॥నమో॥

ఖరదూషణశిర:ఖండనప్రతాప
శరధిబంధన విభీషణవరదా
అరయ విశ్వామిత్రయాగసంరక్షణ
ధరలోన రావణదర్పాపహరణ ॥నమో॥

పొలుపొంద నయోధ్యపురవరాధీశ్వర
గెలుపుమీరిన జానకీరమణ
అలఘుసుగ్రీవాంగదాదికపిసేవిత
సలలిత శ్రీవేంకటశైలనివాసా ॥నమో॥301

అవతారిక:

దశరథనందనుడైన శ్రీరామచంద్రమూర్తిని స్తుతించుచున్న అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో కూడా రామాయణ ఘట్టములను వర్ణిస్తూ రాముని నామాలను సన్నుతిస్తున్నారు. అన్నమాచార్య కీర్తనా యజ్ఞంలో ఈ దీక్షితులు సమర్పిస్తున్న ఈ కీర్తన సంఖ్య 1000. సహస్రాక్షుడు, సహస్రబాహువు, సహస్రముఖుడు, సహస్రరూపుడు అయిన ఆ "సాసముఖుని" సహస్రకీర్తనల వివరణతో అర్చించగలుగుతున్నాను. ఈ

జన్మకిది చాలు. అన్నమయ్య అన్నట్లు "ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి, యిదిగాక వైభవంబికవొకటి కలదే"!

భావ వివరణ:

దశరథనందునడవైన ఓ శ్రీరామచంద్రా! నమో నమో! నీకు వేలకొలది వందనములు. మమ్ము రక్షింపుము తండ్రీ! నీవెవ్వరివి ప్రభూ "కమనీయ శరణాగత వజ్రపంజరుడవు" (నీ శరణార్థులకు మనోజ్ఞమైన వజ్రపు కవచము వంటి రక్షకుడవు).

ఓ రామంచంద్రా! నీవు నీదాసుల రక్షణకై యెప్పుడూ కోదండమును ధరించియే వుంటాను, అనే దీక్ష నిర్వహించిన దీక్షితుడవు. ఆదిత్యకులములో (సూర్య వంశములో) జన్మించిన సకల శస్త్రాస్త్రపారంగతుడవు. మాయలేడివలె వచ్చిన మారీచుని సోదించు (వెదుకునట్టి) తలగుండు గండవు (శిక్షగా తలపై పెట్టుకొని తిరిగే పెద్దబండ వంటి మొనగాడివి). అంటే మారీచునివంటి కపటుల పాలిటి యముడివి అని భావము.

ఖరదూషణుల తలలను ఖండించి పదివేల మంది రాక్షసులను క్షణంలో మట్టుబెట్టావు. శరధిని బంధించి (వారధి నిర్మించి) విభీషణునికి వరదుడవైన ప్రతాపశాలివి. విశ్వామిత్రుని యాగమును సంరక్షించిన జగజ్జెట్టివి. పుడమియందు జన్మించి, రావణాసురని చంపగలిగి కూడా "నేడుపోయి విశ్రాంతి తీసికొని తిరిగి రేపటికి తేరుకొని రా!" అని వదలివైచి వాడి గర్వాన్ని సమూలంగా హరించిన వీరాధివీరుడవు.

కీర్తితో అయోధ్యాపురాధీశ్వరుడవై యేలిన చక్రవర్తివి. గెలుపుమీరిన (కీర్తికాంత, భూకాంత, శ్రీకాంతలను కూడా గెలిచిన) జానకీరమణుడవు. కపిసేనలో అలఘులైన (ఉద్దండులైన) సుగ్రీవుడు అంగదుడు మొదలైన వారందరిచే సేవించబడినవాడవు. ఇంతే కాదు స్వామీ! నీవు సలలితము (దివ్యసౌందర్యోపేతమైన) శ్రీవేంకటశిఖర నివాసివైన మా దైవము శ్రీవేంకటేశ్వరుడవూ నీవే.

సంపుటి: 4 కీర్తన : ఇవియే పో ప్రద్యుమ్నా యిహపరసాధనము
సంఖ్య : 405 పుట : 272 రాగం: భూపాళం

భూపాళం

92 ఇవియే పో ప్రద్యుమ్న యిహపరసాధనము
భవజలధులతేప పరమయోగులకు ॥పల్లవి॥

వామన గోవింద విష్ణు వాసుదేవ హరి కృష్ణ
దామోదరాచ్యుత మాధవ శ్రీధరా
నీమహిమ గానలేము నిన్నెంచఁగలేము నీ –
నామజపమే చాలు నాలుక (కు) సులభము ॥ఇవి॥

అనిరుద్ధ పురుషోత్తమాధోక్షజ ఉపేంద్ర
జనార్దన కేశవ సంకర్షణా
నినుఁ దలఁచఁగ లేము నిన్నుఁ దెలియఁగ లేము
నునుపై నీనామమే నోటికి సులభము ॥ఇవి॥

నారాయణ పద్మనాభ హృషీకేశ
నారసింహ మధుసూదన త్రివిక్రమ
నీరూపు భావించలేము నిక్కపు శ్రీవేంకటేశ
ఆరయ నీనామజప మన్నిటా సులభము ॥ఇవి॥405

అవతారిక:

ప్రద్యుమ్నుడు అంటే 'ప్రకృష్ట'మైన 'ద్యుమ్నము' కలవాడు. అనగా అతిశయించిన బలముకలవాడని అర్థం. మన్మథుని కున్న పర్యాయపదం అది. శ్రీమన్నారాయణుని కేశవనామాలలో కూడా ప్రత్యుమ్ననిపేరు చూస్తాము. శ్రీహరి కూడా అతిక్రమించ సాధ్యంకాని బలము కలవాడు కావున ఆయననూ ప్రద్యుమ్నుడు అంటారు. "ఓ ప్రద్యుమ్నా! పరమ యోగులకైనా భవసాగరమును దాటించే తెప్ప ఇవియే. ఇహమున సుఖము పరమున మోక్షము ఇవ్వవలెనంటే ఇవియేపో సాధనములు" –

అంటున్నారు అన్నమాచార్యులవారు. భజన సాంప్రదాయంలో సాగే ఈ కీర్తన పాడితే కేశవనామాలు చదివినట్లే. మీదే ఆలస్యం...

భావ వివరణ:

ఓ ప్రద్యుమ్నా! (అతిశయించిన బలము కలవాడా) ఇహపరసాధనములు (ప్రతికుండగా ఈలోకములో సుఖము చనిపోయాక పైలోకములలో మోక్షము సాధించు మార్గము) ఇవియేపో (ఇవియే సుమా!) పరమయోగులైన వారికి, భవజలధి తేప (సంసార సాగరమును దాటించగల నావ ఇదియే కదా!)

ఓ వామనమూర్తి! గోవిందుడా! విష్ణుదేవా! వాసుదేవా! శ్రీహరీ! శ్రీకృష్ణా! దామోదరా! (ఉదరమునకు తల్లి యశోదచే దామముతో కట్టబడినవాడా!) అచ్యుతా! మాధవా! శ్రీధరా! (లక్ష్మీవల్లభా!) నీమహిమను గానలేము (తెలుసుకొనలేము). నిన్ను ఇటువంటివాడని అంచనావేయలేము. మరి ఇక యేమి చేయగలం? నాలుకకు అతి సులభమైన పని నీ నామమును జపించుట. అది చాలునాకు.

ఓ అనిరుద్ధా! (పరులచేత అడ్డగింపలేనివాడు) పురుషోత్తమా! అధోక్షజా! (ఇంద్రియములను జయించిన వారికి మాత్రమే కనబడువాడు) ఉపేంద్రా! జనార్దనా! కేశవా! సంకర్షణా! (ప్రళయకాలమందు అందరినీ అంతముజేయువాడు) నిన్ను దలచలేము (నీగురించి ఆలోచించలేము). ఇక నిన్ను యెట్లు తెలియగలము? నునుపైన (పట్టుకోవటానికి తేలికైన) నీ నామము నోటితో సులభముగా పలికెదను ప్రభూ!

ఓ నారాయణుడా! పద్మనాభుడా!, హృషీకేశా! (ఇంద్రియములకు అధిపతి) నారసింహా! మధుసూదనా! త్రివిక్రమా! నీరూపము విశ్వరూపమైనందువలన యెట్లుండునో వూహింపజాలము. కానీ నేడు మాకన్నులయెదుట నిజముగా కనుపించుచున్న నిక్కపు వేంకటేశ్వరుడవు నీవే తండ్రీ! దర్శించి జపించుటకు అతి సులభమైన నీనామజపమును అన్నిటా స్వీకరింతును. ఎందుకంటే సులభమైన తరుణోపాయము ఓం నమో వేంకటేశాయ! అనడమే సుమా!

సంపుటి: 4 కీర్తన : పరమవివేకులాల బంధువులాల
సంఖ్య : 475 పుట : 320 రాగం: ధన్నాసి

ధన్నాసి

93 పరమవివేకులాల బంధువులాల
తెరదీసి మాకు నిది తెలుపరో ॥పల్లవి॥

యేడుజా నలమేనిలో నిందిరానాథుఁ డున్నాఁడు
వేడుకతో నతనిని వెదకరో
పూడిచి వున్నది మతిఁ బొందుగ వైకుంఠము
చూడరో ధ్యానముసేసి సోదించరో ॥పరమ॥

కొడిదెఁడుబయలిలో గోవిందునినెలవఁట
చిడిముడితో నిట్టే చేరి పట్టరో
అడఁచి దాఁచివున్నది అందే బ్రహ్మానందము
విడువరో యీ ముడియ వెలయఁ జేపట్టరో ॥పరమ॥

వూని నల్లెఁడు నాలికలో నుండు శ్రీవేంకటేశుఁ-
డానుకొని బత్తితోడ నటు నిల్పరో
నానఁబెట్టివున్నది నామకీర్తనములందు
తానకముగా నేపొద్దుఁ దలఁచుకోరో ॥పరమ॥475

అవతారిక:

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో సాటివారిని తమ మనస్సులలోని అజ్ఞానపు తెరలను తొలగించి శ్రీహరిని దర్శించమని వేడుకొంటున్నారు. ఇది కూడా తేలికగా కనుపించే క్లిష్టమైన కీర్తన. భావ వివరణ చదివినవారికి ఈ సంగతి వెంటనే అర్థమవుతుంది. గోవిందునికి మీమనస్సులో నెలవుగా వుంచితే బ్రహ్మానందము దానంతట అదే సిద్ధిస్తుంది. శ్రీవేంకటేశ్వరుని నామసంకీర్తనము నాలికపై నుంటే, యే

పొద్దునైనా ఆయననే తలుస్తుంటే... తప్పక ఒకనాటికి ఆ స్వామి దయకలుగుతుంది.

భావ వివరణ:

పరమవివేకులాల (విశిష్ఠమైన వివేకము గల జ్ఞానులారా!) బంధువులారా! మాకు తెరదీసి (వివేకము చూపి) ఇది (ఈసంగతిని) తెలియజేయండయ్యా!

ఏడు'జానలు' పొడుగున్న ఈ శరీరంలో ఇందిరానాథుడైన శ్రీహరివున్నాడు. కాని ప్రయత్నించి వెదకకపోతే మాత్రం కనబడడు. వైకుంఠము అనేది వేరేయెక్కడో లేదు. మనస్సులో శ్రీహరి వున్నట్లే, వైకుంఠము కూడా మన మెదడులోనే పూడ్చివున్నది, (దాగివున్నది). అది వూరకనే కనబడదు. ధ్యానముచేసి, పరిశోధించి వెతికి చూస్తేకాని కనుపించదు. అయ్యలారా! అట్లే సోధించరో!

గోవిందుని నెలవు (వుండేచోటు) నిజంగా యెక్కడవున్నది? కొడిదెడు బయలులోనట (పుడిసిలిలో ఇమిడిన ఆకాశములో వున్నాడట). చిడిముడితో (తొట్రుబాటుతో కూడిన జాగ్రత్తతో) ఆయనను ఇట్టే పట్టరో (మీ వశము చేసికొనండి). అందే (ఆయనను వశపరచుకొనుటలోనే) బ్రహ్మానందము, అణచిదాచివున్నది (అణిగి దాగివున్నది). ఈ ముడియ (మాట)లో దాగి వున్న బ్రహ్మానందము విడువరో (బయటపెట్టండి). వెలయజేపట్టరో (బయటపడంగానే) మీలో భద్రపరచుకొనండి.

శ్రీవేంకటేశ్వరుడు యెక్కడవున్నాడు? పూనినల్లెడు నాలుకలోవున్నాడు (వహించి అటూఇటూ కదలే నాలుకలోనే, ఆయన వున్నాడు). ఆనుకొని (దరిజేరి) ఆయనను బత్తితో (భక్తితో) మనస్సులో నిల్పరో. శ్రీహరి నామసంకీర్తనములో మీ మనస్సును నానబెట్టి (నిమగ్నముచేసి) యే వేళనైనా తానకము (స్థానము)గా ధ్యానించుడు.

సంపుటి: 4 కీర్తన : చెల్లె నీచేతలు నీకే చేరి మేడెగుడిదిన్న
సంఖ్య : 412 పుట : 277 రాగం: సామంతం

సామంతం

94 చెల్లె నీచేఁతలు నీకే చేరి మేడెగుడిదిన్న
నల్లదె కంటిమి నిన్ను హనుమంతరాయ ॥పల్లవి॥

జంగ చాఁచినట్టి నీసంగడి పాదములు
చెంగలించి యెత్తిన నీ శ్రీహస్తము
ముంగలిఁ బిడికిలించి మొలఁజేర్చినచేయి
అంగమాయ నీసొబగు హనుమంతరాయ ॥చెల్లె॥

పెరిగినవాలము పెద్ధైన పిరుఁదును
అరిగి జలధి దాఁటే యాయితమును
సిరుల బంగారు కాసె చెలఁగిన సింగారము
అరుదాయ నీవునికి హనుమంతరాయ ॥చెల్లె॥

స్వామికార్యపుఁజింత జానికి సేమపువార్త
దీమసాన మగుడి యేతెంచిన చేఁత
రామనామజపముతో రతి శ్రీ వేంకటపతి-
కా మేటిబంటవైతివి హనుమంతరాయ ॥చెల్లె॥413

అవతారిక:

"మేడెగుడిదిన్న" అనే గ్రామములో వెలసిన హనుమంతుని సేవిస్తూ అన్నమాచార్యులవారు చెప్పిన అద్భుతమైన కీర్తననాస్వాదిద్దాము. నీ చేతలు నీకే చెల్లినవి స్వామీ! అని కీర్తిస్తున్నారు. ఇటువంటి కీర్తనలు కోకొల్లలున్నాయి! జానకి క్షేమసమాచారము రాముని కెరిగించిన ధీశాలియైన బంటు అని, శ్రీవేంకటేశ్వరునికి కూడా ఈయన మేటి బంటేనట. ఆయన వునికే అరుదాయెనట.

భావ వివరణ:

అల్లదె (అదిగో) 'మేడెగుడిదిన్న'లో చేరి వెలసిన హనుమంతరాయా! నిన్ను కంటిమి (నీ వైభవమును చూచితిమి). నీచేతలు నీకె చెల్లె (నీసాహసములు ఇతరులకు అసాధ్యము. అవినీకే చెల్లినవి ప్రభూ!)

జంగచాచినట్టి నీ సంగడిపాదములు (బారగా పంగజాచినటువంటి నీ పాదముల జంట) కనువిందు చేయుచున్నవి. చెంగలించి (అతిశయముగా) యెత్తిన నీ శ్రీహస్తము (మంగళకరమైన చేయి) ముంగలి బిడికిలించితివి (మీదికెత్తి పిడికిలి బిగించియుంటివి). ఇంకొక చేయి నీ మొలజేర్చితివి (నడుముపై వుంచుకొంటివి). ఓ హనుమంతరాయా! ఈ విధముగా నీసొబగు (శోభ) అంగమాయస్వామీ! (చాలవైభవయుతముగా నున్నది).

పొడవుగాపెంచిన నీ వాలము (తోక) నీ పెద్దవైన పిరుదులమధ్య వ్రేలాడుచున్నది. తిరిగి (వెళ్ళి) నూరుయోజనముల జలధిని (సముద్రమును దాటే నీయాయితము (నిడపు... అంటే... దూకగల సామర్థ్యము...)ను యేమని పొగడగలము! బంగారు రంగు కాసే (వస్త్రము) వైభవోపేతముగానున్నది. ఆభరణములతో నీ సింగారము చెలగినది (కన్నుల పండువగా వున్నది). ఓ హనుమంతరాయా! నీ వునికి (వున్నవిధానము) అరుదాయ (బహు అరుదుగా చూడగలుగుతాము) స్వామీ!

జానకి క్షేమసమాచారము యెంత త్వరగా శ్రీరామచంద్రునికి అందించగలనా, అన్నదే నీ ఆశయము. అదే నీ చింత (ఆలోచన). దీమసాన మగుడియేతెంచిన చేత (లంకలో రాక్షసులను చితకబాది, లంకా దహనము చేసి, రావణునికే హితబోధ చేసి సీతాదేవి చూడామణితో తిరిగివచ్చిన... నీ సాహసము...) అసాధ్యము. రామనామ జపముతో, రతికెక్కితివి (ప్రసిద్ధుడవైతివి). ఓ హనుమంతరాయా! నేడు శ్రీవేంకటపతియైన నీ రామునికే మేటి బంటువైతివి స్వామీ!

సంపుటి: 4 కీర్తన : సమమతినని నీవే చాటుదువు
సంఖ్య : 366 పుట : 246 రాగం: వరాళి

వరాళి

95 సమమతినని నీవే చాటుదువు
రమణ నేరుపునేరము నెవ్వరివి ॥పల్లవి॥

రావణాదులైన రాక్షససమితిలో
నీవే, దేవతలలో నీవేకావా
భావింప నసురలు పగ నీకు నేలైరి
యీవల సురులెల్ల (లేల?) హితులైరి ॥సమ॥

సకలజంతువులకుఁ జైతన్యుఁడవు నీవే
వొకరు నీకుపకారమొనరించేరా
అకట కొందరిఁ బాపాత్ములఁగాఁ జేసి
వెకలిఁ గొందరిఁ బుణ్యవిధులఁ జేసితివి ॥సమ॥

అటుగాన ఇట్టాయ నట్టాయనననేల
యిటు నీచిత్తముకొలఁ దింతేకాక
గటియించి శ్రీవేంకటపతి నీదాసు-
లిటువలె ఘనులై రిదివో నీకృపను ॥సమ॥366

అవతారిక:

ఆ దేవదేవుడే మనందరి తండ్రి. రాక్షసులైన, దేవతలైన, మనబోటి నరులైనా, జంతుజాలములైనా, క్రిమికీటకములైన ఆయనబిడ్డలే. కాని వీరందరి బ్రతుకు ఒక్కలాగున లేవు. కొందరు సుఖిస్తుంటే కొందరు దు:ఖిస్తున్నారు. ఆయన కొందరికి మేలు చేస్తున్నట్లు కొందరిని శిక్షిస్తున్నట్లు అనిపిస్తుంది. ఆయనకు 'సమమతి' (సమానంగా చూచే బుద్ధి) లేదేమో అనిపిస్తుంది. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో 'నీవే సమమతినని చాటుకొంటావు. రమణ నేరుపులెవ్వరివి, నేరములెవ్వరివి? నీకు దేవతలు

చేసిన మంచేమిటి, రాక్షసులు చేసిన చెడేమిటి? వాళ్ళనెందుకు రక్షించావు, వీళ్ళనెందుకు శిక్షించావు? అంతా నీ చిత్తము మా ప్రాప్తము అంటున్నారు.

భావ వివరణ:

ప్రభూ! నీవే సమమతివని (పక్షపాతములేక అందరినీ సమానముగా చూచే బుద్ధికలవాడినని) చాటుకొంటావు. అట్లయినచో, రమణ నేరుపులెవరివి (ఆ చక్కని నేర్పుగల పనులు యెవరికి దక్కుతున్నవి) మరియు నేరములెవ్వారివి (చెడ్డపనులు యెవరికి దక్కుతున్నవి?)

రావణుడు మొదలైన రాక్షసులలో ఆత్మరూపుడవై వున్నదెవరు? నీవేకదా! దేవతలలో వున్నదీ నీవే కాదా? మరి భావించుటకు నీకు, అసురులు పగవారెందుకయ్యారు? మరి ఇటు చూస్తే సురులు నీకు యెట్లు హితులు అయ్యారు, ఇంతా చేసి ఇద్దరూ నీ సంతానమే కదా! ఎందుకు దేవతల్ని రక్షిస్తున్నావు, రాక్షసులనెందుకు భక్షిస్తున్నావు?

జంతువులన్నింటిలోనూ వున్న చైతన్య పదర్థం ఒక్కటే. దాన్నే ప్రాణము అంటారు కొందరు. అది నీవే కదా! అటువంటప్పుడు ఒకరు నీకు ఉపకారమొనరించిరా అకట (అయ్యో!) కొందరిని పాపాత్ములను చేసినావే? వెకలి (ఆసక్తితో) కొందరిని పుణ్యవిధులు చేసే వారిగ నొనరించితివే? ఎందుకీ బేధ భావము నీకు కలుగుతున్నది? ఒకరిమంచేమిటి, ఇంకొకరి చెడేమిటి?

దీనికి కొందరు విధి అని పేరుపెట్టి, కర్మ అనే ఒక సిద్ధాంతం తీసికొనివచ్చి, అందుకని ఇట్లా అయింది. ఇందుకని అట్లా అయింది అని యేవేవో కారణాలు చెబుతారు. అసలేమిటంటే అంతా నీ చిత్తము మా ప్రాప్తము అంతేకాక ఇంకేమిటి? అవునా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఏది ఏమైనా నీ దాసులు మాత్రం నీ కృపవల్ల ఘనులయ్యారు తండ్రీ! నీవు గటియించినచో (తలచుకొంటే) మేము తప్పక ఘనులమవుతాము.

సంపుటి: 4 కీర్తన : నారాయణుని శ్రీనామమిది
సంఖ్య : 73 పుట : 410 రాగం: కేదారగౌళ

కేదారగౌళ

96 నారాయణుని శ్రీ నామమిది
కోరినవిచ్చిఁ గోవో మనసా ॥పల్లవి॥

శుకవరదుని సొంపుగఁ దలఁచుటె
సకలభవ విజయము
అకలంకము మహాభయహరణ –
మొకటి నొకటి వోహో మనసా ॥నారా॥

పక్షిగమన శుభము (పదము?) దలఁచుటే
అభయభోగ విహారమ్ము
వక్షపు లక్ష్మీవరుసే (చే?) సిరులు
లక్షలు గోట్లొల్లవొ మనసా ॥నారా॥

ఇంకా నీతలఁపులెన్ని గలిగిన
వేంకటాధిపు సేవించఁగదో
అంకెలకిన్నియునైన యీ (?)
మంకపు గాక నమ్మవో మనసా ॥నారా॥73

అవతారిక:

తనమనసును హెచ్చరిస్తున్న అన్నమాచార్యులవారిని ఆలకించండి. నారాయణుని శుభప్రదమైన నామము పలికితే చాలును. కోరినవిచ్చిగోవో అంటే కోరుకున్నవన్నీ ఇస్తాడు, స్వీకరించు అని అర్థం. కొన్ని మాటలకి నిఘంటువులలో కూడా సులభగ్రాహ్యమైన అర్థం దొరకదు. అది అట్లా అయ్యుంటుందని భావించాలి. "అంకెలకిన్నియునైన యీమంకపుగాక నమ్మవో మనసా" అంటున్నారు. అంటే యేమిటి? నీవశమయ్యేట్లుగా అన్నీ నీకు శ్రీహరే ఇస్తాడు. నీ మంకుతనము మాని ఆయనను నమ్మవే అని అర్థం. ఆయన హృదయవాసినియైన లక్ష్మీదేవి ఆయన ఇమ్మంటే లక్షలు, కోట్లు

ఇస్తుంది. కానీ ఒల్లవో మనసా! నీవు అసలొప్పుకోవద్దు అంటున్నారు. ఒప్పుకుంటే డబ్బుపిచ్చివాళ్ళవుతారు, మరి.

భావ వివరణ:

ఓ మనసా! శ్రీమన్నారాయణుని శ్రీనామము (మంగళప్రదమైన నామం ఇదే). హరీ! అను. ఇది నీవు కోరిన విచ్చి (కోరికలు తీరుస్తుంది) కోవో (తీసికో...) కానీ ఆ నామాన్ని మాత్రం వదిలిపెట్టకు.

శుకమహర్షిని భాగవత బోధకునిగా చేసి అనుగ్రహించి తరింపజేసినది శ్రీహరినామమే. ఆయనను సొంపుగా ధ్యానిస్తే సకల భవబంధాలు తొలగిపోతాయి. వాటిపై విజయము సాధించగలవు. ఆ శ్రీహరినామము అకలంకము (ఏ దోషమూ లేనిది). గొప్ప భయమును నివారించునది. ఓహో! మనసా! అది ఒకటినొకటి (ఒకే యొక్కటి... అట్టిది ఇంకొకటి లేదు అని అర్థం.)

ఆ శ్రీహరి అలవాట్లు యేమిటో ఒకసారి గమనించండి. ఆయన పక్షిగమనుడు. అత్యంత వేగంగా వెళ్ళే గరుత్మంతునిపై వెళ్ళేవాడు ఆయనే. క్షణాల మీద (తలచినదే తడవుగా) వచ్చి రక్షిస్తాడు. అభయప్రదాతయైన శేషునిపై పవళిస్తాడు విహరిస్తాడు. ఆయన వక్షస్థలంపై సిరులరాణి శ్రీమహాలక్ష్మివుంటుంది. ఆయన సైగచేస్తే లక్షలు కోట్లు ఇస్తుందావిడ. కానీ ఓ వెఱ్ఱి మనసా! వాటిని ఒల్లకే (ఆ లక్షలు కోట్లను అంగీకరించకే... చెడిపోతావు).

అవన్నీ అటుంచి ఈ మాట వినుము. నీకు ఈ ప్రాపంచిక తలపులు (కోర్కెలు) యెన్ని కలిగినా శ్రీవేంకటేశ్వరుని మాత్రము వదలిపెట్టకు. ఆయననే సేవించగదో! అంకెలకిన్నియునైన యీ (నీ వశమయ్యేట్లుగా ఆయన నీకెన్నియైనా ఈయగలడు). ఓ మనసా! మంకెపుగాక (మంకుతనమునకు పోక... అంటే... మొండిగా చెడిపోక) నమ్మవో (ఆయననే శరణు అని నమ్ముకో). తప్పక నీకు మేలు జరుగుతుంది.

సంపుటి: 4 కీర్తన : స్వతంత్రుఁడవు నీవు సరిలేని దొరవు నే-
సంఖ్య : 431 పుట : 290 రాగం: తోడి

తోడి

97 స్వతంత్రుఁడవు నీవు సరిలేని దొరవు నే-
నతికమై యాడినట్లు ఆడఁబోయేవా ॥పల్లవి॥

యెంత నీమనసునను యెట్టుండె నట్లనే
అంతయుఁ జేయవయ్య మాకదే చాలు
అంతకంటే నెక్కుడు నేమంటిమివో యటమీఁదఁ
జెంతల మా చెప్పినట్టు సేయఁబోయేవా ॥స్వతం॥

కమ్మి నీవు మునుప సంకల్పించినట్లనే
కిమ్ముల నారీతిఁ జిత్తగించవయ్య
అమ్మరో నేమందుకుఁ గాదనినను నీవు
సమ్మతించి మాతలఁపు సాగనిచ్చేవా ॥స్వతం॥

పొంచీదేహమున మమ్ముఁ బుట్టించినట్లనే
పెంచి నీపై భక్తిమాకుఁ బెనచవయ్య
నించిన శ్రీవేంకటేశ నేనే పదరితిఁగాక
మంచితనములు నీవు మానఁబోయేవా ॥స్వతం॥431

అవతారిక:

అన్నమాచార్యులవారి అద్భుత సృష్టి ఈ కీర్తన. స్వామీ! నీవు సర్వస్వతంత్రుడవు. నీకెవరన్నా ఇట్లా చెయ్యి, అట్లాచెయ్యి అని నిర్దేశించగలరా? నీకు సమానమైన యెవ్వరూలేని ప్రభువు నీవే. నేను ఆడమన్నట్లు ఆడతావా యేమిటి? నీ ఇష్టమొచ్చినట్లే చేస్తావు. ఏదో అజ్ఞానిని పైగా వదరుబోతును. నీ మంచితనం నీకే వుంటుంది. కాస్త నన్ను బాగుచేయవయ్యా! నీపై మాకు భక్తి పెంచవయ్యా! ఈ జన్మలో

కాకపోతే వచ్చే జన్మలో తరిస్తాను. నన్ను మాత్రం నీ భక్తి నుండి విడదీయకు. నీనుండి విముఖుని చేయకు. నీకు పుణ్యం వుంటుంది. నాకు నీ భక్తి చాలు అంటున్నారు.

భావ వివరణ:

ప్రభూ! నీవు సర్వస్వతంత్రుడవు. నీకు సమానమైన వారెవ్వరూ లేని దొరవు (యేలికవు). నేనూ అతికమై (నిన్ను మించి) ఆడమన్నట్లు ఆడబోయేవా? (ఆడెదవా యేమి?) చివరికి నీ ఇష్టం వచ్చినట్లే నీవు చేస్తావు.

నీ మనసున యెంత యెట్లావుంటే అట్లనే అంతా చేయవయ్యా! నిన్ను కాదనగలవారెవరు? నీవేమి చేస్తే మాకు అదే చాలు. అంతకంటే యెక్కువ యేమాత్రం యేమన్నాము? వో అటుమీద మేము చెప్పినట్లు చేయబోయేవా యేమి? నీకెట్లా తోస్తే అట్లాగే చేయవయ్యా!

మునుప (మేము అమ్మకడుపులోంచి బయటకు రాక మునుపే) నీవు కమ్మి సంకల్పించావు. (పైకొని నిశ్చయించావు). నాదేమున్నది? కిమ్ముల (రహస్యంగా) నారీతి జిత్తగించవయ్యా (అట్లాగే చేయవయ్యా). అమ్మరో! (అమ్మయ్యో!) నేము (మేము) అందుకు కాదనినను నీవు అంగీకరించి మా ఇష్టం సాగనిస్తావా యేమన్నానా? అలాగే కానీవయ్యా!

పొంచీ (కావాలని) ఈ దేహము మాకిచ్చి నీవే మమ్ము పుట్టించావు. సరే! అయినదైదో అయింది. నా విన్నపమొక్కటే, మమ్మల్ని పెంచినట్లే మాకు నీపై భక్తిని కూడా పెంచవయ్యా! మంచితనము నిండిన ఓ శ్రీవేంకటేశ్వరా! నేనే పదరితిని (నేనేయేదో వాగాను). నీవు నీమంచితనం మానుకొంటావా యేమి? ఎట్లాగైనా నీవు మమ్మల్ని కరుణిస్తావు.

సంపుటి: 4 కీర్తన : కలిగె మాకిదె కైవల్యసారము
సంఖ్య : 419 పుట : 281 రాగం: బౌళిరామక్రియ

బౌళిరామక్రియ

98 కలిగె మాకిదె కైవల్యసారము
ఫలించె నాడెదఁ బాడెద నేను ॥పల్లవి॥

నీపాదతీర్థము నీరజభవుని
పైపై కమండలపానీయము
చేపట్టి శంభుని చిరుజడలలో
దీపించుగంగాతీర్థరాజము ॥కలిగె॥

ఘన నీ నామమె గౌరినాలికపై
పనిగొన్న మంత్రపారము
అనుఁగువాణికి నాదిచదువులఁ
బెనఁచే మొదలి బీజాక్షరము ॥కలిగె॥

శ్రీవేంకటేశ్వర చేరి నీదాసుల
సేవ నాపాలిఁటి జీవనము
ఆవిటించి శరణాగతులకును
త్రోవయైన దిదె దోషహరము ॥కలిగె॥419

అవతారిక:

తనకు కైవల్యసారం సిద్ధించినదని ఆనందంతో ఉత్తుంగ తరంగమై కీర్తన నాలాపిస్తున్న అన్నమాచార్యులవారిని వినండి. తన ఆశయం ఫలించింది కావున ఆడెదను, పాడెదను అని నృత్యం చేస్తూ ఈ కీర్తన నాలాపిస్తున్నారు. త్రివిక్రముడైన శ్రీమన్నారాయణుని పాదాలను కడుగవలెనని బ్రహ్మదేవుడు తన కమండలంలోని నీళ్ళను పోస్తే అది ఆకాశగంగయై ప్రవహించి భగీరథుని కోసం భూమిమీదకు చేరటానికి శివుని తలపై చేరి అక్కడనుండి భూమిపై దూకి ప్రవహించి యావత్ ప్రజానీకాన్ని పునీతుల్ని చేస్తున్నదట. గౌరీదేవి శ్రీహరి నామమంత్రం

జపిస్తుందట. వాణికి మొదటి బీజాక్షరాలను ఆదేవ దేవుడే ఇచ్చాడట ప్రభూ! అట్టి నీదాసులను సేవించే భాగ్యం కలిగింది. అదే మాకు కైవల్యసారము అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఇదే మాకు కైవల్యము యొక్క సారము కలిగినది. మా కల ఫలించినది. ఇక నేను ఆడెద (నాట్యం చేస్తాను) పాడెద (కీర్తనలాలాపిస్తాను). ఇంతకీ నాకు సిద్ధించినదేమిటో వినవయ్యా!

ఓ ప్రభూ! నీరజభవుని (బ్రహ్మదేవుని) కమండలంలోని పానీయము (త్రాగేనీరు) శ్రీహరి బలిచక్రవర్తిని పాతాళానికి తొక్కేయుటకు త్రివిక్రముడైనాడు. అప్పుడు వున్నపళంగా ఆయన కాళ్ళు కడగాలని బ్రహ్మ తన కమండలంలోని నీళ్ళు పోసినాడట. ఆ శ్రీహరి పాదజలము ఆకాశగంగయై దివిలో ప్రవహించి భగీరథునికోసం భూమి చేరుటకు శంభుని శిరసుపై దూకి అచ్చటనుండి ఒక పాయ భూమిపై దూకి కోట్లాది ప్రజలు గంగా తీర్థమని సేవించు, గంగానదియై తీర్థరాజమైనది.

ఓ దేవా! నీ ఘననామము గౌరీదేవి నాలుకపై పనిగొన్న (పూనుకొనిన) మంత్రపఠనమైనది. ఆమె నిత్యమూ చేసే నీ నామసంకీర్తన మాకూ దిక్కైనది. నీ అనుగు కోడలైన వాణికి (సరస్వతీదేవికి) ఆనాడు సోమకాసురుని జంపి తిరిగి తెచ్చిన ఆది చదువులను (వేదములను) మొదటి బీజాక్షరములుగా నేడు మాకు విద్యనందించి ఆమెను చదువుల రాణిని చేసినది.

ఓ శ్రీవేంకటేశ్వరా! చేరి నేడు నీదాసులను సేవించుటే నా పాలిట జీవనమైనది. ఆవిటించి (వ్యాపించి) నీ శరణాగతులమైన మాబోటి వారికి అది దోష రహితమై కైవల్యమునకు త్రోవ యైనది. తండ్రీ! నాబోటి అల్పుడు కూడా నిన్ను చేరే ఆధారమైనది.

సంపుటి: 4 కీర్తన : హరిహరి యిందరికి నబ్బురముగాని యిది
సంఖ్య : 363 పుట : 244 రాగం: లలిత

లలిత

99 హరిహరి యిందరికి నబ్బురముగాని యిది
పరగ నీదాసుఁడే పరతత్వవేది ॥పల్లవి॥

పొలసి మశకమండుఁ బొడమేటి జీవుని
తలఁపు బ్రహ్మాండాలు దాఁటిపోయినీ
నిలవెంత నీఁటెంత నీమాయ లివి భువి
బలిమిఁ దెలియువాఁడె పరతత్వవేది ॥హరి॥

తగిలి చూచిన నాత్మఁ దనుఁ గానరాదుగాని
జగమెల్ల దానైతే సరి గనీని
చిగురెంత చేగెంత శ్రీపతి యిందులో నీ-
పగటు దెలియువాఁడే పరతత్వవేది ॥హరి॥

యేవంకఁ దనబుద్ధి యెక్కడనుండునోకాని
శ్రీవేంకటేశ నిన్నుఁ జింతించీని
పూవెంత ఫలమెంత పురుషోత్తముఁడ నీ -
భావమెరుఁగువాఁడె పరతత్వవేది ॥హరి॥363

అవతారిక:

ఓ శ్రీహరీ! నీదాసుడొక్కడే పరతత్వవేది. (నీయొక్క పరా ప్రకృతిని తెలిసినవాడు). మిగిలినవారందరికీ నీ పరతత్వం అబ్బురముగానే వుంటుంది. ఒక మశకము (దోమ) ఎగురుతున్నదంటే జీవాత్మ రూపంలో నీవు దాంట్లో వుండబట్టే. ఆ ఆత్మ నాలోనూ వున్నది. కానీ కానరాదు. ఈ ఆత్మలన్నీ నీవే అవటంచేత జీవాత్మే పరమాత్మయై అద్వైత సిద్ధాంత ప్రతిపాదన సరైనదే అనిపిస్తున్నది. ఓ పురుషోత్తమా! నీ ఈ భావము

తెలిసినవాడే నిజమైన పరతత్వవేది అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

ఓశ్రీహరీ! ఇందరికి (ఇంతమందికి) అబ్బురముగానిది (ఆశ్చర్యకరము కానిది) ఇదే. అదేమిటంటే... నీదాసుడే ఈ జగతియందు భగవంతుని పరతత్వము తెలిసినవాడగుచున్నాడు.

మశకమున (దోమయందు) పొలసి పొడమేటి (సంచరించుచు నెలకొన్న) జీవుడితలపులు చూడబోతే బ్రహ్మాండములను దాటిపోతున్నాయి. ఏమిటీ అద్భుతమాయ!! ఇది యెంతవున్నతమైనది! ఎంత నీటైనది (ఎంత మురిపెము కలిగించునది!) ఈ భువిలో దీనిని తెలియగలవాడెవడు? ఒకవేళ ఎవడన్నావుంటే... వాడేనయ్యా! పరతంత్రుడంటే

తగిలి (పూని) వెదకినా ఆత్మ తాను కనబడదు. కాని సరిగా చూడగలిగితే జగమంతా అది నిండివుంటుంది. ఇదెట్లా సాధ్యమని ఆశ్చర్యపడుతున్నారా? అక్కరలేదండీ... చెట్టు చిగురిస్తున్నప్పుడు ఆ చిగురు యెంత అల్పమైనది!!. కాని దాని చేగు (చేవ లేక బలం) యెంత వుంటుంది. (అది మాను అయితే ఇంటి దూలమై కప్పునే మోస్తుంది కదా!) ఇది నీ దివ్యశక్తి. ఓ శ్రీపతీ! ఇందులో నీ పగలు (ప్రకాశము) తెలియగలమొనగాడెవడు? ఎవడన్నావుంటే వాడేనయ్యా! పరతంత్రుడంటే.

నరుడు తన బుద్ధి యేవంకనున్నా యెక్కడున్నా, ఓ శ్రీవేంకటేశా! నిన్ను జింతించీని (ధానించునా?) నీకృప కలిగితే అట్లా చేయగలడు. వాడెలావుంటాడో యెవరికి తెలుసు? పూవు ఎంత సున్నితము, కోమలముగా వుంటుంది. పండుయెంత పెద్దగా రాయిలా వుంటుంది. రుచిగా కూడా వుంటుందే!! ఓ పురుషోత్తమా! నీ ఈ భావము (లీల) యెరుగగలిగినవాడేనయ్యా! పరతంత్రుడంటే.

సంపుటి: 4 కీర్తన : హరిహరి నీ మాయామహిమ
సంఖ్య : 293 పుట : 196 రాగం: నారాయణి

నారాయణి

100 హరి హరి నీ మాయామహిమ
సరవి దెలియ ననుఁ గరుణించఁగదే ॥పల్లవి॥

తలఁతును నా పాలిదైవమవని నిను
తలఁతును తల్లివిఁ దండ్రివని
మలసి యంతలో మఱతును తెలుతును
కలవలె నున్నది కడ గనరాదు ॥హరి॥

మొక్కుదు నొకపరి మొగి నేలికవని
మొక్కుదు నీ వాదిమూలమని
వుక్కున గర్వించి యుబ్బుదు సగ్గుదు
కక్క సమైనది కడ గనరాదు ॥హరి॥

చూతును నీమూర్తి సులభుఁడవనుచును
చూతు జగములకు సోద్యమని
యీతల శ్రీవేంకటేశ నన్నేలితివి
కౌతుకమొదవెను కడ గనరాదు ॥హరి॥293

అవతారిక:

హరిహరీ! నీమాయామహిమ క్రమంగా తెలిసికొనునట్లు నన్ను కరుణించితివి, గదే! నేను ధన్యుడనయ్యాను తండ్రీ! నీవే నాపాలి దైవము, నా తల్లివి, తండ్రివి, గురుడవు. నీవే నా ప్రాణానివి. అందుకని నీవే కౌతుకమున నన్నేలితివి. ఈ జీవితానికి ఇది చాలు స్వామి. నేను కళ్ళు

తెరిచినా కళ్ళుమూసినా నీ మూర్తే కనబడుతున్నది ఇక ఈ బ్రతుకునకింతకంటే కావలసిందేమి వున్నది ప్రభూ!

భావ వివరణ:

ఓ శ్రీహరీ! నీమాయామహిమల యొక్క తీరుతెన్నులు యెలావుంటాయో వాటిని సరవి (క్రమముగ) తెలియునట్లు నన్ను అనుగ్రహింపుము ప్రభూ!

దేవా! నేను నిన్నే దేవునిగా తలచెదను. నిన్నే నా తల్లిగాను తండ్రిగాను తలచెదను. మలసి (తిరిగి) అంతలోనే ఆ విషయం మరచిపోతాను. ఏమిటి ప్రభూ! నీమాయ? ఇంతలోనే కలవలె అన్నీ మరచిపోయి యేదో పోగొట్టుకున్నవాడిలా బాధపడి నలిగిపోతాను. ఈ భ్రాంతికి కడగనరాదు (అంతము కనబడదు).

ఒకపరి (ఒకసారి) వూరకనే నీకు మ్రొక్కెదను. ఒకపరి నీవు నా ప్రభువువని కీర్తిస్తూ మొక్కుతాను. ఒకపరి సృష్ఠి కంతటికి ఆదిమూలము నీవేనని నమ్ముతాను. నీవు నా పక్షాన వున్నావని ఉక్కున (స్థైర్యము గలవాడనై) గర్వించి ఉబ్బుదును (సంతోషిస్తాను). అటుపై సగ్గుదును (తగ్గిపోతాను). కక్కసమైనది (యెంతో బాధ కలుగుతుంది). కడకనరాదు (దీనికి అంతూ పొంతూ తెలియదు).

ఓ దేవా! నీ దివ్య సుందరమూర్తిని జూచి నీవు మమ్ము సులభముగా అనుగ్రహింతువని తలచెదను. జగములన్నిటికి ఇది సోద్యము (సంభ్రమకరము) అని చూతును. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ విధముగా నన్ననుగ్రహించితివి. నాకు యెంతో కౌతుకము (ఆనందము) కలుగుచున్నది. దానికి కడ కనరాదు (అంతు తెలియకుండా వున్నది). నేను ధన్యుడను తండ్రీ!

సంపుటి: 4 కీర్తన : ఎత్తరే ఆరతులు యియ్యరేకానుకలు
సంఖ్య : 31 పుట : 21 రాగం: బౌళి

బౌళి

101 ఎత్తరే ఆరతులు యియ్యరేకానుకలు
యిత్తల నేఁగివచ్చీని యిందిరానాథుఁడు ॥ పల్లవి॥

గరుధధ్వజపు తేరు కనకమయపు తేరు
సిరులతో వేదములచేరుల తేరు
సురలు మునులుఁ బట్టి సొంపుతోడఁ దియ్యఁగాను
యిరవుగ నేఁగివచ్చీ నిందిరానాథుఁడు ॥ఎత్త॥

జీవకోట్లున్న తేరు శేషుఁడే రూపైన తేరు
వేవేలు సింగారముల వెలయు తేరు
మావరుస నిత్యులును ముక్తులును గొలువఁగా
యీవల నేఁగివచ్చీ నిందిరానాథుఁడు ॥ఎత్త॥

పంచభూతముల తేరు బ్రహ్మాండమైన తేరు
మించిన శ్రీవేంకటాద్రిమీఁదటి తేరు
కొంచక యలమేల్మంగఁ గూడి వచ్చీ నదె తేరు
యెంచరాని మహిమల నిందిరానాథుఁడు ॥ఎత్త॥31

అవతారిక:

శ్రీవేంకటేశ్వరుని రథము తిరువీధులగుండా సాగుతున్నది. ఇందిరానాథుడు ఇటువైపు వచ్చేస్తున్నాడు, ఓ ప్రజలారా! రాండి... హారతులీయండి... కానుకలనీయండి... మీ జన్మ తరింపజేసికోండి అని మంగళం పాడుతున్నారు అన్నమాచార్యులవారు. ఈ తేరు, పంచభూతముల మూలరూపమైన పరమాత్ముని బ్రహ్మాండమైన తేరు అని కీర్తిస్తున్నారు. జీవకోట్లన్నీ ఇందులోనే అదృశ్యరూపంలో వున్నాయట. సురులు మునులు ఈ తేరుని పట్టుకొని సొంపుగా లాగుతున్నారట. ఏరీ కనుపించరేమి? అని జుట్టు పీక్కోకండి. మనకు వారినిచూచే శక్తీ, అర్హతా, భక్తీ

యేవీ లేవు. స్వామి సశరీరుడై తన దేవేరులతో వారికి కనుపిస్తాడు. కాని మనకు అంత అదృష్టం లేదు.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఇందిరానాథుడు ఇటు వూరేగి యిత్తల వస్తున్నాడు (ఇటువైపు వచ్చుచున్నాడు). ఎత్తరో ఆరతులు (హారతులను యెత్తిచూపండి). మీ శక్తి కొలది కానుకలు స్వామికి సమర్పించుకోండి.

ఈ స్వామి యెన్ని రకములైన రథములనెక్కాడో చూడండి. గరుడధ్వజముతో నొప్పిన తేరు బంగారము రాసులైన తేరు. నాలుగు వేదములు దీనికి చేరులు (పట్టుకొని గుంజుటకు వుపయోగించిన నాలుగు త్రాళ్ళు). దేవతలు మునులు అదృశ్యరూపులై దీనిని లాగి తరిస్తున్నారు. ఈవిధంగా ఇరవుగా (సొంపుగా) ఇందిరానాథుడు వూరేగివస్తున్నాడు.

సృష్ఠిలోని జీవకోట్లన్నీ సూక్షరూపంలో వున్నాయి, ఈ రథంలో ఉన్నాయి. ఇది మనకు రథములా కనిపిస్తున్నది కానీ ఆదిశేషుడు చుట్టలు చుట్టుకొని తన పడగలను స్వామికి గొడుగులాపట్టినాడు. వేవేల సింగారములు (అనేకమైన అలంకరణలతో) ఈ తేరు కన్నులపండువగా వున్నది. నారదాది నిత్యులూ, సనక సనందనాది ఋషులు, వ్యాసాంబరీషులవంటి ముక్తులు (ముక్తిపొందినవారు)... మూడు వరుసలలో నిలిచి సేవిస్తున్నారు. ఈవిధముగా ఇందిరానాథుడు వూరేగివస్తున్నాడు.

బ్రహ్మాండమైన ఈ తేరులో పరమాత్మ పంచభూతముల రూపములో విలసిల్లుతున్నాడు. ఈ తేరు మించిన (వుత్కృష్టమైన) శ్రీవేంకటాద్రిపై సాగిపోతున్నది. అదిగో ఈ ఇందిరానాథుడు కొంచక (తగ్గక) తన దేవేరి అలమేల్మంగతో గూడి ఈ తేరుపై వస్తున్నాడు. ఈ మహానుభావుడు యెంచరాని మహిమలు కలవాడు. ఈయనయొక్క అనుగ్రహం పొంది మీజన్మ చరితార్థం చేసికొనండి. ఒక్కసారి ముక్తకంఠంతో అనండి

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం॥



శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



అన్నమయ్య – అనుయాయులు

(పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, తరిగొండ వెంగమాంబ)

భక్తి, రక్తి, విరక్తి కీర్తనలకు

అవతారిక మరియు భావ వివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

అన్నమయ్య – అనుయాయులు

మొదటి ప్రచురణ
జూన్ 2012

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :
కె. వి. ఆర్
98495 79345

అంకితము

తిరుమల సప్తగిరులకు



ఉ ॥ కొండను మోసి దేవతల కొండల కోర్కెలదీర్చి, రాముడై
కొండలద్రిమ్మరౌ కపికి కొండలవైరి సుతున్ వధించితో
కొండను యెత్తి లేత చనుకొండల నంటితివయ్య కృష్ణుడై
కొండలవేంకటేశ! తమ కొండల కంకితమిత్తు దీనినిన్

తా॥ కొండలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరా! నాడు కృతయుగంలో దేవతలకు అమృతం కోసం కొండలవంటి వాళ్ళ కోర్కెలు తీర్చటం కోసం మందరము అనే కొండను మోశావు. త్రేతాయుగంలో రాముడవై కొండల వైరి అయిన ఇంద్రుని కొడుకు వాలిని వధించి ఋష్యమూకం కొండలలో దేశద్రిమ్మరిగా తిరుగుతున్న సుగ్రీవుడనే కపికోసం నిందను కూడా నీవు భరించావు. ద్వాపరయుగంలో గోవర్ధనం అనే కొండను యెత్తి గోకులంలో గొల్లెతల హృదయాలనుదోచి, వారి లేత చనుకొండలను స్పృశించి పరవశింపజేశావు. నేడు కలియుగంలో ఈ తిరుమల ఏడుకొండలపై వెలసి మా కొంగుబంగారమైనావు. యుగయుగాల నుండి నీకు కొండలంటే కొండంత ఇష్టం. అవునా? అందుకనే నేను "అన్నమయ్య - అనుయాయులు" అనబడు నా రచనను నీ కొండలకే అంకితము ఇస్తున్నాను. భక్తితో వాటిని యెక్కినవారందరికీ దీని మూలంగా నాకు దక్కే పుణ్యము సమముగా లభించుగాక!

అన్నమయ్య – అనుయాయులు

అన్నమయ్య "భక్తి" కీర్తనలు

విషయ సూచిక

క్ర.సం.	బహుళ క్ర.సం.	కీర్తన	పేజి
1.	54	అదివో నీప్రతాపము హనుమంత	107
2.	48	ఆనంద నిలయ ప్రహ్లాదవరదా	95
3.	50	ఇతరుల నడుగము యితడే మాదాత	99
4.	34	ఇదియే సాధన మిహపరములకును	67
5.	43	కందర్పజనక గరుడగమన	85
6.	63	కన్నులపండుగలాయ గడపరాయని తేరు	125
7.	33	కొలిచితే రక్షించే గోవిందుడితడు	65
8.	51	కొలువు విరిసెనిదె గోవిందుడు పొద్దులాయె	101
9.	53	కిన్నజానేఽ హం కేశవాత్పరమహో	105
10.	41	గెలిచితి భవములు గెలిచితి లోకము	81
11.	56	చూడనరుదాయనమ్మ సొరిది నందరికి	111
12.	39	చేరియందెల మోతతో చెన్నకేశవా	77
13.	62	జానామ్యహంతే సరసలీలాం	123
14.	55	తథాకురుష్వముదామామద్వేవ	109
15.	59	తవమాంద్రష్టుం దయాస్తివా	117
16.	57	త్వమేవ శరణం త్వామేవమే	113
17.	64	దశవిధాచరణం తన్నభవతి	127
18.	42	నందకధర నందగోపనందన	83
19.	37	నాటికి నాడు గొత్త నేటికి నేడు గొత్త	73
20.	44	పరమపురుష నిరుపమాన శరణు	87
21.	46	పరమపురుషహరి పరమపరాత్పర	91
22.	58	పృథులహేమకౌపీనధర:	115
23.	52	రామాదయాపరసీమా అయోధ్యపుర	103
24.	47	విశ్వమెల్లనీ విరాడ్రూపము	93
25.	38	వొద్దునీవు నా కెదురా వోరి కంసుడా	75
26.	45	శరణు శరణు విభీషణ వరదా	89
27.	36	శరణు శరణు వేదశాస్త్ర నిపుణా	71
28.	35	శ్రావణ బహుళాష్టమి జయంతి నేడు	69
29.	60	స కలం హే సఖి జానామి	119
30.	61	సదయమానస సరోజాతమాదృశ	121
31.	40	సీతారమణా వో శ్రీరామచంద్రా	79
32.	49	సౌమిత్రి సహోదర దశరథ రామా	97

అన్నమయ్య - అనుయాయులు

పెదతిరుమలయ్య "రక్తి" (శృంగార) కీర్తనలు

క్ర.సం.	బహుళ క్ర.సం.	కీర్తన	పేజి
1.	8	అందుకేమిదోసము అంతవాడవౌదువయ్య	15
2.	7	అవతారమందెనిదె అద్దమ రేయి	13
3.	19	ఇందరికి నీవే గుఱి యిదిగో దిష్టాంతము	37
4.	1	ఇతవు సేసినవారికిది వాటాయమ్మలాల	01
5.	23	ఇన్నిటాదొరవు నీవు యిందరున్నారీడ	45
6.	26	ఈరీతి రాముడు కృష్ణుడు యశోదయెదుట నుండి	51
7.	3	ఉంగరము సీతవద్దికొగి నంపి	05
8.	27	ఎటువంటి మోహమో యింతినీపై నితనికి	53
9.	11	ఎమ్మెకాడవై తిరుగనింత దొరకేటికి	21
10.	2	ఏమి నీకింత బలువు యెవ్వరిచ్చిరి	03
11.	20	ఏసతి బొదవలసో యిదొక నెపము వేసి	39
12.	4	ఒయ్యన చేరి పాదాలొత్తవమ్మ	07
13.	22	ఓపము నీతోబెనగ వోబలేశుడ	43
14.	13	కాంతగలనాడు యేకాంతముల మాట	25
15.	18	కానీవయ్యాదానికేమి కలది గలట్టయినీ	35
16.	12	గుట్టుగొంత రట్టుగొంత గులికీగదే	23
17.	10	చెవులారా వినేగాని చెప్పుమా నాకీ సుద్ది	19
18.	5	తమకమేలే యింకను నీతలపు యీతడెరుగు	09
19.	6	తీరె నీయలుకలెల్లా తిరుమాళారు	11

20.	25	దివ్వెయెత్తిన ఫలము దేవరదింతే కదవే	49
21.	24	నీ రమణు డిదెవచ్చీ నెరి నీ విరహమే	47
22.	30	బాపురే యెంతటి జాణ బాలకృష్ణుడు చూడ	59
23.	15	మంచమదె యిల్లదె మాటలేటికే	29
24.	17	మగవాడు భ్రమసిన మరి తెలుపగరాదు	33
25.	21	మహినెల్లా దొప్పదోగే మజ్జనవేళ	41
26.	14	మానెవోరా మాటలికనేలా, నీకు	27
27.	29	మానరాని మాయలు కానీయందుకేమీ	57
28.	31	మొక్కేటి గోపాంగనల మోహనాకారము	61
29.	28	విరహిణి మొదలనే వీరి వొట్టికనేల	55
30.	16	వెగటాయనో కాక విరసమో తమలోను	31
31.	9	వేడుకకాడు గదమ్మ విట్టలుడు	17
32.	32	హరియవతారమె ఆతడితడు	63

చినతిరుమలయ్య "విరక్తి" (అధ్యాత్మ) కీర్తనలు

విషయ సూచిక

క్ర.సం.	బహుళ క్ర.సం.	కీర్తన	పేజి
1.	73	అందరు వికారమందుదురె	147
2.	84	అందుకేమి దోసమా అయితేనేమి	169
3.	69	అల్లము బెల్లమౌనా అన్నలాల	139
4.	75	ఇందరి చూచి యెఱగవద్దా	151

5.	74	ఇందరు నేలదూరేరు హితవే నీవు సేయ	149
6.	78	ఎంతలేదిది యెంచిన	157
7.	76	ఎఱుక గలిగితేను యీతడే దిక్కు	153
8.	77	ఎట్టి హితోపదేశకుడెటువంటి దయాళువు	155
9.	80	ఎవ్వరు చెప్పినా మనసేలమానును	161
10.	82	ఏలికవై నన్నొకని నేలగాను నీ	165
11.	70	ఏలికయైన హరి నేల మరువగ వలె	141
12.	87	ఐనదేది కానిదందులో నేది	175
13.	85	కుడువని కుడుపులు	171
14.	81	చలము చెల్లించుకొన్న సతులాల	163
15.	66	చిన్నవాడు నాలుగు చేతులున్నవాడు	133
16.	72	తచ్చి చూచితే జాలు దైవమే కలడుగాక	145
17.	89	తనకోరికలేటికి	179
18.	65	తనదాసుని కొఱకు ధరియించె నీరూపు	131
19.	68	దవ్వుల తెరువుమరేటికి	137
20.	92	నిండు నిధానమువలె	185
21.	94	నిచ్చలూ జెడనియట్టి	189
22.	79	నీవు గలిగినజాలు నిక్కము అన్నీగలవు	159
23.	95	నేరి చెవ్వడు బ్రదికె	191
24.	93	పండించింతే గలుగునా	187

25.	91	పచ్చిగా దెలియకుంటే	183
26.	65	బ్రహ్మగన్నవాడు పసిబిడ్డా	131
27.	90	భవరోగవైద్యుడైన	181
28.	71	భారము నీదిగాన పట్టి విన్నవించే	143
29.	88	మాయలో మునుగనేల మమతలేల	177
30.	83	సంకె లేక తలచిన జాణలకు	167
31.	96	సకల పురాణములు చాటి నిను	193
32.	86	హరికి మొరవెట్టితే	173

తరిగొండ వెంగమాంబ సంకీర్తనలు

విషయ సూచిక

క్ర.సం.	బహుళ క్ర.సం.	కీర్తన	పేజి
1.	98	ఏల నీకు బుద్ధి లేదురా – ఓరోరి జీవా!	197
2.	100	ఓతల్లీ! గంగాభవానీ! రావే	201
3.	97	గణనాయకా! శరణు – గణనాయకా! శరణు	195
4.	99	లాలిముద్దుల బాల! లాలిగోపాలా!	199
5.	101	శ్రీపన్నగాద్రి వరశిఖరాగ్రవాసునకు	203

ప్రార్థన

కం॥ శ్రీవేంకటేశు గొల్చుచు
ఆవలనీ "అన్నమయ్య - అనుయాయులు"నే
కోవిదులూచగ శిరసుల
నేవివరించెదను వినుడు నిపుణత లొలుకన్

శా॥ ఊహాతీతము నీదలీల భళిరా! ఉర్వీధరా! శ్రీహరీ!
ఆహా! యిత్తరి అన్నమయ్యకృతులన్ అందింతు జోడించుచున్
సాహార్దంబున భావమంత తెలియన్ సాధ్యంబగున్ శ్రీవిభో!
మాహాత్మ్యంబిది నీది నేర్వనగునే మాబోంట్లకున్ యెన్నడున్

ఆ.వె॥ తాళ్ళపాక కవుల తరతరాల బొగడ
సొరిది జేసికొనిన సుకృతమాయె
వేంగమాంబ కృతుల వివరించుటయునాదు
తొంటిజన్మఫలమె తోయజాక్ష!

కం ॥ పెదతిరుమల, చినతిరుమల
కుదిరిరి యీ తాళ్ళపాక కులయుద్ధతికై
ఇదిగో వీరల కృతులను
ముదముగనాస్వాదమంది మ్రొక్కుడు హరికిన్

చం ॥ ఇదికద! భాగ్యమౌ, హరికి నింపుగ బాడిరి తాళ్ళపాకలో
ముదముగ సత్కవుల్ కొలిచి మూడుతరాలుగ కీర్తనంబులన్
అదనుగ అన్నమార్యుడును ఆతనిపుత్రుడు వానిబిడ్డడున్
కుదిరిన జన్మసత్ఫలము కూర్చెదనొక్కెడ నేను మువ్వురన్

మ.కో॥ వేంగమాంబను వుద్ధరించిన వేంకటాచలనాయకా!
రంగుగా నిను భక్తిపాడెను లాలినిద్దురబుచ్చెరా
చెంగటన్ సిరులొల్కు రీతుల చెప్పి వివరంబివ్విధిన్
కొంగుగట్టితి పున్నెమంతయు కోరునదియే ముందిరా?

సీ॥ బ్రతికుండగా తండ్రి బాటలోనే వోయి
తృప్తినిచ్చినవాడె ఆప్తుడగును
"ఆత్మజుండు"ర వీడు అని మెచ్చిపెద్దలు
పొగడుచుండినవాడె పుత్రుడగును
నారాయణుడు కూడ నయమైన బిడ్డంచు
తలనూచువాడు పో తనయుడనగ
దివిజేరు తండ్రికి దివ్యలోకములిచ్చు
కర్మకాండను జేయు ఘనుడు కొడుకు

తే ॥ ఇన్ని గుణములు వొడిగొన్న ఇతడె సుతుడు
ఔర! యీపెదతిరుమల అన్నమయ్య
నియమమును నిల్పి చెప్పెను నిత్యమొకటి
కీర్తనము దాను వేంకన్న కీర్తనుడివి.

ఉ ॥ జన్మల చక్రబంధముల జాడనెరుంగక మ్రగ్గు దీనులున్
చిన్మయమూర్తి సప్తగిరి శ్రీపతిచేరగ దారిజూపుటన్
జన్మనొసంగు తండ్రికిని సాటిర వీడని మెచ్చురీతిగా
తన్మయమొందుకీర్తనలు తాన్పెదతిర్మలపాడి చెప్పెరా

మ॥ అరరే! బిడ్డలు నూర్వురేటికినిరా ఆ దుష్టదుర్యోధనుల్
హరిదాసుండొకడైనమేలు గదరా! అందించ వైకుంఠమున్
తరువుల్ కోటియు చందనంపు తరుకున్ తామెట్లు సాటౌనురా?
తిరువేంకన్నను జేర్చువాడె సుతుడౌ దీప్తించురా వంశమున్

చం॥ నిలిపితి నీలవర్ణునెద, నీరజనాభుని లీలలన్నిటిన్
అలపెదతిర్మలయ్య తను అల్లెను కీర్తన, లిట్లు భావసం-
కలనము జేసి కూర్చితిని; కమ్మగపాడుడు జన్మధన్యమౌ
తొలగును పాపపంకిలము దూరపుమోక్షము సుంత చేరువౌ

ముందుమాట

శ్రీవేంకటేశ్వరుని ఆరాధనే జీవితంగా గడిపిన తాళ్ళపాక అన్నమాచార్యులవారు 32,000 పైగా సంకీర్తనలు చెప్పారు. శ్రీవేంకట మకుటం ఆయన కీర్తనలకు సంకేతం. క్రీ.శ. 1408లో జన్మించిన ఆ మహానుభావుడు క్రీ.శ. 1503లో తన తనువు చాలించే నాటిదాకా ఆ దీక్షను కొనసాగించారు. ఆయన శ్రీనివాస సాయుజ్యం పొందిన నాటినుండి ఆయన అంతిమ కోరిక మేరకు ఆయన సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు అదే దీక్షను కొనసాగించారు.

క్రీ.శ. 1468లో జన్మించిన పెదతిరుమలయ్య సహజ పాండితీ గరిమ సంతరించుకొన్న వాగ్గేయకారుడు. ఈయన వాడిన భాష అనేక సామెతలతోను, ఆనాటి వ్యావహారిక నుడికట్టు పదాలతోనూ అలరారుతుంటుంది. సామాన్యులకు తండ్రీకొడుకుల భాషాశైలి విడదీయుట అసాధ్యము. వీనిని చదివి నేను పొందిన దివ్యానుభూతిని పాఠకులతో పంచుకోవటమే ఈ రచన ప్రధానోద్దేశ్యం. క్రీ.శ. 1553లో ఆ ధన్యజీవి విష్ణు సాయుజ్యం పొందేదాకా ఆ దీక్ష కొనసాగించారు. ఆయన చెప్పిన అధ్యాత్మ కీర్తనలు కూడా సులభశైలిలో మనోరంజకముగా వుంటాయి. ఈ తండ్రీకొడుకులు పదసాహితీ ప్రపంచంలో సూర్యచంద్రులు.

పులి కడుపున పులే పుడుతుందన్న సత్యాన్ని నిరూపిస్తూ, పదకవితాపితామహునికి క్రీ.శ. 1493లో మనుమడు చినతిరుమలయ్య ఉదయించాడు. ఈయనకూడా తన తండ్రి దారిలోనే తరాల అంతరాలు సడలించి పదకవితకు పదునుపెట్టాడు. తన తాత భక్తి, భావగాంభీర్యం ఈయన పుణికి పుచ్చుకొన్నాడని రసజ్ఞుల అభిప్రాయం

"తాళ్ళపాక అర"లో లభించిన ఈ వాఙ్మయసంపద అంతా రాగిరేకులపై లిఖింపబడి భావితరాలకు శ్రీవేంకటేశ్వర ప్రసాదమైనది. క్రీ.శ. 1545, 1547, 1554 మరియు 1558 సంవత్సరములనాటి శాసనములలో కూడా ఈ భాండాగారము గురించి ప్రస్తావించబడినది.

ఈ ముప్పురి రచనా వైదుష్యాన్ని పరిచయం చేయటమే ఈ రచన ప్రధానోద్దేశ్యం. తన తండ్రి పెదతిరుమలను దివికి అనుసరించిన చినతిరుమల క్రీ.శ. 1553లోనే తానూ విష్ణుసాయుజ్యం పొందాడు. అన్నమాచార్యులవారు వెలిగించిన ఆ సంగీతారాధనాజ్యోతి నేటికీ దివ్యకాంతులీనుతూనేవున్నది.

ప్రపంచంలో స, రి, గ, మ, ప, ద, ని – అనే సప్తస్వరాలు వున్నంతవరకు అది వెలుగుతూనే వుంటుంది. ద్వాపరంలో యశోదాదేవి కలియుగంలో వకుళమాలై అవతరించగా శ్రీహరి శ్రీనివాసునిగా ఆమె ఆశ్రయంలో చేరాడు. తమిళులు ఆయనను శ్రీనివాసుడనే అంటారు. అన్నమాచార్యులవారు శ్రీనివాసునే తన ఆరాధ్యదైవమైన శ్రీవేంకటేశ్వరుడని "వేంకట" మకుటంతో 32,000 పైగా కీర్తనలు చెప్పి తరించారు. కారణం యేమై వుంటుంది?

జన్మత: శైవుడైన అన్నమయ్య ఆదివన్ శఠగోపయతి చేతులద్వారా విశిష్టాద్వైతమతం స్వీకరించి అన్నమాచార్యులవారు అయినారు. ఆయనే కాదు వారి తరువాత వారి వంశస్థులంతా విశిష్టాద్వైతులే అయినారు. శఠగోపయతీంద్రులు అహోబలం వాసులయినందున అన్నమాచార్యులవారు అహోబలంలోనే మంత్రోపదేశం పొందారు. అహోబలం నరసింహుని మూలమంత్రమున అక్షరముల సంఖ్య 32. దానినే శఠగోపయతీంద్రులు అన్నమాచార్యులవారికి ఉపదేశించియందురనుట స్వాభావికమే. అన్నమయ్యకూడా అహోబలేశ్వరునిపై వేలాది కీర్తనలు చెప్పిరనుట జగమెరిగిన సత్యమే. ఆ నృసింహుని శృంగారపురుషునిగా కీర్తించుట అన్నమాచార్యుల ప్రత్యేకత. అన్నమయ్య 32000 కీర్తనలు చెప్పిన వెనుక ఆయన జీవితకాలం ముగిసినదనుట సత్యమే అయిననూ వరప్రసాద జనితులైన అన్నమయ్య 32000 కీర్తనలతో ఆయన బృహద్యత్నం ముగియుటకూడా భగవత్సంకల్పమే అయివుండవచ్చును.

ఈనాటి నాబోంట్లు, అల్పజ్ఞానులు, అల్పసామర్థ్యులు, అల్పాయుష్కులూ. అట్టివారికి ఏకాగ్రత యెలావుంటుంది చెప్పండి? వీరు జంటలేనిదే బ్రతకలేరు; ముగ్గురైతే ముచ్చట్లు; నలుగురైతే నవ్వులూ చలోక్తులు; అయిదుగురైతే అనవసర విషయాలు; ఆరుగురైతే అర్థంలేని రాజకీయాలు; ఏడుగురైతే ఎగతాళి; ఎనిమిదిమందయితే ఎదురుదాడి; తొమ్మిదిమంది అయితే దొమ్మి దొమ్మీ; పదిమంది అయితే పడరానిపాట్లు.

మనబోటివారు 32 అన్నమయ్య కీర్తనలు నేర్చితే... అదే ఒక ఘనకార్యం. పైగా 32 విశిష్టమైన సంఖ్య అని తెలుసుకొన్నాము కదా! నేను ఈ నా ప్రయత్నంలో 32 అన్నమయ్య భక్తి కీర్తనలు, 32 పెదతిరుమలయ్య శృంగార కీర్తనలు, 32 చినతిరుమలయ్య అధ్యాత్మ కీర్తనలు, 5 తరిగొండ వెంగమాంబ

మంగళహారతి కీర్తనలు వివరిద్దామని సంకల్పించాను. శ్రీవేంకటేశ్వరుని కృపవుంటే కుంటివాడు ఏడుకొండలెక్కినట్లు నేనూ కృతకృత్యుడనవుతాను. సందేహం లేదు.

మనుష్యునికి ఆ మాయదారి దేవుడు బుద్ధి వికసిస్తున్న కొద్దీ అరిషడ్వర్గాల పీడ అంటగడతాడు. కామం వల్ల శృంగారభావనలు కలుగుతాయి. కొన్నాళ్ళు దాంట్లో కొట్టుకొనిపోయి శ్రీహరి కృపతో ఒకనాడు వైరాగ్యం కలుగుతుంది. అది భక్తికి పునాది వేస్తుంది. చివరికి జన్మల చక్రబంధంలో సతమతమై ఏదో ఒకనాడు వైకుంఠ ప్రాప్తితో మోక్షం దక్కించుకొంటాడు. ఈ వైకుంఠపాళిలో ఆ స్వామి ఆశల నిచ్చెన లెక్కిస్తూనే వుంటాడు. కోరికలనే పాములతో కరిపిస్తూనేవుంటాడు. నిరాశ చెందక శ్రీనివాసునే శరణని న్యాయబద్ధుడై ఆడితే తప్పక నెగ్గి మోక్షం పొందుతాడు. ఆ తరువాత జయమంగళం నిత్య శుభమంగళం అవునా?

తిరుపతికి 100 కి.మీ దూరంలో పశ్చిమాన తరిగొండ అనే గ్రామం వున్నది. అక్కడ వెలసిన జాతిరత్నం తరిగొండ వేంగమాంబ. ఈమె జీవితకాలం చరిత్రకారులు క్రీ.శ। 1780 నుండి క్రీ.శ। 1817గా నిర్ణయించారు. సంసార జీవితం త్యజించి తిరుమలచేరుకొని స్త్రీ అయినందున మొదట వ్యతిరేకత నెదుర్కొన్నా తరువాత ఆమె భక్తితత్పరతవల్ల ఆదరింపబడింది. తుంబురకోనలో స్థిరనివాసమేర్పరచుకొని సాంఘిక వివక్షతనెదిరించి సంప్రదాయంపేరిట జరిగే వివక్షను వెంగమాంబ వేలెత్తి చూపింది. శివకేశవులకు అభేదం ప్రతిపాదించి ఎన్నో యక్షగానాలు, పద్యాలు, ద్విపద కవితలు ఆశుగేయాలు చెప్పింది. వేంకటేశ్వరునికి, తిరుమలలో ఏకాంతసేవ జరిగే సమయంలో ఆనాడు ఈ కవయిత్రి స్వామికి హారతినిస్తూ పాడుతూవుండిన మంగళగీతికను ఈ"అన్నమయ్య- అనుయాయుల" అంతిమ కీర్తనగా అందించడం అమరవాది వంశం చేసుకొన్న అజరామర పుణ్యం.

భక్తి కీర్తనలు జనబాహుళ్యం పొందినవిగా ఎన్నుకోవటానికి ప్రయత్నించాను. వీటి ప్రథానోద్దేశ్యం నిత్యమూ పాఠకులు గానం చేయాలనే. వీటిలో సాధ్యమైనన్ని సంస్కృత కీర్తనలు వుండేలా ప్రయత్నించాను. శృంగారకీర్తనలు వాఙ్మయ విశిష్ఠత పరిచయం చేయాలనే ప్రధానాశయంతో ఎన్నుకోబడినాయి. అధ్యాత్మ కీర్తనలు అందులోనూ చినతిరుమలయ్యవి భక్తి, రక్తి, విరక్తి రుచిచూపాలనే సంకల్పంతో యెన్నుకొన్నాను. ఇటువంటి బృహత్ ప్రయత్నంలో పొరబాట్లు తప్పులూ లోపాలూ వుండటం ఎంతో సామాన్యం. బుధజనులు ఉదారహృదయంతో మన్నిస్తారని

భావిస్తాను. ఎంత త్రాగినా తృప్తి దీరనిది హరినామ రసాయనం. దాని మాధుర్యం అనుభవిస్తేనేగాని తెలియదు. అది గత జన్మల సుకృతం వలన మాత్రమే లభిస్తుంది. శ్రీహరే స్వయంగా అన్నమయ్యను తనవైపు తిప్పుకొన్నట్లు మనము గ్రహించాము కదా! అట్లాగే ఎం.టెక్‌నని యమటెక్కుతో కొన్ని ఇన్‌స్ట్రుమెంట్స్ నేనే సృష్టించానని గర్వించి డబ్బే ముఖ్యం అని జీవించి అవిటివాడినై చివరి దశలో ఆ ఏడుకొండలవాడి దారిలో చేరాను. దాని పర్యవసానమే ఇది.

అందుకే 32 పెదతిరుమలయ్య రక్తి (శృంగార) కీర్తనలు, 32 చినతిరుమలయ్య విరక్తి (ఆధ్యాత్మ) కీర్తనలు, 32 అన్నమయ్య భక్తి కీర్తనలు, 5 తరిగొండ వెంగమాంబ మంగళహారతి కీర్తనలు ఒక్కచోట చేర్చి, వాటికి 'అవతారిక'లనే ఉపోద్ఘాతాలు, 'భావవివరణ'లనే తాత్పర్య విశేషములను జోడించి... ఈ నా ప్రణాళికకు ఆలోచించి, అన్నమయ్య - అనుయాయులు అని పేరుపెట్టాను. అనుయాయులు అంటే అనుసరించినవారు అని అర్థం. ముఖచిత్రం చూడండి.

ఈ ముందుమాట ప్రధానోద్దేశ్యం కీర్తనల విభజన వివరించడమే. ఇక్కడే ఈ కవుల జీవిత చరిత్ర చెప్పాలంటే, సాధ్యమయ్యే పనికాదు.

అవతారికలు సాధ్యమైనంత క్లుప్తంగా, భావవివరణలు సాధ్యమైనంత వివరంగా వ్రాయడానికి ప్రయత్నించాను. శృంగారకీర్తనలలో వయసురాని, వయసుమళ్ళినవారి సౌకర్యార్థం గోప్యం అవసరమై ప్రతిపాదించబడింది.

తిరుమల తిరుపతి దేవస్థానాలవారి గ్రంధాలు, శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులవారి రచనలు ఎనలేని సహాయం అయ్యాయి. సంస్కృతం తెలియని నాకు ఓపికగా సంస్కృత కీర్తనలు వివరించిన శ్రీ శంకరచంద్ర పవన్ గారికి సర్వదా కృతజ్ఞుడను.

నా ఇతర రచనలన్నీ www.geetadeeksha.com అనే వెబ్‌సైట్‌లో పాఠకులకు లభ్యమవుతాయి. ప్రతి ప్రాణిలోను పరమాత్మను దర్శిస్తే ఇక మనుష్యులు సాధించవలసిందేమీవుండదు. "అంతయు నీవే హరి పుండరీకాక్ష" అన్నారు అన్నమయ్య. రక్తి, విరక్తి, భక్తి వంటి మెట్లెక్కినవాడికే "ముక్తి". ఎక్కనివాడు దిక్కుమొక్కులేక అక్కడికక్కడే నిక్కుతాడు. ఆప్తులారా! ఇక చదవండి.

పెదతిరుమలచార్య శృంగార కీర్తనలు

సంపుటి: 17 కీర్తన : ఇతవుసేసినవారి కిది కాదా యమ్మలాల
సంఖ్య : 33 పుట : 22 రాగం: రామక్రియ

రామక్రియ

1 ఇతవుసేసినవారి కిది వాటా యమ్మలాల
కతలు చెప్పఁగఁ బోతే కాఁక రేఁగీ నితఁడు ॥ పల్లవి॥

కడు దప్పిదేరఁగాను కప్పుర మియ్యఁగఁ బోతే
వుడికి తిట్టఁగవచ్చీ నో యమ్మ వీఁడు
వడియుఁ జెమట తుడువఁగఁబోతే పయ్యదను
తడిపాఁత మెడ గొంత తలమనీ నితఁడు ॥ఇతవు॥

కురులు చెదరినవి కూడఁ జెరుగఁగఁ బోతే
విరసాల విదలించివేసీనే వీఁడు
సరుగఁ గస్తూరిబొట్టు చక్క తిద్దఁ బోతేను
వురిసీ నందుకుఁ దో డుప్పని నితఁడు ॥ఇతవు॥

సిగ్గుతో విజనగరసింగారవనములోన
వెగ్గళించి కోనేటి శ్రీవేంకటేశుఁడు
నిగ్గుల నన్నుఁ గూడఁగా నిజాన మెచ్చఁగఁ బోతే
వొగ్గి మాటలబెల్లాల కొడిగట్టీ నితఁడు ॥ఇతవు॥33

అవతారిక:

అన్నమాచార్యులవారి సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు చెప్పిన సరస శృంగారకీర్తన నాస్వాదించండి. ఇది విజయనగరంలోని శృంగారవనము అనే చోట వెలసిన కోనేటి వేంకటేశ్వరునిపై చెప్పిన కీర్తన. నాయిక తన చెలికత్తెలతో చెబుతున్నది. "ఓ అమ్మలారా! మంచి చేసినవారికి ఇది వాటా? (తిప్పలా)? జరిగింది చెప్పబోతే ఎందుకీయన

చిరుబురులాడుతాడు?" అని ఆయన చేష్టలన్నీ వివరిస్తున్నది. ఆయన కూటమిని మనస్ఫూర్తిగా మెచ్చుకుంటే కూడా వొగ్గి మాటల బెల్లాల కొడిగట్టీనితడు – అంటున్నారు. అంటే...?

భావ వివరణ:

ఓ అమ్మలారా! ఇదెక్కడి అన్యాయం? ఇతవు (హితము) చేసినవారికి ఇది వాటా (తిప్పలా?) కతలు (జరిగిన సంగతులు) చెప్పబోతే ఇతడు కాక రేగీని (మండిపడుతున్నాడు).

ఓ అమ్మలారా! దూరంనుంచి వచ్చాడులే, పాపం కడు దప్పికతో నున్నాడేమోనని కర్పూరతాంబూలం ఇయ్యబోయాను. ఉడుకుకొని అడ్డమైన తిట్లు తిడుతున్నాడు. తన వంటికి బట్టిన చెమటను మెల్లగా నా పైటకొంగుతో తుడువబోతే, ఆ తడిపైటనే నా గొంతుకు ఉరిలా బిగించి రుసరుసలాడినాడు.

ఓ అమ్మలారా! చెదరిన తన కురులను (ముంగురులను) నేను చక్కగా సవరించబోతే, వీడు ఎంత విరసుడు!! ననున విదిలించివేసినాడు. తన నుదుట నున్న కస్తూరి తిలకం చెదిరిపోయిందని నేను మళ్ళీ చక్కగా దిద్దబోతే ఉరిసీ (నన్ను ఉరిమినట్లు చూచాడు). అందుకు ఏమాత్రం సహకరించలేదు.

ఆ తరువాత చల్లబడిన అతడు తన ప్రవర్తనకు తనే సిగ్గుపడ్డాడు. ఎందుకంటే, విజయనగరం (హంపీ విజయనగరం) సింగారవనము (శృంగారవనము)లో నెలకొన్న ఈ కోనేటి శ్రీవేంకటేశుడు ఎక్కువ సిగ్గరి. ఆయన, నిగ్గుల నన్ను గూడగా (ఉత్కృష్టుడై నన్ను రమించగా) నిజానమెచ్చబోతే (మనస్ఫూర్తిగా మెచ్చుకొనబోతే), వొగ్గి (అన్నీ వదిలేసి) మాటలబెల్లాల కొడిగట్టీనితడు (మాయమాటలు చెప్పటానికి సిద్ధపడ్డాడు).

సంపుటి: 17 కీర్తన : ఏమి నీ కింత బలువు యెవ్వరిచ్చిరి
సంఖ్య : 386 పుట : 223 రాగం: రామక్రియ

రామక్రియ

2. ఏమి నీ కింత బలువు యెవ్వ రిచ్చిరి
మామీఁదిచలములు మాను మన్నా మానవు ॥ పల్లవి॥

వాడుమోము వంచి నీతో వలపు చెప్పితినో
కూడు మని బత్తి నీకు గొట్టానఁ బెట్టితినో
యేడనుండో వచ్చి నీవు యిచ్చకము లెల్ల నాడి
వోడక వేఁడుకొనేవు వోపనన్నా మానవు ॥ఏమి॥

వట్టి చనవు సేసుక వద్దికి వచ్చితినో
రట్టు తోడ రమ్మని యాఱడిఁ బెట్టేనో
గుట్టుతో నుండక నన్ను కొంగువట్టి తీసినీవే
తట్టువడఁ బెనఁగేవు తగ దన్నా మానవు ॥ఏమి॥

కన్ను లార్చి నీమీఁద కాఁకలు చల్లితినో
తిన్ననిమాటల తరితీపులు సేసితినో
కన్నచో శ్రీవేంకటాద్రికడపరాయఁడవై
సన్నలఁ గూడితి వింకాఁ జాలు నన్నా మానవు ॥ఏమి॥ 386

అవతారిక:

దేవుని గడప (నేడికాలంలో కడప)లో నెలకొన్న కడపరాయునిపై చక్కటి శృంగార సంకీర్తన చెబుతున్నారు పెదతిరుమలయ్య. తిరుమల చేరటానికి ఆనాడు అందరూ దేవుని గడపలో స్వామి ఆశీస్సులు పొంది ఆ తరువాత తిరుమలకి నడక ప్రారంభించేవారట. ఏమయ్యా స్వామీ! మాపై నీకు ఇంత అధికారం ఎవరిచ్చారు? మామీద నీకు ఇంత మచ్చరము యెందుకు మానుమన్నా మానవు, అంటున్నారు. సన్నల గూడితివి అంటే

మాపటివేళ రమింతువు అని అని అర్థం.

తరి తీపులు చేయటం అంటే ఆపేక్ష చూపించటం అని అర్థం. ఈ కీర్తనపాడే నాయిక ఏమంటున్నదో చదవండి.

భావ వివరణ:

ఓ కడపరాయా! ఏమిటయ్యా? నీకు ఈ బలవు (అధికారము) ఎవ్వరిచ్చారు? మామీద చలములు (మచ్చరము) దేనికి? అందువలన మమ్ము ద్వేషించుట మానుమన్నా మానలేకున్నావు.

సిగ్గుతో వాడిన మొగము వంచి నీకు నా వలపు నెరింగించితినా? నన్ను కూడుమని బత్తితో (భక్తితో) నీకు గొట్టానవెట్టితినా (బజారులో పెట్టానా?) అన్నీ చేసింది నీవే కదా! ఎక్కడనుండో వచ్చావు నాతో ఇచ్చకపు మాటలు (పైపై ప్రియవచనములు) ఆడినావు. ఈ రోజు ఓటమినంగీకరించక నన్ను బ్రతిమిలాడి వేడుకొంటున్నావు. నేనిది సహించలేను స్వామీ! అన్నప్పటికీ నీ ప్రయత్నం మానవు.

ప్రభూ! వట్టి చనవుసేసుక (వుత్తుత్తి అనురాగం ప్రదర్శించి) నేను నీ దగ్గరకు వచ్చితినా? రట్టుతో (నానా యాగీ చేసి) నిన్ను నా వద్దకు రమ్మని ఆరడిబెట్టితినా (ఇబ్బంది పెట్టానా?) నీవే ఇన్నీ చేశావు. గుట్టుతో (గుంభనంగా) వుండక అందరూ చూస్తుండగా నా చీరె కొంగుబట్టి లాగావు. తట్టువడ బెనగేవు (అందరికీ వినిపించేటట్లు నాతో పోట్లాడావు). ఇది తగదన్నా మానవు. ఇక నేనేమి చేయగలను?

నా ప్రయత్నం నేనూ చేశాను. నా కళ్ళను ఆర్చి (కదలించి) నీమీద కాకలు చల్లాను (నిప్పులు కురిపించాను). నేరుగా మాట్లాడి తరితీపులు సేసితినో (నా ఆపేక్షను ప్రదర్శించాను). సరే, నేడు గమనిస్తే శ్రీవేంకటాద్రి గడపలో నెలకొన్న కడపరాయుడవై నన్ను సన్నలుగూడితివి (మాపటివేళ రమించితివి). మహానుభావా! ఇంక చాలునన్నా మానవు.

సంపుటి: 17 కీర్తన : ఉంగరము సీతవొద్ది కొగి నంపినవానికి
సంఖ్య : 436 పుట : 252 రాగం: లలిత

లలిత

3. ఉంగరము సీతవొద్ది కొగి నంపినవానికి
వుంగరాలు వేళ్లనిండా నొనరించరే ॥ పల్లవి॥

మద్దులు విఱిచిన మనపిన్న క్రిష్ణునికి
మద్దికాయ లమరు నెమ్మదిఁ బెట్టరే
గద్దించి రావిమానై కాంతలఁ బొందేవానికి
ముద్దుగారే రావిరేక ముంగురులఁ గట్టరే ॥ఉంగర॥

ఘంటాకర్ణునిభక్తి గైకొనేటివానికి
ఘంటలు మొలనూళ్లఁ గట్టరమ్మా
గెంటక గోరనే దైత్యుగీరి చంపినవీనికి
జంట పులిగోరు మెడఁజక్క గట్టరే ॥ఉంగర॥

పాదముననే బండి పడఁ దన్నినవీనికి
పాదపుగజ్జలందెలు వాని యిడరే
గోదిలి గోవర్ధనపుఁగొండ యెత్తినవానికి
యీదెస శ్రీవేంకటాద్రి యెక్కి యాడఁదగునే ॥ఉంగర॥436

అవతారిక:

తన తండ్రి అన్నమయ్య భావపటిమ సంతరించుకొన్న సుపుత్రుడు పెదతిరుమలాచార్యులవారు. ఆనాడు సీతవద్దకు తన బంటు హనుమతో తన గుర్తుగా ఉంగరమును పంపిచిన ఈ స్వామికి నేడు వేళ్ళనిండా వుంగరాలను ధరింపచేయండి అంటున్నారు. ఈ కీర్తనలో ఆయన ప్రస్తావించిన కొంతమంది కథలు నేటి తరాలకు పరిచితం కావు. ఆ కథలను విపులంగా ప్రస్తావించటం కూడా స్థలాభావం వల్ల సాధ్యం కాదు.

అయినా ఈ కీర్తన వివరణ మనకు పెదతిరుమల పాండితీగరిమను పరిచయం చేస్తుంది. రసజ్ఞులు దీనినాస్వాదించండి.

భావ వివరణ:

సీతాదేవి వద్దకు తన ముద్దుటుంగరమును గుర్తుగా తన బంటు హనుమతో పంపిన ఈ దేవదేవుని వ్రేళ్ళకు నిండా ఉంగరాలను తొడగండే.

ఆనాడు బాలకృష్ణునివలె పాకుతూ, తనను కట్టివేసిన రోటిని రెండు మద్దిచెట్ల మధ్యనుండి లాగి వాటిని విరిచి మణికంఠునికి, నలకూబరునికి శాపవిమోచనమిచ్చిన చిన్నికృష్ణుని చెవులకి మద్దికాయలు (ఒక రకమైన చెవి దిద్దులు) నెమ్మదిగా అలంకరించండి. రావి చెట్టుకింద గద్దించి (బెదిరించి), కాంతలను (గోపికలను) కూడినవానికి, రాగివర్ణంతో మెరిసిపోతున్న ముద్దొచ్చే ముంగురులను చక్కగా కట్టి అలంకరించండి.

ఘంటాకర్ణుడనేవాడు తనకు హరినామం వినపడకూడదని చెవులకు గంటలు కట్టుకొని తిరిగాడట. ఈయన వాడివెంటపడి వాని బుద్ధి మార్చి తన భక్తుని చేసికొనినాడట. అటువంటి భక్త జనోద్ధరునికి గంటలున్న మొలత్రాడు కట్టి అలంకరించండి. ఆనాడు హిరణ్యకశిపుడు తనకు ఏ ఆయుధముతోను చావురాకూడదని వరం పొందితే, తను నృసింహుడై, గెంటక (ఆ వరం తిరస్కరించక) గోళ్ళతోనే గీరి వాడిని అంతమొందించాడు. అట్టి, ఈ దేవదేవునికి నేడు 'జంటపులిగోర్ల గొలుసు' మెడలో కట్టండి.

బాలకృష్ణుని శకటాసురుడు బండి రూపంలో సంహరించటానికి కంసునిచే నియోగించబడ్డాడు. చిన్ని పాపాయియైన కృష్ణుడు చాచి కాలుతో ఒక్కతన్ను తన్ని ఆ బండిని నుగ్గునుగ్గు చేశాడు. అట్టి ఈ స్వామి పాదాలకు గజ్జెలున్న కాలి అందియలు అలంకరించండి. గోదిలి (తనవారిని కాపాడవలెనను మమకారముతో) గోవర్ధన పర్వతమునెత్తి దానిక్రింద రేపల్లెవాసులను ఇంద్రుని వడగళ్ళవాననుంచి రక్షించిన ఈ మహానుభావునికి, ఇక్కడ నేడు శ్రీవేంకటాద్రినెక్కి ఆడిపాడి సన్నుతించవలెను కదా!

సంపుటి: 17 కీర్తన : ఒయ్యన చేరి పాదా లొత్తవమ్మ
సంఖ్య : 396 పుట : 229 రాగం: రామక్రియ

రామక్రియ

4. ఒయ్యన చేరి పాదా లొత్తవమ్మ
తియ్యని నోరనే మాట తియ్యవమ్మా ॥ పల్లవి॥

పదియారువన్నెబొమ్మ పట్టపు వొలుకేమమ్మ
యెదురుగొండ లెక్కితి వేమమ్మ
పెదవిపై వాదులనే బేఁట్లు రాలి తమ్మ
యిదివో నీపతితోడ నింత వద్దా అమ్మా ॥ఒయ్యన॥

అతనునిఁ గన్నకొమ్మ హరియఱచేతి నిమ్మ
యితని యలుక దేర్చ వేమమ్మ
మతకాలే నెరపేవు మదము చెక్కులఁ గమ్మ
యితవరిపతితోడ నింత గద్దా అమ్మ ॥ఒయ్యన॥

యీవిఁ గల్పకపు రెమ్మ యింటిలో దాఁచిన సొమ్మ
యీవిభుఁ దప్పక చూచే వేమమ్మ
శ్రీవేంకటేశుఁడైన శ్రీనరసింహునితోడ
యీవేళనే యెక్కుకొంటి వింత గద్దా అమ్మా ॥ఒయ్యన॥ 396

అవతారిక:

అహోబల నారసింహుని దేవేరియైన శ్రీలక్ష్మికి తన భర్తనెలా వశపరచుకోవాలో ప్రబోధిస్తున్నారు పెదతిరుమలాచార్యులవారు. ఒయ్యన అంటే మెల్లగా అని అర్థం. మరి ఆయన ఉగ్రనరసింహుడు. అందుకని పాదములనొత్తి తీపిమాటలతో తియ్యవమ్మా అంటున్నారు. అంటే దారికి తెచ్చుకోవడమన్నమాట. అన్నమయ్య తన ప్రజ్ఞనంతా పుత్రునికి వరప్రసాదం చేశారేమో అనిపిస్తుంది. శ్రీ నరసింహునితో ఈ వేళనే

మొక్కుకొంటిని, ఇంత కద్దా! అమ్మా! అంటున్నారు. ఆనాటి వ్యావహారిక తెలుగే ఈనాటికి వివరణ అవసరమైనదంటే... అది మన దురదృష్టం. అంతే. ఎంత మధురమైన భావసౌందర్యం!!

భావ వివరణ:

తల్లీ! శ్రీదేవీ! నీవు నీపతివద్ద ఒయ్యన చేరి (మెల్లగా చేరి) ఆయన పాదముల నొత్తవమ్మా! తియ్యని (మధురమైన) నోటితో మధుర సంభాషణలు చేసి ఆయనను తియ్యవమ్మా (దారికి తెచ్చుకోవమ్మా!)

అమ్మా! నీవు పదియారు వన్నెల బంగారు బొమ్మవు. నీవు రాజసపు ఠీవిలొలుకుచున్నావు. ఈ నారసింహుడు వెలసిన ఎదురుకొండపై నీవునూ వెలసినావు. బెట్టుసరిచూపి నీ భర్తతో వాదులాడుచున్నావు. ఇదిగో ఎంతైనా ఆయన ఉగ్రనరసింహుడు. ఆయనతో ఇంత వద్దా (అనుకూల్యమా?) తల్లీ!.

నీవు "అతనుని" (మన్మథుని) కన్న సుందరాంగివి కదా! అందుచేత నీవు హరి అరచేతి నిమ్మవు (కరతలామలకవు... అనగా ఎప్పుడు అవసరమైతే అప్పుడు వుపశమనమిచ్చు దానవు... అని అర్థం). మరి ఈ స్వామి ఇప్పుడు అలిగియున్నాడు. ఈయన అలుకనెందుకు తీర్చవు? మదము చెక్కులగమ్మ (చెక్కిళ్ళపై అద్దిన కస్తూరి వ్యాపించగా) నీవు మతకాలు నెరపేవు (ఆయనను సమ్మోహన పరచెదవు). ఇతవరిపతితో (అనుకూలుడైన భర్తతో) ఇంత కద్దా (దిట్టతనమా) తల్లీ!

నీవు ఈవి గల్పకపురెమ్మవు (ఈప్సితములను తీర్చు కల్పవృక్షపు తోబుట్టువవు). ఇంటిలో అందరు దాచుకొనే సంపదవు. ఈ విభుని (జగన్నాథుని) తప్పక చూచేవేమమ్మా? (అట్లా తేరిపారచూచెదవేమమ్మా?) అక్కడ తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడైవున్న ఈ అహోబలనృసింహునితో ఈవేళ యెక్కుకొంటివి (సింహాసనం అధిష్టించియున్నావు). ఇంత కద్దా (దిట్టతనమా) తల్లీ!

సంపుటి:17 కీర్తన : తమక మేలే యింకను నీతలఁపు లాతఁ డెఱుఁగు
సంఖ్య : 126 పుట : 75 రాగం: భైరవి

భైరవి

5. తమక మేలే యింకను నీతలఁపు లాతఁ డెఱుఁగు
సముకమందు నేఁడు నీ చలములెల్లాఁ దీరీని ॥ పల్లవి॥

సేయరాని బాస లతఁడే సేసెఁ గదవే నీకు
మాయదారియలుక యిటు మఱవఁ గదవే నీవు
ఆయ నాయ రావే అతఁ డదివో వున్నవాఁడు
కాయ మంటినపుడే నీ కపటమెల్లాఁ బాసీని ॥తమక॥

కన్నెనాఁడే యితఁడూ నీకుఁ గన్నువేసినాఁడూ
యెన్నరాని బిగువు యింక యేల సేయ నీవు
తన్నుఁదానే యిటకుఁ దగులఁ దీసినపుడే
నిన్నమొన్నఁ గలవి తన నింద లెల్లఁ బాసీని ॥తమక॥

చిందనూరిలోన నీకు చేయి చాఁచె నితఁడూ
మందెమేళ మేలే వాని మానలేవు నీవు
కందు వలర నగుతా యిట్టె కనకరాయఁ డిపుడూ
విందువలెనే యెనసె శ్రీవేంకటేశుఁ డితఁడు ॥తమక॥ 126

అవతారిక:

చిందనూరిలో వెలసిన కనకరాయడి మీద సరస శృంగార కీర్తన చెబుతున్నారు పెదతిరుమలాచార్యులవారు. ఆ స్వామి దేవేరినుద్దేశించి పాడుతున్నారు. ఇతడు నీకై చేయి చాచెను. ఇక నీకు ఉపేక్ష దేనికి? నీవు ఎలాగూ అతనిని విడువలేవు ఎందుకంటే ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. కాబట్టి ఆయనను నవ్వుతూ ఆహ్వానించు. నీ తలపులన్నీ ఆయనపై వున్నాయి. ఆయన సమక్షంలో నీ మత్సరం ఏమాత్రం పనిచేయదు.

ఆయన్ని చూడగానే పరవశించిపోయే నీవు ఆయనకు లొంగక తప్పదు... అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవీ! తమకమేలే (ఇంత పరవశమేలనమ్మా?) ఇక అతడు (ఆ కనకరాయుడు) నీతలపులు (ఆలోచనలన్నింటినీ యెరిగియున్నాడు). నేడు సముకమందు (ఆతని యెదుట) నీ చలములెల్లా దీరీని (నీ మచ్చరమంతా తీరిపోయినది).

నిజమే... ఆయన చేయరాని వాగ్దానాలు నీకు చేసినాడు. అయినా ఈ మాయదారి అలుకలు (కోపతాపాలు) నీకు యెందుకమ్మా? ఆయ నాయ రాలే (అయిందేదో అయింది ఇటు రావమ్మా!) అదిగో ఆయన నీ శరీరాన్ని తాకి నంతలోనే నీకపటము (ఉత్తుత్తి అలుకలు) అన్నీ బాసీని (వదిలిపెట్టిపోతాయి). అందుకే ఈయన ముందు నీఅలుకలు చెల్లవు.

అతడు (ఆ కనకరాయుడు) కన్నెనాటి నుండి (నీవు యౌవనవతి వైనప్పటినుండీ) నీపై కన్నువేసినాడు (వ్యామోహపడినాడు). ఇంకా నీకు పనికిరాని బిగువులు (బింకములు) ఎందుకమ్మా! తనంతట తానే ఇక్కడకు రావటానికి తగులదీసినపుడే (యత్నించినప్పుడే) నిన్న మొన్న ఆయనకు నీపైనున్న నిందలెల్లా (పితూరీలన్నీ) మటుమాయమైపోయినాయి. ఇది యెప్పుడూ జరిగేదే కదా!

తల్లీ! ఈ కనకరాయుడు, చిందనూరిలో నెలకొన్న దేవదేవుడు. ఈయన నీకోసం చేయిచాచి నిన్ను ఆహ్వానిస్తున్నాడు. నీకు మందెమేళమేలే? (ఉపేక్ష ఇంకా దేనికమ్మా?) నీవు ఎలాగూ వానిమానలేవు (ఆయనను విడచి యుండలేవు). అతడు నగుతా (నవ్వుతూనే) ఇట్టే విందువలె నిన్ను పొందినాడు. ఎందుకో తెలుసా? ఈయనే అల్లదిగో ఆ శ్రీవేంకటేశ్వరుడు.

సంపుటి: 17 కీర్తన : తీరె నీయలుక లెల్లా తిరుమాళారు
సంఖ్య : 405 పుట : 234 రాగం: దేసాళం

దేసాళం

6. తీరె నీయలుక లెల్లా తిరుమాళారు
తీరని మోహముతోడి తిరుమాళారు ॥ పల్లవి॥

వీనుల పండువగా వేఁడుకొనీ నీవిభుఁడు
తేనెమోవి మాటాడవో తిరుమాళారు
పూనిపట్టి యప్పటిని పొద్దు గడపఁగ నేల
దీన నేమి వచ్చె నీకు తిరుమాళారు ॥తీరె॥

చక్కని నీచన్నులపైఁ జూఁచీ నాతఁడు చేయి
తక్కని నగవు లేలో తిరుమాళారు
మొక్కేవానివలెనే ముందర నిలుచున్నాఁడు, ఆ
దిక్కు చూడఁగదవమ్మ తిరుమాళారు ॥తీరె॥

కులికి శ్రీవేంకటాద్రి గోవిందరాజు నేప్రొద్దు
తిలకించి కూడె నట్టె తిరుమాళారు
పలుకుఁ బంతము చెల్లెఁ బైపై మీ కిద్దరికి
తెలిసితిమి మీగుట్టు తిరుమాళారు ॥తీరె॥ 405

అవతారిక:

తిరుపతిలో నెలకొన్న గోవిందరాజస్వామి వారి దేవేరిపై సరస శృంగార కీర్తన చెబుతున్నారు. పెదతిరుమలాచార్యులవారు. ఆ తల్లిని "తిరుమళారు" అని సంబోధిస్తున్నారు. తీరని మోహముతో నున్న ఓ తిరుమాళారూ! నీ అలుకలన్నీ తీరినవమ్మా! అంటున్నారు. "తిరుమలదేవి" అనే తెలుగు పదానికి సమానమైన తమిళ పదము అని నా భావన. ఆనాటికాలంలో ఇటువంటి తమిళ పదములు కోకొల్లలు. శృంగార రసం

ఒలికించడంలో తండ్రికి సమవుజ్జీ ఈ తిరుమలయ్య. తెలిసితిమి మీ గుట్టు తిరుమాళారు అని చమత్కరిస్తున్నారు. అందుకే కవి సర్వస్వతంత్రుడన్నారు పెద్దలు.

భావ వివరణ:

ఓ తిరుమాళారూ (తిరుమలదేవీ!) నీ అలుకలు (కోపతాపములు) అన్నీ తీరినవి (సర్దుకున్నాయి). తీరని మోహముతోనున్న నీవు వుపశమించినావమ్మా!

నీ విభుడు (పతిదేవుడైన) ఈ గోవిందరాజస్వామి నీ చెవులకు పండుగవలె నిన్ను వేడుకొనుచున్నాడు. తేనెలూరు అధరములున్న నీవు తీయగా ఆయనతో మాట్లాడవమ్మా! పూనిపట్టి (కావాలని) ఆయనతో అప్పటిని (విరసముతో) పొద్దు గడపుట ఏమి పని తల్లీ! దీనివల్ల నీకేమి వస్తుంది? మొగుడూ పెళ్ళాలు కొట్టుకుంటే ఇరుగు పొరుగు వారికి వినోదం కదమ్మా! ఓ తిరుమాళారూ! నీ అలుకలు మానవమ్మా!

రమ్యమైన నీ వక్షోజములపై చేయిజాచ యత్నించు ఈ స్వామిని చూడు. ఏమాత్రమూ తగ్గని చిలిపినవ్వులెట్లు చిందించుచున్నాడో చూడవమ్మా! ఆ వినయం చూశావా? నీకు మొక్కేవానివలె ఎంత విధేయత చూపుచున్నాడో!! ఆ దిక్కు చూడగదమ్మా! (కాస్త ఆయనవైపు చూడవమ్మా!) తిరుమాళారూ!

కులుకులొలుకు నీవు ఈ వేంకటాద్రి విభుడైన గోవిందరాజును పారవశ్యముతో తిలకించి ఏవేళనైనా ఆయనను కూడేవు. మీకిద్దరికీ ఈ విధముగా పలుకు బంతములు చెల్లెను (మాట పట్టింపులు తీరిపోయినవి). ఎందుకంటే అవి పైపైపంతములే కదా! (ఉత్తుత్తి పంతములు). ఓ తిరుమాళారూ! నేడు మీగుట్టు తెలిసితిమి. (మాకు మీ రహస్యం తెలిసిపోయింది). ఆయన పరమాత్మ, నీవు ఆత్మవు. మీ కలయిక అనివార్యము.

సంపుటి: 17 కీర్తన : అవతారమందె నిదె అద్దమరేతిరికాడ
సంఖ్య : 144 పుట : 85 రాగం: సాళంగనాట

సాళంగనాట

7. అవతారమందె నిదె అద్దమరేతిరికాడ
భవహరుఁడు శ్రావణబహుళాష్టమిని ॥ పల్లవి॥

వసుదేవుఁడు సేసిన వరతపముఫలము
పసల దేవకిపాలి భాగ్యరేఖ
దెసల సజ్జనులకు తిరమైన పుణ్యము
కొసరికె కంసుని గుండెదిగులు ॥అవతార॥

నందగోపుని యెదుటి నమ్మిన యైశ్వర్యము
కందువ యశోదకు కనకనిధి
ముందరి గొల్లెతలకు మోహపుఁ బాలజలధి
సందడి శిశుపాలునిసంహారము ॥అవతార॥

దేవతలమునులకు దివ్యమైన పరంజ్యోతి
భావించుదాసుల వజ్రపంజరము
శ్రీవేంకటాద్రిమీఁదఁ జెలఁగే కృష్ణుఁడిదివో
దావతి నరకాసురు తలగుండుగండఁడు ॥అవతార॥ 144

అవతారిక:

ఎవరన్నా నిష్ణాతులు ఇది పెదతిరుమలాచార్యులవారి కీర్తన అంటే ఓహో అట్లాగా అనుకోగలరే కాని ఇది అన్నమయ్య కీర్తన అంటే కాదనే మొనగాడు మచ్చుకి ఒక్కడు కూడా వుండడంటే నన్ను నమ్మండి. అంత గొప్పగా అచ్చు అన్నమయ్యవలె చెప్పిన కీర్తన ఇది. బహుశా ఒకానొక కృష్ణాష్టమినాడు చెప్పివుంటారీ కీర్తన. అద్దమరేతిరి అంటే అర్ధరాత్రి అని అర్థం. అన్నమయ్య కాలంలో చెరసాలలో వున్న నేరస్థులకు తలగుండు

అనే శిక్ష వేసేవారు. వాడు తన నెత్తిన ఒక పెద్ద ఇనుపగుండు పెట్టుకొని తిరగాలి. మరి ఈ కృష్ణయ్య, నరకాసురునికి తలగుండువంటి మొనగాడట. ఈ పెదతిరుమల వంటి వారినే "ఆత్మజులు" అంటారు.

భావ వివరణ:

ఇదిగో ఈ శ్రీకృష్ణభగవానుడు, అద్దమరేతిరికాడ (అర్ధరాత్రి సమయమున) శ్రావణ బహుళాష్టమినాడు, అవతారమందె (అవతరించినాడు). ఈ దేవదేవుడు భవహరుడు (భవరోగములను నివారించు మహానుభావుడు).

ఈయన వసుదేవుడొనరించిన అనేక దివ్య తపముల ఫలము. దేవకీదేవికి పసల భాగ్యరేఖ (సమృద్ధికరమైన భాగ్యములు గల్పించు భాగ్యరేఖ). దెసల (దిశదిశలయందును) సద్వర్తనుల పాలిటి స్థిరమైన పుణ్యము ఈయనే సుమా! ఈయన కంసునికి "కొసరికె గుండెదిగుట" (ఒకనాటితో తీరని గుండెమంట).

ఈ శ్రీకృష్ణుడు నందవ్రజమున తండ్రి నందగోపునికి తన వైభవమే ఈతడని నమ్మిన ఐశ్వర్యము. పెంపుడు తల్ల యశోదాదేవికి, ఈయన కనకనిధి (బంగారు పాతర). ముందరి గొల్లెతలకు (వయసులో తనకంటే పెద్దవారైన గోపికలకు) మోహవికారమును కలిగించిన పాలజలధి. ఏవిధంగా పాలజలధి దేవతల మనోభీష్టములను తీర్చినదో ఈయన గోపికల వింతవింత కోర్కెలను తీర్చాడు.

ఈ పరాత్పరుడు దేవతల, మునీశ్వరులపాలిటి ఆత్మజ్యోతి. వజ్రముతో చేసిన పంజరము దానిలో వున్న పిట్లనెలారక్షిస్తుందో, అలాతన దాసులను రక్షించే వజ్రపంజరము ఈ మహానుభావుడు. అల్లదే ఆ వేంకటాద్రిపైన వెలసిన వేంకటకృష్ణయ్య ఈయనే కదా! మనం సంతోషంగా దీపావళి చేసికొనుటకు కూడా ఈయనే కారణం. పదియారువేల రాచకన్నెలను చెరబట్టిన దావతి (కామాంధుడు) నరకాసురునికి ఈయన తలగుండు గండడు (తలగుండువంటి మొనగాడు).

సంపుటి: 17 కీర్తన : అందుకేమి దోసము అంతవాడ వౌదువయ్య
సంఖ్య : 135 పుట : 80 రాగం: సాళంగనాట

సాళంగనాట

8. అందు కేమి దోసము అంతవాఁడ వౌదువయ్య
గందము పూసినయట్టి కపురా (?) యిది ॥ పల్లవి॥

అప్పుడే నాతో మాటలాడి యాపెతో నాడేవు
కప్పురముదిన్ననోరి కపురా యిది
యిప్పటి నీ మేనిరేక లిటు నటు చాఁచేవు
తప్పనిరచ్చల దొరతనమా యిది ॥అప్పు॥

చాయల సన్నల రెంటా సరిఁదూఁగఁ దిరిగేవు
పాయపు మదముతోడి పంతమా యిది
చేయి చాఁచి వొండొరుల చేతులకు మొక్కించేవు
నీయంకెకు వంచుకొనే నేరుపా యిది ॥అప్పు॥

గక్కున నిద్దరి నిట్టె కౌఁగిలించుకొంటి విదె
పక్కునఁ బాలుదాగిన బలిమా యిది
మక్కువ శ్రీవేంకటేశ మమ్ము మెచ్చే వప్పటిని
మొక్కలపు రతులలో మోహమా యిది ॥అప్పు॥

అవతారిక:

అందుకేమి దోసము అంటే నేటి పరిభాషలో "అందులో అనుమానమేమున్నది?" అని అర్థం. పెదతిరుమలాచార్యులవారి నాయిక, స్వామితో దెప్పుతున్నది. "నీవు అంతటి వాడివే. అదిగో ఆ కనబడుతున్నది గంధముపూసినకపురా?" అని అడుగుతున్నది. కపురు అంటే సంకేతము అని అర్థం. బహుశా ఈమాట "ఖబర్" అనే పారశీక పదం నుంచి వచ్చియుండవచ్చును. ఎంత గొప్పగా "సంజాయిషీ" అడుగుతున్నదో

చూడండి. ఔరా!! మా ఇద్దరినీ (శ్రీదేవి, భూదేవి) ఒకేసారి చటుక్కున వాటేసుకున్నావు. ఇది గబుక్కున పాలుతాగిన బలముకాదు కదా! అంటున్నది. ఏమి రసహృదయమో! కదా! సాధ్యమైనంత గోప్యంగా వివరణ వుంటే... అది అంతే.

భావ వివరణ:

ఓ దేవదేవా! అందుకేమి దోసము? (అందులో అనుమానించాల్సిందేముంది?) నీవు అంతవాడవే నయ్యా! ఇది, గంధము పూసినయట్టి (గంధము నీ ఒంటికి పూసిన) కపురా (గుర్తుకాదా)? ఇంకా నన్నెందుకు వంచిస్తావు?

అప్పుడే (అంతకుమునుపే) ఆమెతో మాట్లాడి ఇప్పుడు నాతో మాట్లాడుతున్నావు. ఆమె తినిన కర్పూరతాంబూలపు కపురా (వాసన యొక్క గుర్తు కాదా ఇది? నీమేనిపై వున్న ఈ రేకలు చాచేవు (దీర్ఘముగా కనబడుతూనే వున్నాయి.) తప్పని రచ్చల దొరతనమా ఇది? (పాపం! నీవు చేసే పెత్తందారీ తనము ఇదే కాబోలు.) ఎవరు చూడవచ్చారు?

సన్నల (సంధ్యా సమయం అయిందంటే) ఛాయల (చీకటిపడేదాకా) రెంటా (రెండిట్లోనూ) చెడతిరుగుతావు. పాయవు (ఈ అలవాటు మానుకోవు). యౌవనగర్వంతో కలిగిన పట్టుదల కాకపోతే ఇంకేమిటి ఇది? ఒండొరుల (ఇద్దరు భామలను) నీ చేతులు చాచి నీకు మొక్కించుకుంటున్నావు. నీ అంకెకు వంచుకునే నేరుపా ఇది? (నీవైపు తిప్పుకొనే నీ చాకచక్యమా ఇదంతా?)

ఔరా!! ఇదే ఇద్దరినీ (భూదేవిని శ్రీదేవిని) గక్కున ఇట్టే కౌగలించేవు (గబుక్కున ఆలింగనం చేసికొనెదవు). పక్కున (చటుక్కున) పాలుత్రాగిన బలము కాదుకదా! ఇది? ఓ శ్రీవేంకటేశ్వరా! మమ్ము (మా ఇద్దరినీ) మక్కువతో (ప్రేమతో) అప్పటిని (మరలమరల) మెచ్చేవు. ఇది మొక్కలపురతుల మోహమా? (అప్రతిహతమైన రతులదేలినయట్టి మోహావేశము కాదుకదా?)

సంపుటి: 17 కీర్తన : వేడుకకాడు గదమ్మ విట్టలుడు
సంఖ్య : 289 పుట : 168 రాగం: లలిత

లలిత

9. వేడుకకాఁడు గమ్మ విట్టలుఁడు
ఆడా నీడా నేగి వచ్చీ నదె విట్టలుఁడు ॥ పల్లవి॥

తుంగభద్రనీటిలోన తొయ్యలులుఁ దాను నీఁదీ
వెంగలిరతులఁ దోఁగీ విట్టలుఁడు
నింగి మోచినతోపులనీడల వినోదించి
అంగనలతో నవ్వుచు నదే విట్టలుఁడు ॥వేడుక॥

తేరువీది నల్ల వాఁడే దిమ్మరై సతులఁ బిల్చి
వే రమ్మనీ చీఁకటింట్లో విట్టలుఁడు
కూరిమి నిలుపలేక కొండలపడవలలో
నారగించీ నూరవిందు లదే విట్టలుఁడు ॥వేడుక॥

అదివో విజనగరమందు వాడల వాడల
వెదచల్లీ వరములు విట్టలుఁడు
ఉదుటు శ్రీవేంకటాద్రినుండి వచ్చి గుడిలోన
నదన రుక్మిణి దాను నదే విట్టలుఁడు ॥వేడుక॥ 289

అవతారిక:

విజయనగరము (హంపీ)లో వెలసిన విఠలునిపై సరస శృంగార కీర్తన చెబుతున్నారు పెదతిరుమలయ్య. ఆ స్వామి వేడుకకాడట (విలాసపురుషుడు). అక్కడా ఇక్కడా వూరేగి వచ్చాడట ఆయన. శ్రీవేంకటాద్రినుంచి వచ్చి గుడిలో తాను రుక్మిణీదేవి అదనగా వున్నారట. ఇక్కడ అదనగా అంటే తగినట్లు అని అర్థం చెప్పుకోవాల. తాళ్ళపాక కవులు సహజ పండితులైనందున వారి భావనకు 'అదనైన' అర్థం

చెప్పుకోవాలన్నమాట. పెదతిరుమలయ్య వాడిన కొన్ని మాటలకు నిఘంటువులో అర్థాలు దొరకవు. 'తేరువీధి' అంటే రథములు వెళ్ళేరహదారి. చదివి ఆలోచించినకొద్దీ ఆనందాన్ని ఇచ్చే కీర్తన ఇది.

భావ వివరణ:

ఓ అమ్మలారా! ఈ విట్టలుడు (విఠలేశ్వరుడు), వేడుకగాడు కదమ్మా! (విలాస పురుషుడు) కదటమ్మా! ఈయన గొప్ప శృంగారరాయుడు. అదె (అదిగో) ఆడానీడా (అక్కడ ఇక్కడ) యేగివచ్చె (తెగ తిరిగివచ్చాడు).

ఈ తుంగభద్రానది నీటిలో తొయ్యలులు (గొల్లభామలు), తానున్ ఈది, వెంగలిరతుల (మొరటు రతిక్రీడల) దోగీ (తేలియాడి) వచ్చినాడు కాబోలు. నింగిమోచినతోపుల నీడలలో (అల్లదే ఆకాశాన్ని తాకే ఎత్తయిన చెట్ల నీడలలో), అంగనలతో (స్త్రీలతో) వినోదించి (వినోదంగా గడిపి) ఈ విఠలుడు నవ్వుచూ ఎంత కులాసాగా వున్నాడో చూడండి.

ఈ విఠలుడు యెంత పోకిరీవాడో చూశారా? అల్ల తేరువీధిన్ దిమ్మరై వాడే సతుల బిలిచి చీకటింట్లో వేరమ్మనీ (అక్కడ రహదారిలో చెడ తిరిగివచ్చి వాడే గోపికలను పిలిచి చీకటిగావున్న పడక గదులలోకి వేగిరమే రమ్మని పట్టుబడతాడు.) కొండల పడవలలో (కొండగుహలలో) వారిపై తనకూరిమి (వలపు) నిలుపలేక (ఆపుకోలేక) ఊర విందులు (బంతిభోజనాలు) ఆరగించీని (భుజిస్తున్నాడు). వారి జన్మలు ధన్యమైనవి.

అదిగో నేడు ఈ విఠలుడు విజయనగరం (హంపీ) వాడలవాడల (వీధివీధీ) వూరేగుతున్నాడు. వరములను వెదజల్లుతున్నాడు. ఈయన ఉదుటువేంకటాద్రి (ఉద్ధతిగల వేంకటాచలము) నుండి వచ్చాడు. తన ముద్దులభార్య రుక్మిణీదేవితో అదె విఠలుడు అదన (తగినట్లు) తానువున్నాడు. వారికి మొక్కి మీ జన్మ తరింపజేసికొనండి.

సంపుటి: 17 కీర్తన : చెవులారా వినేఁగాని చెప్పుమా నాకీ సుద్ది
సంఖ్య : 154 పుట : 91 రాగం: పారాయణి

లలిత

10. చెవులారా వినేఁగాని చెప్పుమా నా కీ సుద్ది
జవళి వలపు లిట్టే చల్లుదురా ॥ పల్లవి॥

యిరవై నన్నె తలఁతు నెప్పుడు నంటా నాడేవు
తరుణులఁ బొందేవేళ తలఁతువా
యెరవు లేక నాకే యెదురు చూతు ననేవు
కరఁగి చొక్కేవేళ కను విచ్చి చూతువా ॥చెవు॥

వనజాక్ష నారూపువాసి చూతు ననేవు
వనితలచన్నులపై వ్రాతువా
చనవున నాపెకే జపియింతు ననేవు
అనుగుఁగాంతఁబిలచేయప్పుడూ జపింతువా ॥చెవు॥

యెమ్మెలతో నా నేరుపు లెంతు నంటా నాడేవు
కొమ్మలతోడుత నిట్టే కొనియాడుదువా
మమ్ము శ్రీవేంకటేశుఁడ మండెమురాఁడవై
సమ్మతి గూడే విట్టే చన విత్తువా ॥చెవు॥ 154

అవతారిక:

మండెము అనుగ్రామమున వెలసిన వేంగళరాయనిపై సరస శృంగారకీర్తన చెబుతున్నారు పెదతిరుమలాచార్యులవారు. 'జవళి' అంటే 'అమ్మదగిన కొత్త వస్తువు' అని అర్థం. 'జవళివలపు' అంటే నమ్మకం కలిగించే కొంగ్రొత్త ప్రేమలు అని భావించాలి. "ఓ మండెమురాయా! మా చెవులారా వింటాముగానీ, నాకీ కతలు చెప్పవయ్యా! పరాయి కాంతలమీద నమ్మకం కలిగించే కొత్త కొత్త వలపులు ఈ విధంగా చల్లుతారా!

అంటున్నది ఈ చెలికత్తె (పెదతిరుమల). పోనీ ఆయన ఆ వలపుకత్తెల ఇష్టానికి వ్యతిరేకంగా వారిని బలవంతం చేస్తాడా అంటే... అదేమీ లేదు. వారి సమ్మతితోనే ఇట్టే కూడుతాడట. మరీ అంత చనువిస్తాడట.

భావ వివరణ:

ఓ మండెమురాయా! నా చెవులారా వింటానుగానీ కాస్త నీ సుద్దులు (కట్టు కథలు) చెప్పుమా (చెప్పవయ్యా). ఇట్టే (సునాయాసంగా) జవళివలపులు (నమ్మకం కలిగించే కొంగ్రొత్త ప్రేమలు) చల్లుదురా (కురిపించెదవులే).

ఇరవై (సుస్థిరంగా హృదయంలో నిలుపుకొని) నన్నే ఎప్పుడూ తలచుకొంటుంటావని ఆడేవు (అంటుంటావు). నిజం చెప్పు. ఈ స్త్రీలతో రమించువేళ, నన్ను తలచుకొంటావా? ఎరవులేక (ఇంకొకదాని నిచ్చగించక) నాకోసమే ఎదురుతెన్నులు చూస్తుంటానని అంటుంటావు. నిజం చెప్పు. ఆ కామినులతో కరగి పరవశించేవేళ నాకేసి కన్నుతిప్పిఅయినా చూస్తావా?

ఓ వనజాక్షీ! (పద్మనయనా!) వాసి చూతుననేవు (కళ్ళు తెరచినా మూసినా, నా రూపమే నీకనులకు కనిపిస్తుందంటావు). మరి ఆ వనితల కుచగిరులపై నీవు వ్రాసేవ్రాతలు నా చిత్రపటములాయేమి చెప్పవయ్యా! ఆమెనెందుకు గుర్తుచేసికొంటున్నావంటే యేదో చనువు కొద్దీ అట్లా చేస్తానంటావు. మరి నీ ఇతర ప్రియురాళ్ళను నీదగ్గరకు పిలిచేటప్పుడు కూడా ఇట్లాగే ఇతరుల పేర్లు జపిస్తుంటావా? ఏమిచోద్యం!!

నా నేర్పు సామర్థ్యములపై నీకెంత గౌరవం అంటూ ఏవేవో కల్లబొల్లి కబుర్లు చెబుతావు. నాదగ్గర ఇతర కొమ్మల (యువతుల) తోడుత (కూటమిని) కొనియాడుతూనేవుంటావు. ఓ శ్రీవేంకటేశ్వరా! మండెము రాయుడవైన నిన్నే నమ్మితినయ్యా! మమ్ము ఇట్టే కూడి నీ చనువు (అనురాగము) నొసగి నాజన్మ తరింపజేయుము ప్రభూ!

సంపుటి: 17 కీర్తన : ఎమ్మెకాడవై తిరుగ నింతదొరకేటికి
సంఖ్య : 80 పుట : 49 రాగం: శుద్ధవసంతం

శుద్ధవసంతం

11. ఎమ్మెకాడవై తిరుగ నింతదొరకేటికి
దిమ్మరిమాటల నాచేఁ దిట్టించుకోవలెనా ॥ పల్లవి॥

వూరకున్న నన్నుఁ దెచ్చి వోరి నీవు వలచిన
వూరసతులఁ జూపి న న్నుడికించేవు
మేరతో నీ కితవైతే మెడఁ గట్టుకొందు గాక
వారి నన్ను సరిచేసి వాదువెట్టవలెనా ॥ఎమ్మె॥

దవ్వులఁ గూచున్న నన్నుఁ దలఁపించి వారిచేత
యెవ్వతెంటా నడిగించి యీసు రేఁచేవు
యెవ్వతె మన్నించినా నీ వేమైనా నిత్తువుగాక
రవ్వగాని యాఁడువారి రాఁపుసేయవలెనా ॥ఎమ్మె॥

తతి నిన్ను నేఁ గూడి తనిసితే నీ తోటి
సతులచే మొక్కించి జంట సేసేవు
సతమై శ్రీవేంకటేశ సవతులయినవారిఁ
బతివెట్టవలెఁ గాక పచ్చిసేయవలెనా ॥ఎమ్మె॥ 80

అవతారిక:

"నీవు లోకాలనేలే దొరవు. ఇలా ఎమ్మెకాడవై (పోకిరీవై) తిరుగుట తగునా? దిమ్మరి మాటలు (అంటే త్రాగుబోతుమాటలు) మాట్లాడటం యెందుకు? నాచేత తిట్టించుకోవటం యెందుకు"? అని దెప్పిపొడుస్తున్నది నాయిక, శ్రీవారిని. పెదతిరుమల యెంత చక్కటి శృంగారకీర్తన చెప్పారో అవధరించండి. శ్రీవేంకటేశుడు సదా సవతులైన మమ్ము రక్షిస్తూ మాకు న్యాయం చేయాలి కానీ పచ్చిసేయవలెనా? అంటున్నారు. 15వ శతాబ్దం

నాటి తెలుగు అయినందువలన చాలామాటలు అర్థం కావు. కాని అర్థమైనట్లు అనిపిస్తాయి. సవతుల గోల యెంత బాగా చెప్పారో చూడండి.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఎమ్మెకాడవై (విలాసవంతుడైన జులాయివలె) తిరుగుట, ఇంత దొరకు (జగన్నాథుడవైన నీబోటివానికి) యేటికి? (యెందుకు ప్రభూ!) దిమ్మరిమాటల (వదరుబోతు మాటలు మాట్లాడి) నాతో తిట్టించుకొంటావు. ఇది నీకు తగునా?

ఓరీ! నా మానాన నేను వూరకనేవుంటే, పనివేళా తీసికొనివచ్చి వూళ్ళోవున్న నీవలపుకత్తెలను (ప్రియురాళ్ళను) చూపించి నన్ను వుడుక్కునేలా చేస్తావు. నీకు ఇతవైతే (ఇష్టమైతే) వాళ్ళని నీ మెడకు కట్టుకొని తిరుగు. కాదన్నదెవరు? కాని, వారిని నన్ను సరిజేసి (సమానంచేసి) వాదువెట్టవలెనా? (పోట్లాట పెట్టుట తగిన పనియేనా?)

ఎక్కడో దూరంగా కూర్చున్న నన్ను వారిచేత తలపించి (గుర్తుకు తెచ్చుకొనేట్లు చేసి) అదెవ్వతె అని నాగురించి అడిగిస్తావు. వాళ్ళు ఈసుతో (ఈర్ష్యతో) రగిలిపోయేటట్లు చేస్తావు. అదెవ్వతో మన్నిస్తే నీవేమైనా దానికిచ్చుకో. మధ్యలో నాకేమిటి? కానీ, రవ్వగాని (ఏనాడూ అవమానింపబడని) నాబోటి స్త్రీని రావు సేయదగునా? (నవ్వులపాలు చేస్తావా?) ఇది నీకు తగునా?

నీతో గూడి తృప్తిగావున్న నన్ను చూచి, కావాలని తోటి సవతులకు నాచే మొక్కించి, జంటసేసేవు (సమానం చేసేస్తావు). ఓ శ్రీవేంకటేశ్వరా! సవతులైనవారిని, సదా పతివెట్టవలెను (రక్షణ కల్పిస్తుండవలెను). అంతేగాని ఇట్లా పచ్చిసేయవలెనా? (అల్లరిపాలు చేయటం అవసరమా ప్రభూ!)

సంపుటి: 17 కీర్తన : గుట్టు గొంత రట్టు గొంత గులికీ గదే
సంఖ్య : 299 పుట : 172 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

12. గుట్టు గొంత రట్టు గొంతఁ గులికీఁ గదే
చుట్టమువలెనే యీ చొక్కనాథుఁడు ॥ పల్లవి॥

జగడాలమాటలు చల్లఁజూపుతేటలూ
నగుతానే యీరెండు నడపెఁ గదే
మొగమోట సిగ్గులు ముచ్చటల యెగ్గులు
సొగటులు మానఁ డిదె చొక్కనాథుఁడు ॥గుట్టు॥

పనిలేని పంతము పైకొంటే సంతమూ
నినుపుల యివి రెండు నెరపెఁ గదే
తనివోని యాసలు తబ్బిబ్బు బాసలు
చొనిపీ నూరకె నాతో చొక్కనాథుఁడు ॥గుట్టు॥

పానుపుపై జోడులు పలురతివాడులు
నానాఁట యివి రెండు నడపీ గదే
పూనిన శ్రీవేంకటాద్రినుండి వచ్చి ననుఁ గూడె
సూనాస్త్రగురుఁడైన చొక్కనాథుఁడు ॥గుట్టు॥ 297

అవతారిక:

"సునాస్త్రగురుడు" అంటే పుష్పబాణములు గలవాని తండ్రి అని అర్థం. అంటే శ్రీహరి. మన్మధుని అంత అందగాడికి తండ్రి, ఇంకెంత అందంగా వుండాలి? అందుకే ఆయన చొక్కనాథుడైనాడు. అంటే దోషములేనంత అందగాడన్నమాట. చొక్కనాథునిగా వెలసిన శ్రీమన్నారాయణుని కీర్తిస్తున్నారు పెదతిరుమలయ్య. ఈ చొక్కనాథుడు కొంత గుట్టుగా, కొంత

బాహాటంగా ఏదో దగ్గర చుట్టములాగ స్త్రీలతో కులుకుతుంటాడట. అంతా ఇక్కడే చెప్పేస్తే ఎట్లా? భావవివరణ చదివి పరవశించండి మరికొంచెం. ఈయన తీరే ఇంత... గుట్టుగా చెయ్యాల్సినవి రట్టుచేస్తాడు, రట్టు చేయాల్సింది గుట్టుగా చేస్తాడు. శ్రీమన్నారాయణుడు కదా!

భావ వివరణ:

ఓ చెలియా! ఈ చొక్కనాథుడు, మనకు దగ్గరి చుట్టమువలె కులుకుచున్నాడు. ఈయన తాను చేసేపనిని కొంత గుట్టుగా (రహస్యంగా) చేస్తాడు. కొంత రట్టుగా (నలుగురికీ తెలిసేటట్లు) చేస్తాడు.

ఈయన మాటలు చూడబోతే జగడాలమారివాని మాటలు. చల్లని చూపులు మాత్రం నిర్మలంగా వుంటాయి. ఒకపక్క నవ్వుతూనే ఈ రెంటినీ ఒకేసారి నడుపుతాడు కదటమ్మా! ఈయన సిగ్గులు మొగమాటం కలవానివలె వుంటాయి. చెప్పే ముచ్చట్లు యెగ్గులతో (అనాదర పూర్వకంగా వుంటాయి. ఈ చొక్కనాథుడు సొగటులు (నన్ను చిన్నబుచ్చుటలు) మానడు.

ఈయన పనికిమాలిన పంతాలకుపోతాడు. పైకొంటే (చొరవతీసికొంటే) స్వంతమవుతాడు. ఉపాయంతో ఈరెంటినీ ఒకేసారి నడుపుతాడు ఈయన. తనని తీరని ఆశలు చూపిస్తాడు. ఉబ్బితబ్బిబ్బు అయ్యేట్లు బాసలు చేస్తాడు. నాతో వూరకనే చొరవతీసికొంటాడు. ఈ చొక్కనాథుడు అంతటి గడుసువాడు.

పానుపుపై జోడులు (జంటలు). అనేక రతులతో వాడులు (వాడిపోవుటలు). నానాట (ప్రతిరోజూ) ఇవిరెండూ నడుపుతూనే వుంటాడు, ఈయన శ్రీవేంకటాద్రినుండి పూనికతో (పట్టుదలతో) విచ్చేసిన శ్రీవేంకటేశ్వరుడు నన్ను గూడినాడు. తీరాచూస్తే ఆయనే, సునాస్త్రగురుడైన (పుష్పబాణుడైన మన్మథుని తండ్రియని పిలువబడే ఈ చొక్కనాథుడు.

సంపుటి: 17 కీర్తన : కాంతగలనాడు యేకాంతములమాట
సంఖ్య : 296 పుట : 172 రాగం: రామక్రియ

రామక్రియ

13. కాంతగలనాడుఁ యేకాంతములమాట, శ్రీ
కాంతుఁడవు నీవు యిందుకొఱకు నా కాఁక లేల కడపరాయ ॥పల్లవి॥

మానవతి నీవు చనుమానమనఁ
బెంచితి నేఁడు
పూని నే మెంత పిలిచిన రా
వనుమాన మేల కడపరాయ ॥కాంత॥

మారుఁ డంతలోనే నీ
కుమారుఁ డయ్యుండి
మారుకొనె జూడు సారె సారె
నెడమాట లేల కడపరాయ ॥కాంత॥

ఆడఁ జెలిఁ జూచి
మారాడలేక నీవు
కూడితివి శ్రీవేంకటగిరిపైఁ
గోరికమీఱఁ గడపరాయ ॥కాంత॥ 296

అవతారిక:

ఆఁక పెట్టడం అంటే ఆంక్షపెట్టడం అన్నమాట. ఇదిచేయవద్దు, అదిచేయవద్దు అని ఆంక్షలు పెడుతూ వుంటారు ప్రియురాళ్ళు. ఈ కీర్తనలో పెదతిరుమలయ్య శ్రీకాంతుని ప్రియురాలై ఇలా కీర్తన రూపంలో దెప్పిపొడుస్తున్నారు. "నీవు శ్రీకాంతుడవు ఇందుకని నీకు ఆంక్షలెందుకు పెడతాను. ఓ కడపరాయా! కాంతవున్నప్పుడు నీకు ఏకాంతమేమి పని" అని అంటున్నారు. నేటి కడపలో వెలసిన కడపరాయుడైన

శ్రీవేంకటేశ్వరునిపై చెప్పిన కీర్తన ఇది. శబ్దాలంకార ప్రయోగంలో పెదతిరుమల తండ్రికి తగ్గకొడుకే సుమండీ!

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు శ్రీకాంతుడవు (శ్రీపతివి) నీవు కోరితే ఏకాంత కాదంటుంది? ఇక కాంత గలిగిననాడు ఏకాంతము గురించి ఆలోచనలెందుకు, కనుక ఓ కడపరాయా! నీకు ఇందుకొరకు 'ఆఁక' లేల (ఆంక్షలెందుకు?)

ఆ మానవతి (అభిమానంగల స్త్రీ)తో, నీవు చను (పొందు) మానుమని నేనెంత చెప్పాను? నీవు విన్నావా? పెంచితివి. నేడు పూని (ప్రయత్నంతో) నేము (మేము) ఎంతపిలిచినా రావు. ఓ కడపరాయా! నీకు మామీద అనుమానం యెందుకయ్యా! ఇదెక్కడి అన్యాయం?

మేము మాత్రం యేమి చేయగలము? మారుడు (మన్మథుడు) నీకుమారుడై యుండి కూడా మమ్ము మారుకొనెన్ (మాఱుకొనుట... అంటే యెదిరించుట). ఆ ఎదురుదాడిని మేము తట్టుకోగలమా? ఇక చూడు నీవు ఇది అవకాశంగా తీసికొని సారెసారెకు (మాటి మాటికీ) ఎడమాటలు (పెడసరం మాటలు... లేక... పుల్లవిరుపు మాటలు) మాట్లాడుతున్నావు.

ఓ కడపరాయా! ఇది నీకు తగునా ప్రభూ! మేమంతా ఇక్కడ వున్నట్లే వున్నాం. అక్కడ శ్రీవేంకటాద్రిపై నీవు ఆడన్ జూచి (వనితారత్నాన్ని చూచి) ఆమె నీ అలమేల్మంగ కావున మారాడలేక (ఎదురుచెప్పలేక) కోరికమీఱ కూడితివి (కోరికతో పొందితివి). అవునా? (నిజానికి అదే నీ కోరిక). ఓ కడపరాయా! నిన్ను కాదనటానికి మేమెంతవారము తండ్రీ!

సంపుటి: 17 కీర్తన : మానెబోరా మాటలకికనేలా, నీకు
సంఖ్య : 298 పుట : 173 రాగం: పాడి

పాడి

14. మానెఁ బోరా మాటల కిఁక నేలా, నీకు
దీన నెగ్గవుత తెలియుము గాకా ॥ పల్లవి॥

సారె సారె సాదించ నేటికి రా, నీవు
గోర గీరినఁ గోపించఁ దగదా
నేర మేమైన నే నీకుఁ జేసితినా, నీవు
బీరమాడినఁ బెనఁగితిఁ గాకా ॥మానెఁ॥

చాలుఁ జాలు జంకించ నేఁటికిరా, నీవు
నాలినేసిన నవ్వఁగఁ దగదా
నీలవర్ణుఁడ నే నీకుఁ బగదాననా, నీ
పోలికెలు చూచి పొమ్మంటీఁ గాకా ॥మానెఁ॥

నీకు నీకే నిజబాస లేఁటికిరా, నీ
కాఁకమే నంటి కరుణించఁ దగదా
చేకొనరా రతి శ్రీవేంకటేశ్వరుఁడా, నీవు
జోక గూడఁగఁ జొక్కితిఁ గాకా ॥మానెఁ॥ 298

అవతారిక:

పెదతిరుమలయ్య చెప్పి ఈ శృంగార కీర్తనలో చాలా మెలికలున్నాయి. ఆనాటి కడప సీమలో ప్రచార్యంలో వున్న తెలుగుకి నేటి మన తెలుగుకి వున్న అంతరం గమనించండి. "పోరా! మాటలింకాయెందుకు? మానె (ఫరవాలేదులే) నీకు దీనను ఎగ్గు చేయుటయే తెలుసును. అదిగాక ఇంకేమిటి?" అని నాయిక మాటల అర్థం. పల్లవే ఇంత తికమక అయితే

చరణాలు ఎలావుంటాయో ఆలోచించండి. "జోక గూడగ జొక్కితిగాక' – అంటే ఏమిటి? ఈ రచన నాచేత చేయిస్తున్న ఆ తిరుమలేశుని ఏమని పొగడగలను? ఏనాటి పుణ్యమో ఇది?

భావ వివరణ:

మానెపోరా! (ఫర్వాలేదు పోరా!... పో) ఇంకా నీతో మాటలెందుకు? నీకు దీనన్ (దీనురాలిని) యెగ్గవుత తెలియుము గాక (అవమానించుటయే తెలిసివుండవచ్చును).

నన్ను సారెసారెకు (మాటిమాటికీ) సాధించుట దేనికయ్యా! నీ గోళ్ళతో అంత రక్కిపెట్టినా నేను కిమ్మనకనుండవలెనా? కోపించ దగదా (కూడదా?) నేను నీపట్ల ఏ నేరం చేశానయ్యా! నీవు బీరమాడిన (గొప్పలు చెప్పుకొంటుంటే) పెనగితిగాకా! (వద్దు అని తిరస్కరించి ఎదిరించాను కాబోలు). ఈ మాత్రానికే ఇంత మండిపడవలెనా?

చాలు చాల్లేవయ్యా! మరీ ఇంత జంకించనేటికి? (బెదరించుట దేనికి?) నీవు నాలినేసిన (వంచన చేస్తే) అది తెలసిపోయి నేను నవ్వేశాను. అది కూడా తగని పనియేనా? ఓ నీలమేఘశ్యామా! నేను నీకు పగదాననా (శత్రువునా ప్రభూ) నీ పోలికలు చూచి (నీవు నన్ను ఇతర స్త్రీలతో పోల్చి మాట్లాడుతుంటే) కోపంవచ్చి పో పొమ్మన్నాను గానీ, నీవంటే నాకు ప్రేమలేదా?

నీకు నీవే అన్ని నిజబాసలు (శపథాలు) చేయనవసరం లేదయ్యా. విరహాగ్ని తపించే నన్ను కరుణించదగదా? ఓశ్రీవేంకటేశ్వరా! నన్ను నీ సురతమున ననుగ్రహించుము ప్రభూ! జోకగూడగ జొక్కితి గాకా! (నీవు జతయై నన్ను గూడిన పరవశమొందితిని కదా?)

సంపుటి: 17 కీర్తన : మంచమదె యిల్లదె మాట లేటికే
సంఖ్య : 81 పుట : 49 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

15. మంచ మదె యిల్లదె మాట లేటికే
నించినవేడుకతోడ నిద్దిరించు లోనను ॥ పల్లవి॥

యింటికిఁ జెప్పి యంపితి నిందాఁకా నేల రావైతి
వంటఁగాక తొలఁగితి నట్టె వుండరా
వెంట వచ్చినచెలిచే వింటిమి నీ సుద్దు లెల్లా
వొంటినైనాఁ బవ్వళించు వొక్కఁడవే లోనను ॥మంచ॥

చూచియైనాఁ బొమ్మంటిఁగా సుద్దులు చెప్పి యంపితి–
వీ చాయకు రాకు మంచ మెక్కి వున్నదాన
నీచేఁత లన్నియును నీ వెంటనే వచ్చె
కూచుండరా యిఁకనైనా కుదురయి లోనను ॥మంచ॥

యెదురు చూచితిఁగా నీ వేడ నుంటివో కాని
పదరకురా యిది పంతము గాదు
పొదిగి శ్రీవేంకటేశ పోనీక నన్నుఁ గూడితి
వుదుటై యెందునుఁ బోక వుండరా యీ లోనను ॥మంచ॥ 81

అవతారిక:

కాంత పురుషునికి వేసే కఠినశిక్ష ఏకాంత శయ్యాశయనమే. అమ్మవారికీ అదే ఆయుధం కాబోలు. అలిగిన దేవి అంటున్నది "అదిగో మంచం... అదిగో పడకటిల్లు... ఇంకానీతో మాటలెందుకు? బాగా సంతోషంగా లోపల ముడుచుకొనిపడుకో... పోవయ్యా! పో". తండ్రిని మరపించే కవితా చమత్కృతివున్న వాగ్గేయకారుడు పెదతిరుమలయ్య. ఆ భావమాధుర్యాన్ని ప్రతిఫలించలేకపోవటం నా అసమర్ధతయే సుమండీ.

కవిబ్రాసిన ఒక్క అక్షరం సరిగా ముద్రింపబడకపోయినా అర్థం అపార్థం అయ్యే ప్రమాదం వున్న కీర్తన ఇది. ప్రయత్నమే నాది, ప్రసాదం స్వామిది. అంతే మరి.

భావ వివరణ:

అదిగో మంచం... అదే యిల్లు (పడకటిల్లు అదిగో) మాటలేటికి (నీతో అనవసరమైన మాటలు దేనికి) నించిన వేడుకతో (బాగా సంతోషంగా) లోనను (లోపలికెళ్ళి) నిద్దురించు (పడుకోపో).

ఇంటికి (నీ ఇంకోపెళ్ళాం ఇంటికి) చెప్పి కబురు పంపించాను. ఇందాకా యేల రావైతివి? (ఎందుకు రాలేకపోయావు?) ఇదిగో ఇప్పుడు వచ్చావు. ఇంకా నా వంట కాలేదు. పక్కకు తప్పుకొని కాస్త అక్కడే వుండరాదా? అదిగాక నీవెంట వచ్చిందే ఆ చెలికత్తె... అది నీసుద్దులు (నీ సంగతంతా) చెప్పిందిలే. నాకు ఇంకా కోపం తెప్పించకు అదిగో నీ పడకటింట్లో నీ వొక్కడివే పడుకో పోవయ్యా! నన్ను విసిగించకు. పో!

ఇంకోరోజు, నన్ను చూచికూడా బొమ్మంటిగా (వెళ్ళిపొమ్మన్నావు). సుద్దులు చెప్పి పంపితివి. (ఆరోజు కూడా కట్టుకథలు చెప్పి నన్ను పంపించేశావు). ఈ చాయకు రాకు (అసలు ఈవైపుకే రాబోకు). నాకు నిద్రవస్తోంది. మంచంమీద వున్న నన్ను చూచి నీచేతలన్నియు కృత్రిమమే. అవన్నీ ఇప్పటికిప్పుడు నీవెంట వచ్చాయి. పోనీ, ఇకనైనా కుదురుగా కూర్చోవయ్యా! లోపల కుదురుగా వుంటావా?

నీవు యేడనున్నావో కాని, ఇంతసేపూ నీకోసం ఎదురు తెన్నులు చూచాను. ఎంత తపించానో తెలుసా. పదరకురా (కోపించకురా!) ఇది నాపట్టుదలకానేకాదు. నేను నీదాననే ప్రభూ! ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను పోనీక (వదలక) పొదిగి కూడితివి. ఉదుటై (ఉద్ధతితో) లోననే వుండవయ్యా! (నామనస్సులోనే నిలిచిపో) ఎందునుబోకుము (నన్ను విడచి యెక్కడికీ పోకు).

సంపుటి: 17 కీర్తన : వెగ టాయనో కాక విరసమో తమలోన
సంఖ్య : 539 పుట : 311 రాగం: హిజ్జజి

హిజ్జజి

16. వెగ టాయనో కాక విరసమో తమలోన
చిగురుఁ గైదువవాఁడు చేసినట్టి మాయలో ॥ పల్లవి॥

వెన్నెలలు గోలుఁ గాక వేడుకఁ జకోరాలు
వెన్నెల లుమియఁజొచ్చే విధ మేఁటిదే
సన్నపుఁదుమ్మెద లెల్లా జలజమే చేరుఁ గాక
సన్నల నొకటొకటి జారిన దేఁటిదే ॥వెగటా॥

జలమును లత లెల్లా సరి దాఁజేకొనుఁ గాక
జలము తాఁ గుమ్మరించే జాడలేఁటికే
మెలుపుసంపెంగ వుమీఁదగాలి మించుఁ గాక
పొలసి సంపెంగలోనఁబొడమునాగాలి ॥వెగటా॥

జక్కపలుజంటగూడిసమ్మతించుఁగాక నేఁడు
జక్కవ లొండొకటితో జరసీ నేమే
యెక్కువ శ్రీవేంకటేశుఁ డింతితోఁ గూడఁగ నేఁడు
వక్కణించుఁ దొల్లింటివలె నాయఁ గాలమూ ॥వెగటా॥ 539

అవతారిక:

విరహవేదనతో రగిలిపోయే నాయిక, స్వామికి తనంటే మొహంమొత్తిందా!! లేక సరసం కాస్తా విరసం అయిందా యేమిటి? లేక తమ మనస్సుల్లో చిగురుగైదువ వాడు చేసిన మాయలా? ఎందుకిలా జరుగుతోంది అని వాపోతున్నది. చిగురు కైదువ – అంటే లేత చెఱుకుగడ ఆయుధముగా (విల్లుగా) కలిగిన మన్మథుడు అని అర్థం. ఆ తిరుమలయ్య ఇంతిపై దయతో కూడినంతనే తొల్లింటివలెనే కాలము వక్కళించినదట

అంటే మారిపోయిందట. నేటి కాలంలో అంత తేలికగా అర్థంకాని తెలుగు ఇది. అంటే నమ్ముతారా?

భావ వివరణ:

హతవిధీ! యేమిటీదారుణం? ఈ స్వామికి వెగటాయెనో (నేనంటే మొహంమొత్తిందా)? లేక విరసమో (ద్వేషమా)? లేక ఆ చిగురుకైదువ వాడు (లేత చెఱకు వింటి మన్మథుడు) తమలోన (మామనస్సుల్లో) చేసిన మాయలో? ఎందుకు ఈ పరిస్థితి దాపురించింది?

ఓ చెలీ! వేడుకన్ (సంతోషంతో) చకోరాలు (చకోరపక్షులు వెన్నెలలు గోలుగాక (వెన్నెలను త్రాగుతాయి). కానీ నేడు ఆ చకోరాలే వెన్నెలను ఉమియ జొచ్చె (ఉమ్మేస్తున్నాయి). ఇదేమి పద్ధతే? సన్నపుతుమ్మెదలు (చిన్నచిన్న భ్రమరములు) పద్మములలో దూరి మకరందం త్రాగక సన్నలనొకటొకటిజారెనే (చీకటి పడేటప్పటికి ముకుళించిన ఆ పద్మాలను చూచి మొహంమొత్తి ఒక్కొక్కటే జారిపోతున్నాయి.

ఓ సఖీ! సరి (న్యాయంగా) లతలు నీటిని చేకొనుగాక (పీల్చుకోవాల కదా?) ఇదేమిటే లతలు నీటిని కుమ్మరించే (విడిచిపెట్టే) విధానం కనిపిస్తున్నది? సువాసనలు నిండినగాలి ఈ సంపెంగపూలలోంచి బయటకు రావాలిగాని, ఇదేమిటే ఈ సంపంగిపూలు సువాసనను మ్రింగేస్తున్నాయి?

ఓ సఖీ! జక్కువజంటలు (జక్కువపిట్టలజంట) ఒకదానితో ఇంకొకటి ఎంతో అన్యోన్యంగావుంటాయి. కానీ ఇదేమిటే నేడు జక్కువ పక్షులు ఒకదానితో ఇంకొకటి జరసీనేమే (పోట్లాడుకుంటున్నాయి యెందుకే?) ఆహా! ఇప్పుడు అర్థమైనది. స్వామిరాలేదని మన దేవి చింతిస్తుంటే... ఇవి ఇట్లావుండక యెట్లావుంటాయి? నేడు సర్వశ్రేష్ఠుడైన శ్రీవేంకటపతి ఈ యువతిని గూడి నంతనే, కాలము తొల్లింటివలెనే (ఇదివరకులాగే) వక్కణించు (మారిపోయినది). అమ్మయ్యా!!!

సంపుటి: 17 కీర్తన : మగవాడు భ్రమసిన మరి తెలుపగరాదు
సంఖ్య : 251 పుట : 146 రాగం: వరాళి

వరాళి

17. మగవాఁడు భ్రమసిన మరి తెలుపఁగరాదు
నగుఁబాటు చూడరమ్మ నాటకీఁడు కృష్ణుఁడు ॥ పల్లవి॥

కోవిల గుయ్యఁగాను గోపిక పిలిచె నంటా
ఆవల దగ్గరఁ బోయి అందుఁ గానక
ఆవేళ నొక్కనెమలి యాడ నేగఁగాఁ జూచి
భావించి చెలి యనుచుఁ బట్టఁబోయఁగృష్ణుఁడు ॥మగ॥

తీగె యల్లాడఁగాఁ జూచి తెఱవచేసన్న లివి
నాగతి ననుచుఁ జేరి యటు గానక
సోగల నందుఁ గొలనిసొంపుఁ దామెరను జూచి
భాగులఁ జెలిమో మని పట్టఁ బోయఁ గృష్ణుఁడు ॥మగ॥

చెట్టుపైఁ బూవులు రాల చెలి సేసవెట్టె నంటా
అట్టేఁ శ్రీవేంకటేశుఁ డాలకించఁగా
కట్టఁగడ నింతి యది గని నిజముగ వచ్చి
యెట్ట యెదుటనే వుండె నేచి కూడెఁ గృష్ణుడు ॥మగ॥ 251

అవతారిక:

యౌవన తరుణంలో వున్నప్పుడు భ్రమ, హార్మోన్రేకాలు స్త్రీలకు సహజలక్షణాలు. కానీ మగవారు అట్లాచేస్తే నవ్వులపాలవుతారు అంటున్నారు పెదతిరుమలయ్య. గోపికలు ఇదేమాట చెప్పుకొని చూడండమ్మా! ఈ నాటకాలరాయుడు కృష్ణయ్య ఎన్ని వేషాలేస్తున్నాడో! అంటున్నారు. అర్థమంతా ఇక్కడే చెప్పేస్తే అందం యేముంది? అయినా ఇది వినండి... చెట్లపైనుండి పూలు రాలిపడితే, అరే నాచెలి

పూలుచల్లుతోందే నాకోసం అని ఈవేంకటేశుడు ఆమె వినేటట్లు అంటూనే ఆమెను కరిగించివేశాడట. మరి ఆనాటి కృష్ణుని చిలిపి చేష్టలు ఈయన ఇంకా మానలేదు. (అక్కడక్కడా ముద్రణ పొరపాట్లున్నట్లు తోస్తున్నది, నాకు)

భావ వివరణ:

ప్రపంచంలో మగవాడు భ్రమ చెందరాదు. ఒకవేళ భ్రమకలిగినా పైకి చెప్పకూడదు. చెబుతే నగుబాటు (నవ్వులపాలు) అవుతాడు. ఇదిగో ఈ కృష్ణుడు ఎటువంటి నాటకాలరాయుడో చూడండమ్మా! తను భ్రమియించినట్లు యెన్ని వేషాలు వేస్తున్నాడో!!

చెట్టుపై కోయిల కూస్తుంటే అదిగో నా గోపిక నన్ను పిలుస్తున్నదని దగ్గరకుబోయి అక్కడ యెవ్వరూ లేక నిరాశచెందాడట. ఆవేళ (ఆరోజు) ఏంజరిగిందో తెలుసా? ఒక నెమలి పురివిప్పి ఆడుతుంటే చూచి తన చెలి నాట్యం చేస్తున్నదేమో అని భ్రమపడి, భావించి ఈ కృష్ణుడు దాన్ని కౌగలించబోయినాడట. హవ్వ!! యెంత నాటకాలరాయుడు!!

ఒకచోట లతలు గాలికి కదలి వూగుతుంటే, అదిగో నా చెలి రమ్మని చేత్తో నాకు సైగ చేస్తోంది అని అక్కడికి పోయి అక్కడెవ్వరూ లేక నిరాశచెందాడట. కాని అక్కడ సొగసైన కొలనులో ఒక ఎఱ్ఱటి తామరపూవుని చూచి అదిగో భాగ్యవతి అయిన నాచెలి అరుణాధరం... అని దానిని తాకబోయినాడట. ఆహా! యెంత నాటకీడు (నాటకాలరాయుడు) !

చెట్టుపైనుండి గాలికి పూలు రాలిపడితే, ఆహా! నాచెలి సేసవెట్టె (నా చెలి భక్తితో నన్ను పూజిస్తున్నది) అని ఈ శ్రీవేంకటేశ్వరుడు అన్నాడట. అదివిని, కట్టగడ (చిట్టచివరికి) ఈ ఇంతి నిజముగా తన కళ్ళెదుట ఆనాటి కృష్ణుని రూపం చూచి పరవశించిందట. అప్పుడాయన ప్రేమగా ఆమెను గూడి ధన్యురాలిని చేశాడట. జగన్నాటక సూత్రధారికి తెలియని కిటుకు వుంటుందా?

సంపుటి: 17 కీర్తన: కానీవయ్యా దాని కేమి కలది గలట్టయాని
సంఖ్య : 141 పుట : 83 రాగం: పాడి

పాడి

18. కానీవయ్యా దాని కేమి కలది గల ట్టయాని
అనుకొని యింకా నెంత ఆసోదమో ॥ పల్లవి॥

పొలఁతి నంపు మంటేను పూఁటలు న న్నడిగేవు
తెలిపి నిరతి యప్పు దిద్దఁ గలనా
యెలమి నాపె వలపు యెరవు నాపైఁ బెట్టేవు
చెలుల కింకా నెంత సిగ్గు వాట్లో ॥కానీ॥

వాడికెయింతికి కుదువగా నన్నుండు మనేవు
కూడి వావి విడిపించుకొనీవశమా
మాడలవలె సతుల మారుపెళ్లాడేవు
తోడనిట్టె యెందరిని దొడ్డిఁబెట్టేవో ॥కానీ॥

కొమ్మను కౌఁగిటఁ గూడి కొసరు నన్నడిగేవు
కమ్మరఁ దగులు నేను కావలెనా
దొమ్మి శ్రీవేంకటేశుఁడ తోడఁ బెండ్లాడేవు
మమ్మిందరిని ఇక్కడ మండెమురాయఁడవై ॥కానీ॥ 141

అవతారిక:

మండెము అను గ్రామములో వెలసిన వేంగళరాయనిపై శృంగార సంకీర్తన చెబుతున్నారు పెద తిరుమలయ్య. 'కానీలేవయ్యా! దానికేమివుంది? వున్నదేవుంటుంది అనుకొని ఇంకాయెంత అసాధ్యపు పనులు చేస్తావో తెలియకుండావుంది" - అంటున్నది నాయిక (పెదతిరుమలయ్య) ఈ పద ప్రయోగాలు నేటి తెలుగులో లేనందువల్ల చాలా మాటలకు భావము ఊహాజనితమే. మనం నేటికాలంలో ఇట్లాంటి

తెలుగునుడికారం ఉపయోగించము. మనం "మమ్ముయిందరినీ" అంటే పెదతిరుమల "మమ్మిందరినీ" అని సంధి చేశారు. ఇది అన్నమయ్య వాఙ్మయపు ప్రత్యేకత.

భావ వివరణ:

ఓ ప్రభూ! కానీలేవయ్యా! దానికేముంది? కదిగలట్టాయాని (జరగాల్సిందేదో జరుగుతుంది). నీవు ఆనుకొని (అనుకొంటే) ఇంకా యెంత ఆసోదమో (అసాధ్యపు పనులు చేస్తావో యేమిటో)!

ప్రతిపూటా, పొలతి (యువతి)ని పంపించమని నన్ను అడుగుతూనేవుంటావు. ఆలోచించు... ఆమెకు నీ నిరతి (ఆసక్తిని) తెలిపి అప్పుదిద్దగలనా (చక్కబెట్టగలనా)? ఆమె వలపును ఎరవు తెచ్చే బాధ్యతనాపై పెట్టేస్తున్నావు. ఇదేమన్నా నా ఇంట్లో పడివున్న సొమ్మటయ్యా! నీకు కాసేపు వాడుకోవటానికి ఇచ్చేందుకు? ఇది చెలులకు (స్త్రీలకు) యెంత సిగ్గు కలిగించే వ్యవహారం!! నలుగురూ నా గురించి ఏమి అనుకొంటారు?

వాడికెయింతి (నేటికాలంలో... వెలయాలు) కుదువగా (తాకట్టుగా) నన్నుండమంటున్నావు). మళ్ళీ నీవు తిరిగి విడిపించుకుంటావా!! అది సాధ్యపడుతుందా? మాడలు (నేటికాలంలో కరెన్సీనోట్లు) వలె, సతుల (ఆడవాళ్ళను) మారుపెళ్ళాడేవు (ఎక్స్‌ఛేంజ్ చేస్తావా!) ఎంతమందిని ఇట్లా దొడ్డిబెట్టేవు! (నీ కంట్రోల్‌లో) పెట్టుకొంటావు?

ఆ కొమ్మను (యువతిని) కౌగిట గూడి కొసరు అడిగినట్లు నన్నూ రమ్మని పిలుస్తున్నావు. ఇంతజరిగాక నీ రోజూ వ్యవహారానికి నేను వుండిపోవాలా? ఓ దేవదేవా! శ్రీవేంకటేశ్వరా! దొమ్మితోడ బెండ్లాడేవు (అందరూ చూస్తుండంగా జంటపెళ్ళిళ్ళు చేసికొనుచున్నావు). ఇక్కడ ఈ మండెము గ్రామంలో మమ్ము అందరినీ నీ స్వంతం చేసికొనినావు. మేము ధన్యులం. తరించితిమి తండ్రీ!

సంపుటి: 17 కీర్తన : ఇందరికి నీవే గుఱి యిదివో దిష్టాంతము
సంఖ్య : 142 పుట : 84 రాగం: కాంబోది

కాంబోది

19. ఇందరికి నీవే గుఱి యిదివో దిష్టాంతము
కందువతోఁ జేయువయ్య కాఁపురములూ ॥ పల్లవి॥

చేతికి లోనైనయట్టి చెలువుఁడు గలిగితే
యేతులకు రమణు లేమేమి సేయరు
గాతల నీ శిర సెక్కెఁ గామిని యొకతె దొల్లి
యీతలఁ దమవారు యేమి సేతురో ॥ఇందరి॥

మగవాఁడు వలచితే మగువలయినవారు
యెగసక్కేలకును యేమేమి సేయరు
వెగటున నొక లేమ వీఁపున మోఁపించె నిన్ను
యెగువదిగువసతు లేమి సేతురో ॥ఇందరి॥

శ్రీవేంకటేశ నీవు చిత్తగించి కూడితేను
యేవనితలైనా నేమేమి సేయరు
శ్రీవనిత వురముపైఁ జేకొని నిలిచె నీకు
యీవల మాబోంటెల్లా నేమి సేతురో ॥ఇందరి॥ 142

అవతారిక:

'గుఱి' అంటే లక్ష్యం. దిష్టాంతము అంటే ఉదాహరణము. "నేను చెప్పబోయే ఇంతమందికీ నీవే చక్కటి ఉదాహరణ. ఓ ప్రభూ! సామర్థ్యంతో కాపురము చేయవయ్యా" అంటున్నారు పెద తిరుమలాచార్యులవారు. "పెళ్ళాన్ని ప్రేమగా చూడాలి, విలువైన సలహాలు తీసికోవాలి, కరుణ చూపించాలి... కాని పెత్తనం ఇయ్యకూడదు పెద్దలు చెబుతే నీవేం చేశావు? ఒకావిడను నెత్తినపెట్టుకొన్నావు, ఒకావిడను

వీపుమీద మోశావు, ఒకావిడను వురముపై మోస్తున్నావు. నిన్నేమనగలమయ్యా! నిన్ను కాదనేవాడెవడు?" అంటున్నారు

భావ వివరణ:

ఓ దేవదేవా! ఇంతమందికీ నీవే చక్కటి దిష్టాంతము (ఉదాహరణము). కందువతో (సామర్థ్యముతో) చక్కగా కాపురము చేయవయ్యా! నిన్ను చూసి మేము నీలాగ చేస్తే ఇక మాపని అంతే... చేతికి లోనైనయట్టి (లొంగివున్నట్టి) చెలువుడు (మగడు) దొరికితే, యేతులకు (గొప్ప చూపించుకోవటానికి) స్త్రీలు ఏమి చేయరో చెప్పు?

కామిని ఒకతె (ఒకావిడ) నీ శిరసునెక్కి కూచుంది. (వరాహావతారంలో భూదేవిని తలపై ధరించి విష్ణువు హిరణ్యాక్షునితో పోరాడి సంహరించాడు కదా!) మరి ఇక్కడ మేము మాత్రం యేం చేస్తాం? నీలాగే ఆడాళ్ళను నెత్తినపెట్టుకొంటున్నాము.

మగవాడు వలచితే ((ప్రేమిస్తే)... మగువలు పరాచికాలాడటానికి, యేమేమి చేయరంటావో చెప్పవయ్యా! చూచేవారికి వెగటు పుట్టించే విధంగా ఒక లేమ (స్త్రీ) నీచేత వీపుమీద మోయించుకొన్నది. శ్రీకృష్ణావతారంలో నన్ను యమునానది దాకా వీపు మీద తీసికొనిపో అంటే ఒక గోపికను అలాగే మోసినాడట కృష్ణయ్య). మరి ఎగువ దిగువ సతులు (స్వర్గంలోని దేవకాంతలు, అవనిలో అతివలు) ఏమిసేతురో (ఏంచేస్తారో వేరేచెప్పవలెనా?)

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చిత్తగించి (ఇష్టపడి) కూడితే యే వనితలు యేమి చేయరంటావో చెప్పవయ్యా! నీకు శ్రీలక్ష్మి వురము నెక్కి కూర్చున్నది కదా! ఇక్కడ మా భూలోకంలో మాబోటివాళ్ళేం చేయగలమయ్యా! మేమా ఈ ఆడవాళ్ళని నీలాగే భరిస్తున్నాం. ఎంతయినా... భర్తలము కదా!

(ఇప్పుడు చెప్పండి ఈ పెదతిరుమలయ్య తన తండ్రి అన్నమయ్య కంటే రసికుడే కదా!)

సంపుటి: 17 కీర్తన : ఏసతిఁ బొందవలసో యిదొక నెపము వేసి
సంఖ్య : 140 పుట : 83 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

20. ఏసతిఁ బొందవలసో యిదొక నెపము వె(వే)సి
రాసి కెక్క వట్టే యాచారాలు సేసేవూ ॥ పల్లవి॥

చివ్వనఁ దమ్మరసము చీరపై నీవే వుమిసి
అవ్వలఁ జెఱఁగు మాసె నని యాడేవు
జవ్వనమదము నీకు జాఱీఁ జెంపవెంటా
నవ్వు లెల్లా నేఁడే నీవు నవ్వఁగ వొద్దా ॥ఏసతి॥

స్వామివి నిమ్మపంటిరసము పానుపుపైఁ బిండి
ఆముకొని కళరేఁ గెనని యాడేవు
కామాంధకారము నీకుఁ గన్నులఁ గప్పి వున్నది
చేముంచి నీ వుద్దండానఁ జెనక వద్దా ॥ఏసతి॥

సరుస శ్రీవేంకటేశ జారించి నా పోఁకముడి
తెరవేయు మని సిగ్గు దేర నాడేవు
దొరతనపుగర్వము తొట్టిని నిలువెల్లా
నిరతి బలిమితోడ నిన్నుఁ గూడ వద్దా ॥ఏనతి॥ 140

అవతారిక:

నా అనుభవంలో ఇంత ఘాటైన శృంగారకీర్తననెరుగను. వయసు రాని, వయసు రాబోని వారి సౌకర్యార్థం సాధ్యమైనంత గుట్టు వుంచుతాను. రసికులు భావించి, పెదతిరుమలయ్య శృంగారరసస్ఫూర్తిని 'సెబాసో' అనవలసిందే". ప్రభూ ! నీ మనస్సులో ఏసతిని పొందవలెననుకొంటున్నావో గానీ ఇదొక నెపము వేసి రకరకాల పోకడలు పోతున్నావు. ఆవిధంగానే నీవు ప్రసిద్ధి చెందావు" అంటున్నది నాయిక. నా

భావనా దోషాలకు పండిత క్షమార్హుడను. ఒకటి మాత్రం నిజం. "శ్రీవేంకటేశా! జారించి నా పోకముడి తెరవేయమని సిగ్గుదేరనాడేవు" అంటే ఏమిటో ఆ తిరుమల శృంగారరాయని కృపలేకపోతే భావింప జాలరు. జాగ్రత్తగా చదవండి మరి.

భావ వివరణ:

ఓ ప్రభూ! ఏసతిన్ పొందవలసో (నీ మనస్సులో వేరే ఏదో కాంతను పొందవలెనని వున్నది). కానీ ఇదొక నెపము వే(లే)సి, రాసికెక్కేవు (రకరకాలుగా పోకడలు పోతున్నావు). ఈ విధంగా నీవు ప్రసిద్ధి చెందుచున్నావు.

నీ చీరెపై (దోవతిపై) నీవే తాంబూలం తమ్మ యొక్క రసమును చివ్వున వుమిసి (ఉమ్మి) చిందింప చేసికొని నాకే చెరగుమాసెనని ఆడేవు (ఏదో మరక అంటుకొని కొంగుపాడయ్యిందే ఏమిటబ్బా! అని చెబుతున్నావు). యౌవన మదము నీ చెంపలపైననే జాలువారుతున్నది. నవ్వులన్నీ నేడే ఒలకబోస్తే ఎలా? రేపటికి కాసిని దాచుకో.

నీవు స్వామివి (జగన్నాథుడవై) యుండీ ఇవేం వేషాలయ్యా? నిమ్మపంటి రసము (నిమ్మపండు యొక్క రసమును) నీవే పానుపుపై పిండుకొని ఆముకొని (పైకొని) చూపించి ఏదో కలవచ్చినట్లుంది అని చెబుతావు. నేను అనుమానంతో రగిలిపోవాలని నీ కోరిక. నీకు కామం కళ్ళకు పొరలు కమ్మి ఇలాంటి పనులు చేస్తున్నావు. నీ ఆగడాలకు అంతువుండవద్దా?

సరసుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! నా చీరె పోకముడి (నడుముకి బిగించు ముడి) నీవే వూడదీసి, సఖీ కొంచెం తెరమూసేయరాదా? అని పరాచికాలు ఆడి నా సిగ్గు బుగ్గి అయ్యేట్లు పలికెదవు. నీకు దొరతనపు గర్వము నిలువెల్లా తొణికిసలాడుతోంది. నిరతి బలిమితో నినుగూడవద్దా (మిక్కిలి బలముతో నిన్ను గవయవద్దా?)

సంపుటి: 17 కీర్తన : మహిమెల్లా దొప్ప దోగె మజ్జనవేళ
సంఖ్య : 531 పుట : 309 రాగం: లలిత

లలిత

21. మహి మెల్లాఁ దొప్పఁ దోఁగె మజ్జనవేళ
సహజ శృంగారాలు జడిసె శ్రీపతికి ॥ పల్లవి॥

ముత్తేలవాన లెల్ల ముంచి కురిసినయట్టు
హత్తి పన్నీట జలకమాయ హరికి
తత్తరానఁ దెల్ల మొయిలు తనుఁ బొదిగినయట్టు
కొత్తగాఁ గప్పురకాపు గుప్పిరి దేవునికి ॥మహి॥

నీలపుఁబేరు లెల్లా నిండాఁ గట్టినయట్టు
తేలఁ దట్టపుణుఁగు మెత్తిరి పతికి
ఆలరి మెఱుఁగుఁ దీగె లలముకొనినయట్టు
కోలముందై సొమ్ములెల్లా గుప్పిరి విష్ణునికి ॥మహి॥

పెక్కు నవరత్నములు పెద్దరాసి వోసినట్టు
యెక్కువ దండలు గట్టిరి మూరితికి
వొక్కట నలమేలుమంగ నురమునఁ గట్టి రిదె
చిక్కని నవ్వులు మించె శ్రీవేంకటేశునకు ॥మహి॥ 531

అవతారిక:

"తొప్పదోగులు" అంటే పూర్తిగా తడిసిపోవటం "జడిసె" అంటే అతిశయించుట అని అర్థం. "పూర్తిగా తడిసిపోయే నిమజ్జన వేళలో మహిమలు వెల్లివిసే ఈ శ్రీపతికి సహజమైన శృంగార శోభలు అతిశయించినవి" అని ఈ పల్లవికి అర్థం. ఎవరన్నా చెబుతే కాని ఇది అన్నమాచార్యులవారి కీర్తన కాదు పెద తిరుమలయ్య కీర్తన అని

తెలియదు. తొలినాళ్ళలో నేను కూడా ఆవిధంగా పొరబడిన సందర్భములనేకం వున్నాయి. "చిక్కని నవ్వులు మించె శ్రీవేంకటేశుడు" – వంటి ప్రయోగాలు కుమారుని ప్రత్యేకత అని చాలా దూరం వచ్చాకగాని తెలియలేదు. అదట్టావుంచి అద్భుతమైన కీర్తనను ఆస్వాదించండి.

భావ వివరణ:

దేవదేవుడైన ఈ శ్రీపతికి తొప్పదోగే మజ్జనం జరుగు (పూర్తిగా తడిసిపోయేట్లు స్నానం చేయిస్తున్నారు) మహిమలు వెల్లివిరిసే ఈ స్వామికి సహజమైన శృంగారాలు (శోభలు) జడిసె (అతిశయించినవి) చూచి తరించండి.

శ్రీహరికి పన్నీటితో జలకమాయె (స్నానం జరిగింది). ఆ పన్నీటిజల్లు ఆయన శరీరంపై ముత్యాలవాన అధికంగా కురిసినట్లు వుంటుంది. తత్తరానన్ (సంభ్రమముతో) నల్లనీ ఆకాశంలో తెల్లమొయిలు (తెల్లని మేఘం) కమ్ముకొన్నట్లు, ఈ దేవునికి అప్పటికప్పుడు కప్పురకాపు (కర్పూరపుపూత) కుప్పింరించిరి (వేసినారు).

నిండా (పూర్తిగా) ఒంటిమీద, నీలపు బేరులు (నల్లని హారాలు) నింపినట్లు ఈ శ్రీనాతునికి తట్టు పునుగు అనే సుగంధ ద్రవ్యమును మెత్తినారు. ఆలరి మెఱుగు తీగెలు (ఆకాశంలో ఇష్టంవచ్చినట్లు తళుక్కున మెరిసే మెరుపుల) అలుముకొనినట్లు, కోలుముందై (మిక్కిలిగా) సొమ్ములెల్లా గుప్పిరి (ఆభరణాలతో ఈ స్వామిని కప్పివేశారు.

మూరితికి (ఈ విగ్రహ మూర్తికి) అనేక నవరత్నాలుపెద్ద రాశిగా పోసినట్లు ఎన్నెన్నో హారాలు, సరములు కట్టి అలంకరించారు. ఒకటిగా అలమేల్మంగను ఆయన వక్షస్థలంపై కట్టినారు. అప్పుడు ఈ శ్రీవేంకటేశ్వరుడు చిక్కని నవ్వుల మించెన్ (అధికమైన నవ్వులతో అతిశయించినాడు.)

సంపుటి: 17 కీర్తన : ఓపము నీతో పొందు వోబులేశా
సంఖ్య : 395 పుట : 228 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

22. ఓపము నీతోఁ బెనఁగ వోబళేఁశుఁడ
ఆపనినేనెఱుఁగనా అయ్య వోబుళేశుఁడా ॥ పల్లవి॥

చేయి నీవు ముట్టఁగాను సెలవినవ్వులు ముంచె
వోయయ్య తలవయ్యా వోబుళేశుఁడా
నీ యిచ్చలోన మెలఁగ నే మంత నేరుతుమా
ఆయము అంట వచ్చేవు అట్టే వోబుళేశుఁడా ॥ఓపము॥

కోరి పువ్వుల వేయఁగ కొప్పు కడు వెడ జారె
వూరకుండుచాలు నోయి వోబుళేశుడా
సారె నిన్ను మచ్చరాన జరయఁగఁ జాలము
వోరచూపులఁ జూడకు వోబుళేశుఁడా ॥ఓపము॥

గద్దించి నీవు కూడగ కాయమెల్లాఁ బులకించె
వొద్దఁ బాయకుండవయ్య వోబులేశుఁడా
అద్దో శ్రీవేంకటాద్రి నహోబలమునందు
తిద్దితివి నన్ననే రతికి వోబులేశుఁడా ॥ఓపము॥ 395

అవతారిక:

అహోబలంలో నెలకొన్న నరసింహునిపై చక్కని శృంగార సంకీర్తన చెబుతున్నారు పెదతిరుమలాచార్యులవారు. ఈ కీర్తనలో కవి తానూ ఒక చెలికత్తెయై స్వామితో చెబుతున్నారు. 'ఓబులేశుడు' అంటే 'అహోబలేశ్వరుడు' అనే మాటకి వికృతి. నీతో పోట్లాడే శక్తి మాకు

లేదయ్యా! అయ్యో! నాకు ఆపని (పోట్లాడటం) రాదు స్వామీ అంటున్నారు. తన తండ్రి అన్నమయ్య వలెనే అహోబలేశ్వరుని శృంగారనాయకునిగా ఉత్ప్రేక్షించారు పెదతిరుమల. "ఓబులేశా! రతికి తిద్దితివి నన్ననే" అంటున్నారు. దీనిభావమేమి తిరుమలేశా! అని కాసేపు నేను తలపట్టుకొన్నాను.

భావ వివరణ:

ఓ అహోబల నరసింహా! (ఓబులేశా!) నీతో బెనగనోపము (పోట్లాడేశక్తి మాకు లేదయ్యా!); అయ్యో! ఆపని నాకు చేతకాదయ్యా!

నీవెంత ఉగ్రనరసింహుడవైన ఈ శ్రీదేవి నీ చేయిముట్టుకోగానే సెలవినవ్వులు (చిరునవ్వులు) చిందిస్తావు. ఓ అయ్యా! కాస్త ఆపవయ్యా! నీ ఇచ్చలోన మెలగ (మనస్సు) తెలుసుకొని నడచుకోవటం) నేము అంత నేరుతుమా (మాకు అంత తెలుస్తుందా?) నీవైతే ఆమె మర్మములంట నెరుంగుదువు. ఓబులేశా! నీకు నీవే సాటి ప్రభూ!

ఓబులేశా! నీవు కోరికతో నాపై పుష్పములను జల్లగానే, నా కొప్పు సడలినదయ్యా! చాలునోయీ నీ చిలిపి చేష్టలను మాని వూరకుండరాదా? పోనీ సారె (ప్రతి తడవా) నిన్ను జరయగలమా (గదమాయించగలమా) అంటే అదీ సాధ్యం కాదు. ఓబులేశా! మమ్ము వోరచూపులు చూడకు స్వామీ!

నీవు ఏపనిచేసినా గద్దించి (భయపెట్టి) నట్లే వుంటుంది. ఓబులేశా! నీవు గద్దించి కూడిన కాయము (తనువు) పులకించని వారుందురా? మా వొద్ద (తోడు) బాయకుండవయ్యా! (విడనాడక వుండవయ్యా!) అద్దో (అదిగో) ఆ వేంకటాద్రి మీదా, ఈ అహోబలంకొండమీదా, నన్ను నే (నన్ను కూడా) రతికి తిద్దితివి (శృంగారమునకు సిద్ధముజేసినావు) ఓబులేశుడా! ఇంతకంటే సార్థకత ఇంకేముంటుంది స్వామీ!

సంపుటి: 17 కీర్తన : ఇన్నిటా దొరవు నీవు ఇందరు నున్నారీడ
సంఖ్య : 67 పుట : 41 రాగం: రామక్రియ

రామక్రియ

23. ఇన్నిటా దొరవు నీవు యిందరు నున్నారీడ
పన్నినీకతలు బట్ట బాయిట వేయింతునా ॥ పల్లవి॥

నీవేమి సేసినాను నిన్ను మెచ్చఁగలఁ గాక
కాని కన్నులను నిన్నుఁ గసరఁగఁ గలనా
యీవేళ నీవు బొంకితే యిది నిజమందుఁ గాక
భావించి నిన్నుఁ గల్ల పరచఁగఁ గలనా ॥ఇన్నిటా॥

వొద్ద నీవు గూచుండితే వోరుచుకోఁగల గాక
అద్దలించి నిన్ను వెంగెమాడఁ గలనా
పొద్దువోయి వచ్చినాను పొదిగి చేకొందుఁ గాక
వద్దువద్దనుచు నీతో వాదించఁ గలనా ॥ఇన్నిటా॥

కొంగువట్టి తీసినాను కూరిమిఁ జేకొందుఁ గాక
చెంగిచెంగి పానుపుపై సిగ్గవడఁ గలనా
రంగుగా శ్రీవేంకటేశ రతులఁ గడపలో
అంగవించితివి ముద మణఁచుకోఁ గలవా ॥ఇన్నిటా॥ 67

అవతారిక:

నాయిక అంటున్నది "స్వామీ! నీవే సమస్త సృష్టికీ అధిపతివి. ఇక్కడ ఇంతమంది వున్నారు. కావాలని నీ నాటకాలన్నీ బయటపెట్టగలనా? అది సభ్యత కాదు కదా!". ఇది పెదతిరుమలయ్య అద్భుత కీర్తన. కడపలో వెలసిన శ్రీవేంకటేశ్వరునిపై ఈయన తన తండ్రి వలెనే చాలా మంచి కీర్తనలు చెప్పారు. కొంగువట్టి తీయడమంటే బలవంతం చేయటం. చెంగి చెంగి అంటే హఠాత్తుగా అని అర్థం. అంగవించితివి అంటే ఉత్సుకించితివి

అని అర్థం. ఇప్పుడు ఈ కీర్తన ఆఖరి చరణాలు అర్థమవుతాయేమో ఆలోచించి చూడండి. అర్థంకాదు. కానీ ఇలా విడతీసి చూడండి "చెంగిచెంగి కొంగువట్టి తీసినా కూరిమి చేకొందుగాక! పానుపుపై సిగ్గుపడగలనా? ఓ శ్రీవేంకటేశా! రంగుగా కడపలో అంగవించితివి, ఇక ముదమణచుకోగలనా?". ఇప్పుడు కొంచెం నయం.

భావ వివరణ:

స్వామీ! నీవు ఇన్నిటా (ఈ సృష్టి అంతటికీ) దొరవు (అధినాథుడవు). ఇక్కడ ఇంతమందివున్నారు. అంతా మనలనే చూస్తున్నారు. పన్ని (కావాలని) నేను నీ కతలు (ప్రణయగాధలను) బట్టబాయట (బట్టబయలు) వేయింతునా (వేయగలనా?)

నాదేముంది, నీవేం చేసినా నిన్ను మెచ్చుకోవటమే నావంతు. కావి కన్నుల (కన్నెఱ్ఱగాచేసి) నిను కసురుకోగలనా? ఇవ్వేళ నీవు అబద్ధాలు చెబుతే ఇదే నిజం అనవలెనుగాని భావించి (జరిగినదేమిటో ఊహించి) నిన్నున్ కల్లపరచగలనా (అబద్ధమని నిరూపించగలనా?) నీకోపం నేనెరిగినదే కదా!

చేసినవన్నీచేసి, ఏమీయెరుగని వానిలా నీవు నావొద్ద (దగ్గర) కూచుంటే నాకోపం ఎలాగో ఓర్చుకోవలసినదే కాని, అద్దలించి (అదలించి) నీతో వెంగెమాడగలనా (వ్యంగంగా మాట్లాడగలనా)? నీవు యెంత పొద్దుపోయి ఇల్లు చేరినా పొదిగి (వొద్దికతో) చేకొందుగాని (స్వీకరించెదనుగాని) వద్దు నా ఇంటికిరావద్దు అని నీతో నేను వాదించగలనా? వాదించి నెగ్గగలనా?

చెంగిచెంగి (హఠాత్తుగా) కొంగువట్టి తీసినాను (నన్ను బలాత్కరించినా) ఇష్టంగా స్వీకరిస్తానుగాని ఏకశయ్యయై సిగ్గుతో నిన్ను నిరాకరించగలనా? ఓ శ్రీవేంకటేశా! రంగుగా రతుల (శోభలీనుసరతములతో) నన్ను కడపలో తేల్చగా అంగవించితివి (ఉత్సాహముతో వున్నావు). నా సంతోషమును అపుకోగలనా ప్రభూ!

సంపుటి: 17 కీర్తన : నీరమణు డిదె వచ్చీ నెరి నీ విరహ మేలే
సంఖ్య : 252 పుట : 147 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

24. నీ రమణు డిదె వచ్చీ నెరి నీ విరహ మేలే
కూరిమిగలుగుచోటc గొసరేలే ॥ పల్లవి॥

పులకమోసులు గాని పువ్వుబాణములు గావు
పలుమారు చెలి యేల భ్రమసేవే
కలయ నిట్టూర్పు గానిcకడు జల్లగాలి గాదు
అలికి అలికి యేల అలసేవే ॥నీరమణు॥

మక్కుc జెమటలు గాని మదనరసాలు గావు
వెక్కసమై యింతి యేల వెఱచేవే
చెక్కులకాcకలు గాని చిత్తజుమంటలు గావు
వొక్కమాటే యింత యేల వులికేవే ॥నీరమణు॥

కూడినరతులు గాని గుంపెనవాదులు గావు
యేడ కేడ వో చెలి యెంచి చూచేవే
యీడనే శ్రీవేంకటేశుc డింతలోనే నిన్నుc గూడె
వేడుకల నింతలోనే విఱ్ఱవీగేవే ॥నీరమణు॥252

అవతారిక:

"ఓ చెలీ! నీ భర్త ఇప్పుడే వచ్చీనే. ఇంకా నీ విరహము యెందుకే? వలపు చూపించవలసిన చోట ఈ సంకోచమెందుకమ్మా!" అని హితబోధ చేస్తున్నది పెదతిరుమలయ్య భావనా చెలికత్తె. "గుంపెన వాదులు" అనేమాటకు యెక్కడా అర్థము దొరకలేదు. బహుశా అది గుంపు అయిన

వాదులు (గుంపైన వాదులు) అయివుండవచ్చును. ఆమాటకర్థం మిక్కుటమైన పోట్లాటలు, అని. "వో చెలీ! యేమిటేమిటో లెక్కలేసుకొంటావు ఇప్పుడు కావలసినది రతి కూటములు కానీ అంతులేని కీచులాటలు కావు" అని ఆ చెలికత్తె, నాయికతో అంటున్నది. ఈనాటి భాషకు ఆనాటిభాషకు తేడా చూడండి.

భావ వివరణ:

ఓ చెలీ! నీ రమణుడు (భర్త) ఇప్పుడే వచ్చాడు. ఇంకా నెరి విరహము (పనికిరాని విరహవేదన) దేనికమ్మా! కూరిమి (ప్రేమ) చూపించవలసిన ఈ తరుణంలో కొసరుయేలే? (సంకోచమెందుకమ్మా!)

నీ శరీరంపై వుండవలసినవి ఆనందాతిరేకంలో కలిగే పులకలమొలకలు కానీ మదనుని పూబాణములనాట్లు కావు. ఓ చెలీ! ఆయన వస్తున్నాడని పెక్కు మారులు యెందుకు భ్రమ చెందుతావమ్మా! నీ నిట్టూర్పు వడగాడ్పువలెనున్నది కాని చల్లనిగాలి వలె లేదు. ఇన్నిసార్లు నిట్టూర్చి యెందుకమ్మా! అనవసరంగా అలిసిపోతావు?

వలపువానలు కురియవలసిన తరుణంలో మాలిన్య భూయిష్టమైన స్వేదము చిందిస్తున్నావు. ఓ ఇంతీ! వెక్కసమై (మిక్కుటముగా) వెఱచేవు (భయపడుతున్నావు) దేనికమ్మా? ఇప్పుడు ఆయన వస్తున్నాడు. సిగ్గులెక్కుడై నీ కపోలములు వేడెక్కవలసిన సమయంలో మాయదారి మన్మథుని మంటలేమిటమ్మా! ఒక్కమాటే ఇంత ఉలుకైతే యెలాగమ్మా?

ఓ చెలీ! ఇప్పుడు నీకు, స్వామికి మధ్య కావలసినది రతికూటములు. గుంపైన (మిక్కుటమైన) వాదులు (కీచులాటలు) కావు. ఎక్కడెక్కడి తప్పులో యెంచి చూచి ఆయననెందుకు నిరుత్సాహపరచెదవమ్మా! ఇంతలోనే ఈ శ్రీవేంకటేశుడు వచ్చి ఈడనే (ఇక్కడే) నిన్నుకూడినాడు కదా! ఇంతలోనే ఆనందంతో విఱ్ఱవీగిపోతున్నావు. ఎంత అల్పసంతోషివమ్మా!! నీవు.

సంపుటి: 17 కీర్తన : దివ్వె యెత్తినఫలము దేవర దింతే కదవే
సంఖ్య : 250 పుట : 146 రాగం: ఆహిరి

ఆహిరి

25. దివ్వె యెత్తిన ఫలము దేవర దింతే కదవే
యెవ్వతైనా నాయకుఁడు యేలేటివాఁడుఁ గదవే ॥ పల్లవి॥

మతిలో సవతి వని మచ్చరము రేఁగినాను
అతనిఁ జూడవలెఁగా అవునే కదే
కతకారి నిన్నుఁ జూచి కడుఁ జలము లెక్కినాను
పతిబత్తి సేయఁగాను పదరరాదు గదవే ॥దివ్వె॥

వాలిననీసేఁత చూచి వాసి యెంత వుట్టినాను
లాలించి యతనిమాట చెల్లవలెఁ గదే
పాలుపడి నీ జాడకు పంతము నాకు నెక్కినాను
తాలిమితో నా గుణము దలఁచవలెఁ గదవే ॥దివ్వె॥

జోడై నీ వున్నందుకు సూడెంత గలిగినాను
వేడుక నాతనిబుద్ధి వినేదే కదే
యీడనే శ్రీవేంకటేశుఁడే నలమేల్మంగను
కూడె నిన్నుఁ జెల్లెలిఁగాఁ గూర్చుకోవలెఁ గదవే ॥దివ్వె॥ 250

అవతారిక:

"దివ్వె యెత్తుట" అంటే కాపురము నిలబెట్టుట అని అర్థం. ఓ దేవీ! నీ కాపురం నిలబెట్టిన ఫలితము ఇదిగో నీస్వామిదే. ఇంతే కదమ్మా! మీరెంతమంది సవతులున్నా, మిమ్మల్నియేలుకొనేవాడు తిరుమల నాయకుడైన ఈ దేవదేవుడే కదా! ఎంత కాదన్నా ఆయన అలమేలుమంగ పతే... నీవు ఆయనకు జోడై వున్నందుకు నీకు ఆయనపై యెంత కోపం వచ్చినా, ఆయన బుద్ధి తెలిసిందే కదా! నీవు ఏదో ఆవిడ చెల్లెలు మాదిరి

సర్దుకుపోవాలి. తప్పదు. ఏనాటికైనా సవతుల బ్రతుకింతే. పెదతిరుమలాచార్యుని అద్భుత శృంగార కీర్తన ఇది. ఆస్వాదించండి.

భావ వివరణ:

ఓ దేవీ! దివ్వె యెత్తిన ఫలము (నీ కాపురము నిలబెట్టిన దానిఫలితమే) నీ దేవరది (నీస్వామిది). ఇంతే కదమ్మా! ఆ తిరుమలనాయకుడు ఎవ్వతెకైన ఏలేటి శృంగారరాయడే కదమ్మా? మరి నీకు సవతుల మీద మచ్చరము యెందుకమ్మా?

ఓ దేవీ! నీ మదిలో నేను నీ సవతినని మచ్చరము రేగిన, అది సహజమే. కానీ నీవు ఆయనను చూచి నడుచుకోవాలి కదమ్మా! అవునా? కాదా? కతకారి (మాయమాటలు చెప్పే) నీ మగడు నిన్ను చూచి కొంచెం చలము (మచ్చరము) చూపించినా, పతిబత్తి (పతిభక్తి) చూపించాలిగాని, పదరరాదు గదవే (తొందరపడి పోట్లాడకూడదు కదమ్మా? (నీకు నాబోటివాళ్ళు చెప్పవలెనా)?

ఓ దేవీ! వాలిన (అతిశయించిన) నీ చేష్టలను చూచి ఆయన యెంత వాసిపుట్టినా (విభేదించినా) నీవు స్త్రీవి కాబట్టి ఆయనను లాలించి, ఆయనమాట చెల్లేటట్లు ప్రవర్తించాలి కదటమ్మా! నీ ప్రవర్తనకు నాకు కూడా పంతము యెక్కినా నీవు తాలిమితో (క్షమాగుణం ప్రదర్శించి) నాగుణము దలచవలె గదవే (నేనెటువంటిదాననో ఆలోచించాలి కదమ్మా!)

ఓ దేవీ! మనం సవతులం. ఎంతకాదనుకున్నా ఆయన ఆ అలమేలుమంగమ్మ స్వంతం. ఇప్పుడు ఆయన నీకు జంటయైవున్నందుకు, నాకు సూడెంత కలిగినా (కోపం వచ్చినా) ఆయన బుద్ధి తెలిసిందే కదమ్మా! (కుబ్జను కూడా వదలలేదు). మరి నేడు ఇక్కడే శ్రీవేంకటేశ్వరుడై అలమేల్మంగను కూడినాడు. ఇక నీవు ఆమె చెల్లెలువలెనే అమరివుండాలి కదమ్మా!

సంపుటి:17 కీర్తన:ఈ రీతి రాముఁడు కృష్ణుడు యశోదయెదుట నుండి
సంఖ్య : 372 పుట : 215 రాగం: రామక్రియ

రామక్రియ

26. ఈ రీతి రాముఁడు కృష్ణుడు యశోద యెదుట నుండి
కోరి ముద్దు గునియంగ కొమ్మలు నవ్వేరు ॥ పల్లవి॥

పానిపట్టి వుమిసెనే పాలలోన గృష్ణుడు
నేనా రాము డుమిసెఁ దానే కాక
కానఁగానే యింత చేసి కల్లలాడేఁ జూడవే
ఆనవెట్టు మనవే తా నది నిజమనుచు ॥ఈరీతి॥

సారెఁ బిల్లఁదీపు లాడి జారిపడెఁ గృష్ణుడు
వూరకే గడించ నేల వో యమ్మ తాను
వూరివారి నడుగవే వుద్దాండాలు వీనివి
యీరీతి నాపై గడించి యిన్నియుఁ దాఁ జేసెను ॥ఈరీతి॥

వెంటనే విని సుద్దులు వెళ్లవేతు నటవే
వొంటి నన్ను వెఱపించె వుదుటై తాను
దంటనై శ్రీవేంకటాద్రి తాను నే నాడితి మమ్ము
నింటఁ బొత్తు గలపేవు యిద్దరము నొకటే ॥ఈరీతి॥ 372

గడించుట = కల్పించి అబద్ధాలు చెప్పుట

అవతారిక:

బలరామకృష్ణులను యశోద మందలిస్తున్నది. వాళ్ళు యశోద యెదుట ముద్దుగునిశారట. కావలసి వచ్చి అలా వాళ్ళు ముద్దులు కుడుస్తుంటే గోపికలు నవ్వారట. శ్రీవేంకటాద్రి మీద వాళ్ళిద్దరూ అడుకొన్నారట. నిజానికి వాళ్ళిద్దరూ ఒకటేనట. ఇది శృంగారకీర్తన కోవలోకి రాకపోయినా ఇందులోని వైవిధ్యం చూచి యెన్నిక జరిగింది. పెదతిరుమలయ్య అద్భుత

సృష్టి ఈ కీర్తన. "గడించుట" అంటే కల్పించి అబద్ధాలు చెప్పటం. "బిల్లఁదీపు" అనేది చిన్నపిల్లల ఆట. ఎలా ఆడతారో మనకు ఈ కాలంలో అంతుచిక్కదు కాని ఇది ఆడేపిల్లలు జారి పడుతుంటారు, మన చిన్నారి కృష్ణయ్యలాగా.

భావ వివరణ:

ఈవిధముగా బలరాముడు శ్రీకృష్ణుడు, యశోదాదేవి యెదుట జేరి కోరి (కావాలని) ముద్దు గునియంగ (గారాలు పోతుంటే)... అది చూచి కొమ్మలు (గోపస్త్రీలు) నవ్వేరు (పకపక నవ్విరి).

ఓ దేవీ! కృష్ణుడు తన పాలకుండలో పానిపట్టి (కావాలని) వుమిసెనని (ఉమ్మినాడని) రాముడు తాను కూడా వుమ్మినాడు. కానగానే (మేముదాన్ని చూడగానే) ఇంతచేసినవాళ్ళు, కల్లలాడెజూడవే (అబద్ధాలాడుతున్నారు చూడవమ్మా!) వాళ్ళని ఆన వెట్టమనవే (వాళ్ళని వొట్టుపెట్టుకోమని చెప్పవమ్మా!) తానది నిజమని (తాము చెప్పేది నిజమని మాయెదుట అనమను.

ఒకసారి యేంజరిగిందో తెలుసా? వాళ్ళు "బిల్లదీపులు" అనే ఆట ఆడుతున్నారు. మీ కృష్ణుడు ఆ ఆటలో జారిపడిపోయాడు. ఓ యశోదమ్మా! వూరకే గడించనేల (అనవసరంగా అబద్ధాలు చెబితే మాకేం వస్తుందమ్మా!) వీని ఉద్దండాలు (ఘనకార్యాలు) వూళ్ళోవాళ్ళని పిలిచి అడగవమ్మా! వాళ్ళే చెబుతారు. ఇన్నీ తానుజేసి, ఆపైన తానే ఈ రీతి గడించె (అబద్ధాలు చెబుతున్నాడు).

ఓ దేవీ! మేమిట్లా చెప్పటంవిని నాసుద్దులు (సంగతులు) వెళ్ళవేతువా అని (బయటపెడతావా అని) నన్ను ఒంటరిగా పట్టుకొని తాను వుదుటై వెఱపించె (గట్టిగా భయపెట్టాడు). ఇప్పుడు ఈ వేంకటాద్రిమీద తాను నేను, దంటనై (జంటలుగా) ఆడుకొన్నాము. మమ్మల్ని నీవు పొత్తుకలిపేదేమిటి? నిజానికి మేమిద్దరమూ ఒక్కటే అన్నారు వాళ్ళు.

సంపుటి: 17 కీర్తన : ఎటువంటి మోహమో యింతి నీపై నతనికి
సంఖ్య : 1 పుట : 1 రాగం: సాళంగనాట

సాళంగనాట

27. ఎటువంటి మోహమో యింతి నీపై నతనికి
తటుకన నురమున ధరియించె నిన్నును ॥ పల్లవి॥

కామిని నీ నడపులు గజగమనము లని
కామించి నీ పతి కరిఁ గాచెను
కోమలపు నీ పిరుఁదు చక్రభావ మని
నేమమై చక్రము చేత నిలిపినాఁ డతఁడు ॥ఎటు॥

నెలఁత నీ నిలయము నీరజ మనుచుఁ బ్రియ
మలరి జలజనాభుఁ డాయ నతఁడు
కలికి నీ గళము శంఖముఁ బోలునని తాఁ
దలఁచి పాంచజన్యధరుఁ డాయ నతఁడు ॥ఎటు॥

నిరతి నలమేల్మంగ నీ కురులు నలుపని
అరుదార నీలవర్ణుఁ డాయ నతఁడు
గిరికుచవని నిన్నుఁ గెరలి కౌఁగిటఁ గూడె
పరగ శ్రీ వేంకటపతి యాయ నతఁడు ॥ఎటు॥ 1

అవతారిక:

ఈ కీర్తన నాలకించిన వారు సెబాస్ ఈ పెదతిరుమలాచార్యులు తండ్రికి ఏమాత్రం తీసిపోని కొడుకు అంటారంటే నన్ను నమ్మండి. "ఓ దేవీ! నీపై నతనికి యెటువంటి మోహమువుందమ్మా? నిన్ను చటుక్కున వురముపై ధరించినాడు గదటమ్మా!" అంటున్నారు. ఆయన గజేంద్రవరదుడవటానికీ, చక్రహస్తుడవటానికీ, పద్మనాభువడవటానికీ,

పాంచజన్య శంఖధారి అవటానికీ నల్లని వేంకటరమణుడవటానికీ అసలు కారణాలు వేరే వున్నాయట. అంతెందుకు ఇవ్వాళ ఈ ఉన్నత శిఖరాలమీద తిష్టవేసి నెలకొన్న దానికి కూడా వేరే కారణం వున్నదట. ఔరా! పెదతిరుమలాచార్యా!

భావ వివరణ:

ఇంతీ! (ఓ అలమేల్మంగమ్మా!) నీపై అతనికి (ఆ శ్రీనివాసునికి) యెటువంటి (యెంతటి) మోహమో (గాఢానురాగమో కదా!) నిన్ను ఆయన తటుకున (చటుక్కున) తన ఉరముపై ధరించినాడు (నిలుపుకొనినాడు).

ఓ కామినీ! నీనడపులు గజగమనములు (మద కరీంద్రపు నడకలు నీవి) అని నీ భర్త ప్రేమతో అలనాడు మొసలిచే పీడింపబడుచున్న గజేంద్రుని గాచెను (రక్షించినాడు). కోమలమైన నీ నితంబములు చక్రములవలె గుండ్రనివని ఆయన చక్రధారియై నిలిచాడు.

ఓ నెలతా! నీ నిలయము (నివాసము) నీరజము (పద్మము) అని ఆయన ప్రేమాతిశయమున జలజమును తన నాభిలో ధరించి పద్మనాభుడైనాడు. ఓ కలికీ! నీ గళము (మెడ) శంఖమువలెనున్నదని భావించి ఆయన నిరంతరము పాంచజన్యము అను శంఖమును ధరించినవాడై ప్రసిద్ధి బొందినాడు.

ఓ అలమేల్మంగా! నిరతి (మిక్కిలి ఆసక్తితో) ఆయన నీ కురులు (కేశపాశము) నల్లగావున్నదని తానుకూడా అరుదైన మెరయుచున్న నీలవర్ణుడాయెను (నల్లనయ్య అయ్యాడు). నీవు గిరికుచవని (స్తనగిరులున్న దానవు) నీ కౌగిట కరిగిన ఆ దేవదేవుడు వేంకటపతి అను కొండలరాయుడైనాడు. అది తల్లీ! ప్రేమంటే. ఆయనే పతియంటే.

సంపుటి: 17 కీర్తన : విరహిణి మొదలనేవీరి వొట్లిక నేల
సంఖ్య : 427 పుట : 246 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

28. విరహిణి మొదలనే వీరి వొట్లిక నేల
తరుణికి శృంగారాలు తగినవేసేయరే ॥ పల్లవి॥

అలినీలవేణికి నది యేలే సంపెంగలు
అలరుదామెరవిరు లగుఁ గాక
పొలసి పికవాణికి పుయ్యకురే జవ్వాది
చిలుకు చిగురు బంతి చేతి కియ్యరే ॥విరహి॥

దంతియానకు సింహాలఁ దగ వ్రాసిన చీరేలే
చెంతలనే లతల మంజిష్టి గాక
రంతుఁ గలువకంటికి రవిపదక మిదేలే
పంతముతోడ చంద్రాభరణము లిడరే ॥విరహి॥

వడి నీపె గిరికుచవజ్రాల సేస లేలే
అడరుఁ బావులసేసే అమరుఁ గాక
బడి శ్రీవేంకటేశుఁడు పడఁతినిఁ గూడె నింక
కడుఁ గుంకుమపూతేలే గందవొడి చల్లరే ॥విరహి॥ 427

అవతారిక:

ఒట్లు అంటే 'రగుల్చు' అని కూడా అర్థమున్నది. ఆ అర్థంలో ప్రయోగించారు పెదతిరుమలయ్య ఆ పదాన్ని. "అసలే ఆమె విరహంతో రగిలిపోతోంది. ఆ తరుణికి తగిన సింగారాలు చేయండర్రా! ఆ చెలికత్తెల రగుల్పులు కూడా యెందుకు" అంటున్నారు. ఒకటికి రెండుసార్లు చదివితేకాని ఈ కీర్తనలోని భావసౌందర్యం అంతుచిక్కదు. ఉదాహరణకు "గజగామినియైన ఈ భామినికి సింహపు బొమ్మలు అద్దిన

చీరెకడతారేమర్రా" అని పెదతిరుమలయ్య భావనా. చెలికత్తె తనతోటివారితో అంటున్నది. అద్భుతంగా లేదూ?

భావ వివరణ:

ఓ చెలులారా! మొదలనే (అసలే) ఈమె (ఈ అలమేల్మంగ) విరహిణి (విరహతప్త). వీరి నొట్లికనేల (ఇంకా వీళ్ళ వేధింపులు దేనికమ్మా!) మీ గోల మాని ఈ తరుణికి ఈ సమయంలో తగిన శృంగారాలు (సింగారములను) సేయరే (చేయండమ్మా!).

ఈమె అలినీలవేణి (తుమ్మెదలవంటి నల్లని ముంగురులు కల చిన్నది). ఈ సంపెంగలు తలలో పెడతారా? (మీకు బుద్ధివున్నదా?...) సువాసన గల తామరలపూలు పెట్టండమ్మా! ఈమె పికవాణి (కోయిలగొంతు కలది). కోయిల ఎంత నల్లగా వుంటుంది!! ఇంకా నల్లని జవ్వాది ఈమెకు అద్దుతారా!! వద్దు అది పూయకండి. ఈ చిగురు బంతి (లేత చెండు) వంటి చిన్నదానికి చిలుకు (క) ను ఇవ్వండి. ఆ చిలుక పలుకులు ఈమెకు తగినట్లుంటాయి.

ఈమె దంతియాన (గజగామిని... మెల్లగా గజము వలె నడిచే భామ). ఈమెకు సింహం బొమ్మలు అద్దిన చీరె కడతారా? మీకు జ్ఞానం వున్నదా? చెంతల (మీపక్కనేవున్న) మంజిష్టిలతల (ఎఱ్ఱని పూతీగెలు అద్దిన) చీరకట్టండి. ఈమె కలువకంటి (కలువలవంటి కన్నులున్న యువతి) ఈమెకు మీరేమి నగలుపెట్టారో చూడండి. రవిపదకము (సూర్యపతము). ఇది తీసివేసి చంద్రాభరణాలు పెట్టండే. అవే ఆ కలువకంటికి నప్పుతాయి.

ఈమె గిరికుచ (గిరిశృంగములవలె కఠోరమైన కుచయుగళిగల భామిని). ఈమెపై మీరు చల్లే సేసలు (అక్షతలు) వజ్రములా!! మీకు తోచదేమి? ఈమెకు పూల అక్షతలు చల్లండి. ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడు ఈమెను బడిగూడె (శ్రీఘ్రముగా కూడినాడు). ఇంకా ఈమెకు కుంకుమ పూతలెందుకమ్మా? చక్కగా మంచి గంధంపొడి పూయండి.

సంపుటి: 17 కీర్తన : మానరాని మాయలు
సంఖ్య : 5 పుట : 4 రాగం: హిజ్జిజి

హిజ్జిజి

29. మానరాని మాయలు
కానీ యందు కేమి కలసీఁ గాని ॥ పల్లవి॥

చాలురా నీ సన్నలు నా
కాలు దాఁకీఁ గదియకు
కాలమందె యిన్నిఁ గంటిమి నా
చేల విడువరా చెప్పీఁ గాని ॥మాన॥

వద్దురా చల్లువలపూ యింత
ముద్దు లేల పల్లు మోఁచీని
అద్దొ కాలు దొక్కే వప్పటి వొక
కొద్ది నుండరా కూడీఁగాని ॥మాన॥

చెల్లురా నీచేఁతలు నా
వొల్లి చెమ టంటీ నొరయకు
తొల్లి కడపలో దొరసితి నా
వుల్లపు శ్రీ వేంకటోత్తముఁడా ॥మాన॥ 5

అవతారిక:

నాడు, దేవునిగడప అని పిలువబడిన నేటి 'కడప'లో నెలకొన్న వేంకటేశ్వరునిపై పెదతిరుమలయ్య చెప్పిన శృంగార కీర్తన ఇది. ఆనాటి తెలుగు పద ప్రయోగం ఈనాడు చలామణిలో లేనందువల్ల కొంత అర్థంకాని పరిస్థితి. తన దేవేరితో ఆయన చెప్పే మాయమాటలకు, మాయవేషాలకు ఆవిడ విసిగిపోయిందిట. "ఇకచెల్లురా, నాచేల విడువరా"

అన్నది. "నీవి మానరాని మాయలు కానీ, అందుకేమి కలసీగాని!" అని అంటున్నది. నేటికాలంలో "అయితే అయ్యాయిలే" అనే వాడుకవున్నది. భావ వివరణ జాగ్రత్తగా చదివితే సమన్వయం దొరుకుతుంది.

భావ వివరణ:

ఓ ప్రభూ! ఒప్పుకొంటాను, నీవి మానరాని మాయలు. ఆడువారిని మాయ చేయటం నీ అలవాటు. నీ అలవాటు నీవెన్నటికీ మానవు. అందుకేమి కానీ... కలసీగాని (అయితే అయ్యిందిలే).

చాలురా! నీతో ఇకచాలు. నీ సన్నలు (సైగలు) కట్టిపెట్టు. రహస్యంగా నాకాలును దొక్కి కదియకు (దగ్గరకు) రాకు. కాలమందే అన్నీ కంటిమి (మా కాలంలో ఇట్లాంటివి చాలా చూశాంలేవయ్యా!) చేలవిడువరా చెప్పేగాని (నేను చెబుతున్నాను కదా! ముందు నా చీరెకొంగు విడిచిపెట్టు). నీ తుంటరి చేష్టలు మానివేయి.

ఇంత వలపూ చల్లు వద్దురా! నీదంతక్షతములతో చుంబనములు చురుకుమనుచున్నవి. అద్దో (అదిగో) అప్పటి కాలుదొక్కేవు (మళ్ళీ కాలు తొక్కుతున్నావు). ఒక కొద్దినుండరా కూడీగాని (నన్ను కూడెదవు లేవయ్యా! ఒక్క రవ్వ తగ్గివుండవయ్యా! నలుగురూ చూస్తున్నారు కదా!)

నీ చేతలు చెల్లురా (చెల్లిపోయాయి). అంతగా నన్ను రాసుకొని కూర్చోకు. పాపం! నా ఒంటి చెమట నీకు అంటుకొంటుంది. నీవేం మామూలు వాడివా? తొల్లి (అనాదిగా) కడపలో దొరతనము చేయుచున్న మా అందరి మనోహరుడవైన శ్రీవేంకటోత్తముడవు (శ్రీవేంకటేశ్వరుడవు).

సంపుటి: 17 కీర్తన : బాపురే యెంతటి జాణ బాలకృష్ణుఁడు చూడఁ
సంఖ్య : 206 పుట : 121 రాగం: రామక్రియ

రామక్రియ

30. బాపురే యెంతటి జాణ బాలకృష్ణుఁడు చూడఁ
బాపనివలె నున్నాఁడు బలరామకృష్ణుఁడు ॥ పల్లవి॥

వొంటి గోపికలచన్ను లుట్లపై కుండ లంటా
అంటుచుఁ చేతులు చాఁచీ నదే కృష్ణుఁడు
వెంటనే అధరములు వెస మోవిపండ్లంటా
గొంటరియై అడిగీని గోవిందకృష్ణుఁడు ॥బాపురే॥

సతుల పెద్దకొప్పులు చక్కిలాలగంప లంటా
బతిమాలి వేఁడీ నప్పటిఁ గృష్ణుఁడు
చతురతఁ బిరుఁదులు చక్కెరదీబ లంటా
తతిగొని యంటీని దామోదరకృష్ణుఁడు ॥బాపురే॥

అంగనలవొడికట్లు అరఁటిపండ్లంటా
సంగతిఁ గౌఁగలించీ వేసాలకృష్ణుఁడు
అంగడి నింతులెల్లాను అలమేలుమంగ యంటా
చెంగలించి కూడీని శ్రీవేంకటకృష్ణుఁడు ॥బాపురే॥ 206

అవతారిక:

బాలకృష్ణునిపై పసందైన కీర్తన చెబుతున్నారు పెదతిరుమలాచార్యుల వారు. "అమ్మయ్యో! ఈబాలకృష్ణుడు యెంతటి జాణ!! ఈ బలరామకృష్ణుడు గొల్లవానివలె లేడు బాపని వలె (బ్రాహ్మణుని) మాదిరిగా) వున్నాడు", అంటున్నారు. అన్నమయ్యవలె ఈయన (పెదతిరుమల) ఎన్నుకొనే ఇతివృత్తము చాలా నూతనంగా వుంటుంది. గోపికలతో శృంగార ప్రియునికీ బ్రాహ్మణునికి సాపత్యమేమిటి? కొసమెఱుపేమిటంటే "అంగడి నింతులెల్లాను అలమేలుమంగయంటా

చెంగలించి కూడీని శ్రీవేంకట కృష్ణుడు" అంటున్నారు. అర్థం అయ్యా అవనట్లుందా? భావవివరణ చదవండి సందేహ నివృత్తి చేసికొనండి. బలరామకృష్ణులకు అభేదం సూచిస్తున్నారు.

భావ వివరణ:

బాపురే (అమ్మ బాబోయ్), చూడ (చూడబోతే) ఈ బాలకృష్ణుడు యెంతటి జాణ (నేర్పరి)!! ఈ బలరామకృష్ణుడు బాపనివలె (బ్రాహ్మణ పండితుని మాదిరిగా) వున్నాడు. ఆ పోలికలు చూడండి.

ఒంటరిగానున్న గోపికల స్తనయుగ్మములను "అదిగో ఉట్లపైనున్న కుండలు కాబోలు" అని చేతులు చాచి ఈ కృష్ణుడు పట్టుకొనుచున్నాడు. ఆ వెంటనే ఏమి చేస్తాడో వినండి. మా అధరములను చూచి "ఇవి మోవిపండ్లు కాబోలు కొరకనిస్తారా" అని గొంటరియై (కొంటెగా) అడుగుతాడు. ఈ గోవిందకృష్ణుడు, మోవి అంటే పెదవి అనే శ్లేష వాడి తన జాణతనం చూపినాడు.

ఈ కృష్ణుడు గోపికల పెద్ద పెద్ద కొప్పులను జూచి "ఓహో! చక్కిలాల గంపలా!! అబ్బా బాగా ఆకలిగా వుందర్రా! కాసిని చక్కిలాలు పెట్టండి, అని మమ్మల్ని బ్రతిమాలి, అప్పటి వేడీని (మరల మరల వేడుకొంటూ) మా కొప్పులు ముట్టుకొంటాడు. దామోదరుడైన ఈ కృష్ణుడు చతురతన్ (సమయస్ఫూర్తి) చూపించుచూ "అరె! చక్కెర దిబ్బలు ఇక్కడికెలా వచ్చాయబ్బా" అని ఆశ్చర్యం నటిస్తూ మా పిరుదల నంటుతాడు. తతిగొని (ఆసక్తిని పొంది) ఇట్లు నటించు వీనినేమి చేయగలము?

ఈ వేసాల కృష్ణుడు (దొంగవేషాల కృష్ణయ్య) అంగనల (గోపికల) ఒడికట్టును అరటిపండ్లంటూ చేరవయై కౌగలించుకొంటాడు. ఇన్ని చేసినా ఆయన మనస్సులో దేవి అలమేల్మంగకు మాత్రమే స్థానం వున్నదని నిరూపించుటకా!! అన్నట్లు, ఇంతులెల్లా (తనుకూడిన జవ్వనులందరూ) ఆ దేవియేనని ఆ శ్రీవేంకట కృష్ణుడు ఆమెను చెంగలించి (అతిశయించి) కూడినాడు.

సంపుటి: 15 కీర్తన : మొక్కెటి గోపాంగనల మోహనాకారము
సంఖ్య : 221 పుట : 147 రాగం: బౌళి

బౌళి

31. మొక్కెటి గోపాంగనల మోహనాకారము
చిక్కని నవ్వులు నవ్వీ శ్రీవేంకటేశ్వరుఁడు ॥ పల్లవి॥
సత్యభామవురముపై చల్లని కస్తూరిపూఁత
తత్తరించే రుక్మిణి చేతామరపూవు
హత్తిన భూకాంతకు యంగపుపయ్యదకొంగు
చిత్తగించరమ్మ వీఁడే శ్రీవేంకటేశుఁడు ॥మొక్కెటి॥
పంతపుపదారువేల బంగారువుంగరము
బంతికే కుబ్జగట్టిన పసిఁడితాళి
వింతగా రాధాదేవివేసిన కలువదండ
చెంతలను వీఁడేయమ్మ శ్రీవేంకటేశుఁడు ॥మొక్కెటి॥
ఆసల తులసీదేవి యఱచేతిలో యుద్దము
భాసురపు యిళాదేవి పట్టుగొమ్ము
శ్రీసతియెక్కినట్టి సింహాసనపు గద్దె
సేస వెట్టించుకున్నాఁడు శ్రీవేంకటేశుఁడు ॥మొక్కెటి॥

అవతారిక:

శ్రీవేంకటేశ్వరుడే ప్రహ్లాదవరదుడైన నరసింహుడని, ఆయనే రావణాంతకుడైన శ్రీరామచంద్రుడని, ఆయనే గోపికా చిత్తచోరుడైన శ్రీకృష్ణుడని, క్షీరసాగరశయనుడైన శ్రీమహావిష్ణువని, దశావతారమూర్తి అని భావించి 32000 పైగా కీర్తనలు చెప్పారు తాళ్ళపాక అన్నమాచార్యులు. వేంకట మకుటంతో కీర్తనలు చెప్పిన తన తండ్రి బాటలోనే ఆయన తదనంతరం నడిచి సెబాస్ అనిపించుకొన్నాడు ఆయన కొడుకు తాళ్ళపాక పెద తిరుమలాచార్యులు. ఆ సంకీర్తనాచార్యుడు అనేక అధ్యాత్మకీర్తనలే కాక తండ్రికి సరితూగే శృంగార కీర్తనలు కూడా చెప్పారు. అదే దీక్ష కొనసాగించే దిట్టతనంగల కొడుకును కన్నాడు. ఆ సుపుత్రుడు చినతిరుమలయ్య. నేను ఎన్నుకొన్న 32 పెద తిరుమల శృంగార

కీర్తనలలో ఇది 31వది. శ్రీకృష్ణ భగవానుని ఎవ్వరు ఏవిధంగా భావించారో, సేవించారో వివరిస్తున్నారు. ఆయనే మన శ్రీవేంకటేశ్వరుడూనట.

భావ వివరణ:

ఈ శ్రీవేంకటేశ్వరుని చూడండి. చక్కని (స్వచ్ఛమైన) నవ్వులను విరజిమ్ముతూ నవ్వుతున్నాడు. ఈయన యెవ్వరో కాదు... ఆనాడు బృందావనంలో తనకు మొక్కుతున్న గోపీ స్త్రీల పాలిట మోహనకృష్ణుడు ఈయనే.

ఈయనే సత్యభామకు వురముపై అలదుకొనిన చల్లని కస్తూరి పూత. తత్తరించు (సంభ్రమముచెందు) రుక్మిణీదేవికి తనచేత ధరించిన తామరపూవు. హత్తిన (తనను కూడిన) భూదేవికి ఈయన అంగపుపయ్యెద (కుచగిరులను కప్పువల్లెవాటు). చిత్తగించుడమ్మా! (మనస్సులలో ప్రతిష్ఠించుకొనండి) ఈయనే మన శ్రీవేంకటేశ్వరుడు.

పంతము పట్టిన పదియారువేల రాచకన్నెలకు నరకాసురుని వధించిన తరువాత బంగారు వుంగరములు తొడిగి, తన భార్యలుగా స్వీకరించాడు కదా! అందుకే ఈయన వారికి బంగారపు వుంగరమువంటివాడు. కుబ్జను సుందరిగా మార్చి ఆమె కోరిక మేరకు పుత్రునిప్రసాదించిన కృష్ణయ్య బంతిని (పెళ్ళిళ్ళ వరుసను) మొదలుపెట్టిన దామెతోనే. అందుకే ఆయన ఆమె పాలిటి పసిడి మంగళసూత్రము. రాధాదేవి ఆయనకు వరుసమేనత్త. కాని రాధామాధవ చరితం పావనమైనది. కలువపూలదండవలె నవ్యమైనది. మన చెంతనున్న ఈ శ్రీకృష్ణ కుమార్తే తిరుమల శ్రీవేంకటేశ్వరుడు.

జలంధరుని సంహార నిమిత్తం ఆతని భార్యను కూడినా, ఆమెను పరమపునీతను జేసి తులసీదేవిగా సుప్రసిద్ధనుజేసి నిత్యము తులసిమాలలు ధరించు శ్రీవేంకటేశుడైనాడు. ఆయనే ఆమె అరచేతిలో అద్దమువలె మనకు తోపినాడు. భాసురపు (ప్రకాశించెడి) ఇళాదేవికి (గోదాదేవికి) ఈయన పట్టుగొమ్మ (ఆధారము). ఈయన వురమే శ్రీలక్ష్మి నివాసము. అందుకనే ఈ శ్రీవేంకటేశ్వరుడు అందరిచేతా సేసవెట్టించుకొనినాడు (మంగళగీతికలు పాడించుకొనినాడు). అనండి మరొక్కసారి...

శ్లో॥ మంగళం కోసలేంద్రాయ మహనీయ గుణాత్మనే ।
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం ॥

సంపుటి: 4 కీర్తన : హరియవతారమె ఆతడితడు
సంఖ్య : 192 పుట : 0129 రాగం: సౌరాష్ట్రం

సౌరాష్ట్రం

32. హరియవతారమె ఆతఁడితఁడు
పరమ సంకీర్తనఫలములో నిలిపె ॥ పల్లవి॥

వున్నాఁడు వై కుంఠమున నున్నాఁడు యాచార్యునొద్ద
వున్నతోన్నతమహిమ నన్నమయ్య
వున్నవి సంకీర్తనాలు వొట్టుక లోకములందు
పన్నిన నారదాదులు పైపైఁ బాడఁగను ॥హరి॥

చరియించు నొకవేళ సనకాదిమునులలో
హరిఁ బాడుఁ దాళ్ళపాక అన్నమయ్య
తిరమై యాళువారల తేజము దానైయుండు
గరుడానంతముఖ్య ఘనులసంగడిని ॥హరి॥

శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతికొలువునందు
ఆవహించెఁ దాళ్ళపాక అన్నమయ్య
దేవతలు మునులును దేవుఁడని జయవెట్టఁ
గోవిదుఁడై తిరిగాడీఁ గోనేటిదండను ॥హరి॥ 192

అవతారిక:

తన తండ్రి అన్నమయ్యపై అద్భుతమైన కీర్తన వినిపిస్తున్నారు పెదతిరుమలాచార్యులవారు. అన్నమయ్య శ్రీహరి అవతారమేనని కీర్తిస్తున్నారు. "ఆతడు హరి అవతారమె. ఇతడు పరమ సంకీర్తన ఫలములో నిలచె"నంటున్నారు. తన తండ్రి పరమపదించి శ్రీవేంకటాద్రిమీద శ్రీపతి కొలువులో చేరాడట. దేవతలు ఋషులు జయజయ ధ్వానాలు చేస్తుంటే కోనేటి పుష్కరిణి ఒడ్డునే పండిత గోష్ఠిలో

దివ్యాత్మ రూపంలో తిరుగాడినాడట. ఈ కీర్తనతో తాళ్ళపాక పెదతిరుమలయ్య చెప్పిన 32 సంకీర్తనలకు అవతారిక సహితముగా భావ వివరణ అందించటం జరిగింది. దీనితో శ్రీవేంకటేశ్వరుని కొలువులో శృంగారసంకీర్తనలకు మంగళము పాడుట అయినది.

భావ వివరణ:

ఆతడు (తాళ్ళపాక అన్నమయ్య) హరియవతారమె. ఇతడు పరమ సంకీర్తన (దివ్యమైన సంకీర్తనల) ఫలములో నిలిచినాడు.

ఇతడు శ్రీమహావిష్ణువు యొక్క నివాసమైన వైకుంఠము తన స్థానముగానున్నాడు. అందులోనూ ఆచార్యునివొద్ద (శ్రీరామాను -జాచార్యులవారు) వున్న చోటునే తానూ వున్నాడు. ఎందుకంటే ఈయనకూడా ఉన్నతోన్నతమైన మహిమలు కలవాడైనాడు కదా! ఆయన భూలోకంలో పాడిన సంకీర్తనలను పట్టుకొని నారదమహర్షివంటివారు పైపై పాడుతుంటే (తాము వంతపాడుతుంటే) అన్నమయ్య వాటిని వింటూ ఆనందిస్తున్నాడు.

ఆ తాళ్ళపాక అన్నమాచార్యులవారు ఒక్కొక్కసారి సనకసనందనాది ఋషులతో కలిసి తిరుగుతుంటారు. ఒక్కొక్కసారి హరి సంకీర్తనలు పాడుతుంటారు. తిరమై (స్థిరమైన) ఆళ్వారుల (వైష్ణవ భక్తశ్రేష్ఠుల) తేజస్సే తానైనట్లుగా, గరుత్మంతుడు, అనంతుడు (ఆదిశేషుడు) మొదలైన శ్రేష్ఠుల సాంగత్యముతో వారు గడుపుతున్నారు.

వైకుంఠంనుండి భూలోకంలో ఏమిజరుగుతున్నదో చూడటానికి విచ్చేసినప్పుడు, అన్నమయ్య శ్రీవేంకటాద్రిమీద శ్రీపతి కొలువులో ఆవహించి (కలిగి) వుంటారు. శ్రీవేంకటేశ్వరుని కొలువు కేతెంచిన దేవతలు, మునులు ఈ తాళ్ళపాక అన్నమాచార్యులవారు దేవుడని కీర్తిస్తూ జయజయధ్వానములు చేస్తుంటే ఆ స్వామిపుష్కరిణి ఒడ్డున కోవిదుడై (విద్వాంసునివలె) తిరుగాడుతారు.

(మనం మానవమాత్రులంకాబట్టి అవేమీ చూడలేము. అది మన దురదృష్టం... అంతే.)

సంపుటి: 4 కీర్తన : కొలిచితే రక్షించే గోవిందుఁడితఁడు
సంఖ్య : 180 పుట : 121 రాగం: ఆహిరి

ఆహిరి

33. కొలిచితే రక్షించే గోవిందుఁ డితఁడు
యిలకు లక్ష్మికి మగఁడీ గోవిందుఁ డితఁడు ॥ పల్లవి॥

గోవర్ధన మెత్తినట్టి గోవిందుఁ డితఁడు
వేవేలు గొల్లెతల గోవిందుఁ డితఁడు
కోవిదుఁడై ఆలఁగాచే గోవిందుఁ డితఁడు
ఆవలఁ గంసుఁ జంపిన ఆ గోవిందుఁ డితఁడు ॥కొలి॥

క్రూరకాళింగమర్దన గోవిందుఁ డితఁడు
వీరచక్రాయుధపు గోవిందుఁ డితఁడు
కోరి సముద్రాలుదాఁటే గోవిందుఁ డితఁడు
ఆ రీతి బాలురఁ దెచ్చే యా గోవిందుఁ డితఁడు ॥కొలి॥

కుందనపుకాశతోడి గోవిందుఁ డితఁడు
విందుల రేపల్లె గోవిందుఁ డితఁడు
పొంది శ్రీవేంకటాద్రిపై పొసఁగఁ దిరుపతిలో
అందమై పవ్వళించిన ఆ గోవిందుఁ డితఁడు ॥కొలి॥180

అవతారిక:

తిరుపతిలో వెలసిన శ్రీగోవిందరాజస్వామిపై చక్కటి భజన ఆలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. భజన భక్తి పరాకాష్ట చెందే ప్రక్రియ. సజ్జన సాంగత్యంలో భక్తి పూర్వకంగా భగవన్నామ సంకీర్తన చేస్తే పుణ్యం సంగతి అటుంచి చక్కని మానసిక ప్రశాంతత సిద్ధిస్తుంది. ఇది సన్నుతి కాబట్టి భావవివరణ ప్రాముఖ్యత ఎక్కువ వుండదు. ఒకటి రెండుచోట్లు తప్పించి కీర్తన కిష్టంకాదు. "కోరి సముద్రాలు దాటే గోవిందుడు" అనే చరణమూ "కుందనపుకాశతోడి గోవిందుడు" అనే

చరణమూ మాత్రమే వివరణ అవసరమైనవి. అవునా? ఇంతకీ ఈయన ఏ బాలురకోసం ఎప్పుడు సముద్రాలు దాటాడు? ఏమో! ఆలోచించండి.

భావ వివరణ:

ఇతడు (ఈ గోవిందరాజస్వామి) కొలిచితే (శరణని సేవిస్తే) రక్షించే గోవిదుడు. ఈయన ఇలకు (భూదేవికి), లక్ష్మికి (శ్రీదేవికి) మగడు (భర్త). ఈ గోవిందుని సేవించండి.

ఈయన నందవ్రజమున గోవులను, గోపాలురను ఇంద్రుని రాళ్ళవర్షంనుండి రక్షించుటకు తన చిటికెన వ్రేలిపై గోవర్ధన పర్వతము నెత్తి దాని క్రింద వారిని చేర్చి రక్షించాడు. వేవేల (అనేకమంది) గొల్లెతలు కోరుకొన్న గోవిందుడితడే. కోవిదుడై (పెద్దవాడై) గోవులను కాచి గోవిందుడని ప్రసిద్ధి జెందినాడు. ఆ గోవిందుడే ఆవల (అటు తరువాత) మధురానగరమునకు బోయి దుష్ట కంసుని జంపి తనతల్లిదండ్రులైన దేవకీ వసుదేవులను చెఱనుండి విముక్తులను చేశాడు.

ఈ గోవిందుడు క్రూరుడైన కాళిందుడు అనే సర్పము యమునానదిని విషపూర్తించేసి ప్రాణహాని చేస్తుంటే, దానిని మర్దించి వెడలగొట్టి అందరినీ రక్షించాడు. వీరత్వమునకు ప్రతీకయైన తన సుదర్శన చక్రముతో శిశుపాలుని వంటి యెందరిని తుదముట్టించాడో లెక్కయే లేదు. తన గురువు సాందీపుని కోరిక మేరకు, తన తల్లి దేవకీదేవి కోరిక మేరకు సముద్రములను దాటిపోయి యెన్నడో చనిపోయినవారి పుత్రులను తిరిగి సజీవులుగ దెచ్చి వారి కోరికలను తీర్చిన గోవిందుడితడే.

ఈ గోవిందుడు కుందనపు కాశతోడివాడు (ఈయన బంగారు వర్ణము గల వస్త్రమును ధరించి పీతాంబరుడని విశ్వవిఖ్యాతుడైనాడు. రేపల్లెలో పాలు, వెన్న, నేయి అన్నీ దొంగిలించి తన తోటి గోపాలురకు విందులు చేసినాడు. ఆ ద్వాపరయుగం అంతరించి నేటి కలియుగం వచ్చేసింది. ఇప్పుడు జనులను ఈతి బాధలనుండి రక్షించుటకు శ్రీవేంకటాద్రిపై శ్రీవేంకటేశ్వరునిగాను, ఈ తిరుపతి నగరంలో గోవిందరాజస్వామిగాను ఆ కృష్ణయ్యే వెలసి అందముగా పవ్వళించి కనుపించుచున్నాడు.

సంపుటి: 4 కీర్తన : ఇదియే సాధనమిహపరములకును
సంఖ్య : 384 పుట : 258 రాగం: మలహరి

మలహరి

34. ఇదియే సాధన మిహపరములనకును
పదిలము మాపాలి పరమపునామం ॥ పల్లవి॥

కలిదోషహరము కైవల్యకరము
అలరిన మా శ్రీహరినామం
సులభము సౌఖ్యము శోభనతిలకము
పలుమారును శ్రీపతినామం ॥ఇది॥

పాపనాశనము బంధవిమోక్షము
పై పైనిది భూపతినామం
స్థాపితధన మిది సర్వరక్షకము
దాఁపిర మిది మాధవనామం ॥ఇది॥

నేమము దీమము నిత్యకర్మమిది
దోమటి గోవిందనామం
హేమము శరణము యిన్నిట మాకును
యేమేర శ్రీవేంకటేశ్వరునామం ॥ఇది॥384

అవతారిక:

శ్రీహరినామ సంకీర్తన యొక్క మహిమను వివరిస్తున్న అన్నమయ్య అద్భుత కీర్తన నాలకించండి. ద్రాక్షాపాకం అని సంబరపడిపోతే ప్రమాదం. ఒకటి రెండు చోట్ల నేను నిఘంటువును తెరవక తప్పనేలేదు సుమండీ! ఈ మాధవుని నామము 'దాఁపిరము' అంటున్నారు. అంటే దాచిపెట్టిన సొమ్ము అని అర్థం. నేమము, దోమము, నిత్యకర్మమిది అంటే ఏమిటి? ఇట్లా అన్నీ ఇక్కడే చెబుతే ఎలా? ఇది బహుళజనాదరణ పొందిన

కీర్తన. అన్నట్లు... దీమము అంటే 'ఇల్లు' అనే అర్థం వున్నప్పటికీ... 'దీమసము' అంటే ధైర్యము కాబట్టి ధైర్యమునిచ్చునది అనే భావన అన్నమయ్యది కావచ్చును.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఇహపరములకు (ఈ భూలోకంలో ఆనందానికి, చనిపోయిన తరువాత పరలోకంలో వున్నతంగా వుండడానికీ) ఇదియే (ఈ శ్రీహరి నామసంకీర్తనమే) సాధనము (వుపయోగకరము), పదిలము (సురక్షితమైనది). మాపాలి (మాయందు) ఈ నామము మోక్షకరమైనది.

మా శ్రీహరి నామసంకీర్తనము కలియుగములో నిత్యమైన దోషములను నివారించునది. మనము చనిపోయాక కైవల్యము (మోక్షము) సిద్ధింపజేస్తుంది. చాలా సులభమైనది. సౌఖ్యప్రదమైనది. శోభన తిలకము (శుభములు నొసంగుటలో నెన్నుదుటి బొట్టు వంటిది). ఈ శ్రీహరి నామము పలుమారును (మాటిమాటికీ చేయండి). మంచిదే సుమండీ!

ఈ శ్రీహరినామము పాపమును నశింపజేయునది. భవబంధములను సడలించునది. భూపతినామము (భూదేవి భర్తయైన ఈ స్వామి నామము) పైపైనిది (అలవోకగా తేలికయైనది). ఇది స్థాపించబడిన ధనము (ఫిక్స్‌డ్ డిపాజిట్) వంటిది. అందుచేత సర్వత్రా రక్షించునది. ఈ మాధవుని నామము దోపిరము (దాచిపెట్టుకొన్న సొమ్మువంటిది). ఏనాటికైనా సొమ్ములు వుపయోగపడేవే కదా!

ఈ శ్రీహరినామము నిత్యకర్మములవలె (సంధ్యావందనము మొదలైన కర్మలవలె) చేయదగినది. ఇది నేమము (నియమము ప్రకారము చేయదగినది). ఇది దీమము (ధైర్యమునిచ్చునది). ఈ గోవిందుని నామము దోమటి (జీవించుటకు తినే అన్నము వంటిది). మాకు ఇన్నిటా (ఇన్నిటిలోనూ) శరణునొసగు బంగారము వంటిది. ఈ శ్రీవేంకటేశ్వరుని నామమునకు ఏమేర (హద్దుయేది?) దీనికి మితి లేనేలేదు.

సంపుటి: 4 కీర్తన : శ్రావహనబహుళాష్టమి జయంతి నేఁడు
సంఖ్య : 139 పుట : 93 రాగం: సాళంగనాట

సాళంగనాట

35. శ్రావణబహుళాష్టమి జయంతి నేఁడు
సేవించరో నరులాల శ్రీకృష్ణఁ డితఁడు ॥ పల్లవి॥

భావింప వసుదేవునిపాలిటి భాగ్యదేవత
దేవకి గనినయట్టి దివ్యరత్నము
చేవమీర సురల రక్షించే కల్పతరువు
యీ వేళ జన్మించినాఁడు యిదె కృష్ణుడు ॥శ్రావ॥

హరవిరించాదులకు నాదిమూలకారణము
పరమమునుల తప:ఫలసారము
గరుడోరగేంద్రులకుఁ గలిగిన నిధానము
యిరవుగా నుదయించె నిదె కృష్ణుఁడు ॥శ్రావ॥

బలుయోగీశ్వరుల బ్రహ్మానందము
చెలఁగు భాగవతుల చింతామణి
అలమేల్మంగకుఁ బతి యట్టె శ్రీవేంకటాద్రి
నిలపై జన్మించినాఁడు యిదె కృష్ణుఁడు ॥శ్రావ॥139

అవతారిక:

ఒకానొక కృష్ణజయంతి సందర్భంగా అన్నమాచార్యులవారు వినిపించిన మధుర కీర్తన ఇది. శ్రావణ బహుళ అష్టమినాడు శ్రీమన్నారాయణుడే అర్ధరాత్రి కంసుని చెరసాలలో దేవకీదేవి గర్భమున అష్టమునిగా జన్మించాడు. అసంఖ్యాకంగా దానవులను, దానవాంశముతో జన్మించిన దుష్టరాజలోకమును యమపురికంపాడు. ప్రజలు యెంత ఆనందించారంటే నేటికి అది జరిగి 5241 సంవత్సరాలైనా, దేశమంతటా

మహోత్సవంగా శ్రీకృష్ణజయంతిని జరుపుకొంటున్నారు. నేటికీ ప్రపంచం నలుమూలలా ఇటువంటి కీర్తనలు పాడుతూనే వున్నారు.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఈరోజు శ్రావణ బహుళ అష్టమి. నేడే శ్రీకృష్ణ జయంతి. ఇదిగో ఈయనే శ్రీకృష్ణుడు. ఈదేవదేవుని సేవించరో! (సేవించి తరించండి). ఈతడు అందరికీ అన్నీ అయినా, కొందరికి వారు కోరినట్లే కోర్కెలను తీర్చాడు.

వసుదేవుడు ఆయన కన్నతండ్రి. వసుదేవుని భావనకు తగినట్లే ఆయన పాలిటి భాగ్యదేవతయై అంత్యమున మోక్షం ప్రసాదించాడు. తల్లి దేవకీదేవి కడుపున జన్మించిన దివ్యరత్నము. సామర్థ్యంతో దేవతలనందరినీ అడుగడుగునా రక్షించిన కల్పవృక్షము ఈ శ్రీకృష్ణుడు. ఇదిగో ఈవేళ ఆయన జన్మించినాడు. పండుగ జరుపుకోండి.

ఈ శ్రీకృష్ణపరమాత్మ త్రిమూర్తులకు మూలకారణము. హరునికి లయము, విరించికి (బ్రహ్మదేవునికి) సృష్టి, విష్ణువునకు స్థితి (లోకపాలన) బాధ్యతలను వొప్పగించినది ఈయనే. పరమ మునీశ్వరుల తప:ఫలము యొక్క సారము ఈ భగవంతుడే. గరుత్మంతునికి, ఉరగేంద్రునకు (ఆదిశేషునికీ) ఈయన కలిగిన నిధానము (పెన్నిధివంటి వాడు). ఇదిగో నేడు ఇరవుగా (సుస్థిరముగా) ఈ శ్రీకృష్ణుడు వుదయించినాడు.

ఈయన బలుయోగీశ్వరులకు (గొప్పతపోబలం కలిగిన యోగీశ్వరులకు) బ్రహ్మానంద స్వరూపుడు. వారు ఆయనను ఆనందస్వరూపునిగానే భావిస్తారు. భాగవతులకు (భగవంతునే నమ్మినవారికి) చింతామణివలె కోరిన కోర్కెలన్నీ తీరుస్తాడు. దేవి అలమేల్మంగకు ఈయన ప్రాణవల్లభుడు. ఇలపై శ్రీవేంకటాద్రిని ఇదే కృష్ణుడు శ్రీవేంకటేశ్వరుడై అవతరించాడు. సేవించి తరించండయ్యా!

సంపుటి: 2 కీర్తన : శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
సంఖ్య : 347 పుట : 233 రాగం: సాళంగనాట

సాళంగనాట

36. శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్యధురంధరా ॥ పల్లవి॥

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప
అనుపమలంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపురనివాస ॥శర॥

రవితనయసచివ రావణవనాపహార
పవనవేగబలాఢ్య భక్త సులభ
భువనపూర్ణదేహా బుద్ధివిశారద
జవసత్వ వేగ కలశాపురనివాస ॥శర॥

సీతాకోకనాశన సంజీవశైలాకర్షణ
ఆతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవేంకటేశుకరుణాసమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస ॥శర॥347

అవతారిక:

కలశాపురంలో వెలసిన హనుమంతుని కీర్తిస్తున్న అన్నమా –చార్యులవారు ఆవేద శాస్త్ర నిపుణుని శరణువేడుతున్నారు అన్నమయ్య వుపయోగించే విశేషణాలు మరెక్కడా విని వుండరు. ఇది చూడండి... అరుదైన రామకార్యధురంధరుడట ఆ స్వామి గతంలో నేనుకూడా ఈమాటను దురంధరుడుగా భావించి ఆ మాట అర్థం తెలియక చేతులెత్తేశాను. ఇది ముద్రారాక్షస ప్రభావం. నేడు అది 'ధురంధరుడు'

అని గ్రహించాను. ధురంధరుడు అంటే భారము వహించినవాడని అర్థం. శాతకుంభము అంటే బంగారపు కుండ. ఆ రంగులో వున్న ఆ స్వామి శ్రీవేంకటేశ్వరుని కరుణాసమేతుడట. ధన్యోస్మి.

భావ వివరణ:

ఓ హనుమంతరాయా! వేదశాస్త్రమునందు అద్వితీయుడా! బహు అరుదైన రామకార్య ధురంధరా! (శ్రీరామకార్య భారమును వహించిన వాడా!) నీకు శరణు తండ్రీ! శరణు.

ఓ హనుమంతరాయా! అంజనీదేవి పుత్రుడవైన నీవు వాయుదేవుని సుతుడవు. దివ్య కామరూపివి (ఏ రూపము కావలెనంటే ఆ రూపం పొందగలిగిన అద్భుతమహిమ గలవాడవు.) అనుపమ లంకా దహనుడవు (పోలిక చెప్పలేని లంకానగరమును కాల్చిబూడిద చేసినవాడవు). వార్ధి లంఘనుడవు (సముద్రమును దుమికి దాటిన దిట్టవు). ఓ కలశాపురి నివాసా! నీవు జనసురనుతుడవు ప్రజలచేతను దేవతల చేతను కీర్తింపబడు మహానుభావుడవు.

ఓ దేవా! నీవు రవితనయ సచివుడవు (సూర్యుని కుమారుడైన సుగ్రీవునికి మంత్రివి). రావణునికి అత్యంత ప్రీతిపాత్రమైన అశోకవనము యొక్క అపహారా! (వైభవమును తగ్గించిన వాడా!) జంఝామారుత వేగముకల బలశాలీ! నీవు భక్తసులభుడవు (నీ భక్తులను తేలికగా అనుగ్రహించు దేవుడవు). విశ్వమంతా నిండిపోగలిగిన దేహము పొందిన, బుద్ధి విశారదుడవు (మిక్కిలి బుద్ధిశాలివి). ఓ కలశాపురి నివాసా! నీవు జవసత్వ వేగము కలవాడవు (గొప్ప వేగము కల గుఱ్ఱమునకున్న వేగము కలవాడవు).

ఓ ప్రభూ! నీవు సీతాదేవి శోకమును తుదముట్టించినవాడవు. సంజీవనీ పర్వతమును పెకలించితెచ్చినవాడవు. ఆతతప్రతాపశౌర్యుడవు (విరివియైన ప్రతాపము, శూరత్వము కలవాడవు). రాక్షసాంతక కౌతుక (రాక్షసులను అంతమొందించుటకు కుతూహలము కలవాడవు. శ్రీవేంకటేశ్వరుని కరుణ కలవాడవు. ఓ కలశాపురి నివాసా! నీవు శాతకుంభవర్ణుడవు (బంగారపు కుండ రంగుకల) దివ్యతేజోమూర్తివి.

సంపుటి: 2 కీర్తన : నాటికి నాడు గొత్తనేటికి నేడు గొత్త
సంఖ్య : 85 పుట : 57 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

37. నాటికి నాఁడుగొత్త నేటికి నేఁడుగొత్త
నాటకపుదైవమవు నమో నమో ॥ పల్లవి॥

సిరుల రుక్మాంగదుచేతికత్తిధారఁ దొల్లి
వరుస ధర్మాంగదుపై వనమాలాయె
హరి నీ కృపకలిమి నట్లనే అరులచే
కరిఖడ్గధార నాకుఁ గలువదండాయె ॥నాఁటి॥

మునుపు హరిశ్చంద్రు మొనకత్తిధారఁ దొల్లి
పొనిగి చంద్రమతికిఁ బూవు దండాయె
వనజాక్ష నీ కృపను వరశత్రు లెత్తినట్టి
ఘనఖడ్గధార నాకుఁ గస్తూరివాటాయ ॥నాఁటి॥

చలపట్టి కరిరాజు శరణంటే విచ్చేసి
కలుషముఁ బెడఁబాపి కాచినట్టు
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియుఁ బాపి
యిల నన్నుఁ గాచినది యెన్నఁ గతలాయ ॥నాఁటి॥85

అవతారిక:

చక్కటి పురాణగాథలను ప్రస్తావించే ప్రశస్తమైన కీర్తన నాస్వాదించండి. అన్నమాచార్యుల పురాణ పాండిత్యం అబ్బురపరుస్తుంది. పల్లవి కూడా అంత తేలికగా అర్థంకాని అర్థకత్వం నాబోంట్లది. ఎంతో పరిశ్రమతో ఒక కొలిక్కితేగలిగాను. స్వామీ! నీవు నాటకపు దైవమవు. జగన్నాటక సూత్రధారివి. నీ లీలలన్నీ వింతలే. అవి నాటికి నాడే కొత్త అంటే, నిన్నటికి నిన్నయే కొత్తగా వుంటాయి. నేటికి నేడు గొత్త అంటే ఈరోజుకి ఈరోజే కొత్తగావుంటాయి. మొత్తానికి ఎప్పటికప్పుడే నూతనంగా వుంటాయి. అటువంటి నీకు నమోనమో అంటున్నారు. ఆవైనం వుదాహరించటానికి రుక్మాంగద, ధర్మాంగదుల కథ; హరిశ్చంద్ర, చంద్రమతుల గాథ,

గజేంద్రమోక్షము కథ ప్రస్తావిస్తున్నారు. అందుకే శ్రీవేంకటేశా! ఆపదలగాచే నీ కథలు కర్ణపేయమైనవి.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు నాటకపు దేవుడవు (జగన్నాటక సూత్రధారివి). నీలీలలు యెరుంగరానివి. అవి, నాటికి నాడే గొత్త (ఆరోజుకారోజే నూతనంగా వుంటాయి). నేటికి నేడే గొత్త (ఇవ్వాళకివ్వాళ నూతనంగా వుంటాయి). అట్టి నీకు నమోనమో (అనేక వందనములు).

నీ భక్తుడైన రుక్మాంగద మహారాజు కర్తవ్య పాలనలో తనబిడ్డడైన ధర్మాంగదుని శిరచ్ఛేదనకు సిద్ధపడ్డాడు. నీ భక్తుల ధర్మ నిరతి నిన్నెంత ఆనందింపజేస్తుందంటే, 'ఆ ఖడ్గధార' (కత్తిపదునైన అంచు) నీ మహిమవల్ల చక్కటి వనమాల (తులసిదండ) అయింది. అట్లనే (ఆవిధంగానే) నీకృప అనే కలిమిని పొందిన నాకు కరఖడ్గధార కూడా కలువదండ వలె మారిపోయి నన్ను రక్షిస్తుంది. సందేహం లేదు.

(అన్నమయ్య శివకేశవులకు భేదము లేదని నమ్మినవాడు అనుటకు ఈ కీర్తన వుదాహరణ. హరిశ్చంద్రుని కథలో శివుని లీలనే ఇక్కడ విష్ణుమాయగా అభివర్ణించుచున్నారు. నిజానికి అదే నిజము. అవునా?)

మునుపు (తొల్ల) హరిశ్చంద్రుని సత్యసంధతను జగతికి నిరూపించుటకు విశ్వామిత్రుడు అనేక ఇక్కట్లుపాలు చేశాడు. సుతుడు మరణించినా, భార్య తల రాజాజ్ఞచే ఖండించవలసివచ్చినా హరిశ్చంద్రుడు వెనకాడలేదు. భగవత్ కృపవల్ల హరిశ్చంద్రుని మొనకత్తిధార (పదునైన కత్తి) పూవులదండవలె మారిపోయింది. ఓ పద్మనయనా! నీ కరుణ వుంటే నా శత్రువుల కరవాలములు కూడా నాకు కస్తూరి వాటాయె (కస్తూరిపూతలవుతాయి).

ఆనాడు వనములో గజేంద్రుడు చలపట్టి (మాత్సర్యము విడనాడి) నీవే తప్ప ఇత:పరంబెరుగను రక్షించు శరణు అని (మొరబెట్టుకొంటే) విచ్చేసి, కలుషము బెడబాపావు (వాని పీడను తొలగించావు). మకరి శిరస్సు ఖండించి కరిరాజవరదుడవైనావు. ఆవిధంగా అలరిన (వికసించిన) ఓ శ్రీవేంకటేశ్వరా! నా ఆపదలన్నింటినీ తొలగించి ఇక్కడ నన్నున్ గాచినది (రక్షించుటకూడా) ఎన్నన్ కతలాయె (ఎన్నికగన్న కథలైనవి) తండ్రీ!

సంపుటి: 4 కీర్తన : వొద్దు నీవు నా కెదురా వోరి కంసుడా
సంఖ్య : 110 పుట : 74 రాగం: నాట

నాట

38. వొద్దు నీవు నా కెదురా వోరి కంసుఁడా
కొద్దిగాదు పెనఁగఁగ గోవిందుతోఁ గంసుఁడా ॥ పల్లవి॥

పెరిఁగీ రేపల్లె నదె బిరుదు నీ వైరివాఁడే
వొరసి నన్నేల పట్టేవోరి కంసుఁడా
విరసాన వెరవను విష్ణునిమాయను నీ
గొరబైన వెడబుద్ధి గొలుపదు వోరా ॥వొద్దు॥

వెదకీ నీ వైరివాఁడె వీరదానవుల నదె
వుదుటు నాతోనేల వోరి కంసుఁడా
నిదుమనా నిన్నిపుడే సెలవీఁడుగా కతఁడు
పెదవులచేటింతే పేదవానికోపము ॥వొద్దు॥

వెన్నలుఁ బాలరగించి వెస వాఁడె సత్వగూడ
నున్న వాఁడు నిన్ను గెల్వ నోరి కంసుఁడా
వెన్నుఁడు శ్రీవేంకటాద్రివిభుఁడు లోకులఁ గాచె
నన్నిటాఁ గృష్ణావతార మందఁబట్టి నేఁడు ॥వొద్దు॥110

అవతారిక:

దేవకీదేవికి పుట్టిన శిశువును చంపబోయాడు కంసుడు. సంహరించేముందు "ఒరే గోవిందుడు వేరొకచోట పెరుగుతున్నవాడురా! కొద్దిగాదు వానితో పెనగుట. వొద్దు నీవు నాకెదురు నిలబడగలవా?" అని హెచ్చరించింది, శిశువురూపంలో వున్న యెగమాయ. ఆ హెచ్చరికనే ఒక కీర్తన రూపంలో ఆవిష్కరిస్తున్నారు అన్నమాచార్యులవారు. "నభూతో నభవిష్యతి", ఇది అన్యులవల్ల అయ్యేపని కాదయ్యా అన్నమయా!" బాగా

వెన్నా, పాలూ ఆరగించివాడు సత్వ పెంచుకొని నిన్నుగెల్వటానికి వస్తాడురా! వాడు వెన్నుడైన వేంకటేశ్వరుడురా! లోకములను గాచేందుకు కృష్ణావతారమెత్తాడు కాబట్టి జాగ్రత్త!" అని యోగమా(య) కీర్తనపాడటం వూహించను కూడా సాధ్యం కాదు. ఆనందం మీదే... జుర్రుకోండి.

భావ వివరణ:

ఓరీ! కంసుడా! వొద్దు నీవు నాకెదురా (నన్నెదిరించగలవుటరా?) గోవిందుతో పెనగగ (కృష్ణునితో తలబడుట) కొద్దిగాదు (సామాన్యమైనది కాదురా!)

నీవైరివాడే (నీశత్రువైన ఆకృష్ణయ్యే) అదిగో రేపల్లెలో బిరుదు పెరిగీ (శ్రేష్ఠుడై పెరుగుతున్నాడురా). ఒరే! కంసుడా! నన్నేల వొరసి పట్టేవు (నన్నెందుకు బిగించిపట్టుకుంటావురా!) నేను శ్రీమహావిష్ణువుయొక్క యోగమాయనురా! నీ విరసాలకు (బెదిరింపులకు) వెరువను (భయపడతానుటరా!) నీ గొరబైన వెడబుద్ధి (నీ వికారం కలిగించే వంకరబుద్ధి చేష్టలు) గొలుపదు (నీకు మంచి చేయదు). ఇదే హెచ్చరిక.

నీ శత్రువైన ఆ కృష్ణుడు వీరులైన దానవుల నందరినీ, వెదకి వెదకి మట్టుబెడతాడు. నీ ఉదుటు నాతోనేలరా? (నీ గొప్పలు నాముందు యెందుకురా?) అతడు (ఆ శ్రీమన్నారాయణుడు) నాకు సెలవీడుగా (అనుమతించడు కదటరా!) లేకుంటే... నిన్నిప్పుడే చిదుమనా (చిదిమి పారేసేస్తాను. ఏమనుకొన్నావో! జాగ్రత్త!) ఒరే! పేదవాని కోపం పెదవికి చేటు అనే సామెతను వినలేదా? నీకోపం ఆ దేవదేవునేమి చేస్తుందిరా? మూర్ఖా!

వాడే (ఆబాలకృష్ణుడే) రేపల్లెలో వెన్నలు, పాలు సత్వగూడ (బలం పెంచుకోవటానికి) ఆరగించనున్నవాడు. ఓరి కంసా! వాడు నిన్ను గెల్వనున్నాడురా!. ఎందుకంటే నేడు వాడు వెన్నుడైన (విష్ణుమూర్తియైన) శ్రీవేంకదాద్రివిభుడు. అన్నిటా (అన్నివిధములా) లోకములను కాచే (సంరక్షించే) కృష్ణావతారమును అందబట్టి (యెత్తాడు కాబట్టి) నీపని గోవింద... అంతే.

సంపుటి: 3 కీర్తన : చేరి యందెలమోతతో చెన్నకేశవా
సంఖ్య : 179 పుట : 120 రాగం: పాడి

పాడి

39. చేరి యందెలమోఁతతో చెన్నకేశవా
యీరీతి మూడువపూరిలో నిట్లాడేవా. ।। పల్లవి।।

మున్ను యశోదవద్దను ముదు గునిశాడితివి
పన్ని రేపల్లె వీధులఁ బారాడితివి
పిన్నవై గోపాలులతోఁ బిల్లదీపులాడితివి
యెన్నిక మాఁడుపూరిలో యిట్లాడేవా ।।చేరి।।

కాళింగుపడిగెలపై కడునాట్యమాడితివి
కేలి యమునలో రాసక్రీడ లాడితి
చేలలంటి గోపికల చెట్టపట్టాలాడితివి
యీలీల మూఁడు పూరిలో యిట్లాడేవా ।।చేరి।।

తగువిభాండకునితో దాఁగిలి ముచ్చలాడితి
అగడుగా బండివిరిచాటలాడితి
వొగి శ్రీవేంకటగిరినుండి వచ్చి మాఁడుపూర
నెగసెగసి గతుల కిటులాడేవా(?) ।।చేరి।। 179

అవతారిక:

'మాడుపూరు' అనేగ్రామమున వెలసిన చెన్నకేశ్వరస్వామి మీద చక్కటి భక్తి పూర్వకమైన కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. చెన్నకేశవుడు అంటే... అందమైన కేశపాశము కలవాడని అర్థం. కాలి అందియలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతుంటే... ఈవిధంగా మాడుపూరిలో ఆడుకొంటున్నావా స్వామీ! అని పాడుతున్నారు. యశోదమ్మ దగ్గర ముద్దులు కుడిచావు, గోపాలురతో ఆటలాడావు, కాళింగుని పడిగెలమీద నృత్యం చేశావు, గోపికలతో చెట్టాపట్టాలాడినావు, విభాండకునితో దాగిలి ముచ్చలాడావు, శకటాసురుని సంహరించావు. నేడు ఆ శ్రీ వేంకటగిరి

నుండి వచ్చి మాడుపూరులో నెగనెగసి గతుల కిటులనాడేవు అంటున్నారు. అంటే...?

భావ వివరణ:

ఓచెన్నకేశవా! యీవిధముగా మాడుపూరుగ్రామమున చేరి, అందెలు (కాలిగజ్జెలు) మ్రోగుతుంటే, ఇట్లు ఆడేవా ప్రభూ!

మున్ను (ఇదివరలో) నీతల్లి యశోదాదేవి వద్ద ముద్దు గునిశి ఆడితివి (ముద్దులు కుడిచి ఆడినావు). పన్ని (పూనుకొని) రేపల్లె వీధులలో పారాడినావు. అందరిలోకీ చిన్నపిల్లవాడివైనా తోటి గోపబాలురతో సమవుజ్జీగా పిల్లదీపులు అనే ఆటను ఆడితివి. ఈ ఆటలో ఒంగివున్న ఒకరి మెడపైనుంచి ఇంకొకరు కాలు తగులకుండా దుముకవలెను). ఓ దేవదేవా! ఏమయ్యా నీలీల! అనామకులైన నీభక్తులను మోసినావా! మాడుపూరిని ఎన్నికజేసి ఇట్లు ఆడితివా!

ఆనాడు యమునా నదిని విషపూరితం చేసి ప్రాణులనందరినీ చంపుతున్న కాళింగుడనే సర్పరాజుకు బుద్ధి చెప్పాలని, వాని పడిగెలపై నృత్యం చేసి రక్తం కక్కుకొనునట్లుచేసి, వాని భార్యల దీనశరణాగతిని మన్నించి క్షమించావు. ఆ యమునానదిలోనే ప్రియురాండ్రయిన గోపికల చేలలంటి (చీరెలు దొంగిలించి) చెట్టాపట్టాలాడినావు. (ఒకళ్ళ భుజాలపై ఇంకొకళ్ళు తమ చేతులు మెడచుట్టూవేసి దగడ్డరకు తీసికోవటాన్ని, అలాగే కలిసి నడవటాన్ని చెట్టాపట్టాలేసికొనుట - అంటారు) ఈ విధంగా మాడుపూరులో ఇట్లు ఆడినావు స్వామీ!

విభాండకుడనే రాక్షసుడు, తగు గోపబాలునివలె మారిపోయి వారి గుంపులోచేరి కృష్ణుని చంపాలని అనుకొన్నాడు. వాడితో దాగిలి ముచ్చ అనే ఆట ఆడి, కావాలని ఓడిపోయి వారిని మెడపై ఎక్కించుకొని దూరంగాపారిపోయి నేలకేసి కొట్టి చంపేశావు. ఉయ్యాలపాపాయిగా వున్నప్పుడే శకటాసురుని ఒక్కతన్నుతన్ని బండివిరిచి (బండిని ముక్కలు ముక్కలుచేసి) సంహరించావు. నేడు శ్రీవేంకగిరి నుండి మాడుపూరు ఒగివచ్చి (క్రమముగా మాడుపూరు వచ్చి) ఇటుల నెగనెగసి గతుల (ఎగిరెగిరిపడే విధంగా) ఆడేవా (ఆడుచున్నావా తండ్రీ!) ధన్యులము.

సంపుటి: 3 కీర్తన : సీతారమణవో శ్రీరామచంద్ర
సంఖ్య : 157 పుట : 105 రాగం: శంకరాభరణము

శంకరాభరణము

40. సీతారమణ వో శ్రీరామచంద్ర దా
దాత లక్ష్మణుఁడదే తగు రామచంద్ర ॥ పల్లవి॥

చెలువపుసింగారాల శ్రీరామచంద్ర నీ-
సెలవుల నవ్వు గారీ శ్రీరామచంద్ర
చెలఁగీ చెక్కులఁ గళ శ్రీరామచంద్ర
మొలచె మోహనము నీ మోమున రామచంద్ర ॥సీతా॥

చిక్కనిమురిపెముల శ్రీరామచంద్ర
చిక్కులేదు పెద్దకొప్పు శ్రీరామచంద్ర
చిక్కె నీచే మదనుఁడు శ్రీరామచంద్ర
చొక్కపునున్నని మేనిసొంపు రామచంద్ర ॥సీతా॥

చేవదేరినసిగ్గుల శ్రీరామచంద్ర
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీరామచంద్ర
యీవల దాసరిపల్లెనిరవుకొని మీ-
సేవకుల మమ్మునేలే శ్రీరామచంద్ర ॥సీతా॥157

అవతారిక:

దాసరిపల్లె అనుగ్రామములో వెలసిన శ్రీరామచంద్రునిపై చక్కటి భజన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. దాదాత అంటే గట్టివాడు లేక అఖండుడు అని అర్థం. "ఓ సీతాపతీ! రామచంద్రా! అదే నీకు తగిన తమ్ముడు అఖండుడూ అయిన లక్ష్మణుడు", అంటున్నారు. రాముడు

చేవదీరిన సిగ్గులొలకబోస్తున్నాడట. మీసేవకులమైన మమ్ము పరిపాలించుచున్నామయ్యా! అని కీర్తిస్తున్నారు. భజన అవటంచేత క్లిష్ట పదములు తక్కువే వున్నాయి. ఇందులో చాలామాటలు మనం నిత్యజీవితంలో వుపయోగిస్తాము. కాని సరయైన అర్థం తెలిసీ తెలియనట్లుంటుంది.

భావ వివరణ:

సీతారమణుడవు (సీతాపతివి) యైన ఓ శ్రీరామచంద్రా! అదె (అదిగో) నీకు తగినట్టి తమ్ముడు, దాదాత (గట్టివాడు - అఖండుడూ) అయిన లక్ష్మణుడు నీకుడిప్రక్కనే వున్నాడు.

ప్రభూ! నీవు చెలువపు సింగారాల (అందముగా అలంకరింపబడిన) శ్రీరామచంద్రుడవు. సెలవులనవ్వు గారే (లేచిరునవ్వులు వెదజల్లు) శ్రీరామచంద్రమూర్తివి. నీ చెక్కులు (చెక్కిళ్ళు) కళలు చెలగీ (కళలను పెంపొందింపజేస్తున్నాయి) స్వామీ! ఓ శ్రీరామచంద్రా నీమోమున (వదనమున) మోహనము మొలచెను (సౌందర్యము మొలకలెత్తినది.)

ఓ శ్రీరామచంద్రా! నీలో చక్కని మురిపెములు (ప్రోవైన గర్వము... గంభీరమైన రాజసము) తొంగిచూచుచున్నది. ఏమాత్రమూ చిక్కులులేని పెద్దకొప్పును ధరించియున్నావు. మదనుడు (మన్మథుడు) కూడా చిక్కె (నీముందు బలహీనపడిపోతున్నాడు). ఓ శ్రీరామచంద్రా! నీమేని సొంపు (శరీర సౌందర్యం) చొక్కపునున్నది (అత్యంత శోభాయమానంగా వున్నది).

చేవదేరిన (వికసించిన) సిగ్గులు వెదజల్లే ఓ శ్రీరామచంద్రా! నీవు శ్రీవేంకటాద్రిపై వెలసిన దేవదేవుడవు. యీవల (ఇటీవల) దాసరిపల్లె అను ఈ గ్రామమున ఇరవుకొని (వెలసి) నీసేవకులమైన మమ్మున్ యేలేవు (పరిపాలించుచున్నావు). మేము ధన్యులము తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : గెలిచితి భవములు గెలిచితి లోకము
సంఖ్య : 3 పుట : 3 రాగం: సాళంగనాట

సాళంగనాట

41. గెలిచితి భవములు గెలిచితి లోకము
యెలమి నీదాసుల కెదురింక నేది ।। పల్లవి।।

జయ జయ నరసింహా జయ పుండరీకాక్ష
జయ జయ మురహర జయ ముకుంద
భయహరణము మాకుఁ బాపనాశనము
క్రియతోడి నీసంకీర్తన గలిగె ।।గెలి।।

నమో నమో దేవ నమో నాగపర్యంక
నమో వేదమూర్తి నారాయణా
తిమిరి మమ్ముఁ గావఁగ దిక్కయి మాకు నిలువ
జమళిభుజముల శంకుఁజక్రములు గలిగె ।।గెలి।।

రక్ష రక్ష పరమాత్మ రక్ష శ్రీవేంకటపతి
రక్ష రక్ష కమలారమణ పతి
అక్షయసుఖ మియ్యఁగల న(వ?) టు దాపుదండగా
పక్షి వాహనుఁడ నీభక్తి మాకుఁ గలిగె ।।గెలి।। 3

అవతారిక:

మధురాతిమధురమైన భజన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. సాధారణంగా భజనలు స్తోత్రాలు కాబట్టి భావ వివరణకు అంత ప్రాధాన్యత వుండదు. నరసింహునిపైన చెప్పిన దవుటచేత ఆ నృసింహుడే పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు అంటున్నారు. గెలచితి భవములు అంటే ప్రాపంచిక యావను జయించగలిగామని అర్ధం. దాపుదండగా

అక్షయసుఖములనియ్యవయ్యా! అంటున్నారు. ఇదేమాటను నేటి కాలంలో మాకు అండదండవై అంతులేని సుఖమునియ్యవయ్యా! అంటున్నాము మనందరం. అంతే తేడా.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీకృపవల్ల నేను, గెలిచితి భవములు (ప్రాపంచిక యావను జయించగలిగాను). అందుచే జన్మల చక్రబంధం తొలగింది. లోకమునే గెలిచాను. నీదాసులైనవారికి ఈ లోకంలో యెదురేది? నరసింహదేవరా! నీకు జయము జయము. ఓ పుండరీకాక్షా (పద్మనయనా!) నీకు జయము. ముర అను దైత్యుని నిర్జించిన మురాంతకా! నీకు జయమగుగాక! ముకుందమును (కమలమును) చేబూనిన ముకుందా! నీకు జయమగుగాక! మా భయమును హరింపజేసి మాకు పాపమును తుదముట్టించుము స్వామీ! క్రియతో (గొప్ప నిశ్చయముతో) మాకు నీ సంకీర్తనాభాగ్యం కలిగినది.)

ఓ దేవా! నమోనమో (నీకు అనేక వందనములు). ఓ నాగపర్యంకా! (ఆదిశేషుడను నాగుని పరుపువలె కలిగిన స్వామీ!) నీకు వందనము. వేదములే మూర్తీభవించిన ఆదినారాయణుడా! నీకు నమస్కారము. (తిమిరి అంటే నిజానికి తిమ్మిరి అని అర్ధం. తిమురు అంటే త్వరగా అని అర్ధం), మాకు దిక్కువలె త్వరగా మమ్ము రక్షించుటకు నీ జమళిభుజముల యందు (రెండు చేతులయందు) శంఖచక్రములను ధరించియున్నావు.

ఓ పరమాత్మా! రక్షించు. నీవే మాకు రక్ష. ఓ శ్రీవేంకటేశ్వరా! మమ్ము రక్షించు. కమలారమణ (ణి) పతి (లక్ష్మీపతీ!) రక్షరక్ష (రక్షకుడవై మమ్ము ఆదుకో) తండ్రీ! మాకు దాపుదండగ (అండదండగా) అక్షయసుఖము (అంతులేని సుఖము) నందించుటకు నీభక్తి మాకు లభించినది. ఓ పక్షివాహనుడ (గరుత్మంతుని వాహనముగా గల దేవా! నీవే మాకురక్ష.

సంపుటి: 4 కీర్తన : నందకధర నందగోపనందన
సంఖ్య : 66 పుట : 407 రాగం: భూపాళం

భూపాళం

42. నందకధర నందగోపనందన
కందర్పజనక కరుణాత్మన్ ॥ పల్లవి॥

ముకుంద కేశవ మురహర
సకలాధిప పరమేశ్వర దేవేశ
శుకవరద సవితృ సుధాంశులోచన
ప్రకటవిభవ నమో పరమాత్మన్ ॥నంద॥

ధ్రువ పాంచాలీ స్తుతివత్సల మా –
ధవ మధుసూదన ధరణిధరా
భువనత్రయపరిపోషణతత్పర
నవనీతప్రియ నాదాత్మన్ ॥నంద॥

శ్రీమన్ వేంకటశిఖరనివాస మ –
హోమహిమన్ నిఖిలాండపతే
కామితఫలభోగప్రద తే నమో
స్వామిన్ భూమన్ సర్వాత్మన్ ॥నంద॥ 66

అవతారిక:

శ్రీకృష్ణునిపై చక్కటి భజనను గానం చేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది స్తోత్రం అవటంవలన దాదాపు కీర్తన అంతా సరళంగానేవుంది. సవితృసుధాంశు లోచనుడు అంటే సూర్యుడు చంద్రుడు తన రెండు నేత్రములుగాగల విశ్వరూపుడని అర్థం. నాదాత్మన్ అంటే నాదమే ఆత్మగాగల నాదస్వరూపుడైన నారాయణుడని అర్థం. నిఖిలాండపతి అంటే

పెద్ద అండము (గ్రుడ్డు) వలెనున్న విశ్వమునకంతటికీ నాథుడని అర్థం. సంస్కృతం రానివారికి కూడా తేలికగా అర్థమయ్యే కీర్తన ఇది.

భావ వివరణ:

నందకధర! (నందకము అను ఖడ్గమును ధరించిన శ్రీహరీ!) నందగోపుని యొక్క నందనా! (కుమారా!) కందర్ప జనక (మన్మథుని తండ్రివైన స్వామీ!) కరుణాత్మన్ (కరుణాంతంగా!) నీకు వందనములు.

ముకుంద! (పద్మమును చేబూనిన దేవా!) కేశవ! (కేశి అను రాక్షసుని మట్టుబెట్టినవాడా!) మురహర! (ముర అను రాక్షసుని హరించినవాడా!) సకలాధిప! (సకలమునకు అధిపతీ!) పరమేశ్వరా! (సర్వశ్రేష్ఠుడైన ప్రభూ!) దేవేశ! (దేవతలందరికీ అధినాయకా!) శుకవరద (శుకమహర్షికి భాగవత బోధన అను వరమును ప్రసాదించినవాడా!) సవితృసుధాంశులోచనా! (సూర్యుడు, చంద్రుడు తన రెండు కన్నులుగాగలవాడా!) ప్రకటవిభవ! (సృష్టి స్థితి లయములచేత ప్రకటింపబడుచున్న వైభవము కల దేవదేవా!) ఓ పరమాత్మా వందనములు.

ధ్రువునిచేత ద్రౌపది చేత ప్రార్థించబడి కరుణించిన దేవా! మాధవా! (లక్ష్మీపతీ!) మధుసూదన (మధు అను రాక్షసుని చంపినవాడా!) ధరణీధరా! (భూదేవిని స్వీకరించినవాడా!). త్రిభువనములను బాగుగా పోషించుటయందు నైపుణ్యముగలదేవా!) నవనీతం (అప్పుడే తీసిన వెన్న) అంటే ప్రీతిగలవాడా! నాదాత్మన్ (ఓంకారమను నాదమేరూపమైనవాడా!) నీకు నమస్కారములు.

శ్రీవేంకటమను శిఖరమున నెలకొనిన శ్రీవేంకటేశ్వరా! మహామహిమాన్వితా! నిఖిలాండపతీ! (గ్రుడ్డు ఆకారంలోవున్న సమస్త విశ్వమునకు అధిపతీ!) కామితఫలభోగప్రదా! (కోరుకొన్న కోర్కెలను అనుభవించు అనుగ్రహమును మాకు కలిగించునట్టివాడా!) స్వామిన్ (అధిపతీ!) భూమన్ సర్వాత్మన్ (అందరిలో ఆత్మరూపంలోవున్న ఈశ్వరా!) తే నమో (నీకు నమస్కరించుచున్నాను.)

సంపుటి: 4 కీర్తన : కందర్పజనక గరుడగమన
సంఖ్య : 5 పుట : 363 రాగం: బౌళి

బౌళి

43. కందర్పజనక గరుడగమన
నందగోపాత్మజ నమో నమో ॥ పల్లవి॥

వారిధిశయన వామన శ్రీధర
నారసింహ కృష్ణ నమో నమో
నీరజనాభ నిగమగోచర
నారాయణ హరి నమో నమో ॥కంద॥

పరమపురుషా భవవిమోచన
వరద వసుధావధూవర
కరుణాకాంతా కాళిందీరమణ
నరసఖ శౌరీ నమో నమో ॥కంద॥

దానవదమన దామోదర శశి
భానునయన బలభద్రానుజ
దీనరక్షక శ్రీతిరువేంకటేశ
నానాగుణమయ నమో నమో ॥కంద॥ 5

అవతారిక:

తన్మయులను చేయగల భజనను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది కూడా శ్రీకృష్ణపరమాత్మనుద్దేశించి చెప్పినదే కాబోలు. నిగమ గోచరుడు అంటే వేదముల ద్వారా గోచరమగు వాడు అని అర్థం. నానాగుణమయుడంటే అన్నిగుణములు, (మంచివియైనా చెడ్డవి అయినా యెవ్వనిచే జనిస్తున్నాయో ఆ దేవదేవుడని భావించవచ్చును. శశి, భాను నయనుడంటే చంద్రుడు...సూర్యుడు తన రెండు కన్నులుగా గల

విశ్వరూపుడని అర్థం. ఇట్లాంటి మధురమైన భజనలను మనకందించిన అన్నమయ్య ఋణం తీరేదేనా?

భావ వివరణ:

కందర్పజనకా! (మన్మథుని తండ్రీ!) గరుడగమనా! (గరుత్మంతునిపై వెడలువాడా!) నందగోపాత్మజా! (నందగోపుని పుత్రుడా!) నమో నమో (నీకు వందనములు).

వారిధిశయన (పాలజలధిపై పవళించువాడా!) వామనా! (వామనరూపా!) శ్రీధర (లక్ష్మీపతీ!) నారసింహా! శ్రీకృష్ణా! వందనములు. వందనములు. నీరజనాభా! (పద్మము నాభియందుగల శ్రీహరీ!) నిగమగోచర! (వేదముల ద్వారా ప్రకటితమగు దేవదేవా!) ఓ శ్రీమన్నారాయణుడా! శ్రీహరీ! నమస్కారములు అనేక నమస్కారములు.

పరమపురుషా! (పురుషోత్తముడా!) భవవిమోచన (జన్మచే కలిగిన బంధములను తొలగించువాడా!) వరద! (అనుగ్రహించువాడా!) వసుధావధూవర! (ఆదివరాహమై హిరణ్యాక్షుని చంపి, వసుధ అయిన భూకాంతను తన వధువుగా స్వీకరించిన శ్రీహరీ!) కరుణాకాంతా! (కరుణ నిండినవాడా!) కాళిందియను కన్యను తన ధర్మపత్నిగా స్వీకరించిన కృష్ణభగవానుడా! నరసఖ! (అర్జునుని చెలికాడా!) శౌరీ! (శౌర్యవంతుడా!) నీకు వందనములు.

దానవదమనా! (రాక్షసులను తుదముట్టించిన వాడా!) దామోదరా! (తల్లి యశోదచేత రోటికి పొట్టవద్ద త్రాటితో కట్టబడిన శ్రీకృష్ణా!) చంద్రుడు, సూర్యుడూ రెండు నేత్రములుగా గలవాడా! బలరాముని తమ్ముడా! దీనులను రక్షించు శ్రీవేంకటేశ్వరా! సమస్త గుణములకు నిలయమైన జగన్నాథా! నీకు వందనములు. నమోవాకములు.

సంపుటి: 2 కీర్తన: పరమపురుష నిరుపమాన శరణు శరణురే
సంఖ్య : 367 పుట : 247 రాగం: బౌళి

బౌళి

44. పరమపురుష నిరుపమాన శరణు శరణు
రే యేయేయేయే ఇందిరాజమందిరా ॥ పల్లవి॥
కమలనాభ కమలనయన
కమలచరణు (ణ) రే
అమితసురమువినాథ
యూథప నాయకా వరదాయకా ॥పర॥
చతురమూరితి
చతురబాహుశంఖచక్రధరా
అతిశయ శ్రీవేంకటాధిప
ఆంజనాకృతిరంజనా ॥పర॥367

అవతారిక:

గీర్వాణిలో మధురాతి మధురమైన శరణాగతిని వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. చాలా చిన్న కీర్తన అయినా కలకాలం నాలికపై నిలిచిపోగల ఈ కీర్తన శ్రీమన్నారాయణునిపై చెప్పారు అన్నమయ్య. పల్లవిలోని 'శరణు శరణు రే యే యే యే యే" అనే పదమును చూడండి. రే లోని 'ఏ' కారమునకు అనుబంధ స్వరప్రతీకములుగా వుంచినారేమో. ఈకీర్తన ప్రత్యేకత యేమంటే పల్లవి అంతా ఒకటే పాదము చరణములన్నియు రెండేసి పాదములుగా కీర్తన నడుస్తున్నది. అన్నమయ్య పాండిత్యం "అమితసు రమునినాథయాథప నాయక" అనే పదములో తేటతెల్లమవుతున్నది. పోనీ... భావవివరణ చదండి.

భావ వివరణ:

నిరుపమాన (సాటిలేని) పరమపురుషా (పరమాత్ముడా!) శరణువేడుచున్నాను. ఇందిరా (శ్రీమహాలక్ష్మికి) నిజమందిరా (నిజమైన స్థానమైన దేవదేవా!) శరణురే ! (శరణువేడుచున్నాను ప్రభూ!)

ఓ కమలనాభా! నీవు కమలనయనుడవు. నీవు కమలములవంటి పాదములు కలవాడవు. ఓ అమిత సురమునినాథయూథప నాయకా! (అసంఖ్యాకులైన దేవ, మునీశ్వరుల సమూహములకు పతివైన నాయకా!) వరములననుగ్రహించు ఓ దేవా! శరణు.

చతురమూరితి (సాటిలేని చాతుర్యము మూర్తీభవించిన దేవా! ఓ చతురబాహూ! (చతుర్భుజా!) శంఖచక్రములను రెండు చేతులలో ధరించినవాడా! అతిశయించిన (ఎన్నికైన) శ్రీవేంకటేశ్వరా! అంజనాకృతిరంజనా! (అంజనాద్రి నీ శిరస్సు ఆకారమున తన భక్తులను రంజింప చేయుచుండగా ఆ శిఖరాన నెలకొనిన దేవదేవా! నిన్ను శరణు జొచ్చుచున్నాను.

శేషతల్పశాయి బొమ్మ ఫైనల్ పేజీల్లో వస్తుంది

సంపుటి: 2 కీర్తన : శరణు శరణు విభీషణ వరదా
సంఖ్య : 220 పుట : 147 రాగం: సాళంగనాట

సాళంగనాట

45. శరణు శరణు విభీషణవరదా
శరధిబంధన రామ సర్వగుణస్తోమ ॥ పల్లవి॥

మారీచసుబాహుమదమర్దన తాటకాహర
క్రూరేంద్రజిత్తులగుండుగండా
దారుణకుంభకర్ణ దనుజ శిరచ్ఛేదక
వీరప్రతాపరామ విజయాభిరామ ॥శర॥

వాలినిగ్రహ సుగ్రీవరాజ్యస్థాపక
లాలితవానరబల లంకాపహార
పాలితసవనాహల్యపాపవిమోచక
పౌలస్త్యహరణ రామ బహుదివ్యనామ ॥శర॥

శంకరచాపభంజక జానకీమనోహర
పంకజాక్ష సాకేతపట్టణాధీశ
అంకితబిరుద శ్రీవేంకటాద్రినివాస
సోంకారరూప రామ వురుసత్యకామ ॥శర॥ 220

అవతారిక:

శ్రీరామచంద్రునికి శరణాగతిని వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. శరధిబంధనా! అంటే సముద్రమును బంధించి దానిపై వారధిని గట్టిన వాడని అర్థం. సాకేతపట్టణాధీశ అంకిత బిరుద అనేచోట, సాకేతపట్టణాధీశ బిరుదాంకిత అని అన్వయించుకోవాలి అని నా భావన. పౌలస్త్యహరణ అంటే రావణాంతక అని అర్థం. ఉరుసత్యకామ అంటే శ్రేష్ఠమైన సత్యవాక్యపరిపాలకుడని చెప్పవచ్చును. ఓంకార రూపుడంటే

ప్రణవ పరబ్రహ్మ స్వరూపుడని భావిస్తున్నాను. యథాతథంగా ఏ నిఘంటువులోనూ అర్థం తెలియని అనేక ప్రయోగాలున్నాయి ఈ కీర్తనలో.

భావ వివరణ:

విభీషణుని అనుగ్రహించిన శ్రీరామచంద్రా! శరధి బంధన (సాగరమును బంధించి సేతువును నిర్మించిన రామా!) సర్వగుణ స్తోమా! (సర్వసుగుణముల నిలయా!) శరణు. నిన్ను శరణు వేడెదను తండ్రీ!

మారీచ సుబాహులమదమునణచిన శ్రీరామా! నీవు తాటకహరుడవు (తాటకను సంహరించిన వాడవు). క్రూరుడైన ఇంద్రజిత్తు పాలిటి గుండు గండా! (గుదిబండవంటి వాడా!) భయంకరుడైన కుంభకర్ణుడను రాక్షసుని శిరస్తును ఖండించినవాడా! నీవు విజయాభిరాముడవు (విజయకారకుడవైన మనోజ్ఞమూర్తివి).

ఓ శ్రీరామచంద్రా! నీవు వాలినిగ్రహుడవు (వాలిని అణచినవాడవు). సుగ్రీవుని కిష్కిందారాజ్యమున తిరిగి స్థాపించిన వాడవు. వానరబలగములను లాలించినవాడవు (సంరక్షించినవాడవు) లంకాపహారుడవు (లంకను విధ్వంసము చేసినవాడవు). ఓ పాలితసవనా! (యాగసంరక్షకా!) అహల్యా పాపవిమోచకా! (అహల్యపాపమునుండి విముక్తి చేసినవాడా!) నీవు పౌలస్త్య హరణుడవు (పులస్త బ్రహ్మ మనుమడైన రావణాసురిని హరించినవాడవు. ప్రభూ! నీవు ఎన్నో దివ్యనామములుగలవాడవు.

శ్రీరామా! శంకరచాపభంజనా! (శివధనస్సును విరిచినవాడా!) నీవు సాకేతపట్టణమునకు అధినాథుడు అను బిరుదు నీ గుర్తుగా గలవాడవు. నీవే వేంకటాద్రిపై నెలకొన్నవాడవు. ఓంకారస్వరూపుడవు (ప్రణవ పరబ్రహ్మవు). ఉరుసత్యకాముడవు (శ్రేష్ఠమైన సత్యవాక్పరిపాలకుడవు).

సంపుటి: 2 కీర్తన : పరమపురుష హరి పరమ పరాత్పర
సంఖ్య : 453 పుట : 305 రాగం: మలహరి

మలహరి

46. పరమపురుష హరి పరమ పరాత్మపర
పరిపుభంజన పరిపూర్ణ నమో ॥ పల్లవి॥

కమలాపతి కమలనాభ కమలాసనవంద్య
కమలహితానంత కోటిఘనసముదయ తేజా
కమలామలపత్రనేత్ర కమలవైరివర్ణగాత్ర
కమలషట్కయోగీశ్వరహృదయం తేహం నమోనమో(?) ॥పర॥

జలనిధిమథన జలనిధిబంధన జలధిమధ్యశయనా
జలధియంతరవిహార మచ్చకచ్చపయవతారా(?)
జలనిధిజామాత జలనిధిశోషణ జలనిధిసప్తకగమన
జలనిధికారుణ్య నమో తేహం జలనిధిగంభీర నమో నమో ॥పర॥

నగధర నగరిపునందిత నగచర యూథపనాథా
నగపారిజాతహర సారసపన్నగపతిరాజశయన (?)
నగకులవిజయ శ్రీవేంకటనగనాయక భక్తవిధేయా
నగధీరా హం తే సర్వేశ్వర నారాయణ నమో నమో ॥పర॥453

అవతారిక:

పరమపురుషుడైన శ్రీమన్నారాయణునిపై గీర్వాణిలో చక్కటి కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది స్తుతి అయినందువల్ల నారాయణునికి ఆ నామం యెందుకు వచ్చిందో వివరిస్తే రసవత్తరంగానే వుంటుంది కాని స్థలాభావంచేత అదిసాధ్యపడదు. జలనిధి సప్తకగమన అంటే ఏడు సముద్రాలనూ దాటిన వాడని అర్థం. ఎవరు? ఎప్పుడు? ఎలా? ఎందుకు? ఎక్కడ? వివరించాలంటే అదొక ఉపాఖ్యానమవుతుంది. ముందు ఆ కథ తెలియాలి కదా! నగచరయూథపనాథా! కమలషట్క యోగీశ్వరహృదయ లాంటివి కూడా తేలికగా అర్థంకావు. నగపారిజాత అంటే కొండాకాదు, నగలూ కావు. మరేమిటి?

భావ వివరణ:

ఓపరమపురుషా! శ్రీహరీ! పరాత్పరా! (పరమునకే పరమైనవాడా!) దేవదేవా! భిన్నత్వములేని పరిపూర్ణతగలవాడా! పరిపుభంజనా! (దుర్మార్గులైన శత్రువులను తుదముట్టించువాడా!) నమోనమో (వందనములు).

కమలాపతీ! (లక్ష్మీపతీ!) కమలనాభా! కమలాసనుడు (పద్మంలో కూర్చుండు బ్రహ్మచేత కొలువబడువాడా! అనంతకోటి కమలహిత (సూర్యుల) ఘన సముదాయమునకండే తేజస్సుతో ఒప్పువాడా! కమలామలదళనేత్రా! (స్వచ్ఛమైన తామర రేకులవంటి కన్నులు గలవాడా!) కమలవైరి వర్ణగాత్ర! (చంద్రునివంటి శరీరవర్ణము గలవాడా!) కమలషడ్కయోగీశ్వర హృదయ (యోగీశ్వరుల హృదయాలలో షట్చక్రస్వరూపుడవై (కుండలినీ యోగమునకు సంబంధించిన, మూలాధారము మొదలైన ఆరు చక్రముల రూపుడవైవున్న యోగేశ్వరా!) తేహం (అట్టివారికి నేను) నమోనమో (వందనములు చేతును).

జలనిధి మథనా! (సాగరమును మథనము చేయించిన శ్రీమహావిష్ణుదేవా!) జలనిధి బంధన! (సాగరముపై వారధి కట్టించినటువంటి శ్రీరామా!) జలధిమధ్యలో శేషతల్పంపై శయనించు నారాయణా! జలధిలో సంచరించు మత్స్య, కూర్మ రూపములలో అవతరించినవాడా! సాగరుని జామాతా (అల్లుడా!) సాగరమును శోషణ! (ఎండింపచేయదలచిన రామచంద్రా!) జలనిధి సప్తకగమనా! (గురువు సాందీపుని పుత్రుని కోసం సప్త సముద్రములను దాటి చివరికి అతనెక్కడున్నాడో తెలిసికొనిన శ్రీకృష్ణా!) సాగర గంభీరా! నేను నీకు నమస్కరించుచున్నాను.

నగధరా (కొండను వ్రేలిపై యెత్తిన శ్రీకృష్ణా!) నగరిపు నందిత! (కొండల శత్రువైన ఇంద్రుని ఆనందపరచినవాడా!) నగచర (వానర భల్లూకముల) యూథప (సమూహముల అధిపతులగు అంగదుడు, నీలుడు, జాంబవంతుడు వంటి వారికి, నాథా! (నాయకా!), నగపారిజాత హర! (స్వర్గముననున్న పారిజాతమును హరించినవాడా!) సారసపన్నగపతిరాజశయనా! (సముద్రమున సర్వరాజాధిపతియైన ఆదిశేషునిపై శయనించువాడా!) ఏడు కొండలను గెలిచినవాడా! శ్రీవేంకటగిరీంద్రా! భక్తులకు విధేయుడా! సర్వేశ్వరా! నారాయణా! కొండవలె స్థిరధీరుడా! నీకు నా వందనములు.

సంపుటి: 3 కీర్తన : విశ్వమెల్ల నీ విరాడ్రూపము
సంఖ్య : 560 పుట : 356 రాగం: మలహరి

మలహరి

47. విశ్వమెల్ల నీ విరాడ్రూపము
శాశ్వతహరి నీశరణులము ॥ పల్లవి॥

కన్నులఁ సూర్యుఁడు కమలాప్తుఁడు నీ –
పన్నినమోమున బ్రాహ్మణులు
వున్నతివైశ్యులు వూరువులందును
యెన్నఁగ శూద్రులు యిదె పాదముల ॥విశ్వ॥

యింద్రాదిదేవత లీశానబ్రహ్మ ము–
నీంద్రు లంగముల నెసఁగిరదే
సాంద్రలోకములు జఠరంబున నవె
రుంద్రతేజ మదె రోమముల ॥విశ్వ॥

కాలముఁ గర్మముఁ గైవల్యంబును
ఆలోను వెలియు నది నీవు
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర
కోలుముందు నినుఁ గొలిచితిమయ్య ॥విశ్వ॥530

అవతారిక:

విశ్వరూపుడైన విరాట్పురుషుని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. దీనినాస్వాదించి ఆ పరమపురుషుని దర్శించండి. ఏ జన్మసుకృతమో దీనిని వివరించే మహద్భాగ్యం నాకిచ్చాడు ఆ వేంకటరమణుడు. ఇంతకీ 'విరాట్టు' అంటే 'ఆది దేవుడ'ని అర్థం. నిజానికి అనంతమైనా, గొప్ప నిబద్ధత, నియమిత కాలగమనము కలిగిన ఈ విశ్వం ద్వారానే ఆయన ప్రకటించబడుతున్నాడు. ప్రాణరూపంలో జీవకోటిలో ద్యోతక

మవుతున్నాడు. జీవాధారమైన పంచభూతములద్వారా (గాలి, నీరు, సూర్యకాంతి, భూమి, ఆకాశము) భుక్తినిస్తున్నాడు. ప్రాణికోటి పుట్టుకకే కాదు, మనుగడకు, చివరికి చావుకూ, చావు తర్వాత శరీర ఖననానికీ కారణభూతుడౌతున్నాడు. అందుకే అన్నమయ్య "ఈ భూతము జగతినిందరిబట్టె'నన్నారు, ఇదివరలో

భావ వివరణ:

ఓ దేవదేవా! ఈ విశ్వమంతయూ నీ విరాడ్రూపము. (ఆది నారాయణుడవైన నీ విశ్వరూపమే). శాశ్వతుడవైన ఓ శ్రీహరీ! జీవులమైన మేమందరమూ నీ శరణులము (శరణాగతులము) ప్రభూ!

తండ్రీ! నీరెండు కన్నులు పద్మముల మిత్రుడైన సూర్యుడు మరియు రజనీకాంతుడైన చంద్రుడు. నీ విశ్వరూపమున పన్నినమోమున (విరచితమైన నీవదనమున) బ్రాహ్మణులు ఆవరించియున్నారు. అట్లే వైశ్యులు ఊరువులు (తొడలయందును) ఎన్నదగిన శూద్రులు చరణముల వద్దను వున్నతముగా స్థితులైయున్నారు.

ఓ పురాణపురుషా! నీ అంగముల (వివిధ అవయవములలో) ఈశాన (శంకరుడు) బ్రహ్మ (బ్రహ్మదేవుడు), మునీంద్రులు (సప్తఋషులు) ఇంద్రాది దేవతలు, అదే, యెసగిరి (అతిశయించి యున్నారు). సాంద్రలోకములు (దట్టముగా వ్యాపించిన లోకములన్నియు) నీ జఠరమున (నీ కడుపులోనే) కానుపించుచున్నవి. నీ రోమములు (శరీరముననున్న వెంట్రుకలలో) అదే రుంద్ర తేజము (విరివియైన తేజస్సుతో) సమస్త జీవకోటి ద్యోతకమగుచున్నది.

ఓ సర్వేశ్వరా! "కాలము, కర్మము, కైవల్యము" ఆలోను (అనబడు వాటియందు) వెలయునది (విలసిల్లునది) నీవే. కాలము ఇంత నియమబద్ధంగా వుండటానికి, కర్మము తప్పింప నశక్యమైయుండుటకు, కైవల్యము కేవలము ముక్తులకు (సర్వసంగపరిత్యాగులకు) మాత్రమే లభించుటకు నీవే కారణము. ఓ శ్రీకాంతా! శ్రీవేంకటేశ్వరా! కోలుముందు (ముమ్ముందే) నిన్ను కొలిచితిమయ్యా! మమ్ము రక్షింపుము.

సంపుటి: 3 కీర్తన : ఆనంద నిలయ ప్రహ్లాదవరదా
సంఖ్య : 502 పుట : 337 రాగం: బౌళి

బౌళి

48. ఆనందనిలయ ప్రహ్లాదవరదా
భానుశశినేత్ర జయప్రహ్లాదవరదా ॥ పల్లవి॥

పరమపురుష నిత్య ప్రహ్లాదవరదా
హరియచ్యుతానంత ప్రహ్లాదవరదా
పరిపూర్ణ గోవింద ప్రహ్లాదవరదా
భరిత కళ్యాణ గుణ ప్రహ్లాదవరదా ॥ఆనం॥

భవరోగసంహరణ ప్రహ్లాదవరదా
అవిరళ కేశవ ప్రహ్లాదవరదా
పవమాననుతకీర్తి ప్రహ్లాదవరదా
భవపితామహవంద్య ప్రహ్లాదవరదా. ॥ఆనం॥

బలయుక్తనరసింహ ప్రహ్లాదవరదా
లలిత శ్రీవేంకటాద్రి ప్రహ్లాదవరదా
ఫలితకరుణారస ప్రహ్లాదవరదా
బలివంశకారణ ప్రహ్లాదవరదా. ॥ఆనం॥502

అవతారిక:

వైకుంఠం శ్రీమన్నారాయణుడుండే దివ్యలోకము. దానిని పొందాలని ఆశించని హరిభక్తుడుండడు. అక్కడేముంటుంది? ఆనందం పరమానందం, బ్రహ్మానందం అని కూడా దానినే అంటారు. అంతా ఆనందమేవుండే దానినే ఆనందనిలయం అంటారు. ప్రహ్లాదవరదుడైన నృసింహుని ఆనందనిలయుడని కీర్తిస్తున్నారు అన్నమాచార్యులవారు. రవిచంద్రలోచనుడీ ప్రహ్లాదవరదుడంటున్నారు. జయము

పలుకుతున్నారు. మధురమైన ఈ భజనలో పవనసుతవరదుడు శ్రీరాముడు, బలివంశకారణుడైన వామనుడూ, కేశవుడూ, తిరుమలవాసుడూ కూడా ఆ ప్రహ్లాదవరదుడే అంటున్నారు అన్నమయ్య. అదే భక్తి తత్పరతకి పరాకాష్ట.

భావ వివరణ:

ఆనందనిలయుడవైన ఓ ప్రహ్లాదవరదా! నీకు జయమగుగాక! భానుశశినేత్ర! (సూర్యచంద్రులు కన్నులుగాగల) ఓ నరసింహస్వామీ! నీకు జయము పలికెదను ప్రభూ!

స్వామీ! నీవు పరమపురుషుడవు, శ్రీహరివి. చ్యుతి (నాశనము) లేని అచ్యుతడవు. మొదలు – తుది లేని అనంతుడవు. నీకు పరిపూర్ణత తప్ప కొద్దిగా వుండటం అనేదే లేదు. గోవులవంటి సమస్త జీవులను పాలించే గోవిందుడవు. సమస్త కళ్యాణగుణములతో నిండిన దేవదేవుడవు. నీవే ప్రహ్లాదవరదుడవు. అట్టి నీకు జయమగుగాక!

పురాకృతకర్మల వల్ల సంప్రాప్తమయ్యే భవరోగమును అణచగల శక్తి నీకు మాత్రమే వున్నది. నీవు అవిరళమైనవాడవు (విడివడునట్లు చేయలేనివాడవు). కేశవుడవు (కేశి అను దైత్యుని చంపినవాడు శ్రీకృష్ణుడు). పవమాననుతకీర్తివి (ఆంజనేయుని చేత కీర్తింపబడిన శ్రీరాముడవు). పితామహవంద్యుడవు (బ్రహ్మదేవుని చేత కీర్తించబడువాడవు). భవుడవు (శివుడు కూడా నీవే). అట్టి ప్రహ్లాదవరదా! నీకు జయమగుగాక!

ప్రభూ! నీవు అమిత బలశాలివి. (హిరణ్యకశిపుని అమాంతం ఎత్తుకొని గడప మీదకు మోసికొని వెళ్ళాడా నరసింహుడు). శ్రీవేంకటాద్రినున్న లలిత శృంగారరాయుడైన శ్రీవేంకటేశ్వరుడివీ నీవే. కరుణారసము ప్రతిఫలించే ప్రహ్లాదవరదుడవైన కారుణ్యమూర్తివీ నీవే. బలివంశమును రక్షించి పోషించిన త్రివిక్రముడవు నీవే. అట్టి నీకు జయమగుగాక!

సంపుటి: 3 కీర్తన : సౌమిత్రిసహోదర దశరథరామా
సంఖ్య : 499 పుట : 335 రాగం: పాడి

పాడి

49. సౌమిత్రిసహోదర దశరథరామా
చేముంచి గుత్తిలో వెలసినరఘురామా ॥ పల్లవి॥

చెలిమి సుగ్రీవుతోడఁజేసినరామ తొల్లి
శిలనుఁ బడఁతిఁ గావించినరామా
చెలరేఁగిన వానరసేనలరామా
శిలుగుమాయామృగముఁ జించిన రామా ॥సౌమి॥

తరణివంశ తాటకాంతక రామా
నరనాథ కౌసల్యానందన రామా
సిరులఁ బెండ్లాడిన సీతారామా
గరిమతో సేతువుగట్టిన రామా ॥సౌమి॥

రావణాదినుజహరణ రామా
కావించి విభీషణునిఁ గాచినరామా
దీవెన లయోధ్యలోఁ జెందినరామా
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీరామా ॥సౌమి॥ 499

అవతారిక:

గుత్తి పట్టణంలో వెలసిన రఘురాముని మీద రమ్యమైన కీర్తననాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. సౌమిత్రి సహోదరుడవైన దశరథరామా! నీవు గుత్తిలో పూనికతో వెలసినావని కీర్తిస్తున్నారు. తరణివంశము అంటే సూర్యవంశం అని అర్థం. సిలుగు (శిలుగు) మాయామృగము అంటే ఉపద్రవము తెచ్చిన మాయలేడి అని అర్థం. ఇది భజన సాంప్రదాయంలో సాగిన కీర్తనకాబట్టి పరవశించి రామభజన చేసే అదృష్టం మీదే.

భావ వివరణ:

సుమిత్రానందునుడైన సౌమిత్రి లక్ష్మణునికి సోదరుడవైన ఓ దశరథరామా! నీవు చేముంచి (గొప్ప పూనికతో) 'గుత్తి' పట్టణమున వెలసిన రఘురాముడవు. నీకు వందనములు.

స్వామీ! నీవు సుగ్రీవునితో స్నేహముచేసిన రాముడవు. పూర్వము విశ్వామిత్రుని యాగ సంరక్షణకై వెడలినప్పుడు శిలవలెనున్న అహల్యను చైతన్యవంతురాలనుచేసిన రాముడవు నీవే. లంకను ధ్వంసం చేయాలనుకొని చెలరేగిన (విజృంభించిన) వానర సేనలను నడిపించిన రాముడవు నీవే. శిలుగు (సిలుగు – అనగా – ఉపద్రవము తెచ్చిన) మాయలేడివలె వచ్చి మారీచుని, జించిన (చంపిన) ఓ శ్రీరామచంద్రా! నీకు నమోవాకములు. ఓ తరణివంశా! (సూర్యవంశ దీపకా!) నీవు తాటకను అంతమొందించిన రాముడవు. నరనాథుడవు (ప్రజలను సంరక్షించు చక్రవర్తివి). కౌసల్యాదేవి కన్నబిడ్డవు, నీవే. సీతను సిరుల బెండ్లాడిన (వైభవోపేతముగా చేపట్టిన) మా సీతారాముడవు నీవే ప్రభూ ! నీవు గరిమతో (నీటిలో మునిగిపోవలసిన రాళ్ళను నీ మహిమతో తేలునట్లుచేసి) సేతువు గట్టిన (సముద్రముపై వారధిని నిర్మించిన) శ్రీరామచంద్రమూర్తివి. అట్టి నీకు వందనములు.

రావణుడు మొదలైన రాక్షసులను హరించిన శ్రీరామా! నీవు కామించి (కావాలని శరణమునొసగి) అదే రావణుని సోదరుడైన విభీషణుని లంకాధిపతిని చేసి రక్షించావు. అందరి దీవెనలను పొంది అయోధ్యానగరమును పరిపాలించావు. నీవు మరెవరివో కాదు స్వామీ! శ్రీవేంకటాద్రిమీద కలియుగంలో స్థిరపడి మా అందరికి శ్రీవేంకటరామయ్యగారివి నీవే. మేము నీ శరణాగతులము. నీకు మా శతకోటి వందనములు.

సంపుటి: 3 కీర్తన : ఇతరుల నడుగము యితఁడే మాదాత
సంఖ్య : 526 పుట : 353 రాగం: లలిత

లలిత

50. ఇతరుల నడుగము యితఁడే మాదాత
యితనియీవి వొరు లియ్యఁగఁగలరా ॥ పల్లవి॥

దేవదేవుఁ డాదిమపురుషుఁడు హరి
శ్రీవత్సాంకుఁడు చిన్మయుఁడు
యీవల నావల యిలువేలు పతఁడు
భావజగురుఁడు మా పాలిటివాఁడు ॥ఇత॥

జగదేకగురుఁడు శాశ్వతుఁ డచ్యుతుఁ-
డగజకు వరదుఁడు అనంతుఁడు
తగి మము నేలినదైవము యేలిక
నిగమమూర్తి మానిజబంధువుఁడు. ॥ఇత॥

కలిదోషహరుఁడు కైవల్యవిభుఁడు
అలరిన శ్రీవేంకటాధిపుఁడు
చలిమి బలిమి మాజననియు జనకుఁడు
అలమి యితఁడు మాయంతర్యామి. ॥ఇత॥ 526

అవతారిక:

పెట్టేవాడినే యాచించాలి కాని, పెట్టని వాడి ముందు ఎన్నడూ చేయి చాచరాదంటారు పెద్దలు. అదేమాటను చక్కని కీర్తన రూపంలో వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ శ్రీహరి మా అందరి దాత. ఇతని దాతృత్వం ఇంకొకళ్ళకు వుంటుందా? వుండదు గాక వుండదు. అందుకని మేము ఇతరులెవ్వరిని యేమీ అడుగము అంటున్నారు. "చలిమి బలిమి మా జననియు జనకుడు అలమి యితడు మా అంతర్యామి"

అంటున్నారు. బహుశా అన్నమయ్యకాలంలో నేటి 'చెలిమి' చలిమి అని పలికేవారేమో!! 'అలిమి' అనే మాటను నేటికాలంలో అలముకొని అంటున్నాం. మొత్తానికి మధురాతి మధురమైన కీర్తన ఇది.

భావ వివరణ:

జనులారా! ఇతరులనడుగము (మేము పరులను యాచించము). ఇతడే (ఈ శ్రీవేంకటేశ్వరుడే) మా దాత (మాకు దానము చేయగలిగినవాడు). ఇతని ఈవి (త్యాగము) ఇతరులెవరికైనా వుంటుందా?

ఈ శ్రీహరి, దేవదేవుడు (దేవతలందరూ కొలిచే దేవుడు), ఆదిమపురుషుడు (సృష్టి ఆదిలోనే వున్న పరమపురుషుడు), శ్రీవత్సము అనుపేరుగల పుట్టుమచ్చ తన వీపుపై గుర్తుగా వున్నవాడు, చిన్మయుడు (చిదానంద స్వరూపుడు). ఈవల నావల (ఈ మానవలోకంలోనూ, ఆ దేవలోకంలోనూ అతడు ఇలవేలుపు (ఇంటింటా నిత్యము పూజించబడే దేవుడు). భావజగురుడు (భావమునందు మాత్రమే పుట్టుక. మనుగడ కలిగిన మన్మథునికి ఇతడు తండ్రి అంతెందుకు... ఈయన మా పాలిటివాడు (మావంతుగా మాకు దక్కినవాడు).

ఈ శ్రీహరి, జగదేకగురుడు (పతి). శాశ్వతమైనవాడు. చ్యుతి (నాశనము) లేనివాడు. ఈయన అగజకు (పార్వతీదేవికి) వరదుడు (అనేక సందర్భాలలో అండగా నిలిచి కాపాడినాడు). అనంతుడు (తుది అనునది లేనివాడు). మమ్మల్ని తగి (మా అర్హత కొద్దీ) ఏలిన (అనుగ్రహించే) దైవము, మాస్వామియే, ఈయన. ఈ నిగమమూర్తి (వేద స్వరూపుడు) మా నిజబంధువుడు (ఆత్మబంధువు).

ఈయన కలిపురుషుని వలన నరులలో కలిగే దోషములను నిర్మూలిస్తాడు; కైవల్యవిభుడు (ముక్తి నొసగే శక్తి కలవాడు); శ్రీవేంకటాద్రిపై విరాజిల్లే జగన్నాథుడు మాతల్లి, తండ్రీ, చలిమి (స్నేహితుడు) బలిమి (బలము) ఈ శ్రీవేంకటేశ్వరుడే. ఈ మహానుభావుడే, అలమి (మా అణువణువునా ఆక్రమించిన) అంతర్యామి (అంతరాత్మ).

సంపుటి: 3 కీర్తన : కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దువోయ
సంఖ్య : 525 పుట : 353 రాగం: పాడి

పాడి

51. కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దువోయ
వెలుపట నుక్కళాలు వేగుదాఁకా నుండరో ॥ పల్లవి॥

యీపొద్దుకుఁ బోయిరారో ఇంద్రాదిదేవతలు
శ్రీపతి పవ్వళించెను శేషునిమీఁద
తీపులఁబ్రసాద మీరో దేవమునులకునెల్ల
వైపుగఁ దెల్లవారఁగ వత్తురుగాని ॥కొలు॥

పాళెలపట్టుకుఁ బోరో బ్రహ్మరుద్రాదు లిందరు
పాలసముద్రాన హరి పవ్వళించెను
వేళగాదు లోనికిట్టె విచ్చేసె హరి ద్వార –
పాలకులు వాకిళ్ళఁ బదిలము సుండో ॥కొలు॥

గీత మొయ్యనే పాడరో కిన్నరకింపురుషులు
యీతల శ్రీవేంకటేశుఁ డెక్కెను మేడ
ఘాత నెడ నెడ నూడిగకాండ్లు నిలువరో
రాతిరెప్పుడైనా మిమ్ము రమ్మనునో యితఁడు. ॥కొలు॥ 525

అవతారిక:

పైన చెప్పిన ఐదారు కీర్తనలను చూచి ఈ కీర్తనలకి వివరణలు కూడానా... అనుకొనే కొందరు అమాయకుల కోసం ఈ కీర్తన ప్రత్యేకంగా యెన్నుకొన్నాను. "నుక్కళాలు" అనేది ఆనాడు వాడుకలో వున్న రాయలసీమ మాండలీకం. నిఘంటువుల్లో అర్థం దొరకదు. ఈ కీర్తనలో గోవిందుడు నిద్రకుపక్రమించాడు ఈవేళకి, "ఓ ఇంద్రాది దేవతలారా! పోయిరండయ్యా! బ్రహ్మ! రుద్రా! పాళెల పట్టుకబోరో, హరి పాలసముద్రంలో పడుకొంటున్నాడు. ఓ ద్వారపాలకులారా! వాకిలి తలుపులు జాగ్రత్త!" కిన్నెర కింపురుషులు సంగీతమాలపించే దేవతాగణాలు. వాళ్ళని పవ్వళింపు సేవ పాటలు పాడమంటున్నారు.

"రాత్రిపూట ఎప్పుడు ఏ అవసరానికి స్వామిపిలుస్తాడో ఊడికకాండ్లలారా! ఘాత నెడనెడ నిలువరో!" అంటున్నారు. సరిగా అర్థం కాలేదా? మరి భావవివరణ చదవక తప్పదు.

భావ వివరణ:

గోవిందుని కొలువుకి విచ్చేసిన మహామహులారా! చాలా పొద్దుపోయింది. అందరూ వెళ్ళిరాండి. ఇదే కొలువు విరిసె (విడిది అయింది). వెలుపల (బయట) వేగుదాకా (తెల్లవారుదాకా) నుక్కళాలు (పహారా) మొదలుపెట్టి వుండండయ్యా!

ఓ ఇంద్రాది దేవతలారా! ఈ పొద్దుకు (ఈనాటికి) పోయిరాండయ్యా! చూస్తున్నారు కదా! శ్రీహరి ఆదిశేషునిపై పవళించబోతున్నాడు. ఆ చేత్తోనే నారదాది దేవమునులందరికీ తీపుల (మధురమైన ప్రసాదాలు) పంచిపెట్టిండి. అంతా తెల్లవారాక సుప్రభాతసేవకి వత్తురుగానీలే, పదండి.

ఓ బ్రహ్మ రుద్రులారా! పాళెల బట్టుకబోరో! (మీమీ ప్రత్యేక విడిది గృహాలకు వెళ్ళి విశ్రాంతి తీసికోండి). అదిగో క్షీరసాగరమున శ్రీహరి పవళించనున్నాడు. ఇక లోనికి వెళ్లగాదు (ఇక లోపలికి ప్రవేశము లేదు). ఓ శ్రీహరి ద్వారపాలకులారా! వాకిళ్ళబదిలము సుండీ! (వాకిటిలో కాపలా జాగ్రత్త సుమా!)

ఓ కిన్నెర కింపురుషులారా! (వీరు గంధర్వులలో స్పెషలిస్ట్ సింగర్స్... అన్నమాట). మీరు గీతము (పవ్వళింపు సేవలో పాడే జోలపాటలను) ఒయ్యనే పాడరో (శ్రావ్యంగా ఆలపించండయ్యా!). ఇదిగో చూశారా ఈతల (ఇక్కడ) శ్రీవేంకటేశ్వరుడు తన భవనము నెక్కాడు. ఓ ఊడిగకాండ్లూ! (భృత్యులారా!) మిమ్ము రాతిరెప్పుడైనా స్వామి రమ్మనునో (రాండిరా అనిపిలుస్తాడో తెలియదు కదా!) అందుకని, ఘాతల నెడనెడ నిలువరో! (వాకిలి వెలుపల అక్కడక్కడా నిలబడండర్రా! జాగ్రత్త.

(ఇంతకీ ఘాతన్ అంటే ఒక పక్కగా అనే అర్థం. ఎంతో సమన్వయపరచుకొంటేగాని స్ఫురిచదు. మరి అదండీ సంగతి.)

సంపుటి: 3 కీర్తన : రామా దయాపరసీమా అయోధ్యపుర
సంఖ్య : 94 పుట : 63 రాగం: బౌళి

బౌళి

52. రామా దయాపరసీమా అయోధ్యపుర–
ధామా మావంటి వారితప్పులు లోఁగొనవే ॥ పల్లవి॥

అపరాధియైనట్టియాతనితమ్మునినే
కృపఁజూపితివి నీవు కింకలు మాని
తపియించి యమ్ము మొన దారకుఁజిక్కినవాని
నెపానఁ గాచి విడిచి నీవాదరించితివి. ॥రామా॥

సేయరానిద్రోహము సేసినపక్షికి నీవు
పాయక అప్పటి నభయమిచ్చితి
చాయసేసుకొని వుండి స్వామిద్రోహిఁ జెప్పనట్టి–
తోయపుటేటెని మంచితోవనే పెట్టితివి(?) ॥రామా॥

నేరము లెంచవు నీవు నీదయే చూపుదుగాని
బీరపు శరణాగతబిరుద (వు?) నీవు
చేరి నేఁడు నిలుచుండి శ్రీవేంకటాద్రిమీఁదఁ
గోరినవరములెల్లా కొల్ల లొసఁగితివి. ॥రామా॥ 94

అవతారిక:

ఇటువంటి కీర్తనలకు భావ వివరణనిచ్చినప్పుడు గొప్ప క్విజ్ కాంటెస్ట్ గెలిచినంత సంతోషం కలుగుతుంది. పురాణ వాఙ్మయంపైన, తెలుగు భాషపైన యెంత పట్టు వుంటే అంత తేలిక అవుతుంది మీ పని. అన్నమాచార్యుల వారికి జోహార్లు. శ్రీరామచంద్రమూర్తిపై చెప్పిన ఈ కీర్తనలో స్వామిని దయాపరసీమా! అని సంబోధిస్తున్నారు. దయాపారీణుడని భావము. దయయొక్క అంతము దాకా పోయినవాడట. "తోయపుటేటె" అంటే బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. చివరికి

"దారి తప్పిన చిన్నవాడు" అని కూపీ లాగాను. అమ్మయ్య! ఇంతకీ వాడెవడండీ బాబూ! ఆలోచించి పారేయండి.

భావ వివరణ:

ఓ శ్రీరామచంద్రా! దయాపరసీమా! (దయాపారీణా!) అయోధ్యాపురము ధామముగా (నివాసముగా) కలవాడా! మావంటివారి తప్పులు (అపరాధములను) లోగొనవే (నీమనస్సులో పెట్టుకొని మన్నించవయ్యా!) మేమెంత? ఇదివరకు యెంతమంది యెన్ని తప్పులు చేయలేదూ, నీవుయెంత మందిని మన్నించలేదూ? ఆ పట్టిక చెబుతాను వినవయ్యా!

ఆనాడు నీవు కింకలుమాని (అనుమానాలు వదిలిపెట్టి) అపరాధియైనవానియట్టి (నీకు ద్రోహం చేసినవానియొక్క) తమ్ముడిపైననే (రావణుని తమ్ముడైన విభీషణునిపైననే) కృప జూపితివి కదా! ప్రభూ! నీ శరపరంపరకు చిక్కి తపించి తలవంచుకొన్న వానిని, అమ్ములమొనదారకు జిక్కి (నీబాణముల మొనల వర్షానికి చిక్కిన వానిని, నెపములెంచక కాచి (రక్షించి) విడిచిపెట్టి... అలిసిపోయావు నేడు పోయి మళ్ళీ రేపురావయ్యా! అన్నావు. లంకేశ్వరుడైన రావణునీ పాయవు. పాయక (శరణువేడినాడని, త్యజించవు).

సేయరాని ద్రోహము సీతాదేవికి చేసిన పక్షిని క్షమించి, అప్పటినీ అభయమిచ్చితివి (మరల వానికి అభయమునొసంగితివి. (వాడే ఇంద్రుడి పొగరు బట్టిన కొడుకు... కాకాసురుడు అని అంటారు వాడిని). చెప్పనట్టి (చెప్పలేని) స్వామిద్రోహికి, చాయసేసుకొనివుండి (రక్షణ గల్పించి) తోయపుటేటె అనుకొని (దారితప్పిన చిన్నవాడులే అని మన్నించి) మంచితోవనేబెట్టితివి (సన్మార్గుని చేసి గొప్పవానిని చేశావు). సుగ్రీవుడు అని తెలిసింది కదా!

చాలామంది చక్రవర్తులు తమ శత్రువులకు శరణునొసగు సమయమున వారి పూర్వపు నేరములనెంచి దెప్పిపొడుస్తారు. కాని నీవు అట్లా చేయవు. వారిపై కూడా నీ దయనే చూపిస్తావు. అందుకే నీకు పేరుగన్న "శరణాగతత్రాత" అనే గొప్ప బిరుదువున్నది. ఇదిగో నేడు ఈ శ్రీవేంకటాద్రి మీద చేరి ఇట్లా నిలుచుండిపోయి కొల్లలు కొల్లలుగా మేము కోరిన వరములనిచ్చే శ్రీవేంకటేశ్వరుడవైనావు. (ఇది ఇట్లా నాచేత చెప్పించావు. ధన్యోస్మి.)

సంపుటి: 2 కీర్తన : కిన్నజానోఽహం కేశవాత్పర మహో
సంఖ్య : 83 పుట : 56 రాగం: ముఖారి

ముఖారి

53. కిన్నజానేఽ హం కేశవాత్పర మహో
సన్నుతాకర ముమాచరణాయ తస్మై ॥ పల్లవి॥

వేదాంతవేద్యాయ విశ్వరూపాయ నమో
ఆదిమధ్యాంతరహితాధికాయ
భేదాయ పునరప్యభేదాయ నమో నమో
నాదప్రియాయ మమ నాథాయ తస్మై ॥కిన్న॥

పరమపురుషాయ భవబంధహరణాయ నమో
నిరుపమానందాయ నిత్యాయ
దురితదూరాయ కలిదోషవిధ్వస్తాయ
హరియచ్యుతాయ మమ ఆత్మాయ తస్మై ॥కిన్న॥

కాలాత్మకాయ విజకరుణాకరాయ నమో
శ్రీలలామాకుచాశ్రితగుణాయ
హేలాంక శ్రీవేంకటేశాయ నమోనమో
పాలితాఖిల మమాభరణాయ తస్మై ॥కిన్న॥ 83

అవతారిక:

అన్నమాచార్యులవారి కీర్తనలలో ఒక్కొక్కప్పుడు పల్లవి బహు సరళంగా వుంటుంది. ఒక్కొక్కప్పుడు బహు జటిలంగా వుంటుంది. ఇది ఆ రెండవ కోవకు చెందిన సంస్కృత కీర్తన. పంచమీ విభక్తిలోనే నడుస్తుంది కీర్తన

అంతా. "అతని కొఱకు నమస్కరించుచున్నాను, ("తస్మై") ప్రత్యయంతో నడుస్తుంది. పెద్దల సహకారంతో ఈ కీర్తన వివరించగలుగుతున్నాను. నిజంగా, శ్రీమన్నారాయణునిపై చక్కని కీర్తన ఇది.

భావ వివరణ:

మహోన్నతుడునూ, సన్నుతించినవారిని సంరక్షించువాడునూ, నేను అనుసరించదగిన వాడునూ అయిన కేశవునికంటే అన్యునెవరిని ఎరుగను. అతని కొఱకు నమస్కరించుచున్నాను.

వేదాంత వేద్యుడైన బ్రహ్మజ్ఞాని కొఱకు, విశ్వవ్యాప్తుడైన విరాట్ స్వరూపుని కొఱకు, ఆది మధ్యాంతరాహిత్యమును పొందిన వాని కొఱకు, భేదమూ అభేదమూ రెండూ తానే అయిన వాని కొఱకు, నాదప్రియుని కొఱకు, నా ప్రభువైన వానికొఱకు నమస్కారములు.

పరమపురుషుని కొఱకు, జీవుల భవబంధములను సడలించువాని కొఱకు, సాటిలేని ఆనందస్వరూపుని కొఱకు, శాశ్వతుడైనవాని కొఱకు, పాపములను హరించువాని కొఱకు, కలిదోషమును నివారించువాని కొఱకు, హరియునూ అచ్యుతుడునూ అయినవాని కొఱకు, నా ఆత్మస్వరూపుని కొఱకు నమస్కారములు.

కాలస్వరూపుని కొఱకు, కరుణాస్వరూపుని కొఱకు, శ్రీలక్ష్మిస్తనాశ్రిత గుణాసక్తుని కొఱకు, అంతుతెలియని లీలయే తన గుర్తుగా గలవాని కొఱకు, సమస్తమునూ పరిపాలించువానికొఱకు, నాకు ఆభరణము వంటి వాడునూ అయిన శ్రీవేంకటేశ్వరుని కొఱకు నమస్కారములు.

సంపుటి: 3 కీర్తన : అదివో నీప్రతాపము హనుమంతా
సంఖ్య : 500 పుట : 336 రాగం: సాళంగనాట

సాళంగనాట

54. అదివో నీప్రతాపము హనుమంతా
యెదురులేదు నీకు నెక్కడా హనుమంతా. ॥ పల్లవి॥

యెత్తిననీ కుడిహస్త మిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీయెడమచేతిపిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా. ॥అది॥

నలియఁదొక్కిన నీవున్నతపుఁ బాదముకింద–
నలమటించే రరులు హనుమంతా
చలపట్టి నీవు జంగ చాఁచిన పాదహతిని
బలుదానవులు భంగపడిరి హనుమంతా. ॥అది॥

వడి నీవు మీఁదికి వాలమల్లార్చిన
అడఁగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీవేంకటేశు పంపున నీవు గెల్వఁగ
బెడిదమై పొగడేరు పెద్దహనుమంతా. ॥అది॥ 500

అవతారిక:

పెద్దహనుమంతునిపై అన్నమాచార్యులవారు చెప్పిన కీర్తన నాస్వాదించండి. ఇంత చిన్నకోతి తనను జలధి నూరుయోజనాలు దాటించి తన భర్తను చేర్చగలదా! అని శంకించి నవ్వుకొనిన సీతమ్మ శంకను పటాపంచలు చేయటానికి నింగినేలా నిండిపోయేట్లు తనదేహాన్ని పెంచి చూపించాడు హనుమంతుడు. తిరిగి రామకార్యానంతరం రావణుని కలుసుకోవటానికి నానాభీభత్సం సృష్టించాడు. రాక్షసుల్ని

ముప్పుతిప్పలుపెట్టి మూడు చెఱువుల నీళ్ళు తాగించాడు. చేతికందినవాణ్ణి చిదిమేశాడు. ఆ వైనం కీర్తన రూపంలో వినండి. అసురులు, దైత్యులు, దానవులు, రాక్షసులు... అంతా ఒకే జాతికి చెందిన వర్గాలు.

భావ వివరణ:

ఓ హనుమంతుడా! అదిగో, నీ అద్భుత ప్రతాపమునకు యెక్కడా నీకు యెదురు లేనే లేదు స్వామీ!

ఓ హనుమంతా! పైకెత్తియున్న నీ కుడిచేతిని చూచి, ఇల (భూలోకంలోనున్న) అసురులందరూ పాతాళమునకు, హత్తిరి (తగులుకొనిరి). నీ ఎడమ చేతి పిడికిలిని చూచి దైత్యులు తత్తరించి (గాభరాపడిపోయి) చిత్తగించి చిక్కిరదే (వినమ్రులై నీకు వశులయ్యారు).

ఓ హనుమంతుడా! వున్నతమైన నీ పాదము క్రింద నీ అరులను (శత్రుసైన్యమును) నీవు నలియదొక్కిన (నలిగిపోయేట్లు కుమ్మదొక్కివేస్తే) అదిగో యెట్లు అలమటిస్తున్నారో (కుయ్యో! మొఱ్ఱో! అని మొత్తుకొంటున్నారో) చూడు. నీవు చలపట్టి (ఆగ్రహించి) జంగచాచిన పాదహతిని (కాలుచాచి ఒక్కతన్ను తన్నేసరికి) బలుదానవులు (బలవంతులైన దానవులు కూడా భంగపడిరి (ఓడిపోయారు)

ఓ హనుమంతుడా! నీవు పైకిలేపి వేగముగా నీవాలమల్లార్చిన (తోకను అల్లల్లాడిస్తే) రాక్షసులంతా అడగిరి (అణగారిపోయారు). బడినే (అదే క్రమములో) నీవు ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని పంపున (పురమాయింపుపై) గెల్వగా (విజయుడవైతే) పెద్ద హనుమంతుడు ఈ స్వామి అని భక్తులంతా బెడిదము పొగడేరు (అధికముగా కీర్తించుచున్నారు).

సంపుటి: 4 కీర్తన : తథాకురుష్వ ముదా మామద్యేవ
సంఖ్య : 424 పుట : 284 రాగం: లలిత

లలిత

55. తథాకురుష్వ ముదా మామద్యేవ
అధోక్షజస్తే అనుదాసోహం ॥ పల్లవి॥

తవాస్మి శరణం దహరాహం
భవదురితాని భంజ మమ
భువి కృతం చ యా పురా ప్రతిజ్ఞాం
జవన దదామి సర్వేభ్య ఇతి ॥తథా॥

వ్రజామి శరణం వరద తవాహం
త్యజితానుబంధ దర్మ మమ
భుజకృతాం పురా ప్రతిజ్ఞాం
వృజినై ర్మోక్షయిష్యామీతి ॥తథా॥

చింతితం మయా శ్రీవేంకటేశ
కింతు త్వం మయి కృపాంకురు
తంతుహి పురాకృతం ప్రతిజ్ఞాం
అంతగతిం నయామీతి మహి. ॥తథా॥ 424

అవతారిక:

సంస్కృతంలో అద్భుతమైన శరణాగతిని వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అధోక్షజుడైన శ్రీమన్నారాయణుని తనకు సత్వరమే ఆనందం కలిగించమని వేడుకొంటున్నారు. దాసోహం అంటున్నారు. కల్కి భగవానునితో తనను కాపాడమని అర్ధిస్తున్నారు. ధర్మ సంస్థాపనే నీ

ధ్యేయం అనే ప్రతిజ్ఞను పాలించమంటున్నారు. తనను సర్వ కర్మల ఫలితమునుండి విముక్తుని చేయమని ఆ శ్రీవేంకటేశ్వరుని వేడుకొంటున్నారు. డా॥ పవన్ గారి సహాయం యెనలేనిదని మళ్ళీ వారికి కృతజ్ఞతలు చెబుతున్నాను.

భావ వివరణ:

వెనువెంటనే నాకు పరమానందమును ప్రాప్తింపజేయునట్టి దేవదేవా! నీకు నమస్కారములు. అధోక్షజుడవైన నీకు నేను దాసానుదాసుడను.

తొల్లింట నీవు గొప్పవేగము గల శ్వేతాశ్వమునధిరోమించి, పుడమియందుగల సజ్జనులనందరిని కాపాడెదనని ప్రతిజ్ఞ చేసియున్నావు. నేడునా సమస్తపాపములను నివారింపుము ప్రభూ! నేను నిన్ను హృదయపూర్వకముగా శరణువేడుచున్నవాడను.

తొల్లింట, నీవు నీ భుజస్కందములపై గొప్ప బాధ్యతను వేసికొని మాట ఇచ్చియున్నావు. ప్రపంచమున పాపప్రక్షాళనము చేసెదనని వాగ్దానము చేసియున్నావు. నీ ప్రతిజ్ఞను నేడు నిలబెట్టుకొనుము. ధర్మమార్గమును అతిక్రమించినందులకు నన్ను మన్నించి రక్షించుము. నేను నిన్ను దీనుడనై శరణువేడుచున్నాను.

తొల్లింట నీవు నీ శరణాగతులను వారు చేసిన పురాకృతకర్మల ఫలితములనుండి విముక్తులను చేసెదవని ప్రతినపూనియున్నావు. నేడు నీ వాగ్దానమును నిలబెట్టుము. ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్నే సదా ధ్యానించెదను. కాన, నీవు నన్ను తప్పక కృపజూతువుగాక!.

సంపుటి: 3 కీర్తన : చూడ నరుదాయనమ్మ సొరిది నందరికిని
సంఖ్య : 114 పుట : 77 రాగం: లలిత

లలిత

56. చూడ నరుదాయనమ్మ సొరిది నందరికిని
వేడుకతో వచ్చి సేవించేరు బ్రహ్మాదులు ॥ పల్లవి॥

కోరి చంద్రుఁడుదయించ గోకులచంద్రుఁడు వుట్టె-
నేరీతి నీతఁడు నాతఁ డేమౌదురో
వారిధికొడు కతఁడు వారిధియల్లుఁ డీతఁడు
యీరీతి నీతఁ డాతని కేలికాయఁగాని ॥చూడ॥

నల్లనివాఁ డీతఁడాయ తెల్లనివాఁ డతఁడాయ
యెల్ల వారికిఁ జూడ వీరేమౌదురో
అల్లాతఁడే యమృతము అమృతనాథుఁడితఁడు
చల్లనైనహరితోడ సరిగాఁడుగాని ॥చూడ॥

ఆతఁడు పూర్వాద్రిమీఁద నమరెఁ నిందరుఁ జూడ
నీతఁడు శ్రీ వేంకటాద్రి నిరవైనాఁడు
యేతుల వుబ్బుసగ్గులు యిలమీఁద నాతనికి
చైతన్యమెప్పు డీతఁడు సింగారవిభుఁడుగాని. ॥చూడ॥ 114

అవతారిక:

ఓ అమ్మలారా! చూడనరుదాయనమ్మా! ఓ బ్రహ్మాది దేవతలారా! సంతోషంతో మీరంతా వచ్చి ఈ గోకుల చంద్రుడు చిన్నారి కృష్ణయ్యను సేవించుకోండర్రా! ఆకాశంలో వున్న ఆ చంద్రుని చూస్తూనేవున్నారు కదా! ఆయనకీ ఈ కృష్ణయ్యకు పూర్వాపరాలు చెప్పమంటారా? అయితే వినండి అని అద్భుతమైన కీర్తననందుకొన్నారు తాళ్ళపాక అన్నమాచార్యులవారు.

ఇలమీదనాతనికి యేతుల వుబ్బుసగ్గులు. మరి యీతడో సింగారవిభుడూ, చైతన్యమెప్పుడూ.... అంటున్నారు అర్థం కాలేదా? ఆలోచించండి.

భావ వివరణ:

సొరిది (ఆ క్రమములో) అందరికీ చూడనరుదాయనమ్మ (ఈ దేవదేవుని దర్శించుట అందరికీ సాధ్యపడదమ్మా!) మన అదృష్టంకొలదీ బ్రహ్మాది దేవతలే వచ్చి వేడుకతో (సంతోషంతో) ఆయనను సేవించేరు. చూచి తరించండి.

ఆకాశంలో చంద్రుడు ఉదయిస్తుండగా ఈ నేలపై గోకులచంద్రుడు వుట్టె (పుట్టినాడు). మరి వీరిర్వురూ ఏవిధముగా ఒకరికొకరు ఏమవుతారు? అతడు (ఆకాశంలోనున్న ఆయన) వారిధి కొడుకు (క్షీరసాగరునికి పుట్టిన కొడుకు). మరి యీతడు అదే క్షీరసాగరుడు కాళ్ళు కడిగి కూతురునిచ్చిన అల్లుడు ఈ విధముగా ఈతడు ఆతనికి ఏలిక (నాథుడు) అయ్యాడు కదా!

ఇంతేకాదు... ఈయనేమో అందాల నల్లనయ్య. ఆయన పిండివెన్నెలలాగా తెల్లనైనవాడు, ఎల్లవారికైనా (ఎవరికైనా) వీరేమవుతారో కదా! అల్లాతడే (అల్లదిగో ఆకాశంలో వున్న ఆయన అమృతము వంటివాడు (అమృతము తోబుట్టువు కదా!) మరి ఈయన అమృతంతో పాటు పుట్టిన లక్ష్మీదేవికి, అమృతానికి కూడా నాథుడే. చల్లని వాడైన ఈ శ్రీహరితో సమానులెవరయ్యా?

అదిగో ఆ చంద్రుడు పూర్వాద్రినమరె (తూర్పు కొండపై అమరియుంటాడు), ఆయన్ని అందరూ చూచి ఆనందిస్తుంటారు. మరి ఈయనో... శ్రీవేంకటగిరి అనిపిలువబడే కొండపై నెలకొనియుంటాడు. ఇలమీద (ఈ లోకంలో) ఆయనకు యేతుల (ఉద్ధతితో) కూడిన) వుబ్బు సగ్గులు (పెరుగుట తరుగుట) వుంటాయి. మరి ఈ శృంగారరాయనికి? ఎప్పుడూ చైతన్య స్వరూపుడే.

సంపుటి: 4 కీర్తన : త్వమేవ శరణం త్వామేవ మే
సంఖ్య : 41 పుట : 389 రాగం: కన్నడగౌళ

కన్నడగౌళ

57. త్వమేవ శరణం త్వామేవ మే
భ్రమణం ప్రసరతి ఫణీంద్రశయన ॥ పల్లవి॥

కదావా తవ కరుణా మే
సదా దైన్యం సంభవతి
చిదానందం శిథిలయతి
మదాచరణం మధుమథన ॥త్వమే॥

మయా వా తవ మధురగతి (?)
భయాదిక (దిహ?) విభ్రాంతోఽహం
తయా విమలం (?) దాతవ్యా
దయా సతతం ధరణీరమణ ॥త్వమే॥

ఘనం వామమ కలుషమిదం
అనంతమహిమాయతస్యతే
జనార్దన ఇతి సంచరసి
ఘనాద్ఘన వేంకటగిరిరమణ ॥త్వమే॥ 42

అవతారిక:

ఫణీంద్రశయనుడైన శ్రీమన్నారాయణునిపై గీర్వాణిలో మధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. తన స్వకర్మల చేతనే తనాశిస్తున్న చిదానందం శిథిలమైపోతున్నదని వాపోతున్నారు. తన చేష్టల వల్లనే తనాశిస్తున్న మధురానుభవమును కోల్పోతున్నానని దు:ఖిస్తున్నారు.

తనను ఘనమైన పాపపంకిలం నుండి బయట పడవేయమని జనార్దనుని వేడుకొంటున్నారు. ఆఖరి చరణంలోని "ఘనాద్ఘన వేంకటగిరి రమణ" అనే దాంటో "ఘనాద్ఘన" అయివుండవచ్చని నా భావన.

భావ వివరణ:

ఓ ఫణీంద్రశయనా! (ఆదిశేషునిపై పవ్వళించు శ్రీమన్నారాయణుడా!) నీవే నాకు శరణము. నీయందే నా పరిభ్రమణము జరుగుచున్నది.

ఓమధుమథనా! (మధు అనుదైత్యుని వధించిన మధుసూదనా!) నీ కరణ నామీద యెన్నడు సంభవించును? సదా నాకు దీనత్వమే లభించుచున్నది. నా వ్యర్థ కర్మలచేత నా చిదానందము శిథిలమగుచున్నది. నీవు నన్ను అనుగ్రహించి కరుణించుట యెన్నడు సానుకూలమగును ప్రభూ!

ఓ ధరణీరమణా! (భూకాంతుడా!) నా చేష్టల వలన నాకు నీ మధురానుభవము కలుగుట లేదు. అధికమైన భయము నన్ను వివశుని చేయుచున్నది. నిర్మలమైన నీ దయ యెల్లప్పుడునూ నాపై ప్రసరింపజేయుము స్వామీ!

ఓ జనార్దనా! ఘనులకే ఘనుడవైన శ్రీవేంకటేశ్వరా! నా పాపపంకిలము (కలుషితమైన బురదవంటి పాపము) చెప్పనలవి కానంతవున్నది. నీవు అనంత (అంతులేని) దివ్యమహిమలు గలవాడవు కదా! అందుకే నీకై తిరుగుచునే యున్నాను (వెదకుచున్నాను) నన్నుగ్రహింపుము తండ్రీ!

సంపుటి: 4 కీర్తన : పృథులహేమకౌపీనధర:
సంఖ్య : 72 పుట : 409 రాగం: పాడి

పాడి

58. పృథులహేమకౌపీనధర:
ప్రథితవటుర్మే బలం పాతు ॥ పల్లవి॥

సూపాసక్త: శుచిస్సులభ:
కోపవిదూర: కులాధిక:
పాపభంజన: పరాత్పరోయం
గోపాలో మే గుణం పాతు ॥పృథుల॥

తరుణ: ఛత్రీ దండకమండలు
ధర: పవిత్రీ దయాపర:
సురాణాం సంస్తుతిమనోహర:
స్థిరస్సుధీర్మే ధృతిం పాతు ॥పృథుల॥

త్రివిక్రమ: శ్రీతిరువేంకటగిరి
నివాసోయం నిరంతరం
ప్రవిమల మసృణ కబళప్రియోమే
దివానిశాయాం ధియంపాతు ॥పృథుల॥

అవతారిక:

బ్రాహ్మణ వటువును కళ్ళముందు ఆవిష్కరిస్తున్న అన్నమాచార్యుల వారిని అవధరించండి. సంస్కృత కీర్తన అయినందువల్ల కొన్ని చోట్ల భావానికి తగ్గట్లు వివరణలో మార్పులు చేర్పులూ జరిగాయి. పప్పుధప్పళం అంటే ఈ వామనుడికి మరీ ఇష్టంట. ఆ పవిత్రమూర్తిని చూచి సురగణములన్నీ సంస్తుతిస్తున్నాయట. అందరికీ కబళం (అన్నం ముద్ద) పెట్టే ఆ త్రివిక్రముడే, తిరుమల శ్రీవేంకటేశ్వరుడట. అటువంటి స్వామీ!

"మే బలంపాతు" అంటున్నారు. అంటే నాకు బలమును ప్రసాదించుము అని అర్థం. యావత్ జగతికే కబళం పెట్టేవాడు కబళాన్నే యాచించడం వింతల్లోకి వింత కదా!

భావ వివరణ:

పృథుల (శ్రేష్ఠమైన) బంగారు వర్ణముగల కౌపీనము (గోచీ) ధరించినవాడా! పృథితవటుర్మే బలం పాతు (ప్రఖ్యాతిగాంచిన బ్రహ్మచారీ! నాకు బలమును ప్రసాదించుము). ఓ వామనరూపా! నీకు నా వందనములు.

నీవు సూపాసక్త: (ముద్దపప్పు తినుటయందు ప్రీతిగలవాడవు). ఎల్లప్పుడూ శుచిగా వుంటే వారిని సులభముగా అనుగ్రహించువాడవు. కోపతాపములను పరిత్యజించినవాడవు. పరాత్పరుడవు (శ్రేష్ఠులకే శ్రేష్ఠుడవు). గోవులవంటి జీవాత్మలను పాలించు పరమాత్మవు. అట్టి నీవు, 'మే గుణంపాతు' (నా గుణములను పవిత్రీకరింతువు గాక!)

తరుణ: (తరుణవయస్కుడు లేక బాలుడును); గొడుగు, కమండలము, దండములను రెండు చేతులలో ధరించినవాడునూ, పరమ పవిత్రుడును అయిన ఆ వామనుడు అమిత దయాపరుడు. అతడు దేవతలందరి చేత వేనోళ్ళ కీర్తించబడుచున్న మనోహరుడు (శ్రీమన్నారాయణుడు). ఆయన నాకు స్థిరమైన, శ్రేష్ఠమైన బుద్ధిని ప్రసాదించు గాక!

త్రివిక్రముడు (ముల్లోకములను సూదిమొనకూడ పట్టనంతగా వ్యాపించినవాడు) అయిన ఆ దేవదేవుడు శ్రీతిరువేంకటగిరి నిలయుడు. నిరంతరము జీవులకు సునాయాసముగా భుక్తి (ఆహారము) నొసగే ఆయనే భోక్తశ్రేష్ఠుడు. అట్టి భుక్తిప్రధాతా! సర్వభోక్తా! రేయింబవళ్ళు నా బుద్ధిని కాపాడుము తండ్రీ!

సంపుటి: 5 కీర్తన : తవ మాం ద్రష్టుం దయాస్తివా
సంఖ్య : 114 పుట : 78 రాగం: కాంబోది-రచ్చతాళం

కాంబోది - రచ్చతాళం

59. తవ మాం ద్రష్టుం దయాస్తివా
త్రివిధైర్వ్హనాని తే నామాని ॥ పల్లవి॥

కరరమణీ కంకణైర్వ్హనకుచ-
గిరౌ స్థాపిత కిన్నరీయం
సరసం మ్లేచ్ఛరచనాని త్వయి
స్థిరా నదయతి తే నామాని ॥తవ॥

కలవర (రవ) కంపిత కంఠవిలసనం
కిలకిలమేళన కిన్నరీయం
లలనా కావా లంఘితవాద్యం
తిలకయతి తదా తే నామాని ॥తవ॥

నిరత మూర్ఛనా నిబిడతాళరవ
గిరాయోజిత కిన్నరీయం
తరుణీ రణయతి తదా సమీపే
తిరువేంకటవర తే నామాని. ॥తవ॥ 114

అవతారిక:

ఇది జటిలమైన సంస్కృత కీర్తన. వ్రాయసకాండ్రలోపాలేమోగాని కొన్ని చోట్ల స్థూలంగా అర్థం ఊహద్వారా సరిపుచ్చవలసివచ్చింది. కృష్ణయ్య రేపల్లెలోని లీలలను అపార్థం చేసికొనినవారే అధికంగా కనబడతారు. నాస్తికవాదులు, కాంతావ్యామోహం కలవారు, తిరువేంకటేశ్వరుని భక్తులు - ఈ మూడు రకాలవారూ మూడు రకములుగా ఆ దేవదేవుని నామమును పలుకుచున్నారు. అదిగో పులి అని ఒకడు అంటే... ఇదిగో

తోక అని వత్తాసు పాడే మానవులం మేము నిన్ను చులకనగా మాట్లాడితే పోనీలే అని నీవే కరుణించాలి. అట్టి దయ నాపై నీకు వున్నదా లేదా? అని అడుగుతున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

మాంద్రష్టుం, తవదయ... అస్తివా? (నన్ను చూచుటకు నీకు దయవున్నదా? లేదా?) తే నామాని త్రివిధైర్వ్హనాని (నీ నామములు మూడు విధములుగా గొప్పవిగా వున్నవి).

నీహస్తములు, రమణుల కుచగిరులపై నర్తించునపుడు నీ ముంజేతికంకణముల సవ్వడి, కిన్నెరీయం (వీణానాదములను) చేయుచున్నవి. ఇట్టి వర్ణనలతో మ్లేచ్ఛుల (నాస్తికుల) రచనలుగా (కల్పితములుగా) నీనామములు (లీలలు) వినవచ్చుచున్నవి. ఓ దేవదేవా! అట్టి తుచ్ఛమైన రచనల వల్ల నా మనస్సు భ్రష్టుపట్టకుండ నన్ను దయతో స్థిరముగా వుంచి కాపాడుము.

నిన్ను నుతించు స్త్రీల కంఠస్వరములు, కలరవ కంపితములు (హంసధ్వనులవలె కంపిచుచున్నవి). వారి కిలకిల ధ్వనులు కిన్నెరీయం (వీణానాదముల వలె వినవచ్చుచున్నవి). ఆ లలనల (స్త్రీల) రవములు పై వాటి నతిక్రమించే విధముగా వారినోళ్ళతో నీ నామోచ్ఛరణ చేయుచున్నారు. కాని ప్రస్ఫుటించుచున్న నీ నామోచ్ఛరణపై నామనస్సు నిలుచుటలేదు. మరి నీకు నన్ను కరుణించే సమయముమువున్నదా? (అనే నిరంతర అనుమానపీడిత భ్రష్టుడను ప్రభూ!)

తదా సమీపే తరుణీ రణయతి (నీసమీపమున మేమంటే మేమని పోటీపడుతూ స్త్రీలు) నీ నామములను పలుకుచున్నారు. నిరత (ఎల్లప్పుడూ) ఆరోహణ అవరోహణ (పైస్థాయికి పోయి క్రింది స్థాయికి వచ్చునట్లు) యుక్త రాగాలతో, నిబద్ధమైన తాళ రవ యుక్త కీర్తనలతో కిన్నెరీయం (వీణానాదములవలె వినవచ్చుచున్నవి). స్త్రీ సహజమైన చిరుకలహము కూడా వారు నీనామముతోనే చేయుచున్నారు. అట్టి శ్రీవేంకటేశ్వరా! నీకు మాపై దయవున్నదా? లేదా? తండ్రీ! చెప్పవయ్యా! (అనుమానమే మారోగం కదా!)

సంపుటి: 5 కీర్తన : సకలం హేసఖి జానామి తత్
సంఖ్య : 22 పుట : 16 రాగం: నాదరామక్రియ

నాదరామక్రియ

60. సకలం హేసఖి జానామి తత్
ప్రకటవిలాసం పరమం ధధసే ॥ పల్లవి॥

అలికమృగమదమయ మషీకలనో-
జ్జ్వలతాం హేసఖి జానామి
లలితం తవ పల్లవితమనసి ని-
శ్చలతర మేఘుశ్యామం ధధసే ॥సకలం॥

చారుకపోల స్థల కరాంచిత వి-
చారం హేసఖి జానామి
నారాయణ మహినాయకశయనం
శ్రీరమణం తవ చిత్తే ధధసే ॥సకలం॥

ఘనకుచశైలాగ్రస్థిత విధుమణి-
జననం హేసఖి జానామి
కనదురసా వేంకటగిరి పతే-
ర్వినుత భోగసుఖ విభవం ధధసే. ॥సకలం॥ 22

అవతారిక:

బహుళ జనాదరణ పొందిన అన్నమాచార్యులవారి సంస్కృత కీర్తన నవధరించండి. రాధామాధవీయాన్ని జయదేవుడు యెంత మధురంగా చెప్పాడో తాళ్ళపాకవారూ అంత రసభరితంగానే వినిపించారు. ఈ కీర్తనలో రాధతో ఆమె నెచ్చెలి (అన్నమయ్య) చెబుతున్నది. "ఓ సఖీ! నాకు అతనులీలలన్నీ ధరించినవాడని తెలియును. లలాటమున కస్తూరీ

తిలకమును ధరించిన ఆ నల్లనయ్య నీ మనోనాథుడు. నీ అందమైన కపోలములపై కన్నీటి చారికలే కథనంతా చెబుతున్నాయి. ఆ నారాయణుడు నీచిత్తములోనే వున్నాడని నాకు తెలుసు. విచారించకు, నీవు శ్రీవేంకటపతి భోగసుఖమునే పొందుతున్నావు".

భావ వివరణ:

ఓసఖీ! నాకు ఆతని (శ్రీకృష్ణుని) ప్రకటవిలాసము (ప్రకటితములైన లీలలను) ధరించిన వివరము తెలియును.

ఓ సఖీ! ఝుంకారముచేయు గండుతుమ్మెదలను బోలిన నల్లదనమున్న ఆయన లలాటమున (నుదుట) కస్తూరీ తిలకాంచిత వుజ్జ్వల తేజస్సు మెరయుచున్నదని నాకు తెలియును. ఓ సఖీ! నీమృదులమైన, లలితమైన మనస్సునందు నీలమేఘుశ్యాముని నిశ్చలత్వంతో ధరించియున్నావని నాకు తెలియును.

ఓ సఖీ! నీ చారుకపోలస్థలమున (అందమైన చెక్కిళ్ళయందు) విచారగ్రస్తమైన కన్నీటి చారికలున్నవని నాకుతెలియును. ఆయన అహినాయక శయనుడు (పన్నగముల అధిపతి అయిన ఆదిశేషునిపై శయనించు) నారాయణుడని, శ్రీదేవి వల్లభుడని; నీవు ఆయననే నీ చిత్తమున ధరించియున్నావని నాకు తెలియును.

ఓ సఖీ! నీ ఘనకుచశైలాగ్రమున (ఘనస్తనగిరులలో) విదుమణి జననం (చంద్రోదయమైనదని... అది నారాయణుని వదన చంద్రోదయమని) నాకు తెలియును. నీవు ప్రఖ్యాతి చెందిన శ్రీవేంకటపతి యొక్క వినుతభోగసుఖవిభవం (ప్రసిద్ధమైన భోగసుఖపు వైభవమును) ధరించియున్నావు.

సంపుటి: 6 కీర్తన : సదయ మానస సరోజాత మాదృశవశం
సంఖ్య : 162 పుట : 116 రాగం: పాడి

పాడి

61. సదయ మానస సరోజాత మాదృశవశం
వదముదాహం త్వయా వంచనీయా కిమ్ । పల్లవి॥

జలధికన్యా పాంగ చారు విద్యుల్లతా-
వలయ వాగురి కాంత వనకురంగ
లలితభవ దీక్షా విలాస మనసిజబాణ
కులిశపాతై రహం క్షోభణీయా కిమ్ ॥సదయ॥

ధరణీవధూ పయోధర కనకమేదినీ-
ధరశిఖర కేళితత్పర మయూర
పరమ భవదీయ శోభనవదనచంద్రాంశు
తరణికిరణై రహం తాపనీయా కిమ్. ॥సదయ॥

చతురవేంకటనాథ సంభావయసి సం-
ప్రతి యథా తత్ప్రకారం విహాయ
అతిచిర మనాగత్య హంత సంతాపకర
కితవకృత్యై రహం ఖేదనీయా కిమ్. ॥లల ॥

అవతారిక:

ఈకీర్తనలో విశిష్టతయేమంటే అన్నమాచార్యులవారు మన్మథునిపై సవాలు విసురుతున్నారు. హరిదాసులం, మమ్మల్ని క్షోభబెట్టుట నీ తరమౌతుందా? పాపం నారాయణుడు సాగరకన్యకు, నరసింహుడు భిల్లకన్యకు, వరాహస్వామి భూకాంతకు లొంగినట్లు నేను లొంగుతానా?

ఇదిగో నేను నా శ్రీవేంకటేశుని నమ్ముకొన్నాను. నీచేష్టలకు నేను దు:ఖిస్తానాయేమిటి? అని ప్రశ్నిస్తున్నారు. చాలాక్లిష్టమైన కీర్తన ఇది. నేను చెప్పిన వివరణే అన్నమయ్య మనోగతం అని కూడా అనటానికి ఆస్కారం పూర్తిగా లేదు. ఇది నా భావన.

భావ వివరణ:

మానససరోజాత! (మనస్సు అనే సరోవరంలోనే పుట్టుక కలిగిన ఓ మన్మథుడా!) "మాదృశవశం వదముదాహం" (మావంటివారిని అనగా మావంటి హరిదాసులను, వశము చేసికొనుట) నీ తరమా? నీకు అసాధ్యము. నేను క్షోభ జెందుట లేదు ఆనందముగానేయున్నాను.

రమణీయమైన విద్యుల్లతా (ఆకాశంలో తళుక్కున మెరిసే మెరుపుల) వలయములు గల జలధికన్య (క్షీరసాగరకన్య)ను పొందిన వాని (శ్రీమన్నారాయణుని) వలెనూ, వనకురంగము (అడవిజింకను) పట్టుకొను చాకచక్యముగల భిల్లకాంతకు (చెంచులక్ష్మికి) లొంగిన వానిలా (నృసింహుని) వలెనూ, నేను నీయొక్క బాణములకు క్షోభిల్లుతానటరా? ఓ మన్మథా! అట్లెన్నటికీ కాదు.

కనకమేదినీ (బంగారముగల మేదినీకాంతను) ధరించినవాని వలెనూ, భూదేవి పయోధర శిఖరాలలో నర్తించు మయూరము (నెమలి) యైన వానివలెనూ, చంద్రకిరణాల శోభలో కామపీడితుడనగుటకు నేను ధరణీధరునివంటి వాడననుకొన్నావా? (వరాహమూర్తియైన శ్రీహరినా) యేమి? ఓమన్మథా! లేదు. నేనట్లు కాదు.

చతురడవైన ఓ వేంకటనాథా! నీవు యథేచ్ఛగా నన్ను విడిచిపోజూచెదవా? అతి త్వరగా వచ్చి నా క్లేశమును హరింపజేయుము. ఓ మన్మథా! ఆ దేవదేవుడు నా మొరవింటాడు. సంతోషాన్ని కలిగించే నీతుంటరి చేష్టలకు నేను దు:ఖించెదనా యేమి? లేదు. నీకు అది అసాధ్యము.

సంపుటి: 5 కీర్తన : జానామ్యహంతే సరసలీలాం
సంఖ్య : 135 పుట : 92 రాగం: ముఖారి

ముఖారి

62. జానామ్యహంతే సరసలీలాం
నానావిధ కపటనాటక సఖత్వమ్ ॥ పల్లవి॥

కిం కరోమి త్వాం కితవ పరకాంతాన-
ఖాంకురప్రకటన మతీవ కురుషే
శంకాం విసృజ్య మమ సంవ్యాన కర్షణం
కింకారణమిదం తే ఖేలన మిదానీం ॥జానా॥

కిం భాషయసి మాం కృతకమానసతయా
డాంభికతయా విట విడంబయసి కిం
గాంభీర్యమావహసి కాతరత్వేన తవ
సంభోగ చాతుర్య సాదరతయా కిం ॥జానా॥

కిమితి మామనునయసి కృపణ వేంకటశైల-
రమణ భవదభిమతసురతమనుభవ
ప్రమదేన మత్ప్రియం ప్రచురయసి మానహర
మమతయా మదననిర్మాతాన కింత్వం ॥జానా॥135

అవతారిక:

అన్నమాచార్యులవారు ఆవిష్కరించిన శృంగార భక్తినే జయదేవుడు తన అష్టపదులలో అతిమధురంగా వినిపించాడు. రాధామాధవుల శృంగార తరంగిణిలో అసంఖ్యాకులైన శ్రీకృష్ణపరమాత్మ భక్తులు తన్మయులై తరించారు. ఈ అన్నమయ్య సంస్కృత కీర్తన కూడా ఆ కోవకు చెందిన అమృత గుళికయే. ఈ రోజు శ్రావణ బహుళ అష్టమి. ఈ

శ్రీకృష్ణజన్మాష్టమి నాడు ఈ కీర్తన వివరించడం నా అదృష్టం. "నీ సరసలీలలు నానావిధకపటనాటకాలు నాకు బాగుగా తెలియునులే" అంటున్నది నాయిక. నీవు మరీ విటునివలె ప్రవర్తిస్తున్నావని రుసరుసలాడుతోంది. నీఇష్టం వచ్చినదానితో పో నాకేమిటి? అన్నది. ఆఖరికి ఆ వేంకటకృష్ణయ్యను నిలదీసింది నాపై ప్రేమను యెందుకు చూపించవు? అని అడుగుతున్నది. అదండీ సంగతి పాపం!

భావ వివరణ:

"తే సరసలీలాం అహం జానామి" (నీయొక్క సరసలీలలు నాకు తెలుసునులే. నానావిధములైన కపట నాటక సఖత్వమ్ (దొంగనాటకాల చెలిమి, వలపు) నాకు బాగా తెలియునులే. ఇకచాలు.

కృష్ణా! ఇప్పుడు నన్నేంచేయమంటావు? నీ మేనిపై పర కాంతల నఖక్షతాలు కనబడటం లేదూ? ఆ చిహ్నాలు మిక్కుటముగా కనబడుతూనే వున్నాయి కదా! ఒకమాట చెప్పవయ్యా! ఉద్విగ్న భరితమైన, నిశ్శంకావృతమైన ఈ ఆటలు నీకెందులకు?

గోపాలా! కృతకమైన మనస్సుతో నాతో యెందుకు మాట్లాడుతున్నావు? డాంబికముతో నాదగ్గర ఒక విటునివలె యేల ప్రవర్తించుచున్నావు? కపటగాంభీర్యమును జూపి నన్నేల నవ్వులపాలు చేయుచున్నావు? నీసంభోగ చాతుర్యపు సాదరత్వమును యెందుకు లక్ష్యపెట్టకున్నావు?

ఓ శ్రీవేంకట శైల రమణా! ఓ దయారహితా! నన్నేల వ్యర్థముగా వూరడించుచున్నావు? నీ ఇచ్చవచ్చినట్లు యెవ్వరితోనైనా సుఖించు నాకేమి? ఓ మానహరా! కపటముతో నీప్రేమను యేలదాచెదవు? మమతతో కూడిన ఓ మదననిర్మాతా! (మన్మథుని జనకా!) ఆనందముతో నీ నిజమైన ప్రేమను నాపై యేల చూపించవు?

సంపుటి: 3 కీర్తన : కన్నులపండుగలాయ గడపరాయనితేరు
సంఖ్య : 93 పుట : 63 రాగం: సాళంగనాట

సాళంగనాట

63. కన్నులపండుగలాయఁ గడపరాయని తేరు
మిన్ను నేల శృంగారము మితిమీరినట్లు ॥ పల్లవి॥

కదలెఁ గదలె నదె గరుడధ్వజుని తేరు
పొదిగి దేవదుందుభులు మ్రోయఁగా
పదివేలు సూర్యబింబము లుదయించినట్లు
పొదలి మేరువు వచ్చి పొడచూపినట్లు ॥కన్ను॥

వచ్చె వచ్చె నంతనింత వాసుదేవుని తేరు
అచ్చుగ దేవకామిను లాడిపాడఁగా
ముచ్చటతో గరుడఁడు ముండట నిలిచినట్టు
మెచ్చులమెరుఁగులతో మేఘము వాలినట్టు ॥కన్ను॥

తిరిగెఁ దిరిగె నదె దేవదేవోత్తము తేరు
సరుస దేవతలెల్ల జయవెట్టఁగా
విరివిఁ గడపలో శ్రీవేంకటేశుఁడు తేరుపై-
నిరవాయ సింహాసన మిదేయన్నట్లు ॥కన్ను॥ 93

అవతారిక:

దేవునిగడపలో (నేటికడపలో) శ్రీవేంకటేశ్వరుని పూజించి ఆనాటి తిరుమల యాత్రికులు తమ ప్రయాణమారంభించేవారట. కడపరాయనిగా పేరొందిన ఆ దేవదేవుని రథోత్సవం సందర్భంగా అన్నమాచార్యులవారు చెప్పిన చక్కని కీర్తనను అవధరించండి. పదివేల సూర్యులు ఉదయించినంత కాంతితో, స్వర్ణమయమైన మేరు పర్వతం వచ్చి యెదుటనున్నదా అన్నంత దీప్తితో దేవదుందుభులు మ్రోగుతుంటే ఆ గరుడ ధ్వజుని తేరు కదలివస్తున్నదట.

ఎవరో గొప్ప వ్యాఖ్యాత తన నైపుణ్యం కొలదీ వ్యాఖ్యానం (రన్నింగ్ కామెంటరీ) చెబుతున్నట్లు వున్నది కదా! మరి ఆనందించండి. కాకపోతే మీ బాహ్యేంద్రియాలు పనికిరావు. మనోనేత్రం కావాలి.

భావ వివరణ:

ఓ భక్తులారా! అదిగో చూడండి. మిన్ను నేల శృంగారము మితిమీరినట్లు (దివిలోనూ భువిలోనూ వైభవము అవధులు దాటిన విధముగా) కన్నులకు పండుగయైన చందమున కడపరాయని తేరు (రథము) వచ్చుచున్నది.

గరుడధ్వజుడు (గరుత్మంతుడు తన రథపు ధ్వజముపై అంటే (జెండాపై) గల ఆ స్వామి రథము అదిగో కదిలింది... కదిలింది. దేవదుందుభులు (నింగిలోని దేవతల ఢంకలు) పొదిగి (సమూహముగా) మ్రోగుచున్నవి. పదివేల సూర్యబింబములు వుదయించినంత కాంతి మిరుమిట్లు గొలుపుతున్నది. బంగారపు మేరుపర్వతము వచ్చి పొదలి (వర్ధిల్లి) పొడచూపినట్లు (కనబడుతున్నట్లు) ఈ కమనీయదృశ్యం వున్నది.

ఈ వాసుదేవుని రథము అంతనింత వచ్చెవచ్చె (ఎంతో గొప్పగా వస్తోంది... వస్తోంది). దేవకామినులు (అప్సరసలు మొదలైన దేవకాంతలు) అచ్చుగ (చక్కగా) ఆడిపాడుతున్నారు. ఇక స్వామివారు బయలుదేరుతారని గరుడుడు (గరుత్మంతుడు) వచ్చి ముచ్చటగా స్వామి ముందు నిలచినాడు, స్వామి అతనిపై ఎక్కుతుంటే గొప్ప నల్లనిమేఘము కమ్ముకుంటున్నదా... అన్నట్లుంది.

దేవదేవోత్తముడు (దేవతాధిపతులందరికీ యేలిక అయిన... అంటే... ఇంద్రుడు, కుబేరుడు, అశ్వనీదేవతలు మొదలైన నాయకులు అందరికీ దొర అయిన వాడు) యెక్కిన రథము అదిగో ఇటు తిరుగుతున్నది, తిరుగుతున్నది చూడండి. దేవతలంతా దగ్గరచేరి జయజయధ్వానములు చేయుచున్నారు. కడపలో శ్రీవేంకటేశ్వరుని రథము విరివి (అతిశయించి) వస్తున్నది. స్వామివారి సింహాసనమే కదలి వస్తున్నదా అన్నట్లుంది. మనం ధన్యులము.

సంపుటి: 5 కీర్తన : దశవిధాచరణం తన్నభవతి
సంఖ్య : 374 పుట : 253 రాగం: కేదారగౌడ

కేదారగౌడ

64. దశవిధాచరణం తన్నభవతి
దశవిధావస్థార్థం తే తత్ర ।। పల్లవి।।

స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన
దీపితోయం మత్స్య దేహ: పురా
వ్యాపారోయమేవం నచ తరుణ్యా
రూపజలధౌ కేళిరుచయే తత్ర ॥దశ॥

ధారయిష్యామి మందరమితి వ్యాజేన
చారుకచ్ఛపవిధాచరణం పురా
నీరసేయం తవ మనీషా ప్రియవధూ-
భారకుచమందరౌ భర్తుం తత్ర ॥ లల ॥

భువముద్ధరిష్యామి పునరితి వ్యాజేన
ధవళికిటివైభవం ధత్సే పురా
వ్యవహృతిరియం నచ మహామహీకుచతటే
తవ దంతక్షతం దాతుం తత్ర ॥దశ॥

దనుజం హరిష్యామి తమితి వ్యాజేన
ఘన నారసింహవిక్రమణం పురా
దనుజహర తవ మహత్త్వం తన్నచ నఖా-
ర్జనమిందిరాయా (యాం?) ప్రసర్తుం తత్ర ॥దశ॥

అపహరిష్యామి బలిమహమితి వ్యాజేన
కపటవామనరూపకలనం పురా
నిపుణ ఏవం నఖలు నియతిస్సతీషు తే
కపటాచరణం ఘటయితుం తత్ర ॥దశ॥

సంహరిష్యామి నృపజనమితి వ్యాజేన
బహ్వారుణతోయే ప్రాప్తి: పురా
సింహవిక్రమణతే స్థితియం నచ సతీ-
విహ్వలత్వం తదా వేత్తుం తత్ర ॥దశ॥

రావణం జేష్యామి రణ ఇతి వ్యాజేన
భూవరత్వే తే భోగ: పురా
ఏవం నభవతి మహీసుతా విరహం
సావధానేన ప్రహర్తుం తత్ర ॥దశ॥

కంసం హనిష్యామి ఖలమితి వ్యాజేన
సంసారోయమాచరిత: పురా
హింసాదూర నచ హితమిదం ప్రజవధూ-
సంసరణలీలాం ప్రసక్తుం తత్ర ॥దశ॥

పాతయిష్యే ప్రలంబమితి వ్యాజేన
జాతరోషస్య తే జననం పురా
భూతరక్షక తే ప్రభుత్వం తన్నఖలు
భూతలే రేవతీం భోక్తుం తత్ర ॥దశ॥

బుద్ధో భవిష్యామి పురహృతివ్యాజేన
బద్ధరోష ఇతి తే ప్రాప్తి: పురా
తద్ధితం నహిఖలు తదా వధూహస్త
సిద్ధప్రసారేణ సేవితుం తత్ర ॥దశ॥

మారయిష్యామి కలిమతమితి వ్యాజేన
క్రూర కల్క్యవతారకోప: పురా
ధీనర వేంకటనగాధీశ ఏవం న ఖలు
భీరుమూర్వీం సంప్రీణయితుమత్ర ॥దశ॥ 374

అవతారిక:

గీర్వాణిలో శ్రీమన్నారాయణుని దశావతార విభవాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. 32వ సంఖ్య గల అన్నమయ్య భక్తి సంకీర్తన ఇది. 32 పెదతిరుమలాచార్యుల శృంగార కీర్తనలతో కలిసి ఇది 64వ సంకీర్తన. దీని తరువాత అన్నమయ్య మనుమడి వైరాగ్య భక్తి కీర్తనలు మొదలవుతాయి. ఈ దశావతార కీర్తన శృంగారపరిమళం గుబాళించే పారిజాతం. దీని పల్లవి కొంచెం క్లిష్టమే. ప్రభూ! నీ అవతారాలన్నీ ఏదోమిష (నెపము) చేత వెలుగు చూచినవే. అన్నిటి ఆశయమూ దుష్టశిక్షణ, శిష్ట రక్షణ మాత్రమే. కానీ పైకి అవన్నీ నీవు ఏదో ఒక స్త్రీ కొరకు చేశావనిపిస్తుంది. కానీ నిజానికి నీవు; నిర్మోహివి, నిస్సంగివి, నిర్గుణివి. కోపతాపాలూ, వాంఛలు జగన్నాథునికి వుంటాయా? అంతా ఆస్వామి లీల అని తెలియుటయే జ్ఞానం. తెలవక పోవటం అజ్ఞానం, అంతే.

భావ వివరణ:

ఓదేవదేవా! నీ అవతార విభవము, దశవిధ ఆచరణల (శృంగారకలాపముల) కొఱకు కాక, దశవిధ అవస్థల (పదిరకములైన రూపములెత్తినది) దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కొరకు మాత్రమే సుమా!

వేదములను ఉద్ధరించెదననెడి 'మిష' చేత పూర్వము ఈ మత్స్య రూపమును ప్రకాశింపజేసితివి. అంతేకాని తరుణుల రూపసంపద అనెడి సముద్రమును ఆనందించుట అను వ్యాపారమునందు మక్కువ వుండుటజేతకాదు. మందర పర్వతమును ధరింతుననెడి 'మిష' చేత రమణీయమైన కచ్ఛప (తాబేలు) రూపమును దాల్చితివి. అంతేకాని ప్రియవధూటీ సమూహముల భారమైన కుచమందరములను ధరించుటకు కాదు. ఇదియే నీకు గొప్ప రసస్ఫూర్తి.

మరల, పూర్వము భూమిని ఉద్ధరించెదననెడి 'మిష' చేత శ్వేత వరాహవైభవరూపమును ధరించితివి. అంతేకాని నీవ్యాపారము భూదేవి ఘనస్తనశైలములపై నీ నఖ క్షతములిచ్చుటకు కాదు.

దనుజుని (హిరణ్యకశిపుని) సంహరించెదననెడి 'మిష' చేత పూర్వము ఘనపరాక్రము నారసింహ రూపమును ధరించితివి. అంతేకాని

ఓదనుజహరా! నీ మహాత్యము ఇందిరాదేవి యందు నీగచ్ఛతమును గావించుటకు కాదు.

బలిచక్రవర్తిని నివారించెదనను 'మిష' చేత, పూర్వము కపట వామనరూపకల్పన గావించితివి. అంతేకాని నైపుణ్యం కల నీవు కపటమైన ఆచరణతో సతులను పొందుట కొఱకు కాదు.

రాజలోకమును సంహరించెదననెడి 'మిష' చేత గొప్పదైన శోణసాగరమును (రక్తపుసముద్రమును) సృష్టించినవాడవైతివి (పరశు రామావతారం). ఇది నీకు సింహ విక్రమ స్థితియే కాని సతీ విరక్తుడవగుట కాదు.

రావణాసురుని రణమును సంహరించెదననెడి 'మిష' చేత నీవు పూర్వము రామచంద్రమూర్తి విభవము చూపితివి. అంతేకాని సీతాదేవి విరహమును సావధానముగా నిర్మూలించుకొనుట కొఱకు కాదు.

ఖలుడైన కంసుని వధించెదననెడి 'మిష' చేత పూర్వము సంసారమున (ప్రపంచంలో) కృష్ణ రూపమును ప్రదర్శించితివి. అంతేకాని ఓహింసాదూరా! వ్రజాంగనల (గోపికల) పొందు అనెడి శృంగార లీలాప్రదర్శనము కొఱకు కాదు.

ప్రలంబాసురుని వధించుట అనెడి 'మిష' చేత పూర్వము రోషముగల రూపమును (బలరాముడు) ధరించుట నీకు హితవు అయినది. అంతేకాని రేవతీదేవిని అనుభవించుట కొఱకు కాదు. త్రిపురాసుర సంహారమనెడి 'మిష' చేత బుద్ధభగవానుడనగుదునని రోషమును అదుపులోనుంచుట నీకు హితవైనది. అంతేకాని ఆ త్రిపురాసురుల భార్యల శీలములను చెరచుట కొఱకు కాదు.

కలిమతమును (కలిపురుషుని ప్రభావమును) నిర్మూలించెదననెడి 'మిష' చేత క్రోధయుక్తమైన, మరియు క్రూరమైన కల్కిరూపము ధరించితివి. అంతేకాని ఓధీర శ్రీవేంకటనగాధీశా! భీతిచెందిన భూదేవిని సంప్రీతి చెందింపజేయుటకు కాదు.

తాళ్లపాక చినతిరుమలాచార్యుల సంకీర్తనలు:

సంపుటి: 10-1 కీర్తన : బ్రహ్మగన్నవాడు పసిబిడ్డా
సంఖ్య : 11 పుట : 6 రాగం: బౌళి

బౌళి

65. బ్రహ్మఁగన్నవాఁడు పసిబిడ్డా
బ్రహ్మమైనవాఁడు పసిబిడ్డా ॥ పల్లవి॥

వగపులేక చంపవచ్చిన బూతకి
పగసాధించినవాఁడు పసిబిడ్డా
పగటునఁ దనమీఁదఁ బారవచ్చినబండి
పగులఁ దన్నినవాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

గట్టున నావులకొరకు వేలనె కొండ
పట్టి యెత్తినవాఁడు పసిబిడ్డా
జెట్టిపోరునఁ దన్నుఁ జెనకవచ్చినవానిఁ
బట్టి చంపినవాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

మిడికెటికోపపు మేనమామఁ బట్టి
పడనడిచినవాఁడు పసిబిడ్డా
కడువేగ శ్రీవేంకటనాథుఁడై గొల్ల-
పడఁతులఁ గూడినాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

అవతారిక:

అన్నమయ్య అనుయాయులలో (అనుసరించినవారిలో) తాళ్లపాక చినతిరుమలయ్య తాత అన్నమయ్యకు తగ్గ మనుమడని పేరుపొందాడు. వైరాగ్య కీర్తనలు చెప్పటంలో ఈయన తాతకే దగ్గులు నేర్పగలవాడనిపించాడు. నా ఈ అన్నమయ్య - అనుయాయులు రచనలో ఇదివరలో అన్నమయ్య భక్తి కీర్తనలు, ఆయనకొడుకు పెద తిరుమలయ్య శృంగార కీర్తనలు రుచిచూచారు. ఇక తాళ్లపాక మనుమడి వైర్యాగం రుచి చూడండి. నేడు శ్రీకృష్ణాష్టమి. ఈ పర్వదినాన చిన్నారి కృష్ణయ్యను స్మరించి తరిద్దాం. వీడు పసిబిడ్డా అని ప్రశ్నల

వర్షం కురిపిస్తున్నారు. బ్రహ్మమే తానై, బ్రహ్మను కన్నవాడు పసిబిడ్డా? ఇంకానయం. కడువేగ శ్రీవేంకటనాథుడై గొల్లపడతుల గూడినాడు పసిబిడ్డా? అంటున్నారు. అన్నట్లు ఈయనా 'వేంకట' మకుటంతోనే కీర్తనలు రచించాడండీ.

భావ వివరణ:

ఆహా! యేమి ఆశ్చర్యము!! బ్రహ్మదేవుని (విధాతను) కన్నవాడు (తండ్రియైనవాడు) పసిబిడ్డా (చిన్నారి బాలుడా)? బ్రహ్మమైనవాడు (పరబ్రహ్మస్వరూపుడు) పసిబిడ్డా?

పూతకి (పూతన) అనే రాక్షసి కంసుని ఆజ్ఞపై వచ్చి పొత్తిళ్ళలోని కృష్ణయ్యకు విషపూరితమైన తన చనుబాలు ఇచ్చి చంపుదామని వచ్చింది. దాన్ని ఏమాత్రమూ వగపు (విచారము) లేక పాలుతాగి ప్రాణం తీసి పగసాధించినవాడు పసిబిడ్డా? తన మీదకు సగటున (బాహాటంగా) పారవచ్చిన (పడుటకు వచ్చిన) బండిన (బండి రూపంలో వున్న శకటాసురుని) ఒక్క తన్ను తన్ని ముక్కలు ముక్కలుగా పగులదన్నినవాడు పసిబిడ్డా?

తనని పూజించడం మానేశారని రేపల్లె వాసులపై అలిగి ఇంద్రుడు రాళ్ళవాన కురిపించాడు. తన చిటికెన వ్రేలిమీద గోవర్ధన పర్వతాన్ని గొడుగులా యెత్తిపట్టి దాని గుట్టున (నీడలో) గోకులంలోని గోవులను, గోవులవంటి గోపాలురను కాపాడినాడు. వీడు పసిబిడ్డా? తమ మామ కంసుని ఆహ్వానంపై మధురానగరం వచ్చారు. బలరామకృష్ణులు. ముష్టికుడు, చాణూరుడు అనే ఇద్దరు గొప్ప జెట్టీలను (మల్లయుద్ధ నిపుణులను) (అన్నట్లు... చాణూరుడు మన ఆంధ్రుడన్న సంగతి మీకు తెలుసా...) వారిపై వుసిగొల్పాడు కంసుడు. తనను చెనకవ వచ్చిన (చంపవచ్చిన) ఆ జెట్టీని పట్టినేలకేసి కొట్టి, మట్టుబెట్టిన దిట్ట... పసిబిడ్డా?

తనని యెప్పుడు చంపుతాడో అని అనుక్షణం భయంతో మిడుకుతూ (త్రుళ్ళిపడుతూ) ఆగ్రహంతో బ్రతికాడు కృష్ణుని మేనమామ కంసుడు. చివరికి వాడిని పట్టుకొని నేలపై పడనడచి (పడవేసి) చంపినవాడు పసిబిడ్డా? ఆ ద్వాపరయుగం అయిపోయాక, కడువేగ (అతిశీఘ్రముగా) తిరుమలకొండ చేరుకొని వేంకటనాథుడైనాడు ఆ గొల్లపడుచుల వుల్లపు ఝుల్లరి. వీడు పసిబిడ్డా? ఇంకానయం. ఈయన పరమపురుషుడు కదటయ్యా!

సంపుటి: 10-1 కీర్తన : చిన్నవాడు నాలుగు చేతులతోనున్నాడు
సంఖ్య : 32 పుట : 18 రాగం: గౌళ

గౌళ

66. చిన్నవాఁడు నాలుగుచేతులతో నున్నాఁడు
కన్నప్పుడె శంఖముఁ జక్రముఁ జేత నున్నది ॥ పల్లవి॥

నడురేయి రోహిణి నక్షత్రమునఁ బుట్టె
వడిఁ గృష్ణుఁ డిదివో దేవతలందు
పడిన మీబాధ లెల్ల ప్రజలాల యిప్పు డిట్టె
విడుగరాయె మీరు వెరవకఁ డిఁకను ॥చిన్న॥

పుట్టుతానె బాలుఁడు అబ్బురమైన మాఁటలెల్ల
అట్టె వసుదేవుని కాన తిచ్చెను
వట్టి జాలింకేల దేవతలాల మునులాల
వెట్టివేములు మానెను వెరవకుఁడిఁకను ॥చిన్న॥

శ్రీవేంకటనాథుఁడె యాసిసువు దా నై నాఁడు
యీవల వరము లెల్లా నిచ్చుచును
కావఁగ దిక్కైనాఁ డిక్కడనె వోదాసులాల
వేవేగ వేడుకతోడ వెరవకుఁ డిఁకను ॥చిన్న॥

అవతారిక:

అది శ్రావణ బహుళాష్టమినాటి అర్ధరాత్రి రోహిణీ నక్షత్రమున నాలుగు భుజములతోను హస్తములలో శంఖ చక్రములతోను చిన్నవాడు కృష్ణయ్య దేవకీ వసుదేవులకు దివ్యదర్శనమిచ్చి, వారి పూర్వజన్మల పుణ్యమును వివరించి అబ్బురముగా వసుదేవునికి కర్తవ్యోపదేశము గావించాడు. ఇదంతా చెప్పిన పిదప, "దేవతలాల! మునులాల! ఇంకా వట్టిజాలియేల?

వెట్టివేములు మానెను ఇక వెరవకుడు" అన్నాడు హరి. ఆ 'సిసువు' వేరెవరో కాదు శ్రీవేంకటనాథుడే అంటున్నారు మన తాతగారి మాదిరిగానే తాళ్లపాక చినతిరుమలయ్య. అందుకే కొన్ని పదములు నిఘంటువు తెరిచినా మింగుడుపడవు.

భావ వివరణ:

ఈ చిన్నవాడు (చిన్నారి బాలుడు) నాలుగు చేతులతో నున్నాడు. కన్నప్పుడే (పుట్టినప్పుడే) వీనికి చేతులలో శంఖచక్రములు ఆయుధములుగా నున్నవి.

నడిరేయి (అర్ధరాత్రి) రోహిణీ నక్షత్రమున దేవతలందు (దైవ గణములయందు ఇదిగో శ్రీకృష్ణుడు వడి (శీఘ్రముగా) పుట్టినాడు. ఓ ప్రజలారా! మీరు పడిన బాధలెల్లా ఇట్టే విడుగరాయె (విడిచిపోయాయి). ఇప్పుడు మీరు, వెరవకుడికను (ఇక భయపడకండి).

బాలుడు పుట్టుతూనే (పుడుతూనే) అబ్బురమైన (ఆశ్చర్యకరమైన) మాటలతో వసుదేవునికి అట్టే (అట్లా చేయుము అని) ఆనతిచ్చెను (ఆజ్ఞాపించాడు). ఓ మునులారా! దేవతలారా! ఇంక వట్టిజాలియేల? (వ్యర్థమైన దీనత్వమెందులకు?) వెట్టివేములు మానెను (ఇకవెట్టి చాకిరీవుండదు) వెరవకండి, ఇకను (ఇక భయపడకండి).

ఆ తిరుమల శ్రీవేంకటేశ్వరుడే ఆ'సిసువు' (శిశువు) తానే అయ్యాడు. ఈవల (ఇప్పుడు) వరములెల్లా ఇచ్చుచున్నాడు. ఓ దాసులాల! (హరిదాసుల్లారా!) ఇక్కడే (ఈ తిరుమలలోనే) వేడుకతో వేవేగ కావగ దిక్కైనాడు (రక్షించే దిక్కయినాడు). ఇకను వెరవకుడు (ఇక భయపడకండి).

సంపుటి: 10-1 కీర్తన:తన దాసుని కొరకు ధరియించె నీ రూపము
సంఖ్య : 37 పుట : 21 రాగం: సాళంగనాట

సాళంగనాట

67. తన దాసునికొరకు ధరియించె నీరూపము
దిన దిన వేడుకఁ గదిరి నారసింహుఁడు ॥ పల్లవి॥

బలురక్కసు నొడిసిపట్టి తొడలపైఁ బెట్టి
చెలఁగి కొనగోళ్లఁ జించినాఁడు
చలపట్టి పేగులజంధ్యాలతోడుతను
తెలివై వున్నాఁడు కదిరి నారసింహుఁడు ॥ లల ॥

ఘోరదానవు కంఠకుహరరక్తము ముంచి
సారెకు వసంతముగాఁ జల్లినాఁడు
మారుకొన్నదైత్యుని చర్మ మొలిచి మేనిమీఁద
ధీరతఁ గప్పినాఁడు కదిరి నారసింహుఁడు ॥ లల ॥

అందపులక్ష్మియుఁ బ్రహ్లాదుఁడు నుతింపఁగాను
విందుగా నాగముపాల వెలసినాఁడు
అంది శ్రీవేంకటనాథుఁడై యీడా నాడాను
దిందుపడున్నాఁడు కదిరి నారసింహుఁడు ॥తన॥

అవతారిక:

తెలుగు భాష గొప్పదనం, మన పురాణ సాహిత్యంలో వున్న విశిష్టత ఈ పల్లవిలోనే కనబడుతుంది. కదిరిలో వెలసిన ఫాలలోచన నరసింహునిపై చిన తిరుమలయ్య చెప్పిన ఈ కీర్తన పరిశీలించండి. ఈ రూపాన్ని (నరుడు - సింగము) ఈయన తన దాసుని కొఱకు ధరించాడట. ఎవరా దాసుడు? ప్రహ్లాదుడు. కాని నిజానికి హిరణ్యకశిపుడు కూడా ఆయన దాసుడే. హరిద్వారపాలకుడైన జయుడు

కదా! మనబోటివాళ్ళకి శరీరాలతో సంబంధమైతే ఆ స్వామికి ఆత్మలతోనే సంబంధం కదా! ఆయనకు నిత్యమూ వేడుకలే యెందుకంటే శ్రీవేంకటనాథుడూ ఆయనే కదా!

భావ వివరణ:

ఓ ప్రజలారా! దినదినము (ప్రతిరోజూ) వేడుకలు గల ఈ కదిరి నరసింహుని సేవించి తరించండి. ఈయన తన దాసుని కొఱకు (నమ్మిన సేవకుని కొరకు) ఈ రూపమును ధరించినాడు.

ఈయన బలురక్కసుని (బలవంతుడైన రాక్షసుడు హిరణ్యకశిపుని) ఒడిసిపట్టి (బిగించి పట్టుకొని) తన తొడపై పరుండబెట్టుకొని, చెలగి (విజృంభించి) తన కొనగోళ్ళతో చీల్చివేసినాడు. చలపట్టి (మాత్సర్యముతో) తోడుతనె (తదనంతరం) ఆ పేగులను జంద్యాలుగా తన మెడలే వేసికొనినాడు. ఈ కదిరి నరసింహుడు ఈ విధముగా తెలివియై యున్నాడు (తెలుపబడియున్నాడు).

ఘోరదానవుడైన హిరణ్యకశిపుని, కంఠకుహర రక్తము (కంఠపు నాళములోని రక్తమును) మాటి మాటికీ అతిశయముగా వెదజల్లి వసంతములాడినాడు. మారుకొన్న (తన నెదిరించిన) ఆ రాక్షసుని చర్మమును ఒలిచి తన ఒంటిపై కప్పుకొనినాడు. ఈ కదిరి నరసింహుడు. ఈ విధముగా తన ధీరత్వమును ప్రదర్శించినాడు.

అందమైన ఇందిరాదేవి, భక్తుడైన ప్రహ్లాదుడు తనను నుతించుచుండగా ఈ నాగముపాలలో శోభాయమానముగా వెలసియున్నాడు. అంది (అటుపిమ్మట) శ్రీవేంకటేశ్వరుడై ఈడ (ఈ కదిరిలోనూ) ఆడా (ఆ తిరుమలలోనూ) ఈ కదిరి నరసింహుడే దిందుపడున్నాడు (దిందు పడుట అంటే మూర్ఛపోవటం అని అర్థం. కాని తాళ్ళపాక కవులు, సమ్మోహనంగా వున్నాడు అనే అర్థంలోనే ఈ పదమును ప్రయోగించారు).

సంపుటి: 10-1 కీర్తన:దవ్వుల తెరువు మరేటికి తడబాటులు మరేటికి
సంఖ్య : 38 పుట : 22 రాగం: సామంతం

సామంతం

68. దవ్వులతెరువు మరేఁటికి తడఁబాటులు మరి యేఁటికి
యెవ్వరు దలఁచిన నిదియె యిహపరముల నొసఁగున్ ॥ పల్లవి॥

మనసనియెడు పెనువింటను మాయాలక్ష్యముపైని
పనివడి జ్ఞానం బనియెడి బాణం బేసినను
వెనకటి దుష్కర్మంబులు వేళ్లతోడఁ బెకలిన
తనయంతనె సకలంబును తప్పక కాన నగున్ ॥దవ్వు॥

మలయుచు మంత్రార్థం బను మందరగిరిచేతను
చలమున సంసారం బను జలనిధి దచ్చినను
అలవడ హరిభక్తి యనెడియమృతము వొడమినను
పొలసెటి చావునుఁ బుట్టుగు పొడమక బదుక నగున్ ॥దవ్వు॥

జీవుఁ డనియెడిపాదున చిరకాలంబును మొలచిన
శ్రీవేంకటనాథుండను సిద్ధౌషధతరువు
భావింపఁగఁ దనకృప యను పండూ పండినను
కావలసిన యర్థము దనకైవస మగుఁ గానా. ॥దవ్వు॥

అవతారిక:

దవ్వుల తెరువు అంటే సుదీర్ఘమైన మార్గము. భగవంతుని కృప పొందాలంటే కొన్ని సులభమైన మార్గాలున్నాయి కొన్ని కష్టమైన మార్గాలున్నాయి. స్వామీ! నీవేతప్ప ఇత: పరంబెరుగను అని గజేంద్రునిలా శరణాగతి సులభమైన మార్గం. విశ్వామిత్రునిలా వేల సంవత్సరాలు తపస్సు చేయటం... ఆ తరువాత కామక్రోధమోహాది బలహీనతలకు లొంగి, తడబడి మళ్ళీ మొదటికే రావటం... ఇదంతా అవసరమా? ఇహలోకములో సుఖించటానికీ, పరలోకంలో పరమసుఖం పొందటానికీ ఎవ్వరు ఆశించినా ఇదియే (ఈ హరిభక్తియే) సిద్ధౌషధము అంటున్నారు

తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారు.

భావ వివరణ:

ఓ ప్రజలారా! భగవంతుడైన ఆ శ్రీమన్నారాయణుని కృపను పొందితేకాని ముక్తి లభించదు. ఆయన దయతో మాత్రమే ఇహపరములన్ (జీవించియున్నప్పుడు ఇహలోకంలోనూ మరణించాక పరలోకంలోనూ) సుఖము దక్కదు. ఆయన దయ పొందాలంటే కొన్ని దవ్వుల తెరువులు (సుదీర్ఘమైన మార్గాలూ) కొన్ని సులభమార్గాలూ వున్నాయి. ఆ దవ్వుల తెరువులలో తడబడుతూ (పొరబాట్లు చేస్తూ) మరింకెందుకు కష్టపడటం? ఎవ్వరు దలచిన (ఎవరికి కావాలన్నా) ఈ తేలికమార్గం వున్నది కదా!

'జ్ఞానము' అనెడి బాణమును తీసుకోండి. మీ 'మనస్సు' అనెడి గొప్ప 'వింటికి' (ధనస్సునకు) సంధించండి. 'మాయ' అనే ఈ శత్రువుపై గురిపెట్టి వేయండి. ఇక చూడండి. వెనకటి దుష్కర్మంబులు (మీరు పూర్వ జన్మలలో చేసిన పాపాలు కూడా) వేళ్ళతో పెకలించబడి కూలిపోతాయి. సకలంబును (ఏది మంచిదో ఏదికానిదో) తప్పక తనంతట తానే, కాననగును (తెలిసిపోతుంది). అంటే జ్ఞానము ఒక మోక్షమార్గము. అవును కదా!

చలమున, సంసారంబును (మాత్సర్యపూరితమైన ఈ ప్రపంచం అనే) జలనిధిని (సముద్రాన్ని) మంత్రార్థము (నారాయణుని నామమంత్రం అనే) మందరపర్వతంతో మలయుచు (తిప్పుతూ) దచ్చిన (చిలికితే) హరిభక్తి అలవడి (అలవాటై) అమృతముగా వొడముతుంది (తయారవుతుంది). అప్పుడు ఆ అమృతం త్రాగితే పొలసేటి (కలిగే) చావుపుట్టుకలనుండి విముక్తుడై బదుకనగున్ (బ్రతుకవచ్చును).

జీవుడు అనే ఈ పాదున (చెట్టు మొదలులో) చిరకాలంబున (యెప్పటికో) ఆస్వామి కృపవలన శ్రీవేంకటేశుడు అనే సిద్ధౌషధతరువు (గొప్ప ఔషధతత్వముగల చెట్టు) మొలుస్తుంది. దానికి భావింపగ (ఆయననే ధ్యానిస్తుంటే) తనకృప (ఆయన దయ అనే) పండు పండుతుంది. అప్పుడు కావలసిన అర్థములు (ఇహ పరసుఖములు) తనకైవసముగానా (తన స్వాధీనమవుతాయి కదా!)

సంపుటి: 10-1 కీర్తన : అల్లముబెల్లమౌనా అన్నలాల
సంఖ్య : 10 పుట : 9 రాగం: సామంతం

సామంతం

69. అల్లము బెల్లమౌనా అన్నలాల
యెల్లకాలమును గుణమేల మానీనయ్యా ॥ పల్లవి॥

నిక్కము గొండలనీరు నేలకు వేగమె పారు
యెక్కువనేలపై నీరు యెక్క దందుకు
మిక్కిలి ప్రకృతిలోన మెలఁగెటి వానికి
చొక్కమైన జ్ఞాన మెట్టు సొగసీ నయ్యా ॥అల్ల॥

అచ్చపుఁబాలలోన తోడంటితేనె పెరుగౌను
పచ్చి సేసినఁ బెరుగు పాలు గాదు
వచ్చి వచ్చి యెఱఁగనివానికిఁ దెలుప వచ్చు
కుచ్చితుని నెటువలె గుణిఁ జేసే దయ్యా ॥అల్ల ॥

చందనపువాసనలు సంగడిమాఁకుల నంటు
అందలివాసన లిందు నంట వెన్నఁడు
కందువైన శ్రీవేంకటనాథునిదాసు
లెందుండినా నితరము లేల తోఁచీనయ్యా ॥అల్ల॥

అవతారిక:

అద్భుతమైన వైరాగ్యమునావిష్కరిస్తున్నారు చినతిరుమలయ్య. కొన్ని సహజ గుణములుగా వుండి పోతాయి కొన్నిటికి. ఎల్లకాలము వాటికా గుణం సహజంగా వుండిపోతుంది. అల్లము కారంగా వుంటుంది. బెల్లం తియ్యగా వుంటుంది. అల్లం యెన్నటికీ బెల్లం కాలేదు. అదే విధంగా వేంకటనాథుని దాసులు యెందుండినా ఆయన శరణాగతితోనే వుంటారు కానీ వారికి ఇతరము లేల తోచీనయ్యా! అని ప్రశ్నిస్తున్నారు. చందనపు

చెట్టు వాసన పక్కనున్న చెట్లకు వస్తుంది కానీ ఆ చెట్టు వాసన చందనం చెట్టు కంటదు. అవునా? చక్కటి ఉదాహరణలు చెప్పటంలో ఈయన తాతకు సరిజోడే సుమా!

భావ వివరణ:

ఓ అన్నలారా! అల్లము రుచి కారంగా వుంటుంది. బెల్లం రుచి తియ్యగా వుంటుంది. అవి వాటికి ప్రకృతి చేత సహజగుణాలు. ఎల్లకాలమును (ఎప్పుడూ) అవి వాటిగుణమును మానీనయ్యా! (మానుతాయటయ్యా!)

నిజముగా చూస్తే, కొండలపైనుంచి నీరు వేగంగా నేలమీదకు పారుతుంది. అది దాని సహజగుణం ఎక్కువగావున్నా నేలపై నుంచి నీరు కొండపైకి ఎక్కుతుందా? రోజూ ప్రకృతిలో (ఇచ్చి పుచ్చుకోవటాలు అనే వ్యాపార ధోరణి వుండేవానికి) చొక్కమైన జ్ఞానము (శ్రేష్ఠమైన, భగవత్తత్వ జ్ఞానము) యెట్లు సొగసీనయ్యా! (సోకుతుందయ్యా!) ఎన్నటికీ సోకదు.

అచ్చపు పాలలోన (స్వచ్ఛమైన పాలలో) తియ్యని పెరుగు వేసి తోడంటితేనే (తోడు బెడితేనే) కమ్మటి పెరుగవుతుంది. అది ప్రకృతి కాని మళ్ళీ పెరుగును పచ్చిసేసిన (చల్లబరిస్తే) యెక్కడన్నా పాలుగా మారిపోతాయా? ఎఱుగని వానికి (అజ్ఞానికి) వచ్చివచ్చి (మళ్ళీమళ్ళీ ప్రయత్నించి) జ్ఞానము బోధించవచ్చును. కాని ఒక కుచ్చితుని (కపట బుద్ధికలవానిని) సుగుణఖనిగా యెట్లు చేయగలనయ్యా!

ఒక తోటలో చందన వృక్షాల సంగడినున్న (పక్కనేవున్న) చెట్లకు ఆ సువాసన అంటుతుంది. అంతేకాని అందలి వాసనలు (ఆ చెట్ల వాసనలు) ఇందు (ఈ చందనవృక్షానికి) అంటదు. కందువైన (శ్రేష్టలైన) శ్రీవేంకటేశ్వరుని దాసులు యెందుండినా ఆ దేవదేవునికి శరణాగతులే. అంతేకాని, ఇతరములేల తోచీనయ్యా! (అనవసరమైన ఇతర విషయములు వారికి యెందుకు ఆసక్తి కలిగిస్తాయి... చెప్పవయ్యా!)

సంపుటి: 10-1 కీర్తన : ఏలికెయైన హరి నేల మరవగవలె
సంఖ్య : 49 పుట : 28 రాగం: లలిత

లలిత

70. ఏలికయైన హరి నేల మరువఁగ వలె
పాలుమాలి మరియాల భంగవపడవలెను ॥ పల్లవి॥

యిరుకుమానిసంది నేఁటికిఁ జొరవలె
తిరుగలేక యేల తినుక వలె
యెరవులవిషయాల నేల పొరలవలె
కొరగాని పాపాలగొడ వేల వలెను ॥ఏలి॥

మిగుల వురులలోన మెడయాల పెట్టవలె
తగిలించుకొని యేల పొగులవలె
యెగసక్కెపుఁగోరిక లేల కోరవలె
జిగుఉవంటిబందాలఁ జిక్కనేలవలెను ॥ఏలి॥

పారేబండికింద పాదమేల చాఁచవలె
జారుపడి మరియాల జడియవలె
మీరి శ్రీవేంకటనాథు మిక్కిలి వేడుకఁగొల్చి
పోరుమాలి వుండకేల పొడిఁబడవలెను ॥ఏలి॥

అవతారిక:

పాలుమాలి అంటే బద్ధకించి అని అర్థం. మన పైఅధికారిని కాస్త అలక్ష్యం చేస్తేనే ఆయన వూరుకోడు. శిక్షిస్తాడు కదా!మరి ఆ ఏలికలందరికీ యేలికయైన శ్రీహరిని యేలమరవవలెను? సోమరిపోతువై ఆయనను మఱచి మరెందుకు కష్టాలపాలవ్వాలి? అంటున్నారు చినతిరుమలాచార్యులవారు. సోదాహరణంగా తను చెప్పదలచింది సూటిగా చెప్పటంలో ఈయన

అన్నమయ్యకి సరిజోడే. మీరి శ్రీవేంకటనాథు మిక్కిలివేడుక గొల్చి... పోరుమాలి వుండకేల పొడిబడవలెను? అంటున్నారు. అర్థం అయ్యా అవనట్లుంది కదూ!

భావ వివరణ:

ఓ ప్రజలారా! యేలికయైన (జగన్నాథుడైన) హరిని (నారాయణుని) యేల మరువవలెను? మరి (ఆ వెనుక) పాలుమాలి (బద్ధకించి) ఆయన శరణాగతిని మానివేసి, భంగపడవలెను (కష్టాలు కొనితెచ్చుకోవాలి?)

ఇరుకుమానిసంది (కిటికీ చువ్వల సందు మధ్యలోనుంచి) ఎందుకు దూరి వెళ్ళాలని ప్రయత్నించాలి? వెళ్ళటానికి వీలుకాక యేల తినుకవలెను? (ముక్కి ముక్కి ఏరగవలెను?... అంటే... ఇబ్బంది పడాలి? అని అర్థం). ఎరవుల విషయాల (పనికిమాలిన విషయాలలో) యెందుకు తలదూర్చాలి? వ్యర్థమైన పాపాలనన్నింటినీ మూటకట్టుకోవటం దేనికి?

మన, మెడ (గొంతును) తీసుకెళ్ళి స్వయంగా బిగించిన వురితాళ్ళలో ఎందుకు బిగించుకోవాలి? ఆ తరువాత యేల పొగులవలెను (దు:ఖించాలి?) ఎగసెక్కపు కోరికలు (కోరరాని వికటమైన కోరికలతో) తెర్లటం దేనికి? దాని పర్యవసానంగా, జిగురు (బంక) లాగా పట్టుకొని వదలని బంధాలలో (ఎటాచ్‌మెంట్స్‌తో) ఇబ్బందులు పడటం దేనికి?

అయ్యలారా! పారేబండికింద (వేగంగా పోతున్న బండి చక్రం కింద) మీ పాదము పెట్టడం దేనికీ ఆ తరువాత దానికిందజారిపడి యేల జడియవలెను (మిడుకవలెను). సర్వశ్రేష్ఠుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! గొప్ప సంతోషముతో నిన్ను కొలచి, పోరుమాలియండక (దురుసుతనం మాని వుండక) పొడిబడవలెనా? (చూర్ణం చూర్ణం కావలెనా?... అంటే కష్టాలు పాలవవలెనా?)

సంపుటి: 10-1 కీర్తన : భారము నీదిగాన పట్టి విన్నవించేగాక
సంఖ్య : 36 పుట : 21 రాగం: లలిత

లలిత

71. భారము నీదిగాన పట్టి విన్నవించేఁగాక
ఆరితేరి బుద్దెరిఁగే దది యెన్నఁ డయ్యా ॥ పల్లవి॥

వీలని సంసారపువెట్టి నేఁ జేయఁగాను
యేలిన నిన్నుఁ గొలిచే డెన్నఁడయ్యా
కాల మెల్లా విషయాల గాడినె కట్టుండఁగాను
ఆలించి నీ సేవ సేసీ దది యెన్నఁడయ్యా ॥భార॥

బట్టబయలు మాయలబారిఁ బడి వుండఁగాను
యిట్టె నిన్నుఁ దలఁచే దెన్నఁడయ్యా
వుట్టిపడే కోరికల వువ్విళ్ళూరఁగాను
ఆలించి నీ సేవ సేసే దది యెన్నఁడయ్యా ॥భార॥

సొలసి నాలుక నూరుసుద్దులె తడవఁగాను
యిలపై నిన్ను నుతించే దెన్నఁడయ్యా
కలిగి నన్నును శ్రీవేంకటనాథ కాచితివి
ఫలియించెఁ దపము యీ బాగు లెన్నఁడయ్యా ॥భార॥

అవతారిక:

వైరాగ్యం ముప్పిరిగొన్న ఈ కార్తనలో చినతిరుమల సంసారము అనే వెట్టి చాకిరీకి కట్టుబడ్డవాళ్ళం. మాకు నిద్రలేచింది మొదలు నిద్రపోయేదాకా, వున్న కాలమంతా 'యావ', 'వాంఛ', 'పరాయివాళ్ళ బాగోగులు' మోసపోవటమో మోసం చేయటమో ఇంతే తప్ప పట్టుమని పదినిముషాలు పరమాత్ముని ప్రార్థించే తీరికే దొరకటం లేదు. మధ్యలో, వెంట్రుక వాసిలో చావునుంచి తప్పించి నాకు సంకేతాలు ఇస్తూనేవున్నావు.

అయినా నాకు బుద్ధిరాదు. నిన్ను నుతించను. ఏమిటయ్యా! నీమాయ!! పోదా నాకీ యావ?

భావ వివరణ:

అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడే మమ్మల్ని కడతేర్చే భారము (బాధ్యత) మా తండ్రివైన నీది కాక ఇంకెవరిది? అందుకనే నీకు పట్టి (పూనుకొని) విన్నవిస్తున్నాను (మొరబెట్టుకొంటున్నాను). మేము ఎటువంటి దురవస్థలో వున్నామో ఒకసారిచూడు. దీంట్లోంచి ఆరితేరి (బయటపడి) బుద్ధితెచ్చుకొని నిన్ను నేను తలచి ధ్యానించేది యెన్నడయ్యా?

వీలని (వదలలేని) సంసారపు వెట్టిచాకిరీ నేను చేస్తూనే బ్రతుకు గడుపుతున్నాను. ఎంతసేపటికీ సంసారపు యావయే. ఇక జగముల యేలికవైన నిన్ను కొలిచేది యెన్నడయ్యా! కాలమెల్లా విషయవాంఛల గాడికొయ్యకు కట్టుబడివుండవలసివచ్చింది. ఇక ఆలించి (మంచి మాటలు విని) నీ శరణాగతుడనై నీకు సేవచేసేదెన్నడయ్యా?

ప్రభూ! నీ బట్టబయలు మాయలు (పైకి కనిపిస్తూనే వుండే మాయలు) ఎవ్వరూ ఎవ్వరికీ ఏమీకారు అని ఎవరికి తెలియదు? అందరికీ తెలుసు. కానీ నాభార్య, నా సంతానం, నాఇల్లు నావాళ్ళు అని ఒకటే 'యావ'. వాళ్ళందరి మంచిచెడులన్నీ నావే అనుకోవటమే నీమాయ. ఈ మాయలో కలిగే తాపత్రయంతోనే సరిపోతున్నది. ఇక నిన్నెప్పుడు తలిచేదయ్యా? ఉట్టిపడే కోరికలతో (అతిశయించే కాంక్షలతో) ఉవ్విళ్ళూరుతుంటాను. ఇక నిన్నెప్పుడు పొగిడేదయ్యా?

నా నాలుకపై లేచింది మొదలు ఊరసుద్దులే (ఊళ్ళోవాళ్ళముచ్చట్లే వుంటాయి). అట్లా నేను తడవగాను (పట్టించుకొంటూ వుంటే) ఇక నిన్ను నుతించేదెన్నడయ్యా? ఇట్లా నేను అఘోరిస్తున్నా నామీద కరుణతో ఇట్లాంటి నన్ను కూడా శ్రీవేంకటేశ్వరా! నీవు కాచితివి (రక్షించావు). నా తపము ఫలించింది. ఈ బాగులెన్నడయ్యా? (ఇకపై ముక్తి యెన్నడయ్యా?... అని నా భావన.)

సంపుటి: 10-1 కీర్తన : తచ్చి చూచితేజాలు దైవమే కలడుగాక
సంఖ్య : 35 పుట : 20 రాగం: లలిత

లలిత

72. తచ్చి చూచితేఁజాలు దైవమే కలఁడుగాక
హెచ్చిన మాయలఁ బడనేల మాకు నిఁకను ॥ పల్లవి॥

సారెసారె నే నెంత సంపదలు గోరినాను
పోరచి నీ దేహమెకా భోగించేది
యీ రీతి మనసు దా నెన్నటికిఁ దనిసీని
గారవాన హరి నిన్నుఁ గన్నదె దక్కెను ॥తచ్చి॥

పలుమారు చావులేని బదుకు కాసపడేది
యిలలో సంసారమెకా యేఁ జేసేది
కలిగినయాస యే కాలమున ముదుసును
అలరి విష్ణునిశరణన్నదె నిలిచె ॥తచ్చి॥

వేడుకతో ఘనమైన విద్యలు నేరిచినాను
జోడుగా నిందరికిని చూపు టింతేకా
వీడని తలఁపుతో శ్రీవేంకటనాథునిఁ గొల్చి
యీడేరి బదుకుటె యెన్ని కింతె కాకా ॥తచ్చి॥

అవతారిక:

"కలడు కలండనెడివాడు కలడో లేడో" అనే సందేహం జీవితంలో ఒక్కసారి కూడా రాని మానవుడు యెక్కడా వుండడేమో అనిపిస్తుంది. నిస్సహాయస్థితిలో దీనావస్థలో వున్నప్పుడు అది సహజమే. కాని తచ్చి చూచితే చాలయ్యా! ఆ దైవము వున్నాడు అంటున్నారు చిన తిరుమలయ్య. అయితే ఆయన మాయలో బడితే మాత్రం... రాక్షసులమైపోతాము. మాయ కాకపోతే యెంత సంపాదించినా భోగించేది రేపు వుండని ఈ దేహమే, మనస్సు కాదు.

ఆశ అనేది తీరుతుందా? ఇంకా బ్రతకాలి అని కోరుకొనేది ఈ సంసార సుఖాలకోసమా? విష్ణుని శరణనటానికి కాదా? అసలు సకల విద్యా-పారంగతుడనిపించుకొనేది దేనికి? ఆలోచించండి. మరి ఇది ఒక్కసారి చదవండి.

భావ వివరణ:

'తచ్చు' అనే పదము వికృతి. '(త్రచ్చు' అనేది ప్రకృతి. 'తచ్చు' అంటే మథించటం. అంటే చిలుకుట. అంటే బాగా ప్రయత్నించటం. అలా త్రచ్చితే దైవాన్ని కనుగొనగలం గాని, వూరకనే తిరుమలకొండలెక్కితే కనబడదు. అందుకే అసలున్నాడా అనిపిస్తుంది. మాకు అటువంటి, హెచ్చిన (పెరిగిపోయిన) మాయలలో పడుట భావ్యమా?

ప్రతిసారీ నేను ఆ స్వామిని యెంత సంపద కోరినా, దానితో పొరచి భోగించేది (పొంది సుఖపడేది) అశాశ్వతమైన ఈ దేహమే కదా! ఇక మనస్సు ఎన్నటికి తనిసీని (యెప్పుడు తృప్తిపడుతుంది?) గౌరవంతో శ్రీహరిని దర్శించగలిగితే అదే భాగ్యము.

ప్రతివాడు చావులేని బ్రతుకు కావాలని కోరుకొంటాడు, దేనికండీ అది? నీ వాళ్ళంతా చచ్చిపోయాక నీవొక్కడివే బ్రతికి యేమి చేస్తావు? ఎన్నిసార్లు చేసినా సంసారమే కాని మరొకటి కాదు కదా! కాని ఆ విష్ణుమాయవల్ల నేను చావకూడదనే ప్రతివాడూ ఆశపడతాడు. ఈ ఆశ యే కాలమున, ముదుసును? (ఎప్పుడు ముసలిదవుతుంది... అంటే యెప్పుడు తీరుతుంది?) తీరనే తీరదు. విష్ణుని శరణంటే అదొక్కటే నిలుస్తుంది. తక్కిన కోరికలన్నీ నశించేవే... కానీ... తీరేవి కావు.

వేడుకతో (కుతూహలంతో) ఎన్ని విద్యలు నేర్చుకొనినా పరులకు చూపించి సెబాసు అనిపించుకొనుటకే కానీ మరెందుకు? మహా అయితే దానివల్ల ధనలాభం రావచ్చును. మేడలు కట్టవచ్చును. కానీ చివరికి దాని వల్ల నీకేం ఉపయోగము? ఈ ఆశ వీడిన తలపుతో ఆ శ్రీవేంకటేశ్వరుని కొలిచి చూడు. నీకు అంతులేని ఆత్మానందం కలుగుతుంది. నీ బతుకు ఈడేరుతుంది (తరిస్తుంది). ఎన్నిక అవుతుంది. ఇంతకంటే కావలసినది ఇంకేమిటి చెప్పండి?

సంపుటి: 10-1 కీర్తన : అందరు వికారమందుదురె
సంఖ్య : 44 పుట : 25 రాగం: లలిత

లలిత

73. అందరు వికార మందుదురె
నిందలేని నీవు నాదాసులుదక్క ॥ పల్లవి॥

సతుల సుతులఁ జూచి జగములో వారెల్లా
మతిలోన భ్రమయక మానరు
రతికెక్కఁగా హేయరాగరహితుఁడవై
సతతము గలిగిన స్వామివి నీవు దక్క ॥అంద॥

ధనధాన్యములు చూచి తగినజీవులు వాని
వెనువెంటఁ దిరుగక విడువరు
పనిపూని యాశాపాశదూరుఁడవై
ఘనత గలుగు శ్రీకాంతుఁడ నీవు దక్క ॥అంద॥

యిల్లు ముంగిలి చూచి యీ దేహులు వాని
నొల్ల మనుచు రోసి వుడుగరు
వెల్లివిరగ శ్రీవేంకటనాథుఁడవై
తెల్లమైనయట్టి దేవుఁడవు దక్క ॥అంద॥

అవతారిక:

మానవమాత్రులైనవారు తమకున్న భోగభాగ్యాలు చూసికొని, తమ భార్యా బిడ్డల విశిష్టతలను చూసికొని, తమ ఇల్లు వాకిళ్ళు ధనసంపదలను చూసికొని వుబ్బి తబ్బిబ్బవడం సహజమే. వాటివల్ల వారికి కామ క్రోధాది వికారములు కూడా కలుగుతుంటాయి. అందరు అట్టి వికారములనందేవారే. అయితే నిర్మలులైన శ్రీ పతిదాసులు మాత్రం ఆయన శరణాగతిని తప్ప ఇంకా దేనినీ కోరరు, లెక్కచేయరు. వారికి

ఇంకేదైనా రోతయే. వారికి శ్రీకాంతుని చింత తప్ప ఇంకొకటి అక్కరలేదు అంటున్నారు చినతిరుమలాచార్యులవారు.

భావ వివరణ:

ఓ ప్రభూ! అందరు (ఈ ప్రపంచంలో వుండేవాళ్ళంతా) వికారమందుదురె (రాగద్వేషాది వికారములను అనుభవిస్తూనే వుంటారు). నిందలేని (ఏలోపము లేని) నీదాసులు (హరిదాసులు) దక్క (తప్పించి) ప్రతివాడికీ ఈ వికారాలు అతి సహజమే.

అందరు ఈ ప్రపంచంలో తమ భార్యల అందచందాలకు, కొడుకుల గొప్పతనం చూచి వాళ్ళ మనస్సులో గర్వించి తాము చాలా అదృష్టవంతులమని భ్రమపడుతూనే వుంటారు. కానీ వారంతా అశాశ్వతులు. శాశ్వతుడవైన స్వామివి నీవొక్కడివే. నీవు మాత్రమే రతికెక్కగా (విఖ్యాతుడవై) హేయము (ద్వేషము) రాగము (అనురాగము) రహితుడవు (లేనివాడవు). అట్టి నీవు తప్ప అందరూ రాగద్వేష పీడితులే.

ధనధాన్యములకాశపడి ఈ ప్రపంచంలోని జీవులంతా వాటి వెనుకనే పరుగులు తీస్తుంటారు. ఎన్నటికీ ఈ బలహీనతలను వారు విడువరు. ఓ శ్రీకాంతా! ఘనత గలిగిన నీవొక్కడివే పనిపూని (పనివేళా) ఆశాపాశమునకు దూరముగా వుండగలవు. మానవమాత్రులమైన మాకు ఆశాపాశము వురివంటిది.

దేహధారులైన ఈ మానవులంతా తమకున్న ఇళ్ళూ వాకిళ్ళూ చూసికొని గర్వంతో విఱ్ఱవీగుతూనే వుంటారు. రేపు మనము ఎలాగైనా వీటిని వదిలిపెట్టిపోయేవారమే కదా! ఎందుకు వాటిపై వ్యామోహం? అని వారు ఎన్నటికి రోయరు (విముఖులు కారు). నీవు శ్రీవేంకటేశ్వరుడవై వెల్లివిరి అయినావు (ప్రకటింపబడినాడవు). నీవు దక్క (తప్పించి) ఈ విధముగా తెల్లమైనట్టి (విఖ్యాతుడైన) దేవుడు ఇంకొకరు లేనే లేరు తండ్రీ!

సంపుటి: 10-1 కీర్తన : ఇందరునేల దూరేరు హితవే నీవుసేయగ
సంఖ్య : 40 పుట : 23 రాగం: ఆహిరినాట

ఆహిరినాట

74. ఇందరు నేల దూరేరు హితవే నీవుసేయఁగా
ముందుముందె తమ్ముఁ గర్మములు సేయుమంటివా ॥ పల్లవి॥

తెలిసి నిన్నుఁ గొలువ దేహ మిచ్చితివి గాక
బలిమినె మాయలలోఁ బడుమంటివా
మలసి నిన్నుఁ దలఁచ మన సిచ్చితివిగాక
కొలగట్టి విషయాలఁ గోరు మంటివా ॥ఇంద॥

నగుతా నిన్నుఁ బొగడ నాలు కిచ్చితివి గాక
అగడుగా నూరమాట లాడుమంటివా
సొగసి నిన్నుఁజూడఁగాఁజూపు లిచ్చితివి గాక
వగవగలతో నూరివారిఁ జూడు మంటివా ॥ఇంద॥

శ్రీవేంకటనాథ నిన్నుఁ జేరు మనంటివి గాక
జీవులను మనుజులాఁ జేరుమంటివా
భావించి నీదాసులనె భజించు మంటివిగాక
దావతి లంపటాలతోఁ దడఁబడు మంటివా ॥ఇంద॥

అవతారిక:

కాపాడినవాడిని కాటువేయటం కాలకూటవిషం కక్కే పాముకి సహజగుణము. పామరుడైన నరుడు ఆ పాముకి ఎందులోనూ తీసిపోడు. చినతిరుమలాచార్యులవారు ఈ కీర్తనలో "ప్రభూ! నీవు ఈ మానవుణ్ణి పుట్టించి, రక్షించి, వాడికోసం ఇంద్రియాలనిచ్చి ఎంతో హితవు చేస్తే వాడు ఆ ఇంద్రియాలను నిన్ను కీర్తించటానికి బదులు తుచ్ఛమైన కోరికలు

తీర్చుకోవటానికి వాడుతున్నాడే!! పైగా నీవిచ్చిన తెలివితేటలతో నీవే లేవని నిరూపించేందుకు నిన్ను తిడుతున్నాడు. ఇట్లాంటి దౌర్భాగ్యుణ్ణి ఈ చెడ్డపనులు నీవు చేయమన్నావా? ఏమి అజ్ఞానం!! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు హితవేసేయ (మేలేచేస్తే) ఇందరున్ యేలదూరేరు (నిందిస్తున్నారు?) నీవు ముందుముందే (మొట్టమొదట) వాళ్ళని, కర్మలు సేయమంటివా (చెడ్డపనులు చేయమన్నావా?) లేదుకదా!

ప్రభూ! నిన్ను తెలిసికొని కొలిచేటందుకు వీడికి దేహము (శరీరము) నిచ్చావు. బలవంతమైన మాయలో పడిపొమ్మన్నావా? లేదే? మలసి (ఉద్యమించి) నిన్ను ధ్యానించటానికి వీడికి మనస్సునిచ్చావు. వాణ్ణి కొలగట్టి (పాపచింతతో) విషయసుఖాల వెంట పరుగులెత్తమన్నావా? లేదే?

స్వామీ! వీడికి నీవు నాలుకయెందుకు ఇచ్చావు? నగుతా (నవ్వుతూ ఆనందంగా) నిన్ను పొగడమని ఇచ్చావు. అగడుగా (నిందిస్తూ) ఊరమాటలు (పనికిరానిమాటలు) ఆడమంటివా? రెండు కళ్ళు యెందుకిచ్చావు? సొగసి నిన్ను జూడగా (ఇంపుగా నిన్ను చూచి ధన్యుడవమని ఇచ్చావు). వగవగతో (రాగద్వేషాలతో) వూళ్ళోవాళ్ళని చూడమన్నావా? లేదే?

ఓ శ్రీవేంకటేశ్వరా ఈ జీవులను (మనుష్యులను) చేరి వాళ్ళ సాంగత్యంలో జీవితమంతా వ్యర్థంగా గడపమని చెప్పావా? లేదే? నిన్ను చేరుకోమని చెప్పావు. భావించి (సద్భావనతో) హరిదాసులను కీర్తించమన్నావు. అంతేకాని దావతిలంపటాలతో (దు:ఖభాజనమైన సంబంధాల పీకులాటలో) తడబడమంటివా (తత్తరపడుతూ బ్రతుకుమన్నావా?) లేదే? అన్నీ వీడు చేసికొని నిన్ను నిందించి ఇంకా యెక్కువ పాపం మూటకట్టుకొంటున్నాడు.

సంపుటి: 10-1 కీర్తన : ఇందరిజూచి చూచి యెఱఁగ వద్దా
సంఖ్య : 56 పుట : 32 రాగం: నాట

నాట

75. ఇందరిఁ జూచి చూచి యెఱఁగ వద్దా
బందెపసులకు మెడ పన్నించనేలా ॥ పల్లవి॥

యినుమునఁ జేసిరా యెవ్వరిదేహమైనా
పొనిఁగి పోతేఁబోవు పోకుంటే మాను
పనివడి యిందుకుఁగాఁ బాటవడ నేమిటికి
మొనసి దొసపంటికి యినుపకట్టేలా ॥ఇంద॥

మంచిరాతఁజేసిరా మనుజుని మేనేమి
నించి చెడితేఁజెడు నిల్చితే నిల్చు
పొంచిపొంచి యిందుకుఁగా పొడిఁబడనేఁటికి
పంచ నీరుబుగ్గ రాతిబరణిఁ బెట్టనేలా ॥ఇంద॥

చేఁగమానఁ జేసిరా చెల్లఁబో నరుల నెల్లా
యీఁగి కుంగితేఁ గుంగు హెచ్చితే హెచ్చు
నాఁగువార శ్రీవేంకటనాథుఁడు మన్నించఁగాను
దాఁగి జీలుగుబెండుకు తరము వెట్టనేలా ॥ఇంద॥

అవతారిక:

వైరాగ్యం (విరక్తి) తొణికిసలాడే కీర్తనలు చెప్పటంలో చినతిరుమలయ్య యెంతటి దిట్టతనం గలవాడో చూడండి. సంసారతాపత్రయంలోబడ్డ మానవులం కాబట్టి అప్పుడప్పుడు బందిలదొడ్డి (పసువులజైలు)లో, తప్పులు చేసిపడుతూనే వుంటాము. కానీ కనీసం ఇంతమందిని చూచి చూచి అయినా తెలుసుకోవద్దా. చిరకాలం ఆ 'బందెల పసువుల'లాగే వెతలకొగ్గి బ్రతకాలా అంటున్నారు. అద్భుతమైన వుదాహరణలతో తన నీతి బోధను వినిపిస్తున్నారు.

భావ వివరణ:

ఓ జనులారా! ఇంతమందిని చూచి చూచి అయినా మంచియేదో చెడుయేదో యెఱుగవద్దా? జీవితాంతం బందెల దొడ్డిలో బడిన పశువుల వలెనే మెడపన్నించి (తలవొగ్గి) బ్రతుకవలెనా?

మన దేహాన్ని ఇనుముతో చేశారా? ఎవ్వరిదేహమైన సున్నితమైనదే. దాన్ని పొనిగి (తృణీకరించి) పోతే పోయిందిలే అని దురుపయోగం చేయరాదు. అయితే ఇది శాశ్వతం అనుకొని ఏవేవో తిప్పలుపడి దీనికోసం పాటుబడటం దండుగమారిపని. ఎందుకంటారా... ఒక్కసారి ఆలోచించండి, మొనసి (పూనుకొని) దొసపంటికి (తొస్సిపన్ను కోసం) ఎవడన్నా ఇనుముతో చేసిన కట్టు వేయించుకొంటాడా?

మనుష్యుని మేను (శరీరం) యేమన్నా మంచి దిట్టమైన రాతితో చేశారా? చెడిపోతే పోయింది, వుంటేవుంది అని దురుపయోగం చేయవచ్చునా? చేయరాదు. అయితే దీనికోసం పొంచిపొంచి (తిప్పలుపడి) పొడిబడనేటికి (శ్రమపడుట యెందులకు?) అదిమాత్రం దండుగే. ఎందుకంటే... ఒక్కసారి ఆలోచించండి, నీటి బుడగ యెప్పటికైనా చిట్లిపోయేదేకదా! దాన్ని ఎవడన్నా రాతి భరణి (రాయితో చేసిన భరణి)లో పెట్టి కాపాడుతాడా?

చెల్లబో! (ఓరి నాయనో!) మనుష్యుల్ని చేగమానులతో (కొయ్యతో) చేశారా యేమిటయ్యా? ఈగి (బలహీనపడి) ఈ చేగమానులోపలికి వంగిపోతుంది లేదా పైకి వంగిపొడుచుకొస్తుంది. అయితే దీనికోసం శ్రమించి భద్రపరచక్కరలేదు. శ్రీవేంకటేశ్వరుడు నాగువార మన్నించగా (అభివృద్ధి చెందునట్లు దయదలంచితే) సరే.. కానీ.. ఎక్కడనైనా జీలుగుబెండుకు (చీలిపోయిన కొయ్యకు) తరమువెట్టనేల (నగిషీలు చెక్కిస్తాడా యెవడైనా?)

సంపుటి: 10-1 కీర్తన : ఎఱుక గలిగితేను యీతఁడె దిక్కు
సంఖ్య : 55 పుట : 31 రాగం: దేసాళం

దేసాళం

76. ఎఱుక గలిగితేను యీతఁడె దిక్కు
మఱి నిమిష మీతని మానివుండఁ దగునా ॥ పల్లవి॥

యెవ్వరిసొమ్ము గుడిచి యెవ్వరిగుఱ్ఱాలవెంట
క్రొవ్వుదీరఁ బారాడి కొలిచేది
యివ్వలఁ బుట్టించి పెంచి యేలినదేవుఁ డుండఁగా
అవ్వలివ్వలి వారిని ఆసపడఁదగునా ॥ఎఱు॥

తా నెవ్వరికిఁ బుట్టి తలఁకక వూరివారి
నానందాన అయ్య లమ్మ లనుకొనేది
పానిపట్టి సర్వవిధబంధుఁడు విష్ణుఁ డుండఁగా
మానిసిచుట్టరికాలు మరుఁగఁ జెల్లునా ॥ఎఱు॥

యెందువంకనో యీ దేహి యేమిటోనో పొగడుచు
విందువలె నెవ్వరిని వెఱ్ఱిఁ జేసేది
కందువైన శ్రీవేంకటనాథుఁడు గావఁగా
సందుసుడికోరికల సటఁబడఁ జెల్లునా ॥ఎఱు॥

అవతారిక:

'ఎఱుక' అంటే జ్ఞానం. తాళ్ళపాక చినతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలోని ఆనాటి తెలుగునుడికారపు విశిష్ఠతను గమనించండి. ఈ దేవదేవుడే అందరికీ దిక్కు అని చాలామందికి అనిపించదు. అలా అనిపించాలంటే ఆయనకు మనపై కృప రావాలి. ఆ ఎఱుక కలిగేదాకా ఎన్నిసార్లు చూసినామనకు విగ్రహమే కనిపిస్తుంది. చూస్తాము, దండము పెట్టుకొని వెళ్ళిపోతాం. కానీ ఒకనాడు ఆయనకు మనపై

దయకలుగుతుంది. మఱి నిముషమీతని మానివుండదగునా? అనిపిస్తుంది. సందుసుడి కోరికలన్నీ చప్పుడు చేయకుండా జారుకొంటాయి. ఏమిటిదంతా... అనుకొంటే... భావవివరణమే శరణము.

భావ వివరణ:

ఓ మానవులారా! అజ్ఞానం నశించి, ఎఱుక (జ్ఞానం) కలిగితే, ఈతడే మనందరికి దిక్కు అని స్ఫురిస్తుంది. మఱి (ఇక ఆపైన) ఒక్క నిమిషమైనా ఈదేవదేవుని మానివుండదగునా (వద్దు అని వుండవచ్చునా?)

ఎవ్వరిసొమ్ము గుడిచి (ఏ మనిషిని సేవించి వాడిచ్చిన జీతంతో) బలిసిన నా క్రొవ్వు కరిగేట్లు వాడెక్కిన గుఱ్ఱాల వెంట పరుగెత్తి వాడిని కొలిచేది? ఇక్కడ నన్ను పుట్టించి పెంచి నా రక్షకుడైన భగవంతుడుండగా... అవ్వలివ్వలివారిని (ఆపైలోకాలలోవున్న అన్యదేవతలను, ఈ భూమ్మీదున్న ధనవంతులను) ఆసపడదగునా (ఆశించి యాచించవచ్చునా?)

ఎవ్వరో ముక్కూ మొగము తెలియని వాళ్ళకి పుట్టి, తలకక (ఏమాత్రం చలించక) వారినే అమ్మా నాన్నలనుకొని సంతోషపరచాను, సంతోషం పొందాను. అన్ని విధములా శ్రీమహావిష్ణువే పానిపట్టి (పనివేళా) అందరికీ ఆప్త బంధువు. ఆయనుండగా ఈ మానవచుట్టాలతో కాలయాపన చేయవచ్చునా?

ఎందువంకనో (దేనికోసమో), ఏమిటినో (ఏమిటేమిటో) పొగుడుతూ, ఈదేహముతో ఎవ్వరిని విందువలె వెఱ్ఱి చేసేది (సంతోషంతో) వెఱ్ఱివాళ్ళను చేయమంటారు చెప్పండి)? కందువైన (సర్వసమర్థుడైన) శ్రీవేంకటేశ్వరుడు కావగా (అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతుంటే) సందుసుడి కోరికలు (సందుచూసుకొని మధ్యలో పుట్టే కోరికలవల్ల) సటబడజెల్లునా? (సతమతమవటం తగినపనియేనా?) చెప్పండి.

సంపుటి :10-1 కీర్తన:ఎట్టి హితోపదేశకుడు డెటువంటి దయాళువు
సంఖ్య : 52 పుట : 29 రాగం: దేసాళం

దేసాళం

77. ఎట్టి హితోపదేశకుఁ డెటువంటి దయాళువు
అట్టె తాళ్లపాకన్నమాచార్యులు ॥ పల్లవి॥

పచ్చి తామసుల మమ్ముఁ బరమసాత్వికులఁగా
యిచ్చటనె సేసినాఁడు యెంత చిత్రము
యిచ్చగించి మా కులాన నెన్నఁడులేని వైష్ణవ
మచ్చముగాఁ గృపసేసె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥

ముదిరిన పాపకర్మములు సేసినట్టి మమ్ము
యెదుటఁ బుణ్యులఁజేసె నెంత సోద్యము
కదిసి యే జన్మానఁ గానని సంకీర్తన
మదన నుపదేశించె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥

గడుసుఁదనపు మమ్ముఁ గడు వివేకులఁ జేసి
యిడుమ లెల్లాఁ బాపె నే మరుదు
నడుమనె యెన్నఁడుఁ గానని శ్రీవేంకటనాథు
నడియాలముగ నిచ్చె నన్నమాచార్యుఁడు ॥ఎట్టి॥

అవతారిక:

తన తాతగారైన అన్నమాచార్యులవారిపై కీర్తన వినిపిస్తున్నారు తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారు. మాకులములో యెక్కడా లేని వైష్ణవమును మాకు అచ్చముగా కృపచేశారయ్యా ఆయన అని అంటున్నారు. ఎందుకంటే జన్మత: అన్నమయ్య శైవులు. ఓంనమో వేంకటేశాయ అనే అష్టాక్షరీమంత్రాన్ని హితోపదేశంగా చేశారు. ఎంతదయాళువు ఆయన తాళ్ళపాక అన్నమాచార్యులు!! అని కీర్తిస్తున్నారు.

మేము తామసులం, పాపకర్మిష్ఠులం, గడుసుదనం కలవాళ్ళం. మమ్మల్ని కూడా శ్రీవేంకటేశుని దాసులు చేశారు, ఆ స్వామిని అడియాలముగా మాకిచ్చారు అని అంటున్నారు. అంటే యేమిటో...

భావ వివరణ:

అట్టె (అదిగో) ఈ తాళ్ళపాక అన్నమాచార్యులవారు, యెటువంటి హితబోధకుడు!! యెంతటి దయామయుడు!!

మేము జన్మత: పరమ తామసులము. అటువంటి మమ్ము ఇక్కడే పరమసాత్వికులను చేశాడాయన. ఎంత చిత్రంగా వున్నది!! మేము పుట్టుకతో శైవులము. మా కులములో విష్ణువును సేవించటం యెన్నడూ లేదు. అటువంటిది, ఇచ్చగించి (ఇష్టపూర్వకంగా) వైష్ణవాచార్యులుగా మారి, మాకు శ్రీమన్నారాయణుని అచ్చముగా అందించారు ఈ అన్నమాచార్యులవారు. ఇంతకంటే యేమి కావాలి చెప్పండి?

మేము పాపకర్మలు చేయటంలో ముదిరిపోయాం (అలవాటుగా మారిపోయాము)-అటువంటి మమ్మల్నే చినతిరుమలాచార్యులవారిగాను, పుణ్యాత్ములుగానూ చేశారు. ఎంత చోద్యం!! కదిసి (మాకుదగ్గరయై) ఏ జన్మలోనూ ఎరుగని సంకీర్తన మదనను (సంకీర్తనా వసంతశోభను) మాకు ఈ అన్నమాచార్యులవారు ఉపదేశించినారు. మేమెంత అదృష్టవంతులం!!

మేము స్వతహాగా గడుసుదనముగలవాళ్ళం. (మొండితనంగలవాళ్ళం). అటువంటి మమ్మల్నే వివేకవంతులను చేసి అన్నమాచార్యులవారు మా ఇడుములన్నీ బాపె (కష్టాలన్నీ తీర్చినారు). నడుమనే (మా మధ్యలోనే) ఏనాడూ ఎవ్వరికీ దర్శన భాగ్యం ఇవ్వని ఆ శ్రీవేంకటేశ్వరుని ఈ అన్నమాచార్యులవారు, మాకు అడియాలము (మకుటము)గా ఇచ్చారు. అందుకే మేము కూడా 'శ్రీవేంకట' మకుటంతో కీర్తనలు చెప్పి తరిస్తున్నాము.

సంపుటి: 10-1 కీర్తన : ఎంతలేదిదియెంచిన
సంఖ్య : 10 పుట : 6 రాగం: గుజ్జరి

గుజ్జరి

78. ఎంతలే దిది యెంచిన
సంతోషించని సంసారంబు ॥ పల్లవి॥

యేలకొ నేఁ డీదేహి
ఆలరి భోగము లడిగీఁగాక
చాలించఁగఁ జాలఁడు
కోలుముందు హరిఁ గొలువఁగరాదా ॥ఎంత॥

యెందైనను యీమనసు
పందదనంబునఁ బారీఁగాక
ముందరికోరిక ముణుఁగదు
కందువ శ్రీవిభుఁ గానఁగరాదా. ॥ఎంత॥

విడువనితగు లీవేడుక
తొడిఁబడ నెందవైన దొరసీఁగాక
కడగని శ్రీవేంకటనాథు
బడిబడిఁ దిరుగుచు బ్రదుకఁగరాదా. ॥ఎంత॥

అవతారిక:

'ఎంతలేదు' అంటే ఎంతైనావున్నది అని అర్థం. ఆలోచించిచూస్తే ఈ సంసారం ఎంతకైనా తగినదే. దీంట్లో సంతోషించనివారే కానీ తృప్తిగా ఆనందంగావుండేవారు లేరు అంటున్నారు, చినతరుమలయ్య. దీంట్లోని వేడుకలన్నీ ఎన్నటికీ వదలని 'తగులు' (లంపటాలు). అవి తొడబడనెందైన దొరసీగాని అంటున్నారు. అంటే విచలితులనుచేసి ఎన్నటికీ విడువలేని స్థితికి తీసికొనిపోతుంది. ఈ వెధవ పీకులాట బదులు ఆ వేంకటేశ్వరుని

నమ్ముకోరాదా? బ్రతికిన నాలుగురోజులు హాయిగా బ్రతుకరాదా? అంటున్నారు.

భావ వివరణ:

ఓ మానవులారా! ఎంచిన (ఆలోచించిచూస్తే) ఈ సంసారము యెంతలేదు? (యెంతటికైనా తగినదే). పోనీ ఇది సుఖమయం అనుకొందామా అంటే, కాదు. ఇది సంతోషించని (సంతోషమే లేని) సంసారము.

ఈ శరీరంలోవుండే దేహి (ఆత్మ) ఏలకో ఆలరిభోగము లడిగీ (ఎందుకనో చిలిపి భోగములనే కోరుకొంటాడు). నేడు చాలించగ జాలడు, (ఈరోజునుంచి నాకు ఈ భోగాలు చాలు, ఇకవద్దు అని మాత్రం అనడు). దీని బదులు ముందుగానే శ్రీహరిని శరణువేడవచ్చును కదా! అదేం మాయయో చచ్చేదాకా ఆ శ్రీహరి జోలికిపోడు.

ఈ మనస్సు అనేది యెంత విచిత్రమైనది!! ఇది పందదనంబున (పిఱికితనంతో) యెందైననూ బారీ (ఎక్కడికైనా పారిపోతుంది) కాని, దీనికి నిలబడి కష్టాలనెదుర్కొనే ధైర్యం లేదు. తీరని కోర్కెలతో ఇట్లాగే కోరికలతో సతమతమవుతుందికాని, ముందరి కోరిక ముణుగదు (పరము గురించిన ఆలోచనలనే రానీయదు). ఈ మనస్సు చేసే మాయాజాలంలో మగ్గే బదులు, కందువ (సామర్థ్యంతో) శ్రీపతిని దర్శించరాదా? మనశ్శాంతి పొందరాదా?

మిత్రులారా! ఈ వేడుకలున్నాయి చూశారా, ఇవి విడువని తగులు (విడిచిపెట్టని పెట్టలేని పీకులాట. ఒక్కసారి వీటిని అనుభవించామంటే తొడిబడన్ (విచలతులమయ్యేట్లు) చేస్తుంది. ఎందైనా దొరసీ (ఎన్నటికీ విడువలేని స్థితికి తీసికొనిపోతుంది). మరి దారేమిటి? ఈ వెధవ పీకులాట బదులు, కడగని (వీటిని అంతము చేసికొని) శ్రీవేంకటేశ్వరుని, బడిబడిదిరుగుచు (వెంటవెంట తిరుగుతూ) బ్రతుకరాదా!

సంపుటి: 10-1 కీర్తన : నీవు గలిగిన జాలు నిక్కము అన్నీ గలవు
సంఖ్య : 46 పుట : 26 రాగం: రామక్రియ

రామక్రియ

79. నీవు గలిగినఁ జాలు నిక్కము అన్నీఁ గలవు
ఆవల మాయాచార్యుఁ డానతిచ్చెనయ్యా ॥ పల్లవి॥

యేలోకమున నున్న యెడయనిసొమ్ము నీవె
తాలిమి యెందుఁ బోని ధనము నీవె
కాలముకడా తరగని ధాన్యము నీవని
ఆలించి మాగురుఁ డిట్టె ఆనతిచ్చెనయ్యా ॥నీవు॥

యెందెందుం దిరిగిన యేలికవు నీవె
నిందలేనియట్టి తోడునీడవు నీవె
ముందువెనకల నిల్లు ముంగిలియు నీవె యని
అందముగ దేశికుఁడె ఆనతిచ్చెనయ్యా ॥నీవు॥

యెన్నఁడుఁ గలఁగనట్టి హితుఁడవు నీవె
పన్నినట్టె వుండె నిచ్చపంటా నీవె
నన్నుఁ గాచే శ్రీవేంకటనాథుఁడ వని తాళ్లపా
కన్నమయ్యగారె నాకు నానతిచ్చిరయ్యా. ॥నీవు॥

అవతారిక:

ఈ కీర్తనద్వారా తన గురువు (ఆచార్యుడు) స్వయంగా తన తాతగారైన అన్నమాచార్యులవారేనని చెబుతున్నారు, చినతిరుమలయ్య. తాతగారి పెంపకంలో పెరిగి తామసుడనైన తాను సాత్త్వికునిగామారేనని ఆయనే వేరొక కీర్తనలో చెబుతారు. నన్ను గాచే శ్రీవెంకటనాథుడవని తాళ్ళపాక అన్నమయ్యగారె నాకు ఆనతిచ్చారయ్యా అని పేర్కొంటున్నారు. అన్నట్లు దేశికుడు అంటే గురువుగారని అర్థం.

భావ వివరణ:

ఓ దేవదేవా! నిక్కము (ఇది నిజము). నీవు గలిగిన జాలు (నీవు లభ్యమైతే ఇకచాలు). అన్నీ గలవు (సర్వమూ లభిస్తాయి). ఆవల (ఆనాడు) మా ఆచార్యుడు (గురుదేవులు) ఆ విధముగా ఆనతిచ్చిరి (ఆజ్ఞాప్రబోధము చేశారు).

నీవు ఏలోకములోనున్నా, యెడయని సొమ్ముివు (తొలిగిపోని ఆభరణానివి). నీవు ఎందుబోని తాలిమి ధనము (ఎక్కడికీ పోని ధైర్యము అనే ధనము) నీవు ఎంత కాలము తినినా తరగని ధాన్యముివంటివాడవు. ఇదంతా వేరెవరో చిన్నా చితకావాడు చెప్పలేదు. స్వయంగా మా గురువు మా సంగతులన్నీ విని ఇదే మంచి తరుణోపాయమని సెలవిచ్చారు.

ఎందెందు తిరిగినా (మేము ఏ రాజ్యం వెళ్ళినా) యేలికవు నీవే. నిన్ను వుల్లంఘించి మేమెక్కడికి పోగలము? నీవు నిందలేనియట్టి తోడు నీడవు. (నీ ఆశ్రయంలో వుంటే యెవ్వరికీ యే నిందారాదు). ప్రభూ! నీవు ఇట్లు ముంగిలివి (ఇంటి మధ్య ప్రదేశానివి). అయితే విచిత్రంగా ఆ ఇంటికి ముందు భాగమూ నీవే, వెనక భాగమూ నీవే. (అంటే మా ఇంట్లో అణువణువునా వున్న రక్షకుడు నీవే), ఈ విషయం మా దేశికుడు (ఆచార్యుడు) చక్కగా సెలవిచ్చారు.

స్వామీ! నీవు యెన్నడున్ కలగని (వెనుకంజవేయని) హితుడవు (స్నేహితుడవు). మిగతాహితుల మాదిరి అవసరానికి మొగము చాటువేయవు. నీవు పన్నినట్టే వుండే నిచ్చపంటవి. (మేము ఆశించినట్లే పుష్కలంగా పండే అందులోనూ నిత్యమూ పండే పంటవు నీవే.) నన్ను రక్షించే శ్రీవేంకటేశ్వరుడు నీవే, ఈ విధంగా మా తాతగారు తాళ్ళపాక అన్నమాచార్యులు సెలవిచ్చారయ్యా! అందుకే మేము నీదాసులం అయ్యాము తండ్రీ!

సంపుటి: 10-1 కీర్తన : ఎవ్వరు చెప్పినా మనసేల మానును
సంఖ్య : 8 పుట : 5 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

80. ఎవ్వరుచెప్పినా మనసేల మానును
యివ్వలవ్వలౌఁగాక యేలమానును ॥ పల్లవి॥

కమ్ముకొన్న యింద్రియాలు గారడించఁగా జీవుఁ
డెమ్మెలఁ బొరలక మరేల మానును
యిమ్ములేనికోరికలు యెక్కెక్కు లాడఁగాను
వుమ్మడికర్మాలు సేయ కూర కేల మానును ॥ఎవ్వరు॥

పేరడిమదములెల్లా పెనగొనఁగా నొరుల
నీరసించ కీ దేహి యేలమానును
తీరనిచలము లివి తెలివి చెరుచఁగాను
యేరవెట్టుకొని యుండ కేలమానును ॥ఎవ్వరు॥

వుడివోనియాసలు వొత్తుకోలుసేయఁగాను
యిడియక యీప్రాణుఁ డేలమానును
కడువేగ శ్రీవేంకటనాథుఁడు గావఁగా
నెడయక కని మన కేలమానును. ॥ఎవ్వరు॥

అవతారిక:

ఆలోచనకి కేంద్రం మనస్సు. ఆశ దీని బలహీనత. వాటివల్ల కోరిక పుడుతుంది. అది తీరక వేదన కలుగుతుంది. అది చివరికి మృత్యువు క్రింద పరివర్తితమై తీరుతుంది. మనస్సుకున్న ఇంకొక దుర్గుణం ఏమిటంటే, ఇది ఎవ్వరి మాటావినదు. ఇవ్వలవ్వలవటం అంటే ఇటూ అటూ అయిపోవటం. అంటే తత్తర జెందటం. ఈ మనస్సు మనిషిని తత్తరజెందేట్లు చేస్తుంది. ఇక మనస్సు చేత పీడించబడే మానవుడికి ఆ

తిరుమల శ్రీవేంకటనాథుడు తప్ప ఇంకా రక్షించేవాడెవరు? అంటున్నారు చినతిరుమలాచార్యులవారు.

భావ వివరణ:

మన మనస్సు చాలా మొండిది. అది యెవ్వరు చెప్పినా (మంచి బోధించినా) ఏల మానును? ఎందుకు మానివేస్తుంది? ఇవ్వల అవ్వల బొగాక (ఇటూ అటూ తత్తరజెంది కలతపడుతుందేకాని) యేలమానును (యెందుకు మానివేస్తుంది?

ఈ జీవుడున్నాడే... వాడి ఇంద్రియాలు వాడిని కమ్ముకొని (ఆక్రమించుకొని) గారడించి (గారడీచేసి) ఎమ్మెల బొరలించును (విలాసాలలో పొర్లిపోయేట్లు) చేస్తాయి. మరి మనస్సు ఆ అనుభవాలను యెందుకు మానివేస్తుంది? ఇమ్ములేని కోరికలు (తీరని వాంఛలు) యెక్కెక్కులాడు (రోజు రోజుకీ పెరుగుతూనే వుంటాయి. అటువంటప్పుడు ఈ జీవుడు ఉమ్మడి కర్మలు సంచిత, ఆగామికర్మలు) చేయకుండా, ఏల మానును? మరివాడి కర్మకి యెవరేం చేస్తారు?

ఈదేహి వున్నాడే... వాడిని పేరడిమదములెల్లా పెనగొను (విజృంభించిన మదము ఆక్రమిస్తుంటుంది). అప్పుడు వాడు అందరినీ నీ (ని)రసిస్తూనేవుంటాడు (తిరస్కరిస్తుంటాడు). ఏలమానును (అట్లావుండక యెందుకుమానుతాడు?) ఆ దేహికుండే అంతులేని చలము (మత్సరము) వాడి తెలివిని (ఇంగిత జ్ఞానమును) హరించగా, వాడు యేరువెట్టుకొనియుండు (తానే అధికుడనని కలివిడిలేక వుంటాడు). అట్లుగాక యేలమానును? (ఎందుకు మానివేస్తాడు?)

ఈ ప్రాణులు వున్నారే... వీళ్ళని వుడివోని ఆసలు (తీరని ఆశలు) వొత్తుకోలుసేయు (ఒత్తిడిచేస్తూనే వుంటాయి). అటువంటప్పుడు వాళ్ళు, ఇడియక (చీలిపోక) యేలమానును (యెందుకుంటారు?) మరి ఇక దారి యేమిటండీ... అంటే, శ్రీవేంకటేశుని శరణు అనండి. అప్పుడు ఆయన కడువేగ (వెనువెంటనే) కావగా (రక్షించగా) ఈ మనస్సు, కని (ఆయనను దర్శించి) యెడయక (ఎన్నడూవిడిచిపెట్టక) మనును (వుంటుంది). ఏలమానును (ఇంకా యెందుకు మానదు?) తప్పక మానివేస్తుంది.

సంపుటి: 10-1 కీర్తన : చలమె చెల్లించుకొన్న సతులాల
సంఖ్య : 28 పుట : 16 రాగం: గుజ్జరి

గుజ్జరి

81. చలమె చెల్లించుకొన్న సతులాల
సులభమా మీతో పొందు సుతులాల ॥ పల్లవి॥

వ్రతి నైన యతి నైన వలలమాటలఁ బెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల
హితవరుల వలెనె యింత నంత నెలయించి
తతి గొందురుగా ధనధాన్యములాల ॥చలమె॥

పెద్దనైన పిన్ననైన పెలుచుఁదనమె రేఁచి
కొద్ది మీరించిన కామక్రోధములాల(?)
అద్దొ యెంత విరక్తు నైనా విషయాలకె
దిద్దితిరిగా పంచేంద్రియములాల ॥చలమె॥

ముని నైన ఋషి నైన మోహమె పెంచి మరపి
మొనసితిరిగా యిల్లు ముంగిళ్ళాల
ఘనుఁ డైన శ్రీవెంకటనాథుపాదములు
చనవునఁ జూపితి రాచార్యులాలా. ॥చలమె॥

(చినతిరు - అధ్యా - 28 సంకీర్తన.)

అవతారిక:

స్త్రీలు తమకున్న సిరిసంపదలవల్ల అహంకరించి గట్టి పట్టుదలతో వుంటారు. దానిని 'చలము' అంటారు. ఎప్పుడూ దానిని చెల్లించుకోక మానరు. అట్లాగే కొడుకులతో పొందు (కలిసివుంటే) అనేక ఇబ్బందులు తెచ్చిపెడుతుంది. వాటితో వేగటం అంతసులభమా?... అంటున్నారు చినతిరుమలయ్య. ఆరువందల సంవత్సరాలక్రితం అదీ పరిస్థితి అయితే, నేటి

నవీన భారతావని గురించి చెప్పేది యేముందండీ? "కొద్దిమీరించిన కామ క్రోధాలు, పెద్దనైన పిన్ననైన పెలుచుదనమె రేచి" అంటున్నారు చినతిరుమల. ఏదో అర్థమయ్యీ కానట్లు వుందికదా! భావవివరణ చదవండి మరి.

భావ వివరణ:

ఓ సతులాల! (భార్యామణులారా!) మీరు చలమె చెల్లించుకొన్న (మీ మొండిపట్టుదల నెగ్గించుకొన్న) ఘనులు. ఓ సుతులాల (కొడుకుల్లారా!(మీతో పొందు (కలిసివుండటం) సులభమా (అంత తేలిక అయిన పని అనుకొన్నారా?)

ఓ బంధువుల్లారా! మీరు వ్రతదీక్షాదక్షుడినైనా, యతీంద్రుడంతటివాడినైనా మీ వలలమాటల (మాయమాటలతో బాగా చెడగొడతారు). ఓ ధనధాన్యములారా! మీరు హితవరుల వలె (మేలుచేసేవాళ్ళవలె) యింతనంత నెలయించి (ఇంతా అంతా అహంకరింపించి) తతి గొందురుగా (విఱ్ఱవీగేట్లు చేస్తారు). దానివల్ల మనిషి చెడకుండా వుంటాడా?

ఓ కామక్రోధములారా! మిమ్మల్ని కొద్దిమీరించిన (కొద్దిగా వుండక పెట్రేగిపోయేట్లు చేస్తే) మీరు, పెద్దవాళ్ళనైనా చిన్నవాళ్ళనైనా పెలుసుదనమేరేచి (అతిశయంతో కఠినులయేట్లు చేస్తారు.) ఓ పంచేంద్రియములారా! (కన్ను, ముక్కు, చెవి, నోరు, చర్మం) అద్దో (అదిగో) మీరు యెంత విరాగినైనా విషయాలకే దిద్దితిరిగా (విషయలోలుడవునట్లు మారుస్తారు కదా!) ఎంత దుర్మార్గులు!!

ఓ ఇల్లు ముంగిళ్ళలారా! మీరు మునినైనా ఋషినైనా మోహభరితుల్నిచేసి, మరపిపెంచి (వారికి గతంలో వారి స్థితిని మఱచిపోయేట్లు చేసి) మొనసితిరిగా (పూనుకొంటారు కదా!) అటువంటి దుస్థితిలో మా ఆచార్యులు (మా గురుదేవులైన మా తాత అన్నమాచార్యులవారు) చనవున (ప్రేమతో) ఘనుడైన శ్రీవేంకటేశ్వరుని పాదములు జూపితిరి (చూపించారు). ఓ గురుపుంగవులారా! మీరు చేసిన మేలును మరువలేను.

సంపుటి: 10-1 కీర్తన : ఏలికెవైన నన్నొకని నేలగాను నీ
సంఖ్య : 34 పుట : 18 రాగం: దేసాళం

దేసాళం

82. ఏలికెవై న న్నొకని నేలఁగాను నీ
లీలావిభూతి కొకలేశము దక్కువా ॥ పల్లవి॥

పని పూని నాయొకనిపాపము మానుపఁగా నీ
ఘనసంకల్పమునకుఁ గడమా
చెనకి నేనె పూజ సేయఁగా మెచ్చే నంటె
కనుకొనే వందేమి కండ గట్టుకొంటివో ॥ఏలిక॥

దేవుఁడవై నామనసు దెరిచి రక్షించఁగాను
గోవింద నీమాయ కేమి గొఱతా
సోవల నాలోని భక్తి చూచి కాచే నంటివా
కావలసి నీవెంత గాదెఁ బోసుకొంటివో ॥ఏలిక॥

అలరి నాహృదయమునందుఁ గానుపించితేను
వెలయ నీమహిమకు వెలితా
కలిమితో నన్ను శ్రీవేంకటనాథ కూడితివి
యిలమీఁద నీకు నిప్పు డెంత కీర్తి గూడెనో. ॥ఏలిక॥

అవతారిక:

తనతాతన అన్నమాచార్యులవారి కీర్తనలు చదివి, చదివి జీర్ణించుకొనిన మనుమడు చినతిరుమలయ్య కూడా అటువంటి కీర్తనలే రచించినాడనుటకు ఈ కీర్తన గొప్ప ఉదాహరణ. ఆయన అన్నమయ్య కీర్తన 'నేనొక్కడలేకుండితే నీ కృపకు బాత్రమేదీ' (అన్న. అధాత్మ 8 సంపుటి - 49వ కీర్తన) అనేదాన్ని ఎన్నోసార్లు చదివి ఆకళింపుచేసుకోవడం వలన ఇటువంటి కీర్తనలు వెలుగులోకి వచ్చివుంటాయి. 'నన్నొక్కణ్ణి రక్షిస్తే నీ

సొమ్మేంపోతుందయ్యా? నీలీలా విభూతి ఒక్కలేశమైనా తక్కువవుతుందా? నాకు కనిపించినంతమాత్రాన నీ మహిమ కొచ్చిన వెలితియేమిటయ్యా వెంకటనాథా'! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! యేలికవై నన్నొక్కడిని యేలగాను (రక్షించినంతమాత్రాన) నీ లీలావిభూతికి (నీలీలావైభవ ప్రదర్శనకు) ఒక్క లేశము దక్కువా? (కొంచెమైనా తరుగువస్తుందా) చెప్పవయ్యా! స్వామీ!

ప్రభూ! నీసంకల్పానికి తిరుగులేదు. నిజమే అదిఘనమైనదే... కానీ పనివేళా నాయొక్కడి పాపము మాన్పినంతమాత్రాన నీసంకల్పానికి యేమన్నా నష్టమా? చెనకి (అందరినీ కాదని) నాయొక్కడిపూజను మెచ్చుకొని స్వీకరించినంతమాత్రాన నీకు పోయేదేముంది స్వామీ? కనుకొనే వందేమి కండగట్టుకొంటివో? (దానికోసం నీవు నీకండల్ని కరిగించుకోవాలటయ్యా?) ఎంత సునాయాసంగా నా పూజలు స్వీకరించవచ్చును?

ఓ గోవిందా! నీమాయ దాటరానిది. అది జగద్విదితమైన విషయమే కదా! కానీ నీవు దేవుడవు, నేను అజ్ఞానిని. నా మనసుదెరిచి (నాకు జ్ఞానం ఇచ్చి) రక్షించినంతమాత్రాన నీ మాయకు వచ్చిన లోపం యేమిటయ్యా? సోవల (ఋజువైన) నా భక్తిని చూచి నన్ను కాచేనంటివా (రక్షిస్తానంటే) కావలసినంత వున్నట్టి నీ దయ అనే గాదెలో (ధాన్యాగారంలో) గాదెబోసుకొంటివో (ధాన్యం తరిగిపోతుందటయ్యా! కాస్త దయచూపిస్తే చాలు కదటయ్యా!

ఓ మహానుభావా! నాహృదయంలో అలరి (నెలకొని) అందు గానుపించితే (నా హృదయంలో దర్శనమిచ్చినంతమాత్రాన, ఇదివరకే యెంతో మందికి, యెన్నో విధాలుగా, యెన్నోసార్లు నిరూపింపబడిన నీమహిమకు వచ్చిన ఇబ్బందేమిటయ్యా! ఇప్పుడు చూడు నీ కృప అనే కలిమితో (సంపదతో) నన్ను కూడితివి (నావాడివైనావు.) ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు చూడు నీకీర్తి ఈ యిలమీద (భూమిమీద) యెంత ప్రసిద్ధి చెందుతుందో!!

సంపుటి: 10-1 కీర్తన : పంకె లేక తలచిన జాణలకు
సంఖ్య : 20 పుట : 11 రాగం: మలహరి

మలహరి

83. సంకె లేక తలచిన జాణలకు
సంకీర్తనమె పో సర్వశాంతి ॥ పల్లవి॥

భవహర మగుశ్రీపతినామమె
జపకట్టి తలంచితే జన్మశాంతి
తవిలి హరిపూజ తాఁ జేయుటె
కువలయమున నిదిగో గృహశాంతి ॥సంకె॥

అంది ధ్రువవరదుఁడ యనినదె
కందు వైన సర్వగ్రహశాంతి
యిందురవినయనుని నెరుఁగుటె
చందమైన దిదివో నక్షత్రశాంతి ॥సంకె॥

భావించి యనంతునిఁ బలుకుటె
కావించిన దిదివో కాలశాంతి
శ్రీ వెంకటనాతునిఁ జేరుటె
దేవమానవులకును దేహశాంతి ॥సంకె॥

అవతారిక:

'సంకెలేక' అంటే అసంఖ్యాకమైన అని భావించ రాదు 'శంకలేక' అంటే ఏమాత్రం అనుమానం లేక, తలచిన (ధ్యానించిన) జాణలకు సర్వ శాంతికరము సంకీర్తనయేపో - అంటున్నారు చినతిరుమలాచార్యులవారు. ఆ శ్రీహరినామం జన్మశాంతికరము, గృహశాంతికరము, గ్రహశాంతికరము, నక్షత్ర శాంతికరము, కాలశాంతికరము, దేహశాంతికరము అని, అదెలాగో వివరిస్తున్నారు. తాతగారి ప్రభావం మనుమడిపైనెంతుందో చెప్పటానికి ఈ కీర్తన చక్కటి ఉదాహరణ.

భావ వివరణ:

ఓ మానవుల్లారా! సంకెలేక (ఏమాత్రమూ, శంక కాని సంశయము కానిలేక) తలచిన జాణలకు (ధ్యానించిన నేర్పరులకు) సర్వశాంతికరము (అన్నివిధములా శాంతిని కలిగించునది) శ్రీహరి సంకీర్తనమె పో (నారాయణుని కీర్తించుటే సుమా!)

భవహారమగు (పుట్టుకనుండి విముక్తి చేయు) శ్రీపతినామమును, జపకట్టి తలంచిన (భద్రముగ ధ్యానిస్తే) జన్మశాంతి కలిగి మరుజన్మ లేకుండా పోతుంది. తాను తవిలి (ప్రయత్నపూర్వకంగా శ్రీహరిపూజ చేయుటయే కువలయవమున (ఈ భూమి మీద) గృహశాంతి. శ్రీహరినామం జపించక, వెయ్యిమంది పురోహితులతో ఎట్టి 'శాంతి' చేయించినా ఫలితం పెద్దగుండుసున్నా అని గ్రహించండి.

బ్రాహ్మణోత్తములను నియోగించి, నవగ్రహాలకు శాంతి జరిపించుకొంటే కలిగే మేలు బహుస్వల్పం. ఆ శాంతి, అశాంతి కాకూడదనుకొంటే దానితో పాటు అంది (పూనుకొని) ధ్రువవరదుడ (ధ్రువుని అనుగ్రహించినవాడా! (అని అనండి. అదే, కందువైన (సమర్థవంతమైన) గ్రహశాంతి చేస్తుంది.

కొంతమంది నక్షత్రశాంతి చేయించుకొంటారు. కాని నందనందనుని స్మరించరు. అదెంత తెలివిలేని పనియో చూడండి. ఇందు రవి నయనుడు (చంద్రుడు సూర్యుడు తనకన్నులుగా గల) శ్రీహరిని తెలిసికొనుటయే, చందమైన (చక్కటి) నక్షత్రశాంతి. ఇంకొకటి లేదు.

కొంతమంది మాకు కాలం బాగుగా లేదు (మా 'టైమ్' బాగోలేదండీ) అని రక్షరేకులు యంత్రాలు కట్టించుకొంటారు. అదీ డబ్బుదండగ పనియే. భావించి మనస్ఫూర్తిగా అనంతుని పలుకుటే (ప్రార్థించుటే) గొప్పకాలశాంతి. మన బాగోగులు ఆయనే చూసికొంటాడు. దేవతలకు మానవులకు దేహములిచ్చిన దేవదేవుడు శ్రీవేంకటేశ్వరుడు. ఆయనను చేరి కీర్తించుటయే గొప్ప దేహశాంతి. అదిగాక ఇంకేదైనా పనికిమాలినదే.

సంపుటి: 10-1 కీర్తన : అందుకేమి దోసమా అయితే నేమి
సంఖ్య : 119 పుట : 69 రాగం: సాళంగనాట

సాళంగనాట

84. అందు కేమి దోసమా అయితే నేమి
కందు వై లోకములోనఁ గలదే కాదా ॥ పల్లవి॥

వలచి యిందిరాదేవి వన్నెలుఁ జక్కఁదనాలు
వలఁపులో నేపొద్దూఁ దలపోయఁగా
సలిగెతోడుత నాపె సారూప్య మందినట్టు
నలు వై గోవిందుఁడే నారాయణి యాయను ॥అందు॥

బాలకియై లకిమమ్మ పై పై శిగ్గువడఁగా
తేలించి యాపె మనసు తెలియఁ బూని
చాలా వేడుక నాకె సకియె యుండినటు
ఆలికిఁ గా భువనమోహనరూప యాయను ॥అందు॥

యెడయ కింతులలో మే లెల్లాఁ దెలియఁ బూని
కడఁగి యాఁడురూపము గైకొని చూచి
బడినె తనకు నెందూఁ బతిలేనివాఁడు గాన
కడ గోవిందుఁడే శ్రీవెంకటనాథుఁ డాయను ॥అందు॥

అవతారిక:

వైరాగ్య కీర్తనలు చెప్పటంలో దిట్ట అయిన చిన తిరుమలయ్య చెప్పిన సరసశృంగారకీర్తనను మచ్చుకి అందిస్తున్నాను ఆస్వాదించండి. ఈ లోకంలో భర్త భార్యపై వలపుతో సారూప్యమందుట సామాన్యమే. అందుకే మెరుపులోని తటిల్లత వలె మెరిసే పైడిబొమ్మ ఇందిరాదేవి నల్లని వేంకటేశునితో సారూప్యస్థితిని బొంది నల్లని నారాయణి అయింది, అంటున్నారు. అయితేనేమి? అందుకేమి దోసము? అని సమర్థిస్తున్నారు.

తినబోతూ రుచి అడుగుట దేనికి? భావవివరణ చదివి పరవశించండి. పులి కడుపున మేకపుడుతుందా? ఈయనెవరు? అన్నమయ్య మనుమడు కదా! అన్నట్లు... "ఆరు నెలలు సావాసం చేస్తే... వారు వీరవుతా"రనే సామెత వుంది దాన్నే ఇంకొకలాగా చెబుతున్నారు.

భావ వివరణ:

ఓ మానవులారా! అందుకేమి దోసమా? (అందులో తప్పేముంది?) అయితేనేమయింది? కందువై (గొప్పగా) లోకంలో, గలదేకాదా (జరుగుతున్నదే కదా!) కాదంటే నేను చెప్పేది వినండి.

ఇందిరాదేవి (లక్ష్మీదేవి) వన్నెలు చక్కదనాలు చూచి ఈస్వామి వలచినాడు. ఏపొద్దూ (ఎప్పుడూ) ఆమె వలపులో, ఆమెనే తలపోయగా (ఆలోచనలలో నిలుపుకోగా) సలిగెతోడుత (చనువుకొద్దీ) ఆమె ఈయనతో "సారూప్యమోక్షము" చెందిందా అన్నట్లు, నలువై (నల్లనైన) ఈ గోవిందుడే నారాయణి అయింది. అందుకే ఆమే నల్లని నారాయణి.

ఈస్వామికి ఆ"లకిమమ్మ" (లక్ష్మమ్మ) తననెంత ప్రేమిస్తోందో తెలుసుకోవాలనే కోరిక కలిగింది. ఆమెయేమో బాలకి (యవ్వనంలోవున్న తరుణి). ఆమెకు పైపై సిగ్గులు సహజమే. తేలించి (వాటిని అలావుంచి) ఆమె మనసు తెలియబూని, చాలా వేడుకతో (కుతూహలంతో) ఆమె సకియ (చెలికత్తెలాగా మారి ఈయన ఆమెతోనే తిరిగాడు. అందుకనే ఆమె భువనమోహన రూప అయింది.

ఇదేదో బాగుందని... కృష్ణయ్య అయినప్పుడు, తన ఇంతులలో (అష్టభార్యలలోని) మేలెల్లా (మంచినంతా) తెలుసుకొందామని, కడగి (పూనుకొని) అనేక పర్యాయములు ఈయన సుందరీమణుల రూపాలు ధరించి వుంటాడు. బడినె (వెంటనే) ఈయనకు కూడా యెక్కడా, పతిలేనందువల్ల (సాటిలేనందువలన) ఆ గోపాలకృష్ణుడే ఈ శ్రీవేంకటేశ్వరుడై ఇట్లా అందాలు చిందిస్తున్నాడు. చూచి తరించండయ్యా! మీ జన్మకింకేమి కావాలి?

సంపుటి: 10-1 కీర్తన : కుడువనికుడుపులు కొనసాగె మమతలు
సంఖ్య : 19 పుట : 11 రాగం: లలిత

లలిత

85. కుడువనికుడుపులు కొనసాగె మమతలు
కడువేగ శ్రీహరిఁ గానఁగవలదా ॥ పల్లవి॥

నమలక చవులయ్య నాతుల సుద్దులు
అమర చింతకాయలవంటివి
భ్రమసి కొరుకఁబోతె పండ్లు పులుసును
తెమలక శ్రీహరిఁ దెలియఁగ వలదా ॥కుడు॥

విచ్చక మెరుఁగులు విడివడ్డ వలపులు
పచ్చి మేడిపంటి భావమువి
మెచ్చి లోను చూడ మొదలుపురువులె
గచ్చుల యివి మాని కనవద్దా హరిని ॥ లల ॥

బడలని పంట వో పైపైనె హరిభక్తి
కడలేని కల్పవృక్షమువంటిది
కడఁగి కొలువ శ్రీవేంకటనాథుఁడై గురి
బడినె యీతనిఁ గని బ్రదుకఁగ వలదా ॥కుడు॥

అవతారిక:

కుడుపు అంటే భోజనము. అది కుడువగానే రూపుమాసి పోతుంది. అవునా? కుడువకపోతే (తినకపోతే) సరే. అట్లాగే మమతలు చిరకాలం కొనసాగవు. కుడుపు కుడువకుండా వుండటం యెలా సాధ్యం కాదో మమతలు కొనసాగటం కూడా అలాగే సాధ్యం కాదు. కుడుపు ఎలా జీర్ణమైపోతుందో మమతలు కూడా మాయమైపోతాయి. అశాశ్వతమైన వాటికోసం శ్రీహరిని వదులుకోవటం ఎంత అవివేకం? అందుకనే కడువేగ శ్రీహరిన్‌కానగ వలదా? అని ప్రశ్నిస్తున్నారు చిన

తిరుమలాచార్యులవారు. పల్లవి అర్థం కావటానికే తలపట్టుకోవలసి వచ్చిందంటే ఈయన తాతగారివంటి దిట్టయే... సుమా! "ఏడ వలపేడ మచ్చిక యేడ సుద్దులు"... వంటి కీర్తనలే దీనికి స్ఫూర్తి అని నా భావన.

భావ వివరణ:

ఓ మానవులారా! కుడుపు (భోజనం) కుడువగానే కడుపులోకి మాయమైపోతుంది. ఒకవేళ కుడువకపోయినా (తినకపోయినా) పాసిపోయి పాడవుతుంది. ఈ మమతలు, అనుబంధాలూ కొనసాగి ఒకనాటికి మాయమైపోతాయి. ఒకవేళ అవి కొనసాగినా మన ఆయుర్దాయం కొనసాగక అవి యెలాగైనా అంతమవుతాయి. అందుకనే కడువేగ (శీఘ్రముగా) శ్రీహరిని కానగవలదా (శరణు అనవద్దా?).

నాతుల సుద్దులు (స్త్రీల తీపికబుర్లు) నమలకుండా వువ్విళ్ళూరే రుచులువంటివయ్యా! కనిపించే చింతకాయలవంటివి. చింతకాయ రంగును చూచి తియ్యగా వుంటుందనుకొని భ్రమపడి నమిలితే మీ పండ్లు పులిసిపోతాయి. అవునా? అట్లాగే ఆడువారి అమాయకమైన, అందమైన మాటలను విని వారిప్రేమలు నిజము, నిత్యము అనుకొంటే దెబ్బతింటావు. ఆ భ్రమతో తెమలక (చలించక) శ్రీహరిని తెలుసుకోవద్దా?

విడివడ్డవలపులు (ఎడబాటు తరువాత ప్రేమ) యెన్నటికీ కొనసాగదు. అవి విచ్చక మెరుగులు (మెరవని మెరుపుల్లాగ) కనబడవు. వలపులు పచ్చిమేడిపండువలె బంగారురంగులో మెరిసిపోతుంటాయి. కానీ ఆ పండ్లను విప్పి చూస్తే, మొదలు పురుగులే (మొదటినుండీ పురుగులే) వుంటాయి. గచ్చుల (బయటపడి) ఇకనైనా మానివేసి శ్రీహరిని దర్శించవద్దా?

పైపైన హరిభక్తి (సులభమైన శ్రీహరిపై భక్తి) బడలని పంట (యెండిపోని పంట వంటిది), కల్పవృక్షము వలె కడలేనిది (అంతములేనిది). శ్రీవేంకటేశుని కడగికొలువ (పూని ఆరాధిస్తే) గురియై (లక్ష్యమైన) ఆయనే అనుగ్రహిస్తాడు. బడినె (దట్టముగా) ఈతనిని గని (భావనలో దర్శించుచూ) బ్రతుకవలదా? (బ్రతుకును కొనసాగించవద్దా?).

సంపుటి: 10-1 కీర్తన : హరికి మొరవెట్టితె అన్నిపనులు లెస్సవును
సంఖ్య : 6 పుట : 4 రాగం: మలహరి

మలహరి

86. హరికి మొరవెట్టితె అన్నిపనులు లెస్సవును
సరవి నెన్నాళ్లని జాలిఁబడవచ్చును ॥ పల్లవి॥

యేమిసేయు నీ జీవుఁ డీ యరివర్గాలతోడ
బూమెల నెన్నాళ్లని పోరాడీని
చూమరలఁ జూడఁజూడఁ జుట్టాలవలెనె వుండి
దోమటి పంచేంద్రియాలు దోడుగాకపోయను ॥హరి॥

యెక్కడ చొచ్చీ జీవుఁ డీ కర్మపురుణములు
పెక్కువిధములఁ బిరువీకు సేయఁగా
వొక్కొక్కనాఁటి వడ్డె వొదిగీఁగాని తల
తిక్కగొన్న పాపములు దీరకె పోయను ॥హరి॥

యెవ్వరు దిక్కీ జీవుని కెంతని యీఁదఁగలఁడు
యివ్వల సంసారమనె యీ వారిధి
నవ్వుతా శ్రీవేంకటనాథుని మఱఁగు చొచ్చి
యివ్వగఁ దా దరిచేరి యిన్నియు గెలిచెను ॥హరి॥

అవతారిక:

ఈ జీవుడు యెంత? వీడిసామర్థ్యమెంత? వీడు అరిషడ్వార్గాలను గెలువగలడా? పంచేంద్రియాలను వంచగలడా? వీడు చేసిన కర్మల ఋణాలు తీరుతాయా? ఈ తిక్క వెధవ చేసే పాపాలు ఒక్క నాటికి పూర్తి అవుతాయా? అసలు వీడికి దిక్కెవరు? వీడు ఈ సంసారసాగరాన్ని ఈద గలడా? లేడు లేడు వీడివల్లకాదు. అదిగో ఆ ఏడుకొండలవాడే గతి అంటే... ఆయనను చేరితే సరేసరి. నాయనలారా! ఇప్పుడు ఈ అవతారిక

అంత సులభం కాదు ఈ చినతిరుమలయ్య కీర్తన. రుచి చూడండి, మీకే తెలుస్తుంది. దిమ్మ తిరుగుతుంది, నిజము. అన్నట్లు "చూమరులు" అనేమాటకు అర్థమేమిటి?

భావ వివరణ:

ఓ మానవులారా! శ్రీహరికి మొరబెట్టుకొంటే (బాధలను యేకరువుపెట్టుకొంటే) అన్ని పనులూ లెస్సవును (బాగుగా అవుతాయి). సరవి (ఈ క్రమములో) ఈవిధంగా యెన్నాళ్ళని జాలిబడవచ్చును? (ఖేదమునొందవచ్చును?)

ఈ జీవుడు కామక్రోధములాదిగాగల అరివర్గములతో (అంత: శత్రువులతో) యేమి చేయగలడు? బూమెల (ఆ వంచనలతో) యెన్నాళ్ళని పోరాడగలడు? వీడి పంచేంద్రియాలూ (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము) వీడికి దోమటివి (ఆధారభూతమైనవి). చూమరులు (చూచేవారు) చూడచూడ అవి చుట్టాలవలెనే అనిపిస్తాయి. కాని అవి యెన్నటికీ వాడికి తోడుగాక పోవును.

ఈ జీవుడు గతంలోచేసికొనిన కర్మల యొక్క ఋణము యెక్కడ చొచ్చీ (యెక్కడికి పోతుంది?) అవి వాడిని అనేక విధముల పిరువీకుసేయు (పీకులాటపడునట్లు చేస్తాయి). ఒక్కొక్క నాటికీ (రోజురోజుకీ) వాడు చేసిన పాపాలకు శిక్ష వడ్డీ పెరిగినట్లు పెరిగిపోతూనే వుంటుంది. తిక్కగొన్న పాపాలు (వెర్రెత్తిన పాపములు) ఎన్నడూ తీరకపోవును.

ఈ జీవుడికి దిక్కు యెవ్వరు? వీడు ఈ సంసార వారధిని (సాగరమును) యెంతని ఈదగలడు? మరి వీడికి దారేమిటి? శ్రీవేంకటేశ్వరుని యొక్క మఱుగుజొచ్చి (అండలో జేరి) ఆయన శరణు జొచ్చితే ఆ జీవుడు అన్నిటినీ అధిగమించి నెగ్గుకువస్తాడు.

సంపుటి: 10-1 కీర్తన : ఐనదేది కాని దందులో నేది
సంఖ్య : 27 పుట : 15 రాగం: నారాయణ దేసాక్షి

నారాయణదేసాక్షి

87. ఐనదేది కాని దందులో నేది
నానారూపి శ్రీనాథుఁడె కాకా ॥ పల్లవి॥

యెవ్వరి దూషించె మెవ్వరి భూషించే
మెవ్వరు స్వతంత్రులిందులో
అవ్వల నివ్వల నంతరాత్ముఁడైన
య వ్వనజాక్షుని ననుటగాకా ॥ఐన॥

యెందుకుఁ గోపించే మెందుకు మెచ్చే
మెందుఁగద్దు మే లిందులో
అందు నిందుఁ దానె యల్లుకొన్న
నందనందనునే నమ్ముటగాకా ॥ఐన॥

యే చోటు మంచిది యే చోటు చెడ్డది
యే చోటు సతమౌనిందులో
కాచేటి శ్రీవేంకటనాథుఁడె
చేచేతఁ గాణాచై చెల్లించెఁ గాకా ॥ఐన॥

అవతారిక:

వనజాక్షుడైన శ్రీహరి తప్ప ఎవ్వరూ స్వతంత్రులు కారు. అటువంటప్పుడు ఎవ్వరిని దూషించేది? ఎవ్వరిని భూషించేది? ఎవ్వరిని కోపించేది? ఎవ్వరిని మెచ్చుకొనేది? ఏచోటు మంచిది? ఏచోటు చెడ్డది? వీటన్నింటినీ చెల్లించేదెవరు? శ్రీవేంకటేశ్వరుడే కదా! అనేక రూపములను ధరించగల ఆ శ్రీనాథుడు కాక అయినదేది? కానిదేది? అంటున్నారు చినతిరుమలాచార్యులవారు. ఏదన్నా అవ్వాలి అంటే ఆయనకే సాధ్యం. అదేపని అవకూడదు అంటే కూడా ఆయనకే సాధ్యం. అందుకే ఆ స్వామిని "ఘటనాఘటనసమర్థుడు" అన్నారు. తేలికగా కనుపించే క్లిష్టమైన కీర్తన ఇది.

భావ వివరణ:

ఈ సృష్టిలో అనేకానేక రూపాలున్నాయి. ఆ రూపాలలో అనేకానేక జీవులున్నాయి. దేని విశిష్ఠత దానికుంది. ఇవన్నీ తమ మనుగడ కొనసాగించటానికి కారణమేమిటి? నానారూపాలలో వాటిలో వున్న శ్రీనాథుడే. ఇందులో ఆయన అయినదేది? కానిదేది? అన్నీ... ఆ శ్రీనాథుడే.

మనచుట్టూ వుండే శత్రువుల్లోనూ మిత్రులలోనూ ఆయనేవున్నాడు. వారి అంతరాత్ముడైవున్నది కూడా ఆ శ్రీహరియే. అవ్వల (దివిలోని దేవతలలోను) ఇవ్వల భువిలోని జీవులలోనూ ఆయనేవున్నాడు. ఇక నేను ఎవ్వరిని దూసించేది (తిట్టేది) ఎవరిని భూషింతు (పొగిడేది?) అన్నీ ఆ వనజాక్షుడే (పద్మలోచనుడే) అని కీర్తించుట తప్ప ఇంకా యేమిచేయాలి?

మన పురాకృత కర్మలకి ఫలితం, దానంతట అది రాదు. ఇంకొకరి ద్వారా ఆ ఫలితం మనకు సంక్రమిస్తుంది. అదే ఆ జగన్నాథుడిమాయ. అందువలననే కొందరు మనకు మేలు చేస్తారు మరి కొందరు కీడు చేస్తారు. ఇందులో అందరూ నందనందనుడైన గోవిందుడే. మరి మనం కొందరిని కోపిస్తామెందుకు? కొందరిని మెచ్చుకొంటామెందుకు? ఇందులో మేలు దేంట్లో కద్దు (వున్నది)... దేంట్లో లేదు? మరి అందు నిందు (వారిలోనూ వీరిలోనూ) తానే అల్లుకొని (వ్యాపించి వున్నప్పుడు) ఆయనను తప్పించి ఇంకెవర్ని నమ్మగలను?

మన కర్మలననుసరించే మనకు సుఖదు:ఖాలు కలుగుతాయి. వాటిలో కొన్నిటిని భూమిమీదా కొన్నిటిని పరలోకాల్లోనూ (స్వర్గ నరలోకాలలో) అనుభవిస్తాం. ఈలోకంలో అనుభవించే మంచిని "అయినవారితోనూ" చెడుని "కానివారితోనూ" అనుభవిస్తాం. అనుభవించాక, క్షణం కూడా అక్కడా వుండము ఇక్కడా వుండము. ఏచోటూ సతమైనది (శాశ్వతమైనది) కాదు. మనల నందరిని కాచేటి (సంరక్షించే) శ్రీవేంకటేశ్వరుడే, చేచేత కాణాచి (ఈమాటకు సరితూగే మాట... (అరచేతిలో చింతామణి), ఆయనే అరచేతిలో మాణిక్యమై అన్నీ చెల్లిస్తుంటే ఇంకా చెడేమిటి? మంచేమిటి చెప్పండి.

సంపుటి: 10-1 కీర్తన : మాయలో మునుఁగ నేల మమతలేల
సంఖ్య : 42 పుట : 24 రాగం: రామక్రియ

రామక్రియ

88. మాయలో మునుఁగ నేల మమత లేల
చేయారా దేవుఁ డీపాటి సేయ నోపఁడా ॥ పల్లవి॥

అట్టె దేహసమ్మంధ మాసపడే జీవులాల
పట్టి హరిసమ్మంధాన బ్రదుకరాదా
నెట్టన సర్వాంతరాత్మై నిలుచున్న దేవుఁ డిట్టె
చుట్టాలపక్కాలపాటి శుభ మియ్య నోపఁడా ॥మాయ॥

మోసపోక ధనధాన్యములు గూర్చే దేహులాల
వేసరక విష్ణుభక్తి వెదకరాదా
రాసి కెక్క యిందరిని రక్షించే దేవుఁడె
కాసువీసములపాటి కావ నోపఁడా ॥మాయ॥

వెలయ రాజులను దీవించే ప్రాణులాల
కల శ్రీవేంకటనాథుఁ గానఁగ రాదా
వలె నని యిందరికి వరాలిచ్చే దేవుఁ డేమి
కొలువునిలవుపాటిగుణ మియ్య నోపఁడా ॥మాయ॥

అవతారిక:

చిన తిరుమలయ్య కీర్తనలలో పల్లవినర్థం చేసికోవటం చాలా కష్టమవుతుంటుంది. ఈ కీర్తన చూస్తే ఆ సంగతి స్పష్టమౌతుంది. మాయలోమునుగనేల? మమతలేల? దేవుడు ఈపాటి చేయార చేయనోపడా? అంటున్నారు. మనల్ని పుట్టించి, పెంచి మనకోసం ప్రకృతిలో మనకు కావలసినవన్నీ సమకూర్చిన ఆ దేవదేవునికి ప్రతిఫలంగా మనం యేమిస్తున్నాం? రాజుకి అడుగడుగుదండాలు

పెడుతున్నాం, చుట్టాల పక్కాలకోసం ఆరాటపడుతున్నాం, కాసుల కోసం కక్కుర్తిపడుతున్నాం. శ్రీవేంకటేశ్వరుని శరణు అనమన్నా అనం. ఏమిటీ మాయ!!

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఈ సంసారము మిథ్య. ఇది ఈశ్వరుని మాయచే వర్ధిల్లుచున్నది. ఈమాయలో తలమునకలై పోవుటెందులకు? అక్కరకు రాని మమతల వల్ల ప్రయోజనమేమిటి? చేయార (మీ చేతులారా) ఆ దేవదేవునికి సేవచేయరాదా? మన ఈ మనుగడకే కారణమైనవాడు ఈపాటికూడా చేయతగడా?

ఓ జీవులారా! కేవలం దేహ సంబంధాల కొరకే ఆశపడెదరేల? శ్రీహరితో సంబంధం పెట్టుకొని బ్రతుకరాదా? ఇదిగో మీ నెట్టనే (యెట్టయెదుటనే) ఆ సర్వాంతర్యామి నిలచిన దేవుడైయుండగా మీరు భయపడతారేమి? ఆయన మీ చుట్టాలపక్కాలపాటి శుభము మీకు అందించలేడా?

ఓ దేహులారా! (దేహమును ధరించిన మానవులారా!) ధనధాన్యములనెంత పోగుచేసికొనినా మీరు మోసపోక తప్పదు. వాటితో వేసరక (ఇబ్బంది పడక) విష్ణు భక్తిని వెదకి కనుగొనరాదా? రాసికెక్కి (జగత్ప్రసిద్ధుడై) అందరినీ రక్షించే ఆ దైవశిఖామణి మిమ్మల్ని కాసువీసము పాటి (కాసులో పదియారవవంతు మాత్రం) కాపాడలేడా? ఎంత విడ్డూరం!!

ఓ ప్రాణులారా! వెలయ (జీవించుటకు) రాజుల్ని దీవించే మీరు ఎంత దౌర్భాగ్యులు!! దానిబదులు కల (మీ అందరిలోనూ గల) శ్రీవేంకటేశ్వరుని కానగరాదా? (దర్శించకూడదా?) ఆయన వలెనని (కావాలి అనునట్టి) ఇందరికీ కోరిన వరాలనిచ్చే దేవుడు. కొల్పునిల్పు (నిలుచుండే కొలువు) పాటి గుణము (మేలు) ఇయ్యనోపడా (ఈయలేడా?)

సంపుటి: 10-1 కీర్తన :తనకోరిక లేఁటికి నాతడె యిన్నియు గల్పించగ
సంఖ్య : 17 పుట : 10 రాగం: బౌళి

బౌళి

89. తన కోరిక లేఁటికి నాతఁడె యిన్నియుఁ గల్పించఁగ
అనువుగ నిందుకు యిద్దరి యత్నంబులు వలెనా ॥ పల్లవి॥

అద్దముచూచెటియాతఁ డలరుచు నవ్విన నవ్వును
అద్దములోపలినీడయు నా రీతినె కాదా
గద్దరియగు శ్రీవిభు సంకల్పంబుననె జగముల
సుద్దులు దు:ఖము సుఖమును సూటిఁబడెఁగానా ॥తన॥

నాఁటక మాడించునతఁడు నయమునఁ గదలింపంగా
నాఁటకమందలి బొమ్మలు నానాగతిఁ జెలఁగున్
ఆటలఁ జేతన్యాత్మకుఁడగు దేవునిచేష్టలనె
పాటిగఁ బాపముఁ బుణ్యము బహుళం బగుఁ గానా ॥తన॥

అరదము నడపెటి సారథి యటునిటు వాగెలు వట్టిన
అరదముగుఱ్ఱములు మెలఁగు నాయాముఖములను
నరులను శ్రీవేంకటగిరినాథుఁడె తగఁ బ్రేరింపఁగ
గరువము లేమియుఁ గలిమియుఁ గలిగుండుఁ గానా ॥తన॥

అవతారిక:

ఈ కీర్తన పల్లవిని అర్థం చేసికోవటం గగనమయ్యిందంటే నమ్మండి. ఎంతో ప్రయత్నంతో నేనిలా భావించగలిగాను. అంతర్యామివలె హరియే మనలో వుండి మన పురాకృత కర్మలఫలముగా మనకు త్రిగుణములనిస్తున్నాడు. వాటిననుసరించే మనకు కోరికలు కలుగుతాయి. కాని సంకల్పములను కల్పించేదిమాత్రం ఆ సర్వేశ్వరుడే. ఇందుకు (ఈ సంకల్ప జననమునకు) ఇద్దరి యత్నము కూడా కావలెనా? అని ప్రశ్నిస్తున్నారు చినతిరుమలయ్య. తమాషా యేమిటంటే ఆ సంకల్పం నాదే అని మనం భ్రమపడుతుంటాం. అందంలోని ప్రతిబింబాలలాంటివాళ్ళం ఆ

బింబానికి ఎలా స్వతంత్ర్యం లేదో మనకూ అంతే. ఆయన ఆడిస్తున్న బొమ్మలాటలో మనం తోలుబొమ్మలం. అంతే... మరి...

భావ వివరణ:

ఓ మానవులారా! ఆతడె (ఆ శ్రీహరియే) ఇన్నియున్ కల్పించగ (ఈ కోరికలనన్నింటినీ ప్రేరేపిస్తుంటే) తన కోరికలేటికి? (ఈ కోర్కెలు తమ కోర్కెలని భ్రమపడుతున్నాం. అవి మన కోర్కెలెలా అవుతాయి?) ఇందుకు (ఈ సంకల్పముల పుట్టుకకు) ఇద్దరి యత్నము కావలెనా? మనం నిమిత్తమాత్రులం... అన్నీ కల్పించేది ఆ శ్రీహరియే సుమా!

అద్దములో చూచేవాడు తను నవ్వితే వాడి ప్రతిబింబముకూడా నవ్వుతుంది. దానికేమి స్వతంత్ర్యముంటుంది? అదే రీతిగా, గద్దరి (ఘటనాఘటన సమర్థుడైన) శ్రీపతియొక్క సంకల్పముతోనే జగములన్నిటిలో వ్యవహారాలన్నీ నడుస్తాయి. మన సుఖదు:ఖాలన్నీ సూటిపడేది (కల్పించబడుతున్నది) ఆయన వల్లనే గానా (కావున) మనం కేవలం నిమిత్తమాత్రులం (మనం కర్తలుగా కనిపించినా కర్తలు కాని వాళ్ళం. ఈ కీర్తనకి ఈ విధంగా వివరణ వ్రాసేది నేనా? కాదు. నాలోని అంతర్యామి. నాకంత జ్ఞానం యేదీ?)

ఒక నాటకంలో పాత్రధారులు దాని దర్శకుడు చెప్పినట్లు చేస్తారు, మాట్లాడుతారు. ఆ నాటకంలో బొమ్మలు (పాత్రలు) నానాగతి చెలగున్ (రకరకాలుగా వుంటాయి). కొన్ని మంచివి కొన్ని చెడ్డవి. చేతనాత్మకుడు (ఆత్మలో చైతన్యం కలిగించే) ఆ దేవదేవుని చేష్టలనే మనం పాటించి కొన్ని పాపము కొన్ని పుణ్యము అనుకొంటున్నాం. బహుళమైన ఇవన్నీ ఆయన ఆటలే అని గ్రహించండి.

ఒక రథసారథి తన గుఱ్ఱములయొక్క వాగెలువట్టిన (పగ్గాలు పట్టుకొంటే) వాడి అరదము (రథము) వాడు అనుకొన్న చోటికి ఆ గుఱ్ఱాలు తీసికెళతాయి. మనం కేవలం గుఱ్ఱాలవంటివాళ్ళం. శ్రీవేంకటేశ్వరుడు సారథియై తోలుతుంటే, మనల్ని ప్రేరేపిస్తుంటే మనం పరుగులు తీస్తున్నాం. కలిమిలేములు (సంపద, దారిద్ర్యం) రెండూ కలిగుండగా (ఆయనిచ్చేవే, కానీ) అవి మనవి అని మనం భ్రమతో గర్వపడుతుంటాం. ఎంతటి పిచ్చోళ్ళం!!!

సంపుటి: 10-1 కీర్తన : భవరోగవైద్యుఁడైన బలువెజ్జు
సంఖ్య : 22 పుట : 13 రాగం: రామక్రియ

రామక్రియ

90. భవరోగవైద్యుఁడైన బలువెజ్జు
సవరని పైఁడిపక్షి సకినగాఁడు ॥ పల్లవి॥

తల్లివద్ద నోరిలోన తగ లోకములు చూపి
వెల్లివిరి నింద్రజాలవిద్యవాఁడు
చెలుల్బడి నొక్కకొండ చేతఁబట్టి యెత్తినాఁడు
బల్లిదుఁడు వాఁడివో బారివిద్యవాఁడు ॥భవ॥

మునుపె సకలభూతములకు నేలికయై
మనసెల్లా నెరిగిన మంత్రవాది
చనవున జలధిలో సంప దింద్రునికిఁ జూపె
అనువరి వాఁడివో అంజనగాఁడు ॥భవ॥

పట్టరాని కాళింగుపడిగెలమీఁదు మెట్టి
పట్టినాఁడు వాఁడువో పాములవాఁడు
అట్టె శ్రీవేంకటనాథుఁ డమరుల నెల్లనుఁ జే-
పట్టి దైత్యులఁ జంపించే పాళగాఁడు ॥భవ॥

అవతారిక:

ఈ వైద్యుడు మామూలుగా అందరికీ వచ్చే రోగాలు మాన్పేవాడు కాదు... భవరోగాలను పోగొట్టేవాడు అంటున్నారు చినతిరుమలయ్య. సంసారములో అనేక భవరోగాలు వస్తుంటాయి. వాటిని మాన్పే వైద్యుడే ఈ బంగారు రంగుగల పక్షిమీద పయనించే సకినగాడు. ఆ పక్షియెన్నడూ సవరనిది అంటున్నారు. చినతిరుమలయ్య కీర్తనల పల్లవి అంత తేలికగా అర్థం కాదు. బారి విద్యవాడు, మంత్రవాది, అంజనగాడు, పాళగాడు వంటి మాటల అర్థాలు అంత సులువుగా కొరుకుడుపడవు. అర్థమైనట్లుంటుంది కాని అర్థం చెప్పమంటే చెప్పలేం. అన్నట్లు... ఇది

భక్తిరస ప్రధానమైన కీర్తన అని ప్రత్యేకంగా చెప్పాలా?

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఈ స్వామి భవరోగములను (జన్మత: సంసారములో సంప్రాప్తించే అనేక రోగాలను) నయము చేయగల బలువెజ్జు (గొప్పవైద్యుడు). ఈయన "సవరని పైడిపక్షి సకినగాడు" (చక్కని శుభశకునమైన బంగారు రంగుగల గరుడ పక్షి వాహనముగా అలంకరింపబడినవాడు).

ఈ వైద్యుడు అనేకానేక విద్యలలో శిశువైన నాటినుండే ఆరితేరినాడు. శిశువుగానే తన చిన్ని నోటిలో తల్లి యశోదకు త్రిభువనాలు వెల్లివిరి (విస్తృతంగా) చూపిన ఇంద్రజాలవిద్యవాడు (మెజీషియన్ అన్నమాట). తానొక అధికారివలె చెల్లుబడితో (అధికారంతో) నిర్దేశించి గోకులాన్నంతా కొండక్రింద (గోవర్ధన పర్వతం క్రింద) చేర్చి, చిటికెన వ్రేలిపై దానినెత్తి అహోరాత్రములు కాపాడిన బల్లిదుడు (బలాఢ్యుడు) వాడే. వాడుగొప్ప బారి విద్యవాడు (వెయిట్ లిఫ్టర్).

సకల భూతములకు (జీవులకు) మునుపె (వారు పుట్టబోవుటకు ముందే) ఈ ఏలికయైన స్వామి, వారి మనస్సు నెరిగి జన్మ ప్రసాదిస్తాడు. ఈయన మంత్రం వేయగానే ఆ నూతన జన్మలో పాత జన్మ పూర్తిగా మరిచిపోతారు. ఈయన అంత గొప్ప మంత్రవాది, మాంత్రికుడు (హిప్నటిస్ట్). వాత్సల్యంతో ఇంద్రునికి క్షీరసాగరంలో అనేక దివ్యసంపదలున్నాయని చూపి దానినెలా మధించాలో చెప్పిన ఈ అనువరి (ఉపాయశాలి) గొప్ప అంజనగాడు (అంజనం వేసి కళ్ళకు నిక్షిప్తాలు చూపే టెక్నీషియన్).

పట్టుకోటానికసాధ్యమైన కాళింగు సర్పముయొక్క పడిగెలమీద మెట్టి (యెక్కి) నృత్యం చేసి విషంతో పాటు రక్తాన్ని కూడా కక్కించి ఆ పామును దారికి తెచ్చుకొన్న ఈయన గొప్ప పాములవాడు (స్నేక్ చార్మర్). అదంతా ద్వాపరయుగంలో జరిగింది. అట్టె (అదేవిధంగా) నేడు ఈ కలియుగంలో కూడా శ్రీవేంకటేశ్వరుడై అమరులను (దేవతలవంటి సాత్వికులను) రక్షించి దైత్యులను (రాక్షసులవంటి దుర్మార్గులను) చంపించే ఈ దేవదేవుడు గొప్ప పాళగాడు (దండనాయకుడు) (ఎక్జిక్యూషనర్).

సంపుటి: 10-1 కీర్తన :పచ్చిగా దెలియకుంటె బహుముఖమై తోచు
సంఖ్య : 13 పుట : 7 రాగం: లలిత

లలిత

91. పచ్చిగాఁ దెలియకుంటె బహుముఖమై తోఁచు
అచ్చమై యిన్నియును శ్రీహరికల్పితములే ॥ పల్లవి॥

కొందరు దిట్టుదురూ, కొందరు దీవింతురు
చందపుసంసారము జూడ లివి
కందువ రేయిాఁ బగలుఁ గాలము నడచినట్టె
అందరిలోఁ గలుగు శ్రీహరికల్పితములే ॥పచ్చి॥

కొన్నిటిపై కోపము కొన్నిటిపై వేడుక
వున్నతి దేహధారుల వోజ లివి
పన్ని కాయ పండు దొండపంటియందె తోఁచినట్టు
అన్నియుఁ బుట్టించిన శ్రీహరికల్పితములే ॥పచ్చి॥

కొంతచోట మనుజులు కొంతచోట దేవతలు
అంతా శ్రీవేంకటనాథు నాజ్ఞ యిది
చెంత చప్పనయుఁ దీపు చెఱకందె వుండినట్టు
కాంతుఁడైన శ్రీహరికల్పితములే ॥పచ్చి॥

అవతారిక:

"ఈ సృష్టిలో సమస్థమూ సృష్టించినది ఆ శ్రీహరియే కదా! అందరికీ అచ్చమైన ఆయన కల్పితములే అన్నీ. ఈ విషయం స్పష్టంగా తెలియకపోతే అనేక రకాలుగా ఆయనే తెలియజేస్తున్నాడు" అని అంటున్నారు చినతిరుమలయ్య. దీని భావవివరణ చదివాక మీ మనస్సు ఆనందంతో ఈ సంకీర్తనాచార్యుని సెభాస్ అంటుంది. నామటుకు నేనే, కొందరితో ప్రీతిగా వుండేవాడిని కొందరిని పలుకరించుట కూడా

చేయను. ఏమిటీ వింత అనుకొనేవాడిని. నాకు నేడు జ్ఞానోదయమయింది. ఓ శ్రీహరీ! ఇతరులకు నిన్నెరుగ తరమా? అన్నారు కదా! అన్నమయ్య.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఈ విషయం పచ్చిగా దెలియకుంటే (మర్మము లేకుండా పైకి తెలియకపోతే) బహుముఖమై తోచు (ఎన్నో విధములుగా మనకే తోస్తున్నది). ఏమిటా తోచేది? అన్నియునూ (సమస్తమూ) అచ్చముగా (కేవలము) శ్రీహరి కల్పితములే (సృష్టించినవే సుమా!)

కొందరు మనల్ని తిడుతుంటారు. కొందరు మనల్ని దీవిస్తుంటారు. ఈ ప్రపంచము తీరే అంత. దినదినమూ రేయింబవళ్ళు (రాత్రీపగలూ) వచ్చినట్లు కందువ (సామర్థ్యంతో) కాలము నడుస్తూనే వుంటుంది. మరి ఈ కాలాన్ని మనోవికారాలను ఎవ్వరు సృష్టించారు? మీరా? కాదుకదా! అవి అందరిలోనూ నెలకొని వున్న ఆశ్రీహరి కల్పితములు (సృష్టించినవే).

మనకు అకారణంగా కొన్నిటిపై కోపము కలుగుతుంటుంది. కొన్నిటిపై వేడుక (ప్రసన్నత) కలుగుతుంటుంది. దేహధారులకు (మానవదేహము ధరించిన మనందరికీ) ఓజలివి వున్నతిని (ఇవి గొప్పగా అమరిన సహజ స్వభావములే). ఉదాహరణకి ఒక దొండపండును తీసికొండి. ఒకప్పుడు అదే పచ్చి దొండకాయ కదా! కాయ పండూ రెండూ దాంట్లోనే వున్నాయి కదా! అన్నీ పుట్టించింది ఆ శ్రీహరే అని అర్థం కాలేదా.. ఇంకా?

ఈ అనంత విశ్వంలో కొంతచోట (ఒకచోట) మానవులున్నారు. కొంత చోట (వేరొకచోట) దేవతలున్నారు. జన్మాంతమున కొందరిక్కడివారు అక్కడికి, కొందరక్కడివారిక్కడికీ వస్తుంటారు. ఇది నిర్ణయించేదెవరు? మీరా? కాదుకదా! అది అంతా ఆ శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞపై నడుస్తుంటుంది. ఒక చెఱకు గడను తీసికొండి. పచ్చిగా వున్నప్పుడు అది చప్పనయీ (వగరుగా వుంటుంది). ఉన్నట్లుండి కొంతకాలానికి అదే తియ్యగా అవుతున్నది. ఇదంతా కాంతుడైన (జగన్నాథుడైన) శ్రీహరి కల్పితములే (లీలలే) అవునా?

సంపుటి: 10-1 కీర్తన : నిండునిధానమువలెనీవు
సంఖ్య : 29 పుట : 17 రాగం: మలహరి

మలహరి

92. నిండునిధానమువలె నీవు గలిగుండఁగాను
పండిన యోగికిఁ బూర్ణభావనె మంచిది ॥ పల్లవి॥

కలకాలము భూమిఁ గతలె వింటిమిగాని
నల నహుషాదు లున్నారా యేమి
యిలలో నితరులెల్లా నేమిలెక్క యిందుకుఁగా
యెలయింపువిషయాల యేమరఁగఁ దగునా ॥నిండు॥

చేపట్టి పురాణాలు చెప్పఁగా వింటిమిగాని
బాపురె దుర్యోధనుసంపద యేది
కాపాడ నిప్పటివారికలిమి యెంచఁగ నేది
యీ పాటిపనికిఁగా నిది గోరఁ దగునా? ॥నిండు॥

మళ్లిమళ్లి భూమిలోన మాటలె వింటిమిగాని
తొల్లిటి బలాఢ్యుల సత్తువ లేవి
వెల్లివిరై యెప్పుడూ శ్రీవేంకటనాథ నీదాసు
లెల్లకాలముఁ జెడని యీ బలిమె నిజము ॥నిండు॥

అవతారిక:

పుట్టిన ప్రతివాడు గిట్టేవాడే కదా! సప్తఋషులతో పల్లకీ మోయించుకొన్న నహుషుడి గతేమయింది? పన్నెండు అక్షౌహిణీల సైన్యం వున్న దుర్యోధనుడు తొడలు విరిగి దిక్కులేని చావు చచ్చాడు కదా! ఎంతమంది గురించి యెన్నికథలు వినలేదు? ఒక్కడైనా కలకాలం వున్నాడా? ఓ శ్రీవేంకటేశ్వరా! ఒక్క నీదాసులు మాత్రమే యెల్లకాలమూ లబ్ధప్రతిష్ఠులై వుంటారు. తతిమ్మా వాళ్ళంతా తలా ఒక దారిన

కాలప్రవాహంలో కొట్టుకొని పోతారు అంటున్నారు, చినతిరుమలయ్య. మనకర్థమయ్యే భాషో చెప్పాలంటే... "అక్షౌహిణీ" అంటే 21870 రథసైన్యం, అంతే సంఖ్యగల గజసేన, 65650 మంది అశ్వసేన, 1,09,350 మంది కాల్బలసేన. ఇట్లాంటి అక్షౌహిణీలు పన్నెండు వున్నాయట ఆ దుర్యోధనుడికి.

భావ వివరణ:

ఓ దేవదేవా! పండిన యోగికి (పరిపక్వతనొందిన యోగికి) పూర్ణ భావనే (పరమాత్మ సమస్తమునందు సంపూర్ణముగా నున్నాడు అనే ఆలోచనే) శ్రేష్ఠమైనది. ఎందుకంటే సర్వమునా, నిండు నిధానము (దాచిన పెన్నిధివలె) నీవు వారి భావనలలో నుంటివి కదా!

ఈ భూమ్మీద చాలా కాలంనుంచి కతలె (పురాణ గాథలు) వింటూనే వున్నాము. అందులో చెప్పిన నహుషుడు మొదలైనవారు ఈనాడు వున్నారా యేమయ్యా? ఆయనకే ఆ గతి (సర్పం అయిపోయాడు) పట్టితే ఇతరులు ఒక లెక్కా!! ఇందుమూలముగా తెలియాల్సిందేమిటి అంటే విషయాల యెలయింపులో (ఇంద్రియభోగాలలో) ఏమరుపాటు (పరవశత్వము) తగదు.

చేపట్టి (పూని) పురాణాలనన్నింటినీ విన్నాము. బాపురె (ఓరినాయనో!) దుర్యోధనుడి సంపద యెవరికన్నా వుంటుందా? వాడు రారాజు. వాడిచేతిలో పన్నెండు అక్షౌహిణీల సేనవుంది. భీష్మాది వీరులున్నారు. అంతులేని సంపదవున్నది. కాని అవేమన్నా వాడిని కాపాడాయా? వాడికే అట్లా అయితే నేటివారి గురించి చెప్పేదేముంది? ఈ పాటిదానికి పరమాత్మను నాకు సంపదలు కావాలి అని కోరుకోమంటారా?

ఈ భూమిమీద, మళ్ళీ మళ్ళీ యెన్నిసార్లు గొప్ప బలవంతుల గురించి విన్నామో కదా! తొల్లిటి (ఆనాటి) వాడు ఈనాడు ఒక్కడన్నా వున్నాడా చెప్పండి. అందరూ కాలగర్భంలో కలిసిపోయారు కదా! కానీ ధ్రువుడు, ప్రహ్లాదుడు వంటి నీదాసులు మాత్రం కలకాలం మానవుల మనస్సులలోనే వెల్లివిరై నిలిచివుంటారు (విఖ్యాతులై స్థిరముగావుంటారు). ఓ శ్రీవేంకటేశ్వరా!

యేనాటికీ చెడిపోని నీ బలిమే (శక్తియే) నిజమైనది తండ్రీ!

సంపుటి: 10-1 కీర్తన:పండించి తేగలుగునా పరమాత్మునిదాస్యము
సంఖ్య : 30 పుట : 17 రాగం: లలిత

లలిత

93. పండించితేఁ గలుగునా పరమాత్మునిదాస్యము
నిండుమతి నుండితేను నెరవేరుఁగాక ॥ పల్లవి॥

బాధకు నోపనివాఁడు పాపము సేయనేల
పోదిసేయఁ దొలుతేమి బుద్ధి లేదా
సాదువలె నుండితేను సర్వేశ్వరుఁడె తన్ను
వాదులాట లెల్ల మాన్పి వహించుకో లేఁడా ॥పండి॥

దండుగ కోపనివాఁడు తప్పులు సేయఁగ నేల
వుండరాదా తా నుండె వొడికానను
కొండవంటియాసతోడ కోరక తా నుండితేను
తండుముండై లంపటాలు తగిలీనా తనకు ॥పండి॥

వళుకు కోపనివాఁడు వచ్చి పూఁటవడనేల
వొలిసినట్లు తనంత నుండరాదా
కలకాలము శ్రీవేంకటనాథుఁ గొలిచితె
అలరి యభయ మిచ్చి అట్టె కావ నోపఁడా ॥పండి॥

అవతారిక:

పరమాత్మపై భక్తి శరణాగతి, నమ్మకము... పండించితే కలుగవు. అంటే కృషిచేసి సాధించాలని చూస్తె కుదిరే పనికాదు. నిండుమతి నుండితే అంటే.. పరిపూర్ణ విశ్వాసంతో వుంటే అది నెరవేరుతుంది అంటున్నారు

చినతిరుమలాచార్యులవారు. పాపంచేస్తే బాధ తప్పదు. అది పరమాత్మ తీర్పు. మొదట్లోనే బుద్ధి తెచ్చుకొని సన్మార్గంలో వుంటే నరకంయాతనలుండవు గదా! ప్రతిక్షణం నీవేనాకు దిక్కు అంటే ఆ వేంకటపతి తన అభయహస్తంతో మీకు శరణునందిస్తాడు గదా! అంటున్నారు. కాని మనం తప్పులమీద తప్పులు చేస్తూనే వున్నాం.

భావ వివరణ:

ఓ ప్రజలారా! పరమాత్ముని దాస్యము (శరణాగతి) పండించితే గలుగునా (కృషిచేసినంతమాత్రాన లభిస్తుందా?) అది నెరవేరాలంటే తేలికపనికాదు. నిండుమతినుండితేనే (పరిపూర్ణమైన విశ్వాసం వుంటేనే) అది నెరవేరుతుంది.

బాధకునోపనివాడు (నరకయాతనలకు తాళలేనివాడు) అసలు పాపమెందుకు చేయాలి? పోది (పూని) సేయదొలుతే (చేసేముందే) బుద్ధిలేదటయ్యా! మొదట్లోనే సాధువర్తనుడైవుంటే, తనను ఆ సర్వేశ్వరుడే వాదులాటలెల్ల (పొట్లాటలు మాన్పి) వహించుకోలేడా (ఆదరించేవాడు కదా!)

దండుగ (శిక్ష)కు ఓపనివాడు (తాళలేనివాడు) తప్పులు చేయటందేనికి? వాడు తానుండే హద్దులలోనే తగినట్లు వుండవచ్చును గదా! కొండలంతవున్న ఆశతో తాను కోర్కెలు లేకుండా వుంటే తండుముండై (తడబాటు కలిగించే) లంపటాలు (తగులములు) తనకు తగిలీనా (తగిలేవా?)

వళుకుకోపనివాడు (తగవులాటకు తాళలేనివాడు) వచ్చి పూటవడనేల (పొట్లాటకు రావటం యెందుకు)? వొలిసినట్లు (తగినట్లు) తాను వుండవచ్చును కదా! శ్రీవేంకటేశ్వరుని యెల్లవేళలా కొలిచిన యెడల చక్కగా అభయం ఇచ్చి కావనోపడా (రక్షించడా!!)

సంపుటి: 10-1 కీర్తన : నిచ్చలూ జెడనియట్టి నీకె తెలుసుగాక
సంఖ్య : 26 పుట : 15 రాగం: గౌళ

గౌళ

94. నిచ్చలూఁ జెడనియట్టి నీకె తెలుసుఁగాక
యిచ్చల మావంటివా రేమెరుగుదు రయ్యా ॥ పల్లవి॥

బాలుఁడు వృద్ధనియెటి పరిభాష లన్నియును
మూలమూలలను దేహమునకె కాక
యీలో నెంచిచూచితే నెన్నటివాఁడు
కోలుముందై పెరిగీనో కొంచె మయ్యీనో ॥నిచ్చ॥

మంచిది చెడ్డ దనెటి మాట లెల్లా భువిలోన
యెంచిచూడ మనుజుల కింతెకాక
నించి సర్వపూర్ణుఁడవై నీవులేని చోటేది
తుంచరాదు పెంచరాదు తొల్లె కలవు ॥నిచ్చ॥

వాఁడు వీఁ డనియెటి వచనాలు జగములో
పోఁడిమి జీవులయందె పొసఁగెఁ గాక
వేఁడినా కొసరినాను విశ్వవ్యాపకుఁడవై
నాఁడు నేఁడు శ్రీవేంకటనాథుఁడవె కలవూ ॥నిచ్చ॥

అవతారిక:

"దేవదేవా! నీవు అనాదివి. నిత్యుడవు. అచ్యుతడవు. నీ తత్త్వం నీకు తప్ప పరులకు అగమ్యగోచరము. ఇక మావంటివారు నిన్నెట్లు తెలియగలరు?" అనే మాటల్ని అన్నమయ్య కాలంనాటి వాడుక తెలుగులో చెప్తే ఈ కీర్తన పల్లవి అవుతుంది. చినతిరుమలయ్య చెప్పిన ఈ కీర్తనలో అయ్యలారా! అన్నీ మనం చెప్పుకొనే మాటలే కానీ పదార్థం మాత్రం ఒక్కటే అంటున్నారు. దేహంలో వుండే జీవుణ్ణే ఒకసారి బాలుడంటున్నాం,

ఒకసారి యువకుడంటున్నాం, ఒకసారి ముసలాడు అంటున్నాము. కానీ మూలమూల నున్నది ఒక్కడే. వీడు ఇంత అజ్ఞాని అనితెలిసే ఆ వేంకటపతి వీడు వేడినా తిట్టినా వీడిని రక్షిస్తూనే వుంటాడు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నిచ్చలు చెడనియట్టి (నిత్యుడవు అయిన) నీకె తెలుసుగాక (నీవొక్కడివే జ్ఞానివి). ఇచ్చల (కోర్కెతో సతమతమయ్యే) మాబోటివారు నిన్నేమి తెలుసుకోగలరు?

మేము బాలుడు, యువకుడు, ముసలివాడు అని పరిభాషలో (వాడుక భాషలో) అంటుంటాము. ఇవన్నీ మా దేహాలకు చెందేమాటలు. ఈ లోన (ఈ దేహంలోపల) యెంచి చూచిన మూలమూలలలో (అంతరాంతరాలలో) వున్న జీవుడు యెన్నటివాడు? వాడికి కోలుముందై (విజృంభించి) పెరుగుట లేక తరిగి కుచించుకుపోవుట వుంటాయా? వుండవు. అవి కేవలం దేహానికే.

ఈ భూమిమీద మంచిది చెడ్డది అని యెందరినో అంటుంటాం. ఆలోచించి చూస్తే మేము ఇలా యెవరినంటున్నాము? మాతోటి మనుష్యులను, అవునా? కానీ సర్వపూర్ణుడవై (అంతా నిండిపోయి పూర్తిగా మాలో నిండివున్న) నిన్ను కాదా? అసలు నీవులేని చోటేది? నీవు తొల్లె (అనాదిగా) ఆత్మవై మాతోనే వున్నావు. ఈ ఆత్మ తుంచరాదు (నశింపచేయరాదు) పెంచరాదు (వృద్ధిని చేయరాదు). ఈ మాటలు నీవే భగవద్గీతలో చెప్పావు.

ప్రభూ! మేము పరులని భావించి "వాడు" లేక "వీడు" అనే మాటలను వుపయోగిస్తుంటాం. ప్రపంచంలో ఈ మాటలు వేరెవ్వరికీ పొసగవు (సరిపోవు). పోడిమి (చక్కగా) అవి "జీవులకే" తగివున్నాయి. కాని వారిలో వున్న నీకుగాదు. ఎందుకంటే... ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు విశ్వవ్యాపకుడవై నాడూ నేడూ మాలోనే కలవు. మేము నిన్ను వేడినా కొసరినా (అవమానించినా) యెన్నడూ మమ్ము విడిచిపోవు. ఎందుకంటే... తండ్రి బిడ్డను యెన్నటికీ వదలడు. (తప్పు చేస్తే నాలుగు తంతాడు అంతే...)

సంపుటి: 10-1 కీర్తన : నేరి చెవ్వడు బ్రదికె నేరక యెవ్వడు చెడె
సంఖ్య : 24 పుట : 14 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

95. నేరి చెవ్వడు బ్రదికె నేరక యెవ్వడు చెడె
భారకుఁ డందరికి శ్రీపతి యింతెకాక ॥ పల్లవి॥

వొక్కరి నేరము లైతె నూరకె వెదకఁజూచే
నక్కటా నా గుణదోషా లవి యెంచను
వొక్కటై విచారించితే వొరులేమి తానేమి
అక్కడ నిక్కడ గురి హరి యింతె కాక ॥నేరి॥

దట్టించి వొక్కరినైతె తప్పు లెంచఁజూచేను
అట్టె నా యపరాధాల కాజ్ఞ యేదో
నెట్టనఁ దలపోసితే నేనేమి పరులేమి
గట్టిగా స్వతంత్రుఁడు శ్రీకాంతుఁ డింతెకాకా ॥నేరి॥

వూరకె వొక్కరి నైతె వొచ్చములు వట్టేను
కారుకమ్మినట్టి నా కల్ల లెంచను
గారవించి శ్రీవేంకటనాథుఁడు నన్ను
సారెకు రక్షించఁగాను జయ మాయఁగాకా ॥నేరి॥

అవతారిక:

సర్వుల భారము వహించి రక్షించేవాడెవరు? ఆ శ్రీపతి. ఇంతెగాక ఇంకా నేర్వవలసినదేమి? దీనినెరిగి జీవిస్తున్న వాళ్ళెంతమంది వున్నారు? దీని నేర్వక చెడిననూ చెడకున్ననూ రక్షకుడు మాత్రం ఆ శ్రీహరియే అంటున్నారు చినతిరుమలాచార్యులవారు. తనకో న్యాయం పరులకో న్యాయం అనే గుణదోషము జీవలక్షణము. "కారుకమ్మినట్టి నాకల్లలెంచను.. వూరకె వొక్కరినైతేవొచ్చములు వట్టేను" అనే మాట

ఐదువందలయేళ్ళనాడు వాడుక భాషే, కాని ఈ నవీన యుగంలో కారుకోసం కల్లు అమ్ముకొన్నారని అనుకొనే నాగరికులు వుంటే ముక్కుపై వేలుపెట్టుకోకూడదు. అదంతే... అనుకోవాలి. మీరు దీనిని భక్తితో చదువుకోండి. పరుల గోలమనకేల గోపాలబాలా?

భావ వివరణ:

ఓ ప్రజలారా! అందరికీ భారకుడు (భారమును వహించువాడు) శ్రీపతి. ఇంతేకాక మరేదియు లేదు. దీనిని నేర్చి బ్రతికినవాడేడీ? (అంటే.. అందరూ ఆ జ్ఞానం లేకుండానే బ్రతుకుతున్నారు). ఇట్లా అయితే నేరక (తెలియక) ఎవ్వడు చెడిపోడు?

అక్కటా! (అయ్యో!) వొక్కరి నేరములైతే (ఇంకొకరి నేరములైతే) వూరకె (పనివదలి) వెతుకుతాను, కాని నాగుణదోషములైతే లెక్కచేయను. ఒక్కటిగా భావించి చూస్తే పరులేమిటి? తానేమిటి? అక్కడా నిక్కడా (వారిలో వున్నదీ, వీరిలో వున్నదీ) గురి (సాక్షీభూతుడు) యెవరు? శ్రీహరియే. ఇంతేకాక వేరే సత్యం యేముంటుంది?

ఒకరినైతే (ఇంకొకరినైతే) దట్టించి (అదిలించి) తప్పులు వెదుకుతాను. అట్లాగే నాతప్పులైతే ఆజ్ఞయేదీ (అనుమతిస్తానా? యెన్నటికీ ఒప్పుకోను.) నెట్టున (తప్పకుండా) తలపోసితే (ఆలోచిస్తే) నేనేమిటి? పరాయివారేమిటి? ఎవ్వరమైనా అస్వతంత్రులమైన మానవులమే. గట్టివాడు (స్వతంత్రుడు) యెవరన్నా వున్నారంటే ఒక్క శ్రీకాంతుడే కదా!

నేను వూరకనే, వొక్కరినైతే (ఇంకొకరినైతే) వొచ్చములు వట్టేను (పొరబాట్లను పట్టుకొంటాను). కారు కమ్మినట్టి నాకల్లలు (నా నల్లబడిన, అబద్ధాలను మాత్రం) యెంచను (లెక్కజేయను). ఇన్ని అవగునాలున్న నాబోటివాడిని కూడా ఆ శ్రీవేంకటేశ్వరుడు గౌరవించి, సారెకు (ప్రతియొక్క పర్యాయము) రక్షించాడు. అందుచేతనే నాకు జయమాయగాకా (విజయం దక్కింది కదా!) లేకుంటే నేనేపాటివాడను తండ్రీ!

సంపుటి: 10-1 కీర్తన : సకలపురాణములు చాటి నిను బొగడగా
సంఖ్య : 58 పుట : 33 రాగం: లలిత

లలిత

96. సకలపురాణములు చాటి నినుఁ బొగడఁగా
తకమకలుగా నల్పార్థము చెప్పఁ దగునా ॥ పల్లవి॥

నిను నిర్గుణుఁ డనేటి నీచజాతులయందె
యెనయు దుర్గుణము దా నెంతో
కనకంబు నిను మనుచు కారునాయంబులను
యెన లేనిదుర్వాదుల నేమనఁగఁ గలము ॥సకల॥

నీవె తా మనుకొనేటి నిందితాత్ములు దాము
కావించుద్రోహంబు కడమా
దావతులఁ దనుఁ గన్నతల్లి గొడ్డని పల్కు
దేవతానిందలకుఁ దెలుపఁగ వశమా ॥సకల॥

అమరుసర్గము మిథ్య యను శూన్యభాషులకు
తమితోడ భ్రమ యేల తరగు
తమగురువు శాస్త్రంబు తామె కల్లనఁగాను
క్రమబుద్ధి శ్రీవెంకటనాథ యిత్తువా. ॥సకల॥

(చినతిరుమలయ్య - అధ్యా - సంఖ్య 58)

అవతారిక:

భగవంతుడు 'నిర్గుణుడు' అంటే గుణాతీతుడని అని అర్థం. అసలు గుణమే లేనివాడని పెడర్థం తీసే నీచజాతి మానవుల నేమంటాము? పురాణములన్నీ ఆయనను పురుషోత్తముడని కీర్తిస్తుంటే, తికమకలైన అల్పార్థములు చెప్పే దుర్వాదులను నిరసించవద్దా, అంటున్నారు తాళ్ళపాక చినతిరుమలాచార్యులవారు. కనకము వంటి నిన్ను అన్యాయమైన

వాదనలతో హేళన చేసే నీచులను యేమనగలం చెప్పవయ్యా! ఓ వేంకటపతీ! కాస్త వాళ్ళకు క్రమబుద్ధి ఇవ్వవయ్యా! అని ప్రార్థించగలము. మీదపడిపోట్లాడలేం కదా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! అష్టాదశ పురాణములూ నీవు జగన్నాథుడవని చాటి నిన్ను పొగుడుతుంటే నాస్తికులైన వారు తకమకలుగా (తికమకజెందునట్లు) అల్పార్థములను (పెడర్థములు) చెప్పిన, అది తగిన పనియేనా?

వేదము నిన్ను నిర్గుణుడు అన్నది. అనగా నీచమైన అల్పగుణములు లేని వాడని కదా! నీచ జాతికి చెందిన కొందరు మానవులు గుణమేలేని వాడివని విమర్శిస్తున్నారు. ఆ దుర్గుణము తానెంతయో ఆ నీచులయందే వున్నది. కనకము (బంగారము) వంటి నిన్ను కారునాయంబుల (న్యాయం అనేది లేకుండా) మనుచు (వుంటూ) చెప్పలేని దుర్వాదులు (చెడువాదనలు) చేస్తున్నారు. వాళ్ళ కర్మకు వాళ్ళనొదిలేయటం కన్న యేం చేయగలం చెప్పండి.

"అహం బ్రహ్మాస్మి" లాంటి వేదవాక్యములను పట్టుకొని, నీవే తాము అనుకునే నిందితాత్ములు (పాపాత్ములు) తాము చేసే ద్రోహం చెప్పశక్యమా? దావతుల (పదిమందిలో) తనకు కన్నతల్లినే గొడ్డని (గొడ్రాలు) అని నిందించే వాడు దైవదూషణ చేసినవాడే కదా! వాడెంత నీచుడో చెప్పటం ఎవ్వరికైనా వశమా?

అమరు సర్గము (అమరుల స్వర్గము) మిథ్య అనే శూన్య భాషులకు (శూన్యవాద నాస్తికులకు) తమి భ్రమకలుగుతూనే వుంటుంది. అది యెందుకు తగ్గుతుంది చెప్పండి. తమ గురువు చెప్పిన శాస్త్రమును తామే కల్ల (అబద్ధం) అనే దుష్టులకు చెడే జరుగుతుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! వారికి నీవు మాత్రం సక్రమమైన బుద్ధిని యెలా ఇస్తావు?

మాతృశ్రీ తరిగొండ వేంగమాంబ కీర్తనలు

దరువు, ఆట తాళం

97. గణనాయకా! శరణు – గణనాయకా! శరణు
గణనాయకా! శరణు – గణనాయకా! ॥ పల్లవి॥

శ్రీశివ వరపుత్ర!– చిరతర ఘనచిత్ప్ర–
కాశ! మమ్మేలు! శ్రీ – గణనాయకా! ॥గన॥ 1

భవరోగ సంహార! – భక్త చిత్త విహార!
కవిజన మందార! – గణనాయకా! ॥గన॥ 2

మునిజన పాలన! – మూషక వాహన!
ఘన సుగుణ సంతాన! – గణనాయకా! ॥గన॥ 3

నీరధి గంభీర! – నిగమ గోచర! విశ్వ–
కారణ విగ్రహ! – గణనాయకా! ॥గన॥ 4

అలరార నిను నమ్మి – నటువంటి మాపాల
కలిగియుండుము నీవు – గణనాయకా! ॥గన॥ 5

తాపత్రయంబును – తలఁగించి మముఁ బ్రోచి
కాపాడవయ్య! శ్రీ – గణనాయకా! ॥గన॥ 6

తలఁగక విఘ్నకా – రులఁ ద్రుంచి, బ్రహ్మ స–
త్కళలో నన్నుంచు శ్రీ – గణనాయకా! ॥గన॥ 7

ఆరూఢిఁ దరిగొండ – హరికి సోదరియైన
గౌరికుమార! శ్రీ – గణనాయకా! ॥గన॥ 8

అవతారిక:

విఘ్ననాయకుడు, శివపార్వతీ తనయుడు, గణపతి అయిన గజాననుని కీర్తిస్తున్నారు వెంగమాంబ. భవరోగసంహారా! శరణు శరణు అని ప్రార్థిస్తున్నారు. స్వామి నీరధిగంభీరుడట. తనకు విఘ్నములు కలిగించే దుర్మార్గులను ఏమాత్రం వెనుదీయక త్రుంచి తనను బ్రహ్మసత్కళలో వుంచమని వేడుకొంటున్నారు. అంటే బ్రహ్మదేవుడు తనకు జన్మత:

ప్రసాదించిన కళలను పెంపొందింపజేయమని ప్రార్థిస్తున్నారు. వీనుల విందుగా పాడుకోదగ్గ కీర్తన ఇది.

భావ వివరణ:

ఓ గణపతిదేవా! నిన్ను శరణు వేడుచున్నాను. ఓ గణనాథా! శరణు శరణు. ఓ గణనాయకా! నాకు శరణునొసంగము.

శ్రీశంకరుని వరప్రసాదివైన కుమారా! నీవు చిరతర (అనంతమైన) ఘన (గొప్పదైన) చిత్ప్రకాశము (అనిర్వచనీయమైన ప్రకాశము) గలవాడా! ఓ గణనాయకా! మమ్ము పరిపాలింపుము.

భవబంధములే రోగములై పీడించగా ఆ పీడను, నివారించెడి నీవు భక్తుల చిత్తములలో విహరింతువు. కవిజనులకు (పండితులకు) పారిజాతవృక్షము వంటివాడవు. అట్టి గణనాయకా! శరణు.

మునీశ్వరులను పాలించు ఓ మూషికవాహనా! నీవు గొప్ప సుగుణముల పరంపర కలవాడవు. అట్టి గణనాయకా! శరణు.

ఓ ప్రభూ! నీవు సముద్రమువలె గంభీరమైనవాడవు. నిగమగోచరుడవు (వేదముల ద్వారా గోచరింపబడువాడవు). విశ్వము జనించుటకు కారణమైన రూపము కలవాడవు. అట్టి గణనాయకా! శరణు

ఓ గణేశ్వరా! అతిశయించి నిన్ను నమ్మినట్టి మాయెడల అనుగ్రహము కలిగియుండుము ప్రభూ!

ఓ గణనాయకా! మా తాపత్రయములను (ఆధ్యాత్మికము, ఆధిభౌతికము, ఆధిదైవికము), తొలగించి మమ్ము అనుగ్రహించి రక్షించుము.

ఓ దేవా నాకు విఘ్నములను కలిగించే దుర్మార్గులను తలగక (ఏమాత్రము వెనుదీయక) త్రుంచుము (నశింపజేయుము). అట్లు త్రుంచి నన్ను బ్రహ్మసత్కళలో (బ్రహ్మదేవుడు నాకు జన్మత: ప్రసాదించిన కళలను పెంపొందజేయుము). శ్రీ గణనాయకా! నిన్ను శరణువేడెదను.

శ్రీగణనాయకా! ఆరూఢి (అతిశయించి) తరిగొండ హరికి (సింహానికి... అంటే... నరసింహునికి) సోదరి (చెల్లెలు) అయిన పార్వతీదేవి కుమారుడా! నిన్ను శరణువేడెదను. నన్ను అనుగ్రహింపుము.

పంతువరాళిరాగం, ఆదితాళం

98. ఏల నీకు బుద్ధి లేదురా? – ఓరోరి! జీవా!
ఏల నీకు బుద్ధి లేదు? – ఎవరితో నీకేల వాదు? ॥ పల్లవి॥

ఫాలభాగమందుఁ జూడారా! – భ్రమలన్ని యచట
భగ్నముగాఁ జెండి వీడరా!-వోరోరి జీవా! యేల నీకు బుద్ధి లేదురా ॥అనుపల్లవి॥

జనసంగములోనఁ జిక్కి – సంతోషాన మేను సొక్కి
నిన్ను నీవు జూడవేమిరా
సంసారసుఖము యెన్నటికీ–
విడనాడరా! వోరోరిఁ జీవా ॥ఏలనీకు॥ 1

ఆఱు చక్రములు నిలిపి – ఆఱుగురి గర్వ మణఁచి
మేరువపై నిలిచి చూడరా! మితి
మేరలేక మిన్ను లోను –
మిన్ను చూడరా! వోరోరి! జీవా ॥ఏలనీకు॥ 2

అండాండ, పిండాండములను-భేదించి, శోధించి, మించి అ
ఖండమాయను ఖండించరా! – అన్నిట నిలిచి, అ
ఖండపదవి నిండించరా! వోరోరి! జీవా ॥ఏలనీకు॥ 3

యాయీ యాల తరి – గొండ నరహరినిఁ జేరి
పండు వెన్నెల బయలుఁ జూడరా!
దండిగ వెలిఁగే నిండు జ్యోతి నీలోఁ
గానరా! వోరోరి! జీవా! ॥ఏలనీకు॥ 4

అవతారిక:

తెలుగు భాషకున్న విశిష్టత యేమంటే ఒకే ఒక అక్షరం మార్పుతో మొత్తం అర్థమే మారిపోతుంది. అర్థం ఎలాగైనా సమన్వయపరచవచ్చును. ఉదాహరణకి తరిగొండ వెంగమాంబ గారి ఈ కీర్తన అనుపల్లవిని చూడండి. ఫాలభాగమందు చూడరా! అచ్చట భ్రమలన్నీ భగ్నముగా చెంది వీడరా!

వోరోరి జీవా! అని వున్నది. ఇందులో విడిచిపెట్టమనే ఆదేశం జీవునికి చేస్తున్నారు. అదే "వీడురా" అయితే భ్రమలన్నీ విడిచిపెట్టిపోతాయని అర్థం వస్తుంది. నామటుకు నాకు 'వీడురా' అయితే సబబుగా వుంటుందనిపించింది.

భావ వివరణ:

ఓరోరి జీవుడా! నీకెందుకు బుద్ధిలేదురా! ఏమాత్రం బుద్ధిరాదేమిరా! వాదు (జోలి) నీకు ఇంకొకరితో యెందుకురా?

నీ ఫాలభాగమందు (నుదుటిమీద ఏమిఁవ్రాసి వున్నదో చూసుకో. అక్కడ నీ భ్రమలన్నీ భగ్నముగా జెండి (పటాపంచలయి) వీడురా (విడిచిపోతాయిరా!) ఓరోరి జీవా! ఇంకా నీకు యెందుకు బుద్ధిరాదురా!

జన సందోహంతో సంగత్వం పెట్టుకొని వారి సంతోషాలలో పాలుపంచుకొంటూ నీ ఒళ్ళు నీవు మఱచిపోతున్నావు. నిన్ను నీవు చూసుకోవేమిరా? ఈ సంసార సుఖములను విడిచిపెట్టరా!

ఆఱు చక్రముల నిలిపి (షట్చక్రయోగసాధనలో మనస్సు లగ్నంజేసి) ఆరుగురి గర్వమణచి (అరిషడ్ వర్గములను జయించి) చూడరా! మేరువపై నిలిచిన (మేరుపర్వతాన్ని అధిరోహించిన) అనుభూతి కలుగుతుంది. ఓరోరి జీవా! మతిలేని గగనాంతర సీమలను చేరిన అనుభూతి కలుగుతుంది.

అండపిండ బ్రహ్మాండములను భేదించి పరిశోధించు. అన్నిటినీ మించే అఖండమైన మాయను ఖండించి పారవేయరా! ఓరోరి జీవా! అన్నిటిలో నిలిచి (జ్ఞానము, జ్ఞేయమూ, జ్ఞాని – అన్నీ నీవే అయిపోతావు). అఖండపదవి (మోక్షము) నీకు సిద్ధిస్తుంది.

యాయీయాల? (అల్లరి యెందులకు?) తరిగొండ నరసింహస్వామిని చేరుకోరాదా? అక్కడ పండువెన్నెలలో ఆరుబయట చూడరా! అప్పుడు నీలో దండిగా (సమృద్ధిగా) వెలిగే ఆత్మజ్యోతి కనబడుతుంది. ఓరోరి జీవుడా! దాని చూచి తరించరా నాయనా!

లాలి

99. లాలి ముద్దుల బాల! – లాలి గోపాలా!
లాలి కాంచన చేల! – లలిత గుణజాలా! ॥లాలీ॥1

ప్రవిమలాచార! యా – దవ కులోద్ధారా!
కవిబృంద మందార! – కలికలుషదూరా! ॥లాలీ॥2

నంద నందన! సదా – నంద! గోవిందా!
సౌందర్య వదనార – వింద! ముకుందా! ॥లాలీ॥3

వర చిన్మయాకార! – వనధి గంభీరా!
నిరుపమగుణ హార! – నిగమ సంచారా! ॥లాలీ॥4

శైలజస్తుత నామ! – సంపూర్ణ కామా!
నీలమేఘ శ్యామ – నిర్జర లలామా! ॥లాలీ॥5

తరిగొండపుర వాస! – తారక విలాసా!
చిరరమ్య దరహాస! – శ్రీ శ్రీనివాసా! ॥లాలీ॥6

అవతారిక:

తరిగొండ వెంగమాంబ శ్రీకృష్ణునిపై పాడిన లాలిపాటను ఆస్వాదించండి. ఇందులో వివరణకేమాత్రం ఆస్కారం లేకపోయినా పాట మాధుర్యం దృష్ట్యా ప్రస్తుతించవలసిన కీర్తన ఇది. ముద్దు లొలికే గోపాల బాలా! లాలి. ఓ కాంచన చేలా! లాలి. లలితగుణ జాలముకలిగిన దేవా! లాలి అంటున్నారు. పాఠకుల సౌకర్యార్థమే పద వివరణ కాని నిజానికి పదవివరణ అవసరమేలేని సరళమైన భాషవాడారు. అన్నమయ్య మాదిరిగానే ఈమె తరిగొండ వాసుడైన నరహరే, తిరుమల శ్రీశ్రీనివాసుడు అని భావిస్తున్నారు. అన్నట్లు 'నిర్జరలలామ' అంటే యేమిటి?

భావ వివరణ:

ఓ ముద్దులొలికే బాలుడా! గోపాలా! లాలిపాడెదనయ్యా! లాలి. ఓ కాంచనచేలా! (పచ్చని బంగారువర్ణపు పట్టుదట్టి కట్టిన కిట్టయ్యా! లాలి) మనోహరమైన గుణములు సమృద్ధిగా గల గోపాలా! లాలి.

గొప్ప నిర్మలమైన నడవడిగల గోపాలా! నీవు యాదవకులమును ఉద్ధరించుటకు అవతరించితివి. కవి బృందములకు (పండితమండలికి) మందారము వంటివాడవు. కలియుగ కాలుష్యమును దూరము చేయుటకు భూమిపై నవతరించిన దేవుడవు నీవే.

ప్రభూ! నీవు నందుని నందనుడవు (పుత్రుడవు). ఎల్లప్పుడూ ఆనందముతో వుండే గోవిందుడవు. సుందరమైన వదనారవిందము గలవాడవు. ముకుందమును (పద్మమును) చేతదరించిన ముకుందుడవు.

స్వామీ! నీవు చిన్మయాకారుడవు (చిదానంద స్వరూపుడవు). వనధిగంభీరుడవు (సముద్రమువలె గంభీరుడవు). సాటిలేని సుగుణములు హారముగా కలిగినవాడవు. నిగమ సంచారుడవు (వేదములయందు సంచరించువాడవు).

ఓ దేవదేవా! శైలజ (పార్వతీదేవి) స్తుతించునామ సముదాయము కలవాడవు. సంపూర్ణమైన కామనలు గలవాడవు. నల్లని మేఘపు కాంతిగల శరీరచ్ఛాయ గలవాడవు. నీవు నిర్జరలలాముడవు. (ముసలితనములేని దేవతలందరిలోనూ శ్రేష్ఠుడవు). ఓ సర్వేశ్వరా! నీవు తరిగొండ పట్టణ వాసుడవైన నారసింహుడవు. ఓ తారకవిలాసా! (మోక్షము నొసగే శ్రీహరీ!) రమ్యమైన చిరునవ్వు నిరంతరం పెదవులపై తాండవించే శ్రీశ్రీనివాసా! లాలి పాడెదను నిద్దురపోవయ్యా!

మోహన రాగం – త్రిపుట చాపు తాళం

100. ఓ తల్లి! గంగాభవానీ! రావే!
ఖ్యాతిగ నిచటికి కపటము మాని ॥ఓ తల్లీ॥ ॥పల్లవి॥

హరిపాదమునఁ బుట్టినావు, పుర
హరుని జటాజూటమున నిలిచినావు
పరమ పవిత్ర వైనావు, మా
పాలిట వెలసి పూజలు గైకొన్నావు ॥ఓ తల్లీ॥ 1

హరి కర్పితముగ శ్రీతులసీవన
మలనాఁ డర్థితో నిన్నుఁ గావింప వెలసి
తరుణిది పెంచను మెఱసి యున్న
నర లేక రావె! శేషాద్రిలో వెలసి ॥ఓ తల్లీ॥ 2

వాసిగ నిను చాల నమ్మి, చిన్న
వాండ్ల కాదురువుగ నున్న సొమ్మమ్మి
చేసితి, నిను పని నమ్మి చేయ
నిరవుగనిచటికి బిరబిర రమ్మి! ॥ఓ తల్లీ॥ 3

తరిగొండ నరసింహుఁడైనా శేష
గిరివాసు నేవేళ కీర్తింపు జ్ఞాన!
కరుణ నాపై నుంచి శాన,
మమ్ము, కడతేర్చు భారము కల్గిన దాన ॥ఓ తల్లీ॥ 4

అవతారిక:

తుంబురవనంలో నివసించటానికి తరిగొండ వెంగమాంబగారికి యెట్టకేలకు అనుమతి లభించింది. కాని అక్కడ నీటిసౌకర్యంలేదు. ఆమె హితైభిలాషులు ఒక బావితవ్వటానికి ప్రయత్నించారు. కాని విధివశాత్తు రాయిపడింది. అందరి గుండెల్లోనూ రాయి పడింది. అయితే వెంగమాంబ

గారుభయపడలేదు. ఆమె శ్రీహరి శరణాగతురాలు. హరి పాదోద్భవియైన గంగాభవానిని ఈ కీర్తన పాడి ప్రార్థించింది. స్తంభంలోంచి పుట్టుకొచ్చి తనభక్తుని ఆదుకొన్న నారసింహుని భక్తురాలిని గంగమ్మ అనుగ్రహించి బావిలో తీయటి నీరు వూరింది. మరి యీ కీర్తన నాస్వాదించండి.

భావ వివరణ:

ఓ తల్లీ! గంగాభవానీ! రావమ్మా! కపటమును విడనాడి ఇక్కడకు వచ్చి ఖ్యాతిగడించు ప్రసిద్ధిబొందవమ్మా!

తల్లీ! నీవు శ్రీహరి పాదములవద్ద జన్మనొందినావు. తరువాత పురాంతకుడైన శంకరుని జటాజూటమున బంధింపబడి నిలిచిపోయావు. ఆయన శరీరమును తాకి పరమపావనివైనావు. మావద్దకు వచ్చి నెలకొని గంగామాతగా నిత్యమూ పూజలు గైకొంటున్నావు.

మళ్లీ నిన్ను హరికి అర్పితము చేశారు (బదరీనాథవద్ద) నిన్ను అలనాడు శ్రీతులసీవనంలో అర్థించగా వెలసినావు. నేడు అరలేక (బేధభావంలేక) ఈ తరుణాన మా పుణ్యం పెంచేటందుకు ఈ శేషాద్రిపైకి శోభాయమానంగా రావమ్మా!

ఓతల్లీ! నీవిఖ్యాతిని నమ్మి, పిల్లవాండ్ల ఆధారమైన వారి నగలను అమ్మి నిన్ను మనసారా నమ్మి బావితవ్వించటానికి వెచ్చించాను. ఇక నువ్వు బిరబిరా ఇక్కడకు వచ్చి ఇరవు (స్థావరము) పొందవమ్మా! రావమ్మా!

తరిగొండ నరసింహస్వామికూడా తానే అయిన శేషాచలపతి శ్రీవేంకటేశ్వరుని యేవేళనైనా కీర్తించే జ్ఞానస్వరూపిణీ! నాపై శాన (చాలా) దయ చూపించవమ్మా! మమ్ము ఈ కష్టంనుండి బయటపడవేయవమ్మా! నాపై ఎంతో బాధ్యత వున్నది తల్లీ! నన్ను రక్షించవమ్మా!

మంగళము

ముత్యాల హారతి పాట

101. శ్రీపన్నగాద్రివర శిఖరాగ్ర వాసునకు
పాపాంధకార ఘన భాస్కరునకూ,
ఆ పరాత్మనకు నిత్యానపాయినియైన
మా పాలి అలమేలు మంగమ్మకూ
జయ మంగళం నిత్య శుభ మంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 1

శరణన్న దాసులకు వరమిత్తునని బిరుదు
ధరియించియున్న పర దైవమునకూ,
మరువల దీ బిరుదు నిరతమని పతిని
ఏమరనియ్య నలమేలు మంగమ్మకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 2

ఆనంద నిలయమం దనిశంబు వసియించి
దీనులను రక్షించు దేవునకునూ,
కానుకల నొనఁగూర్చి ఘనముగా విభుని స-
న్మానించు అలమేలు మంగమ్మకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 3

పరమొసఁగ నా వంతు నరుల కని వైకుంఠ-
మరచేత చూపు జగదాత్మునకునూ,
సిరు లొసఁగ తనవంతు సిద్ధమని నాయకుని
ఉరముపై కొలువున్న శరధిసుతకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 4

తెలివితో ముడుపు లిటు తెమ్ము తెమ్మని పరుష
నళికించి కైకొనెడి అచ్యుతునకూ,
ఎలమి పాకంబుఁ జేయించి అందర కన్న
మలయ కెపు డొసఁగే మహామాతకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 5

మఱియు చిత్ర విచిత్ర మంటపావళులకును,
తిరువీథులకు, దివ్య తీర్థములకూ,
పరఁగ ఘన గోపుర ప్రాకారతతులకును,
చిరములై తగు కనక శిఖరములకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 6

తరచైన ధర్మసత్రములకును, ఫలపుష్ప
భరిత శృంగారవన పంక్తులకునూ,
మరువొప్పు ఉగ్రాణములకు, బొక్కసములకు,
సరసంబులగు పాకశాలలకునూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 7

అహివైరి ముఖ్య వాహనములకు, గొడుగులకు,
రహి నొప్పు మకర తోరణములకునూ,
బహువిధ ధ్వజములకు, పటువాద్య వితతులకు,
విహిత సత్కల్యాణ వేదికలకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 8

దర చక్ర ముఖ్య సాధనములకు, మణిమయా-
భరణ దివ్యాంబర ప్రతతులకునూ,
కర చరణ ముఖ్యాంగ గణ సహితమై, శుభా-
కరమైన దివ్య మంగళ మూర్తికీ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 9

కలిత సుజ్ఞానాది కల్యాణగుణములకు,
బలమొప్పు నమిత ప్రభావమునకూ,
వలగొనిన సకల పరివార దేవతలకును,
చెలఁగి పనులొనరించు సేవకులకూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 10

అలరఁగా బ్రహ్మోత్సవాదులై సంతతము
వలనొప్పు నిత్యోత్సవంబులకునూ,
పొలుపొందు విశ్వప్రభుత్వ మూలంబునకు,
నలువొందు వర విమానంబులకునూ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 11

అరయ తరిగొండ నరహరి యగుచు నందరికి
వరము లొసఁగే శ్రీనివాసునకునూ,
మురియుచును విశ్వతోముఖు నిట్లు భరియించి
సిరుల వెలయుచునుండు శేషాద్రికీ
జయ మంగళం నిత్యశుభమంగళమ్,
జయ మంగళం నిత్య శుభ మంగళమ్. 12

అవతారిక:

తిరుమలలో నేటికీ స్వామికి మంగళగీతికవలె వినిపిస్తున్న ఆనాటి వెంగమాంబ హారతిపాటను ఆస్వాదించి తరించండి. శ్రీవేంకటేశ్వరునికీ, జనని అలమేలు మంగకు, ఆనందనిలయవాసుడైన శ్రీనివాసునికి, ఆయన పురముపై నెలకొన్న సముద్రరాజ తనయకు తిరువీధులకు, గోపురాలకు, మంటపాలకు, తీర్థములకు, శిఖరాలకు, ధర్మసత్రాలకు, శృంగారవనాలకు, స్వామివారి ధనాగారాలకు, వంటశాలలకు, ఆయన గరుడవాహనము మొదలైన వాహనములకు, గొడుగులకు, మకరతోరణాలకు, ధ్వజములకు, మంగళవాయిద్యములకు, వేదికలకు, స్వామివారి పట్టువస్త్రాలకు ఆయన కళ్యాణ గుణములకు, దేవతలకు, బ్రహ్మోత్సవాలకు, తరిగొండ నరసింహునికి, శేషాచలమునకు పేరుపేరునా మంగళాశాసనములను వినిపిస్తున్నారు. పాడి, విని, చదివి తరించండి. ఈ రచన పరిసమాప్తమవుతున్నది.

32 అన్నమయ్య భక్తి కీర్తనలు, 32 పెదతిరుమలయ్య రక్తి (శృంగార) 32 చినతిరుమలయ్య విరక్తి (అధ్యాత్మ) కీర్తనలు, అవతారిక, భావి వివరణలతో అందించబడ్డాయి. 5 తరిగొండ వెంగమాంబ కీర్తనలను కూడా వాటితో పాటు అందించాను. ఆనందమంతా మీదే సుమా!

భావ వివరణ:

శ్రీపన్నగాద్రివరశిఖ (వేషశైల శిఖరమున) వసించు మహానుభావునికి, పాపాంధకారము నణగించు గొప్ప సూర్యునికి, పరమపురుషునికి, నిత్య అనుపాయియైన (నిత్యమూ అనుసరించివుండే) అలమేల్మంగమ్మకు జయమంగళము మరియు శుభమంగళము.

తన శరణాగతులకు వరములిస్తాడనే బిరుదున్న పరదేవతామూర్తికి, ఓ స్వామీ! నీబిరుదును మరువకు అని ప్రతిక్షణం తనే ఆయనకు గుర్తుచేసే అలమేల్మంగకు మంగళా శాసనములు.

ఎల్లవేళలా ఆనందనిలయంలో నివసించి దీనులను రక్షించే దేవదేవునికి, ఆయనకు ఘనమైన కానుకలనొసగి ఆయనకు ప్రీతిగలిగించు అలమేల్మంగకు జయమంగళము మరియు శుభమంగళము.

తన అరచెయ్యి చూపిస్తూ మీకు వైకుంఠం ఇవ్వటమే నావంతు అని ఆయనంటుంటే, మీకు సిరిసంపదలివ్వటం నావంతు అని ఆయన పురముపైనెక్కిన అలమేల్మంగకు మంగళాశాసనములు.

మనస్ఫూర్తిగా ముడుపులను తీసికొనివచ్చినాకర్పించి తరించండిరా అనే అచ్యుతునికి అందరికీ అన్నపానములనొసగే మహామాతకు జయమంగళము మరియు శుభమంగళము.

తిరుమలలోని చిత్రవిచిత్రమైన మంటపములకు, తిరువీధులకు, దివ్యమైన తీర్థములకు, గొప్ప గోపురాలకు, ప్రాకారాలకు బంగారు శిఖరాలకు మంగళాశాసనములు.

అధికముగానున్న ధర్మసత్రములకు, ఫలపుష్ప సమన్వితమైన శృంగారవనములకు, మురువొప్పు డగ్రాణములకు (సౌందర్యమొప్పు భాండాగారములకు) చక్కటి వంటశాలలకు జయమంగళము మరియు శుభమంగళము.

పన్నగములశత్రువైన గరుత్మంతునికి, స్వామివారి గొడుగులకు, కాంతివంతమైన మకర తోరణములకు, మంగళవాయిద్యములకు, కళ్యాణ వేదికలకు మంగళా శాసనములు.

స్వామివారి శంఖ చక్రాది ఆయుధములకు, మణిమయమైన ఆభరణములకు, దివ్యమైన చీనాంబరములకు, కరచరణాది అంగములతోనున్న మంగళమూర్తికి జయమంగళము మరియు శుభమంగళము.

సుజ్ఞానము మొదలైన కళ్యాణగుణములకు, బలమైన ఆయన

భావమునకు, చుట్టూ చేరిన దేవతలు మొదలైన పరివారమునకు, అసంఖ్యాకులైన సేవకులకు మంగళాశాసనములు.

స్వామివారి బ్రహ్మోత్సవములకు, ఎప్పుడూ జరిగే నిత్యోత్సవములకు, స్వామివారు నిర్వహించు విశ్వపరిపాలనమునకు, ఆయన విమానములకు జయమంగళము మరియు శుభమంగళము.

అదిగో ఆ తరిగొండ నారసింహునకు, కోరినవారందరికీ వరములనొసగే శ్రీనివాసునికి, విశ్వతోముఖుడైన ఆ శ్రీవేంకటేశ్వరుని భరిస్తున్న సిరుల శేషాద్రికి అనేకానేక మంగళాశాసనములు.

"సర్వేజనా: సుఖినో భవంతు".



శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

"అ ఆ ఇ ఈ" లలో అన్నమయ్య

రచన :
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

అ ఆ ఇ ఈ లలో అన్నమయ్య

మొదటి ప్రచురణ
మార్చి 2011

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.
Cell: 9393021360

వెల : అమూల్యం

ప్రతులకు :
ప్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09

ముందుమాట

దేశభాషలందు తెలుగు లెస్స – అన్నాడు శ్రీకృష్ణదేవరాయలు. అన్ని భాషల్లోను తెలుగు 'లెస్సు' అన్నాడు ఇంగిలీసు నేర్చిన తెలుగువాడు. ఎంగిలి తిండికి అలవాటుపడి పల్లెల్లోనూ 'కాన్వెంటులు' వెంట వెంటనే వచ్చి అమ్మా నాన్నా పోయి మమ్మీ, డాడీలు వచ్చారు. 'తల్లీ! నిన్ను దలంచి' అని సరస్వతీదేవిని తలవకుండానే, 'బాబా! బ్లాక్ షీప్' అంటున్నాయి పిల్లగొఱ్ఱెలు. ఇది ఆ చిన్నారుల తప్పుకాదు. నాగరికులమనుకొనే అనాగరికులనుంచి పుట్టిన మాయరోగం. దీనికి మందు మంచి ఆలోచన. తనని తను ప్రేమించుకోవటం జీవలక్షణం. అమ్మా నాన్నలను ప్రేమించటం జీవి జన్మ లక్షణం. తనవారిని ప్రేమించటం సహజ లక్షణం. ఇందులో ఏ దోషములేదు. కాని, తన కన్నతల్లి వలెనే తనదేశాన్ని ప్రేమించాలి. తన తల్లి నేర్పిన భాషను ప్రేమించాలి. అందుకే 'చేయెత్తి జైకొట్టు తెలుగోడ' అని పాడాడు ఆనాటి కవి. నేడు ఈ డాలర్ పరుగులో ఆంధ్రభాషకు అన్ని అక్షరాలే అక్కర్లేదు, దాంట్లో సగం అక్షరాలున్న ఇంగ్లీషే ధవుజండ్ టైమ్స్ బెటర్ అంటున్నాడు తెలుగోడు. అందుకని నేటి తెలుగు పిల్లవాడు 'కళ్ట' బదులు 'కర్ర' అని వ్రాస్తుంటే వెరీగుడ్ అంటున్నాడు పంతులు.

ఇదంతా చూసి నాబోటి అనామకుడు (అమాయకుడు కూడ) చేసిన ఒక చిరుయత్నమే మీరు చదువుతున్న ''అఆఇఈ లలో అన్నమయ్య''. అన్నమాచార్యులవారి సంకీర్తనలపై అపరిమితమైన అనురాగం వున్న నేను జన బాహుళ్యంలో అత్యంత ప్రసిద్ధిచెందిన కీర్తనలనుండి, కీర్తనలోని మొదటి అక్షరము ఆధారముగా, యీ "అ ఆ ఇ ఈ లలో అన్నమయ్య" అనే సంకీర్తనలను సంకలనము చేసి మీ ముందు ఉంచుతున్నాను. నా ప్రదాన వుద్దేశ్యం పిల్లలకి (కొంతమంది పెద్దలకి కూడ) తెలుగు అక్షరాలను పరిచయం చేస్తూ అన్నమయ్య కీర్తనల ద్వారా అక్షరాలే కాక అక్షరక్రమం కూడ గుర్తుండేట్లు చేయడం. పిల్లలకి పాటలు తేలికగా గుర్తుంటాయి.

సంగీత సాహిత్యాలలో మీ పాపాయి మిమ్మల్ని పరవశింపచేస్తుంది. కీర్తన మొత్తం రాకపోయినా పర్వాలేదు. పల్లవి నేర్చుకొన్నా మనలక్ష్యం నెరవేరుతుంది. అమ్మ తన ఒడిలో కూర్చోబెట్టుకొని 'హ' అంటే తన పాపాయి "హరినామమే కడు ఆనందకరము మరుగవో మరుగవో మరుగవో మనసా" అని పల్లవి అందుకుంటే పులకించి పోని తల్లిదండ్రులుంటారా? పాపాయికి ఆ శ్రీహరి శ్రీరామరక్ష కాకుండా వుంటాడా? ఆలోచించండి. తల్లి "ఱాళ్ళతోటి కొట్టి అంపాలకోసినా" అని పద్యం చదివితే పాపాయి కాసేపు ఆలోచించి 'అ' అంటే అమ్మ యెంత ఆనందపడుతుంది! పాపాయికి అప్పుడు ఆ పద్యానికి సంబంధించిన ప్రహ్లాదుడి కథ చెబుతే 'అ' అనే అక్షరాన్ని పాపాలు మరువగలదా? కాబట్టి తల్లులారా! బామ్మలారా! అమ్మమ్మల్లారా! తండ్రులారా! తాతల్లారా! మీ ప్రయత్నం మీరూ చేయండి.

సాధుజనులారా! ప్రయత్నం మానకండి. తెలుగు గడ్డపై పుట్టి తెలుగు నేర్చుకోకపోవటం జన్మనిచ్చిన తల్లిదండ్రులను అమ్మా! నాన్నా! అని పిలువనంత నేరం దేవుని ఎదుట నిలబడి ఆ దేవునికి నమస్కరించనంత నేరం.

దయచేసి నేరస్థులు కాకండి. ఆలస్యమైనా ఆచరించేవాడే కృతకృత్యుడవుతాడు. ఎంత గొప్ప పరుగు పందేనికి అయినా మొదటి అడుగే ముఖ్యం. ఇక లేవండి. గమ్యం చేరండి. తెలుగు నేర్చుకోండి. తెలుగులో మాట్లాడండి.... తెలివిగా వుండండి.

అంకితం

ఆ.వె॥ అంకితంబునిత్తు అన్నమయ్యా! నీకు
చిన్నిపాప నిన్ను సన్నుతించు
కీర్తనంబు పాడి కీర్తించు వెన్నుని
ముందు బ్రతుకునందు పొందునందు.

ప్రార్థన

రాగం : బౌళి

శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు ॥శ్రీ మన్నారాయణ॥

కమలాసతీముఖకమల కమలహిత
కమలప్రియ కమలేక్షణ
కమలాసనహిత గరుడగమన శ్రీ-
కమలనాభ నీ పదకమలమే శరణు ॥శ్రీ మన్నారాయణ॥

పరమయోగిజన భాగధేయ శ్రీ-
పరమపురుష పరాత్పరా
పరమాత్మా పరమాణురూప శ్రీ-
తిరువేంకటగిరిదేవా శరణు ॥ శ్రీ మన్నారాయణ॥

భావామృతం :

ఓ శ్రీ మన్నారాయణా శ్రీ మన్నారాయణా శ్రీ మన్నారాయణా మాకు మంగళకరమైన నీ యొక్క పాదపద్మములే శరణు.

లక్ష్మీదేవి ముఖకమలమునకు సూర్య భగవానునివలె ఆనందమొసగు వాడవు. పద్మములను ప్రీతితో హస్తమున ధరించువాడవు. తామరలవంటి కన్నులుగలవాడవు. కమలాసనుడైన బ్రహ్మదేవునకు మేలు చేయు తండ్రివి. గరుత్మంతునధిరోహించి సంచరించువాడవు. పద్మనాభుడవు. అట్టి నీ పాదపద్మములే మాకుశరణము.

పరమయోగులైన వారికి భాగ్యప్రదాతవు. పరమపురుషుడవు. శ్రేష్ఠుల కందరికీ శ్రేష్ఠుడవు. పరమాత్యవు. ఉత్కృష్టము మరియు అణురూపము కూడ ధరించువాడవు. అట్టి తిరువేంకటాద్రి నాయకా! నీకు శరణు. నాకే శరణు, శరణు.

1 అ

రాగం : మధ్యమావతి

అదివో అల్లదివో శ్రీహరివాసము
పదివేలు శేషుల పడగలమయము ॥అదివో॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాసమఖిల మునులకు
అదె చూడుడదె మొక్కుడానందమయము ॥అదివో॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్నధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥అదివో॥

కైవల్యపదము వేంకటనగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపదరూపమదివో
పావనములకెల్ల పావనమయము ॥అదివో॥

భావామృతం :

(ఒకసారి వాయుదేవునికి ఆదిశేషునికి మధ్య తమలో అధిక బలశాలి యెవరనే వివాదంవచ్చి, తగవు తీర్చటానికి నారదుని ఆశ్రయించారట. ఆయన ఆనంద పర్వతము నాశ్రయించమంటే వారా పర్వతాన్ని అడిగారట. శేషుడు నన్ను గట్టిగా బిగించి పట్టుకొంటే నువ్వు ఆ పట్టు విడిపించు అన్నదట వాయుదేవునితో 'ఆనందగిరి'.

ఆదిశేషుని పట్టుకి వాయుదేవుడు బిగిసిపోయి మానవులు ఊపిరాడక తల్లడిల్లారట. దేవతల అభ్యర్థన మేరకు శేషుడు జాలి తలచి పట్టుకాస్త సడలిస్తే వాయుదేవుడు ప్రచండవేగంతో ఆనందగిరిని ముక్కలు చేసేశాడట. దేవతల ప్రార్థన విని ఆదిశేషుడు ఒకదానిపై తన నివాసమేర్పరచుకొన్నాడట. అదే శేషాచలం. వృషభాద్రి, నారాయణాద్రి, అంజనాద్రి, గరుడాద్రి, వేంకటాద్రితో కలిసి ఏడుకొండలు ఆవిధంగా ఒక్కచోట వెలశాయి. వాటిని తన నివాసంగా ఏర్పరచుకొన్నాడు. వైకుంఠం నుంచి దిగివచ్చిన శ్రీమన్నారాయణుడు. తనే శ్రీవేంకటేశ్వరుడై వాటిపై వెలిశాడు)

అదిగో అల్లదిగో ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అదే శ్రీహరి నివాస స్థానము. అది ఆదిశేషుని పడగలతో నిండిపోయి వున్నది. (మనబోటి అల్పులకి కనబడదనుకో..) పదివేల పడగలమయమైన దానిని భావించి నమస్కరించి తరించండి. ఆ కనబడుతున్న వేంకటాచలం చూశారా! అది బ్రహ్మాదిదేవతలందరికి ఆప్యాయమైనది. మహామునులందరికీ ఆ కొండ నిత్యమూ నివాసస్థానం. వారు ఉండటానికి యెంచుకొన్నచోటు అదే సుమా! దాన్ని చూడండి. మొక్కండి. ఆనందం నిండి వుండే నెలవు అదే.

దాని దగ్గరలోనే వున్న పర్వతమే శేషాచలము. స్వర్గంలో వుండే దేవతలు భూమిపైకి వచ్చినప్పుడల్లా స్వయంగా వుండే చోటు అదే. మనయెట్ట నెదుట వుండే మూలధనం అదే. బంగారు శిఖరాలు (గోల్డ్‌కాదు...) గల ఆ పర్వతం బ్రహ్మర్షులు, బ్రహ్మత్వం సిద్ధించిన మహామహులందరికీ ఆటపట్టుగా విలసిల్లుచున్నది.

ఇక ఈ వేంకటాచలం మహిమ నేమని వర్ణించను? ఇది మోక్షప్రాప్యస్థానము. శ్రీమన్నారాయణుని అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరునికి అపురూపమైన భాగ్యము ఇది. చక్కగా భావించగలిగితే సర్వసంపదలకి మారు రూపు ఇదే. పవిత్రమైన వాటన్నింటిలోకి అత్యంత పవిత్రమైనది ఈ వేంకటాచలమే.

2 ఆ

రాగం : ముఖారి

ఆకలివేళల-నలపైన వేళలను
తేకువ హరినామమే- దిక్కు మరి లేదు ॥ఆకలి॥

కొఱమాలియున్నవేళ-కులము చెడినవేళ
చెఱవడి యొరులచే-జిక్కినవేళ
ఒఱపైన హరినామ-మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన-మఱి లేదు తెఱగు ॥ఆకలి॥

ఆపదవచ్చిన వేళ - ఆఱడి బడినవేళ
పాపపు వేళల -భయపడిన వేళ
ఓపినంత హరినామ-మొక్కటే గతిగాక
మాపుదాక బొరలిన-మఱిలేదు తెఱగు ॥ఆకలి॥

సంకెలబెట్టిన వేళ - చంప బిలిచినవేళ
అంకిలిగా నప్పులవా-రాగిన వేళ
వేంకటేశు నామమే - విడిపించ గతిగాక
మంకు బుద్ధి బొరలిన- మఱిలేదు తెఱగు ॥ఆకలి॥

భావామృతం :

ఆకలితో బాధపడుతున్నప్పుడు, అలసి శ్రమపడి యున్నప్పుడు, మానవులకు తేకువ (ధైర్యము) నొసగునది యేది? శ్రీహరి నామము ఒక్కటే దిక్కు కాని మరింకేదీ లేదు (అని గ్రహించండి). కొఱమాలియున్నవేళ (ఎందుకూ కొఱగాని స్థితియందు), కుల భ్రష్టత్వము చెందినప్పుడు, ఇతరుల చేతిలో జిక్కి చెరసాలలో బంధింపబడినప్పుడు, ఒఱపైన (చక్కటి) హరినామమొక్కటే గతి. పొరబాటుగానైనా ఇంకొకటి దిక్కు కాదని గ్రహించవలెను. అసలింకొక దారియే (తెఱవు) లేదు, ఉండబోదు.

మనకు అనుకోకుండా ఆపద సంభవించినప్పుడు, నిందకు గురియైన వేళలయందు, పాపము జరుగుచున్న వేళలయందు, భయకంపితులైయున్న సమయములలోను చేతనయినంత హరినామమొక్కటే దిక్కు. అంతేగాని చివరిదాక ఎంత బొరలినా(శ్రమించినా) ఇంకొకమార్గం లేదు.

నీపై వైరభావం కలిగినవారు సంకెళ్లతో బంధించి బాధించుచున్నప్పుడు, సంహరించుటకు సిద్ధపడినప్పుడు, అప్పులవాళ్లు అంకిలిగా (అడ్డుపడి) నిలబెట్టిన వేళ, ఆ శ్రీవేంకటేశ్వరుని నామమొక్కటే దిక్కు. అదొక్కటే నిన్ను విడిపించగలదు. అట్లుగాక మంకుబుద్ధితో (మూర్ఖత్వంతో) శ్రమిస్తే ఏమి ఉపయోగం? ఇంకొకదారి లేదు అని గ్రహించి ఆ ఏడుకొండల వాడిని "అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ" అని వేడుకోండి. మిమ్మల్ని తప్పక రక్షిస్తాడు.

3 ఇ

రాగం : బౌళి

ఇప్పుడిటు కలగంటి నెల్ల లోకములకు–
నప్పడగు తిరువేంకటాధీశు గంటి ॥ఇప్పుడిటు॥

అతిశయంబైన శేషాద్రి శిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుగగ గంటి
చతురాస్యు పొడగంటి చయ్యన మేలుకొంటి ॥ఇప్పుడిటు॥

కనకరత్న కవాట కాంతు లిరుగడ గంటి
ఘనమైన దీపసంఘముల గంటి
అనుపమ మణిమయమగు కిరీటము గంటి
కనకాంబరము గంటి గ్రక్కున మేలుకొంటి ॥ఇప్పుడిటు॥

అరుదైన శంఖచక్రాదు లిరుగడ గంటి
సరిలేని అభయహస్తమును గంటి
తిరు వేంకటాచలాధిపుని జూడగ గంటి
హరిగంటి గురుగంటి నంతట మేలుకొంటి ॥ఇప్పుడిటు॥

భావామృతం :

(కలలో తనకు దివ్యదర్శనమొసగిన శ్రీ వేంకటేశ్వరుని ప్రత్యక్షానుభవాన్ని వర్ణిస్తున్నారు అన్నమాచార్యుల వారు. ప్రతి పాదంలోను ఆ అనుభూతిని గమనించండి.....) ఇప్పుడు నేనొక దివ్యస్వప్నమునుగాంచితిని. ఆ స్వప్నంలో సమస్తలోకములకు తండ్రియైన పవిత్రమూర్తి శ్రీవేంకటేశ్వరుని దర్శించితిని.

ఆ కలలో సర్వశ్రేష్టమైన శేషాచలమును చూచితిని. సరిసమానమనునదేలేని గోపురము యొక్క దివ్యకాంతులను చూచితిని. నూరుకోట్ల సూర్యల అద్భుత కాంతిగలతేజస్సు నొకదానిని గాంచితిని. చతుర్ముఖుడైన బ్రహ్మను జూచితిని. అంతలోనే చటుక్కున మేలుకొంటిని.

రెండువైపులా రత్నఖచితమైన బంగారు తలుపులను చూచితిని. ఘనమైన దీపసమూహములను దర్శించితిని. సాటిలేని మణులు తాపినకిరీటములను చూచితిని. మేలిమి వస్త్రములను దర్శించితిని. వెంటనే నేను మేలుకొంటిని.

అరుదుగా కాని కనబడని దివ్య శంఖచక్రములను చూచితిని. సాటిలేని అభయహస్తమును దర్శించితిని. ఆ స్వప్నమున తిరుమలనాయకుని జూచితిని. జగద్గురువైన శ్రీహరిని దర్శించితిని. వెంటనే నేను మేలుకొంటిని.

4 ఈ

రాగం : నాట

ఈతడే రఘురాము డీతడేకాంగవీరుడు
యీతడు చేసిన చేతలెన్నియైనా గలవు ॥ఈతడే॥

ఖరదూషణాదులను ఖండతుండములు సేసె
అరుదుగా వాలినొక్క యమ్మున నేసె
సరవి కొండల చేత సముద్రము బంధించె
ఇరవై విభీషణునికిచ్చె లంకారాజ్యము ॥ఈతడె॥

కూడ పెట్టె వానరుల, కుంభకర్ణాది దైత్యుల
తోడనే రావణు జంపె దురము గెల్చె
వేడుకతో సీతాదేవి గూడెను పుష్పక మెక్కె
యీడు జోడై సింహాసన మేలె నయోధ్యలోన ॥ఈతడే॥

పుడమి యంతయు గాచె పొందుగా దనంతలేసి
కొడుకులగాంచెను కుశలవుల
యెడయక శ్రీవేంకటేశుడై వరములిచ్చె
అడరి తారక బ్రహ్మమై ఇదె వెలసె. ॥ఈతడే॥

భావామృతం :

ఓ ప్రజలారా! ఇదిగో ఈ మహానుభావుడే మన రఘురాముడు. ఈయన అసహాయశూరుడు. ఈయన చేసిన ఘనకార్యము లెన్నయినా వున్నాయి. (వాటిని కీర్తిస్తాను... వినండి).

ఆనాడు దండకారణ్యంలో ఖరదూషణాది రాక్షసులను పదివేలమందిని ఖండతుండములు (ముక్కలు ముక్కలుగ) చేశాడు. రావణాసురునే ముప్పుతిప్పలు పెట్టిన వాలిని ఒకే ఒక్క బాణంతో సంహరించాడు. సరవి (క్రమముగా లేక తదనంతరం) కొండరాళ్లతో సముద్రమున సేతు బంధనం చేశాడు. ఇరవై (ఇరవు+అయి=పొదుకొని) విభీషణుని లంకారాజ్యమునకు ప్రభువును చేశాడు.

ఒక్కవానరాన్నే చెప్పిన మాట వినేట్లు చేయటం కష్టం. అటువంటిది వానర సైన్యాన్నే నడిపించి కుంభకర్ణాది దైత్యులతో సహా రావణాసురుని సంహరించి దురము (యుద్ధము) గెల్చాడు. సంతోషముతో సీతాదేవిని స్వీకరించాడు. ఈడూ జోడైన ఆమెతో సింహాసన మలంకరించి అయోధ్యానగరాన్ని పరిపాలించాడు.

ఆ తరువాత భూమండలాన్నంతా, అశ్వమేధ యాగం చేసి సుభిక్షంగా, పొందుగా కాచె (అనుకూలముగా భూమిని పరిపాలించాడు. తనంతలేసి (తనతో సమానమైన ప్రతాపము కల) కుశలవులు అనే కొడుకులను గాంచినాడు. ఇదంతా ఆ త్రేతాయుగంలో జరిగినా... నేడు ఈ కలియుగంలో, యెడయక (విడువక) తిరుమలలో శ్రీవేంకటేశ్వరుడై తారకబ్రహ్మ (మోక్షప్రాప్తినిచ్చే పరబ్రహ్మవలె వెలసినాడు)

5 ఉ

రాగం : ఖమాస్

ఉగ్గు వెట్టరే వోయమ్మా చె-
య్యెగ్గీనిదె శిశు వోయమ్మా ॥ఉగ్గు వెట్టరే॥

కడుపులోని లోకమ్ములు గదలీ-
నొడలూచకురే వోయమ్మా
తొడికెడి సరుగన తొలగ దీయరే
వుడికెడి పాలివి వోయమ్మా ॥ఉగ్గు వోట్టరే॥

చప్పలు వట్టుక సన్నపు బాలుని-
నుప్పర మెత్తకురోయమ్మా
అప్పుడె సకలము నదిమీనోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా ॥ఉగ్గు వోట్టరే॥

తొయ్యలు లిటు చేతుల నలగించక
వుయ్యల నిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
నొయ్యన తిట్టకురోరమ్మా ॥ఉగ్గు వెట్టరే॥

భావామృతం

ఓ అమ్మలారా! ఈ శిశువునకు ఉగ్గు (స్త్రీలు చనుబాలతో ఆముదం కొద్దిగా రంగరించి ఇచ్చేదే ఉగ్గు అంటే. ఇది పాపాయి జీర్ణవ్యవస్థను చక్కబరుస్తుంది. పాలుత్రాగే పాపాయికి తల్లులు ఉగ్గుపెట్టేవారు. ఇక్కడ అన్నమయ్య తనే యశోదయై

గోపికలతో ఈ పాట రూపంలో ఉగ్గుపెట్టండని చెబుతున్నారు)పెట్టండమ్మా! కాస్త చేతులు చాచి ఈ శిశువు ఉగ్గుకు అడ్డు పెడుతున్నాడర్రా! అయినా ఉగ్గుపెట్టండమ్మా!

ఈబిడ్డ అట్లాంటిట్లాంటి సాధారణ శిశువు అనుకున్నారా ఏమర్రా! వీడు తన కడుపులో లోకాలన్నీ దాచుకొన్నాడు. మీరు గబగబా పిల్లాడిని ఊపితే వీడి ఒళ్ళంతా ఊగి లోకాలు తల్లడిల్లి పోతాయి కాస్త జాగ్రత్త. ఉడుకుడుకు పాలు పిల్లాడి మీద పొంగిపోయేట్లు చేస్తారా ఏమే? కాస్త జాగ్రత్త.

చిన్నపిల్లవాడర్రా! వీడిని జబ్బలు పట్టుకొని ఆకాశం వైపున కెత్తకండి (కళ్ళు తిరుగుతాయి చిన్నారికి). వాడి చిన్నారి నోట్లో ఆ ఉగ్గంతా ఒక్కసారి తోసేయకండే, వాడి నోట్లో అంత ఉగ్గుపడుతుందా. చూసుకోండమ్మా!

ఓ అమ్మాయిలూ! కాస్త జాగ్రత్త! వాడి నెత్తిమీద మొత్తకండి. వాణ్ణి అలిసిపోయేట్లు చేస్తారేమిటే! ఇక చాలు ఉయ్యాలలో పెట్టండి. వీడు కొండల తిమ్మయ్య (ఏడుకొండలవాడు) ఈ పాపాయిని కటువైన మాటలతో నిందించకండి.

6 ఊ

రాగం :గౌళ

ఊరకే దొరకునా ఉన్నతోన్నత సుఖము
సారంబు దెలిసికా జయము చేకొనుట ॥ఊరకే॥

తలపులోపలి చింత-దాటినప్పుడు గదా
అలరి దైవంబు ప్ర-త్యక్షమౌట
కలుషంపు దుర్మదము-గడచినప్పుడు గదా
తలకొన్న మోక్షంబు-తనకు జే పడుట ॥ఊరకే॥

కర్మంబు కసటువో-కడిగినప్పుడు గదా
నిర్మలజ్ఞానంబు-నెరవేరుట
మర్మంబు శ్రీహరిని-మఱుగు జొచ్చినగదా
కూర్మి తన జన్మమె-క్కుడు కెక్కుడౌట ॥ఊరకే॥

తన శాంత మాత్మలో-దగలినప్పుడు గదా
పనిగొన్న తన చదువు-ఫలియించుట
ఎనలేని శ్రీవేంక-టేశ్వరుని దాస్యంబు
తనకు నబ్బిన గదా-దరిజేరి మనుట ॥ఊరకే॥

భావామృతం :

అత్యుత్తమమైన మోక్షసౌఖ్యము తగిన యత్నముజేయక చేజిక్కుతుందా? ఒక పనిలో విజయం కలుగవలెనంటే ఆ పనిలోని సారమునంతా గ్రహించి తగిన సాధనజేయవలెను కదా! ఊరకే ఏకార్యమైనా నెరవేరుతుందా?

ఆలోచనలలో చింత విడనాడితేనే కదా! భగవత్సాక్షాత్కారం సాధ్యపడుతుంది. మలినములతోనున్న దుర్మదమును అతిక్రమిస్తేనే కదా! మోక్షం ప్రాప్తించేది. ఊరకే నాకు మోక్షం కావాలి, మోక్షంకావాలి అని తపనపడితే మోక్షం దొరుకుతుందా?

ఒక జన్మలో ప్రాప్తించిన మాలిన్యం ఆ జన్మతో పోతుందనుకోవటానికి వీలులేదు. అది మరుజన్మలోనూ నీడలా వెంటాడవచ్చును. కాబట్టి ఏదో ఒక జన్మలో ఆ మాలిన్యాలన్నింటినీ పూర్తిగా కడిగివేసికొంటేనే కదా! నిర్మలమైన జ్ఞానం కలుగుతుంది. హృదయకమలంలో శ్రీమన్నారాయణుడు ప్రకాశిస్తేనే కదా!జన్మసాఫల్యం కలుగుతుంది. ఊరకే నాజన్మ చరితార్థం కావాలి అని కలలు కంటే అయిపోతుందా? ఎన్నటికీ అవదు.

ఆత్మశాంతి పొందిన తరువాత గాని ఎవ్వరికైనా తను చదువుకొన్న చదువుకు

సార్థకత కలుగదు. జతలేని తిరుమలనాయకుడైన శ్రీవేంకటేశ్వరుని దాస్యము తనకు లభిస్తేనే గాని సంసార సాగరంలో ఒడ్డుజేరట మనేది జరుగదు. (దీని గురించి తెలిసీతెలియని తత్త్వబోధకులు ఏమి జెప్పినా నమ్మకండి. ఓం నమో వేంకటేశాయ అని శరణాగతినొందండి)

7 ఋ

ఆ.వె॥ ఋషుల గాచువాడు లోక రక్షకుడును
ఆర్తజనులకెల్ల అండ హరియె
వేడరయ్య! వాని వేంకటేశా! యని
అన్నమయ్య బాట నవధరించి.

భావామృతం :

ఋషులను దీనజనులను దిక్కయి కాపాడు వాడు లోకాల రక్షకుడైన శ్రీహరియే. ఓ ప్రజలారా! ఆయన్ని శ్రీవేంకటేశ్వరా! అని, అన్నమయ్య బాట ననుసరించి వేడుకోండి.

8,9,10 ఌ, ౡ

ఆ.వె॥ ఌ ౡలు నేడు 'లుప్తమై' పోయెను
భాషయందులేదు వాడుకిపుడు
అన్నమయ్య పాట అదియెట్లునుండురా
వినుతగుణనిధాన! వేంకటేశ!

భావామృతం

నేటి నవీన కాలంలో ఌ, ౡ అనే అక్షరాలు వాడుకలలో లేవు. ఇక అన్నమయ్య పాటలు ఆ అక్షరాలతో ఎలా మొదలవుతాయి? నుతించబడు సుగుణాలుకల వేంకటేశ్వరా! నీవిది వినుము ప్రభూ!

11 ఎ

రాగం : బౌళి

ఎక్కడి మానుషజన్మం బెత్తిన ఫలమేమున్నది
నిక్కము నిన్నెనమ్మితి నీచిత్తంబికను ॥ఎక్కడి॥

మరువను ఆహారంబును మరువను సంసారసుఖము
మరువను ఇంద్రియభోగము మాధవ నీమాయ
మరచెద సుజ్ఞానంబును మరచెద తత్త్వరహస్యము
మరచెద గురువును దైవము మాధవ నీమాయ ॥ఎక్కడి॥

విడువను పాపము పుణ్యము విడువను నాదుర్గుణములు
విడువను మిక్కిలి యాసలు విష్ణుడ నీమాయ
విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును
విడిచెద నాచారంబును విష్ణుడ నీమాయ ॥ఎక్కడి॥

తగిలెద బహు లంపటముల తగిలెద బహుబంధంబుల
తగులను మోక్షపు మార్గము తలపున యెంతైనా
అగపడి శ్రీ వేంకటేశ్వర అంతర్యామివై
నగినగి నను నీవేలితి నాకా యీమాయ ॥ఎక్కడి॥

భావామృతం

ఎక్కడి మనుష్య జన్మస్వామీ! ఇది? ఈ జన్మయెత్తి ఏమన్నా ఉపయోగం వుందా? లేదు. ఇక నీ ఇష్టం. నిజం చెబుతున్నాను ప్రభూ! నేను నిన్నే నమ్ముకొన్నాను.

ఓ మాధవా! నేనెంత దౌర్భాగ్యుడినంటే.... ఆహారమును విడువలేను రోజుమూడుపూటలా తినవలసిందే. సంసారసుఖం వదులుకోలేను. ఇంద్రియ భోగం మీద ఇసుమంతైనా విరక్తి లేదు. ఇక వాటిని మరువనుకానీ మంచి జ్ఞానమును, తత్త్వరహస్యములను, జగత్ప్రతియైన దైవమును, హితోపదేశం చేసే గురువును మాత్రం మఱచిపోతాను. దీనికి నేను కారణం కాదు ప్రభూ! నీమాయ ఆవరించడం చేత ఇట్లు జరుగుచున్నది.

ఓ విష్ణుదేవా! విడువకుండా పాపాలు పుణ్యాలు ఒకదాని వెంట ఇంకొకటి చేస్తూనే ఉన్నాను. నా చెడుగుణములను వదిలిపెట్టలేకున్నాను. ఆశాపాశముచే బంధింపబడి ఆశను విడువలేను ఇదంతా నీ మాయయే కదా! ఇదిట్లా వుంటే మానవులకు విధించబడిన ఆరు విధులను మాత్రం విడిచిపెట్టాను. వైరాగ్యం మాటనెత్తడం లేదు. ఆచారము అంటే ఏమిటో మఱచిపోయాను. విష్ణుస్వరూపా! ఇదంతా నీ మాయకాకామరేంటి?

ఓ ప్రభూ! నేను ఎన్నో చిక్కులలో తగులుకొంటాను. ఎన్నో బంధనములలో తగులుకొంటాను. ఇకపోతే నా ఆలోచనలలో కూడ మోక్షమార్గం జోలికి పోవటం లేదు. ఇవన్నీ జరిగినా నాకేం భయం? ఓ శ్రీవేంకటేశ్వరా! నాకు నీ దర్శనం అయింది. నీవు అంతర్యామిగా సంతోషంతో నన్ను రక్షిస్తున్నావు కదా! అట్టి నాకు నీమాయ అంటే ఏం భయం?

12 ఏ

రాగం : హిందోళ

ఏమని పొగడవచ్చునీతని ప్రభావము
వేమరువో పుణ్యులాల వినరో యీకతలు ॥ఏమని॥

అనంత సూర్యతేజుడట కాంతి చెప్పనెంత
దనుజాంతకుండట ప్రతాపమెంత
మనసిజగురుడట మరిచక్కదనమెంత
వనజజు గనినయట్టి వాడట ఘనతెంత ॥ఏమని॥

గంగాజనకుడట కడు చెప్పే పుణ్యమెంత
చెంగట భూకాంతుడట సింగారమెంత
రంగగు లక్ష్మీశుడట రాజసము లెంచనెంత
అంగవించు సర్వేశుడట సంపదెంత ॥ఏమని॥

మాయానాథుడట మహిమ వచించుటెంత
యేయెడ దావిష్ణుడట యిరవెంత
పాయక శ్రీ వేంకటాద్రి పతియై వరములిచ్చే
వేయిరూపుల వాడట విస్తారమెంత ॥ఏమని॥

భావామృతం

ఈ మహానుభావుని ప్రభావమును మనం ఏమని పొగడ గలము? మాటిమాటికీ ఈయన కథలను ఆలకించండి. ఓ పుణ్యాత్ములారా! అదే పుణ్యం అంటే.

లెక్క లేనంతమంది సూర్యుల కాంతి గలవాడీ స్వామి. ఇక ఆయన కాంతి ఎంతని చెప్పగలం? అసురులను నిర్మూలించుటయే ధ్యేయముగా కలవాని ప్రతాపమెంతటిదని చెప్పగలము? ఈయన మన్మధునికే కన్నతండ్రియట, మరి ఎంత చక్కని వాడో ఎలా చెప్పగలం? సృష్టికర్త అయిన చతుర్ముఖ బ్రహ్మగారినే సృష్టించిన కన్నతండ్రి ఈ స్వామి. మరి ఈయన ఘనత ఇంతని ఎలా చెప్పగలము?

సురగంగను తన పాదములనుండి పుట్టించిన పుణ్యమూర్తి పుణ్యమింతయని చెప్పగలమా? తన సమీపముననే భార్య భూదేవిని నిలుపుకొను సింగారాలు ఎలావర్ణించగలము? వైభవోపేతుడైన శ్రీ కాంతుని ఠీవిని యెంచగలమా? ఎల్లప్పుడు ఉత్సాహముతోనుండు ఈ సర్వేశ్వరుని సంపదయెంతటిదో ఎలా తెలుస్తుంది?

ఈ స్వామి మాయాదేవికే నాథుడు. ఈయన మహిమను చెప్పగలుగుట జరిగే పనేనా? ఎక్కడబడితే అక్కడ వ్యాపించియుండేవాడు కావుననే ఈయనను విష్ణువు అన్నారు. ఇక ఇది ఈయనుండే చోటని చెప్పగలమా? విడువకుండా వేంకటపతియై అంతులేని వరములిచ్చే విశ్వరూపుడైన వేయిరూపముల జగదీశ్వరుని వైశాల్యమెంతో చెప్పే శక్తి ఎవరికుంది?

13 ఐ

ఐతివే యేలికెసాని వందరికిని
నీతితో సవతులెల్ల నీకు లోనే యిఁకను ॥పల్లవి॥

ఆరసి నీ కాతఁడు అరవడమచ్చునే
పేరు రాన నేపొద్దుఁ బెట్టుకున్నాఁడు
సారెకు నీవు మంచి సకినాన వచ్చితివే
యీరాని చనవులెల్లా నిచ్చినాఁడు నీకు ॥ఐతివే॥

పొందుల నీకాతనికి పొంతనాలు గూడునే
మందలించి నీవాడినమాట దోయఁడు
యెందును నీమొకమాయ మందు యెటువంటిదే
కందువ నీ మోవికే కాచుకున్నాఁ డిపుడు ॥ఐతివే॥

చెలఁగి మంచివేళనే సేస నీవు వెట్టితివే
కలసి పాయఁడు శ్రీ వేంకటేశ్వరుడు
అలరి మమ్మేలెనాతఁడప్పణ నీవిచ్చితివే
వలపించ నేరుతువే వసమాయ నతఁడు ॥ఐతివే॥

భావామృతం

(ఓ చెలియా!) మొత్తానికి అందరికిని (స్వామిని వలచిన వారందరికీ) నీవు 'యేలికసాని' (రాజవేశ్య)వైపోయావు. ఆయనను వలచిన మా బోటి సామాన్యులందరూ నీ సవతులు. ఇక నీతో (న్యాయప్రకారము) ఈ సవతులందరూ నీకు 'లోనే' లొంగియుండవలసినవారే.

నీకు (నిన్ను) ఆయన కావాలని 'ఏపొద్దూ' (అన్నివేళలా), అచ్చునే (అచ్చముగా), 'పేరురాన' (ప్రేమతో) అరవడము పెట్టుకొన్నాడు (వుంచుకున్నాడు) ఆయన ఇష్టం. నీవు సారెకు (ఈ పర్యాయము) మంచి 'సకినాన వచ్చితివి. (శకునం చూసి వచ్చినట్లున్నావు), నీకు ఆయన ఇయ్యకూడని స్వాతంత్ర్యము ఇచ్చాడు. ఇకనేం.. యేలికసానివైపోయావు.

నీకు ఆయనకు పొందుల (కూటములలో) పొంతనాలు గూడునే (మంచి స్నేహము కలిసినది). నీవాడిన మాటను ఆయన దోయడు (మందలించి కాదనలేడు). యెందును (ఇక యెప్పుడైనా), ఆయనకు నీమొకమాయ మందు (నీ అందమైన

ముఖము మందు అయిపోయింది). ఎటువంటిదే.. ఇప్పుడు నీ తీయటి అధరామృతం కోసం కాచుకొనియున్నాడు.

ఓ సఖీ! చెలగి (ఉత్సుకతతో) నీవు మంచివేళనే, సేసవెట్టితివి (ఆ స్వామి ఆశీర్వాదం పొందినావు). ఈ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను కలసి పాయడు (నీపొందు విడువడు). నీ పొందువలన అలరి (తృప్తుడై) స్వామి మిమ్మల్ని కూడా యేలె (మన్నించినాడు). ఆయన అందరినీ ఏలే శృంగారరాయడు కదా!

14 ఓ

రాగం : ఖరహరప్రియ

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమున కళలెల్ల మొలచినట్లుండె ॥ఒకపరి॥

జగదేకపతిమేన చల్లిన కర్పూరధూళి
జిగికొని నలువంక చిందగాను
మొగి చంద్రముఖి నురమున నిలిపెగాన
పొగరు వెన్నెల దిగబోసి నట్లుండె ॥ఒకపరి॥

పొరి మెఱుగు చెక్కుల పూసిన తట్టుపునుగు
కరగి ఇరుదెసల కారగాను
కరిగమన విభుడు గనుక మోహమదము
తొరిగి సామజసిరి తొలికినట్లుండె ॥ఒకపరి॥

మెఱయు శ్రీవేంకటేశు మేన సింగారముగాను
తఱచైన సొమ్ములు ధరియించగా
మెఱుగు బోణి అలమేలు మంగయు తాను
మెఱుపు మేఘము గూడి మెఱసినట్లుండె ॥ఒకపరి॥

భావామృతం :

(ఆహా!! ఎంత అద్భుతంగా వుంది ఈ జంట. ఏమి అందం!!) ఒకసారి ఒకరకమైన అందం, ఇంకొకసారి ఇంకొకరకమైన అందం... స్వామివారి ముఖమున కళలన్నీ మొలక లెత్తాయా? అనునట్లున్నది. (వర్ణనాతీతమైన వీరి సౌందర్యం గురించి యెంత చెప్పినా... తక్కువే అవుతుంది)

ఈయనెవరు? జగదీశ్వరుడు, జగదేకపతి, ఈయన దేహంపై కర్పూరం పొడి చల్లారు. దాని జిగి(కాంతి) నలుదిశలా చిందుతున్నది. ఇటుచూస్తే ఈ చంద్రముఖిని ఈయన తన హృదయంపై వుంచి నిలుపుకొన్నాడు. అందువలన పొగరు వెన్నెల (దట్టంగా కాస్తున్న వెన్నెల) దిగబోసినట్లుండె (కురిసినట్లున్నది).

ఓహో! పొరి మెఱుగు చెక్కుల (పదేపదే మెఱయుచున్న చెక్కిళ్ళు) పై పూసిన తట్టుపునుగు కరిగి ఆయన రెండు చెక్కిళ్ళు (చెంపల) పై కారుచున్నది. ఈ స్వామి సామజవరగమనుడు (మదపుటేనుగు నడక వంటి ఠీవి గల నడకగల వాడు) అమ్మవారిపై ఈ స్వామికున్న మోహము, మోహమదమువలె స్రవించుచుండుటచేత, ఈయనను సాజముతో పోల్చుట యెంతయో సమంజసముగా నున్నది. తొరిగి సామజసిరి దొలకి నట్లున్నది. (స్రవించుచున్న మదపుటేనుగు యొక్క మదజలము చెక్కులపై ఒలికినట్లున్నది).

శ్రీవేంకటేశ్వరుని శరీరంపై సింగారింపబడి తళతళ మెఱయు ఆభరణములు అనేకములు అలంకరింపబడినవి. మెఱుగు బోణి (మెఱయుచున్న శరీరముగల) ఈ అలమేల్మంగమ్మ ఈ స్వామి పక్కన వుంటే నల్లటి మేఘముల మధ్య తటిల్లత (మెఱుపు) తళుక్కుమన్నట్లున్నది. ఈ సౌందర్యం కన్నులారా చూచిన వారి జన్మ ధన్యము. అందుకు సందేహమా?

15 ఓ

రాగం : శ్రీరాగం

ఓ పవనాత్మజ ఓ ఘనుడా
బాపు బాపనగ పరగితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ హనుమంతుడ ఉదయాచల ని-
ర్వాహక నిజసర్వప్రబలా
దేహము మోచిన తెగువకు నిటువలె
సాహసమిటువలె చాటితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ రవి గ్రహణ ఓ దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపు వినతా తనయాదులు
గారవింపనిటు కలిగితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ దశముఖహర ఓ వేంకటపతి-
పాదసరోరుహ పాలకుడా
ఈ దేహముతో ఇన్నిలోకములు
నీ దేహమెక్క నిలిచితిగా ॥ఓ పవనాత్మజ॥

భావామృతం :

వాయునందనుడవైన ఓ ఆంజనేయా! ఓ ఉద్దండుడా! నీ భక్తులందరు 'బాబోయ్' 'అమ్మబాబోయ్' అనునట్లు వర్ధిల్లితివి కదా!

తూర్పునవున్న 'ఉదయాచలము'ను నిర్వహించిన ఓ హనుమంతా! అన్ని విధములా వ్యాపించిన మహానుభావా! సూర్యగమనమునకు అనుగుణంగా మహాకాయమును దాల్చి ఇటువంటి సాహసము చూపించితివి (సూర్యని ద్వారా వేదములను నేర్చుటకు స్వామి గొప్ప ఆకారముతో సూర్యుని అనుసరిస్తూ, వింటూ ఏకసంతాగ్రాహిగా వేద విద్య నేర్చాడు.) ఇటువంటి ధైర్యము (సూర్యుని దగ్గరకు ముఖం పెడితే కాలి బూడిదైపోతాం కదా!) ఇంకొకరికి వుంటుందా?

(చిన్నపాపాయిగా వున్నప్పుడే సూర్యుని తినే పండు అనుకొని ఆ సూర్యుని 'గ్రహించుటకు' ఎగిరి పట్టుకోబోయాడు.) అంత అల్లరి పిల్లవాడా! ఓ రాక్షసాంతకా! లంకలో ఎదురులేక చిత్తమొచ్చినరీతి వ్యవహరించితివి కదా! వినతాసుతుడైన గరుత్మంతుడు తను స్వయంగా గొప్ప శక్తిమంతుడై కూడ నిన్ను తన సాటివానిగా గుర్తించి ఆదరించగా ఈ విధముగా ప్రబలినాడువు కదా

పదితలల రావణాసురుని గర్వభంగము జేసిన ఓ మారుతీ! శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మములను తలదాల్చు మహానుభావా! ఇటువంటి అసదృశమైన దేహముతో ఇన్నిలోకములను నీ దేహము అధిగమించునట్లు నిలిచితివి కదా! నీ పరాక్రమము సాటిలేనిది.

16 ఔ

రాగం : తిలంగ్

ఔనయ్య జాణడవు ప్రహ్లాద వరద
ఆనలు వెట్టకుము ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

వేసరక శ్రీసతితో వేడుక నవ్వులు నవ్వీ
ఆసలు చూపేవు ప్రహ్లాద వరద
సేస వెట్టిన చేతుల చెరగువట్టి తీసేవు
ఆ సుద్దులె చెప్పేను ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

నంటున తొడమీదను నలినాక్షినెక్కించుక
అంటేవు సిగ్గులు ప్రహ్లాదవరద
గెంటక ఏ పోద్దును కేలు కేలు కీలించుక
అంటువాయ వదివో ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

కందువతో కాగిలించి కైవసము సేసుకొంటి
వందముగ నీకెను ప్రహ్లాద వరద
పొంది శ్రీవేంకటమున పొంచి ఔభళములోన
అంది వరాలిచ్చేవు ప్రహ్లాద వరద ॥ఔనయ్యా॥

భావామృతం

ఓ ప్రహ్లాద వరదా! అహోబల నృసింహా! ఔనయ్యా! నీవు జాణతనంగలవాడవే. మాకు ఆనలు (నిర్బంధము కలిగించు షరతులు) పెట్టవద్దు తండ్రీ! (నీవు పెడితే మేం తట్టుకోలేము, మేము పెడితే నీవు అవలీలగా దాటివేస్తావు).

వేసరక (సునాయాసంగా) శ్రీలక్ష్మితో విలాసముగా నవ్వులొలక బోస్తున్నావు. ఆమెకు ఆస (అపేక్ష) చూపుచున్నావు. ప్రహ్లాదుని దీవించావు. సేసవెట్టిన (అక్షతలు చల్లిన) ఆ చేతులతోనే నిర్భంధించి హిరణ్యకశిపుని ప్రాణములు తీసేవు. ఓ ప్రహ్లాద వరదా! నేను ఆ సుద్దులు చేప్పేను (ఆ కథలను వివరిస్తాను).

ఓ ప్రహ్లాద వరదా! పద్మనేత్రియైన శ్రీలలనను నంటున (స్నేహముతో) నీతొడపై కూర్చుండబెట్టుకొని ఆమె సిగ్గులను (లజ్జను) స్పృశించెదవు. ఏ సమయముననైనా ఆమెను గెంటక (నెట్టివేయక), కేలుకేలుకీలించి (చేయి చేయి తగలించి), అంటువాయవు (విడనాడవు)

కందువతో (సామర్థ్యముతో) అందముగ ఈకెను (ఆమెను) కౌగలించి నీ వశము చేసికొంటివి. శ్రీవేంకటగిరిపై ఈమెనా విధముగా పొంది, ఇక్కడ ఈ ఔభళములో (అహోబలంలో) అంతులేని వరములను అనుగ్రహించుచున్నావు.

17 అం

రాగం : సురటి

అంగన లీరె యారతులు
అంగజ గురునకు నారతులూ ॥అంగన॥

శ్రీ దేవి తోడుత చెలగుచు నవ్వే
ఆదిమ పురుషుని కారతులు
మేదినీ రమణి మేలము లాడేటి
ఆదిత్య తేజున కారతులు ॥అంగన॥

సురలకు నమృతము సొరిది నొసంగిన
హరికిది వో పసిడారతులు
తరమిది దుష్టుల దనుజుల నడచిన
అరి భయంకరున కారతులూ ॥అంగన॥

నిచ్చలు కళ్యాణ నిధియై యేగేటి–
అచ్చుతునకు నివె యారతులు
చొచ్చి శ్రీ వేంకటేశుడు నలమేల్మంగ
యచ్చుగ నిలిచిరి యారతులు ॥అంగన॥

భావామృతం

ఓ వనితల్లారా! హారతులెత్తండమ్మా! మన్మధునికే తండ్రి అయిన ఈ మహానుభావుడికి హారతులనీయండి.

శ్రీదేవితో ఏదో చలోక్తికి నవ్వుతున్న ఈ ఆదిపురుషునికి హారతుల నీయండి. భూదేవితో సరసములాడుచు దర్శనమిస్తున్న ఈ సూర్యతేజో విరాజితునికి మీరంతా హారతులనీయండి.

దేవతలకు మోహినీ అవతారమున వరుసలో నిలువ జేసి అమృతము పంచి ఇచ్చిన హరికి ఇవే బంగారు హారతులు. దుర్మార్గులైన దానవులను వరుసగా మట్టుబెట్టి శత్రు భయంకరుడైన హరికి హారతులివియే.

నిత్య కళ్యాణము జరిపించుకొని ఊరేగు అచ్యుతునికి ఇవే మంగళహారతులు. ఆవిర్భవించిన శ్రీ వేంకటేశ్వరుడు అలమేలు మంగమ్మ చక్కగా నిలిచియున్నారు. వారికివే కర్పూర నీరాజనములు.

18 అఃఅఃఅఃఅ

పరమాత్ముడొసగిన వరములన్నీ గిడ్డంగులు (కొటారుల) గా వచించబడినదీ సమృద్ధినిచ్చే కొండే ఇది (ఆయన వరములే పెద్దపెద్ద నిలువలు). చూడగా శ్రీనాథుని మంగళప్రదమైన కొండ ఈ తిరుమలయే. సర్వసంపదలు కురిసి రాసులుగా గుహలలో నిండి పోయిన కొండ ఇదే. ఓ ప్రజలార! ఇదిగో ఈ శ్రీవేంకటాద్రి గొప్ప విస్తృతమైన కొండ.

ఖ

20

ఆ.వె॥ ఖడ్గధారియైన 'కల్కి' రూపుడు హరి
అణచ దుష్టజనుల నవతరించు
అన్నమయ్య పాట కాదిలో లేదు 'ఖ'
సంకటంబు కలిగె వేంకటేశ!

భావామృతం :

కల్కి అవతారం యెత్తిన శ్రీహరి ఖడ్గంచేత ధరించి దుష్టశిక్షణ చేస్తాడు. అన్నమయ్య కీర్తనలలో 'ఖ' తో ఆరంభమయ్యే కీర్తన నా కంటబడలేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! అందుచేత ఇబ్బంది కలిగింది.

గ

21

రాగం : మోహన

గతులన్ని ఖిలమైన కలియుగమందును
గతి ఈతడే చూపె ఘన గురుదైవము ॥గతులన్ని॥

ఈతని కరుణనేకా ఇల వైష్ణవుల మైతి–
మీతని వల్లనే కంటి మీ తిరుమణి
ఈతడే ఉపదేశమిచ్చెను అష్టాక్షరి మంత్రము
ఈతడే రామానుజు లిహపరదైవము ॥గతులన్ని॥

వెలయించెనీతడేకా వేదపు రహస్యములు
చలమి నీతడే చూపె శరణాగతి
నిలిపినాడీతడేకా నిజముద్రా ధారణము
మలసి రామానుజులు మాటలాడే దైవము ॥గతులన్ని॥

నియమములు ఈతడేకా నిలిపె ప్రపన్నులకు
దయతో మోక్షము చూపె తగనీతడే
నయమై శ్రీ వేంకటేశు నగమెక్కే వాకిటను
దయచూచి మమ్మునిట్టే తల్లిదండ్రి దైవము ॥గతులన్ని॥

భావామృతం :

ఈ కలియుగంలో కలి ప్రభావముచే అరిషడ్వర్గముల పాలై దిక్కులన్నీ అంతరించిపోయి గతి ఏదిరా భగవంతుడా అని ఆవేదన చెందుతుంటే నాకు ఈ మహానుభావుడైన శ్రీ ఘనముని గురుదేవుల వారు గొప్పగురుదేవులై దారిచూపించారు.

ఈయన దయవలననే మేము వైష్ణవులమై విష్ణువునాశ్రయించాము. ఈ తిరుమలమణిని ఈయన కృప వలననే చూచితిమి. అష్టాక్షరి మంత్రమని ప్రఖ్యాతిజెందిన 'ఓం నమో నారాయణాయ' అను మంత్రమును ఈ గురువే ఉపదేశించారు. ఇహ పరములు రెంటికీ దైవమైన ఈ ఆచార్యులే శ్రీరామానుజాచార్యుల వారు.

ఈ గురుదేవులే మాకు వేదములలోని తత్త్వరహస్యములనన్నింటినీ తెలియజేసిరి.

కరుణాంతరంగులై మాకు ఆదిదేవుని శరణాగతి పొందుట నేర్పారు. వైష్ణవమత సంప్రదాయబద్ధముగా శంఖచక్రాది ముద్రలను ధరింపజేశారు. ఆపై మాతో శ్రీరామానుజులు జ్ఞానబోధచేసి మాటలాడిరి.

ఈ గురుపుంగవులే శరణాగతి యొక్క నియమములన్నీ మాకు నేర్పారు. ఈ మహానుభావుడే కరుణతో మాకు మోక్షమార్గం చూపారు. అందరినీ, నన్నూ కరుణించినట్లే అనుగ్రహించుటకే శ్రీవేంకటేశ్వరుని కొండను ఎక్కునప్పుడు వాకిటిలోనే నిలిచి మమ్మల్ని ఈవిధముగా దీవించు తల్లీ, తండ్రీ, దైవమూ కూడా ఈ గురుపుంగవులే అయ్యారు.

22

ఘ

రాగం : పూర్వి కళ్యాణి

ఘుమ్మనియెడి శృతి కూడగను
కమ్మని నేతులు కాగగ చెలగె ॥ఘుమ్మని॥

నీల వర్ణుడని నీరజాక్షుడని
బాలుని నతివలు పాడేరో
పాలు పిదుకుచును బానల కాగుల
సోలి పెరుగు త్రచ్చుచు చెలరేగె ॥ఘుమ్మని॥

మందరధరుడని మాధవుడని గో-
విందుని పాడేరు వెలదులిదే
నంద వ్రజమున నలుగడ నావుల
మందల పేయల మంచిరవముల ॥ఘుమ్మని॥

వేంకటపతియని వేదనిలయుడని
పంకజనాభుని పాడేరు
అంకుల చేతను అలరు రవంబుల
బింకపు మాటల బృందావనమున ॥ఘుమ్మని॥

భావామృతం :

ఘుమ్మనే శృతి బద్ధమైన ధ్వనితో పెద్ద పెద్ద కాగులలో కమ్మని రుచిగల నేతులు కాగుచున్నవి. (గోపాలకృష్ణుని నందవ్రజము శోభలీనింది. ఆ వివరం వినండి...)

గోపభామినులందరూ ఆ గోపబాలుని నీలవర్ణుడని, నీరజాక్షుడని కీర్తించుచు పాడినారు. పాలు పిదుకుచు కొందరు గోపికలు బానలు కాగులు నింపసాగిరి. కొందరు స్త్రీలు పెరుగును సోలి(వివశులైపోయి) చిలుకుచూ చెలరేగి కాననైరి.

గోవిందుడని పేరు గాంచిన ఆ శ్రీకృష్ణుని గోపికలు (వెలదులు) అందరూ మందరగిరి ధరుడని (గోవర్ధన పర్వతమును తన చిటికిన వ్రేలిపై ఎత్తిన వాడని), మాధవుడని పాడి కీర్తించెడివారు. నందవ్రజమున (రేపల్లెలో) నలుదిక్కులా, మంచి ధ్వనిగల ఆవుల మందలను పేయలను (దూడలను) కాచినాడు.

ఇపుడు పద్మనాభుడైన ఆ మహానుభావుని శ్రీవేంకటపతియనియు, వేదములే నిలయముగాగల శ్రీమన్నారాయణుడనియు భక్తితో పాడి జనులు కీర్తించుచున్నారు. ఆ విధముగా బృందావనమున అంకుల చేతను (విశిష్టమైన ఆభరణములు గల చేతులతోను) బింకపు మాటలతోను (గర్వముగల మాటలతో) జగతి విలసిల్లినది.

23 జ

ఆ.వె॥ ఎరుగ 'జ' అను వర్ణమిప్పుడు కనరాదు
వాడరిపుడు జనులు భాషయందు
అన్నమయ్యపాట నగపడదుర 'కంట'
వినుత గుణవిలోల వేంకటేశ!

భావామృతం

ఈ రోజుల్లో 'జ' అను అక్షరం వాడుకలో లేదు. ఇక అన్నమయ్య కీర్తన 'జ' తో ఆరంభం ఎలా అవుతుంది ఓ శ్రీవేంకటేశ్వరా! సకల సద్గుణాభిరామా! ఇది నిజం.

24 చ

రాగం : నాట

చక్రమా హరి చక్రమా
వక్రమైన దానవుల వక్కలించవో ॥చక్రమా॥

చుట్టి చుట్టి పాతాళము చొచ్చి హిరణ్యాక్షుని
చట్టలు చీరిన ఓ చక్రమా
పట్టిన శ్రీహరిచేత పాయక ఈ జగములు
ఒట్టుకొని కావగదవొ ఓ చక్రమా ॥చక్రమా॥

పానుకొని దనుజుల బలుకిరీట మణుల
సానలు తీరిన ఓ చక్రమా
నానా జీవముల ప్రాణములు గాచి ధర్మ-
మూని నిలుపగదవొ ఓ చక్రమా ॥చక్రమా॥

వెరచి బ్రహ్మాదులు వేదమంత్రముల నీ
వురుట్లుకొనియాడే రో చక్రమా
అతిముతి తిరువేంకటాద్రీశు వీధుల
ఒరపుల మెరయుదువో ఓ చక్రమా ॥చక్రమా॥

భావామృతం

ఓ సుదర్శన చక్రమా! హరిహస్త భూషణమైన పరాక్ర విక్రమా! వక్రబుద్ధిగల రాక్షసులపై తిరుగబడి సంహరించుము. చక్రమా! ఓ చక్రమా! (నిన్ను కీర్తించెదను)

గిరగిర తిరుగుచు పాతాళలోకమున చొరబడి హిరణ్యాక్షుడు అను రాక్షసుని "చుట్టలు తీరిచి" (చంపి) వేసిన చక్రమా! శ్రీహరి తన హస్తమున నిన్ను ధరించగా ప్రతిజ్ఞపూనినట్లు వదలక జగములనెల్ల రక్షించుచున్న సుదర్శనమా! (నీకు సాటిలేరు).

పూనుకొని (ఆరోజుల్లో 'పానుకొని' అనే వారేమో) అసురుల అసంఖ్యాకమైన కిరీటములలోని మణులను సానబట్టిన (సానలు తీరిన) ఓ చక్రమా! అనేకములైన జీవులను (గజేంద్రుని నుంచి అంబరీషుని వరకు) ప్రాణములను కాపాడి ధర్మమును నిలబెట్టినావు గదా! (విష్ణుభక్తుడైన అంబరీషునిపై కోపించి దుర్వాస మహాముని ఒక భూతాన్ని పంపించాడు సంహరించమని భీతిల్లిన అంబరీషుడు శ్రీహరిని శరణు వేడాడు. తన భక్తుని రక్షించుటకు శ్రీహరి తన సుదర్శన చక్రం ప్రయోగించాడు. అది భూతాన్ని క్షణంలో సంహరించి దుర్వాసుని వెంటబడింది. దానినుంచి మునిని రక్షించటం తమవల్ల కాదన్నారు హరుడు బ్రహ్మాది దేవతలు. శ్రీహరికూడా తనపని నెరవేరే దాకా సుదర్శనాన్ని ఆపలేనని అంబరీషునే శరణు వేడమన్నాడు. అంబరీషుడు ప్రార్థిస్తే అప్పుడు శాంతించింది సుదర్శనం. అది అంతగొప్పది)

ఆనాడు భీతిల్లిన బ్రహ్మాది దేవతలు వేదమంత్రాలతో నీ వురట్లు (గొప్పతనం) కొనియాడారు కదా! ఓ చక్రమా సంభ్రమము కలుగునట్లు తిరుమలనాథుని హస్తభూషణమై ప్రతాపముతో బహిర్గతమై మెరిసిపోతున్న సుదర్శనమా! (మమ్ము రక్షింపుము)

25 చ

రాగం : చక్రవాకం

చందమామ రావో జాబిల్లి రావో మంచి
కుందనపు పైడికోర వెన్నపాలు తేవో ॥చందమామ॥

నగుమోము చక్కనయ్యకు నలువపుట్టించిన తండ్రికి
నిగమములందుండే అప్పకు మా నీలవర్ణునికి
జగమెల్ల ఏలిన స్వామికి చక్కని ఇందిర మగనకి
ముగురికి మొదలైన ఘనునికి మాముద్దుల మురారి బాలునికి॥చందమామ॥

తెలిదమ్మి కన్నుల మేటికి మంచి తియ్యని మాటల గుమ్మకు
కలికి చేతలకోడెకు మా కతలకారి ఈ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండవొయ్యారికి నవనిధుల చూపుల చూచే సుగుణునకు ॥చందమామ॥

సురుల గాచిన దేవరకు చుంచు గరుడు నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మానీటు చేతల పట్టికి
విరుల వింటి వాని అయ్యకు వేవేల రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీ వేంకటనాధునికి ॥చందమామ॥

భావామృతం

ఓ చందమామా! ఇటు వైపుకు ఒక్కసారిరా. చల్లటి జాబిల్లీ (జాను+బిల్లి=జాబిల్లి, అనగా అందమైన పిల్లి, అనగా కుందేలు అంటే... కుందేలు తనలో ఉన్నవాడు, అనగా చంద్రుడు) ఇటు రారాదా! పదియారు వెన్నపూర్తిగా తీయని పాలను మా బాబుకు తీసికొని రారాదా.

మా బాలుడు నవ్వుకవలొలికే ముఖమున్న చక్కనయ్య. బ్రహ్మదేవునికి జన్మనిచ్చిన తండ్రి. వేదములన్నింటిలో కీర్తించబడిన జనకుడు. నీలమేఘచ్ఛాయ గల శరీరం దాల్చిన వాడు జగన్నాధుడు. అందాల బొమ్మ లక్ష్మీదేవికి ప్రియమైన

మగడు. బ్రహ్మా, విష్ణు, మహేశ్వరులు అని పిలవబడే ముగ్గురు దేవుళ్ళకు అది దేవుడు. ఇతడే ముద్దులు మూటగట్టే మా మురారి.

సర్వశ్రేష్ఠమైన వీడు తెల్లని పద్మముల వంటి కన్నులు గలవాడు. మధురమైన మంచి మాటలు మాట్లడే అలంకార ప్రియుడు. ఒయ్యారము లొలుకు మనోజ్ఞమైన చేతలు గల శృంగారమూర్తి (మోహినీదేవి). లెక్కకు మించిన కథలు (పురాణములు) పుట్టుటకు కారణ భూతడైన. వామన మూర్తి. ఆదిత్యకులమును వుద్ధరించిన గుణవంతుడైన బిడ్డ ఈ బాలుడే (రాముడు). ఈ అబ్బాయి సుగుణాలప్రోవు. నవనిధులను ప్రసాదించు వాడు.

ఈ దేవుడే దేవతలందరినీ రక్షించిన వేలుపు. తెల్లటి గరుత్మంతుని అధిరోహించి ఠీవిగానుండే వాడితడే. యుక్తమైన బుద్ధులు గల పెద్దమనిషి కూడ ఇతగాడే. ఇతను చేసే పనులన్నీ తీర్తినట్లుంటాయి. ఈయనెవరనుకున్నారు? స్వయాన మన్మధునికి జన్మనిచ్చినవాడు. అంతేకాదు అనంతమైన (వేలకొద్దీ) రూపములు గలవాడు. ఇదిగో ఈ మా శ్రీ వేంకటేశ్వరుడు అధికముగా ఐశ్వర్యములను ప్రసాదించు జాణ (నేర్పరి).

26 ఛ

రాగం : చక్రవాకం

ఛీ ఛీ నరులదేటి జీవనము
కాచుక శ్రీహరి నీవె కరుణింతుగాక ॥ఛీ ఛీ॥

అడవిలో మృగజాతియైనా గావచ్చుగాక
వడి నితరుల గొలువగ వచ్చునా
వుడివోని పక్షియై వుండనైనా వచ్చుగాక
విడువకెవ్వరినైనా వేడవచ్చునా ॥ఛీ ఛీ॥

పసురమై వెతలేని పాటు పడవచ్చు గాక
కసటువో నొరుల బొగడగా వచ్చునా
వుసురు మానై పుట్టివుండనైన వచ్చుగాక
విసువక వీరివారి వేసరించవచ్చునా ॥ఛీ ఛీ॥

యెమ్మెల బుణ్యాల సేసి యిల యేలవచ్చుగాక
కమ్మి హరిదాసుడు గావచ్చునా
నెమ్మది శ్రీవేంకటేశ నీచిత్తమే కాక
దొమ్ముల కర్మములివి తోయవచ్చునా ॥ఛీ ఛీ॥

భావామృతం

ఛీ! ఛీ! ఈమానవుల దెంత దౌర్భాగ్యమైన జీవితము!! వీరిని ఆ శ్రీహరియే రక్షించాలి కాని ఇక ఎవ్వరి వలన అయ్యేపని కాదు.

అధికారంలో వున్న మానవుల దాస్యంచేసి బ్రతుకుట కంటే అడవిలో ఏ మృగంగానైనా జీవించవచ్చును కదా! అన్యులను కొలువవచ్చునా? శాశ్వతంగా పక్షిగానైన జీవించవచ్చును కాని అదే పనిగా ఎవ్వరినైనా అర్ధించ వచ్చునా?

మానవుడు పశువు వలె నిరంతరం అవిశ్రాంతంగా గడపవచ్చును కానీ, కోరికలతో సిగ్గువిడచి ఇతరులను పొగడవచ్చునా? జీవితాంతం వృక్షమై పడివుండవచ్చును. కాని విసుగుకూడ లేకుండ వారినీ వీరిని దేబిరించవచ్చునా? అది ఎంతమాత్రము మంచిదికాదు.

విశిష్టత కలిగి ఎన్నో పుణ్యములు చేసిన పుణ్యఫలంగా ఈ భూమండలాన్నేల వచ్చును గాక! వివరముతో శ్రీహరిదాసులు అవటం సాధ్యపడుతుందా? ఓ శ్రీ వేంకటేశ్వరా నీ ఇష్టప్రకారం కాక దొమ్మిగాపైనబడే కర్మలను అధిగమించటం అనేది జరుగుతుందా? ఎన్నటికీ జరుగదు.

27 జ

రాగం : లలిత

జయలక్ష్మి వరలక్ష్మి సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి బెరసితివమ్మ ॥జయలక్ష్మీ॥

పాలజలనిధిలోని పసనైన మీగడ
మేలిమి తామెరలోని మించు వాసన
నీలవర్ణనురముపై నిండిన నిధానమవై
ఏలేవు లోకములు మమ్మేలవమ్మ ॥జయలక్ష్మీ॥

చందురుతోడ బుట్టిన సంపదల మెఱుగవో
కందువ బ్రహ్మలగాచే కల్పవల్లివో
అందిన గోవిందునికి అండనే తోడునీడై
వుందానవు మాయింటనే వుండవమ్మ ॥జయలక్ష్మీ॥

పదియారు వన్నెల బంగారు పతిమ
చెదరని వేదముల చిగురుబోడి
ఎదుట శ్రీవేంకటేశు నిల్లాలవై నీవు
నిధుల నిలిచే తల్లి నీవారమమ్మ ॥జయలక్ష్మీ॥

భావామృతం

అమ్మా! జయలక్ష్మీ! వరలక్ష్మీ దేవీ! యుద్ధరంగంలో వీర విహారం చేసే సంగ్రామ లక్ష్మీ! నీవు శ్రీమన్నారాయణునకు ప్రియురాలవై అవతరించినావు (సత్యభామగా భావన)

నీవు పాలసముద్రమునుండి వెలువడిన పసందైన మీగడవు తల్లీ! శ్రేష్ఠమైన పద్మము యొక్క పరిమళము కూడ నీవే. నీలమేఘచ్ఛాయతో మెరిసిపోయే శ్రీహరి వక్షస్థలమును ఆక్రమించిన సౌభాగ్యలక్ష్మివి. లోకములనన్నింటిని పరిపాలించు దానివి. అందుచేత మమ్ముకూడా పరిపాలించుము తల్లీ!

దేవదానవులు క్షీరసాగరమును మథించినప్పుడు చంద్రునితో పాటు పుట్టి సంపదలన్నింటికీ నీవే సామ్రాజ్ఞివైనావు. బ్రహ్మాదులను రక్షించే కల్పవల్లివై గోవిందునకు తోడు నీడవు అండదండవూ అయి ఉన్నదానవు. మాగృహమున స్థిరపడు తల్లీ!

పదహారు వన్నెలు గల (నేటి కాలంలో 24 కారెట్లు) బంగారు బొమ్మవు తల్లీ! నీవు స్థిరముగా వేదములన్నింటిలోను కీర్తింపబడిన కుసుమపేశలవు. మా ఎదుట ఇలవేల్పుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుని అర్ధాంగివై నీవు నవనిధులని కీర్తింపబడే ఆ సంపదలకు ఆస్థానమై వున్నదానవు. ఓ జగజ్జననీ! మమ్ము మరువకు తల్లీ! మేము పరాయివారముకాము. నీ వారమే నమ్మా!

28 జే

రాగం : నవరోజ

జోవచ్యుతానంద జోజో ముకుందా
రావె పరమానంద రామగోవింద ॥జోవచ్యుతా॥

నందు నింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవచేయంగ
నందముగ వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మా ముద్దురంగ ॥జోవచ్యుతా॥

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు ॥జోవచ్యుతా॥

అట్టుగట్టిన మీగడట్టె తిన్నాడే
వట్టి కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినెనని యత్త యడుగ విన్నాడే
గట్టిగా నిది దొంగ కొట్టుమన్నాడే ॥జోవచ్యుతా॥

గొల్లవారిండ్లకు గొబ్బునకు బోయి
కొల్లలుగ త్రావి కుండలను నేయి
చెల్లునా మగనాండ్రు జెలిగి యీశాయీ
చిల్లతనములు సేయ జెల్లునట వోయీ ॥జోవచ్యుతా॥

రేపల్లె సతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీ కొడుకు మా ఇండ్లలోను
మాపుగానే వచ్చి మా మానములను
మీపాపడే చెఱిచె నేమందుమమ్మ ॥జోవచ్యుతా॥

ఒకని యాలినిదెచ్చి నొకని కడబెట్టి
జగడములు కలిపించి సతిబతుల బట్టి
పగలు నలుజాములును బాలుడైనట్టి
మగనాండ్రచేబట్టి మదనుడైనట్టి ॥జోవచ్యుతా॥

అంగజుని గన్న మాయన్న యిటు రారా
బంగారు గిన్నెలో పాలు పోసేరా
దొంగనీవని సతులు పొంగుచున్నారా
ముంగిటనాడరా మోహనాకారా ॥జోవచ్యుతా॥

గోవర్ధనంబెత్తి గొడుగుగా పట్టి
కావరమ్మున నున్న కంసుపడగొట్టి
నీవు మధురాపురమునేల చేపట్టి
ఠీవితో నేలిన దేవకీ పట్టి ॥జోవచ్యుతా॥

అంగుగా తాళ్లపాకన్నయ్య చాల
శృంగార రచనగా చెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాలా ॥జోవచ్యుతా॥

భావామృతం

ఓఅచ్యుతానందా! (అంతులేని ఆనందరూపా!)

జో జో (నిదురపో నాన్నా!) ఓముకుందా! రారా పరమానంద స్వరూపా! రాముని రూపం ధరించిన ఓగోవిందా! జోజో!

నీవు క్షేమంగా నందగోపుని ఇంటికి జేరి చంద్రముఖులైన గోపికలు నీకు సేవ చేయుచుండగా, గొల్లపల్లెలో దొంగవైన మా ముద్దుల రంగన్నా జోజో!

నీవు మునుముందుగా క్షీరసాగరమున శయనించియుంటివి. తరువాత బాలునిగా మారి మునులుకు అభయము నొసంగితివి. తరువాత వసుదేవునకు ద్యోతకమైతివి (దర్శన మొసగితివి) తరువాత రేపల్లెలో గోపాల బాలుడైతివి. అట్టిబాబూ జోజో!

చెక్కులు గట్టిన మీగడ తరకలు కడుపార భుజించినాడు. ఏమియు తెలియని అమాయకురాలైన కోడలి మూతిపై ఆ మీగడ రాసినాడు. అందుచేత అత్త ఆమెని నిలదీసి అడుగగా ఇదిగో నీ కోడలే దొంగతనం నేర్చిన జాణ అని అన్నాడు. అటువంటి అల్లరి పాపా జోజో!

శీఘ్రముగా గొల్లవారిండ్లకు బోయి అక్కడ కుండలలోని నెయ్యి అంతులేకుండా త్రాగాడు. ఈ పిల్లవాడు ఈ ఇల్లాళ్ళను ఈ విధంగా కుళ్ళుచేష్టలతో ఏడిపించతగునా?

ఆగ్రహించిన కొందరు గోపికలు రేపల్లెలో ఇలా గోడు వినిపించారు. ''ఓగోపెమ్మా! మీ కొడుకు రాత్రివేళ మా ఇండ్లకువచ్చి మామానముల నపహరించాడు. వాని నేమనమంటావో చెప్పవమ్మా!

ఒక ఆడదాన్ని (పెళ్ళాన్ని) తెచ్చి ఇంకొక మగవాడికి అంటగడతాడు. దాంతో ఆ స్త్రీమొగుడు వచ్చి పోట్లాట పెట్టుకొంటాడు. మీ పిల్లవాడు పగటి వేళ నాలుగు జాములూ మా స్త్రీలతో కూడి అపర మన్మధుని వలె ప్రవర్తిస్తాడు. అట్టి అల్లరి కృష్ణయ్య గూర్చి ఏమి చెప్పమంటావు?

మన్మధుని కన్న తండ్రివైన మా కన్నా! ఇటురా నాన్నా! నీకోసం బంగారు గిన్నెలో పాలు పోసియుంచాము. నీవు దొంగవని సతులు నిందించుచున్నారు. మన ఇంటి ముంగిటిలో ఆడుకోరాదా తండ్రీ! మోహనరూపా! ఎందుకురా మాటలు పడతావు. (అని యశోద అంటున్నది.)

గోవర్ధనపర్వతమును గొడుగులా పట్టి రక్షించిన వాడవౌ బాలుడా! గర్వముతో విర్రవీగిన కంసుని పట్టి సంహరించిన వాడవైతివి. మధురాపురమును ఏలుట సాగించితివి. ఓదేవకీనందానా! ప్రజారంజకముగా. దానిని పరిపాలించితివి.

తాళ్ళపాక అన్నమాచార్యుల వారు ఈ శృంగార గీతిక రూపంలోని జోలపాటను సకలసంపదలను సిద్ధింపజేయు మంగళముగా తిరుపతిలోని మదనగోపాలుడైన శ్రీవేంకటేశ్వరునికి వినిపించినాడు.

29 ఝ

ఆ.వె॥ ఝషము రూపుదాల్చి చంపె 'సోమకు' దొల్లి
వేదరాశి గాచె విష్ణుమూర్తి,
అన్నమయ్య పాట అక్షరము 'ఝ' లేక
సంకటంబు కలిగె వేంకటేశ!

భావామృతం

పెద్ద చేప ఆకారము దాల్చి పూర్వం విష్ణుమూర్తి సోమకుడు అను రాక్షసుని సంహరించి వేదములను కాపాడాడు. ఓ శ్రీ వేంకటేశ్వరా! అన్నమయ్య కీర్తనలలో ఝ తో ఆరంభమయ్యే కీర్తన దొరకక ఇబ్బంది కలిగినది.

30 ఞ

రాగం : ధన్యాసి

జ్ఞానయజ్ఞ మీగతి మోక్ష సాధనము
నానార్థములు నిన్నే- నడపె మాగురుడు ॥జ్ఞానయజ్ఞ॥

అలరి దేహమనేటి-యాగశాలలోన
బలమై యజ్ఞానపు-పశువు బంధించి
కలసి వైరాగ్యపు-కత్తుల గోసికోసి
వెలయ జ్ఞానాగ్నిలో-వేలిచెమా గురుడు ॥జ్ఞానయజ్ఞ॥

మొక్కుచు వైష్ణవులనే-మునిసభ గూడ పెట్టి
చొక్కుచు శ్రీ పాదతీర్థ-సోమపానము నించి
చక్కగా సంకీర్తన-సామగానము చేసి
యిక్కువతో యజ్ఞముసే-యించెబో మా గురుడు ॥జ్ఞానయజ్ఞ॥

తదీయ గురుప్రసా-దపురోడాశ మిచ్చి
కొదదీర ద్వయమను-కుండలంబులు వెట్టి
యెదలో శ్రీ వేంకటేశు-నిటు ప్రత్యక్షము చేసె
ఇదివో స్వరూప దీక్ష-యిచ్చెను మాగురుడు ॥జ్ఞానయజ్ఞ॥

భావామృతం

జ్ఞానయజ్ఞమే బహుసులభమైన మోక్షసాధనమని నిన్ననే మా ఆచార్యులు మాకు చెప్పిమాచే నిర్వహింపజేసినారు. ఆ దీక్షావివరములన్నీ మాకు వారు సెలవిచ్చియున్నారు.

'శరీరము' అనే ఈ యజ్ఞశాలలో, బలమైన 'అజ్ఞానం' అనే పశువును తీసికొనివచ్చి బంధించి,' వైరాగ్యం' అనే కత్తితో దానిని ఖండించి, జ్ఞానము అనే అగ్నిలో మా గురువు గారు దానిని వేల్చినారు.

తదుపరి నమస్కారము వంటి ఉపచారములను గావించుచు పరమభాగవతులైన వైష్ణవులు అనే మునుల సభలో నన్ను జేర్చిరి. పిదప సంతోషముతో మా అందరికీ ' శ్రీపాద తీర్థము' అను 'సోమపానము', సంకీర్తన అనే సామవేదగానమును వినిపించిరి. ఆ విధానమున గురువులు మాచే యజ్ఞమును చేయించినారు.

అటుపిమ్మట మాగురువు గారు ఆయనకు సంబంధించిన పురోడాశము ('హుతశేషము') గురుప్రసాద రూపమున నొసగిరి. కొఅతలేనట్లుగా 'ద్వయము' అను కుండలములను మాకు పెట్టారు.

(శ్రీ మన్నారాయణ చరణౌశరణం ప్రపద్యే, శ్రీ మతే నారాయణా నమః అను ఈ రెండు మంత్రములే నిజమైన కుండలములు) ఆ విధముగా మా ఆచార్యులు మా హృదయముతో శ్రీ వేంకటేశ్వరుని ప్రత్యక్షము సేయించినారు. ఆ విధముగా ఆయన మాకు 'స్వరూపదీక్షను' ఇచ్చారు.

31 ట

ఆ.వె॥ టక్కులాడివోలె తన్వి మోహిని ఆయె
అమృతమీయదాయె అసురులకును
అన్నమయ్య పాట అక్షరము 'ట' లేక
సంకటంబు మిగిలె వేంకటేశ!

భావామృతం

అసురులను వంచించి దేవతలకు అమృతం పంచి ఇవ్వాలని విష్ణుమూర్తి వగలాడి మోహినీ రూపం ధరించాడు. మోహిని వగలు చూపింది కాని అమృతం ఈయదాయెను. ఓ శ్రీవేంకటేశ్వరా! అన్నమయ్య కీర్తన 'ట' తో మొదలయింది దొరకలేదు. చాలా చిక్కువచ్చింది.

32 ఠ

ఆ.వె॥ ఠక్కుడనిరి హరిని దానవులానాడు
సర్వులకును తండ్రి సత్యమిదియె
అన్నమయ్య పాట కాదిలో లేదు 'ఠ'
వేంకటేశ! కలిగె సంకటంబు

భావామృతం

శ్రీహరిని రాక్షసులందరూ ఆనాడు ఠక్కుడు, అనగా, మోసగాడు అన్నారు. నిజానికి ఆయన జీవులందరికి తండ్రి. తండ్రికి కొడుకులలోని చెడుని చంపాలని వుంటుంది, అంతే. ఓ శ్రీవేంకటేశ్వరా! ఏ అన్నమయ్య కీర్తనా 'ఠ'తో ఆరంభం కాదు. గొప్ప కష్టం వచ్చింది ప్రభూ!

33 డ

రాగం : ఖమాస్

డోలాయాంచల డోలాయాం హరే డోలాయాం ॥డోలాయాంచల॥
మీన కూర్మ వరాహ మృగపతి అవతార
దానవారే గుణశౌరే ధరణీ ధర మరుజనక ॥డోలాయాంచల॥
వామన రామ రామ వరకృష్ణ అవతార
శ్యామలాంగ రంగ రంగా సామజవరద మురహరణ ॥డోలాయాంచల॥
దారుణ(తారణ) బుద్ధ కలికి దశవిధ అవతార
శే (సీ)రపాణే గోసమాణే శ్రీ వేంకటగిరి కూట నిలయ ॥డోలాయాంచల॥

భావామృతం

శ్రీ హరీ! నీకు ఊయలలూపెదను. బాగుగా కదలాడు ఊయలలూపెదను.

మత్స్యరూపుడవై (వేదములను రక్షించితివి), కూర్మరూపుడవై (మంధరగిరి నెత్తితివి), వరాహరూపుడవై (భూదేవిని కాపాడితివి), మృగేంద్రుని రూపుడవై (నరసింహుని వలో ప్రహ్లాదుని బ్రోచావు), ఓ ప్రభూ! అసురారీ! శౌర్యవంతమైన గుణభూషణా! భూ రమణా! మదనజనకా! నీవు సర్వేశ్వరుడవు.

వామనరూపుడవై (బలిని నిరోధించితివి), శ్రీ రామచంద్రమూర్తివై (రావణుని తెగటార్చితివి), బలరాముడివై (దారుణమైన బలశాలివైతివి), శ్రీ కృష్ణపరమాత్మవై (వరప్రదాతవైతివి) ఓ మహానుభావా! నల్లని శరీరముకలవాడా! శ్రీ రంగమునేలెడి రంగనాధా! గజేంద్ర సంరక్షకా! మురాసురభంజనా! నీవు అసామాన్యుడవు.

ధర్మవర్తనతో తరింపజేసిన ఓ బుద్దా! (శాంతి ప్రవర్ధకుడవు), కలికి అవతారుడవై (దుర్జనాంతకుడవు). ఓ సీరపాణే (నాగలి ధరించినవాడా) గోసంరక్షకా! శ్రీ వేంకటగిరి కూటమియైన ఏడుకొండలపై నివాసమైన శ్రీ వేంకటేశ్వరా కదలాడే ఈ డోలికలలో ఊగుతూ మమ్ము ఆదుకోతండ్రీ!

34 ధ

ఆ.వె॥ ధక్క మోతతోటి తరుణ రుక్మిణి దెచ్చి
పరిణయంబునాడె మురు విరోధి
అన్నమయ్య పాట అక్షరము 'ధ' లేక
తిప్పలొచ్చి పడెను తిరుమలేశ!

భావామృతం

శత్రువులందరినీ చిత్తుచేసి, 'ధక్క' (డప్పులు) మొదలైన వాయిద్యాల ధ్వనులు మారు మ్రోగుతుంటే మురారి అయిన శ్రీకృష్ణుడు రుక్మిణిని పెండ్లియాడాడు. ఓ శ్రీవేంకటేశ్వరా! 'ధ' తో మొదలయ్యే అన్నమయ్య కీర్తన లభించక చిక్కువచ్చింది స్వామీ!

35 ణ

ఆ.వె॥ 'ణ' యను అక్షరంబు నావూహ మేరకు
మొదలు కాదు పదము రాదు, లేదు
అన్నమయ్యపాట అక్షరము 'ణ' తోటి
కొండలయ్య! లేదు వుండబోదు

భావామృతం

ఓ ఏడు కొండలవాడా! నాకు తెలిసినంత వరకు 'ణ' తో మొదలయ్యే అన్నమయ్య కీర్తన లేదు. ఇంకెక్కడా వుండబోదు. కాబట్టి నీకో నమస్కారం తండ్రీ!

36 త

రాగం : మోహన

తత్తాతి గుడి ధిం ధిం తకధింధిం
తిత్తి తిత్తి తి తితి తితి తితి ॥తత్తాతి॥

దానవదన వితాన దాన సం-
ధానరుధిర నిజపాన మిదం
నానాభూతగణానాం గానం
దీనజనానాం తిత్తితి తితి తితి ॥తత్తాతి॥

విమత దనుజమత విభవపరిభవిత
సమధికం తవ శౌర్య మిదం
ప్రమదా భవ్యం ప్రమాదాభరణం
తిమిర నిరసనం తిత్తితి తితి తితి ॥తత్తాతి॥

తిరువేంకటగిరి దేవ నిధానం
పరమామృతరస భాగ్యమిదం
కరుణావరణం కమలా ఘటనం
తిరో తిరో తిత్తితి తితి తితి ॥తత్తాతి॥

భావామృతం

తత్తాతిగుడి ధిం ధిం తక ధిం ధిం
తిత్తి తిత్తితి తితి తితి తితి

ధారాళముగా కారుచున్న 'చొంగ' తో కలిసిపోయిన రక్తమునంతయూ వచ్చింది వచ్చినట్లే త్రాగివేయుచున్నవాడీ నరసింహుడు. రకరకములైన జీవగణములు అన్నియూ కీర్తించి పాడుచున్నారు. దీనజనులు తిత్తి తిత్తి అని నర్తించుచున్నారు.

శత్రువులైన రాక్షసుల యొక్క వైభవమును దారుణంగా అవమానించు శౌర్యము కలవాడీ నరసింహుడు దానవులను అజ్ఞాన తిమిరములావహించగా వారికి సంతోషముతో కలిగే ఏమఱుపాటును నిరసించే ఆయన ప్రతాపమే తిత్తితి తితి.

ఇది తిరువేంకటపతి పుణ్యనిలయము.' పరము' అనే అమృతం పొందే భాగ్యం ఇక్కడ కలుగుతుంది. ఇది దయావృష్టికి నెలవు. లక్ష్మీదేవికి ప్రియమైన స్థానం ఈ మహానుభావుని హృదయమే. తిరో తిరో తిత్తితి తితి.

37 థ

ఆ.వె॥ 'థ, ణ', ల తోటి యే పదము లేదు తెలుగులో
యే నిఘంటువునందు కానరాదు
పాటయెట్లునుండు పద కవీ అన్నయ్య!
తిరుమలయ్య గీతి తెలుపుటెట్లు?

భావామృతం :

ఓ తిరుమల నాయకా! తెలుగులో వున్న నిఘంటువులన్నీ తిరుగ వేశాను. 'థ, ణ' లతో ఆరంభమయ్యే మాటే దొరకలేదు. ఇక పాట ఎట్లు వుంటుంది? పద కవితా పితామహా! అన్నమాచార్యా!

38 ద

రాగం : శంకరాభరణం

దనుజులు గనిరి తత్త్వమిది
వనజాక్షుని కృప వసించ నేలా! ॥దనుజులు॥

హరి పరమాత్ము డనాది పురుషుడు
సురులకు నరులకు సులభుడు
హరి కోపముతో నన్యుల వరములు
సరిగా వెంచగ జగములలోన! ॥దనుజులు॥

వేదాంత విదుడు విష్ణుడు కృష్ణుడు
శ్రీదేవికి బతి శేఖరుడు
పోది బరస్తుతి పుణ్యముకంటే
పాదుగ హరి దిట్టే పాపము మేలు! ॥దనుజులు॥

నారాయణు డున్నతు డచ్యుతు డుప-
కారుడు శ్రీవేంకటవిభుడు
చేరి యీతడే శిక్షించ రక్షించ
వూర దయివములు వొగి నితని సరా! ॥దనుజులు॥

భావామృతం :

(ఓ మానవులారా! సురులు విష్ణుభక్తులనే భ్రమతో అసురులు విష్ణు విరోధులయ్యారు. విష్ణుభక్తులను హింసించి, పాపకార్యాలు చేసి హరిచే శిక్షింపబడ్డారు. అందువల్ల మరింత హరిని ఎదుర్కొనటానికి అన్యదేవతల కోసం తపస్సు చేసి వరాలు పొంది హరితోపోరి, హరిచేతిలో నశించి ఇదివరకు తాము హరి నిందతో మూటగట్టుకొన్న పాపం నశించి, పుణ్యంతో వైకుంఠం పొందారు. ఆ దనుజులకు అన్యదేవతల మేలుకంటే హరి చేసిన కీడే పరమ సుఖాన్నిచ్చింది. అవునా?) దనుజులు ఈ విచిత్రమైన తత్త్వమును ఆకళింపు చేసికొనిరి. వనజాక్షుడు (పద్మనయనుడు) అయిన శ్రీహరి కృపతో వసించనేలా! (మనము వుండటమెందుకు?)

నిజం ఆలోచిస్తే, శ్రీహరి పరమాత్ముడు, ఆదిపురుషుడు. ఆయన సురులకు, నరులకు, సులభుడు (సులభంగా వరములిచ్చే పక్షపాతి) అని భావించి, హరిపై కోపముతో ప్రపంచంలో అన్యుల (ఇతర దేవతల) వరములను యెంచగా (పొందాలనుకోవటం) సరికాదు. (అదివారికి హానికరమే అవుతుంది).

వేదాంతుల చేత తెలుపబడినవాడే కృష్ణుడయిన (నీలవర్ణుడైన) విష్ణువు. ఆయనే శ్రీలక్ష్మీ వల్లభుడు, అత్యున్నతుడు. పరస్తుతి చేసి (అన్య దేవతలను కీర్తించి) పోది (పోగుచేసికొనిన) పుణ్యము కంటే, పాదుగా (నిలచి) శ్రీహరిని తిట్టే పాపమే మేలు. (చివరికి అది విష్ణుపురిని ప్రాప్తింప చేస్తుంది)

శ్రీమన్నారాయణుడు ఉన్నతమైనవాడు. నాశనములేని అచ్యుతుడు. ఎంతో ఉపకారము చేయువాడు. ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. ఆయన నాశ్రయించినచో మనం చేసికొన్న పాపపుణ్యాలను బట్టి, శిక్షిస్తాడో రక్షిస్తాడో ఆయన ఇష్టం. అంతేకాని, వూరినిండా లెక్కకు, మిక్కుటంగా క్రమముగా వుండే ఇతర దేవతలెందుకు? వారు ఈ ఏడుకొండలవాడితో సమానమా?

39 ధ

రాగం : దేసాళం

ధరణినెందరెన్ని – తపములు చేసినాను
హరికృప గలవాడే – అన్నిటా బూజ్యుడు ॥ధరణి॥

మితిలేని విత్తులెన్ని – మేదినిపై జల్లినాను
తతితో విత్తినవే – తగ బండును
ఇతర కాంతలు మఱి – యెందరు గలిగినాను
పతి మన్నించినదే – పట్టపు దేవులు ॥ధరణి॥

పాలుపడి నరులెన్ని –పాట్లుబడి కొలిచినా
నేలిక చేపట్టిన వాడే –యెక్కుడు బంటు
మూలనెంత ధనమున్నా – ముంచి దాన ధర్మములు
తాలిమితో నిచ్చినదే – దాపురమై నిల్చును ॥ధరణి॥

ఎన్నికకు గొడుకులు – యెందరు గలిగినాను
ఇన్నిటా ధర్మపరుడే – యీడేరును
ఉన్నతి జదువులెన్ని – వుండినా శ్రీవేంకటేశు
సన్నుతించిన మంత్రమే – సతమై ఫలించును ॥ధరణి॥

భావామృతం

ఈ లోకంలో యెందరెన్ని తపస్సులు చేసినప్పటికీ, హరికృప పొందినవాడు మాత్రమే అన్నింటిలోను పూజకు అర్హుడు.

తతితో (అదనుతో) విత్తనాలు భూమిలో నాటకుండా యెన్ని విత్తనాలు చల్లినా లాభమేముంది? బాగుగా దున్నిన నేలలో అదను చల్లిన విత్తనమే మొలకెత్తుతుంది. ఒకరాజు చేరదీసిన స్త్రీలెంత మంది వున్నా అతని మన్నింపు పొందినది మాత్రమే పట్టపు రాణిగా పరిగణించబడి రాజ్యాన్నేలుతుంది.

ఒక ఏలిక (ప్రభువు) వద్ద యెంతమంది భృత్యులు వూడిగం చేస్తున్న వారంతా పాలుపడి, పాట్లుపడి కొలిచినా వ్యర్థమే. ఆయన నమ్మిన బంటు మాత్రమే ముఖ్యమైన అధికారి అవుతాడు. తక్కినవారంతా జీతం తీసికొనే పనివాళ్ళు మాత్రమే. మూలనెంత ధనం వున్నా (ఆరోజుల్లో ధనవంతులు ఇంట్లో వొక మూల త్రవ్వి, బిందెల్లో నాణెముల రూపంలో వున్న ధనం పోసి, ఒక వస్త్రంతో మూసికట్టి, పాతిపెట్టి దాచి వుంచేవారు. ఒక బిందెకు ఇంకొక బిందెకు 'లంకె' వేసి ఇంకో తాడు కట్టేవాళ్లు. అవి వాళ్లకి ఉపయోగపడక ఆ తరువాత యెవరికో దొరికి వారికి వుపయోగపడేవి. అవే

'లంకెబిందెలు' అనేవారు. అది నిరుపయోగమే. తాలిమితో (శ్రద్ధతో), ముంచి (అతిశయించి) దానధర్మం చేసినది మాత్రమే దాపరమై (ప్రాప్తమై) జన్మాంతరములలో అక్కరకొచ్చును.

ఎన్నికకు (లెక్కించుటకు) ఎంతమంది కొడుకులున్నా వాళ్లు నిరుపయోగులే. ఇన్నిటా (ఇందరిలోనూ) ధర్మవర్తనుడు మాత్రమే ఈడేరుతాడు (తల్లిదండ్రిని, కడతేరుస్తాడు) అహో!! అన్నమాచార్యా! ఆరువందల ఏళ్లక్రిందనే, ఎంత సత్యం చెప్పావయ్యా!) ఉన్నతమైన చదువులు యెన్నివున్నా శ్రీవేంకటేశ్వరుని సన్నుతించె మంత్రం (ఓం నమో వేంకటేశాయ) ఒక్కటే సతమైన (శాశ్వతమైన) ఫలితాన్నిస్తుంది. తక్కినవన్నీ వ్యర్థమైన చదువులే అవి బిరుదులవలె పేరు వెనకాలో ముందరో తగిలించుకోటానికి తప్పించి ఆ స్వామి కరుణ పొందటానికి అస్సలు... ఉపయోగపడవు)

40 న

రాగం : శ్రీరాగం

నమో నారాయణాయ
నారాయణాయ సగుణ బ్రహ్మణే సర్వ
పారాయణాయ శోభనమూర్తయే ॥నమో॥

నిత్యాయ విబుధ సంస్తుత్యాయ నిత్యాధి-
పత్యాయ మునిగణప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానస సాం-
గత్యాయ జగదవన కృత్యాయ తే నమో ॥నమో॥

అక్రమోద్ధత బాహు విక్రమాతిక్రాంత
శుక్ర శిష్యోన్మూలనక మాయ
శక్రాది గీర్వాణ వక్రభయ భంగ నిర్
వక్రాయ నిహతారి చక్రాయతే నమో ॥నమో॥

అక్షరాయాతి నిరపేక్షాయ పుండరీ
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణ విజ్ఞాన దక్ష యోగీంద్ర సం
రక్షానుకంపా కటాక్షాయ తేనమో ॥నమో॥

కరిరాజవరదాయ కౌస్తుభా భరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందు కోటీర తరుణీ మనస్త్రోత్ర
పరితోషచిత్తాయ పరమాయతేనమో ॥నమో॥

పాత్రదానోత్సవ ప్రథిత వేంకటరాయ
ధాత్రీశకామితార్థప్రదాయ
గోత్రభిన్మణిరుచిర గాత్రాయ రవిచంద్ర
నేత్రాయ శేషాద్రి నిలయాయ తే నమో ॥నమో॥

భావామృతం :

ఓ నారాయణుడా! నీకు వందనములు. సుగుణములకు నెలవైన పరబ్రహ్మ స్వరూపుడవు నీవు. సర్వమూ నేర్చినవాడవు. నీవు సుందరమూర్తివి. అట్టి నీకు వందనము. ఓ మహానుభావా! నీవు నిత్యము వుండెడివాడవు. గొప్ప పండితులచే చక్కగా స్తుతింపబడువాడవు. మునిజనుల నమ్మకమైన వాడవు. సత్యస్వరూపుడవు.

ప్రత్యక్షముగా కరుణించువాడవు. సద్బుద్ధిగల వారి సాంగత్యాభిలాషివి. జగత్తు నంతటిని తృప్తిపరచువాడవు. అటువంటి నీకు నమస్కారములు.

ఓ దేవదేవా! అన్యాయం పెట్రేగినప్పుడు నీ బాహువుల పరాక్రమముచే దాని నెదిరించువాడవు. శుక్రాచార్యుని శిష్యులైన దైత్యులను నిర్మూలించు నియమము కలవాడవు. ఇంద్రాది దేవతలకు అతిశయించిన భయమును నిర్మూలించిన వాడవు. ఏ విధమైన వక్ర స్వభావమూ లేనివాడవు. శత్రువులను తరుగు చక్రము గలవాడవు. అట్టి నీకు వందనములు.

ఓ లోకేశా! నీవు నాశనము లేనివాడవు. ఏ కోరికలూ లేనివాడవు. పద్మదళ నేత్రుడవు. శ్రీవత్సమును పుట్టుమచ్చ నీ లక్షణముగా కలవాడవు. ఎన్నడూ క్షీణించని విజ్ఞాన దక్షత కలవాడవు. విశిష్టమైన యోగులను రక్షించి మిక్కిలి కరుణతో అనుగ్రహించువాడవు. అట్టి నీకు నమస్కారములు.

ఓ స్వామీ! నీవు అలనాడు గజేంద్రుని కాపాడినవాడవు. దివ్య కౌస్తుభమణి చేత అలంకరింపబడిన వాడవు. 'ముర' అను రాక్షసుడు శత్రువుగా కలవాడవు. జగన్మోహనుడవు. లే వెన్నెల వెలుగులు విరజిమ్ము కిరీట ధారివి. లేబ్రాయపు గోపికలచే కీర్తించబడి మిక్కిలి సంతుష్టాంతరంగుడవై కైవల్యము నొసగినవాడవు. అట్టి నీకు వందనములు.

ఓ జగన్నాథా! నీవు పాత్రులకు వారికి తగినవి అనుగ్రహించుటలో ప్రసిద్ధిజెందిన శ్రీవేంకటేశ్వరుడవు. మానవుల కామితములను దీర్చువాడవు. వివిధ దివ్య రత్నములచే బొడమిన కాంతులచే ప్రకాశించు దేహము కలవాడవు. శేషాద్రి నిలయమైనవాడవు. అటువంటి ఓ పరమపురుషా! నీకు శతకోటి వందనములు.

41 ప

రాగం : అభేరి

పలుకు తేనెల తల్లి పవళించెను
కలికి తనముల విభుని కలసినదిగాన ॥పలుకు॥

నిగనిగని మోముపై నెఱులు గెలకుల చెదర
పగలైనదాక చెలి పవళించెను
తెగని పరిణతులతో తెల్లవారినదాక
జగదేకపతి మనసు జట్టిగొనె గాన ॥పలుకు॥

కొంగు జాఱిన మెఱుగు గుబ్బలొలయగ తరుణి
బంగారు మేడపై పవళించెను
చెంగలువ కనుగొనల సింగారములు దొలక
అంగజగురునితోడ అలసినది గాన ॥పలుకు॥

మురిపెంపు నటనతో ముత్యాల మలగుపై
పరవశంబున తరుణి పవళించెను
తిరువేంకటాచలాధిపుని కౌగిట గలసి
అరవిరై నును చెమట నంటినదిగాన ॥పలుకు॥

భావామృతం

తేనెలూరు తీయని పలుకులు మాట్లాడే అలమేలు మంగమ్మ తల్లి నిదురించుచున్నది. స్త్రీకి పరిపూర్ణత్వమును కలిగించే పతితో రతిపై ఆసక్తి కలిగిన ఆమె తన వల్లభునితో సంగమించినది.

నిగనిగమని ప్రకాశించు ముఖముపై ముంగురులు చెదిరి ఆడుచున్నవి. పగలైపోయినా ఆమె పవళించియే ఉన్నది. అంతులేని ప్రావీణ్యముతో ఆ తల్లి, జగదీశ్వరుడైన తన పతి మనసును ఆకట్టుకొని యున్నది. కావున బడలి శయనించుచున్నది.

ఆమె పయ్యెద స్థాన భ్రంశమునందగా మెఱయు స్తనయుగ్మము విస్తరించి యున్నవి. ఆ భామామణి బంగారపు మేడపై నిదురించుచున్నది. ఎఱ్ఱ కలువల వంటి సోగ కన్నులలో శృంగారం అతిశయించి ఆమె మదనుని జనకునితో మన్మథ యుద్ధమున అలిసిపోయియున్నది. అందుచే ఆ తల్లి నిదురించుచున్నది.

మురిపెము లొలుకు అభినయం చూపిన ఆ తల్లి ముత్యాల హంసతూలికా తల్పంపై పరవశురాలై పవ్వళించి యున్నది. తిరుమలాధీశుడైన శ్రీవేంకటపతి కౌగిటిలో కరిగిపోయిన ఆ తల్లి అరవిచ్చిన మొగ్గవలె చిరుచెమటలు కమ్మి శయనించుచున్నది.

42 ఫ

రాగం : శ్రీరాగం

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా–
కేలీ విహార లక్ష్మీనారసింహ ॥ఫాలనేత్రా॥

ప్రళయ మారుత ఘోర భస్మికా ఫూత్కార–
లలిత నిశ్వాస డోలా రచనయా
కులశైల కుంభీనీ కుముదహిత రవి గగన–
చలన విధి నిపుణ నిశ్చల నారసింహా ॥ఫాలనేత్రా॥

వివరఘన వదన దుర్విధిహసన నిఘ్నాత–
లవదివ్య వరుష లాలా ఘటనయా
వివిధ జంతువ్రాత భువన మగ్నీకరణ
నవనవ ప్రియ గుణార్ణవ నారసింహా ॥ఫాలనేత్రా॥

దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానల వి–
కారస్ఫులింగ సంగక్రీడయా
వైరిదానవ ఘోర వంశ భస్మీకరణ
కారణ ప్రకట వేంకట నారసింహా ॥ఫాలనేత్రా॥

భావామృతం

ఈ అహోబల నరసింహుడు నుదుట వహ్నినేత్రుడైన లక్ష్మీనరసింహుడు, బలీయమైన మెరుపుతీగెల వంటి కాంతులు ప్రస్ఫుట మవుచుండగా కేళి విహారమును సలుపుచున్నవాడు.

ప్రళయకాలము నాటి ఝంఝామారుతములు వీచుచుండగా భస్మీపటలమొనర్చు ఘోరమైన ఫూత్కారము సలుపుచూ అంతలోనే లలితమైన ఉచ్ఛ్వాస నిశ్వాసముల డోలలూపుచుండగా ఆవృతంబైన కులపర్వతములను, భూమ్యాకాశములను, సూర్యచంద్రులను ఉయ్యాలలూపు చున్నప్పటికీ, తను నిశ్చలంగా వుండే నైపుణ్యం కలవాడీ లక్ష్మీనరసింహుడు.

విస్తరించిన పెద్ద ముఖమున భీకరాట్టహాసము ప్రకటించుచుండగా ధారగా లాలాజలము రాశిగా కారుచుండగా అనేకములైన జీవులను కలిగిన ప్రపంచమును అగ్నికీలలలో భస్మీపటల మొనర్చు అరుదైన కొంగ్రొత్త గుణ సముద్రుడై ఈ లక్ష్మీనరసింహుడు ప్రకటితమైనాడు.

ధగధగమని మెరయుచున్న భీకరమైన కోరలనుండి దారుణమైన

స్ఫులింగములు (నిప్పురవ్వలు) వెలువడి క్రూరులైన దానవులను, వారి వంశములను బూడిదపాలు చేయుచుండగా ఆ వినాశనమునకు కారణమై ప్రకటింపబడిన ఈ నరసింహుడు వేరెవ్వరో కాదు, ఆ వేంకటేశ్వరుని తొలిరూపమైన వేంకట నారసింహుడు.

(అందుకనే ఆంధ్రదేశంలో వేంకట నారసింహుని పేరు పెట్టుకొన్న వెంకట నరసయ్యలు లెక్కకు మిక్కుటంగా వున్నారు.)

బ

43

రాగం : ధన్యాసి

బండి విరిచి పిన్న పాపలతో నాడి
దుండగీడు వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

పెరుగు వెన్నలు ప్రియమున వే-
మరుముచ్చిలించు మాయకాడు
వెరుపున దన విధము దాచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

పడుచు గుబ్బెత పరపుపై పోక-
ముడి కొంగు నిద్ర ముంపునను
పడియుతా (?) వద్ద పవళించినట్టి
తొడుకుదొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

గొల్లపల్లెలో ఇల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెగాడు
యెల్లయినా వేంకటేశుడు ఇదె
తొల్లిటి దొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

భావామృతం

(దుండ గీడు అంటే దుష్టుడు. అంటే 'కీడు' చేసే వాడు అని అర్థం. ఆదిదేవుణ్ణి అంతటి మాట ఎందుకంటున్నారు అన్నమయ్య? గోపెమ్మల్లాగా, మనబోటి సామాన్యుల్లాగా ఆలోచించే వారికి స్వామి లీల అర్థమవుతుందా? ఆయన ఎవ్వరికీ కీడు చేయడు. మన కర్మఫలమే మనకిచ్చినా, అది మన కంటికి కీడులాగే కనిపిస్తుంది. అదే మాయ. ఆ మాయగాణ్ణి దొంగ అంటున్నారు అంతా.... నిజానికి దొంగలెవరు?)

బండి విరిచి పిల్ల పాపలతో ఏవేవో దొంగాటలాడే దుండగీడు వస్తున్నాడు. జాగ్రత్త దోబూచి. (దోంగ భూతం) వస్తాడు.

అతి ఇష్టంగా పెరుగు వెన్నలను మాటిమాటికీ దొంగతనం చేసే మాయలమారివాడు ఈ కుర్రవాడు. ఉపాయంతో తన విధానమేమియో తెలియనీయని ఈ దొరదొంగ (దొంగవలె భ్రమింపచేసే సర్వేశుడు) వచ్చాడు. జాగ్రత్త దోబూచి.

చక్కటి స్తనములున్న (గుబ్బెత) పడుచుపిల్ల పరుపు మీద నిద్ర పోతుంటే చీరముడి ఊడతీసి ఆమె ప్రక్కనే పడుకొన్న దొంగవచ్చాడు, తొడుకు (ఒడిసి పట్టుకొండి). జాగ్రత్త. దోబూచి.

రేపల్లెలో ప్రతి ఇంటిలోను దూరి, ఆ ఇంట్లో వెన్నలను కన్నెలను కొల్లగొట్టిన వాడే ఈ కోడెవయసు కుర్రవాడు. వీడు అన్నీ తానే అయిన శ్రీ వేంకటేశ్వరుడే. ఇదిగో ఈయన అనాదిగా భక్తుల హృదయాలను దొంగతనం చేస్తున్న పెద్ద దొంగ. జాగ్రత్త!! దోబూచి వస్తున్నాడు. బాబోయ్. జాగ్రత్త!

44 భ

రాగం : రామక్రియ

భక్తి కొలది వాడే-పరమాత్ముడు
భుక్తి ముక్తి దానె యిచ్చు- భువి పరమాత్ముడు ॥భక్తి॥

పట్టిన వారి చే బిడ్డ-పరమాత్ముడు
బట్ట బయటి ధనము-పరమాత్ముడు
పట్టపగటి వెలుగు-పరమాత్ముడు
ఎట్టయెదుటనే వున్నా-డిదే పరమాత్ముడు ॥భక్తి॥

పచ్చిపాలలోని వెన్న-పరమాత్ముడు
బచ్చెన వాసిన రూపు-పరమాత్ముడు
బచ్చు చేతివొరగల్లు-పరమాత్ముడు
ఇచ్చకొలది వాడు పో-యీ పరమాత్ముడు ॥భక్తి॥

పలుకులలోని తేట-పరమాత్ముడు
పలియించు నిందరికి -పరమాత్ముడు
బలిమి శ్రీవేంకటాద్రి -పరమాత్ముడు
ఎలమి జీవుల ప్రాణ-మీపరమాత్ముడు ॥భక్తి॥

భావామృతం :

పరమాత్మకు మనపట్ల కలిగే కరుణయెప్పుడూ మనభక్తికి తగ్గట్లుగానే వుంటుంది. జీవులకు భుక్తి ముక్తి రెండూ ఇచ్చేవాడు ఆ పరమాత్ముడు దక్క వేరెవ్వరూ కాదు.

పరమాత్మ 'పట్టినవారిచే బిడ్డ'. అంటే ఎవరు ఎత్తుకొంటే వారి దగ్గరకు వెళ్ళే

బిడ్డవలె ఎవరు నాకు నీవే కావాలి తండ్రీ! అంటే వారిని కరుణిస్తాడు. పరమాత్మ బట్టబయలు చేసుకోగలిగిన ధనం (వైట్ మనీ అన్నమాట). గుప్తధనంకాదు. పరమాత్ర ఆరుబయట పట్టపగలు కనబడే సూర్యకాంతి వంటివాడు. కృత్రిమంగా వెలిగించిన దీపంకాదు. పరమాత్మ వేరెక్కడనో లేడు, మన యెట్టయెదుటనే వున్నాడు. (మనపుణ్యం కొఱవైనందువలన మనకు కనిపించడు. అంతే...

వెచ్చజేయని పచ్చిపాలలో దాగియున్న వెన్నవలె ఆ పరమాత్మ అణువణువులో వున్నాడు. పరమాత్మ 'బచ్చెనబాసిన రూపు' అనగా ఏవిధమైన పైపూతల వంటి మెఱుగులు లేని నిజస్వరూపుడు. పరమాత్మ బచ్చు (వైశ్యుడు) చేతిలోని 'వొరగల్లు' అనగా గీటురాయి. (అన్నమాచార్యుల కాలంలో వైశ్యులే నేటికాలంలో స్వర్ణకారులు చేసే పనికూడా నిర్వహించేవారు). ఎవరిదెంత నిజమైన భక్తియో ఆ గీటురాయికి తెలియకుండా వుంటుందా? మన ఇచ్చ (కోరిక) కొలది ఆయన మనని అనుగ్రహిస్తాడు.

పరమాత్మ పలుకులలోని తేట. అనగా వేదవేదాంగము లన్నింటిలోని వాక్యములలోని భావస్వరూపుడు. ఇంతమంది జీవులకు స్వపరభేదం లేకుండా "చేసికొన్నవారికి చేసికొన్నంత" ఫలితం ఇచ్చే న్యాయమూర్తి. ఈయనే శ్రీవేంటాద్రిపై వెలసిన పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరుడు. ఈయన అనుపమ శక్తి సంపన్నుడై వాత్సల్యంతో జీవులందరిలోను ప్రాణరూపంలో వున్న పరమాత్మ.

45 మ

రాగం : అభోగి

మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖ మందనేల ॥మనుజుడై॥

జుట్టెడు కడుపుకై చొరని చోట్లు చొచ్చి
పట్టెడు కూటికై బతిమాలి
పుట్టిన చోటికే పొరలి మనసు వెట్టి
వట్టి లంపటము వదలనేరడు గాన ॥మనుజుడై॥

అందరిలో పుట్టి అందరిలో పెరిగి
అందరి రూపము లటు తానై
అందమైన శ్రీవేంకటాద్రీశు సేవించి
అందరాని పదము అందెనటు గాన ॥మనుజుడై॥

భావామృతం :

ఓ మానవులారా! ఏమిటీ విచిత్రం!! మానవుని వలె జన్మించిన వాడు, ఇంకొక మానవుని సేవించడమేమిటి? పోనీ దానివలన ఏమన్నా సుఖపడుతున్నాడా అంటే లేదే!! ప్రతి దినము దుఃఖిస్తూనే వున్నాడు. మరి ఇక ఇదంతా యెందుకు? ఆలోచించండి.

సరే! తిండికోసం పడరాని పాట్లు పడవలసి వస్తోంది అనుకుంటే, మన కడుపు యెంత వుంది? జుట్టెడు (జానెడు కడుపు). దీనికోసం చొరరాని చోట్లు (వెళ్లకూడని స్థలములకు) చొచ్చి (వెళ్ళి), అవస్థలు పడుతున్నాడు. పట్టెడు కూటికోసం (పిడికెడు తిండికోసం) ఎవరెవర్నో బ్రతిమిలాడి, భంగపడి, మనస్సంతా తనుపుట్టిన చోటుపైనే పెట్టి, ప్రవర్తించి, వుపయోగపడని లంపటాలను (తగులుకొన్న బాంధవ్యాలనే తొంపిని) వదలనే లేడు. కాబట్టి వీడు మనిషై పుట్టి సాధించినదేమిటి? శుద్ధ దండుగే కదా!

ఇక ఈ మానవ జన్మలో వీడు చేసిన అకృత్యాలవల్ల యేం జరుగుతున్నదో చూడండి. వీడు (ఈ ఆత్మ) మళ్ళీ అందరిలోనూ పుడుతున్నాడు. కాబట్టి అందరిలోనూ పెరుగుతున్నాడు. ఆ హీనజన్మల రూపములన్నీ తానే అవుతున్నాడు. (ఈ దీక్షితులు యెక్కడో ఏ గాడిద జన్మనో పొందుతాడనే ఆలోచనే... కంపరం కలిగిస్తున్నది కదా!)

మరి యెందుకండీ ఈ తిప్పలు? మనోజ్ఞమూర్తియైన ఆ స్వామిని, శ్రీవేంకటేశ్వరుని సేవించి, మానవులకు అందరాని కైవల్య పదవ నందుకొనుటకు ప్రయత్నించాలి, కానీ వ్యర్థజీవితం గడుపవచ్చునా?

46 య

రాగం : ఖమాస్

యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్త విన్నిటాను
యజ్ఞాది ఫలరూప మిటు నీవై వుండవే ॥యజ్ఞ॥

పరికించ జీవులకు ప్రాణమవైన నీకు
నిరతి ప్రాణ ప్రతిష్ఠ నేము సేసేమా
మరిగి మా పూజలంది మమ్ము గాచెడి కొరకు
హరి నీ మూర్తి ప్రాణమావహించవే ॥యజ్ఞ॥

జగతికి నీ పాద జలమే సంప్రోక్షణ
జిగి నీకు సంప్రోక్షణ సేయువారమా
పగటున నన్ను నేడు పావనము సేయుటకు
అగు పుణ్యతీర్థముల అభిషేకమందవే ॥యజ్ఞ॥

వేదములు తెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు
వేద మంత్రముల పూజావిధి సేసేమా
యీ దెస నీ దాసులమైన మమ్ముగాచుట కొరకు
వేదమూర్తివై యిందే విచ్చేసి ఉండవే ॥యజ్ఞ॥

భావామృతం

స్వామీ! యజ్ఞమూర్తివి, యజ్ఞ భోక్తవు, యజ్ఞకర్తవు, ఆ యజ్ఞఫలప్రదాతవు కూడా నీవే. ఇవన్నీ నీవై వుండగా ఇంకా భగవంతుడవు నీవు కాక మరెవ్వరు?

మేమెంత బుద్ధిహీనులమయ్యా!! పరికించి చూస్తే జీవులన్నిటిలోనూ ప్రాణం రూపంలో వున్నదెవ్వరు? నీవే. అట్టి నీకు ఏము(మేము) నిరతితో (అత్యంతాసక్తితో) ప్రాణ ప్రతిష్ఠ చేసి పూజిస్తున్నాము. నీకు ప్రాణమివ్వటానికి మేమెవ్వరం తండ్రీ! అయినా మమ్మల్ని క్షమించి మా పూజల్ని స్వీకరించటానికి మమ్మల్ని రక్షించటానికి ఈ మూర్తి రూపాల్లో ప్రాణ రూపంలో ఆవహించివుండు ప్రభూ!

ఈ సమస్త సృష్టికీ నీపాద జలమైన గంగానది, దాహం తీరుస్తున్నది. దాన్ని సంప్రోక్షించుకొని (నెత్తిపై చల్లుకొని) మేము పాపవిముక్తులమవుతూ్నాము. కాని మేము జిగితో (గొప్పగా) నీకు సంప్రోక్షణచేసి పూజిస్తున్నాము. ఇది ఎంత అవివేకమైన పని? అయినా నేడు నన్ను సగటున (బాహాటముగా) పాప విముక్తుని చేయుటకు అన్ని పుణ్యతీర్థములలోనూ నాచేత అభిషేకములను స్వీకరించి నన్ను అనుగ్రహించు. నీ అంతటివాడిని అభిషేకించాననే తృప్తి నాకు కలిగించు. శ్రీవేంకటేశ్వరా! వేదములను తెచ్చిన (సోమకాసురుని మత్స్యావతారంలో సంహరించి తెచ్చినవాడు శ్రీహరి). అట్టి నీకు, ఏము (మేము), (నేము అనే పాఠంలో వున్నది. నేము అంటే ధాన్యం చెరుగుట అని అర్థం) వేదమంత్రాలు వల్లిస్తూ పూజచేస్తున్నాం. సరే మా అజ్ఞానంమాది. అయినా ఓ మహానుభావా! ఈ చోట మమ్మురక్షించుటకు నీ దాసులమైన మమ్ము కరుణించి ఈ మూర్తిలోనికి వేదమూర్తివై వచ్చి ఇందులోనే నెలకొని మమ్ము ధన్యులను చేయుము తండ్రీ!

47 ర

రాగం : దేశ్

రచ్చకెక్కితివి పండరంగి విఠలా
పచ్చి దేరేవింతలోనె పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

గుట్టుగల దొరవని కొసరి చూచినంతనే
రట్టుగా నవ్వేవు పండరంగి విఠలా
మట్టుమీరి తమకపు మాటలనె నీవలపు
బట్టబయలు సేసేవు పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

సాగిన సబలలోన సన్న సేసినంతలోనె
రాగిదేవించేవు పండెరంగి విఠలా
వేగిరపు చేతలనె విరివి నీ మోహ మెల్ల
బాగుగా వెళ్లవేసేవు పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

తతి నీ వున్న చోటికి దగ్గర వచ్చినంతనె
రతి కూడితివి పండరంగి విఠలా
గతియైన శ్రీవేంకటనాధ యేలితివి
పతివై కోవిలకుంట్ల పండరంగి విఠలా ॥రచ్చకెక్కి॥

భావామృతం :

ఓ పాండురంగ విఠలా! వీధినబడి గోల చేస్తావేమయ్యా! (రచ్చకెక్కావు), కాస్తకూడ బిడియం లేకుండా పచ్చిదేరేవు (మరుగులేకుండా బట్టబయలు చేసేస్తున్నావు (నన్ను...) ఇంతలోనే అలా చేస్తే ఎలా స్వామీ!

నీవు నా గుట్టు కాపాడే స్వామివని నిన్ను కొసరి కొసరి (మరీ... మరీ) చూచిన మాటనిజమే. అందుకని రట్టుగా (నిందలపాలయేట్లుగా) నవ్వుతావా? హద్దుమీరిన మైమరపు మాటలాడి నీకు నామీద నున్న ప్రేమ బట్టబయలు చేసేస్తున్నావు. నీకిది తగునా విఠలా?

విఠలా ఒకపక్క సభ జరుగుతుంటే సన్నసేసేవు(సైగలు చేస్తావు) అంతలోనే రాగి దేలించేవు (రంజింప జేస్తావు) నీవేగిరంపు (తొందరపాటు) చేతలతో నీకు నాపైగల మోహాన్ని బాగా అందరికీ తెలిసేట్లు వెళ్లగక్కుతావు. ఓ పాండురంగా! ఇది నీకు మర్యాదా? (ఎందుకలా నలుగురిలో గుట్టురట్టు చేస్తావు?)

ఓ విఠలా! సమయం చూసికొని నేను నీవున్న చోటికి రాగానే వలపులలో ముంచెత్తుతావు (రతికెక్కితివి) అక్కడ తిరుమలలో వున్న వేంకటనాథుడే నీవై ఈనాడు కోవెల కుంట్లలోని పాండురంగ విఠలా! నీవు మాకు భర్తవై మమ్ము సదా కటాక్షించు ప్రభూ!

48 ల

రాగం : ఆహిరి

లక్ష్మీకళ్యాణము లీలతో బాడే మిదే నేడు
లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥లక్ష్మీ॥

చూపులే చూపులు మీకు సూనకము బాసికము
వూపుచున్న గుబ్బలివి బూజగుండలు
తీపులమోవితేనెలు తీరని మధుపర్కము
దాపుగ బెండ్లియాడేరయ్య తగుదగు మీకును ॥లక్ష్మీ॥

మాటలు మీకిద్దరికి మదనమంత్రములు
మేటి తలబాలు మీలో మించునవ్వులు
గాటమైన పులకలు కప్పురవసంతాలు
నీటున బెండ్లాడరయ్య నెరవేరె మీకును ॥లక్ష్మీ॥

కౌగిలి కౌగిలి మీకు కందువ పెండ్లి చవికె
పాగినకోరికలే పావకోళ్ళు
ఆగిన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
వీగక పెండ్లాడుడయ్య వేడుకాయె మీకు ॥లక్ష్మీ॥

భావామృతం :

నేడు మంగళప్రదమైన కళ్యాణము గురించి పాడి, ఇదిగో ఆ వివరాలు లీలతో చెబుతున్నాము. ఓ మహానుభావా! నీవును ఆ తల్లి అలమేల్మంగ స్వయంగా లక్ష్మీనారాయణులే. (మామూలు పెళ్ళిలో అలా భావించమంటారు, కానీ ఇక్కడ స్వయంగా ఈ వధూమరులు లక్ష్మీనారాయణులే)

మీరు ఒండొరులను పరవశంతో చూచుకొనుచున్నారు. మీ చూపులే సూనకము (స్త్రీలుతలలో ధరించు పాపిడిబిళ్ళ) మరియు బాసికము (వధూవరులు నుదుటకట్టుకొనే పట్టీ). ఊగుచున్న ఘనస్తనద్వయమే ఐరేణికుండలు. మీ మీ మధురాధరసుధయే మధుపర్కము అనే పెరుగు తేనె కలిసిన పానీయం. (మధుపర్కము అంటే వధూవరులకిచ్చే చదివింపు వస్త్రములు అని శ్లేషకూడా ఇక్కడవున్నది) మీరు ఏకమై పరిణయమాడుతున్నారు స్వామీ! మీకు పరస్పరం ఇది తగునట్లున్నది.

స్వామీ! పురోహితులు మీచే వేరే మదన మంత్రాలు చదివించ నక్కరలేదు మీరు మాట్లాడుకొనే మాటలే అలా వున్నాయి. మీరు ఒకరిని చూచి ఒకరు సమ్మోహనంగా నవ్వుకొంటుంటే ఆ నవ్వులు ఒకరిపై ఇంకొకరు తలంబ్రాలు పోసికొంటున్నట్లుంది. ఆ చేతులు ఒండొరుల తలలకు (కావాలని) తగిలించుకొంటున్నప్పుడు కలిగే పులకింతలే కర్పూరవసంతం ఆడుకొంటున్నారా (వెంట్రుకలు నిక్కబొడుచుకొంటే అలాగే వుంటుంది) అనునట్లున్నది. మీ ఇద్దరూ వైభవంగా పరిణయమాడండి స్వామీ మీకన్నీ నెరవేరుతాయి.

మీరుఒండిరులను పరవశించి కౌగిలించుకొనగా తాపముదీర్చు ఆ ఆలింగనమే వివాహమండపమా అనిపిస్తోంది. వ్యాపించినగాఢమైన కోరికలే పావకోళ్ళు (వరుడు ధరించుకొయ్యపాదరక్షలు). నిలిచిన ఓ శ్రీవేంకటేశ్వరా! నీవూ, నీదేవేరియైన అలమేలుమంగమ్మ వెనుదీయక నిత్యకళ్యాణం జరుపుకోండి. మీకు అదొకవేడుక. (మాకు అదే భాగ్యము.)

49 వ

రాగం : హిందోళం

వచ్చెను అలమేలు మంగ ఈ
పచ్చల కడియాల పణతి చెలంగ ॥వచ్చెను॥

బంగారు చేదివిటీలు పూని
శృంగారవతులు వేవేలు రాగా
రంగైన వింజామరలు వీవ
మాంగల్య లీల సొంపగు జవరాలు ॥వచ్చెను॥

పలుకుల తేనియ లొలుక చెంత
చిలుకలు కలకల పలుక రవల
గిలుకు పావలు ముద్దు గులుక మేటి
కలికి చూపుల మొనలు తళుకని చిలుక ॥వచ్చెను॥

రంభాది సతులెల్ల చేరి ఎదుట
గంభీర గతులను మీర నటనా
రంభములను మేలు కోరి కొలువ
అంభోజాక్షుడౌ వేంకటేశునొయ్యారి ॥వచ్చెను॥

భావామృతం :

ఇదిగో చూడండి, ఇదే వచ్చెను అలమేల్మంగమ్మ. ఈమె మరకతములు తాపిన చేతి కడియములను ధరించి శోభిల్లుచున్నది.

అనేకమంది శృంగార పరిపూర్ణులైన చెలికత్తెలు బంగారు దివిటీలు (కాగడాలు) చేతిలో ధరించి వెంటరాగా అందమైన వింజామరలు (తెల్లని చామరము)చే వీచుటకు మరికొందరు ఆయత్తమవగా ఆ జవరాలి మాంగల్యము మనోహరముగా మెడలో వూగుచుండినది.

ఆమె పెంపుడు చిలుకలు, తేనెలొలుకునట్లు మధురముగా 'గలగల' పలుకు చుండినవి. ఆమె పావలు (పావుకోళ్ళు) ముద్దులొలుకు గిలుకు(సవ్వడి) ను చేయుచున్నవి, వాడియైన ఆమె చూపుల తూపులు తళుక్కుమని తళతళలను చిలుకుచున్నవి (వెదజల్లుచున్నవి).

రంభ మొదలైన అచ్చరలు అందరు చేరి ఆమె యెదుట గంభీరముగా నృత్యము సలుపుచుండిరి. వారి నటనా వైదుష్యమునంతయు ప్రదర్శించుచు ఆ దేవిని మేలుకొలుపు కొలువు సలుపుచున్నారు. పద్మదళాయతాక్షుడైన శ్రీవేంకటేశ్వరుని ఒయ్యారి భామ అయిన ఆదేవి మనోజ్ఞమైనది.

50 శ

రాగం : జంఝూటి

శరణు శరణు సురేంద్ర సన్నుత-శరణు శ్రీసతివల్లభా
శరణు రాక్షస గర్వసంహర-శరణు వేంకటనాయకా ॥శరణు॥

కమలధరుడును-కమల మిత్రుడు
కమల శత్రుడు పుత్రుడు,
క్రమముతో మీ కొలువుకిప్పుడు
కాచి నా రెచ్చరికయా ॥శరణు॥

అనిమిషేంద్రులు మునులు దిక్పతు
లమర కిన్నెర సిద్ధులు,
ఘనతతో రంభాది కాంతలు
కాచినా రెచ్చరికయా ॥శరణు॥

ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు
నిన్ను కొలువగ వచ్చిరి
విన్నపము వినవయ్య తిరుపతి
వేంకటాచల నాయకా ॥శరణు॥

భావామృతం :

దేవేంద్రునిచే సన్నుతింపబడెడి ఓ శ్రీనాధా! శరణు శరణు. ఓ రాక్షస గర్వనాశకా! శరణు శరణు. ఓ వేంకట నాయకా! శరణు శరణు.

విష్ణుమూర్తి, సూర్యభగవానుడు, చంద్రుడు,కుమారుడైన చతుర్ముఖుడు మీ యొక్క సన్నిధిని వరుసలో నిలిచి రక్షకులవలె హెచ్చరికగానున్నారు.

సురేంద్రుడు, మహర్షులు, దిక్పాలురు, దేవతలు,కిన్నెరులు, సిద్ధులు, ఆడంబరం ప్రదర్శించు రంభాది దేవకాంతలు, మొదలైన వారు వరుసలో హెచ్చరికగానున్నారు.

అగ్రగణ్యులైన ప్రహ్లాదుని వంటి ప్రముఖులు నిన్ను పూజించుటకు వచ్చిరి. ఓ తిరుపతి వేంకటేశ్వరా! మా మొరలను ఆలకింపుము ప్రభూ! శరణు శరణు.

51 ష

రాగం : లలిత

షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును సమర్పయామి ॥షోడశ॥

అలరు విశ్వాత్మకు ఆవాహనమిదే సర్వ
నిలయునకు ఆసనము నెమ్మినిదే
అల గంగా జనకునకు అర్ఘ్య పాద్యాచమనాలు
జలధిశాయికి నిమజ్జనమిదే ॥షోడశ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదే
సరి శ్రీమంతునకు భూషణములివే
ధరణీధరునకు గంధవుష్ప ధూపములు
తిరమిదే కోటి సూర్యతేజునకు దీపము ॥షోడశ॥

అమృత మథనునకు నదివో నైవేద్యము
గమిచంద్ర నేత్రునకు కప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునకు
తమితో బ్రదక్షిణాలు దండములు నివిగో ॥షోడశ॥

భావామృతం :

పదునారు కళలతో విరాజిల్లునట్టి స్వామికి పదునారు విధములైన షోడసోపచారములను జ్ఞానపూర్వకంగా నిత్యమూ సమర్పించెదము గాక!

విశ్వమంతయు వ్యాపించియున్న ఆత్మరూపునికి ఇదే ఆవాహనము,

చేయుచున్నాను. అన్నిచోట్లలో స్థితుడైయున్న స్వామికి ఆసనముప్రీతితో సమర్పించుచున్నాను. గంగకుజనకుడైన దేవరకు అర్ఘ్యపాద్యములను సమర్పించుచున్నాను. క్షీరసాగరశయనుడైన ఆ శ్రీమహావిష్ణువునకు నేనిదిగో నిమజ్జనము సేయుచున్నాను. (స్నానము చేయించుచున్నాను)

పీతాంబరుడైన విష్ణువునకు వస్త్రములతో అలంకరించెదను.లక్ష్మీకాంతునకు నగలను సమర్పింతును గాక! భూదేవీరమణునకు గంధము, పుష్పములు, సుగంధ ధూపములను సమర్పింతును గాక! కోటి సూర్యులప్రకాశము గల స్వామికి నిత్యము దీపమును సమర్పించుచున్నాను.

పాలసముద్రమధనమున అమృతము నిప్పించిన స్వామికి నైవేద్యము నర్పింతును.సూర్యచంద్రులు నేత్రములుగా గల దేవునికి కర్పూరతాంబూలము నిచ్చుచున్నాను. శ్రీవేంకటాద్రిపైవెలసిన జగన్నాధునికి ప్రీతితో ప్రదక్షిణములు,దండములు ఇవిగో, ఇదే చేయుచున్నాను.

52 స

రాగం : సామంత

సహజ వైష్ణవాచార వర్తనుల
సహవాసమె మా సంధ్య ॥సహజ॥

అతిశయమగు శ్రీహరి సంకీర్తన
సతతంబును మా సంధ్య
మతి రామానుజమతమే మాకును
చతురతమెరసిన సంధ్య ॥సహజ॥

పరమభాగవత పదసేవనమే
సరవినెన్న మా సంధ్య
సిరివరు మహిమలు చెలువొందగ వే-
సరక వినుటే మా సంధ్య ॥సహజ॥

మంతుకెక్క తిరుమంత్ర పఠనమే
సంతతమును మా సంధ్య
కంతు గురుడు వేంకటగిరి రాయని
సంతర్పణమే మా సంధ్య ॥సహజ॥

భావామృతం

వైష్ణవ సిద్ధాంతములను నమ్మి శ్రీమన్నారాయణుని శరణు పొందినవానికి ఆ వైష్ణవులతో 'సహవాసము' చేస్తూ జీవించుటయే సంధ్య (సంధ్య వార్చుట), అను సంధ్యావందనము.

మా వైష్ణవులకు నిరంతరమూ శ్రీహరి నామ సంకీర్తన విశిష్టముగా చేయుటయే సంధ్యావందనము. త్రికరణ శుద్ధిగా శ్రీరామానుజాచార్యులవారి మతము (విశిష్టాద్వైతము) నవలంభించుటయే, మాయొక్క నేర్పరితనం చాటునటువంటి సంధ్య.

శ్రీమన్నారాయణుడే సర్వస్వం అని సద్బుద్ధితో సన్మార్గంలో జీవించే పరమ భాగవతోత్తములను గురువులుగా గౌరవించుచూ వారి పాదసేవనము చేస్తూ ఒక పద్ధతిగా జీవించుటయే నిజమైన సంధ్య. శ్రీపతియైన శ్రీహరి యొక్క దివ్యమహిమల గురించి విసుగులేకుండా శ్రద్ధగా వినుటయే మాకు సంధ్యావందనము.

ప్రసిద్ధికెక్కిన "ఓం నమో నారాయణాయ అను పవిత్ర అష్టాక్షరీ మంత్రమును త్రికరణ శుద్ధిగా ఎప్పుడూ జపించుటయే మాకు సంధ్యావందనము. మన్మధుని జనకుడైన వేంకటాద్రి సర్వేశ్వరుడు శ్రీవేంకటేశ్వరుని సంతర్పణ (తృప్తిగా సేవించుట) యే మా విశిష్టాద్వైతులకు నిజమైన సంధ్యావందనము. అంతేగాని భక్తిలేకుండా ఏదో ముక్కునపెట్టుకొన్నది చీదినట్లు, ప్రొద్దు పొడుచుటకు ముందు అయిదు ఘడియల కాలము, సూర్యుడు నడినెత్తిన వున్నప్పుడు, ప్రొద్దుగ్రుంకిన వెనుక మూడు ఘడియలు భగవంతునికి నమస్కరించుట (ప్రార్థించుట) మాత్రమే ఎన్నటికీ సంధ్యావందనము కాదు.

53 హ

రాగం జోన్‌పురి

హరినామమే కడు ఆనందకరము
మరుగవో మరుగవో మరుగవో మనసా ॥హరి నామమే॥

నళినాక్షుని శ్రీనామము
కలిదోషహరము కైవల్యము
ఫలసారము బహుబంధమోచనము
తలచవో తలచవో తలచవో మనసా ॥హరి నామమే॥

నగధరునామము నరకహరణము
జగదేక హితము సమ్మతము
సగుణ నిర్గుణము సాక్షాత్కారము
పొగడవో పొగడవో పొగడవో మనసా ॥హరి నామమే॥

కడగి శ్రీ వేంకటపతి నామము
బడి బడినే సంపత్కరము
అడియాలంబిల నతిసుఖమూలము
తడవవో తడవవో తడవవో మనసా ॥హరి నామమే॥

భావామృతం

హరినామస్మరణ మొక్కటే మిక్కిలి ఆనందమును కూర్చునది. కనుక ఓ మనసా! నీవు నామము కలిగించు ఆనందమును అదే యావగా పొందుము. మరల మరల పొందుము.

మంగళకరమైన ఆపద్మదళాయ తాక్షుని నామము కలిపురుషుని చేప్రాప్తించు దోషములను హరించి వేయును, మోక్షమునందించును. ఆ నామము పుణ్యఫలము యొక్క సారమైయున్నది. అనేకములైన బంధములను సడలించునది కూడ హరి నామమే. ఓమనసా ఆనామమును స్మరించుము. మరల మరల స్మరించుము.

గోవర్ధన గిరి నెత్తిన ఆ శ్రీహరినామము నరకమును నివారించునదైయున్నది. విశ్వమున కంతటికి ఈనామము మేలు కలిగించునది. సర్వులకు సమ్మతమైనదియు ఈనామమే. సుగుణ నిర్గుణ రూపుడైన పరమాత్ముని సాక్షాత్కరింప చేయునదియు ఈ నామమే. ఓమనసా! అట్టి నామమును స్తుతించుము. మరలమరల స్తుతించుము.

యత్నించి వేంకటేశ్వరుని నామము నాశ్రయిస్తే అతి శీఘ్రముగా సంపదలను వెలయ జేస్తుంది. గురుతుగా సుఖాలవాల మైన నామమును ఓమనసా వెదకరాదా మరల మరల యత్నించి వెదకరాదా!

54 ళ

ఆ.వె॥ 'ళ' యను అక్షరంబు రాదు మొట్టమొదట
ఆంధ్రభాష పదములందు లేదు
అన్నమయ్య గీత మదియెట్లు తెలిపెద
సప్తగిరి నివాస సాధు వినుత!

భావామృతం

ఆంధ్ర భాషలో 'ళ' తో మొదలయ్యే పదమేలేదు. సాధు జనులు కీర్తించు సప్తగిరీశా! అన్నమయ్య కీర్తన ఎట్లా వుంటుంది? మరి ఇంక ఇదే దారి తండ్రీ!

55 క్ష

రాగం : మోహన

క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరాబ్ధి॥

చరణ కిసలయములకు సకియ రంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు అతివ నిజనాభికిని
నిరతి నానావర్ణ నీరాజనం ॥క్షీరాబ్ధి॥

పగటు శ్రీవేంకటేశు పట్టపు రాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

భావామృతం

క్షీరసాగరమున జన్మించుటజేత క్షీరసాగరకన్య అయిన శ్రీమహాలక్ష్మికి పద్మవాసిని అయిన అలమేల్మంగమ్మకు మంగళహారతులివిగో!

పద్మనేత్రియైన పద్మావతీ దేవి యొక్క వదనమునకు జక్కువపిట్టలను బోలిన స్తనయుగ్మముపై అంటిన కర్పూరముతో వెలసిన కర్పూర నీరాజనమిదియే. ఈ అలినీలకుంతల (నల్లనిముంగురులు గల రమణి) చక్కటి కొప్పునకు, కమలముల వంటి (తామరపువ్వుల వంటి) చేతులకు మాణిక్యములతో నిలిచిన నీరాజనము ఇదే.

చిగురుటాకులవంటి పాదములకు, అరటి బోదెల బోలిన ఊరువులకు ఆసక్తితో నొసంగు ముత్యాల మంగళహారతి ఇదియే. దుస్సహమైన మొలకు, హరినారి నాభికీ పలువన్నెల మంగళహారతి సమర్పింతుము.

అలంకారములచే ప్రకాశించు శ్రీవేంకటనాథుని పట్టపు రాశి ఈ అలమేల్మంగమ్మ. పదునారు కళలతో వర్ధిల్లు ఈ సతి శ్రీమహాలక్ష్మి యొక్క దివ్య రూపమే కదా! లోకమాతయైన ఈమెకు భక్తి పూర్వకమైన నీరాజనము ఇదివో. లోకాలను పరిపాలించే మా తల్లి అలమేల్మంగమ్మ సౌందర్యమునకు విస్తృతమైన మంగళ నీరాజనములను సమర్పించుచున్నాను.

56 అ

అట్టు సేయక రావె యిట్టె నీవు
గట్టిగా వచ్చేవంటాఁ గాచుకున్న వాఁడు ॥పల్లవి॥

చెలిమి చేసినవారు చేతికిలోను గావలె
చలములు సాదించ సంగతిగాదు
వలచిన వారలు వద్దఁ బాయకుండవలె
పొలయలుకలు చూపఁ బొసఁగ చెప్పుడును ॥అట్టు॥

సరస మాడేటివారు సమ్మతించి వుండవలె
నెరసులు పట్టేది నేరుపుగాదు
మరుతంత్రములవారు మంతనాన నుండవలె
విరసాన రచ్చలుంటే వేడుక గాదు ॥అట్టు॥

వొడఁబాటు గలవారు వొద్దికతో నుండవలె
అడియాసలఁ బొరలే దందము గాదు
అదరి శ్రీ వేంకటేశుఁడలమేల్మంగవు నీవు
తడియక కూడితివి తగులాయ మోహము ॥అట్టు॥

భావామృతం

ఓ నెచ్చెలీ! నీవు అట్టు సేయక (నిందించకుండా) యిట్టే నీ ప్రియుని వద్దకు రావే. నీవు గట్టిగా (ధృడ నిశ్చయంతో) వచ్చెదవా అని ఆ కాచుకొని యున్నవాడు అనుమానిస్తాడు. కావున త్వరపడు.

పురుషులతో చెలిమి చేసిన వారు, వారి చేతిలో లొంగి వుండవలసి వస్తుంది. "చలములు సాధించ సంగతి కాదు" పట్టుదలలకు పోకూడదు. వలచిన వారిని యెన్నడూ వదలియుండరాదు. ఎప్పుడూ, పొలి యలుకలు చూప (రుస రుస లాడుట) పొసగదు (సరిపోదు).

సరసములాడుకొనే ప్రేయసీ ప్రియులు ఒకరిమాట ఇంకొకరు వినుటకు సిద్ధపడి వుండాలి. "నెరసులు పట్టేది" (ఒకరి తప్పులింకొకరు యెత్తి చూపటం), నేరుపు కాదు (తెలివైన పనికాదు). మరు తంత్రములవారు (శృంగార తంత్రములు వాడదలచినవారు) మంతనాలనుండవలె (ఒకరితో ఇంకొకరు మాట్లాడుకోవాలి గాని పోట్లాడుకోరాదు). సరసం విరసంగా మారి బజారుకెక్కారంటే అది మీకు సంతోషం కాదు కదా!

పరులసొమ్మునాసించువారు వినయ విధేయతలతో వుండవలెను. వారు అడియాస (ప్రత్యుపకారము జరుగుతుందనే ఆశతో) బొరలిన (వ్యవహరించుట) అందమైన పనికాదు. అలమేలుమంగవైన నీవు శ్రీ వేంకటేశ్వరునితో, అదరి (అతిశయించి) తడయక (తడబడకుండా) కూడినావు. ఇక మోహములు తగులాయెను (ఆసక్తికరములైనవి).



శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



అన్నమయ్య అధ్యాత్మ చింతన

ఎన్నుకొన్న

అధ్యాత్మ కీర్తనలకు

అవతారిక మరియు భావ వివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

అన్నమయ్య అధ్యాత్మ చింతన

మొదటి ప్రచురణ

జూన్ 2012

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె. వి. ఆర్

98495 79345

అంకితము

అహోబల లక్ష్మీ నరసింహునికి

ఆ.వె ॥ అన్నమయ్య కిష్టదైవమై అలరారి
ఉర్విగాచుచున్న ఓబులేశు –
కిత్త అంకితమ్ము నిందిరమ్మను గూడి
బ్రోచుగాత జనుల పుడమియందు.

అన్నమయ్య అధ్యాత్మ చింతన

ఎన్నుకొన్న అన్నమయ్య కీర్తనలకు

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పేజి
1.	అంగడినెవ్వరు నంటకురో	15
2.	అంతరుమాలినయట్టి అధములాల	47
3.	అందాకా నమ్మలేక అనుమానపడుదేహి	95
4.	అక్కరకొదగినయట్టి	13
5.	అచ్చుతు కృపా లబ్ధమదియు గాక	157
6.	అటుకొన్నాళ్ళందాకా	121
7.	అతని నడుగవో చిత్రగుప్త	163
8.	అనలము సూర్యుడు నన్నిటందు వెలసినా	179
9.	అన్నిటా శ్రీహరిదాసుడగువానికి	71
10.	అన్నిటికినొడయడవై	63
11.	అణుమాత్రపు దేహినంతే	147
12.	అమ్మెడిదొకటి అసిమలోదొకటి	5
13.	అయ్యో మాయలబొంది అందునిందు నున్నవారు	39
14.	ఇంతగాలమాయను ఏడనున్నారో	135
15.	ఇంతేపో వారివారి హీనాధికములెల్ల	87
16.	ఇందుకా కోరిపుట్టె యిట్టి బతుకు	189
17.	ఇట్టియవివేక బుద్ధి యేపనికివచ్చు	151

18.	ఇట్టెమమ్ము రక్షించుట యేమిదొడ్డనీకు	185
19.	ఇతరుల దూరనేల యెవ్వరూ నేమిసేతురు	73
20.	ఇత్తడి బంగారుసేయ నింతకు నేరుతునంటా	25
21.	ఇది యరుదనునొకడిది యరుదనిచెప్పు	177
22.	ఇద్దరూ దేహ సమ్మంధమిదివో	55
23.	ఈ జీవునకు నేది గడమల తనకు	139
24.	ఉమ్మడి కర్మములాలవుండజోటు	197
25.	ఊరకే వెదకనేల వున్నవి చదువనేల	159
26.	ఎంత కఠినమో హృదయమిది	83
27.	ఎటువంటి వెఱ్ఱినో యేమని విన్నవింతు	161
28.	ఎట్టి విజ్ఞానమేటి చదువు	21
29.	ఎట్టగెలుతు బంచేంద్రియముల	99
30.	ఎట్టు మోసపోతినేను యివియెల్ల	91
31.	ఎన్నడు పక్వముగాదిదె	19
32.	ఎన్నాళ్ళున్నానిట్టేకదా	101
33.	ఎవ్వరుగర్తలుగారు యిందిరానాథుడే కర్త	7
34.	ఎవ్వరు గలరెవ్వరికి	193
35.	ఏదియును లేనిదేటిజన్మము	37
36.	ఏమని పొగడవచ్చు నిటువంటి	85
37.	ఏమిసేయువాడ యివి విరసమొకటొకటి	105
38.	ఏమిసేయగలవారము యెందుకు నౌదుము	145

39. ఏమిసేయగలవాడ నిదివో నేను 153
40. ఏమీనెఱగనినాడు యిటునిన్ను 75
41. ఏమిసేసేమిక నేమునెంతని 59
42. ఏమిసేతు దైవమా యెన్నడు గరుణించేవో 65
43. ఏమియుజేయగ వద్దు యింతలోనె మోక్షము 31
44. ఏనోరువెట్టక నిన్ను నేమని కావుమందును 89
45. ఏ వుపాయములు మాకిక బనికి రావు 173
46. ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము 169
47. ఓహో వొడలు మాని వొపికగడుమేలు 109
48. జేలేనేనొక పనికి నవుదు నీకును 115
49. కటకటా యిటుచేసె గర్భబాధ 3
50. కటకట యీమాయ గడచుట 199
51. కలలోని సుఖమే కలియుగమా 29
52. కలిగిననాడే చుట్టరికంబులు 149
53. కోటికి బడగయెత్తికొంకనేల 111
54. గొరబైమొదలుండి గొనలకు నీరేల 171
55. చింతలు రేచకుమమ్ము చిత్తమా 97
56. చెప్పబోతే యీ యర్థము 127
57. చెప్పినంతపని నే చేయగలవాడ 129
58. చెల్లనెక్కికొంటివిగాజీవుడ 67
59. చెల్లబో తియ్యని నోరజేదేటికి 57

60. ఛీఛీ వోబదుకా సిగ్గులేని బదుకా 33
61. జీవుడనేనొకడను సృష్టికి గర్తవు నీవు 165
62. తానేతెలియుగాక తలచగనెట్టు వచ్చు 187
63. తెలియుటయెన్నడు దేహితనంతట 113
64. దైవమా నీవు మమ్ముదయ దలచుట గాక 79
65. దోమటి నింతెరగరా తొల్లిటివారు 181
66. నన్నునింతగా గడించ నాయమా 49
67. నాకు నందుకేమివోదునన్ను 51
68. నాకు నాకే సిగ్గాయెనయ్యా 191
69. నారాయణ నీనామ మహిమలకు 133
70. నీవెంత నేనెంత నీకు నాకునెంత 93
71. నీవువెట్టినట్టి చిక్కు నీవే తెలుపవలె 167
72. నీవెటు దలచిన నిఖిలము 137
73. నీవే యంతర్యామివి నీవు వున్నదే వైకుంఠము 141
74. నీవే సేసినచేత నీవే చేకొనుటింతే 175
75. నేనేమిసేయుదును నీవు నాలోపలనుండి 11
76. పంతపుటాసలుబండ్లరాగా 103
77. పొందగు 'నాత్మాపుత్రనామ' మను 107
78. పరమపాతకుడ భవబంధుడ 27
79. పరులకైతే నిదే పాపము గాదా 45
80. పాటెల్ల నొక్కచోనుండు భాగ్యమొక్కచో 81

81. పావనముగావో జిహ్వా 201
82. పెరిగిపెద్దగాను మరిపిన్నవాడుగాను 155
83. ప్రపన్నులకునిది పరమాచారము 41
84. బాపురే నీమాయ భ్రమయించీ 119
85. బోధకులెవ్వరూ లేక భోగినైతి 35
86. మరిగితి నేమిసేతు మగిడినేనెందువోదు 183
87. మఱిహరిదాసుడై మాయల జిక్కువడితే 43
88. మాకు నేమీబని గాదు మరి ఏమి 125
89. మాపులే మరణములు రేపులే పుట్టువులు 77
90. మాయా మోహము మానదిది 131
91. ముచ్చుగన్నతల్లి చేరిమూలకు 17
92. వట్టిజోలి యెంతలేదు 195
93. విత్తొకటి వెట్టగాను వేఱొకటి 123
94. విభుడ వింతటికీ వెరవుతో 61
95. వెడమంత్రమికనేల? 9
96. సేయనివాడెవ్వడు చేరి చిల్లరదోషాలు 53
97. సొగియునా మఱియు ముచ్చుకు బండు వెన్నెలలు 23
98. శ్రీపతి యొకడే శరణము మాకును 143
99. శ్రీహరి చేసిన చిహ్నలివి 1
100. హరి నీవు మాలోన నడుగుటరుదు 117
101. హరిభక్తి వోడయెక్కినట్టి వారలే 69

ప్రార్థన

ఉ॥ శ్రీహరి మాయలోదగిలి చిత్త వికారపు సుళ్ళ జిక్కితిన్
దాహము తీరదాయె తలదాల్చకపోతిని దైవ చింతనన్
మోహము పాశమై బిగిచి ముందరి కాళ్ళకు బంధమాయెరా
దేహములో స్థితుండయినదీ హరియేనని నేర్వనైతిరా

శా॥ ఔరా! శ్రీహరి మాయనేర్వనగునే ఆ శూలికైనన్ భళా!
శ్రీరాముండయి గాచు మమ్ము తృటిలో జేబూని కోదండమున్
పోరాడే నరసింగమౌను తునుమున్ భూభారమౌ దైత్యులన్
మారేడై తిరువేంకటాద్రి విభుడై మాదిక్కు మొక్కొనురా

కం॥ ఆత్మనెరుంగను, యిక న –
ధ్యాత్మజ్ఞానంబుయెట్లు అలవడునయ్యా!
ఆత్మారాముని వలె పర –
మాత్మా! నడిపించవయ్య! ఆంగజగురుడా!

మ.కో॥ నిన్నలేదిది రేపువుండదు, 'నేను' అన్నది నిత్యమా?
అన్ని నాకను లోభమాగదు ఆశ చావదిదేమిరా?
మన్నులో కలిసేది దేహము 'మాయ' అంతుకు చిక్కదే?
వెన్నడౌ తిరువేంకటేశుని వేడరాదటె చిత్తమా!

ఆ.వె॥ హరిని శరణమనక అధ్యాత్మ చింతన
అవని నరులకెపుడు అమరబోదు
హరికృపనెరిగినను అమరును మోక్షంబు
అనెను అన్నమయ్య అది నిజంబు.

తే॥ కొమి కాకున్న మోక్షంపు గడప ద్రొక్క
కాదు సాధ్యంబనిరి పెద్దలదియు నిజమె,
అవిసినవి యాసలణగారె జీవితేచ్ఛ
హరియె దిక్కుమొక్కనినాడు అమరవాది.

కం॥ వదలిన నిశ్శ్వాసంబును
పదిలముగా లోగొనంగబడునో! లేదో!
అది యెవ్వడెఱుగజాలడు
తుది శ్వాసగు నీవు గొనక తోయజనాభా!

చం॥ అవనిని గాచినావు కద! హస్తిని బర్వులు వెట్టుచున్ భళా!
అవనిజ జానకీపతిగనయ్య! సురాంతకుడైతివో ప్రభూ!
అవనికి పీడయౌ! నృపులనంత మొనర్చిన కృష్ణమూర్తి ! ఈ
భువినిటు వేంకటాద్రి దరి మోక్షపు బాటల బెట్టినావురా!

మ॥ వనజాతాక్షుడు పద్మనాభుడితడే పాకారి సంస్తుత్యుడున్
ఘన ఇందీవరశ్యాముడున్ హరియు శ్రీకాంతుండు భూనాథుడున్
ముని వంద్యుండు మురారి శంభునుతుడున్ ముక్తీవధూటీ ప్రియున్
మన శ్రీవేంకటరాయునెంచగలరే మార్తాండ బ్రహ్మాదులున్!!

కం॥ వలపులు, సొలపులు, అలుపులు
వెలవెల పొలయుటలు, కలల బేలలగుటయున్
వలవల విలవిల రగులుట,
కలతల కనుమూయుటెల్ల 'కలియుగ' మాయే!!!

సీ॥ వరదహస్తము జూపి వరుసగా సిరులిచ్చి
కొండలరాయుడై కూడినావు
అభయహస్తముజూపి అణచిభయములన్ని
తిరుమల రాయుడై తేలినావు
వడ్డికాసులు గుంజు వనజనాభుడవీవు
శంఖచక్రంబుల శౌరివీవు
శృంగార రాయుడౌఅంగజగురుడీవు
అలమేలుమంగమ్మ వలపు పంట

ఆ.వె॥ అన్నమయ్య యిచ్చె హరిపాట హరి బాట
అతనిదారి బట్టి హితవుదెలిసి
సులువు బాట బట్టి చెలగి నానుర హరీ!
వెతలు వెఱపు దీరె వేంకటేశ!

ముందుమాట

తాళ్ళపాక అన్నమాచార్యుల వారిపై యెనలేని భక్తి ప్రపత్తులు కలిగి నేను ఇదివరలో ఆయన కీర్తనలలో కొన్నింటిని ఎన్నుకొని మున్నుడి సహితముగా భావామృతము నందించాను. దినమున కొక్క కీర్తన చొప్పున సాగించిన ఆయజ్ఞంలో 606 కీర్తనల తరువాత నావల్ల కాదేమో అని భావించాను. అప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానములవారు అందులో 101 కీర్తనలున్న సంపుటి-5 ముద్రించుటకు 30,000 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తాము అనగానే శ్రీ వేంకటేశ్వరుడే నన్ను మెచ్చినట్లు తలచి ఈ జన్మకిది చాలుననుకున్నాను.

దానిపేరు "భావయామివేంకటేశమ్."

కాని నా కృషి ఆపలేదు. దినమున కొక్కటి చొప్పున అన్నమయ్య శృంగార కీర్తనలనెన్నుకొని 'ఏలుకో శృంగారరాయా'! అనే పేరుతో మరియొక 101 కీర్తనలనెన్నుకొని ఉపోద్ఘాతముతో కూడిన తాత్పర్యము నందించాను. ఇది క్లిష్టతరమైన ఉద్యోగమే అయినను, ఆ సప్తగిరీశుని దివ్యానుగ్రహంతో నేనెన్నడూ వినని మాటలకు (నిఘంటువులలో లేని మాటలకు) కూడా అర్థం స్ఫురించేది. ఇది భగవద్సాక్షిగా నేను చెప్పే నిజం. అన్నమయ్య సరసశృంగార కీర్తనల 'పచ్చితనం'లో భక్తిని, ఆత్మ పరమాత్మల సంగమంగా చూడగలిగితే దానిలో బూతు కనబడదు. ఆత్మోద్ధారణ కనబడుతుంది. 101 రోజులపాటు సాగిన ఆ 'కామయాగం'లో నాకు ఒక్కరోజు కూడా స్త్రీ పురుషుల కూటమి కనబడలేదు. ఆత్మ పరమాత్మల కలయికే కనబడింది.

అటుతరువాత అన్నమాచార్యుల వారి ఆధాత్మ కీర్తనలకి అవతారికతో కూడిన భావ వివరణ వ్రాయాలనే సంకల్పం కలిగింది. ఇదిగో మీ చేతిలో వున్న 'అన్నమయ్య అధ్యాత్మచింతన' అవతరించింది. ఇవికూడా

దినమునకొక్కటి చొప్పున 101 కీర్తనలు చేయాలని నా సంకల్పం. మరి ఆ తిరువేంగళప్ప నన్ను ఎట్లా అనుగ్రహిస్తాడో – ఏమో.

అసలు అధ్యాత్మ కీర్తనలంటే ఏమిటో అన్నమయ్య మనుమడు చినతిరుమలయ్య పద్యం వినండి.

కం॥ దేహాత్మేశ వివేకో –
త్సాహంబును లోకవేద ధర్మాధర్మా –
ద్యూహాపోహంబుల గల –
యా హరి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్

తా॥ దేహము, ఆత్మ, ఈశ్వరుడు – అను ఈ మూడింటి యొక్క వివేకము నెరుంగుట, లోకములో ఆచరించబడుచున్న ధర్మములు మరియు వేద విహితమైన ధర్మము, అధర్మములు వాటినర్థం చేసికొనుటలో కలిగే ఊహలు మరియు అపోహలు విడమరచే శ్రీహరి సంకీర్తనలే అధ్యాత్మకీర్తనలు.

"మార్జాల"మంటే ఏమిటంటే "బిడాలము" అననట్లు వున్నది కదా! ఇదంతే.... మనకు అర్థమయ్యేట్లు చెప్పుకోవాలంటే కొంత మన స్వంత అభిప్రాయాలు దూరి ఇంకా చిక్కు పడే ప్రమాదం వున్నది. అయినా నా ప్రయత్నం నేను చేస్తాను. తల్లికడుపులోంచి పుట్టి, పెరిగి, జీర్ణించి, నశించుటయే వ్యాపారంగా లోక తంత్రం నడుస్తున్నది. పైన చెప్పిన దశలన్నీ మనకి కలిగాయని మనం అనుకొంటున్నాం కాని అవి కలిగినది మన శరీరానికి మాత్రమే. దాన్నే దేహం అంటున్నాం. ఈ దేహంలో పరమాత్మ యొక్క అంశ ఆత్మవలె ప్రవేశిస్తుంది. అది చైతన్యం. వికారములులేని నిర్మలానందమూర్తి. అద్వైతసిద్ధి పొందగలిగితే ఆ ఆత్మ తానే పరమాత్మ అని గ్రహిస్తుంది. ఈ శరీరం వదలిన తరువాత ఆ స్థితిని చేరుకొంటే అదే మోక్షం అంటే. ఆ స్థితి చేరుకోకపోతే ఏం జరుగుతుంది? మనం ఈ పుట్టుకలో చేసిన మంచీ చెడుల పర్యవసానం (Resultent)

మన కర్మఫలంగా మనకు జమ అవుతాయి. మన గత జన్మలలో అనుభవించగా మిగిలిన పూర్వ కర్మఫలం దీనికి కలిసి ఒక సంప్రాప్త కర్మఫలంగా మన ఆత్మకు తోడవుతుంది. దీన్ని అనుభవించక తప్పదు గాక తప్పదు.

ఈ కర్మఫలం Positive అయితే మంచి జన్మలు, Negative అయితే నీచజన్మలు కలుగుతాయి. అందుకే ఒకే విధంగా పుట్టి ఒకేచోట ఒకే విధంగా పెరిగిన ఇద్దరు సహోదరులలో ఒకడు కోటీశ్వరుడవుతున్నాడు ఇంకొకడు నికృష్టుడవుతున్నాడు. ఇది ఒక చక్రబంధం. దీని నుండి విముక్తి కావాలంటే ఆ పరమాత్మకు మన ఆత్మపై కృపకలగాలి అప్పుడు ఆయన మనకు ఆత్మజ్ఞానం అందిస్తాడు. మన అజ్ఞానం నశించి మన ఆత్మ సాక్షాత్కారమవుతుంది. మనం జీవించియున్నా రాగద్వేషాతీతులమై భవబంధవిముక్తులమై సచ్చిదానందస్థితిలో వుండిపోతాం. దాన్నే జీవన్ముక్తి అంటారు.

దాన్ని పొందాలంటే సులభోపాయం అధ్యాత్మ చింతన, విరక్తి, శ్రీహరిశరణాగతి. ఇది చెప్పినంత తేలిక కాదు. ఎందుకంటే ఆస్థితిని వివరించలేం అనుభవించాలి. ఎవరెస్టు పర్వతం ఎలా ఎక్కాలో చదివి తెలుసుకున్నవానికీ నిజంగా ఎక్కినవానికీ ఎంతో తేడా వున్నట్లే అనుభవించని ఆత్మానందం శుద్ధ నిరుపయోగం. అయితే ఎవరెస్టు ఎక్కాలంటే ఎక్కడో అక్కడ మొదటి అడుగు వేయాలి కదా!

ఈ పుస్తకం మొదటి కీర్తన చదువగానే మనం మన ఆత్మశోధనలో మొదటి అడుగు వేశాం అన్నమాటే. అదే అన్నమయ్యమాట. ఇక అనండి శ్రీవేంకటేశమ్ శరణంప్రపద్యే...

అన్నమయ్య కీర్తనలకే కాదు అనేకమంది దివ్యుల స్తోత్రాల కోసం..

Please Visit my website : www.geetadeeksha.com

అధ్యాత్మ సంకీర్తనలు

సంపుటి: 1 కీర్తన : శ్రీహరి చేసిన చిహ్నాలివియూ
సంఖ్య : 406 పుట : 272 రాగం: పాడి

పాడి

1. శ్రీహరిసేసిన చిహ్నా లివి యూ –
మొహము విడుచుట మోక్ష మది ॥ పల్లవి॥

మలినం బేది మణుగననేది
కలుషపుమలముల కాయ మిది
కలిగిన దేది కడు లేందేది
చలనపుమాయలజన్మ మిది ॥ శ్రీహ ॥

తనిసిన దేది తనియనిదేది
దినదిన మాకలి దీరదిది
కొన యిందేది గుఱి మొదలేది
పనిగొనుకర్మపుబంధ మది ॥ శ్రీహ ॥

నిండినదేది నిండనిదేది
కొండలపొడవులకోరి కది
అండనె శ్రీ వేంకటాధిపు శరణని
వుండుటె యిహపరయోగ మది ॥ శ్రీహ ॥ 406

అవతారిక:

అన్నమాచార్యులవారి చక్కటి అధ్యాత్మ కీర్తనతో ఈ సాహితీ యజ్ఞం మొదలుపెడదాం.. అధ్యాత్మకీర్తనల బాహ్యార్థము ఒకటైతే అంతరార్థం వేరొకటిగా వుంటుంది. మనము ఆ గూఢార్థం అరయగలిగితే కీర్తన వైశిష్ట్యం తెలుస్తుంది. సంసారము మోహముచే జనించి మోక్షముతో పరిసమాప్తమవుతుంది. కాని మోహమును విడువకుంటే యేనాటికీ

అంతం కాదు. కాని దీని చిహ్నాలు (గుర్తులు) చేసిన దెవరు? ఇంకెవరు ఆ శ్రీహరియే. ఇది ఇలా వుంటుందని నిర్దేశించినదెవరు? ఆ శ్రీహరియే. మరి ఆ శ్రీవేంకటేశ్వరుని శరణనకుండా ఈ మోహంలోనుంచి బైటపడగలమా? కల్ల....

భావ వివరణ:

మానవునికి కలిగిన మోహము శ్రీహరిమాయవలన కలుగుతున్నది. ఆ మాయవలననే మానవుడు జన్మల చక్రబంధంలో చిక్కి కర్మలలో తగలి మోక్షమునరయలేడు. ఇవి శ్రీహరి చేసిన గుర్తులు.

మలినము అంటేయేమిటి? మణుగు (మరుగు విసర్జనము) అంటే యేది? మరి ఈ కాయము (శరీరము) కలుషితమైన మలముతో నిండినదే కదా! అసలు "ఉన్నది" అని అంటున్నది దేనిని? "లేదు" అని దేనిని అంటున్నాము? అనునిత్యం చలనపు మాయల (మార్పుచెందే మాయతో నిండిన) జన్మమే ఇది. అందుకే మనం మాయాబద్ధులం.

మనలో వుండి తనిసినదేది? (తృప్తిపడునది యేది?) తనియనిదేది? (తృప్తి జెందనివాడు ఇంకా ఇంకా కావాలి అనేవాడెవడు?) మనకు రోజురోజుకీ ఆకలి యెందుకు తీరకుండా మళ్ళీ మళ్ళీ పుడుతున్నది? కర్మబంధంలో చిక్కి పనిగొని (కావాలని) కర్మల పరంపర చేస్తూ జీవిస్తున్నాం. ఇక మరి యిందు (ఇందులో) కొనయేది (చివరిది అనేదేది?) గుఱి మొదలేది (సరియైన ఆరంభం యేది?) లేనేలేదు.

మానవునికి కలిగే కోరికలు కొండల పొడవులు (పర్వతాల యెత్తంత అనంతమైనవి). ఇందులో నిండినదేది నిండనిదేది? (తీరినది యేమిటి తీరనిదేమిటి?) ఒక కోరిక తీరితే ఇంకొక కోరిక పుడుతూనే వుంటుంది కదా! మరి తరుణోపాయమేమిటి? శ్రీవేంకటాధిపుని శరణుజొచ్చి ఆయన అండనే (రక్షణలోనే) వుండుటే. అదొక్కటే ఇహపరయోగము (జీవించియున్నప్పుడు భుక్తిని, మరణించాక ముక్తిని ఇచ్చే దివ్యమైన ఉపాయము.)

సంపుటి : 1 కటకటా యిటుచేసె గర్మబాధ
సంఖ్య : 239 పుట : 160 రాగం: సామంతం

సామంతం

2. కటకటా యిటుచేసె గర్మబాధ
యెటువంటివారికిని నెడయదీ బాధ ॥ పల్లవి ॥

దినదినము ప్రాణులకు దీపనముచే బాధ
తనుపోషణములు కందర్పబాధ
మనసుశాంతికి సదా మమకారముల బాధ
తనివోనికోర్కులకు దైవగతి బాధ బాధ ॥ కట ॥

వెడయాసచూపులకు వేడుకలచే బాధ
కడువేడ్కలకు వియోగముల బాధ
తొడవైన యెఱుకలకు దురితబుద్ధుల బాధ
జడియు బరచింతలకు సంసారబాధ ॥ కట ॥

అరిది నిశ్చయమతికి ననుమానములబాధ
సరిలేనిజీవులకు జన్మబాధ
తిరువేంకటాచలాధిపునిగని మని కొలుచు –
వెరవుచేతనెకాని వీడదీ బాధ ॥ కట ॥ 239

అవతారిక :

"కటకటా" అంటే నేటికాలంలో "అయ్యయ్యో" అనడం. కర్మల వలన కలిగే బాధ (పీడ) యిటు (ఈ విధంగా) చేసింది కదా! అని వాపోతున్నారు అన్నమాచార్యులవారు. బాధపడని ప్రాణిలేదు. అమ్మకడుపులో వుండటం ఒక నరకం. బయటకు వచ్చాక తనకి తను యేమీ చేసికోలేని దైన్యస్థితి. జీవించడంలో రకరకాల బాధలు. మరణబాధ చెప్పవలసిన పనియేలేదు. మరి ఈ బాధ యెలా పోతుందయ్యా? ఏమో దీనిని చదివి తెలుసుకోండి. ఎందుకంటే ఈ బాధ ఎటువంటివారికైనా తప్పదుగాక! తప్పదు.

భావ వివరణ :

కటకటా (అయ్యయ్యో!) కర్మబాధ (నేను చేసిన పనులవల్ల కలిగిన బాధ) ఇటుచేసె (ఈ విధముగా చేసినది కదా!) ఈ బాధ (వేదన) ఎటువంటివారికైనా తప్పదు కదా!

దినదినము (ప్రతిదినమూ) ప్రాణులకున్ (జీవులన్నిటికీ) తీపనము (తీపురము... అయివుండవచ్చు.... తీపురము అంటే ప్రమాదము అని అర్థం) చేత బాధ, తను పోషణముల (శరీరాన్ని పోషించుకున్నందువలన) కందర్ప బాధ (కామవాంఛలు కలిగి పీడిస్తాయి). దాని వల్ల మమకారము (నాది నాది అనే భావన) కలిగి అది మనశ్శాంతికి పీడగా పరిణమిస్తుంది. తనివోని (తృప్తిపడని) కోర్కెలు ఈ మమకారంవల్ల కలుగుతాయి. కాని దైవగతి (దేవుని నిర్ణయం) ఎలా వుంటుందో ఎవ్వరికీ తెలీదుకదా! అందుకని ఈ కోర్కెలకు ఆ దైవగతియే పీడ.

వెడయాస చూపులకు (తుచ్ఛమైన కోర్కెలతో చూసేవారికి) వేడుకలు (సంతోషం కోసం వెంపర్లాడి) బాధ కలుగుతుంది. ఆ అంతులేని వేడుకలు ఆగిపోక తప్పదు కదా! ఆ వియోగపు బాధ వేడుకలకూ తప్పదు. అప్పుడు కొంత ఎఱుక (జ్ఞానం) కలుగుతుంది. తొడవైన (మంచిదైన) ఆ జ్ఞానానికి దుర్బుద్ధి పీడగా పరిణమిస్తుంది. దాని వలన సంసార తాపత్రయం కలిగి పరచింతకు (ముక్తిపై కోర్కెకు) పీడ అవుతుంది.

ఇది ఇలా వుంటే... నిశ్చయమతికి (ఎలాగైనా సరే ముక్తి పొందాలి అనుకునే మనస్సుకు, అనుమానం (ముక్తి వస్తుందో రాదో అనే శంక) పీడ అవుతుంది. అందువలన ఏవేవో పుణ్యకార్యాలు చేయాలని ఆరాటపడతారు. దానివల్ల మళ్ళీ ఉత్తమ జన్మలు కలిగి అదీ... ఒక పీడ అవుతుంది. మరి ఇక దారి ఏమిటండీ? శ్రీవేంకటేశ్వరుని దర్శించి, ఆయనే దిక్కని కొలుస్తూ, వెఱపుచేత (భయభక్తులతో) వుంటే కాని వీడదీబాధ (ఈ పీడ వదలదు).

సంపుటి : 1 కీర్తన : అమ్మెడిదొకటి అసిమలోదొకటి

సంఖ్య : 483 పుట : 324 రాగం: లలిత

లలిత

3. అమ్మెడి దొకటి అసిమలోదొకటి
బిమ్మిటి నిందేటిపెద్దలమయ్యా ॥ పల్లవి ॥

సంగము మానక శాంతియు గలుగదు
సంగలంపటము సంసారము
యెంగిలిదేహం బింతకు మూలము
బెంగల మిందేటిపెద్దలమయ్యా ॥ అమ్మె ॥

కోరికె లుడుగక కోపం బుడుగదు
కోరకుండ దిక్కువమనసు
క్రూరత్వమునకు కుదువ యీ బ్రదుకు
పేరడి నేమిటిపెద్దలమయ్యా ॥ అమ్మె ॥

ఫలము లందితే బంధము వీడదు
ఫలముతో తగులు ప్రపంచము
యిలలో శ్రీ వేంకటేశుదాసులము
పిలువగ నేమిటిపెద్దలమయ్యా ॥ అమ్మె ॥ 483

అవతారిక :

అన్నమాచార్యులవారి కీర్తనలలో పల్లవి కొరకరాని కొయ్యగా వుంటుంది. ఇక అధ్యాత్మ కీర్తనలైతే చెప్పనే అక్కరలేదు. ఈ వివరణ ఆ శ్రీనివాసుని కృపతో నాకు స్ఫురించిన వివరణ. "ఆశ్వాసించి" అనే తత్సమ శబ్దానికి, 'అసమసంచి' అనేది వికృతి రూపం. ఆ మాటకి అర్థం 'ఊరడించి' లేక 'ఓదార్చి'. అమ్మెడిదొకటి, ఊరడించేది ఇంకొకటి ఓ ప్రభూ! 'బిమ్మటినిండె' (వివశత్వము అధికముగానున్న) పెద్దలమయ్యా (పెద్దమనుషులం స్వామీ!) అంటున్నారు. చీకటి వెలుగుల్లాంటివి అజ్ఞానం, జ్ఞానం. అన్ని వికారాలకు మూల కారణం మనస్సు. అది మనని

కోరికలకు అమ్మేస్తుంది. మనలోని అంతరాత్మ బుద్ధిమంతుడు. అది ఊరడించి మంచిగా వుండమంటుంది. మనమేమో వివశులమై మనస్సు చెప్పినట్లు విని చెడిపోతాం. చివరికి శ్రీవేంకటేశ్వరుని దాసులమయ్యాక ఈ రొంపిలోంచి బయటపడతాం అంటున్నారు.

భావ వివరణ :

ఓ ప్రభూ! ఈ మానవులకి ఏ ప్రాణికీ లేని మనస్సునెందుకిచ్చావయ్యా! మంచిది చెడ్డది కూడా మా అంతరాత్ముడే. మంచిగా వుండేది బుద్ధి. మనో వికారాలనిచ్చేది మనస్సు. మనస్సు మమ్మల్ని కోర్కెలకి అమ్మేస్తుంటుంది. బుద్ధిమాత్రం అదంతేలే బెంగపెట్టుకోకు నీవు మంచిగా వుండు... అని ఓదారుస్తుంటుంది. మేమేమో "బిమ్మటినిందేటిపెద్దలము" వివశులమైపోయిన పెద్దమనుషులం.

ఇంకొకరితో సంగము (స్నేహము) మానకపోతే మనశ్శాంతి కలుగదు. సంగముతో కలిగే లంపటం వలన సంసారము కలుగుతున్నది. దీనికంతకీ మూలకారణము ఈ ఎంగిలి దేహము. జీవితాంతం ఈ ఎంగిలి వాంఛించేదేహం కోసం బెంగలతో నలిగిపోయే పెద్దలమయ్యా! మమ్మల్ని కరుణించి ఈ చక్రబంధంలోంచి బయటపడవేయవయ్యా! స్వామీ!

కోరికలుడుగక (కోరికలు నశించక) కోపము పోదు. ఈ కోరికకు ఆధారం మనస్సు. అది మనిషి బ్రతుకును క్రూరత్వానికి తాకట్టు పెట్టుతుంది. ఒక్కసారి క్రూరత్వం వచ్చాక మంచేమిటి చెడేమిటి? పేరడినేమిటి (పెద్దరికం యేమిటి?) ఇంకా మేమేమి పెద్దలమయ్యా?

మేము చేసే మంచిగాని చెడుగాని ఫలితములివ్వక మానవు కదా! ఈ ఫలితములవల్ల మిత్రులు శత్రులు కలుగుతారు. దానివల్ల బంధము కలిగి కొందరిని మనవారు అనుకొని కొందరిని విరోధులు అనుకొంటాం. ఈ కర్మఫలములతో ప్రపంచపు 'తగులు' (యావ) కలుగుతుంది. ఎంతటి పెద్దలైనా అల్పులవలె ప్రవర్తిస్తుంటారు. ఇలలో అందుకని, మమ్మల్ని శ్రీవేంకటేశ్వరుని దాసులుగా పిలిస్తే చాలును. మాకు పెద్దరికం వద్దేవద్దు. అది ఏమిటికయ్యా? (ఎందుకయ్యా)?

సంపుటి : 1 కీర్తన : ఎవ్వరు గర్తలుగారు యిందిరానాథుడే గర్త
సంఖ్య : 485 పుట : 325 రాగం : గుండక్రియ

గుండ క్రియ

4. ఎవ్వరు గర్తలు గారు యిందిరానాథుఁడే కర్త
నివ్వటి ల్లాతనివారై నేమము దప్పకురో ॥ పల్లవి ॥

కర్మమే కర్తయైతే కడకు మోక్షము లేదు
అర్మిలి జీవుఁడు గర్తయైతే బుట్టుగే లేదు
మర్మపుమాయ గర్త అయితే మరి విజ్ఞానమే లేదు
నిర్మితము హరి దింతే నిజమిదెఱగరో ॥ ఎవ్వ ॥

ప్రపంచమే కర్తయైతే పాపపుణ్యములు లేవు
వుపమ మనసు గర్తై ఉంటే నాచారమే లేదు
కపటపు దేహములే కర్తలయితే చావు లేదు
నెపము శ్రీహరి దింతే నేరిచి బ్రదుకరో ॥ ఎవ్వ ॥

పలుశ్రుతులు గర్తలై పరగితే మేర లేదు
అల బట్టబయలు గర్తైతే నాధారము లేదు
యెలమి నిందరికి గర్త యిదివో శ్రీవేంకటాద్రి –
నిలయపుహరి యింతే నేడే కొలువరో ॥ఎవ్వ ॥485/1

అవతారిక :

ఈ సృష్టిలో ఏమి జరిగినా, ఎప్పుడు జరిగినా, ఎలా జరిగినా, ఎందుకు జరిగినా కర్త ఎవరు? ఎవ్వరూ కాదు ఇందిరానాథుడు (లక్ష్మీపతి) ఒక్కడే కర్త అంటున్నారు అన్నమాచార్యులవారు. నీతినియమాలు తప్పక ఆతనివారై నివ్వటిల్లి (అతిశయించి) వుండండి అని అంటున్నారు. మనం చేసే కర్మకానీ, మనం వుండే ప్రపంచం కానీ, వేదవేదాంగములు కానీ మరేదైనా గానీ కర్తలు కావు అంటున్నారు. శ్రీవేంకటాద్రి నిలయపు హరిని నేడే కొలవండి అని హితవు చెబుతున్నారు.

భావ వివరణ :

ఓ జనులారా! సృష్టి స్థితి లయల చేత ఈ యావద్విశ్వాన్నీ నిర్వహించే 'కర్త' వేరెవ్వరూకాదు. ఇందిరా రమణుడైన శ్రీహరియే అన్నిటికీ కర్త. నివ్వటిల్లి (అతిశయించి), అతనివారై, నేమముదప్పకరే (నియమమును అతిక్రమించకుండా వుండండయ్యా!)

ఒకవేళ మన కర్మయే అన్నిటికీ కర్త అనుకొంటే మనం కర్మచేయకుండా వుండలేము కనుక ఇక మోక్షము సిద్ధించుట అనేది జరగదు. జీవునికి ఆపేక్ష ద్వేషమూ వుండవు. అతడు అర్మిలిజీవుడు (ప్రేమస్వరూపుడు). ఒకవేళ జీవుడే కర్త అయితే పుట్టుక అనేది లేదు. మర్మముతో నిండినది మాయ. ఒకవేళ మాయ కర్త అయితే తత్త్వ జ్ఞానమనేదే సాధ్యంకాదు. మరింకేమిటి? కర్మలన్నీ హరిచేత నిర్మింపబడినవి. ఇదే నిజము. దీన్ని తెలుసుకొంటే చాలును.

ఒకవేళ ఈ ప్రపంచమే అన్నిటికీ కర్త అయితే పాపులు పుణ్యులూ వుండరు. అసలు పాపపుణ్యాలే వుండవు. మనస్సు ప్రతిదాన్ని పోల్చుకొని ఆ 'ఉపమ'తో తృప్తి పడుతుంటుంది. ఒకవేళ ఆ మనస్సే కర్త అయితే ఇక ఆచారము (సదాచారము) వుండనే వుండదు. మానవుని దేహము కపటపు (మోసకారి) దేహము. ఎంతకాలం దీన్ని ప్రేమతో పోషించినా చివరికి చావుతో నశిస్తుంది. ఒకవేళ ఇదే కర్త అయితే చావే వుండదు కదా! నెపము (నేరారోపణ) భరించేవాడు శ్రీహరి అంతే. ఇది తెలిసి బ్రతకండయ్యా!

ఒకవేళ వేదమ ఉలే కర్తలైతే మేరయేలేదు. అంటే ఒక పద్ధతే వుండదు. బట్టబయలు (మిక్కిలి బహిర్గతమైనదే) కర్త అయితే ఇక ఆధారమనేదే వుండదు. కనుక, ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడే అన్నిటికీ కర్త అని నేడే ఆయనను సేవించండి. అంతే ఇంతకు మించి ఏమీ లేదు.

సంపుటి : 1 కీర్తన : వెడమంత్రమికనేల వేరువెల్లంకులునేల

సంఖ్య : 461 పుట : 309 రాగం ముభారి

ముభారి

5. వెడమంత్ర మికనేల వేరువెల్లంకులు నేల
పుడమిధరుడు మాకు భువనౌషధము ॥ పల్లవి ॥

హరి యచ్చుతాయంటే నణగు బాపములు
నరసింహా యనియంటే నాటిన దు:ఖములు మాను
పురుషోత్తమాయంటే బుండ్లు బూచులు మాను
పరమౌషధ మీతడే పాటింప మాకు ॥ వెడ ॥

వాసుదేవ యనియంటే వదలు బంధములెల్లా
వాసికి గృష్ణాయంటే వంతల రోగాలు మాను
శ్రీసతీశ యనియంటే చింతలిన్నియును మాను
గాసిదీర నితడేపో ఘనదివ్యౌషధము ॥ వెడ ॥

గోవిందా యనియంటే గూడును సంపదలు
యీవల మాధవయంటే నిహము బరము జేరు
దేవ నారాయణయంటే దేహము సుఖియై యుండు
శ్రీవేంకటేశుడే మాకు సిద్ధౌషధము ॥ వెడ ॥ 461

అవతారిక :

అన్నమాచార్యులవారి అధ్యాత్మకీర్తనలలో పల్లవినర్థం చేసికోవటం ఒకయెత్తు, మిగిలిన కీర్తన అంతా ఒక ఎత్తు. ఉదాహరణకి ఈ కీర్తన పల్లవినే తీసికొందాం. వెడమంత్రము అంటే వేద మంత్రము అని కొందరి అభిప్రాయం. కానీ 'వెడ' అంటే తుచ్ఛమైన అనికూడా అర్థం వున్నది. పూర్వీకులు కొన్ని వ్యాధులు మరియు తేలు, పాము కాట్లకు మంత్రములతోనయము చేసేవారు. రకరకాలైన వేరులతోను మూలికలతోను కొన్ని వ్యాధులు నయము చేసేవారు. ఆ మూలికలను వేరువెల్లంకులంటారు. పుడమిధరుడంటే భూదేవిభర్త అయిన విష్ణువు. భువనౌషధమంటే విశ్వవిఖ్యాతమైన మందు అని అర్థం. ఈ పల్లవికి అర్థం

ఏమిటంటే భూరమణుడైన విష్ణువు మాకు దివ్యౌషధము. అది అన్ని రోగాలకీ దివ్యమైనది. అది వుండగా ఇంకా మంత్రాలు నాటు మందులు మాకు యెందుకయ్యా? ఆ శ్రీహరి పరమౌషధం సేవించండి అంటున్నారు.

భావ వివరణ :

ఓ ప్రజలారా! పుడమిధరుడు (భూకాంతుడైన విష్ణువు) మాకు భువనౌషధము (జగత్ప్రసిద్ధిమైన మందు). అది వుండగా, ఇక (ఇంకా) వెడమంత్రము (తుచ్ఛమైన మంత్రాలు), వేరు వెల్లంకులు (మూలికా వైద్యములు) యెందుకయ్యా!

ఓ శ్రీహరి! అచ్యుతా! అంటే పాపములన్నీ నశిస్తాయి. నరసింహా! అని అంటే నాటిన (పాతుకుపోయిన) రోగాలు తొలగిపోతాయి. పురుషోత్తమా! అని ప్రార్థిస్తే పుండ్లు (కురుపులు), బూచులు (దయ్యంపట్టుటవంటి మానసిక వ్యాధులు) తొలగిపోతాయి. కాబట్టి మాకు పాటింప (సమ్మతించిన) పరమౌషధం ఈతడే (ఈ శ్రీహరియే). వేరుగా ఇంకే మందూ అవసరం లేదు.

బంధములవలన (మానవ సంబంధముల వల్ల కలిగిన తగులములవల్ల) మనిషి వేదన చెందుతాడు. దానికీ ఒక మందువున్నది వాసుదేవా! అని ప్రార్థిస్తే చాలును. కృష్ణా! అని అంటే పేరుగన్న రోగాలు ఇబ్బందులు తొలగిపోతాయి. ఓ శ్రీసతీశా! అని అంటే విచారములు (చీకాకులు) అన్నీ తొలగిపోతాయి. గాసిదీర (మా శ్రమ తొలగుటకు) ఇతడే పో! ఘనమైన ఔషధము.

సగం వ్యాధులు సరైన తిండిలేక వస్తాయి. దానికి మందు ధనం. అదివుంటే సగం వ్యాధులు రావు. గోవిందా! అని అంటే సమస్త సంపదలు సమకూడుతాయి. ఇక మాధవా! అన్నాము అంటే ఇహమున సుఖములు పరమున (చనిపోయాక) మోక్షము లభిస్తాయి. ఓ దేవా! నారాయణా! అని అంటే దేహములో దేహి సుఖముగా వుంటాడు. ఇవన్నీ లభించాలంటే ఒక మంచి సిద్ధౌషధము (సిద్ధించిన ఔషధం) కావాలి కదా! మాకు ఆ సిద్ధౌషధమే శ్రీ వేంకటేశ్వరుడు.

సంపుటి : 1 కీర్తన : నేనేమిసేయుదును నీవు నాలోపలనుండి
సంఖ్య : 459 పుట : 308 రాగం : గుండక్రియ

గుండక్రియ

6. నే నేమిసేయుదును నీవు నాలోపలనుండి
శ్రీనాథుడవు నీచేత లింతేకాక ॥ పల్లవి ॥

తనువేమిసేయును తనువులోపలనున్న –
చెనటి యింద్రియములచేతలుగాక
మనసేమిసేయును మనసులోపలనున్న –
నినుపుగోర్కులు చేసేనేరములుగాక ॥ నేనే ॥

జీవుడేమిసేయును జీవునిబొదుగుతున్న –
భావపుప్రకృతి చేసేపాపముగాక
చేవదేర బుట్టు వేమిసేయు ముంచుకొన్నట్టి –
దైవపుమాయలోనిధర్మ మింతేకాక ॥ నేనే ॥

కాలమేమిసేయును గక్కన శ్రీ వేంకటేశు –
డేలి మన్నించేమన్నన యిదియేకాక
యేల యేల దూర నింక నెవ్వరు నేమిసేతురు
మేలిమి నిను దలచి మెచ్చుటేకాక ॥ నేనే ॥ 459

అవతారిక :

ఓ శ్రీనాథా! నీవునాలోపల అంతర్యామివైయుండి అన్నీ చేయిస్తున్నావు. పైకి నా తనువు, మనస్సు, ఇంద్రియాలు, జీవుడు నా పుట్టుక మొదలైనవి నా పనులన్నీ చేస్తున్నట్లు కనుపించినా అది నిజం కాదు. అన్నీ నీచేతలే. నేనేమి చేయుదును? ఇందులో ఇంకొకరిని నిందించవలసిన పనియేమిటి? ఎవ్వరుమాత్రం ఏమిచేయగలరు? మేలిమి (అధికుడవైన) నిన్ను మెచ్చుకుంటూ జీవిస్తే చాలును. అన్నమాచార్యులవారు చెప్పింది అక్షరసత్యం. నిగ్రహించగలిగినవాడు శ్రీవేంకటేశ్వరుడొక్కడే.

భావ వివరణ :

ఓ ప్రభూ! శ్రీనాథుడవైన నీవు, అంతర్యామివలె నాలోపలనుండి సమస్తము చేయించుచున్న నీ చేతలే ఇవన్నీ. అంతేకాక నేనేమిసేయుదును (నేనేమి చేయగలను?) నీవు చేయించేవే అన్నియూ అని గ్రహించాను.

నా తనువులో (శరీరంలో) వున్న చెనటి ఇంద్రియాలు (వ్యర్థమైన అవయవములు) చేయించే పనులే అన్నీ. మరి నాతనువేమి చేస్తుంది? నా మనస్సులోపలదాగి నినుపుగోర్కెలు (నిండియున్న వాంఛలు) నాచేత ఎన్నో నేరములను చేయించుచున్నవి. దానికి నా మనస్సేమి చేస్తుంది. దానిని నిందించి ప్రయోజనమేమిటి?

నాలోవుండే జీవుడికి పొదగుకొని (కమ్ముకొని) భావనలు కలిగించే ప్రకృతి ఒకటి యున్నది. అది వానిచేత సమస్త పాపములను చేయించుచున్నది. దానికి నాజీవుడేమిచేస్తాడు? భగవంతుని మాయ యొక్క ధర్మమేమిటంటే నిష్పక్షపాతంగా మా కర్మలకు తగిన పుట్టుక (జన్మ) నీయటం. ఒక్కసారి పుట్టాక ఆ జన్మకు తగిన కర్మలు చేస్తూనే వుంటాం. ముంచుకొన్నట్టి (అతిక్రమించే) మాయనేమీ అనకుండా, జన్మను నిందించి ప్రయోజనమేమిటి?

గక్కన (వెంటనే) శ్రీవేంకటేశ్వరుడు, మనని ఏలి (పరిపాలించి) మన్నిస్తే... ఆ మన్నన మనకి మేలు చేయగలదు కాని కాలము ఏమి చేయగలదు? అది క్షణ క్షణం గతించి పోతూనే వుంటుంది. కాబట్టి ఇక యెందుకు వాటిని వీటిని నిందించుట? ఎవ్వరేమి చేస్తారు? ఓ ప్రభూ! మేలిమి (అధికుడవైన) నిన్ను తలచి (ధ్యానించుచూ) మెచ్చుటేకాక (కీర్తించుట తప్ప) నేనేమిసేయుదును?

సంపుటి : 1 కీర్తన : అక్కరకొదగనియట్టి యర్థము

సంఖ్య : 456 పుట : 306 రాగం : ముఖారి

ముఖారి

7. అక్కరకొదగనియట్టియర్థము
లెక్క లెన్నియైనా నేమి లేకున్న నేమిరే ॥ పల్లవి ॥

దండితో దనకు గాని ధరణీశురాజ్యంబు
యెండెనేమి యది పండెనేమిరే
బెండుపడ గేశవుని బేరుకొనని నాలికె
వుండెనేమి వుండకుండెనేమిరే. ॥ అక్క ॥

యెదిరి దన్ను గానని యడపుల గుడ్డికన్ను
మొదల దెఱచెనేమి మూసెనేమిరే
వెదకి శ్రీపతి సేవ వేడుకజేయనివాడు
చదివెనేమి చదువు చాలించెనేమిరే ॥ అక్క ॥

ఆవల నెవ్వరులేనిఅడవిలోని వెన్నెల
కావిరి గాసెనేమి కాయకున్ననేమిరే
శ్రీ వేంకటేశ్వరు జేరనిదర్మములెల్ల
తోవల నుండెనేమి తొలగిననేమిరే ॥ అక్క ॥ 456

అవతారిక :

గొప్ప నీతివాక్యములను చెబుతున్నాడు అన్నమాచార్యులవారు. మనుష్యుడు ధనమును సంపాదించేది దేనికోసం? తనకు ఆపదలో అక్కరకొస్తుందని. అట్లా అవసరానికి సహాయపడని అర్థము (ధనము) నిరర్థకమంటున్నారు. లెక్కలేనంత ధనంవున్నా, లెక్కపెట్టవలసిన అవసరం లేనంత తక్కువ వున్నా నిరుపయోగమే అంటున్నారు. అడవిలో యెంతవెన్నెల కాచినా నిరుపయోగమే కదా! మన జీవనయానంలో యే

దర్మాన్ని ఆచరించినా దాని ప్రయోజనం శ్రీ వేంకటేశ్వరుని చేరటం. అందుకు కానప్పుడు ఆ ధర్మానికి అర్థం వ్యర్థమే.

భావ వితరణ :

ఓ మానవులారా! అక్కరకొదగని (అవసరమునకు ఉపయోగపడని) యట్టి అర్థము (ధనము), లెక్కలేనంత వుంటే నేమి - అసలు లేకుంటేయేమి?

ధరణీశునకు (రాజుగారికి) అతని రాజ్యము దండితో (గొప్పగా) తనకు గావలె (తనకు వుపయోగపడాలి) అట్లుకానిచో అది యెండెనేమి... పండెనేమి (నశించినా ఒకటే అభివృద్ధిచెందినా ఒకటే). ఆయనకేమి లాభం? బెండుపడ (నిర్బలుడైనప్పుడు) మనిషి కేశవుని స్మరించి రక్షణ పొందాలి. ఆ స్వామి పేరు పలుకని నాలుక వుంటేయేమి, లేకుంటే నేమిరా?

విరోధినుంచి తనను తాను రక్షించుకొనుటకు ఉపయోగించని కన్ను గుడ్డికన్నే కదా? అది తెరచివుంటేనేమి? మూసివుంటేనేమి? పెద్ద తేడా వుండదు.

శ్రీనాథుని వెదకి పట్టుకొని ఇష్టముతో సేవించాలి. అట్లా చేయనివాడు యెంత చదివితే నేమి వుపయోగం? అసలు చదవకపోయినా నష్టమేమిటి?

ఎవ్వరూ లేని నిర్జనారణ్యంలో ఎంత పండువెన్నెల కాచినా యెవరికి వుపయోగం? ఆ వెన్నెల యెంత చీకటిని తొలగించినా వుపయోగమేమిటి? ఏ ధర్మశాస్త్రమైనా శ్రీవేంకటేశ్వరుని చేరే మార్గం నేర్పాలి. అట్లా నేర్పని ధర్మాలు, తోవల (జీవనయానంలో) వుండెనేమి? తొలగినేమి (వుంటేనేమి? పోతేనేమి?)

సంపుటి : కీర్తన : అంగడినెవ్వరు నంటకురో

సంఖ్య : 241 పుట : 161 రాగం : శ్రీరాగం

శ్రీరాగం

8. అంగడి నెవ్వరు నంటకురో యీ –
దొంగలగూడినద్రోహులను (ము) ॥ పల్లవి ॥

దోసము దోసము తొలరో శ్రీహరి –
దాసానదాసుల దగ్గరక
ఆసలనాసల హరినెఱగక చెడి
వీసరపోయినవెఱ్ఱులను (ము) ॥ అంగ ॥

పాపము పాము పాయరో కర్మపు –
దాపపువారము(ల) దగ్గరక
చేపట్టి వేదపుశ్రీహరికథలు
యేపొద్దు వినినిహీనులము ॥ అంగ ॥

పంకము పంకము పైకొనిరాకురో
కొంకు గొసరులకూళలము
వేంకటగిరిపై విభునిపుణ్యకథ
లంకెల వినని యన్యులము ॥ అంగ ॥ 241

అవతారిక :

ఈ ప్రపంచం, ఒక అంగడి (సరుకులు అమ్మే సూపర్‌బజార్ అన్నమాట) ఇందులో బేరసారాలు చేస్తున్న మనమంతా దొంగలమే. మామూలు దొంగలము కాదు ద్రోహబుద్ధిగల దొంగలము. మమ్మల్ని తాకవద్దు. మీరూ చెడిపోతారు. మమ్మల్ని పుట్టించి, పోషించి, రక్షిస్తున్న శ్రీహరినే మఱచి ఆయనని తలుచుకోని కృతఘ్నులము. ఆశాపాశమునకు చిక్కి వీసరపోయిన (మెత్తపడిపోయిన) పిచ్చివాళ్ళం అంటున్నారు

అన్నమాచార్యులవారు. భగవంతుని శరణాగతిలో ఆత్మనింద ఒక భాగము. నేను హీనాతిహీనుణ్ణి అని అంగీకరించటమే శరణాగతికి తొలిమెట్టు.

భావవివరణ :

ఓ నరులారా! ఈ ప్రపంచమే పెద్ద అంగడి వంటిది. ఇందులో జీవిస్తున్న మేము... భగవంతుని మరచి, దొంగలతో స్నేహం చేసి చేయరాని పనులను చేస్తున్న ద్రోహులము. మమ్ము అంటకురో (తాకవద్దురా). మీరూ చెడిపోతారు.

శ్రీహరికి దాసానుదాసులైనవారిని వదలిపెట్టండి. వారివద్ద నుండి తొలరో (తొలగిపోండి) వారిదగ్గరకెళ్ళకండి (ద్రోహులమైన మేమూ వెళ్ళము). అసలనాసల (అత్యధికమైన ఆశతో) శ్రీహరిని యెరుగక చెడి వీసరపోయిన (వెలితిపడి చిన్నబోయిన) వెఱ్ఱులము (పిచ్చివాళ్ళము). మేమేం చేస్తున్నామో మాకే తెలియటంలేదు).

మేము చేసికొనిన కర్మల తాపపువారము (ఆ కర్మల యొక్క తాపము చేత పీడించబడుతున్న వాళ్ళము). మాతో వుంటే మీకూ పాపము అంటుకొంటుంది. మా దగ్గరకు పాయరో (మాదగ్గరకు రాకండి). చేపట్టి (దీక్షవహించి) మేము యే పొద్దు (ఏ సమయంలో కూడా) శ్రీహరి కథాశ్రవణం చేయని హీనాతిహీనులము. వేదమూర్తి అయిన ఆయన కథలు వినని వారికి పాపము రాక ఇంకేమొస్తుంది?

మేము కొంకున్ గొసరుల కూళలము (భయము, సంకోచములచే పీడించబడు కుత్సితులము). ఓ పాపపంకిలమా! (బురదవంటి పాపమా) మమల్ని ఆశ్రయించవద్దు. వేంకటగిరిపైనున్న శ్రీవేంకట విభుని పుణ్యకథలను లంకెల (తగులుకొని) వినని అన్యులము (సరియైన వాళ్ళము కానివారము). అందుకని మమ్మల్ని మా కర్మకు వదలి మీరైనా మంచిగా వుండండి.

సంపుటి : 1 కీర్తన : మచ్చుగన్నతల్లి చేరి మూలకు నొదిగినట్లు
సంఖ్య : 240 పుట : 161 రాగం : శ్రీరాగం

శ్రీరాగం

9. ముచ్చుగన్నతల్లి చేరి మూలకు నొదిగినట్టు
తెచ్చినసంబళమెల్ల దీరుబో లోలోనె ॥ పల్లవి ॥

దప్పముచెడినవానితరుణి కాగిట జేరి
అప్పటకప్పటికి నుస్సు రనినయట్టు
వొప్పయిన హరిభక్తి వొల్లనివాని యింటి –
కుప్పలైన సంపదలు కుళ్లుబో లోలోనె ॥ ముచ్చు ॥

ఆకలిచెడినవాని అన్నము కంచములోన
వోకిలింపుచు నేల నొలికినట్టు
తేకువైన హరిభక్తి తెరువుగాననివాని –
వేకపుసిరులు కొంపవెళ్లుబో లోలోనె ॥ ముచ్చు ॥

వొడలుమాసినవాని వొనరు జుట్టములెల్ల
బడిబడినే వుండి పాసినయట్టు
యెడయక తిరువేంకటేశు దలచనివాని –
అడరుబుద్ధులు పగలౌబో లోలోననె ॥ ముచ్చు ॥ 240

అవతారిక :

మానవులు పాపపుణ్యాలు చేస్తూనే వుంటారు. ఆపై వాటి ఫలితాలను అనుభవించటానికి హీనమైనవో, ఉత్తమమైనవో జన్మలు యెత్తుతూనే వుంటారు. ఈ జీవనయానం, అమ్మకడుపులో పడిన దగ్గర నుంచి మొదలవుతుంది. చివరి శ్వాస వదిలాక అంతమవుతుంది. ఈ జీవన యానానికి మనం వచ్చేప్పుడు "సంబళం" (దారి ఖర్చు) కూడా తెచ్చుకుంటాం. అదే మనం చేసిన మంచి కర్మ. కానీ దారిబత్తెంలాగానే అది 'తీరుబోలోలోన' (లోపల లోపల ఖర్చు అయిపోతూనేవుంటుంది.

మచ్చుగన్నతల్లి (దొంగకి జన్మనిచ్చిన తల్లి ఇతరులకి తన ముఖము చూపలేక ఒకమూల అవమానంతో ఒదిగియున్నట్లు, మానవుడి పాపపుణ్యాల ఫలం రహస్యంగా కఱగిపోతూనే వుంటుంది అంటున్నారు అన్నమయ్య.

భావ వివరణ :

ఓ మానవులారా! చేరి... ముచ్చుగన్నతల్లి మూలకునొదిగినట్లు (దొంగకు జన్మనిచ్చిన తల్లి అవమానంతో ఒక మూల పడి వుండి జీవించినట్లు), మనం పాపపుణ్యాల ఫలంగా వెంటతెచ్చుకొన్న సంబళం (దారిబత్తెం) తనంతట అదే లోపల్లోపల రహస్యంగా ఖర్చు అయిపోతూనే వుంటుంది.

దప్పముచెడినవాని తరుణి (ఔన్నత్యం కోల్పోయిన వాడిపెళ్ళాం) భర్త కౌగిటిలో కూడా ఉస్సురుమని జీవించినట్లు, మేలైన హరి భక్తి వద్దు అనే వాడి ఇంట్లో సంపద యెంతకుప్పలైవున్నా (సమృద్ధిగా వున్నా) అవి లోలోన కుళ్ళుబోవును (తమంత తామే లోపల్లోపల కుళ్ళి మురిగిపోతాయి). వాటివల్ల ఏ మంచీ జరుగదు. వాడికి పుణ్యం రానేరాదు.

ఆకలి చెడిపోయినవాడు తినే కంచంలోనే బొళుక్కుమని డోక్కొని తిన్న అన్నం నేలపాలు చేసికొంటాడు. శ్రీహరిభక్తి మానవులకి తేకువ (ధైర్యం) నిస్తుంది. కానీ శ్రీహరి భక్తి తెరువుగాననివాడు (దారినిపోనివాడు) ఇంట్లో యెంత వేకపు సిరివున్నా (అంటే... యెంత ఆగర్భ శ్రీమంతుడైనా) లోలోన కొంపవెళ్ళబోవు (తనంతట తనే దివాలా తీస్తాడు).

ఒడలు మాసినవాని (చెడిపోయినవాడి) చుట్టాలు వాని బడిబడినే వుండి (సమీపములోవున్నా) పాసినయట్లు (వాడిని వదలి వేసినట్లు) ఎడయక (వదలిపెట్టక) శ్రీ వేంకటేశ్వరుని స్మరించనివానికి తన బుద్ధియే తనకు శత్రువై దానంతట అదే వినాశన హేతువు అవుతుంది. అంటే వాడి బుద్ధే వాడి మృత్యువవుతుంది.

సంపుటి : 1 కీర్తన : ఎప్పుడు పక్వము గాదిదె యింద్రియ భోగంబులచే
సంఖ్య : 482 పుట : 323 రాగం మలహరి

మలహరి

10. ఎన్నడు పక్వము గా దిదె యింద్రియభోగంబులచే
సన్నము దొడ్డును దోచీ సంసారఫలంబు ॥ పల్లవి ॥

తిత్తితో నూరేండ్లకును దేహము పండగబండగ
చిత్తం బెన్నడు పండక చిక్కెను కసుగాయై
పొత్తులపుణ్యముబాపము పులుసును తీపై రసమున
సత్తు నసత్తును దోచీ సంసారఫలంబు ॥ ఎన్న ॥

వెదవడి పుత్రుడులపౌత్రులే విత్తులు లోలో మొలచియు
పొది గర్మపుపూ మారదు పూపిందెయిన దిదే
తుద నిదె సుఖమును దు:ఖము తోలును గింజయి ముదురుక
చదురము వలయము తోచీ సంసారఫలంబు ॥ ఎన్న ॥

వినుకలిచదువుల సదలో వేమరు మాగగ బెట్టిన
ఘనకర్మపుటొగ రుడుగదు కమ్మర పులిగాయై
మనుమని శ్రీ వేంకటేశుకు మహి నాచార్యుడు కానుక
చనవున నియ్యగ వెలసెను సంసారఫలంబు ॥ ఎన్న ॥ 482

అవతారిక :

ఈ అధ్యాత్మ కీర్తనలో సంసారఫలము యొక్క విశిష్టత్వమును వివరిస్తున్నారు అన్నమయ్య. "ఎంత తిన్నా కడుపు నిండనిది – ఏ రుచీ లేకపోయినా ఎంతో రుచిగా వుందనిపించేది – ఒక్కసారి దొంగతనంగానైనా తింటే బాగుంటుంది అనే భ్రమ కలిగించేది – అని ఇతర మత గ్రంధాలు కూడా చెప్పాయి. అన్నమయ్య వర్ణన ఇంకా అద్భుతం. ఈ సంసారఫలము యెన్నడూ పక్వము కాదట అంటే ఎప్పుడూ పచ్చిగానే వుంటుంది కాని, పండదట. ఎందుకంటే ఇది ఇంద్రియ భోగాలతో నిండివున్నది కదా! అందుకని ఒకప్పుడు పెద్దదిగా

మరియొకప్పుడు చిన్నదిగా కనిపిస్తుందట. ఒక అక్షరము లోపంవల్ల ఈ కీర్తన భావమే మారిపోతుంది వివరాలు చదవండి.

భావ వివరణ :

ఓ ప్రజలారా! ఇదె సంసారఫలము. ఎన్నడూ పక్వము కాదు (ఏనాటికీ పండు పండదు). ఇది సన్నము (చిన్నదిగానూ) తోస్తుంది. దొడ్డును (లావుగానూ) అనిపిస్తుంది.

నూరేండ్లు వుంటుంది కాబట్టి ఈ దేహము, తిత్తితో (తోలుతో) పండగ పండగ (పండి వడలిపోతూనే వుంటుంది). కానీ దీంట్లో వున్న చిత్తము (మనస్సు) కసుగాయై (పచ్చికాయవలె) పండక వుంటుంది. ఎంతో మందితో పొత్తులు (జతకట్టుటలు) చేస్తుంది కాబట్టి పుణ్యకర్మలు పనికిరాని కర్మలవలెను, పాపకర్మలు ఆచరించదగ్గవిగానూ కనిపిస్తాయి. రసముల (ఇక రుచుల విషయానికి వస్తే ... పులుపు తీపిగాను తియ్యనిది పుల్లనిదిగానూ అనిపిస్తుంది. సత్తు అసత్తుగా (నిజం అబద్ధంగా) అనిపిస్తుంటుంది.

ఈ సంసారఫలం విత్తులు వెదవడి (విత్తనాలు వెద చల్లుట వలన) ఆ విత్తనాలే కొడుకులు మనుమలు అయి లోలోన విపరీతమైన గర్వము పూపిందెలుగా మొలిచి విస్తరిస్తుంటుంది. దీనికి (ఈ సంసార ఫలానికి) పైతోలు ఏమిటో తెలుసునా... దేహి అనుభవించే సుఖము. ఇక దీని గింజలు ఆ దేహి దు:ఖమే. ఈ సంసార ఫలం యెన్నడూ ముదరదు. ఇది కొంతమందికి నలుచదరముగా కనిపిస్తే కొందరికి గుండ్రంగా కనిపిస్తుంది.

వినుకలి చదువుల సదలో (చదువులు, వినిపించుట జరిగెడి పండిత గోష్ఠిలో) దీనిని చాలాసార్లు మాగబెట్టిన తరువాత గానీ దీని ఒగరు రుచి వుడగదు (పోదు). కమ్మర (అటు పిమ్మట) పుల్లని కాయవలె భరించలేనిదవుతుంది. అప్పుడు మా గురుదేవులు చనవున (ప్రేమతో) శ్రీ వేంకటేశ్వరునకు, మనుమని (శరణాగతితో వుండమని) ఇయ్యగా – మహిని (ఈలోకంలో) సంసార ఫలము యొక్క తత్త్వం తెలిసినది.

సంపుటి : కీర్తన: ఏటి విజ్ఞానమేటి చదువు

సంఖ్య : 77 పుట : 53 రాగం : గుండక్రియ

గుండక్రియ

11. ఏటివిజ్ఞాన మేటిచదువు
గూటబడి వెడలుగతి గురుతు గనలేడు ॥ పల్లవి ॥

ఏడుమడుకల చర్మమింతయును దూంట్లె
గాడబెట్టుచు జీము గారగాను
పాడైనయిందులో బ్రదుకు గోరీ బ్రాణి
వీడదన్నుక చనెడి వెరవు గనలేడు ॥ ఏటి ॥

కడుపునిండిన మహాకష్టంబు నలుగడల
వెడలుచును బెనుమురికి వేయగాను
యిడుమ బొందుచు సుఖం బిందుకే వెదకీని
వొడలు మోవగ జీవు డోపననలేడు ॥ ఏటి ॥

వుదకమయమగు కన్ను లురికి యేమైన గని
మదవికారము మతికి మరుపగాను
యిది యెరిగి తిరువేంకటేశు గని జీవుడా
సదమలానందంబు చవిగానలేడు ॥ ఏటి ॥ 77

అవతారిక :

అన్నమాచార్యులవారి కీర్తనలలో పల్లవే అర్థంకాదు అనటానికి ఇది చక్కని ఉదాహరణ. ఎంత చదువుకున్నా విజ్ఞానము (భగవంతుని గూర్చిన అనుభవపూర్వకమైన జ్ఞానం) లేకపోతే ఏమానవుడైనా కుంటివాడు కుంటుకుంటూ నడిచినట్లు వ్యర్థునిగా పేరు లేకుండానే బ్రతుకుతాడు – అని దీని అర్థం. భగవద్సాక్షిగా ఇది వ్రాసేవరకు నాకూ తెలియదు. ఆ ఏడుకొండలవాడిని స్మరించగానే మెఱుపులా స్ఫురిస్తుంది. కాగితం మీద వ్రాయగానే పన్నీరు ఆవిరైనట్లు ఇక బుఱ్ఱలో యేమీ వుండదు. ఇది సత్యం.

నిజానికి "గూటిబడి" అని వుండాలి. రాగిరేకులపై వ్రాసిన వారి పొరబాటువల్ల 'గూటబడి' అయింది. నీకెలా తెలుసునని నన్ను అడిగితే నిష్ప్రయోజనం సుమండీ!

భావ వివరణ :

ఏటి విజ్ఞానము, ఏటి చదువు? (విజ్ఞానం యేమిటి – చదువేమిటి). చదువు కొనినంత మాత్రాన విజ్ఞాని (ఆత్మజ్ఞానం కలవాడు) కాలేడు. కుంటివాడు వెడలు (నడచిపోవు) గతి (విధముగా) గురుతు గనలేడు. (నేర్పరికాలేడు). అనగా కుంటివాడు ఎలాగైతే సరిగా నడవలేడో చదువుకొనినంత మాత్రంచేత భగవత్సాక్షాత్కారం పొందలేడు.

మానవుని దేహం ఏడు మడకల చర్మము (ఏడు పొరలున్న చర్మము) తో చేయబడినది. దీని నిండా దూంట్లే (రంధ్రములే) (రోమ రంధ్రములు). ఇది కాడ బట్టుచు (నశించిపోతూ) చీము కారుతూ వుంటుంది. ప్రాణి (జీవుడు) ఇందులో బ్రతుకగోరి వస్తాడు. ఇది పాడైనా, దీంట్లోనే వుంటాడు. ఈ ప్రాణి ఈ శరీరంలేకుండా బ్రతికే వెఱపు (దారి) తెలియదు.

మహాకష్టముతో ఆ దేహి కడుపు నిండుతుంది. ఒక్కసారి కడుపు నిండాక ఈ దేహి గొప్ప మురికి కూపాల్లోంచి పోతుంటాడు. ఇడుము (కష్టము) పొందుతూనే వుంటాడు. కానీ అదే సుఖము అనుకొంటుంటాడు. దాంట్లోనే సుఖం వెతుక్కుంటుంటాడు. వాడి శరీరం కూడా వాడు మోసికొనలేని స్థితి చేరుకుంటాడీ జీవుడు.

వాడి కళ్ళువున్నాయే... అవి వుదకమయము (నీటితో నిండినది). కానీ అవి ఆ జీవి మనస్సునకు మదము, వికారము అలవరుస్తాయి. ఇది తెలిసికొని శ్రీవేంకటేశ్వరుని దర్శనం పొందగానే ఆ జీవికి సదమలానందంబు (సత్తు యొక్క నిర్మలమైన ఆనందము) కలుగుతుంది. పైవన్నీ తెలిసికొంటేకాని ఆ ఆనందం యొక్క చవిగానలేడు (అనుభవం పొందలేడు.)

సంపుటి:1 కీర్తన : సొగియునా మఱియు ముచ్చుకు బండువెన్నెలలు
సంఖ్య : 242 పుట : 162 రాగం : బౌళి-జంపెతాళం

బౌళి-జంపెతాళం

12. సొగియునా మఱియు ముచ్చుకు బండువెన్నెలలు
పగవానివలెనె లోపల దాగుగాక ॥ పల్లవి ॥

దక్కునా పేదకును తరముగాని ధనంబు
చిక్కి యెవ్వరికైన జేరుగాక
వెక్క సంబైన గోవిందుని దలపుబుద్ధి
తక్కినపరులకెల్ల దలపేల కలుగు ॥ సొగి ॥

అరగునా దుర్బలున కరుదైన యన్నంబు
కురుచబుద్ధులను నరమిగొనుగాక
తొరలునా హరివినుతి దుష్టునకు నది నోర
దొరలెనా యతనినే దూషించుగాక ॥ సొగి ॥

చెల్లునా యమృతంబు సేవించ నధమునకు
వొల్లనవి నేలపై నొలుకుగాక
వెల్లి గొనుమందునకు వేంకటేశుస్మరణ
చల్లనౌనా మనసు శఠియించుగాక ॥ సొగి ॥ 242

అవతారిక :

ఇదే పల్లవికి నాలుగైదు రకములుగా భావవిరణ చేయవచ్చు. అన్నమాచార్యులవారి ఆలోచన 'ఇది' అని చెప్పగల శక్తి నాకులేదు. సొగియుట అంటే ఇంపు అవుతుందా అని అర్థం. అంటే రుచిస్తుందా? అని. విరగాసిన పండువెన్నెల దొంగకి రుచిస్తుందా? వాడు యెప్పుడూ చీకటినే కోరుకుంటాడు. శత్రువుకుండే పగ బైటకు రాకుండా లోపలే దాగి వుండి నలుగురి కంట బడక అపకారం చేస్తుంది. (దాగివున్నది పగ

కాదు... పగవాడు అని కూడా అర్థం చెప్పుకోవచ్చు). అట్లాగే మందబుద్ధి! మనస్సుని వేంకటేశ్వరుని స్మరించి చల్లగా వుంచుకోవే అంటే అది మాట వింటుందా మొండికేస్తుంది కాని, అంటున్నారు.

భావ వివరణ :

ఓ ప్రజలారా! ముచ్చుకు (దొంగకు) విరబూసిన పండువెన్నెల సొలయునా (రుచిస్తుందా)? అట్లాగే శత్రువునకుండే పగ లోపల్లోపలనే దాగి వుండి అపకారం చేస్తుంది కానీ బయటపడుతుందా?

ఒక పేదవాడికి అంతులేని ధనం లభిస్తే అది వాడికి దక్కుతుందా? అది ఎవ్వరికో పరాయి వాళ్ళకే చేరిపోతుంది. వెక్కసంబైన (దుర్లభమైన) శ్రీహరి నామచింతన చేయాలనే బుద్ధి ఆయన దయకలిగిన వారికి తోస్తుంది కానీ మిగతావారికి తోచను కూడా తోచదు. వాడి పక్కనున్న వాళ్ళంతా గోవిందా అంటున్నా వీడు మాత్రం నోరు విప్పడు.

దుర్బలుడైనవాడు పొట్టనిండా అన్నం మ్రింగినా హరించుకోగలడా? అల్పబుద్ధులు వుండేవారు నరమిగొనుగాక (కృత్రిమంగా వుంటారు). వారికి మంచి చెప్పినా రుచించదు. ఒక దుష్టబుద్ధికి హరి కీర్తనము తొరలునా (కలుగుతుందా?) వాడి నోటిలో హరి నామము దొర్లుతుందా? వాడెంతసేపటికీ శ్రీహరిని తిడుతూనే వుంటాడు లేదా తనకి తాను ఒక గొప్ప హేతువాదిననుకొని తనలోనే వున్న ఆ అంతర్యామిని గుర్తించనేలేడు.

అర్హతలేని అధమునికి అమృతం చేతికందించినా అది వాడికి దక్కుతుందా? ఒల్లనని (వద్దని) నేలపై ఒలకపోసికొంటాడు. ఎన్నో జన్మలనుంచి వెల్లిగొనుమందునకు (పరంపరగా వస్తున్న మందబుద్ధికి) శ్రీ వేంకటేశ్వరుని సంస్మరణ చల్లనౌనా (శమనం కలిగిస్తుందా?) వాడి మనస్సు శఠియించుగాక (మొరాయిస్తూనే వుంటుంది కదా!)

సంపుటి : 1 కీర్తన : ఇత్తడి బంగరుసేయ నింతకు నేరుతునంటా
సంఖ్య : 360 పుట : 241 రాగం : సామంతం

సామంతం

13. ఇత్తడి బంగారుసేయ నింతకు నేరుతునంటా
కొత్తసేతలెల్ల దొరకొంటిగా నీవు ॥ పల్లవి ॥

హీనులైనవారు నిన్ను నేచి కొలిచిన ఘన –
మైనపదవుల బెట్టేయె (య?)టు వలెనే
మానక యెవ్వతెనైన మచ్చిక దగిలి నాతో –
నానిపట్టి సరిసేసే వద్దిరా నీవూ ॥ ఇత్త ॥

కడుబాతకులు నిన్ను గదిసి కొలిచేరంటా –
నడరి పుణ్యలజేయునటువలెనే
కడగి యెవ్వతెనైన గాజు మాణికము సేసి
వడి నన్ను గెరలించవద్దురా నీవూ ॥ ఇత్త ॥

దిందుపడ మాయసేసి దేవుడ నేగానంటా –
నందరి భ్రమలబెట్టునటువలెనే
అందమైన తిరువేంకటాద్రీశ నీ ప్రేమ
చెంది నన్ను గూడి దాచజెల్లునా నీవూ ॥ ఇత్త ॥ 360

అవతారిక :

శ్రీ వేంకటేశ్వరుని యోగులు జ్ఞానులేకాదు హీనులు దీనులు కూడా కొలుస్తారు. కొందరు జ్ఞానం వల్ల కలిగిన వైరాగ్యంతో సేవిస్తే, కొందరు బాధలవల్ల కలిగే పీడలనుంచి రక్షణ కోసం శరణు అంటారు. కనుక హీనులు పుణ్యులు కూడ ఆయననే ఆశ్రయిస్తారు. ఒక్కసారి ఆయన రక్షణలో చేరితే ఇత్తడి వంటి సామాన్య లోహాన్ని బంగారం చేయగలడాయన అంటే అతి సామాన్యుడైన నాబోటి అల్పునికూడా విశిష్ట

వ్యక్తిని చేయగలడు. అటువంటి కొత్తసేతలెల్ల (పనులన్నీ) దొరకొంటివి కదా (ప్రయత్నిస్తూనేవుంటావు స్వామీ!) అంటున్నారు అన్నమాచార్యుల వారు.

భావ వివరణ :

ఇత్తడిని బంగారము చేయుట నేర్చితినంటూ కొత్తకొత్త సేతలు (మహిమలు) చూపేవు స్వామీ! నీవు దొరకొనిన (ప్రయత్నించిన) ఆ పనులన్నీ వింతలే. ఇత్తడి వంటి అల్పులను బంగారంవంటి ఉన్నతులుగా చేస్తావు.

హీనాతిహీనులైన వారుకూడా నిన్ను నేచి కొలచిన (పూనుకొని సేవిస్తే) వారికి ఉన్నతమైన పదవుల నందిస్తావు నేను లోలుడనై ఎవ్వతెకైనా మచ్చికదగలి (అలవాటుపడి) మానకవుంటే (వదలలేని స్థితిలో వుంటే) నాతో నానిపట్టి (విశ్వప్రయత్నాలు అయినా సరే) నన్ను సరిచేసేవు (బాగు చేస్తావు).

అద్దిరానీవూ (నీవంటే అదేరా నామాలవాడా!) అట్లాగే, అతిపాపాత్ములు కూడా నిన్ను గదిసి (ఆశ్రయించి) కొలిచితే, అరే – వీళ్ళు నా భక్తులు అని అడరి పుణ్యుల చేతువు (ప్రయత్నించి పుణ్యాత్ములను చేసెదవు). గాజు ముక్కవంటి అల్పురాలను కూడా గొప్పయోగినిని చేసి మాణిక్యమువలె అపురూపం చేస్తావు. అటువంటప్పుడు, ఓ ప్రభూ నీవూ వడి నన్ను గెరలించవద్దా? (శీఘ్రముగా నన్ను కూడా నీవు బాగుచేయవద్దటయ్యా?)

దిందుపడ మాయసేసి (మూర్ఛపోవునంతగా నీ మాయాజాలంలో ఇరికించి) నేను దేవుణ్ణి కాదురా అని అందరినీ భ్రమపెడతావు. (ఆనాటి యశోదాదేవి దగ్గర నుంచి ఈనాటి చార్వాకుల దాకా అలా భ్రమలో పడ్డవారే, పడుతున్నవారే). సౌందర్యమూర్తివైన ఓ శ్రీ వేంకటేశ్వరా! నీ ప్రేమ నాకు చెందినది. నన్ను గూడి (నావాడవై) నీవు ఆ ప్రేమను దాచిపెడితే... అది చెల్లునా (అదేమన్నా బాగుందా తండ్రీ!).

సంపుటి : 1 కీర్తన : పరమపాతకుడ భవబంధుడ

సంఖ్య : 33 పుట : 22 రాగం: సామంతకం

సామంతకం

14. పరమపాతకుడ భవబంధుడ శ్రీ-
హరి నిను దలచ నే నరుహుడనా ॥ పల్లవి ॥

అపవిత్రుడ నే నమంగళుడ గడు
నపగత పుణ్యుడ నలసుడను
కపటకలుష పరికరహృదయుడ నే
నపవర్గమునకు నరుహుడనా ॥ పర ॥

అతిదుష్టుడ నే నధిక దూషితుడ
హతవివేకమతి నదయుడను
పతిలేనిరమాపతి మిము దలచలే -
నతులగతికి నే నరుహుడనా ॥ పర ॥

అనుపమవిషయపరాధీనుడ నే -
ననంతమోహభయాతురుడ
వినుతింపగ దిరువేంకటేశ ఘను -
లనఘులుగాక నే నరుహుడనా ॥ పర ॥ 33

అవతారిక :

భగవాదారాధనలో ఆత్మనింద (తన చెడుగుణములను తానేకరువుపెట్టుకొని మన్నించమని వేడుకొనుట) ఒక ప్రత్యేకత. నేను అటువంటి నీచుణ్ణి... ఇటువంటి దుర్మార్గుణ్ణి... నీ దయకు అర్హుడినా ప్రభూ! కానేకాదు. కానీ కనికరించు అని వేడుకొంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తనలో చాలా మాటలు విన్నవే... కానీ అర్థం తెలియనివి. మన దైనందిన జీవితములో చాలా మాటలకి మనకు అర్థం తెలియదు. ఓ శ్రీహరీ! నేను పరమపాపిని యెందుకంటే భవబంధాలచే

కట్టివేయబడ్డాను. అసలు నిన్ను ధ్యానించే అర్హతయైనా నాకున్నదా ప్రభూ! అంటున్నారు.

భావవివరణ:

ఓ శ్రీహరీ! నేను పరమపాతకుడను. భవబంధాలచేత కట్టివేయబడినవాడను. కామక్రోధాది అరిషడ్వర్గములకు లొంగిపోయి యెన్నో అకృత్యములను చేశాను. అసలు, నాకు నీదయ పొందే అర్హతవున్నదా ప్రభూ!

ఓ దేవా! నేను పవిత్రత లేని వాడను. "అమంగళుడ" (మంగళకరములు కాని పనులనే చేయువాడను). అపగతపుణ్యుడ (పోయిన పుణ్యము కలవాడను అంటే యేమాత్రం పుణ్యం లేనివాడను)... అలసుడను (సోమరిని). కపట కలుష పరికర హృదయుడను (కుత్సితము వంటి చెడుగుణములు సమూహముగా గల హృదయం వున్నవాడను) ఓ ప్రభూ! ఇట్టి నేను అపవర్గమునకు (మోక్షమునకు) అర్హుడనా తండ్రీ?

స్వామీ! నేను అతి దుష్టుడ (చెడ్డవాడను). అధిక దూషితుడ (దైవదూషణ చేయు నీచుడను), హతవివేకుడ (నశించిన వివేకము కలవాడను... అంటే వివేకము లేని వాడను). అధముడను (దయా గుణము లేనివాడను). పతిలేని రమాపతీ! (ప్రతిలేని లక్ష్మీపతీ... అంటే నీలాంటి మరెవ్వడూ లేని శ్రీపతీ!) నేను మిమ్మల్ని తలచనేరను. శ్రేష్ఠమైన ముక్తికి నేను అర్హుడనా ప్రభూ?

ఓ దేవదేవా! నేను అనుపమ విషయపరాధీనుడను (సాటిలేని విషయ సుఖములకు బానిసనైనవాడను). అనంతమోహభయ ఆతురుడ (అంతులేని మోహము, భయము అను రోగములచే పీడితుడను). ఇది నీకు తెలిసిన విషయమే. నీవు శ్రీవేంకటేశ్వరుడవు. ఘనులు, అనఘులు (పాపరహితులు) కాక, నిన్ను వినుతించుటకు (కీర్తించుటకు) నేను అర్హుడనా తండ్రీ!

సంపుటి : 1 కీర్తన : కలలోని సుఖమే కలియుగమా

సంఖ్య : 118 పుట : 81 రాగం : సామంతం

సామంతం

15. కలలోనిసుఖమే కలియుగమా, వెన్న –
కలిలో నెక్కడిదె కలియుగమా ॥ పల్లవి ॥

కడిగడి గండమై కాలము గడపేవు
కడుగగడుగ రొంపి కలియుగమా
బడలికె వాపవు పరమేదో చూపవు
గడిచీటియును నీవు కలియుగమా ॥ కల ॥

కరపేవు కఱతలే మఱపేవు మమతలే
కరకఱ విడువవు కలియుగమా
తెరచీర మఱగింతే తెరువేల మానేవు
గరుసేల దాటేవో కలియుగమా ॥ కల ॥

కానిదె మెచ్చేవు కపటాలే యిచ్చేవు
కానీలే కానీలే కలియుగమా
పై నిదే వేంకటపతి దాసులుండగ
కానవా నీవిదేమి కలియుగమా ॥ కల ॥ 118

అవతారిక :

కలియుగంలో కలపురుషుని ప్రభావం వలన ధర్మం అధర్మంగానూ అధర్మం ధర్మంగానూ కనిపిస్తాయి. విపరీతమైన విశృంఖలత్వంతో మంచి వినేవారే వుండరు. ఈ కీర్తనలో ఆ కలియుగం యొక్క ప్రభావాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. కలలో మనం సుఖంగా వున్నట్లు కలవచ్చినంతమాత్రాన ఆ సుఖం నిజంగా వుంటుందా? వెన్నకలి (ఒక దినుసు)లో పేరుకేగాని వెన్నయెలాగైతే వుండదో కలియుగంలో అంతా కలిగినట్లనిపించినా సుఖమనేది కలలోని మాట అంటున్నారు. ఎందుకంటే కపటత్వమే ఈ కలియుగ లక్షణం.

భావవివరణ :

ఓ కలియుగమా! వెన్నకలిలో పేరులోనే కానీ నిజంగా వెన్న అనేది ఎలా వుండదో... కలియుగంలో సుఖం కలిగివుంటుంది అనుకుంటే అది కేవలం కలలోని మాటయే సుమా! నిజంగా ఏ సుఖమూ వుండదు.

ఈ కలియుగంలో కడిగడి గండమై, (ప్రతి ఘడియా గండమువలే) కాలము గడుస్తుంది. కడుగుతున్న కొద్దీ రొంపి (బురద) అంటుతూనేవుంటుంది. తీరని అలసట కలుగదుతుంది. ముక్తి పొందు మార్గం గురించిన ఆలోచనయే రాదు. నీ ప్రయాణం ఎటువంటిదంటే... దానికి గడిచీటి (అనుమతిపత్రం) కూడ లేదు. ఓ కలియుగమా ఇక నీకు నీతి యెక్కడిది!

కరపేవు (అలవాటు చేస్తావు) కఱతలే (చెడ్డపనులు). మఱపేవు మమతలే (మమతానురాగాలతో ఒళ్ళు మఱచేట్లు చేస్తావు). కరకఱలు (కోపతాపాలు) విడిచిపెట్టవు. ఓ కలియుగమా! నీ గురించి ఇంకా ఏమి చెప్పమంటావు? తెఱచీరె (అడ్డముగా తెరవలె కట్టిన చీరె) ఏమి మఱుగు (చాటు) అందిస్తుంది? ఓ కలియుగమా! నీకున్న తెరువు (దారి... అంటే సన్మార్గం) ఎందుకు మూసివేస్తావు? గరుసేల దాటేవు? (నీ హద్దులు యెందుకు అతిక్రమిస్తావు?) ఓ కలియుగమా! నీవు చేస్తున్నది తప్పు.

ఓ కలియుగమా! ఏది మెచ్చుకోకూడదో దాన్నే మెచ్చుకుంటావు. కపట ప్రవర్తన అలవాటు చేస్తావు. కానీలే కానీలే నీ వ్యవహారం కూడా ఎంతకాలం సాగుతుందో చూద్దాము. పైనవున్న శ్రీవేంకటేశ్వరుని దాసులను కూడా కానవా యేమిటి? ఇదేమి పద్ధతే కలియుగమా? నీ ఆటలు వారి ముందు సాగవు జాగ్రత్త సుమా!

సంపుటి : 1 కీర్తన: ఏమియు జేయగవద్దు యింతలోనె మోక్షము
సంఖ్య : 430 పుట : 288 రాగం : గుండక్రియ

గుండక్రియ

16. ఏమియు జేయగవద్దు యింతలోనె మోక్షము
దీమపువిజ్ఞానమే దివ్వెత్తుఫలము ॥పల్లవి॥

పాపచింత మదిలోన బారకుండా నిలిపితే
చేపట్టి దానములెల్లా జేసినంత ఫలము
కోపానలములోన కోరికలు వేల్చితేనే
యేపున యజ్ఞాలు నేసి యేచినంతఫలము ॥ఏమి॥

కనకముపై యాస కాదని పోదొబ్బితేనే
తనకు వేవేలు గోరతపముల ఫలము
వనితల మోహమువల బడకుండితేనే
దినము గోటితీర్థాలు దిరిగినఫలము ॥ఏమి॥

శ్రీ వేంకటేశ్వరు జేరి కొలుచుటే
ధావతిలేనియట్టి తన జన్మ ఫలము
భావించి యాచార్యపాదపద్మమూలమే
సావధానమున సర్వశాస్త్రార్థఫలము ॥ఏమి ॥ 430

అవతారిక :

చిత్తశుద్ధిలేని శివపూజలేలరా అన్నారు పెద్దలు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు మోక్షము సిద్ధించాలంటే ఘోరమైన తపస్సులాంటివి చేయవలసిన పనియేలేదు అంటున్నారు. దీమపు విజ్ఞానమే దివ్వెత్తుఫలము చేకూరుస్తుంది అంటున్నారు. అది దీమసపు విజ్ఞానమై యుంటుందని నా భావన. అంటే భగవంతుని గూర్చిన వుపయోగపడే జ్ఞానమే ఆకాశమంత ఉన్నతమైన ఫలమునిస్తుంది అని భావము. మదిలో పాపచింతన లేకుండా

బ్రతికితే సకలదానములు సలిపినంత ఫలము అంటున్నారు. గూఢార్థమేమంటే పాపచింతనతో యెన్ని దానాలు చేసినా నిరుపయోగం సుమా! అని.

భావవివరణ :

ఓ ప్రజలారా! ఇంతలోనే మోక్షము లభిస్తుంది. దాని కోసం ఏమియు చేయగవద్దు. మీకు దీమ (స)పు విజ్ఞానము (ఉపాయముతో కూడిన భగవత్ జ్ఞానమే దివి+యెత్తు ఫలము (అత్యున్నతమైన ఫలితము) నిస్తుంది.

మదిలోన పాపచింతన పారకుండనిలిపితే (సోకకుండా నిగ్రహించితే), చేపట్టి (నిర్వహించి) సమస్త దానములను చేసినంత ఫలమును చేకూరుస్తుంది. మనకి కోపం వస్తే అది అగ్నిలా దహించివేస్తుంటుంది. అది మన యొక్క మనస్సును దహించకుండా మనలో నిబడీకృతమైన కోరికల్ని దహించి వేస్తే... ఏపున (గొప్పగా) సమస్త యజ్ఞాలూ చేసిన ఫలము కలుగుతుంది.

కనకముపై ఆస (బంగారం అంటే వ్యామోహం) మానవుని బలహీనత. దాన్ని పోదొబ్బితే (మెడపట్టి గెంటేస్తే) తనకు (అట్లాచేసిన వానికి) వేవేల తపములు (వేల కొలది తపస్సులు) చేసినంత ఫలము నిస్తుంది. స్త్రీల వ్యసనంతో మోహపీడితుడై వారి వెంటబడకుండా వుంటే, కోటి పుణ్యతీర్థములను దర్శించినంత ఫలము కలుగుతుంది. (అంటే... స్త్రీ వ్యసనంవున్నవాడు యెన్నిసార్లు కాశీ ప్రయాగలు వెళ్ళినా ఫలితం లేదు డబ్బు దండుగ... అంతేనంటున్నారు.)

శ్రీ వేంకటేశ్వరుని శరణుజొచ్చి సేవించిన ఆరాధించుటే ధావతిలేని యట్టి తన జన్మఫలము (నిరాసక్తితో జీవించే జన్మయొక్క సత్ఫలితము). భావములో కూడా అచంచల విశ్వాసంతో గురువుల పాదసేవ చేయుటయే సావధానముగా (హెచ్చరికతో) సర్వశాస్త్రములను అర్థసహితముగా నేర్చినంత ఫలము.

సంపుటి : 1 కీర్తన : చీచీ వో బదుకా సిగ్గులేనిబదుకా
సంఖ్య : 467 పుట : 33 రాగం : బౌళి

బౌళి

17. చీచీ వో బదుకా సిగ్గులేనిబదుకా
వాచవికి బతిమాలి వడబడ్డ బదుకా ॥పల్లవి॥

ఆసలకు జోటు గద్దు అంతరంగాన నెంతైన
నీసమంతా జోటు లేదు విరతికిని
యీసున సంసారమున కెందరైనా గలరు
వోసరించి మోక్షమియ్య నొకరు లేరు ॥చీచీ॥

భోగించ వేళ గద్దు పొద్దువొడపుగుంకును
వేగమే హరిదలచ వేళలేదు
వోగులలంపటమున కోపి కెంతైనా గద్దు
యోగపు సత్కర్మాన కొకయింత లేదు ॥చీచీ॥

యెదుట ప్రపంచాన కెఱు కెంతైనా గద్దు
యిదివో యాత్మజ్ఞాన మించుకా లేదు
మది శ్రీవేంకటేశుడు మమ్ము నిట్టె కాచెగాని
పదరి నానేరములు పాప మఱి లేరు ॥చీచీ॥ 467

అవతారిక :

అనుక్షణం కొత్త కొత్త కోరికలుకు తొత్తులైపోతూ సిగ్గులేని బ్రతుకులు ఈడుస్తూ జిహ్వాచాపల్యం కొఱకు బ్రతుకుతూ, ప్రతిదానికీ సర్దుకొనిపోయి జీవితం గడిపేస్తున్న మానవులు జీవించరు.... బ్రతుకుతారు. అట్టి బ్రతుకులకు ఛీ కొడుతున్నారు అన్నమాచార్యులవారు. తాను బ్రతికే ప్రపంచమే సర్వం అని తన ఆత్మజ్ఞానం కొద్దిగానైన నేర్వక ప్రపంచం గురించి ఇంకా తెలుసుకోవాలనుకొనే మాబోటివారికి దిక్కెవరు? నా

నేరములు పాప మఱి వేంకటేశ్వరుడు దక్క అన్యులులేరు, అంటున్నారు. నా నేరముల బాప... అని వుంటే ఇంకా బాగుండేది.

భావవివరణ :

ఓ మానవ జీవితమా! ఛీ ఛీ ఎంత సిగ్గులేని బ్రతుకే? నీ వాచలకి (జిహ్వా చాపల్యం తీరుటకు) పరులను బ్రతిమాలి, భంగపడుతూ వడిబడ్డ (సర్దుకొనిపోయి) జీవితం గడిపేస్తున్న బ్రతుకా! దేనికోసం ఇదంతా?

ఓ బ్రతుకా! ఆసలకు చోటుగద్దు (వుంటుంది). కాని అంతరంగంలో విరతికి (విశ్రాంతికి) మాత్రం వీసమంత (కొంచెంకూడా) చోటులేదు. ఈర్ష్యా ద్వేషములతో ప్రపంచంలో గడుపుటకు అందరూ సిద్ధమే కానీ... ఓసరించి (వద్దు అని) మోక్షమార్గం ఇచ్చేవాళ్ళు ఒక్కరంటే ఒక్కరుకూడా లేరు.

నాకు భోగించడానికి మాత్రం బోలెడంత సమయం గద్దు (దొరికింది). వేగంగా రాత్రింబవళ్ళు గడచిపోయాయి. కాని శ్రీహరిని తలుచుకొనుటకు కూడా క్షణం తీరిక దొరకలేదు. ఓగుల లంపటానికి (దేవురించే పీకులాటలకు) మాత్రం ఎంత ఓపికయైనా నాకు వుంటుంది. యోగమార్గం నేర్చి సత్కర్మ చేయటానికి మాత్రం ఒకింతకూడా అవకాశం లేకుండా పోయింది.

ఓ శ్రీ వేంకటేశ్వరా! నాయెట్ట నెదుట నున్న ప్రపంచం తెలుసుకోవాలని ఆసక్తి, తెలుసుకొనే సాధనకు మాత్రం ఎంతైనా నాకు ఎఱుక (ప్రపంచజ్ఞానం) గద్దు (వున్నది). కానీ ఇదిగో నా ఆత్మయేమిటో తెలుసుకొనే ఆత్మజ్ఞానం మాత్రం అణువంతైనా లేదు. మా మదిలో వున్న శ్రీపతి మమ్ము ఇట్టే కాచుకొని (రక్షించాలికానీ).... పదరి (త్వరగా) నా నేరములబాప మఱి దిక్కెవ్వరును లేరంటే లేరు.

సంపుటి : 1 కీర్తన : బోధకులెవ్వరు లేక భోగినైతిని

సంఖ్య : 465 పుట : 312 రాగం : కన్నడగౌళ

కన్నడగౌళ

18. బోధకులెవ్వరు లేక భోగినైతిని
శ్రీదరుడే మాకు దిక్కు చింతింప నికను ॥పల్లవి॥

పట్టి దిగంబరినై పాలే యాహారముచేసి
తొట్టినపంచేంద్రియములతోవ విడిచి
పుట్టితి సన్యాసినై బుద్దెఱిగీనెఱగక
అట్టె నడుమ సంసారినైతి నేనూ ॥బోధ॥

గచ్చుల నన్నీ మఱచి గాలే ఆవటించుకొని
అచ్చపుబరమయే కాంతసమాధి
నిచ్చలు నిద్రాభ్యాసనిర్మలయోగినైతి
కచ్చుపెట్టి మేలుకొని ఘనకర్మినైతి ॥బోధ॥

భావము పారవిడిచి బ్రహ్మాండమెల్ల నిండి
వేవేలు గోరికల వేడుకతోడ
జీవన్ముక్తుడనైతి శ్రీవేంకటేశ్వరు జేరి
ధావతు లిన్నియు మాని తన్మయుడనైతి ॥బోధ॥ 465

అవతారిక :

అతి తేలికగా కనుపించే ఈ కీర్తన బహు జటిలమైనదని నా అభిప్రాయం. నేను వ్రాసిన భావ వివరణే సరి అయినది అనే దుస్సాహసం చేయలేను. కాని ఇది నాకు స్ఫురించిన వివరణ. తాను జీవన్ముక్తుడనయ్యానని అంటున్నారు అన్నమాచార్యులవారు. ఇప్పటి వరకు హితవు బోధించేవారు లేక భోగినై శారీరక ఆనందమే పరమావధిగా జీవించాను. ఆ శ్రీధరుడే మాకు దిక్కై ఆదుకొన్నాడు. ఇక చింతించాల్సిన పనిలేదు అంటున్నారు.

భావవివరణ:

ఓ ప్రజలారా! ఇంతకాలమూ భోగివలె జీవించాను. బోధకులు (మంచి చెడు విడమరచి చెప్పేవారు) లేక నాకున్న సమయమునంతా వ్యర్థపరచి కొంటిని. శ్రీధరుడైన తిరుమలనాథుడు మాకు దిక్కు అయినాడు. ఇక మాకు చింతించవలసిన పనియేముంది?

తల్లి గర్భంలో చేరి నేను దిగంబరినైతిని (వస్త్రవిహీనుడనైతిని). పాలేయాహారముగా (తల్లి అందించే జీవరసాయనమే నా ఆహారముగా) పంచేంద్రియములతో నిమిత్తం లేక పెరిగి, సన్యాసినై (సంగరహితుడనై) పుట్టాను. బుద్ధి వున్నా లేనట్లే. నాకు మలమూత్రాల విచక్షణ కూడా లేదు. అట్లా పెరుగుతూ సంసారపు యావలో పడిపోయాను.

ఆ తరువాత నాలో పూచిన భావముల నన్నింటిని మఱచి గాలినే పొందికగా, నిజమైన ఏకాంత సమాధిలోకి ప్రవేశించి, నిత్యమూ యోగనిద్రలో గడిపే నిర్మలయోగినయ్యాను. ప్రయత్న పూర్వకంగా యోగనిద్ర నుంచి విముక్తడనై ఘనకర్మిష్ఠినైతిని. రకరకముల యోగకర్మలనవలంభించితిని.

వేవేల కోరికలను సంతోషముతో విడనాడి, భావము పారవిడచి (మనస్సులో కూడా మలినము లేక) బ్రహ్మాండమెల్ల ఆత్మరూపినై నిండిపోయాను. ఆ విధంగా నేను జీవన్ముక్తుడనయ్యాను. శ్రీ వేంకటేశ్వరు చేరుకొని, ధావతులన్నీ మానివేసి (ఆసలన్నీ విడనాడి) తన్మయత్వ స్థితి జేరుకొంటిని.

సంపుటి : 1 కీర్తన : ఏదియునులేని దేటిజన్మము

సంఖ్య : 301 పుట : 201 రాగం : నాట

నాట

19. ఏదియునులేని దేఁటిజన్మము
వేదాంతవిద్యావివేకి గావలెను ॥పల్లవి॥

పరమమూ ర్తిధ్యానపరుఁడు గావలె నొండె
పరమానందసంపద లొందవలెను
పరమార్థముగ నాత్మభావింపవలె నొండె
పరమే తానై పరగుండవలెను ॥ఏది॥

వేదశాస్త్రార్థకోవిదుఁడు గావలె నొండె
వేదాంతవిదుల సేవించవలెను
కాదనక పుణ్యసత్కర్మి గావలె నొండె
మోదమున హరిభక్తి మొగి నుండవలెను ॥ఏది॥

సతతభూదదయావిచారి గావలె నొండె
జీతమైనయింద్రియస్థిరుఁడు గావలెను
అతిశయంబగు వేంకటాద్రీశుసేవకులె
గతియనుచు తన బుద్ధిఁ గలిగుండవలెను ॥ఏది॥ 301

అవతారిక :

మానవునిగా జన్మము పొందిన జీవికి జీవితలక్ష్యం జ్ఞాన సముపార్జన. జ్ఞానం అంటే మనిషి బ్రతుకుటకుపయోగపడే 'విధ్య' కాదు. అది యెలాగునైనా నేర్వవలసిందే. మరి చచ్చే దాకా బ్రతకాలికదా! జ్ఞానం భగవత్కృప వుంటేనే కాని కలుగదు. అసలు నీవు యెవరు? ఇది నేర్వవలెనంటే సత్యాసత్యాలు నిత్యానిత్యాలు జ్ఞానాజ్ఞానాల మధ్య తేడా తెలియాలి. ఈ వివేకము వేదాంత విద్య నేర్చుట వలన కలుగుతుంది.

అట్లు నేర్చినవానిదే నిజమైన మానవజన్మ. ఏమియులేక నిద్రాహారభయ మైథునాదుల నిమిత్తం బ్రతికితే అదేటి జన్మరా నాయనా? అంటున్నారు అన్నమాచార్యులవారు. 'ఒండె' అంటే ఏమిటి? నేటి కాలంలో 'అట్లా కాకపోతే' అని అంటున్నాం. జాగ్రత్తగా భావవివరణ చదవండి.

భావవివరణ :

ఏదియును లేని (యెట్టి ప్రయోజనము లేని) జన్మము (బ్రతుకు) యేటి జన్మము? (ఎట్లాంటి బ్రతుకు?) మనిషిగా పుట్టిన వాడు వేదాంత విద్యనేర్చిన వివేకి కావలెను. (నిత్యము తరించాలి). సత్యము కాని వాటికి ప్రాకులాడక వేంకటేశ్వరుని సేవలో పరమ మూర్తియైన శ్రీవల్లభుని ధ్యానపరుడు కావలెను. ఒండె (అట్లా కాకపోతే) పరమానందముచే లభించు అమందానందమును అనుభవించవలెను. ఆత్మయే పరమార్థము. అది భగవదంశతో కూడిన నిత్యసత్య స్వరూపము. ఆత్మను అట్లా భావించాలి. ఒండె (లేదా) తానే పరము, పరమే తానను విధమున యుండవలెను.

మానవుడు వేదాంతశాస్త్రము యొక్క అర్థములన్నీ నేర్చిన కోవిదుడు (పండితుడు) కావలెను. లేదా వేదాంత విశారదులను సేవిస్తూ జీవించాలి. కాదనక (వ్యతిరేకించక) పుణ్యకర్మలు (సత్కర్మలు) చేయు కర్మిష్టి కావలెను. లేదా సంతోషంతో హరిభక్తిలో దీక్షాదక్షుడైవుండవలెను.

మానవుడు ఎల్లప్పుడూ భూతదయతో కరుణామయునిగా జీవించాలి. లేదా జితేంద్రియుడైన స్థిరచిత్తుడు కావలెను. అతిశయించిన శ్రీవేంకటేశ్వరుని దాసులే దిక్కని బ్రతుకవలెను. అటువంటి భగవత్సేవకులే గతియను తన స్వంత బుద్ధి కలిగి యుండవలెను.

సంపుటి : 2 కీర్తన : అయ్యోమాయల బొంది అందునిందునున్నవారు
సంఖ్య : 12 పుట : 9 రాగం : భైరవి

భైరవి

20. అయ్యో మాయలఁ బొంది అందు నిందు నున్నవారు
యియ్యగొనఁ గర్తలుగా రెఱఁగరు జడులు ॥పల్లవి॥

చుక్కలై యుండినవారు సురలై యుండినవారు
యిక్కడనుండి పోయినయీ జీవులే
దిక్కుల వారి నిందరు దేవతలంటా మొక్కేరు
యెక్కుడైన హరి నాత్మ నెఱఁగరు జడులు ॥అయ్యో॥

పాతాళవాసులును పలులోకవాసులును
యీతరవాతనుండిన యీజీవులే
కాతరాన వారిపుణ్యకతలే వినేరుగాని
యీతల శ్రీహరికత లెఱఁగరు జడులు ॥అయ్యో॥

యిరవెఱిఁగినముక్తు లెఱఁగని బద్దులు
యిరవై మనలోనున్న యీ జీవులే
సిరుల మించినవాఁడు శ్రీవేంకటేశ్వరుఁడే
శరణాగతులు దక్క చక్కఁగారు జడులు ॥అయ్యో॥ 12

అవతారిక :

'జడుడు' అంటే జడత్వము కలవాడని అర్థం. తెలివి తక్కువవాడు లేక మందబుద్ధి అని వివరించవచ్చును. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో అయ్యో! మాయలో తగులుకొనిన అందునిందునున్నవారు (పరలోకంలోగాని ఇహలోకంలోగాని వున్నవారు) ఇచ్చిపుచ్చుకొనుటకు కర్తలు కారు, (వాళ్లు కర్మఫలం ఇయ్యలేరు, పుచ్చుకోలేరు). అంతమాత్రంకూడా యెరుగని జడులు. శ్రీవేంకటేశ్వరుని శరణాగతులు దక్క మిగతాజడులకు ముక్తి యెన్నటికీ సిద్ధించదు అంటున్నారు.

భావవివరణ:

అయ్యయ్యో! మాయలు బొంది (భగవంతుని మాయలలో తగులుకొనిన) జీవులే... అందునిందునున్నవారు (పరలోకములలోను, ఈ భూలోకంలోనూ వున్నవారు. వారి కర్మఫలాలననుసరించియే వారికీ లోకాలు దక్కాయి. కాని ఆ కర్మఫలం ఇయ్యటానికి గాని పుచ్చుకొనటానికి గాని వారు (జీవులు) ఎంతమాత్రము కర్తలు కారు. వారికేమీ తెలియదు. వారు జడులు (మందబుద్ధులు).

నక్షత్రాలలోవున్న ధ్రువునివంటివారు, దేవేంద్రాది దేవతలైనవారు, ఈ భూమిపై నుండి వారి పుణ్యవశమున అక్కడ చేరినవారే సుమా! ఆ దేవతలలోనే కొంతమంది దిక్కులవారు (దిక్పాలకులైనవారు). జడులైన ఈ మానవులు ఆ దేవతలనే సర్వశ్రేష్ఠులని మొక్కుతున్నారు. వీరు తమ ఆత్మలోనున్న శ్రీహరిని యెన్నటికీ తెలుసుకోలేరు. ఎక్కడెక్కడో ఆ హరి కోసం వెతుకుతూనేవుంటారు.

అధోలోకములైన పాతాళమున నున్న వారు అతల, వితల, సుతల రసాతల.... మొదలైన యెన్నో లోకముల నున్నవారు... యీ తరువాత నుండిన (మిగిలిన) ఈ జీవులే. ఆశ్చర్యమేమంటే... జడులైన ఈ లోకవాసులు, కాతరాన (భయంతో) వారికథలనే పురాణాలుగా వింటున్నారు. వారికే పుణ్యం వస్తుంది చెప్పండి? ఈతల (ఈలోకంలో) వారు శ్రీహరికథలనెరుగని జడులు కదా!

ఇకపోతే మనలోనే వున్న ఈ జీవుడు మాత్రం ఇరవెరిగిన (తనస్థానం... తన గమ్యం తెలిసినవాడైతే) ముక్తుడు (భవబంధములను వదలిన ఉన్నతుడు). లేనిచో ఏమి యెరుగని బద్ధుడు (బద్ధుడై చిక్కుబడినవాడు). సర్వైశ్వర్యములకు అధిపతి ఆ శ్రీవేంకటేశ్వరుడు. ఆయన కృపలేక మోక్షలక్ష్మి దక్కుతుందా? ఇది తెలియనివారు జడులే కదా! మరి అటువంటి జడులు ఎట్లా చక్కగా అవుతారు? ఆ శ్రీహరి శరణాగతితో మాత్రమే సుమా!!

సంపుటి : 2 కీర్తన : ప్రపన్నులకు నిది పరమాచారము

సంఖ్య : 317 పుట : 212 రాగం : నాదరామక్రియ

నాదరామక్రియ

21. ప్రపన్నులకు నిది పరమాచారము
విపరీతాచారము విడువఁగవలయు ॥పల్లవి॥

భగవదపచారము భాగవతాపచారముఁ
దగులక దేవతాంతరము మాని
నగధరు శరణము నమ్మి యాచార్యుని
బగివాయనిదే పరమవైష్ణవము ॥ప్ర॥

దురహంకారము దుఃఖము సుఖమునుఁ
బొరయక ప్రాకృతుల పొంతఁ బోవక
దరిశనాభిమానాన ధర్మము వదలక
పరిశుద్ధి నుండుటే పరమవైష్ణవము ॥ప్ర”

ఉపాయాంతరము లొల్లక భక్తి చేపట్టి
యెపుడూఁ దీర్థప్రసాదేచ్ఛతోడ
నిపుణత శ్రీవేంకటనిలయుఁడే గతియని
ప్రపత్తి గలుగుటే పరమవైష్ణవము ॥ప్ర॥

అవతారిక :

అహోబల మఠపు జీయరు, నృసింహోపాసకుడు అయిన శఠగోప యతీంద్రులచేత మంత్రోపదేశమును పొంది విశిష్టా ద్వైతం స్వీకరించిన అన్నమయ్య తన జీవితకాలంలో వైష్ణవుడై శ్రీవేంకటేశ్వరుని శరణాగతితో జీవించి 32000 కు పైగా సంకీర్తనలు చెప్పి తరించారు. శ్రీపతి శరణాగతి పొందిన ప్రపన్నులకు (ప్రపత్తిచేసినవారి) గొప్ప ఆచారము ఇదియే. ఇంకా అన్యములైన విపరీతాచారములను తక్షణమే విడువవలెను అంటున్నారు. వైష్ణవం చెప్పని ఏ ఆచారమైనా విపరీతమేనని అన్నమయ్య అచంచల విశ్వాసం. శ్రీవేంకటేశ్వరుడే గతియని ప్రపత్తి (శరణాగతికూడిన

భక్తి) గలుగుటే పరమవైష్ణవం యొక్క ముఖ్య లక్షణము. ఈ కీర్తనలో తీర్థ ప్రసాదేచ్ఛతో వుండమన్నారు. అంటే పానకం, వడపప్పు లొట్టలేసుకొంటూ తినటం కాదు. మరేమిటో చదవండి.

భావవివరణ :

ఓ భక్తులారా! ప్రపన్నులకు (వైష్ణవ దీక్ష స్వీరించి శ్రీహరి శరణాగతితో జీవించు వారికి), ఇది (శరణాగతి) పరమాచారము (విశిష్టమైన ఆచారము). ఇదిగాక విపరీతములైన (వ్యతిరేకములైన) ఆచారములను వెంటనే వదలివేయవలయును.

పరమ వైష్ణవమంటే యేమిటో తెలియుడు భగవదపచారము (భగవంతుని పట్ల నేరము) భాగవతాపచారము (భగవంతుని నమ్మినవారి పట్ల నేరము) తగులక (ఆచరించక) దేవతాంతరము (అన్యదేవతలను ఆరాధించుట) మానవలెను. నగధరుడు (కొండను వ్రేలిపై ధరించిన శ్రీకృష్ణుడు) శరణము అని నమ్మి తన ఆచార్యుని బగివాయనిదే (తోడు వదలిపెట్టక) సేవించుచు వుండవలెను.

దురహంకారము పనికిరాదు. సుఖదుఃఖములకు అతీతుడుగా వ్యవహరించవలెను. వాటిలో బొరయక (పొందుకోరక) వుండవలెను. ప్రాకృతులు (పామరుల) పొంత (పొత్తు పనికిరాదు. దరిశనాభిమానము (భక్తులు తీసికొనువచ్చు కానుకలపై కాంక్ష) ఏమాత్రమూ పనికిరాదు. ధర్మమునెప్పుడూ వదలిపెట్టరాదు. పరిశుద్ధాత్ములై వుండవలెను. పై లక్షణములన్నియు కలిగియుండుటే పరమవైష్ణవము. కేవలము వేష భూషణములు కలవారు వైష్ణవులు కారు.

ఉపాయాంతరములొల్లక (పని సానుకూలమగుటకు మరియొక తేలిక మార్గముల నంగీకరించక), భక్తి అను దీక్షను చేబట్టి, ఎప్పుడూ తీర్థ ప్రసాదేచ్ఛతో వుండవలెను (అనగా తీర్థయాత్రలు చేయుట, ప్రసన్నతతో యుండుట యందు ఇష్టము కలిగియుండవలెను). నైపుణ్యంతో శ్రీవేంకటేశ్వరుడే దిక్కు అని నమ్మి ప్రపత్తి (శరణాగతి) కలిగి యుండవలెను. అదియే పరమవైష్ణవము. మిగతావన్నీ బూటకములే.

సంపుటి : కీర్తన : మఱి హరిదాసుడై మాయల జిక్కుపడితే

సంఖ్య : 29 పుట : 20 రాగం : దేసాక్షి

దేసాక్షి

22. మఱి హరిదాసుఁడై మాయలఁ జిక్కుపడితే
వెఱపించఁబోయి తానే వెఱచినట్లవును ॥పల్లవి॥

శూరుఁడైనవాఁడేడఁజొచ్చిన నడ్డము లేదు
ఆరీతిజ్ఞానికి విధు లడ్డము లేవు
కారణాన నప్పటినీఁ గలిగెనా నది మరి
తేరిననీళ్ల వండు దేరి నట్లవును ॥మఱి॥

సిరులరాజైతే నేమి సేసిన నేరమి లేదు
పరమాధికారియైతేఁ బాపము లేదు
అరసి తనకుఁదానే అనుమానించుకొనెనా
తెరువే పోయేసుంకరిఁ దెలిపిన ట్లవును ॥మఱి॥

భూమెల్ల మేసినా నాఁబోతుకు బందె లేదు
నేమపుఁబ్రపన్నునికి నింద లేదు
యీమేర శ్రీవేంకటేశ్వరుని శరణని
సోమరి కర్మమంటితే జుంటీఁగ కతవును ॥మఱి॥ 29

అవతారిక :

హరిని నమ్మిన హరిదాసుడు నిర్మోహి కనుక ఏవిధమైన మాయలకు జిక్కుబడక నిస్సంగుడై వుంటాడు. అతనే మాయలో పడితే, భయపెట్టవలెనని భీకరమైన వేషధారణ చేసినవాడు తన వేషం చూసికొని తానే భయపడినట్లవును సుమా! అంటున్నారు అన్నమాచార్యులవారు.

అన్నమయ్య వాడిన భాష గ్రాంధిక భాష కాదు. రాయలసీమ మాండలికం. అందులోనూ ఆరువందల యేళ్ళనాటి మాండలికం అవటం వల్ల కొంత ఇబ్బంది తప్పదు. కాబట్టి భావ వివరణ కొంత భావజనితమే.

భావవివరణ :

హరిదాసుడైనవాడు నిర్మోహి. కనుక అతనిని భ్రమలు కలిగించే సంసార మాయలేమీ చేయలేవు. మరి అటువంటి హరిదాసుడే మాయలో జిక్కితే, వెఱపింపబోయి (భయపెట్టాలని ప్రయత్నించి) చివరికి తానే భయపడ్డట్టవుతుంది.

శౌర్యవంతుడెక్కడకు వెళ్ళినా, ధైర్యంగా అడ్డంకులన్నీ అధిగమించగలడు. అదే విధంగా జ్ఞానియైనవాడు కర్మమార్గంపై విరక్తుడై వుంటాడు గనుక వాడికే విధులు అడ్డురావు. కారణాన (సహేతుకంగా) నప్పటి నీగలిగితే భగవదర్పణ చేయగలిగితే అది వండుమట్టి జేరిన నీళ్ళు తేర్చితే తేరి శుద్ధమైనట్లు అవుతుంది.

సిరులన్నీ వున్న కుబేరుడైనా చేసిన దోషము దోషమే. అత్యున్నత అధికారియైనా పాపముచేస్తే పాపమే, శిక్షార్హుడే. తనమీద తనకే నమ్మకం లేక అనుమానంతో పీడింపబడేవాడు తనని తాను అనుమానించుకొంటే, దారినపోయే బాటసారి తనకు తానే సుంకము (ఈనాటి సేల్స్ టాక్స్) నేను ఇంత కట్టాలి అని తెలిపినట్లవుతుంది.

ఆంబోతుకు అచ్చువేసి వూరిపై వదలిపెడతారు. అది ఎక్కడపడి మేసినా బందిలదొడ్డిలో పెట్టరు. ఎందుకంటే అది పరమేశ్వరుని ప్రీతికోసం చేస్తున్నామని భావిస్తారు కనుక. నేమపు (నియమములు గల) ప్రపన్నులకు (హరి శరణాగతులకు), నిందలేదు (ఏతప్పు వుండదు). ఈ విధంగా శ్రీవేంకటేశ్వరుని శరణు జొచ్చినవారు తిరిగి సోమరి కర్మమంటితే (వ్యర్థమైన కర్మిష్టులైతే), జుంటీగ కతవును (తుమ్మెద కథమాదిరవుతుంది). పూలమీద వాలి మకరందం పోగుచేసి, కష్టపడి తేనెపట్టులో అది దాచుకొన్న తేనె, చివరికి దానికేమన్నా ఉపయోగపడుతుందా? ఆలోచించండి.

సంపుటి: 2 కీర్తన : పరులకైతే నిదే పాపము గాదా

సంఖ్య : 316. పుట : 212 రాగం : నాదరామక్రియ

నాదరామక్రియ

23. పరులకైతే నిదే పాపముగాదా
పురిగొని నీవంకఁ బుణ్యమాయఁగాక ॥పల్లవి॥

పరమపురుష నీవు పట్టినదే ధర్మము
అరసి నీవు చెల్లించినదే సత్యము
ధరలోన నీరెంటికి తండ్రితో విరోధించఁగ
దొరసి ప్రహ్లాదునకు దోడైనదే గురుతు ॥పరు॥

నారాయణుఁడు నీవు నడపినదే తగవు
ఆరూఢి నీవౌనన్నదే ఆచారము
సారెకుఁ దమయన్నతో చండిపడి పెనగఁగ
కోరి సుగ్రీవు వహించుకొన్నదే గురుతు ॥పరు॥

శ్రీవేంకటేశ నీవుచేసినదే నీతి
చేవతో నీవొడఁబరచినదే మాట
కావించి తాతతోఁ బోరఁగా నీవు చక్రమెత్తి
ఆవేళ నడ్డమైనందుకు అర్జునుఁడే గురుతు ॥పరు॥

అవతారిక:

న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు మానవమాత్రులకే కాని, పరమాత్మకి ఈ పరిమితులేవీ లేవు. ఆయన చెప్పిందే ధర్మం ఆయన చేసిందే న్యాయం. భాగవతం చదివిన పామరులకి ఇది అన్యాయం అనిపించినా ధర్మసూక్ష్మం తెలిసినవారు పరమాత్మ ధర్మపక్షపాతి కనుక అలా జరిగిందని భావిస్తారు. ఆయన, తండ్రీ కొడుకులకు... అన్నాదమ్ములకు... తాత మనుమళ్ళకు తంపులు పెట్టే తంపులమారిగా మనకు కనిపిస్తాడు. సానపట్టని వజ్రాన్ని సామాన్యులు పోల్చుకోగలరా?

ఇంకొకళ్ళకి ఇదే నీపనులు పాపములు గావా? నీకు మాత్రం పుణ్యములే అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావవివరణ:

ఓ దేవదేవా! పరులకైతే ఇదే (నీవు చేసిన ఈ పనులే) పాపముగాదా? (పాపకర్మలు అవుతాయి కదా!) పురిగొని (వ్యాపించి) నీవంక (నీపక్షంగా చూస్తే) అదే పుణ్యకర్మ అయిపోయింది గదా!

నీవు పరమపురుషుడవు కాబట్టి నీవు చేబట్టినదే ధర్మము. నీవు చెల్లుబడి చేసినదే సత్యము. మానవలోకంలో దీనికి గురుతు (సాక్ష్యం) యేమిటో చెప్పమంటావా స్వామీ! ఈ రెండిటికీ ప్రహ్లాదుని చరిత్రయే గురుతు. తండ్రీ కొడుకులకు విరోధం పెట్టి కొడుక్కి తోడై తండ్రిని తుదముట్టించావు కదయ్యా!

నీవు శ్రీమన్నారాయణుడవు. నీవు నడిపినదే తగవు (ఇద్దరిమధ్య తగవులు పెట్టాలంటే పెడతావు తీర్చాలంటే తీరుస్తావు). రూఢిగా నీవుదేన్ని ఔనంటే అదే ఆచారము. ఈసారి దీనికి గురుతు యేమిటో చెప్పనా? తన అన్నతో చండిపడి (విభేదించి), పోరాడగా సుగ్రీవుని కోరివహించి (కావాలని అతని పక్షాన చేరి, చెట్టుచాటునుంచి శత్రువుకాని వాడిని చంపావనే అపకీర్తిని కూడా రామావతారంలో భరించావు). ఇంతకంటే గురుతు ఇంకేమి కావాలి?

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చేసినదే నీతి. నీవు అంగీకరింపజేసినదే మాట (వేదవాక్కు). ఆ రోజుల్లో నృసింహ, రామచంద్రులుగా అలా చేశావు, సరే మరి ద్వాపరయుగంలో ఏమిచేశావు? తాతగారితో (భీష్మునితో) మనుమడు (అర్జునుడు) సరిగా యుద్ధం చేయటంలేదనే నెపంతో చక్రం పట్టనన్న మాటని గాలికి వదలివేసి చక్రంతో భీష్ముని చంపబోయి రోషపడిన మనుమడితో తాతని చంపించావు. ఇంతకంటే గురుతు ఏమికావాలి? తండ్రీ! నీవు జగన్నాటక సూత్రధారివి. నీకు అడ్డేమిటయ్యా! కానివ్వు నీ ఇష్టం.

సంపుటి : 2 కీర్తన : అంతరుమాలినయట్టి అధములాల

సంఖ్య : 17 పుట : 12 రాగం : మలహరి

మలహరి

24. అంతరుమాలినయట్టి అధములాల
పొంత సంతకూటమి పొరిచూపు గాదా ॥పల్లవి॥

కనక మిత్తడితోడ కలయ సరిదూఁచితే
అనువవునా అది దోష మవుఁగాక
ఘనుఁడైన హరితోఁ గడుహీనదేవతల
ననిచి సరివెట్టితే నయ మవునా భువిని ॥అంత॥

పట్టభద్రుఁడు గూర్చుండే బలుసింహాసనముపై
వెట్టిబంటుఁ బెట్టేవారు వెఱ్ఱులేకారా
గట్టిగా శ్రీహరితోడ కలగంపదేవతలఁ
బెట్టి కొలుచుట విందువెట్టి పగగాదా ॥అంత॥

కొంచక సింహముండేటిగుహ నుండవచ్చునా
పొంచి నక్కలకెల్ల బొక్కలేకాక
అంచెల శ్రీవేంకటేశుఁ డాత్మలోనే వుండఁగాను
కొంచపుదైనాల పలువంచలనేకాక ॥అంత॥ 17

అవతారిక:

అన్నమాచార్యులవారి కీర్తనలలో పల్లవిని అర్థం చేసికోవటమే ఒక గండం. ఈ పల్లవికి అర్థం... తారతమ్యాలు తెలియని అధములారా! సంతకూటములలో ఒకడికింకొకడు తెలియక పోయినా పరస్పరం మర్యాదలొలక బోసికొనినట్లు, ముక్కూ మొగం తెలియని చిల్లర దేవుళ్ళకు మొక్కటం పొరిచూపు (భేద భావంతో చూచుటే) కదా! ఆ దేవతలు శ్రీహరికి సరితూగగలరా? మృగరాజైన సింహం వుండాల్సిన గుహలో

బొక్కలు (ఎముకలు) తినే నక్కలు వుండతగునా అంటున్నారు. అన్నమయ్య తీవ్రవైష్ణవతత్వం పాఠకుల్ని సంభ్రమపరుస్తున్నది.

భావవివరణ :

అంతరుమాలినయట్టి (తారతమ్యాలు తెలియని) అధములారా! సంతకూటమి పొంత (వారం వారం జరిగే సంతల దగ్గర) పొరిచూపెగాదా? (భేద దృష్టితో చూచుటలాంటిదేకదా!) అంటే... ఒకడి కంటే ఇంకొకడు గొప్ప అని పరస్పరం మన్నించుకోవటం లాంటిదే ఈ విభిన్న దేవుళ్ళను కీర్తించటం కూడా.

ఒక కంసాలి ఇత్తడి బంగారం ఒకే రంగులో వున్నాయని సమానంగా తూస్తే... అది దోషమవుతుంది గాని, అనువవునా (అంగీకారము అవుతుందా? అదే విధంగా ఘనుడైన శ్రీహరితో అతిహీనులైన (కామక్రోధాలకు లొంగిపోయే) ఇతర దేవతలను సరిబోలిస్తే భూలోకంలో, అది నయము అవుతుందా? ననిచి (అతిశయించి) అట్లు చేయదగునా?

సింహాసనం మీద పట్టభద్రులు (సర్వశ్రేష్ఠుడని నిర్ణయించే ప్రశంసాపత్రం పొందినవారు) కూర్చోవాలి. అటువంటి సింహాసనం మీద వెట్టి చాకిరి చేసే బంటులను (నేటి కాలంలో బంట్రోతులు) కూర్చోబెట్టేవాళ్ళు వెఱ్ఱివాళ్ళు కాదా? శ్రీహరితో కలగూరగంప దేవుళ్ళను (రకరకాల కూరగాయలుండే గంపలో ఏవేవో కూరలున్నట్లు, వూరికొక్కరుండే దేవతలను) పెట్టి పూజిస్తే అది విందుకు పిలిచి పగవారిని గౌరవించుట కాదా?

మృగరాజైన సింహం వుండాల్సిన గుహలో, పొంచి (దాగికొని) కొంచక (సంకోచము లేక) వుండే నక్కలకు ఏం మిగులుతాయి? బొక్కలే కాక మృగాలు దొరుకుతాయా? ఆత్మస్థితుడైయుండే పరమాత్మ ఎవరు? ఆ శ్రీవేంకటేశ్వరుడే. ఆ దేవదేవునితో కొంచెపుదైవాల (అల్పులైన దేవతలను) సరితూచటం పలువంచలనేకాక (అమర్యాదకరమైన పనియే సుమా!)

సంపుటి : 2 కీర్తన : నన్ను నింతగా గడించి నాయమా దిగవిడువ
సంఖ్య : 39 పుట : 27 రాగం : కన్నడగౌళ

కన్నడగౌళ

25. నన్ను నింతగా గడించి నాయమా దిగవిడువ
అన్నిటా రక్షించకపో దంతర్యామి ॥పల్లవి॥

సొమ్ము వోవేసినవాఁడు చుట్టిచుట్టి వీథులెల్లా
కమ్మిక వెదకీనట కన్నదాఁకాను
నమ్మిన అజ్ఞానములో నన్నుఁబడవేసుకొని
అమ్మరో వూరకుందురా అంతర్యామి ॥నన్ను॥

వోడబేరమాడేవాఁడు వొకదరి చేరిచి
కూడినయర్థము గాచుకొనీనట
యీడనే ప్రపంచములో నిట్టె నన్ను దరిచేర్చి
వోడక కాచుకోరాదా వోయంతర్యామి ॥నన్ను॥

చేరి వుప్పమ్మేవాఁడు చిట్లు వేఁగనఁడట
వూరకే శ్రీవేంకటేశ వోపికతోడ
ఆరయ నన్నుఁ బుట్టించినట్టివాఁడవు నాభార...
మేరీతి నైన మోవు మిఁక నంతర్యామి ॥నన్ను॥ 39

అవతారిక :

పరమాత్మ మనలోనే అంతర్యామివలె వుంటాడనేది జగమెరిగిన సత్యం. మనని కల్పించిన వాడు ఆయనే కదా! శరీరాన్ని ఇచ్చి పోషించి, మనోవికాసము మనోవ్యాకులత కూడా కల్పించేవాడు ఆ శ్రీహరియే. ఇంతగా నన్ను గడించి (కల్పించి) ఇప్పుడు దారిమధ్యలో నన్ను దిగవిడచుట న్యాయమా ప్రభూ? నేనేమైపోతాను? ఓ అంతర్యామీ! అన్ని విధాలా నన్ను రక్షించక పోదు (కుదరదు). నన్ను పుట్టించావు కదా! మరి

నా భారం ఇంకెవరు మోస్తారు అదెవరివలనవుతుంది? నీకు తప్పదు అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావవివరణ :

ఓ దేవదేవా! నన్ను ఇంతగా గడించి (కల్పించి), ఇప్పుడు దిగవిడువ (ఉన్నట్లుండి వదలివేయుట) నాయమా (న్యాయమేనా?) ఓ అంతర్యామీ! (అంతరాత్మవలె నాలోనే వున్న మహానుభావా!) అన్నిటా నన్ను రక్షించక పోదు (తప్పదు) తండ్రీ!

ఒక అజ్ఞాని సొమ్ముపారేసికొనినాడు (ధనం పారవేసికొనినాడు). దానిని కన్నదాకాను (అది దొరికేదాకా) వీధులెల్లా చుట్టిచుట్టి కమ్మిక తిరుగుతూ వెదకుతూనే వుంటాడు. నేనూ అజ్ఞానినే కదా! నిన్ను పారవేసికొని అదేపని చేస్తున్నాను. అమ్మరో! (అయ్యయ్యో!!) నన్ను అజ్ఞానంలో పడవేసి ఈ రీతి వూరకుందువో? ఓ అంతర్యామీ! ఇది నీకు న్యాయమేనా తండ్రీ!

ఓడనుబేరం చేసికొని దానిపై వెళ్ళి వ్యాపారం చేసి వచ్చిన లాభం యెక్కడ లెక్కవేసికొంటాడు? సముద్రంమీదకాదు కదా! అట్లాగే ప్రపంచమనే ఈ మహాసాగరంలోంచి నన్ను దరితేర్చి అప్పుడు ఇట్టే నీలెక్కలు కట్టుకోరాదా? ఓడక (వదలిపెట్టక) కాచుకోరాదా? (కాపాడుకోకూడదా?) ఓ అంతర్యామీ! ఈ సముద్రం మధ్యలో నీవు లెక్కలు వేసికొంటూ కూర్చుంటే నాకు దిక్కెవరు? తండ్రీ! నీకు తెలియందేముంది?

బజారులో చేరి పువ్వమ్మెవాడు (పూలు అమ్ముకొనేవాడు) చిట్లువేగనడు (ఒకటి రెండు పనికి రాని పూలువున్నా పట్టించుకోకుండా మంచివాటితోపాటు వీటినీ చెలామణి చేస్తాడు). ఓ శ్రీవేంకటేశ్వరా ! నీవు ఎంతో ఓపికతో నన్ను పుట్టించావు. పైగా అంతర్యామివై నన్ను అనుక్షణం నిర్దేసిస్తున్నవాడవూ నీవే. మరి ఇక నా భారం నీవు కాక ఇంకెవరు మోపగలరు? (మోయగలరు?) నీకు తప్పదు ప్రభూ!

సంపుటి : 2 కీర్తన : నాకు నందు కేమి వోదు నన్ను నీ వేమిచూచేవు
సంఖ్య : 28 పుట : 19 రాగం : సాళంగనాట

సాళంగనాట

26. నాకు నందు కేమి వోదు నన్ను నీ వేమిచూచేవు
నీ కరుణ గలిగితే నించి చూపవయ్య ॥పల్లవి॥

ఘోరమైన దేహపు దుర్గుణ మేమి గలిగిన
ఆరసిఁ బ్రకృతిఁబోయి అడుగవయ్య
నేరని నాజన్మముతో (లో?) నేరుపేమిగల్లా నన్ను
ధారుణిఁ బుట్టించినవిధాత నడుగవయ్య ॥నాకు॥

పంచేంద్రియములలోని పాపమేమి గలిగినా
అంచెలఁగామునిఁబోయి అడుగవయ్య
ముంచిన నాకర్మములో మోసమేమి గలిగినా
మంచితనానఁ జేయించేమాయ నడుగవయ్య ॥నాకు॥

అన్నిటా నా వెనకటి అపరాధ మేమిగల్లా
మన్నించి నాగురుఁజూచి మానవయ్య
మిన్నక శ్రీ వేంకటేశ మీఁది పనులేమిగల్లా
నిన్నుఁజూచుకొని నన్ను నీవే యేలవయ్య ॥నాకు॥

అవతారిక :

అరిషడ్వర్గ ప్రేరితమైన మానవజన్మనెత్తాను. కాని ఈ జన్మ నీవిచ్చిందే కదా! ఈ దేహంతో చేసిన పాపాలకు ప్రకృతిది బాధ్యత. ఇకపోతే నన్ను ఇట్లా పుట్టించిన బ్రహ్మగారిది తప్పు. నాపంచేంద్రియాలదేమి తప్పు? వాటిని వశం చేసికొనిన మన్మథుడు బాగానే వున్నాడు. నీమాయ నడిపించినట్లు నడిచిన నా కర్మములో మోసమేముంది? పోనీ ఒకవేళ వున్నా... నా గురువును చూచి నన్ను వదిలివేయవయ్యా!

ఓ శ్రీవేంకటేశ్వరా! మీది పనులేమిగల్లా (నన్ను మించిన పనులు ఏమన్నావుంటే) సర్వేశ్వరుడవైన నిన్ను జూచుకొని, నేను నీ భృత్యుడను కాబట్టి నన్ను నీవే ఏలవయ్యా! ... అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావవివరణ :

నేను నేరస్థుడనని నీవు భావించవచ్చును. అది నీ తప్పు కాకపోవచ్చును. కానీ జరిగేవన్నీ నానేరములే నని అనటం ఏమి న్యాయం? ఒకవేళ నీవు నన్ను నిందించినా... నాకున్ అందుకేమియునుపోదు. నన్ను నేరస్థునిగా నీవేమి చూచేవు? నామీద జాలి కలిగితే నీ కరుణ చూపించు. కాని అయిన దానికి కాని దానికి నన్ను తప్పుబట్టకు స్వామీ!

నా దేహములో ఘోరమైన దుర్గుణములు కలిగినా నేనేం చేస్తాను? పోయి ప్రకృతిని అడుగవయ్యా. అది చేసే దుర్మార్గానికి నాదా తప్పు? నా జన్మమున ఏమాత్రము నేర్పు (తెలివీ, లేదా, అతితెలివి) వున్నా దానికి బాధ్యుడు నన్ను పుట్టించిన విధాత (బ్రహ్మగారు). పోయి ఆయన్నడగవయ్యా! ఏమిటిరా బ్రహ్మా! వీడిజన్మ ఇలా తగలబడిందేమిటి? అని ఆయనను అడుగు.

నా పంచేంద్రియములవల్ల పాపములు జరుగుతున్నవి అని అనడమేమి సబబు ప్రభూ! నీవు పోయి వాటిని వశం చేసికొని నన్ను ఆడిస్తున్న ఆమన్మథుని అడగరాదా? నీ మాయ, మంచిని కనబరుస్తూ మాచేత అనేక కర్మములను చేయించుచున్నది. అది కర్మబంధం. దానిలో మునిగి మేము బయటపడలేకున్నాము. కర్మలను చేస్తూనే వున్నాం ఫలితం అనుభవిస్తూనే వున్నాం. ఇందులో కర్మల యొక్క మోసం ఏముంది? మహామాయ నీదయితే మా కర్మలేం చేస్తాయి స్వామీ!

పోనీ... నా పురాకృత కర్మములు (వెనుకటి జన్మల కర్మలు) అపరాధ భూయిష్టములనుకొందాం. కాని నా గురుపుంగవులు మహానుభావులు వారిని జూచి నన్ను మన్నించరాదా? మిన్నక (ఊరకనే) నన్ను యేలుకోవయ్యా! ఎందుకంటే... ఓ శ్రీవేంకటేశ్వరా! మీది పనులేమిగల్లా (నన్ను మించిన పనులు, నేను ఒక వేళ ఏమన్నా చేసివున్నా... నేను నీ భృత్యుణ్ణి కాబట్టి) నిన్ను జూచుకొని నీవే నన్ను యేలుకోవాలి. నీకు తప్పదు మరి.

సంపుటి: 2 కీర్తన : సేయనివాడెవ్వడుచేరి చిల్లర దోషాలు
సంఖ్య : 72 పుట : 49 రాగం : రామక్రియ

రామక్రియ

27. సేయనివాఁ డెవ్వఁడు చేరి చిల్లర దోషాలు
యేయెడ జీవులజాడ లీశ్వరకల్పితమే ॥పల్లవి॥

దేవునినమ్మినయట్టి దేహియట యాతనికి
యీవల నెంతటిపాప మేమిసేసును
భావించి యన్నినేరాలు పరిహరించు నతఁడే
ఆవటించు సూర్యునికి నంధకార మెదురా ॥సేయ॥

పూజింపించుకొనేవాఁడు భువనరక్షకుఁడట
తేజముతో దురితాలు తెంచఁగలేఁడా
రాజు సేసినయా ణాజ్ఞ రాజుకంటే నెక్కుడా
వోజతో వజ్రాయుధాన కోపునా పర్వతాలు ॥సేయ॥

చేతనాత్మకుఁడట శ్రీవేంకటేశ్వరుఁడు
జాతిలేనిజీవునికి స్వతంత్ర మేది
కాతరపుజన్మానకుఁ గార్యకారణ మేది
యేతున గరుడనికి నెదురా పాములు ॥సేయ॥ 72

అవతారిక :

అన్ని మతములు ఘోషించేది ఒకే సూత్రాన్ని. పాపము చేసిన వానిని ద్వేషించకండి. వాడి పాపమును ద్వేషించి వాడు తిరిగి ఆ పాపం చేయకుండా సన్మార్గంలో నడపండి. చిన్న చిన్న దోషములు వుండని మానవుడు వుండనే వుండడు. ఈ జీవుల జాడుల (రూట్స్) ఈశ్వర కల్పితములు. కాబట్టి వీరిని సంస్కరించే శక్తి వున్నదీ ఆయనకే. అసలీ జీవుడికి స్వతంత్రమేది? చేతనాత్మకుడైన శ్రీ వేంకటేశ్వరుడు దయతలచక పోతే... అంతే సంగతులు అంటున్నారు అన్నమాచార్యులవారు. నేను

పండితుడిని, సమర్థుడిని, స్వతంత్రుడిని అనుకునే అమాయక జీవుల్లారా! పాములు గరుత్మంతుణ్ణి ఎదిరించగలవా? అంటున్నారు.

భావవివరణ :

ఓ మానవులారా! చిల్లరదోషములు (చిన్నచిన్న తప్పులు) చేయని వాడెవ్వడుంటాడు? ఏయెడ (ఎక్కడెక్కడా) జీవుల జాడలు (విధానములన్నియును) ఈశ్వర కల్పితములే. (భగవంతునిచే నిర్దేశించబడినవి మాత్రమే). ఆయన సంకల్పంతోనే అన్నీ జరుగుతాయి.

దేవుని నమ్మినటువంటి దేహి (జీవుడు). వాడిని ఎంతటి పాపమైనా యేమిసేసును (ఏం చేస్తుంది?) ఈ జీవుడి నేరాలన్నింటినీ భావించి (గ్రహించి) పరిహరించే (నిర్మూలించే) సమర్థుడు ఆ సర్వేశ్వరుడే. ఆవటించి (పొందుపడి... లేక ... పూనుకొని) సూర్యకాంతిని చీకటి ఏమిచేయగలదు?

మనందరితో పూజింపించుకొనేవాడు (పూజలు చేయించుకొనేవాడు) పదునాల్గు భువనాలను రక్షించు దీక్షాదక్షుడైన జగదీశ్వరుడు. ఆ తేజోమూర్తి మన దురితములను (పాపములను) తెంచగ లేడా? రాజు సేసిన, ఆణాజ్ఞ (ఆన+ఆజ్ఞ) రాజుగారికంటే ఎక్కువా? ఓజతో (దేదీప్యమానంగా వెలిగిపోయే) వజ్రాయుధానికి (ఇంద్రుని వజ్రాయుధాన్ని) పర్వతాలు ఓపునా? (చాలునా)

శ్రీవేంకటేశ్వరుడు చేతనాత్మకుడట (చేతనాస్వరూపుడైన ఆత్మవలె జీవులన్నిటిలోనూ వున్నాడు). ఆ జీవుడికి జాతి అనేది లేనే లేదు. ఇక స్వతంత్రం మాత్రం ఎక్కడుంది? ఇవన్నీ కాతరపు జన్మలే (తత్తరపాటు కలిగిన బ్రతుకులే). వీటికి కార్యకారణమేది? (ఇది ఇందుకు జరిగింది అని చెప్పగలిగిన మొనగాడెవడు?) వాడే... ఆ జగన్నాథుడే చెప్పగలడు. చిన్న చిన్న పాములవంటి ఈ జీవులు గరుత్మంతుడువంటి పరమాత్మ నెదిరించగలవా?

సంపుటి : 2 కీర్తన : ఇద్దరు దేహసమ్మంధ మిదివో మాయ
సంఖ్య : 92 పుట : 62 రాగం : సామంతం

సామంతం

28. ఇద్దరు దేహసమ్మంధ మిదివో మాయ
గద్దించి యాడవుండునో కడసారీ తాను ॥పల్లవి॥

తోడఁబుట్టినమమత తొడఁగి కొన్నాళ్లకు
వాడికె పుత్రులమీఁదవలె నుండదు
వేడుక వారెవ్వరో వీరెవ్వరో కాని
కూడపెట్టీ వీరికే కొట్లాడీ వారికే ॥ఇద్ద॥

తల్లిమీఁదఁ గల భక్తి తనకే కొన్నాళ్లకు
యిల్లాలుమీఁదవలోఁబఎ నింత వుండదు
వెల్లవిరి నది యెంత విచారించ నిది యంత
యిల్లుముంగి లొక్కరిది యెరపు వొక్కరిది ॥ఇద్ద॥

నీతితో శ్రీవేంకటేశునిత్యసేవ కొన్నాళ్ల –
కీతల సంసారమంత యితవు గాదు
అతఁడెట్టు యివిమెట్టు అందరూ నెఱిఁగినదే
చేతు లొకటిమీఁదట చిత్త మొకయందు ॥ఇద్ద॥ 92

అవతారిక :

మానవుని జీవితంలో బాల్య, కౌమార, యౌవన, వృద్ధాప్య దశలుంటాయి. ఆయా దశలలో అతనికి అప్పటికవసరమైన బంధాలు అనుబంధాలు కలుగుతాయి. అన్నదమ్ములు సర్వస్వం అనుకొని, ఆడిపాడి వారితో పెరిగి తనకి పుత్రులు కలగగానే సోదరులతోనే కలహిస్తాడు. తల్లి మీద భక్తితో పెరిగినవాడే, తన ఇల్లాలు రాంగానే. ఇల్లాలికి ముంగిలి (ఇంటిలో ముందు ప్రదేశం) తల్లికి యెరవు (అదుక్కోవటం) ఇస్తాడు. శ్రీవేంకటేశ్వరుని సేవ చేయు దీక్షాపరులకు ఇతర సంసార

తాపత్రయములు రుచించవు. వారి చేతలు ప్రాపంచికంగావున్నా, మనస్సు స్వామిపైనే వుంటుంది. మరింకొందరు దౌర్భాగ్యులున్నారు. వారి చిత్తము సంసారము మీద, చేతులు దేవుడి పూజమీద వుంటాయి. అంతా... ఆ నామాలవాడి మాయ అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావవివరణ :

నేను ఇకపై చెప్పబోవు... ఇద్దరు (రెండు రకములు) వారితోటి సంబంధములూ ఆత్మ సంబంధములు కావు. అవి ఈ జన్మకు, ఈ దేహంతో కలిగిన సంబంధములు మాత్రమే. ఇది ఒక మాయ. తాను (ఈ జీవి), గద్దించి (సాధికారంగా) కడసారి (క్రిందటి జన్మలో) ఏడవుండునో (ఎక్కడున్నాడో ఎవరికి తెలుసు?) అంటే ఇప్పుడు నేను ఈ పేరు గల వ్యక్తిని... (క్రిందటి జన్మలో ఎవరినో...?)

తోడబుట్టినవాళ్ళతో ఆడుతూ పాడుతూ పెరిగినా, తన పుత్రులు పెరిగి పెద్దవుతూనే, ఆస్తికోసం తగాదాలు పడతారు. ఆలోచించండి. నిజానికి వారెవ్వరు? వీరెవ్వరు. ఇద్దరూ కేవలం ఈ జన్మకే వచ్చినవారుకదా! గత జన్మలో లేరు... వచ్చే జన్మలో రారు. మరి కొడుకులకోసం కూడబెడతారు, తోబుట్టులతో కోట్లాడుతారు. ఏమిటీమాయ?

మానవజీవితంలో తన తల్లి మీద ఎంత భక్తితో పెరిగినా అది తన ఇల్లాలి మీదవున్నంత వుండదు. ఇదంతా విచారించి చూస్తే వెల్లువిరిసిన మాయ అనిపించకమానదు. ఆలోచించి చూడండి ఒక్కరికి (పెళ్ళానికి) ఇల్లు ముంగిటి అంటే ఇంటిలోని ముందు ప్రదేశం (నేటి భాషలో పడకగది). ఇంకొకరికి (తల్లికి) ఎరవు (ఎరువు తెచ్చుకొని బ్రతకటం). ఏమిటీ ఘోరం?

నీతితో (ఒక నియమం ప్రకారం) శ్రీవేంకటేశ్వరుని సేవచేస్తూ బ్రతికినా... కొన్నాళ్ళకు విధి ప్రేరితమై సంసార తాపత్రయంలో పడతారు (ఆచార్యులవారికే ఆ బాధ తప్పలేదు... మనమెంతటివాళ్ళం చెప్పండి). ఆ హరిసేవ, సంసారసుఖమంత ఇతవు (హితవు) అంటే హితకరముగానుండదు. ఆ శ్రీహరి సేవకు చేతుల్ని వాడెదము కాని ముఖ్యమైన చిత్తాన్ని మాత్రం సంసారంవైపే మరల్చివుంచుతామే... ఏమిటీ మాయ?

సంపుటి : 2 కీర్తన : చెల్లబో తియ్యనినోర జే దేటికి యీ
సంఖ్య : 59 పుట : 40 రాగం : సామంతం

సామంతం

29. చెల్లఁబో తియ్యనినోరఁ జేఁ దేఁటికి యీ–
పల్లదపుఁగోరికలపాలు సేయవలెనా ॥పల్లవి॥

ఆసలకు నాదేహ మమ్ముకొంటి వింటింట
దాసునిఁగా నాపాలిదైవమా నీవు
పోసరించి భూమిలోనఁ బుట్టించి రక్షించి
యీసులేక భంగపెట్టు టిది గొంత వలెనా ॥చెల్లఁ॥

పామరపుటింద్రియాలబారిఁ దోసితివి నన్ను
దామెనకట్టుగాఁ గట్టి తత్వమా నీవు
దోమటి నామతిలోనఁ దోడునీడవై యుండి
పామేటిసుఖములనే భ్రమయించవలెనా ॥చెల్లఁ॥

గక్కన నింతట నన్నుఁ గరుణించితివి నేఁడు
మొక్కితి శ్రీవేంకటాద్రిమూలమా నీకు
దిక్కుదెసవై నాకు దేవుఁడవై యేలికవు
చొక్కి నామన సింత సోదించవలెనా ॥చెల్లఁ॥ 59

అవతారిక :

ఈ కీర్తనలోని కొన్ని మాటలు నేటి తెలుగులో వాడుకలో లేవు. వాటికి అన్నమాచార్యులవారి భావం అంత సులభగ్రాహ్యం కాదు. 'దోమటి నామదిలోన తోడు నీవై యుండి...” అనే వాక్యంలో దోమటి అంటే దోషభూయిష్టమైన అనే భావనలో వుపయోగించారు. “పల్లదపు కోరికలకు” తిన్నని అర్థం చెప్పటం కూడా కష్టమే. “చెల్లబో” అనేది సంతోషాన్ని వ్యక్తం చేసే అన్యయపదము. నేటి కాలంలో

“సరిపోయిందిపో” అని సంతోషంతో అంటున్నాం. ఈ రోజుల్లో ఈ పల్లవికి రమారమి ఇలా అర్థం చెప్పుకోవచ్చు. “సరిపోయిందిపో! తీపిని కోరుకునే నోటిలో చేదు యెందుకు పెడతారయ్యా! బ్రతుకును, పల్లదపు (వ్యర్థమైన) కోరికల పాలు చేయతగునా”? అంటున్నారు.

భావవివరణ :

చెల్లబో! (సరిపోయింది పో!) తియ్యటి నోటిలో చేదు యెందుకు పెడతారయ్యా! మన బ్రతుకును ఈ పల్లదపు కోరికల పాలు (వ్యర్థమైన వాంఛలపరం) చేయతగునా?

ఆసలకున్ ఆ దేహము అమ్ముకొంటివి (ఆ యొక్క దేహం ఆశలకు అమ్ముడు పోయింది). ఇంటింటా దాసునిగా బ్రతికాను. నా పాలిదైవమా! నీవు భూమిపై నన్ను నీదాసునిగా పుట్టించి రక్షించావు. ఈసులేక (ఈర్ష్యకులోనుగాక) నన్ను కాపాడాలి. కానీ ఇట్లా భంగపెట్టుట ఇది కొంత (ఇది చిన్నతనము). ప్రభూ! ఇది వలెనా? (తగిన పనియేయా)

నీవు చేసిన పని యేమిటో చూశావా స్వామీ! నన్ను పామరపు ఇంద్రియాల (అజ్ఞానపు భోగేంద్రియాల) పాలు జేశావు. ముడిమీద ముడివేసి కట్టిపడేసి, తత్వ చింతన లేకుండా చేశావు. దోషభూయిష్టమైన నా మనస్సులో తోడు నీడవైయుండి కాపాడక నన్ను, పామేటి సుఖముల (వశపరచుకొను ఇంద్రియ భోగముల) పాలు చేశాను. అట్లా భ్రమయింపజేయ తగునా? ప్రభూ!

ఈ వ్యవహారం ఇట్లా నడుస్తూ... ఈ జన్మల చక్రబంధములో నేను ముప్పు తిప్పలు పడుతుంటే ఒకరోజు నీకే నాపై జాలి కలిగింది. నన్ను గక్కున (వెంటనే) కరుణించావు. శ్రీ వేంకటాద్రి మూలాధారమైన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను భక్తితో నీకు మ్రొక్కితిని తండ్రీ! నీవు నాకు దిక్కుదెస (నిర్దేశనము) అయ్యావు. నా దైవమై నన్ను పరిపాలించావు. అటువంటప్పుడు నా మనస్సును ఇంతగా చొక్కి సోధించవలెనా? (ఇంతచేటు పరీక్షించవలెనా) ప్రభూ!

సంపుటి : 2 కీర్తన : ఏమిసేసేమిక నేము యెంతని దాచుకొందుము

సంఖ్య : 51 పుట : 35 రాగం : మలహరి

మలహరి

30. ఏమి సేసే మిఁక నేము యెంతని దాఁచుకొందుము
నీమహిమ యింతంతననేరము నేమయ్యా ॥పల్లవి॥

అంది నిన్ను నొకమాటు హరియని నుడిగితే
పొందినపాతకమెల్లాఁ బొలిసిపోయ
మందలించి మఱి యొకమాటు నుడిగినఫల –
మందె నీ కప్పగించితి మదిగోవయ్యా – ॥ఏమి॥

యిట్టె మీకు. రెండుచేతులెత్తొకమాటు మొక్కితే
గట్టిగా నిహపరాలు గలిగె మాకు
దట్టముగ సాష్టాంగదండము వెట్టినఫల –
మట్టె నీమీఁద నున్నది అదిగోవయ్యా ॥ఏమి॥

సరుగ నీకొకమాటు శరణన్నమాత్రమున
సిరులఁబుణ్యుఁడ నైతి శ్రీవేంకటేశ
ధరలోన నే నీకు దాసుఁడనైతి శ్రీవేంకటేశ
ధరలోన నే నీకు దాసుఁడనైనఫల –
మరయ నీమీఁద నున్న దదిగోవయ్యా ॥ఏమి॥ 51

అవతారిక :

వైరాగ్యానికి పునాది భక్తి. ఫలితం అధ్యాత్మచింతన. కారణం భగవత్కృప. దాదాపు అందరూ భోగంతో మొదలుపెట్టి, విరాగులై, యోగులై ముక్తి పొందినవారే. అన్నమాచార్యులవారి ఈ కీర్తన వారికి హరిపైగల పరిపూర్ణ భక్తిని మరీమరీ చాటుతోంది. నీమహిమ ఇంతటిది అనటానికి వీలులేదు. ఎంతని దాచిపెట్టగలం. ఎక్కడచూచినా నీ మహిమే. మేం మరేం

చేయగలమయ్యా... అంటున్నారు. నేను నీకు దాసుడను. అట్లా ఆయినదాని ఫలము నీమీదనున్నది అనగా నిన్ను మించి వున్నది, అంటున్నాడు. హరి కంటే హరిదాసులే అధికులనే దాసభక్తిని చాటుతున్నారు.

భావవివరణ :

ఇకన్, ఏము (మేము) యేమిసేసేము? నీమహిమ ఎంతని దాచుకొందుము. అయ్యా! అది ఇంతింత అన నేరము (ఇంతుంటుందని ఒక పరిమితిని చెప్పఏము, తండ్రీ!)

అంది (పూనుకొని), ఒక్కమాటు 'హరి' అని నుడిగితే (అంటే) కలిగిన పాపములన్నియు పొలసిపోయ (చచ్చిపోతాయి). అరె!! అని తెలివితెచ్చుకొని, ఇంకొకమాటు 'హరి' అంటే అంతా... మిగిలిపోయిన పుణ్యమే కదా! అదిగో అప్పుడు నేనేం చేశానంటే ఆ పుణ్యఫలం నీకే సమర్పించాను. ఇక నాకు విచారమెందుకయ్యా!

ఏదీ నీ గుడికి వచ్చాను కదా! అని ఒక్క మాటు నా రెండు చేతులూ ఎత్తి నీకు నమస్కరించాను. దాంతో మాకు ఇహపరాలు గలిగే (ఈ లోకంలో పొందవలసిన భోగాలన్నీ దక్కటమే కాకుండా, పరలోకంలో సుఖం పొందే అర్హత కూడా సంపాదించుకొన్నాను). సరే, ఇదేదో బాగుందని దట్టముగా (బాగా) నీకు సాష్టాంగ నమస్కారం చేశాను. అదిగో దాని ఫలితము నీమీద నున్నది (నిన్ను మించి పోయింది). అయ్యా! అదిగో ఇందులో నా గొప్పతనం యేమీలేదు.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు ఒక్కమాటు, సరగున (వేగముగా) శరణు మహాప్రభో! అన్నాను. అంతమాత్రాన అన్ని వైభవాలతో పుణ్యాత్ముడనయ్యాను. మరి అటువంటప్పుడు నీ దాస్యమే జీవనోపాధిగానెంచుకొన్నవారు పొందే ఫలము యెంత గొప్పది? అయ్యా! అదిగో... అది అరయన్ (చూడగా), నీమీద నున్నది (నిన్ను మించిపోయింది ప్రభూ!)

సంపుటి : 2 కీర్తన : విభుడ వింతటికి వెరవుతో ననుఁగావు
సంఖ్య : 66 పుట : 45 రాగం : పాడి

పాడి

31. విభుఁడ వింతటికి వెరవుతో ననుఁగావు
అభయాహ స్తముతోడి ఆదిమూలమా ॥పల్లవి॥

పలులంపటాలచేతఁ బాటువడి పాటువడి
అలసితిఁ గావవే వో ఆదిమూలమా
చలమరి యితరసంసారభ్రాంతిఁ జిక్కితి న –
న్నలరించి కావవే వో ఆదిమూలమా ॥విభుఁ॥

యెంతకైనా నాసలచే యేఁగేఁగి వేసరితి –
నంత కోపఁ గావవే వో ఆదిమూలమా
సంతలచుట్టరికాల జడిసితి నిఁకఁ గావు
అంతరాత్మ నాపాలి) ఆదిమూలమా ॥విభుఁ॥

రంటదెప్పుటింద్రియాల రవ్వైతిఁ గావవే వో –
అంటిన శ్రీవేంకటాద్రి ఆదిమూలమా
గెంటక ముమ్మాటికిని నీకే శర–
ణంటిఁ గావవే వో ఆదిమూలమా ॥విభుఁ॥ 66

అవతారిక :

పరమాత్మ అన్నిటికి ఆదిమూలము అంటే "తల్లివేరు॥ చెట్టుకి తల్లివేరు ఎలాగో ఈ విశ్వానికి పరమాత్మ అటువంటివాడు. ఈ విశ్వానికంతటికీ ఆయన విభుడు. అంటే భర్త. అభయహస్తముతో నన్ను కాపాడుము ప్రభూ! అంటున్నారు అన్నమాచార్యులవారు. స్వామీ! నేను "రంటదెప్పుటింద్రియాల రవ్వైతిని. నన్ను కాపాడవయ్యా" అంటున్నారు. అంటే ఏమిటో తెలియాలంటే భావ వితరణ చదవక తప్పదు మరి. లంపటము – అంటే, దొంగతిండితినే గొడ్లకు మెడనుండి రెండు

కొయ్యలను వ్రేలాడకడతారు. పరుగెత్తి పారిపోకుండా అవి కాళ్ళకు అడ్డం తగలి గొడ్లను ఇబ్బంది పెడతాయి. అదే లంపటము. మనిషికి లంపటమెవటో వూహించండి.

భావవితరణ :

అన్నిటికీ ఆదిమూలము (రూట్ కాజ్) వైన ఓ పరమాత్మా! నీవు ఇంతటికీ (జగత్తునకు) ఆధారభూతుడవు. నెరవుతో (ఉపాయముతో) నన్ను కాపాడుము ప్రభూ! నీ అభయమును చూపు హస్తమును నాకందించి నన్ను రక్షించుము.

ఓ ఆదిమూలమా! అనేక లంపటాలతో (గుది కొయ్యలతో) ఇబ్బందులు పడీ పడీ బాగా అలసిపోయాను. నన్ను ఇకనైనా విముక్తుని చేసి రక్షించరాదా? నాకు చలమరి భ్రాంతులు (మత్సరమును పెంచు భ్రమలు) కలిగించు ఇతర సంసార తాపత్రయములలో చిక్కుపడిపోయాను. నన్ను సేదదీర్చి ఆదుకోరాదా? నీవు తప్ప నన్ను ఆదుకోగలవారెవ్వరు?

ఓ ఆదిమూలమా! ఆసలకై (నా ఆశలను తీర్చుకొనుట కొరకు) ఎంతైనా (ఎంత దూరమైనా) పోయిపోయి వేసరితి (విసిగిపోయాను). అంతకు ఓపన్ కావవే (అటుపైన ఓపికతో నన్ను కాపాడరాదా?) నాకున్న చుట్టరికాలు అన్నీ సంతలో చుట్టరికాలు. ఎదురుపడ్డప్పుడు కలుపుగోరుతనంగా పరామర్శించే వారేకాని, ఆపదలో ఆదుకొనేవాడొక్కడూ వుండడు. నా పాలిటి అంతరాత్ముడవైన ఓ ఆదిమూలమా! నన్ను అనుగ్రహించవయ్యా!

ఓ శ్రీవేంకటేశ్వరా! నేను రంటన్ తిప్పు ఇంద్రియాల రవ్వ యైతిని (రెండిటి యందు, సుడిగుండం వలె త్రిప్పే ఇంద్రియాలకు చూరచూర అయిపోయాను). అనగా... సుఖదుఃఖముల వంటి ద్వంద్వములు కలిగించు ఇంద్రియ లోలుడనయ్యాను. ముమ్మాటికి (మనో వాక్కు, కాయకర్మలు అనే మూడిటితోనూ నీకు శరణాగతుడనయ్యాను. ఓ ఆదిమూలమా! నన్ను గెంటక (తిరస్కరించక) కావవే (కాపాడరాదా తండ్రీ!)

సంపుటి : 2 కీర్తన : అన్నిటికి నొడయడవైన శ్రీపతివి నీవు

సంఖ్య : 64 పుట : 43 రాగం : శ్రీరాగం

శ్రీరాగం

32. అన్నిటికి నొడయఁడవైన శ్రీపతివి నీవు
యెన్నరాదు మా బలఁగఁ మెంచుకో మా పొఁజు ॥పల్లవి॥

జ్ఞానేంద్రియము లైదు శరీరిలోపల
ఆనక కర్మేంద్రియము లైదు
తానకపు కామక్రోధాలవర్గము లారు
యీ నెలవు పంచభూతా లెంచు మాపొఁజు ॥అన్ని॥

తప్పనిగుణాలు మూఁడు తనువికారము లారు
అప్పటి మనోబుద్ధ్యహంకారాలు
వుప్పతిల్లువిషయము లుడివోని వొక అయిదు
యిప్పటి మించేకోపము యెంచుకో మాపొఁజు ॥అన్ని॥

ఆఁకలి దప్పియును మానావమానములను
సోఁకినశీతోష్ణాలు సుఖదుఃఖాలు
మూఁకగమికాఁడ నేను మొక్కెద శ్రీవేంకటేశ
యేఁకటారఁ గడపేవా నెంచుకో మాపొఁజు ॥అన్ని॥ 64

అవతారిక :

నేటికాలంలో మనవెంట ఎంతమంది 'గుండాలు' వుంటే మనం అంత గొప్పవాళ్ళమని గుర్తు. అవునా? అలాగే అన్నమాచార్యులవారి కాలంలో ఒక రాజుగారికి ఎంత పెద్ద సేన వుంటే అంత గొప్పవాడని ప్రసిద్ధి. ఓ శ్రీపతీ! మా పొజు (మా బలగం) కూడా అంత తేలికగా లెక్కించలేము. కావాలంటే లెక్కపెట్టుకో అని ఒక ఏభైమంది లెక్కచెబుతున్నారు. వీటితో నేను మూకగమికాడను (చుట్టుముట్టి వెంటవచ్చే నాయకుడును). ఓ శ్రీవేంకటేశ్వరా! నీకు మాత్రం నేను మొక్కుతాను "ఏకటార గడపేవా నెంచుకో మాపొజు" అని అంటున్నారు. అంటే ఏమిటో... ఆపొజు వివరాలు

తెలయాలంటే... ఇంకో దారి లేదు. ఈ కీర్తనకు భావ వివరణ చదవాల్సిందే... తప్పదు. ఇంతకీ... ఒడయడవైన.... అంటే యేమిటో తెలుసునా మగడవైన లేక భర్తవైన అని అర్థం.

భావవివరణ:

ప్రభూ! శ్రీపతివైన నీవు అన్నిటికీ ఒడయడవైన (భర్తవైన) జగన్నాథుడవు. అయినప్పటికీ నేనూ తక్కువ వాడిని కాదు. మా బలగము (సేనను) యెంచరాదు (అంతతేలికగా లెక్కించలేము). కావాలంటే చెబుతాను, యెంచుకో (లెక్కించుకో) మా పొజు (ఏన).

మాకు (నాకు) ఐదు జ్ఞానేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము), ఆనక (ఆ తరువాత) ఐదు కర్మేంద్రియాలు (కాళ్ళు, చేతులు మొ॥) తానకపు (స్థానం చేసికొనిన) ఆరుగురు మిత్రుల్లాంటి శత్రువులు (కామ, క్రోధ, మోహ, లోభ, మద, మత్సరములు), వీటన్నింటికీ నెలవైన స్థానమైన (భూమి, ఆకాశము వంటి) పంచభూతాలు వున్నాయి. ఈ లెక్క సరిపోయిందా?

ఇంకా విను... జీవులందరికి తప్పని సరైన మూడు గుణాలు (సత్త్వ, రజస్తమో గుణములు) నాకూ వున్నాయి. వాటితోపాటు శైశవ, బాల్య, యౌవన, కౌమార, వృద్ధాప్య, మరణావస్థలవంటి దశలలో వచ్చే ఆరు వికారాలు నాకూ వున్నాయి. ఎన్నడూ ఉడివోని (తొలగని) గ్రంథ పరిజ్ఞానంతో నేర్చిన ఆరు విషయములు, అప్పటి (మరల మరల వేధించే) మనస్సు, బుద్ధి, అహంకారం నాకూ వున్నాయి. ఇంకొకటుంది ... అది, ఇప్పటిమించే కోపం (అవకాశాన్ని మించే కోపము) కూడా వుంది.

ఇక మరొకమారు మాపొజు లెక్కించుకో, స్వామీ! ఆకలి, దప్పిక, మానావమానాలు నాకూ వున్నాయి. ఇక సుఖదుఃఖాలు, కలిమిలేములు, శీతోష్ణాలు, ఇష్టాయిష్టాలు, మొదలైన ద్వంద్వముల గురించి చెప్పనే అక్కరలేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఏను (నేను) మూకగమికాడను (వెంట వెంట నా బలగాన్ని తిప్పుకొని నడిచేవాడను). ఇన్నాళ్ళు ఇలాగే బ్రతికాను. ఇప్పుడు బుద్ధి వచ్చింది. కావున, ఏకటారన్ (మిక్కిలి ఆపేక్షతో) కడపేవా (గడుపు తావా?) అని మాపొజునెంచక నన్ను కనికరించు. నీకు మ్రొక్కెదను తండ్రీ!

సంపుటి : 2 కీర్తన : ఏమిసేతు దైవమాయెన్నడు గరుణించేవో

సంఖ్య : 105 పుట : 71 రాగం : భైరవి

భైరవి

33. ఏమిసేతు దైవమా యెన్నఁడు గరుణించేవో
దామెనసంసారములోఁ దట్టువడీ మనసు ॥పల్లవి॥

యెక్కడిపగయొకో ఇంద్రియాలు నన్నుఁబట్టి
చక్కు ముక్కు సేసి యెంచి సాదించీని
గుక్కక యేమిసేసినకొలయొకో వెంటవెంట
వెక్కసపు పుట్టువులై వెనుతగిలీని ॥ఏమి॥

యెన్నాళ్లపాపమొకో యెడతెగక నాలోన
వున్న తపుఁగోపమై వుమ్మగిలీని
తిన్నని యెవ్వరిచేతితిట్టు దాఁకినవిధమో
విన్నని విజ్ఞానమెల్లా వీటిఁబోయఁ దుదిని ॥ఏమి॥

యేవేళ గుణమో యెడతెగని కర్మాలు
రావిమానిజిగురై వూరక యంటీని
శ్రీ వేంకటేశుఁడ నీవు చిత్తములోపల నుండి
కావఁగఁగదా నీవే గతి యనవలసె ॥ఏమి॥ 105

అవతారిక :

సంసారము అంటే ఆలుబిడ్డలతోడియునికి అని అర్థం. భార్యాపిల్లలతో సుఖదుఃఖాలు అనుభవిస్తూ, మనుష్యుడు జీవనయానాన్ని కొనసాగించటమే సంసారమంటే. ఇది ఒక దామెన సంసారము (అనేకమైన బంధములు గల సంసారము). నామనస్సు ఇందులో తట్టువడీ (ఇరుక్కుపోయినది). ఓ దైవమా! ఏమిచేయగలను? దిక్కు తోచుట లేదు. నన్ను యెన్నడు కరుణిస్తావు తండ్రీ ! అని ఆక్రోశిస్తున్నారు అన్నమాచార్యులవారు. త్రిగుణాత్మకమైన కర్మలను అంతూపొంతూ లేక చేస్తుండటం వలన వాటి కర్మఫలం "రావిమాని జిగురై

వూరకే అంటీని" ... అంటున్నారు. అంటే యేమిటో తెలియాలంటే, భావవివరణ చదవక తప్పదు... మరి.

భావవివరణ :

ఓ దైవమా! నేనేమి సేతును (చేసెదను)? దామెన సంసారములో (అనేక బంధనములు గల సంసారములో) మనసు (నాయొక్క మనస్సు) తట్టువడీ (ఇరుక్కుపోయింది). బయటకు రాలేకపోతున్నాను. నన్ను కనికరించుము తండ్రీ!

ఎక్కడి పగయో కాని నా ఇంద్రియాలు నన్ను యెంచి బట్టి (యెంచిపట్టుకొని) నన్ను చక్కుముక్కుసేసి (చిందరవందజేసి) సాధించినవి. ఏమి చేసిన కొలయొకో (పగసాధింపో) కాని, వెంటవెంటనే గుక్కక (నన్ను గ్రుక్కతిప్పుకోనివ్వకుండా వెంటబడి తరిమి తరిమి) వెక్కసపు పుట్టువులై (దుస్సహమైన జన్మలై) వెనుతగలీని (వెంటతగులుకొన్నాయి). ప్రభూ! ఇప్పుడు నాగతి ఏమిటి?

స్వామీ! ఎన్నాళ్ళనుంచి నేను చేసికొనిన పాపమో కాని, నాలో అది అంతులేని కోపముగా, ఉమ్మగిలి (ఉడకబెట్టి) నాకు మనశ్శాంతి లేకుండా చేసింది. ఎవ్వరిచేత యెన్నడు తిట్టుదాకిన విధమో (శపించబడితినో కాని)... తుది (చివరికి) విశిష్టమైన ఆత్మజ్ఞానము, యెల్లా వీటుబోయెను (అంతా నష్టపోయింది).

ఓ దేవదేవా! ఏవేళ గుణమో (ఎప్పుడు ఏ గుణము ఆవహిస్తుందో కాని) త్రిగుణాత్మకమై (సత్వ రజ స్తమో గుణావసిష్ఠుడనై) అంతులేని కర్మలు చేస్తూనే వున్నాను. అవి రావిమాని జిగురై (రావి చెట్టునుండి కారే బంకవలె) నాకు అంటుకొని ఎన్నటికీ వదలటంలేదు. ఓ శ్రీవేంకటేశుడా! నీవు నా చిత్తములోపల తిష్టవేసికొని వుండి, కావగన్ (రక్షించుటకు).... నీవే గతియనవలసె కదా! (అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ... అని అనవలెను కదా!)

సంపుటి : 2 కీర్తన : చెల్లనెక్కికొంటివిగా జీవుడయీ బలుకోట
సంఖ్య : 84 పుట : 57 రాగం : కాంబోది

కాంబోది

34. చెల్ల నెక్కికొంటివిగా జీవుఁడ యీబలుకోటా
బల్లిదుఁడ నీకు నేఁడు పట్టమాయఁ గోటా ॥పల్లవి॥

తొమ్మిదిగవనులైన దొడ్డతోలుఁగోటా
కొమ్మలచవుల మూలకొత్తళాలకోటా
వమ్ములేని మెడవంపువంకదారకోటా
పమ్మి పగవారినెల్లా పట్టుకొన్న కోటా ॥చెల్ల॥

తలవాకిలిదంతపుతలుపులకోటా
తలిరుఁజేతులపెద్దదంతెనాలకోటా
వెలియాసలనేదండువిడిసినకోటా
గులుగై యింద్రియములు కొల్లగొన్నకోటా ॥చెల్ల॥

నడచప్పరములనే నలువైనకోటా
జడిసినచెవుల మించుసవరణకోటా
పడనిపాట్లఁ బడి ఫలియించెఁ గోటా
యెడమిచ్చి శ్రీవేంకటేశుఁ డేలెఁ గోటా ॥చెల్ల॥ 84

అవతారిక :

చాలా తేలిక అనిపించే బహుక్లిష్టమైన అధ్యాత్మ కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఆనాటి చంద్రగిరి రాజుల కోటను స్ఫురణలో బెట్టుకొని చెప్పారేమో అనిపించింది నాకు. ఇందులో వాడిన చాలా మాటలు నేటికాలంలో వాడుకలో లేవు. ప్రతిచరణంలోనూ 'కోటా' అని పలికిన మాట సంగీతపరంగా వాడబడినదిగానే గుర్తించాలి. "చెల్లనెక్కికొంటివిగా"... అన్న పల్లవి అర్థంకావటానికే తలప్రాణం

తోకకివచ్చిన తోకరాయుణ్ణినేను. ఈ కీర్తన నెట్లా సాధించాలి? అన్నమయ్య అన్నట్లు యెడమిచ్చి శ్రీవేంకటేశుడేలితేగాని" దారిలేదు. ఓ దేవదేవా! నీవే దారి చూపించాలి తండ్రీ!

భావవివరణ :

ఓ జీవుడా! చెల్లన్ (బాగుగా) యెక్కి (అధిరోహించి) ఈ బలుకోటా (బలమైన కోటను) కొంటివిగా (నీ ఆధీనం చేసికొంటివి కదా!) బల్లెదుడా (వీరుడా!) నేడు నీకు ఈ కోట పట్టమాయెను (పట్టముగట్టబడినది).

ఈ కోట, తొమ్మిది గవనులైన (ద్వారములున్న) గొప్ప తోలుతో చేయబడిన కోట. ఈ కోటలో మూల మూలకూ క్రొత్తక్రొత్త వింతలున్నాయి. ఈ కోటలో నమ్మలేని (అభేద్యమైన) మెడవంపులవంటి వంకదార (రు)లున్నాయి. వంకరటింకరగా పోయే ఈ దారుల్లో దారితప్పటం "ఖాయం", పమ్మి (అతిశయించి) ఈ కోటలో పగవారు (కామ క్రోధాది శత్రువులు) పట్టుకొనబడియున్నారు.

ఈ కోట తల వాకిలి (ముఖద్వారము) లో దంతముతో చేయబడ్డ తలుపులున్నాయి. (32 పళ్ళు వున్న నోరు దీని ముఖద్వారం అని భావము). ఈ కోట పెద్ద దూలములతోను తలరు (ఆశ్చర్యకరమైన) చేతులతోను (కదిలే భాగములతోనూ) విలసిల్లుచున్నది. ఈ కోటలో వెల్లివిరిసిన ఆశలు అనే దండు (సైన్యము) విడిసియున్నది (స్థావరం చేసికొనబడియున్నది. ఈ కోటను గులుగైన ఇంద్రియాలు (లోపలలోపలనే చెడగొట్టు ఇంద్రియములు) కొల్లగొట్టేశాయి.

ఈ కోటకు పెద్ద గుడారముల వంటి చప్పరములను (తొడుగులను) తొడుగుతారు. ఈ కోటలో రకరకములైన సవరణలు (పరికరములు) అమర్చబడియున్నవి. పడరాని శ్రమలు పడితేగాని ఈ కోటను స్వాధీనపరుచుకోలేము. ఎడమిచ్చి (అవకాశము కల్పించి) శ్రీవేంకటేశ్వరుడు యేలే (పరిపాలించే) కోటయే మన దేహము. ఆయన దయలేకపోతే ఎన్ని హంగులున్నా ఇది చిటికెలో ఛిద్రమైపోతుంది సుమా!

సంపుటి : 2 కీర్తన : హరి భక్తి వోడయెక్కినట్టివారలేకాని
సంఖ్య : 56 పుట : 38 రాగం : గుండక్రియ

గుండక్రియ

35. హరిభక్తివోడ యెక్కినట్టివారలే కాని
తరఁగు మొరఁగులను దాఁటలే రెవ్వరును ॥పల్లవి॥

నిండుఁజింతాజలధికి నీళ్లు దనచిత్తమే
దండిపుణ్యపాపాలే దరులు
కొండలవంటి కరళ్లు కోరికె లెందు చూచినా
తండుముండుపడేవారే దాఁటలే రెవ్వరును ॥హరి॥

ఆపదలు సంపదలు అందులోని మకరాలు
కాఁపురపులంపటాలే కై యొత్తులు
చాపలపుగుణములే సరిఁజొచ్చేయేరులు
దాపుదండ చేకొని దాఁటలే రెవ్వరును ॥హరి॥

నెలవై వుబ్బుసగ్గులే నిచ్చలుఁ బోటునుఁ బాటు
బలువైనయాశే బడబాగ్ని
యెలమి శ్రీ వేంకటేశుహితులకే కాల్నడ
తలఁచి యితరులెల్ల దాఁటలే రెవ్వరును ॥హరి॥ 56

అవతారిక :

సంసారసాగరాన్ని దాటాలంటే ఒక 'నావ' కావాలి కదా! ఏమిటా ఓడ 'నావ'? ఆ సంసారసాగరం యెటువంటిది? ఎటువంటివారు ఆ నావనెక్కగలరు? అన్నమాచార్యులవారు వివరిస్తున్నారు. ఈ సంసార సాగరంలో మొసళ్ళుకూడా ఉన్నాయట. నెలవై వుబ్బుసగ్గులే నిచ్చలు బోటును బాటు – అంటే ఏమిటో అంత తేలికగా తెలుస్తుందా? శ్రీ వేంకటేశ్వరుని హితులకే ఇది కాల్నడ అంటున్నారు. ఇతరులెవ్వరూ యెంత తలచినా దాటలేరట. అచ్చతెలుగు ఈనాటి వారికి కొరుకుడుపడని మాట నిజమే కాని, చక్కటి భావగరిమ వున్న కీర్తన ఇది. 'తరఁగు

మొరఁగు' అనే మాట బహుశాత 'తఱుగు మెఱుగు' అయివుండవచ్చును. ఆ మాటకు జరామరణములు అని అర్థం చెప్పుకోవచ్చును. అన్నమయ్య ఆంతర్యం అంతుచిక్కదు.

భావవివరణ :

ఓ మానవులారా! శ్రీహరి భక్తి, ఈ సంసార సాగరం దాటింపజేయగల ఒకే ఒక 'ఓడ' (నావ). దీనిని యెక్కినవారు మాత్రమే ఈ సంసార జలధిని దాటగలరు. కాని.... జీవికి సహజమైన తరగుమొరగులను (జరామరణములను) అన్యులెవ్వరూ దాటలేరు. (అంటే... హరి భక్తులకు జరా మరణాలు వుండవని కాదు, వాటి భయం వుండదు... అని అర్థం).

మనని పుట్టుకతోనే సంసారజలధిలో పడవేశాడు ఆయన. ఈ సంసార చింతా జలధికి, నిండావున్న నీళ్ళు యేమిటో తెలుసునా? మానవుడి చిత్తమే (మనస్సే). దీనికి 'తరులు' పాపపుణ్యాలు (ఒక ఒడ్డు పుణ్యం... ఒక ఒడ్డు పాపం). కొండల వలె ఎత్తైన "కర(డ)ళ్ళు" (అలలు) ఏమిటో తెలుసా ఈ మానవుడి కోరికలు. ఈ సంసారజలధిలో ఎక్కడ చూచినా అలలే. అందరూ ఇందులో తండుముండు పడేవారే (తొట్రుపడే వారే). ఎవ్వరూ దాటలేరు.

ఈ సంసారసాగరంలో భయంకరమైన మకరాలు (మొసళ్ళు) వున్నాయి. అవే క్షణక్షణం మరణహేతువైన 'ఆపదలు'. అవికాకుండా ప్రాణానికే ముప్పు తెచ్చే సంపదలు. స్త్రీ చేతిలో కలిగించబడిన 'యొత్తులే' మానవుడికి కాపురపులంపటాలు (సంసార లంపటం) కలిగించి వేధిస్తాయి. ఆ కాపురంలో చాపల్యం కలిగించే గుణములు వుంటాయి కదా! అవి మంచిని మరపించే తలనొప్పిగా పరిణమిస్తాయి.

ఈ సంసారసాగరంలో వున్న 'ఉబ్బుసగ్గులు' (హెచ్చుతగ్గులు) నిచ్చలు (రోజూవుండే) ఆటుపోట్లు తప్పనిసరి. తెలియకుండానే ఒకేసారి ఈ సముద్రంలో పెల్లుబికే బడబాగ్ని ఏమిటో తెలుసునా? బలమైన ఆశలు. అయితే ఇంత గొప్ప సంసారజలధి కూడ, శ్రీ వేంకటేశుని హితులకు మాత్రం ఒక చిన్న కాల్నడ, (ఉచ్చగుంట). వారు దాన్ని దుమికి దాటగలరు. మరింకెవ్వరూ ఎంత తలచినా... దాటనే లేరు.

సంపుటి : 2 కీర్తన : అన్నిటా శ్రీహరిదాసుడగువానికి

సంఖ్య : 68 పుట : 46 రాగం : రామక్రియ

రామక్రియ

36. అన్నిటా శ్రీహరిదాసుఁడగువానికి
కొన్ని దైవములఁ గొలువఁగఁ దగునా ॥పల్లవి॥

విహితకర్మముసేసి వెదకేటి హరి నిట్టె
సహజమై కొలచేటిసరసునికి
గహనపుఁగర్మాలు కడమలైన నేమి
మహిఁ గనకాద్రికి మరి పైఁడి వలెనా ॥అన్ని॥

పలుదానములకెల్ల బలమైనహరి నిట్టె
బలువుగఁ జేకొన్న భక్తునికిని
నెలకొని యాతఁడన్నియునుఁ జేసినవాఁడె
తెలిసి సూర్యునిఁ జూడ దీపాలు వలెనా ॥అన్ని॥

వేదవేద్యుఁడు శ్రీవేంకటపతినామ–
మాదిగాఁ బఠియించే యధికునికి
ఆదైనచదువులు అఱచేతి వతనికి
మేదినిఁ దిరుగాడ మెట్లు వలెనా ॥అన్ని॥ 68

అవతారిక :

అన్నమాచార్యులవారి నాటి తెలుగు నుడికారం నేటి భాషతో పోలిస్తే వ్యత్యాసం కనబడుతుంది. "కొన్ని దైవముల గొల్వనేల" అంటే కొందరు దేవతలను కొలుచుటెందుకు అని. "వేవేదద్యుడు శ్రీ వేంకటపతి" అని ఆనాటి రాగిరేకులో వ్రాసివుంది. పెద్దలు దాన్ని 'వేదవేద్యుడు' అని పరిష్కరించారు. ఆ విధంగా, పెద్దలు పరిష్కరించకపోతే బహుశా నేటి తరం వారు ఏమీ అర్థంకాక వాటిదారిన వాటిని వదలివేసేవారేమో! ఈ కీర్తనలో అన్నమయ్య ప్రతిభ ప్రతి చరణంలోనూ ప్రస్ఫుటమవుతుంటుంది. చదువరి ఆనందంతో పులకించిపోతాడు.

భావ వివరణ :

అన్నిటా (మనోవాక్ కర్మలలో) శ్రీహరిని దాస్య భక్తితో సేవించే వానికి, కొన్ని దైవముల (కొందరు ఇతర దేవతలను) కొలుచుట యెందులకు? అది తగదు.

వేదోక్తమైన విహిత కర్మలు చేయుట శ్రీహరిని వెదకి (శోధించి) కనుగొనవలెను. కాని సహజముగ (స్వభావ సిద్ధముగానే) హరియే తన సర్వస్వమని కొలిచేటి సరసునికి (ఆనంద సిద్ధి పొందినవానికి).... గహనపు కర్మాలు (అడవిదారివలె అయోమయం కలిగించే కర్మలు).... కడమలైననేమి (కొఱత అయితే మాత్రం ఏమి నష్టం?) ఈ భువిలో కనకాద్రికి (బంగారంతో మెరిసే మేరు పర్వతానికి ఇంకొంచెం బంగారం చేరిస్తే తేడా ఏమి వస్తుంది?

అన్ని దానములకన్న శ్రీహరి భక్తి బలమైనది. ఆయన జగన్నాథుడు కావున ఏదానమైనా ఆయన ఇవ్వవలసినదే. ఆయననే బలంగా చేకొన్న హరిభక్తునికి అన్ని దానముల ఫలమూ సిద్ధిస్తుంది. అతడు అన్ని దానములను చేసినవాడే అగుచున్నాడు. సూర్యుణ్ణి చూడటానికి ఎవడన్నా పగటి వేళ దీపము వెలిగిస్తాడా? అట్లాంటి వెఱ్ఱినేమని అంటాము?

శ్రీ వేంకటేశ్వరుడు వేదవేద్యుడు (వేదము ద్వారా ప్రకటింపబడినవాడు). ఆదిగా (నిద్రలేస్తూనే) ఆ నామం పఠించేవాడు (సహజంగానే పలికేవాడు) సర్వాధికుడు. అతనికి ఆదైన చదువులు (మొదలుపెట్టిన చదువులన్నీ) అఱచేతివి (కరతలామలకములు). ఏదన్నా మేడనెక్కాలంటే మెట్లు కావాలి కాని మేదిని దిరుగాడు వానికి (తేలికగా నేలమీద నడిచేవానికి) ఆ మెట్లు యెందుకు?

సంపుటి : 2 కీర్తన : ఇతరుల దూరనేల యెవ్వరూ నేమిసేతురు

సంఖ్య : 174 పుట : 117 రాగం : వరాళి

వరాళి

37. ఇతరుల దూరనేల యెవ్వరూ నేమిసేతురు
మతి వారూc దమవంటిమనుజులేకాక ॥పల్లవి॥

చేరి మేలుసేయc గీడుసేయ నెవ్వరు గర్తలు
ధారుణిలో నరులకు దైవమేకాక
సారెc దనవెంటవెంటc జనుదెంచేవారెవ్వరు
బోరునc జేసినపాపపుణ్యాలేకాక ॥ఇత॥

తొడcగి పొగడించాను దూషించా ముఖ్యులెవ్వరు
గుడిగొన్న తనలోనిగుణాలేకాక
కడుcగీర్తినపకీర్తి గట్టెడివా రెవ్వరు
నడచేటి తనవర్తనములే కాక ॥ఇత॥

ఘనబంధమోక్షాలకుc గారణ మిcక నెవ్వరు
ననడిచిన జ్ఞానాజ్ఞానములే కాక
తనకు ఎ వేంకటేశుc దలపించేవారెవ్వరు
కొనమొద లెఱిcగిన గురుcడేకాక ॥ఇత॥ 174

అవతారిక :

చక్కటి జ్ఞాన ప్రబోధన చేస్తున్నారు అన్నమాచార్యులవారు. ప్రపంచంలో మానవులు పరులకు మేళ్ళూ కీళ్ళూ చేస్తూనే వుంటారు. ఇకరిని పొగడుతుంటారు ఇంకొకరిని తిడుతుంటారు. దీనివలన ఒకరినొకరు తిట్టుకొంటారు కొట్టుకొంటారు. ఆ పరాయి మనుష్యులు కూడా తమబోటివారే కదా! మదిలో వారు కూడా తమవలెనే కామకోధాది అరిషడ్వర్గపీడితులు. ఈ భాగ్యానికి ఇతరులను నిందించుట తగునా? ఎవ్వరు మాత్రం ఏమి చేయగలరు? అంటున్నారు. మరి దారేమిటి?

భావ వివరణ :

ఇతరులను నిందించుట అతి తేలికపని. కాని ఆ విధంగా పరులను దూరనేల (నిందించుటెందుకు)? మతి (మనస్సు విషయంలో) వారూ... తమవంటి మనుష్యులే కదా! దీనికి యెవ్వరునూ, యేమి సేతురు (చేస్తారు)?

ధారుణిలో (భూమిమీద) నరులకు మేళ్ళూ, కీళ్ళూ (ఉపకారములు, అపకారములు) చేయుటకు కర్తలు యెవ్వరు? దైవమేకాక (దేవుడు తప్ప) ఇంకొకరు కర్తలా? మనిషి చనిపోయాక వాడి వెంట ఎవరు వస్తారు? బోరున (గొప్పగా) సారెన్ (ప్రతిసారీ) వాడు చేసిన పాపపుణ్యాలు గాక ఇంకేమన్నా వాడి వెంట వస్తాయా? రానేరావు.

ఈ మానవుడు కొందరిని పొగడుతుంటాడు, కొందరిని దూషిస్తుంటాడు. తొడగి (ప్రారంభించి) ఈ రెండు పనులూ చేయించే ఆ ముఖ్యమైన వారెవరు? వాడిలో గుడిగొన్న (అతిశయించిన) గుణములే (సత్త్వ రజ స్తమో గుణములే) కదా! ఈ మానవుడికి గొప్పకీర్తి, అపకీర్తి ... రెండూ కలుగుతుంటాయి. వాడికి ఆ రెండూ అంటగట్టే వారెవరు? నడచేటి, వాడినడత మరియు ప్రవర్తనలే కదా!

ఇక, ఈ మానవుడు సంసార బంధాలలో చిక్కినా, మోక్షము సిద్ధింపచేసికొనినా కారణమెవ్వరు? ననిచిన (చిగురించిన) జ్ఞానము, అజ్ఞానమే వాటికి కారణం. అవి కాక ఇంకేమీ కారణం కావు. ఇదిట్లుండగా అంతటికీ కారణభూతుడైన ఆ శ్రీ వేంకటేశ్వరుని తలపించే (స్ఫురింపజేసే) వారెవ్వరు? ఈ జ్ఞానామృతానికి, కొన మొదలు (అంతము – ఆది) రెండూ తెలిసిన గురుదేవులే కదా! ఇంకెవరు ఆ దేవదేవుని అందించగలరు?

సంపుటి : 2 కీర్తన : ఏమి నెఱగనివాడు యిటు నిన్ను గొలిచేనా
సంఖ్య : 135 పుట : 91 రాగం : మాళవిగౌళ

మాళవిగౌళ

38. ఏమీ నెఱఁగనినాఁడు యిటు నిన్నుఁ గొలిచేనా
నీమాయ దెలుపఁగా నిను ననేఁగాకా ॥పల్లవి॥

పసురముగఁ జేసితే బడి నిన్నుఁ దలఁచేనా
వెస రాయిఁజేసితే వెదకి నిన్నెణిఁగేనా
పొసఁగ మానుగ నన్నుఁ బుట్టించితేఁ బొగడేనా
ముసిపి నరుఁడజేయఁగా మొరయిడేఁగాక ॥ఏమీ॥

మొగి మృగముఁ జేసితే మొక్కనెఱిఁగేనా
తగఁ బక్షిఁ జేసితేఁ దరిఁ బూజసేసేనా
జిగి నితరజంతువుగఁ జేసితేఁ దగిలేనా
అగపడి వివేకిఁ జేయుఁగ ననేఁగాక ॥ఏమీ॥

యింత కధకారిఁ జేసి యీప్రపంచజ్ఞాన –
మింత యొసఁగితివి మరఁ గిఁకనేలా
చింత లిన్నియుఁ దీర శ్రీవేంకటేశ నను
సంతతము నేలఁగా శరణనేఁగాక ॥ఏమీ॥ 135

అవతారిక :

అన్నమాచార్యుల కాలంనాటి తెలుగులో కొంత నుడికార వ్యత్యాయసం వలన ఈ కీర్తనకి భావవివరణ కావలసి వచ్చింది. లేకపోతే బహు సరళమైన కీర్తన ఇది. ఓ దేవదేవా! నన్ను కరుణించి నీమాయ నాకు తెలిపినావు. అట్లా చేయకపోతే... ఇటు నిన్ను గొలిచే వాడినా? ఏమీ ఎఱగనినాడు కేవలం అజ్ఞానాంధకారంలో పడి మగ్గిన ప్రాణిని. నేడు ఇంత అధికారిని జేసి, ఈ ప్రపంచజ్ఞానం ఇంత ఇచ్చి మరగు (దాగుడుమూతలు) ఇకనేల? అంటున్నారు. నీవు జగదీశ్వరుడివి. నన్ను

పశువుగా పుట్టించినా, పక్షిగా పుట్టించినా, అడవిలో చెట్టుగా పుట్టించినా, జంతువుగా పుట్టించినా నిన్ను కాదనేవాడెవడు? నిన్ను శరణాగతి బొందగల జ్ఞానమున్న ఈ మానవజన్మనిచ్చావు, నీకు సదా కృతజ్ఞుడను.

భావ వివరణ :

ఓ తిరుమలేశా! ఏమీ ఎఱగని నాడు (అజ్ఞానాంధకారములో వున్ననాడు)... ఇటు నిన్ను కొలిచే వాడినా? నీమాయ తెలుపుట వలన కాకపోతే ఇది (నేను నిన్ను శరణుజొచ్చుట) జరిగే పనియేనా? అసాధ్యం ప్రభూ!

నన్ను పసురముగ (పశువుగా) పుట్టించితే, బడి క్రమముగా) నిన్ను తలచేవాడినా? వెస (శీఘ్రముగా) ననున ఒక రాయిని చేస్తే... వెదకి నిన్ను ఎఱిగేవాడినా? పోనీ నన్ను నీకు అనుకూలముగా... ఒక చెట్టులాగా పుట్టిస్తే నిన్ను ఇట్లా కీర్తించగలిగేవాడినా? ముసిపి (అజ్ఞానాంధకారం తొలగించి) నరుని జేయుట చేత ఇట్లా నీమాయ తెలిసింది... ఇట్లా మొరబెట్టు కొంటున్నాను. లేకపోతే ఇది జరిగేదా?

మొగి (నీవు పూనుకొని) నన్ను ఒక మృగముగా చేస్తే... నీకు నమస్కరించగలిగేవాడినా? తగన్ (నా కర్మానుసారముగా) ఒక పక్షిగా పుట్టిస్తే నిన్ను సమీపించి పూజించేవాడినా? ఇతరములైన ఏ జంతువును చేసినా నిన్ను తగిలేనా (అనుసరించేవాడినా?) నాకు అగపడి (ప్రత్యక్షమై) వివేకవంతుని జేయుటవలన గాక నీ దాసుడనయ్యేవాడినా?

ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంతకు నన్ను అధికారిని జేసి ఇంత ప్రపంజ్ఞానము నాకు ఇచ్చావు. మరగికనేలా (ఇంకా నాకు అపరిచితుడుగా నుండి పోవుట యెందులకు?) నాకున్న చింతలన్నియు దీరినవి. సంతతము (ఎల్లవేళలా) ఎలగా (నన్ను పరిపాలించుటకు) శరణని అన్నాను. అనేగాక (అట్లా కాకపోతే) నీమాయ దెలియుట సాధ్యమా?

సంపుటి : 2 కీర్తన : మాపులేమరణములు రేపులే పుట్టువులు
సంఖ్య : 157 పుట : 105 రాగం : దేశాక్షి

దేశాక్షి

39. మాపులే మరణములు రేపులే పుట్టువులు
చాపలాలు మాని విష్ణు శరణను మనసా ॥పల్లవి॥

చాలునంటే ఇంచుకంతే చాలును జన్మమునకు
చాలకున్న లోకమెల్లఁజాలదు
వీలినయీయాసా వెట్టివానిచేతిరాయి
చాలు నింక హరి నిట్టె శరణను జీవుఁడా ॥మాపు॥

పాఱకున్న పశుబాలై బడలదు మనసు
పాణితే జవ్వనమునఁ బట్టరాదు
మీఱిన నీరుకొద్దిదామెర యింతె యెంచి చూడ
జాఱవిడిచి దేవుని శరణను జీవుఁడా ॥మాపు॥

సేయకున్నఁ గర్మము శ్రీపతిసేవనే వుండు
సేయఁబోతేఁ గాలమెల్లా సేనానేన
వోయయ్య యిది యెల్లా వుమినాఁకే చవుతాలు
చాయల శ్రీవేంకటేశు శరణను జీవుఁడా ॥మాపు॥ 157

అవతారిక :

ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు వాడిన ఆనాటి తెలుగు భాషవల్ల కొంత, రాగిరేకులపై వ్రాసినవారి పొరబాట్లవల్ల కొంత, శ మరియు స అనే అక్షరాలు యధేచ్ఛగా తారుమారగుటవలన కొంత.... అతి సులువైన ఈ కీర్తన, అర్థంకాని పరిస్థితిని సంతరించుకొన్నది. 'వెట్టివానిచేతిరాయి' అనే మాటలు వెట్టివాని చేతిరాయిగా వ్రాయబడింది. 'పసిబాలై' అనేమాట 'పశుబాలై'గా చెక్కబడింది. 'వుమినాకే చవుతాలు' అంటే ఉమ్మినాకే చవితెలియునని భావించాలి. అంటే ఏమిటో తెలియాలంటే భావవివరణ చదవక తప్పదు. కాలమెల్ల 'శేనాశాన' అని రాగిరేకులో వున్నది. అది 'సేనాసేన' కావచ్చును. అంటే ఏమిటి?

భావవివరణ:

ఓ మనసా! ఈ ప్రపంచంలో చావుపుట్టకలు జీవికి తప్పవు. మాపులే (సాయంకాలములే) ఆజీవి మరణములు. రేపులే (మరునాటి ఉషోదయములే) పుట్టకలు (తిరిగి జన్మించుటలు) – రేయింబవళ్ళెలా తప్పవో, చావుపుట్టకలూ జీవికి తప్పవు. చాపలాలు (చంచల స్వభావములను) మాని (వదలి) విష్ణుశరణమునందుకొనుము.

మానవ జన్మమునకు తృప్తి వుండితీరాలి. చాలును అంటే ఇకవద్దు, నాకున్నది చాలు అనిపించాలి. లేకపోతే... వాడికి ఈ లోకమంతా నీదే అని ఇచ్చినా చాలదు. వీలిన (అనుకూలముకాని) ఈ ఆశ మానవునికి అపకారి. ఎందుకంటే... అది పిచ్చివాడి చేతిలోని రాయివంటిది. వాడు దాన్ని ఎవరిపై విసురుతాడో ఎవరికి తెలుసు? వెట్టివాడి చేతిలోని రాయి ఎవరికి తగులుతుందో? అందువలన ఆశను వదలిపెట్టి శ్రీహరిని శరణు వేడుకో. ఓ జీవుడా అదే నీకు మేలు.

మనస్సు ఎటువంటిదంటే... అది పాఱక వున్న (పరుగెత్తలేని) పసిపాపవలె వున్నంతవరకు బడలదు (అలసిపోదు). కాని యౌవనం రాగానే అది పాఱితే (పరుగులు తీస్తే) దానిని పట్టరాదు (పట్టుకోవటం అసాధ్యం). ఎంచి చూస్తే, మీఱిన నీరుకొద్ది (అధికమైన నీరునుబట్టి) దామెర (ఆపద కలిగించె ఊపిరాడని చావు వుంటుంది కదా!) అందుకని ఓ జీవుడా! అన్నీ జాఱవిడిచి ఆ దేవదేవుని శరణు అని వేడుకో.

ఓ జీవుడా! నీవు కర్మము సేయకున్న (కోరికతో ఏ కర్మలూ చేయకుంటే) శ్రీపతి సేవలోనే వుంటావు. ఒకవేళ అలాకాక కర్మలు సేయబోతే నీ కాలమంతా సేనాసేన (జోహారు... జోహారు) అనగా నీవు కర్మలు చేస్తున్నంతకాలం, వహ్వా! వహ్వా! అని పొగడ్తలే వస్తూ వుంటాయి. ఓ అయ్యా! వేంకయ్యా! ఇది యెల్లా (ఇదంతా) వుమినాకే చవుతాలు (ఉమ్మివేసి పారవేస్తేకాని, నీ కరుణామృతం యొక్క రుచి తెలియదు). ఓ జీవుడా! శ్రీవేంకటేశ్వరుని చాయల (నీడలో) శరణు తండ్రీ! అనవయ్యా!

సంపుటి : 2 కీర్తన : దైవమా నీవేమమ్ము దయదలచుటగాక
సంఖ్య : 158 పుట : 106 రాగం : ధన్నాసి

ధన్నాసి

40. దైవమా నీవే మమ్ము దయదలఁచుటగాక
చేవల నీసేఁతలెల్ల చెల్లును లోకానను ॥పల్లవి॥

తీపునంజేవేళ నట్టె తేటఁబులు సింపౌను
పై పైఁ బుణ్యమయితేఁ బాప మింపౌను
వోపి జంతువుల కివి వొకటొకటికి లంకె
చేపట్టి పాపము లెట్టు సేయకుండవచ్చును ॥దైవ॥

కడుఁజలువై తేను గక్కన వేఁడింపౌను
చెడనివిరతివేళ సిరు లింపౌను
వొడలు మోచినవారి కొకటొకటికి లంకె
తొడరుభోగాలు మాని తోయ నెట్టువచ్చును ॥దైవ॥

యినియు నీమాయే యిన్నియు నీయాజ్ఞలే
జవళిఁ బ్రాణులకెల్ల సమ్మతైనవి
యివల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
తవిలి నీవే గతి దాఁగ నెట్టువచ్చును ॥దైవ॥ 158

అవతారిక :

అన్నమాచార్యులవారి కీర్తనలో పల్లవిని, సాధించటం బహుక్లిష్టమైన ప్రక్రియ. 'చేవల' అంటే 'వశపరచుకోగల' అని భావించవచ్చును. ఓ దేవా! నీవేమి చేసినా చెల్లుతుంది. మేము నీ ఆజ్ఞాబద్ధులము. నీవే మమ్మల్ని కరుణించాలి కానీ మేము చెయ్యగలగిందేమీ లేదు – అని దీని అర్థం. మానవుడికి విపరీతమైన చిత్త చాంచల్యం పెట్టావు. ఒక పని చేస్తూనే దానికి విరుద్ధంగా ఆలోచన చేస్తాడు. పుణ్యకార్యాలు చేస్తూనే పాపకార్యాలు ఇష్టపడతాడు. విరక్తిని పొందుతూనే సిరులు గడించాలని ఆలోచిస్తాడు. ఈ వైరుధ్యంవల్లనే అనేక పాపాలు చేస్తాడు. భోగలాలసుడవుతాడు.

నీమాయావర్తనుడైన ఈ నీ అధీనుల్ని నీవుకాక ఇంకెవరు ఆదుకొంటారు తండ్రీ!

భావవివరణ:

ఓ దేవదేవా! నీవే మమ్ము దయదలచి రక్షించవలెను. చేవల (ఆజ్ఞావర్తనులను చేయగలిగిన నీసేతలెల్ల (నీలీలలన్నియును) లోకానను (ఈ లోకంలో) చెల్లును (సాగుతూనే వుంటాయి). మేము చేయగలిగిందేమీ వుండదు.

మేము తీపు నంజేవేళ (తీపి తింటున్నప్పుడు) మాకు తేట బులుసు (పుల్లని పదార్థములు) ఇంపౌను (బాగుంటాయి అనిపిస్తుంది). పైపైన పుణ్యకార్యాలు చేస్తూనే పాపము చేస్తే బాగుంటుందేమో అనే భ్రమ కలుగుతుంది. మరి, మేము నడిచే జంతువులం కదా! ఈ విరుద్ధ భావాలు ఒకదానికొకటి లంకె (ముడిపడివుంటాయి). ఇక మేము పాపము చేయకుండా వుండగలమా? అదెట్లా సాధ్యమవుతుంది ప్రభూ!

కడు జలువైతే (ఎక్కువ చల్లగా వుంటే) గక్కున (వెంటనే) వేడిగావుంటే బాగుండును అనిపిస్తుంది. చెడని విరతివేళ (వైరాగ్యంతో వున్నవేళ) సిరిసంపదలు సంపాదిస్తే బాగుండుననిపిస్తుంది. వొడలు మోచినవారికి (శరీరధారులైన మానవులకు) ముడిపడ్డ ఈ పరస్పర వైరుధ్యాల వలన, భోగలాలస తొడరు (భోగములపై రక్తి కలుగుతుంది). మాని (వద్దు అని) వీనిని తోయనెట్టవచ్చునా (విసర్జించగలమా?)

ఓ ప్రభూ! ఇవన్నియును నా మాయలే ఈ నీ ఆజ్ఞలు జమళి (నిత్యనూతన)మైనవి జీవులందరికీ శిరోధార్యమైనవి. ఇందువలన ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నీకే తవిలి (తగులుకొని) శరణు అన్నాను. మాకు నీవే గతి. నన్ను నీవు తాగనెట్టువచ్చునా (అధఃపాతాళానికి త్రోయవచ్చునా తండ్రీ!)

సంపుటి : 2 కీర్తన : పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు
సంఖ్య : 182 పుట : 122 రాగం : రామక్రియ

రామక్రియ

41. పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచోనుండు
యీటవెట్టి పెద్దతనా లెంచఁ బనిలేదు ॥పల్లవి॥

సరవిఁ గలకాలముఁ జదువుచుండు నొకఁడు
గరిమ నీకృప నిన్నుఁ గను నొకఁడు
ధరఁ బ్రయాసముతోడఁ దపముసేయు నొకఁడు
శరణుచొచ్చి నీకుఁ జనవరౌ నొకఁడు ॥పాటె॥

వొక్కఁడు మోపుమోచు నొక్కఁడు గొలువుసేయు
వొక్కఁడు పొగడీ త్యాగ మూరకే యందు
వొక్కఁ డాచారము సేయు నొక్కఁడు మోక్షము గను
యెక్కడా నీకల్పన కేమిసేయవచ్చును ॥పాటె॥

భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము
యేవలనైనా నీవు యిచ్చితేఁ గద్దు
జీవులు నిన్నెఱఁగక జీఁకటి దవ్వఁగనేల
శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు ॥పాటె॥ 182

అవతారిక :

అచ్చతెలుగు నుడికారాలతో చిక్కేమిటంటే వేర్వేరు అర్థములు ఒకే మాటకి వుండటం వలన అపార్థానికి దారితీస్తుంది. 'పాటెల్లా నొక్క చోట' అంటే, 'ఒకచోట పాటు యెల్లా వుంటుంది' అని అర్థం చెప్పుకోవాలి. 'ఈటువెట్టి పెద్దతనాలెంచబనిలేదు' అంటే.. 'అనవసరంగా గొప్పతనం అంటగట్టాల్సిన పనిలేదు' అని అర్థం. ఈ పల్లవిని నేటి భాషలో చెప్పాలంటే... 'పడరాని తిప్పలు ఒకరికి, భోగభాగ్యాలు ఇంకొకరికి' ఇవి వీరి వారి గొప్పతనం అని అనుకోకూడదు. అవి వారి వారి కర్మఫలాలు.

చవట ఒకడైతే చక్రవర్తి ఇంకొకడవుతాడు. కానీ అసలైన నేర్పు ఈ స్థితిగతుల్లో లేదు... శ్రీవేంకటేశ్వరుని సేవించుటయే నేర్పు అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావవివరణ:

ఓదేవదేవా! 'కష్ట'మంతా ఒకచోట వుంటే 'కలిమి' ఇంకొకచోట వుంటుంది. ఈటువెట్టి (వ్యర్థముగా) అవతలివారు గొప్పవారు అని అనుకోకూడదు.

స్వామీ ఎంత చిత్రం! ఒకడు వున్న కాలమంతా సరవి (క్రమంగా) వేదాలు చదువుతూనే వుంటాడు. ఈ మధ్యలో ఒకడు వున్నట్లుండి నీ కృపకు పాత్రుడవుతాడు. ఒకడు అనేక ప్రయాసలు (బాధలు) పడి నీకై ఘోరతపస్సు చేస్తాడు. మరింకొక జనవరి (జనులచే వరించబడినవాడు) అవుతున్నాడు. ఎందుకంటే, వాడు నిన్ను శరణుజొచ్చి నీకుదాసుడైయున్నాడు. ప్రభూ! అతితేలికయైన మార్గం వదలి యెందుకా తిప్పలు.

ఓ దేవా! ఒకడు మోపుమోచు (బరువులెత్తి జీవిస్తాడు), ఒకడు గొలువు సేయు (రాజుగారి కొలువులో వుంటాడు). ఒకడు భట్రాజులా ఇంకొకర్ని పొగడుతూనే వుంటాడు. ఒకడు వూరకనే త్యాగము (ఈవి) కలిగి వుంటాడు. ఒకడు యజ్ఞయాగాలవంటి ఆచారములను చేస్తాడు. ఇంకొకడు అతి తేలికగా మోక్షం పొందుతాడు. అయ్యా! నీ కల్పనకు అంచనాకట్టడం యెవరి తరము?

భావించన్ (ఆలోచిస్తే) అటుగాన ఫలమెల్ల (ఆ, యా, ఫలములన్నీ), నీ మూలము (నీమూలంగా కలిగినవే). ఎవరికైనా నీవిచ్చినదే కద్దు (దక్కుతుంది). మరి, ఈ జీవులు దీని నెరుంగక చీకటి దవ్వనేల (చీకట్లో తవ్వి ఏవేవో పొందాలనుకోవటం ఎంత పిచ్చితనము?) ఎందుకీ తిప్పలు? ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను సేవించటమే నేర్పరితనం. మిగతా ప్రయాసలన్నీ శుద్ధ... దండుగ తండ్రీ!

సంపుటి : 2 కీర్తన : ఎంత కఠినమో హృదయమిది

సంఖ్య : 181 పుట : 121 రాగం : నాట

నాట

42. ఎంత కఠినమో హృదయ మిది
చెంత ఱాతఁజేసిరి గాఁబోలు ॥పల్లవి॥

అమరఁ బురాణములందు నరకముల–
క్రమములు చదివియుఁ గలఁగవు
యమకింకర ఘోరాకృతు లటు విని
భ్రమసి యించుకా భయపడ నేను ॥ఎంత॥

మనుజులదారుణ మహితకర్మముల –
అనుభవములు గని యలయను
వొనర మహోగ్రయహోరాత్రంబులు
చనుచుండఁగా జడియును నేను ॥ఎంత॥

కలుషరౌద్రదుఃఖముల కించుకా
కలఁగను చీరికిఁ గైకొనను
యెలమిని శ్రీవేంకటేశుఁడ నాపాలఁ
గలిగి కాచితివి గాసిల నేను ॥ఎంత॥ (8)

అవతారిక :

హృదయం సుతిమెత్తనైనది అంటారు. కాని అదేమిటో నా హృదయం యెంత కఠినమైనది!! దీన్ని రాతితో చేశారేమో కదా! యమకింకరులు ఘోరయాతన పెడతారన్నా భయపడనాయె!! అకృత్యములు చేసేవారికి కలిగే అనుభవాలను వినినా బాబోయ్ అని వెరవను. అహోరాత్రంబులూ భయంకరంగా జీవిస్తున్నా జంకను. కలుషమైన క్రోధముచే దుఃఖములను బొందియు కలగను. అంతేకాదు. చీరికిగైకొనను. అటువంటి స్థితిలోవున్న

నన్ను రక్షించావయ్యా! వేంకటేశ్వరా! అంటున్నారు అన్నమాచార్యులవారు. అంత తేలికగా అర్థమైతే మరి కావలసిందేముంటుంది?

భావవివరణ:

ఓ ప్రభూ! ఈ మానవ హృదయము ఎంత కఠినమైనదో కదా! దీనిని 'ఱాయి' చేత చేసినారేమో!!

అమరిన ఓ హృదయమా! పురాణములందు వివరింపబడిన నరకముల వరుస (రౌరవాది నరకములు) గురించి చదివి కూడా కలంగవు (కలత చెందవు) యమకింకరులు పెట్టే ఘోరమైన శిక్షలను గురించి వినికూడా, యించుక (కొంచెమైనా) భ్రమతో నేను భయపడకున్నానే!!

మనుష్యులు చేయునటువంటి దారుణమైన అహితకర్మముల (చేయరాని పనులవలన) యెన్నియో చెడు ఫలములను అనుభవించుచున్నారు. ప్రతిదినము అట్లనుభవించు వారిని జూచుచునేయున్నాను. కాని నేను అలయను (విసుగు చెందుట లేదు.) మహోగ్రయహోరాత్రంబులు (మహాభయంకరమైన రాత్రింబవళ్ళు) చనుచుండగా (గడచుచుండిననూ) నేను జడియను (జంకుటలేదు). నిర్లజ్జగా దుష్కార్యములను చేయుచునే యున్నాను.

అయ్యో! నేను కలుషితమైన క్రోధము చేతను దాని ఫలితమైన దుఃఖముచేతను, ఇంచుక (కొంచెమైనా) 'కలఁగను' (సంక్షోభమును జెందను). ఆపైన చీరికగైకొనను (బలమైన పశ్చాత్తాపముతో బ్రద్దలైపోను). ఇటువంటి నికృష్ట స్థితిలో వున్న నాపాలగలిగి (నాయందు కరుణవహించి), శ్రీవేంకటేశ్వరా! ఎలమిని కాచితివి (సంతోషముతో రక్షించితివి). నేను గాసిల (బాధపడుతుంటే) రక్షించావా తండ్రీ!

సంపుటి : 2 కీర్తన: ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ
సంఖ్య : 180 పుట : 121 రాగం : వరాళి

వరాళి

43. ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ
కామించి బ్రహ్మాదులనుఁ గప్పీ నీమాయ ॥పల్లవి॥

బచ్చెనరూపులు పెక్కు పడెచ్చుల వేసినట్లు
నిచ్చల నినుచున్నది నీమాయ
తచ్చి వారివారిరతి తమతమకే తెలియ
పచ్చిగా భోగింపించీ దంపతుల నీమాయ ॥ఏమ॥

మఱి తొలునాటిభోగాలు మరునాటికి నింతగా
నెఱవుగాఁ దమకించీ నీమాయ
విఱుచరానిదుఃఖము వెస నిద్రవోయితేనే
మఱపించి నవ్వించీ మహిలో నీమాయ ॥ఏమ॥

పట్టరానిజవ్వనము పరసిపోతే ముదిమి
నెట్టుకొల్పి వుబ్బఁడచీ నీమాయ
గట్టిగా శ్రీవేంకటేశ ఘనుఁడవైననీదాసుల
పట్టకుండాఁ జేయుము బలిసెనీమాయ ॥ఏమ॥ 180

అవతారిక :

శ్రీహరి మాయాలజిక్కనివారెవ్వరు? అన్నారు పెద్దలు. అదే ఇతి వృత్తంతో అద్భుతమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. దీని భావవివరణ, చదివితే ఇది సరళంగా కనుపించే జటిలమైన కీర్తన అని అర్థమవుతుంది. పల్లవి అతి సరళంగా వుండటం వలన అలా అనిపిస్తుంది. చరణాలు మరణాలు అనిపిస్తాయి. ఆచార్యులవారి భాషలోని వింత వింత సంధి ప్రక్రియలు ఒక పట్టాన అర్థంకావు. "పడెచ్చులవేసి" - పడి+అచ్చులవేసి అని అన్వయం చేసికొనవలెను. "నిచ్చల నినుచున్నది నీమాయ" - నిచ్చల నినిచి+ ఉన్నది నీమాయ అని

అన్వయించుకొంటేకాని అర్థం కాదు. "పట్టకుండా జేయు" - పట్టకుండన్+చేయు అనుకోవాలి. ఇక మాధుర్యం సంగతికి వస్తే లేరు అన్నమయ్యకు సాటి అని వేరే చెప్పాలా?

భావవివరణ:

ఓ దేవదేవా! నీమాయను యేమని పొగడవచ్చును. ప్రభూ! అది ఇటువంటిది అని యెట్లు చెప్పగలం? బ్రహ్మాది దేవతలనే నీమాయ కప్పి వారు కామమునకు లొంగునట్లు చేసినది నీమాయ (మోహినీ అవతారంలో).

అనేకమైన "బచ్చనరూపులు" (రంగస్థల నటుడు వేసిన వేషములు) పడి(వేసి), అచ్చులవేసినట్లు (అదేమాదిరి వేసినట్లు) - మేము కూడా అనేకమైన వేషాలు నిచ్చలు (ప్రతినిత్యం) వేస్తుంటాం. నీమాయ నినిచి ఉన్నది. (అంతా నిండివున్నది). అందుకని అదివేషం అని మఱచి అందులోనే జీవిస్తుంటాం. దంపతులను వారివారి ఇష్టానుసారము తమ తమకములలో తామే తచ్చి (తగిలి) పచ్చిగా భోగిస్తుంటారు. ఎంత మాయ చేస్తావు తండ్రీ!

నిన్న భోగించాను. మఱునాడు కూడా అదే భోగానుభవము. అందులో తేడాయేమీలేదు కదా! మరి... ఇంత నెరవుగా (నేర్పరిగా) నీమాయ తమకించీని (మైమరపిస్తుందేమిటి?) విఱువరాని దుఃఖము (తునుముట సాధ్యము కాని గొప్పదుఃఖమును కూడా, వెస (బాగుగా) నిద్రపోతే మఱచిపోతాం. మరునాడు నవ్వుతుంటాం. అది నీ మాయ కాక ఇంకేమిటి స్వామీ!

దేవా! పట్టరాని యవ్వనమున పరవశించిపోతే ముదిమి (ముసలితనం) నెట్టుకొనివచ్చి ఉబ్బు (గర్వమును) అడచీ (అణచివేస్తుంది). మరి నీమాయ ఎవ్వరిని వదిలిపెడుతుంది? ఘనుడవైన శ్రీవేంకటేశ్వరా! నీదాసులమైన మమ్మల్ని మాత్రం నీమాయ పట్టకుండా వుంటే చాలు. నీమాయ గట్టిగా బలిసినదగుటచే "అన్యధా శరణం నాస్తి... త్వమేవ శరణం మమ..."

సంపుటి : 3 కీర్తన : ఇంతేపో వారివారిహీనాధికములెల్ల
సంఖ్య : 14 పుట : 10 రాగం : గుజ్జరి

గుజ్జరి

44. ఇంతేపో వారివారిహీనాధికములెల్ల
పంతాన తామే పాటిభాగ్యము నాపాటే. ॥పల్లవి॥

అందరిలో దేవుఁడుండు అందధికులు గొందరు
కొందరు హీనులై కుందుదు రింతే
చెంది వీచేగాలొకటే చేనిపంటా నొకటే
పొంది గట్టికొలుచుండి పొల్లు కడఁబడును. ॥ఇంతే॥

పుట్టుగందరి కొకటే భూమిలో యేలికలును
వెట్టిబంట్లుఁ గొందరై వీఁగుదు రింతే
చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు
తెట్టెలై మేలొకటికి తీలొకటికాయ ॥ఇంతే॥

కోరి శ్రీ వేంకటపతికుక్షిలోనే లోకములు
ఆరయఁ గిందెడు మీఁదెడై వున్నవింతే
యీరీతి నితనిదాసు లెక్కిరి పొడవులకు
తారి కిందికి దిగిరి దానవులై కొందరు ॥ఇంతే॥ 14

అవతారిక :

ఈ కీర్తనలో నాకు వచ్చిన సందేహాలను ఏ ఒక్క నిఘంటువూ తీర్చలేకపోయింది. చాలా చోట్ల నాకు స్ఫురించిన భావం ప్రకటించాను. నూటికి నూరుపాళ్ళూ ఇదే ఆచార్యుల వారి భావం అనే సాహసం చేయలేను. "కోరి శ్రీవేంకటపతి కుక్షిలోనే లోకములు ఆరయన్ కిందెడు మీదెడై వున్నవింతే"... అనే చరణాన్ని చూడండి. శ్రీవేంకటేశ్వరుడు కోరి తన కుక్షిలోనే అరయన్ కిందయేడు, మీదయేడు లోకములు వున్నవి ఇంతే". అంటే ఈ వసుంధరయే కాక, దానిపైన ఏడు (స్వర్గం మొదలైనవి) దానికింద ఏడు (పాతాళం మొదలైనవి) కూడిన ఈ విశ్వం సమస్తం ఆ

శ్రీహరి పొట్టలోనే వున్నాయని అర్థం. అన్నమాచార్యుల భావం యెంత సరళమో నుడికారం అంత జటిలం.

భావవివరణ:

ఇంతేపో, వారి వారి ఉచ్చనీచస్థితులు అన్నియూ భగవంతునిచే ప్రాప్తములు! పంతముతో తామేపాటి, భాగ్యమున్ ఆపాటే (తాము యెంత అర్హులో, తమ భాగ్యము కూడా అదే విధముగా వుంటుంది).

మనందరి అంతరాత్ముడు ఆ దేవుడే కదా! కాని అందులో కొందరు అధికులు అయ్యారు. కొందరు హీనులై కుందుదురు (దుఃఖిస్తారు). ఇదింతే. వీచేగాలికి హీనాధికములున్నవా? అది అందరికీ ఒకటే కదా! చేనిపంటానొకటే (పొలంలో పండే పంట హీనుజాతివాడు పండించినా, అగ్రజాతివాడు పండించినా ఒకేలా పండుతుంది కదా! శ్రీహరిని పొంది గట్టిగా కొలుచుండి (సేవ చేయుచుండినచో, పొల్లు కడబడున్ (పాపము తగ్గును).

పుట్టుకు అందరికీ ఒకేలా వుంటుంది కానీ ఈ భూమిపై కొందరు యేలికలును (రాజులై సుఖిస్తున్నారు). కొందరు వెట్టి చాకిరీ చేసే బంట్లు వలె వీగుదురు (క్షీణిస్తున్నారు). ఇదింతే. వరిగురుమతో (గొప్పదైన వరిధాన్యంతో) జొన్నగింజ సరితూగుతుందా చెప్పండి. ఒకటి తెట్టెలైన మేలు (అధికమైన మేలు) అయితే... తీలు ఒకటికి ఆయ (అణగారిపోవుట ఇంకొకటి అవుతుంది).

శ్రీవేంకటపతి తనకుక్షిలోనే (ఉదరములోనే) అరయన్ (పరికించగా) కోరి కిందయేడూ, మీదయేడు లోకములను వున్నవి. ఇదింతే, అనగా ఈ భూమితో కలసి పదునాలుగు భువనములన్నియు ఆయన పొట్టలోనే వున్నవి. ఈ విధముగా... ఈయన దాసులు పొడవులకు యెక్కిరి (ఉన్నతలోకములను అధిరోహించిరి). ఇదిట్లుండగా కొందరు దానవులై (రాక్షసస్వభావికులై) తారి (సంచరించి), కిందకి దిగిరి (అధఃపాతాళమునకు బోయిరి).

సంపుటి : 3 కీర్తన : ఏనోరువెట్టుక నిన్ను నేమని కావుమందును
సంఖ్య : 60 పుట : 41 రాగం : ఆహిరి

ఆహిరి

45. ఏనోరువెట్టుక నిన్ను నేమని కావుమందును
నే నిన్నుఁ దలఁచినది నిమిషమూ లేదు. ॥పల్లవి॥

పాయమెల్ల సంసారముపాలే పడితిఁగాని
చేయార నీసేవ నేఁ జేసుట లేదు
కాయమెల్ల కాంతలకే కగడుశేషమాయఁగాని
నీయవసరములందు నే నొదుగలేదు. ॥ఏనో॥

చిత్తము ఆసలపాలే సేసి బదికితిఁ గాని
హత్తి నిన్నుధ్యానము సేయఁగలేదు
సత్తెపునానాలుకెల్ల చవుల కమ్మితిఁగాని
మత్తిలి నీకీర్తనము మరపుటా లేదు. ॥ఏనో॥

పుట్టుగెల్లా నజ్ఞానముపొంతనే వుంటిఁగాని
వొట్టి నీవిజ్ఞానము నొల్లనైతిని
యెట్టు నన్ను మన్నించితి విందుకే పో వెరగయ్యా
నెట్టన శ్రీవేంకటేశ నిన్నడుగా లేదు. ॥ఏనో॥ 60

అవతారిక :

ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నిన్ను ఒక్క నిముషము కూడా పట్టుమని భక్తితో ధ్యానించలేదు. మరి, ఇక ఏనోరుపెట్టుకొని నిన్ను రక్షించమని అడుగగలను? నా బ్రతుకంతా సంసార తాపత్రయంతోనే గడిపాను. నా చేతులారా నీకు సేవచేయనే లేదు. పుట్టుకంతా అజ్ఞానంతోనే గడిపాను. ఇకనన్నెట్లా మన్నిస్తావు? నిన్ను శరణు అడుగుటకు కూడా నాకు

భయంవేస్తోంది అంటున్నారు అన్నమయ్య. ఆచార్యులవారిది ఆస్థితి అయితే మనబోటి వారి గురించి చెప్పేదేముంది?

భావవివరణ:

దేవదేవా! నిన్ను ఏనోరు పెట్టుకొని, యేమని నన్ను రక్షించమని అడుగగలను? నేను నీకు చేసిందేముంది? ఒక్కనిముషమైన నిన్ను తలుచుకోలేదు కదా!

పాయమెల్లా (వయస్సునంతా) సంసారము పాలేపడితి (సంసారపుయావతోనే గడిపాను). కాని చేయార (నాచేతులతో) నీసేవ చేసిందే లేదు. కాయమెల్లా కాంతలకే కడు శేషమాయె, (శరీరంలో వున్న సత్తువనంతా స్త్రీలకే మిగిలిపోవునట్లు చేశాను). నీనిమిత్తం ప్రయత్నించనే లేదు. ఇక ఏమని నిన్ను ఈనాడు కరుణించమని అడుగగలను?

ప్రభూ! నా చిత్తము (మనస్సు) నంతా ఏవేవో వెఱ్ఱి ఆశలపాలుజేసి బ్రతుకునంతా వ్యర్థముగా గడిపాను. హత్తి (కూడి) నిన్ను ఎప్పుడూ ధ్యానించనేలేదు. సత్యము చెప్పవలసిన నా నాలికను ఎల్లచవులకున్ అమ్మితిని (రకరకములైన రుచులన్నింటిని ఆస్వాదించుటకు విక్రయించాను). మత్తిలి (పరవశించి) నీ కీర్తనలను మరపుటా లేదు (పాలగునట్లు చేయలేదు). ఇక ఏమని నిన్ను ఈనాడు దయచూపమని అడుగగలను?

తండ్రీ! నాపుట్టుకెల్లా (జన్మనంతా) అజ్ఞానం పొంతనే (అజ్ఞానంతోబాటే) వున్నాను కానీ ఒట్టి (శపథముతో) నీ విజ్ఞానము (అనుభవ పూర్వకమైన జ్ఞానమును) ఒల్లనైతిని (అంగీకరించలేదు... అంటే... ప్రయత్నించలేదు)... ఇక నన్ను నీవెట్లు మన్నిస్తావు? ఇందుకేపో వెఱగయ్యాను (ఇందుకే కదా! నాకు భయం వేస్తున్నది?) అందుకని ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్నడుగలేదు. అయిందేదో అయింది ఈ దీనుణ్ణి ఆదుకో ప్రభూ!

సంపుటి : 3 కీర్తన : ఎట్టుమోసపోతి నేను యివియెల్ల నిజమని
సంఖ్య : 41 పుట : 28 రాగం : శంకరాభరణం

శంకరాభరణం

46. ఎట్టు మోసపోతి నేను యివియెల్ల నిజమని
నెట్టన హరినే నమ్మనేర నయితిఁగా ॥పల్లవి॥

దేహమిది నాదని తెలిసి నమ్మివుండితే
ఆహా నేనొల్లనన్నా నిట్టే ముదిసె
వూహల నాభోగమెల్లా వొళ్లఁబట్టెనంటా నుంటే
దాహముతోడ నినుముదాగినీరాయఁగా ॥ఎట్టు॥

మనసు నాదని నమ్మి మది మది నే పెంచితి –
ననుఁగుఁబంచేంద్రియములందుఁ గూడెనా (ను?)
యెనసి ప్రాణవాయువు లివి సొమ్మని నమ్మితి
మొనసి లోను వెలినై ముక్కువాత నున్నవి ॥ఎట్టు॥

ఇందుకొరకె నేను ఇన్నాళ్లు పాటువడితి
ముందు వెనకెంచక నే మూఢుఁడ నైతి
అంది శ్రీవేంకటేశ్వరుఁ డంతటా నుండి నా–
చందము చూచి కావఁగ జన్మమే యీడేరె. ॥ఎట్టు॥ 41

అవతారిక :

అసలివియన్నీ విని... నేను ఎట్లా మోసపోయాను? ఎట్లా నిజమని నమ్మాను? తప్పకుండా శ్రీహరిని నమ్మజాలనైతిని అంటున్నారు అన్నమాచార్యులవారు. "ఊహల నాభోగమెల్లా వొళ్ళబట్టానంటానుంటే... దాహముతోడ నినుము దాగిసి నీరాయగా" – అంటే ఏమిటో బుఱ్ఱ బద్దలుకొట్టుకున్నా అర్థంకాలేదు. ఏదుకొండలవాడా! అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణంమమ. ఏదన్నా స్ఫురింపజేయవయ్యా! తండ్రీ! అని

మొఱబెట్టాను. "అంది శ్రీవేంకటేశ్వరుడంతటా నుండి నా చందము చూచి కావగ జన్మమే యీడేరె" అని ఆచార్యులవారన్నట్లే జరిగింది.

భావవివరణ:

హతవిధీ! ఇవియన్నియు (దేహము, భోగభాగ్యాలు, మనస్సు, ప్రాణము మొదలైనవన్నియును) నిజమైనవని ఎట్లా నమ్మాను? నెట్టున (తప్పకుండా) హరిని (శ్రీహరిని) మాత్రం నమ్మనైతినే. ఎంత దౌర్భాగ్యుడను!!

ఈదేహము 'నాది' అని తెలసి (అనుకొని) నమ్మికతో వుంటే... ఆహా! నేను వద్దన్నా ఇది ముదిసె (ముసలిదైపోయింది). దీనితో అనుభవించే నా భోగాలన్నీ 'ఊహలే' కాని ఆ భోగాలను వంటబట్టించుకొని వుండిపోయాను. వాటి కోసం తపించాను. ఎంత తీవ్రమైన దాహమంటే దాని తాపానికి ఇనుము కూడా కరిగి నీరు అవుతుంది. ఎంత క్షోభననుభవించాను ప్రభూ!

నా మనస్సును నమ్మివున్నాను. నాదని అనుకొన్నాను. మది (మనసులోనే) మదినే పెంచితిన్ (నేను దానిపై మమకారం పెంచుకొన్నాను). కాని అది అనుగు పంచేంద్రియముల గూడెను (పాపకార్యములను ప్రోత్సహించు కన్ను ముక్కు వంటి పంచేంద్రియములతో జతకలిసింది). ఇవి ఎనసి (పొందిన) ప్రాణవాయువులను (ప్రాణము, అపానము, ఉదానము, వ్యానము, సమానము అను ఐదు వాయువులు) నమ్మి వాటిపై ఆధారపడ్డాను. కాని అవి ముక్కు ఆధీనమైనవి. ఎప్పుడు నన్ను వదలిపెడతాయో తెలియదు. ఎంత దారుణం!!

ఓ దేవదేవా! ఇన్నాళ్ళూ నేను వీటికొఱకా పాటుపడింది? ముందూ వెనుక ఆలోచించక వీటికొఱకా మూర్ఖుడినయ్యాను? అని ఎంతో దుఃఖించాను. అప్పుడు శ్రీవేంకటేశుడు నన్ను అందుకొని, నా చందము (పద్ధతి) చూచి అంతటా తానై నన్ను రక్షించాడు. అప్పుడు నా జన్మమే ఈడేరె (ధన్యమైనది).

సంపుటి : 3 కీర్తన : నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు

సంఖ్య : 51 పుట : 35 రాగం : ముఖారి

ముఖారి

47. నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు
దైవమా సిగ్గువడక తగిలే నేఁగాకా ॥పల్లవి॥

చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయఁగాను
యిందు మాసేవలు నీకు నేడకువచ్చు
పొంది వసిష్టాదులట్టె పూజలు సేయఁగాను
సందడి మాపూజలు సరకా నీకు. ॥నీవెం॥

సనకాది యోగులు సారె నిన్నుఁ దలఁచఁగా
యెనసి మాతలఁపు నీ కేడకెక్కును
నునుపుగా శేషాదులు నుతులు నిన్నుఁజేయఁగా
పనివడి మానుతులు బాఁతేయనా నీకు ॥నీవెం॥

కిట్టి నారదాదులు నీకింకరులై వుండఁగాను
యిట్టె నీదాసుఁడనను టెంత కెంత
వొట్టి శ్రీవేంకటేశ మాకొకవుపాయము గద్దు
పట్టి నీదాసులబంటుబంట నయ్యేనిఁకను. ॥నీవెం॥ 51

అవతారిక :

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవెంతటి ఉన్నతుడవు!! మేమెంత అధములము !! మన మధ్య ఎంత అంతరం వుంది!! అయినా సరే, సిగ్గు యెగ్గు లేకుండా నిన్ను తగులుకున్నాను. నాదైవమా! బ్రహ్మాది దేవతలు, వసిష్ఠాది ఋషులు, సనకసనంనాది యోగులు, ఆదిశేషుడు, నారదాది మహామహులు నీకింకరులు. వారి ముందు నేనెంత అల్పుడిని. అయినా నాకూ ఒక ఉపాయముందయ్యోయ్. నేనూ తక్కువ వాడినేం కాదు. నీదాసులకి బంట్లుంటారు కదా! ఆ బంట్లకి బంటునవుతాను. ఆ విధంగా నేనూ నీవాడినే అని సగర్వంగా చెప్పుకొంటాను... అంటున్నారు అన్నమయ్య.

భావవివరణ:

ఓ దైవమా! నీవెంత (ఎంతటి ఉన్నతుడవు) నేనెంత (ఎంత అధముడను)!! నీకూ నాకూ మధ్య ఎంత దవ్వు (దూరము... లేక అంతరం) వున్నది!! అయినా, ఏమాత్రం సిగ్గుపడక నేనుతగిలీ గాక! (తగులుకొన్నాను కదా! నీకు).

బ్రహ్మాది దేవతలు నీకు చెందిన (నీవారై) నీకు పలు సేవలు చేస్తుంటే, మాసేవలు, నీకున్‌యెందు వచ్చెయేడకు వచ్చె (ఎందులోకి వస్తాయి, ఎక్కడకు వస్తాయి?) వసిష్ఠుడు మొదలైన ఋషులు సులువుగా నిన్ను పొంది పూజలు చేస్తుంటారు. ఆ సందడిలో నీకు మా పూజలు సరకా (లక్ష్యమా)? ప్రభూ! మరి నాగతేమిటి?

ఓ దేవదేవా! సనకాది యోగులు నిన్ను సారె (ప్రతిసారీ) తలచగా (ధ్యానిస్తూనేవుంటారు). ఎనసి (అతిశయించి) మా ధ్యాస నీకు యెక్కడ కెక్కుతుంది? నునుపుగా (స్నిగ్ధముగా) ఆదిశేషుడు మొదలైనవారు నిన్ను కీర్తిస్తుంటే పనివడి మా నుతులు (పనివేళా నా కీర్తనలు) బాతేయనా (బాతి+ఆయెనా... అంటే ప్రేమ అవసరమౌతుందా?) మేము ప్రేమిస్తే యెంత ప్రేమించకపోతే యెంత?)

స్వామీ! నారదాదులు (నారదుడు మొదలైన సంకీర్తనారాధ్యులు) కిట్టి (నీ సమీపములోనే వుండి) నీ కింకరులు (భృత్యులు) అయివున్నారు. మరి, నేను ఇట్టే నీ దాసుడినుట యెంతకెంత? (ఎంత దుస్సాహసము!!) ఒట్టి (అతిశయించి ఓ శ్రీవేంకటేశ్వరా! మాకొక ఉపాయమున్నదయ్యా! పట్టి (పూనుకొని) నేను నీ దాసుల యొక్క బంట్లకు భృత్యుడుగా వుంటాను. హరిదాసులు సేవకులకు బంటునైతే మరి నీకూ నాకూ చుట్టరికమున్నట్లే కదా! తండ్రీ!

సంపుటి : 3 కీర్తన : అందాకానమ్మలేక అనుమానపడు దేహి
సంఖ్య : 18 పుట : 13 రాగం : లలిత

లలిత

48. అందాఁకా నమ్మలేక అనుమానపడు దేహి
అంది నీసొమ్ముగనక అదియుఁదీరుతువు. ॥పల్లవి॥

నీదాసుఁడననేటినిజబుద్ధి గలిగితే
ఆ దెస నప్పుడే పుణ్యుఁడాయ నతఁడు
వేద (దు?)తో నొక్కొక్కవేళ వెలుతులు గలిగితే
నీదయవెట్టి వెనక నీవే తీరుతువు ॥అందా॥

తొలుత నీశరణము దొరకుటొకటేకాని
చెలఁగి యాజీవునికిఁ జేటు లేదు
కలఁగి నడుమంత్రాన గతిదప్పనడచిన
నెలకొని వంకలొత్త నీవే నేరుతువు. ॥అందా॥

నీవల్లఁ గొరత లేదు నీపేరు నొడిగితే
శ్రీవేంకటేశ యిట్టె చేరి కాతువు
భావించలేకుండఁగాను భారము నీదంటేఁజాలు
నీవారి రక్షించ నీవే దిక్కొదువు. ॥అందా॥ 18

అవతారిక :

జీవులందరూ ఆ పరమాత్ముని ప్రియ సంతతే. ఆయన వారిని తన 'సొమ్ము'గానే భావిస్తాడు. దౌర్భాగ్యమేమిటంటే వీడిని అజ్ఞానం అనే పొర యెప్పుడూ కప్పివేస్తుంటుంది. దానితో వాణ్ణి అనుమానం అనే పిశాచి పట్టుకొంటుంది. తనదేహంలో వున్న పరమాత్మని గుర్తించలేడు. అందాకా (అంతవఱకు) నమ్మలేక తన మనుగడకే కారణమైన పరమాత్మనే నమ్మలేక అనుమానపడుతుంటాడు. ఓ ప్రభూ! అదియు (ఆ అనుమానం కూడా)

నీవే తీరుస్తావు అంటున్నారు అన్నమాచార్యులవారు. శ్రీవేంకటేశ్వరుడే పరమాత్ముడని భావించలేని వారు (నాలాంటి అల్పులు) కూడా తమ భారం అంతా నీదే మహాప్రభో! అంటే ఆనాడు ద్రౌపదిని రక్షించినట్లు రక్షిస్తాడు... "నీవేదిక్కొదువు" అంటున్నారు.

భావవివరణ:

ఓ దేవదేవా! నిన్ను అందాకా (అంతవరకు... అంటే... చివరి వరకు) నమ్మలేక, దేహధారి యైన'జీవుడు' అనుమానపడుతుంటాడు. వాడు నీసొమ్ము (సొత్తు) గనుక, అంది (పూనుకొని) అదియు దీరుస్తావు (ఆ అనుమానం కూడా పోగొట్టి) వాడిని నీవాణ్ణి చేసికొంటావు.

ప్రభూ! ఆ దేహికి తాను నీదాసుడను అనే నిజబుద్ధి కలుగగానే అప్పుడే, ఆ దెస (అక్కడే) అతడు పుణ్యుడాయ (పుణ్యాత్ముడైపోతాడు). వేదుతో (వెగటు స్వభావముతో) ఒక్కొక్కప్పుడు వెలుతులు గలిగితే (నీపై నిర్లక్ష్యం కలిగితే) వెనక (ఆ తరువాత) నీవే వారిపై దయజూపి ఆ వెగటుతనాన్ని కూడా రూపుమాపుతావు. కాకపోతే నీకృప కలగవలసిన అవసరం మాత్రం వుండాలి.

తొలుత (మొట్టమొదట) నీ శరణమును వేడితే... అది దొరకగానే ఇక ఆ జీవుడికి చేటు (కీడు) లేనే లేదు. ఒకవేళ వాడికి అనుకోకుండా నడమంత్రపు సిరి (మధ్యలో అకస్మాత్తుగా వచ్చిన సంపద) వలన గతిదప్పినడిచితే... నీవు నెలకొని (నిలిచి) నీవే వంకలొత్త (సరిజేయుట) నేరుతువు.

ఓ శ్రీవేంకటేశ్వరా! మావలన లోపం వుంటుంది కానీ నీవల్ల కొరత (లోపం) వుండనే వుండదు. మేము నీపేరు నొడిగితే (పలికినంతనే) ఇట్టే చేరి కాతువు (రక్షించెదవు). ఒకవేళ నిన్ను భావించలేకపోతే (అంతరంగంలో దర్శించలేకపోతే) మేము చేయవలసిందొక్కటే భారము నీపైవేసి నీవే దిక్కు అంటే... నీవారిని నీవే రక్షించుకొంటావు. నీవే దిక్కూ అవుతావు. ఇది ముమ్మాటికీ నిజం తండ్రీ!

సంపుటి : 3 కీర్తన : చింతలు రేచకుమమ్ము చిత్తమా నీవు
సంఖ్య : 63 పుట : 43 రాగం : గౌళ

గౌళ

49. చింతలు రేఁచకు మమ్ము చిత్తమా నీవు
పంతముతో మముఁగూడి బతుకుమీ నీవు ॥పల్లవి॥

తల్లి శ్రీమహాలక్ష్మి తండ్రి వాసుదేవుఁడు
ఇల్లు మాకు బ్రహ్మాండమింతా నిదె
జల్లిదపుహరిభక్తి పాఁడిఁ బంటా నాకు
వొల్లము కర్మఫలము లొకటి నేము ॥చింత॥

జ్ఞానమే మాకు ధనము సర్వవేదములు సొమ్ము
వూనినవై రాగ్యమే వుంబళి మాకు
అనినగురుసేవలు ఆఁడుబిడ్డలు నాకు
మేనితోనే తెగులాయ మేలు మాకుఁ జేరెను ॥చింత॥

యేలికె శ్రీ వేంకటేశుఁ డింటిదేవపూజ మాకు
పాలుగలబంధువులు ప్రపన్నులు
కీలు మాకు నీతనిసంకీర్తన మోక్షమునకు
యేలా ఇంకా మాకు నేమిటితో గొడవ. ॥చింత॥ 63

అవతారిక :

తన చిత్తమును హెచ్చరిస్తున్నారు అన్నమయ్య. ఓసి చిత్తమా! చింతలను రేప వద్దు అంటున్నారు. మాతో వుండాలంటే పట్టుదలతో నీవు మమ్మల్ని అనుసరించి బ్రతుకవలసినదే. నీకు ఇంకోదారి లేదు అంటున్నారు. తన విశిష్టత లేవియో ఏకరువు పెడుతున్నారు. పెట్టి ... ఇంకా మాకు యేలా (యేమిటికి) నీతో గొడవ అంటున్నారు. వైష్ణవుల శరణాగతి పద్ధతియే ఇంత. అతిసరళమైన ఈ కీర్తనలో కూడా "ఆనిన

గురుసేవలు ఆడు బిడ్డలు నాకు" అంటే ఏమిటో ఒక పట్టాన అర్థం కాలేదు నాకు. ఉంబళి అంటే ఏమిటి?

భావవివరణ:

ఓ చిత్తమా! (మనసా!) నీవు మమ్ము (మాకు) చింతలు రేచకు (ఆవేదన కలిగించకు). నీవు పంతముతో (దీక్షతో) మమ్ము అనుసరించి బ్రతుకుము.

మా గురించి నీకు తెలియునా? మాతల్లి లక్ష్మీదేవి. మా తండ్రి వాసుదేవుడు. ఈ బ్రహ్మాండ మంతయును మా ఇల్లే. మా ఇంట్లో సమృద్ధిగా నున్న పాడిపంటా... బల్లిదుడైన (పరాక్రమశాలియైన) శ్రీహరియందు మాకు గల భక్తి. అందుకని, నేము (మేము) కర్మఫలము నొక్కదానినైనా ఒల్లము (అంగీకరించము).

మాకున్న ధనమేమిటో తెలుసా... జ్ఞానము. మా సొమ్ము (సొత్తు) యేమిటో తెలుసా... సమస్త వేదములు మాసొమ్ము. పూనిన (పొందిన) వైరాగ్యము మాకు 'వుంబళి' (పన్నులేని ఆదాయము... (అంటే టాక్స్ ఫ్రీ ఇన్‌కమ్). మా ఆడుబిడ్డలు (కుమార్తెలు) యెవ్వరో తెలియునా? మేము నమ్మిశ్రద్ధగా ఆచరించిన గురుసేవలు. మాకు మేనితోనే (శరీరంతోనే) తగులాయె (చిక్కువచ్చింది). ఎందుకంటే, "మేలు చేరె" (దానిపై వలపు కలిగింది).

మా ఇంటిదేవుడు (ఇలవేల్పు) లోకాల ఏలిక అయిన శ్రీ వేంకటేశ్వరుడి పూజ మా సర్వస్వము. మావైపునున్న బంధువులు శ్రీహరి శరణాగతి పొందిన ప్రపన్నులు. ఆ దేవదేవుడైన శ్రీహరి నామ సంకీర్తన మా మోక్షమునకు కీలు (ఉపాయం) ఇంక మాకేల కొరత? ఏమిటితో గొడవ (దేనితో గొడవ?)

సంపుటి : 3 కీర్తన : ఎట్టుగెలుతు బంచేంద్రియములనే

సంఖ్య : 47 పుట : 32 రాగం : కన్నడగౌళ

కన్నడగౌళ

50. ఎట్టు గెలుతుఁ బంచేంద్రియముల నేఁ
బట్టరానిఘనబలవంతములు. ॥పల్లవి॥

కడునిసుమంతలు కన్నులచూపులు
ముడుఁగక మిన్నులు ముట్టెడిని
విడువక సూక్ష్మపువీనులు యివిగో
బడిబడి నాదబ్రహ్మము మోచె. ॥ఎట్టు॥

అదె తిలపుష్పంబంత నాసికము
కదిసి గాలి ముడెగట్టెడని
పొదిగి నల్లెఁడే పొంచుక నాలికె
మొదలుచు సర్వము మంగెడిని ॥ఎట్టు॥

బచ్చెనదేహపుపైపొర సుఖమే
యిచ్చఁ బ్రపంచం బీనెడిని
చెచ్చెర మనసిది శ్రీవేంకటేశ్వరుఁ
దచ్చి తలఁచఁగా దరి చేరెడిని. ॥ఎట్టు॥ 47

అవతారిక :

మానవుని కన్ను ముక్కు నోరు చెవి చర్మములను పంచేంద్రియములంటారు. ప్రపంచానికి సంబంధించిన బాహ్య జ్ఞానమును ప్రసాదించే వీటివల్లనే నరుని జీవితం సాధ్యమవుతున్నది. కాని కాలం గడిచిన కొద్దీ అవి మనిషిని తమ వశము చేసికొని తమ ఇష్టం వచ్చినట్లు వాడిని ఆడిస్తుంటాయి. వాడు వాటిని గెలువలేక వాటికి బానిస అవుతాడు. అవి పట్టరాని బలవంతములై వాడిమీద పెత్తనం

చలాయిస్తాయి. అందుకనే వీటిని ఎట్టా గెలుతును అని వాపోతున్నారు అన్నమయ్య. చెచ్చెర మనస్సు వీటితో కూడిన వీటిని గెలవాలంటే దచ్చితలచాలి, శ్రీవేంకటేశ్వరుడు దరిచేరాలి అంటున్నారు. అంటే?

భావవివరణ:

హతవిధీ! నేను ఈ పంచేంద్రియములను ఎట్లా గెలిచెదను? ఇవి పట్టరానివి (బంధింపలేనివి) గొప్ప బలవంతములైనవి. అవి నా శత్రువులని తెలిసినా నేను వాటినేమీ చేయలేకపోతున్నాను.

కన్నులు, కడున్‌యిసుమంతయి (గొప్ప వాడియైనవి). వీటి చూపులు ఏమాత్రం తగ్గక మిన్నులు ముట్టెడిని (ఆకాశాన్ని తాకుతూనే వుంటాయి). ఇదిగో ఈ వీనులు (చెవ్వులు) వున్నాయే అవి విడువక సూక్ష్మమైన శబ్దజ్ఞానమును అందజేయుచున్నవి. నాదబ్రహ్మవలె నున్న పరమాత్ముని అంశగలవైనప్పటికీ మనస్సు వీటిద్వారా తనకిష్టమైనవే వింటుంటుంది. వీటిని కాదనుట కష్టమే.

ఈ నాసిక (ముక్కు) వున్నదే... ఇది కేవలం తిల పుష్పంబంతయున్నది (నువ్వు పువ్వు అంతుంటుంది). అది కదిసి (దగ్గరయై) గాలిని కూడా, ముడిగట్టెడిని (పన్నువలె కట్టించుకొంటుంది). అక్కడే పొంచియున్న నాలుక మెదలుచు (దాని ఇష్టం వచ్చినట్లు కదలుచూ కనపడ్డదాన్నల్లా మింగుతూనే వుంటుంది.

ఇక ఈ బచ్చెన దేహము (రంగురంగుల శరీరం) వున్నదే... దీనిపై పొరలో మాత్రమే స్పర్శజ్ఞానం వుంటుంది. కాని అది సుఖేచ్ఛతో ప్రపంచాన్నే ఈనెడిని (ప్రసవిస్తుంటుంది). సమస్త జీవకోటి పుట్టుకకు ఇదే కారణం. అవునా? సరే, ఈ ఐదూ ఇలావుంటే వీటితోపాటు చెచ్చెర (శీఘ్రముగా) వశపరచుకోగల మనస్సు కూడా వున్నది. అది శ్రీవేంకటేశ్వరుని తచ్చి తలచగా (ప్రయత్నించి ధ్యానించగా) ఆస్వామి దాననుగ్రహించి, దరిజేరెడిని (దానికి దగ్గరవుతాడు).

సంపుటి : 4 కీర్తన : ఎన్నాళ్ళున్నా నిట్టేకదా

సంఖ్య : 59 పుట : 398 రాగం : దేసాళం

దేసాళం

51. ఎన్నాళ్ళున్నా నిట్టె కదా
విన్నని వెరగులె వేఁడుకలాయ ॥పల్లవి॥

భువి నెట్టున్నాఁ బోయేదే కా
చవులకుఁ జవియగు శరీరము
ధ్రువమని యీ సుఖదు:ఖ రోగములు
భవముల కిదియే బందములాయ ॥ఎన్నా॥

ఎంత వొరలినా నిదే తాఁగద (?)
కంతల కంతల కాయమిది
బొత దగులుచుక పొరలఁగఁ బొరలఁగ
సంతకూటములె సరసములాయ ॥ఎన్నా॥

కైపుసేసినా ఘనమౌనే కా
పాపముఁ బుణ్యముఁ బైపైనే
యీ పుట్టుగునకు ఈ వెంకటపతి
దీపించఁగఁ బెనుఁదెరువొకటాయ ॥ఎన్నా॥ 59

అవతారిక :

అన్నమాచార్యులవారి కీర్తనలలో పల్లవిని అర్థం చేసికొనుట తలకు మించిన భారం అవుతుంది. ఈ కీర్తన అందుకు చక్కని ఉదాహరణ. "ఎన్నాళ్ళున్నా ఇదే కదా! అల్పమైన వింతలు (సర్‌ప్రైసెస్) సంతోషకరమైనవిగానే వుంటాయి." అంటున్నారు. కొత్త ఒక వింత పాత ఒక రోత. ఇవ్వాళ నవ్వించేదే రేపు ఏడిపిస్తుంది. మానవ సంబంధాలన్ని సంత కూటములే (బజారులో కలసి బాగున్నారా అని

పలకరించుకొన్నాక... ఆ తరువాత ఎవరికి వారే యమునా తీరే...) మరి... ఇక ఇదింతేనా ఇలాగే నూరేల్ళు బ్రతకాలా? బాబోయ్...అని భయపడకండి. మార్గం వున్నది.

భావవివరణ:

ఓ మానవులారా! ఆలోచించండి, ఎన్నాళ్ళు బ్రతికినా ఇట్టే కదా! (ఇదింతే కదా!) విన్నని వెరగులే (అల్పమైన వింతలే) వేడుకలాయ (సంతోషకరమైనవిగా వుంటాయి). (ఆ తరువాత సంతోషం మాయమవుతుంది.)

ఈ శరీరమున్నది చూశారా? భూమ్మీద ఎట్లా బ్రతికినా ఇది పోయేదే కదా! ఉన్నంతకాలము ఇది చవులకు జవియగును (రుచులకు చప్పబడిపోతుంది). ధ్రువమని (ఎడతెగనిదిగా వుంటుందనుకొని) సుఖదు:ఖములు అనే రోగాలపాలబడి భవబంధాలలో మగ్గిపోతుంటుంది.

ఎంత వొరలినా (పొర్లినా) ఇదే తాఁగద (తాఁకు కద) అంటే... ఎంత క్రిందమీదైనా స్పర్శానందం కాయమునకే కదా! మరి ఈ కాయము ఏమిబాగుంది? దీని నిండా కంతల దొంతరే. బొతదగులుచు (పొత్తు కలిసి) పొరలగ పొరలగ (వుండగా వుండగా) సరసములాయ (చనువుతో కూడిన సంబంధాలేర్పడతాయి). కానీ ఇవన్నీ సంతకూటములు (బజారులో కలిసినప్పుడు ప్రేమలొలకబోసి బాగున్నారా అని చూపించే ఆప్యాయతలే...). ఇవి నిజం అని భ్రమపడవద్దు.

కైపుసేసినా (ఎంత విజృంభించినా) ఘనమౌనేకా (గొప్పతనమవుతుందా?) అవన్నీ మన పాపపుణ్యాల పైపైనే (వలననే) కదా! ఇందులో మనగొప్పతనమేమున్నది? ఈ పుట్టుగునకు (జన్మకు) ఈ శ్రీవేంకటేశ్వరుడు దీపించగా (వెలుగునీయగా) పెను తెరువొకటాయ (గొప్ప జీవన్మార్గము లభించింది.)

సంపుటి : 4 కీర్తన : పంతపుటాసలు బండ్ల రాగా

సంఖ్య : 69 పుట : 47 రాగం : గుండక్రియ

గుండక్రియ

52. పంతపుటాసలు బండ్ల రాఁగా
దొంతుల యలమటఁ దొలఁగేనా ॥పల్లవి॥

మును దీపనాగ్ని మోఁచిన దేహిని
అనిశముఁ గ్రోధాగ్ని నణఁచేనా
మనసిజుకతమున మహి జన్మించితి
విను మరునాజ్ఞకు వెలి యయ్యేనా ॥పంత॥

సటలోభపు సంసారము చొచ్చితి
ఘటన విడుము డిఁకఁ గలిగీనా
నటించు చపలపునాలుక గల నే
మటమాయపు చవి మానేనా ॥పంత॥

పాపపుణ్యముల భవముల జీవిని
తోపడ కర్మము దొబ్బేనా
యేపున శ్రీవేంకటేశ్వరుశరణమే
పైపయి భజించి బ్రదికితిఁగాక ॥పంత॥ 69

అవతారిక :

అన్నమాచార్యులవారి కీర్తనలలో పల్లవియే కొరకరాని కొయ్య అని వెనకటికొకసారి విన్నవించాను. కొట్టుమిట్టాడితేనేగాని కుదరని కసరత్తు. మానవుల ఆశలు తీరక పంతము (పోటీ) పెరుగుతుంది. ఈ పంతపుటాసలు ఒకటి, రెండు అనుకోలేం. ఇవి బండ్లమీద మోసికొచ్చేటంతగా వుంటే వానికి తగ్గట్లే... అవి తీరలేదనే ఆలమటము (ఆరాటము) కూడా వుంటుంది. ఇది తొలగిపోయే దారేది? అంటున్నారు.

విచారించకండి.... వేంకటేశ్వరుని శరణమే మార్గం. ఆయనను పైపయి భజించి బ్రతికితిగాక! అంటున్నారు.

అంటే ఏమిటి?

భావవివరణ:

మానవులారా! పంతము (పట్టుదల వలన పెరిగే పోటీ) పెంచునటువంటి ఆశలు, బండ్లరాగా (కుప్పలు తెప్పలుగా బండ్లపై వచ్చినట్లు కమ్ముకొనగా) అలమట (అవి తీరలేదే అనే చింత) దొంతుల (సమూహంగా) పెరుగుతుంది. అది తొలగేనా (పొమ్మంటే పోతుందా?)

దేహి అని పిలువబడే ఈ ఆత్మ దీపనాగ్ని, (అగ్నివలె వెలిగే జ్యోతి స్వరూపుడు). కానీ అజ్ఞానంవలన, అనిశము (ఎల్లప్పుడూ) వాడిని క్రోధాగ్ని అణిచివేయుచున్నది. నేను కూడా ఈ భూమిపై పుట్టినది. ఆ మనసిజు కతమున (మన్మథుడి మూలంగానే). మరి ఇది వినండి. నేను కూడా ఆ మరుని ఆజ్ఞకే వెల అయ్యేనా (అమ్ముడు పోయేనా!!) ఎంత దురదృష్టం?

సట లోభము (కపటియైన లోభగుణము)తో నిండిన ప్రపంచమున ప్రవేశించితిని. ఇక విడుముడి (విముక్తి) అనే ఘటన కలగీనా (కలుగుతుందా?) నేను నా నాలుక బాధ భరించలేను. చపలపు నాలుక (చపలస్వభావంగల నా నాలుక) నటించు (ఎప్పుడూ ఆడుతూనే వుంటుంది). అది మట(టు) మాయపు చవి (మిక్కిలి మాయకు గురిచేసే 'రుచి' అనే యావనుమానుకొంటుందా?

తను చేసిన పాపపుణ్యముల వలన భవములు (పుట్టుకలు) కలిగిన ఈ జీవిని, తోపడ కర్మము (వడ్రంగివాని వలె దూగడ బట్టే కర్మము) దొబ్బేనా (దొబ్బుతుంది కదా!) అంటే... ఆ జీవి తను చేసిన పాపపుణ్యాలవల్లనే జన్మలలో దొబ్బబడతాడు (నెట్టివేయబడతాడు). ఇక వీడిగతి ఇంతేనా? ఏపున (ఎక్కువగా) శ్రీ వేంకటేశ్వరుని శరణమే (శరణాగతిలోనే) పైపయి భజియించి (సులభముగా కీర్తించి) బ్రతికిపోయాను కదా!

సంపుటి : 4 కీర్తన : ఏమి సేయువాఁడ నివి విరసమొకటొకటి
సంఖ్య : 63 పుట : 43 రాగం : శుద్ధవసంతం

శుద్ధవసంతం

53. ఏమి సేయువాఁడ నివి విరసమొకటొకటి
తామసంబొకవంక తత్వమొకవంక ॥పల్లవి॥

యితరోపాయరాహిత్యుండు గాఁడేని
అతిశయంబగు మోక్ష మది యబ్బదు
సతతోద్యోగానుచరితుండు గాఁడేని
వితతసంసారసుఖవిధి నడవదు ॥ఏమి॥

వివిధేంద్రియ విషయవిముఖుఁడు గాఁడేని
యివల వైష్ణవధర్మమిది యబ్బదు
అవిరళంబగు దేహానుసరణములేక
భవమాత్రమున సుకృతఫలమబ్బదు ॥ఏమి॥

పరమానందసంపన్నుండు గాఁడేని
చరమవిజ్ఞాన నిశ్చలుఁడు గాఁడు
యిరవయిన శ్రీవేంకటేశ యిటువలె నీవు
కరుణించకున్న దుర్గతులచే భ్రమసీ ॥ఏమి॥ 63

అవతారిక :

విరసము అంటే వ్యతిరేకము అని అర్థం. "అయ్యో! నా యెదుటనున్నవన్నీ ఒకదానికొకటి విరసములు. ఒకవంక తామస ప్రవృత్తిని ప్రకోపించేదుంటే, ఇంకొక ప్రక్క తత్త్వచింతనకు అవసరమైనదున్నది. ఏమిచేయగలను?" అని వాపోతున్నారు. అన్నమాచార్యులవారు. కరవమంటే కప్పకు కోపం, వదలమంటే పాముకు కోపం అంటారు పెద్దలు. మనకేమో ఈ రెండూ కావాలి. ఇది భ్రమ. జీవితమంతా వ్యతిరేక భావాలను సమన్వయ పరుస్తూనే గడపవలసి

వస్తోంది. ఈ సంసారం వదలదు. వదిలితే కాని మోక్షం రాదు. కానీ భ్రమవల్ల నాకు రెండూ కావాలనిపిస్తుంది. మరి దారేమిటి?

భావవివరణ:

ఓ దేవదేవా! నేనేమి చేయగలవాడను? నాయెదుట వున్న ఈ రెండూ ఒకదానికొకటి విరసము (వ్యతిరేకము). ఒకటి తామస ప్రవృత్తిని పెంపొందించేది, మరొకటి తత్త్వచింతనావశ్యకత కలిగినది. (కాని నేను ఈ రెండూ వదులుకోలేను)

నాబోటి సాధకుడు, ఇతరోపాయ రాహిత్యుండు (ధర్మ, అర్థ, కామ, మోక్షములలో ధర్మ అర్థ కామములు అను ఇతరోపాయములను వదలినవాడు) కాడేని (కాకపోతే) అతిశయించిన మోక్షమును పొందలేడు. అయితే... సతతోద్యోగ అనుచరితుండు కాడేని (ఎప్పుడూ ఏదో ఒక వృత్తిని చేబట్టకపోతే), వితత సంసార సుఖవిధి (విరివిగా నుండే సంసార సుఖము పొందు వ్యాపారము)నడువదు. ఈ రెండూ అవసరమే.

వివిధ ఇంద్రియ విషయ విముఖుండు (రకరకములైన ఇంద్రియ భోగములనుండి విరక్తి పొందినవాడు) కాకపోతే వైష్ణవధర్మము ఇటువైపున అలవడదు. దేహముయొక్క ఆదేశములను అనుసరించక జీవనయానం సాగదు. అయితే దేహం కోసమే జీవిస్తే... భవమాత్రమున (కేవలం పుట్టుకచేత) సుకృతఫలము (పుణ్యఫలము) ప్రాప్తించదు.

పరమానం స్థితి వలన సంపన్నుడు కాకపోతే... చరమ విజ్ఞాన నిశ్చయుడు (కడపటిగా ఆవశ్యకమైన విజ్ఞానము (ఆత్మజ్ఞానము) చేత నిశ్చయమనస్కుడు) కాలేడు. అంటే చివరికి ఒకదానికొకటి విరుద్ధమైన ఆవశ్యకతలతో పీడ కలిగింది. శ్రీవేంకటాద్రిపై ఇరవయిన (నెలకొన్న) శ్రీహరీ! ఇటువలె (ఈవిధంగా) నీవు కరుణించకపోతే నేనే దుర్గతులపాలై భ్రమసీ (భ్రమలోనే వుంటాను తండ్రీ!)

సంపుటి : 4 కీర్తన : పొందగు "నాత్మాపుత్రనామ" మను-

సంఖ్య : 62 పుట : 42 రాగం : మాళవిగౌళ

మాళవిగౌళ

54. పొందగు "నాత్మాపుత్రనామ"మను-
చందపువేదమె సరి నిలిపితివి ॥పల్లవి॥

పుత్రుఁడు మరుఁడట పుత్రుఁడు బ్రహ్మట నీ-
పుత్రపౌత్రులే భువినెల్లా
పుత్రకామేష్టిని బొడమితి దశరథ-
పుత్రుఁడవై యిది పొగడఁగ నరులు ॥పొంద॥

మనుమఁడు రుద్రుఁడు మనుమఁడు వశిష్ట
మనుమని మనుమలే మహి యెల్లా
మనుమఁడవై యదితిమాన్యగర్భమున
జననమందితివి జగమున కరుదు ॥పొంద॥

యిదె నీగోత్రంబీచరాచరం-
బెదుట మెరసె నిదె యిహమెల్లా
కదిసిటు శ్రీవేంకటగోత్రంబున
నుదయించి మెరసితో హరి నీవు ॥పొంద॥ 62

అవతారిక :

"ఆత్మావైపుత్రనామాసి" - అనునది వేదవాక్యము. ఆత్మ తానే తన పుత్రునిగా వుంటుంది. అని దాని అర్థం. అట్లను నట్టి వేదమునే నీవు చక్కగా పొందుగా నిలిపావు ప్రభూ! అని ఈ పల్లవికి అర్థం. అన్నమాచార్యులవారి కీర్తనలలో గీత, వేదవాక్యం, సామెతలు గుప్పించటం పరిపాటే. ఈ కీర్తన ప్రత్యేకత యేమంటే అన్నమయ్య పదగుంభనం. అన్నమయ్య కీర్తనలు నేర్చుకొనే చిన్నపిల్లలు దీని అర్థం చెప్పుతాతయ్యా అని అడిగితే నాబోటి తాతయ్యలు తాధయ్యని నృత్యం చేయాల్సిందేనేమో."

కదిసిటు శ్రీవేంకటగోత్రంబున నుదయించి మెరసితో హరి నీవు" - అంటే స్వామి పుట్టిన గోత్రం శ్రీవేంకట అనికాదు. మరేమిటో!!

భావవివరణ:

స్వామీ పొందు అగు (చక్కనైన) "ఆత్మావైపుత్రనామాసి" (ఆత్మయే తన పుత్రునిగా వుండును) అనునట్టి వేదవాక్యమును సరిగా నిలిపితివి. ఆ చందమును వివరింతును. ఆలకింపుము.

నీ పుత్రుడొకడు మరుడట (మన్మథుడట). ఇంకొక పుత్రుడు బ్రహ్మదేవుడట. ఈ భూమినిండా ఎవడు పుట్టినా వీరిద్దరీవల్లనే కదా! అంతా నీ కొడుకులు, మనుమళ్ళే కదా! అట్లాంటి నీవు దశరథమహారాజు పుత్రకామేష్ఠి యాగం చేస్తే పొడమితివి (జన్మించావా?) నిన్ను జనులందరూ తమ రక్షకుడని కీర్తించారా? ఎంత విచిత్రం!

ప్రభూ! రుద్రుడు (శివుడు) నీ మనుమడు (దిక్పాలకులను సృష్టించి నియమించింది బ్రహ్మదేవుడే కదా! ఈశాన్య దిక్కునకు పాలకుడైన రుద్రుడు మరి నీ మనుమడే కదా!) వశిష్ఠుడు మునులందరిలో అగ్రగణ్యుడు. ప్రపంచంలో రుద్రుడు సృష్టించిన రుద్రగణాలు, వశిష్ఠుని సంతతియైన మునిగణాలు, వారి సంతానం చూడబోతే అంతా నీమనుమలు, మునిమనమలే కదా! ఇక్కడొక తమాషా యేమంటే... కశ్యపు జాపతి నీ మనుమడు.... అదితి ఆయన భార్య నీవేమో ఆమె తపస్సుకు మెచ్చి ఆమెకు 'వామను'డనే పుత్రునిగా పుట్టావు. అంటే నీవే నీ మనుమనిగా నీ కోడలికి పుట్టావా? ఏమి విచిత్రం!!

అందువలననే ఈ చరాచర విశ్వమంతా నీ గోత్రమే (వంశమే). ఈ ఇహలోకమంతా ఈ విధంగా నీ యెదుటనే మెరసీ (విస్తరించినది). ఇటు (ఈవిధంగా) కదిసి (మమ్ము సమీపించి) శ్రీవేంకట గోత్రంబున (కొండ మీద) ఓశ్రీహరీ నీవు వుదయించి (పొడచూపి) మెరసితివి శోభతో వెలుగులను చిమ్మినావు.

సంపుటి : 4 కీర్తన : ఓహో వొడలుమాని (మా వొడలు నీ?) వోపికె గడుమేలు

సంఖ్య : 41 పుట : 28 రాగం : దేవగాంధారి

దేవగాంధారి

55. ఓహో వొడలుమాని (మా వొడలు నీ?) వోపికె గడుమేలు
యీహల నీవుపకారమేమని నుతింతు ॥పల్లవి॥

పుట్టినచోటంటినా అది భూతములనెలవు
నెట్టన మూసిన మేను నిఖిల హేయమయము
యిట్టి నా యాతుమలోన హరి యెట్టుంటివి నీవు
అట్టె నీ చేఁతలు దలఁచి అరుదయ్యా నాకు ॥ఓహో॥

మించుల మనసంటిమా అది మిగులఁ జంచలంబు
పంచల నా సంపదలు పాపపుణ్య విధులు
యెంచఁగా యిటువంటి నన్ను యెట్టు ధరియించితి
నించిన నీ చేఁతలు విని నివ్వెరగయ్యాని ॥ఓహో॥

పాయ మిది యంటిమా పంచేంద్రియముల వశము
ఆయము నా కంటిమా అది అయిదు భూతముల మొరఁగు
యీయెడ శ్రీవేంకటేశ యీడా యెట్టేలితి నన్ను
మాయల నీశరణంబిందుకే మనసయ్యా నాకు ॥ఓహో॥ 41

అవతారిక :

ఈ కీర్తనలో "ఓహో వొడలు మాని వోపికె గడుమేలు" అనే పల్లవే ఒక పట్టాన అర్థం కాదు. పెద్దలు దానిని విశ్లేషించి "ఓహో మా వొడలు నీ వోపికె గడుమేలు" అని విశ్లేషించారు. అప్పుడు అన్నమాచార్యులవారి భావం అంతుచిక్కింది. "ఓహో దేవదేవా! మా ఈ శరీరం నీ క్షమవల్ల మాకు ఎంతో వుపకారంగా దొరికింది. ఈ విధంగా నీ వుపకారం ఏమని పొగడను స్వామీ!" – అని ఈ పల్లవికి అర్థం. దీనికే ఇన్ని తిప్పలు పడితే మిగతా చరణాల మాటేమిటి? జాగ్రత్తగా పరిశీలించండి.

భావవివరణ:

ఓహో! దేవదేవా! ఈ మా వొడలు (శరీరము) నీ వోపికె. (నీ క్షమవలన మాకు లభించింది). అది మాకు గడుమేలు (గొప్ప ఉపకారము). ఈ నీవుపకారాన్ని నేను ఏమని కీర్తించను ప్రభూ!

నాదెంత అధోగతియో చూడు ప్రభూ! నా పుట్టినచోటు చూద్దామా అంటే అది భూతములు వుండేచోటు. నన్ను ఎందులో మూసి వుంచావు? అన్ని విధాలా హేయము (అసహ్యకరమైన) మేనిలో (శరీరంలో). ఇంత అసహ్యకరమైన దీంట్లో ఆత్మారాముడవై, నీవెట్టా వున్నావయ్యా! ఓ శ్రీహరీ! నీ చేతలు (లీలలు) నాకు తలచన్ అరుదయ్యా (అద్భుతంగా వున్నాయి) స్వామీ!

పోనీ, శరీరం దేముంది... మనస్సు దానికంటే మించినది వున్నది కదా! అనుకోవటానికి కూడా వీలులేదు. ఆ మనస్సు చంచలమైనది. ఇక నా పంచల (తోడువున్న) సంపదలు ఏమిటయ్యా అంటే నా పాపపుణ్యాల విధులు... నేను గడించిన నా సిరిసంపదలు. ఒక్కసారి ఆలోచిస్తే... ఇంత నీచాతినీచుడైన నన్ను నీవెట్లా ధరించితివి (దాల్చితివి? నీ చేతలను వింటే గొప్ప ఆశ్చర్యం కలుగుతున్నది స్వామీ!

సరే, నా పాయము (ఆయుర్దాయం) గురించి ఎంత తక్కువ చెబుతే అంత మంచిది. అది పంచేంద్రియముల దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది. ఇక నా ఆయము (ఆర్జన) చూద్దామా అంటే అది పంచభూతముల మొరగు. అనగా పంచభూతములచే వంచించబడినది. ఎందుకంటే నేను ఎప్పుడూ పంచభూతాల అధీనుణ్ణే కదా! ఇటువంటప్పుడు ఓ శ్రీవేంకటేశ్వరా! అక్కడ (దివిలో సరే,)... యీడా (ఈ భూమిమీద కూడా) ఎట్లా మాయల నన్ను పరిపాలిస్తున్నావయ్యా! అందుకే నీకు శరణుజొచ్చితిని.

సంపుటి : 4 కీర్తన : కోటికి బడగయెత్తి కొంకనేల

సంఖ్య : 40 పుట : 27 రాగం : గుండక్రియ

గుండక్రియ

56. కోటికిc బడగయెత్తి కొంకనేల
యీటులేని పదమెక్కి యిcకనేల చింత ॥పల్లవి॥

పెట్టినది నొసలను పెద్ద పెద్ద తిరుమణి
కట్టినది మొలc జిన్నకౌపీనము
పట్టినది శ్రీహరిపాదపద్మమూలము
యెట్టయినా మాకు మేలే యిcకనేల చింత ॥కోటి॥

చిక్కి నా లోనైనది శ్రీవైష్ణవధర్మము
తొక్కినది భవముల తుదిపదము
యెక్కినది హరిభక్తి యిది పట్టపేనుcగ
యెక్కువ కెక్కువే కాక యిcక నేల చింత ॥కోటి॥

చిత్తములో నిండినది శ్రీపతి రూపము
హత్తినది వైరాగ్య మాత్మ ధనము
యెత్తల జూచిన మాకు నిదివో శ్రీవేంకటేశుc–
డెత్తి మమ్ము గావగాను యికనేల చింత ॥కోటి॥ 40

అవతారిక :

"కొంకుట" అంటే సంకోచముతో భయపడటం. కోటికి పడగలెత్తుట అంటే కోటీశ్వరుడగుట. కోటీశ్వరుడైనవాడు జంకుటెందులకు? ఈటులేని (వ్యర్థముకాని) స్థానమును పొంది ఇంకా దిగులెందుకు – అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎక్కడ జూచినా మాకు శ్రీవేంకటేశ్వరుడే మమ్ము యెత్తి గావగాను, ఇక చింతయేల? అంటున్నారు. శ్రీవైష్ణవంలో అత్యంత ప్రధానమైనది హరిశరణాగతి. హరి భక్తి... హరిచింత.... హరి శరణాగతి

వుంటే గాని విరక్తుడు కాలేడు. అవేవీ లేకుండా మోక్షం ఎలా వస్తుంది? ఇంతకీ... ఇక్కడ కోట్లకు పడగలెత్తటం అంటే సంచులనిండా ధనం వుండటం కాదు. మరి...

భావవివరణ:

ఓ ప్రజలారా! కోటికి బడగయెత్తి (గొప్ప కోటీశ్వరుడై) కొంకనేల (భయంతో సంకోచించుట యెందులకు?) శ్రీహరి శరణాగతిని పొంది కోట్ల కొలదీ పుణ్యం సంపాదించినవాడు జంకుటెందులకు? అని భావము. ఈటులేని పదమెక్కి (వ్యర్థముకాని ఉన్నతస్థానమును బొంది), ఇంకా దిగులెందుకు?

ఇక మా గురించి చెప్పాలంటే... మేము నొసల (నుదుటి మీద) పెట్టుకొన్నది పెద్ద పెద్ద తిరుమణి (పెద్దగా నున్న పంగనామాలు). మొలన్ కట్టినది చిన్న కౌపీనము (మొలకు కట్టుకొన్నది... చిన్న గోచీ). ఆపైన పట్టుకొన్నది శ్రీహరి పాద పద్మములు. మాకు ఎట్లా జరిగినా మేలే. మరి ఇంకా విచారం ఎందుకు?

నాకు చిక్కి, నా స్వంతమైనది ఈ శ్రీవైష్ణవ ధర్మము. తొక్కినది భవముల తుదిపదము (అనేక పుట్టుకల చిట్టు చివరి పదము (స్థానము) పై అడుగుపెట్టాను. ఇది పట్టుపుయేనుగు వంటి హరిభక్తి. దీనిపై నెక్కితిని. ఇది ఎక్కువకే యెక్కువ (సర్వోన్నతము) అయిన స్థానము. ఇక దిగులెందుకు?

నా చిత్తము శ్రీహరి రూపముతో నిండిపోయినది. ఆత్మలో వైరాగ్యము అనే ధనము హత్తినది. (కలిగినది). మాకు యెత్తల జూచినా (ఎక్కడ జూచినా) ఇదిగో ఈ శ్రీవేంకటేశ్వరుడే కనబడుచున్నాడు. ఆయన యెత్తి (ఎత్తుకొని) మమ్మల్ని రక్షిస్తుంటే ఇంకా దిగులెందుకయ్యా! మాకే విచారమూ లేదు. మేము హరిదాసులము.

సంపుటి : 4 కీర్తన : తెలియుట యెన్నడఁడు దేహి తనంతట
సంఖ్య : 70 పుట : 47 రాగం : బౌళి

బౌళి

57. తెలియుట యెన్నఁడు దేహి తనంతట
తెలియఁగ హరి నిదిక్కే కలది ॥పల్లవి॥

రాపుగ రేపే మూత్రపురీషంబులు
ఆపై నాఁకటియలమటలు
కైపుగ నింతటఁ గామవికారము
మాపు నిద్దురలమంపులె కలది ॥తెలి॥

కొన్నాళ్లు బాల్యము కొన్నాళ్లు కౌమార-
మన్నిటఁ గొన్నాళ్లు యౌవ్వనము
పన్నిన ముదిమియుఁ బైపైఁ గొన్నాళ్లు
వున్నతి నంతట నుడుగుట కలది ॥తెలి॥

జంతువులకు యీ సరవులు నీవే
పొంతలఁ గల్పించి పొదిపితివి
యింతట శ్రీవేంకటేశ్వర నీకృప
చింతించి కావవే చేకొని నన్ను ॥తెలి॥ 70

అవతారిక :

దేహి అనగా దేహమును ధరించిన జీవుడు. వీడి చేతనయే పరమాత్మ సిద్ధి. ఆ చేతన పోయిన మరుక్షణం వాడిని 'చనిపోయాడంటున్నాం'. మరి ఈ దేహంలోంచి ఆ దేహి 'చని' పోగానే ఇంత వరకు ఒక పేరుతో పిలిచిన వాళ్ళు వాడి తోలు శరీరాన్ని శవం అంటున్నాం. ఇది వరకు గానీ, చనిపోయిన తరువాతగానీ వీడు దేహియేఆని ఈతోలు తిత్తికాదు. వీడు ఇంకో తోలు తిత్తిని వెదకి కొని దాంట్లో దూరేవాడే కానీ నూరేల్ళు దాటి దాంట్లో వుండడు. ఇది వాడు తనంతట తను తెలిసికొనుట యెన్నడూ

జరుగదు. ఏదోనాడు శ్రీహరి దయకలిగితేనే వాడికి తెలుస్తుంది. నీ దిక్కే (శరణమే) వాడికి ఆ జ్ఞానం కలిగిస్తుంది అంటున్నారు అన్నమాచార్యులవారు ఆ పరమాత్మతో

భావవివరణ:

మానవుడు అయిన దేహి (జీవుడు) తనంతట తాను, ఆత్మ తత్త్వాన్ని తెలియుట యెన్నడు సాధ్యపడుతుంది? ఓ శ్రీహరీ! ఇది తెలియగ నీ దిక్కే (శరణమే) కలది (వాడికి కలిగే ధన్యత), అదిలేక వాడెన్నడూ తెలియలేడు.

ఈ శరీరంలో దూరినంతనే ఈ దేహికి కలది (అబ్బినది) యేమిటి? రాపుగరేపు (ఆగకుండా ఒరిపిడి కలిగించే) మలమూత్రంబులు, ఆపైన ఆకలి దప్పికల అలమటలు (ఆవేదనలు), కైపు (వివశత్వం) కలిగించే కామ వికారములు, రాత్రికాంగానే నిద్దురలు, ఆ నిద్దురలలో మంపులు (మైకములు) కలదే ఈ దేహి.

సరే, ఈ దేహి ఈ దేహంలో ఎన్నాళ్ళని వుంటాడు? కొన్నాళ్ళు బాల్యము, కొన్నాళ్లు కౌమారము, అన్నిట (అందులోనే) యౌవనము కొన్నాళ్ళుంటుంది. పైపైనబడి బాధించే ముదిమి (ముసలితనం) కొన్నాళు ళ్ళ పన్నినట్లు వుంటుంది. ఈ బాధలతో వాడికి వున్న ఆ కొద్దిపాటి ఉన్నతి కూడా, ఉడుగుట (నశించుట) కలది (జరుగుతుంది). ఎందుకంటే ఆ ముసలితనం యాతన భరించలేక దైవదూషణ చేస్తూనే వుంటాడు కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! జంతువులకు (జ్ఞానం లేక ఆహార, నిద్రా, భయ, మైథునాల కోసమే జీవించే ఈ మానవ మృగాలకు) యీ సరవులు (పద్ధతులు) నీవే కల్పించి, పొంతల పొదిపితివి (సమీపించి వుద్ధరించితివి). ఓ దేవదేవా! ఇంతట (ఇక) చింతించి (నా గురించి కాస్త ఆలోచించి) నన్ను చేకొని (చేరదీసి), నీ కృపన్ (నీ దయతో) కావవే (రక్షించవయ్యా! నా తండ్రీ!)

సంపుటి : 4 కీర్తన : ఔలే నే నొకపనికి నవుదు నీకును

సంఖ్య : 23 పుట : 16 రాగం : మంగళకౌశిక

మంగళకౌశిక

58. ఔలే నే నొకపనికి నవుదు నీకును
కూళలలో నెంచి చూడ గురి యవుదును ॥పల్లవి॥

పసురమువంటివాఁడ పాపపుబందెలు దెత్తు
శిసువువంటివాఁడ సిగ్గు నెగ్గు నెరఁగ
వసుధలో రాయివంటివాఁడను దయదలఁచ
యెసఁగ నన్నేరీతి నీ వేలితివి దైవమా ॥ఔలే॥

మాఁకువంటివాఁడ నే మతి లేదు; పుచ్చిన-
పోఁకవంటివాఁడ నెప్పుడు కొరగాను
రోఁకలివంటివాఁడ రోటిలోని పోట్లకు
యేఁకట నన్నెటువలె నేలితివి దైవమా ॥ఔలే॥

పామువంటివాఁడ నే పట్టినవారిఁ గరతు
గామువంటివాఁడ లోకమువారిఁ బీడింతు
నేమపు శ్రీవేంకటేశ నీవు నన్ను బంటంటా-
నేమిటికి గృపతోడ నేలితివి దైవమా ॥ఔలే॥ 23

అవతారిక :

'ఔలే' అంటే నేటి కాలంలో "ఔనులే" - అన్నమాట. 'కూళుడు' అంటే కుత్సితబుద్ధి కలవాడు అని అర్థం. "గురియవుదు" అంటే గురును (అధికుడను) అవుదునని అర్థం. "ఔనులే స్వామీ! నీకు ఒక పనిలో నేను అత్యధికుణ్ణి అయి తీరుతాను. నిన్ను ఆశ్రయించిన వారిలో కుత్సితులు కూడా వుంటారు కదా! నేను అదిగో వాళ్ళందరిలో గురువు వంటివాడను. అందుకోసమైనా నన్ను అనుగ్రహించవయ్యా!" - అంటున్నారు అన్నమాచార్యులవారు. భగవత్సన్నుతిలో నిందాస్తుతి కొందరు

యెంచుకుంటే... ఆత్మనిందాస్తుతి కొందరెంచుకున్నారు. నేను ఒట్టి పనికిమాలిన వాణ్ణి, నీచుణ్ణి - అయినా సరే నీకు నన్ను కరుణించక తప్పదుగాక తప్పదు, అంటున్నారు.

భావవివరణ:

ఔనులే స్వామీ! నీకు ఒక్కపనిలో అత్యధికుణ్ణి అయితీరుతాను. నిన్ను ఆశ్రయించిన వారిలో కూళులు (కుత్సితబుద్ధి కలవారు) వుంటారు కదా! వాళ్ళందరిలో నేనే గురుడిని. ఆ విధంగానైనా వీడు యెంచదగ్గవాడని నీవనుకుంటే నాకదే పదివేలు.

నేను యెట్లాంటివాడినో చెబుతాను విను. పశురము (పశువు) వంటివాడను. పాపము అనే బందెల దొడ్డిలో వున్నాను. చిన్ని శిశువు వంటివాడను అందుకని సిగ్గూయెగ్గూ నాకు లేనేలేవు. భూమిలో రాయివంటివాడను. నాకు దయాదాక్షిణ్యాలు లేనేలేవు. ఓ దైవమా! నన్నేవిధంగా యేలావు ప్రభూ !

నేను వృక్షమువంటివాడను. మతిలేదు. నేనూ పెరుగుతాను, నీరూ గాలి సూర్యకాంతి ఆహారంగా తీసికొంటాను. పశువులు కదిలి శత్రువునుంచి తప్పించుకొంటే, నేనది కూడా చేయలేను, ఎందుకంటే నాకు మతికూడా లేదు కదా! నేను పోక (వక్క) వంటి వాడను. అందులోనూ పుచ్చిన వక్కను. దేనికీ కొరగాను (దక్షిణ ఇయ్యటానికి కూడా ఉపయోగపడను) నేను రోకలి వంటివాడను. రోటిలో పోట్లకు (దెబ్బలకు) ఏకటను (ఆపేక్ష కలవాడను). ఓ దైవమా! నన్నెట్లా యేలితివి (పరిపాలించావు) స్వామీ!

ఇంతేకాదు, నాకు ఇంకో దుర్గుణం కూడా వున్నది. నేను పామువంటివాడను. కాపాడినవాడిని కూడా కాటువేసే దుర్మార్గుణ్ణి. నేను 'గాము' (పిశాచం) వంటి వాడిని. లోకములో వుత్తిపుణ్యానికే అమాయకుల్ని పీడిస్తుంటాను. నేమపు (శరణాగత రక్షణా నియమముగల) శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను బంటంటా (వీడు నా బంటులే పోనీ అని) ఏమిటికి (ఎందుకు) కృపన్ యేలితివి? ఓ దైవమా! అందుకే నేనూ తరించాను తండ్రీ!

సంపుటి : 4 కీర్తన : హరినీవు మాలోన నడు(డ)గుటరుదు గాక
సంఖ్య : 39 పుట : 26 రాగం : ధన్యాసి

ధన్యాసి

59. హరి నీవు మాలోన నడు(డ)గుటరుదుగాక
శరణు నీకునే జయమందుటరుదా ॥పల్లవి॥

పాపపుణ్యాలంపటమైనది మేను
కూపపు యోనులఁ గుంగేటిది మేను
దీపనాగ్నిగలదిష్టము యీమేను
మోపు మోచిన నేము ములిగేది యరుదా ॥హరి॥

పొలసి పొద్దొకచాయఁ బొరలేటి మనసు
కొలఁదిలేని యాసఁ గుదురైన మనసు
మలసి సంసారమేమరిగిన మనసు
కలనేము, తిమ్మటలు గైకొనేది యరుదా ॥హరి॥

పెనచి యంద్రియములఁ బేఁడినభవము
పనివడి చింతలకే పాలైనభవము
యెనలేని శ్రీవేంకటేశ నీకే శరణని
మనెఁగాన యిఁక మీఁద మంచిదౌటరుదా ॥హరి॥ 39

అవతారిక :

ఓ శ్రీహరీ! నీవుమాలోనే నెలకొని వున్నావనుట అరుదైన విషయమా? నీకు శరణాగతులమై మేము జయములను పొందుట అరుదైన విసయమా? మాకు ఈ మేను, మా మనస్సు, మా భవము (జన్మ) నీవిచ్చినవే కదా! ఈ మేను మోచిన మేము ములిగేది అరుదా? ఈ మనస్సు కలిగిన మేము తిమ్మటలు గైకొనుట అరుదా? ఈ భవము (జన్మ, పుట్టుక) ఇంద్రియముల వశమై చింతల పాలైనది. మరి ఇటువంటి

పరిస్థితిలో శ్రీవేంకటేశ్వరుడే దిక్కు అనగలిగితే, అప్పుడు అంతా మంచియే జరుగుతుంది అంటున్నారు అన్నమాచార్యులవారు. కొన్ని మాటలకు నిఘంటువుల్లో కూడా అర్థం దొరకలేదంటే నమ్మండి.

భావవివరణ:

ఓ శ్రీహరీ! నీవు లోనన్ (మాలోపలనే) అడగుట (వశించియుండుట) అరుదా (ఆశ్చర్యమా?) నిన్ను ఒక్కసారి శరణుజొచ్చిన పిదప జీవితంలో జయమును పొందుట అరుదా? నిన్ను శరణన్న వారికి అన్నీ జయాలే.

ఈ మేను (శరీరము) పాపపుణ్యాల లంపటము వలన కలిగినది. రకరకములైన యోని కూపములలో బడి కుంగేటిది (దిగబడిపోయినది). అయినప్పటికీ దీనిలోగల దీపనాగ్ని (వివేకమనే జ్యోతి చేత) దిష్టము (ఉపదేశించబడుతుంటుంది.) ఎందుకంటే ఈ మేను మాకు నీ కృపచే కలిగినది కదా! ఇటువంటి ఈ మేనుకు మోచిన (దరించిన)మేము ములిగేది (ఆశాపాశమున చిక్కుట) అరుదా (ఆశ్చర్యమేముంది) ప్రభూ!

ఇక నామనస్సు నామేనుకంటే ఒక ఆకు ఎక్కువే చదివింది. అది, పొద్దొక చాయన్ (పూటకొక విధముగా) పొలసి (సంచరించి) పొరలేటిది (ప్రవర్తిస్తుంటుంది). దీనికి కొలదిలేని (అంతులేని) ఆశ కుదురైనది (తోడైనది). అందుకని ఈ మనసు సంసారమును (ప్రాపంచిక విషయములను) మరిగింది. ఇట్టి మనస్సు కల నేము (కలిగిన మేము) తిమ్మటలు (కోతి వికారములను) ఒందుటలో ఆశ్చర్యమేమున్నది స్వామీ!

ఇక నా భవము (జన్మ) నా ఇంద్రియములు బాగా పెనచి పేఁడినందువలన (పెనవేసుకొని పేనినందుచేత) కలిగినది. అందువలన పనివేళా ఇది అనేక చింతలకు పాలైపోయినది. ఎనలేని (అంచనావేయలేని) ఓ శ్రీవేంకటేశ్వరా! నా అదృష్టం కొద్ది నీకు శరణు అని నా భవము మనెన్ (ధన్యమైనది.) కావున ఇక మీద ఇది మంచిది అవుట అరుదా (ఆశ్చర్యమా?) తండ్రీ!

సంపుటి : 4 కీర్తన : బాపురే నీమాయ భ్రమయించీ జీవులకు
సంఖ్య : 257 పుట : 172 రాగం : గౌళ

గౌళ

60. బాపురే నీమాయ భ్రమయించీ జీవులకు
దాపున నున్నదేకాని దవ్వలకుఁ జొరదు ॥పల్లవి॥

మోక్షముచి గానదు ముందర నుండఁగాను
సాక్షియై జగమిది చవి చూపఁగా
దీక్షకుఁ జొరదు మరి దేవ నీపై భక్తి లేదు
దక్షులై యాలుబిడ్డలు దండనుండఁగాను ॥బాపు॥

జ్ఞానమితవు గాదు సంగడి నుండదుగాన
నానాయోనులమేను ననిచుండఁగా
ఆనకమై వైరాగ్యమంట దలవాటులేక
కానఁబడ కర్మములు గాసిఁబెట్టఁగాను ॥బాపు॥

మంచిదని నీ తిరుమంత్రము దలఁచుకోదు
పంచేంద్రియములాత్మ బలిశుండఁగా
యెంచుకొని శ్రీవేంకటేశ నీకే శరణని
అంచల నీదాసులైతే నన్నిటా గెలిచిరి ॥బాపు॥ 257

అవతారిక :

"అయ్యబాబోయ్! నీమాయ నాబోటి జీవులను ఎంత భ్రమలో ముంచుతున్నది ప్రభూ! అది (మాయ) మాదగ్గరనే అంటిపెట్టుకొని వుంటుంది. కాని దూరంగా పోదు" – అంటున్నారు అన్నమయ్య. దాని మూలంగానే దీక్షతో నీపై భక్తి కుదరదు ఎందుకంటే మేము దక్షులం (సమర్థులం) అని భార్యా బిడ్డల దండనే వుండి వెంపర్లాడుతూనే వుంటాం. ఎంచుకొని ఏదో ఒక రోజున ఏడుకొండల వాడే ఏలిక అని ఎఱుక కలుగుతుంది. అప్పుడు ఆయన దాసులమైతే ఆయన మాయను

గెలువగలుగుతారు. అందాక శ్లేష్మంలో పడ్డ ఈగలాగ కొట్టుమిట్టాడుతూనే చస్తూ బ్రతుకుతుంటారు.

భావవివరణ:

ఓ దేవదేవా! నీ మాయ నాబోటి జీవులను ఎంత భ్రమింపచేస్తున్నది!! బాపురే (అయ్యబాబోయ్). అది దాపునే వున్నది (మా సమీపంలోనే వుంటుంది). దవ్వులకు జొరదు (దూరంగా పోదు).

ఈ జీవివున్న జగము (ప్రపంచము) చలిచూపగా (చాలాబాగుంది అనిపిస్తుంటుంది.) అప్పుడు నీమాయ సాక్షివలె మాముందరనే వుంటుంది. మోక్షము రుచిగానదు (హాయిగా సుఖాలనుభవించక ఈ మోక్షం దేనికిరా– అనిపిస్తుంటుంది). ఓ దేవా! దక్షులై (సమర్థులై) భార్యాబిడ్డల, దండ (దగ్గర) వున్నంతకాలమూ మా సమర్థత నిరూపించుకోవటానికి అడ్డమైన పనులు చేస్తాంగాని, దీక్షకు జొరదు (మనస్సు దీక్షతో నిలవదు). మరి, నీపై భక్తి ఎలా కలుగుతుంది? లేనేలేదు.

సంగడినుండగా (సంగత్వంతో జీవించినంత కాలమూ) ఋణానుమంధాలు కలిగి అనేకమైన యోనికూపములలో బడి ఏదో ఒక శరీరంతో దానిపై ననిచుండవలెను (ఆ శరీరంపై అనురాగంతో జీవించాల్సి వస్తుంది). జ్ఞానము (ఆత్మజ్ఞానము) ఏమాత్రమూ ఇతవుగాదు (రుచించదు.) కర్మకాండచేత మనస్సు గాసిబెట్టగా (బాధపడుతున్నంతవరకు), ఆనకమై (ధంకా బజాయించి) వైరాగ్యం అలవడదు గాక అలవడదు.

ప్రభూ! "ఓం నమో వేంకటేశాయ" – అనే నీ తిరుమంత్రము మంచిదని నామనస్సు తలుచుకోనే తలుచుకోదు. నా పంచేంద్రియములు ఆత్మకంటే బలిశున్నంతవరకు ఆ మంత్రము యెలా రుచిస్తుంది? అప్పుడు ఒకనాడు నాపై నీకు కరుణ కలిగి నన్ను యెంచుకున్నావు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీకే శరణని నిన్ను ఆశ్రయించాను. అంచలంచలుగా నీదాసుడనైనాను. నీదాసులు అన్నిటా (ఇహపరములు రెండిటిలోనూ) గెలిచిరి. తండ్రీ! నీదాసుడనైన నాగురించి ఇంకా చెప్పాల్సిన పనేమున్నది?

సంపుటి : 4 కీర్తన : అటుగొన్నాళ్లందాక యిటు గొన్నాళ్లిందాక

సంఖ్య : 227 పుట : 152 రాగం : వరాళి

వరాళి

61. అటు గొన్నాళ్లందాఁక యిటు గొన్నాళ్లిందాఁక
కటకటా శునకపుగతియాయఁ గావవే ॥పల్లవి॥

పసిమిఁ బాపమనేటి బందెలు మేసితిని
కసరి దేహపు కట్టుగాడి నుంటిని
కొసరి కర్మపుమెడగుదియ మోఁచితిని
పసురమువంటివాఁడఁ బాలించవే ॥అటు॥

పంచేంద్రియములనేబాడిగె మోఁచితిని
లంచపు సంసారమనే లాడిఁబడితి
పంచల నాసలచేత బందమ (ము) వెట్టించుకొంటి
ముంచినగుఱ్ఱమువంటి మూఢుఁడఁగావవే ॥అటు॥

మరిగి 'యజ్ఞాన' మనేమద మెత్తి తిరిగితి
'మరుఁ'డనేమావటీనిమాయఁ జిక్కితి
గరిమ శ్రీవేంకటేశ కరిఁ గాచితివిగాన
కరి నైతి నన్ను నీవు కరుణించవే ॥అటు॥ 227

అవతారిక :

కటకటా! కుక్క బ్రతుకైపోయింది నాది. అటు గొన్నాళ్ళున్నాను. యౌవనమదముతో ఒల్లుపై తెలియలేదు. ఇటుగొన్నాళ్ళున్నాను. వృద్ధాప్యంలో దినదినము గండంగా గడుస్తున్నది. ప్రభూ! నన్ను రక్షించవయ్యా! అని అన్నమాచార్యులవారు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పశువులాగ జీవించాను, మూఢుడిలా ప్రవర్తించాను, మన్మథుడనే మావటివాడి మాయలో జిక్కిన ఏనుగునై ఈనాడు రోధిస్తున్నాను. నీకు కరివరదుడవనే పేరుంది కదా! నన్ను కరుణించరాదా స్వామీ!

అంటున్నారు. ఇది తిరుమలేశుని కూడా కరిగించి వుంటుంది. సిరికిన్ జెప్పక పరుగెత్తుకొచ్చివుంటాడు అన్నమయ్య కోసం...

భావవివరణ:

ఓ దేవదేవా! కుక్కకు నీతి నిజాయితీ యేముంటుంది? ఏ ఇంట్లో పడితే ఆ ఇంట్లో దూరి వాళ్ళ ఆహారం తిని, వాళ్ళ చేతిలో రాళ్ళ దెబ్బలు, బూతులూ తింటుంది. నాదికూడా ఆ కుక్క బ్రతుకైపోయింది. అటుగొన్నాళ్ళ దాకా (యౌవనగర్వంతో కామపీడితుడనై కొన్నాళ్ళు) ఇటుగొన్నాళ్ళు (ముసలితనంలో అశక్తుడనై కొన్నాళ్ళు జీవితం వ్యర్థం చేసికొన్నాను. కటకటా! (అయ్యయ్యో) నన్ను కావవే (రక్షించు ప్రభూ!)

స్వామీ! పాపము అనే బందెలదొడ్డిలో పడి, పసిమి (పచ్చనిగడ్డిని) మేసినాను. కసరు (చాపల్యంగల) దేహము అనే కట్టుగాడి (స్తంభానకి కట్టేశారు). చేసిన కర్మ అనే గుదియ (పశువులు పారిపోకుండా కాళ్ళకు అడ్డంపడేలా మెడకు కట్టిన గుదిబండ) మోస్తూనే వున్నాను. నాది పశువు బ్రతుకైపోయింది. నన్ను నీవు పరిపాలించరాదా ప్రభూ!

దేవా! నా పంచేంద్రియములు నాచేత బాడిగెకు (అద్దెకు) తీసుకోబడ్డాయి. ఈ అద్దె కొంపలో యెన్నాళ్ళు వుంటానో నాకే తెలీదు. లంచాలు ఇచ్చిపుచ్చుకొనే సంసారమనే లాడి బడితి (ప్రపంచమనే మోత బరువు) నెత్తిన బెట్టారు. ఆశలు అనే తాళ్ళతో నన్ను కట్టేశారు. గుఱ్ఱము అవివేకంతో, ఇతర జంతువుల్ని చంపించాలని మనిషిని తనపై నెక్కించుకొని చివరికి మనిషికి బానిస అయిపోతుంది కదా! అదే విధంగా నేనూ మూఢుడినై నా ఇంద్రియాలకు లొంగిపోయాను.

ఇంకేముంది? అజ్ఞానం అనే మదమెక్కి, మరిగి మదపుటేనుగు వలె తిరిగాను. మరుడు (మన్మథుడు అనే మావటివాడు సందు చూసికొని నాపైయెక్కి అంకుశంతో పొడిచిపెట్టాడు. వాడి మాయలకు లొంగిపోయి అడ్డమైన పనులు చేస్తున్నాను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు గజేంద్రునికి మోక్షము నొసగిన శ్రీమన్నారాయణుడవు. ఈ కరిని (ఏనుగును) కూడా కరుణించి ముక్తినీయరాదా తండ్రీ!

సంపుటి : 4 కీర్తన : విత్తొకటి వెట్టగాను వేరొకటి మొలచీనా
సంఖ్య : 186 పుట : 125 రాగం : రామక్రియ

రామక్రియ

62. విత్తొకటి వెట్టఁగాను వేరొకటి 1మొలచీనా
హత్తి దేహగుణములు ఆతుమకయ్యీనా ॥పల్లవి॥

చెంది చేఁదుదిన్ననోరు చేఁదేయయివుండుఁగాక
దిందుపడి కొంతైనాఁ దియ్యనుండీనా
బందెల సంసారికి బలు లంపటాలేకాక
అందు హరిఁజేరి సుఖ మందఁ దీరీనా ॥విత్తొ॥

యెంగిలిఁ బుట్టినమేను హేయమే వెదకుఁగాక
చెంగలించి పావనము సేసుకోనీనా
ముంగిటి దేహికిఁ గర్మములు ముంచుకొనుఁగాక
రంగుగ శ్రీపతిఁ గొలిచి రతికెక్కీనా ॥విత్తొ॥

చేతికి వచ్చినసొమ్ము చేరిదాఁచుకొనుఁగాక
యేతులఁ దా నొల్లనంటా యీసడించీనా
యీతల శ్రీవేంకటేశుఁ డిచ్చిన విజ్ఞానము
ఆతుమ సంతసించుఁ గాకందు వెలితున్నదా ॥విత్తొ॥ 186

అవతారిక :

"ఆత్మ నిర్గుణస్వరూపమే, కాని దానికి గతజన్మ వాసనలు వుండటం వలన ఈ దేహమును హత్తి (పొంది) దీనిగుణములు ఆత్మకు అవుతున్నాయి. విత్తనం ఒకటి పెడితే చెట్టు వేరొకటి మొలుస్తుందా."? అంటున్నారు అన్నమయ్య. చిన్న పిల్లాడికి అయినా చేతికొచ్చిన సొమ్ము తనకోసం దాచుకొందామని వుంటుంది కాని మనకిదివద్దు అనే భావము కలుగుతుందా? జన్మ జన్మలకీ ఇలాగే జరుగుతుంటుంది. ఇదిట్లావుండగా

ఆ శ్రీవేంకటేశ్వరుడికి ఈ ఆత్మపై కృప కలిగి విజ్ఞానము (ఆత్మజ్ఞానము) నందిస్తాడు. అట్లా ఇచ్చిన విజ్ఞానంతో ఆత్మ సంతుష్టి చెందుతుంది. అటుగాక అందులో వెలితి వుంటుందా– అంటున్నారు.

భావవివరణ:

ఓ మానవులారా! మనం ఏ విత్తనం నాటితే, దాని మొక్క మాత్రమే మొలుస్తుంది. వేఱొక చెట్టు రాదు కదా! ఆత్మ ఒక దేహమును హత్తి (ధరిస్తే) ఆ దేహ గుణములే దానికీ అంటుతాయి. అది సహజం.

ఒకడు వేపగింజ కొఱికాడనుకోండి చేదు, తిన్నవాడి నోరు చేదే అవుతుంది గాని, దిందువడి (దాని గుణం తగ్గించుకొని) తియ్యగామారుతుందా? సంసార బంధనాలలో చిక్కుబడ్డవాడికి అనేక రకములైన లంపటాలు (పీకులాటలు) తగులుకొంటాయి. వాడు నాది, నాకు, నేను అనే ఏడుస్తుంటాడు గాని శ్రీహరిని ఆశ్రయించి సుఖంగా దీరీనా (తీరివుంటాడా?) ఏనాటికీ వుండడు.

హేయమైన (అసహ్యకరమైన) యెంగిలి కామవాంఛ వలన ఈ దేహము పుట్టింది. మరి, ఇది కూడా ఆ యెంగిలి బ్రతుకునే కోరుకుంటుందికాని, చెంగలించి (అతిశయించి) తనని తాను పావనము చేసికోవటం జరుగుతుందా? ముంగిటి (ముందరవున్న) దేహికి (ఆత్మకు) కర్మబంధనాలు తగులుకొంటాయి కాని, శోభాయమానంగా శ్రీపతిని కొలిచి తరించటం అనేది జరుగుతుందా?

ఎవరికన్నా చేతికి కొంతసొమ్ము అందితే, వెంటనే జాగ్రత్తగా దాచుకొంటాడు గానీ, ఏతుల (సగర్వంగా) నాకు వద్దని యీసడించుకొంటాడా? ఏనాటికీ అట్లా జరుగదు. కానీ శ్రీవేంకటేశ్వరుని కృప కలిగి ఆత్మజ్ఞానం ఇస్తే... ఆ విజ్ఞానంతో ఈ ఆత్మ సంతుష్టి చెంది జ్ఞాని అవుతుంది. అటుగాక... అందులో వెలితి (కొఱత) వుంటుందా?

సంపుటి : 4 కీర్తన : మాకు నేమీ బనిగాదు మరి యేమిగలిగినా
సంఖ్య : 245 పుట : 164 రాగం : ఆహిరి

ఆహిరి

63. మాకు నేమీc బనిగాదు మరి యేమిగలిగినా
శ్రీకాంతు నడుగరో చిత్రగుప్తులాల ॥పల్లవి॥

ధరణీశుపసులకుc దగు బందె లేదట
హరిదాసులకుc బాపమంటునా మరి
సరిc జక్రపుడాగు లిచ్చటc జూచుకోరో మీరు
ఆరసి మీcదటిమాట లాతని నడుగరో ॥మాకు॥

లావరిమన్ననపాత్రులకు వెట్టి లేదన
కావింప వైష్ణవులకుc గర్మమున్నదా
దేవునిలాంచన మిదె తిరుమణి చూచుకోరో
ఆవల నేమిగల్లాను ఆతని నడుగరో ॥మాకు॥

సతి రాణివాసమైతే జాతికులమెంచరట
హితశరణాగతులకేది జాతి
తతి శ్రీవేంకటపతిదాస్య మిది చూచుకోరో
యితవై మరేమిగల్లా నీతని నడుగరో ॥మాకు॥ 245

అవతారిక :

మానవులంతా మరణానంతరం యమధర్మరాజు దర్బారులో చిత్రగుప్తుడి ముందు నిలబడతారనీ అప్పుడాయన వారిని ప్రశ్నించి వారి నేరాల ప్రకారం శిక్ష వేస్తాడని ప్రతీతి. అయితే విష్ణుసేవకు జీవితాన్ని కైంకర్యం చేసిన హరిదాసులని ఎవ్వరూ ఏమీచేయలేరు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు చిత్రగుప్తుడితో, పోవయ్యా.. పోయి మా శ్రీహరిని అడుగు నీతో మాకేమీ పనిలేదు. మేము చేస్తున్నది శ్రీవేంకటపతి దాస్యము. మరేమన్నా వుంటే

ఈయన్ని అడుక్కోవయ్యా! ఆ లెక్కలేవో మీరూ మీరూ చూచుకోరో... అని దబాయిస్తున్నారు. మరే ఇతర కవికైనా ఇటువంటి చమత్కారం సాధ్యమా!! ఇది చదవండి... ఆనందం జుర్రుకోండి.

భావవివరణ:

ఓ చిత్రగుప్తులారా! దీంతో మాకు నేమీ పనిగాదు (పనిలేదు). మరి ఏమన్నా వుంటే ఆ శ్రీహరిని అడుగరో (అడుక్కోవయ్యా)!

నీకొక సంగతి తెలుసునా? రాజుగారి గొడ్లను బందెల (బందెలదొడ్డిలో) పెట్టటానికి వీలులేదు. మరి మేము హరిదాసులం, మాకు పాపం యెట్లా వుంటుంది? ఇదిగో మాకు భుజకీర్తులవలె ముద్రింపబడిన శంఖు చక్రాలను చూశారా.... వీటిని చూచుకోవయ్యా! వీటిని అరసి (చూశాక) ఆపైమాట మాట్లాడుకో... అదీ నాతో కాదు, పోయి ఆ శ్రీహరితోనే మాట్లాడుకో. నీతో మాకేమి పనివుంది?

లావరిమన్నన పాత్రులకు (అందరికంటె బలాఢ్యుడైన మొనగాడి స్వంతమనుష్యులకు) వెట్టిలేదట, (వెట్టి చాకిరీ చేసే అవసరం లేనేలేదట). ఇదిగో మేము వైష్ణవులం. మాకు కర్మబంధం అడ్డురాదు. మాకు కామమే లేకపోతే కర్మబంధం ఎలా వుంటుంది. మానుదుటనున్న ఈ దేవుని లాంఛనము తిరుమణి (పంగనామాలు) చూసుకోవయ్యా! ఆవలన్ (ఆ తరువాత) ఏమిగల్లా (ఏమన్నావుంటే) పోయి ఆతని (ఆ శ్రీహరిని) అడుగరో.

సతి (ఎవరన్నా స్త్రీ) రాణివాసము (రాణిగారి కొలువులో వుంటే... దాని జాతి కులము ఏమిటని యెవ్వరూ అడుగరట. హితుడైన శ్రీపతి శరణాగతులకు జాతేమిటి? తతి (సమర్థుడైన) శ్రీవేంకటపతి దాస్యము చేసే శరణాగతులము. ఇది చూచుకోరో... (ఓ చిత్రగుప్తా! ఇది చూసుకోవయ్యా! యితవై (హితకరమై) మరేదన్నావుంటే... పోయి మా వేంకటేశ్వరుని అడుక్కోవయ్యా! మా జోలికి రాకు.

సంపుటి : 4 కీర్తన : చెప్పబోతే యీ యర్థము చిత్తము వొడబడదు
సంఖ్య : 270 పుట : 181 రాగం : శంకరాభరణం

శంకరాభరణం

64. చెప్పఁబోతే యీ యర్థము చిత్తము వొడఁబడదు
తప్పులు వెదకకురో తత్వజ్ఞులాల ॥పల్లవి॥

చెలఁగి మిథ్య యంటాఁ జేసేయజ్ఞాలు ఫలించునా
యిల శూన్యోపాసకుల కేడ దేవుఁడు
లలి మాయా శబళితులకు మోక్ష మెక్కడిది
నలి నభేదవాది కానందానుభవ మేది ॥చెప్ప॥

హరి శరణుచొరనియట్టివారికి దిక్కేది
గురుఁడు వేరే లేఁడట కోరి వుపదేశమేది
వెరసి శిక్షాసూత్రాలు విడిచితే ప్రణవమేది
పరగ భక్తి లేదట భవమేట్టు గడచె ॥చెప్ప॥

శ్రీ వేంకటేశముద్ర ధరించక వైకుంఠమేది
యీ విబుపేరు జపించకెట్టు పాపా లుత్తరించు
వేవేగ దాసుఁడుగాక వెట్టికేల కరుణించు
సేవించినఁగాక సర్వచింతలేల యడుగు ॥చెప్ప॥ 270

అవతారిక :

అనాదిగా తత్వజ్ఞులకు భగవదారాధకులకు బేధాభిప్రాయాలు వుంటూనే వచ్చాయి. జగన్మిథ్య అనేవారు చేసే యజ్ఞాలు యెవరికి వుపయోగిస్తాయి? నేనే భగవంతుణ్ణి భగవంతుడే నేను అనే వాడికి పరమానందం ఎలా అనుభవంలోకి వస్తుంది? భక్తిలేనివాడికి చావుపుట్టుకల చక్రము తప్పుతుందా? శ్రీవేంకటేశుని సేవించక చింతలెట్లా తొలుగుతాయి? మేము తార్కికంగా ఆలోచిస్తాం అనేవారు భగవంతుని గురించి యేవేవో అర్థములు చెబుతారు. కానీ చిత్తము మాత్రం

వాటినంగీకరించదు. నేనిలా చెబుతుంటే దయచేసి ఓ తత్వజ్ఞులారా! నాలో తప్పులు వెదకవద్దు, అంటున్నారు అన్నమయ్య.

భావవివరణ:

ఓ తత్వవేత్తలారా! మీరు చెప్పే ఈ అర్థములతో నా చిత్తము (మనస్సు) ఒడబడదు (అంగీకరించదు). మీ వాదనలు మీ తార్కిక వివరణలు మొదలైన వాటితో నా మనస్సు విభేదిస్తే, దయచేసి తప్పులు వెదకవద్దు.

అయినా నాకుతోచింది చెబుతాను వినండి. మీరు "జగన్మిథ్య" అంటూ యెన్ని యజ్ఞాలు చేసినా ఎవరికుపయోగం? యజ్ఞఫలమెలా దక్కుతుంది? ఇక శూన్యోపాసకులున్నారు వారికి దేవుడే లేడట. లలి (ఈ క్రమములో) మాయచేత చిత్రవిచిత్రముగా ఆవరించబడినవారికి మోక్షము ఎలా దక్కుతుంది? అభేదవాది భగవంతుడే తాను, తానే భగవంతుడు అంటాడు. వాడికి అదొక 'నలి' (రోగము). వాడికి బ్రహ్మానందము యొక్క అనుభవము సాధ్యపడుతుందా చెప్పండి.

శ్రీహరిని శరణుజొచ్చినవాడు కడతేరగలడు. అలా శరణాగతులు కాని వారికి వేరే దిక్కులేనే లేదు. కొందరు ఏ గురువునీ ఆశ్రయించరట, వారికి వారే గురువులట. ఇక వారికి ఉపదేశం యెవరు చేస్తారు? శిఖాసూత్రాలు (అగ్నికార్యం పద్ధతులు) విడిచి పెడితే ఓంకారం అవసరమేముంది? ఇవన్నీ ఇటుంచి, భక్తి లేదనే వాడికి జన్మల చక్రభ్రమణం తప్పుతుందా? వాడు చస్తూనే వుంటాడు, పుడుతూనే వుంటాడు.

శ్రీవేంకటేశ్వరుని శంఖుచక్ర ముద్ర శరీరంపై ధరించని వాడికి వైకుంఠప్రాప్తి కలుగుతుందా? ఈ జగన్నాథుడి పేరు జపించని వాడికి పాపవిచ్ఛేదన జరుగుతుందా? అత్యంత శీఘ్రముగా హరిదాసుడు గాక ఆ భృత్యుని శ్రీహరి యెట్లు కరుణించును? ఇంతెందుకు శ్రీవేంకటరమణుని సేవించక చింతలన్నీ నశించే దారియేది?

సంపుటి : 4 కీర్తన : చెప్పినంతపని నేజేయగలవాడ నింతే

సంఖ్య : 207 పుట : 139 రాగం : భంగాళం

భంగాళం

65. చెప్పినంతపని నేఁ జేయఁగలవాఁడ నింతే
అప్పటి నపరాధమా ఆదరించవలదా ॥పల్లవి॥

నీయాజ్ఞ దేహము నే మోచితినింతే
యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వేయి వేలై వేగుదాఁక వెట్టిసేసి యలసితి
వోయయ్య కొంతైన వూరగించవలదా ॥చెప్పి॥

నీవు సేసేకర్మము నేఁజేయువాఁడ నింతే
యీవల నానందసుఖ మియ్యవయ్యా
కోవ(వు?)రమై వెంట వెంటఁ గొలిచినబంట్లకు
తావులఁ గొంత వడైనా దప్పిదీర్చవలదా ॥చెప్పి॥

మతిలో శ్రీవేంకటేశ మనికయినవాఁడ నింతే
తతి నాపాటుకు దయదలఁచవయ్య
యితవై పనిసేసేటియింటిపసురమునకు
వెతదీరఁ బాలార్చి వెడ్డు వెట్టఁదగదా ॥చెప్పి॥ 207

అవతారిక :

అప్పుడప్పుడు ఇంటిగొడ్లు మొరాయిస్తుంటాయి. వాటిని మెల్లిగా దారిలోకి తెచ్చుకోవాలిగాని కొట్టి చంపేస్తామా? నేనూ నీకు పనిచేసే గొడ్డునే, నన్నున్ పాలార్చి వెడ్డువెట్టదగదా? అంటున్నారు అన్నమయ్య ఈ కీర్తనలో. నీవు పుట్టించావు, నీవే భ్రమలు కల్పించావు, మాచేత మంచిపనులూ చెడ్డపనులూ నీవే చేయిస్తున్నావు ఓరయ్యా! నన్ను కాస్త అయినా వూరడించవద్దా? నీవెంటబడి కొలిచేబంటుకు దప్పిక నువ్వు తీర్చకపోతే యెవరు తీరుస్తారు? అప్పటి నపరాధము (మళ్ళీ మళ్ళీ చేసే తప్పులు) చేశానని దెప్పితే ఎలా? నీవు చెప్పిందే నేను చేశాను. ఏదో చూసీ

చూడనట్లు పోవాలిగాని నన్ను తిప్పలు బెడితే ఎలా చెప్పు? ఈ కీర్తన అర్థం చేసికోవటం అంత తేలిక కాదు అని తెలుస్తూనే వున్నది, కదా!

భావవివరణ:

ఓ దేవదేవా! నా తాహతు ఏపాటిది? చెప్పిన పని మారు మాటలేక చేయవలసిన బానిసను. ఇంతే కదా! అటువంటి నాపై కాస్త జాలి చూపించవద్దా!! అప్పటియపరాధములు (మళ్ళీ మళ్ళీ బుద్ధిలేక నేను చేసే తప్పులను) ఆదరించవలదా (మన్నించవద్దా!)

నేను ఈ నా శరీరం ధరించింది నా కోరికమేరకా? అది నీ ఆజ్ఞ ప్రకారమే జరిగింది కదా! మరి దీనికి విజ్ఞానపు (నీవు వున్నావనే జ్ఞానం) యెందుకియ్యవు? వేలకొద్ది యేళ్ళు వెట్టి చాకిరి చేసి బ్రతికానయ్యా! రాత్రింబగళ్ళు, నిద్రభయాహార మైథునాలే. ఒకటేవెట్టి అలిసిపోయాను తండ్రీ! ఇక నావల్లకాదు. ఓరయ్యా! కాస్త అయినా ఊరడించవద్దా!! నేనేమైపోతాను?

అదే విధంగా నీవు చేసిన కర్మలే నేనూ చేశాను. ఇంతే కదా! నీవు యెనలేని ఆనందము సుఖము పొందావు. మరి నా కర్మ ఇట్లా కాలిందేమిటి? కోవురమై (పారాహుషారుగా) నీవెంట వెంట తిరుగుతూ సేవించే బంట్లకు (భృత్యులకు) తావుల (అక్కడక్కడా) నోరు తడిపి దాహం తీర్చవద్దా! నీ బంటు దప్పికతో బాధపడితే నీకేమి ఆనందము ప్రభూ!

"సరే నీవు అడిగినవి పొందటానికి నీకేమి అర్హత వుందని" అడుగుతావేమో! ఓ శ్రీవేంకటేశ్వరా! మతిలో మనికయినవాడను (నిన్ను నా మనస్సులో ప్రతిష్టించుకొన్నవాడను). ఇంతే... ఇంతకంటె నాకే అర్హతా లేదు. తతి (ఇదేతగిన సమయం అని) నా అవస్థలను చూచి జాలిపడవద్దా! ఇతవై (మేలు కలుగునట్లు) బండచాకిరీ చేసే యింటి పసురమునకు (ఇంటిగొడ్డుకు) వెతదీర (వుపశమింపజేసి) పొలార్చి, పాలు+ఆర్చి (ఏదో పోనీలే అని) ఉపేక్షించాలి. వెడ్డువెట్టు (వంచించుట) తగునా? నీవే నన్ను మోసం చేస్తే నాకు గతేమిటి?

సంపుటి : 3 కీర్తన : మాయామోహము మానదిది

సంఖ్య : 566 పుట : 380 రాగం : దేవగాంధారి

దేవగాంధారి

66. మాయామోహము మానదిది
శ్రీయచ్యుత నీచిత్తమే కలది ॥పల్లవి॥

యెంత వెలుఁగునకు నంతేచీఁకటి
యెంత సంపదకు నంతాపద
అంతటా నౌషధ మపథ్యమును సరి
వింతే మిగిలెను వేసటే కలది ॥మాయా॥

చేసినకూలికి జీతమునకు సరి
పూసినకర్మభోగము సరి
వాసులజన్మము వడి మరణము సరి
ఆసల మిగిలిన దలపే కలది ॥మాయా॥

మొలచినదేహము ముదియుటకును సరి
తలఁచినదైవము తనలోను
యిలలో శ్రీవేంకటేశ నీ కరుణ –
గలిగినమాకెల్ల ఘనతే కలది ॥మాయా॥ 566

అవతారిక :

అచ్యుతుడైన పరమాత్మ జీవులందరికీ మాయకు లోబడే చిత్తము (మనస్సు) నిచ్చాడు. ఈ మాయ వలన అది మోహపీడితమై, సన్మార్గం వదలి దుర్మార్గంలోపడి చెడి ఆయననే మరచిపోతుంది. ఏనాటికీ మోహమును మానదు. ఈ చిత్తము తీరే ఇంత కాబట్టి, నీ చిత్తము నాపై కలుగునట్లు చేసి నన్ను నీ మాయ నుండి రక్షించు అంటున్నారు అన్నమయ్య. ఒక యజమాని కూలివాడిపై రాగద్వేషాలు లేక చేసిన పనికి తగినంత కూలీనే ఇస్తాడు కదా! ఆ పరమాత్మకూడా అంతే. ఇదే కీర్తనకు

ఇంకా నాలుగు రకాలుగా భావవివరణ ఇవ్వవచ్చును. యద్భావం తద్భవతి... అన్నారు పెద్దలు. అన్నమయ్య చిత్తము మనబోంట్లకు సరిగా అవగతం కాకపోతే... ఆశ్చర్యమేముంది?

భావవివరణ:

ఓ శ్రీ అచ్యుతా! ఇది (నీవు ఇచ్చిన ఈ చిత్తము) మాయామోహము మానదు. (నీమాయకు లోబడి మోహమును మానదు). ప్రభూ! నీ చిత్తమే కలది (నీ ఇష్టం, తండ్రీ!) మోహపీడితయైన దీన్ని ఏంచేసినా నీదయ.

ఈ నీ సృష్టిలో యెంత వెలుతురు వున్నదో, అంతే చీకటి వున్నది. ఎంత సంపదనిస్తావో అంత ఆపద (ప్రమాదం) కూడా దానికి అంటకడతావు. అంతటా ఔషధము (ప్రతి మూలికా ఒక ఔషధమే). దానికి సరిబోవునట్లు అపథ్యము (తినకూడని మందులు) కూడ నీవే సృష్టించావు... (విషము కూడా ఆయన సృష్టియే కదా!) ప్రభూ! నీవు కలిగించే ఈ మాయామోహము వల్ల వేగుటయే (చింతయే) మిగులుతుంది. అంతా ఒక వింతగా మిగిలిపోతుంది.

ఓ దేవదేవా! చేసికొన్న వారికి చేసికొన్నంత అనేదే నీ నిర్ణయం. ఎంత కష్టపడితే అంత కూలి ఇస్తావు. పూసిన కర్మకు (చేసిన కర్మము) దాని ఫలితం అనుభవించటంతో సరిపెడతావు. జన్మా నీవే ఇస్తావు. చావూ నీవే ఇస్తావు. వాసిగల జన్మ ఇచ్చినంతమాత్రాన చావూ అలాంటదే వుండవలసిన పనిలేదు. నీమాయ, ఆశలను మిగిల్చి, వాసనలను (సంస్కారములను) కలుగునట్లు చేస్తుంది.

ఈ దేహము మొలిచిందంటే (అవతరించిందంటే) ఇది ముసలిది కాకమానదు. మరి దారేమిటి? తనలోనే వున్న దైవమును తలచిన (ధ్యానించిన) సరి (సరిపోతుంది. అది చాలును). ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ లోకంలో నీ కరుణకు పాత్రులమయ్యామంటే... సరి. ఇక మాకు అన్ని ఘనతలు కలది (కలుగుతాయి.) ఇందులో సందేహం లేదు.

సంపుటి : 3 కీర్తన : నారాయణ నీ నామమహిమలకు

సంఖ్య : 574 పుట : 385 రాగం : మాళవిగౌళ

మాళవిగౌడ

67. నారాయణ నీనామమహిమలకు
గోరఁ బోవుటకు గొడ్డలి దగునా ॥పల్లవి॥

హరియని నొడిగిన నణఁగేటిపాపము
సిరుల నేను నుతిసేయఁగఁగలనా
పరగినపిచ్చుకపై బ్రహ్మాస్త్రము
దొరకని వూరకె తొడిగినయట్లు ॥నారా॥

అచ్చుతయనఁగా నందెటిసంపద
యిచ్చల నెంచిన నిలఁగలవా
కొచ్చి కొచ్చి యొక కొండంతకనకము
వెచ్చపుఁబోకకు వెల యిడినట్లు ॥నారా॥

యెదుటనే శ్రీవేంకటేశ్వర యఁనగాఁ
బొదిగెటితపముల పుణ్యము గలదా
కదిసి సముద్రము గడచి వోడలోఁ
జిదిసి యినుము దెచ్చినయట్లు ॥నారా॥ 574

అవతారిక :

అన్నమాచార్యులవారి అధ్యాత్మకీర్తనలలో ప్రత్యేకత ఏమంటే పల్లవి చాలా గూఢముగా వుంటుంది. హరినామ మహిమను వివరిస్తున్నారు. నారాయణ అని పలికి గొప్ప గొప్ప పుణ్యాలు సాధించాలి గాని సిరిసంపదలవంటి తుచ్ఛమైన కోరికలు పొందుటకు హరినామము వాడితే "గోటితోబోయే దానికి గొడ్డలి వాడినట్లవుతుంది" అంటున్నారు. శ్రీవేంకటేశా! అంటే అనేక తపముల పుణ్యం కలుగుతుంటే మళ్ళీ వేరే తపస్సులు చేయటం ఎలా వుంటుందంటే కాస్తంత ఇనుము

తీసుకురావటానికి పెద్ద ఓడ ప్రయాణం చేసినట్లుంటుంది – అంటున్నారు. ఉపమా కాళిదాసస్య – అన్నారు పెద్దలు. కానీ ఉపమా అన్నమాచార్యస్య – అంటాను నేను.

భావవివరణ:

నారాయణుని నామసంకీర్తన దివ్యమహిమాన్వితమైనది. సిరిసంపదలు, ఇష్టకార్యసిద్ధి పుత్రపౌత్రాభివృద్ధి వంటి చిన్నచిన్న కోర్కెలు సిద్ధించుటకు దాని పుణ్యం వాడటం యెంత తెలివితక్కువతనం అంటే "గోరితో పోయేదానికి గొడ్డలి కావాలా?"

హరియని నొడిగిన (పలికితే) పాపములన్నీ అణగును (నశించును). అటువంటిది సిరులన్ యేను నుతిసేయగగలనా (తుచ్ఛమైన సిరులకోసం నేను శ్రీహరిని నుతించగలనా?) పరగిన (ఇది చూస్తే ఎలా వుంటుందంటే)... వూరకే వింటికి సంధించి ఒక పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేసినట్లు వుంటుంది.

అచ్చుత (అచ్యుత) యనగాన్, అందేటి (పొందునట్టి) సంపదలను, ఇచ్చలను (కోర్కెలను), ఇలన్ (ఈలోకంలో) యెంచిన (లెక్క కట్టితే) కలవా (సాధ్యమవుతుందా?) (కొచ్చు అంటే వదలుకొనుట అని అర్థం... కాని ఇక్కడ గుచ్చిగుచ్చి బేరము చేయటం అనే అర్థంలో వాడారు.) గీచిగీచి బేరము చేసి ఒక కొండంత బంగారాన్ని వెచ్చించి ఒక పోక చెక్క వెలకు కొన్నట్లు వుంటుంది, ఈ తెలివితక్కువ బేరము.

మనయెట్టనెదుటనే వున్న ఈయనను శ్రీవేంకటేశ్వరా! అంటే చాలును అది పొదిగేటి పుణ్యములు కలది. (క్రమ్ముకొన్నట్లు తపస్సు చేసిన పుణ్యములను) కలుగచేస్తుంది. ఆ నామాన్ని సాంసారిక సుఖాలకోసం వాడితే ఎంత మూర్ఖంగా వుంటుందంటే... కదిసి (చేరువయై) సముద్రమును ఓడమీద దాటి, చిదిసి (నలిగిపోయి నానా తిప్పలు పడి) ఇనుమును తీసికొనివచ్చి వ్యాపారం చేసినట్లు వుంటుంది.

సంపుటి : 3 కీర్తన : ఇంతగాలమాయను యేడనున్నారో వీరు
సంఖ్య : 344 పుట : 232 రాగం : రాయగౌళ

రాయగౌళ

68. ఇంతగాలమాయను యేడనున్నారో వీరు
వింతలై యడవిఁగాసేవెన్నెలాయ బ్రదుకు ॥పల్లవి॥

యేలేవారి దూరితి యెడరువుట్టినవేళ
కాలమును దూరితిని కలఁగేవేళ
తాలిమిలేనివేళ తగుఁగర్మము దూరితి
యేలాగని కాచేవారి నెవ్వరిఁ గానము. ॥ఇంత॥

దైవమును దూరితి తమకించినట్టివేళ
కావించి నన్నే దూరితిఁ గాఁగినవేళ
సోవగాఁ గోపపువేళ చుట్టాల దూరితిమి
యీవలఁ దోడైనవారి నెవ్వరిఁ గానము. ॥ఇంత॥

పుట్టుగు దూరితిమి పోరానియట్టివేళ
కట్టఁగడ నెందువంటకఁ గానమైతిమి
జట్టి శ్రీవేంకటేశుఁడు శరణంటేనే కాచె
యిట్టె యింతటివారు యెవ్వరును లేరు ॥ఇంత॥ 344

అవతారిక :

బ్రతుకంతా అడవిగాచిన వెన్నెలవలె నిరర్థకమైపోయిందని వాపోతున్నారు అన్నమయ్య. తాను సేవించినవారు, తనను సేవించినవారు, గురువులు, శిష్యులు, ఆప్తబంధువులు – వీళ్ళంతా ఈనాడు ఏరీ, ఎక్కడున్నారు? ప్రతిదానికీ ఎవరినో ఇంకొకరిని తిట్టానేకాని శ్రీవేంకటేశ్వరుని శరణంటే చాలునని గ్రహించలేకపోయాను. "పోరానియట్టివేళ" అనే పదాన్ని, సంకటములలోవున్నప్పుడు అనే అర్థంలో వుపయోగించారు. కట్టగడ నెందువంకన్ కానమైతిమి అని నిజాయితీగా

పశ్చాత్తాపప పడుతున్నారు. అందరి బ్రతుకులూ ఇంతే. మరి దారేమిటి? హరిచరణమే శరణము అనుటయే.

భావవివరణ:

ఇంతకాలము గడచిపోయింది. వీరు (నాతో జీవితాన్ని పంచుకొన్నవాళ్ళంతా) యేడనున్నారో కదా! ఎంత వింతగావున్నది!! నా బ్రతుకంతా అడవిలో కాచిన వెన్నెలవలె నిరర్థకమైపోయింది కదా! అయ్యో! హతవిధీ.

ఎడరువుట్టినవేళ (భంగపడినవేళ) నన్ను నేను నిందించుకోకుండా నా యజమానులను నిందించాను. కలగేవేళ (కష్టకాలంలో) నాచేతకానితనానికి, కాలం కలిసిరాలేదని తిట్టాను. నేను తాలిమిలేని వేళ (ధైర్యం కోల్పోయినప్పుడు) నా కర్మ ఇట్లా కాలిందని దూరితిని (నిందించాను). ఏలాగని కాచేవారిని (ఏదోఒకవిధంగా రక్షించేవారిని కానము (చూడలేకున్నాము).

తమకించునట్టివేళ (చలించిపోతున్నప్పుడు) నా కష్టాలన్నిటికీ దేవుడే కారణమని ఇష్టం వచ్చినట్లు తిట్టాను. కావించి (చేతకాక) కాగినవేళ (తపిస్తున్న వేళలలో) ఆత్మనింద కూడా చేసికొన్నాను. కోపాన్ని నిగ్రహించుకోలేక కొడుకుల్ని మొదలుకొని వున్న బంధువుల నందరినీ తిట్టాను. అందుకని ఈవల (ఇటువైపు) నాకు తోడుంటాననే వాణ్ణి ఒక్కడినీ చూడను.

ఇప్పుడుపోరానియట్టివేళ (సంకటములలో నలిగేవేళ) వచ్చేసింది. ఎందుకు పుట్టానురా దేవుడా! అని నా పుట్టుకనే నిందించాను. ఇక ఇప్పుడు "కట్టగడనెందువంకన్ కానమైతిమి" చిట్టచివరికి తిట్టడానికి ఒక్కరూ కనబడటంలేదు. ఏంచేయను? (జట్టి అంటే ఏదో ఒక ధర అని నిశ్చయించడం... కానీ ఇక్కడ, నిర్ణయించి అనే అర్థంలో వాడరు) నిర్ణయించి శ్రీవేంకటేవ్వరుడు శరణు నాకు అనగానే ఇట్టే నన్ను రక్షించాడు. ఇంతటి సమర్థుడు ఎవ్వరూలేరు.

సంపుటి : 3 కీర్తన : నీవెటుదలచిన నిఖిలము నట్టౌ
సంఖ్య : 575 పుట : 386 రాగం : లలిత

లలిత

69. నీ వెటు దలఁచిన నిఖిలము నట్టౌ
యేవల స్వతంత్రమింతా నీది ॥పల్లవి॥

యేఁటిపురాకృత మెక్కడికర్మము
దాఁటక హరి నీదయ గలితే
నీటున నిన్నియు నీ కల్పితములు
పాటించి నీవే పాపఁగలేవా ॥నీవె॥

యెక్కడిజన్మము లెక్కడిమరణము-
లొక్కఁడవె నీవు వొద్దంటే
యెక్కువ నిందరి నేలెటివాఁడవు
యిక్కడఁ గొలిచితి మితరము లేలా. ॥నీవె॥

యేది పాపము యేది పుణ్యము
పోదిగ నీవే పొమ్మంటే
చేదో డిందుకు శ్రీవేంకటేశ్వర
ఆదెస నిను శరణంటిమి గొంత ॥నీవె॥ 575

అవతారిక :

శ్రీహరి సర్వస్వతంత్రుడు. మనం చేసిన కర్మకి తగిన ఫలితం సాక్షీభూతుడుగా నిస్తాడు అనే మాట నిజమే అయినా, ఆయన తలచుకొంటే ఏదైనా చేయగలడు. నిఖిలము (సర్వమూ) ఆయన ఎట్లా అనుకొంటే అట్లా అవుతుంది. పురాకృతకర్మలు, జనన మరణాలు, పాపపుణ్యాలు ఆయన పొమ్మంటే పోతాయి రమ్మంటే వస్తాయి. ఇది సత్యం. కాని ఆయన ఎందుకు పొమ్మంటాడు ఎందుకు రమ్మంటాడు?

నీవు ఆ శ్రీవేంకటేశ్వరునే నమ్మి శరణు తండ్రీ! అంటే ఏదో ఒకనాటికి ఆయనకే దయకలిగి పైన చెప్పినవన్నీ చేస్తాడు. వచ్చిన చిక్కేమిటంటే ఆయన మీద ధ్యాస కలుగుట ఒక ఎత్తయితే... అది చలించకుండా నిలబడటం ఇంకొక ఎత్తు. ఈ ఎత్తుల్లో మనం చిత్తు కాకుండా వుంటే... అప్పుడెత్తుకుంటాడు మనని. ఇదండీ అన్నమాచార్యులవారి హితబోధ.

భావవివరణ:

ఓ శ్రీపతీ! నీవెట్లు తలచిన, నిఖిలము (సర్వమూ) అట్లేయగును. ఏవల (ఎప్పుడైనా) నీవు సర్వస్వతంత్రుడవు. ఇదంతా నీఇష్టం. కాదనే శక్తి ఒక్కడికీ లేదు.

ఏటి పురాకృతము (ఎక్కడి తొల్లింటికర్మ)? ఎక్కడి కర్మము (ఎక్కడి సంచిత, ఆగామి కర్మలు?) ఓ శ్రీహరీ! నీదయకలిగితే వాటిని దాటడం ఒక బ్రహ్మవిద్యా? ఇన్నియు (ఇవన్నీ) నీటున (సగర్వంగా) నీవు కల్పించినవే కదా! పాటించి (ఆదరించి) నీవే పాపగలేవా (వాటినుండి మమ్మల్ని తప్పించలేవా?) నీకు కాక మరెవరికి అది సాధ్యమవుతుంది?

ప్రభూ! నీవొక్కడివి "వద్దు" అంటే జన్మాలు ఎక్కడివి? మరణాలు ఎక్కడివి? ఆత్మకు అనంతమైన మోక్షం అరక్షణంలో ఇవ్వగలవు. ఈ సర్వజీవులను యేలేటి (పరిపాలించే) వాడివి నీవే కదా! ఇక్కడ నిన్ను నమ్మి కొలుచుచున్నాను. ఇక మాకు ఇతరములేలా? అన్యదేవతలు, రకరకాల పూజావిధానాలు, వేదోక్త కర్మలు - ఇవన్నీ యెందుకు?

ఓ దేవదేవా! పోదిగ (కమ్ముకొని) నీవు మా భారము వహించి "పోండి" - అంటే పాపమేమిటి? పుణ్యమేమిటి? ఆ రెండూ మమ్మల్నేమీ చేయలేవు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు చేదోడు (చేయిచాచి సాయం అందించే ఆర్తత్రాణ పరాయణుడవు).

ఇందుకు (దీనికోసం) ఆదెస (ఆవిధంగా) నిన్ను కొంత శరణుజొచ్చితిమి (కొద్దిగానైనా శరణు వేడేము). ఈ మాత్రానికే నాకు ఇంత చేశావు తండ్రీ.

సంపుటి : 4 కీర్తన : ఈజీవునకు నేది గడపల తనకు
సంఖ్య : 56 పుట : 398 రాగం : దేవగాంధారి

దేవగాంధారి

70. ఈ జీవునకు నేది గడపల తనకు
నేజాతియును లేక యిట్లున్నవాఁడు ॥పల్లవి॥

బహుదేహకవచములఁ బారవేసినవాఁడు
బహుస్వతంత్రముల నాపదనొందినాఁడు
బహుకాలముల మింగి పరవశంబైనాఁడు
బహుయోనికూపములఁ బడి వెడలినాఁడు ॥ఈజీ॥

పెక్కు బాసలు నేర్చి పెంపు మిగిలినవాఁడు
పెక్కునామములచే బిలువఁబడినాఁడు
పెక్కుకాంతలతోడ పెక్కుపురుషులతోడ
పెక్కులాగులఁ బెనఁగి బెండుపడినాఁడు ॥ఈజీ॥

ఉండనెన్నఁడుఁ దనకు ఊరటెన్నఁడు లేక
యెండలకు నీడలకు యెడతాఁకినాఁడు
కొండ (ల) లో నెలకొన్న కోనేటిరాయని
యండ చేరెదననుచు నాసపడినాఁడు ॥ఈజీ॥ 56

అవతారిక :

ఎన్నియో దేహములను ధరించిన ఈ జీవుడు గడపల తొలిమెట్టు యేది? అంటే వాడి మొట్టమొదటి జన్మేదో ఎవడికి తెలుసు? తనకు జాతి అనేదే లేకుండా యిట్లు జీవించుచున్నాడు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఎన్ని జన్మలెత్తినా, ఎంత అనుభవించినా, ఎన్ని బంధనాలలో తగులు కొన్నా వీడికి ఊరట అనేదే లేదు. కొండలలో నెలకొన్న కోనేటిరాయుడిని చేరెదనని ఆశపడినంతనే వీడికి తరుణోపాయం లభించింది, అంటున్నారు. తాళ్ళపాకలో వెలసిన అధిష్టాన

దైవాన్ని కోనేటిరాయడని పిలుస్తారట. ఆయనే అన్నమయ్యనమ్ముకొన్న తిరువేంకటేశ్వరుడు కూడా.

భావవివరణ:

ఓ మానవులారా! ఈ జీవునకు గడపల (తొలిమెట్టు) ఏది? అనగా వాడితొలిజన్మ ఏదియో యెవరికి తెలుసును? తనజాతి అనేదేలేక ఈ విధంగా జీవిస్తున్నాడు కదా! ఇతగాడు.

వీడు ఎన్నో దేహములను కవచముల వలె పారవేసినాడు (సహస్రకవచుని వలె ఒక్కొక్క కవచాన్ని వదలివేసినాడు). అనేక స్వతంత్ర జీవితాలు గడిపి అనేక ఆపదలను పొందినాడు. ఎన్నో కాలములలో గడిపి పరవశత్వంతో బ్రతికాడు. అనేకమైన యోనికూపములో మగ్గి బయటకు వచ్చాడు. కాని ఇప్పటికి కూడా వీడి ఉనికి యేమిటో వీడికి తెలియరాలేదు.

వీడి జీవనయానాల్లో వీడు అనేకమైన భాషలను నేర్చాడు. ఎంతో "పెంపు మిగిలిన" వాడు (అభివృద్ధిని సాధించాడు). అనేకమైన పేర్లతో పిలువబడినాడు. కొన్ని జన్మలలో అనేక స్త్రీలతోను, కొన్ని జన్మలలొ అనేక పురుషులతోను సుఖించాడు. అనేకమైన వ్యామోహాలతో పెనగులాడి బెండుపడినాడు (బలహీనపడ్డాడు.)

ఉండనెన్నడు (ఏదేహంలోవున్నా) తనకు ఊరట (మనశ్శాంతి) లేక, శీతోష్ణాది ద్వంద్వములకు చలించిపోయాడు. ఇదిగో ఇప్పుడు కొండలలో నెలకొన్న ఈ కోనేటిరాయుని చేరెదను అనుకొని ఆశపడ్డాడు. ఇక వాడికి అంతా మంచే జరుగుతుంది.

సంపుటి : 3 కీర్తన : నీవే యంతర్యామివి నీవున్నదే వైకుంఠము
సంఖ్య : 579 పుట : 389 రాగం : లలిత

లలిత

71. నీవే యంతర్యామివి నీవున్నదేవైకుంఠము
ఆవలc బరమపదమన నింకాc గలదా ॥పల్లవి॥

యిందరు జంతువులు నీవిచ్చినరూపులు మోచి
బొందితో నీకే నెలవై పుట్టినారు
కందువ నీ ప్రపంచపు కైంకర్యములు సేసి
అందిరి జీవన్ముక్తు లదివో చాలదా ॥నీవే॥

యేలిక వంచినపనే యింద్రియభోగములెల్ల
తోలితోలి రాచాజ్ఞ తోయకున్నారు
కాలము నిన్నుc బాయరు గర్భగోళమందున్నారు
యీలోకమే సాలోక్య మిది యింత చాలదా ॥నీవే॥

జ్ఞానము నజ్ఞాన మేది స్వామికార్యములోన
మానక నీపనులలో మత్తులైనారు
శ్రీనాథుడవు నీవే శ్రీవేంకటేశ్వర
నీనాటకములోనే నిత్యులైరి చాలదా ॥నీవే॥ 579

అవతారిక :

శ్రీమహావిష్ణువు, వైకుంఠం, సనకాదిఋషులు ఇంద్రాది దేవతలు – ఇవన్నీ పురాణేతిహాసాల ద్వారా మనం భగవంతుని స్మరించే సాధన ప్రక్రియలో అంతర్భాగం మాత్రమే. మాంసచక్షువులతో వీరిని చూడటం సాధ్యమయ్యేపనిగాదు. అసలు చూడవలసిన పనేలేదు. ఎందుకంటే ఆ నారాయణుడే అంతర్యామిగా మన అందరిలోను వున్నాడు. ఆయన వున్న ఈ దేహమే వైకుంఠం. అందరిలో వున్న హరి ఒక్కడే అని తెలుసుకోవటమే పరమపదము పొందటం. జీవిత కాలంలోనే ఈ సత్యాన్ని గ్రహించినవాడు రాగద్వేషాలకు అతీతుడుగా వుంటాడు. ఆ స్థితి చేరుకోవటమే జీవన్ముక్తి.

వాడికి మళ్ళీ పుట్టుక వుండదు. మరి ఈలోగా మనం పొందుతున్న ఈ అనుభవాలన్నీ యేమిటి? ఇదే శ్రీవేంకటేశుని నాటకము అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావవివరణ:

ఓ దేవదేవా! మాలోవున్న అంతర్యామివి (ఆత్మస్వరూపుడు) నీవే. నీవు నెలకొనివున్న ఈ దేహమే వైకుంఠము. ఇంకా అవతల పరమపదము (మోక్షము) అనేదివేరే వున్నదా? లేనేలేదు స్వామీ!

నీవిచ్చిన వేర్వేరు రూపాలతో వీరంతా రకరకాల జంతు రూపములను దాల్చారు. ఏదో ఒక బొంది (శరీరం) మోచి (దరించి) నీకే స్థానమైనట్లు పుట్టినారు. కందువ (చమత్కారంతో) ఈ ప్రపంచాన్ని (వారి ప్రాపంచిక జీవితాన్ని)నీకే కైంకర్యం చేసి జీవన్ముక్తిని పొందారు. అదిగో అది చాలదా ప్రభూ! వేరే వైకుంఠం... విష్ణుదూతలు... ఇదంతా యెందుకు?

మహానుభావా! నీవే యేలికవు (పరిపాలకుడవు). మేము పొందుతున్న ఈ ఇంద్రియ భోగాలన్నీ ఎవరిచ్చారు? నీవు పంచినవే (పంచిపెట్టినవే కదా!) మరి ఈ జీవులంతా, తోలితోలి (అదలించబడిన వారై) రాజాజ్ఞను (తమ యేలిక ఆజ్ఞను) తోయలేకున్నారు (ధిక్కరించలేకున్నారు). కాలము నిన్ను బాయరు (క్షణంకూడా నిన్ను వదలిపెట్టరు). ఎందుకంటే వీరుండేది ఎక్కడో కాదు... నీ గర్భగోళంలోనే (విశ్వరూపుడవైన నీ కడుపులోనే) వున్నారు. అందుచేత ఈ లోకమే సాలోక్యము (నీవుండేలోకం). దేవా! ఇది తెలుసుకుంటే చాలదా? ఇంకా ఏమి తెలుసుకోవాలి?

ప్రభూ! నీ పనులలో (సేవలో) మత్తులైనారు (తన్మయత్వం పొందేవారు) కోరుకునేది నీసేవ మాత్రమే. స్వామికార్యమునే సర్వస్వం అనుకొనేవారు జ్ఞానులైతే నేమి? అజ్ఞానులైతేనేమి? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే శ్రీనాథుడవు. వీరంతా నీ నాటకంలో పాత్రధారులు. వీరంతా నిత్యులే. ఏదో ఒక జన్మలో, ఏదో ఒకచోట, ఏదో ఒక పాత్ర ధరిస్తారు. నేనూ అటువంటి పాత్రధారినే. నాకు ఆ తృప్తి చాలదా తండ్రీ!

సంపుటి : 3 కీర్తన : శ్రీపతి యొకడే శరణము మాకును
సంఖ్య : 573 పుట : 385 రాగం : లలిత

లలిత

72. శ్రీపతి యొకఁడే శరణము మాకును
తేప యితఁడె మఱి తెరఁగేది ॥పల్లవి॥

ఆసలు మిగులా నాతుమ నున్నవి
యీసులేనిసుఖ మెక్కడిది
చేసినపాపము చేతుల నున్నది
మోసపోనిగతి ముందర నేది ॥శ్రీప॥

కోపము గొందుల గుణముల నున్నది
యేపున నిజసుఖ మిఁక నేది
దీపనాగ్నితోఁ దిరిగెటిదేహము
పైపై విరతికిఁ బట్టేది ॥శ్రీప॥

పంచేంద్రియములపాలిటిబదు కిది
యించుక నిలుకడ కెడ యేది
యెంచఁగ శ్రీవేంకటేశ్వరుఁ డొకడే
పంచినవిధులను పాలించుఁగాక ॥శ్రీప॥ 573

అవతారిక :

బహు సరళమైన ఈ కీర్తన అన్నమాచార్యులవారు మాకు శ్రీపతియొక్కడే దిక్కు. సంసార సాగరాన్ని తరించాలంటే ఆయన తేప (తెప్ప). ఆ హరి గాక ఇంకో దారి లేదు అంటున్నారు. ఆనాటి తెలుగు నుడికారంలోని వైవిధ్యం గమనించండి. "ఈసులేని సుఖమెక్కడిది" అంటే ఈర్ష్యలేక సుఖం వుండదని కాదు. ఈర్షలేనటువంటి సుఖం నిరాసక్తమైన ఆత్మకొక్కదానికే వుంటుందని భావము. ఆశ, క్రోధము, చాపల్యము అనే

మూడు దుర్గుణాలు తమలోతామే అనేక మార్పులు జెంది ఈర్ష్య పాపచింతన, మోసము, ద్వేషము అస్థిరత్వము వంటి దారుణమైన పరిణామాలు కలుగుతాయి. దీనికి విరుగుడేమిటి?

భావవివరణ:

ఓ ప్రజలారా! మాకు ఒక్క శ్రీపతియే శరణము (ఆదుకొనే దిక్కు). ఇతడే తేప (సంసార సాగరాన్ని దాటించే తెప్ప). ఈయనకాక మరి తెరగేది (ఇంకొక దారి యెక్కడుంది)?

ఆత్మలో, మిగుల ఆసలు నున్నవి (అంతులేని ఆశలు వుంటే) ఈర్ష్య లేనటువంటి సుఖమయ జీవితం సాధ్యమా? దానివల్ల అంతులేని పాపము చేజేతులారా చేస్తూనే వుంటాము. అంతులేక మోసం చేస్తుంటాం తిరిగి మోసపోతుంటాం. ముందర అన్నీ మోసాలే. ఇక తరుణోపాయం యేది?

గొందుల గుణముల (సంక్షోభము చెందే గుణము) వున్నంతవరకు కోపము పోనేపోదు. అట్లే క్రోధాగ్నిలో కాలిపోతున్న వాడికి ఏపున (ఎక్కువగా) సుఖమెట్లా వస్తుంది? బడబాగ్నివంటి ద్వేషంతో తిరిగేవాడికి దేహము రగిలిపోతూ వుంటుంది. అప్పుడప్పుడూ విరతి (విరక్తి) కలుగుతుంటుంది. మళ్ళీ కొన్నాళ్ళకి మామూలే. ఈ పైపై విరతికి (ఉత్తుత్తి విరక్తికి) పట్టేది (బలమేది?)

బదుకిది (ఈ బ్రతుకు) పంచేంద్రియముల పాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం అనే ఐదు ఇంద్రియాలచేత నియంత్రించబడుతున్నది). నిత్యము సుఖాన్వేషియైన ఆ ఇంద్రియాలు ఆత్మకు అంతులేని చాపల్యం కలుగచేస్తాయి. నిలకడయేవుండదు. ఇక దీనికి తరుణోపాయమేమిటి? ఎంచగ (లెక్కించి చూస్తే) శ్రీవేంకటేశ్వరుడొక్కడే దిక్కు. ఆయన పంచిన విధులను (మనకు నియోగించిన కర్తవ్యములను) పాలించవలెను (నిర్వర్తించాలి). అదిగాక ఇంకో తెరగు లేదు.

సంపుటి : 3 కీర్తన : ఏమిసేయగలవార మెందుకు నౌదుము నేము
సంఖ్య : 201 పుట : 135 రాగం : కాంబోది

కాంబోది

72. ఏమిసేయఁగలవార మెందుకు నౌదుము నేము
శ్రీమాధవ నీవే దయఁ జిత్తగించు మమ్మును. ॥పల్లవి॥

వేపరక పుణ్యాలు గావించేదే యరుదుగాని
సేసేనంటే పాపములు చేతిలోనివే
గాసిలక చూచితేఁ జీఁకటైనా వెలుఁగౌఁగాని
వీసమంత మఱచినా వెలుఁగైనాఁ జీఁకటే ॥ఏమి॥

తెలివితో మోక్షము సాధించేదే యెక్కుడుగాని
అలయించేలోకము లెన్నైనా గలవు
తలఁచితే నీరూపము తానే యెదుట నుండు
యిలఁ బరాకై వుండితే నెచ్చోటాఁ జిక్కదు. ॥ఏమి॥

యీవల నీదాసుఁడయ్యేది ఘనముగాని
దావతి రాజసాలంతటా నున్నవి
శ్రీవేంకటేశ్వర నీసేవే ధ్రువపదము
దేవతాంతరమెల్లా దిగ్గుడుకు దిగ్గుడు ॥ఏమి॥ 201

అవతారిక :

ఓ మాధవా! మేము మానవమాత్రులం. ఎంతవాళ్ళము – ఏమి చేయగలము? నీవే చిత్తగించి దయచూపి మమ్మల్ని రక్షించాలి అంటున్నారు. మేము జీవులం – అజ్ఞానులం చేసే పుణ్యం అంతంత మాత్రం. పాపాలు అనంతం. నీవు కూడా మమ్మల్ని మఱచిపోతే మాగతేమిటి? నీసేవ చేస్తే ధ్రువపదమైనా తేలికగా లభిస్తుంది. దేవతాంతరమైనా దిగ్గుడుకు దిగ్గుడు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఇది కొసమెరపు. అర్థం అయిందనిపించినా ఇది అర్థంకాని కీర్తన.

భావవివరణ:

ఓ శ్రీమాధవా! మేము ఏమి చేయగలుగుతాం? ఎందుకున్ ఔదము (దేనికి ఉపయోగిస్తాం)? నీవే దయజిత్తగించి (దయదలచి) మమ్మల్ని ఆదుకోవాలి. లేకపోతే మాగతేమిటి?

దేవా! మేము, వేసరక (శ్రమ అనుకోకుండా) చేసే పుణ్యకార్యాలే అరుదు (చాలా తక్కువ). ఇక పాపాలు చేయటం మాత్రం నా చేతిలోని పనే. ఎన్ని కావాలంటే అన్ని చేస్తాను. ఏదో నువ్వు గాసిలక (శ్రమ అనుకోకుండా) దయ చూస్తే చీకటైనా మాకు వెలుతురే అవుతుంది. నీవు వీసమంత (రూపాయిలో పదియారవ వంతు లేదా 1/16 వంతు) మమ్మల్ని మరచినా, వెలుగైన చీకటికి సమానమే.

స్వామీ! తెలివిగా నీవద్దనుండే మోక్షాన్ని పొందటం యెక్కుడు (గొప్పతనం) కాని ఏదో ఒక లోకం పొందాలంటే కష్టమేముంది? ఏజన్మనెత్తినా భూలోకంలోనే కదా! వుంటాము. జన్మలేక ఆత్మరూపంలో వుంటే పైన ఏడు క్రింద ఏడు లోకాలున్నాయి. ఏదో ఒకదాంట్లో వుంటాం. అందులో గొప్పేముంది? నిన్ను తలచితే (మనస్సులో నిలుపుకొన్నవారికి) నీవు వారి యెదురుగానే వుంటావు. ఇల (ఈలోకంలో) పరాకై వుండితే (నిన్ను విస్మరించిఉంటే) వాళ్ళకి ఎక్కడా చిక్కవు.

ఓ శ్రీవేంకటేశ్వరా! దావతి (ఆసక్తితో) రాజాస్థానాలు యెన్నైనా వుంటాయి. ఎక్కడైనా వుంటాయి కాని, ఇక్కడ నీ దాస్యం మాత్రం అంత తేలికగా దొరకదు. ఎంతో గొప్పతనం వుంటేకాని అది దొరకదు స్వామీ! నీసేవాభాగ్యం దక్కితే ధ్రువపదవి దక్కినట్లే. దేవతాంతరమెల్లా (అన్యదేవతల కొలువులన్నీ) దిగ్గుడుకు దిగ్గుడు (తక్కువ కంటే తక్కువ).

సంపుటి : 3 కీర్తన : అణుమాత్రపుదేహినంతే నేను

సంఖ్య : 347 పుట : 234 రాగం : సామంతం

సామంతం

74. అణుమాత్రపుదేహి నంతే నేను
మొణిఁగెద లేచెద ముందర గానను. ॥పల్లవి॥

తగుసంసారపుతరఁగలు నీమాయ
నిగమములయడవి నీమాయ
పగలునిద్రలువుచ్చేభవములు నీమాయ
గగనపునీమాయఁ గడవఁగవశమా ॥అణు॥

బయలువందిలి కర్మబంధములు నీమాయ
నియమపుఁ బెనుగాలి నీమాయ
క్రియనిసుకపాఁతరకెల్లొత్తు నీమాయ
జయమంది వెడలఁగ జనులకు వశమా. ॥అణు॥

కులధనములతోఁ జిగురుఁగండె నీమాయ
నిలువు నివురగాయ (?) నీమాయ
యెలమితో శ్రీవేంకటేశ నీకు శరణని
గెలుచుటగాక యిది గెలువఁగవశమా ॥అణు॥ 347

అవతారిక :

అన్నమాచార్యువారి అధ్యాత్మ కీర్తనలతో గొప్ప చిక్కేమిటంటే పైకి ఒక మాట వుంటే దాని అంతరార్థం ఇంకొకటుంటుంది. అన్నమయ్య వూహ గోప్యంగా వుంటుంది. ఈ కీర్తన వారి భావ గాంభీర్యానికి చక్కని వుదాహరణ. దేహి అంటే ఆత్మ. నేను అని మనం చెప్పుకొనే వీడు యెవరు? శరీరమా? అనేక మార్పులు చెంది నశించిపోయే ఈ శరీరం "నేను" కాదు. నాకు బాధ కలిగింది అంటే నొప్పి అంటే దేహానిది కాని బాధ అయితే దేహిది. కేవలం ఒక అణువు పరిణామంలో వుండే ఈ దేహిని నేను అంతే. కాని ముణిగెద (అనేక శరీరాల్లో దూరుతుంటాను). లేచెద (ఆయా శరీరాల్లోంచి లేచి

బయటకు వస్తుంటాను). ముందర గానను (నాకు రేపు ఏం జరుగుతుందో తెలుసుకోలేను) మరి నా గతేమిటి? నీమాయ నెట్లా తెలియగలను?

భావవివరణ:

ఓ దేవదేవా నేను అణుమాత్రపు దేహిని (అణువు పరిమాణం వున్న ఆత్మను). అంతే. అయినా నేను ముణిగెద (అనేక శరీరాల్లో దూరుతుంటాను). లేచెద (ఆయా శరీరాల్లోంచి బయటకు వస్తుంటాను). ముందర గానను (వాటిలో వున్నంత కాలమూ రేపు ఏం జరుగుతుందో తెలుసుకోలేను) పుట్టి, చస్తూ, అజ్ఞానంతో జీవిస్తుంటానని అర్థం.

ప్రభూ! ఈ సంసార జలధిలో వువ్వెత్తున లేచే తరగలు (తరంగాలు) నీమాయ. అడవి వలె అగమ్యగోచరమైన నిగమములు (వేదశాస్త్రములు) నీమాయ. రేయింబవళ్ళు, వుచ్చేభవములు (నశించే పుట్టుకలు) నీమాయ. ఆకాశమెంత అగమ్యగోచరమో నీ మాయ కూడా అంతే. అట్టిదానిని కడవగ (దాటుటకు) వశమా (మాకు సాధ్యమా?)

స్వామీ! బయలువందిలి (వ్యర్థప్రయత్నాలు అనేకం చేసి) కర్మబంధాలలో తగులుకొంటుంటాం. అదంతా నీమాయయే. నియమంతోవుండే గాలి, పెనుగాలి (ఝుంఝామారుతమై) యై సర్వనాశనం చేయుట నీమాయ. "క్రియన్ ఇసుకపాతర కెల్లొత్తు నీమాయ" – పెళ్ళగించివేసి ఇసుక దిబ్బలో పూడ్చిపెట్టడం నీమాయ – (అంటే విలయనాశనం చేయటం కూడా నీమాయే). నిన్ను ఎదిరించి జనులు జయముతో బయటకు రాగలరా తండ్రీ!

స్వామీ ఉన్నతకులంలో పుట్టామని, ధనవంతులమని కొందరు మూర్ఖులు జిరుగుగండె (పక్షులను పట్టుకోవటానికి ఒక ఉచ్చు) లలో చిక్కుకుపోతుంటారు. అదంతా నీమాయే. ప్రభూ! నీమాయ మమ్మల్ని నిలువునా నివ్వెరపోవునట్లు చేయజాలినది. ఓ శ్రీవేంకటేశ్వరా! ఎలమితో (వికాసముతో) నీకు శరణుజొచ్చితే నీమాయను గెలువగలరు గాని ఇంకో విధంగా నీమాయను గెలువగ వశమా? అసాధ్యం ప్రభూ!

సంపుటి : 3 కీర్తన : కలిగిననాడే చుట్టరికంబుల దిరుగు నిదె
సంఖ్య : 357 పుట : 241 రాగం : సామంతం

సామంతం

75. కలిగిననాఁడే చుట్టరికంబులఁ దిరుగు నివి
నలుగడ నివి సతమని మతి నమ్ముట పాపమయా ॥పల్లవి॥

దేహముతోడనె పెరుగును తీరని యీఇంద్రియములు
దేహముతోడనె ముదియును తేటతెల్లమిగను
ఆహా పుట్టనినాఁడును అంతమునొందిననాఁడును
శ్రీహరిమాయలఁ దగులుక జీవునిఁ దడవ వివి ॥కలి॥

తెలిశున్నపుడే తగులును తియ్యనియీసంసారము
తెలివికిఁ బాసినయప్పుడు దిగఁబడుఁ దా నెందో
మలయక నిద్రించునప్పుడు మత్తుఁడై యున్నప్పుడు
చలమరి జీవునితోడుత సమ్మతమే లేదు ॥కలి॥

కన్నులు దెరచినయప్పుడే కాన్పించును యీలోకము
కన్నులు మూసినయప్పుడె కడగడఁ దా నణగు
అన్నిట శ్రీవేంకటేశ్వరుఁ డాత్మను వెలిఁగెడివేళను
వున్నతిజీవులఁ దగులవు వొదుగుచుఁ దిరుగు నివి ॥కలి॥ 357

అవతారిక :

సిరులుంటే మన దగ్గరకు బంధువులు నారికేళసలిలములాగా వస్తారు. ఆ సిరులు పోతే అదే బంధువులు కరిమ్రింగిన వెలగపండులోని గుజ్జులాగా మాయమైపోతారు – అన్నారు పెద్దలు. ఆ సత్యాన్నే అన్నమయ్య ఈ కీర్తనలో చెబుతున్నారు, కానీ ఇంకో విధంగా. ఇదే చుట్టరికాలు, లేనినాడు తిరుగున్, అంటున్నారు. వీటిని శాశ్వతమని నమ్మటం పాపమయ్యా! అంటున్నారు. శ్రీవేంకటేశ్వరుడు ఆత్మలో వెలిగిన

వేళ జీవులకు భ్రమలన్నీ తొలగిపోతాయి. ఈ కీర్తనలో "కడగడదానణగు" అను మాటకు సరితూగే అర్థం ఏ నిఘంటువులోను దొరకలేదు. సందర్భాన్నిబట్టి ఊహించవలసివచ్చింది.

భావవివరణ:

అయ్యా! (ఓ జనులారా!) చుట్టరికాలన్నీ కలిగిన వేళనే (ధనం వున్నప్పుడే) తిరుగున్ (నడుస్తాయి). ఇవి నలుగడ (నాలుగుదిక్కులా) సతతమని (శాశ్వతమని) మతి నమ్ముట (మనస్సులో తలచుట) పాపము.

ఈ ఇంద్రియములు దేహముతోపాటు పెరుగుతున్నాయి. ఈ దేహముతోపాటే అవీ ముసలివైపోతున్నాయి. స్పష్టమైన తెలివితేటలను పొందుతాయి. ఆహా! పుట్టినదగ్గరనుంచి చచ్చేదాకా జీవుని, ఆ శ్రీహరి మాయలు తగులుకొనేవుంటాయి. ఇవి తడవవు. (వదలవు అనే అర్థంలో ప్రయోగించబడింది).

మానవుడు మెలకువతో వున్నప్పుడే ఈ బాహ్య ప్రపంచం స్ఫురణలోకి వస్తుంది. నిద్రించినప్పుడు ఆ స్ఫురణ మాయమైపోతుంది. మానవులకు ఈ సంసార మాధుర్యం అనుభవంలోకి వచ్చినప్పుడు జీవితం మధురం అనిపిస్తుంది. నిద్రించి తెలివిలేని వేళల్లో తాను (ఆత్మ) ఎందో (ఎక్కడో) దిగబడి వుంటుంది. అదే విధముగా మత్తులో వున్నప్పుడు కూడా ఈ సంసారముతో ఎట్టి సంబంధమూ వుండదు. చలమరి జీవునితో (మాత్సర్యం కల జీవునితో) అటువంటి నిద్రావస్థలోనున్న వానికి సమ్మతమే (సంబంధమే) లేదు.

ఈలోకమున్నదే... ఇది మనం కన్నులు తెరచినప్పుడే మనకు కనబడుతుంటుంది. కన్నులు మూసినప్పుడు ఈలోకము "కడగడన్ తానణగును" (సమూలంగా మాయమవుతుంది). అదేవిధంగా శ్రీవేంకటేశ్వరుడు ఆత్మలో వెలుగుతున్నప్పుడు ఆ జీవునికి సుఖదు:ఖముల వంటి ద్వంద్వములు తాకవు. అవి ఒదుగుచు తిరుగాడును. (అణుకువగా సంచరిస్తుంటాయి).

సంపుటి : 3 కీర్తన : ఇట్టియవివేకబుద్ధి యేపనికివచ్చునిక
సంఖ్య : 189 పుట : 127 రాగం : బౌళి

బౌళి

76. ఇట్టియవివేకబుద్ధి యేపనికివచ్చు నిఁక
జట్టిగొని నాగుణము చక్కఁజేయఁగదవే. ॥పల్లవి॥

హరి నీయిచ్చఁ బ్రపంచమంతా నీవు నడపఁగ
అరసి నీశక్తి దెలియక నమ్మక
వెర వెరఁగనియట్టి వెఱ్ఱివాఁడ నే నొక్క -
దొరనంటాఁ బనుల కుద్యోగించేను ॥ఇట్టి॥

అంతరాత్మవై నీవు అన్నియుఁ బెరరేఁచఁగ
బంతినే నీమహిమెల్లా భావించక
చెంత నీసంసారము సేసేవాఁడ నే నంటా
దొంతులకోరికలతోఁ దూరిపారేను ॥ఇట్టి॥

ఆదినుండి స్వతంత్రుఁడవై యేలినట్టినిన్ను
సోదించి శరణు నాఁడే చొరఁగలేక
యీదెస శ్రీవేంకటేశ యిప్పుడు నీ దాసుఁడనై
నీదయకలిమితోడ నేఁడు మొక్కేను ॥ఇట్టి॥ 189

అవతారిక :

శ్రీహరిని ప్రార్థిస్తున్నారు అన్నమయ్య. ఇంత అవివేకమున్న నా బుద్ధి ఏపనికి వస్తుంది స్వామీ? నీవే ఏదోలాగున దీనిగుణములను చక్కజేయాలి. నిన్ను ఆదినుండే శరణుజొచ్చితే ఇంకా బాగుండేది. ఏదో నీదయవల్ల నీదాసుడనై నీకు మొక్కేను లేకుంటే నేనే మొనగాణ్ణి అనుకొని దొంతుల కోరికలతో దూరిపారేను అంటున్నారు.

భావవివరణ చదివితే ఇంకా తేటతెల్లమవుతుంది. ఇంతకీ... "జట్టిగొనుట", అంటే కొనుక్కోవడం. నాదుర్గుణాలు కొనేసుకుని కాస్త నన్ను చక్కగా చేయవయ్యా! అంటున్నారు.

భావవివరణ:

ఓ దేవదేవా! ఇట్టి అవివేకబుద్ధినిచ్చావు నాకు. ఇదెందుకు పనికివస్తుంది నాకు? నా గుణములను జట్టిగొని (కొనేసుకుని) చక్కజేయగదవే (సరిదిద్దరాదా?)

ఓ శ్రీహరీ! నీవు సృష్టించిన ప్రపంచం నీవు నడువగ (నడుపుతుంటే) అందులో జీవిస్తున్నాను. అనంతశక్తివంతమైన ప్రకృతి నిబద్ధతను చూచి కూడా నీశక్తి తెలియక నిన్ను నమ్మలేకున్నాను. నాదెంత వెఱ్ఱితనమంటే... వెరవెరగని (నిశ్శేష్టుడనైకూడా) నేనే దొరని అనుకొని ఏవేవో పనులను జేస్తుంటాను, చేయిస్తుంటాను.

ప్రభూ! నాలో అంతర్యామిగా నీవేవుండి, అన్నియున్ పెరరేచగా (ప్రేరేపిస్తుంటే) అన్నీ అనుభవిస్తూ కూడా నీ మహిమను భావించనైతి (అర్థం చేసికొనలేకపోయాను). నేనే సంసారమును చేసికొనుచున్నాను అనే అహంభావముతో దొంతుల కోరికల (వరుసగా ఒకదాని తరువాత ఇంకొకటి వచ్చే కోరికలతో) దూరిపారేను (సతమతమవుతూనేవున్నాను).

ఆదినుండి (సృష్ఠి మొదలయిన దగ్గరనుంచి) నీవు సర్వస్వతంత్రుడవు. భువనాల ఏలికవు. ఏనాడో నీశరణుపొందవలసింది. శోధన చేసి నీవే దిక్కు అని గ్రహించవలసింది. అట్లా చేయలేక అహంకరించి జీవించాను. కాని, నేడు నీ దయ కలిమితో (అనుగ్రహభాగ్యం పొంది) ఓ శ్రీవేంకటేశ్వరా! ఇప్పుడు నీ దాస్యము స్వీకరించి, యీదెస (ఇకపై) నీకు మొక్కేను. ధన్యుణ్ణి తండ్రీ!

సంపుటి : 3 కీర్తన : ఏమి సేయగలవాడనిదివో నేను

సంఖ్య : 200 పుట : 134 రాగం : ఆహిరి

ఆహిరి

77. ఏమి సేయఁగలవాఁడ నిదివో నేను
నీమరఁగు చొచ్చితిఁగా నీచిత్త మిఁకను. ॥పల్లవి॥

పుట్టినవాఁడను నేను భోగించేవాఁడను నేను
గట్టిగా నిప్పుడు నాకుఁ గర్తవు నీవు
పట్టరాదు జవ్వనము పాయరాదు సంసారము
యిట్టివెల్ల నీమాయ యేమీ ననరాదు ॥ఏమి॥

కడుఁగాంక్షలు నాసొమ్ము కర్మములు నాసొమ్ము
నడమ నంతర్యామివి నీకు నీవు
వుడివోవు కోరికలు వొదుగదు కోపము
కడదాఁకా నీమహిమ కాదనరాదు ॥ఏమి॥

భావించలేనివాడను ప్రకృతిలోని వాడను
శ్రీవేంకటేశ దయసేసితివి నీవు
తోవదప్పదు జ్ఞానముతొలగదు వివేకము
దేవుడవు నీ మర్మము తెలియఁగరాదు ॥ఏమి॥ 200

అవతారిక :

ఓ శ్రీవేంకటేశ్వరా! మేము చేయగలిగిందేముంది. ప్రభూ! నీఅండజేరాము. మమ్మల్నెట్లా దయచూచెదవో నీఇష్టం అంటున్నారు అన్నమాచార్యులవారు. మానవ జీవితమంతా నీమాయవలననే భ్రమలో సతమతమవుతున్నది. దానినేమీ అనరాదు. మనోవికారములు కోపతాపాలు నీ మహిమవల్లనే మమ్ము కడదాకా పీడిస్తున్నాయి. దాన్నెట్లా కాదంటాం స్వామీ! ప్రకృతికిలోనై నిన్ను భావింపలేకున్నాం. నీవే కృపజూపి తొలగని జ్ఞానం ఇవ్వాలి. మమ్మల్ని ఉద్ధరించాలి అంటున్నారు.

భావవివరణ:

ఓ దేవదేవా! నేను ఏమిచేయగలను? ఇదిగో, నేను నీ మరుగు చొచ్చితిగా (నీ ఆశ్రయం పొందితిని కదా!) ఇకపై అంతా నీ చిత్తము (ఇష్టం). పాలముంచినా నీటముంచినా నీదే భారం స్వామీ?

జన్మపొందినది నేను. సుఖాస్వాదన చేస్తున్నది నేను. కానీ ఇప్పుడు నాకు నీవే కర్తవు. ఈ మాట నిజం. యౌవనమదమును పట్టరాదు (ఆపుట అసాదమైన). సంసారబంధాలను పాయరాదు (విడనాడలేను). ఇవన్నీ నీమాయయే. వాటినేమని నిందించగలము? చేయించేవాడొకడు చేసేవాడొకడు చేయించేవాడు గొప్ప జగన్నియంత.

కడుకాంక్షలు (అంతులేని కోరికలు) నా సొమ్ము (సొత్తు). ఆకాంక్ష నెరవేరుటకు నేను చేసే కర్మలు నా సొత్తు. కానీ ఈ కర్మాచరణలో తప్పొప్పులను యెంచే నా అంతర్యామివి మాత్రం నీవే. నాకోరికలు యేమాత్రం వుడివోవు (తగ్గవు). అవి తీరనప్పుడు వచ్చే కోపము వొదగదు (నా ఆధీనంలో వుండదు). కడదాకా (నా చివరి క్షణం దాకా) అట్లాగే జరుగుతుంది. నీ మహిమను కాదనలేము తండ్రీ!

ఓశ్రీవేంకటేశ్వరా! నీ మాయ, నీ మహిమ నేను భావించలేకున్నాను. ఎందుకంటే నేను నీవు సృష్టించిన ప్రకృతికి అధీనుడనై జీవిస్తున్నాను. నా అదృష్టం కొద్దీ నీవు నాపై దయచూపించావు. ఇక నా త్రోవ ఎన్నటికీ తప్పదు. నాఆత్మజ్ఞానం నశించదు. వివేకము విస్తరించి వుంటుంది. నీవు నా దేవుడవు నీ మర్మము (రహస్యము తెలుసుకొనుట సాధ్యమా ప్రభూ!

సంపుటి : 3 కీర్తన : పెరిగిపెద్దగాను మరిపిన్నవాడగాను
సంఖ్య : 317 పుట : 214 రాగం : రామక్రియ

రామక్రియ

78. పెరిగి పెద్దఁగాను మరి పిన్న వాఁడఁగాను
యిరవుగ నేన బుదెరిఁగెడి దెపుడు ॥పల్లవి॥

కంకిగ బహునరకంబులు చొచ్చితి–
నింకా భయ మది యెరఁగను
జంకెనలనే పలుచదువులు చదివితి
మంకుఁదనం బిది మానదు ॥పెరి॥

తియ్యక కడుఁ బెనుదేహాలు మోచితి
నయ్యో యింకా నలయను
నెయ్యపు హేయము నిచ్చలుఁ గడిగెద
చియ్యని రోయను సిగ్గుఁ బడను ॥పెరి॥

ధర్మము సేసితి దానము లొసఁగితి
కర్మము లింకాఁ గడపను
అర్మిలి శ్రీవేంకటాధిప నీకృప
నిర్మల మైతిని నే నిపుడు ॥పెరి॥ 000

అవతారిక :

ఈ కీర్తన పల్లవిలోనే అచ్చుపొరబాటువల్ల కొంత అయోయమ స్థితి కలిగింది. "బుదెరిగెడి దెపుడు" అంటే ఎంతకీ అర్థం కాలేదు. ఒక నిఘంటువలో బుద్ధెరుగుట అనే పదానికి జ్ఞానము పొందుట అనే అర్థము వున్నది. ఇక అది ముద్రారాక్షసం అయివుండవచ్చని భావించాను. అప్పుడు సందేహమేఘాలు చెల్లాచెదరయినాయి. నేను పెరిగి పెద్దవాడైన విజ్ఞానిని గాను ఏమీతెలియని పిన్నవాడనూ గాను. అజ్ఞానంలో తెలిసీ తెలియని

కర్మిష్ఠిని నాకున్న పరిమిత మతితో నేను బుద్ధెరిగెడిది (జ్ఞానినయ్యేది) యెప్పుడు? అని అడుగుతున్నారు అన్నమయ్య. శ్రీ వేంకటపతి కృప వుంటే అదెంతపని?

భావవివరణ:

నేను పెరిగి పెద్దను (జ్ఞానమున్న శ్రేష్ఠుడను) గాను. పోనీ, ఏమీ తెలియని పిన్నవాడనూ గాను. మరి ఇక నేను ఇరవుగ (స్థిరపడి) బుద్ధెరుగుట (జ్ఞానమునందుకొనుట) ఎప్పుడు?

నేను కంకిగ (అందరినీ నిందించే ధూర్తునిగా) అనేక నరకముల ననుభవించాను, వాటిలో మగ్గాను. అయినా ఈ జీవికి భయము తెలియలేదు. గురువులచేత జంకెనలనొంది (భయపెట్టబడి) ఎన్నో చదువులు చదివాను, అయినా ఇది (ఈ నా జీవుడు) మంకుతనము (మొండితనము) మానదు. మళ్ళీ పాపాలు చేస్తూనే వుంటుంది. పుట్టుకలననుభవిస్తూనే వుంటుంది. తియ్యక (వదలకుండా) అనేక దేహములను ధరించితిని.

అయ్యో! ఇంకా అలయను (విసుగు జెందను). నిచ్చలు (ప్రతిసారీ) హేయమున్ గడిగెద (పాపప్రక్షాళన అప్పటికప్పుడు చేసికొంటూనే వున్నాను). చియ్యని (ఛీ ఛీ ఇదేమిటి అని) రోయను (అసహ్యపడను). సిగ్గులేక మళ్ళీ పాపాలు చేస్తూనే బ్రతుకుతాను.

సరే, ఆ పాపప్రక్షాళన కోసం అనేక ధర్మకార్యాలు చేశాను. దానములనిచ్చాను. ఈవిధంగా మళ్ళీ కర్మములలోనే తగులుకొంటున్నాను. దానివల్ల ఉత్తమ జన్మలు పొందుతూనే వున్నాను. మరి ఈ జీవిగతి ఇంతేనా? కాదు. ఓ శ్రీవేంకటేశ్వరా! అర్మిలి (ప్రేమతో) ఒకనాడు నీదయ నాపై కలిగింది. ఇప్పుడు నేను పాపప్రక్షాళన బొందిన నిర్మలుడనయ్యాను. ధన్యుణ్ణి తండ్రీ!

సంపుటి : 3 కీర్తన : అచ్చుతుకృపాలబ్ధి మదియు

సంఖ్య : 248 పుట : 166 రాగం : దేసాళం

దేసాళం

79. అచ్చుతుకృపాలబ్ధ మదియుఁగాక
మచ్చిక నాతఁడు సేనేమతకముగాక ॥పల్లవి॥

నానాపాట్లఁ బడె నాఁడు కరి మకరిచే
హీనదెస ప్రహ్లాదుఁడు హిరణ్యుచేఁ బాటువడె
పానిపట్టి హరి యది పరిహరించని నాఁడా
ఆనుక హరిదాసుల కంతటనే భంగమా ॥అచ్చు॥

తగిలి భీష్ముఁడు శరతల్పమందు నుండఁడా
అగడై విభీషణుఁడు అన్నచేఁ దన్నువడఁడా
పగపాడే చూచుచుండ భాగవతులను హరి (?)
తగినపుణ్యుల నిందు తప్పు లెంచవచ్చునా ॥అచ్చు॥

మంతనాన నారదుఁడు మాయలకుఁ లోనుగాఁడా
చెంతల నర్జునునకు చేతులు దెగిపడవా
ఇంతలో శ్రీవేంకటేశుఁ డిట్టెవీని మన్నించఁడా
ఇంతటి మహానుభావు లిందుకు జడుతురా ॥అచ్చు॥ 245

అవతారిక :

మహానుభావులు కూడా కర్మవశము చేత కష్టాలు అనుభవించారు. కరి మకరిచే నానాపాట్లు పడి "నీవే తప్ప నిత:పరంబెరుగ" అని ప్రార్థిస్తేనే కదా! హరి గజేంద్రునికి మోక్షం కల్పించాడు? అంటూ పెక్కు వుదాహరణలతో అచ్చుతు (అచ్చుతు) కృపాలబ్ధి ఆయన శరణాగతులకు లభిస్తుంది అంటున్నారు అన్నమయ్య. చేరువయై ఆయన చేసే మతకము (మాయ) గాక ఇంకేమిటి? ఆయనకి స్వపర బేధం వుంటుందా

అంటున్నారు.

భావవివరణ:

అచ్చుతు (అచ్యుతుని) కృపాలబ్ధము (దయగలుగుటయే) అదిగాక మరొక గతిలేదు. మచ్చికన్ (మోహము కలుగజేసే) ఆతడు చేయునట్టి మతకము (మాయలు) గాక వేరొకటి లేదు.

నాడు (ఆనాడు) కరి మకరిచే నానాపాట్లు పడె. (గజేంద్రమోక్ష సమయంలో గజరాజు మొసలిచేత అనేక శ్రమలకు గురియైనాడు). హీనమైన దశను బొందిన ప్రహ్లాదుడు తండ్రి హిరణ్యకశిపుని చేత అనేక బాధలననుభవించాడు. పానిపట్టి (నేటికాలంలో ఇదే మాటను పనిపట్టి అంటున్నాం... కార్యశీలుడై అని అర్థం). శ్రీహరి వారి కష్టాలను పరిహరించలేదా (తీర్చలేదా?) హరిదాసులను అంతటనే (అంతలోనే) ఆనుక భంగములు (అణచివేయు అవమానాలు) కలుగుతాయా? ఏనాటికీ కలుగవు.

శ్రీకృష్ణుని భక్తుడైన భీష్ముడు ఒంటినిండా గుచ్చుకొన్న బాణములే తల్పముగా పడివుండలేదా? శ్రీరాముని భక్తుడైన విభీషణుడు, అన్న రావణుని కాలితన్నులు తినలేదా? హరి పగపాడేచూచుచుండగా (శత్రువువలె చూస్తుంటే) భాగవతులను బాధలను భరించాకే కృప చూపాడు కదా! ఇందులో మనం తప్పుపట్టవచ్చునా? అంతా ఆ దేవదేవుని ఇష్టం.

నారాయణ నామంతోనే సంచరించే నారదుడు హరిమాయకులోనై రోదించాడు కదా! బావా అని పిలిచే అర్జునుడు కృష్ణమాయకు లోనై తనచేతులు తెగిపడినవని ఖిన్నుడైనాడు కదా! శ్రీవేంకటేశ్వరుడు వీరందరినీ మన్నించి ఇట్టే కరుణించలేదా? మహానుభావులైన హరిదాసులు ఇందుకు (హరిమాయకు) జడుతురా (భయపడతారా)? ఏనాటికీ భయపడరు.

సంపుటి : 4 కీర్తన : ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
సంఖ్య : 196 పుట : 131 రాగం : సామంతం

సామంతం

80. ఊరకే వెదకనేల వున్నవి చదువనేల
చేరువనె వున్నదిదె చెప్పరాని ఫలము ॥పల్లవి॥

కోపము విడిచితేనె పాపము దానే పోవు
దీపింప సుజ్ఞానముతెరు విదివో
లోపల మనిలుఁడై లోకముమెచ్చుకొరకు
పైపైఁగడిగితేను పావనుఁడౌనా ॥ఊర॥

ముందరికోరిక వోతే ముంచిన బంధాలు వీడు
కందువ నాస మానితే కైవల్యము
బొందిలోన నొకటియు భూమిలోన నొకటియు
చిందు వందు చిత్తమైతే చేరునా వైకుంఠము ॥ఊర॥

కాంతల పొందొల్లకుంటే ఘనదు:ఖమే లేదు
అంతరాత్మ శ్రీవేంకటాద్రీశుఁడు
అంతట మాటలె యాడి హరి శరణనకుంటే
దొంతినున్నభవములు తొలఁగునా వివేకికి ॥ఊర॥ 196

అవతారిక :

ఊరకనే శాస్త్ర గ్రంథాలన్నీ వెదకటం దేనికి? అందులో వున్నవన్నీ బుఱ్ఱలోకి ఎక్కించుకొని తిప్పలు పడటం దేనికి అంటున్నారు అన్నమాచార్యులవారు. చెప్పలేనంత ఫలితం నీ దగ్గరలోనే వుంది. నువ్వు చేయాల్సిందల్లా... కామక్రోధాలను కట్టడి చేయటం, ఆత్మజ్ఞానంతో వుండటము, ఆశకు లొంగకుండటం, కాంతాకనకాలపై వ్యామోహం విడనాడటం, శ్రీహరిశరణాగతితో వుండటం అంతే. "లోపల మనిలుడై

లోకము మెచ్చుకొరకు పైపై గడగితేను పావనులౌనా" అనే చరణంలో 'మనిలుడై' అనే మాట అచ్చుతప్పు అని నా అభిప్రాయం. అది 'మలినుడై' అని వుండాలి.

భావవివరణ:

ఓ మానవులారా! ఊరకనే కనుపించిన శాస్త్రగ్రంథాలనన్నింటినీ వెదకుట దేనికి? వాటిని చదివి శ్రమపడటం దేనికి? చెప్పరాని ఫలము (వివరించుట సాధ్యంకాని గొప్ప ఫలితము మీ దాపుననే వున్నది కదా! ఇంత చిన్నదానికి వేదాలు చదవాలా?

మనం మన కోపాన్ని విడిచిపెట్టామంటే పాపము దానంతట అదేపోతుంది. అప్పుడు సుజ్ఞానము దానంతట అదే దీపిస్తుంది (వెలుగొందుతుంది). మనస్సులోపల మలినుడై (మలినము కలిగినవాడై) పైపై గడగితే (పైకి మంచిగావుంటే) పావనులౌనా (పుణ్యాత్ములైపోతారా?) ఏనాటికీ కారు.

ముందరి కోరికలు (భవిష్యత్తులో లభించాలని కోరుకునే కామనలు) పోతేనేకాని వాటివల్ల కలిగే ప్రతిబంధకాలు పోవు. కందువ (సామర్థ్యంతో) ఆశను విడనాడితేగాని కైవల్యము (మోక్షము) సిద్ధించదు. బొందిలోన నొకటియు (మన శరీరంలోపల ఒక విధమైనట్లు) భూమిలోన నొకటియు (లోకం దృష్టిలో ఇంకొక విధమైనట్లు) మార్పులు చెందే చిత్తమైతే (మనస్సువుంటే) వైకుంఠం లభిస్తుందా?

కాంతల పొందు వొల్లకుంటే (స్త్రీ వ్యసనం లేకపోతే) దు:ఖానికి ఆస్కారం యెక్కడుంది? అంతరాత్ముడైయున్న శ్రీవేంకటేశ్వరునితో నిత్యమూ సంభాషిస్తూ ఆ శ్రీహరినే శరణు మహాప్రభో! అనకుంటే దొంతినున్న భవములు (కుప్పలు తెప్పలుగా రాబోయే జన్మలు) వివేకికి తొలుగునా? (వివేకవంతులైన వారికి తప్పుతాయా?)

సంపుటి : 3 కీర్తన : ఎటువంటివెట్టినో యేమని విన్నవింతును
సంఖ్య : 260 పుట : 176 రాగం : దేసాక్షి

దేసాక్షి

81. ఎటువంటివెట్టినో యేమని విన్నవింతును
ఘటనలు నావంటా గర్వింతునయ్యా ॥పల్లవి॥

తలఁచేతలఁపు నీది తనువు నీ విచ్చినది
నిలిచినజగమ మెల్లా నీమయము
వలవంత నే నిందులో వట్టియహంకారినై
తెలియక నేనేయంటాఁ దిరిగేనయ్యా ॥ఎటు॥

సేసేచేఁత నీయాజ్ఞ చిత్తమెల్లా నీయిచ్చ
రాసులకర్మములు నీరపము లివి
ఆసపడి నే నిందులో అన్నియు నావనుచును
పోసరించి మాయలలోఁ బొరలెదనయ్యా ॥ఎటు॥

ఇహము నీవినోదమే యెన్నఁ బరము నీసొమ్మే
సహజము నీకు మాలోచైతన్యాలు
మహిలో శ్రీవేంకటేశ మరి నీదాసుఁడనైతి
బహుభక్తి నీమీద బచరించేనయ్యా ॥ఎటు॥ 260

అవతారిక :

ఒల్లమాలిన అజ్ఞానంతో నరులు కర్తృత్వ భోక్తృత్వాలు తనవే అనుకుంటాడు. అంటే చేసేది తానే, అనుభవించేది తానే అనుకొంటుంటాడు. తేలిక ఉదాహరణలో చెప్పాలంటే ఈ అవతారిక భావవివరణలను నేను వ్రాశాననుకోవటం అజ్ఞానం. నాచేత ఆ ఏడుకొండలవాడు వ్రాయించాడను కోవటం వివేకం. అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో అదేమాట 'దేసాక్షి' రాగంలో చెబుతున్నారు. "ఎటువంటి వెట్టినో ఘటనలు నావంటా

గర్వింతునయ్యా!" అంటున్నారు. పల్లవి ఇంత తేలికగావుంటే మిగతా కీర్తన కొరుకుడుపడదు. ఇది నా అనుభవం.

భావవివరణ:

ఓ దేవదేవా! నేను ఎటువంటి వెట్టివాడనయ్యా! ఏమని నా వెట్టితనాన్ని వివరించను? చేసేవాడవు చేయించేవాడవూ నీవయితే జరుగుతున్న ఘటనలన్నీ నావల్లనని గర్వంతో అహంకరించుచున్నాను.

ఈ నా శరీరం నీవు ఇచ్చినదే. ఈనాతలపు నేనుతలచేది కాదు. నీ సంకల్పమే. నేను నిలుచున్న ఈ భూమి అది వున్న జగత్తు ఇంతనియమం పాటించుతున్నాయంటే అది నీవల్లనే కదా! నా వలవంత (మన్మథతాపము) ఎవరిచ్చారు? నీవే కదా! ఇందులో నాదేమున్నది? అయినా, వట్టి అహంకారినై తెలియక అన్నిటికీ నేనే యనుచు తిరుగుతున్నానయ్యా!

నా చిత్తమెల్లా నీ ఇచ్ఛతో నడుస్తున్నది. నేను చేసే చేతలన్నీ నీ ఆజ్ఞతో నడుస్తున్నాయి. రాసుల కర్మములు (రాశిగావున్న కర్మలన్నీ) నేను చేసిన ఇవి నీ నీరపములు (నీ చెల్లుబడి). అయితే మధ్యలో నేను ఆశాపాశబద్ధుడనై అన్నియూ నావని అంటూ, పోసరించి (కొవ్వెక్కి) నీమాయలలోపడి సంచరిస్తున్నాను. నాగతేమిటి తండ్రీ!

ఇహము (ఈలోకము) నీ వినోదం కొరకు నీవే సృష్టించుకొన్నావు. పరమూ నీ సొమ్మే. (పైనవుండే పరలోకాలన్నీ నీసొత్తే కదా!) అసలు మాలో వుండే చైతన్యమే నీవు. మా చేష్టలన్నీ నీకు సహజమే. ఓ శ్రీవేంకటేశ్వరా! మహిలో (భూమ్మీద పుట్టి) నేను నీదాసుడనైతినయ్యా! బహుభక్తి (నవవిధభక్తి మార్గాలతో) నిన్నున్ పచరించేనయ్యా ! (ఆరాధించెదను స్వామీ!)

సంపుటి : 2 కీర్తన : అతనినడుగవో చిత్రగుప్త

సంఖ్య : 293 పుట : 197 రాగం : లలిత

లలిత

82. అతని నడుగవో చిత్రగుప్త నాయందలియౌఁగాము లన్నియును
అతఁడే మీకుత్తరము చెప్పెడిని యన్నిటికిని మముఁ దడవకుమీ॥పల్లవి॥

కరచరణాదులు నాకుఁ గల్పించినయతఁడే
గరిమల నావుభయకర్మ సంఘములకుఁ దాఁ గర్తా
సరుగఁ బ్రాణము లొసఁగి చైతన్య మతఁడే
పరగఁగ నాయపరాధంబులు పరిహరించఁ గర్తా ॥అత॥

రమణతో ననుఁ బుట్టించి రక్షించేయతఁడే
అమరఁగ నన్ను వహించుక నావళుకంతయుఁ దీర్చఁగఁ దాఁ గర్తా
ప్రమదమున నాయంతరాత్మయైపాదుకొన్నయతఁడే
మమతల మీలోకము చొరకుండా మాఁటలాడుకొనఁ దానేకర్తా ॥అత॥

యెప్పుడుఁ బాయక దాసునిఁగా నేలుకొన్నయతఁడే
తప్పక యిహముఁబరమునిచ్చి వొరులు దడవకుండఁ జేయఁగఁ గర్తా
చెప్పఁగ నాపాలిదేవరా శ్రీవేంకటేశుఁ డతఁడే
అప్పణిచ్చి మిము సమ్మతి సేయుచు నటు మముఁ గావఁగఁ దానే కర్త ॥అత॥ 294

అవతారిక :

మానవునికి మోక్షం సిద్ధించాలంటే మనస్సే సాధనం. నరకద్వారం కూడా మనస్సే. చిత్రగుప్తుడు ఎక్కడో యమలోకంలో వుండి మన పాప పుణ్యాల చిట్టా వ్రాస్తున్నాడని మనం యమధర్మరాజుగారి ఎదుటకు వచ్చినప్పుడు ఆ చిట్టా విప్పుతాడనీ, అంతదాకా మన పాపపుణ్యాల చిట్టా రాస్తూనేవుంటాడని నమ్మకం. అన్నమాచార్యులవారు ఆ చిత్రగుప్తునితో నాఅందలి యౌగాములన్నిటికి అతడు (శ్రీవేంకటేశ్వరుడు) జవాబు

చెబుతాడు. ఆయన్ని అడుగవో. మమ్ము దడవకుమీ (మాజోలికి రాకు) అంటున్నారు. ఆయన వాదన బహుపసందుగా వుంది.

భావవివరణ:

ఓ చిత్రగుప్త మహాశయా! అతని (శ్రీవేంకటేశ్వరుని అడుగవో. నాయందలి ఔగాములు (యుక్తాయుక్తము)లన్నింటికినీ, అతడే మీకు వుత్తరము జెప్పెడిని (బదులు చెబుతాడు). మమ్మున్ తడవకుమీ (విచారించవద్దు...) అంటే ప్రశ్నించవద్దు.

నాకు కాళ్ళూ చేతులు ఇచ్చింది శ్రీహరే కదా! మరి నావుభయకర్మలకు (సంచిత మరియు ఆగామికర్మలకు) ఆయనే కదా! కర్త? నా ప్రాణములు సరుగ (వర్ధిల్లుటకు) ఇవ్వబడిన చైతన్యమతడే. మరి నా అపరాధములను పరిహరించుటకు కర్త కూడ అతడే కదా! అవి పరిహరింపబడక నీవుననన్ను పాపిగా దలచినచో ఇందు నాదోసమేమున్నది?

రమణతో (చక్కగా) నన్ను పుట్టించి, రక్షించే యతడే ఆ శ్రీహరి. ఆయనే తగినట్లుగా నన్ను సరిచూచుకొంటూ, నా వళుకంతా (తగవు) తీర్చి రక్షించుటకు కర్త అయివున్నాడు. ప్రమదమున (సగర్వంగా) నా అంతరాత్మయై పాదుకొన్న (స్థిరపడిన) అతడే (శ్రీహరే) మమతలతో మీ లోకమున కట్టుబడకుండా, మీతో మాట్లాడుకొంటాడు. ధర్మం బోధిస్తాడు. తానే అన్నిటికీ కర్త.

ఆ శ్రీహరి ఎప్పుడూ విడువక తనదాసుని వలె ఏలుకొని తప్పక తన భక్తులకు ఇహపరములను వొసగును. ఒరులు తడవకుండజేయును. తనవారు దు:ఖించకుండ జేయును. చెప్పాలంటే నాపాలి దైవమైన శ్రీవేంకటేశ్వరుడు మిమ్ము సమ్మతిచేయుచు (మిమ్మల్ని సద్బుద్ధి గలవారిగ సేయుచు) ఆవిధముగా మమ్ము రక్షించగా తానే కర్తయగుచు మీరు అర్పించుకొనునట్లు జేయును.

సంపుటి : 3 కీర్తన : జీవుడనేనొకడను సృష్టికి గర్తవు నీవు
సంఖ్య : 257 పుట : 186 రాగం : భైరవి

భైరవి

83. జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు
యీవల ధర్మపుణ్యము లివివో నీచేతివి ॥పల్లవి॥

పుట్టినయట్టిదోషాలు పురుషోత్తమా నీవు
పట్టి తెంచివేయక పాయనేరవు
గట్టిగా సంసారములోఁ గలిగినలంపటాలు
ముట్టి నీవల్ల నేకాని మోయరావు ॥జీవు఼॥

పంచభూతవికారాలు పరమాత్ముఁడా నీవే
కొంచక నీయాజ్ఞఁగాని కొద్ది నుండవు
అంచెల జగములోని ఆయాసహజములు
వంచుక నీవల్లఁగాని వైపుగావు ॥జీవు఼॥

చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె
హత్తించి చూపినఁగాని యంకెకురాదు
సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె
నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చే యిఁకను ॥జీవు఼॥ 275

అవతారిక :

భగవంతుడికి మనపై దయకలిగి మనపుట్టుకలోని దోషాలు తెంచివేస్తాడు. స్త్రీ వ్యసనం వున్నవాడు వేమనలాగ యోగి అయిపోతాడు. అశోకచక్రవర్తి ప్రజాహిత కార్యక్రమాలు చేస్తాడు. ధర్మపుణ్యాలు మనంచేసినట్లు కనబడినా అవి నీ చేతివి అంటున్నారు అన్నమయ్య. నేను నిమిత్తమాత్రుడనైన జీవుడను. మరి నీవో సృష్టికర్తవు. నాలో ధర్మచింతన రావాలంటే నీవు సంకల్పించాలి. కానీ ఇది ఇంకొకరివల్ల అయ్యేపనికాదు.

సత్తుగా నీ శరణుజొచ్చితిమి, నిత్తెము గావ బ్రోవ నీయిచ్చే యికను అంటున్నారు.

భావవివరణ:

ఓ దేవదేవా! నేను జీవుడను. మరి నీవో సృష్ఠికర్తవు. ఈవల (ఈపైన) మేము చేసే ధర్మకార్యాలు (పుణ్యకార్యాలు) నీచేతలు (నీవు సంకల్పించి మాచేత చేయించిన పనులు) లేకుంటే మాకు ఆ మంచిపని చేయాలనే ఆలోచనే కలుగదు ప్రభూ!

ఓ పురుషోత్తమా! మాపుట్టుకతోనే వచ్చిన కొన్ని దోసాలు యెంతకీపోవు. నీకు దయకలిగి వాటినిపట్టి తెంచాల్సిందే. లేకపోతే అవి పాయనేరవు (పోనేపోవు). ఈ సంసారంలో అనేక లంపంటాలు (పీకులాటలు) కలుగుతుంటాయి. అవి ముట్టి (అంటుకున్నాక) నీవల్లకాని (నీ సంకల్పం వలనగాని) మోయరావు (భరించలేము).

పంచభూతాలని పిలువబడే గాలి, నీరు, వెలుగు (అగ్ని), భూమి, ఆకాశములు అనేక మానసిక, శారీరక మార్పులు మనలో కలిగించి మానవుని ప్రవర్తన ప్రకృతి అదుపాజ్ఞలలో వుంచుతున్నది. ఓ పరమాత్మా! నీ ఆజ్ఞానుసారమే ప్రకృతి నడుస్తుంది. జగములోని సహజమైన ఆయాపరిణామములన్నియు వంచి నీవు బాగుచేస్తే నీవల్ల అవి నీవైపు తిరుగుతాయి. లేకపోతే జన్మలెత్తటమే కానీ అంతూ పొంతూ వుండదు.

ఓ శ్రీవేంకటేశ్వరా! మామనస్సులో ఒకనాడు విజ్ఞానము (ఆత్మజ్ఞానము) నీవు హత్తించి (కలిగించి) చూపితేగాని అంకెకురాదు, (నీవశముకాదు). సత్తుగా (సత్యము నీవొక్కడవే అని) తెలిసికొని నిన్ను ఒకనాడు శరణుజొచ్చితే నిత్తెము (నిత్యము) కావబ్రోవ (పాలించి రక్షించుటకు), ఇకను నీయిచ్చే (ఇంక నీ ఇష్టమే) తండ్రీ!.

సంపుటి : 2 కీర్తన : నీవువెట్టినట్టిచిక్కు నీవే తెలుపవలె

సంఖ్య : 360 పుట : 242 రాగం : దేసాక్షి

దేసాక్షి

84. నీవు వెట్టినట్టిచిక్కు నీవే తెలుపవలె
నావశమా తెలియ నారాయణా ॥పల్లవి॥

నీటిలోన నొకబుగ్గ నిమిషములోనఁ బుట్టి
కోటిసేసినట్లుండుఁ గొంతవడి
పాటించి యందే యడఁగెఁ బ్రకృతియో బ్రహ్మమో
యేఁటిదో వీనియర్థ మెరిఁగించవయ్య ॥నీవు॥

ఆకసాన నొకగాలి అట్టె మ్రోయుచుఁ బొడమి
లోకము సేయ విసరు లోలోనె
మైకొని యందే యడఁగె మాయయో సత్యమో
యీకడ నీయర్థము మా కెఱిఁగించవయ్య ॥నీవు॥

భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవేంకటేశ
వాములై వెలయు సేసేవారికి
ఆముక యందే యడఁగె అసత్తో ఇది సత్తో
యేమో యీయర్థము మా కెరిఁగించవయ్య ॥నీవు॥ 360

అవతారిక :

ఓ నారాయణుడా! నీవు కల్పించిన చిక్కుముళ్ళన్నీ నీవే విప్పాలి. నావశమా? అంటున్నారు అన్నమాచార్యులవారు. నీటిలో బుడగపుట్టి కొంతసేపుండి ఏకారణములేక తనంతటతానే సమసిపోతుంది. ఎప్పుడు పుడుతుంది? ఎంతసేపు వుంటుంది? చెప్పగలవారెవ్వరు? ఓశ్రీవేంకటేశ్వరా! బూమిలో మొలకలు పుట్టి ఎలా మొక్కలౌతున్నాయి? ఇది సత్తుయా అసత్తుయా వీటి అర్థములను విడమరచి చెప్పగల సామర్థ్యం నీకొక్కడికే వుందయ్యా!

భావవివరణ:

ఓ నారాయణుడా! నీవు వెట్టిన (కల్పించిన) చిక్కులు (సమస్యలను) నీవే తెలుపవలె (నీవే పరిష్కరించవలెను). తెలియ నా వశమా? (వాటిని గ్రహించుట నాశక్యమా?)

నీటిలోన ఒక బుగ్గ (బుడగ) నిముషములోన పుట్టి కోటిసేసినట్లుండు (అతిశయించినట్లుండు) కొంతవడి (కొంతసేపు) అట్లుండి, పాటించి (ధరించి) అందే అడగు (నశించిపోతుంది అక్కడే). మరి ఇది ప్రకృతియా, బ్రహ్మమా, ఎటువంటిది? దీనియర్థము యెఱుగలేకున్నాను. నశించేది బ్రహ్మమెట్లా అవుతుంది? నిజమే కాని నీటిలో నీరే కలిసిపోయింది. ఇక నశించిందేముంది? నాకు ఈతత్త్వమే అర్థంకావటంలేదు.

ఆకాశంలో ఒక గాలి ఝుంఝూమారుతంలా మ్రోయుచు (శబ్దంచేస్తూ) బొడమినది (పుట్టినది). లోకము సేయ విసరు (లోకమును కల్లోలపరచునది) (టోర్నెడో) మైకొని అందే అడుగు (సమ్మతించినట్లు వచ్చింది వచ్చినట్లే పోతుంది). వినాశనం మాత్రం జరిగింది. ఇది సత్యమా? మాయయా? ఇక్కడ మాకు నీ ఈ చేష్టకు అర్థము వివరించవయ్యా!

ఎవ్వరూ నాటకుండానే చిన్న మొక్క మొలచింది. అది చిన్న మొక్కై తరవాత పెద్ద వాములుగా మారి పెరుగుతుంది. ఆ విధంగా ఆముకయుండి (విస్తరించియుండి) అందే అడగు (ఎట్లా పుట్టిందో అలాగే నశించిపోతుంది). నశించింది, కాబట్టి ఇది సత్తుకాదు. దానికెవ్వరూ కర్తకాదు. కాబట్టి సత్తా? ఏది సత్తు ఏది అసత్తు? ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ అర్థము నెరిగించవయ్యా! బుఱ్ఱను తొలచివేసే ఈ సందేహాలు యెవరు తీరుస్తారు స్వామీ?

సంపుటి : 2 కీర్తన : ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము
సంఖ్య : 357 పుట : 240 రాగం : ధన్నాసి

ధన్నాసి

85. ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము
ప్రకటించి వొకటి చేపట్టరో వివేకులు ॥పల్లవి॥

తనుఁ దలఁచుకొంటేను తక్కినదేహభోగాలు
పనికిరావు అవి ప్రకృతిగాన
ఘనమైనలోకభోగములతో లోలుఁడైతే
తనుఁ గానరాదు జీవతత్వముగాన ॥ఒక॥

దైవము నెఱిఁగితేను తన కామ్యకర్మములు
భావించి మఱవవలె బంధాలుగాన
కావించేటితన కామ్మ కర్మాలఁ గట్టువడితే
దైవము లోను గాఁడు స్వతంత్రుఁడుగాన ॥ఒక॥

సరి మోక్షముగోరితే స్వర్గము తెరువు గాదు
అరయ స్వర్గము తెరువల మోక్షానకు
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుని
శరణాగతియె సర్వసాధనముగాన ॥ఒక॥ 357

అవతారిక :

మానవులు ఈ శరీరం వదలి పరలోకములు చేరి వారి పుణ్యానుసారం స్వర్గ నరకాలనుభవిస్తారని ప్రతీతి. స్వర్గసుఖాలు కోరి యజ్ఞయాగాదికామ్యకర్మములు యెన్ని చేసినప్పటికీ వారి పుణ్యం క్షీణించగానే తిరిగి జన్మపొందాలని వేదం చెబుతున్నది. మోక్షము పొందితే తిరిగి జన్మవుండదు. మోక్షము కొరకు ఆలోచింపజేసేది సుజ్ఞానము. కామ్య కర్మలనాచరించమనేది అజ్ఞానము. వివేకులైనవారు తమతమ ఇచ్ఛానుసారం యేదేని ఒకటి చేపట్టాలి అంటున్నారు అన్నమయ్య. అరయ స్వర్గము తెరువల

మోక్షమునకు అలమేల్మంగపతి యొక్క శరణాగతియే సర్వసాధనము అంటున్నారు. అంటే ఏమిటో భావవివరణలో ఆస్వాదించండి.

భావవివరణ:

నేను చెప్పబోవు రెండిటిలో ఒకటి సుజ్ఞానమును ప్రకటించుచున్నది. ఇంకొకటి అజ్ఞానమును ప్రకటించుచున్నది. ఓ వివేకవంతులారా! మీకు తగినట్లు రెండిటిలో ఏదో ఒకదానిని చేకొనుడు.

మానవుడు అనుభవించే దేహభోగములన్నీ ప్రకృతి వల్ల జనించినవి. వాటి స్థాయికూడ తక్కువే. అవి పనికిమాలినవి. ఇహలోకభోగములు ఘనమైనవే, కాని వాటికి లోలుడైన (వశుడైన) చో జీవతత్వము కూడ కానరాదు. తోటి జీవిని ప్రేమించలేడు. అజ్ఞాన జనిత అహంకారముతో జీవిస్తుంటాడు.

దైవము నెరిగించేది సుజ్ఞానము. దానినెరిగితే, కామ్యకర్మలకు కట్టువడడు. తాను ఆచరించు కర్మలన్నీ కామ్య కర్మలని, ఇచ్ఛలేకుండా కర్తవ్యభావంతో చేస్తాడు. అన్ని బంధములను పరిగణించడు. తను కావించే (నెరవేర్చే) కామ్యకర్మలతో కట్టువడడు, ఎందుకంటే అలా కట్టువడినవారికి దైవములోనుగాడు (లొంగడు). ఎందుచేతనంటే దైవము సర్వస్వతంత్రుడు. ఆయన దేనికీ కట్టువడడు.

ఇక భగవంతుని ఆశ్రయించినవారు మోక్షము కోరుకుంటారు. అది సహజమే కాని ఆయన సరి (మంచిదే... ముందు) స్వర్గము ఇస్తాను, స్వర్గ సుఖాలు అనుభవించు అంటాడు. మోక్షము గోరితే స్వర్గము తెరువుగాదు (వాడి మార్గము కాదు). అరయ (పరిశీలిస్తే) స్వర్గము, మోక్షమునకు తెరువల (దారిదోపిడి దొంగ). అందుకని మోక్షమును ఆశించేవారు సుజ్ఞాన, అజ్ఞానముల జోలికి పోకుండా, అలమేల్మంగపతియైన శ్రీవేంకటేశుని శరణాగతి పొందవలెను. అదియే సర్వసాధనము. కావున మోక్షాపేక్షగలవారు స్వామిని శరణంటే చాలు.

సంపుటి : 2 కీర్తన : గొరబైమొదలుండగ గొనలకు నీరేల

సంఖ్య : 409 పుట : 274 రాగం : పాడి

పాడి

86. గొరబై మొదలుండఁగఁ గొనలకు నీ రేల
దొరదైవ మితఁడే తుదఁగలఫలము ॥పల్లవి॥

క్రతువులు హరియే కర్మము హరియే
పితరులకు హరియే పెనుఁదృప్తి
సతతమంత్రములసారము హరియే
యితనిసేవే పో యిన్నిటిఫలము ॥గొర॥

అనలము హరియే ఆహుతి హరియే
జననీజనకులసరవి హరే
పనివడి వేదముఁ బ్రణవము హరియే
యెనసితనిపూజ యిన్నిటిఫలము ॥గొర॥

యేలికె హరియే యిరవును హరియే
వాలాయము సర్వము హరియే
కాలము శ్రీవేంకటగిరిహరియే
నేల నీతనిశరణే సఫలంబు ॥గొర॥ 406

అవతారిక :

సర్వమూ హరియే. ఆయనగాక అన్యమేదియును లేదు అంటున్నారు అన్నమయ్య. 'గొరబు' అంటే గౌరవించదగిన అని అర్థం. ఇదివరలో చెప్పినట్లు చాలా సందర్భాల్లో ఆచార్యులవారి పల్లవే అర్థంకాదు. ఒక చెట్టువుంటే ఎవరన్నా దాని మొదలులో నీళ్ళుపోస్తారు కానీ చెట్టు కొమ్మల చివరలకు నీళ్ళుపోస్తారా? దొరదైవము అంటే దైవములందరికీ దొర... అంటే... దేవదేవుడు అన్నమాట. తుదగలఫలము అంటే మోక్షము. ఈ పల్లవికి అర్థమేమంటే... మోక్షప్రదాత అయిన ఈ దేవదేవుడు, ఇతడే

మనతోడువుంటే అన్యదేవతలెందుకండీ... గౌరవప్రదమైన చెట్టు మొదలులో నీరు పోస్తారా? కొమ్మల చివర్లకు నీరు పోస్తారా?

భావవివరణ:

ఓ మానవులారా! ఎవరైనా గొరబైన (గౌరవప్రదమైన) చెట్టు మొదళ్ళలో నీరుపోస్తారు కానీ కొమ్మల చివర్లలో పోస్తారా? వాటికి నీరెందుకు? అదే విధంగా దేవదేవుడైన ఇతడే మోక్షప్రదాత కావున ఈయన నాశ్రయించాలి కాని యితర దేవతలతో పనేమిటి? సర్వమూ హరియే కదా!

మనం చేసే క్రతువులు (యజ్ఞయాగాలు) శ్రీహరియే. వాటి కర్మకాండ అంతా శ్రీహరియే. పితరులకు పెనుదృప్తి (పితృదేవతలకి తృప్తిగా శ్రాద్ధఫలము నందించేవాడూ) శ్రీహరియే. సతతమంత్రముల (వేదమంత్రముల) సారము కూడా శ్రీహరియే. ఇతనిని సేవిస్తే వీటన్నిటిఫలమూ వచ్చినట్లే కదా! ఆలోచించండి.

అసలు ఇంత పటాటోపంతో హోమాలు ఆహుతులు చేస్తారు కదా! ఆలోచించండి. ఈ అగ్నిహోత్రుడెవరు. శ్రీహరి సృష్టియే కదా! పోనీ ఈ అగ్నిలో చేసే ఆహుతి యెవరు? అదీ శ్రీహరియే. తల్లీదండ్రుల సరవి (ఒకరి తరువాత ఒకరు వచ్చే క్రమము) యెవరు? అదీ శ్రీహరియే. వేదములన్నీ పనివడి (పనివేళా) ఘోషించే ప్రణవము (ఓంకారము) యెవరు? శ్రీహరియే. మరి, యెనసి (పూనుకొని) ఇతనిని పూజిస్తే ఇవన్నీ చేసినట్లేకదా!

ఈ చతుర్దశభువనాలకు ఏలిక శ్రీహరియే. ఇరవును (వాటిస్థానము కూడా) శ్రీహరియే. వాలాయము (అనివార్యము) హరియే (అనగా పగలు తరువాత రాత్రీ, రాత్రి తరువాత పగలు చావు పుట్టుకలు, ప్రకృతి విధానము సర్వమూ శ్రీహరియే). కాలపురుషుడు కూడా వేంకటాచలము మీదనున్న ఈ శ్రీహరియే. నేల (ఈలోకంలో) ఈ మహానుభావుని శరణాగతియే సఫలంబు (సర్వఫలములనొసగి తరింపజేయును).

సంపుటి : 2 కీర్తన : ఏవుపాయములు మాకింకబనికిరావు
సంఖ్య : 408 పుట : 275 రాగం : శుద్ధవసంతం

శుద్ధవసంతం

87. ఏవుపాయములు మా కిఁకఁ బనికిరావు
నీవే హరి కావవే నిరుహేతుకమున ॥పల్లవి॥

యివల నింద్రియజయం బేడ నే నేడ
భువి నింద్రియములతోఁ బుట్టె నీతనువు
ఆవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ
భవము చంచలమనసు పంగెమే యెపుడు ॥ఏవు॥

యెలమిఁ గర్మవిముక్తి యేడ నే నేడ
తెలియంగఁ గర్మాధీన మీబ్రదుకు
కుళకమగుసాత్వికపుగుణ మేడ నే నేడ
కలియుగం బిది యిందుఁ గలవాఁడ నేను ॥ఏవు॥

తనివోనిఘోరతప మేడ నే నేడ
అనిశంబు నీకు శరణాగతుఁడను
యెనలేని శ్రీవేంకటేశ్వరుఁడ నీబిరుదు
కనుఁగొనఁగ శరణాగతపారిజాతం ॥ఏవు॥ 408

అవతారిక :

ఓ శ్రీహరీ! మమ్మల్ని ఏ వుపాయములూ రక్షించలేవు. నన్ను రక్షించటానికి నీకు హేతువు (కారణం) కూడా లేదు. అయినా సరే దీనుడను. నీకు శరణుజొచ్చియున్నాను. శరణాగత పారిజాతం అనే నీపేరు నిలబెట్టుకోవటానికైనా నన్ను రక్షించక నీకు తప్పదు అంటున్నారు అన్నమయ్య. అసలు నేనెంతవాణ్ణి? ఇంద్రియాలపై విజయం, నిశ్చలబుద్ధి, కర్మవిముక్తి, సాత్విక గుణం, తపోదీక్ష ఇటువంటి పెద్దపెద్దమాటలు నాకేం

తెలుస్తాయి ప్రభూ! అవెక్కడ నేనెక్కడ? ఇది కలియుగం స్వామీ! ఇందులో నాబోటి వాళ్ళే ఎక్కువ. మరి మాగతేమిటి?

భావవివరణ:

ఓ ప్రభూ! మాకిక ఏ ఉపాయములూ పనికిరావు. ఓ శ్రీహరీ! నీవే మమ్ము నిర్హేతుకముగానైనా, కావవే. అంటే మమ్మల్ని రక్షించవలసిన అవసరం నీకు లేదు. కానీ మమ్మల్ని రక్షించు.

ఇక యిటుచూస్తే నాకు ఇంద్రియ నిగ్రహం లేదు. ఇంద్రియ జయం యెక్కడ నేనెక్కడ? ఎందుకంటే ఈ తనువు (శరీరం) భూమ్మీద ఇంద్రియాలతోనే పుట్టింది కదా! అటువైపు చూద్దామంటే మనస్సు నా భవము (పుట్టుకే) చంచల బుద్ధితో కలిగింది. నిశ్చల బుద్ధియెక్కడ నేనెక్కడ? నా మనస్సు ఎప్పుడూ పంగెమే (ట్రాప్ – ఉచ్చు) అది నన్ను బంధించివుంచుతుంటుంది.

ఎలమి (సంతసించుటకు) కర్మవిముక్తి నాకు సాధ్యమా ప్రభూ! అదెక్కడ నేనెక్కడ? నా బ్రతుకంతా కర్మాధీనమే కదా! కర్మలు చేస్తూనేవున్నాను, ఫలితం అనుభవిస్తూనే వున్నాను. దీనికి విముక్తి యెప్పుడు? కుళకమగు సాత్విక గుణము యెక్కడ నేనెక్కడ (కుళుపు అంటే ఉంగరంలో పొదిగే మణి. కావున, విలువైన మణివంటి సాత్విక గుణము యెక్కడ నేనెక్కడ అని భావిస్తున్నాను.) ఓ మహానుభావా! ఇది కలియుగం. నేను ఇందులోవుంటే నాకు మంచి బుద్ధులెలా వస్తాయి?

పోనీ ఒక మూల కూర్చొని, తనివోని (తృప్తితీరని) ఘోరతపస్సు చేసి నిన్ను మెప్పిద్దామనుకొంటే, తపస్సెక్కడ నేనెక్కడ? నేను నీకు అనిశంబు (ఎల్లప్పుడూ) శరణాగతుడనే. శరణు అంటూ నిన్ను అర్థిస్తూనేవుంటాను. ఎనలేని శ్రీవేంకటేశ్వరా! నీ బిరుదేమిటో ఆలోచించు. శరణాగత పారిజాతము అని ఇంకెవరినన్నా అంటారా? మరి నీవు కాక నన్ను యెవరు రక్షిస్తారు తండ్రీ!

సంపుటి : 2 కీర్తన : నీవేసేసిన చేత నీవే చేకొనుటింతే

సంఖ్య : 444 పుట : 299 రాగం : గుండక్రియ

గుండక్రియ

88. నీవే సేసినచేఁత నీవే చేకొనుటింతే
యీవల నీసొమ్ము నీకే ఇయ్య సిగ్గయ్యీనయ్యా ॥పల్లవి॥

ఆలు బిడ్డలఁ గని యటు దనమగనికి
సీలాన సమర్పణ సేయవలెనటవయ్యా
తాలిమిఁ బుణ్యాలు సేసి దైవమా నే నీకు
యేలీల సమర్పించే నిందుకే నువ్వు వచ్చీనయ్యా ॥నీవే॥

అంకెలఁ గన్నకొడుకటు దమతండ్రికిని
తెంకి నే నీవాఁడ నని తెలుపఁగవలెనటవయ్యా
లంకె నాలోపలనున్న లక్ష్మీశ నే నీకు
పొంకపు నీ బంట నన్నఁ బునరుక్తయ్యీ నయ్యా ॥నీవే॥

తననీడ యుద్దములోఁ దానే యటు చూచి
పనివడి వూరకే భ్రమయవలెనటయ్యా
అనుగుశ్రీవేంకటేశ ఆతుమలోనున్న నిన్ను
గని మని శరణంటిఁ గడఁ బూజించనేలయ్యా ॥నీవే॥ 444

అవతారిక :

మనం స్వామికి "నైవేద్యం సమర్పయామి" అంటూ నివేదిస్తుంటాం. ఒక్కసారి ఆలోచిస్తే ఆ నివేదన చేసేది లడ్డూ కానీ పొంగల్ కానీ దేంతో చేశారో, ఆ పదార్థం చేసింది యెవరు? మనం కాదు కదా! బంగారు వజ్రాల 'సొమ్ములు' స్వామికి 'కానుకగా చదివిస్తాం'. బంగారం, వజ్రం మనం చేశామా? నీవు చేసినవి నీవే తీసుకొంటున్నావు... ఇందులో నా గొప్పయేముంది? అట్లా 'సమర్పయామి' అంటూ ఇయ్యటానికి

సిగ్గుగావుందయ్యా! అంటున్నారు అన్నమయ్య. ఇవన్నీ చూస్తూ ఆత్మలోనేవున్న నీకు శరణని అననివాడిని యేమనాలో తెలియటం లేదు. ఇంకా వేరే పూజించాలా? అంటున్నారు.

భావవివరణ:

ఓ దేవదేవా! ఈ సృష్టిలో సమస్తమూ నీవు చేసిన చేతలే. మేము నీకు వాటిని నివేదించుట అంటే వాటిని నీవే చేకొంటున్నావు. ఆవల (అటుపైన) నీ సొమ్ము నీకే సమర్పిస్తున్నాం. ఇందుకు సిగ్గవుతున్నది స్వామీ!

ఒక భార్య తన శీలము నిరూపించుకోవటానికి తన మగనికి బిడ్డలను కని ఇవ్వాలా? ఆమె ఆయనతో పొరపొచ్చాలులేక సంసారంచేస్తే చాలదా? నేను చేసే పుణ్యకార్యాలు ఎలా చేస్తున్నాను? ఓ దైవమా! సంకల్పం కలిగించింది నీవు. ఆ సంకల్పం కార్యరూపంలోపెట్టే సమర్థతనిచ్చింది నీవు. మరి ఏలీల (విధము)గా నీకు 'సమర్పయామి' అంటున్నానయ్యా! ఇందుకే నాకు నవ్వు వస్తున్నది.

ఒక కన్నకొడుకు తన కన్న తండ్రికి అంకెలన్ (వశమై) నేను నీవాడను (కొడుకు) అని తెంకి (సుస్థిరంగా) చెప్పవలెనటయ్యా! ఆ సంగతి తండ్రికి తెలియదూ! నాలో అంతర్యామివలెనున్న ఓ లక్ష్మీపతీ! నేను పొంకపు బంటు (పొందికగల భృత్యుడు) అని చెప్పుకొంటే పునరుక్తమయ్యేనయ్యా! (చెప్పిందే మళ్ళీమళ్ళీ చెప్పినట్లు అవుతుందయ్యా!)

ఒకడు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకొని మురిసిపోతుంటే వాణ్ణి చూసి మనకు నవ్వు వస్తుంది కదా! తెలివిగలవాడు పనివడి (కావాలని) వూరకే భ్రమయవలెనటయ్యా! (అద్దంలో చూసికొంటున్న ఆ వ్యక్తిలాగా భ్రమపడవలెనా?) అనుగు (ముఖ్యుడవైన) ఓ శ్రీవేంకటేశ్వరా! నా ఆత్మలోనే వున్న నిన్ను దర్శించి కడనే (చివరకు) శరణంటిని. ఇంకా పూజించనేల? నీవే నేను, నేనే నీవు కదయ్యా!

సంపుటి : 2 కీర్తన : ఇదియరుదను నొకడిదియరుదని చెప్పు
సంఖ్య : 421 పుట : 284 రాగం : లలిత

లలిత

89. ఇది యరుదను నొకఁడిది యరుదని చెప్పు
యిది యరుదని విను నెవ్వఁడూ నెఱఁగఁడు ॥పల్లవి॥

పుట్టినవానికినెల్లా భువి మరణము నిత్య –
మట్టే చచ్చినవారి కవ్వల జననము
పుట్టనినాఁడైతేను పొడగానరాదు మేను
కొట్టఁగొనఁ గానరాదు కొన్నాళ్లేకాని ॥ఇది॥

జీవుఁడు నిత్యుఁ డేమిటాఁ జెరుపఁగరానివాఁడు
యీవివేకము దెలిసి యేజాతివారైనా
దైవికమే నమ్మి తమధర్మములఁ బాయరాదు
సావధాన మిదియే సంసారయోగము ॥ఇది॥

చిత్తమూ నీలోపలను శ్రీవేంకటేశ్వరుఁడు
పొత్తునఁ గూడున్నవాఁడు పొదిగి పాయకు నీవు
యెత్తి నాదేహగుణము ఇది జీవగుణ మిది
ఇత్తలాదైవగుణము యిది మఱవకుమీ ॥ఇది॥ 421

అవతారిక :

గీతావాక్యాన్ని వినిపిస్తున్నారు అన్నమ్య. ఇది (ఈ ఆత్మ) అరుదనునొకడు అంటే అరుదని భావిస్తాడు. ఇంకొకడు ఇది అరుదని చెప్తాడు. ఇంకొకడు ఇది అరుదని వింటాడు. కానీ వీరెవ్వరూ ఆత్మనెరుగరు. ఓ చిత్తమా ఈ గోలంతా నీకుదేనికి? నీలోపలనే శ్రీవేంకటేశ్వరుడు పొదిగి యున్నాడు. నీవు ఆయనను వదలకు. దేహమంటే యేమిటో, జీవుడు అంటే యేమిటో, పరమాత్మ అంటే

యేమిటో తెలుసుకో అని వివరిస్తున్నారు ఈ కీర్తనలో. ఇదే విధంగా పూర్తి గీతావాక్యాన్ని అన్నమాచార్యులవారు ఆనాడు వినిపించి యుంటారు.

భావవివరణ:

ఇది (ఈ ఆత్మ) అరుదైనది. దీనినెవ్వరూ తెలియరు అని ఒకడు తలుస్తాడు. ఇంకొకడు ఇది అరుదైనది అని చెప్పును. ఇంకొకడు ఇది అరుదైనది అని వింటాడు. కానీ వీళ్ళల్లో ఒక్కడు కూడా ఆత్మఅంటే ఏమిటో ఎరుగడు.

పుట్టినవానికి యెవ్వడికైనా ఈ భూమి మీద చావు తప్పదు. అట్లే చచ్చినవాడికి తిరిగి పుట్టుకా తప్పదు. పుట్టనినాడు ఈ దేహం పొడగానరాదు. కొన్నాళ్లే దీని వైభవం. కొట్టగొన (చిట్టచివరకు) ఇది కానరాదు కదా! మధ్యలో వచ్చింది మధ్యలోనే పోతుంది... అంతే.

జీవుడు నిత్యుడు (శాశ్వతమైనవాడు) ఏమిటా చెరుపగరానివాడు (జీవుని ఏవిధముగానూ చెడగొట్టుట అసాధ్యము. ఈ వివేకము (జ్ఞానము) తెలిసిన ఏ జాతివారైనా జరిగేవన్నీ దైవికముగానే జరుగుతాయని నమ్మి తన ధర్మమును పాయరాదు (వదలరాదు). తన ధర్మము తను నిర్వర్తించుచూ పోవలెను. ఇదియే సంసారయోగము. సావధానులై దీనిని నిర్వర్తించవలెను.

ఓ చిత్తమా! ఈ ఆలోచనలన్నీ నీకెందుకు? శ్రీహరి ఎక్కడో వున్నాడని భ్రమపడకు. ఆయన శ్రీవేంకటేశ్వరునివలె నీలోపలనే వున్నాడు. నీ పొత్తున (పక్కనే) నిన్నుగూడియున్నాడు. నీవు పొదిగి (జతయై) పాయకు (విడువకు). నీ దేహగుణములు, జీవగుణములు (జీవుని లక్షణములు), ఇత్తల (ఇక్కడ కనిపించుచున్న ఈ) దేవుని దైవగుణములు వేర్వేరని తెలియుము. ఇది మరువకుము సుమా!

సంపుటి : 2 కీర్తన : అనలము సూర్యుడు నన్నిటందు వెలసినా
సంఖ్య : 445 పుట : 300 రాగం : బౌళి

బౌళి

90. అనలము సూర్యుఁడు నన్నిటందు వెలసిన (నా?)
ఘనపవిత్రమైనట్టు ఘనుఁడే పో జ్ఞాని ॥పల్లవి॥

కాంచనము అంటువడినఁ గలదా అందు నింద్యము
పెంచు ముట్టంటువడినఁబెక్కుపదూష్యముగాక
అంచల సుజ్ఞానిఁ బాపమంటునా తాఁ జేసినాను
పంచల నజ్ఞాని నై తేఁ బైకొనీఁగాక ॥అన॥

యెఱుకగల నాలిక నింతైనా జిడ్డంటునా
యెఱుకలేనిచేత నింతా జిడ్డంటుఁగాక
కఱతలయోగిని కర్మములివంటునా
చుఱచుఱ జడునైతేఁ జుట్టుకొనుఁగాక ॥అన॥

తామెరపాకుల నీరు తగ నందు నంటునా
ఆమేర నెందైనాను నంటుఁగాక
యీమేర శ్రీవేంకటేశునిదాసుఁడు భూమిఁ
గామించి తా నుండినానుఁ గడు మాయలంటునా ॥అన॥ 445

అవతారిక :

అగ్నిని అందరూ (పవిత్రులూ, అపవిత్రులూ) ఉపయోగిస్తారు. సూర్యుణ్ణి అందరూ చూస్తారు. అంతమాత్రాన అపవిత్రత వారికి (సూర్యాగ్నులకు) అంటుతుందా? అట్లే జ్ఞాని కూడా ఇతరుల సాంగత్యంతో వుండి కూడా ఘనుడే పో అంటున్నారు అన్నమాచార్యులవారు. దీనికి కొన్ని వుదాహరణలు సూచిస్తున్నారు. మనం తామరాకులని అంటాము. అన్నమయ్య నూతనంగా "తాపెరపాకు" అంటున్నారు. తమలపాకులు అనే

ప్రయోగం మనం నిత్యం చేస్తుంటాం కదా! తామెరపాకు మీద నీటిబొట్టులా శ్రీవేంకటేశ్వరుని దాసులు ప్రపంచంతో సంగత్వవున్నా వారు నిస్సంగులే అంటున్నారు.

భావవివరణ:

అనలము (అగ్ని), సూర్యుడు అన్నిటందు వెలసినా (అన్నిటితో సంపర్కమున్నా) ఘనముగా పవిత్రముగానే వున్నట్లు, జ్ఞాని సంగత్వంతో వున్నా ఘనుడైన నిస్సంగుడే పో. వాడికి ఏమలినమూ అంటదు.

బంగారాన్ని ఎంతోమంది దుర్మార్గులు కూడా తాకుతుంటారు. దానికి నిందవస్తుందా? అంటరాని వాళ్ళు ఎంతమంది అంటుకొన్నా "ముట్టంటువడదు". దూష్యముగాదు (నిందబడదు). ఒక కార్యము పాపముతో కూడినదైనను జ్ఞానికి యేపాపమూ అంటదు. కాని అజ్ఞానిని మాత్రం ఆ పాపకార్యం పైకొనును (ఆవహిస్తుంది). ఎందుకంటే వాడు ఆ పాపాన్ని మనస్ఫూర్తిగా చేస్తాడు కదా!

మానవుని అవయవాలలో నాలుకకు ఇంతైనా జిడ్డు అంటుతుందా? అదే చేతికి ఎంతజిడ్డు అంటుతుంది? ఎందుకంటే నాలుకకు ఎన్నడూ జిడ్డు అంటుకోని జ్ఞానము బోధిస్తుంది. చేయి పాపం చేస్తుంది. కరతల యోగిని (దుశ్చేష్టలు చేయు యోగిపుంగవుని) అతని కర్మలు అంటునా? ఏనాటికీ అంటవు. అదే చుఱ చుఱ రగిలే మూర్ఖుణ్ణి తప్పక ఆ పాపములు అంటుకొంటాయి.

తామెరపాకుల (తామరాకులపైన) నీరు అంటుకొంటుందా? అందునందునా నీటిబొట్లుంటాయి గాని తడి అంటదు. ఆమేర (అదేవిధంగా) ఎక్కడైనా అంటుగాక వుంటుంది. ఈ విధంగానే శ్రీవేంకటేశుని దాసులు ఈ భూమిమీద కొన్ని కామించి (కోర్కెలతో) వున్నా, వారిని ఈ సాంసారిక మాయలు అంటుతాయా? ఏనాటికీ అంటవు.

సంపుటి : 2 కీర్తన : దోమటి నింతెరగరాతొల్లిటివారు

సంఖ్య : 415 పుట : 280 రాగం : లలిత

లలిత

91. దోమటి నింతెరఁగరా తొల్లిటివారు
వామదేవ వసిష్ఠ వ్యాసాదులు ॥పల్లవి॥

తానే దైవమైతే తపమేల జపమేల
పూని సారెఁ బూజించేపూజలేల
కూను వంగి యింటింటఁ గోరనేల వేఁడనేల
యీనెపాన లోకమెల్లా నేలరాదా తాను ॥దోమ॥

తగఁదా స్వతంత్రుఁడై తే దరిద్రదు:ఖములేల
నొగిలి వ్యాధులచేత నొవ్వనేల
నగుఁబాటులైన జననమరణములేల
ముగురువేల్పులదండ మొనచూపరాదా ॥దోమ॥

శ్రీవేంకటేశుఁడే శేఖరపుదైవమని
సావధానుఁ డితనికి శరణుచొచ్చి
భావములోపలఁ దనపాపబంధములఁ బాసి
తావుల నాతనికృప దండ చేరరాదా ॥దోమ॥ 415

అవతారిక :

దోమటి అంటే నిఘంటువు అర్థం "అన్నము" అని. కానీ అన్నమాచార్యులవారు ఈ పదాన్ని కపటము, మాయ అనే ధోరణిలోనే వుపయోగించారు. పూర్వకాలం నాటి ఋషులైన వసిష్ఠుడు, వామదేవుడు మొదలైనవారు ఈ దేవదేవుని మాయ ఇంతైనా ఎరుగరా? తానే దైవమైతే తపస్సు చేసికోవటం దేనికి? ఇంటింటా వెన్నలు అడుక్కోవటం దేనికి? జననమరణాలేమిటి? కన్నీళ్ళేమిటి? దేవదేవుడై ఎప్పుడూ వుండవచ్చు

గదా! అసలవన్నీ యెందుకు ఈ తిరువేంకటేశ్వరుని శరణాగతులవరాదా? నేనిచ్చిన వివరణ నాకు స్ఫురించనది మాత్రమే.

భావవివరణ:

మన పూర్వీకులైన వసిష్ఠ వాసుదేవాది ఋషులు, ఈ దేవదేవుని దోమటి (మాయ) ఇంతైనా (కొంచెమైనా) యెరుగరు. (ఆయన వాళ్ళ శిష్యుడుగా వుంటే... తమ శిష్యునిగానే భావించారు.)

తానే దైవమైతే తపస్సెందుకు చేశాడు? ఆదిత్యహృదయంలాంటి స్తోత్రాలెందుకు పఠించాడు? పూనుకొని శివపూజలెందుకు చేశాడు? కూనువంగి (అభిమానం చంపుకొని) ఇంటింటా వెన్నకోసం వేడుకోవటం దేనికి? ఈ నెపాన (నెపముతో) తానే సర్వేశ్వరుడనని లోకమంతా పరిపాలించవచ్చుగదా! మధ్యలో ధర్మరాజుచే రాజసూయం చేయించటం దేనికి? దుర్యోధనుణ్ణి రారాజా అని పొగడటం దేనికి?

పోనీ తానే సర్వస్వతంత్రుడనుకొందాం. జీవుడనుకొందాం. మరి ఈ జీవుడికి దరిద్రమెందుకు వస్తోంది? దు:ఖమెందుకు కలుగుతున్నది? వ్యాధుల చేత నొగిలి (పీడింపబడి) నొవ్వనేల (బాధపడుట యెందులకు?) హీనజన్మములెందుకు? మరణములెందుకు? హాయిగా ముగ్గురు వేల్పుల సరసనే తానూ వుండవచ్చును కదా! కావున జీవాత్మ పరమాత్మ ఎలా అవుతాడు?

ఆ వ్యర్థపుటాలోచనలెందుకు? ఈ శ్రీవేంకటేశుడే శేఖరపుదైవము (కొండలలో నెలకొన్న దేవదేవుడు). సావధానుడు (శ్రద్ధగా తన ఆశ్రితులను కాపాడువాడు). ఈ స్వామి శరణుజొచ్చి తన భావములోపల (మనస్సుల నుండికూడా) పాపచింతన (పాపపుటాలోచనలను) బాసి (వదలివైచి) ఆపై ఆయన కృప కొరకై, దండచేరరాదా (ఆశ్రయించరాదా?)

సంపుటి : 2 కీర్తన : మరిగితిసేతు మగిడినేనెందువోదు

సంఖ్య : 455 పుట : 307 రాగం : బౌళి

బౌళి

92. మరిగితి నేమి సేతు మగిడి నే నెందు వోదు
సరుస దైవమ నీకే శరణుచొచ్చేను ॥పల్లవి॥

తల్లి గోపించి మొత్తినఁ దనయుఁడు తల్లికొంగే
యెల్లగాఁ బట్టి పెనఁగి యేడిచినట్టు
వెల్లవిరై హరి నీవు విషయాలఁ జిక్కించితే
ఇల్లిదే నిన్నుఁ దలఁచి ఇటు దూరే నేను ॥మరి॥

కన్నతండ్రి బాలునిఁ జంకంబెట్టి దించితేను
కొన్నేసి విలుచు ముద్దుగునిసినట్టు (?)
వున్నతి నాలోనుండి వూరకే మాయ నాపై
బన్నితే నిన్నే సొలసి పగటులాడేను ॥మరి॥

దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే
భావించి చేపట్టితే నీ బంట నేనింతే
శ్రీవేంకటేశ నీవు చేకొని రక్షించఁగాను
జీవుఁడనయిననేను చెలఁగి మొక్కేను ॥మరి॥ 455

అవతారిక :

నాలో అనేక బలహీనతలున్నాయి. వాటి కలవాటుపడ్డాను. నేనెక్కడికి పోతాను? నేను విషయవాంఛలలో జిక్కి అది నీవు చేసిన పని అని నిన్ను నిందిస్తాను. నన్ను మాయలలో చిక్కించి చెడగొడుతున్నావని నిన్ను నేరమెంచుతాను. నీవే తల్లివి తండ్రివి దైవానివి అని నేను నీ బంటునని భావించలేకపోతున్నాను. నీవు శ్రీవేంకటేశ్వరుడవై నన్ను రక్షించే దేవుడవు. నేను జీవుడనని గ్రహించాను. అందుకే శరణని నీకు మొక్కేనయ్యా

అంటున్నారు అన్నమాచార్యులవారు. సరళంగా కనిపించే జటిలమైన కీర్తన ఇది "పగటులాడేను" అంటే పైకి నిన్ను తప్పుపట్టెదను అని చెప్పుకోవచ్చును.

భావవివరణ:

ఓ దేవదేవా! మరిగితిని (ఈ వ్యసనములకు మిక్కిలి అలవాటుపడ్డాను). నేనేమి చేతును? నేను మగిడి (మరల) యెక్కడికి పోగలను? సరసుడవైన ఓ ప్రభూ ! నీకు శరణాగతుడనయ్యాను స్వామీ!

ఒక తల్లి బిడ్డ తప్పుచేశాడని కోపించి మొత్తితే (దండిస్తే) ఆ కొడుకు తల్లినొదిలి పారిపోతాడా? ఏడుస్తూ ఆమె కొంగుపట్టుకొని పెనగులాడి మరీ ఆమెతో ఎల్లగా (సమస్తరీతులుగా) మళ్లీ కలహిస్తాడు. ఓ శ్రీహరీ! నీవు వెల్లవిరిసి నన్ను అనేక విషయవాంఛలలో జిక్కించి (అలవరచి) నా తల్లికి కాకుండా జేశావు. ఇల్లిదే (ఇదిగో) అందుకని నేను నాతల్లి (శ్రీవేంకటేశ్వరుడు) ని తలచుకొని నేను బాధలో నిన్ను దూరితిని (తిట్టాను). నేను చేసిన అనేక తప్పుల్లో ఇదీ ఒకటి అనుకోరాదా?

ఒక బాలుడు, వాని కన్నతండ్రి వున్నారనుకో ఏదో కాస్త దించుదాములే అని అప్పటివరకు ఎత్తుకొని కూడా చంకలో నుండి దించితే ఆ బాలుడు కొన్నిసార్లు ఎలుచు (ఏవేవో పోకడలకుపోయి) ముద్దుగా చంకదిగనని గునుస్తాడు. మరి నీవునాలోనే అంతర్యామిగావుండి, నన్నే వూరకే మాయజేసి, నాపై నీమాయాజాలం గప్పితే.. సొలసి (తట్టుకోలేక) పగటులాడేను (పైకి నిన్ను తప్పుపట్టేను). అంతేకదా!

స్వామీ! నా దాతవు, తల్లివి, తండ్రివి మరియు దైవానివీ నీవేకదా! భావించి చేపడితే నేను నీ బంటునే కదా! తండ్రీ! ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను రక్షించి చేగొనుటకై, జీవుడనైన నేను చెలగి (అతిశయించి) నీకు మ్రొక్కెదను.

సంపుటి : 2 కీర్తన : ఇట్టె మమ్ము రక్షించుట మేయిదొడ్డ నీకు
సంఖ్య : 503 పుట : 340 రాగం : మాళవిగౌళ

మాళవిగౌళ

93. ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు
బట్టబాయిటనే నీవు పదిరూపు లైతివి ॥పల్లవి॥

చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁ గుంగినకొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి ॥ఇట్టె॥

అడుగులు మూఁటనే యఖిలము గొలచితి
బడిబడినే రాచపగ నీఁగితి
బెడిదపులంక విభీషణు నేలించితివి
అడరి పాండవులదిక్కై నిలిచితివి ॥ఇట్టె॥

త్రిపురకాంతలగుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికిరూపై యున్నాఁడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మా నుతులకు నిరవైతివి. ॥ఇట్టె॥ 503

అవతారిక :

చక్కటి దశావతార కీర్తనను వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. అతి సరళమైన ఈ కీర్తన ఒకటి రెండు చోట్ల తప్పించి దాదాపు కీర్తనంతా సుగమమే. ప్రభూ! నేడు మమ్ము ఇట్టె రక్షించుట నీకేం గొప్ప (ఏమి కష్టం అని భావము). ఆనాడు అసాధ్యులైన రాక్షసులు వున్నప్పుడే నీవు బాహాటంగానే పది రూపములెత్తి దీనుల్ని రక్షించావు, అంటున్నారు.

ఇపుడు ఈ కలియుగంలోకూడా శ్రీవేంకటేశ్వరుడవై మా ప్రార్థనలను మన్నిస్తూనేవున్నావంటున్నారు.

భావవివరణ:

ఓ దేవదేవా! ఆనాడు ఘోర దానవులు లోకాలను పీడిస్తున్నప్పుడే నీవు పది రూపములతో బట్టబయటనే (బాహాటంగానే) దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేశావు. నేడు ఇది కలియుగము. మమ్ము ఇట్టె రక్షించుట, యేమిదొడ్డ (గొప్ప) నీకు?

ఆనాడు చదువుల చిక్కుదిద్ది చక్కగజేసితివి (వేదములనెత్తుకుపోయిన సోమకుని చంపి వాటి కష్టం తొలగించావు... మత్స్యావతారము). మొదలన్‌కుంగిన కొండను ఎత్తి మోచితివి (క్షీరాబ్ధిలో మునిగిన మందర పర్వతాన్ని ఎత్తి మోసి నీవీపుపై నిలిపి క్షీరసాగరమధనానికి తోడ్పడ్డావు... కూర్మావతారం). భూమిని చేపట్టి తెచ్చి పొదిగి (నిలుపుకొని) వుద్ధరించితివి (వరాహావతారం). అదనున (సమయంచూసి) ప్రహ్లాదుని ఇట్టే మన్నించితివి (నరసింహావతారం).

అడుగులు మూటనే అఖిలము గొలచితివి (మూడు అడుగులతో త్రిభువనంబులను కొలచితివి... (వామనావతారము). బడిబడినే రాచపగన్ ఈగితివి (వెంట వెంటనే రాజలోకంపై నున్న పగతో వేగిపోతివి... పరశురామావతారం). బెడిదపు లంకను (గొప్ప లంకాద్వీపాన్ని) విభీషణుని చేత పరిపాలించితివి. (శ్రీరామ చంద్రుడు). అడరి (పూని) శిష్టులైన పాండవులకు దిక్కువై రక్షించితివి (శ్రీకృష్ణావతారం).

త్రిపురకాంతల గుట్టు దీర బోధించితివి (త్రిపురాసుల భార్యల మానమపహరించి అందులోని గుట్టు వివరించితివి, (బుద్ధభగవానుని అవతారము). ఉపమ, కలికి రూపైయున్నాడవు (పోల్చరాని కల్కి అవతారము నెత్తితివి). ఇపుడు ఓ శ్రీవేంకటేశ్వరా! లోకాలనెల్లా యేలితివి. ఎప్పుడూ మా నుతులకు (ప్రార్థనలకు) ఇరవైతివి (స్థానము యైయుంటివి).

సంపుటి : 2 కీర్తన : తానే తెలియుగాక తలచగనెట్టువచ్చు
సంఖ్య : 473 పుట : 319 రాగం : గుండక్రియ

గుండక్రియ

94. తానే తెలియుఁగాక తలఁచఁగడ నెట్టువచ్చు
నానాగతుల తననాటకపుమాయ ॥పల్లవి॥

అట్టె యేఁబదియైనయక్షరాలలోనట
తిట్టులట వొకకొన్ని దీవెనలటా
మట్టుతో వేదములట మంత్రములట కొన్ని
యిట్టివి చిక్కులు భూమి నిఁకనెన్ని గలవో ॥తానే॥

కదిసిన యఱువదిగడియలలోనట
పొదలు నడకలట భోగములటా
నిదురట వొకకొంత నేరుపులు కొన్నియట
యెదుట చూడఁగఁ జూడ నిఁక నెన్ని గలవో ॥తానే॥

రేవగలు కన్నులివి రెంటిలోనేయట
దైవము జీవులలోనే తానకమట
శ్రీవేంకటాద్రిమీద జెలఁగి యా (గెనా?) తఁడే యట
యేవంక నీచేఁతలు యిఁక నెన్నిగలవో ॥తానే॥ 473

అవతారిక :

ఈ జగన్నాటకంలో జీవులందరూ పాత్రధారులే. నాటకం జరుగుతున్నంతకాలమూ ఇది నిజము, నిత్యము అని భ్రమకలుగుతూనే వుంటుంది. ఇది ఎప్పుడు మొదలవుతుందో ఎప్పుడు పూర్తవుతుందో తనొక్కడికే (ఆ శ్రీహరికే) తెలియును. ఇతరులకి తలచగ ఎట్టువచ్చును అంటున్నారు అన్నమయ్య. అనేక పోకడలుగల నాటకం ఇది అంటున్నారు. ఉన్న వాఙ్మయం అంతా ఏబది అక్షరాలే. కాలగమనమంతా

అఱువది గడియలతోనే ముడిపడివుంది. దేవునిలోను జీవునిలోను తానకమై (స్థానమై) యున్నది ఆ శ్రీవేంకటేశ్వరుడే. నీలీలలు ఎన్నని చెప్పేదయ్యా! అంటున్నారు. ఇది చాలా క్లిష్టమైన కీర్తన అని నమ్మక తప్పదు. అవునా?

భావవివరణ:

తన జగన్నాటకము యొక్క మాయ యెట్టిదో తానే (ఆ దేవదేవుడే) తెలియును గాక! నానా గతుల (అనేక రీతులుగానున్న) దానిని ఎట్టతలచగవచ్చు (ఎట్లు ఊహించగలము?)

అట్లే భాషలో వున్నది కేవలం 'ఏబది' అయిన అక్షరములే (ఏభయి అక్షరాలు) వున్నాయి. వాటితోనే కొన్ని తిట్లంట. మరికొన్ని దీవెనలంట. మట్టుతో (మితిగా) కొన్ని వేదములు అయినవట. మరికొన్ని మంత్రములయినవంట. ఇట్టి చిక్కు సమస్యలు భూమ్మీద ఇంకా ఎన్ని వున్నాయో యెవడికి తెలుసు?

ఒక దినమునకు అరువది గడియల కాలము మాత్రమే వుంటుంది (1 గడియ = 24 నిముషాలు). కదిసిన (సమానముగానున్న) ఆ కాలములో పొదలు (వర్ధిల్లెడి) నడతలట. అందులోనే భోగములంట. అందులోనే కొన్ని నిద్దురలంట, కొంతసేపు తన నేర్పరితనం ప్రదర్శించుకోవటం అట. చూడగాచూడగా ఇట్లాంటివి ఇంకా ఎన్నున్నాయో ఎవరికి తెలుసు?

మాకువున్నవే రెండు కన్నులు. ఆ రెండిటితోనే రాత్రిం బగళ్ళ తారతమ్యం తెలుసుకొంటున్నాము. దేవుడు జీవుడు ఈ రేయింబవళ్లులాగా పరమాత్మకు రెండు కన్నులు. పరమాత్మ ఎవరు? శ్రీవేంకటాద్రిపై చెలగే (వర్ధిల్లే) ఆ శ్రీవేంకటేశ్వరుడే. ఏవిధంగా చూచినా అనూహ్యమైన నీ చేతలు ఎన్నున్నాయో ఎవరు చెప్పగలరు తండ్రీ!

సంపుటి : 2 కీర్తన : ఇందుకా కోరి పుట్టె యిట్టిబదుకు
సంఖ్య : 397 పుట : 268 రాగం : సామంతం

సామంతం

95. ఇందుకా కోరి పుట్టె యిట్టిబదుకు
పొందుల శ్రీహరితోడిపొత్తుల మాబదుకు ॥పల్లవి॥

బడబాగ్ని ఆఁకటిబారిఁబడ్డబ్రదుకు
పడఁతులకూటములఁ బడ్డబదుకు
వొడలి తోలినెమ్ముల వొడిగట్టేబదుకు
బడిఁ బుణ్యపాపాలపై తరవు బదుకు ॥ఇందు॥

నాలుక గడచితేను నరకపుబదుకు
మూలమలమూత్రాల మూటగట్టేబదుకు
కాలము నడిపి వూర్పుగాలిఁబుచ్చేబదుకు
పాలుమాలేయింద్రియాల పంగెమాయ బదుకు ॥ఇందు॥

ఇంపుసుఖ దు:ఖాల యెండనీడబదుకు
మంపుఁగామక్రోధాలమాటు బదుకు
జంపుల శ్రీవేంకటేశు శరణు చొరఁగ నేఁడు
సొంపు లిన్నిటా మాకు సుఖమాయ బదుకు ॥ఇందు॥ 397

అవతారిక :

ఎంతో పుణ్యం చేసికొంటేనేగాని జీవికి 'మానవజన్మ' లభించదు. కష్టపడి కోరి అట్లా పుట్టింది, ఇందుకా అని విచారిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇట్టిబ్రతుకుకోసం ఇన్ని తిప్పలు పడవలెనా? శ్రీహరితో పొత్తులు పొందులు పెట్టుకుంటే మా బ్రతుకునకు అర్థం వుంటుంది. నిద్ర, భయము, ఆకలి, శరీరవాంఛల కోసం బ్రతికే పుట్టుక

ఏం పుట్టుక? జంపుల శ్రీవేంకటేశు శరణు చొరగ నేడు మాకు బ్రతుకు సుఖమాయెనంటున్నారు? జంపులంటే ఏమిటి?

భావవివరణ:

ఓ మానవులారా! ఆలోచించండి. కోరి మానవునిగా పుట్టింది ఇందుకా? ఇట్టిబ్రతుకు కోసమా అన్ని అవస్థలు పడింది? వద్దు. ఇక మా బ్రతుకును, శ్రీహరితోడి పొత్తులతోనే గడుపుతాము. ఆయన పొందులతోనే జీవిస్తాం.

ఈ బ్రతుకు ఎంత నీచమైనదో ఆలోచించండి. ఇది బడబాగ్ని వంటి ఆకలి బారిన బడ్డ బ్రతుకు. పడతుల కూటముల (స్త్రీ సాంగత్యానికి) వెంపర్లాడే బ్రతుకు. ఒడలితోలి నెమ్ములకు (ఒంటి తడికోసం) సిద్ధపడ్డ బ్రతుకు. (చెమటోడ్చి బ్రతికే జీవితం) వరుసగా చేసికొనిన పాపపుణ్యముల 'పైతరవు' (హరించివేయు) బ్రతుకు.

నాలుక గడచితేను (నాలుక ఇష్టంవచ్చినట్లు నడిచినందువల్ల) నరకంగా బాధలు పడిన బ్రతుకిది. మలమూత్రములను మూటగా కట్టి తెచ్చుకొన్న బ్రతుకు. అన్నిటికంటే వింత ఏమిటంటే... కాలము నడుపుతుంటే ఉచ్ఛ్వాస నిస్వాసాలనే గాలి వూర్పుల లెక్కతో సరిచూసుకొనే బ్రతుకిది. పాలుమాలే ఇంద్రియాలు (సోమరిపోతులైన ఇంద్రియాలచేత) పంగెమాయె (ఉచ్చు అయిపోయిన) బ్రతుకు ఇది.

ఈ మానవుని బ్రతుకులో సుఖదు:ఖాలు ఎండా, నీడా వలె వస్తూనే వుంటాయి, పోతూనే వుంటాయి. కామక్రోధాల మంపులో (మత్తులో) గడిపే బ్రతుకిది. ఇట్లాంటి నీచమైన బ్రతుకు కోసమా ఆ శ్రీహరిని అంతవేడుకొన్నది? కానే కాదు. జంపుల శ్రీవేంకటేశ్వరుని (చెంపసరసులు అనే చెవి ఆభరణములను ధరించిన తిరుమలేశుని) శరణుజొచ్చి, నేడు మా బ్రతుకు సొంపుగా సుఖవంతమైనది.

సంపుటి : 4 కీర్తన : నాకు నాకే సిగ్గయ్యాని నన్నుజూచుకొంటేను

సంఖ్య : 2 పుట : 2 రాగం : దేసాళం

దేసాళం

96. నాకు నాకే సిగ్గయ్యాని నన్ను జూచుకొంటేను
చేకొని నీవే మన్నించఁ జెయ్యొగ్గేఁగాని ॥పల్లవి॥

సేయరానిపాపములు సేసివచ్చి యేనోర
నాయెడ నిన్ను వరములడిగేను
కాయముతో నింద్రియకింకరుఁడనై యేమని
చేయార నీబంటనని చెప్పుకొనేను ॥నాకు॥

వేగిలేచి సంసారవిధులకే వొడిగట్టి
యేగతిఁ గొసరి నీపై నేఁట వేసేము
ఆగడపు బంగారుకాతుమనేన (య?)మ్ముకొని
భోగపుమోక్షము నెట్టు వొందించు మనేము ॥నాకు॥

కలుపుట్టుగుబదుకు కాంతలకు వెచ్చపెట్టి
వలసి నేఁడెట్టు నీవార మయ్యేము
నెలవై శ్రీవేంకటేశ నీవే కరుణించితివి
బలిమిసేసి నీ కెట్టు భారము వేసేము ॥నాకు॥ 2

అవతారిక :

నన్ను చూసుకొంటే నాకే సిగ్గు వేస్తున్నదయ్యా! స్వామీ! ఏదో పోనీలే అని నీవే మన్నించి చేయినందించాలి. లేకపోతే మేము నీవారముయెట్లా అవుతాము? నీవే నెలవై మమ్ము కరుణించాలి అంటున్నారు అన్నమయ్య. ఈ కీర్తనలో 'ఏఁట' అనే మాట వాడారు. దాని అర్థం ఏ వొక్క నిఘంటువులోనూ దొరకదు. సందర్భాన్నిబట్టి ఏఁట అంటే నెపము అని పెద్దలు వివరించారు. ఈ సంసార విధులకు, మేము వొడిగట్టేము.

అటువంటప్పుడు నీపై నెపము మేమెట్లు వేయగలము ప్రభూ! అంటున్నారు. మిగతా కీర్తన అంతా సరళంగానే వున్నది.

భావవివరణ:

ఓ దేవదేవా! నన్ను జూచుకొంటే నాకు నాకే సిగ్గవుతున్నదయ్యా! నేనెంతనీచుణ్ణి? ఏదోవిధంగా, నన్ను చేకొని (స్వీకరించి) నీవే మన్నించుటకు చెయ్యొగ్గాల (ప్రయత్నించాలి). కానిచో నా గతేమిటి?

నేను చేయరాని పాపాలు చేశాను. నీ ఎదురుగా ఏనోరు పెట్టుకొని నాకు వరములిమ్మని అడుగుతాను. నా ఈ శరీరంతో ఇంద్రియాలకు కింకరుడనై (బానిసనై) దుష్కర్మలు చేసి చేయార (సిద్ధపడి) నీబంటునని ఏ ముఖం పెట్టుకొని చెప్పుకొంటాను?

వేగిలేచి (పొద్దున లేచిన దగ్గరనుంచి) నా సమయమంతా సంసార విధులు నిర్వర్తించటానికే వినియోగించి, ఏగతి నీపై కొసరి (సంకోచించక) వేటు వేసేను (నెపము వేయగలను?) ఆగడపు బంగారునకు (త్రుచ్ఛమైన కనకానికి) నా ఆత్మగౌరవాన్ని అమ్ముకొని ఇంకా సుఖప్రదమైన మోక్షాన్ని ఎట్లు ఒందించుమనేము (ఇమ్మని అడుగుతాను?)

పుట్టిన దగ్గరనుంచి బ్రతుకును స్త్రీల కోసం వెచ్చించి ఈ రోజున మేము నీవారము అని ఏవిధంగా చెప్పుకొంటాము? కానీ ఓ శ్రీవేంకటేశ్వరా! నెలవై (మా హృదయంలో స్థితుడవై, నీవే మమ్ము కనికరించి అనుగ్రహించినావు. ఇంకా బలవంతంగా నీపై భారము ఎట్లు వేయగలము? అయినా తప్పదు. మా భారం నీదే తండ్రీ!

సంపుటి : 4 కీర్తన : ఎవ్వరు గలరెవ్వరికి

సంఖ్య : 46 పుట : 394 రాగం : దేశాక్షి

దేశాక్షి

97. ఎవ్వరుగల రెవ్వరికి
ఇవ్వల నవ్వల నితఁడేకాక ॥పల్లవి॥

ముద్ద సేసినటు మొదలఁ గడుపులోఁ
బెద్దగాఁ దాఁ బెరుగునాఁడు
ఒద్దనెవ్వరుండిరొకరైనా
ఒద్దికైన బంధుఁడొకఁడేకాక ॥లలలలల॥

వరతఁ బోవునట్టి వడి సంసారపు
తెరలఁ దగిలి తాఁ దిరుగునాఁడు
వెరవకుమని భావించువారెవరు
తరితోడ నీతఁడె కాచుఁగాక ।ఎవ్వ॥

ఉడుకఁ బెట్టినట్టి వుడివోయిన నరకాల
నుడుకుచుఁ దానుండునాఁడు
తడవువారెవ్వరంతటఁ దన్ను
కడవేగ వేంకటపతిగాక ॥ఎవ్వ॥ 49

అవతారిక :

ఒక్కసారి ఆలోచించండి. మానవులు తల్లి కడుపులో తొమ్మిదినెలలు గడుపుతున్నంత కాలం ఆ కూపములో వాడికి తోడూ నీడా అయి తిండిపెట్టి వాణ్ణిపెంచి రక్షించిందెవరు? సంసార తాపత్రయంలో కష్టాలకు బెంబేలెత్తిపోతుంటే ఆశాకిరణంలా అడ్డుపడుతున్నదెవరు? ఘోర ప్రమాదంలో సమర్థులైన పెద్దలంతా అనంత నీరవ నిశీధిలో మరణిస్తుంటే పాకటంకూడా రాని పసిగుడ్డును ఒక్కదాన్నే బ్రతికించినదెవరు? ఇవ్వల ఆ

పాపాయికి, అవ్వల (అంటే గతించిన ఆ పెద్దలకి) ఇతడు గాక ఎవ్వరికి ఎవ్వరు గలరు? అంటున్నారు అన్నమయ్య.

భావవివరణ:

ఎవ్వరుగలరెవ్వరికి (ఎవరికి ఎవరున్నారు?) ఇవ్వల (ఈ మన భూలోకంలోను) అవ్వల (అక్కడ నున్న పరలోకములోనూ) ఇతడే కాక (ఈ శ్రీహరికాక ఎవరు దిక్కు?)

ఒక ముద్ద చేసినట్లు మనను అమ్మకడుపులో పెడతాడు. అప్పుడు ఆ జీవి పెద్దగా పెరుగుతాడు. అప్పుడు వాడి ఒద్ద యెవరుంటారు? ఒక్కరైనా వుంటారా? ఆ తరువాత వాడిని మావాడు అనే బంధువుల్లో ఒక్కడైనా ఆగర్భనరకంలో నీకు దిక్కూ మొక్కవుతాడా? అసలు ఆ తల్లికి నొప్పులు తెప్పించి నిన్ను బయటపడేసిందెవరు?

'వరఁత' అంటే 'ఏఱు' అని అర్థం. ఏఱులాగా వడిగా ప్రవహించే సంసారపు తెరలలో (కుతకుతలలో) పడి పిచ్చివాడిలా తిరుగుతున్నప్పుడు భయపడకు నాయనా! అని అంతరాత్మలా మనోధైర్యాన్ని ఆలోచనలను (బ్రెయిన్ వేవ్స్) అందించువారెవరు? ఇంకా మీ బుర్రకి తట్టలేదా? తరితోడ (ఓడ వలే) రక్షించేదెవరు? ఆ దేవదేవుడు కాక ఇంకొకరెవరున్నారు?

సరే! ఎలాగైతేనేం చచ్చామనుకోండి. ఆ తరువాత ఉడకబెట్టినట్లు నరకంలోని కూపాల్లో వుడకబెడుతున్ననాడు, ఉడికిపోతూ దిక్కులేక ఏడుస్తున్ననాడు, అంతట తడవు వారెవ్వరు? (చేతులతో ప్రేమగా నిమిరి ఓదార్చే వారెవ్వరు?) తన్ను (తనను) రక్షించేదెవరు? ఇదిగో ఈ శ్రీవేంకటపతే. ఇంకెవ్వరూ రారు రాబోరు. అమాయకులారా! ఇప్పటికయినా నన్ను నమ్మండి. ఆ ఏడుకొండలవాడిని శరణు అనండి.

సంపుటి : 4 కీర్తన : వట్టిజోలియెంతలేదు

సంఖ్య : 481 పుట : 324 రాగం : కన్నడగౌళ

కన్నడగౌళ

98. వట్టిజోలి యెంత లేదు వైరాగ్యమే సుఖము
నెట్టుకొని వివేకింపనేరవలెఁగాని ॥పల్లవి॥

కట్టుకొంటే నెంతైనాఁ గలదు సంసారము
పట్టి చేసితేఁ గలవు పనులెన్నైనా
చుట్టుకొంటే నూరఁగలచుట్టరికముఁ గలదు
అట్టె మోక్షము గడించే దరు దింతేకాని ॥వట్టి॥

చేసేనంటేఁ గలవు సేనాసేన పనులు
లాసి తగిలించుకొంటే లంపటా లంటు
ఆసలు పెంచఁ జూచితే నంతకంతకుఁ బెరుగు
వేసిరి శాంతిఁబొందుటే వేడు కింతేఁకాని. ॥వట్టి॥

పనిగొంటేఁ బెనుగొనుఁ బంచేంద్రియంబులు
వెనుకొంటేఁ జిమ్మిరేఁచు వేడుకలు
తనిసి శ్రీవేంకటేశు దసానుదాసుఁడై
కొనకెక్కఁగ నాతనిఁ గొలువవలెఁగాని ॥వట్టి॥ 481

అవతారిక :

'వట్టిజోలి' అంటే ప్రయోజనం లేని సంగత్వం. పనికిరాని ఆ అనుబంధాలకన్నా విరాగిలా బ్రతుకుటయే మంచిది అంటున్నారు అన్నమయ్య. తెగించి వివేకిలా బ్రతుకుట నేర్వవలెను అంటున్నారు. ఎంత తగిలించుకుంటే అంత తగులుకొంటుంది ఈ సంసార లంపటం. ఏదో ఒకనాటికి విసుగుబొంది శాంతిని పొందాలి. లేకపోతే దారితెన్నూ వుండదు. కొనకెక్కి ఆ శ్రీవేంకటపతిని గొలువవలెను అంటున్నారు.

దసానుదాసులై అనే మాట అచ్చుతప్పు అని నా భావన. అది దాసానుదాసులై అయిఉంటుంది.

భావవివరణ:

ఓ మానవులారా! ప్రయోజనంలేని సంగత్వం ఎంతవున్నా దేనికి? దానికంటే వైరాగ్యమే మిక్కిలి సుఖమైనది. నెట్టుకొని (ఉద్యమించి) వివేకముతో ఈ విషయం నేర్వవలెను.

ఈ సంసారము (ప్రపంచము) వున్నది చూశారా, ఇది ఎంతకట్టుకొంటే అంత వుంటుంది. పూనుకొని పరులకు మేలు చేయాలనుకొంటే ఎన్ని పనులైనా గలవు. చుట్టుకొంటే (కల్పించుకొంటే) వూళ్ళో యెన్నో చుట్టరికాలు కలుస్తాయి. కాని మోక్షం సంపాదించాలి అంటే మాత్రం బహు అరుదుగా సాధ్యం. అంతేకాని మరొకటి కాదు.

చేయాలి అనుకొంటే పనులు సేనాసేన (మిక్కుటముగా) కలవు. లాసి తగిలించుకొంటే (గట్టిగా అంటించుకొంటే) ఎన్ని లంపటాలైనా అంటుకొంటాయి. ఆశలు యెంత పెంచుకుంటే అంత పెరుగుతాయి. వాటిపై వేసరి (విసుగు కలిగి) ఎంత శాంతి పొందితే అంత సంతోషం కలుగుతుంది. ఇదింతే కాని మరొకటి కాదు.

పనిగొంటే (ఆశక్తి కలిగితే) మానవుని పంచేంద్రియములూ పెనగొను (పెనవేసుకొని, లోలుడిని చేస్తాయి). వెనుకొంటే (వెనకడుగువేస్తే) వేడుకలు (ఆనందము) జిమ్మిరేచు (తలకెక్కుతుంది). తనిసి (తృప్తితో) శ్రీవేంకటేశ్వరుని దాసానుదాసులైతే కొనకెక్కుట అత్యున్నత స్థానము పొందుట తథ్యము. ఆయన శరణాగతిలో వుండాలి, అంతేకాని మరొకటి కాదు.

సంపుటి : 4 కీర్తన : ఉమ్మడికర్మములాల వుండజోటు మీకులేదు
సంఖ్య : 132 పుట : 89 రాగం : సాళంగనాట

సాళంగనాట

99. ఉమ్మడికర్మములాల వుండఁ జోటు మీకు లేదు
యిమ్ముల నెందైనాఁ బోరో యివి లేనిచోటికి ॥పల్లవి॥

పెట్టినది నుదుటను పెరుమాళ్ల లాంఛనము
దట్టమై బుజములందు దైవశిఖామణిముద్ర
నెట్టన నాలుకమీఁద నీలవర్ణనామమిదె
అట్టె హరిదాసులకంటునా పాపములు ॥ఉమ్మ॥

మనసునఁ దలఁచేది మాధవుని పాదములు
దినముఁ గడుపునించేది హరిప్రసాదము
తనువుపైఁ దులసిపద్మాక్షమాలికలు
చెనకి హరిదాసులఁ జేరునా బంధములు ॥ఉమ్మ॥

సంతతముఁ జేసేది సదాచార్యసేవ
అంతరంగమున శరణాగతులసంగ మిదే
యింతటాను శ్రీవేంకటేశుఁడు మమ్మేలినాఁడు
అంతటా హరిదాసుల నందునా అజ్ఞానము ॥ఉమ్మ॥ 132

అవతారిక :

ఉమ్మడి కర్మములంటే సంచితకర్మలు, ఆగామి కర్మలు. సంచిత కర్మలు మనకు పూర్వ జన్మల నుండి ప్రాప్తించిన పుణ్యపాపకర్మల ఫలములన్నమాట. ఇక ఆగామి కర్మలంటే మనం ఈ జన్మలో చేసిన కర్మమలకు ఫలితం. ఇప్పుడు కొంత అనుభవించి కొంత రాబోయే జన్మకి అట్టేపెట్టుకొంటామన్నమాట. ఈ ఉభయకర్మల ఫలితం అనుభవించక ఆ ఏడుకొండలవాడికి కూడా తప్పలేదు. మనం యెంత? కానీ అన్నమయ్య

ఆ ఉభయకర్మలను తనజోలికి రాకుండా ఎక్కడకైనా పొమ్మని బ్రతిమిలాడుతున్నారు. తను ఎటువంటి హరిదాసో వివరించి తనని వదిలేయమంటున్నారు. కొసమెరుపేమంటే ప్రారబ్ధకర్మ అని ఇంకొకటుంది. మనం ఏమీ చేయకపోయినా భగవదేచ్ఛతో చుట్టుకొంటుంది. దానినాపగలవారెవ్వరూ లేరు. కాకపోతే ఆయన దాని తాపాన్ని తగ్గించగలడు. అదీ హరిదాసులకే సుమండీ!

భావవివరణ:

ఓ ఉభయకర్మములారా! నావద్ద వుండటానికి మీకు చోటులేదు. ఇమ్ముల (ఇప్పటికిప్పుడు) ఎక్కడికన్నాపోండి. ఎక్కడికిపోతారు? ఇవి లేనిచోటికి పోండి. అంటే హరిదాసులు లేని చోటు. ఇవి పుష్కలంగా అవసరం అవుతాయి, అక్కడకు పోండి.

మేము మా నుదుటిపై పెరుమాళ్ళు (భగవంతుని) లాంఛనము (పంగనామాలు) ధరించాము. మా భుజములమీద దట్టమైన శంఖచక్రాల ముద్రలు ధరించాము. నాలుక మధ్య స్పష్టంగా నీలవర్ణుడైన శ్రీహరినామం వుంటుంది. మరి పాపము అట్టి హరిదాసులకు ఎట్లా అంటుకొంటుంది?

సరె, మా బాహ్య స్వరూపం అట్లావుంటే మా అంత: శరీరం ఎలావుందో వినండి. మేము మా మనస్సులో సదా తలచేది మాధవుని పాదపద్మములే, రోజూ మా కడుపు నింపుకొనేది శ్రీహరి ప్రసాదముతోనే. మేము శరీరంపై ధరించేది విష్ణుతులసిమాలలు. అటువంటి హరిదాసులకు భవబంధములు అంటుకోగలవా?

ఇక మా దినచర్య ఎట్లావుంటుందో వినండి. మేము సంతతము (ఎల్లప్పుడూ) చేసేది సదాచార్యుల సేవ. మా ఆత్మారాముడు అనుక్షణం శ్రీహరి శరణాగతుల సాంగత్యంతోనే తృప్తి చెందుతాడు. ఆ శ్రీవేంకటేశ్వరుడు అన్ని విధాలా మమ్ము పరిపాలిస్తుంటాడు. అటువంటి హరిదాసులను అజ్ఞానం సమీపించగలదా? ముమ్మాటికీ అసాధ్యం.

సంపుటి : 4 కీర్తన : కటకట యీమాయ గడచుటయెట్లో

సంఖ్య : 96 పుట : 65 రాగం : మలహరి

మలహరి

100. కటకట యీమాయ గడచుట యెట్లో
ఘటనలహరికృప గలిగినఁగాక ॥పల్లవి॥

యిరవగుజీవుల కెంతగలిగినా
పరధనకాంతలే బలుప్రియము
ధరఁ గర్మపుఁజేఁతలలోనెల్లా
సొరిదిఁ బాపమే సులభము ॥కట॥

నానారుచులు యనంతము గలిగిన
కానిపదార్థమె కడుఁ దీపు
పానినచదువులపఠన లుండఁగా
మాననిదుర్భాషమాఁటలే హితవు ॥కట॥

యెదలో శ్రీవేంకటేశ్వరుఁడుండఁగ
సదరపుదివిజులు చవులయిరి
అదనను శ్రీగురుయానతి గలుగఁగ
పొదిగొని యివి తలపోయఁగ వలసె ॥కట॥ 96

అవతారిక :

కటకటా! అంటే నేటి కాలంలో అయ్యయ్యో! అనడం అన్నమాట. అయ్యయ్యో! ఈ మాయను నెగ్గుకురావడమెట్లో అర్థం కావటంలేదు. హఠాత్తుగా ఘటన మాదిరిగా శ్రీహరి కృప కలిగితే యేమోకాని, ఇది అసాధ్యమనిపిస్తున్నది అంటున్నారు అన్నమాచార్యులవారు. మానవ సహజమైన బలహీనతల వల్ల నరుడు తనకెంతవున్నా పరస్త్రీలమీద వ్యామోహం, పరుల ధనం మీద కాంక్ష వదలలేడు. తనకెన్ని

రుచులువున్నా పొరుగింటి పుల్లకూరే బాగుంటుందంటాడు. ఎంత చదువుకున్నా దుర్భాషలాడుట మానడు. ఎదురుగా శ్రీవేంకటేశ్వరుడు వున్నా ఎందరెందరో దేవతలకు మొక్కుతాడు. శ్రీగురుకృప కలిగేదాకా వీడు తన పద్ధతి మార్చుకోడు అంటున్నారు.

భావవివరణ:

అయ్యో! హతవిధీ! ఈ మాయను గడచుట (అధిగమించుట) ఎట్లు? ఘటనల (హఠాత్తుగా ఒక ఘటనవలె) హరికృప కలిగితే కాని ఈ మాయను దాటుట అసంభవమని తోస్తున్నది.

ఈ జీవులు యెంత విచిత్రమైనవారు!! ఇరవుగ (సుస్థిరంగా) వీరికెంత కలిగినా, పరులధనము మీదను, పరస్త్రీలమీదనే వీరి వ్యామోహం వుంటుంది. ఈ భూమి మీద పుణ్యకార్యాలు చేయాలంటే శ్రమకానీ, పాపము సులభంగా, సొరిది (వరుసగా) చేసికొంటూ పోవచ్చును. అవునా?

మనకు అనేక రుచులు ఆస్వాదించటానికి సిద్ధంగా వున్నా, అవికూడా అంతులేకుండావున్నా కానీ వారికి 'కాని పదార్థాలే కడుదీపు' (పనికిరాని పదార్థాలే ఎంతో తీయగా వుంటాయి). అందుకే పొరుగింటి పుల్లకూర రుచి అంటారేమో! పానిన (పూని స్వీకరించిన) చదువులు ఎన్ని పఠించటానికి వున్నా పలుకరాని దుర్భాషలే ఇష్టంగా పలికి ఆనందిస్తాడు. ఎంత విచిత్రం!!

అందరి యెదలో (హృదయంలో) స్థిరంగా చూస్తే శ్రీవేంకటేశ్వరుడు వున్నాడు. కానీ ఈ మానవులకు.. సదరపు దివిజులు (తేలికగా అనుగ్రహించే చిల్లర దేవుళ్ళే) చవులయిరి (ఇష్టమవుతారు). అదనను (తగిన సమయంలో) శ్రీగురుయానతి (శ్రీవైష్ణవ గురువుల ఆశీర్వాదం) లభించడం వలన ఈ విపరీతమైన తలపోతలు నశించినవి. మేము ధన్యులమయ్యాము.

సంపుటి : 2 కీర్తన : పావనము గావో జిహ్వా బ్రదుకవో జీవుడా
సంఖ్య : 359 పుట : 242 రాగం : భూపాళం

భూపాళం

101. పావనము గావో జిహ్వా బ్రదుకవో జీవుఁడా
వేవేల కితని నింక వేమారునుఁ బాడి ॥పల్లవి॥

హరినామములే పాడి ఆతనిపట్టపురాణి
ఇరవై మించినయట్టియిందిరఁ బాడి
సరి నిరువంకలాను శంఖచక్రములఁ బాడి
వరదకటిహస్తాలు వరుసతోఁ బాడి ॥పావ॥

ఆదిపురుషునిఁ బాడి అట్టె భూమిసతిఁ బాడి
పాదములఁ బాడి నాభిపద్మముఁ బాడి
మోదపు బ్రహ్మాండాలు మోచేవుదరముఁ బాడి
ఆదరానఁ గంబుకంఠ మంకెతోఁ బాడి ॥పావ॥

శ్రీవేంకటేశుఁ బాడి శిరసుతులసిఁ బాడి
శ్రీవత్సముతోడురముఁ జెలఁగి పాడి
లావుల మకరకుండలాలకర్ణములు పాడి
ఆపటించి యితని సర్వాంగములుఁ బాడి ॥పావ॥ 359

అవతారిక :

అనంతశయనుడైన గోవిందునికి మంగళము పాడుతున్నారు అన్నమాచార్యులవారు. శ్రీహరిని వేవేలు చందముల కీర్తించి జిహ్వాను (నాలుకను) పునీతం కమ్మంటున్నారు. తన జీవుణ్ణి వేమారును బాడి పునీతుడై బ్రతుకమంటున్నారు. తన అంగాంగాలను ఆ స్వామి శంఖ చక్రాదులను బాడి (పాడి అంటే కీర్తించి) ధన్యులవమంటున్నారు. జయమంగళం అని లేకపోయినా దీనిని మంగళగీతికలా

భావించవచ్చును. ఆవటించి ఇతని సర్వాంగములను బాడి పావనము గమ్మంటున్నారు. అంటే?

భావవివరణ:

ఓ నాలుకా! నీవు పునీతము కారాదా? ఓ జీవుడా! ఇంక నితని వేమారున్ పాడి (వేయి విధముల కీర్తించి) వేవేల బ్రతుకవో (దీప్తించుచు జీవించుము).

హరినామమును గానము చేయుము. అతని పట్టపురాణియై ఇరవై (సుస్థిరముగా) మించినయట్టి (అతిశయించిన) ఇందిరబాడి (శ్రీదేవిని కీర్తించుము). ఇరువంకలా (శ్రీహరి కుడి ఎడమవైపులలోగల శంఖ చక్రములను పాడి (కీర్తించుము). శ్రీహరి కటి ప్రదేశముననున్న వరద హస్తమును వరుసతో పాడి (వరుసగా కీర్తించుము. ఆ విధముగా తరించుము).

ఆదిపురుషుడైన ఆదినారాయణుని పాడి (కీర్తించెదము), అట్లాగే భూదేవీ సతిని కీర్తించెదము. ఆ శ్రీదేవిభూదేవి ఆ స్వామి పాదములను ఒత్తుచుండగా వాటిని కీర్తించెదము. పదునాల్గు భువనములను మోదముతో (ఆనందంగా) తన వుదరములో మోయుచున్న ఈ పద్మనాభుని పాడి (కీర్తించెదము), అంకెతో (ఈ స్వామికి వశమై) ఆదరాన (సగౌరవంగా) కంబు కంఠమును (శంఖమువంటి ఆయన మెడను) పాడి (కీర్తించెదము.)

శ్రీ వేంకటేశ్వరుని కీర్తించెదము. ఈయన తలపై నున్న తులసి మాలలను పాడి (కీర్తించెదము). చెలగి (విజృంభించి), శ్రీవత్సము అను పుట్టుమచ్చగల ఉరము (వక్షస్థలమును) పాడి (కీర్తించెదము). ఆవుల మకరకుండలముల (బలమైన మకరాంకములు గల కుండలములను ధరించిన) చెవులకు పాడి (కీర్తించెదను). ఆవటించి (పొందుపడి) ఇతని సర్వాంగములను పాడి కీర్తించెదము.

ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ...

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు
2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు
3. నేదునూరి కృష్ణమూర్తి గారు
4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు
5. గరికపాటి వెంకట్ గారు
6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు
7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)
8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు
9. శంకర చంద్ర పవన్ గారు

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ

శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు



పొడవుకు పొడవైన పురుషోత్తమా

ఎన్నుకొన్న
అన్నమయ్య సంకీర్తనలకు
అవతారిక మరియు భావ వివరణ

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

పొడవుకు పొడవైన పురుషోత్తమా

మొదటి ప్రచురణ

జనవరి 2013

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

వెల : **అమూల్యం**

ప్రతులకు :

ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం. 61, సిద్ధార్థ నగర్,

హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. ప్రింటింగ్ :

కె. వి. ఆర్

98495 79345

అంకితము

శ్రీహరి శరణాగతులకు

భక్తితో



ఈ ప్రపంచంలో మనస్ఫూర్తిగా హరినామ సంకీర్తన చేసే మహానుభావులకు, నాకు స్ఫూర్తియై నన్ను హరిదారిలో నడిపిన అసంఖ్యాకులకు, పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పుకోలేని తరుగని హరి శరణాగతులకు దీనిని అంకితమిస్తున్నాను. వారందరికీ తిరుమలేశుడు శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్ష వీక్షణ లభించుగాక.

కం॥ పొడవుకు పొడవైన హరిన్
విడువక పురుషోత్తముండు వీడని కొలుతున్
వడి కృతినంకితమిత్తును
జడియక హరి కీర్తనంబు సలుపుఘనులకున్

పొడవుకు పొడవైన పురుషోత్తము

ఎన్నుకొన్న అన్నమయ్య సంకీర్తనలకు అవతారిక మరియు భావవివరణ

వర్ణానుసారముగ విషయసూచిక

క్ర.సం.	కీర్తన	పేజి
1.	అందరి బ్రతుకులునాతనివే	27
2.	అక్కడనెక్కడ నరకము	285
3.	అతడు లోకోన్నతుడాదిమపురుషుడు	319
4.	అతడే యెఱుగును మముబుట్టించిన	155
5.	అతి సులభంబిదె శ్రీపతిశరణము	195
6.	అతిశోభితేయం రాధా	45
7.	అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు	1
8.	అప్పుడు వేంకటరాయడలమేల్మంగ	128
9.	అలసితిని పుణ్యపాపముల	291
10.	అల్లవాడే వాడల్లవాడే	35
11.	ఆనతియ్యగదవే అందుకేకాచుకొన్నాడ	310
12.	ఆమూరితియే యీమూరితి	242
13.	ఇంచుకంతధర్మములోనున్నది	328
14.	ఇంతయు నీమాయామయమేగతి	95

15.	ఇందరిలో నేనెందుబోలుదు	101
16.	ఇందుకంటె మరి ఇకలేదు	261
17.	ఇతరములన్నియు నడమంత్రములే	164
18.	ఇతని మరచితిమి యెదుటనె	279
19.	ఇదినీమాయా యింద్రజాలమో	227
20.	ఇదియే కావలెనని తాగైకొని	230
21.	ఇదియే ఉపాయమికనాకు	236
22.	ఇదెనీ చిత్తంబింక నా భాగ్యము	300
23.	ఇరవుగ నిన్నెరిగిరి యిదివోనీదాసులు	152
24.	ఇప్పుడే నేనొడబడమరవగ	201
25.	ఇవిసేయగ నేనలసుడ	81
26.	ఈతడే యీతడే సుండీయెంతయెంచి	92
27.	ఉపకారిదేవుడు అపకారిగాడు	207
28.	ఎంచి చూడరో ఘనులాల ఇందీవరాక్షుడు	86
29.	ఎంతకాలంబైన తప్పదు యెవ్వరికి	258
30.	ఎంతనినుతియింతు రామరామ ఇట్టి నీ ప్రతాపము	137
31.	ఎక్కడ వోయనో జాతస్మరత్వము	246
32.	ఎక్కడిది వివేకమెంత	270

33.	ఎట్టిదో మీమాయా విలాసము	198
34.	ఎటువంటి భోగి వీడెటువంటి జాణ	107
35.	ఎట్టసేయగలవాడవో	313
36.	ఎదురుమాటలాడితి నీకు	322
37.	ఎన్నడు మానవు యీదుర్గుణములు	176
38.	ఎన్నడు నేనిక బుద్ధిరిగేది	192
39.	ఎన్నిబాధలుబెట్టి యేచెదవు నీవింక	134
40.	ఎన్నిలేవు యీ యింద్రజాలములు	340
41.	ఎప్పటి జీవుడే యెప్పటి జగమే	140
42.	ఏకాత్మవాదులాల యిందుకేది వుత్తరము	90
43.	ఏదిగతినేనొక్కడనే యెందరి కోపుదు	334
44.	ఏమరజనదు బ్రతికేటి కాలము	303
45.	ఏమనవచ్చును చెల్లుచున్నవివే	167
46.	ఏమనిచెప్పుట మాయజ్ఞానము	288
47.	ఏమిచెప్పెడినో శాస్త్ర రహస్యము	186
48.	ఏలయ్యపరమాత్మ యేలికవు మాకునై	143
49.	ఒక్కడవే లోకాన కొడయడవు	53
50.	కటకటామీరితివి కలికాలమా	63
51.	కనియు కానరు నీమహిమ కంస జరాసంధులు	182
52.	కమ్మరను జీవునికిని యిది కారణమే	276

53.	కలదందేపో సర్వము గలదు	120
54.	కలదిదివో సుఖము గలిగినను గర్భము	72
55.	కలుగుట కలిగిననాడే నే ఘనపాపములకు	213
56.	కాదనితోయగ నెంతటివారికి	252
57.	కొండా చూతము రారో కొండుక తిరుమల కొండ	219
58.	కొందరికివి సమ్మతమై కొందరికవి గావు	39
59.	కోరుదు నామది ననిశము	343
60.	ఘోరవిదారణ నారసింహా నీ	10
61.	చల్లనైకాయగదో చందమామా నీ	104
62.	చల్లరే హరిపై జాజర జాజ	116
63.	చాలు జాలు నీ హరియే మాకును	110
64.	చెలగి యధర్మము పుట్టింప నీకేల	189
65.	జగన్మోహనాకార చతురుడ	337
66.	జగన్నాథా నీ కొక్కనికి శరణుజొచ్చితి	249
67.	జీవాతుమైయుండు చిలుకా నీ	13
68.	జీవుని కేకాలము నీహరి చేరువ బంధువు	210
69.	తందనానా అపా తందనానా పురే	78
70.	తతిగొని యీపాటు దైవమా	48
71.	ధర గడపట నే జంతువుకైనా	113
72.	దైవమా నా పెరరేపణ లివితప్పక	316

73.	దేవా నీవే యిన్ని చందముల తిరముగ	170
74.	నారాయణ నేనస్వతంత్రుడ	264
75.	నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు	6
76.	నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు	294
77.	'నిశ్చింతం పరమం సుఖ' మనుమాటే	158
78.	నీవు సర్వగుణ సంపన్నుడవు	325
79.	నీవొక్కడివే సర్వాధారము	267
80.	నీకెటువలసెనటు సేయుము	273
81.	పుట్టుమాలిన బరుబోకివి	29
82.	పురుషుండనిశృతి వొగడీనట	84
83.	పెరుగు బెరుగ బెద్దలుగాగా పెనువెట్టి	32
84.	ప్రాణుల నేరమి గాదిది	131
85.	బలమగు కర్మములివివో జీవుల	6
86.	మలఘుని నిన్న పెరుమాళ్ళు వీడే	66
87.	మానరా నవ్వు మానరా	204
88.	మేడలెక్కి నిన్ను జూచి కూడెనన	346
89.	రాధామాధవరతి చరితం	147
90.	వినరయ్య నరసింహ విజయము జనులాల	57

91.	విన్నపమిదియే వేవేలకు గోవిందా	255
92.	విచారించుకోరో యివికులాల	173
93.	వెదకి వెదకి చొప్పులొత్తుచు	239
94.	వెట్టిమానుపరెవ్వరు	282
95.	వెలపల మరువక లోపలలేదు	98
96.	వెరపు దెలుపు నీవేగిరమే	42
97.	వెఱతు వెఱతు నిండువేడుకపడ	5
98.	వేగిరమేటికిని వేసటలేటికి	307
99.	సకలోపాసకులకు నందును సగుణంబే	216
100.	సకల దేవతలు నీ శరీరమే	233
101.	సత్యము సేయగవచ్చును సర్వేశ	224
102.	సరిగాదు వీడన వలదు	331
103.	సర్వజ్ఞత్వము వెదకగ నొల్లను	297
104.	సర్వోపాయముల జగతి నాకితడే	69
105.	శరణని బ్రతకరో జనులాల	123
106.	శరణాగత వజ్రపంజర	179
107.	హరిహరి నిను సకలాంతర్యామివి	161
108.	హరి గోవిందా హరి గోవిందా	75

ప్రార్థన

కం॥ శ్రీ పురుషోత్తముడే కద!
భూపతి లక్ష్మీవిభుండు "పొడవుకు పొడవౌ"
ఈ 'పొడుగు' కీర్తనంబుల
నే పూనుచు గొల్తునయ్య! నిన్నిటుల హరీ!

చం॥ సరసపు భక్తి కీర్తనలు స్వామి మహాత్మ్యము జెప్పు కీర్తనల్
విరివిగ జెప్పెనన్నమయ పేర్చితినొక్కెడ నెంచి వేయి, నే
హరి! అవతారికల్ మరియు అన్నిటి భావము తెచ్చి పేర్చితిన్
తిరుమలనాథ! నీ కృపనుదీటుగ జెప్పితి వేయినిన్ పదిన్.

సీ॥ తొలినాళ్ళ నాకున్న తెలిసీ తెలియనట్టి
మిడిమిడి జ్ఞానాన మేటివైన
కీర్తనంబులు ప్రక్కకిన్ బెట్టితిని కొన్ని
"పెద్దవైనాయని" వీడియంటి
చరణాలు తగ్గించి సవరించితిని కొన్ని
పరులననుకరించి వదలియుంటి
ఆనాడు వదలిన అద్భుత కీర్తనల్
తిరుగదోడెదనయ్య! తిరుమలేశ!

ఆ.వె॥ పొడవుకు పొడవైన పురుషోత్తమాయని
పేరుబెట్టి నేను పిలిచినాను
భావవివరములను వదలక జెప్పితిన్
బుధ జనులకు గూర్చు ముదము ముక్తి.

తే॥ వేయి కీర్తనలెన్నితి విశద పరచ,
భావవివరణ, దానితో పాటు తొలుత
దాని అవతారికను చెప్పి దన్యుడైతి,
ఇపుడు ఇది కొండలయ్యకే యెంత పొడవౌ!!

ఉ॥ ఏమిది నాదు భాగ్యమిక నేమనిచెప్పను దేవదేవ! నీ
కేమని మ్రొక్కెదన్ తిరుమలేశ్వర! యేమని కోరుకొందురా
నేమపు భక్తినిచ్చితివి నీపదదాస్యము నాకు జాలురా
ఓ మధుసూదనా! మదినివుండుము వూపిరి ఆగునంతకున్

తరళము॥ పొడవుకే పొడవైనవో సురపూజ్యవోపురుషోత్తమా!
పుడమి భర్తవు ఆమెపుత్రికి వున్నతంబగు భర్తవున్
తడవి అంగము వందలాదికి తాళిగట్టిన గొల్లవున్
వడిగ కోరికలిచ్చు వేంకటపర్వతేంద్రుడవోవిభో!

శా॥ కంసారిన్ మధుకైటభాంతకుని శ్రీకాంతామనోవల్లభున్
పుంసామోహను సూర్యచంద్రనయనున్ మోదంబుతో గొల్చెదన్
ఈ సామాన్యునికిన్ని యిచ్చిన ఘనున్ ఈ నూత్న యత్నంబుతో
వాసిన్‌యెన్నితి నన్నమయ్య కృతులన్ బారైన సంకీర్తనల్.

సీ॥ ఇదియపూర్వంబైన సదమల యత్నంబు
పురుషోత్తముని గొల్చు పుణ్యక్రతువు
శరణన్న వారికి పరుగిడి తోడుండు
మధుసూదనుని మ్రొక్కు మంత్రవిద్య
కరుణ జాల్వారెడి కరుణాకరుని పూజ
సలుపంగ దక్కించు సకల సుఖము
తిరుమలేశుని వేడ దీనులై దిక్కంచు
దరిచేరి కాపాడు తథ్యమిదియె

ఆ.వె॥ అరసి కరివరదుని మురహరిని దొరని
నమ్మి గొలిచి మనుడు నయము కలుగు,
ఆర్తరక్షణంబె హరికున్న నియమంబు
నన్ను నమ్ముడయ్య! వెన్నుగొలువ.

ముందుమాట

ఈ రచనకు **పొడవుకు పొడవైన పురుషోత్తమా** అని పేరు పెట్టడంలో నా అంతరార్థం ముందుగా వివరిస్తాను. పొడవైనవాడు అంటే యెత్తయినవాడు అని అర్థం. ఉన్నతుడు అన్నమాట. పొడవుకు పొడవు అంటే "ఉన్నతోన్నతుడు" అన్నమాట. పురుషోత్తముడంటే శ్రీమన్నారాయణమూర్తి. ఉన్నతోన్నతుడైన శ్రీమన్నారాయణుడు అని ఈ రచన నామకరణానికి అర్థము చెప్పుకోవచ్చును.

అన్నమాచార్యులవారి కీర్తనల ప్రత్యేకత యేమంటే ఆయన వుపయోగించిన తెలుగు మాండలికము ఆనాటి సామాన్య తెలుగువాడు మాట్లాడిన భాష. అద్దో, వోరీ, చెల్లబో, సుండీ, అమ్మరో వంటి మాటలు నేటి కాలంలో వాడుకలో లేవు. అందుచేతనే ఆ తెలుగు కీర్తనలకు కూడా వివరణ అవసరమైవున్నది. ప్రతి కీర్తనకు అవతారిక ఇవ్వటం దేనికంటే ఆ కీర్తన ప్రత్యేకతను తేటతెల్లము జేయుట.

అన్నమయ్య కీర్తనలలో నూటికి తొంబది తొమ్మిది పల్లవిలో రెండు పాదములు, మూడు చరణాలలో ఒక్కొక్కదానిలో నాలుగు పాదములు వెఱసి 14 పాదముల కీర్తన వుంటుంది. లఘు కీర్తనలలో రెండు పాదములున్న చరణాలలో కొన్ని కీర్తనలున్నాయి. కొన్ని కీర్తనలు మూడు చరణాలు కాక రెండే చరణాలతో వున్నాయి. మూడు పాదముల పల్లవిగల కీర్తనలు, ఒకే ఒక పాదం గల కీర్తనలు కూడా వున్నాయి. అన్నమయ్య, ఆయన పుత్రుడు పెదతిరుమలయ్య, మనుమడు చినతిరుమలయ్య "వేంకట" మకుటం ప్రతి కీర్తనకు చివరి చరణాలలో చేర్చి తాళ్ళపాకవారి ప్రత్యేకత చాటుకొన్నారు.

ఈ కీర్తనలను అజరామరం చేయటంలో పెనుగొండ యేలిక సాళ్వనరసింహరాయల కృషి యెనలేనిది. నిదుపాటి పలుచని రాగిరేకులు చేయించి వాటిపై కొన్ని వేల కీర్తనలు అందులోను ఆశువుగా పాడి

వినిపించిన కీర్తనలను మామూలుగ ఆరు వందల యేళ్ళనాటి ధోరణిలో తాటియాకులపై వ్రాయించడం సర్వసాధారణమే. కాని ఈ కీర్తనలు అజరామరంగా వుండాలని రాగిరేకులపై చెక్కించడం నిజంగా బృహత్తర యజ్ఞమే. రాగిరేకులపై చెక్కిన పనివారలలో కన్నడిగులు అధికులుగా వున్న ప్రాంతం అవటంవల్ల తెలుగు లిపి వచ్చిన కన్నడిగులు యెక్కువమంది ఈ కీర్తనలను చెక్కివుంటారని అందువలన మాటల మధ్యలో 'యీ' బదులు 'ఈ', పల్లవి ప్రారంభంలో "ఎక్కడ" బదులు "యెక్కడ" అని వ్రాయటం జరిగింది. ఇటువంటి యెన్నో సాధక బాధకములకోర్చి తిరుమల తిరుపతి దేవస్థానములవారు అన్నమాచార్య ప్రాజెక్టును నెలకొల్పి నరసింహరాయల కృషికి తగ్గని కృషి సలిపి ఆ సప్తగిరీంద్రునికి అన్నమయ్య పద నీరాజనాన్ని నాబోటి సామాన్యుడికి ఆలంబన అయ్యేట్లు చేశారు. వేయి కీర్తనలను వివరించడం నేను కలలో కూడా వూహించలేని దుస్సాహసమే. ఆ తిరుమల రాయడు యెంతమందిలో దూరి నాకు బాసటయై వలసిన సాయం చేశాడో చెప్పలేను.

నా ఈ ప్రస్తుత ప్రయత్నంలో, నేనింతవరకు "ఇవి పెద్ద కీర్తనలు వీటి వివరణ రెండు పేజీలలోకి తగ్గించడం సాధ్యం కాదని విడిచిపెట్టిన 'పొడుగాటి కీర్తనలను యెన్నుకొని, పేజీల నియంత్రణ పాటించకుండా సాధ్యమైనంత వివరణ ఇస్తూ అన్నమయ్య కీర్తనలకు భావవివరణ సమకూర్చాను. ఎన్ని కీర్తనలను వివరించగలనో ఆ తిరువేంకటేశ్వరునికే తెలియాలి. రోజుకొక్క కీర్తన చేయాలనే నియమం కూడా లేదు. సాధ్యమైనంత విపులంగా అవసరమైనంత క్లుప్తంగా చెప్పాలని నా ఆశ. ఇక ఆపైన శ్రీవేంకటేశ్వరుని దయ.

ఇక్కడ ఒక అతి ముఖ్యమైన విషయం ప్రస్తావించాలి. అన్నమయ్య కాలం నాటి తెలుగు నుడికారానికి నేటి తెలుగు నుడికారానికి చాలా

తేడావున్నది. ఆనాటి కొన్ని పద ప్రయోగాలు నేడు లుప్తమైనాయి. కొన్ని పద ప్రయోగాలు మార్పు చెందాయి. ఆనాడు తమిళ, కన్నడ భాషల ఒత్తిడి తెలుగుపై రాయలసీమలో యెక్కువగా వుండటం వలన కొన్ని వాడుక పదములకు అర్థములు నిఘంటువుల్లో దొరకవు. నేడు మనం "ఏమిటే?" అనే మాటను ఆ రోజుల్లో "ఏమిరే?" అనేవాళ్ళు. ఇది మనకు యెక్కడా అంతుచిక్కదు. ఉదాహరణకు ఈ రచనలోని ఒక కీర్తనలో "పుట్టుమాలిన బరుబోఁకివి అనే పదము ప్రయోగించారు. ఎన్ని నిఘంటువులు తిరగవేసినా ఫలితం సున్నా.

రాగి రేకులపై లిఖింపబడిన కీర్తనలలో కొన్ని చోట్ల "కిలుము" పట్టడంవల్ల వ్రాసిన పాఠ్యం సందిగ్ధంగా వుండే సందర్భాలు కోకొల్లలుగా వున్నాయి. కొన్ని పర్యాయములు ఆ కీర్తనలోని ఆ చరణం అసంపూర్తిగానే వుండిపోతుంది. ఒకటి రెండు అక్షరాలైతే వూహించవచ్చునుగాని అంతకెక్కువైతే కష్టమే కదా!

600 సంవత్సరాలనాటి తెలుగు పదనుడికారానికి ఇప్పటి తెలుగునుడికారానికి తేడా వుండటం వల్ల కొన్ని పదముల అర్థం మారిపోయే ప్రమాదం కూడా సాధ్యమే. ఇటువంటి సందర్భాలలో నేను ఆ వేంకటరమణునిపై భారంవేసి అప్పటికప్పుడు స్ఫురించిన భావార్థము వివరించడం జరిగింది.

ఇక్కడ ప్రస్తావిస్తున్న ఈ పొడవుకు పొడవైన పురుషోత్తమ రచనలో 108 అన్నమాచార్యులవారి సుదీర్ఘ కీర్తనలకు అవతారిక సహిత భావవివరణ అందించటం జరిగింది. కొన్ని తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారి కీర్తనలను కూడా రుచి చూపించగలగడం నా అదృష్టమే. ఈ 108లో రెండు కీర్తనలు "భావయామి వేంకటేశమ్"లో ప్రస్తావించబడినవే. కానీ అప్పుడు కీర్తనలు అంత పెద్దగావుంటే పాఠకులకు ఇబ్బందిగా వుంటుందని, నేనే రెండు కీర్తనలను కొంచెం

కుఱచ చేశాను. కానీ ఈ రచనలో వాటిని తిరిగి సుదీర్ఘ కీర్తనలుగా వివరించాను. అందుచేత ఈ అన్నమాచార్య కీర్తనా యజ్ఞంలో ఇది మూడవ పుస్తకంగా రూపుదిద్దుకొన్నది.

మొదటిపుస్తకం "భావయామి వేంకటేశమ్" దీనిలో 606 అన్నమాచార్య సంకీర్తనలు, మున్నుడి (ఉపోద్ఘాతము) భావామృతం (తాత్పర్యవివరణ) సహితముగా వివరించాను.

రెండవ పుస్తకం "హరినామమే కదా! అన్నమయ్య వరము". ఇందులో 404 అన్నమాచార్యులవారి కీర్తనలను అవతారిక (ఉపోద్ఘాతము) భావవివరణ (తాత్పర్య వివరణ) సహితముగా విరించాను. ఇదియెలా పూర్తిచేశానో ఆ ఏడుకొండలవాడికే తెలియాలి. దినదిన గండం నూరేళ్ళు ఆయుస్సులా అయింది నాపని. నాగుండెలో ఇది వరకే వున్న స్టంటుకు ఇంకొక రెండు తోడుగా వచ్చి చేరాయి. ఎన్నడు నా కలం ఆగిపోతుందో నాకే తెలియదు. అందుకనే 606 వ కీర్తన తరువాత ప్రతి 101 కీర్తనలు ఒక విడి పుస్తకంగా వేరువేరు పేర్లతో వెలువరించాను. ఆ విధంగా 4 పుస్తకాలు మళ్ళీ ఒక పుస్తకంలాగా చేయించి "హరినామమే కదా! అన్నమయ్య వరము" అని పేరుపెట్టాను. దీనితో 1010 అన్నమయ్య కీర్తనలు రెండు పుస్తకాల రూపంలో అవతరించాయి. నాశక్త్యానుసారం 30 సెట్లు తయారుచేయించాను. ఆర్థిక భారం మోయలేక టి.టి.డి. వారి సహాయం అర్థించాను. వారు సమ్మతించి దీనిని (ఈ రెండు పుస్తకాలనూ) వెలుగులోకి తెస్తామని అన్నారు. వారిపై, హరిపై భారం వేసి, ఈ నా మూడవ పుస్తకం కొనసాగించాను.

దీనితో 1116 అన్నమాచార్యులవారి సంకీర్తనా యజ్ఞం పూర్తి అయింది. శ్రీనివాస పరబ్రహ్మతోడులేక ఇది సాధ్యమయ్యేదా? అసంభవం. ఈ మూడవ పుస్తకం యెలా వెలుగులోకి వస్తుందో భారం ఆ శ్రీవేంకటేశ్వరుడికే వదలివేశాను.

ఇది ముగించేముందు నేను మనస్ఫూర్తిగా కృతజ్ఞతాపూర్వక పాదాభివందనలు చేయాల్సిన అసంఖ్యాకులలో కొందరినైనా ప్రస్తావించక ఆ అంతరాత్మకు నేను ద్రోహం చేయలేను.

1. తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి వారికి
2. సుజనరంజని – హైదరాబాద్–500 018 వారికి
3. ఈ యజ్ఞంలో నాకు ఆదినుండి వెన్నుదన్నువలె నిలిచిన నవరత్నాలకు
4. డి.టి.పి. చేయుటకు చేదోడు వాదోడైన
   శ్రీ మురళీకృష్ణ గారికి
   శ్రీ కె. వెంకటేశ్వరరావు గారికి
5. అడిగినదే తడవుగా సలహా సహాకరములందించిన అసంఖ్యాకులైన నా శ్రేయోభిలాషులకు
   అందరికీ తిరుమలనాథుని దీవెనలు లభించుగాక!



ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ...

1. **డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ**
2. **డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు**
3. **నేదునూరి కృష్ణమూర్తి గారు**
4. **గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు**
5. **గరికపాటి వెంకట్ గారు**
6. **గురు కొండవీటి జ్యోతిర్మయి గారు**
7. **శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)**
8. **ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు**
9. **శంకర చంద్ర పవన్**

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ

పొడవుకు పొడవైన పురుషోత్తమా

సంపుటి: 1 కీర్తన : అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగము
సంఖ్య : 227 పుట : 151 రాగం: మలహరి

మలహరి

1 అదె చూడు తిరువేంకటాద్రి నాలుగుయుగము-
లందు వెలుగొందీ ప్రభ మీరఁగాను ॥ పల్లవి॥

తగ నూటయిరువై యెనిమిదితిరుపతులఁ గల-
స్థానికులును చక్రవర్తిపీఠకములును
అగణితంబైన దేశాంత్రులమఠంబులును
నధికమై చెలువొందఁగాను

మిగులనున్నతములగు మేడలును మాడుగులు
మితిలేనిదివ్యతపసులున్న గృహములును
వొగి నొరగుఁబెరుమాళ్ళవునికిపట్టయి వెలయు-
దిగువతిరుపతి గడవఁగాను ॥అదె॥

పొదలి యరయోజనముపొడవుననుఁ బొలుపొంది
పదినొండుయోజనంబులపరపుననుఁ బరగి
చెదర కేపంకచూచిన మహాభూజములు
సింహశార్దూలములును

కదిసి సురవరులు కిన్నరులు కింపురుషులును
గరుడ గంధర్వయక్షులును విద్యాధరులు
విదితమై విహరించువిశ్రాంతదేశముల
వేడుకలు దైవారఁగాను ॥అదె॥

యెక్కువలకెక్కువై యెసఁగి వెలసినపెద్ద-
యెక్కు డతిశయముగా నెక్కినంతటిమీఁద
అక్కజంబైన పల్లవరాయనిమటము
అలయేట్లపేడ గడవన్
చక్కనేఁగుచు నవ్వచరిఁ గడచి హరిఁ దలఁచి
మ్రొక్కుచును మోకాళ్లముడుగు గడచినమీఁద-
నక్కడక్కడ వేంకటాద్రీశుసంపదలు
అంతంతఁ గానరాఁగాను ॥అదె॥

బుగులుకొనుపరిమళంబులపూవుఁదోఁటలును
పొందైననానావిధంబులవనంబులును
నిగిడి కిక్కిరిసి పండినమహావృక్షముల-
నీడలను నిలిచి నిలిచి

గగనంబు దాఁకి శృంగారరసభరితమై
కనకమయమైనగోపురములనుఁ జెలువొంది
జగతీధరునిదివ్యసందలుగలనగరు
సరుగననుఁ గానరాఁగాను ॥అదె॥

ప్రాకటంబై నపాపవినాశనము లోని
భరితమగుదురితములు పగలి పారుచునుండ
ఆకాశగంగతోయములు సోఁకిన భవము-
లంతంత వీఁడి పారఁగను

యీకడనుఁ గోనేట యతులుఁ బాశుపతుల్ మును-
లెన్ననగ్గలమైవున్న వైష్ణవులలో
యేకమై తిరువేంకటాద్రీశుఁడాదరిని
యేప్రొద్దు విహరించఁగాను ॥అదె॥

అవతారిక:

అక్షరములలో ఆదియైన 'అ' అనే అక్షరము నేనే అన్నాడు పరమాత్మ శ్రీమత్భగవద్గీతలో. పొడవులకు పొడవైన ఆ పురుషోత్తముని 32000 సంకీర్తనలతో కీర్తించారు అన్నమాచార్యులవారు. ఆయనదారిలోనే నడిచారు ఆయన పుత్రుడు పౌత్రుడు. ఆ అన్నమయ్య అనుయాయులు వేల సంఖ్యలో ఆయన అడుగుజాడలలో హరిదాసులైనారు. అంతులేని ఆ హరి హారంలో నేనూ ఒక చిన్నపూసనై నాజన్మకొక సార్ధకత దక్కించుకొన్నాను. వేయి కీర్తనలకు వివరణ వ్రాసి వేనామలవెన్నుని వినుతించాను. అన్నమయ్య కీర్తనలు పల్లవి, నాలుగు పాదములు గల మూడు చరణములు వెరసి పూర్తి కీర్తనగా వుంటుంది. ఈ కీర్తనలో కొన్ని రెండు చరణాలవీ వున్నాయి. కాని అంతకు యెక్కువ చరణాలు లేక అతి పొడవైన చరణాలు గలవి వున్నాయి. అట్టి పొడవైన కీర్తనల మణిహారమే మీరు చదువుతున్న "పొడవులకు పొడవైన పురుషోత్తమా!"

ఈ హారంలో ఇది మొదటి పూసవంటి కీర్తన. శ్రీవేంకటాద్రి వైశిష్ట్యాన్ని, తిరుపతి ఘనతను, శృంగారవనాల వసంతశోభను, సురులు మునులు గొలిచెడి శ్రీవేంకటేశ్వరుని తిరుమల శిఖరాల విహారము, వైష్ణవ శరణాగతులు దాసభక్తి, ఈ కీర్తనలో తనువు పులకరించేటట్లు వర్ణించబడినది. ఆ రోజుల్లో తిరుమల కొండ యెక్కుతుంటే ఎలా వుంటుందో చెప్పగలవాళ్ళు యేరీ యెక్కడున్నారు? అన్నమయ్య ఆ లోటు తీరుస్తున్నారు.

భావ వివరణ:

అదె చూడు (అదిగో చూడండి) నాలుగు యుగాలనుండి వెలుగొందుతున్న శ్రీవేంకటాద్రి ప్రభమీరగాను (వైభవము అతిశయించగా) శోభిల్లుచున్నది.

ఈ దేవదేవుని సేవించుటకు నూట ఇరవై ఎనిమిది తిరుపతులలోగల

స్థానికులందరూ విచ్చేసినారు. చక్రవర్తి పీఠమునధిరోహించిన అనేకులు విచ్చేశారు. లెక్కలేనంతమంది దేశాంతరమతాధిపతులు అధికముగా కిక్కిరిసినట్లు విచ్చేశారు, ఇక ఆ తిరుమలకొండ దిగువన తిరుపతి పట్టణమున్నది. అక్కడ మేడలు మిగులనున్నతములు (చాలా యెత్తయినవి), చక్కని మాడుగులు (సౌధములు) వున్నవి. తరగని దివ్యతపస్సులను చేసే అనేక గృహములు ఆ వూరిలో వున్నాయి. ఒగి నొరగు (వినమ్రులై ఒంగి నమస్కరించు) పెరుమాళ్ళకు (వేంకటేశ్వరస్వామికి) వునికిపట్టయిన (ఆవాసమై) వెలసివున్నదా తిరుపతి.

ఇక ఆ తిరుమల కొండయెలావున్నదంటే... అది పొదిలి అరయోజనము పొడవున పొలుసందును (అడ్డముగా ఆ కొండ వెడల్పు అరయోజనము అనగా నాలుగుమైళ్ళు వుంటుంది). ఆ కొండ చుట్టుకొలత దాదాపుగా పదకొండు యోజనాలు లేక ఎనభై ఎనిమిది మైళ్ళు వుంటుంది. ఆ కొండపై యేవైపు చూచినా, మహాభూజములు (గొప్ప వృక్షములు కనబడతాయి). అనేక సింహములు పులులు కూడా ఆ కొండపై వున్నాయి. కదిసి (చేరువయై) ఆ కొండ మీద అనేక సురవరులు (దేవతాప్రముఖులు) వుంటారు. కాకపోతే వారు మనవంటి మానవులకు కనుపించరు. ఆ దేవగణములలో అనేక మంది కిన్నరులు, కింపురుషులు, గరుడులు, గంధర్వులు, యక్షులు విద్యాధరులు విదితమై (బాహాటంగా) విశ్రాంతి ప్రదేశములలో విహరిస్తుంటారు. వారంతా వేడుకలదైవారుతుంటారు (మునిగి తేలుతుంటారు).

ఎక్కువలకెక్కువై (ఎక్కుటకు యెంతో ప్రయాసకరమై) అతిశయముగా వెలసినదా కొండ. ఎట్లాగో శ్రమలకోర్చి దానినెక్కినంత, దానిమీద ఆశ్చర్యకరమైనట్టి పల్లవరాజుల మఠము దర్శనమిస్తుంది. ఆ ప్రాంతాన్ని ఏట్లపేడగడప అంటారు. అక్కడనుంచి తిన్నగా వెళ్ళితే 'నవ్వచరి' అనే ప్రాంతం వస్తుంది. దాన్ని దాటి గోవిందా! ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా! అని హరినామ సంకీర్తన చేస్తూ, మొక్కుతూ మోకాళ్ళముడుగు (మోకాళ్ళపర్వతం) చేరుతాం. దాన్ని గడచిన మీదట (యెక్కిన తరువాత)

అక్కడక్కడ వేంకటేశ్వరుని ఆలయ ఘోష లీలగా వినబడుతుంటుంది. ఆలయ వైభవం అంతంత (అక్కడల్లంతదూరాన్నుంచే) గానరాగా (కనబడుతుంటే) ఆనందంతో ఒళ్ళు పులకరిస్తుంటుంది. శ్రమ ఫలించబోతున్నదే అనే ఆనందంతో ఉత్సాహం ఉరకలు వేస్తుంటుంది.

అక్కడ, బుగులుకొను పరిమళంబులు (వ్యాపించెడి సువాసనలను) వెదజల్లు పూలతోటలు కనువిందు చేస్తాయి. పొందుగా శోభిల్లుతున్న నానావిధములైన తోటు కనువిందు చేస్తాయి. పెద్దపెద్ద పండ్లు బాగా పండిన ఫలములు కిక్కిరిసి దట్టముగానున్న వృక్షములు అటు ఆకలినీ తీరుస్తాయి, ఇటు సేదతీరే నీడను ప్రసాదించి యెండను తట్టుకొనేట్లు చేస్తుంది. అక్కడ కనువిందు చేసే విధంగా ఆకాశమునంటు శృంగార రసభరితమైన బంగారు గోపురములు దర్శనమిస్తాయి. అక్కడనుంచి శోభాయమానమైన జగతీవరుని (భూకాంతుని) దివ్యసంపదల వైభవాన్ని చాటే తిరుమల నగరి దర్శనమిస్తుంది. సరుగున ఆ విధముగా వర్ధిల్లుతూ ఆయల దర్శనము కలుగుతుంది.

ఆచోట, ప్రాకటంబై (ప్రసిద్ధమై) పాపవినాశనము అను జలపాతము పరమపునీతమై ప్రవహించుచుండును. అందులో స్నానము చేసినవారి పాపములన్నియు పటాపంచలైపోవును. ఆ ప్రాంతాలలోనే కల ఆకాశగంగ అను యెత్తైన జలధారలో పవిత్రస్నానమాచరించిన కలిగే పుణ్యం చెప్పనలవికాదు. ఆ నీరు మనవంటిని సోకినంతనే భవములన్నియు (పుట్టుకలకు మూలకారణమైన పాపములన్నియు) పటాపంచలైపోవును. ఇదిగో ఈ దివ్యమైన స్వామి పుష్కరిణి అనే కోనేరు. ఆనందనిలయమున కెదురుగానున్న దీనిలో యతీంద్రులు, పాశుపతి (పరమశివుడు) మునులు, అగ్గలమై (అధికముగావున్న) వైష్ణవులతోపాటు మేమును, యేకమై స్నానాదికములాచరించి తరించితిమి.

అదిగో ఆనందనిలయ స్వర్గశిఖరము. శ్రీవేంకటేశ్వరుని పవిత్ర నివాసమదియే. ఆ దరిని (ఆ తావులో) ఆయన యెప్పుడూ విహరిస్తుంటాడు.

సంపుటి: 1 కీర్తన : నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు
సంఖ్య : 75 పుట : 51 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

2 నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముఁడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం-
స్తుత్యుఁ డీతిరువేంకటాద్రివిభుఁడు ॥ పల్లవి॥

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాతఁ-
డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాతఁ-
డేమూర్తి నిజమోక్షమియ్యఁజాలెడునాతఁ-
డేమూర్తి లోకైకహితుఁడు
యేమూర్తి నిజమూర్తి యేమూర్తియునుఁగాఁడు
యేమూర్తి త్రైమూర్తు లేకమైనయాతఁ-
డేమూర్తి సర్వాత్ముఁ డేమూర్తి పరమాత్ముఁ-
డామూర్తి తిరువేంకటాద్రివిభుఁడు ॥నిత్యా॥

యేదేవుదేహమున నిన్నియును జన్మించె
నే దేవుదేహమున నిన్నియును నణఁగె మరి
యే దేవువిగ్రహం బీ సకల మింతయును
యేదేవునేత్రంబు లినచంద్రులు
యేదేవుఁ డీజీవులిన్నింటిలో నుండు
నేదేవుచైతన్య మిన్నిటికి నాధార-
మేదేవుఁ డవ్యక్తుఁ డేదేవుఁ డద్వంద్వుఁం-
డాదేవుఁ డీవేంకటాద్రి విభుఁడు ॥నిత్యా॥

యేవేల్పుపాదయుగ మిలయునాకాశంబు
యేవేల్పు పాదకేశాంతం బనంతంబు
యేవేల్పు నిశ్వాస మీమహామారుతము
యేవేల్పునిజదాసు లీపుణ్యులు
యేవేల్పు సర్వేశుఁ డేవేల్పు పరమేశుఁ-
డేవేల్పు భువనైకహితమనోభావకుఁడు
యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము
ఆవేల్పు తిరువేంకటాద్రివిభుఁడు **॥నిత్యా॥75**

అవతారిక:

శ్రీ వేంకటాద్రి విభునిపై మధురాతిమధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తన వివరణ ఇదివరలో నేను "భావయామి వేంకటేశమ్‌లో ఇవ్వటం జరిగింది. ఇప్పుడు మళ్ళీ ఇట్లా ప్రస్తావించటానికి కారణమేమంటే అప్పుడు దానినెంపిక చేసిన సంకలనంలో ఈ కీర్తన పొడుగు యెక్కువైనదని ఒక చరణం తీసివేయబడినది. అది ఈ సంకలనంలోని ఈ కీర్తనలో జతపరచి పెద్ద కీర్తననందిస్తున్నాను. ఎందుకంటే, దీనిపేరే పొడవుకు పొడవైన పురుషోత్తముడు కదా! ఇది ఎంత మధురమైన కీర్తన అంటే కొంతమంది సినీరచయితలు ఈ బాణీని వుపయోగించుకొన్నారు. ఒకసారి పరిశీలించి చూస్తే నేను చెప్పేది మీకే అర్థమవుతుంది. అవతల శ్రోతను అంతగా ఆకర్షించగల కీర్తన ఇది. ఈ వేంకటేశ్వరుడు నిత్యుడు. ఆత్మస్వరూపంలో మన అంతరాత్మలో నిత్యమూ మన వెంటనే వుండి నడిపిస్తున్నాడు. మనందరి చేత సంస్తుతి చేయబడుచున్న ఈ ప్రత్యక్షదైవమే త్రిమూర్తుల మూలమైన పరబ్రహ్మ. ఈయనే విశ్వరూపుడు. ఈయనే త్రివిక్రముడు. ఈయన కనుగవ సూర్యచంద్రులు. అణురూపుడూ ఈయనే దశావతారమూర్తీ ఈయనే.

భావ వివరణ:

నిత్యమూ మన అంతరాత్మరూపంలో మనలో వుండే ఈ దేవదేవుడు నిత్యుడు (భూత భవిష్యద్వర్తమానకాలములలో వుండేవాడు). ఈ సత్యాత్ముని లక్షణమే సత్యము. ఈయనే ప్రత్యక్ష దైవమైన పరబ్రహ్మ. ఈ తిరువేంకటాచలపతి, అశేష శరణాగతుల చేత బాగుగా స్తుతించబడుతున్న సంస్తుత్యుడు.

ఈ మూర్తి లోకములన్నింటిని పరిపాలిస్తాడో ఆతడీయనే. ఏమూర్తిని బ్రహ్మాది దేవతలు యేమిటి యెంత వెదకినా కనబడడేమని ఆతృతతో వెదుకుతారో ఆతడీయనే. ఏమూర్తి జీవులకు నిజమైన ముక్తి నొసగు సమర్థత కలిగియుంటాడో ఆతడీయనే. ఏమూర్తి అన్ని లోకములకు రక్షణరూపంలో హితము నొసగుతాడో ఆతడీయనే.

ఏమూర్తి నిజమైన మూర్తియో ఆతడీయనే. ఏమూర్తియునూకాని నిరాకార పరబ్రహ్మ కూడా ఈయనే. త్రైమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) ఏకమైన మూర్తి యెవడో ఆతడీయనే. ఏమూర్తి సర్వ ఆత్మలలో నెలకొని యున్నాడో ఆతడీయనే. ఏమూర్తిని అంతా పరమాత్మ అని కీర్తించెదరో ఈయనే ఆ మూర్తి. నేడు మనకనుల యెదుట తిరువేంకటేశ్వరునిగా కనుపించుచున్న ఈ మూర్తియే ఆమూర్తులన్నిటికీ మూలపుమూర్తి.

ఏ దేవుని యొక్క దేహము నుంచి ఈ సృష్టిలోని ప్రతి యొక్కటి ఆవిర్భవించెనో ఆతడీయనే. ఏదేవుని దేహములో ఆపుట్టినవన్నీ తిరిగి అణగారి పోతున్నాయో ఆతడునూ ఈయనే. ఏదేవుని విగ్రహములో నుండి సనక సనందనాది ఋషులవంటి వారే కాక సమస్త జీవకోటి పుట్టినదో ఆతడీయనే. ఏదేవుని కన్నులలో ఒకటి సూర్యుడు ఇంకొకటి చంద్రునిగా వెలుగొందుతున్నాయో ఆదేవుడితడేయని గ్రహించండి.

ఏదేవుడీ జీవులన్నింటిలోనూ వున్నాడో ఆతడీతడే. ఏదేవుని యొక్క చైతన్యమీ జీవులన్నిటికీ కదలికనిచ్చుచున్నదో ఆతడితడే. ఏదేవుడు అవ్యక్తుడో (స్పష్టముగా ఇది అని చెప్పలేమో) ఆతడీయనే. ఏదేవుడు అద్వంద్వుడో (ద్వంద్వభావము లేక ఎప్పుడూ ఒకే భావముతో వుంటాడో) ఆతడీయనే. ఆదేవుడే నేడు మన కన్నులయెదుట పురుషోత్తముడై దర్శనమిస్తున్న తిరువేంకటాచలాధిపుడు.

త్రివిక్రముడైనప్పుడు ఏ వేల్పు యొక్క పాదయుగము (పాదముల జంట) ఒకటి ఆకాశమంతయూ ఆవరించి ఇంకొకటి భూమినంతయు యేమాత్రమూ సందులేక ఆక్రమించినదో ఆతడీయనే. విరాట్పురుషుడై విశ్వరూపం చూసినప్పుడు ఏవేల్పు యొక్క పాదకేశములయొక్క అంతరములు (వివిధ కేశములు) ఒక్కొక్క విశ్వముగా వెలసి అనంతకోటి విశ్వములు ఒకే మూర్తిలో కనబడినవో ఆ వేల్పు ఇతడే. ఏవేల్పు యొక్క నిశ్వాసమే అనంతప్రళయ ఝుంఝూమారుతమై జీవకోటిని అల్లకల్లోలము చేయగలడో ఆతడీయనే. గొప్ప పుణ్యులైన ఈ సమస్త హరిదాసులు యేవేల్పుని నిజదాసులో ఆతడీయనే. సర్వేశ్వరుడు, పరమేశ్వరుడు అని యేవేల్పు పిలువబడుచున్నాడో ఆతడీయనే. ఏవేల్పు భువనముల కన్నింటికీ ఒకే ఒక్క హితుడైయున్నాడో ఆతడితడే. ఏవేల్పు కడు సూక్ష్మమైన అణురూపుడుగానూ కడఘనమైన అనంతరూపునిగానూ వున్నాడో ఆవేల్పు ఇదిగో మన కన్నులయెదుటనున్న తిరువేంకటాచలపతి అయిన శ్రీవేంకటేశ్వరుడు. ఈయనను శరణనండి.

సంపుటి: 1 కీర్తన : ఘోరవిదారణ నారసింహ నీ-
సంఖ్య : 67 పుట : 46 రాగం: నాట

నాట

3 ఘోరవిదారణ నారసింహ నీ-
వీరూపముతో నెట్లుండితివో ॥ పల్లవి॥

ఉడికెడికోపపుటూర్పులc గొండలు
పొడివొడియై నభమునకెగయ
బెడిదపురవమున పిడుగడులు దొరుగcగ
యెడనెడ నీ వపు డెట్టుండితివో. ॥ఘోర॥

కాలానలములు గక్కుచు నయన-
జ్వాలల నిప్పులు చల్లుచును
భాలాక్షముతో బ్రహ్మాండకోట్ల-
కేలికవై నీ వెట్లుండితివో. ॥ఘోర॥

గుటగుటరవములు కుత్తికc గులుకుచు
గిటగిటc బండ్లు గీcటుచును
తటతటc బెదవులు దవడలు వణcకcగ
ఇటవలె నీ వపుడెట్లుండితివో ॥ఘోర॥

గోళ్ళ మెఱుcగుల కొంకుల పెదపెద-
వేళ్ళ దిక్కులు వెదకుచును
నీళ్ళతీగెలు నిగుడcగ నోర ను-
చ్చిళ్ళ గమ్మcగ నెట్లుండితివో. ॥ఘోర॥

హిరణ్యకశిపునినే పడఁచి భయం-
కర రూపముతోఁ గడుమెరసి
తిరువేంకటగిరి దేఁవుడు నీవిఁక
యిరవు కొన్ననాఁడెట్లుండితివో ॥ఘోర॥

అవతారిక:

విదారణము అంటే వధించుట అని అర్థం. ఘోరవిదారణ అంటే అతి భయంకరగా వధించువాడని అర్థం. ఓ నరసింహా! ఇంత భయంకరమైన యీ రూపముతో యెట్లావున్నావయ్యా! అంటున్నారు అన్నమాచార్యులవారు. ఆ భీకరాకారుని వర్ణన వర్ణనాతీతమనిపిస్తున్నది కదా! తొలి పాదం చూడండి "సలసల కాగిపోయే కోపము వలన వెలువడిన నిస్వాసములు కొండలను కూడా నుగ్గునుగ్గు చేయగ ఆ పొడి ఆ నిట్టూర్పు వేగానికి ఆకాశానికెగసిపడుచున్నది". ఇట్లాంటివి ఇంకా పదివున్నాయి, ఈ కీర్తనలో ఆయన నోరు తెరిస్తే చొంగ తీగలుగా సాగి వ్యాపించిందిట. నోటినిండా వుమ్మికమ్ముకుందట. అంతా ఇక్కడే చెప్తే కీర్తన స్ఫూర్తి తగ్గుతుంది. భావవివరణ చదివి పూర్తి ఆనందం మీ స్వంతం చేసుకోండి.

కొంత ఉపోద్ఘాతము ఇస్తే ఈ కీర్తన ఔచిత్యం ఇంకా పెరుగుతుందనిపిస్తోంది. తన ప్రియభక్తుడైన ప్రహ్లాదుని చిత్రహింసలకు గురిచేసిన హిరణ్యకశిపునిపై అలవిమాలిన కోపం వచ్చింది శ్రీహరికి. వాడిని వధించుటకు నృసింహుడై వాడి వరముల కనుగుణంగానే వాడిని తన తొడపై నిడుకొని, గడపలో నిలిచి, యే ఆయుధములూ లేక గోళ్ళతోనే చీల్చి విరజిమ్మే రక్తం క్రిందపడకుండా జుట్టి, సంధ్యాసమయంలో చంపివేశాడు. ఆయన అర్ధాంగి శ్రీలక్ష్మి కూడా

భయంతో బిత్తరబోయింది. ఆనాటి ఆ వధా సమయంలో నీవెట్లుండితివో అని మరీ వర్ణిస్తున్నారు అన్నమయ్య. మీకెవరికన్నా నవరసాలలో రౌద్ర రసం యెట్లా వుంటుందనే సందేహం వస్తే ఈ కీర్తన చదవండి.

భావ వివరణ:

ఓ ఘోర విదారణ నారసింహా! (భయంకరముగా వధించు ఉగ్రరూపముకల నరసింహదేవా!) నీవు ఈ రూపముతో ఇంత భయానకంగా యెట్లుంటివయ్యా?

కోపముతో వుడికిపోవుచున్న నీవూర్పుల (వేడి నిశ్వాసములలో) కొండలు (కులపర్వతములు) పొడివొడియై (చూరగా పొడియైపోయి) నభముకెగయ (ఆకాశవీధిని విరజిమ్మింది.) నీ బెడిదపు రవమున (భయంకరమైన కంఠస్వరమున) పిడుగులు దొరగగ (పిడుగులు రాలిన ధ్వని పొడజూపినది). ఇది పురాణేతిహాసములద్వారా మేము నేర్చిన వూహయే. కానీ యెడనెడ (ఆయాసమయాల్లో) నీవు యెట్లుండితవో (యెట్లావున్నావో కదా!)

ఈ నృశింహుడు (అహోబల నరసింహుడు) జ్వాలానృసింహుడు. భయంకరమైన అగ్నికీలలు నోటినుండి విరజిమ్మపడుతుండగా హిరిణ్యకశిపుని వధించి ప్రహ్లాదుని రక్షించుటకు వెలసిన ఈస్వామి కాలానలము (కాలగ్నిని), గక్కున (ఒక్కమాటుగా) వెదజల్లుతూ జ్వలించు కన్నులు నిప్పులు గక్కుచుండగా ఫాలాక్షముతో (నెన్నుదుట మూడవ కంటితో) అనంతకోటి బ్రహ్మాండములకు నీవు యేలికవని అందరూ కీర్తించగా ఆనాడు నీవు యెట్లుంటివో కదా!

ప్రభూ! నారసింహా! నీవు హిరిణ్యకశిపుని కుత్తికను చీల్చి కులుకుచు (రక్తము వెదజల్లుతూ) మళ్లీ నేలరాలకుండా గుటగుట ధ్వని వస్తుంటే

జుఱ్ఱుకొంటూ, కోపమాగక దంతములను గిటగిట ధ్వనివచ్చునట్లు గీటుచును (నూరుకొంటూ) వున్నావు. నీ ఆవేశం కట్టలు తెంచుకొని వస్తుంటే నీ దవడలు వణికి ఒకదానికొకటి తగిలిన నీ పెదవుల నుండి "తటతట"మను ధ్వని వస్తున్నది. ఇంత బీభత్సాకారముతో ఆనాడు నీవు యెట్లుంటివయ్యా నరహరీ!

స్వామి భయంకరమైన జూలు ఆయన కళ్ళకు అడ్డముపడి దిక్కులు కనబడకుండా పోతున్నాయి. పెదపెద (బాగా పొడుగైన) వ్రేళ్ళకున్న కొంకుల గోళ్ళు (వంకరలు తిరిగిన నఖములు) మెరుస్తుంటే... ఆ కాంతికి అంతా స్పష్టంగా కనబడుతున్నది. ఒక్కసారి ఆయన భయంకరమైన నోరు చూడండి. ఆయన నోటినుంచి రక్తంతో తడిసిన చొంగకారి, ఆ చొంగ నీరు ఆయన నోరు తెరచినప్పుడు తీగెలవలె సాగి ఆ నోటిలో వుచ్చిళ్ళు (వుమ్మి) ఆయన ముఖమునంతా కమ్ముకొన్నది. జుగుప్సాకరమైన ఆ ఆకృతితో అపుడెట్లుంటివయ్యా! ఉగ్రనారసింహా!

అప్పుడా నారసింహుడు దుష్ట హిరణ్యకశిపుని ఆ విధముగా ఏపడచి (ఏడిపించి) భయంకరమైన రూపముతో కడుమెరసె (గొప్పగా మెఱసి పోయాడు). ఓ తిరువేంకటాచలాధిపా! నేడు ఇట్లా గంభీర శాంతమూర్తిలా మా కన్నులముందు దర్శనమిస్తున్నావు కానీ ఆనాటి నీ ఉగ్ర నరసింహావతారములో మాత్రం యెట్లుంటివో, మా వూహకందుటలేదు తండ్రీ! లోకాల రక్షకుడే భక్షకుడైతే, శాంతాకారుడు క్రాంతికారుడైతే ఎవ్వరు చేయగలిగిందేముంది? శరణు శరణు సురేంద్ర సన్నుత... అంటూ శరణు వేడటమే దారి.

సంపుటి: 1 కీర్తన : జీవాతుమైయుండు చిలుకా నీ–
సంఖ్య : 50 పుట : 32 రాగం: ఆహిరి

ఆహిరి

4 జీవాతుమై యుండు చిలుకా నీ–
వావలికి పరమాత్ముఁడై యుండు చిలుకా ॥ పల్లవి॥

అతుమపంజరములోన నయమున నుండి నా–
చేతనే పెరిగిన చిలుకా
జాతిగాఁ గర్మపుసంకెళ్లఁబడి కాలఁ
జేతఁ బేదైతివే చిలుకా

భాతిగాఁ జదువులు పగలురేలును నా–
చేత నేరిచినట్టి చిలుకా
రీతిగా దేహంపురెక్కలచాటున నుండి
సీతుకోరువలేని చిలుకా ॥జీవా॥

బెదరి అయిదుగురికిని భీతిఁబొందుచుఁ గడుఁ–
జెదరఁగఁ జూతువే చిలుకా
అదయులయ్యినశత్రులారుగురికిఁగాక
అడిచిపడుదువే నీవు చిలుకా

వదల కిటు యాహోరవాంఛ నటు పదివేలు–
వదరులు వదరేటి చిలుకా
తుదలేని మమతలు తోరమ్ము సేసి నా–
తోఁగూడి మెలగిన చిలుకా ॥జీవా॥

నీవన నెవ్వరు నేనన నెవ్వరు
నీవే నేనై యుండుఁ జిలుకా
శ్రీవేంకటాద్రిపై చిత్తములో నుండి

సేవించు కొని గట్టి చిలుకా

దైవమానుషములు తలఁపించి యెపుడు నా-
తలఁపునఁబాయని చిలుకా
యేవియును నిజముగా వివి యేఁవిటికని నాకు
నెఱిఁగించి నటువంటి చిలుకా ॥జీవా॥50

అవతారిక:

భారతీయ తత్త్వవేత్తలు 'నేను' అనేది శరీరం కాదని, దాంట్లో స్థితుడైవున్న చైతన్య స్వరూపుడే ఆత్మ అనీ, వాడు వున్నంతవరకే ఈ శరీరానికి 'నేను' వర్తిస్తుందనీ ఆ చైతన్యం పోతే నేను అనేది కట్టెల్లో కాలిపోయే ఇంకొక 'కట్టే' అని యేనాడో చెప్పారు. చైతన్యస్వరూపుడైన ఆత్మ వివిధాత్మలుగా కనుపించుచున్నా వీటిమూలము పరమాత్మనుంచి వచ్చిందే. చివరికి యేదో వొక నాటికి అది మళ్ళీ ఆ పరమాత్మలో కలుస్తుంది. అంతదాకా ఆత్మ అనేక భ్రమలకు లోనై అనేక వికారములు పొంది, అరిషడ్వర్గాలకు లోనై, త్రిగుణాత్మకమై, పంచేంద్రియములవశుడై పాపపుణ్యములు చేస్తూ జీవితవైకుంఠపాళి ఆటలో ఆశల నిచ్చెనలెక్కుతూ వైఫల్యాలనే పాములతో కరిపించుకొంటూ దినదినగండం నూరేళ్ళ ఆయుస్సు వలె బ్రతుకు నెట్టుకొస్తున్నాడు.

భారతీయ తత్త్వవేత్తలు పరమాత్మను హంసతోను, ఆత్మను చిలుకతోను పోలుస్తూ అనేక తత్త్వ బోధనాగీతములాలపించారు. హంసయుక్తాయుక్త విచక్షణగల పక్షి అని, చిలుక యుక్తాయుక్త విచక్షణలేక తుర్రున యెగిరిపోయే గుణంకల పక్షి అనీ, కొరికే పండును కూడా పూర్తిగా కొరక కుండానే యెంగిలి చేసి వదిలేసే చపలత్వంగల పక్షి అనీ అలా పోల్చివుంటారేమో. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు జీవాత్మవై

మాలోవున్న చిలుకా నీవు ఆవలికి (అసలుకి) పరమాత్మవైయుంటివే. కానీ అజ్ఞానం వల్ల భ్రాంతికి గురియై పంచేంద్రియాలకు వశమై, అరిషడ్వర్గాలకు లొంగి తన పరమాత్మ తత్త్వం మరచిపోయి కేవలం జీవ భ్రమతో చిలుకలాగా స్థిరత్వం లేక సతమతమవుతున్నాడు. అద్భుతమైన తత్త్వగీతం ఈ కీర్తన.

భావ వివరణ:

ఓ చిలుకా! నువు జీవాత్మవైవున్న చిలుకవు. ఆవలికి (అటువైపు నుంచి చూస్తే) నిజానికి నీవు పరమాత్మవే. కాని అజ్ఞానం వలన నీవు పరమాత్మవని గ్రహింపలేకున్నావు.

ఓ చిలుకా! నీవు ఆత్మ అనే పంజరంలో చక్కగా ఇరుక్కుపోయావు. నిన్ను పెంచింది కూడా వేరెవరో కాదు, నేనే. నీకీ బంధింపు యెందుకువచ్చినదో తెలుసా? నీవు చేసిన కర్మల పర్యవసానంగా "కాలఁజేతఁ బేదైతివి" (కాళ్ళూ చేతులూ ఆడని అశక్తురాలివయ్యావు). నీకుగా నీవే సంకెళ్ళలో బంధింపబడ్డావు.

ఓ చిలుకా! రేయింబవళ్ళు నాచేత విద్యలు చదివించుకొని, భాతిగా (విధాయకముగా) నేర్చావు. నీ దేహంలోవున్న రెక్కల చాటున వెచ్చని రీతిగా వున్నావు. బాగానే వున్నది. కాని నీవు సీతు కోరువలేవు (శీతోష్ణముల హెచ్చుతగ్గులకు సహించలేవు). అనగా నీవు కష్టనష్టములకు ఓర్వలేని చిలుకవు.

ఓ చిలుకా! నీకు అయిదుగురు జులాయి స్నేహితులు వున్నారు. వాళ్ళు నిన్ను అదిలించి బెదిరించి తమ పంతం నెగ్గించుకొంటారు. నువ్వు ఇలా యెంతకాలం వాళ్ళకి భయపడుతూ బెదరిపోతూ వుంటావే చిలుకా? (సుఖ భ్రాంతిని కలుగజేసే పంచేంద్రియాలను ప్రస్తావిస్తున్నారు అన్నమయ్య).

ఓ చిలుకా దయ అనేమాట నెరుగని ఆరుగురు శత్రువులు నిన్ను అడిచిపెట్టాలని చూస్తూనేవున్నారు (వాళ్ళే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు). వాళ్ళ వలన నీకేనాటికైనా ముప్పు తప్పదు. ఓ చిలుకా! నీకు ఇంకొక బలహీనత వుంది. ఆహారం లేకపోతే వుండలేవు. దానికోసం పదివేల అనవసర ప్రసంగాలు చేస్తావు. అడ్డమైన వాగుడు వాగుతావు. ఓ చిలుకా! నీవు అందరితో అనుబంధాలను పెంచుకొని తోరమ్ము (అధికమైన అనురాగంతో) మెలగి చివరికి నష్టపోతావు. విచిత్రమేమంటే ఒకసారి నష్టపోయినా బుద్ధి తెచ్చుకోవు.

ఓ చిలుకా! ఒకసారి వివేకంతో ఆలోచించు. నీవంటే యెవరు? నేనంటే యెవరు? నీవే నేనూ, నేనే నీవు (ఆత్మలన్నీ ఒక్కటే, అవి వేరువేరనేదే భ్రాంతి). మనందరికీ అంతరాత్ముడు. ఆ శ్రీవేంకటేశ్వరుడు. ఆయనను నీ చిత్తములో నిలుపుకొని సేవించుకొని, గట్టిపడు (స్థిరపడు).

ఓ చిలుకా! నీకు జరిగే సంఘటనలు కొన్ని 'మానుషాలు' (మనిషి చేసినందువల్ల సంభవిస్తాయి). అవి వాళ్ళు తమంతతామే చేసినవో లేక నీ చర్యకు ప్రతిచర్యగా చేసినవో అయివుంటాయి. వీటిని కొంత సవరించుకోగలవేమో? కాని నీకు కొన్ని దైవికంగా జరుగతాయి. దానినే ప్రారబ్ధము అంటారు. అవి ఆ దైవము నిర్దేశించినట్లు నీ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేక జరుగుతుంటాయి. ఇది ఆ స్వామి లీల. కావున నన్ను నీ తలపులనుండి బాయకు. ఆ స్వామిని వదలకు. ఇవేవీ నిజము కావని తెలుసుకొనేట్లు చేసి ఇవన్నీ వ్యర్థమని గ్రహించునట్లు చేశావు. అటువంటి ఓ చిలుకా! నీకు ఋణపడివున్నాను.

సంపుటి: 1 కీర్తన : వెఱతు వెఱతు నిండు వేడుకపడనిట్టి-
సంఖ్య : 235 పుట : 157 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

5 వెఱతు వెఱతు నిండువేడుకపడ నిట్టి-
కుఱుచబుద్దుల నెట్టు గూడుదునయ్య ॥పల్లవి॥

దేహమిచ్చినవానిఁ దివిరి చంపెడువాఁడు
ద్రోహిగాక నేఁడు దొరయట
ఆహికముగ నిట్టి అధమవ్రిత్తికి నే
సాహసమున నెట్టు చాలుదునయ్య ॥వెఱ॥

తోడఁబుట్టినవాని తొడరి చంపెడువాఁడు
చూడ దుష్టుఁడుగాక సుకృతియట
పాడైనయిటువంటిపాపబుద్ధులు సేసి
నీడ నిలువ నెట్టు నేరుతునయ్య ॥వెఱ॥

కొడుకు నున్నతమతిఁ గోరి చంపెడువాఁడు
కడుఁబాతకుఁడుగాక ఘనుఁడట
కడలేనియిటువంటి కలుష వ్రిత్తికి నాత్మ
వొడఁబరపఁగ నె ట్లోపుదునయ్య ॥వెఱ॥

తల్లిఁ జంపెడువాఁడు తలఁప దుష్టుఁడుగాక
యెల్లవారలకెల్ల నెక్కుడట
కల్లరియనుచు లోకము రోయుపని యిది
చెల్లఁబో నే నేమిసేయుదునయ్య ॥వెఱ॥

యింటివేలుపు వేంకటేశ్వరుఁ దనవెంట-
వెంటఁ దిప్పెడువాఁడు విభుఁడట
దంటనై యాతనిదాసానుదాసినై
వొంటినుండెద నేమి నొల్లనోయయ్య ॥వెఱ॥

అవతారిక:

మనుష్యులు సాధారణంగా ఇంకొకరిని ఆక్షేపించేటప్పుడు "మా ఇంటావంటా అటువంటి బుద్ధులు లేవు అబ్బో! మీ అంత గొప్పతనం మాకెక్కడిది?" అని దెప్పిపొడుస్తూ వుంటారు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు భగవంతునే దెప్పి పొడుస్తూ తన గురువు రామానుజాచార్యులవారు భగవంతునికంటే గొప్పవాడన్నారు. యెందుకంటె ఆయన తిరువేంకటేశుని కూడా తనవెంట దిప్పుకోగల సమర్థుడట.

శ్రీహరి దుష్ట శిక్షణ అనే నెపంతోను ధర్మనిర్వహణ అనే నెపంతోను తండ్రిని చంపాడు, తల్లిని చంపాడు, అన్నను చంపాడు, కొడుకును చంపాడు. ఆ మాటకొస్తే యెవ్వరినైనా, యెన్నో వుపాయాలతో మోసంచేసి చంపాడు. భాగవతం చదివితే అన్నీ ఆయన మోసంచేసిన కథలే. కాకపోతే ఆ కథలన్నీ "నిండువేడుకతో" వుంటాయి. ఈ శ్రీహరి బుద్ధులు చూడబోతే కొంచెపు బుద్ధులుగా కనబడుతున్నాయి. ఇటువంటి వాడిని నిన్నెట్లు కూడెదనయ్యా? నీవంటేనే వెఱతు వెఱతు (భయం భయంగా) వున్నది అంటున్నారు. ఇటువంటి ప్రక్రియను నిందాస్తుతి అంటారు. ఈ కీర్తన ప్రత్యేకత బహు అరుదుగా నిందాస్తుతని వుపయోగించే తాళ్ళపాక పదకవితాపితామహుడు తన ఇంటివేలుపుపై ఈ ప్రక్రియ చేయటం ఇందులోని కథలు నేటి తరానికి అంతుచిక్కని ప్రహేళికలు.

భావ వివరణ:

అయ్యా! (ఓప్రభూ!) నువ్వు ఇట్టి కుఱుచబుద్ధుల (దోషభూయిష్టమైన) తక్కువ బుద్ధులు వున్నవాడివి. నిండువేడుకన్ యెట్టుగూడుదును (పూర్తి సంతోషంతో నిన్ను యెట్లా నమ్మి నీతో స్నేహం చేయమంటావు చెప్పు స్వామీ!) నీవంటేనే వెఱతు వెఱతు (భయం భయంగా వున్నది).

దేహమిచ్చినవాని దివిరి చంపెడువాడు ఈ స్వామి. (ఆనాడు పరమశివుణ్ణి గజాసురుడు తన దేహంలోనే వుండిపొమ్మని కోరుకుంటే ఆ భోళాశంకరుడు వాడికా వరము నిచ్చేసి వాడి దేహంలోనే వుండిపోయాడు. కాలాంతకుడు లేక మరణాలు కరువైనాయి. పార్వతి దు:ఖం చూడలేక విష్ణువు నందిని గంగిరెద్దులా

అలంకరింపించి బ్రహ్మాది దేవతలతోపాటు గజాసురుని వద్దకు గంగిరెద్దు మేళగాళ్ళవలె వెళ్ళి నంది ఆటతో గజాసురుని మెప్పించి వరం కోరుకొమ్మంటే నీదేహం వరంగా ఇయ్యి నాకు అందులో వున్న శివుడు కావాలని వరము అడిగాడు. సరే దేహం తీసికోమని వాడు వరమివ్వగానే నందితో వాడిని చీల్పించి చంపాడు శ్రీహరి. ఇదీ ఆ కథ. నమ్మినవారిని చంపిన అటువంటి ద్రోహిగాక మరి యెవరు ఆయన? కాని ఆయనే "దొర"యట. (జగదీశ్వరుడట). ఆహికముగ (జ్వరమువలె పీడించు) ఇట్టి అధమవ్రిత్తికి (మర్యాదతక్కువ పనికి) నేను సాహసమున యెట్లు చాలుదును తండ్రీ! నీకు నీవేసాటి.

తోడబుట్టినవాని తొడరి జంపెడువాడు ఈస్వామి. ఈ మహానుభావుడు తన తోడబుట్టినవాని (తనతోపాటు ఒకే తండ్రికి పుట్టినవానిని) తొడరి (గొప్ప ప్రయత్నంతో యెదిరించి) చంపాడు. ఆ కథ వినండి. వామనమూర్తియైన ఈ శ్రీహరి తండ్రి కశ్యప ప్రజాపతి. ఆయనకు దితి వలన పుట్టిన పెద్దకొడుకు హిరణ్యకశిపుడు. వాడికి బ్రహ్మ చావులేని వరం ఇయ్యటానికి కుదరదు వేరే వరం కోరుకోమన్నాడు. వాడు కష్టపడి ఆలోచించి ఏ దేవతలవల్ల, దేవజాతులవల్ల, నర, మృగ, ఖగ, కీటక జాతులవల్ల, భూమిపైనకాని లోనగాని ఆకాశంలోగాని, పాతాళాదిలోకాలలోగాని, ఏ ఆయుధంతోగాని, ప్రాణమున్నదానితోగాని, ప్రాణంలేనిదాంతోగాని, పగలుగాని, రాత్రిగాని, ఇంటిబయటగాని లోపలగాని తన రక్తం నేలపై పడకుండా మాత్రమే చావురావాలని వేరేవిధంగా చావకూడదని "హిరణ్యకశిపుని" వరములు కోరుకొన్నాడు. అప్పుడు తన స్వంత అన్నగారిని చంపటానికి ఈ శ్రీహరి యెంత మాయచేశాడో చూడండి. సింహం తల నరుడి దేహం గల నరసింహుడై గడపమీద కూర్చుని వాణ్ణి తన వడిలో పడుకోబెట్టుకొని సంధ్యాసమయంలో గోళ్ళతో చీల్చి చంపి బొట్టు నెత్తురు రాలకుండా వచ్చిన నెత్తురు వచ్చినట్లే జుఱ్ఱి మాయోపాయంతో చంపేశాడు. ఇటువంటివాడు దుష్టుడుగాక సుకృతి (మంచిపనులు చేసేవాడు) యెట్లా అవుతాడు? పాడైన ఇటువంటి పాపబుద్ధులుసేసి, నీ నిలువ (ఇలా గుహలలో దాక్కోవటం) నేను యెట్టు నేరుతునయ్యా (నాకు ఆ నేర్పు లేదు తండ్రీ!)

కొడుకునున్నతమతిగోరి చంపెడువాడు ఈ స్వామి. తన స్వంత కొడుకు ఉన్నతమతి అవ్వాలని ఆ శ్రీహరి అతనిని చంపేశాడట. ఆకథ వినండి.

వరాహావతారంలో హిరణ్యాక్షుని చంపి శ్రీహరి భూదేవిని రక్షించాడు. ఆయనను వలచిన భూకాంతను చేపట్టాడు. వారి వలపు పర్యవసానంగా నరకుడు జన్మించాడు. అసురసంధ్యలో జనించిన అతను అసురుడై లోక కంటకుడయ్యాడు. శ్రీహరి వాడిని సంహరిస్తాడని, భయపడిన భూదేవి వాడికి చావులేకుండా చేయమని శ్రీహరిని వేడుకొంది. అది సాధ్యం కాదని కావాలంటే భూదేవికి తప్ప ఎవ్వరికీ వాడిని చంపే శక్తి వుండదని వరం పొందింది. మామూలుగానే నరకుడు బల గర్వంతో లోకకంటకుడయ్యాడు. చివరికి శ్రీకృష్ణుని భార్య సత్యభామ చేతిలోనే వాడు చచ్చాడు. ఎందుకంటే సత్యభామ భూదేవి అంశతో జన్మించింది కాని ఆమె శ్రీహరి లీల తెలియదు. అదటుంచి కన్నకొడుకునే చంపినవాడు గొప్ప పాపాత్ముడుకాక ఘనుడవుతాడా? అంతులేని, ఇటువంటి కలుష వ్రిత్తికి (దోషపూరితమైన పనికి) నీఆత్మ యెట్లంగీకరించెనోగాని నా ఆత్మమాత్రం పుత్రునే సంహరించే దుర్మార్గానికి ఒప్పుకోదయ్యా!

తల్లిజంపెడివాడు తలచుకోరాని దుష్టుడు కదా! కానీ అటువంటివాడు యెల్లవారలకెల్లా (తక్కిన అందరికంటే అధికుడా? ఏమిటా కథ?) పరశురాముడి తల్లి రేణుకాదేవి తండ్రి జమదగ్ని. నీళ్ళు తీసికొని రావటానికి నదికి వెళ్ళిన రేణుక ఆ నదిలో జలకాలాడుతున్న గంధర్వ జంటను చూచి నీళ్ళు తేవటానికి ఆలస్యం చేసింది. ఆగ్రహించిన జమదగ్ని ఆమె తల నరికేయమని ఆజ్ఞాపించాడు. అందుకు నిరాకరించిన పుత్రులలో పెద్దవారిని శపించి బూడిద చేశాడు. పరశురాముడు తండ్రిమాట విన్న తక్షణమే తల్లి తల నరికేశాడు. (ఆతరువాత తండ్రి వరంతో ఆమెను బ్రతికించుకున్నాడు. అది వేరే సంగతి). కల్లరి (నేరస్థుడు) అని లోకమెల్లా నీవు చేసిన పనికి రోసినా (అసహించుకొనినా) నీవు లెక్కసేయవు. చెల్లబో! (ఓయమ్మో) నేనేమి చేసేదయ్యా!

ఇంటివేలుపు శ్రీవేంకటేశ్వరుడు. మనందరికీ ఆయనే దిక్కు. మరి ఆయనను తనవెంట వెంట త్రిప్పుకొనే విభుడు ఇంకెంత గొప్పవాడు. అవునా, ఆ గురువు శ్రీరామానుజాచార్యులవారు. దంటనై (దిట్ట తనము కలవాడనై) నేనాయనకు దాసానుదాసుడనైతిని, నేను కూడా ఒంటినుండెద (ఏకాకిగా సన్యసించి ఆయనవలె బ్రతికెదను). ఓ అయ్యా! (శ్రీహరీ!) నేనేమీ ఒల్లను (అన్యములను వేటినీ అంగీకరించను). నేను పరివ్రాజకుడనై జీవించెదను.

సంపుటి: 1 కీర్తన : బలువగుకర్మము లివివో జీవుల ప్రారబ్ధంబులు
సంఖ్య : 296 పుట : 197 రాగం: సామంతం

సామంతం

6 బలువగుకర్మము లివివో జీవుల ప్రారబ్ధంబులు సంచితంబులును
బలిసి తీరవివి పెరుగకనే కాని బ్రహ్మలబహుకల్పంబులదాఁక ॥పల్లవి॥

పాయనిజన్మంబులకర్మంబులు పాయక జీవుల ప్రారబ్ధములై
యేయెడఁ జూచిన నెదిటికొలుచులై యిచ్చల నిటు భుజియించఁగను
కాయపుఁ బెడతటిగండఁడు విధి, నుఁగడ తేర్చిన తనకడకర్మములు
పోయి సంచితంబులఁ గలసిన, నవి పొదలుచుఁ గొండలపొడవై పెరుగు ॥బలు॥

పొదలి సంచితంబులు వడిఁ బెరుగును పోలియును జీవునిపుణ్యముఁ జాలక
యెదిగినపుణ్యం బిగురును కాఁగినయినుముమీఁది జలములవలెను;
పదిలములై కడుఁ బాపకర్ములే బరువై పరగఁగఁ బ్రాణికి నెన్నఁడు
తుదయు మొదలు నెందును లేక, వడిఁ దొలఁగక భవములతొడవై తిరుగు ॥బలు॥

తలఁపులో నవయఁదలఁచిన జంతువు, కలుషహరుఁడు వేంకటగిరిపతి దను-
దలఁచుభాగ్య మాత్మకు నొసగినఁ, జిత్తము పరిపక్వంబై యెపుడు
జలజోదరుఁదలఁచగఁబ్రారబ్ధంబులు సంచితంబులుఁ బొలిసి పుణ్యులై
చెలువగునిత్యానందపదంబునఁ జెలఁగి సుఖించగఁ జేరుదు రపుడు ॥బలు॥296

అవతారిక:

హైందవ సిద్ధాంతాల ప్రకారం మనం చేసే మంచిని పుణ్యమని చెడుని పాపమని, వర్గీకరించి, మంచి పనికి మంచి ఫలితం కలుగుతుందని చెడు పనికి చెడు ఫలితం కూడా అనుభవించవలసివుంటుందని హెచ్చరిస్తోంది. ఇంతవరకు బాగానేవున్నది, కానీ ఈ అనుభవమే విచిత్రంగా జరుగుతుంటుంది. చెడుకి మంచి ఫలితపు అనుభవం కలిగి, మంచికి

చెడు ఫలితం కలుగుతున్నదా అనే భ్రమ కలుగుతుంది. ఎందుకంటే దుర్మార్గులు రాజభోగాలనుభవిస్తే సన్మార్గులు తిండికి కూడా లేక అష్టకష్టాలు పడుతుంటారు. దానికి కారణమేమంటే, దుర్మార్గుడు అనుభవిస్తున్నది వాడు ఇదివరకు చేసిన మంచికి ఫలితం. భగవంతుని ఈలీల మన మనోస్థైర్యంలేనివారు ఆయనపై నమ్మకాన్ని వదలుకొనే ప్రమాదం వున్నది. ఒక్కటి గుర్తుపెట్టుకోవాలి. భగవంతునికి ఎవ్వరిపైనా ప్రేమకాని ద్వేషంగాని వుండవు. ఆయన కర్మసాక్షి. మరణశిక్షవేసే న్యాయపతికి నేరస్థునిపై యెట్టి శతృత్వమెలా వుండదో భగవంతునికీ మనపై ఇష్టాయిష్టములుండవు. కాని సత్ప్రవర్తనగల సాధువైన నేరస్థునిపై న్యాయపతికి కొంత సానుభూతి వున్నట్లే యెప్పుడూ మంచినే చేస్తూ ఒకానొక బలహీనక్షణంలో తప్పు చేసినా ఫలితం అంత దుస్సహముగా వుండదని పెద్దల నమ్మకం. అందుకనే సాధ్యమైనంత యెక్కువ మంచి, తక్కువ చెడు చేసి భగవంతుని శరణాగతితో చేసిన చెడుకు పశ్చాత్తాపపడుతూ, మరల ఆ తప్పు చేయకుంటే చివరికి అంతా మంచే జరుగుతుంది. ఇదంతా తెలియని హైందవ భక్తులు సాధారణంగా వుండరు. మరి ప్రపంచంలో అనాదిగా పాపం యెందుకు జరుగుతున్నది? మనిషి కామక్రోధాది అరిషడ్వార్గాలకు లొంగి ఒకానొక బలహీనక్షణంలో తప్పులు చేస్తూనేవుంటాడు. ఇట్లా చెప్పుకొంటూ పోతే ఈ వివరణకు అంతమనేది వుండనే వుండదు. కాబట్టి ఇది వదిలివేసి కర్మల గురించి ఆలోచిద్దాం.

మనము పూర్వ జన్మలలో చేసిన పాపపుణ్యములకు వేరొక జన్మలో ఫలితం అనుభవించటమే సంచిత కర్మఫలం అంటారు. అందువల్లనే పాపానికి మంచి పుణ్యానికి చెడు ఫలితములు కలుగుతున్నవా అనే భ్రమ కలిగి పాపులు ఇంకా యెక్కువ పాపం చేసే ప్రమాదమూ వున్నది. ప్రారబ్ధ కర్మఫలము అని ఇంకొక తిరకాసు వున్నది. దానివలన నిర్హేతుకంగా జీవి మంచీ చెడు ఫలితములనుభవిస్తుంటాడు. దీనికి యెవ్వరూ యేమీ

చేయగలిగింది లేదు. కేవలం అనుభవించటమే. సంచిత కర్మలలో కొన్ని ఇప్పుడిప్పుడే ఫలితానికి రావు. ఏదో ఒకనాటికి తప్పక వస్తాయి. వాటిని ఆగామి కర్మఫలం అంటారు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు ప్రారబ్ధ సంచితకర్మలగురించి చెబుతున్నారు. వీటి ఫలితం అనుభవించక తప్పదు. అయినా శ్రీవేంకటేశుని కృప వుంటే ఆయన శరణాగతులకు చివరికి మంచే జరుగుతుంది.

భావ వివరణ:

ఈ పల్లవిని ఇలా చెప్పుకుంటే సులభంగా అర్థం అవుతుంది. అవే పదాలు అటూ ఇటూ మార్చాలి... అంతే. ఇవివో జీవుల ప్రారబ్ధంబులు, సంచితములును బలువగు కర్మలు. అవి బలిసి, బహు బ్రహ్మకల్పములదాకా పెరుగునే కాని తీరవు (వదలిపోవు).

జన్మంబులు పాయనివి (తప్పనివి). జన్మ అంటూ యెత్తాక మంచో చెడో యేదో ఒక కర్మ చేయక జీవికి తప్పించుకొనుట సాధ్యంకాదు. జీవులకు ఈ కర్మలు పాయక (విడువక) ప్రారబ్ధములై (ఇంకొక జన్మనెత్తించేవిగా) పరిణమిస్తాయి. అవి యెప్పటికైనా వదలక యెదిటి కొలుచులై (రాబోయే జన్మలై) కొన్ని ఇచ్చల (యాదృచ్ఛికముగా అనుకోకుండానే) జరుగుతుంటాయి. వాటిని భుజించక (అనుభవించక తప్పదు). ఇక ఇంకొక గండరగండుడు వాడు కాయపుబెడతటి గండడు (అవునంటే కాదని, కాదంటే అవుననే పెడసరపు వ్యతిరేకి అయిన మొనగాడు). వాడికొక గొప్పపేరుంది. అదే "విధి" తను కడతేర్చిన (చచ్చాక కూడా) తనకడ కర్మలు (వదిలిపెట్టని కర్మలు) అవే. అవేం చేస్తాయో తెలుసా? పోయి (ముందు జన్మలకు సంక్రమించి) సంచిత కర్మలై (కొనితేబడిన కర్మలై) కలిసిపోయి, పొదలుచు (పెరుగుచూ) కొండలపొడవున (ఎత్తెత్తుకొండలవలె) పెరుగుతూనే వుంటాయి. వీటిని తప్పుకోవటం అసాధ్యం.

ఇక ఈ సంచిత కర్మలు (కొనితేబడిన కర్మలు). పొదలి (అభివృద్ధి పొందుతూ) వడిపెరుగును (శ్రీఘ్రముగా వృద్ధి జెందును). జీవులు చేసే పుణ్యకర్మలవల్ల వారికి మంచి తప్పక జరుగుతుంది. అయితే వేడి చేయబడిన ఇనుముపై పడిన నీటిబిందువు ఎలా తర్వగా ఇగిరిపోతుందో పుణ్యములవలన కలిగే మంచికూడా ఆ జీవిచేసే చెడు కర్మల పాపమువలన ఇగిరిపోతూనే వుంటుంది. కనుక ఎంత తక్కువ పాపంచేస్తే అంత ఎక్కువ పుణ్యం నిలుస్తుంది. చేసే పుణ్యాలు చేస్తూనే, పాపాలు కూడా చేస్తూనే వుంటామంటే కొండల్లాగా పెరిగే పాపాలవల్ల పుణ్యపు ప్రయోజనం మిగలనే మిగలదు. పాపకర్మములు కూడా పదిలముగా పెరుగుచూ అంతులేని బరువుగా పరిణమించి ఎన్నడూ ప్రాణిని వదలక, ఎక్కడా తుదియు మొదలు లేక వడి తొలగక భవముల తొడపై (రకరకములైన పుట్టుకలుగ పరిణమించి) జీవిని తిరుగాడుతూనే వుండేట్లు చేస్తుంది.

ఈ తిరుగాడే కార్యక్రమము కూడా ఒక నాటితో ఆగిపోయే వ్యవహారం కాదు. పుట్టిన తరువాత చచ్చేదాకా కర్మ చేయక తప్పదు దాని ఫలితము అనుభవించకా తప్పదు. తన మనస్సులోని ఆలోచనలతో, నవయు (నలిగి కృశించిపోయే) జంతువు వంటివాడే నరుడు. వీడికి నిరంతరం చింతతో మనశ్శాంతి కరువవుతుంది. కలుషహరుడు (పాప నిర్మూలన చేయు సమర్థుడైన శ్రీవేంకటేశ్వరుడు తనను తలచుకొనే భాగ్యము ఆత్మకు కలిగించనప్పుడు ఆ చిత్తము (మనస్సు) పరిపక్వత నొంది తీరుతుంది. అట్టి స్థితిలో జలజోదరుని (పద్మనాభుని) ధ్యానించగా ఆయాత్మ చేసికొనిన సంచిత కర్మలు మరియు ప్రారబ్ధ కర్మలు బొలిసి (నశించి) పుణ్యులై చెలువగ (శోభిల్లగా), అపుడు ఆయాత్మలన్నియు నిత్యానంద పదమును పొందుతాయి. ఆ నిత్యానందస్థితిలో అనంతమైన సుఖమును పొందుతారు.

సంపుటి: 1 కీర్తన : అందరి బ్రతుకులు నాతనివే
సంఖ్య : 335 పుట : 223 రాగం: పాడి

పాడి

7 అందరి బ్రతుకులు నాతనివే
కందువెల్ల శ్రీకాంతునిదే ॥పల్లవి॥

వేమరుc జదివెడివిప్రులవేదము
సోము (మ?)కవైరియశోవిభవం
శ్రీ మించునమరలజీవనమెల్ల సు-
ధామథనునిసంతతకరుణే ॥అంద॥

హితవగు నిలలోని సుఖమెల్లను
దితిసుతదమనుcడు దెచ్చినదే
తతి తల్లిదండ్రి తానై కాచిన-
రతి ప్రహ్లాదవరదుని కృపే ॥అంద॥

అలరినయమరేంద్రాదులబ్రదుకులు
బలిబంధనుకృపc బరగినవే
బలసి మునులయాపదలు వాపుటకు
బలునృపభంజను పరిణతలే ॥అంద॥

పూని యనాథుల పొందుగc గాచిన-
జానకీవిభునిసరసతలే
నానాభూభరణంబులు నందుని-
సూనుcడు చేసినసుకృతములే ॥అంద॥

తలకొని ధర్మము తానై నిలుపుట
కలుషవిదూరునిగర్వములే
నిలిచి లోకములు నిలిపినఘనుcడగు-
కలియుగమునవేంకటపతివే ॥అంద॥335

అవతారిక:

ఆత్మరూపంలోవున్న అందరికీ వారివారి భాగ్యానుసారం యేదో ఒక జన్మనిచ్చేవాడు జనార్దనుడు. క్రిమికీటకమైనా మరే జీవియైనా ఆయన యిచ్చిన బ్రతుకును గడపవలసినదే. ఇంకొక ప్రత్యామ్నాయం (ఆల్టర్నేట్) వుండదు. కందువ అంటే చమత్కారం అని అర్థం. ఎవరికే జన్మ ఇవ్వాలి? ఎంతకాలం వుంచాలి? ఎప్పుడు తుంచాలి నిశ్చయించేది ఆ శ్రీకాంతుడే. ఇంకెవ్వరికీ ఆ అధికారం లేదు. ఈ జన్మలో మహారాజు కాబట్టి తరువాత జన్మలో చక్రవర్తి అవ్వాలని లేనేలేదు. నల్లి అయి రక్తం పీలుస్తూ చిదిమేయబడే ప్రాణి కావచ్చును. ఈ కీర్తనలో నర్మగర్భంగా "తలకొని (నిర్వహించి) ధర్మముతానేయై నిలుపుటకు" అంటే, నాస్తిక ధర్మమును బోధించే బుద్ధుడూ తానేయైనట్లు ప్రస్తావన వస్తుంది. ఇది దశావతార వివరణ అని అర్థం అయితేనే, ఈ ఊహ తట్టుతుంది. కలుషమును (త్రిపురాసురుల చెడును) గర్వములను తొలగించిన ఆ దేవదేవుని గర్వములే (గౌరవములే) ఆయనదే యేపనియైనా. ఇది గ్రహించుట జ్ఞానము. వితండ వాదన అజ్ఞానము. ఎడ్డెమంటే తెడ్డెమనే వితండవాదులను సృష్టికి ప్రతిసృష్టిచేయగల విజ్ఞానవేత్తలమనే అఖండులను ఒక నమస్కారంపెట్టి వదిలేద్దాము.

ఓ నాస్తికశిఖామణులారా! మీ ఆలోచన కూడా సరియైనదే. నూటికినూరుశాతమూ మీ ఇష్టం వచ్చినట్లు పుట్టుకలు మరణాలు తెప్పించి ఏ రోగమొచ్చినా గ్యారంటీగా తగ్గించుకోగలిగిననాడు దేవుడు లేడు గీవుడు లేడు అని నేనూ మీతో చేరిపోతాను. అందాకా నేనూ మా తిరుపతయ్యా కలిసే వుంటాము. కొసమెరుపేమంటే అన్నమాచార్యులవారి దశావతార కీర్తన ఇది అని మీకు తెలిస్తే మీరు కాదు, నేను ధన్యుణ్ణి.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఈజీవులందరి బ్రతుకులునూ ఆతనివే (ఆ శ్రీమన్నారాయణునివే). ఆయన కృపవలన ఆ జీవికి ఆ బ్రతుకు దక్కింది.

కందువయెల్లా (ఆ చమత్కారం ఎవరికే జన్మ ఇవ్వాలో నిర్ణయించడంలోనే వున్నది.) ఆ చమత్కారం (ఆ నైపుణ్యం) అంతా ఆ శ్రీకాంతునిదే.

విప్రులు (బ్రాహ్మణులు) వేమరు జదివెడి వేదములు (అనేక పర్యాయములు వల్లించు వేదములన్నియు) ఆనాడు మత్స్యావతారంలో శ్రీహరి, వేదములను దొంగిలించిన సోమకాసురుని వధించి తిరిగి బ్రహ్మ దేవేరియైన వాణికి వాణి రూపంలో (మాటవలె) బీజాక్షరాలతో ఇచ్చి, ఇది ఇకపై శ్రుతివలె వుంటుందని నిర్దేశించి వేదము సోమకునికి దక్కకుండా కాపాడాడు. శ్రీమించు అమరజీవనమెల్ల (కామధేను, కల్పవృక్షములు సంపదలతో మించిన దేవతల వైభవమంతయూ కూర్మరూపియై మందర పర్వతమును ధరించిన సుధామథనుని (అమృతమథనుడైన) శ్రీహరి సంతతకరుణ (నిరంతర కృపాప్రసాదమే).

ఇలలోన్ ఈ సుఖమే హితవగున్ యెల్లను ప్రపంచంలో (ఈ ఆనందమే అన్నివేళలా క్షేమము నొసగునది). ఎందుకంటే ఆది వరాహమై హిరణ్యాక్ష దైత్యుదమనుడు (దానవ భంజనుడైన) శ్రీహరి ప్రసాదమే. అమిత నిశ్చయంతో యెల్లరకు తల్లియును తండ్రియునూ తానే అయి సంరక్షించిన ప్రహ్లాదవరదుడు శ్రీనరసింహుని కృపయే, సర్వమూ. ఆయనే లేకుంటే నేటికి మనం హిరణ్యకశిపుని భజనపరులమై వుండేవారము.

అమరేంద్రాదుల బ్రతుకులన్నీ (దేవేంద్రాది దేవతల బ్రతుకులన్నీ ఆనాడు బలిచక్రవర్తి వల్ల బూడిదపాలైపోతే శ్రీహరి వామనుడై, జగన్నాధుడైనా బలిచక్రవర్తిని భిక్షాం దేహియని యాచించి మూడడుగుల స్థలము చాలని, దానము గ్రహించి ఒక అడుగుతో భూమిని, ఇంకొక అడుగుతో సమస్త విశ్వమును ఆక్రమించి మూడవ అడుగుకు స్థలములేదని అసత్యదోషానికి, ఆ బలిని బంధనముతో బంధించి ఆతడు తన ప్రియభక్తుడు ప్రహ్లాదుని మనుమడైనందు వలన కరుణతో విడిచిపెట్టి అసత్యదోషణా నివారణార్థం ఆతని తలపై తన మూడవ అడుగువుంచి రసాతలమునకు తొక్కివైచి ఆతనికి గొప్ప వరములను ప్రసాదించి అతని వాకిలిలో కావలివానిగావుండి రసాతలంలో కూడా స్వర్గంలోవలె మృత్యువులేని అఖండవైభవములనిచ్చాడు.

నాస్తికులై మునులను పీడించు కార్తవీర్యునివంటి రాజుల శిరస్సులను ఖండించిన పరుశురాముడు ఇరువదియొక్క మారులు భూమిని చుట్టి తనవశమైన భూమిని బ్రాహ్మణ్యులందరికీ దానముగా ఇచ్చేసిన పిమ్మట రాజులను క్షమించి వారి సంతతిని ప్రజారంకముగా పరిపాలించండని హితవు చెప్పిన ఆ బలుసృపభంజనుని, పరిణతులే (ఒసగబడిన ఆనందములే).

పూనికతో కోదండదీక్షాదక్షుడై పొందుగా (గొప్పగా) అనాథలను గాచిన (దీనజనోద్ధారకుడైన జానకీమనోహరుడు శ్రీరామచంద్రమూర్తి యొక్క సరసతలే (అనుగ్రహములే) సర్వమూ. ఆయనే లేకపోతే నేటికీ రావణాసురుడు కావలసినవి అందరినుంచీ లాగివేసికొంటూ, కావలసిన స్త్రీలను తనకైవశంచేసికొంటూ హాయిగా వుండేవాడు. వాడే గొప్పరాజ్య పరిపాలనా దక్షుడని వితండవాదులై కొంతమంది తమ స్వంత రామాయణాలతో వారిలోకంలో వారూ వుంటూనే ఒక నాటికి ఏది మంచో ఏది చెడో తెలుసుకొంటారు. ఎవరుమాత్రం యేమి చేయగలరు? వూరుపొమ్మని, వల్లకాడు రమ్మని పిలిచేనాడు తెలిసినా తెలియకున్నా తేడాయేమీ వుండదు. నందునిసూనుడై (రేపల్లెలో నందగోపుని బిడ్డడై యాదవుడై శ్రీకృష్ణుడై) నానాభూభరంబులను (అనేకరకములైన భూభారములను) తొలగించాడు. పూతన వంటి రాక్షసులనేకాక జరాసంధుడు, కంసుడువంటి రాక్షసాంసతో జన్మించిన రాజులనూ ధనరాజ్యమదోన్మత్తులై దుర్మార్గులైన రాజులనందరినీ భారతయుద్ధంలో నామరూపాలులేకుండా చేశాడు. దుష్టశిక్షణానంతరము సుస్థిర ధర్మరాజ్యపాలనతో శాంతి భద్రతలను పరిరక్షించాడు.

ద్వాపరయుగము అంతరించిపోయి కలియుగం వచ్చేసింది. ఇంకా అక్కడక్కడా త్రిపురాస్తురుల్లాంటి దుర్మార్గులు మిగిలిపోయారు. వారు పరమశివుని భక్తులు. లోకకంటకులు. శివుని చేతిలోగాని చావరు. వారిని శివభక్తికి దూరం చేసి తాను బుద్ధుడై వారికి నాస్తికవాదమే సరియైనదని బోధించి, త్రిపురాసుల భార్యల శీలాపహరణమనే పాపమును కూడా చేసి దానిచే శిలయైపొమ్మనే శాపం కూడా వారిచే పొందిన త్యాగశీలి ఆయన. తాను చెప్పినదే 'ధర్మము' చేసినదే 'న్యాయము' అయినా శిలయై తిరుమలలో వుంటానని తన తప్పుకి తానే భార్యారహితుడై శిలయైనాడు. శ్రీవేంకటేశ్వరుడై నిలిచి లోకములన్నీ నిలిపిన ఘనుడై కలియుగనారాయణుడై మనబోటి ఆర్తులను కంటికి రెప్పలా కాపాడుతున్నాడు.

సంపుటి: 1 కీర్తన : పుట్టుమాలిన బరుబోకివినన్ను
సంఖ్య : 107 పుట : 73 రాగం: సాళంగం

సాళంగం

8 పుట్టుమాలినబరుబోఁకివి నన్నుఁ
దిట్టే వదేమోసి దిమ్మరిమాయ ॥పల్లవి॥

ఒరపులాడక పోవె వోసి మాయ నాతోఁ
దొరలేవు నిను ముట్ట దోసము
వెరపించే వేమోసి విష్ణుభక్తినంటా-
నెరఁగనటే నీయేతు లిన్నియును ॥పుట్టు॥

వుదుటు చెల్లదు పో పో వోసి మాయ నా-
యెదుర మాఁటలు నీకు నిఁకనేలే,
వదరేవు హరిభక్తివనిత, తెలియరు నే-
నిదురవుచ్చినవారు నీవు నా కెదురా ॥పుట్టు॥

వొల్లవటే జీవ మోసిమాయ నీ-
కల్లలిన్నియును లోక మెఱుఁగును,
నల్ల నివిభునిమన్నన భక్తినంటాఁ
జెల్లఁబో పాపపుచేఁదు మేయకువే ॥పుట్టు॥

వూరకుండవుగా వోసిమాయ నిన్నుఁ
బేరఁ బిలువము గుంపెనలాదేవు,
నారాయణభక్తినాతి నన్నును నిన్నుఁ
గోరి యిందరు నెఱుఁగుదు రేల పోవె ॥పుట్టు॥

వోవపు ననుఁజూచి వోసిమాయ నా-
తోవ వచ్చినను నొత్తువు నీవు,
శ్రీవేంకటగిరిదేవునిభక్తి నా-
హావళికే నిన్ను నలమి రిందరును ॥పుట్టు॥ **107**

అవతారిక:

అన్నమాచార్యులవారి ఈ కీర్తనలో చాలా విశిష్టతలున్నాయి. శ్రద్ధగా ఆలకించండి. ఇది ఒక సంవాదరూపమై కీర్తన. ఇద్దరిమధ్య సంవాదము జరుగుతోంది, ఆ ఇద్దరిలో ఒకరు మంచి, ఒకరు చెడు. మంచికి మారుపేరు హరిభక్తి. చెడుకి మారుపేరు మాయ. ఈ మాయను, పుట్టుమాలినది (నాశనమైనదని) బరుబోకివి (పోరంబోకువి) అని తీవ్రంగా నిందిస్తున్నారు. ఎవరు? ఇంకెవరు మన హరిభక్తి. ఆ మాయను దిమ్మరిమాయ (భ్రమకలిగించే మాయ) అని అంటున్నారు. నేటికాలంలో దీనినే "మాయదారిది" అని వుపయోగిస్తున్నాం. మాయ కూడా తక్కువతిన్నదేమీ కాదు. "ఒసేయీ నన్ను వూరకనే విష్ణుభక్తిని అని భయపెట్టకే. నీ యేతులిన్నియును నేనెరుగనటే? నీవంటే యెవడికి భయమే" అని మొండికెత్తింది మాయ. ఇవన్నీ ఒక యెత్తు ఆఖరి చరణం ఒకయెత్తు. ఆఖరికి విజేత అయిన హరి భక్తి ఏమంటోందంటే "నేను శ్రీవేంకటగిరిదేవుని భక్తిని. ఆహావళికే నిన్నున్ ఇందరును అలమిరి". అంటే యేమిటో అర్థమయిందా? బాగా ఆలోచించండి. ఎన్ని నిఘంటువులను వెదకినా ఫలితం వుండదు. శ్రీవేంకటేశ చరణం శరణం ప్రపద్యే. అని భక్తిగా మొక్కి ప్రార్థించండి. నేను అదే చేశాను. అప్పుడు ఒక తటల్లత తళుక్కున మెరిసింది. అదేమో తెలియాలంటే భావవివరణ చదవక తప్పదు మరి.

భావ వివరణ:

హరిభక్తి: ఓ దిమ్మరి మాయా! (భ్రమలు కలిగించే మాయా!) నీవు నన్ను దిట్టేవదేమోసి (నీవు నన్ను తిడతావేమిటే?) నీవు పుట్టుమాలిన బరుబోంకివి (నాశనమైన పోరంబోకువి). మరి నేనెవరినో తెలుసా? సాక్షాత్తు ఆ శ్రీహరి భక్తిని. నాతో పెట్టుకుంటే నీఅంతు చూస్తాను జాగ్రత్త!

హరిభక్తి: ఓసి మాయా! నాతో ఒరపులాడకే (ఘర్షణపెట్టుకోవద్దే). నాతో దొరలేవు (కిందామీదా అవుతున్నావు). అసలు నిన్ను ముట్టుకుంటేనే దోసము (దోషమూ, పాపము).

మాయ: ఓసినీ విష్ణుభక్తినని గొప్పలు చెప్పుకొని, నన్ను భయపెడతావటే? నీయేతులన్నీ (గొప్పలన్నీ) నేనెరగనటే?

హరిభక్తి: ఓసి మాయా! పోపోవే! నీ వుదుటు (ఉద్ధతి) ఇక చెల్లదు (పనికిరాదు) ఇంకానాతో నీకు యెదురు మాటలు దేనికే? పోపోవే.

మాయ: ఒసే హరిభక్తి వనితా! నీవు నాకెదురేమిటే? ఎంతసేపు నేను హరిభక్తిని హరి భక్తిని అని వదరేవు? (వాగుతావు?) నేను ఎవ్వరినైనా మత్తులో పడేసి నిదురపుచ్చగలను తెలుసా? నేను నిదురపుచ్చినవారికీ ఒళ్ళూపైనా తెలియనే తెలియవు. జాగ్రత్త! నాతోపెట్టుకోకు. నీవు హరిభక్తివైతే నాకేమిటే?

హరిభక్తి: ఓసి మాయా! నీవు వొల్లవటే జీవము? (నీవు పరమాత్మను ఒప్పుకోవా యేమిటే?) లోకము నీకల్లలిన్నియును యెరుగునులే. నీవు అబద్ధాల పుట్టవని మా హరిభక్తులు యెప్పుడో తెలుసుకొన్నారు.

మాయ: ఒసే పాతకీ! హరిభక్తినని, నల్లని విభుడైన శ్రీవేంకటేశ్వరుని మన్నన కలిగినదానివని గొప్పలు చెప్పుకోకే. చెల్లబో!! (అమ్మయ్యో) పాపపుచేదు దున్నపోతులా మేయకువే (మేయవద్దే).

హరిభక్తి: ఓసిమాయా! నీవు వూరకుండవు గదే! (మౌనంగా వుండవు కదటే. నిన్ను బిలువము (నిన్ను పేరుతో పిలువము) ఎందుకంటే నీవు గంపెనలాడేవు (అతిశయపుమాటలు మాట్లాడతావు).

మాయ: నేను నారాయణ హరిభక్తినాతిని (శ్రీమన్నారాయణుని హరిభక్తి వనితా రూపం దాల్చి వచ్చిన దానను) అని ఏమి చెబుతున్నావే. ఇక్కడున్న ఇంతమందికి నేనెవరో నీవెవరో తెలియదటే. కోరి నీతో నాకేల? పోవే.

హరిభక్తి: ఓసి మాయా! నన్ను జూచి ఓపవే (సహించవే) నాతోవచ్చినను (నా దారికి అడ్డంవస్తే) నొత్తువు (ఇబ్బందిపడతావు) జాగ్రత్త! నీవు ఒళ్ళు దగ్గరబెట్టుకో. నేను శ్రీవేంకటగిరిమీది దేవుని భక్తిని. ఆహరికే (కొట్లాటవచ్చిందంటే) ఇందరును (ఇంతమంది హరిభక్తులూ కూడా) నిన్నున్ అలమిరి (ఆక్రమించి చితకబొడుస్తారు) జాగ్రత్త.

సంపుటి: 1 కీర్తన : పెరుగ బెరుగ బెద్దలుగాగా పెనువెఱ్ఱివట్టు బెద్దెఱిగితే
సంఖ్య : 440 పుట : 295 రాగం: బౌళి

బౌళి

9 పెరుగఁబెరుగఁ బెద్దలుగాఁగా పెనువెఱ్ఱి పట్టు బుద్ధెఱిఁగితే,
మరులు మఱచితేనే యిన్నిటిగెలిచేమర్మము సుండీ జ్ఞానులకు ॥ పల్లవి॥

జననమందినయప్పుడు దేహి సన్యాసికంటే నిరాభారి
తనరఁ గౌపీనకటిసూత్రముల తగులములేని దిగంబరి
తనుఁ దా నెఱఁగఁడు యెదిరి నెఱఁగఁడు తత్వధ్యానాలయ-
నిర్మలచిత్తుఁడు
పెనఁగేకోరిక యించుకంత లేదు పేరులేనివాఁడు
వీఁడువో యమ్మా ॥పెరు॥

నిద్దురవొయ్యేటియప్పుడు దేహినిత్య విరక్తునివంటిఘనుఁడు
బుద్ధి సంసారముపై నించుకా లేదు భోగమేమీ నొల్లఁడు
వొద్దనే యేపనులకుఁ జేయఁబోఁడు వున్నలంపటాల కేమియుఁ
జొరఁడు
కొద్దిలేనియాస యెందువోయనొకో కోప మేమి లేదు
వీఁడివో యమ్మా ॥పెరు॥

హరి శరణన్నయప్పుడు దేహి అమరులకంటె కడునధికుఁడు
పరమునిహము నఱచేతిదే ప్రయాస మించుక లేదు
దురితము లేదు దుఃఖములు లేవు తోడనే వైకుంఠ మెదురుగా వచ్చు
గరిమ శ్రీవేంకటేశుఁడు వీఁడివో కానరైరిగా యిన్నాళ్లమ్మా ॥పెరు॥440

అవతారిక:

జీవి తను శిశువుగావున్నప్పుడు మాయామర్మము లేక సన్యాసివలె నిర్మోహిగావుంటాడు. దిగంబరియై కపటములేకుండా నిర్మలానందస్థితిలో

వుంటాడు. వాడు పెరిగి పెద్దవాడవుతున్నకొలదీ పెనువెఱ్ఱి తలకెక్కుతుంది. యుక్తవయస్సు వచ్చేసరికి బుద్ధెఱిగిన కొద్దీ మదనతాపము మొదలవుతుంది. దానితో వాడి పతనమూ మొదలవుతుంది. ఈ మరులు మఱచితేగాని వాడు బాగుపడడు. మరులు మఱచితే అన్నిటిలోను విజయం సాధించగలడు. జ్ఞానులైనవారి విజయరహస్యం ఇదే సుండీ (సుమా!) అంటున్నారు అన్నమాచార్యులవారు. జన్మించినప్పుడు యే పేరూ పెట్టనంతవరకు వాడు తత్త్వజ్ఞాని ఒక్కసారి పేరుపెట్టి వాడిని ఆ పేరుతో పిలవంగానే వాడిలో నేను, నాది అనే భావన కలుగుతుంది. వాడిలో కోరిక చిగురిస్తుంది.

సరే! ఈ మానవుడి నిద్రావస్థను పరికించండి. అప్పుడుకూడా వాడు నిత్య విరక్తునివలె, దేనిమీదా వాంఛలేక, యే లంపటమూలేక కోపతాపాలు లేకుండా వుండగలుగుతున్నాడు. ఎందుకని? వాడి బుద్ధి సంసారము మీద లేదు. సుషుప్తిలోవున్నది. అందుకని. సరే! వాడు హరిశరణాగతి పొందినదే తడవుగా అమరులకంటే ఆనందంగా వుంటాడు. వాళ్ళకి స్వర్గంపైకెవరు దండెత్తుతారా అనే భయం వెన్నంటే వుంటుంది. కాని శ్రీవేంకటేశ్వరుని నమ్ముకొన్నవాడికి వైకుంఠం యెదురుగా వున్నట్లే వాడు జీవన్ముక్తుడు.

భావ వివరణ:

ఒక జీవి పెరిగి పెరిగి పెద్దవుతుంటాడు. అట్లా పెరుగుతున్నకొద్దీ వాడి బుద్ధికూడా వికసిస్తుంది. అయితే దురదృష్టం కొద్దీ ఆ బుద్ధి పెనువెఱ్ఱిబట్టి అనేక భ్రమలకు లోనై, మరులుగొని (మదనుని పీడకు గురియై) తన జీవన గమ్యం తెలియలేక చెడిపోతున్నాడు. అయితే భగవత్కృప కలిగితే జ్ఞానం వస్తుంది. అప్పుడు వాడు ఆ మరులు మఱచి జ్ఞానియై ఇహపరములను రెంటినీ సాధించగలుగుతాడు. ఇన్నిటినీ గెలిచేమర్మము ఇదే సుండీ! (సుమా).

జననమందినయప్పుడు దేహి అని పిలువబడే ఈ జీవి గొప్ప నిరాభారి (ముని) అతని లోకమే అతనిది. ఇతరుల సంగత్వం అక్కరలేదు. సన్యాసికంటే నిస్సంగుడు. మొలత్రాడుకాని, కౌపీనము (గోచీ) కాని వంటిపై లేని దిగంబరుడు. తనను తానెరుగడు. అట్లే యెదుటనున్న వారినీ యెరుగడు. పూర్వజన్మజ్ఞానం వుండి తల్లి గర్భంలోని అంధకారంలో తొమ్మిది నెలలు మగ్గి

భగవంతుడా నన్నీ నరకం నుండి బయటపడవేయి ప్రభూ! మరల యేపాపమూ చేయను. సద్బుద్ధితో వుంటాను. ఈసారి ముక్తిని సాధిస్తాను అని అనేక ఒట్లు పెట్టుకొంటాడు. నిర్మల చిత్తముతో ఈ ప్రపంచంలోకి అడుగుపెడతాడు. వాడికి పేరుపెట్టనంతవరకు 'నేను' అనే భావనకూడా రాదు. ఇంచుకైనా (కొద్దిగా కూడా) పెనగే కోర్కెల పీడ (పెనవేసికొని వేధించే కోర్కెల బాధ) వాడికుండదు. జీవన్ముక్తుడు వాడేనే వోయమ్మా!

ఇక నిద్రపోయేవాడిని చూద్దాము. ఆ నిద్రలో వుచ్ఛ్వాస నిస్స్వాసములున్న దేహి (జీవి) మాత్రమే. ఊపిరిపీలుస్తున్నాడు. కాబట్టి జీవించినట్లున్నా, వీడు నిత్య విరక్తుడు. ఆలోచనేలేనివానికి యే రక్తి వుంటుంది? అందుచేత విరాగి యైన ఘనుడు. ఈ సంసారముపై కొద్దిగా కూడా ధ్యాసవుండని నిస్సంగుడు. ఆ దశలో వాడు యే భోగమును ఒల్లడు (కాంక్షించడు), ఒద్దనే, (నిరాకరించినట్లు) అసలు పట్టించుకోడు. ఏపనినీ తలపెట్టడు, పని నిర్వహించడు. లంపటాలకేమియూ జొరడు (ఏవిధమైన బంధుత్వపు తగుల ములలో తగులుకొనడు). కొద్దిలేని ఆస (అంతులేని ఆశ) యెందువోయనో ఆ సుషుప్తిలో యెక్కడికి పోయిందో కదా! ఇక అరిషడ్వర్గాలమాటకొస్తే, వీడికి కోపము అనేదేలేదు. ఓయమ్మా! వీడు జీవన్ముక్కుడే.

కానీ ఆ శైశవదశ, సుషుప్తి యెల్లకాలమూ వుండేవి కావు. ఆ స్థితిలో నుంచి విడివడగానే అరిషడ్వర్గాల పీడితుడై శీతోష్ణ సుఖదు:ఖాది ద్వంద్వ పీడితుడై అనేక పాపపుణ్యాల పీకులాటలో వుంటాడు. వాడి జన్మ సుకృతం వలన శ్రీవేంకటేశ్వరుని శరణాగతిని పొందుతాడు. అప్పుడు అమరులకంటే (దేవతలకంటే) అధికుడు అవుతాడు. ప్రయాస ఇంచుకంతైనా లేక (అప్రయత్నంగా) ఇహమూ పరమూ అతనికి అరచేతిలో నిలచివుంటాయి. ఏవిధమైన పాపచింతనలేని విరాగి అతడు. అతనికి యే దు:ఖమూ వుండదు. మరి అటువంటి వానికి వైకుంఠము యెదురుగా వుండకుండా యెక్కడ వుంటుంది? ఈ శ్రీవేంకటేశ్వరుని గరిమ (దివ్యమహాత్మ్యమును) ఇన్నాళ్ళూ చూడలేకపోయామే!! ఓయమ్మా! ఇప్పటికైనా బ్రతికాము. ధన్యులమయ్యాము.

సంపుటి: 6 కీర్తన : అల్లవాడే వాడల్లవాడే
సంఖ్య : 43 పుట : 31 రాగం: గౌళ

గౌళ

10 అల్లవాఁడే వాఁడల్లవాఁడే
యెల్ల లోకములకుఁ దానేలికైనవాఁడు ॥ పల్లవి॥

దొడ్డమేఁక పొలగూడు దోమటి దొడికినాఁడు
గడ్డవయసగు బిడ్డగన్నవాఁడు
నడ్డిముక్కుతోడ వెట్టి నవ్వులు నవ్వినవాఁడు
అడ్డపాపఁడై యున్న ఆకుమీఁదివాఁడు ॥అల్ల॥

ఆలి యిల్లు బొడ్డుతోడ నంటఁగట్టుకొన్నవాఁడు
కోలలేక లోకమెల్లఁ గొలిచినాఁడు
కాలువగా మింటి నీరు కాలఁదన్ని తీసినాఁడు
నేలకింది పరపుపై నెలకొన్నవాఁడు ॥అల్ల॥

మించుల మించుల వన్నె మెకము నేసినవాఁడు
దంచేటి కైదువచేఁదనరువాఁడు
కంచముగా గొల్లవారి కడవలపాలెల్ల
వంచుకొని దోసిట వారవట్టువాఁడు ॥అల్ల॥

పోటుమీరిన యసురపురము లిన్నియుఁ జొచ్చి
వీటిబుచ్చి దుమ్ములుగా వేసినవాఁడు
బూటకపుసురలతో ఁబున్నమ కప్పురమున
కూటువగాఁ జాపకూడు గుడిచినవాఁడు. ॥అల్ల॥

అల్లిందామరల పొందులైన కన్నులవాఁడు
తల్లిఁ గూఁతుఁ గౌఁగిటఁ దగిలినాఁడు
చల్లనైన వేంకట శైలముపై నున్న
నల్లని మేనివాఁడు నవ్వుమోమువాఁడు. ॥అల్ల॥

అవతారిక:

"అదిగో వాడే, యెల్ల లోకాలపాలకుడైన దేవదేవుడు" అని అత్యద్భుతమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది శ్రీమన్నారాయణుని అవతార వివరణే కాని దశావతార వివరణ కాదు. కూర్మ, నారసింహ, పరశురామ, కల్కి అవతారాల ప్రసక్తి లేదు. కాని యజ్ఞనారాయణుడు, ఆదినారాయణుడు, మఱ్ఱిఆకుపై శైశవ నారాయణుడు, దత్తాత్రేయుడు మొదలైన రూపములను దాల్చిన శ్రీహరి అవతారములను కీర్తిస్తున్నారు. ఎంతో పటిష్టమైన పౌరాణిక వాఙ్మయ పరిచయం వుంటేకాని ఇటువంటి కీర్తనలు వివరించుట సాధ్యంకాదు.

ఒక్కొక్కప్పుడు మన వూహ సరైనదో కాదో అని మనకే అనుమానం వస్తుంది. ఉదాహరణకు ఈ కీర్తనలో "బూటకపు సురలతోన్ పున్నమ కప్పురమున కూటువగాన్ చాపకూడున్ కుడిచినవాడు" – ఎవరు వాడు? నేను ఆలోచించి, దత్తాత్రేయులవారు అని వూహించాను. అన్నమాచార్యులవారి యోచన ఇంకొకరుకూడా అయివుండవచ్చును. దశావతారముల క్రమములో అది "కల్కి" వివరణ అవాలి. కానీ యెలా సమన్వయ పరచాలి? మరి ఇది "అసిధారావ్రతము" అంత ఆషామాషీ వ్యవహారం కాదు. అవునా? చాలా జాగ్రత్తగా చదవండి.

భావ వివరణ:

అల్లవాడే (అదిగోవాడే) వాడు అల్లవాడు (ఆదిపురుషుడు). ఎల్లలోకములను (పైనున్న ఏడు, క్రిందనున్న ఏడు మొత్తము పదునాల్గు లోకములకును) తానే ఏలికైన (పరిపాలకుడైన) వాడు. వీడే జగన్నాథుడు.

"దొడ్డమేక పొలగూడు దోమటి దొడికినాడు". శ్రేష్ఠమైన మేక (యజ్ఞ పశువుయైన మేక) పొలగూడు (మాంసమును) దోమటి దొడికినాడు (ఆహారముగా భుజించినాడు). ఈయననే యజ్ఞనారాయణుడని వేదము కీర్తించినది.

"గడ్డ వయసగు బిడ్డగన్నవాడు". అతి వృద్ధాప్యపు వయసుతో జగత్ పితామహుడని కీర్తించబడిన బిడ్డను (బ్రహ్మదేవుని) కన్నవాడు. ఈయనే ఆదినారాయణుడు.

"నడ్డిముక్కుతోడ వెఱ్ఱి నవ్వులు నవ్వినవాడు" నడుము మధ్యలో ముక్కువుండి, యెప్పుడు చూచినా వెఱ్ఱినవ్వు నవ్వుతున్నట్లు సగం తెరచుకున్న నోరుతోవుండే చేప ఆకారముగల దేవుడు. మత్స్యావతారముననున్న శ్రీహరి.

"అడ్డపాపడైవున్న ఆకుమీది శిశువు" జగత్ప్రళయమున అనంత నీరవములో ఒకమఱ్ఱి ఆకుపై శిశువు వలె తెలియుండి ఒక కాలిబొటనవ్రేలు నోటితో చప్పరించి తిరిగి జగత్ సృష్టి సంకల్పమును చేసిన శైశవనారాయణుడు. (కూర్మ, వరాహ నారసింహ ప్రసక్తిలేదు).

"ఆలి ఇల్లు బొడ్డుతోడ నంటగట్టుకొన్నవాడు" తన ఆలి లక్ష్మీదేవి పుట్టినిల్లయిన క్షీరసాగరమును బొడ్డుతోడ (పుట్టిననాటినుంచే) అంటగట్టు కొన్నవాడు (తనస్వంత ఇంటిలో హక్కు భుక్తంగా అనుభవిస్తూ స్వంతం చేసికొనిన శ్రీమన్నారాయణుడు).

"కోలలేక లోకమెల్ల గొలిచినాడు". ఏ కొలబద్ద లేకుండానే కొంచెముకూడా సందులేక లోకమంతా వ్యాపించి కొలిచి రెండు అడుగులతోనే భూనభాంతరములు వ్యాపించి చూపి బలి చక్రవర్తిని మరి నీవు దానమిస్తానన్న మూడవ అడుగునకు చోటేది అని ప్రశ్నించిన వామనమూర్తి.

"కాలువగా మింటి నీరు కాలదన్ని తీసినాడు" ఆనాడు ఆకాశమంతా నిండిపోయేట్లు పాదముతో నింగిని తన్నినప్పుడు ఆకాశగంగకు చోటు లేక ఆ త్రివిక్రముని పాదములు నాశ్రయించి అందులో ఇమిడిపోయింది. అటువంటి విశ్వప్రకాశకుడు. **నేలకింది పరుపుపై నెలకొన్నవాడు** ఆదిశేషుడు భూమిని పరుపులా మోస్తుంటే విష్ణుమూర్తి ఆదిశేషునిపై పవ్వళించియుంటాడని విష్ణుపురాణం వర్ణిస్తున్నదట. **మించుల మించుల వన్నె మెకము నేసినవాడు** మించు (విజృంభించుచున్న) మించులవన్నె (బంగారురంగుగల) మెకమున్ (లేడిని) యేసినవాడు (చంపినవాడు) శ్రీరామచంద్రుడి అవతార వర్ణనమిది (పరశురాముని వదలినారు).

"దంచేటికైదువచే దనరువాడు" దంచుటకు వుపయోగించు సాధనములు (రోకలిని) కైదువగా (ఆయుధముగా) స్వీకరించినవాడు బలరాముడు అవతారము.

"కంచముగా గొల్లవారి కడవలపాలెల్లా వంచుకొని దోసిటావారవట్టువాడు" శ్రీకృష్ణలీలను వినండి. ఆ బాలకృష్ణుని ఇంటినిండా పాలేవుంటాయి. కానీ కంచముగా (తన స్వంత ఆహారంలా) వూళ్ళోవున్న గొల్లవారిండ్లలోని కడవల నిండుగనున్న పాలను వంచుకొని దోసిళ్ళలో పట్టి వారవట్టువాడు (ధారగా పార బోసిన చిలిపివాడు. నాయనా! మనింట్లో అన్నిపాలుంటే వాళ్ళఇంటి పాలెందుకురా అంటే వింటాడా? ఆయనకి కావలసింది యేడిపించడమే. అదే శ్రీకృష్ణలీల.

"పోటుమీరిన అసురపురము లిన్నియుజొచ్చి వీటి బుచ్చి దుమ్ములుగా వేసినవాడు". హద్దుమీరిన త్రిపురాసురుల పురములలో జొరబడి, వారి భార్యల మానములను వీటిబుచ్చి (పొల్లుచేసి) ఆ రాక్షసులను ఒకేసారి భస్మము చేయించినాడు. శ్రీహరి ఈలీలను బుద్ధావతారంతో నిర్వహించి పరమశివుని త్రిపురాంతకుడను కీర్తిని కలిగించినాడు.

"బూటకపు సురలతోన్ పున్నమ కప్పురమున కూటువగాన్ చాపకూడున్ కుడిచినవాడు" మారువేషాలలో వున్నదేవతలతోపాటుగా పున్నమకప్పురము అనే చోట, కూటువగా (ఒకే గుంపుగా) చాపకూడు (పంక్తి భోజనం) కుడిచినవాడు (తిన్నవాడు). దత్తాత్రేయావతారము.

"అల్లిందామరల పొందులైన కన్నులవాడు" జంట తామరపువ్వులవంటి రెండు కన్నులుగల అందగాడు.

"తల్లి కూతుకౌగిట తగిలినవాడు" తల్లియైన భూదేవిని వరాహమూర్తిగా, ఆమె కూతురైన సీతాదేవిని శ్రీరామునిగా కౌగలించుకొనిన జనార్దనుడు జగద్వల్లభుడూ ఈయనే సుమా!

"చల్లనైన వేంకటశైలముపైనున్న నల్లనిమేనివాడు నవ్వుమోమువాడు" ఎత్తైన కొండ అవటంవలన నిత్యమూ చల్లగా వుండే శ్రీ వేంకటాద్రిపై వెలసి నల్లని నిగనిగలాడు మేను (శరీరము) గలవాడు ఈ శ్రీవేంకటేశ్వరుడు. ఎంతటి దివ్య సౌందర్యరూపం అది. ఎంత చక్కటి నవ్వు మొగముతో వున్నాడో చూడండి.

సంపుటి: 1 కీర్తన : కొందరికివి సమ్మతియైతే కొందరి కవి గావు
సంఖ్య : 384 పుట : 257 రాగం: బౌళి

బౌళి

11 కొందరి కివి సమ్మతియైతే కొందరి కవి గావు
యిందరిలోపల నీవెడమాయలు యేగతిఁ దెలిసే నేనయ్యా ॥ పల్లవి॥

దూరము కర్మమునకు జ్ఞానము; తోడనే (తొడునే?) వొండొకటికిని
దూరము; పరమునకు ప్రపంచము తొలుత విరుద్ధంబు;
దూరము విరతికి సంసారము; తుదమొదలే లేదు;
యీరీతుల నీ వెడమాయలు యేగతిఁ దెలిసెద నేనయ్యా ॥కొంద॥

కూడదు దేహమునకు నాత్మకు గోత్రవిరోధం; బెన్నఁడును
కూడదు కోపమునకు శాంతము గుణావగుణములను;
కూడదు బంధమునకు మోక్షము కోరికలే కట్లుగాన;
యేడ గొలఁదిగా శ్రీహరిమాయలు యేగతిఁ దెలిసెద నేనయ్యా ॥కొంద॥

శ్రీ వేంకటపతి నన్నీగతిఁ జిక్కించితి వీజగమునను;
భావింపఁగరాదు నీమహిమ బహుముఖములయర్థముగాన;
యేవిధమును నేఁటికి నాకిఁక యెందెందని తగిలెద నేను
దైవికమగు నీదాసానుదాస్యము దక్కినదే నాకు ॥కొంద॥384

అవతారిక:

"వెడమాయ" అంటే నానార్థములున్నాయి. ఇక్కడ దాదాపుగా సరిపోల్చే అర్థం దుస్సహమైన లేక భరించలేని అని చెప్పుకోవచ్చును. ఆ పరమాత్మ జగన్నాటకం యెవరికీ అర్థం కాదు. ఆయన రచనలు యెంత విచిత్రమైనవంటే అవి కొందరికి నచ్చేట్లుంటాయి, కొందరికి నొచ్చేట్లువుంటాయి. ఆయన కృప ఒక్కొక్కరిపై ఒక్కొక్క రకంగా

ఉంటుంది. దానికి ఒక కొలబద్ద వుండదు. రెండు గంటలు పూజ చేసేవాడికి ఒక గంట పూజ చేసేవాడికంటే రెండింతలు పుణ్యం వస్తుందనే నియమం యేమీలేదు. ఇంతమందిలో నీవు ఎవరిని కరుణిస్తావో ఎవరిని శిక్షిస్తావో యెవరు చెప్పగలరు? ఇంతమందిలో నీ దుస్సహమైన మాయలు యెలావుంటాయో యెవరు చెప్పగలరు? అవి యేగతి తెలుస్తాయి స్వామీ! అంటున్నారు అన్నమాచార్యులవారు.

కర్మము దారి కర్మముదే జ్ఞానముదారి జ్ఞానముదే అనుకోవటానికీ వీలులేదు. దేహమునకు, ఆత్మకు జన్మవైరం వున్నట్లా లేనట్లా? బంధం యేది కలిగిస్తుంది, మోక్షం యేది కలిగిస్తుంది? చిట్టచివరగా, ఇదంతా శ్రీవేంకటేశ్వరుని మహిమ. బహుముఖములుగల ఆ మహిమనర్థంచేసికోవటం అంత తేలిక పనికాదు. ఆయన దాసానుదాసులకి తప్ప మిగతావారికి ఆయన మాయ ఎలా అర్థమవుతుంది? అసలివన్నీ వ్యర్థమే. ముక్తి మార్గము ఒక్కటే హరిదాసుల (దాస్యముతో హరి శరణాగతిలో జీవించే వానికి) యేదో ఒక నాటికి ముక్తి తథ్యము అంటున్నారు.

భావ వివరణ:

ఇవి (శ్రీహరి మాయలు) కొందరికి సమ్మతివైతే (అనుకూలమైనవి) అయితే కొందరికి (మరికొంతమందికి) అవి (ఆయనమాయలు) కావు. (అనుకూలమైనవి కాక, ప్రతికూలమైనవి). అయ్యా! (ఓ దేవదేవా!) ఇందరి లోపల (ఇన్ని సందర్భాలలో) నీ వెడమాయలు (దుస్సహమై, విచిత్రములైన మాయలను) ఏను (నేను), యేగతి తెలిసేను? (ఎట్లు తెలుసుకోగలను ప్రభూ!)

విచిత్రమేమంటే, కర్మమునకు జ్ఞానము దూరము. కర్మలు శ్రద్ధగా చేసేవాడికి జ్ఞానం వుండనక్కరలేదు. అలాగే నిజమైన జ్ఞానికి కర్మతోపనిలేదు. రెండూ కలిసేవున్నట్లున్నా రెంటికీ దూరమే. మొట్టమొదట

పరమునకు (ఊర్ధ్వలోక ప్రాప్తికి) ప్రపంచమునకు (ఇహలోక వ్యవహారములకు) విరుద్ధము (ఒకదానికింకొకటికీ పొసగదు). జ్ఞాని అయ్యాక రెండూ వ్యర్థమే. విరతికి (నిర్వాపారికి... అంటే... నాకే నిమిత్తమూ లేదు, నేనేపనీ చేయను అనేవాడికి) సంసారము (ఈ జగత్తు) దూరము (సమ్మతించదు). ఇటువంటి విచిత్రమైన విరుద్ధమైన నీ సృష్టిలోని మాయలను నేను యేరీతి తెలిసేనయ్యా!

ఇకపోతే దేహమునకు ఆత్మకు కూడదు (ఒకదానికొకటికి పడదు). వాటికి గోత్ర విరోధము (సగోత్రీకులు యెలా వివాహము నిషిద్ధమో, దేహమూ ఆత్మా కలపనసాధ్యమైనవి.) అదే విధంగా, కోపమూ శాంతమూ యెన్నడునూ కూడవు (కలవవు). కోపిష్టివాడికి శాంతగుణం అబ్బనే అబ్బదు. శాంతికామునికి కోపమురానేరాదు. శాంతము సుగుణమైతే కోపము, అవగుణము (చెడు గుణము). కోరికవున్నచోట కట్టుబడివుండుట తప్పనిసరి అవుతుంది. కోరిక వుంటే బంధము, కోరిక లేనివానికి మోక్షము, సహజమే కదా! ఆ శ్రీహరి మాయలకు కొలత యేవున్నది? వాటిని యేగతి తెలియగలము?

ఓ శ్రీవేంకటపతీ! నన్ను ఈ జగతిని (ఈ ప్రపంచమునకున్) చిక్కించితివి (వశమైపోయేట్లు చేసినావు). నీ మహిమ, బహుముఖముల అర్థములు (అనేకానేక విధములుగా వుంటుంది). భావింపగరాదు (ఊహాతీతమైనవి) ఏవిధమును (యేదియేమైనా) నేనెందెందు తగిలెదను (యెక్కడెక్కడని సంగత్వము పెట్టుకోమంటావు ప్రభూ!) నాకిక నేటికి? (నాకు ఈ పీకులాటలన్నీ యెందుకు?) నాకు నీదాసానుదాస్యము (నీ దాసులకు సేవచేసే భాగ్యము) దైవికమగు (దైవదత్తముగా) దొరికినది. నాకు అది చాలును తండ్రీ! అదే నా ముక్తి మార్గము.

సంపుటి: 4 కీర్తన : వెరపు దెలుపు నీవేగిరమేనీ
సంఖ్య : 2 పుట : 361 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

12 వెరపు దెలుపు నీ వేగిరమే నీ
వెఱిఁగియు నెఱఁగక యేమంటివో ॥ పల్లవి॥

గోరపురుధిరము గురియు గోళ్ళ నీ
తోరమైన యా తొడమీఁద
గోరంటగోళ్ళ కోమలి నిలువఁగ
ఈరసమందక యేమంటివో ॥వెరపు॥

నెత్తురుఁ బెదవుల నీ మొకమలరఁగ
బిత్తరి వీడెపుఁ బెదవులతో
మత్తకరిగమన మాటలాడఁగా
ఎత్తిన మదమున నేమంటివో ॥వెరపు॥

ఆననరౌద్రము నట్టహాసమును
పూనిన నినుఁగని బొమముడితో
లేనగవుల నదలింపెడి సిరితో
హీనాధికముల నేమంటివో ॥వెరపు॥

పెద పెద యూర్పుల పేగుల జందెపు
టుదరముతో నీవుండుచును
చెదరిన పయ్యెద చెరఁగు జారుసతి
యెదురెదురను నీవేమంటివో ॥వెరపు॥

చింపి నెరుల నీ శిరసు ముడుచుకొని
కంపముడిగి వేంకటపతివై
లంపటమందుచు లక్ష్మీసతితో
ఇంపులు నెరపుచు నేమంటివో ॥వెరపు॥ 2

అవతారిక:

లక్ష్మీనృసింహుని కీర్తించుచు అన్నమాచార్యులవారు వినిపించిన సహజత్వముట్టిపడే కీర్తన ఇది. ఆనాటి తెలుగు నుడికారంలో వుండే తేడా వల్ల ఈ కీర్తనకి వివరణ కావలసివచ్చింది కాని నిజానికి సులభగ్రాహ్యమైన కీర్తనయే ఇది. వెరపుదెలుపుట అంటే భయపెట్టుట అని అర్థం. వేగిరము అంటే తీవ్రత అని అర్థం. నేటి కాలంలో అయితే "ఓ స్వామీ! భయమును కలిగించు నీ తీవ్రత నీవెఱుగుదువో యెఱుగవో" అని వివరించాలి అ పల్లవిని. అన్నమయ్య కాలంనాటి తెలుగులో. అన్నమయ్య "ఎత్తిన మదము" అన్నారంటే, నేటికాలంలో "యెక్కువైన గర్వము" అని అర్థం.

ఆ నృశింహుని ఆపాదమస్తకం అద్భుతంగా వర్ణించి ఆ చింపిరి జుట్టు స్వామియే తిరుమల వేంకటపతి అయ్యాడంటున్నారు. చింపిరి జుట్టు పోయి చక్కగా ముడిచిన కొప్పు వచ్చిందట ఈయనకి. లక్ష్మీసతి లంపటంలా తగులుకొందిట. ఆ లక్ష్మీమదేవితో ఇంపులు నెరపుచు ఏమివున్నావయ్యా!! అని ఆశ్చర్యపోతున్నారు. కాబట్టి ఏమంటివో అంటే "ఏమివుంటివో" అని అర్థం చేసికోవాలి "ఏమి అన్నావో" అని అర్థం చేసికొంటే అంతే సంగతులు.

భావ వివరణ:

ఓ నారసింహా! వెఱపు దెలుపు (భీతిని కలిగించు) నీ వేగిరమే (నీ తీవ్రత) నీవు "యెఱిగియున్ యెఱుగక యేమంటివో!! (నీవు యెరుగుదువో యెరుగవో అన్నట్లున్నావు స్వామీ!)

నీ రూపము నవలోకింపుము ప్రభూ! గోరపురుధిరము (రోత కలిగించు నెత్తురు) నీ గోళ్ళనుండి కురియుచును (కారుచున్నది). తోరమైన (బలిష్ఠమైన) ఆ తొడమీద గోరంట గోళ్ళ కోమలి (గోరింటాకు వలన యెఱ్ఱబడిన, నఖములు కలిగిన సుకుమారమైన శ్రీలక్ష్మి) నిలువగ (ఆయనను నిలువరించి శాంతపరుస్తుంటే) ఈరసమందక యేమంటివో (ఏమాత్రమూ ఆమెపై నీ ఆగ్రహము చూపక యేమివున్నావయ్యా!)

ఓ నృసింహా! నెత్తురుతో తడిసి ఎఱ్ఱబారిన నీపెదవులతో నీముఖము ప్రస్ఫుటముగా కనుపించుచున్నది. నీవు అటులుండగా, బిత్తరి వీడెపు బెదవులతో (ఎఱ్ఱని తాంబూలపు పెదవులుగల), మత్తకరిగమన (మదగజపుమెల్లని నడక గలిగిన) శ్రీలక్ష్మి మాటలాడగ (నీతో మృదువుగా మాటలు కలిపి పలుకరించగా) ఇంత అందాల ఇందిర నాదిరా అని యెత్తిన మదమున (ఇనుమడించిన గర్వముతో) ఏమంటివో (ఏమివున్నావయ్యా!!).

స్వామీ! ఆనన రౌద్రము (ముఖములో కొట్టొచ్చినట్లున్న కోపము) అట్టహాసము (వికటాట్టహాసమువంటి గర్జన) చేస్తున్న నిన్ను చూచి, ఒకింత ఆగ్రహించి తన భ్రుకుటిని ముడిచి చిరునవ్వుతోనే నిన్ను అదలించెడి (బెదరించుచున్న) సిరితో (శ్రీలక్ష్మితో) హీనాధికముల (యెక్కువతక్కువ మాట్లాడకుండా) యేమివున్నావు స్వామీ!!

ఆ దుష్ట హిరణ్యకశిపుడు నీ ప్రియ భక్తుడు ప్రహ్లాదుని పెట్టిన చిత్రహింసను తలచిన కొలదీ ఆగ్రహంతో నీకు వుద్రేకమధికమై పోయింది. నీ వూర్పులు (ఉచ్ఛ్వాస నిస్శ్వాసములు) పెదపెదలైనవి (అంతకంతకు అధికమైనవి). ఆ వుద్రేకంలో నీవు వాడి పేగులను పీకి జందెపు పోగులుగా వేసికొనినావు, ఆ పేగులపై నుంచి కారే నెత్తురు నీ పొట్టపై మిలమిల మెరుస్తున్నది. నీవిట్లావుంటే ఆ కోమలాంగి కంపించుట చేత తొలగిన పయ్యెద (జారి చెదిరిపోయినది). అట్టి అందాల భార్యతో యెట్టయెదుటనే నీవు యేమివున్నావు నారసింహా!

ఓ శ్రీవేంకటేశ్వరా! శాంత గంభీర సౌందర్యరత్నాకరుడవైన నీవే, ఈ ముడుచుకొనిన చింపినెరుల (చింపిరిజుట్టు)తో నున్న శిరస్సుగల నారసింహుడివా? నీ కంపముడిగినదా (కోపము తగ్గినదా) మరికనేమి? లక్ష్మీసతితో లంపటమందుచు (వ్యామోహ పడుతూ) ఇంపులు నెరపుచు (వలపులనొలకబోయుచు) యేమివున్నావయ్యా!! ఉగ్రనరసింహుడివి శాంత నరసింహుడివై నాబోటి భయస్థులకు దిక్కుమొక్కయినావు తండ్రీ!

సంపుటి: 6 కీర్తన : అతిశోభితేయం రాధా
సంఖ్య : 000 పుట : 35 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

13 అతిశోభితేయం రాధా
నతతవిలాసవశా రాధా. **॥ పల్లవి॥**

దర్పకబలబోధా రాధా
తర్పణగంధవిధా రాధా
దర్పయుతక్రోధా రాధా
దర్పకరసవేధా రాధా
తారితావరోధా రాధా
తారుణ్యోద్బోధా రాధా
ధారితానురోధా రాధా
దారితాపరాధా రాధా.
తరుణీమరుగాధా రాధా.
ధరసమకుచబాధా రాధా
తరుణసదనుబోధా రాధా
ధరణిదుస్సాధా రాధా. (?)
తనుభవగురుగాధా రాధా
స్తనకృతగిరిరోధా రాధా
తనువరవచనసుధా రాధా
ధ్వనిజితపికమేధా రాధా
తరుణసఖీసవిధా రాధా
దరశశిరుచిసౌధా రాధా
తరళితతటిద్విధా రాధా
దరహసనవరోధా రాధా
ధనగర్వనిషేధా రాధా

స్తవతత్పర విబుధా రాధా
ద్రవధునీకృతసుధా రాధా
దవమదనవ్యాధా రాధా
తరుణత్వ పురోధా రాధా
తరుణస్మరయోధా రాధా
తరుపశుమణిగుణధారక బహుల వి-
తరణపరా బహుధా రాధా.
దైవికసుఖోపధా రాధా
ద్రావకనిజాభిధా రాధా
శ్రీవేంకటగిరిదేవకృపాము-
దావైభవ నాథా రాధా.

అవతారిక:

సంస్కృతంలో ఒక విచిత్రమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది ఒక భజన. రాధాదేవిని ప్రస్తుతిస్తూ చెప్పిన కీర్తన. అన్నమయ్యమీద చైతన్య ప్రభువు (ఆయన సమకాలికుడే ఈయన) భక్తి ప్రభావం వుండటం వల్లనూ వారిమధ్య సంభాషణ సంస్కృతంలోనే జరిగివుండాలి. అందుకనే అన్నమయ్య చెప్పిన రాధా మాధవుల శృంగారకీర్తనలన్నీ గీర్వాణిలోనే వున్నాయి. ఈ కీర్తనలో ప్రతి చరణం రాధా అనే సంబోధనతో ముగియుచున్నందువలన ఇది భజన అయివుంటుందని నా అభిప్రాయం. ఉదాహరణకు, "అతిశోభితేయం" అని గాయకుడు అంటే... "రాధా" అని భజన బృందం అంటారు. "సతతవిలాసవశా" అని గాయకుడంటే, "రాధా" అని భజన బృందం అంటుంది. అన్నమాచార్యుల వారికి కూడా భజన సంప్రదాయంమీద మక్కువ యెక్కువే.

భావ వివరణ:

మిక్కిలి శోభ కలిగినదానివైన రాధా!
విలాసినియై నమస్కరింపబడుచున్న రాధా (పల్లవి) దర్పమను బలమును కలదానివైన రాధా!

తర్పణ సంస్కారయుతమైన దానా రాధా!
దర్పముతో కూడిన క్రోధమును కలిగిన రాధా!
మన్మథుడు కలిగించిన వేదనతో కూడిన రాధా!
కృష్ణునికై అవరోధములనన్నింటినీ తరించిన రాధా!
యౌవనమును ప్రేరేపించిన రాధా!
అనువర్తమును (అనుసరించినడచుటను) ధరించిన రాధా!
అపరాధములను సహించక ఖండించిన రాధా!
గోపాంగనలు వుదాహరణముగా చెప్పుకొనే రాధా!
ధారుణీభారముతో సమమైన కుచభారంచే పరితపించు రాధా!
తరుణులకు మంచిని బోధించు రాధా!
ధరణిలో అందరికీ దుస్సాధ్యమైన రాధా!
తనూభవుడైన మన్మథుని గురుగాథలను రచించురాధా!
గిరులకంటే వున్నతమైన స్తనయుగళముగల రాధా!
సౌందర్యమునకు సరితూగు సుధామయ వచనములు గల రాధా!
గండు కోయిల స్వరమును గెలువగల కంఠధ్వనిగల రాధా!
తరుణవయస్సుగల సఖులకు దగ్గరయైయున్న రాధా!
వెన్నెల నధిగమించు దంతముల కాంతిగల రాధా!
తళుక్కుమనిపించు మెరుపుతీగెవంటి నడుముకల రాధా!
మందహాసమున కొత్త కాంతులు కల రాధా!
ధనగర్వమును తృణీకరించు స్వభావముగల రాధా!
గోవిందుని స్తుతించుటలో ప్రావీణ్యముగల రాధా!
స్వరమున అమృత మాధుర్యమును స్రవించు రాధా!
మదనతాపముచే దహింపజేయు రాధా!
తరుణప్రాయములోనున్న రాధా!
తరుణప్రాయమున మన్మథ తాపము కలిగిన రాధా!
తరువులను, పశువులను ఆశ్రయించి బహుళముగా తిరిగే వితరణ కలిగిన రాధా!
దైవికముగా కలుగు సుఖమునకు మార్గమైన రాధా!
తననామోచ్చారణతోటే కృష్ణుని ద్రవింపజేయగల రాధా!
శ్రీవేంకటేశ్వరుని, కృపానందమను వైభవమున్న భర్తగల రాధా!

సంపుటి: 4 కీర్తన : తతిగాని యీపాటు దైవమా విచారించవే
సంఖ్య : 428 పుట : 287 రాగం: రామక్రియ

రామక్రియ

14 తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమ ॥ పల్లవి॥

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలులరొదలు ఆకాశమే ట్టోరిచెనో
కటకటా యిట్లాయఁ గలికాలమహిమ ॥తతి॥

అంగలాచేకామినుల యంగభంగపుదోఁపు
లింగితాన మింట సూర్యఁ డెట్టుచూచెనో
పొందు నానాజాతిచేత భువనమెట్లానెనో
కంగి లోకమిట్లాయఁ గలికాలమహిమ ॥తతి॥

అరుదు గోహత్యలు సేయఁగ దూడలంగలార్వ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధనచూర కెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెందణఁగెనో కలికాలమహిమ ॥తతి॥

దేవాలయాలు నానాదేశములెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావులేలేరాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలికాలమహిమ ॥తతి॥

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనలుండే విపరీతకాలమున
గరువాలుఁ గపటాలే కలికాలమహిమ ॥తతి॥

వుపమించి దంపతులు వొకరొకరినిఁ జూడ
చపల దు:ఖములతో సమయఁగాను
తపములు జపములు ధర్మము లెందణఁగెనో
కపురుఁబాపాలు నిండెఁ గలికాలమహిమ ॥తతి॥

తలలు పట్టీడువఁగా తల్లులు బిడ్డలవేయ
తలఁపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కలుగోయ మరుఁడెట్టు వోరిచెనో
కలఁకలే ఘనమాయఁ గలికాలమహిమ ॥తతి॥

దీనత లోఁబడి గుండెదిగు లసురుసురులు
వానినెట్లు లోఁగొ (నె) నో వాయుదేవుఁడు
గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తిక గోయఁ
గానఁబడె నింతేసి కలికాలమహిమ ॥తతి॥

పలుమారు నమ్మించి ప్రాణములు గొనఁగాను
యిలఁ దమలోఁ బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీవేంకటేశ నీవే యెరుఁగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమ ॥తతి॥ **428**

అవతారిక:

ఈ కీర్తనకి అవతారిక వ్రాస్తుంటే మానాన్నగారి తల్లి రాధమ్మగారు గుర్తుకు వచ్చింది. అరవైయేళ్ళ కిందటిమాట. ఐదేళ్ళ నేను మాటవినక ఎదిరిస్తే... కలికాలం నాయనా! కలికాలం. ఒక వినయం లేదు ఒక వందనం లేదు అనేది. ఆనాడు నిజంగా అర్థం తెలియని అజ్ఞానినైప్పటికీ ఆవిడ ఆత్మకి క్షమార్పణ చెబుతూ నేడు ఈ కీర్తనవల్ల నాకు కలిగే పుణ్యం ఆవిడ ఆత్మకి అందాలని దేవదేవుని ప్రార్థిస్తున్నాను.

కలికాలం యొక్క ప్రభావాన్ని వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ దైవమా! తతిగాని (కాస్త కూడా ఆసక్తి కలిగించని) యీ మానవుల అవస్థలు విచారించవయ్యా! నేడు నీకు చెప్పాలంటే ఇవన్నీ (ఈ మానవుల పాట్లన్నీ) కతలాయ (కథలు కథలుగా జెప్పవచ్చును) అంటున్నారు అన్నమయ్య. ఇది చాలా పెద్ద కీర్తన. ఇందులో కూడా నాటి రాజులను తీవ్రంగా నిరసించారు అన్నమయ్య. తల్లి చూస్తుండగానే కొడుకుని నరికివేసే రోజులొస్తాయట. నమ్మించి ప్రాణాలు తీసేవాళ్ళు కోకొల్లలుగా పుట్టుకొస్తారట. అయ్యా! కలికాలం... ఆకలికాలమా?

భావ వివరణ:

ఓ దైవమా! దైనందిన జీవితంలో ఈ మానవులు పడుతున్న యీపాటు (ఈ తిప్పలు) విచారించవే (కాస్త గ్రహించవయ్యా!) నేడు చెప్పన్ కతలాయన్ (అవి చెప్పాలంటే నేడు కథలు కథలుగా చెప్పవచ్చును). ఎందుకంటే, ఇది కలికాల మహిమ (కలియుగ ప్రభావం).

అప్పుడు జరిగే ఘోరాలు వినుము ప్రభూ. పూజింపబడవలసిన భూసురులు (బ్రాహ్మణులు) తుటుములై (సమూహముగా) తుండెములు మొండెములు (ఖండించబడిన మొండెములు) కలవారవుతారు. భూతములు (ప్రాణులన్నీ) ఇటువలె యెట్లు మోచెనో (ఇటువంటి అన్యాయం యెట్లు భరిస్తాయో!!)

తల్లిదండ్రులు మరణించిన బాలురు (చిన్నపిల్లల) రోదలు (యేడుపుతో) ఆకాశము నిండిపోతుంది. కటకటా! (అయ్యయ్యో!) ఇట్లా అయిపోయిందే ఈ కలికాలము!! హతవిధీ!

కామినుల (స్త్రీల) అంగభంగపుదోపు (మానభంగపు పాట్లు) అంగలార్చే (దు:ఖిస్తారు). ఈ ఘోరము మింటి (ఆకాశంలో) సూర్యుడు

యెట్లు చూచెనో (ఎట్లా సహిస్తాడో!!) నానాజాతులు (విభిన్న జాతివారు) పొంగుజేత (విజృంభణము వలన) ప్రపంచమెట్లు సహించునో కదా! హతవిధీ! కంగి (పోట్లాడుకుంటూ) ఈ లోకమంతా ఇట్లా చెడిపోయింది. ఆశ్చర్యకరముగా గోహత్యలు జరుగుతుంటాయి. దుర్మార్గులు అట్లా చేస్తుంటే లేగదూడలు అంగలార్వ (అల్లాడుతుంటాయి), సరి ఘర్మదేవత నీతిని విడువని ధర్మదేవత ఈ దురాగతమునెట్లు సమ్మతించునో (సహించునో)? పరుల ధనమును చూఱకు (కొల్లగొట్టుదురు). అందులకు లక్ష్మీదేవి యెట్లు పట్టాయెనో (అవకాశమిస్తుందో) హతవిధీ! ఈ మొదనష్టపు కలికాలమున కరుణ యెందరిగెనో (దయాదాక్షిణ్యాలు యెక్కడకు వెడలిపోయినవో!!)

వివిధ దేవాలయాలలో ఆయా దేవతలు నానా దేశములలో (అనేక రకములైన రాజులు పరిపాలించు దేశములలో) దేవగాజొచ్చి (దేవత రూపములలో ప్రవేశించి) యెట్లుండిరో ఆలోచిస్తేనే ఆశ్చర్యంగా వుంటుంది. ఎందుకంటే, ఆయా రాజ్యాలనేలే రాజులు అందరికీ దయ ఒకింతయే కానీ కావరము (పొగరు) మాత్రం ఘనమాయ (అత్యధికమే కదా!) కలికాలం మహిమ. ఇంతకంటే యేమి చెప్పగలము?

ఈ రాజుల అధర్మపాలనలలో అనేక సందర్భాలలో నిరపరాధుల శిక్షించబడ్డారు వారిని చంపి నెత్తురు ఏఱులై పారించారు. ఇదంతా చూచికూడా దిక్పాలకులైన ఇంద్రాది దేవతలు, తెరలక (తొలగిపోకుండా) ఇంకా దిక్కులను పాలిస్తూ యెందుకు వున్నారో? విపరీతమైన భావాలున్న ఈ కలికాలంలో విరసవర్తనులే (దుష్ప్రవర్తనగలవారే) అధికులుగా వుంటారు. వాళ్ళకందరికీ గర్వమూ, కపట స్వభావము తప్పించి వేరే గుణములెట్లావుంటాయి? మరి కలికాలం మహిమ అంటే అంతే.

దంపతులెట్లా వుంటారో చూడండి. భార్య తన భర్తను ఇంకొకడితో ఉపమించి (పోల్చి) చూచి నిరసిస్తుంటుంది. భర్త కూడా అట్లే చపల చిత్తంతో తన భార్యకన్న పరస్త్రీ యెక్కువ సుఖమిస్తుందనే భ్రమలో నిత్యమూ దు:ఖిస్తుంటారు. ఇక వారు అట్లా వుంటే వారి నైష్టిక కర్మలు తపములు జపములు, ధర్మములు యేమైపోతాయో కదా! ఈ కలికాలమంతా కపురు బాపాలతో ఘోరమైన పాపాలతో నిండిపోతుంది. ఇక ఇదింతే.

తల్లులు తమ స్వంత కన్నబిడ్డల్నే చంపేసుకొంటుంటారు. వాళ్ళ తలలను పట్టి ఈడ్చి పిల్లలను ఇంట్లోంచి వెడలగొడతారు. ఇదంతా వారి అంతరాత్మ యెట్లా సహిస్తుందో? వారికీ ఆలోచనే యెట్లా వస్తుందో? స్త్రీలను ముక్కలుగా కోయటాన్ని మరుడెట్లు (మన్మథుడు యెట్లు సహిస్తాడో)? కలకలే (దు:ఖములే) ఘనమాయ (అధికమౌతాయి) ఎవరూ యేమీ చేయలేని స్థితిలో వుంటారు.

ప్రజలంతా దీనత్వమునకు లోబడి ఉస్సురుస్సురని నిట్టూరుస్తూ జీవిస్తుంటారు అటువంటిదీనులకు వాయుదేవుడు కూడ యెలా సహకరించి ఉచ్ఛ్వాస నిస్స్వాసలు కల్పిస్తుంటాడో అర్థంకాదు. గూనువంచి (దాగికొనిన) తల్లి చూస్తుండగా కొడుకు కుత్తిక (గొంతు) పట్టుకొని కోయుట అనే దురాగతము కనబడే రోజులు వస్తాయి. ఇంతేసి (ఇంత ఘోరమైన) కలికాలమహిమ అది.

అనేక పర్యాయములు ప్రాణములు నమ్మించి తీసేవాళ్ళు పుట్టుకొస్తారు. వాళ్ళు అట్లా ప్రాణాలు గొనగాను (తీస్తుంటే) ఇక తమలో ప్రాణాలు యెవరికి నిలుస్తాయి? ఓ శ్రీవేంకటేశ్వరా! జీవులలో నెలవై (నిలిచియున్న) నీవే యెరుగుదువు గానీ ఇంకెవరికి తెలుస్తుంది తండ్రీ! ఈ దౌర్భాగ్యపు కలికాలములో కలుషమే ఘనమాయ (పాపమే పరమావధి అయిపోతుంది ప్రభూ!)

సంపుటి: 4 కీర్తన : ఒక్కఁడవె లోకానకొడయఁడవు నీవె
సంఖ్య : 41 పుట : 388 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

15 ఒక్కఁడవె లోకానకొడయుఁడవు నీవె
దిక్కుగా నెవ్వరులేరు తిమ్మినాయఁడా ॥ పల్లవి॥

బొడ్డుచెర్ల బొమ్మిరెడ్డి పొలమెల్లఁ జేడవెట్టి
గడ్డనుండి పైరువిత్తి కాచుకుండఁగా
దొడ్డగాఁ బండఁగఁ జూచి దోసకారి మొండిదొర
దిడ్డివఁదీసి కొంటఁబోయ తిమ్మినాయఁడా ॥ఒక్క॥

పాలకొల్ని చందిరెడ్డి పంటసేయఁ బొద్దులేక
గాలివీటి కాఁపురానఁ గసుగందఁగా
కోలుపుచు దినమూ నీకొండమీఁది నాయకులు
తీలుపరచేరుగదే తిమ్మినాయఁడా ॥ఒక్క॥

కామకొల్ని మారిరెడ్డి కనుచూపువారినెల్ల
కోమలపు చెలువలు గోరు, మెత్తగా
ప్రేమముతోఁగేదారి పెరిగి పండిన పంట
తేమరేగి ఊటువట్టె తిమ్మినాయుడా ॥ఒక్క॥

గుండుఁగంటి దేవిరెడ్డి కొలిచిన వండిపెట్టు
కుండఁ గాపరింటనింట కూడుమోయఁగా
పండిన బండ్లఁగొట్టి పంటలెల్ల నానాఁటి
తిండికొక్క కొలఁదాయ తిమ్మినాయుఁడా ॥ఒక్క॥

వెలిగొండ కాపిరెడ్డి వేఁకపు జీవనమెల్ల
తలమోఁచి తిరిపెమై తల్లడించఁగా
తెలిసి యాతనితో నొక్కటిగాఁగ నీగుట్టు
తెలిసె వేంకటగిరి తిమ్మినాయుఁడా ॥ఒక్క॥41

అవతారిక:

అన్నమాచార్యులవారి ఈ కీర్తన ప్రత్యేకత ఏమిటంటే 16వ శతాబ్ది నాటి రాయలసీమ రైతుల కష్టాలు కళ్ళకు కట్టిస్తున్నారు. ఇందులో అన్నమయ్య ప్రస్తావిస్తున్న రైతుల పేర్లు మనకు చరిత్రలో మరెక్కడా కనబడవు కాబట్టి అవి అన్నమయ్య కాలంనాటి కౌలు చేసే రైతుల పేర్లని మనము భావిస్తే తప్పులేదని నా వూహ. ఈ కీర్తనలో భక్తిగాని వైరాగ్యం గాని శృంగారంగానీ లేవు. కేవలం చారిత్రక సంఘటనల సంఘటితమే ఈ కీర్తన. తిమ్మయ్య అనేది జానపదులు వుపయోగించే శ్రీవేంకటేశ్వరుని పేరు. తిమ్మినాయుడు అనేది కూడా శ్రీవేంకటేశ్వరుని పేరే. పల్లవిని గమనిస్తే అన్నమయ్య ఒకింత ఆవేదనతో ఈ కీర్తన చెప్పారనిపిస్తున్నది. ఓ తిమ్మనాయుడా! ఈ లోకానికికంతకూ నీవే ఒడయడవు (భర్తవు) వేరే యెవ్వరూ దిక్కుగా లేరు అంటున్నారు.

భావ వివరణ:

ఓ తిమ్మనాయడా! (శ్రీవేంకటేశ్వరా) ఈ లోకమునకంతటికీ నీవు వొక్కడవే ఒడయడవు (భర్తవు). నీవు తప్పించి దిక్కుగా (రక్షణగా) వేరెవ్వరూ లేరు తండ్రీ! ఎందుకంటే దిక్కుగా వుండవలసిన పాలకులు భక్షకులైపోతున్నారు. స్వార్థం వెఱ్ఱితలలు వేస్తున్నది. బొడ్డుచెర్వు బొమ్మిరెడ్డి గారి పొలమంతా జేడవెట్టి (యెరువుతోలి) పైరువిత్తి, పంటకోసం నిరీక్షిస్తుంటే, పంట బాగా పండిందనే సంతోషం కూడా లేకుండా

దోసకారి (దుష్టుడైన) మొండిదొర "దిడ్డిఁదీసి" (అడ్డదారిగుండా వచ్చి) దోచుకొనిపోయాడు. ఓ తిమ్మినాయడా! ఏమిటీ దౌర్జన్యం!!

పాలకొల్ని చందిరెడ్డి పంటసాగుచేయుటకు, సమయములేక గాలివీటి కాపురాన (ఏమాత్రమూ నిలకడలేని సంసారంతో) కసుగందగ (మిక్కిలి పడలిపోయి) దినములు చెడగొట్టుకొంటుంటే, నీకొండ మీది నాయకులు, తీలుపరచేరు (అణగద్రొక్కారు.) ఓ తిమ్మనాయడా! ఏమిటీ అన్యాయం!! కామకొల్ని మారిరెడ్డి పేరుకుతగ్గవాడేనేమో అనిపిస్తున్నది. ఆయన కనబడ్డవారితోనెల్లా సౌందర్యారాధన జరుపుతుంటాడు. ఆయన యజమాయిషీలో పండిన పంట కూడా ప్రేమగానే తేమరేగి (నీరుయెక్కువై) ఊట వట్టె (చెడిపోయింది) స్వామీ! ఓ తిమ్మనాయడా! ఇటువంటి వాళ్ళ సాగులో ఇక బాగుపడేదేముంటుంది? గుండు గంటికి చెందిన "కొలచిన దేవిరెడ్డి" వండిపెట్టే కుండతో తనయజమానియొక్క ఇంటికి కూడు మోయగా తను చేస్తున్న పంట చెడిపోయి తను రోజూ తిండికే కొలదాయ (కొఱత యేర్పడినది).

ఓ తిమ్మనాయడా ఏమిటీ వైపరీత్యం? వెలిగొండ కాపిరెడ్డి వేకపు జీవనమెల్లా (బికారి జీవితమంతా) తలవంచుకొని ముష్టియెత్తి జీవించాడు. ఎంతో తల్లడిల్లిపోయాడు. ఇది తెలిసి అతనితో స్నేహబంధమేర్పరచుకొని ఒకటైపోయాక నీ గుట్టు తెలిసిపోయింది. ఓ తిమ్మనాయడా! నీవు వైకుంఠంలో కాదయ్యా నీవు కోపిరెడ్డిలాంటివారిలోనే వుంటావు. నీవు అమితమైన కరుణామూర్తివి ప్రభూ!

సంపుటి: 4 కీర్తన : వినరయ్య నరసింహవిజయము జనులాల
సంఖ్య : 513 పుట : 345 రాగం: నాట

నాట

16 వినరయ్య నరసింహవిజయము జనులాల
అనిశము సంపదలు నాయువు నొసఁగును ॥ పల్లవి॥

మొదలఁ గొలువుకూటమున నుండి కశిపుఁడు
చదివించెఁ బ్రహ్లాదుని శాస్త్రములు
అదన నాతఁడు నారాయణుఁడే దైవమనె
అదిరిపడి దైత్యుఁడు అతనిఁ జూపుమనె ॥వినర॥

అంతటఁ బ్రహ్లాదుఁడు 'అన్నిటానున్నాఁ'డనియె
పంతమున దానవుఁడు బాలునిఁ జూచి
యెంతయుఁ గడఁకతోడ 'ఇందులోఁ జూపు'మని
చెంతనున్న కంబము చేతఁగొని వేసె ॥వినర॥

అటమీఁదట బ్రహ్మాండం బదరుచు
కుటిలభయంకరఘోషముతో
చిట చిట చిటమని పెట పెట పెటమని
పటపట మనుచును బగిలెఁ గంబము ॥వినర॥

కులగిరు లదరెను కుంభిని వడఁకెను
తలఁకిరి దైత్యులు తల్లడిలి
కలఁగెను జగములు కంపించె జగములు
ప్రళయకాలగతిఁ బాటిల్లె నపుడు ॥వినర॥

ఘననారసింహుఁ డదె కంబమునందు వెడలె
కనుపట్టె నదిగొ చక్రజ్వాలలు
మునుకొని వెడలెఁ గార్ముకముక్తశరములు
కనకకశిపునకుఁ గలఁగె గుండియలు ॥వినర॥

అదరె నద్దేవునికోపాగ్నులు బెడిదపు –
మిడుఁగురులతోడుత మిన్నులుముట్టి
పిడుగులురాలేటిభీకరనఖరములు
గడుసు రక్కసునికి గాలములై తగిలె ॥వినర॥

తొడికి పట్టి విష్ణుఁడు తొడమీఁద నిడుకొని
కడుపు చించెను వానిగర్వమడఁగ
వెడలెఁ జిల్లున వానివేఁడి నెత్తురు నింగికి
పొడి వొడియాయ శత్రుభూషణములెల్లను ॥వినర॥

నెళ నెళన విరిచె నిక్క వానియెముకలు
పెళపెళ నారిచి పెచ్చు వెరిగె హరి
జుళిపించి పేగులు జంద్యాలుగా వేసుకొనె
తళుకుఁగోరలు తళతళమని మెరిచె ॥వినర॥

పెటలించి నరములు పెరికి కుప్పలువేసి
గుటగుటమని రొప్పె గోవిందుఁడు
చిటిలించి కండలు చెక్కలు వారఁజెండి
కుటిలదానవుఁ జూచి 'ఖో' యని యార్చెను ॥వినర॥

తెంచి శిరోజములు దిక్కులకు వాని –
పంచప్రాణములుగొనెఁ బరమాత్ముఁడు
అంచెల నీరీతిని ప్రహ్లాదునిపగ నీఁగె

మించి దేవతలు మితిమీఱి జయవెట్టిరి ॥వినర॥

అప్పు డిందిరాదేవి యంకమునఁ గూచుండె
వొప్పుగ శాంతమందె నహోబలేశుఁడు
తప్పక కోనేటిదండఁ దానై యిందును నందు
చిప్పిల వరములిచ్చీ శ్రీవేంకటశుఁడు ॥వినర॥

అవతారిక:

నేను మూడు సంవత్సరముల క్రిందట భాగవతగాధలు అనే పేరుతో త్రివిక్రమ విజయం అనే వామనావతార ఆవిష్కరణ గాధ వివరించాను. దానికి మాతృక బమ్మెరపోతనామాత్య విరచిత ఆంధ్రమహాభాగవతము. సాధ్యమైనంతవరకు మూలమునే అనుసరించి తెలుగు వచనంలో వ్రాశాను. అక్కడక్కడా కొన్ని పద్యాలను వినిపించాను. అవన్నీ పోతనామాత్యులవారి స్ఫూర్తితో నాకు స్ఫురించినవే. అదే భాగవత గాధలలో పరశురామావతార వైశిష్ట్యాన్నికూడా గద్యపద్య రచనగా అందించాను. ముందు ముందు తరాలు భాగవతపఠనం యెంత చేస్తారనేది భగవదేచ్ఛ అయినప్పటికీ www.geetadeeksha.com అనే నా website లోకి వెళ్తే ఎవరైనా చదువుకోవచ్చు.

ఆవిధంగా నేను నాకు తోచిన భగవత్సేవ చేశాను. కాని ఆనాడు నరసింహావతార గాధను ఎందుకనో చేపట్టలేదు. ఈరోజు అన్నమాచార్యులవారి రూపంలో ఆలోటు తీరుతోంది. ఇది చాలా పొడవైన కీర్తన. పొడవుకు పొడవైన పురుషోత్తముని, నృసింహావతార గాధను అన్నమాచార్యులవారి కీర్తన రూపంలో వివరించడం నిజంగా నా సుకృతమే. చాలా కాలానికి నా కోరిక నెరవేరుతున్నది.

"జనులాల! వినరయ్య నరసింహ విజయము

అనిశము సంపదలు నాయువు నొసగును' – అని ఫలశ్రుతిని కూడా పల్లవిలోనే గానం చేస్తున్నారు అన్నమయ్య

మరింక ఆలస్యమెందుకు? మొదలుపెట్టండి. అహోబల నరసింహుని విజయము అన్నమయ్య ఆవిష్కరణము.

భావ వివరణ:

ఓ జనులారా! అనిశము (యెల్లప్పుడూ) నరసింహ విజయ చరిత్రమును వినరయ్యా! దాని శ్రవణము మీకు ఆయువు (ఆయుర్దాయమును) సంపదలను ఒసగును.

తొలిరోజులలో హిరణ్యకశిపుడు తన పుత్రుడైన ప్రహ్లాదుని తన కొలువు కూటమునుండి (రాజధానినుండి) శాస్త్రములను చదివించుటకు గురువుల కడకు పంపెను. అదన (అదే తడవుగా ఆ ప్రహ్లాదుడు నారాయణుడొక్కడే దేవదేవుడనెను అదిరిపడిన (చకితుడైన) దనుజుడు అయితే ఆ ఆనారాయణుని తనకు చూపుమని నిర్బంధించెను.

అంతట ప్రహ్లాదుడు "ఇందుగలడందులేడని సందేహమేల? నారాయణుడు యెందెందు వెదకి చూచిన అందందే కలడు" అన్నాడు. పంతము బట్టిన దానవుడు బాలప్రహ్లాదుని జూచి యెంతయున్, కడకతోడ (ప్రయత్నముతో) చెంతనున్న ఒక స్తంభమును చూపించి అయితే ఇందులో హరిని చూపించరా అని చేతితో మోది ఆ స్తంభమును ఒక్క తన్నుతన్నాడు.

అటుమీదట (అంతట) బ్రహ్మాండమంతయు అదిరిపడునంత దారుణము, భయంకరము అయిన ఘోషముతో (ధ్వనితో) ఆ కంభము (స్తంభము) చిట చిటమని చిట్లిపోయింది. పెట పెట పెటమని పెగుళ్ళు రేచింది. పట పటమని పగిలిపోయింది.

ఆ ధ్వనికి కులగిరులదిరెను (భూమిపైనున్న కులపర్వతములు అదిరిపడినవి). కుంభిని (భూదేవి గడగడమని వణకిపోయింది). తల్లడిల్లిపోయిన (చలించిపోయిన) రాక్షసులంతా తలకిరి (భయపడిపోయారు) లోకములన్నియు కలగెను (సంక్షోభించాయి). జగత్తు అంతా ప్రళయ కాలము వాటిల్లబోతున్నదా అన్నట్లు కంపించిపోయింది.

ఘనుడైన నారసింహుడు (నరుని యొక్క మొండెము, సింహము యొక్క తల, వాడియైన గోళ్ళు గల భయంకరాకారముతో) అదె కంబమునందుండి వెడలె (బ్రయటకు వచ్చాడు) అదిగో అదే కనుపట్టి చక్రజ్వాలలు (వలయాకారములో ఆవరించుకొనిన అగ్నిజ్వాలలు కనబడినవి). కార్ముకమునుండి వెడలిన (అప్రతిహతమైన విష్ణు ధనస్సు నుండి విడువబడిన శరములు (బాణములు) మునుకొని వెడలె (ముందరపడి ఆ ధనస్సు నుండి వెడలినవి). అది చూచి హిరణ్యకశిపునకు గుండెలు అదిరిపడినవి.

నృసింహదేవుని కోపాగ్నులు అడరెన్ (అతిశయించినవి) బెడిదపు (అధికమైన) మిణుగురులవలె నిప్పురవ్వలతో ఆకాశము నిండిపోయినది. ఆ స్వామి నఖరములు (గోళ్ళు) గీరుతుంటే పిడుగులు రాలుతున్న భయంకర ధ్వనులు వినవైనవి. ఆ గోళ్ళు దుర్మార్గుడైన ఆ హిరణ్యకశిపునికి గాలములై తగిలినవి.

నృసింహుడైన ఆ విష్ణుమూర్తి వాడిని తొడికిపట్టి (ఒడిసిపట్టుకొని) తన తొడమీద బెట్టుకొని వాని కడుపును చించివేసెను. దానితో వాని గర్వము కూడా అడగెను (నశించెను). వాని వేడినెత్తురు ఆకాశమునకు జిల్లున వెదజల్లబడెను. శత్రువైన ఆ హిరణ్యకశిపుని భూషణములు (నగలు) ఆ నృసింహుని బలమునకు నుగ్గు నుగ్గయి పొడిపొడిగా రాలిపడినవి.

ఆ హరి (నరసింహరూపుడైన స్వామి) పొడుచుకొనివచ్చిన వాని యెముకలను నెళనెళమని ధ్వని వచ్చునట్లు విరిచివేశాడు. పెళపెళన్ ఆరిచి (పెళపెళమని

ఆడించి) పెచ్చుపెరిగాడు. వాడి పేగులు వూడదీసి జళిపించి (విదలించి) జంధ్యపు పోగులుగా మెడలో వేసికొనినాడు. ఆకాశములో మెరపులు మెరుస్తున్నట్లు అప్పుడు ఆయన కోరలు (ములుకు దంతములు) తళతళమని తళుక్కున మెరసినవి.

ఆ ఉగ్రనారసింహుడు హిరణ్యకశిపుని వధించిన భీకరలీల యెలావున్నదో వినండి. ఆయన వాడి యొక్క నరములను ఫెటలించినాడు (త్రెంచివేసినాడు). వాటిని పెరికి కుప్పలుగా పోసినాడు. ఆ భీభత్సమైన పని చేసినందువలన ఆ గోవిందునికి రొప్పు కలిగి గుటగుటమని ధ్వని వచ్చునట్లు రొప్పినాడు.

కాని ఇంతలోనే బాలుడు మరియు తన భక్తుడైన ప్రహ్లాదుని వాడు బాధించి ఇబ్బంది పెట్టిన వైనం గుర్తుకు వచ్చి వెంటనే వాడి కండలను చిట్లించి, చెక్కలువార (చిన్న చిన్న ముక్కలయ్యేట్లు చిట్లగొట్టి) కుటిలుడైన (కుత్సితబుద్ధికల) ఆ దానవుని జూచి 'ఖో" యని వికృతముగా ఆ నరసింహుడు అర్చెను (పెద్ద కేకపెట్టాడు).

అంతట ఆ నరసింహుడు ఇంకా తన కోపం చల్లారక వాడి (ఆ రాక్షసుడి) తల వెంట్రుకలను వూడపీకి నలుదిక్కులకు విసరివేశాడు. పరమాత్ముడైన ఆ దేవదేవుడు అంతటితో చాలించి వాని పంచప్రాణములను ఒక్కసారిగా హరించివేసినాడు. ఈ రీతిగా ఆ హరి అంచెలంచెలుగా తన భక్తుని పగను ఈగె (తీర్చినాడు). మించి (నింగినుండి) ఇదంతా పరికించుచున్న దేవతలు మితిమీరిన ఆనందంతో, జయవెట్టిరి (జయజయ ధ్వానములు చేసిరి).

అంతలోనే ఇందిరాదేవి (శ్రీలక్ష్మి) ఆయనను శాంతపరచుటకు అక్కడకు వచ్చి మనోహరంగా ఆయన తొడపై కూర్చొనినది. అంతట అహోబలేశ్వరుడైన ఆ నరసింహుడు ఒప్పుగ (తగినట్లు) శాంతమందే (శాంతము వహించినాడు). ఆయనే పావనమైన కోనేటి ఒడ్డున శ్రీవేంకటేశ్వరుడు కూడా తానే అయి చిప్పిలునట్టి (పెల్లుబికిన) వరములను అనేకము ఒసగి అనుగ్రహించి తన దాసులను రక్షించినాడు.

సంపుటి: 4 కీర్తన : కటకటా మీరితివి కలికాలమా – పుణ్య
సంఖ్య : 77 పుట : 412 రాగం: ఆహిరి

ఆహిరి

17 కటకటా మీరితివి కలికాలమా – పుణ్య
ఘటన గరవై పోయెఁ గలికాలమా ॥ పల్లవి॥

భూసురుల కామినులు బోయల నామి (యు?) కులఁ
జేసుకొని యాండ్లె చిచ్చురికిరి
యీసునను నీవలన నెక్కువకులములెల్ల
కాసు సేయకపోయెఁ గలికాలమా ॥కట॥

అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునునైరి
వన్నె సెడి యతులు ధనవంతులైరి
ఇన్నియును జేసితిని యింకనైనా నీకు
కన్నీరు రాదుగా కలికాలమా ॥కట॥

*** అరుదగుఁ బతివ్రతలు అభిమానవతులు పలు**
దొరలకమ్ముడు వోయి తొత్తులైరి
చిరకాల సుకృతమున చిత్తమునఁ గొంతైన
కరుణ మార్పితివిగా కలికాలమా ॥కట॥

కోవిదుల మను దొరల కులరాణి వాసములు
త్రోవలనె లంజలై తుదిమీరిరి
ఏవంకఁ జూచినా యిట్లనే ధర్మంబు
గావు వట్టితివిగా కలికాలమా ॥కట॥

పట్టభద్రుల నతులు పలుమారు నింద
*** దిట్టు దిరిపెంబులై దీనులైరి**
ది (ఇ?) ట్లైనఁ దిరువేంకటేశుదాసులు నిన్నుఁ
గట్టవేతురుసుమీ కలికాలమా ॥కట॥77

అవతారిక:

"కటకటా"! అంటే నేటికాలంలో అయ్యయ్యో!! అనడం అన్నమాట. పాతకాలంనాటి వాళ్ళు అంటుంటారు అయ్యయ్యో! కలికాలం వచ్చేసిందండీ! ఏమిటీఘోరం? మరీ దారుణంగా వున్నది. ఎక్కడా పుణ్యఘటన అనేమాటే కరువైపోయిందే? అంటున్నారు అన్నమాచార్యులవారు. భగవద్గీత అర్జున విషాదయోగంలో చెప్పినట్లు కులవ్యవస్థ రూపుమాసిపోతుంది. వర్ణ సంకరమైనందువల్ల ఎవరి ధర్మం వారు ఆచరించడం అనేది వుండదు. అడిగేవాడూ వుండడు. మంచి చెప్పేవాడు అసలే వుండడు. ధనముంటే యేపని చేసినా అడ్డు చెప్పేవారుండరు అనే అహంకారులు తయారవుతారు. అన్నా చెల్లెలు వరుస అయిన వారు పెళ్ళి చేసికొంటారుట. బ్రాహ్మణుల ఆడపిల్లలను బోయలు వివాహమాడతారట. భర్త రక్షణలో వుండాల్సిన భార్యలను దొరలు కొనుక్కుంటారట. రాణివాసాలలో రంకులు జరుగుతాయట. ఏవైపు చూచినా 'ధర్మం' అనే వ్యవస్థే వుండదట. పట్టభద్రులు అంటే నేటి నవీన కాలంలో "డిగ్రీలు పీజీలు" వున్నవాళ్ళు అన్నమాట. వాళ్ళంతా దీనావస్థలో ముష్టియెత్తి జీవిస్తారట. "600 సంవత్సరాల" క్రిందట ఒక మహానుభావుడి కీర్తనలో నానాటికి పతనమవుతున్న మన వ్యవస్థ గురించి ఇంత చక్కగా చెప్పటం ఆశ్చర్యంగాలేదూ? కిలుము పట్టిన **అడ్డగీతలోని** పూరణ ఆచార్యులవారి స్ఫూర్తితో ఈ రచయిత చేసినదే. పరిష్కర్తలు "..." అని పదలివేసియున్నారు. పొరబాటనిపిస్తే పెద్దలకి, క్షంతవ్యుడను.

భావ వివరణ:

కటకటా! (అయ్యయ్యో!) ఓ కలికాలమా! మీరితివి (హద్దునతిక్రమించితివి కదే!) నీ ప్రభావమువల్ల పుణ్య ఘటనలు (మంచిపనులే) కరవై పోయెను (అరుదైపోయాయి, లేకుండా కూడా పోతున్నాయి). "ఆ కలికాల ప్రభావం" వల్ల యేమి జరుగుతున్నదో వినండి.

భూసురుల కామినులు (సదాచారము పాటించవలసిన బ్రాహ్మణ యువతులు) బోయల (బోయవారిని) నాయకుల జేసికొని (మగనిగా

యెంచుకొని) ఆండ్రె (భార్యలై) చిచ్చురికిరి. చివరికి (ఆపస్మరణము పొందిరి). ఈసునను (ఈర్ష్య పెచ్చుపెరిగి) నీ వలన (నీ ప్రభావముచేత) యెక్కువ కులములెల్ల (అగ్రకులములన్నీ) కాసుసేయకపోయె (దమ్మిడీ విలువ జేయక, మేము అగ్రకులస్థులం కాదు బాబోయ్ అనే రోజులు వస్తాయి). కలికాలమా! యెంత దౌర్భాగ్యమే?

"అన్నలును జెల్లెండ్లు నాండ్లు మగలునునైరి" (అన్న చెల్లెలు వరుస అయిన స్త్రీ పురుషులు శాస్త్రము లేదూ చట్టు బండలూ లేదని పెళ్లి చేసికొంటారు.) యతులు (సన్యసించిన ధర్మబోధకులు) వన్నెసెడి (పేరు ప్రతిష్ఠ మఱచి) ధనవంతులైపోతారు. ఇన్నియును చేసికూడా, నీకు కన్నీరు అనేదే రాదు. ఓ కలికాలమా! నీవెక్కడ దాపురించావే?

'పతివ్రతలు' అనేవారే మచ్చుకి కూడా లేకుండా పోతారు. అభిమానవతులైన స్త్రీలు కూడా యెంతో మంది "దొరలకు" అమ్ముడుపోయి తొత్తులైరి (బానిసలైపోతారు). చిరకాలము సుకృతము చేయుటకు అలవాటు కలిగినవారు మాత్రం చిత్తమున కొంతైనా కరుణవుండి మార్పుకు ప్రయత్నిస్తుంటారు. కాని నీవు వారి ఆటలు సాగనీయవు. ఓ కలికాలమా నిన్నెవ్వరు నెగ్గగలరు?

కోవిదులు (శాస్త్రము తెలిసిన) పండితులము అనే దొరలు అగ్రకులస్త్రీల ఇంటి త్రోవలబట్టి వారిని చెడు వర్తనులను చేసినందువలన వారు లంజలై (వ్యభిచారిణులై) తుదిమీరిరి (హద్దులు లేకుండా పోతారు). ఏవంక జూచినా (ఎటువైపు జూచినా) ఇట్లనే ధర్మంబు గావుబట్టితివి కదా! (నాశనమైపోయింది కదా!) కలికాలమా! యెంత దరిద్రం దాపురించబోతున్నదే!

పట్టభద్రుల నతల (బాగా చదువుకొనిన విద్యాధికులు కూడా అణగిమణగివుంటారు.) పలుమారు (అనేక పర్యాయములు) నిందలతోనూ తిట్లతోనూ తిరిపెంబులై (బిచ్చగాండ్లవలె) దీనులైరి (దీనావస్థలో వుంటారు). ఇట్లైన (ఇదంతా ఇటున్నా కూడా).... ఓ కలికాలమా! నిన్ను వేంకటేశ్వరుని శరణాగతులు మాత్రం కట్టవేతురు (కట్టేసి పడేస్తారు). జాగ్రత్త! వారి జోలికి పోవద్దు.

సంపుటి: 14 కీర్తన : మలఘుని నిన్నపెరుమాళ్ళు వీడే
సంఖ్య : 368 పుట : 213 రాగం: సామంతం

సామంతం

18 మలఘునినిన్న పెరుమాళ్లు వీఁడే
వెలయ రాజసమున విష్ణువీఁగీ వాఁడే ॥ పల్లవి॥

నాలినిద్దరు దేవుళ్ళ నడుమ నిలుచుండి
కైలాటాలు చల్లీనదె కనుఁగొనల
వేళవేళఁ బొత్తులను విందులారగించుకొంటా
వాలి కొలువుండీఁ దిరువాముడి మంటపాన ॥మలఘు॥

ఆటలుఁ బాటలుఁ జూచి అంగరంగవైభవముల
నీటుతోడ సొమ్ములెల్లా నిండాఁ బెట్టుక
గాఁటపు పూదండలతోఁ గస్తూరినామములతో
మేఁటి సింహాసనముపై మించేరు కళల ॥మలఘు॥

తామెరకొలనువలెఁ దగఁ దిరుచేల చాతి
కోమలులిద్దరుఁ దాను కుచ్చళ్ళు వోసి
ప్రేమఁగరకజడలు పిరిఁది దిండ్లు దీరిచి
కామించి నవ్వీ వాఁడే కల్యాణవేదికను ॥మలఘు॥

ముత్తేల చొల్లెపుచుట్టు ముంగురులపైఁ గప్పి
మెత్తిన గందపుఁబూత మేన నిండఁగా
హత్తిన పూవుదండలమర జల్లులలోని-
కొత్తమేలుకట్లలోను గూచున్నాఁడు వీఁడె ॥మలఘు॥

కుడియమకొప్పుల కుళ్ళాయి పాగచుంగుల
బెడిదపు దంపతులు పెండ్లిచవికెలో
అడరి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
పుడమిఁ గూడున్నవారు భోగపురతులను ॥మలఘు॥368

అవతారిక:

దేవుని కళ్యాణమహోత్సవ సందర్భంగా అన్నమాచార్యులవారు వినిపించిన కీర్తన ఇది. వైష్ణవ పరిభాషలో ప్రయోగించే పడికట్టు పదములు చాలా వున్నాయి.

"పెరుమాళ్ళు" అంటే శ్రీవేంకటేశ్వరుడు. "పెరియపిరాట్టి" అంటే లక్ష్మీదేవి. "మలఘుననిన్నపెరిమాళ్ళు" అంటే... కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు అని భావించాలి. "తిరువాముడి మంటపము" అంటే కళ్యాణమండపము. 'మేలుకట్లు' అంటే (మెట్లమాదిరికట్టిన ఉన్నతాసనము). "పిరిది దిండ్లు" అంటే కూర్చున్నప్పుడు మెత్తగా వుండటానికి వేసికొనే పరుపు. "చొల్లెపుచుట్టు" అంటే చుట్టచుట్టిన సిగకట్టు. ఈయన దేవేరులైన శ్రీదేవి, భూదేవి ఎంతమనోహరంగా వున్నారంటే ఒకామెకు కొప్పు ఎడమవైపుకు చుట్టబడివుంటే ఇంకొకామెకు కుడివైపుకు చుట్టబడి వుందట. స్వామివారికి కుళ్ళాయి పాగ చుంగలుగా చుట్టారట. మొత్తానికి ఈ కీర్తనకి ప్రతిపదార్ధం వివరించాలంటే అసామాన్య పాండిత్యం ద్రవిడ భాషలలో కూడా వుండాలి. నాకు అంత శక్తి లేదు తండ్రీ! అయినా ప్రయత్నం మానను.

భావ వివరణ:

ఓ ప్రజలారా! వీడే (ఈ స్వామియే) మలఘుననిన్నపెరుమాళ్ళు (కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు) ఈ స్వామిని పరికించి చూచినారా? రాజసమున (రాచఠీవితో) విఱ్ఱవీగీని (అతిశయించుచున్నాడు), వాడే (ఆ శ్రీవేంకటేశ్వరుడే).

ఈ స్వామి, ఇద్దరు దేవుళ్ళనడుమ (దేవేరిల మధ్య) నాలిగా (మందముగా) నిలుచున్నాడు. అదే "కైలాటాలు" చల్లీను (మాయోపాయములు పన్నుతున్నాడు). కనుగొనల ద్వారా సైగలు చేయుచున్నాడు. వేళవేళా (ఆయావేళకు తగినట్లు) పొత్తులను ఇద్దరితో జంటగా విందులు

ఆరగించుచున్నాడు. ఈ విధముగా ఇద్దరు దేవేరులతో తిరువాముడి మండపాన (కళ్యాణమంటపమున) వాలి కొలువుండీ (అతిశయముగా కొలువుదీరియున్నాడు).

ఈ కళ్యాణ మహోత్సవ సందర్భంగా ఆడేవారు ఆడుతున్నారు. పాడేవారు పాడుతున్నారు. అంగరంగ వైభవముతో స్వామి అలరారుచున్నాడు. సామ్ములన్నీ నీటతోడ నిండా బెట్టుకనున్నాడు (తమ ఆభరణములనన్నింటినీ పూర్తిగా అలంకరింపజేసికొన్నారు). గొలుపు పూదండలతో (ఒత్తుగా కట్టిన పూలదండలతో) వున్నవారికి కస్తూరి నామము నల్లగా అందముగా కనుపించుచున్నది. ఈ ముగ్గురూ మేటి సింహాసనముపై కళల మించేరు (కళలను విరజిమ్ముతూ) అతిశయించు ఠీవిగా కూర్చొనియున్నారు).

ఆ కోమలులిద్దరితోపాటు స్వామికి కూడా కుచ్చళ్ళుపోసి మంగళవస్త్రాలు ధరింపజేసి, తామరకొలను ఒడ్డున మెత్తని దిండ్లు అమర్చిన మెత్తలపై ప్రేమగా చూపులు విరజిమ్ముతూ సుఖాసీనులైనారు. ఆ కళ్యాణవేదిక మీద కామించి నవ్వీను అదే (కోర్కెతో చిరునవ్వులొలికిస్తూవున్నాడు ఆ స్వామి).

ఈ దేవదేవుని కేశాలంకరణ చూడండి. ఈయన కొప్పుచుట్టూ ముత్యాలదండ గట్టిగా బిగించారు. వారి ఒంటిపై ఒత్తుగా, నిండుగా మంచి గంధము పూత మెత్తారు. మళ్ళీ ఒత్తైన పూదండలతో వారిని అలంకరించారు కొత్తగా మెట్లవలె అంచెలంచలుగా అమర్చిన ఆసనముపై కూర్చున్నాడే వాడే నిత్య పెళ్ళికొడుకు.

ఒక దేవేరికి కుడివైపున కొప్పు వంగివున్నది. ఇంకొక దేవేరికి ఎడమవైపు కొప్పు వంగి వున్నది. స్వామికి కుళ్ళాయి పాగా తలకి అందముగా చుట్టారు. బెడిదపు దంపతులను (సర్వాధికులైన ఆ దంపతులను) పెండ్లిచవికెలో (కళ్యాణ వేదికపై) అమర్చినారు. అదరి (అతిశయించిన) శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగయును తానునూ, అఖండమైన భూలోక వైభవము కొరకు కూడియున్నారు. భోగపురతుల దేలుచూ నయనానందకరముగానున్నారు.

సంపుటి: 2 కీర్తన : సర్వోపాయముల జగతినాకితడే
సంఖ్య : 132 పుట : 89 రాగం: మలహరి

మలహరి

19 సర్వోపాయముల జగతినాకితడే
వుర్వీధవుడు పురుషోత్తముండితడే ॥ పల్లవి॥

సకలగంగాదితీర్థస్నానఫలము లివి స్వామిపుష్కరణిజలమే నాకు
సకలపుణ్యక్షేత్రావాసయాత్ర లివి సరి వేంకటాచలవిహార మిదియే
సకలవేదాధ్యయన శాస్త్రపాఠంబు లివి శౌరిసంకీర్తనం బిదియే నాకు
సకలకర్మానుష్ఠానముల యితని కిచ్చటఁజాతుపడికైంకర్య మిదియే ॥సర్వో॥

ఉపవాసతపము లివి యితనిప్రసాదంబు లొగి భుజింపుటే నాకు దినదినంబు
జపరహస్యోపదేశంబు లితనిపాదజలంబులుశరణనేటిసేవ యొకటే
ఉపమింపఁ బుణ్యపురుషులదర్శనము నాకు నొగినిచటి బహువృక్షదర్శనంబు
యెపుడుఁ బుణ్యకథాశ్రణంబు లిచ్చోటియెన్నఁగలబహుపక్షి కలకలఁబు ॥సర్వో॥

తలఁపుగలయోగంబులందు శ్రీవైష్ణవులఁ దగులుసంవాస సహయోగంబు
వెలయు నిండుమహోత్సవంబు లిన్నియునితనివిభవంబు

లెసఁగు తిరునాళ్లు నాకు
చెలఁగి యిటు దేవతాప్రార్థనింతయు నాకు శ్రీవేంకటేశ్వరుని శరణాగతి
అలరునాసంపదలు యితని పట్టపురాణి అలమేలుమంగ కడకంటి చూపు ॥సర్వో॥132

అవతారిక:

దాదాపు ఇరువది సంవత్సరాలక్రిందట ఎం.ఎస్. సుబ్బలక్ష్మి గారి మధుర కంఠంలో ఈ కీర్తనవిని మంత్రముగ్ధుడినయినమాట నిజమే అయినా నా"భావయామి వేంకటేశవమ్"లో గాని, తదనంతరంగాని నేను ఈ కీర్తన యెన్నుకొనకపోవుటకు కారణమేమంటే... దీనిని షిర్డీసాయిపరంగా నేను అనుదినమూ బహుతరచుగా పాడుకోవటమే. కాని ఏడుకొండలవాడిని తప్పించుకొని తిరిగితే ఆయన తిరగనిస్తాడా?

1029వ కీర్తనగా నేడు "పొడవుకు పొడవైన పురుషోత్తమా" అనే ఈ సంపుటిలో దీనిని యెన్నుకొనక తప్పలేదు. దేవదేవా! తిరువేంకటేశ్వరా! నన్ను క్షమించు తండ్రీ! నా అజ్ఞానానికి నన్ను క్షమించు. "సర్వోపాయముల నీవే" అంటే ఇదే కదా! హరియైనా నీవే, హరుడైనీ నీవే, సాయిబాబా అయినా నీవే సర్వమూ నీవే. నా ఆత్మకూడా నీవే. మరి ఈ బేధభావము అజ్ఞానంవల్లనే కదా! ఉన్నది ఒకటే పరబ్రహ్మతత్వం దానికి ఏపేరుపెట్టినా ఒకటే. ఇప్పుడీ కీర్తనను ఇంకా స్పష్టతవున్న మనస్సుతో వ్రాస్తున్నాను.

భావ వివరణ:

ఓ భక్తులారా! సర్వోపాయముల (నవవిధ భక్తిమార్గములన్నింటితో ఆరాధించుటకు) జగతి (ఈ ప్రపంచమున) నాకు ఇతడొక్కడే మిగిలియున్నాడు. ఈయన మరెవరో కాదు ఉర్వీధవుడు (భూదేవీ వల్లభుడు). సర్వులూ పురుషోత్తముడని కీర్తించే దేవదేవుడు కూడా ఇతడే సుమా!

నాకు ఈ తిరుమల కొండపైనున్న స్వామిపుష్కరిణి జలములే గంగ మొదలైన సకల పుణ్యప్రదమైన తీర్థస్నానములన్నింటితో సమానము. ఈ వేంకటాచలమున విహరించుటే, నాకు సకల పుణ్యక్షేత్రములలో బహుకాలవాసము వంటిది. ఈ తిరుమలలో శ్రీవేంకటేశ్వరునిపై నేను పాడుకొనే కీర్తనయే నాకు సకల వేదాధ్యయనముతోను సకల శాస్త్ర పాఠంబులను నేర్చుటతోను సమానము. ఇతనికి (ఈ శ్రీహరికి) ఇచ్చట చాతువడి కైంకర్యము (నేను ధరించి చేయు ఊడిగమే) నాకు సకల విహిత కర్మానుష్టానము. నేను చేయవలసిన కర్మకాండ యేదైనా నాకు అనవసరమే.

భక్తితో ఇతని ప్రసాదము ప్రతిదినము స్వీకరించుటే నాకు ఉపవాసదీక్షతో తపమునాచరించుట వంటిది. శరణాగతితో ఇతని పాదోదకమును తీర్థముగా స్వీకరించుటయే నాకు రహస్యముగా చేయబడిన పూజ వుపదేశము. ఈ తిరుమల శిఖరములపైనున్న అసంఖ్యాకమైన పుణ్య వృక్షముల దర్శనమే, ఈ విశ్వములోని అసంఖ్యాకులైన పుణ్యపురుషుల దర్శన భాగ్యము వంటిది. తన్మయత్వంతో ఈ తిరుమల శిఖరాలపైనున్న అశేష పక్షిజాతుల కలకలంబులే నాకు చెవికింపైన శ్రీహరి పుణ్య కథాశ్రవణము.

ఈ తిరుమలలోని శ్రీవైష్ణవులతోటి సహజీవనమే నేను మనస్ఫూర్తిగా కోరుకునే గొప్పయోగము. ఈ స్వామికి అనునిత్యము చేయు సుప్రభాతసేవ వంటి మహోత్సవములే నాకు వైభవోపేతమైన బ్రహ్మోత్సవంబులవంటి తిరునాళ్ళు. ఇన్ని వేలమంది దేవతల నారాధించుట నాకు ఈ శ్రీవేంకటేశ్వరుని శరణాగతికంటే యెక్కువైనది కాదు. ఇతని పట్టపురాణియైన అలమేలుమంగమ్మ కడకంటి చూపు (కేవలము కన్నుకొనలనుండి చూచి అనుగ్రహిస్తే) నాకు అష్టైశ్వర్యములూ సమకూడినట్లే. ఈ జన్మకాభాగ్యము చాలును.

సంపుటి: 2 కీర్తన : కలదిదివో సుఖము గలిగినను గర్భము నిలువక మానునా
సంఖ్య : 22 పుట : 15 రాగం: గుజ్జరి

గుజ్జరి

20 కలదిదివో సుఖము గలిగిననుగర్భము నిలువక మానునా
మలసి కామ్యకర్మములకుఁ జొచ్చిన మగుడఁ బుట్టువులు మానునా ॥పల్లవి॥

పరగ నింద్రజిత్తుఁడు హనుమంతుని బ్రహ్మాస్త్రంబునఁ గట్టి
అరయ నందుపై మోకులుగట్టిన నలబ్రహ్మాస్త్రము వదలె
పరిపరివిధముల నిటువలెనే హరిఁ బ్రపత్తి నమ్మిననరుఁడు
తిరుగఁ గర్మమార్గమునకుఁ జొచ్చిన దేవుఁడు దనవాత్సల్యము
వదలు ॥కల॥

అలరినసంసారభ్రమ విడిచి యడవిలోన జడభరతుఁడు
తలఁపుచు నొక యిట్టిఁ బెంచినంతనే తనకును నారూపు దగిలె
ములుగుచు లంపటములు దెగవిడిచి మోక్షము వెదకెడినరుఁడు
వలవనిదుస్సంగతులు పెంచినను వాసన లంటక
మానునా ॥కల॥

అటుగన తాఁబట్టినవ్రత ముండఁగ నన్యమతము చేపట్టినను
నటనల నెందునుఁ బొందక జీవుఁడు నడుమనె మోకుఁడైనట్లు
తటుకన శ్రీవేంకటపతి నొక్కనిదాస్యము భజియించిననరుఁడు
ఘటనల నాతనికైంకర్యములకు కడుఁ బాత్రుఁడు గాక
మానునా ॥కల॥

అవతారిక:

చాలామంది చావుపుట్టుకలు మానవ కల్పితాలు అని భ్రమపడి అనవసరమైన పగద్వేషాలతో రగిలిపోతూ వుంటారు. కానీ చావు పుట్టుకలు భగవన్నిర్దేశ్య ప్రకారమే జరిగే విధి విధానాలే కాని మానవ వ్యూహలు కాదు. వచ్చిన గొప్ప చిక్కుయేమిటంటే కర్త నేనే అనుకుంటూనే జీవులు ఆ కర్మలకు సుఖదు:ఖాలనుభవిస్తుంటారు. అన్నీ పరమాత్మ కల్పితాలేనని, ఆయన జగన్నాటకం అని గ్రహించలేరు. కాని మూలకారణం కర్మయే కదా! ఒక స్త్రీతో సుఖిస్తే అంతటితో సరిపోతుందా? ఆమెకు గర్భం రాకుండా వుంటుందా? కామ్యములనిచ్చే యే కర్మకైనా ఫలితం అనుభవించక తప్పుతుందా? మరి ఆ ఫలితం దేహం లేకుండా అనుభవించలేని జీవుడు యేదో ఒక దేహం పొంది తద్వారా దానికి సంబంధించిన సుఖదు:ఖాలు అనుభవించాల్సిందే... తప్పదు. కాబట్టి అంతా భగవదేచ్ఛ అనుకోకుండా నేనే చేయగలను అని "మానవ ప్రయత్నం" మొదలు పెడితే... ఫలితం మాత్రం భగవదేచ్ఛ. ఈ సిద్ధాంతాన్ని అనేక పౌరాణిక ఘట్టాలతో వివరిస్తున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

ఓ మానవులారా! ఇదివో వినండి. ఒక స్త్రీతో సుఖమును పొందితే మొగవాడు, ఆ కామ ఫలితం వలన ఆమె గర్భం ధరించక తప్పుతుందా? మలసి (తిరిగి) ఆ పుట్టిన జీవి అనేక కామ్య కర్మలు (ఫలితమునిచ్చే కర్మలు) చేయక మానుతాడా? దానివలన తిరిగి జన్మలు పొందక తప్పుతుందా? ఈ విధంగా జీవుడు కర్మలు చేస్తూనే ఫలితం అనుభవిస్తూనే వుంటాడు.

అలనాడు లంకలో చొచ్చిన హనుమంతుని ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రముతో బంధించాడు. కాని అతితెలివితో రాక్షసమూకలు ఎందుకైనా మంచిదని ఆయనను మోకులతో (తాళ్ళతో) కూడా కట్టేశారు. ఫలితంగా బ్రహ్మాస్త్ర ప్రభావం చెడిపోయి ఆయన బంధవిముక్తుడయ్యాడు. పరిపరి విధముల (అనేక పర్యాయములు) ఇదేవిధముగా హరి ప్రపత్తి (శ్రీహరి శరణాగతి) నమ్మనివారు, తిరిగి కర్మ మార్గమునకు తగులుకొని తమ ప్రయత్నాలు తాము చేస్తుంటారు. అప్పుడు దేవుడు తన వాత్సల్యమును వదలిపెట్టి మనని మన కర్మకే వదలి వేస్తాడు.

జడభరతుడనేవాడు సంసారముపై వ్యామోహమును విడిచి అడవిలో తపస్సు చేస్తుండేవాడు. అనుకోకుండా ఒక 'యిట్టి' (జింకపిల్లను) రక్షించి దాని రక్షణ భారం వహించి దానిమూలంగా తిరిగి బంధము కలిగి జింకగా పుట్టి అనేక బాధలు అనుభవించాడు. ఇందువలన తెలిసేదేమంటే, లంపటములను (బంధములను) తెగవిడిచి నరుడు మోక్షమును పొందాలంటే, దుస్సాంగత్యమును వదలివేయక తప్పదు. దానిని పెంచుకొంటే వాసనలు (అనుభూతిని కలిగించు స్మృతులు) వదిలిపెడతాయా? అవే జన్మకారణాలవుతాయి.

అటుగన (అదే విధంగా) తాను నమ్మికతో పట్టిన వ్రతము ఒకటివుండగా అన్య సిద్ధాంతముల వెంట మతముల వెంటబడితే ప్రయోజనమేమిటి? ఆ జీవుడు ఇహపరములు రెంటికీ చెడి నడమనే మోడై బాధలు పొందుతాడు. తటుకున (చటుక్కున) శ్రీవేంకటపతి దాస్యమును స్వీకరించి ఆయన శరణాగతిని పొంది ఆ స్వామినే భజించే నరుడు ఆయన కైంకర్యమును (దాస్యమును) స్వీకరిస్తే ఆ ఏడుకొండలవాడి కృప రాక మానుతుందా? తప్పకుండా కలుగుతుంది.

సంపుటి: 2 కీర్తన : హరిగోవిందా హరిగోవిందా
ఆనందమానందమాతుమకును
సంఖ్య : 339 పుట : 228 రాగం: గుండక్రియ

గుండక్రియ

21 హరి గోవిందా హరి గోవిందా
ఆనందమానంద మాతుమకును
గురూపదేశాన వెదకఁగా వెదకఁగా
గరిమ నీయర్థము కంటి మోయయ్యా ॥పల్లవి॥

సరి నన్యధర్ములు మానుమంటివి
శరణు నీకుఁ జొరుమంటివి
దురితము లణఁచేనంటివి
పరగ మోక్షం బిచ్చేనంటివి
హరి నీవచనము అమోఘము
నరులము నే మిది నమ్మితిమి
పరమపద మిప్పుడే కలిగెను
ధర నొక్క మనసుతో నున్నారమయ్యా ॥హరి॥

యెందు నీవే గతి యనుమంటివి
యేచి యొక్క మాఁటే చాలునంటివి
యిందరి కభయ మిత్తునంటివి
యిది నీ కెపుడు వ్రతమంటివి
కందువ నీబిరుదుసత్యము
కానిమ్మని నేము చేపట్టితిమి
ఆంది నీవే మాకు దిక్కైతివి
అన్నిటా సంతోసాన నున్నారమయ్యా ॥హరి॥

అసమానినవాఁ డెక్కు డంటివి
ఆతనివెంటఁ దిరిగేనంటివి
భాసురపాదరేణువు నే నంటివి

పావన మయ్యేనని యంటివి
మోసలేనిది నీ సంకల్పము
మొక్కే మిందులకు శ్రీవేంకటేశా
అనపడ నితరుల నాకు నీవే యాస
యని నీదాసులమై యున్నారమయ్యా ॥హరి॥ 339

అవతారిక:

దేవదేవుడైన హరి గోవిందుని సంకల్పము అటలము. గీతావాక్యముగా ఆ పరమాత్మ బోధ అంతయూ ఆత్మానందము నొసగునదే. ఇందుకించిత్ సందియమును లేదు. ఆయనే జగద్గురువు. ఓ అయ్యా! అయినా మా గురుదేవులు వుపదేశము చేసిన తరువాతనే మేము నీ అర్థము నెరింగితిమి లేనిచో మాకు నీ దివ్య బోధ అర్థమయ్యేదే కాదు అని కితాబునిస్తున్నారు అన్నమాచార్యులవారు. పరధర్ములు భయంకరములు. అన్యధర్ముల జోలికి పోవద్దని పరమాత్మ చెప్పినా మానవుడు విననందువలననే నేడు ప్రపంచంలో ఇంత అశాంతి పెట్రేగిపోతోంది. శరణన్నవానిని కాపాడతానని వాగ్దానం చేశాడు పరమాత్మ. ఆ విధంగా ఆయనే దిక్కు అనే భావనతో వుంటే నిత్యమూ సంతోషమే కదా! మానవులకు దు:ఖమేవుండదు కదా! దేవా! నిర్మోహి అయినవాడే సర్వశ్రేష్ఠుడన్నావు.

ఇకపోతే పాఠకులకు మనవి. ఇటువంటి కీర్తనలు ఒక్కసారి గానం చేస్తే భగవద్గీత చదివిన పుణ్యం వస్తుంది. కాని నమ్మకం, భక్తి శరణాగతి ముఖ్యం. అవి లేనినాడు 108 సార్లు పారాయణ చేసినా లక్షమంది పెద్దగా సామూహిక పారాయణ చేసినా ఫలితం యేమంతవుండదు.

భావ వివరణ:

ఓ హరిగోవిందుడా! హరిగోవిందుడా గురూపదేశాన (మా గురుదేవుల ఉపదేశ ప్రభావముచే) వెదకగా వెదకగా (నీ కొఱకు పట్టుదలతో శోధించగా) నీ గరిమ (నీ వైభవమును) నీ యర్థము (నీ గీతావచనపు వివరణమును) కంటిమి (దర్శించగలిగితిమి). ఓ అయ్యా! ఆనందమానందమాతుమకును

(మా ఆత్మకు బ్రహ్మానందము కలిగినది తండ్రీ!) మా జన్మ ధన్యమైనది.

నీవేమంటివి ప్రభూ! సరిగా అనిపించిననూ అన్యధర్మములు (పరులకు నిర్దేశించబడిన ధర్మములను) మానుము అంటివి. నీకు శరణు జొరుమంటివి (శరణాగతితో నిన్ను నమ్మమంటివి). మా దురితములను (పాపకర్మలను) తొలగింతునంటివి. సందేహము వలదు, నేనే నీకు మోక్షము నిచ్చెదనంటివి. ఓ శ్రీహరీ! నీ వచనము (గీతావచనము) అమోఘము (సాటిలేనిది). మేము మానవమాత్రులము. ఇదే నమ్మితిమి. పరమపదమిప్పుడే కలిగినది (జీవన్ముక్తులమయ్యాము). ఈ భూమిపై జీవిస్తున్నప్పటికి ఒక పరిపూర్ణమైన మనస్సుతోనున్నారము.

ఇంకా నీవేమన్నావో గుర్తుచేసి కొనెదను. ఎందున్ నీవే గతి అంటివి (మాజీవిత కాలమున, ప్రాణములను వదలునప్పుడు, మరణించిన పిదప కూడా నీవే మాకు దిక్కు అని అన్నావు) ఏచి (అతిశయించి) నీ ఆ ఒక్క అభయమే మాకు చాలును అన్నావు. శరణాగత రక్షణయే నీ వ్రతము అంటివి. ఓ జగదీశ్వరా! కందువ (సర్వ సమర్థుడవైన) నీ బిరుదు (శరణాగత రక్షకుడవను బిరుదు) సత్యము కానిమ్మని, చేపట్టితిమి (నీ ఆశ్రయమును పొందితిమి). అంది (మాకు వశమై) నీవే మాకు దిక్కు అయితివి. మేము ఇహపరములన్నిటిలోనూ సంతోషముగానున్నామయ్యా!

ప్రభూ! మేము అనుక్షణము గుర్తుంచుకొనవలసిన మరికొన్ని మాటలు సాటిలేనివి. ఆశ మానుమంటివి. పాపములన్నిటికీ మూలము ఆశ. అది చచ్చినా విడువని పీడ. మరల జన్మ కలుగుటకు అదియే మూలకారణము. నిర్మోహి (ఆశ విడనాడినవాడు) ఎక్కుడు (అధికుడు) అంటివి. అట్టి నిర్మోహి వెంటనే సర్వకాల సర్వావస్థలయందు నీవు వారితోడు వుంటానన్నావు. విశ్వరూపుడవైన నీ పాద రేణువు పాటివారు ఈ భారతయుద్ధ వీరులంటివి. అంతేకాదు అది నీ దాసులైన వారికి దివ్యచక్షువులతో చూపి మరీ నిరూపించితివి. కర్తవ్య దీక్షలో మేము చేసే పాపములు మమ్ము అంటవని అంటివి. ప్రభూ! నీ సంకల్పము మోసలేనిది (వంచన ఏమాత్రమూ లేనిది). ఓ శ్రీవేంకటేశ్వరా! ఇందులకే నీకు మొక్కేమయ్యా! ఆసపడని నీవే మా అందరికీ ఆస (ఆధారము). ఎందుకంటే నిన్ను ఏ ఆశా వశపరచుకోలేదు. ఓ ప్రభూ! ఆ ధైర్యంతోనే నీ భృత్యులమైవున్నామయ్యా! నా వూపిరి ఆగేదాకా అలాగే వుంటాను తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : తందనాన ఆహి తందనాన పురె
సంఖ్య : 385 పుట : 259 రాగం: బౌళి

బౌళి

22 తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన ।। పల్లవి।।

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ।।తంద।।

కందువగుహీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ।।తంద।।

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టుభూమి యొకటే
చండాలుఁ డుండేటి సరిభూమి యొకటె ।।తంద।।

అనుగుదేవతలకును అలకామసుఖ మొకటే
ఘనకీటపశువులకు కామసుఖ మొకటె
దినమహోరాత్రములు తెగి ధనాఢ్యున కొకటే
వొనర నిరుఁబేదకును వొక్కటే అవియు ।।తంద।।

కొరలి శిష్టాన్నములు గొనునాఁక లొకటే
తిరుగుదుష్టాన్నములు దినునాఁక లొకటే
పరగ దుర్గంధములపై వాయువు నొకటే
వరుసఁ బరిమళముపై వాయువు నొకటే ।।తంద।।

కడఁగి యేనుఁగుమీఁదఁ గాయుయెండొకటే
పుడమి శునకముమీఁదఁ బొలయునెండొకటే
కడుఁబుణ్యులను పాపకర్ములను సరిఁ గావ
జడియు శ్రీవేంకటేశ్వరు నాము మొకటే ॥తంద॥ 385

అవతారిక:

ఈ విశ్వవిఖ్యాతమైన కీర్తనను "భావయామి వేంకటేశమ్" సంపుటి 1లో నేను వివరించటం జరిగింది. కాని అప్పుడు పల్లవితోపాటు మూడు చరణాలను మాత్రమే పేర్కొన్నాను. ప్రస్తుతం "పొడవుకు పొడవైన పురుషోత్తమ"లో పొడుగు కీర్తనలకే ప్రాధాన్యత గనుక ఇదేకీర్తన చరణాలు అన్నిటితోపాటు వివరిస్తున్నాను. ఇదివరలో చెప్పినట్లే అన్నమాచార్యులవారి ఈ కీర్తనలో 'అహి' అనే మాట నేటికాలంలో ఆహా! 'పురే' అనే మాటను "ఒరే" అని 'భళా' అనే మాటను "భలే" అని వ్యవహరిస్తున్నాము. తందనాన అనేది వూతపదం. "అవునవునూ" అనడం అన్నమాట. అందుకనే మనం అన్న మాటకి ఎవరన్నా 'వత్తాసు' పలికితే ఏమిట్రా! వాడన్న ప్రతిదానికీ తాన అంటే తందాన అంటావు అని మందలిస్తారు. కాని ఈ తాన తందాన పాటలు యెంత జనామోదం పొందాయంటే అన్నమాచార్యులవారి నెరుగనివారు కూడా ఈ కీర్తననెరుగుదురు. అన్నమయ్యలోని మరొక కోణం కానవచ్చే కీర్తన ఇది. చేతన వున్న ఏ జీవిలోనైనా పరబ్రహ్మ 'ఒక్కని' గానే వుంటాడు. ప్రకృతి ప్రసాదం అందరికీ సమానమే గాలి, వాన, కాంతి అందరివీ. ఏ ఒక్కరివీ కాదు. మరి అటువంటప్పుడు నేను అగ్రకులజుడననీ నీవు తక్కువ జాతివాడవని వివక్ష చూపించటం తగనిపని. అందరూ ఆ పరమాత్మ బిడ్డలమే. ఇంతకంటే అభ్యున్నతయోచన సాధ్యమా?

భావ వివరణ:

తందనాన! అహి, తందనాన! పురే తందనాన! భళా తందనాన!

జ్ఞప్తికి వుంచుకోండి. బ్రహ్మము ఒక్కటే పరబ్రహ్మస్వరూపుడైన పరమాత్మ ఒక్కడే. పరమాత్మయే మతమునకు చెందని పరబ్రహ్మ ఆయన యే ఒక్క

కులమునకు సొత్తుకాదు. ఇందు (ఈ పరబ్రహ్మకు) హీనులు, అధికులు అను విచక్షణలేదు. కందువగు (ప్రాపంచిక దృష్టిగల) అవన్నీ మానవమాత్రులకే. ఎందుకంటే అందరికీ శ్రీహరియే అంతరాత్మ రూపంలో వున్నాడు. కాకపోతే ఇందులో జంతువుల కులము జ్ఞానరహితమైనదైనా అదికూడా ఒకటే. వాటికి కూడా శ్రీహరే అంతరాత్మ. అదే నిజం కాకపోతే, వేటనైపుణ్యం ఆ జంతువుకు యెవరు నేర్పుతున్నారు? ప్రకృతి అని నాస్తికులు వాదించ వచ్చును. కాని పరమాత్మే ప్రకృతి రూపంలో మనబోంట్లకు తన అమేయమైన శక్తిని బుజువు చేస్తున్నాడు.

ప్రజలారా! ఇది గుర్తుపెట్టుకోండి. నిండార (నిండుగా) నిద్రించునట్టి రాజుగారు పోయే నిద్రసుఖమూ ఒక్కటే. అండనే (అక్కడనే) నేలపై ఒదిగి పడుకొనే బంటు యొక్క నిద్రయు ఒక్కటే. మెండైన బ్రాహ్మణుడు (భూసురుడని కీర్తింపబడుతున్న బ్రాహ్మణుడు) నడిచే నేలా ఒక్కటే చండాలుడని జనులు నిరసించే కడజాతివాడు నడిచే సరిభూమి (చదునైన) నేల కూడా ఒక్కటే కదా! మరి ఒకడి గొప్ప యేమిటి? ఒకడి తక్కువ యేమిటి?

అనుగు (ప్రముఖులైన) దేవతలకు కామసుఖము యెట్లుండునో కీటకములకు పశువులకు కూడ కామసుఖము అట్లే యుండును. దినము అహోరాత్రములు (పగలు, రేయి) ధనవంతునికి నిరుపేదయైన వాడికీ ఒకేలా వుంటాయి. కొరవి (పొంది) శిష్టాన్నములు (విహితమైన) ఆహారమును భుజించెడి ఆకలి యెటువంటిదో ఎక్కడపడితే అక్కడ తిరిగి దుష్టాన్నము భుజించే ఆకలి కూడా ఒకటే. అదే విధంగా సువాసన వెదజల్లు వస్తువులపై వీచెడి వాయువు, దుర్గంధభరితమైన వాటిపై నుండి వీచు వాయువూ రెండూ ఒక్కటే. దుర్గంధ సుగంధములు వాయువునకు లేవు అవి కేవలం ఆయా వస్తువులపై వాయువు వీచుటవలన వస్తువలు నుంచి వాయువునకు సంక్రమించినట్లు భ్రమ కలిగిందేకాని వాయువునకు యేగంధమూ లేదు.

కడగి (పూని) యేనుగుమీదకాయు యెండ అయినా భూమిపై వీధికుక్కమీద పొలయు (కాయు) యెండైనా ఒక్కటే. ఘోర పాపాత్ములనైనా, గొప్ప పుణ్యాత్ములనైనా సరిగావ (సమానముగా రక్షించుటకు) పాపమును జడియజేయు (నివారించును), శ్రీ వేంకటేశ్వరుని నామమూ ఒక్కటే

సంపుటి: 2 కీర్తన : ఇవిసేయగనే నలసుడ యెటువలె మోక్షంబడిగెదను
సంఖ్య : 328 పుట : 220 రాగం: భూపాళం

భూపాళం

23 ఇవి సేయఁగ నే నలఁసుడ యెటువలె మోక్షం బడిగెదను
వివరముతోడుత నీవు సులభుఁడవు విష్ణుఁడ నిన్నే కొలిచెదఁగాక
॥ పల్లవి॥

జపయజ్ఞ దానకర్మంబులు యెంచఁగ జిరకాలఫలంబులు
యెపుడుఁ బుణ్యతీర్థస్నానములు యిల పాపవిమోచనములు
అపరిమిత దేవతాంతరభజనలు ఆయాలోకప్రాప్తులు
వుపవాసాదినియమవ్రతములు తపోనిష్ఠకుఁ గారణంబులు
॥ఇవి॥

రవిచంద్రగ్రహతారాబలములు భువిలోఁ గామ్యఫలములు
తవిలినపంచేంద్రియనిగ్రహంబులు తనుధరులకు దుర్లభములు
అవిరళధర్మార్థకామంబులు మతియైశ్వర్యములకు మూలములు
అవలగ్రహణకాలానుష్ఠానము లధికఫలంబులు ఆశామయము
॥ఇవి॥

పరగ సప్తసంతానబ్రాహ్మణతర్పణములు ఖ్యాతిసుకృతములు
అరయఁ బుత్రదారక్షేత్రసంగ్రహ మందరికిని సంసారభోగము
హరి నరహరి శ్రీవేంకటేశ్వరా అఖిలము నొసఁగెడిదాతవు
సరుగన నీవే దయతో రక్షించఁజాలుదు వేకాలమును మమ్మును
॥ఇవి॥

అవతారిక:

అలసుడు అంటే సోమరిపోతు అని అర్థం. బాగా బద్ధకంవున్న వాడన్నమాట. వైదికధర్మం పాటించువానికి సంధ్యావందనము అనుష్టానము

వంటి కొన్ని వైదిక నిత్యకృత్యములు చేయవలసి వుంటుంది. గ్రహణ కాలములలో కొన్ని నియమములను పాటించవలసి వుంటుంది. పంచేంద్రియ నిగ్రహం ఆవశ్యకమై వుంటుంది. సప్త సంతాపములందు బ్రాహ్మణ తర్పణములను వదల వలసి వుంటుంది. పుత్రుల కొరకు భార్య కొరకు గృహము మొదలైన క్షేత్రముల కొరకు కొన్ని వైదిక కర్మలాచరించవలసి వుంటుంది. బ్రాహ్మణులకు ఇవి తప్పింప వీలులేని ధర్మములు. అన్నమాచార్యులవారు యేమంటున్నారో వినండి. స్వామీ! ఇవన్నీ నేను చేయవలసిన ధర్మములే కాదనలేను. కాని నేను గొప్ప సోమరిపోతును ప్రభూ! నాకవన్నీ యెందుకు? నీవు సర్వసులభుడవైన విష్ణుడవు. అయినా నిన్ను ఏవిధంగా నాకు మోక్షం ఇయ్యి స్వామీ! అని అడగగలను? ఒక్క అనుష్టానము రాదు. యజ్ఞకాండ తెలియదు. వైదిక కర్మకాండ అంటే తగని బద్ధకం నాకు. నాకు తెలిసింది నీ శరణాగతి ఒక్కటే. నీ దాస్యమే నా పరమావధి. నీవే దిక్కు. ఇంకొక సంగతి నాకు దృఢచిత్తముకూడా నీవే ఇవ్వవలసి వుంటుంది అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఇవి (ఈ విహిత కర్మములను) సేయగ (చేయవలెనంటే) నేను అలసుడ (సోమరిపోతును). నిన్ను, ఇక ఎటువలె (ఏవిధముగా) మోక్షం బడిగెద? (మోక్షమును ఇమ్మని ప్రార్థించమంటావు?) నీవు సులభముగా అనుగ్రహించు విష్ణుదేవుడవు. వివరముతోడ (విచారించగా) నిన్నే కొలిచెదను గాక!

ప్రభూ యెంచగా (ఆలోచించి చూస్తే) జపము, యజ్ఞము, దానము వంటి కర్మంబుల వలన కూడా మోక్షము తప్పక లభిస్తుంది. కానీ అవి చిరకాల ఫలంబులు (బహుకాలము పట్టు సాధనలు). గంగ మొదలైన పుణ్యతీర్థములలో స్నానములు కూడా పాపవిమోచనములే. అది యెంతో వ్యయప్రయాసలతో కూడినది. అంతులేకుండా దేవతాంతరములను (అన్యదేవతలను) ఆరాధిస్తే, అది సులభగ్రాహ్యమైన ఆయా దేవతల లోకప్రాప్తి నొసగగలుగును. ఇకపోతే ఉపవాసము మొదలైన

నియమములతో వ్రతములు చేసినా తపోనిష్టతో నిన్ను సంతృప్తి పరచాలంటే అది నావంటి సోమరివల్ల అయ్యే పనేనా స్వామీ! నక్క యెక్కడ! నాకమెక్కడ? అని పెద్దలేనాడో అన్నారు కదా!

ఓ ప్రభూ! భువిలో (ఈ భూలోకములో) సూర్యచంద్రాది గ్రహముల యొక్కయు తారాబలము యొక్కయు గణనము చేసి గ్రహచార దోషణా నివృత్తికి శాంతులు పూజలు చేయుటయు కద్దు. కాని అవి చేసే ఘనకార్యమేముంది? కామ్య ఫలములనొసగును. తవిలిన (ప్రయత్నించిన) పంచేంద్రియ నిగ్రహము సత్ఫలితమిచ్చినా, తనుధారులకు (దేహధారులైన మానవులవంటివారికి) అది దుస్సాధ్యము. అవిరళముగా (ఆపకుండా) ధర్మార్థ కామములను నెరవేర్చిన అష్టైశ్వర్యములు కూడా సిద్ధించుటకు మూలకారణము ఆవల (అటుపైన) గ్రహణ కాలములలో కొన్ని అనుష్టానములను చేసిన గొప్ప ఫలమెగుననుట సత్యమే. కాని అది ఆశామయము. ఆశకు అంతేలేదు. పైగా నిరాశ దాని నీడ. మరి ఇక యేమిలాభము?

పరగ (అతిశయించగా) బ్రాహ్మణుల చేత సప్త సంతాపములందు (ఎవరన్నా దివంగతులైతే) యేడు సంతాప కర్మలు చేయాల్సివుంటుంది. తర్పణలు వదలవలసి వుంటుంది. అవి ఖ్యాతిగల సుకృతములే. కాని మోక్షదాయకములు కావు. ఇకపోతే దారాసుతులతో (భార్య, సంతానముతో) క్షేత్రసంగ్రహమున (పొలములు కొని గృహనిర్మాణములు చేయువేళలలో) చేయునవన్నియు భోగ సంగ్రహములు. బహుపరిమిత సుఖములకారకములు. ఓ శ్రీహరి, నరహరి రూపుడైన శ్రీవేంకటేశ్వరా! అఖిలము నొసగెడి దాతవు నీవే. మమ్ములను యేకాలమందైనా రక్షించుటకు నీవొక్కడివే సమర్థుడవు. సరగున (వేగముగా) దయచూడుము తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : పురుషుండని శ్రుతి వొగడీనట ఆపురుషుఁడు నిరాకారమట
సంఖ్య : 252 పుట : 169 రాగం: బౌళి

బౌళి

24 పురుషుండని శ్రుతి వొగడీనట ఆ పురుషుఁడు నిరాకారమట
విరసవాక్యము లొండొంటికి నివి వింటే నసంబద్ధములు॥ పల్లవి॥

మొగమున బ్రాహ్మలు మొలచిరట ఆ మూరితి అవయవ రహితుఁడట
తగుబాహువులను రాజులట ఆ తత్వమే యెంచఁగ శూన్యమట
పగటున తొడలను వైశ్యులట ఆ బ్రహ్మము దేహము బయలట
అగపడి పాదాల శూద్రులట ఆతనిరూపము లేదట ॥పురు॥

తనవందనమునుఁ గలదట దైవము తనుఁ జూడఁ గన్నులు లేవట
తనవిన్నపమునుఁ జేయునట ఆతనికిని వీనులు లేవట
తనయిచ్చినదే నైవేద్యంబట దైవమునోరే లేదట
తనయిచ్చేటిధూపంబును గలదట దైవము ముక్కును లేదట ॥పురు॥

అంతాఁ దానే దైవమటా; యజ్ఞము లొరులకుఁ జేయుటట
సంతతమునుఁదా స్వతంత్రుఁడటా జపముల వరముల చేకొంటట
చింతింపఁ దానే యోగియటా చేరువ మోక్షము లేదట
పంతపుశ్రీవేంకటపతి మాయలు పచారించిన వివియట

॥పురు॥ 252

అవతారిక:

పరమాత్మను వేదము పురుషుడని కీర్తించింది. పురుషసూక్తము, జగత్ప్రసిద్ధమైనది. కాని నిరాకార నిర్గుణ స్వరూపుడని కూడా శ్రుతులు

కీర్తించాయి. అటువంటప్పుడు విరసవాక్యములైన ఇవి అసంబద్ధములు కదా! అంటున్నారు అన్నమాచార్యులవారు. ఆ విరాట్పురుషుని నోటినుండి బ్రాహ్మణులు మొలచిరట. ఇది వూహాతీతము కదా! రూపమే లేనివానికి నోరేమిటి అందునుండి బ్రాహ్మణులు రావటమేమిటి? నైవేద్యము ఆ స్వామికి పెడతారే నోరే లేనివానికి నివేదన యేమిటి? ఆకారములేనివానికి కన్నులెలా వుంటాయి? చెవులే లేనివానికి విన్నపములు చేయుటేమిటి? తనకేమీ అవసరం లేకపోయినా మనకోసం తనూ విహిత కర్మలు చేస్తాడట యోగేశ్వరుడైన కృష్ణుడు అతడి ప్రజారంజకముగా పాలించిన రాముడూ అతడే. నేడు శ్రీవేంకటాద్రిపై చేరి మాయలు ప్రదర్శించుచూ ప్రజలను సన్మార్గులను చేస్తున్నదికూడా ఆ స్వామియే. కానీ మోక్షమనేది నీలోనే వున్నదట. భావనా రూపమైన ఆ ముక్తి కావాలంటే మళ్ళీ ఒక్కటే దారి

"అన్యధా శరణం నాస్తి

త్వమేవ శరణం మమ" అని శరణువేడుటయే దారి.

భావ వివరణ:

శ్రుతి (వేదము) ఆ దేవదేవుని "పురుషుడు" అని వొగడీని (కీర్తించింది). అట (అక్కడ) ఆ పురుషుడు నిరాకారమట (ఆకారములేనివాడట). ఇదెట్లు సాధ్యము? ఇవి వింటే అసంబంధంబులు (ఒకదానికొకటి ముడివడని నుడువులు). ఒండొంటికి (ఒకదానికింకోటి) విరసము (వ్యతిరేకమైన వాక్యములు).

ఆ (మూరితి) విరాట్పురుషుడు, అవయవములే లేని వాడట (నిరాకారుడు కదా!) కాని బ్రాహ్మలు (విప్రులు) ఆయన ముఖమునుండి మొలచిరట (ఆవిర్భవించినారట). తగు బాహువులయందు (దృఢమైన చేతులనుండి) రాజులట (క్షత్రియులు వచ్చారట.) ఆ తత్వము

లెక్కించనసాధ్యము కదా! ఆ పురుషుని తొడలనుండి వైశ్యులు పుట్టినారట. సరియేననుకొంటే మరి శూతులు ఆ బ్రహ్మమునకు దేహమే లేదన్నది కదా! ఇదెట్లు సాధ్యము? అగపడి ధృడముగా కనిపించు పాదములలో నుండి శూద్రులు వుదయించిరట. కాని ఆ విశ్వరూపునికి రూపమే లేదట. రూపములేని వానికి పాదములెట్లుండును? ఏమిటీ వైపరీత్యము?

ఆ పురుషోత్తమునికి వందనము ఆచరించిన చాలునట. నిన్ను తనవానిగా నెంచునట. కాని తను చూచుటకు కన్నులే లేని వానికి చూచుటెట్లు సాధ్యము? పోనీ మనవేదన తెలియజేయుదమంటే వీనులే లేని వింతరూపమట. ఫలం, పుష్పం, పత్రం, తోయం (నీరు) యేది భక్తితో ఇచ్చినా నాకు నైవేద్యముగా స్వీకరిస్తానని ఆ స్వామియే అన్నాడు. నిజమే, కానీ నోరే లేని వాడు దేన్ని తింటాడు? దేన్ని త్రాగుతాడు చెప్పండి?

అంతా తానే దైవమట (తానే సర్వోత్తముడైన దైవమట). తనకు యే కోరికా లేనందున యజ్ఞము చేయవలసిన అవసరం లేకపోయినా తనను ఇతరులు అనుకరిస్తారు కాబట్టి విశ్వశాంతికి తానూ యజ్ఞము చేస్తాడట. సంతతము (యెల్లప్పుడు) తాను సర్వస్వతంత్రుడట. కాని జపముల నాచరించి వరములను స్వీకరించునట (శ్రీరామునిగా యెన్నో యాగాలూ వ్రతాలూ జపములూ చేశాడు కదా!) చింతింప (యోచించిన) తానే యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడట. కాని మోక్షమనేది భావనయే కానీ వరము కాదట. పంతపు శ్రీవేంకటేశ్వరా! (పట్టుదలగల శ్రీనివాసా!) ఇవియన్నీ నీవు పచారించే (నడపునట్టి) మాయలు (మాయయేనట). అది తెలియగ మాకు సాధ్యమా తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంఖ్య : 235 పుట : 157 రాగం: దేసాక్షి

దేసాక్షి

25 ఎంచి చూడరో ఘనులార యిందీవరాక్షుఁడు రక్షకుఁడు
సంచితముగ నితనిశరణంబే సర్వఫలప్రద మిందరికి ॥ పల్లవి॥

హరిఁ గొలువని కొలువులు మఱి యడవిఁగాసిన వెన్నెలలు
గరిమల నచ్చుతు విననికథలు భువి గజస్నానములు
పరమాత్మునికిఁ గానితపంబులు పాతాళములనిధానములు
మురుగురునికిఁగానిపూవులపూజలు మగఁడులేనిసింగారములు ॥ఎంచి॥

వైకుంఠుని నుతియించనివినుతులు వననిధిఁ గురిసినవానలు
ఆకమలోదరుఁ గోరనికోరికె లందనిమానిఫలంబులు
శ్రీకాంతునిపైఁ జేయనిభక్తులు చెంబుమీఁదికనకపుఁబూఁత
దాకొని విష్ణుని తెలియనితెలువులు తగ నేటినడిమిపైరులు ॥ఎంచి॥

వావిరిఁ గేశవునొల్లనిబదుకులు వరతఁగలపుచింతపండు
గోవిందుని కటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు
భావించి మాధవుపైలేనితలఁపులు పలుమేఘములవికారములు
శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు ॥ఎంచి॥235

అవతారిక:

అన్నమాచార్యులవారి కీర్తనలు వివరిస్తున్న నేను వృత్తిరీత్యా ఇంజినీరును. నా తెలుగు పాండిత్యం 12వ తరగతి తెలుగు మీడియం కుఱ్ఱవాడికుండే పాటిదే. నిఘంటువుల్లో కూడా కనబడని అచ్చతెలుగుమాటలు వాడిన పురాతన జానపద తెలుగు మాటలకు నాకు అర్థం కనబడదు కానీ స్ఫురిస్తుంది. నా లోపలినుంచి యెవరో చెబుతుంటారు. బహుశా ఇది అయుంటుంది అని నాకు "తోస్తుంటుంది". ఎవరో చెబుతుంటారు. లేదా నాకే అనిపిస్తుంటుంది. ఉదాహరణకు ఈ కీర్తనలోని "వావిరి గేశవు నొల్లనిబదుకులు వరతగలపు చింతపండు" అనే వాక్యానికి అర్థం యేమిటి?

ఎంత ఆలోచించినా నాకు లభ్యమైన ఏ నిఘంటువు వెదకినా అర్థం దొరకలేదు. "లావొక్కింతయులేదు ఏడుకొండలవాడా!" అని కళ్ళు మూసుకున్నాను. నాకు చటుక్కున స్ఫురించింది. కేశవుని అంగీకరించని బ్రతుకులు బాగా తెగులుపట్టి చెడిపోయిన చింతపండు వంటివి అన్నమాట. ఈ స్ఫురణనిచ్చిన వాడెవరు? నేనా? కాదు నేను అంత పండితుణ్ణి కాదు. దీనికి కారకులు ఇద్దరే అని నా నమ్మకం. ఒకరు అన్నమాచార్యులవారు. ఇంకొకరు వేంకటేశుడు. ఏది ఏమయినా నావంటి అతి సామాన్యుని చేత ఇంత చేయిస్తున్న ఆ ఇందీవరాక్షుని శరణమే కారణమని స్ఫురించి తండ్రీ! శ్రీహరీ! ధన్యుడనయ్యా! అనుకొన్నాను. ఇంకా ధైర్యంగా ఆ పురుషోత్తముని వెంట పరుగు మొదలుబెట్టాను. ఇకపోతే ఈ కీర్తనలో తాళ్ళపాక పదకవితాపితామహుడు వాడిన ఉపమానములు అనుపమానములు నభూతో నభవిష్యతి అని కీర్తించదగిన కవితాఝరి. ఆనందం అంచులు చూడండి.

భావ వివరణ:

ఓ ఘనులారా! ఈ సంగతిని మీరు యెంచి చూడరో (చూడండి). ఇందీవరాక్షుడు (కమలములవంటి కన్నులుగల శ్రీహరి) మాత్రమే మన రక్షకుడు. ఇందరికీ (ఈ జీవులందరికి) ఇతని శరణాగతియే సంచితముగ (కూడబెట్టినదానివలె) సర్వఫలప్రదము (అన్ని సత్ఫలితములను ఇచ్చును).

శ్రీహరిని కొలువని (ఆరాధించని) కొలువులు (పదవులు), మఱి (అటుపై) అడవిలో కాసిన వెన్నెలవలె నిరుపయోగమైనవి. ఎవ్వరికీ ఆనందము నొసగనివి. గరిమల (మహిమాన్వితమైన) అచ్చుతుని కథలను వినినివాడు ఎన్ని పురాణాలు చదివినా యేమి లాభము? అది "గజ స్నానము" వలె నిరుపయోగమైనది. ఏనుగు చక్కగా స్నానం చేసి కొలను బయటకు వచ్చి తొండంతో మట్టిని పీల్చుకొని తిరిగి తన దేహముపైన ఆ మట్టిని చిమ్ముకొంటుంది. దాని స్నానం వలన యేమి వుపయోగముంటుంది? పరమాత్ముడైన శ్రీమన్నారాయణుని కొరకు తపములు చేయక అన్యదేవతలకై చేయు తపములు పాతాళముల నిధానములు (పాతాళ లోకము సముద్రముల అడుగున వుంటుంది. అక్కడికి వెళ్ళేదెవరు? అక్కడ ఎంత ఐశ్వర్యము వున్నా

భూమిపైకి తేగలిగినవాడెవరు? కనుక అది కేవలము నామ మాత్రమే). మరుగురునికి (మన్మథుని తండ్రియైన శ్రీహరికి) చెందని పుష్పార్చనలు, మగడులేని సింగారములు. ఒక స్త్రీ యెంత పూలతో అలంకరించుకొన్నా ఆమె భర్త దేశాంతరమున వుంటే ఆ పుష్పాలంకరణ వ్యర్థమే కదా!

ఓ ప్రజలారా! మనం నుతించవలసింది కేవలం వైకుంఠునే (విష్ణుమూర్తినే) అందుకు విరుద్ధముగా స్వప్రయోజనం కోసం, వారినీ వీరినీ కీర్తిస్తుంటే అవి వననిధిగురిసిన వానలు వంటివి (సముద్రముపై కురిసిన వానవలె నిష్ప్రయోజనమైనది. వాన పొలములో కురిస్తే పంటలకు ప్రయోజనము గానీ... అక్కడెక్కడనో కురిస్తే లాభమేమి?) ఏదన్నా కోరికవుంటే కమలోదరుడు (పద్మనాభుడు) అయిన శ్రీహరిని కోరాలి. అట్లుగాక అన్యులను కోరికలు కోరితే అది అందని మామిడిపండ్లకు ఆశించడంవలె నిరుపయోగమైన నిరీక్షణ. ఏదన్నా భక్తితో కూడిన కార్యక్రమముంటే అది శ్రీకాంతుని కోసం చేయాలి. అందుకు విరుద్ధమైతే అది నీళ్ళుతాగే చెంబు మీద బంగారపు పూత (గోల్డ్‌ప్లేటింగ్) చేయించడం వంటిది. మహా అయితే ఒక నెలపాటు వుండే ఆ పూత వలన ఏమి లాభం వుంటుంది? దాకొని (సమీపించి) విష్ణుని తెలుపని తెలుపులు (బోధనలు) తగన్ (తగినట్లు) పరిశీలిస్తే, అవి ఏటిపై వేసిన పైరులు (ఏటిమీద విత్తిన విత్తనాలు నిష్ప్రయోజనమే కదా!)

ఓజనులారా! వావిరి (ఉత్కృష్టమైన) కేశవుని వొల్లని (నమ్మని) బ్రతుకులన్నీ "వరతగలపు చింతపండు" (బాగా తెగులు పట్టి చెడిపోయిన చింతపండు వంటిది). అది నిష్ప్రయోజనము. అటు (ఆమీదట) గోవిందునికి మ్రొక్కని మొక్కుబడులన్నీ గోడకు తగిలించని చిత్రపటములు. వాటిని చూచేదెవరు మెచ్చేదెవరు? మాధవుని భావించని తలపులు (ఆలోచనలు) ఆకాశంలోని అర్థం పర్థంలేని మేఘాకృతులు. క్షణక్షణం మారిపోయే ఆ మేఘాకృతులు నిష్ప్రయోజనములే కదా! అయితే... శ్రీవేంకటేశ్వరుని కరుణ కలిగిందంటే ఆ జీవులకు పైజెప్పినవన్నీ సత్ఫలితములిచ్చే వైభవములే అవుతాయి.

సంపుటి: 2 కీర్తన : ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
సంఖ్య : 253 పుట : 169 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

26 ఏకాత్మవాదులాల యిందు కేది వుత్తరము
మీకు లోకవిరోధ మేమిటఁ బాసీ నయ్యలాల ॥ పల్లవి॥

పాప మొక్కడు సేసితే పాపులే యిందరుఁ గావలదా
యేపున వొకరిపుణ్య మిందరికి రావలదా
కోపించి యొక్కఁ డసురైతే కోరి యిందరుఁ గావలదా
చూప దేవుఁడొక్కఁడైతే సురలిందరుఁ గావలదా ॥ఏకా॥

వొకఁ డపవిత్రుఁడైతే నొగి నిందరుఁ గావలదా
నొకఁడు శుచై వుండితే వోడ కిందరుఁ గావలదా
వొకనిరతిసుఖ మంటి యిందరును వొనరఁ బొందవలదా
వొకని దుఃఖ మందరు వూరఁ బంచుకోవలదా ॥ఏకా॥

ఆకడక నొకఁడు ముక్తుఁడయితే నందరునుఁ గావలదా
దీకొని యొకఁడు బంధుఁ (బుద్ధ) డయితే యిందరుఁ గావలదా
చేకొని శ్రీవేంకటేశుఁ జేరి దాసులయి యుండేటి -
లోకపుమునులనుఁ దెలుసుకోవలదా ॥ఏకా॥253

అవతారిక:

అద్వైత బ్రాహ్మణుడైన అన్నమాచార్యులవారు విశిష్టాద్వైతాన్ని చేపట్టి ఆచార్యుడై అద్వైతాన్ని ఖండిస్తూనే తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టువడి యెన్నో కీర్తనలను చెప్పారు. ఈ కీర్తనలో కూడా ఆయన ఏకాత్మవాదాన్ని ఖండిస్తున్నారు. ఇన్ని గుణదోషాలుగల ఈ జీవాత్మలు యేదోషమూలేని పరమాత్మ ఒక్కటే ఎలా అవుతాయి? నక్కయెక్కడ? నాకలోకము (స్వర్గము) యెక్కడ? అంటున్నారు ఆచార్యులవారు. పైగా మీరు లోకవిరోధులు ఆ గుణం మీరు పొమ్మన్నా పోతుందా? ఈ కీర్తనలో నా మాటలకి జవాబు చెప్పండయ్యా! అందరూ ఒకే ఆత్మ స్వరూపులైతే ఒకడు పవిత్రుడెందుకవుతున్నాడు? ఇంకొకడు అటవికుడెందుకవుతున్నాడు. ఎవరి ఆత్మ సంస్కారం వారిదేనని స్పష్టమవుతున్నది కదా! మరి ఆత్మ స్వరూపం ఒక్కటే

అనటంలో అర్థమేముంది? భగవంతుని దాసులైనవారికీ దురహంకారులకీ ఒకే ఆత్మ విచక్షణ వుంటుందంటే అది అసంబద్ధమే.

భావ వివరణ:

ఓ ఏకాత్మవాదులారా! (ఉన్నది ఒక్కటే ఆత్మ స్వరూపమని వాదించు తార్కికులారా!) ఇందుకేది వుత్తరము (నా వాదనను ఖండించగా తగిన సమాధానము మీవద్ద వున్నదా?)

అయ్యలారా! మీకు లోక విరోధము (లోకులు అన్నదానిని కాదనే నైజము) యేమిట బాసీను (యెందుకుపోతుంది?) మీ ఆలోచనా విధానమే తప్పు అని నాకు అనిపించుచున్నది. అయ్యలారా! అందరి ఆత్మా ఒక్కటే అయితే... ఒక్కడు పాపము చేస్తే ఇందరూ (ఈ జీవులందరు) పాపులేగావలదా (పాపాత్ములే కావద్దా?) ఏపున (అతిశయంగా) ఒక్కడు పుణ్యము చేసిన ఇందరూ ఆ పుణ్యమును పొందవలెను కదా! అట్లు జరగుట లేదేమి? కోపించిన ఒకడు అసురుడై దుష్కార్యములను చేస్తే (హిరణ్యకశిపుడి వంటి వారు) ఇందరూ కోరి అసురులే అయిపోవాలి గదా! సరే పోనీ దేవుడు ఒక్కడే అనుకొందాం. అటువంటప్పుడు ఇంద్రుడు, శివుడు, గణపతి, కార్తికేయుడు వంటి ముక్కోటి దేవతలెందుకు? అందరూ ఒకే పరమాత్మ అనుకొంటే సరిపోదా?

ఒకడు పవిత్రుడైన ధర్మబోధకుడైన ఆచార్యుడైతే అందరూ ఆచార్యులేకావలెను కదా! శుచిగా వుండేవారేకావాలి కదా! పోనీ ఒకడు అపవిత్రుడై ఆచారమేలేని దురాత్ముడైతే ఇందరూ అపవిత్రులే కావాలి కదా! ఒకరి రతి సుఖమింకొకరికి దక్కితే అందరూ భోగులే అయిపోయి స్త్రీ లోలులయ్యేవారు కదా! ఒకని ఇంట మృత్యువు సంభవించి దు:ఖముతో తత్తరజెందుతుంటే వూరివారందరూ తత్తరజెందవలెను కదా! అట్లూ పంచుకోవటం సాధ్యమా?

ఇక పోతే ఇంకొక గొప్ప వుదాహరణను చూడండి. అకడ (అక్కడ) ఒకడు ముక్తుడైతే (మోక్షమును) పొందగలిగిన అర్హత సంపాదిస్తే... అందరూ ముక్తులే అయిపోవాలి కదా! దీకొని (దీనుడై) ఒకడు సంసారతాపత్రయముతో బద్ధుడైతే (కట్టివేయబడినవాడైతే), ఇంతమందీ అటువంటి వారే కావాలి కదా! ఒక సర్వసంగపరిత్యాగి ఎలా ఆవిర్భవిస్తాడు? మరి, ఈ లోకంలో యేదో బ్రతికేస్తున్న వారే అధికంగా వున్నారు. శ్రీవేంకటేశ్వరుని దాసులై మునులవలె జీవించేవారు యెందుకుంటారు? ఇంత చిన్న వివేచన తెలుసుకోవద్దా? కాబట్టి పరమాత్మ సాయిజ్యం పొందేదాకా ఏ ఆత్మా విశిష్టాత్మకాదు... కాబోదు... కాజాలదు.

సంపుటి: 2 కీర్తన : ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచిచూచినా
సంఖ్య : 371 పుట : 249 రాగం: సాళంగనాట

సాళంగనాట

27 ఈతఁడే యీతఁడే సుండి యెంత యెంచి చూచినా
చేతనే వరాలిచ్చీ శేషాచలేశుఁడు ॥ పల్లవి॥

విశ్వరూపపుబ్రహ్మము విరాట్టయినబ్రహ్మము
ఐశ్వర్యస్వరా ట్టాసామ్రాట్టయినబ్రహ్మము
శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైన బ్రహ్మము
యీశ్వరుఁడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము ॥ఈత॥

సూర్యునిలో తేజము సోమునిలో తేజము
శౌర్యపుటనలునిభాస్వత్తేజము
కార్యపుటవతారాలఁ గనుఁగొనేతేజము
వీర్యపుటెజ్జభాగాలవిష్ణునామ తేజము ॥ఈత॥

పరమపురుషమూర్తి ప్రకృతియైనమూర్తి
గరిమతో మహదహంకారమూరితి
ధరఁ బంచతన్మాత్రలు తత్వము లైనమూరితి
గరుడానంత సేనేశకర్తయైనమూరితి ॥ఈత॥

భాగవతపుదైవము భారతములో దైవము
సాగినపురాణవేదశాస్త్ర దైవము
పోగులైనబ్రహ్మలను బొడ్డునఁ గన్నదైవము
శ్రీగలిగిభూపతైన శ్రీవేంకటదైవము ॥ఈత॥371

అవతారిక:

ఈతడే శేషాచలేశ్వరుడు సుమండీ! ఎంత ఎంచి చూస్తే అంతగా తేటతెల్లమవుతుంది. ఈతడే యెంచుటచేతనే వరాలిచ్చే శ్రీవేంకటేశ్వరుడు.

ఇదేపల్లవికి ఇంకా రెండుమూడు విధాలుగా భావము వివరించవచ్చును. దేనినైనా సమర్థించవచ్చును. అదీ అన్నమాచార్యులవారి వైభవం. విశ్వరూపుడైన విరాట్పురుషునిగా ఈ బ్రహ్మమును భావించగలరా? సూర్యునిలోనున్న దివ్యకాంతి, చంద్రునిలోనున్న చల్లనికాంతి, అగ్నిలోనున్న జ్వలించేకాంతి ఈయనవే. జీవులలో జీవశక్తి ఈతడే. చక్రవర్తులకు యేలికయైన జగదీశ్వరుడూ ఈయనే. యజ్ఞభాగములందరికీ అందించే యజ్ఞపురుషుడూ ఈ స్వామియే. అంతేకాదు విష్ణువు అని సమస్త దేవతలూ అనునిత్యం కీర్తించేదీ ఈ దేవేంద్రపూజితునే. నిత్యపారాయణ గ్రంథాలయిన భాగవతంలోనే కాక పంచమవేదముగా కీర్తించబడుతున్న మహాభారతంలో కూడా కథానాయకుడు ఈ పురుషోత్తముడే.

భావ వివరణ:

ఓ జనులారా! యెంత (ఏవిధముగా) యెంచి చూచినా (భావించినా) చేతనే (తలచుటచేతనే) వరాలిచ్చే (ఈప్సితములను తీర్చే) ఈతడే యీతడే సుండీ (ఇతడు ఇతగాడే సుమండీ). అంటే ఇటువంటి మరెవ్వరూ లేరని భావము.

ఈతడే బ్రహ్మము (పరబ్రహ్మ). విశ్వరూపము ప్రదర్శించిన బ్రహ్మము ఇతడే. విరాట్టు (ఆదిదేవుడు) అయిన బ్రహ్మము ఇతడే. ఐశ్వర్య స్వరాట్టు (బ్రహ్మము) మరెవ్వరో కాదు సామ్రాట్టు (సర్వం సహ చక్రవర్తి) యైన ఈ పరబ్రహ్మే. శాశ్వత బ్రహ్మాండాలు (పదునాలుగు భువనాలు) తన శరీరముగా గలిగిన ఈ బ్రహ్మమే నిజమైన పరబ్రహ్మము. ఈశ్వరుడై (సర్వాధిపతియై) మహారాట్టై (చక్రవర్తియై) ఇందరిలో (ఈ సమస్త జీవులలో) బ్రహ్మము (అంతర్యామి) గా వున్న పరమాత్మ స్వరూపుడు వారి జీవశక్తియూ ఈతడే.

సూర్యునిలోని కనులుమిరుమిట్లు గొలిపే కాంతి, చంద్రునిలోని చల్లని తెల్లని కాంతి కూడా ఈ దేవదేవునివే. శౌర్యపు (మండించు శక్తిగల) అనలుని (అగ్నిదేవుని) భాస్వతేజము (జ్వలన తేజము) ఈయనదే. ఈ స్వామి ఆయా

జగత్కళ్యాణ కార్యక్రమముల కొఱకు అనేక అవతారములనెత్తినాడు. వాటిలోని దివ్యతేజము ఈ దేవదేవునిదే. వీర్యపు యజ్ఞభాగాల (ప్రభావముగల గొప్ప యజ్ఞములలో) వారి వారి యజ్ఞభాగములందించు యజ్ఞనారాయణుడు విష్ణుమూర్తి అని ప్రసిధుడైన ఈ తేజోమూర్తియే.

ఓ ప్రజలారా! పరమపురుషుడని కీర్తివహించినదీ మూర్తియే. ప్రకృతి రూపంలో అనునిత్యమూ తన అనంత అద్భుత శక్తి (సెల్ఫ్‌డికే, సెల్ఫ్‌గ్రోత్) చూపిస్తున్నది ఈ మూర్తియే. గరిమతో (మహిమతో) మహత్ అహంకారము (మంచి స్వభావముగల అహంకారము) ఈ మూర్తియే. ధర (ప్రపంచములో) పంచతన్మాత్రలు (శబ్ద, రస, స్పర్శ, రూప, గంధములను గ్రహించు శక్తి ఈ మురారిదే) అనగా... పంచేంద్రియములైన కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము అందించు శారీరక జ్ఞానము ఏదైతే మన మెదడు ద్వారా అందుకొని గ్రహించి దాచుకొని పునశ్చరణ చేయగలుగుతున్నామో ఆ దివ్య శక్తికూడా ఈ మూర్తియే. ఈయనే లేనినాడు కళ్ళు వున్నా చూడలేవు, వాసన పీల్చినా తెలియదు తినినా రుచి తెలియదు స్పర్శేవుండదు. కోమాలో వున్నాడండీ అంటారు. వాడిది చావుకాదు బ్రతుకూకాదు. ఆ రూపమూ ఆయానే. ఈ భక్తులంతా శేషశయనుడని, గరుడ గమనుడని అనంత పద్మనాభుడని కీర్తింపబడుచున్న అగమ్యగోచరుడునూ ఈ మూర్తియే.

ఓ ప్రజలారా! భాగవతములో అనేక పురాణ కథానాయకుడు, భారతములో శ్రీకృష్ణపరమాత్మ ఈ దేవదేవుడే. పదునెనిమిది పురాణములలోని పురాణ పురుషుడు ఈతడే. వేదము కీర్తించునది, శాస్త్రములు చర్చించునది ఈతనినే. ఈ పరమాత్మ స్వరూపుని బొడ్డులో నుంచి తొమ్మిది మంది బ్రహ్మలు (సృష్టికర్తలు) పుట్టారట. వారే నలువ (చతుర్ముఖ బ్రహ్మ), భగువు, పులస్త్యుడు, అంగిరసుడు, అత్రి, క్రతువు, దక్షుడు, వశిష్ఠుడు, మరీచి. వారి నుండే అన్ని జాతులు సృష్టిచేయబడి జన్మించినవి. అందుచే సర్వులను కన్నదైవము ఎవరయ్యా అంటే శ్రీకలిగిన భూపతియైన ఆ శ్రీవేంకటపతియే.

సంపుటి: 2 కీర్తన : ఇంతయు నీమాయామయ మేగతిఁ దెలియఁగవచ్చును
సంఖ్య : 133 పుట : 89 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

28 ఇంతయు నీమాయామయ మేగతిఁ దెలియఁగవచ్చును
దొంతిఁబెట్టినకుండలు తొడరినజన్నములు ॥ పల్లవి॥

కలలోపలిసంభోగము ఘనమగుసంపద లిన్నియు
వలలోపలినిడిపరువులు వన్నెలవిభవములు
తలఁపున గలిగియు నిందునే తగులకపోదెవ్వరికిని
తెలిసినఁ దెలియదు యిదివో దేవరహస్యంబు ॥ఇంత॥

అద్దములోపలినీడలు అందరి దేహపురూపులు
చద్దికివండినవంటలు జంటఁగర్మములు
పొద్దొకవిధమయి తోఁచును భువి నజ్ఞానాంబుధిలో-
నద్దిన దిది దెలియఁగరా దంబుదముల మెఱుఁగు ॥ఇంత॥

మనసునఁ దాగినపాలివి మదిఁగలకోరిక లిన్నియు
యినుమున నిగిరిననీళ్లు యిల నాహారములు
పనివడి శ్రీవేంకటగిరిపతి నీదాసు లివిన్నియు
కని మని నిడిచిన మనుజులకాయపుమర్మములు ॥ఇంత॥133

అవతారిక:

ఈ కీర్తన బహుక్లిష్టమైనదని నా అభిప్రాయము. ఆ దేవదేవుని మాయామయమైన దేహతత్వము అంతతేలికగా అర్థం కాదు. యజ్ఞము చేసేటప్పుడు దొంతరగ పేర్చిన కుండలలో అనేకరకములైన యాగ సామాగ్రినుంచుతారు. దేంట్లో ఏముందో మూత తెరిచి చూస్తేనే కానీ

తెలియదు కదా! అట్లాగే అనుభవాలనుపొంది, కొన్నింటిని మూటకట్టుకొని వెంటతీసికొనివెళ్ళే జీవుడు దానిని యేదో ఒక జన్మలో అనుభవిస్తాడు. ఈ అనుభవం కూడా ఒక మాయవలె యెందుకు అనుభవిస్తున్నామో ఎంతకాలం అనుభవిస్తామో చివరికి ఏమవుతుందో తెలియదు. చిత్తు కాగితాలేరుకొనేవాడు, కొన్ని లక్షలమంది భవిష్యత్తును నిర్దేశించగల నాయకుడవుతున్నాడు. ఉన్నట్లుండి ఒక ప్రమాదంలో ప్రాణాలే పోగొట్టుకొంటున్నాడు. పెద్ద యజ్ఞం చేసి ఆయువు పెరగాలని హోమం చేసేవాడు యాగశాల తగలబడి శవం అవుతున్నాడు. మరి ఆయువు పెరగలేదేం? ఏమిటి నీ మాయ? ఏది నిజం? ఏది అబద్ధం? కొసమెరుపు యేమంటే అన్నమాచార్యులవారు, అనుభవాల సంకలనమే జీవితమైనప్పటికీ శ్రీవేంకటేశ్వరుని శరణాగతి చిట్టచివరికి రక్షిస్తుందంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఇంతయూ నీమాయామయమే (ఈ జగమంతా నీ మాయతో నిండినదే). ఏగతి దెలియగవచ్చును (మేము దానిని ఏవిధముగా నేర్చెదము?) తొడరిన జన్నములు (చేసిన క్రతువులలో) ఒకదానిపై ఇంకొకటి దొంతిబెట్టిన కుండలవలె దేంట్లో యేముంటుందో తెలియని వగుటచే ఏదిముందు అనుభవిస్తామో తెలియదు. (అనుభవించటమే మనపని).

ఒకనికి సంభోగించినట్లు కలవచ్చిందంటే ఆ అనుభవము భావజనితమే కాని, అనుభవేక వేద్యము కాదుకదా! కలలో ఒకనికి ఘనమైన సంపద కలిగితే సంపన్నుడై పోతాడా? కలలో రకరకములైన

వైభవములు కలిగినా ప్రయోజనమేముంటుంది? వలలో మెత్తని పరుపులు పరిస్తే అందులో పడుకోగలరా? అయితే పైవన్నీ తలపులో భావాలే అయినప్పటికీ దాని అనుభూతిని సుఖదు:ఖములద్వారా అనుభవించని వాడెవ్వడూ వుండడు. అవునా? ఇదెట్లు సాధ్యమో యెవ్వరికీ తెలియని దేవరహస్యము. తెలిసినట్లుంటుంది, కానీ యేమీ తెలియదు.

ఒక జన్మలో మనం పొందే దేహపురూపవైభవము అద్దములోని ప్రతిబింబాలవలె సదామారిపోతూనే వుంటాయి. ఇక మన జంట కర్మంబులు (సంచిత కర్మ మరియు ప్రారబ్ధకర్మ) చద్దిమూట కట్టుకొని పోయేవాడు వండించుకొన్న వంటల వలె యెప్పుడు తింటామో... తీరా తినేవేళకు ఆ వంటకు రుచీపచీ వుండని పరిస్థితి. అయినా తినక తప్పదు కదా! అజ్ఞాన సాగరంలో తలమునకలయ్యేవాడికి యే పొద్దు యెలావుంటుందో తోచదు. అంబుదముల మెఱుగు (ఆకాశంలోని మేఘాలలోని మెరుపులకు ఏ ఆకారముంటుందో ఎవరికి తెలుస్తుంది? ఇది అద్దినది (ఏదోవిధముగా సంభవించేది) తెలియగరాదు. (దీనివిధానము తెలియాలంటే సాధ్యము కాదు).

మనస్సులో పుట్టిన ఈ కోరికలు మనస్సులోనే దాగిన మర్మములు. అవి సూర్యకాంతిలో ఇగిరిపోయిన నీళ్ళవంటివి. మనం తినే ఆహారం యేపూట దాపూటే కదా! దాచివుంచుకొనే వీలులేదు. అట్లే కోర్కెల వైక్లబ్యముననుభవించక తప్పదు. అయితే దీనిలో ఒక సుగుణమున్నది. శ్రీవేంకటేశుని దాసులకు మాత్రము ఈపై జెప్పినవన్నియు వర్తించవు. వారు మనుష్య శరీరాలు దాల్చినా వదిలివేసినా సంగత్వమునొల్లని ముక్తులు.

సంపుటి: 2 కీర్తన : వెలుపల మరువక లోపల లేదు
వెలుపలగలిగిన లోపల మఱచు

సంఖ్య : 137 పుట : 92 రాగం: రామక్రియ

రామక్రియ

29 వెలుపల మఱవక లోపల లేదు వెలుపలఁ గలిగిన లోపల మఱచు
చలమున నిదియే ఘడియ ఘడియకును సాధించినసుఖమటుదోఁచు ॥పల్లవి॥

వెలుపలి వెలుఁగే చూడఁగ లోపలి వెడచీఁకటి గాననియట్లు
అలరి ప్రపంచజ్ఞానికిఁ దనలో నాత్మజ్ఞానము గనరాదు
పలుమరు చీఁకటి చూడఁగఁ జూడఁగ బయలే వెలుఁగై తోఁచినయట్లు
అలయక తనలోచూపు చూచినను అంతరంగమున హరిఁ గనును ॥వెలు॥

జాగరమే కడుఁ జేయఁగఁ జేయఁగ సతతము నిద్దుర రానట్లు
చేగలనింద్రియములలోఁ దిరిగినచిత్తవికారము లయపడదు
యీగతి నిద్దుర వోఁగాఁ బోఁగా నిలలో సుద్దులు యెఱఁగనియట్టు
యోగపుటేకాంతంబును దనమన సొగి మరవఁగ మరవఁగ హరిఁగనును
॥వెలు॥

దేహపుటాకాశపునిట్టూర్పులు బహిరపుబయట నడఁగినయట్లు
ఆహా జీవునిజననమరణములు అందే పొడముచు నం దడఁగు
వూహల శ్రీవేంకటపతివాయువు కొగి నాకాశము వొక్క సూత్రము
ఆహా ప్రాణాపానవాయువులు ఆతుమ నిలుపుటే
హరిఁ గనుట ॥వెలు॥137

అవతారిక:

అంత:కరణము పరిశుద్ధంగా వుంటే బాహ్యముగా శుచిగా వుండే గొప్ప ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు. బాహ్యముగా గొప్ప పరిశుద్ధుడను అనేవాడు అంత:కరణలో సాధారణ వ్యక్తి అయితే

అతడు భగవంతుని మన్ననకు అనర్హుడు. శౌచము అనగా శుభత్ర. వెలుపల శౌచమును మరువక లోపల శౌచము లేదు. ఒకవేళ వెలుపల శౌచము కలిగిననూ లోపలి శౌచము సంగతినే మరచును. ఇది జీవిలక్షణం. ఘడియ ఘడియకూ ఇదే జరుగుతుంటుంది. కానీ ఆ చలమును (మత్సరమును) నిరోధిస్తే సుఖము తప్పక దొరుకుతుంది. వేళకు నిదురించక జాగరణకు అలవాటు పడిన ఇంద్రియములలోనే తిరిగే మనోవికారములు తమ ప్రతాపము చూపిస్తాయి. అట్లే అతి నిద్రాలోలుడూ ఆత్మజ్ఞాని కాలేడు. యోగ శక్తి ద్వారా బాహ్యపు ప్రపంచమును మరచి మానసిక యేకాంతమునకు అలవాటుపడితేనే శ్రీహరి దర్శనం కలుగుతుంది. ఇదంతా చిలుకపలుకుల్లాగా అనుకొంటుంటే ఏమీ వుపయోగం లేదు. ఆ భావన మనస్సులో స్థిరపడాలి. అదీ అంత తేలిక కాదు. కొసమెరుపేమంటే ఈ చెప్పేది కేవలం బాహ్యజ్ఞానం మాత్రమే.

భావ వివరణ:

వెలుపల (బాహ్యముగా శౌచము) మఱువక (వదలిపెట్టక) లోపలలేదు (అంత:కరణము శౌచముగా నుండుట సంభవించదు.) వెలుపల గలిగిన (బాహ్యముగా శౌచమును పాటించువాడు) లోపల (అంత: కరణ యొక్క శౌచమును) మఱచు (వదలివేయును). చలమున (మత్సరమున) ఘడియ ఘడియకు (ప్రతిక్షణమూ) ఇదియే మరువరానిది, నిజమైనది. దీనిని (అంత:శౌచమును) సాధించిన అటు (అటుపిమ్మట) సుఖము దోచు (సుఖము కలుగుతుంది).

వెలుపలి వెలుగే (బయటకు కనుపించే వెలుగు) చూచినచో లోపలి వెడ చీకటి (గృహాంతర్భాగపు చీకటి) కనుపించదు. అదేవిధముగా తానే గొప్ప ప్రపంచజ్ఞానము కలవాడననుకొనే అహంభావికి ఆత్మజ్ఞానం

కనరాదు. చీకటిలో చాలాసేపు గడిపి కనులను చిమ్మచీకటికి అలవాటు చేసినవానికి బయలే (ఆరుబయటి వెలుగే) వెలుగై (సూర్యకాంతివలె) తోచును (కనుపిస్తుంది). అట్లు (అదే విధముగా) అలయక (వెనుదీయక) తనలో చూపుచూచినను (అంతర్ముఖుడై ఆత్మావలోకనం చేసికొంటే) తన అంతరంగంలోనే నెలకొనియున్న శ్రీహరిని దర్శించుట సాధ్యమే. వారే జీవన్ముక్తులు.

జాగరమే కడు జేయగా (యెప్పుడు మెలకువతోనే వుండి) అట్లే చేయగా చేయగా యెప్పటికీ నిద్దురే రానట్లు, చేగల (స్వాధీనము చేసికొనుశక్తిగల) ఇంద్రియాలలో తిరిగే మనోవైకల్యము, లయ పడదు (అంతము కానేకాదు). ఈ విధముగా నిదురించగా నిదురించగ ప్రపంచజ్ఞానముకూడా అలవడదు. ఎందుకంటే మనస్సు యేస్థితికి అలవాటు చేస్తే ఆ స్థితిలోనే వుంటుంది. అట్లే యోగసాధనతో ఏకాంతమునకు అలవాటుపడితే మనస్సున బాహ్య విషయములనన్నీ మరచి హరినే నిలుపగలుగును.

దేహము అనే ఆకాశంలో ఒక నిట్టూర్పు అంకురిస్తే అది బయటకు వెలువడక తప్పదు కదా! అది బయటకు వస్తేనే అడగును (అంతమవుతుంది). ఆహా! జీవుని జననమరణములు కూడా ఉచ్ఛ్వాసతోనే పుట్టి నిస్వాసతో అంతమైపోతాయి. ఊహలలో నిలుపుకోవలసిన శ్రీవేంకటేశ్వరుని యోగసాధనతో తమ ప్రాణాపానవాయువులను నిరోధించి ఆత్మలో నిలుపుకోగలిగితే హరి దర్శనము సాధ్యమవుతుంది.

సంపుటి: 2 కీర్తన : ఇందరిలో నేమెందు బోలుదుము
యిందరి బోలినజీవులమే

సంఖ్య : 138 పుట : 93 రాగం: గుజ్జరి

గుజ్జరి

30 ఇందరిలో నే మెందుఁబోలుదుము యిందరిఁ బోలినజీవులమే
కందువ వీరలఁ దలఁచి చిత్తమిది కలఁగెడి దైవము కావఁగదే ॥ పల్లవి॥

యెందరొకో జరాదు:ఖము లేచి యనుభవించేటివారు
యెందరొకో దరిద్రదు:ఖము లెసఁగి యలమటించేటివారు
యెందరొకో బంధనతాడనహీనదెసల నుండెడివారు
యెందరొకో దాసదాస్యవిధి నెడయరాక చెఱ లయినవారు ॥ఇంద॥

యెందరొకో మరణదెసలచే నిల సంయోగవియోగదు:ఖితులు
యెందరొకో జన్మరోగముల నెక్కువభయమందేటివారు
యెందరొకో రాజులచోరులహింసలకు లోనయినవారు
యెందరొకో పొడమినజీవుల కెక్కడ నెక్కడ నేపాటో ॥ఇంద॥

యెందరొకో యీదు:ఖనివృత్తికి యెడసి మిమ్ముఁ గొలిచినవారు
యెందరొకో సంపదలకు లోనై యేతాయాతనఁ బడువారు
యెందరొకో శ్రీవేంకటేశ యిపు డెక్కువ నీశరణము చొచ్చి
యిందును నందును సుఖులై లోకుల నిందరిఁ జూచుచు
నవ్వెడివారు ॥ఇంద॥138

అవతారిక:

ఈ ప్రపంచంలో క్రిమికీటకాలవంటి అల్పజీవులను సృష్టించినదా దేవుడే. తిమింగలాలవంటి భారీ జీవులనూ పుట్టించినది ఆ దేవుడే. సప్త ఋషుల వంటి ధన్యజీవులను భూమ్మీదకు తెచ్చిందా పురుషోత్తముడే దుందుభిలాంటి దుష్టరాక్షసులకు జన్మనిచ్చింది ఆ దేవుడే. మరి ఇదంతా

యెందుకు చేస్తున్నాడు? ఒక జీవిని ఇంకొక జీవికి ఆహారంగా యెందుకు పెట్టాడు. మంచితనాన్ని పెంచి చెడుని త్రుంచటమే ఆయన వుద్దేశ్యమైతే ఆయన భక్తులు కూడా బాధలు యెందుకు అనుభవిస్తున్నారు. ఆయన ఆలయంలో దొంగతనాలు చేస్తున్నవారు అంతులేని సిరిసంపదలతో యెందుకు ప్రముఖులుగా కీర్తింపబడుతున్నారు. పడుతూ లేస్తూ రోజూ గుడికి వెళ్ళేవాడు, పాము కాటుకు చచ్చిపోతే గుడిస్థలాన్నే 'కబ్జా' చేసేవాడు గుడి ధర్మాధికారి అవుతాడు. ఇదెక్కడి న్యాయం అని మనబోటి పిచ్చోళ్ళు జుట్టు పీక్కుంటూ వాళ్ళూ దుర్మార్గులవుతున్నారు. ఎందుకు ఇదంతా? అన్నమాచార్యులవారు ఈ అరుదైన కీర్తనలో ఆ తమాషాను వివరిస్తున్నారు. ఎందరో ముసలి బడుగులు దు:ఖిస్తున్నారు, ఎందరో దాస్యం అనుభవిస్తున్నారు. ఎందరో మరణం ద్వారా వియోగం అనుభవిస్తున్నారు, ఎందరో కాలు కిందపెట్టనవసరం లేని శ్రీమంతులున్నారు. ఇంతమందిలోన యేము (మేము) ఏ కోవకి చెందినవాళ్ళమో తెలీటం లేదు. ఈ చెప్పబోయే వాళ్ళలో నేను యెందులో వుంటానో తెలియటం లేదు. వీళ్ళను తలచుకొంటేనే నా మనస్సు కకావికలమై పోతున్నది అంటున్నారు.

భావ వివరణ:

ఓ దైవమా! (దేవదేవా!) ఇందరిలోన (నేను ఈ కీర్తనలో చెప్పబోయే ఇంతమందిలో) యేము (మేము) యెందుబోలుదుము (యెవ్వరిని పోలివుంటాము) యెందరిబోలిన (యెవ్వరివలెనున్నా) మేమూ జీవులమే కదా! వీరల (ఈ నిర్భాగ్యులను) కందువ దలచి (ప్రత్యేకముగా తలచుకొని) చిత్తమిది (ఈ నామనస్సు) కలగెడి (కలత చెందుతున్నది). ఏమి చెయ్యాలో పాలుపోవటం లేదు. ఏచి (అతిశయముగా) జరాదు:ఖములను (ముసలితనంవల్ల అనేక కష్టములను) అనుభవిస్తున్నవారు యెందరొకో (యెంత మందివున్నారో)

దరిద్రదు:ఖములెసగి (పొంది) అలమటించేవారు (అవస్థలు పడుతున్నవారు) యెందరొకో? బంధించబడి, తాడన (దెబ్బలు తింటూ) హీనమైన బ్రతుకులు గడుపుతున్నవారు యెందరొకో? దాసులై దాస్యమనుభవిస్తూ యెడయరాక (ఇంకొక దారిలేక) చెఱసాలవంటి బ్రతుకు గడుపుతున్న వారు యెందరొకో? ఎందుకిలా జరుగుతున్నది? వాళ్ళు చేసిన తప్పేమిటి?

ఇల (ఈ ప్రపంచంలో) మరణదెసలచే (చావుమూలంగా) సంయోగ వియోగములను పొందుతున్నారు, (కొంతమంది కలుస్తున్నారు... కొంతమంది విడిపోతున్నారు). ఇట్లాంటివారు యెందరొకో? జన్మరోగములతో (పుట్టుకుతోనే వచ్చిన వ్యాధులచే పీడించబడుతూ) గొప్పభయపీడితులై యెప్పుడు చస్తారో తెలియని నిర్భాగ్యులు యెందరొకో? రాజుల (అధికారుల) చోరుల (దోపిడీదారుల) హింసలకు లోనై యేడుస్తున్నవారు యెందరొకో? పొడమిన జీవులకు (పుట్టుక కలిగిన ప్రాణులందరికీ) యెక్కడెక్కడ యేపాటో (యేదిప్రాప్తమో) తెలిసేది యెందరొకో? అయినప్పటికీ ఈ దు:ఖనివారణకు, యెడసి (వదలక) మిమ్ము కొలిచేవారు యెందరొకో (యెంతమందివుంటారు స్వామీ! అత్యల్పులే సంఖ్యలో)

సంపదల గర్వపీడితులై యేతయాతన (గర్వాంధులై మదోన్మత్తులై) దైవమును తలచేవారు యెందరొకో? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇపుడు యెక్కువగా నీ శరణాగతులై నిన్నే నమ్ముకొనేవారెందరొకో? అటువంటి నీ ఆశ్రితులంతా ఇందున (ఈ భూమ్మీదా) అందునా (చచ్చాక ఆ స్వర్గంలో కూడా) సుఖులై (హాయిగా వుంటూ) లోకులనందరి జూచుచు (పైన చెప్పిన తిప్పలన్నీ పడుతున్న పిచ్చోళ్ళను చూచి) నవ్వేడివారు (నవ్వుకొంటుంటారు).

సంపుటి: 5 కీర్తన : చల్లనైకాయగదో చందమామా నీ
సంఖ్య : 228 పుట : 156 రాగం: సామంతం

సామంతం

31 చల్లనై కాయఁగదొ చందమామా నీ
వెల్ల(ల్లి?) గాఁ దిరువేంకటేశునెదుర
మొల్లమిగ నమృతంపు వెల్లి గొల్పుచు లోక-
మెల్ల నినుఁ గొనియాడఁగాను ॥పల్లవి॥

పొందైన హితులు నాప్తులు రసికులును గవులు
నందమగు నునుమాటలాడ నేర్చిన ఘనులు
చిందులకు నాడేటి సీమంతినీ మణులు
చెలఁగి యిరుగడఁ గొలువఁగాను

వందిమాగధులు గైవారింపఁ దనదివ్య-
మందిరోపాంత ఘనమార్గమునఁ గోనేటి-
ముందటను మంద మందప్రయాణములతో-
నిందిరాపతి మెరయఁగాను ॥చల్లనై॥

ఏకాంత సుఖగోష్ఠినింపొంద మానవా-
నీకంబులెడఁ గలసి నిలిచి సేవింపఁ గాం-
తాకదంబముల (లు?) హస్తముల కంకణఝణ-
త్కారములు నిగుడఁ జామరములిడఁగ
జోకైన మణిగణస్తోమాంకితంబులై
సొంపొందు నాలవట్టములు గరములఁ దాల్చి
యేకాంతులిరువంక నెదిరి కొలువఁగ సకల-
లోకేశ్వరుఁడు మెరయఁగాను ॥చల్లనై॥

బంగారుప్రతిమలకు ప్రతులైన దివిజలో-
కాంగనలు ఘనవిమానాంగణంబుననుండి

చెంగలువలును మంచిసేవంతిరేకులును
చెలఁగి యిరుగడఁ జల్లఁగాను
మంగళాత్మకములగు మహితవేదాంత వే-
దాంగవిద్యలకు ప్రియమంది చేకొనుచుఁ దిరు-
వేంకళేశ్వరుఁడు గడు వేడుకలతోడఁ దిరు-
వీథులను విహరించఁగాను ॥చల్లనై॥228

అవతారిక:

చిన్నపిల్లలకి, వలపుజంటలకి ప్రీతిపాత్రుడైన మామ చందమామపై చక్కటి కీర్తన చెబుతున్నారు అన్నమాచార్యులవారు. జాజర పాటలను జోలపాటలను, విరహగీతాలను, భజనలను, మేలుకొలుపులను..., ఒకటేమిటి? ఏ ప్రక్రియ చేసినా ఎవరిపై కీర్తన చెప్పినా చివరికి ఆ కీర్తన నివేదన మాత్రం శ్రీవేంకటేశ్వరునికే దక్కుతుంది. రసికులకు కవులకు, ప్రేమజంటలకు ఆరాధ్య దైవమైన చందమామ అమృతము వెదజల్లేది ఆ శ్రీవేంకటేశుని కోనేటి ఒడ్డున చేరిన అశేష భక్తులు తరించి పులకించి పోవుటకేనట. అన్నమయ్య ప్రత్యేకత యేమంటే మనబోంట్ల కన్నులకు కానరాని దేవాంగనలు, దివ్యవిమానాలూ, అప్సరసలు చల్లె చేమంతులూ చెంగలువలు ఆయన మనో నేత్రాలకు కనిపిస్తాయి కాని మనబోటి మానవమాత్రులకు కనబడవు. మనకు ఆయన సేవించే వనితామణులు మాత్రమే కనిపిస్తారు.

భావ వివరణ:

ఓ చందమామా! నీవు చలనై (చల్లనివాడవై) కాయగదో వెన్నెలను కాయవయ్యా! వెల్లిగా (ధారగా) ఈ తిరువేంకటేశ్వరుని యెదుట, నీవు కాయగదో! మొల్లమిగా (అధికముగా) అమృతంపుధారలు వెల్లిగొల్పుచు (కురిపించుచూ) లోకమంతా నిన్ను చల్లని రేరాజువని కీర్తిస్తుంటే కాయగదో!

నీకు పొందిక గల హితులు ఆప్తులు అనేకులున్నారు. వారంతా రసికులు, కవులు, అందమైన మెత్తని కమ్మని మాటలు చెప్పడం నేర్చిన ఘనులు. కాలి

గజ్జెలు ఘల్లుఘల్లుమన చిందేసి ఆడేటి సీమంతినీ మణులు (ముద్దుగుమ్మలు) నీకునూ ఆరాధ్యదైవమైన శ్రీరమణుని ఇరువైపులా బారుగా నిలుచుండి కీర్తిస్తుండగా కాయగదో! బహుపరాక్ అని కీర్తించు వందిమాగధులు పనిలోపనిగా నిన్నునూ గైవారింపుగా (పొగుడుతుండగా) ఆ వేంకటరమణుని దివ్య మందిర ప్రాంగణమున, రాచమార్గములలోనూ, స్వామి కోనేటిముందటను మందముగా (మెల్లమెల్లగా) ప్రయాణము చేయుచూ నీ స్నిగ్ధ కాంతిలో వేంకటరమణుడు మెరిసిపోతుంటే చల్లగా రావయ్యా! చందమామా!

శ్రీవేంకటేశ్వరుడు ఏకాంతసేవకు సిద్ధమయ్యాడు. ఆయన సుఖగోష్టికై మానవుల వరుసలు దీరి నిలిచి సేవిస్తున్నారు. కాంతాకదంబములు (వివిధ వయో పరిమితిగల వనితలు... అంటే... బాలికల నుంచి వృద్ధ స్త్రీలవరకు గల ఆడువారి గుంపులు) చేతికంకణములు ఝణఝణమనుచుండగా చామరములతో వీయుచున్నారు. ఆలవట్టములతో (వస్త్రముతో చేసిన గుండ్రటి విసనకర్ర) నున్న చేతులకు మణులు పొదిగిన అందమైన సొంపైన ఆభరణముల సమూహముతో ఏకాంతసేవకై ఇరువైపులా నిలుచున్నారు. వీరందరి సేవలో సకలలోకేశ్వరుడైన శ్రీవేంకటేశుడు మెరయగాను (శోభలీనుచున్నాడు).

బంగారుబొమ్మలవలె మెరిసి పోతున్న ప్రతులైన (సాటిలేని) దేవకాంతలు ఆకాశమార్గమున వచ్చి తమ విమానముల వరుసలలో నుంచి దిగి, చెంగలువలను (ఎఱ్ఱని కలువపూలను, మంచి చేమంతి పూవులను ఇరువైపులా విస్తృతముగా చల్లుతున్నారు. మంగళకరమైన వేదాంత వేదాంగ విద్యలలో ఆరితేరినవారు వేదఘోషతో నుతిస్తుంటే ప్రియమంది చేకొనుచు (ఆప్యాయంగా వాటిని స్వీకరించుచూ) శ్రీవేంకటేశ్వరుడు గొప్ప వేడుకగా తిరుమల మాడవీధులలో వూరేగుచున్నాడు. ఈ మహోత్సవం చూస్తూ తన బావగారి సౌందర్యానికి మురిసిపోతూ చల్లనైన చందమామ వెన్నెల జల్లు కురిపిస్తూనేవున్నాడు.

సంపుటి: 5 కీర్తన : ఎటువంటిభోగి వీడెటువంటి జాణ
సంఖ్య : 177 పుట : 121 రాగం: సామంతం

సామంతం

32 ఎటువంటి భోగి వీఁడెటువంటి జాణ
వటపత్రమున నున్నవాఁడా వీఁడు ॥ పల్లవి॥

పొదిగొనఁ బూచిన పున్నాగతరులలో
పొదలుఁ బుప్పొళ్ళపైఁ బూఁదేనె సోనలు
గదలుచు జడివానకాలంపుఁ బెదపెద్ద-
నదులై పారనున్నతిని
కదలని నడిగడ్డ కల్పభూజంబుల
పదిలమైన నీడ బంగారు చవికెలో
కదిసిన జలరాశి కన్నెకొఁగిటఁ గూడి
వదలకెప్పుడు నున్నవాఁడా వీఁడు ॥ఎటు॥

వలనగు తావుల వాసంతికలలోన
కెలఁకుల నరమోడ్పుఁ గెందామరలయందు
పొలయుచు గొజ్జంగపూవుల దూళితో
లలితంపు గాలి చల్లఁగను
కొలఁదిమీరిన మంచి కోనేటి పన్నీటి-
జలములలో నున్న జలజముఖులుఁ దాను
అలరుచుఁ దగనోలలాడుచు నేప్రొద్దు
వలపులు చల్లినవాఁడా వీఁడు ॥ఎటు॥

లోకము లోపలి లోలలోచనలెల్లా
జోకైన తనవాలుఁ జూపులచేఁ జిక్కి
యీకడాకడ చూడనెఱఁగక నిజమైన-
సాకారమునకె మెచ్చఁగను
పైకొన్న సరసపుఁ బలుకులఁ గరఁగించి
యేకాంతమున సౌఖ్యమెల్లఁ జేకొనుచుఁ దా-
నీకడఁ దిరువేంకటేశుఁడై యున్నాఁడు
వైకుంఠపతియైన వాఁడా వీఁడు ॥ఎటు॥177

అవతారిక:

తిరువేంకటేశ్వరుని ఏకాంతసేవలో అన్నమాచార్యులవారు ఆలపించిన కీర్తన ఇది అని నా వూహ. ఈ స్వామియెట్లాంటిభోగి!! ఎట్లాంటి జాణ అని సన్నుతిస్తున్నారు. ఆచార్యులవారి ఈ కీర్తన ప్రత్యేకత మేయంటే ఇందులోని వర్ణనలు ప్రకృతి శోభావిష్కరణ యెంతో రమణీయంగా వున్నాయి. జలరాశికన్నెగూడి కౌగిటినెప్పుడూవదలక కదిసివున్నవాడట ఈ భోగి. అంటే ఏమిటో అంతా తెలిసీ యేమీ తెలియనట్లు వున్నది కదూ! ఇద్దరు భామలతో జలకములాడీయాడీ యేపొద్దునూ వలపులు జల్లేవాడట. ఏకాంత సౌఖ్యమెల్లచేకొనుచు ఈవేళ వేంకటపతియై యున్నాడట ఈ వైకుంఠపతి. దీనినిబట్టి ఈ కీర్తన తాళ్ళపాకలోని కోనేటిరాయనిపై చెప్పారేమో అనిపిస్తున్నది. ఏదియేమైనా మధురసుధావాహిని ఇది.

భావ వివరణ:

ఓ ప్రజలారా! మన కన్నులయెదుటనున్న ఈ దేవుడు యెటువంటి భోగి (యెంత భోగపురుషుడు!!), వీడు యెటువంటి జాణ (యెంత చతురుడు!!) ఆనాడు అనంతనీరవమున శిశువై తెప్పగా మఱ్ఱియాకుపై తేలి, కాలిబొటనవ్రేలిని చీకిన వటపత్రశాయిగానున్నవాడు, పొడవుకు పొడవైన ఈ పురుషోత్తముడేనా?

పొదిగొని బూచిన (దట్టముగా పూచిన) పున్నాగ వృక్షములలో పొదలు (నెలకొన్న) పుప్పొళ్ళపైనుండి పూదేనె (మకరందము) సోనలు (చిరుజల్లు) కదలిప్రవాహమై వానాకాలమున వున్నతముగా పారు పెద్దపెద్ద నదులైనవి. ఆఱుఱుల గట్లపై కదలని కల్పతరువులున్నాయి. ఆ కల్పతరువుల చల్లని నీడలో బంగారపు చవికెలో (మంటపములో) కదిసిన (చేరువయైన) జలరాశికన్నె (సాగరకన్యయైన లక్ష్మీదేవి) ను సందిట బిగించి యేపొద్దునైనా విడువని శ్రీకాంతుడైన వాడా వీడు!! ఆహా! మన జన్మ తరించినది.

వలనగుతావుల (ఆ ప్రక్కనున్న ప్రదేశములలో) వాసంతికలు (అడవిమొల్లచెట్లు) వున్నాయి. వాటి సమీపమున అరవిచ్చిన కెందామరల (ఎఱ్ఱని తామరపూవుల)పై గొజ్జంగ పూవుల పుప్పొడిని మోసుకుపోతున్న లలితమైన చల్లనిగాలి వీస్తుంటుంది. అక్కడ కొలది మీరిన (సాటిలేని) ఒక కోనేరు వున్నది. పన్నీరు వంటి ఆ కోనేటి జలములలో పద్మములవంటి వదనములు గల భామలతో తనివిదీర జలకములాడిన దేవదేవుడు యే ప్రొద్దునైనా జలములతోపాటు తన వలపులను చిలిపిగా వెదజల్లుచున్న ఈ శృంగార రాయుడు అని సరసులపొగిడే వాడేనావీడు.

లోకములోనున్న లోలలోచనలు (చంచలాక్షులు అనగా కదలే కనుగవలున్న లలనలు) సరసమైన తమ వాలుచూపులలో చిక్కి అటూ ఇటూ కూడా చూడలేక తిన్నగా చూచుచున్న ఈ కాసారపు జగన్మోహనుని మెచ్చేవిధముగా నున్నాడు. వారిని సమ్మోహనపరచే తన వాక్చాతురితో కరగించుచున్నాడు. ఈ ఏకాంత సేవా సౌఖ్యములో తిరువేంకటేశుడు ఈ వేళ తానే వైకుంఠపతియై యున్నాడా? వాడే వీడా?

సంపుటి: 3 కీర్తన : చాలుఁజాలు నీహరియే మాకును సకలక్రియలకు నాయకుడు
సంఖ్య : 371 పుట : 250 రాగం: లలిత

లలిత

33 చాలుఁజాలు నీహరియే మాకును సకలక్రియలకు నాయకుఁడు
నాలుకతుదనే యీతఁడుండఁగా నలుగడ నెవ్వరి వెదకేము. ॥ పల్లవి॥

యేలినవాఁడట లక్ష్మీవిభుఁడట యేమిటనుఁ గొరత మాకిఁకను
నాలోనున్నాఁడు బ్రహ్మతండ్రియట నాకాయుష్యము బాఁతా
పాలజలధిపై దేవునివారము పాఁడి మాకు నిఁక నేమరుదు
అలింపఁగ నే మింతటివారము అన్యుల కిఁకఁజేయి చాఁచేమా. ॥చాలుఁ॥

భూకాంతాపతికింకరులము యీ భూము లిన్నియును మాసొమ్మే
పైకొని చక్రాయుధుఁడే మాదాపు భయము లిన్నిటాఁ బాసితిమి
యీకడ నచ్యుతుమరఁగు చొచ్చితిమి యెన్నటికిని నాశములేదు
యేకొఱఁతని ఇఁక నాసపడుచు నే మెవ్వరికి నోళ్లు దెరచెదము ॥చాలుఁ॥

శ్రీవైకుంఠునిదాసులమట యరచేతిదిమోక్షము మాకిదివో
పావనగంగాజనకునిబంట్లము పాపములన్నిటఁ బాసితిమి
శ్రీవేంకటపతి వరము లియ్యఁగాఁ జిక్కినవెలుతులు మాకేవి
యీ వైభవములఁ దనిసిన మాకును
ఇతరులఁ దగిలెడి దిఁకనేది ॥చాలుఁ॥371

అవతారిక:

ఈ కీర్తన పాడుకొన్నా, వినినా గొప్ప ఆనందంతో కూడిన గర్వం కలుగుతుంది. అయ్యో! నాకేమీలేదు అనుకొని ఇతరులను యాచించుటకంటే దరిద్రమేముంటుంది? ఒకవేళ మనకు తిండికే లేక

యాచించవలసి వస్తే... లక్ష్మీపతి మనస్వామి భూలలనావిభుడు మన దైవము ఆయనను ఆశ్రయించి నాకిది కావాలి అంటే ఇవ్వడా? మరి ఇంకొకళ్ళముందు చేయి చాచుటకు సిగ్గులేదా? పోనీ మీకు ఇహలోకంలో యేమీ వద్దు, మోక్షం కావాలి అనే ఆశవుంటే వైకుంఠుని వేడుకోక ఇంకెవరిని వేడుకొంటారయ్యా? పోనీ పుణ్యంకావాలనే పీకులాట వుంటే ఈ స్వామియే గంగాజనకుడు కదా! ఈయన దాసులకి పాపమెలా వస్తుంది? అన్నిటికన్నీ నచ్చజెప్పే అన్నమాచార్యులవారి వాదనకు మీరు సరితూగగలరా?

భావ వివరణ:

ఓ భక్తులారా! మాకు ఈ హరియే చాలున్ జాలును (సరిపోతాడు). ఆయన సకలక్రియలకు (ధర్మార్థ కామమోక్షము లొసగుటకు) నాయకుడు (ఈయగల అధినాయకుడు). మా పూర్వ జన్మ సుకృతం వలన నిత్యమూ మా నాలుక తుదినే యీతడుండగా (ఇతనినే మేము కీర్తిస్తుంటే).... నలుగడ నెవ్వరి వెదకేము? (నలుదిక్కులా ఇంకా యెవరిని వెతుకుతాము)? మాకింకొరు అవసరమే లేదు.

ఇతనెట్టివాడో మీకు తెలియునా? వినండి. యేలినవాడట (జగత్పరిపాలకుడు); లక్ష్మీదేవి మనోవల్లభుడట. ఇక మాకు కొరతయేమిటను (యెందులో కొఱత వుంటుంది). నాలో అంతర్యామిగా వున్న ఈయనే స్వయముగా బ్రహ్మదేవుని తండ్రియట. ఇక మా ఆయుర్దాయమునకు బాతా (కొఱతయేమి వుంటుంది) చెప్పండి. మేము పాలజలధిపై పవ్వళించు దేవుని (క్షీరసాగర శయనుడైన శ్రీహరి) వారము (ఆప్తబంధువులము). ఇక మాకు పాడినేమరుదు? (భోగభాగ్యములకు కొదవేమిటి) చెప్పండి. నేము (మేము) ఆలింపగ (విన్నారంటే) ... ఇంతటి వారము (ఇంత వున్నతులము). ఇక అన్యులకు (పరులముందు) చేయిజాచి యాచింతుమా? చాలు చాలు మేమెన్నటికీ అట్లు చేయము.

మా గురించి మేము చెప్పుకోకూడదు... కానీ మేమెవ్వరమో తెలియునా? భూదేవీ వల్లభుడీ జగన్నాథుడేకదా! మేము ఈ స్వామి కింకరులము (భృత్యులము). ఈ భూమండలంలోవున్న భూములన్నీ మా ప్రభువువే. అంటే మా సొమ్మే కదా! స్వయముగా సుదర్శన చక్రాయుధుడే మా దాపైన సంరక్షకుడు (మావెంటనేవుండి రక్షించు దైవము). మరి మాకు భయమెందుకు? అచ్యుతుడంటే అర్థం తెలుసా మీకు? చ్యుతి (నాశనము) లేనివాడని అర్థము. మేము ఈ అచ్యుతుని మరుగుజొచ్చితిమి (ఆశ్రయములోనున్నవారము). అందుకనే మాకు యెన్నటికీ నాశనము లేదు. ఇక మాకు యేమి కొఱత వుందని పరులముందు నోరు తెరచి యాచించెదము? ఆశపడి అట్లు చేయవలసిన అగత్యమే మాకు లేదు. అవునయ్యా! ఇది నిజము.

సరే! ఇహలోకంలో అన్నీ వున్నాయి, మరి మోక్షము సంగతేమిటంటారా? ఆయన స్వయముగా శ్రీవైకుంఠపతి. మేము ఆయన దాసులము. మాకు అరచేతిలోనే మోక్షము వుంటుంది. దానికోసం మేము యెవ్వరినో యాచించవలసిన పనిలేదు. ఇకపోతే మేము పాపాలు చేస్తుంటే మా పాపాలు వదిలించండని ఇతర దేవతలను యాచించాలి. కానీ మాకా అవసరమే లేదు. మా స్వామి పరమ పావనియైన గంగాదేవికి జనకుడు. మేము యెన్నడో పాప విముక్తులమయ్యాము. మాకు ఈ శ్రీవేంకటేశుడు యేవరమడిగితే అది ఇస్తాడు. ఇక మాకు వెలితి (లోటు) యేమిటి? ఈయన దాస్యమనే వైభవమును స్వంతం చేసికొనిన మాకు ఇతరులను తగిలి (సంపర్కము పెట్టుకొని) వారి అండలో బ్రతకాల్సిన పనేమిటి?

సంపుటి: 3 కీర్తన : ధరగడపటనే జంతువుకైనా తనజన్మమే సుఖమైతోచు
సంఖ్య : 372 పుట : 221 రాగం: లలిత

లలిత

34 ధరఁ గడపట నేజంతువుకైనా తనజన్మమే సుఖమై తోఁచు
హరి గలఁడని తా నమ్మివుండఁగా
నతఁడిచ్చేసుఖ మొల్లరు ॥ పల్లవి॥

మొదలఁ గొందరికి స్వర్గలోకమే మోక్షసుఖంబని తోఁచును
అదె కొందరికి దేవత్వమే బ్రహ్మానందంబై తోఁచును
వుదుటునఁ గొందరికి సంసారమే వున్నతసుఖమై తోఁచును
తుద నామీఁదటిహరిదాస్యసుఖము ధ్రువపట్టంబని కానరు. ॥ధరఁ॥

సొరిదిఁ గొందరటు శూన్యతత్వమే సుఖమని మాఁటలనందురు
యిరవెరఁగని వారికి ధనధాన్యము లెక్కువసుఖమై తోఁచును
నిరతిఁ గొందరికి చిరజీవులౌటే నిత్యసుఖంబని తోఁచును
వరుసల శ్రీపతిపై భారంబిడె వైరాగ్యపుసుఖ మెఱంగరు ॥ధరఁ॥

యెక్కడ చూచిన మాయలసుఖములు యెన్నైనాఁ గల వెప్పుడును
చొక్కపు శ్రీవేంకటపతితోడుత సుఖియించేటిసుఖ మొల్లరు
యిక్కడ నక్కడ నీతనిదాసులే యేచి సుఖింతురు నిజసుఖము
కిక్కిరిసినయజ్ఞానాంధకారులు కిందును మీఁదును
నెరఁగరు ॥ధరఁ॥372

అవతారిక:

తమ జీవితకాలంలో జీవులందరూ శ్రీహరి వునికినే ప్రశ్నిస్తూ వారికి సుఖము వారిశక్తి సామర్థ్యాలవల్ల కలుగుతున్నాయని గర్వించి శ్రీహరిని అతనిచ్చే 'సుఖమును' కాదంటారు. ఆయన మాయవల్ల జంతువుకు కూడా

దాని బ్రతుకు హాయిగానే వున్నదనిపిస్తుంది. దొంగ తిండ్లు తింటూ పిల్లి రోజూ తిట్లు తింటూనే వుంటుంది. కాని ఒక్కరోజు కూడా ఛీ యేమిటీ బ్రతుకు? ఇంతమందితో రోసి బ్రతికి లాభమేమిటి? అనుకోదు. దాని బ్రతుకు దానికి సుఖమైతోచు అంటున్నారు అన్నమాచార్యులవారు. స్వర్గం కావాలనుకొంటారు కొందరు. దేవత్వం దక్కితే చాలంటారు కొందరు. అదేం కాదు నా సంసారమే మకరందాస్వాదనలాగా హాయిగా వుందంటాడింకొకడు. కాని హరిదాస్యమే సుఖము అని మాత్రం కానరు (తెలియరు). ఇదంతా అజ్ఞాన జనితమైన మాయ. ఎన్ని జన్మలెత్తినా కొంతమందికి తమ బ్రతుకు పరమావధి కేవలం బ్రతకటం కాదని, హరినెరుగుటే ముక్తి అని జీవుడు తెలుసుకోలేడు. దానికీ ఆయన కృప కలుగవలసిందే. లేకపోతే మహాసాగరాల అనంతగర్భాలలో బ్రతికే అసంఖ్యాక జలచరాలలో యేదో ఒకటియై చచ్చేదాకా బ్రతికి అలా జన్మల పరంపర అనుభవిస్తూనే వుంటారు. ఒక్కసారి కళ్ళుమూసికొని ఆలోచించండి. గడచిన క్షణంరాదు. అవునా? గడచిన క్షణం మన వయస్సును పెంచిందే కాని జ్ఞానాన్ని కాదు అనుకోండి... మన బ్రతుక్కీ పిల్లి బ్రతుక్కీ పెద్ద తేడా యేమీ లేదు.

భావ వివరణ:

ఓ ప్రజలారా! కడపటన్ (చిట్టచివరకు) ధరన్ (ఈ లోకంలో) యే జంతువుకైనా తన జన్మమే గొప్ప సుఖమైనది అనే తోచు (అనిపిస్తుంది). అట్లాగే మానవులంతా హరిగలడనీ శ్రీహరిమాత్రమే సుఖమునీయగలడని ఒల్లరు (ఒప్పుకోరు) అలా బ్రతికేస్తూ వుంటారు.

కొందరికి మొదల (మొట్టమొదటగా స్వర్గముకంటే సుఖ కరమైనది ఇంకొకటి లేదనిపిస్తుంది. అదే మోక్షమనిపిస్తుంది. అదే కొందరికి దైవత్వం పొంది తాము కూడా పూజింపబడితే దాన్ని మించిన బ్రహ్మానందం లేనే

లేదనుకొంటారు. ఉదటున (ఉద్ధతితో) సంసారమే మరి కొందరికి సుఖముగా తోస్తుంది. కానీ తుదన్ (చివరికి) ఆ శ్రీహరి దాస్యము మాత్రమే ధ్రువపట్టమువలె (ధ్రువమండలమేలుతున్న ధ్రువుడు పొందిన ఔన్నత్యము వలె) శ్రేష్ఠమైనదని, సుఖకరమైనదని కానరు (గ్రహించలేరు).

ఇంకా కొంతమంది శూన్యత్వవాదులుంటారు. జగమంతా మిథ్య, శూన్యము అని వారు నమ్ముతూ ఆ శూన్యతత్వమె, సొరిది (క్రమముగా) సుఖము నిస్తుందని నమ్ముతారు. ఇరవెరుగనివారికి (జీవన గమ్యం తెలియని వారికి) ధన ధాన్య సేకరణయే యెక్కువ సుఖము అనిపిస్తుంది. వారు దానికోసమే జీవిస్తుంటారు. మరి కొందరికి చావే లేకుండా చిరకాలం జీవించి సుఖించాలని వుంటుంది. అదియే వారికి నిరతి (మిక్కిలి ఆసక్తిని కలిగించు లక్ష్యము) గా తోస్తుంది. కానీ వారెన్నటికీ శ్రీపతిపైననే భారము వేసి ఆ క్రమములో వైరాగ్యభావనలో వుండుటే నిజమైన సుఖమని యే నాటికీ గ్రహించలేరు.

ఇదంతా నటనసూత్రధారియైన శ్రీహరిమాయయని, యెన్నైనా (యెన్ని విధాలనైనా) యేమైనా యెప్పటికినైనా యెక్కడ చూచినా ఆ మాయను జయించలేరనీ, అదే సుఖమని భ్రమిస్తుంటారని కూడా గ్రహించలేరు. చొక్కపు (అందమైన) శ్రీవేంకటేశ్వరునితో సుఖించుటే నిజమైన సుఖమని తెలియలేరు. ఇక్కడ (ఈ లోకమందూ) అక్కడా (పరలోకమందుకూడా) ఈతని దాసులే, యేచి (అతిశయించి) సుఖింతురు. అదే నిజమైన సుఖము. అతని దాసులు కాని అహంకారులు కిక్కిరిసిన (దట్టమైన) అజ్ఞానాంధకారంలో బడి క్రిందనూ మీదను (ఏదిమంచో ఏది చెడో) యెరుగక బ్రతుకు ఈడుస్తుంటారు.

సంపుటి: 28 కీర్తన : చల్లరే హరిపై జాజరజాజ
సంఖ్య : 319 పుట : 211 రాగం: శంకరాభరణం

శంకరాభరణం

35 చల్లరే హరిపై జాజరజాజ
చల్లఁగా సరసపు జాజరజాజ ॥ పల్లవి॥

సతతపు వలపుల జాజరజాజ
చతురులమాటల జాజరజాజ
సతమగు నవ్వుల జాజరజాజ
జతనపు సిగ్గుల జాజరజాజ ॥చల్ల॥

సముకపు కొసరుల జాజరజాజ
సమరతికరఁగుల జాజరజాజ
జమళి తమకముల జాజరజాజ
సమయని యాసల జాజరజాజ ॥చల్ల॥

జడియని పంతపు జాజరజాజ
సడఁగుల చేఁతల జాజరజాజ
జడిగొనుచెమటల జాజరజాజ
జడగొను పెనఁగుల జాజరజాజ ॥చల్ల॥

చలముల వొట్ల జాజరజాజ
సలిగెలపగటుల జాజరజాజ
చలువల వినయపు జాజరజాజ
సళుపుల చూపుల జాజరజాజ ॥చల్ల॥

సంగడి మూఁకల జాజరజాజ
జంగిలి మతకపు జాజరజాజ
సంగాత మమరిన జాజరజాజ
సంగతి యెరికల జాజరజాజ ॥చల్ల॥

సారపు మోవుల జాజరజాజ
సారెకుఁ బొలసేటి జాజరజాజ
సొరుచి మెచ్చుల జాజరజాజ
జారతనంబుల జాజరజాజ **॥చల్ల॥**

సందడి కొలువుల జాజరజాజ
సందుల వొత్తుల జాజరజాజ
చందురుపాటల జాజరజాజ
సందె చీఁకటుల జాజరజాజ **॥చల్ల॥**

చాలుకొను సతుల జాజరజాజ
జాలివిరహముల జాజరజాజ
చాలామరిగిన జాజరజాజ
చౌలూరించే జాజరజాజ **॥చల్ల॥**

చనుఁగవ గురుతుల జాజరజాజ
చనవుల కొసరుల జాజరజాజ
యెనసెను శ్రీవేంకటేశ్వరుఁ డీతని
చనుమానంబుల జాజరజాజ **॥చల్ల॥**

అవతారిక:

ఇది ఒక జాజరపాట. వసంతోత్సవంలో పరవశించి దేవేరిలతోనూ సఖియలతోనూ జాజరచల్లుతూ కనువిందు చేస్తున్నాడు కర్పూరధూళితో జాజర చల్లుతూ శ్రీవేంకటేశుడు. శృంగారం రసప్రవాహవాహినియైనది. అన్నమాచార్యులవారి కన్నులముందు యెక్కడచూచినా తానేయై జాజరలో పాల్గొంటున్నాడు ఏడుకొండల ఏలిక. భావాన్ని సాధ్యమైనంత నర్మగర్భంగా వుంచడానికి ప్రయత్నించింది "పెద్దలను" "పిన్నలను" దృష్టిలో వుంచుకొనియే.

ఇదివరలో ఒకసారి చెప్పినట్లు జాజర జజ్జర అనే పదమునకు పర్యాయపదము. జజ్జర అంటే వంచన అని అర్థం. నేటి కాలంలో ఈ

వసంతోత్సవమే హోలీ పండుగ అయ్యింది. శ్రీనివాడుసు పద్మావతి హోలీ ఆడుతున్నారని వూహిస్తేనే ఒళ్ళు పులకరిస్తున్నది కదా! మరి అన్నమయ్య తన భావనా విలీనాకాశంలో ఈ జాజరజాజన వీక్షిస్తుస్తున్నారు. సురులకు మునివరులకు మాత్రమే దృగ్గోచరమయ్యే జాజరను పరమాత్మ కృపచేత మీ కనులముందుంచుతున్నాను. చదివి పరవశించండి.

భావ వివరణ:

ఓ చెలులారా! హరిపై జాజరజాజ (వసంతమును) చల్లరే. సరసముతో కూడిన జాజరజాజ ఆయనపై చల్లగా (శీతముగా) వెదజల్లరే.

ఈ జాజర యెటువంటిదో తెలియునా? సతతము (యెల్లప్పుడూ) వలపులు వెదజల్లునది. జాణతనముతో కూడిన చతుర సంభాషణలు కలిగిన జాజర. శాశ్వతముగా ఆనందమునందించు జాజర. ప్రయత్నపూర్వకముగా సిగ్గులు దాచుకొని పరవశించుచున్న జాజర.

ఈ జాజర సముకపు కొసరులది (బాహాటముగానే మరి కొంచెము కావాలని కొసరు అడిగే వసంతము). ఇది సమరతికి ప్రోత్సహించుచూ ఒండొరులలో కరగిపోయే జాజర. ఇది జమళి (జంటలు) తమకమున (తన్మయత్వమున) తలమునకలయ్యే జాజర. ఇది సమయని ఆసల జాజర (ఏమాత్రమూ తగ్గని ఆశలు చిగురించిన జాజర.)

ఈ జాజర జడియని పంతపు జాజర (శ్రీనివాసుడు తనపంతము నెగ్గించుకోవటానికి యెంతకైననూ వెనుదీయడు). ఇది సడగుల చేతల జాజర (చిలిపి చేష్టల వసంతము). ఇది చెమటలు జల్లులై కురియు జాజర. ఇది తనదేవి జడను చేతితో అందిపుచ్చుకొని వేంకటేశ్వరుడు ఆడే వసంతము.

ఈ జాజర చలములవొట్లది (మత్సరముతో కూడిన ఒట్లు పెచ్చుమీరిన యది). ఇది సలిగెల పగటులది (ఆశ్రయించిన లావణ్యములు పెల్లుబికిన జాజర). ఇది చల్లని వినయములు పరిఢవిల్లు జాజర). ఇది సకుపుచూపుల (నొప్పించునట్లు నటనతో చూచు జాజర). అవన్నీ పైపైనటనలే.

ఈజాజర సంగడిమూకల జాజ (జతకలసిన గుంపులు చేసికొను పండుగ). ఇది జంగిలిమతకప జాజర. (జంగలి అంటే గోసమూహములేక పశు సమూహము అని అర్థం. కాని అన్నమయ్య మొరటు అనే అర్థంలో వాడారు). ఇది జంగిలి మతకపు జాజర (మొరటుగా చేసే వంచన). ఇది సంగాత మమరిన జాజర (స్నేహముతో కూడిన తమాషా). ఇది సంగతి యెరికల జాజర ఇది ఏ జంట, యెక్కడ, యెలా చేరిక అవుతున్నాయో తెలిసినా లక్ష్యపెట్టని జాజర. అంటే ఇక్కడ యెవరిగోల వారిదే.

ఈ జాజర సారపు మోవుల జాజ (చేవగలిగిన వలపుల మొలకల వసంతము). ఇది సారెకు పొలసేటి జాజర (మాటకు మాట బదులిచ్చి అతిశయించు పండుగ). ఇది సొరుచి మెచ్చుల జాజర (ఒకరి అంద చందాలు ఇంకొకరు మెచ్చుకొనే జాజర). ఇది జారతనంబుల జాజర (యధేచ్ఛగా శృంగార సామ్రాజ్యములేలే పండుగ).

ఈ జాజర సందడి కొలువుల జాజ (సందడిగా కలిసివుండే పండగ). ఇది సందుల ఒత్తుల జాజర. ఇది చందమామపై విరహగీతము లాలపించి పరవశించే జాజర. ఇది సందె చీకటుల (సాయం సంధ్యా లేచీకట్లలో జంటలు కులికే జాజర).

ఈ జాజర చాలుకొను సతుల జాజ (సతులు వరుసలు దీరెడి పండుగ). ఇది విరహ వేదనలో కన్నీటిజలపాతములౌ జాజర. వ్యాకులతలకు గురి అయ్యెడి జాజర. ఒకరి వ్యాకులత ఇంకొకరికి మూర్ఖత్వంగా కనుపించవచ్చును. అందుకనే ఇది చౌలూరే (రుచులు గుబాళించే జాజర)

ఇన్ని యధేచ్ఛ కూటములనంతం ఇంకా చెప్పేదేముంటుంది? ఇది చనుగవలపై గుర్తులు మొలచిన జాజర. ఇది కొసరి కొసరి చనువులు ప్రదర్శించెడి జాజర. ఈ జాజరలో శ్రీవేంకటేశ్వరుడు యెనసెను (విజృంభించినాడు). అందుచే ఇది ఈతని చనుమానంబుల జాజర (యెప్పుడూ తన మాటే చెల్లుబడి అయ్యే వసంతోత్సవము). ఈ శృంగారరాయని కాదనగల దమ్ముయెవరికున్నది చెప్పండి.

సంపుటి: 3 కీర్తన : కలదందే పో సర్వముఁ గలదు - కామితార్థమును గలదు
సంఖ్య : 446 పుట : 300 రాగం: లలిత

లలిత

36 కల దందే పో సర్వముఁ గలదు - కామితార్థమును గలదు
కలదు కలదు శరణాగతులకు హరి - కైంకర్యంబున
మోక్షము గలదు. ।। పల్లవి।।

అకాశంబున మోక్షము వెదకిన - నందులోపలా లేదు
పై కొని తానెంత వెదకి చూచినా - పాతాళంబున లేదు,
ఈకడ ధరలో మూల మూలలను - యెందు వెదకినా లేదు
శ్రీకాంతుని మతిఁజింతించి యాసలఁ
-జిక్కక తొలఁగిన నందే కలదు. ।।కల।।

కోటి జన్మములు యెత్తిన ముక్తికి - కొన మొదలేమియు గనరాదు
వాటపు సంసారములోఁ గర్మపు - వార్ధి యీఁదినాఁ గనరాదు,
కూటువతో స్వర్గాదిలోకములఁ- గోరి వెదకినాఁ గనరాదు
గాటపు కేశవభక్తి గలిగితే -
కైవల్యము మతిఁగానఁగవచ్చు ।।కల।।

సకలశాస్త్రములు చదివినాఁబరము - చక్కటిమార్గము దొరకదు
వికటపు పలువేల్పుల నెందరి గదు - వెదకి కొలిచినా దొరకదు,
ఆకలంకుడు శ్రీవేంకటగిరిపతి - అంతరంగమున నున్నాఁడనుచును
ప్రకటముగా గురుఁడానతి యిచ్చిన - పరము సుజ్ఞానము
తనలో దొరకు. ।।కల।।

అవతారిక:

మోక్షమనేది యెక్కడో లేదయ్యా! నీలోనే వున్నది. నాది నావాళ్ళు అనే పీకులాట వున్నంత కాలమూ నీకు మోక్షం ఎలా వస్తుంది. నీవు "బందీ"వే

కదా! నీ మనస్సులోనే వున్న ముక్తిని వెదకవు కానీ మోక్షం కావాలని వూళ్ళు పట్టుకు తిరుగుతే వస్తుందా? మరి అది విరక్తి వలనగాని రాదు. అది సాదనవలన గాని రాదు. అది చెప్పినంత తేలిక కాదు. అతి తేలిక మార్గమొకటి వున్నది. అదియే శ్రీహరి శరణాగతి. అంతా అందులోనే వున్నది. శ్రీహరిని శరణన్నవాడు యెవ్వరినీ యేదీ యాచించడు. అందువల్ల ఆశ అనే తంటా నుంచి ముందుగా విడుదల అవుతాడు. ఏనాడైతే హరిని గాక పరులను యాచించడో వాడు జీవన్ముక్తుడే. వాడికి కామితార్థములు దక్కినట్లే. అటువంటి ముక్తులకు శ్రీహరికైంకర్యములోనే మోక్షము దక్కుతుంది. ఎందుకంటే కేశవుడి భక్తి తప్ప వాడికింకేమీ వద్దు. ఇట్టి సుజ్ఞానము కలుగవలెనంటే, ఆకలంకుడు శ్రీవేంకటేశ్వరుడు మన అంతరంగంలోనే వున్నాడనే గురువుల ఆనతిని మనస్ఫూర్తిగా శిరసావహించాలి అంటున్నారు అన్నమాచార్యులవారు. కొసమెరుపేమంటే ఈ వైరాగ్య భావన నమ్మకంగా మనస్సులో నాటుకొని పోవాలి. ఊరకనే పైపై మాటలవల్ల లాభం లేదు.

భావ వివరణ:

ఓ భక్తులారా! అందేకలదుపో సర్వము. (జీవనసారమంతా అందులోనే వున్నది పోండి!) హరి శరణాగతులకు (శ్రీహరినే శరణాగతితో ఆశ్రయించిన వారికి) ఆయనే కామితార్థములను (కోరిన ఐహికములన్నీ తీరుస్తాడు, సంపదలనిస్తాడు). ఆయన కైంకర్యమే మోక్షసాధనము.

ఇక ఆ మోక్షము యెక్కడవున్నదో ఒక్కసారి ఆలోచించండి. ఆకాశంలో వున్నదా? యెంత వెదకినా అక్కడ లేనే లేదు. పోనీ పాతాళ లోకమున వున్నదా అంటే, పైకొని (తీవ్రంగా యత్నించి) వెదకినా అక్కడ కూడా కానరాదు. ఈకడ (ఇక్కడ) ధరలో (భూమిమీద) మూలమూలల వెదకినా బొత్తిగా

కనుపించదు. మరి ఇంకెక్కడున్నాడయ్యా! అంటే ఆ శ్రీకాంతుని ఆసల జిక్కక (ఆశాపాశమునకు కట్టువడక) మతి జింతించి (మనస్సులో ధ్యానించి వెదకితే) అందే (ఆ మనస్సులోనే) ఆ మోక్షమూ వున్నది.

ఒక జీవుడు కోటి జన్మలెత్తినప్పటికీ ముక్తికి, కొనమొదలు (ఆద్యంతములు) కనుగొనుట సాధ్యము కాదు. ఎందుకంటే ముక్తికి ఆ ప్రయత్నం చేయాలంటే ఆ పరమాత్మ సమ్మతించాలి. లేకపోతే జీవి వాటపు సంసారములో (అనుకూలమైన ప్రాపంచిక సుఖములలోబడి) కర్మలు అనే మహాసాగరంలో యెంత ఈదులాడినా లాభం లేదు. పోనీ కూటువతో (సాధనచేసి) తపోశక్తి వంటి వాటితో స్వర్గమునంతా వెదకినా, అందునా కానరాదు. ఎందుకంటే అది ఒక వస్తువు కాదు. కేశవునిపై (శ్రీమన్నారాయణునిపై) గాటపు భక్తి (గాఢమైన భక్తివుంటే) ఆ కైవల్యము (మోక్షము) మతిగానగా వచ్చును (మనస్సులోనే దర్శించవచ్చును).

ఇంకా కొంతమంది సర్వ శాస్త్రము (ఆరు శాస్త్రములూ) చదివి గొప్ప పాండిత్యము సంపాదిస్తారు. అంత మాత్రాన చక్కటి మార్గము పరమునకు (ముక్తికి) దొరుకుతుందని అనుకొంటున్నారా? సాధ్యంకాదు. పోనీ వికటపు పలువేల్పులను (చమత్కారులైన ముక్కోటి దేవతలనూ) ఆరాధిస్తే మోక్షం దొరుకుతుందా అంటే, కల్ల! ఒక్కనాటికీ దొరకదు. అకలంకుడు (దోషరహితుడు) అయిన శ్రీవేంకటేశ్వరుడు వేరే యెక్కడో లేడు. మన అంతరంగములోనే వున్నాడు. అయితే మరి యెట్లా మనకు కనబడుతాడయ్యా! అంటే గురువుల కృప కలిగి ఆనతిచ్చినచో సుజ్ఞానము పరము (మోక్షము) ప్రకటనమవుతాయి.

సంపుటి: 3 కీర్తన : శరణని బ్రతుకరో జనులాల!
సంఖ్య : 239 పుట : 160 రాగం: సాళంగనాట

సాళంగనాట

37 శరణని బ్రతుకరో – జనులాల!
గరిమ మెరసె నిదె – కనకసింహము. ॥ పల్లవి॥

అహరహమునుఁ బ్ర – హ్లాదుఁడు దొరకొని
బహువిధముల హరి – మహిమలు వొగడఁగ,
కహకహ హిరణ్య – కసిపుఁడు నగి హరి
సహజ మేది యని – చఱచెఁ గంభము. ॥శర॥

అటమరి పెటపెట – మని బెట్టెగసి
చిటపట రవముల – జిరుతపొగలెగసి,
తటతట మనుచును – తరలి వ్రయ్య లై
పటపట మనుచును – పగిలెఁ గంభము. ॥శర॥

బెడిదపు చూపుల – మిడుఁగురు లెగయఁగ
పుడమి యదర నూ – ర్పులు చెలఁగ,
గడగడ వడఁకి ది – క్తటము లల్లాడగ
వెడలెఁ గంభమున – విజయసింహము. ॥శర॥

నగవుల సుడివడె – నభోంతరంబులు
పొగలెగసెను పెను – బొమముళ్ళ,
పగటు నార్పులను – పగిలెను గొండలు
వెగటున వెడలెను – వీరసింహము. ॥శర॥

తెఱచిన నోరఁ బ్ర – తి ధ్వనులెసగఁగ
కఱకు గతులు చు – క్కలు చెదర,
నెఱిహంకృతులను – నిఖిలముజెదరగ
వెఱచఱవఁగెరలె – విమలసింహము. ॥శర॥

పటువిహారముల – బ్రహ్మాండ మగల
గుటగుటరవళి నా – కులు వొగడ,
నిటలనేత్రమున – నెఱమంట లడర
పటుగతి మెరసెను – భయదసింహము. ॥శర॥

పెడపెద కోఱల – పిడుగులు రాలఁగ
తుద నఖముల నె – త్తురు దొరుగ,
గుదిగొను కసురుల – కులగిరు లూఁటాడ
వుదయించె నదివొ – వుగ్రసింహము. ॥శర॥

అట్టహాసమున – నసురలు వారఁగ
ముట్టి వాయువులు – మొగతిరుగ,
దట్టములై జల – ధరములు ముసరఁగ
దిట్టయై వెడలె – ధీరసింహము. ॥శర॥

జలధులు గలఁగెను – జడిసె లోకములు
తలకె సప్త పా – తాళములు,
ఉలికి పడదొడగె – నూర్ధ్వ లోకములు
కొలువున నిలిచెను – ఘోరసింహము. ॥శర॥

అచ్చట హిరణ్య – నదరంట బట్టి
యిచ్చలదొడపై – నిడి చించి,
కుచ్చివానిపే – గులు జంద్యములుగ
విచ్చివేసుకొనె – విష్ణుసింహము. ॥శర॥

పొగిడిరి దివిజులు – భువనములు వెలసె
పగయుడిగి చెలగెఁ – బ్రహ్లాదుఁడు,
మిగుల శాంతమున – మించె శ్రీవేంకట
నగమునహోబల – నారసింహము. ॥శర॥

అవతారిక:

అహోబలనృసింహునిపై అసంఖ్యాకమైన కీర్తనలు చెప్పారు అన్నమాచార్యులవారు. అక్కడి నారసింహుని నవనారసింహులంటారు. ప్రహ్లాదునిపై అమిత కరుణారస వృష్టిని కురిపించే ఆ స్వామి శ్రీలక్ష్మీ చేరువైనప్పుడు శృంగార స్వరూపుడు. దుష్ట హిరణ్య కశిపుని దురాగతానికి మండిపడే జ్వాలా నృసింహుడు. నారదాదుల కీర్తించునపుడు శాంత నృసింహుడు హిరణ్యకశిపుని దానవపుత్రులు స్వామిపై పగతో దాడిచేసినపుడు ఉగ్రనరసింహుడు. ఈ కీర్తన ప్రత్యేకత యేమంటే, మూడవ చరణమైన "బెడిదపు చూపుల – మిడుగురు లెగయగ" అనే పాదము నుంచి కీర్తన చివరి పాదము "నగమున నహోబల నారసింహము" వరకు గల తొమ్మిది చరణాలు నవనారసింహులలో ఒక్కొక్కరి ప్రశస్తి అని పెద్దల అభిప్రాయము. ఏది ఏమైనా ఈ కీర్తన నాలపించిన వారికి ఈ అహోబల నవనారసింహులను అన్ని ప్రయాసల కోర్చి దర్శించిన పుణ్యం భక్తితో ఈ కీర్తన గానం చేస్తే కలుగుతుంది. "వెలస్వల్పము – ఫలమధికము" అని అన్నమయ్య తరచూ అంటుంటారే... అదే ఇది. కళ్ళుమూసి ఆ నృసింహుని రూపు మనస్సు అనే తెరమీద ప్రతిఫలింపజేసికొని "శరణు, శరణు సురేంద్ర సన్నుత శరణు శ్రీ సతి వల్లభా"! అని ముమ్మారు స్మరించి అప్పుడీ కీర్తన చదవండి మీ జన్మ ధన్యమవుతుంది.

భావ వివరణ:

ఓ జనులారా! ప్రహ్లాదవరదుడైన ఈ అహోబల నారసింహుని శరణని బ్రతుకు వెళ్ళమార్చుకోండి. ఇదే (ఇక్కడే) ఈ కనకసింహము (హిరణ్యుని చంపిన సింహము) గరిమ మెరసెను (మహిమతో వెలుగొందుచున్నాడు).

ప్రహ్లాదుడు దొరకొని (పూనుకొని) అహరహము (రేయింబవళ్ళూ) అనేక విధములుగా శ్రీహరి మహిమలను కీర్తించుచుండగా, దుష్టుడైన ఆ హిరణ్యకశిపుడు "కహకహ" మని నవ్వి యెక్కడరా నీ హరి? వాని సహజమేది (స్వభావము యెట్టిది?) చూపరా! అని అక్కడనేవున్న కంభమును (స్తంభమును) చరచెను (మోదెను).

అటుమరి (ఆపైన) పెటపెటమని పెట్లెగసి (పెట్లిపోయి) చిటపటమనే ధ్వనితో చిన్నగా పొగలను వెదజల్లుతూ తటతటమనే పెద్ద ధ్వనితో ఆ స్తంభము ప్రయ్యలై (పగుళ్ళువారి) పటపటమని పగిలిపోయి భయమును గొలిపింది. అప్పుడేమి జరిగిందో వినరయ్యా!

ఒక "విజయ సింహము" బయటకు వచ్చింది. అదెట్లా వున్నదయ్యా! అంటే... దాని బెడిదపు చూపుల (భయంకరమైన చూపులు) మిణుగురులు (మెరుపులు) యెగిసిపడుతున్నాయి. భూమి కంపించిపోవునట్లు వూర్పులు (ఉచ్ఛ్వాస నిస్స్వాసములు) చేయుచున్నాడు. దానిని చూచి దిక్తటములు (దిక్కులన్నియు) గడగడమని అల్లాడినవి (కంపించినవి). అప్పుడు ఆ స్తంభము నుండి ఒక సింహము వెడలి వచ్చినది. విజయవాంఛతో వెడలివచ్చిన ఆ నవ నరసింహుడే విజయసింహము.

ఇదిగో ఈ నరసింహుడే వీరసింహము. ఈయన నగవుల ధ్వనితో నభోంతరంబులు సుడివడెన్ (గగనసీమ ఘూర్ణిల్లినది). పెద్దపెద్ద కనుబొమలనుండి పొగలు యెగసిపడినవి. పగటునార్వులను (వెలువడిన గర్జనలతో) కొండలు కూడా నుగ్గునుగ్గయిపోయినవి. వెగటున (గొప్ప విరస భావముతో) ఆ వీర నృసింహుడు స్తంభమునుండి బయటకు వెడలి వచ్చెను.

అహో! ఈ యెదుట నున్న నరసింహుడే విమల నారసింహుడు. తెరచిన ఈ స్వామి నోటినుండి ప్రతిధ్వనులు వెడలుచున్నవి. ఈయన కరకుగతులకు (కఠినమైన విధానములకు) బెదరి చుక్కలు చెదరినవి (నక్షత్రములు చెదరిపోయినవి. ఆయన భీకరాకారమునుండి వెడలిన గొప్ప హూంకారమునకు నిఖిల జగంబంతయు బెదరిపోయింది. భీతి గొలపు ఆ విమలనారసింహము అట్లు అతిశయించినది.

భళా! ఈ భయద (భయమునుగొలుపు) సింహమును గమనించండి. ఆయన పెద్దపెద్ద అంగలతో విహారము చేస్తుంటే బ్రహ్మాండము పెల్లగించబడినట్లు బీటలువారింది. ఆయన వేగానికి చెవుల ఆకులనుంచి గుటగుటధ్వనులు వెలువడినవి. ఆయన నిటల నేత్రమునుండి (కనుబొమ మధ్యనున్న అగ్ని నేత్రము

నుండి) నెఱమంటలు (మండుతున్న జ్వాలలు) వెలువడుచున్నవి. ఈ భీకర నృసింహుడు పటుగతి (మెఱసెను శ్రేష్ఠమైన విధమున దీప్తించినాడు).

బాపురే! ఈ ఉగ్ర నరసింహమును చూడండి. ఈయనకు పెదపెద కోఱలున్నవి. వాటినుండి పిడుగులు రాలుతున్నప్పుడు వచ్చే కాంతి వస్తున్నది. ఆయన గోళ్ళ చివరలనుండి నెత్తురు కారుచున్నది. "గుదిగొను కసురుల కులగిరులూటాడ" – అంతవరకు అతిశయించిన దానవ కులములను కొండలు సమూలంగా అంతమైనవి. అదిగో అప్పుడు ఆవిర్భవించాడు ఆ ఉగ్ర నారసింహుడు.

ఇదిగో ఈ ధీరసింహమును చూచినారా! ఈయనగారి వికటాట్టహాసము వినినంతమాత్రాన అసురులు వారగ (పారిపోతుండగా) ఎందుకంటే ఆ నవ్వుల నుండి ఘోరమైన ధ్వనితో వాయువు వెలువడింది. ఆ వేడి వాయువుచే దట్టమైన జలధరులు ముసరగ (మేఘాలు కమ్మినవి). ఆ భయోత్పాతంతో ఈ ధీర సింహము దిట్టయై వెలువడినాడు.

ఇదిగో ఈ ఘోరసింహమును వీక్షించండి. ఈ స్వామిని జూచి జలధరులు గలిగినవి. (కారుమేఘములు కమ్ముకొనినవి). పదునాల్గు లోకములన్నియు జడిసినవి (కంపించినవి). ఏడుపాతాళములు (అధోలోకములు) తలకినవి (చలించిపోయినవి). ఏడు ఊర్ధ్వలోకములు ఉలికిపడినవి. ఈ విధంగా ఈయన కొలువుదీరియున్నాడు.

ఆహా! యేమి ఈ విష్ణు సింహపు వైపరీత్యము!! ఆయన ఆ హిరణ్యకశిపుని అదిరిపోవుచుండగా పట్టుకొని ఇక్కడకు యెత్తుకొనివచ్చి తన తొడలపై నుంచుకొని చించివేశాడు (చీల్చివేసినాడు). వాని పేగులను కుచ్చి (జడలుగా మెలిబెట్టి) జంద్యాలుగా తన మెడలో వేసికొనినాడు. విచ్చివేసుకొనిన (విడదీసి వేసికొనిన) ఆ పోగులనుంచి నెత్తురు జొటజొట రాలుతున్నది. ఆ విధంగా ఆ విష్ణు సింహము అతిశయించినది.

ఎట్టకేలకు దుష్టశిక్షణ శిష్టరక్షణ జరిగినవి. దివిజులు (దేవతలందరూ) ఆ దేవదేవుని కీర్తించిరి. పదునాల్గు భువనములు పరవశించినవి. బ్రహ్మాది దేవతల పగ చల్లారినది. అందరూ శాంతించారు. ఆ అహోబల నారసింహము శాంతాకారుడై శ్రీవేంకటేశ్వరుడై ఈ వేంకటాద్రిపై మించె (అతిశయించినాడు.) ఈయనను శరణని తరించండి.

సంపుటి: 18 కీర్తన : అప్పుడు వేంకటరాయ డలమేలుమంగ గూడి
సంఖ్య : 281 పుట : 188 రాగం: సామంతం

సామంతం

38 అప్పుడు వేంకటరాయc డలమేలుమంగc గూడి
కుప్పలుగా భోగించీc గోడతిరునాళ్లు ॥ పల్లవి॥

చీనిచీనాంబరములసింగారపు మేడనుండి
వీనుల సన్నగాళెలు వినుకొంటాను
పూని విహరించి వచ్చి పొందుగా నుయ్యాలలూcగి
కోనేటిదరి మెరసీc గోడతిరుణాళ్లు ॥అప్పc॥

అముకొన్నపన్నీట నద్దినదుప్పటితోడ
దోమటి పూవుదండలు దూలాడcగా
కోమలపుటెలుcగులకొమ్మలు లావులువాడ
గోమున నవధరించీc గోడతిరుణాళ్లు ॥అప్పc॥

అడుగడుగుకు విడేలందుకొంటా సంకీర్తన –
లెడయక భాగవతు లెచ్చిపాడcగా
గొడుగులుc బడగలు కోరి చామరము లిడ
గుడిగొన వినోదించీc గోడతిరుణాళ్లు ॥అప్పc॥

నానావాద్యాలతో నట్టకులు గడించగా
పానిపట్టి మంచిమంచి పాత్ర లాడcగా
అనుక కోలాటములు అంత నింతc జూచుకొంటా
కోనేటిరాయcడు మెచ్చీc గోడతిరుణాళ్లు ॥అప్పc॥

వరుసతో విణ్ణాపcజివారు తాళము లొత్తుచు
పొరిcదొరి ద్రావిడానc బొగడcగాను
విరులు యేకాంగులు వినువీధిc జల్లcగాను
గురుతరముగ మించీc గోడతిరుణాళ్లు ॥అప్పc॥

పప్పులు నిడ్డెనలును పానకాలు ఫలములు
అప్పటప్పటికిఁ బైపై నారగింపుచు
చెప్పరాని మహిమల శ్రీవేంకటేశ్వరుఁడు
కుప్పళించీ వాసనలఁ గోడతిరుణాళ్లు ॥అప్పఁ॥281

అవతారిక:

కోడతిరుణాళ్ళు అంటే వేసంగిలో స్వామి వారికి జరిపే వసంతోత్సవములు. ఒకానొక వసంతోత్సవ వైభవమును కళ్ళకుకట్టినట్లు వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇది చాలా పొడవైన కీర్తనయే కాదు, పొడవైన పురుషోత్తముని పొగడే కీర్తన. ఆ తిరునాళ్ళలో శ్రీవేంకటేశుడు, అలమేల్మంగ 'కుప్పలుగా భోగించీరట' అంటే విరివిగా సుఖించారన్నమాట. ఈ స్వామియే మనందరికీ "అప్పడు" (తండ్రి). ఆయన వూరేగింపుతో వెళ్ళే అదృష్టం అందరికీ దొరకదు. నేడు మన సుకృతం కొలదీ మనకు దక్కింది స్వామి వెంట నడిచి మీ జన్మ చరితార్థం చేసికోండి. అన్నమయ్య ఆ వైభవాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తున్నారు. ఆనందనిలయుని ఆశీర్వాదం పొందండి. తమిళులు కూడా అసంఖ్యాకంగా విచ్చేసి వారి భాషలో ప్రార్థనలు చేస్తున్నారు. ఆ వూరేగింపు ఆ కోడెతిరుణాళ్ళ శోభ వర్ణించటం నావల్ల నేమవుతుంది? అన్నమయ్య వివరమును మనకు అర్థమయ్యేట్లు చెప్తాను. చదివి జన్మతరింపజేసికోండి.

భావ వివరణ:

అప్పడు (సర్వ జగతికి తండ్రియైనట్టి) శ్రీవేంకటేశ్వరుడు అలమేల్మంగమ్మ కలిసి కుప్పలుగా భోగించీ (విరివిగా సుఖించారు) ఆ కోడెతిరునాళ్ళు (ఆ వసంతోత్సవము) కన్నులపండువగా వీక్షించి తరించండి.

ఆయన యెలా వేంచేస్తున్నాడో తిలకించండి. సింగారపు మేడనుండి తమ (ఆనంద నిలయ భవనం నుండి) చీనీ చీనాంబరములు (పట్టువస్త్రములు) ధరించి, వీనుల విందుగా సన్నాయి మేళము వింటూ, పొందుగా (హాయిగా) విహరించి వచ్చి ఈ కోనేటి ఒడ్డున ఉయ్యాలలూగుతూ ఈ కోడె తిరునాళ్ళలో మెరసిపోవుచున్నాడు. ఏమియీ వైభవం!!

ఆముకొన్న పన్నీట నద్దిన దుప్పటి (విరివిగ చల్లిన పన్నీరుతో అద్దిన గట్టి వస్త్రము) పై వారిని ప్రతిష్టించినారు. దోమటి పూవుల దండలతో (దట్టముగా అల్లిన పుష్పమాలలను) దూలాడగా (వ్రేలాడేట్లు) వేశారు. కోమలముగా నున్న కొమ్మలు (స్త్రీలు) లావుగవాడగ (పెద్దగా పాడుతున్నారు). ఈ విధముగా ఈ కోడెతిరునాళ్ళలో వారు (శ్రీవేంకటేశుడు, అలమేల్మంగ) గోమున (సౌకుమార్యముతో) అవధరించారు. (సావధానులైయున్నారు).

ఆ ఊరేగింపు అడుగడుగునకూ ఆగుతూనే వున్నది. స్వామి భక్తులనుండి విడేలు (తాంబూలము) నందుకొంటూ, భాగవతులు అవిశ్రాంతముగా పాడుచున్న సంకీర్తనలు ఆలకిస్తూ గొడుగులు పట్టుకొనేవారు స్వామికి పన్నగేంద్రుని పడగలవలె పట్టుకొని వెంటవెంట తరలివస్తుంటే చామరములు (వింజామరలు) వీచేవారు వీస్తుంటే, ఈ కోడెతిరునాళ్ళను స్వామి అతిశయముగా వినోదించుచున్నాడు.

అనేక వాయిద్యముల కనుగుణముగా నట్టువలు (నర్తకులు) నృత్యములను చేయుచున్నారు. విచిత్రవేషధారులు పానిపట్టి (ప్రయత్నపూర్వకముగా) రకరకాల పురాణ పాత్రలను ధరించి వెంట నడచుచూ చూపరులకు దేవతలే వెంటవస్తున్నారా అన్న భ్రాంతిని కలిగించుచున్నారు. అలసట లేకుండా కోలాటములాడుచున్న వారిని అక్కడక్కడా వింటూ ఆ వైభవం చూచి ఆ కోనేటిరాయుడు "సెబాసు" అని మెచ్చుకొంటూ ఆ కోడెతిరునాళ్ళలో మెల్లిగా ముందుకు సాగుతున్నాడు.

వరుసలు దీరిన శ్రీవైష్ణవులు తాళబద్ధముగా ద్రావిడ భాషలో (తమిళములో) స్తోత్రాలు పాడేవారి పొగడ్తలు ఆనందంగా వింటూ ఏకాంగులు (సన్యాసులు) పూవులను చాలా ఎత్తునకు పడునట్లు చల్లుతుంటే ఈ కోడతిరునాళ్ళు గురుతరముగా (శోభాయమానంగా) వున్నది.

అదిగో అటుచూడండి స్వామివారికి నైవేద్యము పెట్టేవారు వడపప్పు, రకరకములైన పప్పులు, ఇడ్డెనలు, పానకము, మంచి మంచి పండ్లు నైవేద్యముగా పెడుతున్నారు. స్వామివారు అప్పటికప్పుడు పైపైన వాటిని స్వీకరిస్తున్నారు. చెప్పనలవిగాని మహిమాన్వితమూర్తియైన ఈ శ్రీవేంకటేశుడు ఆ రకరకాల నైవేద్యములు స్వీకరించి రకరకములైన వాసనలను కుప్పళించీ (కుమ్మరిస్తున్నాడు). ఆ పరిమళములు నాఘ్రాణించి స్వామికి జయము పలకండి.

సంపుటి: 1 కీర్తన : ప్రాణుల నేరమిగాదిది – బహుజన్మ పరంపరచే
సంఖ్య : 362 పుట : 242 రాగం: గుండక్రియ

గుండక్రియ

39 ప్రాణుల నేరమిగాదిది – బహుజన్మ పరంపరచే
ప్రాణులు సేసిన తమ తమ – పాపఫలము గాని. ॥ పల్లవి॥

హరి సకలవ్యాపకుఁడని – అందరుఁ జెప్పఁగ నెరిఁగియు
పరదైవంబుల గొలువక – పాయరు మానవులు,
నరపతి భూమేలఁగ భూ – వరు భజియింపఁగ నొల్లక
పరిసరవర్తుల వెంబడిఁ – బనిసేసిన యట్లు ॥ప్రాణు॥

పొందుగఁ దమతమ చేసిన – పూజలు మ్రొక్కులుగైకొన
అందముగాఁ బురుషోత్తముఁ – డాతఁడె కలఁడనియు,
అందరు నెరిఁగియు నితరులఁ – జెందుదు రున్నతశైలము
నందక చేరువ తరువుల – నందుకొనిన యట్లు. ॥ప్రాణు॥

శ్రీవేంకటపతి యొక్కఁడె – చెప్పఁగ జగముల కెల్లను
దైవము నాతుమలోపలి – ధనమనఁగా వినియు,
సేవింపరు పామరు లీ – దేవుని మధురం బొల్లక
వావిరిఁ బులుసులు చేఁదులు – వలెనని కొనునట్లు. ॥ప్రాణు॥

అవతారిక:

దేవదేవుడు, పురుషోత్తముడు అయిన శ్రీహరిని పూజించకుండా అన్యదేవతలను పూజించువారు యేనాటికీ ముక్తిని పొందలేరు. కొన్ని వరములను పొంది కోరికలు సిద్ధింపజేసికొనవచ్చును. కాని ఆ తీరిన

కోరికలవల్ల అప్పటి కానందం కలిగిన కడకు కన్నీరే మిగులుతుంది. శ్యమంతకమణి వుదంతం గుర్తుకు తెచ్చుకోండి. అయితే ఇది ప్రాణుల నేరము కాదంటున్నారు అన్నమాచార్యులవారు. యెన్నో జన్మల పరంపరలో జీవి అనేక పాపకర్మలు చేసి వాటి ఫలితం అనుభవిస్తూ పరితపిస్తూ భగవంతుడికి దూరంగానే వుంటాడు. ఏదో ఒక నాటికి ఆయనకి కరుణ కలిగి తనదారికి తిప్పుకొంటాడు. అందాక అంతర్యామిగా మనలోనే వున్న హరిని గుర్తించలేక అలిసిపోతుంటాం. ఆ హరి చరణమును శరణంటే దరిచేర్చుకుంటాడు. అందాకా... "చిల్లర రాళ్ళకు మొక్కుతువుంటే, చిత్తశాంతి దొరకదు గాక దొరకదు. రాజు గారిని నమ్ముకోవాలిగాని రాజోద్యోగిని నమ్ముకుంటే యేమి లాభం? దూరాన వున్న ప్రదేశం గురించి తెలియాలంటే సమున్నత శైలము నెక్కాలి, యేదో కనబడ్డ చెట్టెక్కితే యేమిలాభం? తింటే తియ్యటి పాయసం తినాలిగాని పుల్లటివి చేదువి యెన్నితిన్నా ప్రయోజనం యేమిటి అంటున్నారు అన్నమయ్య.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఇది (శ్రీహరినే నమ్ముకొని యుండక పోవుట) ప్రాణులనేరమిగాదు (జీవులు చేసికొనిన అపరాధం కాదు). ఎందుకంటే, ప్రాణులన్నియు బహుజన్మల పరంపరలో (వరుసలో) తాము చేసే అనేక పాపాల పర్యవసానంగానే అజ్ఞానంతో శ్రీహరి తమ యెదుటనే వున్నా గుర్తించి శరణువేడని దౌర్భాగ్యులుగానే వుండిపోతారు.

ఏ ప్రవచనం వినినా శ్రీహరి సర్వవ్యాపకుడు శరణాగత రక్షకుడనే చెబుతారు కదా! అది విన్నవాడెవడైనా నిజమైన భక్తుడయ్యాడా? మానవులు అప్పటికప్పుడు తమ కోర్కె నెరవేరాలని పరదేవతలను (అన్యదేవతలను)

ఆశ్రయించక మానరు. ఇదింతే. దీనికి చేయగలిగిందేముంది? ఒక దేశాధినేత అయిన రాజుగారిని ఆశ్రయిస్తే ఆ పని జరుగుతుంది కాని, యెవడో రాజోద్యోగిని ఆశ్రయించితే పరిసరవర్తనులయిన (రాజునాశ్రయించి వెంటబడే) ఆ రాజోద్యోగివల్ల మనకేమి లాభం వుంటుంది?

మనం పూజిస్తే పురుషోత్తముడైన శ్రీహరిని పూజించాలి. పొందుగా (చక్కగా) తమతమ పూజలని స్వీకరించుటకు ఆయన యెల్లప్పుడు సిద్ధంగా వుంటాడు. ఆయన ద్వారా ఈప్సితాల నీడేర్చుకోవాలిగాని చిల్లరదేవుళ్ళనాశ్రయించటం అవివేకం కాదా? దూరానవున్న దృశ్యమేదైనా చక్కగా కనుపించాలంటే ఆ దగ్గిరలోవున్న ఉన్నత శైలము (ఎత్తైన కొండ) నెక్కాలి అంతేకాని యేదో కనబడ్డ చెట్టునెక్కితే యేమి ప్రయోజనముంటుంది చెప్పండి? అయ్యలారా!

చెప్పగ (చెప్పాలంటే) శ్రీవేంకటేశ్వరుడు వొక్కడే జగములకెల్ల దైవము (జగదీశ్వరుడు). ఈయనే మన ఆతుమలోపలి ధనము (ఆత్మ నిధానము) ఇది యెంతో మంది జ్ఞానులు చెప్పిన జ్ఞానబోధ. ఇది అంతా యెఱిగి కూడా పామరులు (అజ్ఞానులు) ఈ దేవుని సేవింపక యెందరో చిన్నచిన్న దేవుళ్ళని ఆశ్రయిస్తుంటారు. దీనికి యెవరేమి చేయగలరు? చక్కటి తీపులు (మధుర భక్ష్యాలు) తమ చెంతనేవున్నా పుల్లటి పండ్లను చేదు వంటకాలను తింటామనే వారిని మనమేమి చేయగలం చెప్పండి? ఎవరికర్మ వారిది... అంతే.

సంపుటి: 1 కీర్తన : ఎన్నిబాధలబెట్టి-యేఁచెదవు నీవింక
సంఖ్య : 284 పుట : 190 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

40 ఎన్నిబాధలఁ బెట్టి - యేఁచెదవు నీవింక -
నెంతకాలముదాఁక గర్మమా!
మన్నించు మనుచు నీ - మ్రొగు చొచ్చితిమి మా -
మాటాలకించవో కర్మమా! ॥ పల్లవి॥

ప్రతిలేని దురితముల - పాలుసేయక నన్నుఁ -
బాలించవైతివో కర్మమా!
తతితోడ నాత్మపరి - తాపంబు తోడుతను -
తగులేల సేసితో కర్మమా!
జితకాములకు గాని - చేతికిని లోనయి -
చిక్క వేకాలంబు కర్మమా!
మతిహీనులైనట్టి - మాకు నొక పరిపాటి -
మార్గంబు చూపవో కర్మమా! ॥ఎన్ని॥

అసలనియెడి తాళ్ళ - నంటఁగట్టుక విధికి -
నప్పగించితివి గదె కర్మమా!
వాసి విడిచితిమి నీ - వారమైతిమి మమ్ము -
వన్నె చెడనీకువో కర్మమా!
కాసుకునుఁ గొరగాని - గతిలేని పనికిఁగా -
కాలూఁద నీవేల కర్మమా!
ఓసరించొక మారు - వొయ్యనే ఒకరీతి -
నొల్లనని తలఁగుమీ కర్మమా ॥ఎన్ని॥

తిరువేంకటాచలా – ధిపుని మాయలచేత –
దెసలఁదిరిగిన యట్టి కర్మమా!
హరిదాసులగు వారి – నాదరింతువుగాక –
అంత నొప్పింతువా కర్మమా!
వరుస నేనుగ మీఁద – వాని సున్నంబడుగ –
వచ్చునా నీకిట్లఁ గర్మమా!
పరమపురుషోత్తముని – భ్రమతఁబడి నీవిట్ల –
బట్టబయలైతిగా కర్మమా! ॥ఎన్ని॥

అవతారిక:

పురాకృత కర్మమును తప్పింప పురుషోత్తమునికైనను వలను గాదనే పురాణాలూ బోధిస్తున్నాయి. అయితే ఆ దేవదేవుడు యే కర్మకు 'కర్త' కానప్పటికీ జరిగిన ఆ లీల (కర్మ) వలన వేదన చెంది శపించినప్పుడు ఆ శాపాన్నికూడా అనుభవిస్తూ జగత్కళ్యాణమే జరిపాడు. ఆయన, ఏడుకొండలపై ఏళ్ళతరబడి 'నిలబడే వున్నాడు'. అదీ కర్మననుభవించటమే కదా!

అటువంటి కర్మను తెగడుతూ అన్నమచార్యులవారు... ఇంకా యెంత కాలం మమ్ము పీడిస్తావే? యెన్ని బాధలు పెడతావే? ఇక నీ బాధ భరించే శక్తి మాకు లేదు. మా మాట మన్నించి మమ్ము వదలిపెట్టి రక్షించవే అని బ్రతిమిలాడుతున్నారు. కొసమెరుపేమిటంటే ఒసే కర్మమా! హరి దాసులను మాత్రం నీవేం చేయలేవే యెందుకంటే వాళ్ళు నీకన్నా యెంతో యెత్తున శ్రీహరిని నమ్ముకొనివున్నారు. వాళ్ళ జోలికి పోతే ఆయన వూరక నిన్ను మన్నించడు. ఏనుగు అంబారీపై పోతున్న వాడిని అయ్యా తాంబూలంలోకి సున్నంలేదు కాస్త ఇస్తే సున్నం రాసుకొంటాను అని యెవడన్నా అడుగుతాడా? అట్లాగే హరిదాసులమైన మా దగ్గరకొచ్చే అర్హతే నీకు లేదంటున్నారు.

భావ వివరణ:

ఓ కర్మమా! ఇంకా యెంతకాలం మమ్మల్ని నీవు (యేచెదవే) పీడిస్తావే? యెన్ని బాధలు పెడతావే? ఎంతోకాలంనుంచి మమ్మల్నేడిపిస్తూనేవున్నావు

కదుటే!! నీవు పెట్టే హింసనికయేమాత్రమూ భరింపలేక, మమ్మల్ని రక్షించమని నీ చాటుకు చేరి వేడుకొంటున్నాము మమ్మల్ని మన్నించరాదా?

ఓ కర్మమా! నీ మూలంగా అనేక పాపాలు చేస్తున్నాము. మమ్మల్ని వాటిపాలు చేయక కాస్త రక్షించవే. ఇంత పరితాపం కలిగించే బంధములను మాకెందుకు కట్టిపెడతావే? యెంత మనోవేదన కలిగిస్తావే? ఎవడన్నా జితకాముడు (కోర్కెలను జయించినవాడు) వుంటే, నీవు వాడిని యేమీ చేయలేవు. నీవు విరక్తులకు లొంగియే వుంటావు. మతి హీనులైన మాబోటివారి మీద కనికరించి మాకు పరిపాటి మార్గము (సక్రమమైన మార్గం) చూపించరాదా?

ఓ కర్మమా! ఆశలు అనే గట్టి తాళ్ళతో అంటకట్టేసి మమ్మల్ని 'విధి' అనే దుర్మార్గుడికి ఒప్పగించావు కదటే!! పేరు ప్రతిష్ఠలను పోగొట్టుకొని నీవారిమయ్యాము. మమ్మల్ని ఇంకా చెడగొట్టకు. కాసు విలువ కూడా చేయని చిల్లర పనులు మాచేత చేయించి కాసేపైనా మమ్మల్ని కాలు నిలదొక్కనీయక వేగిరపరుస్తున్నావు. మేమంటే నీకు అంత ఇష్టం యెందుకే! ఈ ఒక్కసారికి "మీరంటే నాకిష్టంలేదు మీ దారిన మీరుపోండి అని మమ్మల్ని తృణీకరించి వెళ్లగొట్టరాదా? తిన్నగా మిమ్మల్ని నేను ఒల్లను అనరాదా?"

ఓ కర్మమా! ఆఖరికి మా వేడుకోలు వినకపోయినా మా హితవును వినుము. అది నీకే మంచిది. మమ్మల్ని నీవు అడ్డమైన దిక్కులలో తిప్పగలుగుతున్నావంటే అది కేవలం శ్రీవేంకటేశ్వరుడి మాయవల్లనే. అందులో నీగొప్పేమీలేదు. నీవు మమ్మల్నేమీ చేయలేవు. యెందుకంటే మేము శ్రీవేంకటేశుని దాసులము. నీవు ఇతరుల నేడ్పించినట్లు శ్రీవేంకటేశుని దాసులను నొప్పించలేవు. ఏనుగు అంబారీపైపోయే సర్వోన్నతుని మా తాంబూలం కొరకు కాస్త సున్నం వుంటే ఇస్తారా అని యే బుద్ధిహీనుడైనా అడుగుతాడా? అదే విధంగా నీకంటే చాలా యెత్తులోనున్న భగవద్భక్తులము మేము. నీవు మమ్మల్ని యేమీ చేయలేవు. మేము నీ భండారం బయటపడేస్తాము. మేమె వరమనుకొన్నావు, పరమపురుషుడైన శ్రీహరి దాసులము భ్రమలో పడి మాజోలికి రాకు. జాగ్రత్త!!

సంపుటి:4 కీర్తన : ఎంతని నుతియింతు రామరామ
యిట్టి నీప్రతాపము రామరామ
సంఖ్య : 485 పుట : 327 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

41 ఎంతని నుతియింతు రామరామ యిట్టి నీప్రతాపము రామరామ
పంతాన సముద్రము రామరామ బంధించవచ్చునా రామరామ
॥ పల్లవి॥

బలుసంజీవనికొండ రామరామ బంటుచేఁ దెప్పించితివి రామరామ
కొలఁదిలేనివాలిని రామరామ ఒక్కకోల నేసితివట రామరామ
వెలయ నెక్కువెట్టి రామరామ హరువిల్లు విరిచితివట రామరామ
పెలచు భూమిజను రామరామ పెండ్లాడితివట రామరామ
॥ఎంత॥

శరణంటే విభీషణుని రామరామ చయ్యనఁ గాచితివట రామరామ
బిరుదులరావణుని రామరామ పీఁచమడఁచితవట రామరామ
ధరలోఁ జక్రవాళము రామరామ దాఁటి వచ్చితివఁట రామరామ
సురలు నుతించిరట రామరామ నీ చొప్పు
యిఁక నదియెంతో రామరామ ॥ఎంత॥

సౌమిత్రి భరతులు రామరామ శత్రుఘ్నులుఁ(డుఁ?)
దమ్ములట రామరామ
నీ మహత్త్వము రామరామ నిండె జగములెల్లా రామరామ
శ్రీమంతుఁడ వన్నిటాను రామరామ శ్రీవేంకటగిరిమీఁది రామరామ
కామితఫలదుఁడవు రామరామ కౌసల్యానందనుఁడవు
రామరామ ।మెంత॥ 485

అవతారిక:

శ్రీరామచంద్రునిపై అన్నమాచార్యులవారు కీర్తన చెప్పారంటే అది సాధారణంగా భజన ప్రక్రియలోనే వుంటుంది. మరామరా అంటూ అదే పనిగా భజించి తన చుట్టూ వల్మీకము (పుట్ట) వెలసినా ఆ నామాన్ని వదలని ఒక బోయవాడు అందించిన మోక్షప్రమాణం రామాయణం. 'రామ' అంటే పాపవిముక్తుని చేస్తానని నారాయణుడు స్వయంగా ప్రతిజ్ఞ చేశాడు. నేటికీ కాశీనగరంలో దేహం చాలించే మోక్షార్తులకు తారకనామం స్వయంగా శివుడే వారి చెవిలో వుపదేశిస్తాడని భక్తులు నమ్ముతారు. అటువంటి రామనామంపై అన్నమయ్యకు యెంత మక్కువో ఈ కీర్తనే నిరూపిస్తున్నది. ఈ కీర్తన గాయకుడు పాడుతుంటే తోటి భక్తులు రామ రామ అని వంత పాడితే చాలును. అనునిత్యం పాపపంకిలంలో కూరుకుపోయి స్వయంగా భగవన్నామ సంకీర్తనయే చేయలేని పామరులను సైతం ప్రభావితంచేసి "వైష్ణవులను" చేసిన ఆచార్యులవారు అభినందనీయులు. ద్రాక్షాపాకంలావున్న ఈ కీర్తనకు భావవివరణ అవసరమే లేదు. కాని మనం వుంటున్నది 21వ శతాబ్దం కాబట్టీ మనకు 'టెల్గూ' రాదనుకోవటం 'గొప్పతనం' కాబట్టి, ఒకటి రెండు మాటలకి వివరణ అవసరం వచ్చింది. అంతే. ఉదాహరణకి, "ధరలో జక్రవాళము రామరామ దాటి వచ్చితివట రామరామ" అనే వాక్యానికి అర్థం నూటికి తొంబది యెనిమిది మందికి రాదని (యెందుకంటే... నాకూ... రాదు) నాకు తెలుసు. పర్వాలేదండీ పాండిత్యంకంటే భక్తి గొప్పదని భక్తికంటే పట్టుదల గొప్పదని వాల్మీకి యేనాడో నిరూపించిన కర్మభూమి మనదేశం. చుట్టూ కొండలు వున్న లంకా ద్వీపంలో వాటిని దాటి వచ్చాడట కోదండరాముడు. అదీ సంగతి.

భావ వివరణ:

ఓ శ్రీరామచంద్రా! నిన్ను యెంతని కీర్తించనయ్యా! నీపేరే "వీరరాఘవుడు" ఓ రామా! నీవు ఆనాడు పంతముతో సముద్రమును బంధించి వారధి

కట్టించితివి. అట్లు చేయవచ్చునా (చేయగలరా?) శ్రీరామా అది అన్యులకు అసాధ్యము.

ఓ శ్రీరామా! ఆనాడు ఇంద్రజిత్తుతో పోరునందు నీ తమ్ముడు లక్ష్మణుడు మూర్ఛిల్లగా నీ బంటు అయిన హనుమంతునితో సాటిలేని సంజీవని పర్వతాన్ని తెప్పించినావు. కొలదిలేని (సాటిలేని) వాలిని ఒకే ఒక బాణంతో విగత జీవుని చేశావు. నిండు సభలో సాటిలేనట్లు శివధనస్సును యెక్కువెట్టి విరిచితివట కదా! ఆపైన పెలుచు (అతిశయించిన) భూమిజను (సీతను) పెండ్లియాడితివట. ఓ శ్రీరామా! నీ దివ్యగాథను గానం చేయుచూ మేము మా జన్మ తరింపజేసికొంటున్నాము తండ్రీ!

ఓ శ్రీరామభద్రా! నీవు శత్రువు సోదరుడైనా విభీషణుడు శరణాగతితో నీ వద్దకు వస్తే చయ్యన (వెంటనే) వానిని ఆదరించి రక్షించావు. బిరుదుల రావణుని (సమర్థుడైన రావణాసురుని) పీచమడచితివి (యుద్ధమున సంహరించావు) అందుకోసం సముద్రం మధ్యలో చుట్టూ చక్రవాళము (కొండల మధ్య వర్తులాకారం)లో వున్న లంకా ద్వీపానికి సముద్రాన్ని దాటివచ్చావు. అప్పుడు శ్రీరామా! నిన్ను దేవతలు సైతము కీర్తించిరి. ఇక నీచొప్పు (నీవు అనుసరించిన జీవనగమ్యము) యెంత వున్నతమైనదో మళ్లీ చెప్పనవసరంలేదయ్యా!.

ఓ రామ భూవరా! సుమిత్రానందనుడైన లక్ష్మణుడు, భరత శత్రుఘ్నులూ నీ అనుంగు తమ్ములు. వారు నిత్యమూ నిన్ను సేవిస్తుంటారు. నీ మహాత్యముతో ఈ సర్వజగత్తు నిండిపోయింది. ఓ శ్రీరామచంద్రా! నీవు అన్ని విభవములుగల శ్రీమంతుడవు. శ్రీవేంకటగిరి మీద వెలసిన వేంకటరాముడవు. కామిత ఫలములను (కోరుకొన్న కోర్కెలను) సత్వరమే తీర్చెడి కౌసల్యానందనుడవు నీవే తండ్రీ!

సంపుటి: 4 కీర్తన : ఎప్పటిజీపవుడే యెప్పటి యెంతగాలమును నీరతే
సంఖ్య : 437 పుట : 295 రాగం: బౌళి

బౌళి

42 ఎప్పటిజీవుఁడే యెప్పటిజగమే యెంతగాలమును నీరీతే
కప్పువచ్చితి వనాదినుండియు కర్మము యింకా వేసరవా ॥ పల్లవి॥

మఱచితివా తొలుజన్మంబుల మరణకాలముల దుఃఖపుఁబాట్లు
మఱచితివా యమకింకరులయి మర్దించిన బహుతాడనలు
మఱచితివా నరకకూపముల మాఁటికి మాఁటికిఁ బరచిన బాధలు
మఱియును సుఖమని భవమే కోరెదు మనసా ముందర గానవుగా
॥ఎప్పటి॥

తలఁచవుగా జననకాలమునఁ దనువిడియే యిటు పుట్టిన రోఁతలు
తలఁచవుగా బాల్యంబునఁ దల్లితండ్రుల శిక్షలు వ్యాధులును
తలఁచవుగా సంసారమునకును దైన్యంబున యాచించెటి యలమట
తలఁపుననిదియే వలెనని వోమెదు తనువా యింకా రోయవుగా
॥ఎప్పటి॥

కంటివిగా మలమూత్రాదుల కడుగఁగఁ దీరని దినదినగండము
కంటివిగా కనురెప్పలనే కాలముగడచేటికడత్రోవ
కంటివిగా శ్రీవేంకటపతి కరుణచేత నీ వివేకభావము
అంటి యిటువలెనె సార్వకాలమును అంతరాత్మ నినుఁదలఁచగా
॥ఎప్పటి॥437

అవతారిక:

ఒక జీవి జన్మిస్తున్నదంటే అదేమొదటి జన్మా? అట్లా యెన్ని జన్మలు పొందుతాడో ఆ జీవి, యెవరికి తెలుస్తుంది? ఈ జీవుడు యెప్పటివాడు? ఏమో యెవరికి తెలుస్తుంది? పోనీ వీడు జన్మలను పొందుతున్న జగత్తు

యెప్పటిది? అదీ చెప్పలేము. పోనీ వీడు యెంత కాలం నుండి ఈ జన్మలు పొందుతున్నాడు? అదీ చెప్పలేము. పోనీ వీడు యెంత కాలం ఈ జన్మలు పొందుతాడు? అదీ చెప్పలేము. ఎన్నాళ్ళయినా ఈ రీతే. దీనికి అంతూలేదు పొంతులేదు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఆయన వీటన్నిటికీ కర్మము మూలకారణము అంటున్నారు. అనాది నుండి పూర్వజన్మ వాసనలను కప్పుక వచ్చితివి ఇంకా ఈ జీవిని యెన్ని తిప్పలు పెడతావే? నీకు ఇంకా విసుగుపుట్టటం లేదటనే? అంటున్నారు. ఈ జన్మలూ, బాలారిష్టాలూ, సంసారతాపత్రయం, వ్యాధులు ముసలితనంలో చావూ, నరకలోకం పీడా... యెన్నాళ్ళయినా ఇంతేనా ఈ రోతకు విసుగూ విరామంలేవా?

ఇక జంతు జన్మ అయితే చింతించే బుద్ధి కూడా వుండదు. ఆహార నిద్రా భయమైధునాలకే పరిమితమైన దేహం వుంటుంది. దినదినగండంగా బ్రతికినంతకాలం బ్రతకటం... అంతే.. మన కనురెప్ప తెరచి మూసేలోగా కాలం కరిగిపోతూనే వుంటుంది. ఇక ఇదింతే... ఏదో ఒకనాడు ఓ శ్రీవేంకటపతి! నీ కృప నాపై కలుగుతుంది. అప్పటినుండి సర్వకాల సర్వావస్థలయందు నా అంతరాత్మ నిన్నే తలుస్తుంటుంది. మళ్లీ ఆదారిలో జన్మలూ, భ్రాంతులూ, నవ్వులూ కన్నీళ్ళు కొన్నాళ్ళకు విరక్తి. అప్పుడు ఈ "కామి" "మోక్షగామి" అవుతాడు.

భావ వివరణ:

ఓ కర్మమా! వీడు (నీవు ఏడిపిస్తున్న ఈ జీవుడు) యెప్పటివాడే? వీడు వుంటున్న ఈ జగత్తు యెప్పటిదో అదన్నా తెలుసా? యెంతకాలమైనా ఇదే రీతి (విధానము). మార్పుయేమన్నా వున్నదా? ఈ జీవుణ్ణి అనాదినుండి కప్పుకవచ్చితివి (ఆక్రమించుకొని వున్నావు). ఇంకా వేసరవా (విసుగుపుట్టదా?) నా దారిన నన్నొదిలేయరాదా?

ఒసే మనస్సా! నీకు ముందరేముందో తెలీదు (రాబోయే జన్మ తెలీదు). నీ తొలి జన్మంబులనన్నింటినీ మరిచిపోయావు. ఆ జన్మలలో చచ్చేటప్పుడు

యెంత యాతనపడ్డావో యెంత దు:ఖపడ్డావో యెంత కష్టపడ్డావో అప్పుడే మరచిపోయావు. పోనీ యమలోకంలో యెట్లా మర్ధించి బాధలు పెట్టారో అదన్నా గుర్తుందా? ఉహూ, నీకు యెప్పటికప్పుడే "పరగడుపు" ఆ నరక కూపాల్లో వాళ్ళు మాటికి మాటికీ పరచిన బాధలు అప్పుడే మఱచిపోయావు. అన్నీ మరచి మళ్ళీ సుఖంగా వుండే భవము (జన్మ) కావాలని ఆశపడుతున్నావు. దానికోసం యేవేవో పుణ్యకార్యాలూ చేస్తున్నావు. ఇంకా యెంత కాలమే?

ఒసే! తనువా! (శరీరమా!) నీకు రోతపుట్టటం లేదటే? నీ ఈ జన్మ యెంత రోతపుట్టించింది? మీ అమ్మకడుపులో తొమ్మిది నెలలు, దుర్గంధ భరితమైన నెత్తుటిమడుగులో చిమ్మచీకట్లో దిక్కు మొక్కూ లేకుండా వున్నావు. పోనీ మీ అమ్మ కడుపులోంచి బయటకు వచ్చాక నీ బాల్యం గుర్తుందా? నిన్ను నీవు చీమనుంచి కూడా రక్షించుకోలేక అన్నిటికీ యేడిచేవాడివి. ఆకలి, నొప్పి అనికూడా చెప్పుకోలేని అర్భకుడివి. పోనీ పెళ్ళి చేసుకొని సంసారంలోనన్నా సుఖపడి యేడిచావా అంటే అదీ లేదు. ఎంతమందిని దైన్యంతో యాచించావు? ఎంతమందితో తిట్లు తిన్నావు? ఎంత అలమటించావు? నీ తలపున ఇది కావాలి అది కావాలి అని ఆశించి వోమెదువు (రాజీకొస్తుంటావు?) ఇంకా నీకు రోతపుట్టదేమే?

ఒసే అంతరాత్మా! ఎన్ని జంతు జన్మలెత్తావే? మలమూత్రాదులను విసర్జించి అలాగే కడుక్కోకుండానే నీవు తిరిగిన వైనం మాకు తెలియదా? కనురెప్ప మూసేలోగా నిన్ను ఇంకే జంతువు పట్టుకొని గుటుక్కుమని మింగుతుందో తెలియదు. ఏ వేటగాడు నీవు పోయే దారి కడత్రోవ (ఆఖరిదారి) చేస్తాడో తెలియదు. నీకు తెలియకుండానే ఒకరోజున అట్లా అఘోరిస్తున్న నీపై ఆ శ్రీవేంకటపతికి దయ కలుగుతుంది. నీలో వివేక భావము కలుగుతుంది. అంటి (పూనుకొని) ఈవిధంగా ఓ వేంకటపతీ! సర్వకాలమునా అంతరాత్మ నిన్ను తలచగా (ధ్యానించగా) యేదో ఒకనాటికి దీనికి (ఈ అంతరాత్మకి) ముక్తి కలుగుతుంది.

సంపుటి: 4 కీర్తన : ఏలయ్య పరమాత్మ యేలికపు మాకునై
సంఖ్య : 64 పుట : 403 రాగం: ధన్యాసి

ధన్యాసి

43 ఏలయ్య పరమాత్మ యేలికపు మాకునై
నాలినే పెట్టితివి నాడూను
కాలునికి మమ్ము నరిగాఁపులే కమ్మనుచు
నేలనే తిప్పేవు నేఁడూను ॥ పల్లవి॥

భారమగు నీటిలోఁబవళించి నీ వాది-
నారాయణుఁడవైతి నాఁడూను
పైరుగా నిందరిని ప్రకృతిలోపలఁదెచ్చి
నారుగాఁ బోసితివి నాఁడూను

నారపేరిడి తండ్రి నందనుని బిలవఁగరు-
ణారసము నించితివి నాఁడూను
చేరి కడు మమ్ము రక్షింపనోపక వట్టి
నేరములె యెన్నేవు నేఁడూను ॥ఏలయ్య॥

దట్టముగఁ జొచ్చి యిందరిదేహములలోన-
నట్టనడుమెక్కితివి నాఁడూను
అట్టలుగ బ్రహ్మాండమనియించి జంతువుల-
నట్టే ముంచితివి నాఁడూను

ఒట్టి యిందరికి సరయూ (యవు?) దరిని మోక్షంబు
నట్టు కొట్టితి గొంత నాఁడూను
పొట్ట పొరుగునఁ దెచ్చి భూతముల మెడగట్టి
నిట్టి (ట్ట;) పిడినేఁపేవు నేఁడూను ॥ఏలయ్య॥

పొలుపుగా మమ్మిట్లఁ బుట్టించుకొరకునే
నలిననాభుఁడవైతి నాఁడూను
పలువేలుపులకెల్ల పదవులిన్నియు నొసగి
నలుగడల నునిచితివి నాఁడూను

చలముకొని దానవులఁ జక్కాడి దేవతల
నలఁకువలు దీర్చితివి నాఁడూను
చెలఁగి యిందరిఁగావ శ్రీవేంకటాద్రిపై
నెలకొనిటు నిలిచితివి నేఁడూను. ॥ఏలయ్య॥ 64

అవతారిక:

"నాలిని" పెట్టుట అంటే వంచన చేయుట అని అర్థం. పరమాత్మునితో అన్నమాచార్యులవారు విన్నవించుకొంటున్నారు. నువ్వులోకపాలకుడవు కదా! మేము అర్భకులం. మమ్మల్ని మభ్యపెట్టి మాచేత చేయరాని పాపాలను చేయించావు. నాడూను నేను బలిపశువునే అయ్యాను. మరి నేడూను (ఈనాడు) కాలునికి (యమునికి) మమ్ము కట్టు కావలి పెట్టి ఈ లోకంలో పిచ్చి వాళ్ళను తిప్పినట్లు తిప్పుతున్నావు. నాడు నువ్వు ఆదినారాయణుడవు. ప్రకృతి నుంచి మాకు నారుపోసి పెంచావు. తండ్రికి తన పుత్రునిపై అంత కరుణ యెలా కలుగుతున్నది? నీవల్లనే. నేడు మేము ఆ బంధాల వశులమైపోతే మళ్ళీ నువ్వు మమ్మల్నే నిందిస్తావు. ఇదేమి న్యాయం ప్రభూ! మా దేహాలలో అంతరాత్మగా దూరి మా జన్మ కారకుడవయ్యావు. అంతవరకూ బాగానే వున్నది మరి ఇంత బ్రహ్మాండంలో మమ్మల్ని జంతువులాగానే ప్రవర్తింపజేస్తున్నావు ఏమిటి స్వామీ! నీ లీల.

గమనిక : ఇదే ఇతివృత్తంతో అన్నమయ్య అనేక కీర్తనలు చెప్పటం వలన ఇది మనం ఇదివరకే చదివినట్లుంటుంది. కానీ ఇది అది కాదు. ఇది వేరేదే.

భావ వివరణ:

ఓ పరమాత్మా! నీవు యేలికవు (లోకపాలకుడవు). మాకునై (మాకోసము) నాలినే (వంచననే) పెట్టితి వేలయ్య? విధించితివెందులకు? నాడూను (ఆనాటినుంచి) నీతీరు ఇదియే. మమ్ము కాలునికి (యమధర్మరాజునకు) అరిగాపులే కమ్మనుచు (మేమే మూల్యము చెల్లించే కాపలాలో వుండమని) నేడూను (ఈ జన్మలో కూడా) తిప్పేవు యేలయ్యా? (యెందుకు పిచ్చి వాళ్ళలా పరుగులు పెట్టిస్తున్నావు స్వామీ?)

అనంతజలధియైన సాగరమున మత్స్యియాకుపై పవ్వళించిన ఆదినారాయణుడవైతివి నాడూను (సృష్ట్యాదియందు). నాడూను (ఆనాడే) ఇందరిని (ఈ జీవులందరినీ) పైరుగా ప్రకృతి లోకి తెచ్చి నారు బోసితివి (ఈ ప్రకృతిలోనికి తీసికొనివచ్చి సశ్యమును పెంచినట్లు పెంచి పోషించావు.) ఇదంతా యెందుకు చేస్తున్నావు స్వామీ!

తన కన్న కొడుకును ఒక తండ్రి పేరుపెట్టి పిలిచిన నాటినుంచే ఆ తండ్రి గుండెల్ని కరుణారసముతో నింపేస్తున్నావు. అనాదిగా ఇంతేకదా! మరి నేడు మేము మమతానుబంధాలకు కట్టువడి వ్యధ చెందుతుంటే తిరిగి నీవు మమ్మల్నే దోషులుగా నిలబెడుతున్నావు. ఇదంతా యేలయ్యా?

ఇందరి జీవుల దేహములలోనూ దట్టముగా అంతర్యామి వలె దూరి, నాడూను (అనాదిగా) అతిశయించితివి. ఇంత పెద్ద బ్రహ్మాండమును క్షణంలో నామరూపాలు లేకుండాచేసి జంతువుల తీరుగా మమ్ము అణగించి నట్టేటముంచేశావు. ఇదంతా యెందుకు చేస్తున్నావయ్యా?

ఇన్ని జీవులకు ఒట్టి (పూనుకొని) క్రమేపీ ముక్తిని ప్రసాదిస్తావు. కొంతనట్టుకొట్టితివి (కొంత ఆలస్యం మాత్రం తప్పదు). పోనీ ఈ జీవులను వారి దారిన వారిని ఒంటిగా వదలిపెడతావా అంటే... అదీలేదు. ఈ భూతములకు (జీవులకు) తోడూనీడా అని ఇంకొకరిని మా మెడకు అంటకడతావు. ఈ విధంగా మమ్మల్ని వేపుకుతింటావు. నేడూను (ఈనాటికీ) నీది ఇదే తంతు. ఓదేవదేవా! ఇదంతా యేలయ్యా!

ఈవిధంగా మమ్మల్ని పుట్టించుటకోసం ఆనాడు పద్మనాభుడవై, నీ నాభికమలంలోంచి బ్రహ్మదేవుని సృష్టించి... ఆయనకు తోడుగా దక్షుడు, అంగిరసుడు మొదలైన నవ బ్రహ్మలను సృష్టించి జీవుల పుట్టుక నిర్వర్తించావు. సృష్టి స్థితి లయ కార్యములు నిర్వహించుట కొరకు ముక్కోటి దేవతలను వారికి మళ్ళీ శంకరుడు, దేవేంద్రుడు వంటి అధినాధులను నియమించావు. వారిని నలుగడల (అన్నిచోట్లా) నీ కార్యక్రమ బాధ్యతలనే పంచి ఇచ్చావు. అనాదిగా నీది ఇదే తంతు. ఇలా యెందుకయ్యా?

అదట్టావుంటే, నీ సృష్టిలోనే కొందరిని చలముకొని (మత్సరముగల) దానవులను చేస్తున్నావు. వాళ్ళను జక్కాడి (వధించి) దేవతలను సంరక్షిస్తావు. అనాదిగా వారిని (దేవతలను) అమరులను (చావులేనివారిని) చేశావు. మోసంతో అమృతము దేవతలకర్పించావు. సరే! మా కర్మకు మమ్మల్ని వదలివేయక ఈ జీవులనందరినీ రక్షించటంకోసము తిరుమల శిఖరాలపై వెలసి నేడూను అలా నిలుచునేవున్నావు. తండ్రీ! ఏడుకొండలరాయుడా! యేలనయ్యా? మాకోసం ఇంత శ్రమ పడుతున్నావు?

సంపుటి: 5 కీర్తన : రాధామాధవ రతి చరిత మితి
సంఖ్య : 166 పుట : 112 రాగం: రీతిగౌళ

రీతిగౌళ

44 రాధామాధవరతిచరితమితి
బోధావహం శ్రుతిభూషణం ॥ పల్లవి॥

గహనే ద్వావపి గత్వా గత్వా
రహసి రతిం ప్రేరయతి సతి
విహరతస్తదా విలసంతౌ
విహతగృహాశౌ వివశౌ తౌ ॥రాధా॥

లజ్జాశబళ విలాసలీలయా
కజ్జలనయన వికారేణ
హృజ్జావ్యవహృత (హిత?) హృదయా రతి
స్పజ్జా సంభ్రమచపలా జాతా ॥రాధా॥

పురతో యాంతం పురుషం వకుళై:
కురంటకైర్వా కుటజైర్వా
పరమం ప్రహరతి పశ్చాల్లగ్నా
గిరం వినాపి వికిరతి ముదం ॥రాధా॥

హరి సురభూరుహ మర్హతివస్వ- (మారోహతీవ?)
చరణేన కటిం సంవేష్ట్య
పరిరంభణ సంపాదితపులకై-
స్పురుచిర్జాతా సుమలతికేవ ॥రాధా॥

విధుముఖదర్శన విగళితలజ్జా-
త్వధరబింబఫలమాస్వాద్య
మధురోపాయనమార్గేణ కుచౌ
నిధివద (ద్ద?) త్వా నిత్యసుఖమితా ॥రాధా॥

సురుచిరకేతక సుమదళ నఖరై-
ర్వరచిబుకం సా పరివృత్య (వర్త్య?)
తరుణిమసింధౌ తదీయదృగ్జల-
చరయుగళం సంసక్తం చకార ॥రాధా॥

వచన విలాసైర్వశీకృత (త్య?) తం
నిచులకుంజ మానితదేశే
ప్రచురసైకతే పల్లవశయనే
రచితరతికళా రాగేణాస ॥రాధా॥

అభినవకల్యాణాంచితరూపా-
వభినివేశ సంయతచిత్తౌ
బభూవతుస్తత్పరౌ వేంకట-
విభుణా (నా?) సా తద్విధినా సతయా ॥రాధా॥

సచ లజ్జావీక్షణో భవతి తం
కచభరం (ర?) గంధం ఘ్రాపయతి
నచలతిచేన్మానవతీ తథాపి
కుచసంగాదనుకూలయతి ॥రాధా ॥

అవనతశిరసాప్యతి సుభగం
వివిధాలాపైర్వివశయతి
ప్రవిమల కరరుహరచన విలాసై-
ర్భువనపతి (తిం?) తం భూషయతి ॥రాధా॥

లతాగృహమేళనం నవనై -
కతవైభవ సౌఖ్యం దృష్ట్వా
తత స్తతశ్చరసౌ (శ్చరతస్తౌ?) కేలీ-
వ్రతచర్యాం తాం వాంఛంతౌ ॥రాధా॥

వనకుసుమ విశదవరవాసనయా
ఘనసారరజోగంధైశ్చ
జనయతి పవనే సపది వికారం
వనితా పురుషౌ జనితాశౌ ॥రాధా॥

ఏవం విచరన్ హేలా విముఖ-
శ్రీవేంకటగిరి దేవోయం
పావనరాధాపరిరంభసుఖ-
శ్రీవైభవసుస్థిరో భవతి ॥రాధా॥166

అవతారిక:

రాధామాధవుల శృంగార రసఝరిలో తలమునకలు చేస్తున్నారు అన్నమాచార్యులవారు. ఇటువంటి కీర్తనలకు ప్రతిపదార్థం వివరించటానికి కొన్ని ఇబ్బందులున్నాయి. ఇది సంస్కృత కీర్తన. సంస్కృతానికి తెలుగు అర్థం ఒక్కొక్కప్పుడు యెబ్బెట్టుగా వుంటుంది. ఇక రెండవ విషయం పాఠకులలో పిన్నవయసు వారికి శృంగార మోతాదు యెంత పరిమితివుంటే అంత మంచిది. సాధ్యమైనంత నర్మగర్భంగా వుండాలి. ఇక నా వయసు వృద్ధులకి శృంగారం నమలలేని పోకచెక్కలాగా ముదావహంకాదు. అందుచే సంస్కృత తాత్పర్య వివరణ చాలా సవరించవలసి వచ్చింది. సంస్కృత పండితులకు నా ప్రత్యేక క్షమార్పణలు. నా ఉద్దేశ్యము నిజానికి ప్రతిపదార్థ వివరణ కాదు భావ వివరణయే. మూడవ విషయమేమంటే అన్నమయ్య శృంగార వివరణ ప్రేయసీ ప్రియుల సమాగమమనిపించినా నిజానికి అది ఆత్మ పరమాత్మల సాయిజ్యం. మాధవుడు పరమాత్మ. ఆయనను చేరుకోవాలని రాధ అనే ఆత్మ అహరహమూ తహతహలాడుతుంటుంది. చివరికి వారి కలయికే మోక్షసామ్రాజ్యం. ఉత్కృష్టమైన ఈ వివరణనందించిన డా॥ పవన్‌కు యేమిచ్చి ఋణం తీర్చుకోగలనో తెలియదు. పద్మావతీ వల్లభుడు అనునిత్యం ఆయనకు మేలుచేయాలని ఆకాంక్షిస్తున్నాను.

భావ వివరణ:

రాధామాధవుల రతి చరితము (శృంగార సామ్రాజ్య విహరణము) నెరుంగుట వేద సమ్మతము (శిష్ట జనామోదకరము) అని గ్రహించవలెను.

రాధామాధవులిరువురూ అంధకారమున కలసి విహరించుచూ రహస్యముగా రతికి ప్రేరేపించుచూ విలాసముగా విహరించు గృహములను వీడినవారై వివశులైరి. అట్టి రాధామాధవుల రతి చరితము కమనీయము మరియు రమణీయము.

అధికమైన సిగ్గు అనే విలాసము చేతను కాటుక కన్నుల వికారము చేతను, హృదయపూర్వకంగా వ్యవహరించు ఇచ్ఛారతిగల రాధ సంభ్రమమునకు, చపలత్వమునకులోనైనది. అట్టి రాధామాధవుల రతిచరితము రమణీయమైనది.

ముందు నడుచుచున్న ముకుందుని కొంటెతనమును సహించలేని రాధ లతల తూళ్ళతోనూ, పొదరింటి దుబ్బలతోను కొట్టుచున్నదై తరువాత మౌనముగా చిరునవ్వులు చిందించుచున్నది. అట్టి రాధామాధవుల రతిచరితము కడు మనోహరమైనది.

పారిజాత వృక్షమును అవనికి దెచ్చిన శ్రీహరి యొక్క నడుమును కౌగలించి పరవశించి పులకాంకితమైన శరీరము గల రాధ సుమలతవలె భాసిల్లుచున్నది. అట్టి రాధామాధవుల రతి చరితము అతి మనోహరమైనది.

విగళత లజ్జ గలదై, చంద్రబింబమువంటి వదనమునందలి బింబాధరములను ఆస్వాదించుచు మధురోపాయ మార్గములచేత కుచమర్దనమున నిత్యసుఖమును కలిగించు రాధామాధవుల రతి చరితము మనోజ్ఞమైనది.

సుందరమైన మొగలిపూవుయొక్క దళములవంటి గోళ్ళతో రాధ నందకిశోరుని చబుకాన్ని పరివేష్టించి యౌవన వనంలో తన చరణ

యుగళమును చేరుటకు సంసిద్ధురాలగుచున్నది. అట్టి రాధామాధవుల రతిచరితము మనోహరమైనది.

తన వాగ్విలాసముతో మాధవుని వశపరచుకొని పొదరింటియందు, పరచిన ఇసుక పరుపుపై రతికళానైపుణ్యము ప్రదర్శించే ఆ యౌవన సామ్రాజ్యాధినేతలైన రాధామాధవుల రతిచరితము కడు రమణీయమైనది.

అభినవ కళ్యాణాంచిత రూపముగలిగిన ఆయత్తచిత్తములతో తత్పరులైవున్న వేంకట విభునితో కూడిన ఆ రాధామాధవుల రతి చరితము అతిమనోహరమైనది.

ఆమె సిగ్గు కల్గిన చూపులతో అతనిని చూస్తూ గంధయుక్తమైన తన జుత్తు వాసనలను గుబాళిస్తున్నది. కుచ సంగమునకు అనుకూలముగా నుంటూ ఆమానవతి కదలకనేయున్నది. అట్టి రాధామాధవ చరితము కడు రమణీయము.

వంచిన శిరస్సు కలదైనప్పటికినీ, అనేక రకములైన పలుకులచే వివశు రాలవుతున్నది. కోమలమైన పవిత్ర కరముల వివిధరచనా విలాసములచేత భువనపతియైయున్న ఆ నందనందనుని భూషించుచున్నది. అట్టి రాధామాధవుల రతిచరితము మనోజ్ఞము.

లతాగృహమునందు రతి సమాగమములచే కొత్తదగు ఇసుకపరుపుల వైభవ సౌఖ్యమును చూచి అక్కడ చరించే జంటలు రతికేళీవ్రతమును కోరుచున్నారు. అట్టి రాధామాధవుల చరితము కడు మనోహరము.

వనపుష్ప విలాస సుగంధములతో ఘనసార (కర్పూర) పరాగ గంధములతో అక్కడ వాయువులు సంచరించే వనితా పురుషులకు తాపము కలిగించుచున్నవి. అట్టి రాధా మాధవుల రతిచరితము మనోజ్ఞమైనది. ఈవిధంగా విహరించు లీలా వినోదియైన శ్రీవేంకటగిరిదేవుడీతడు. ఈయనను పావని రాధాదేవి ఆలింగన సుఖముగల శ్రీవైభవము సుస్థిరముగానుండుగాక!

సంపుటి: 4 కీర్తన : ఇరవుగా నిన్నెరిగిరి యిదివోనీదాసులు
సంఖ్య : 217 పుట : 145 రాగం: గుండక్రియ

గుండక్రియ

45 ఇరవుగా నిన్నెరిఁగిరి యిదివో నీదాసులు
పరదైవములమీఁద నొల వేయనేల పనిలేవు
నీ మాయలు కరుణానిధీ ॥ పల్లవి॥

ముంచెను నీపాదములు మూఁడులోకములయందును
యెంచెను నీ వేయినామాలు యిలలో వేదవ్యాసుఁడు
చంచులఁ దలఁచిరి నిన్ను మున్నే సనకాదియోగీంద్రులు
పొంచి యింకా నీకు దాఁగఁ జోటు లేదు
యిందు బొడచూపవే యింకవెడమాయలేలా ॥ఇర॥

కొనెను నీపాదతీర్థము బ్రహ్మ కోరి నీపాదము గడిగి
వినుతించె నీమహిమ తొల్లె వేయినోళ్లగలశేషుఁడు
అనిరి నిన్నెక్కుడనుచు మొదల శుకాదిమునీంద్రులెల్లా
పొనిగి నీవు మాయ సేయఁ జోటు లేదు
మమ్ము పొసఁగి యేలుకోవె పురుషోత్తముఁడా ॥ఇర॥

యెక్కెను ధ్రుఁడు పట్టము యిదివో నిన్నుఁ గొలిచి
చిక్కెను నీశరణాగతి నేఁడు శ్రీవైష్ణవులచేతను
గక్కన శ్రీవేంకటేశుఁడా యిట్టె కాచితివి మాటకే మమ్ము
యిక్కడ నీమాయ సేయఁ జోటు లేదు
నిన్ను నెరిఁగిరి నీదాసు లిందిరారమణా ॥ఇర॥ 217

అవతారిక:

పరమాత్మను ఇరవుగా (సుస్థిరముగా) నెరిగిన వాడెవడు? ఆయన గుణగణాలు, రూప విలాసములనెరిగినవారెవరు? నిజానికి యెవ్వరూలేరు. దుష్టశిక్షణకై ఏ రూపాన్నైనా ధరించాడు. ఎక్కడ పడితే అక్కడ ప్రత్యక్షమయ్యాడు. ఇదివో నీదాసులు నిన్నెరిగిరి అంటున్నారు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. ఓ కరుణానిధీ! నీమాయలకు వశులైనవారు భ్రమపడి నీకృప సత్వరముగా రాదని పరదేవతల నాశ్రయిస్తుంటారు. విశ్వరూపుడవు, విశ్వవ్యాప్తుడవు, విశ్వనేత్రుడవు, విశ్వవందితుడవు నీవు దాగి వుండగల స్థలం వుంటుందా? చతుర్ముఖ బ్రహ్మనీ త్రివిక్రమరూపం చూచి సంభ్రమానంద పారవశ్యములతో నీ పాదములను తన కమండల జలంతో కడిగితే అదే సురగంగ యైనది. ఘన యోగీంద్రులకు లభ్యముకాని నీవు బాలుడైన ధ్రువునికి చిక్కావు. ఓ పురుషోత్తమా! నీ శరణాగతులు మాత్రమే నిన్నెరుగుదురయ్యా! నేడు మాబోటి శ్రీవైష్ణవుల ననుగ్రహించుటకు శ్రీవేంకటేశ్వరుడవై తిరుమల శిఖరంపై చేరావు. ఇక్కడ నీమాయ నీదాసుల జోలికిరాదు. రానేరాదు అంటున్నారు.

భావ వివరణ:

ఓ కరుణానిధీ! ఇరవుగా (సుస్థిరముగా) నీవు ఇటువంటివాడవని నిన్నెరిగిన వారెవరయ్యా! ఇదివో నీ దాసులు (శరణాగతులు) నిన్నెరిగిరి. నీవుండగా పరదేవతలపైన ఒలవేయనేల (చుట్టుకొనుటెందులకు?) నీ మాయలు పనిలేవు. (నీ చిద్విలాసము నెరుంగనసాధ్యము).

అలనాడు వామనుడవై నీవు బలిచక్రవర్తిని మూడడుగుల స్థలమును యాచించితివి. త్రివిక్రముడవైన నీ పాదములు ఈ మూడు లోకములను ముంచెను (ఆక్రమించినవి). ఇలలో వేదవ్యాసులవారు నీ వేయి

నామములను యెంచెను. ఆయన భీష్మాచార్యులవారి నోటిద్వారా వాటిని మాకందించారు. అదే విష్ణు సహస్రనామ ప్రవచనమై జగద్రక్షకమైనది. ఇదిట్లుండగా, మున్నె (అంతకుముందే) సనకసనందనాది యోగీంద్రులు నిన్ను చంచులదలచిరి (భావనాకాశములో నిన్ను భావించగలిగారు). మరి ఇకనీకు దాగికొనుచోటేదయ్యా? ఇంకా నీ వెడమాయలేలయ్యా? (వికృతమైన మాయలు మాపై యేల ప్రయోగించెదవయ్యా!)

ఆనాడు త్రివిక్రముడవైన నీ పాదము నింగినంతయు కప్పివేయగా చతుర్ముఖ బ్రహ్మ పరవశుడై నీ పాదమును కడిగాడు. అదే నీ పాద తీర్థము పవిత్రమైన గంగానదియైనది. తొల్లె (ఆనాడే) ఆదిశేషుడు నీదివ్యమహిమను వేయినోళ్ళతో పొగడినాడు. మొదటి నుండి శుకమహర్షి వంటి భాగవతోత్తములు నిన్ను యెక్కుడు (అధికముగా) కీర్తించిరి. పొనిగి (తృణప్రాయులమైన మాపైన) నామాయలేలయ్యా? నీమాయ చూపుటకు వేరే చోటేలేదా? ఓ పురుషోత్తమా! మమ్మనుగ్రహించి యేలుకోవయ్యా!

ఓ ఇందిరారమణా! ఆనాడు ముక్కుపచ్చలారని బాలుడైన ధ్రువుడు ఇదిగో నిన్ను గొలిచే పట్టమునెక్కెను (ధ్రువతార అయ్యాడు). నేటికీ ఆయనను దర్శించక వివాహ తంతే పూర్తికాదు. ఈనాడు విశిష్టులైన ఈ శ్రీవైష్ణవులు అందరికీ విశిష్టమైన నీ దివ్య శరణాగతి చిక్కినది దక్కినది. ఇంకా వారికి కావలసినదేమి వున్నది. ఓ శ్రీవేంకటేశ్వరా మమ్ము అనుగ్రహించి నీవు, గక్కున (వెంటనే) మమ్ము మాటకే గాచితివి (కేవలం మాటలతో కీర్తించినందుకే రక్షించితివి) నీదాసులందరికీ నీ శరణాగత రక్షణాదీక్ష గురించి తెలిసిపోయింది. ఇంక నీ మాయజూపే చోటేది స్వామీ?

సంపుటి: 4 కీర్తన : అతడే యెరుగును మముబుట్టించిన అంతరాత్మ
సంఖ్య : 442 పుట : 297 రాగం: లలిత

లలిత

46 అతఁడే యెరుఁగును మముఁబుట్టించిన యంతరాత్మయగునీశ్వరుఁడు
అతికీ నతుకదు చిత్తశాంతి యిదె ఆత్మవిహారం బిఁక నేదో ॥ పల్లవి॥

కనుచున్నారము సూర్యచంద్రులకు ఘనవుదయాస్తమయములు
వినుచున్నారము తొల్లిటివారలవిశ్వములోపలికథలెల్లా
మనుచున్నారము నానాఁటికి మాయలసంసారములోన
తనిసీఁదనియము తెలిసీఁదెలియము
తరువాతి పనులిఁక నేవో ॥అత఼॥

తిరిగెద మిదివో ఆసలనాసల దిక్కుల నర్థార్జన కొరకు
పొరలెద మిదివో పుణ్యపాపములభోగములందే మత్తులమై
పెరిగెద మిదివో చచ్చెడి పుట్టెడి భీతిగలుగు దేహములోనే
విరసము లెరఁగము మరచీ మరవము వెనకటికాలము విధియేదో
॥అత఼॥

అట్టైనారము హరినుచతిచే నాఅడి (డిఁబోవక) గురువనుమతిని
పట్టినారమిదె భక్తిమార్గమిదె (మును?) బలువగు విజ్ఞానముచేత
గట్టిగ శ్రీవేంకటపతి శరణని కంటి మిదివో మోక్షము తెరువు
ముట్టిముట్టము పట్టీపట్టము ముందటి కైంకర్యంబేదో
॥అత఼॥442

అవతారిక:

భగవంతుడు వున్నాడు అంటారే కాని వున్నాడన్న వాళ్ళెవరూ ఆయనను కన్నులయెదుట సశరీరంగా నిలిపి నిరూపించలేదు. పోనీ లేడనుకుందామా ఒక జీవి పుట్టి పెరిగి నశించే క్రమపరచబడిన

కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదెవరు? పరమాణువుకు జగద్విలయాన్ని సృష్టించగల శక్తి యెక్కడనుంచి వచ్చింది. ఇంత నిబద్ధతతో ఇన్ని అనూహ్య పరిమాణంగల గోళాలు ఖగోళంలో నిర్విరామంగా నిర్నిమిత్తతతో నిరంతర చలన కార్యక్రమం జరుగుతున్నది? ఎవ్వరూ సరయిన సమాధానం చెప్పలేని శేష ప్రశ్న ఇది. మనం వూహించలేని ఈ జగత్తును నిర్వహిస్తున్న ఆ శక్తినే ఈశ్వరుడు అని పిలుస్తున్నాం. మనలో చైతన్య రూపంలో వున్న ఆ ఈశ్వరునే అంతర్యామి అంటున్నాం. ఆ అంతర్యామి జీవిలో ఆత్మరూపంలో విహరిస్తుంటాడు. భగవంతుని మాదిరిగానే వున్నా కనుపించడాయె, పైగా ఒక్కొక్కరిలో ఒక్కొక్కరకంగా వున్నాడు. ఒకణ్ణి సజ్జనుని చేస్తే ఇంకొకడిని దుర్మార్గుని చేస్తున్నాడు. రెండురకాలవారికీ ఒకసారి ప్రశాంతంగా మనశ్శాంతి వుంటుంది. ఇంకొకసారి వారికే మనశ్శాంతి వుండదు. అతికీ అతుకనట్లుండే ఈ చిత్తశాంతే ఆత్మ విహారమంటే. మరొకటి కానేకాదు అంటున్నారు అన్నమాచార్యులవారు. వారి ఆలోచనతో లాక్షణికులు విభేదించవచ్చును. కాని కవి సర్వస్వతంత్రుడు. అతని భావన అవగాహన అతని స్వంతము, అతని అంతర్యామి అధీనము. బయటి ప్రపంచంలో ప్రకృతి రూపంలో ఆ భగవంతుడే వున్నాడు.

భావ వివరణ:

మమ్మల్ని పుట్టించిన అంతర్యామి రూపుడైన ఈశ్వరుడు మాత్రమే ఈ సంగతి నెరుగును. అతికీ అతుకనట్లుంటుంది. చిత్తశాంతి (మనశ్శాంతి ఒకసారి వుంటుంది, ఒకసారి వుండదు). దీనినే ఆత్మవిహారము అంటున్నాం. ఇంకోటి యేముంది చెప్పండి.

ఈ ప్రకృతి నిబద్ధత చూస్తున్నాము కదా! ఎంతో ఘనముగా సూర్యోదయం ఉదయాన్నే చూస్తున్నాము. సంధ్యాసమయాన సూర్యాస్తమయాన్నీ చూస్తున్నాము. సూర్యుడస్తమించగానే రాత్రి అవుతోంది. చంద్రోదయం అవుతోంది. తిరిగి సూర్యుడు అదే నిబద్ధతతో

వస్తున్నాడు, చంద్రుడు పోతున్నాడు. తొల్లిటి వారు (మన పూర్వీకులు) వీరినే దేవుని రూపాలని అనేక కథలను చెప్పారు. అవన్నీ వింటూనేవున్నాము. మాయా పరివృత్తమై అంతుచిక్కని ఈ సంసారములో మన మనుగడ సాగిస్తూనే వున్నాము. తనిసీ తనయము (ఒక్కొక్కప్పుడు) అతిశయిస్తాము (ఒక్కొక్కప్పుడు అతిశయించము). తరువాత పనులికనేవో తెలిసీ తెలియము (తరువాత యేమి జరుగుతుందో ఒకసారి తెలుస్తుంది ఒకసారి తెలియదు). మరి నిబద్ధత వుంటే యెప్పుడూ తరువాత యేమి జరుగుతుందో తెలియాలి కదా! అదెందుకు కావటం లేదు?

ప్రకృతి సంగతి కాసేపు అలావుంచి మన సంగతి చూడండి. ఇదిగో ఆసలనాసల (ఆశలపై ఆశలు)తో సతమతమవుతూ దిక్కులన్నీ అర్ధార్జనము (ధన సంపాదన) కొరకు తిరుగుతూనే వున్నాము. దానికోసం అనేకమైన పనులు చేసి పాపమూ మూటకట్టుకొంటున్నాము, పుణ్యమూ మూట గట్టుకొంటున్నాము. అనేక భోగాల మత్తులో పడిపొర్లుతున్నాము. పుట్టినదగ్గరనుంచీ చచ్చేదాకా దేవుడిచ్చిన ఈ దేహములోనే మనుచున్నారము (నివసిస్తున్నాము). మనకు జరిగే విరసములు (అవమానాలను) జరిగేదాక తెలియము. జరిగాక జరిగినది మరువాలన్నా మరువలేము. ఇది విధియేనని సరిపుచ్చుకోనూలేము. ఇది విచిత్రమైన మానవ ప్రకృతి.

మేము ఇటువంటి ప్రకృతి చేత, అట్టినారము (బజారున పడ్డాము). సద్గురువుల కృప కలిగి వారి అనుమతితో ఇదే భక్తి మార్గమును పట్టుకొన్నాము. శ్రీహరిని కీర్తించినాము. బలమైన విజ్ఞానము భగవత్ జ్ఞానమును సంపాదించినాము. దానివలన గట్టిగా (ధృఢముగా) శ్రీవేంకటేశ్వరుని శరణాగతిని పొందినాము. ఇదే మోక్షమార్గమని గ్రహించినాము. కానీ ఈ భగవత్ కైంకర్యము (దాస్యము) ముట్టీముట్టము (ఒక్కొక్కప్పుడు చేపడతాము ఒక్కొక్కప్పుడు చేపట్టము) పట్టీ పట్టము. ఇదే ఈశ్వరమాయ, శ్రీవేంకటేశ్వరుని లీల.

సంపుటి: 4 కీర్తన : "నిశ్చింతం పరమం సుఖ" మనుమాటే నిజము నిజము తెలియరుగాని

సంఖ్య : 318 పుట : 214 రాగం: గుండక్రియ

గుండక్రియ

47 "నిశ్చింతం పరమం సుఖ" మనుమాటే నిజము
నిజము తెలియరుగాని
అశ్చర్యంబిది పరమయోగులకు ననుభవులకు
దృష్టాంతముసుండీ ॥ పల్లవి॥

కరచరణాదులుగలచైతన్యము గక్కునఁ బానుపుపైనుండి
సరుగన సడిలిన నిద్రామందము సమకూడీ నరులకటువలెనే
పరమాత్మునిపై సకలోద్యోగ వు (గో?) పాయంబులు దా దిగవిడిచి
ధరఁ దానుండిన బ్రహ్మానందము తనుఁదానే పైకొనుఁజుండీ
॥నిశ్చిం॥

వున్నతిఁ దానొక దేశములోపలనుండి క్రితముచూచిన నవియెల్లా
అన్ని దేశములు నటుదలపోసిన యంతకుగోచరమైనట్లు
యెన్నగఁబూర్వజ్ఞానంబున సర్వేశ్వరుఁడగు హరిఁదలఁచినను
సన్నిధియగు సుజ్ఞానానందము సత్యము సత్యంబదిసుండీ
॥నిశ్చిం॥

ననిచిన ప్రపంచకల్ప (ల్ప?) ములలో నానావిధముల జంతువులు
తనుఁదాఁజాడఁగరానిరూపు లద్దములోపలఁగన్నట్లు
ఘనుఁడగు శ్రీవేంకటపతిరూపము గక్కన నెదుటనె సేవించి
అనయము తనుఁదా సంతసించుటే యాత్మానందంబిదిసుండీ
॥నిశ్చిం॥ 318

అవతారిక:

సుఖముగా లేకపోవుట వేరు చింతిస్తూవుండటంవేరు. సుఖంగా లేకపోయినా నిశ్చింతతో వుండవచ్చును ఎప్పుడు? భక్తి వైరాగ్యములుంటే. సుఖంగా వున్నా కొంతమంది తృప్తిలేక చింతతోనే గడుపుతారు. కానీ నిశ్చింతవుంటే పరమసుఖంగా వుంటారు. ఇది నిజము. అదియే నిజమని తెలియరుగాని అదే నిజము అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ విషయం పరమయోగులకు కూడా ఆశ్చర్యం తెప్పిస్తుంది. గొప్ప అనుభవంకలవారికి కూడా ఇదే చక్కని దృష్టాంతము సుమండీ! అంటున్నారు. మంచి మెత్తటి బూరుగు దూది పరుపుపై పడుకొన్నవాడు కమ్మటి నిద్రలోకి హాయిగా జారుకొన్నట్లు ప్రాపంచికమైన యుక్తులు, కుయుక్తులూ విడిచిపెట్టినవారు బ్రహ్మానంద స్థితిని తప్పక పొందగలరంటున్నారు. శ్రీవేంకటేశ్వరుని యెల్లవేళలా దలచుచూ యెప్పుడూ సంతోషంతో వుండటమే ఆత్మానందము అంటే. అదేలేనివాడు యెన్ని మేడలున్నా, యెంతధనమున్నా, యెంత అధికారమున్నా యేమీలేనట్లే. అవునా?

భావ వివరణ:

నిశ్చింతగా వుండుటయే మిక్కిలి సుఖవంతమైన స్థితి. ఇట్లు చెప్పెడి మాట నిజము. అయితే ఈ సత్యం చాలామంది యెరుగరు, గాక! పైజెప్పిన సత్యం పరమయోగులకు కూడా ఆశ్చర్యకరమే. అనుభవంగలవారికి ఈ సత్యము గొప్ప దృష్టాంతము సుమండీ!

ఒక వ్యక్తి తన పాన్పుపై సుఖముగా పరుండినదే తడవుగా అతని కరచరణములలో కలిగే చైతన్యంకూడా నిద్రిస్తుంది. నరులందరికీ

అటువలెనే (అట్లాగే) జరుగుతుంది. పరమాత్మునిపై అచంచలమైన నమ్మకంతో సకలోద్యోగ ఉపాయంబులు దిగవిడిచి (అన్నిరకములైన వ్యవహారపు కిటుకులను విసర్జించి) తనలో తానే బ్రహ్మానందము (పరమానందు) అనుభవించుచున్న స్థితిలో వుంటే, బ్రహ్మానందము తనకుతానే (దానంతట అదే) సంప్రాప్తిస్తుంది సుమండీ!

ఎవరైనా రోజూతానొక దేశములో చూచిన వున్నతిని తన స్వంతదేశములో కూడా ప్రవేశపెట్టాలని యోచిస్తాడు. అన్ని దేశముల రాజులూ అట్లే ఆలోచించిన ఉన్నతి దానంతట అదే వస్తుంది. అట్లే తన పూర్వజన్మసుకృతముచేత కలిగిన జ్ఞానముతో సర్వేశ్వరుడైన శ్రీహరిని స్మరించినచో సుజ్ఞానానందము వాని సన్నిధినే నిజముగా యుండును. ఇది సత్యము సుమండీ!

ఈ ప్రపంచంలో ననిచిన (పూచిన) అనేక కల్పములలో నానారకములైన జంతువులు అనేకరూపములతోనున్నవి. మన వెనుక యేమున్నదో మనము చూడలేము. కానీ మన ముందు ఒక అద్దము వుంటే ఆ లోటు తీరుతుంది కదా! అట్లే ఎవ్వరికైనా ఆత్మానందము అంత సులువుగా లభ్యమవదు. మొట్టమొదట శ్రీవేంకటేశుని శరణాగతి పొందవలెను. ఆయన రూపమును తనకన్నులయెదుట నిలుపుకొని, అనయము (ఎల్లవేళలా) తనుదా సంతసించుచు (తన ఆత్మావలోకనంతో తనలో తానే సంతోషముతో) వుండవలెను. అదే ఆత్మానందము సుమండీ!

సంపుటి: 4 కీర్తన : హరిహరి నిను సకలాంతర్యామిని
ఆత్మదలచుటే యోగంబు
సంఖ్య : 450 పుట : 303 రాగం: గుజ్జరి

గుజ్జరి

48 హరిహరి నిను సకలాంతర్యామివి (ని?) ఆత్మఁదలఁచుటే యోగంబు
శరణాగతరక్షామణి నిన్నే శరణని యెడిదే తుదిపదము ॥ పల్లవి॥

నీయందే యీ సచరాచరమును నీవే చరాచరమందు నిత్యమును
పాయక వుండుట గని తలపోయుట పరమార్థంబుల సారంబు
కాయము జీవుఁడు నీయధీనమై కలుగఁగఁ బ్రకృతియుఁ
బురుషునిఁగానిటు
మాయలముంతవు మాయకుఁ జొరవని మతిఁ దలపోయుట
సుజ్ఞానంబు ॥హరి॥

తనలోఁ (పల) బరతత్వపు నీవును తా నీపరతత్వములోపలఁగా
మనసునఁ దలఁచుట వేదాంతంబులమంతనములసన్మార్గంబు
ఘనమునకును మరి ఘనమై యందే కడుసూక్షమునకుఁ
గడు సూక్ష్మంబై
యెనసిన పూసలలోదార మవని యెన్నుటె పరమరహస్యంబు
॥హరి॥

ఆతుమలోపల ఘనవైకుంఠము ఆతుమ నీ వైకుంఠములోపల
యీతల నాతల సరిగాఁదెలియుట యిదియే బ్రహ్మానందంబు
శ్రీతరుణీశ శ్రీవేంకటపతి సేవారతి నిను నీ భజియించెద
దాతవు దైవమవై ననుఁగావుము తలఁచెద మిదియే తత్వంబు
॥హరి॥ 450

అవతారిక:

సకలజీవులలో అంతరాత్మగా నున్నవాడు శ్రీహరే. కాని ఏ జీవికీ ఆ హరికృప కలిగేదాకా ఆ విషయం తోచదు. ఒకవేళ తోచినా శ్రద్ధ కలుగదు. హరికృప కలిగినవారికి ఆయనను ఆత్మలో ధ్యానించాలనే వూహ కలుగుతుంది. దానికీ యోగ్యత కావాలి. ఆ యోగ్యత కలుగుటయే యోగము అనబడింది. అది ఆ శ్రీహరి శరణాగతులకే దక్కుతుంది అంటున్నారు అన్నమాచార్యులవారు. అప్పుడే తుదిపదమైన మోక్షము సిద్ధించుతుంది అంటున్నారు. సృష్ఠిలోని చరాచరములన్నీ ఆ శ్రీహరిలోనే వున్నాయి. ఆయనే వాటన్నింటిలోనూ వున్నాడు. సర్వం విష్ణుమయం అంటే అదేమరి. ఆ శ్రీహరి ఏ మాయకూ లోనుగాడని తలపోయు జ్ఞానమే సుజ్ఞానమంటున్నారు భగవద్గీతా వాక్యాన్ని పునశ్చరణ చేస్తున్నారు అన్నమయ్య. పూసల దండలో ఆ పూసల్ని నిలిపివుంచే దారము కనబడనట్లు ఈ విశ్వాన్నంతా ఆయన ఆక్రమించివున్నా మన కనులకు గోచరించదు. ఇంకొక సత్యమేమంటే ఆత్మలో వైకుంఠాన్ని నిలుపగలిగిన వారిఆత్మ వైకుంఠములోనే వుంటుందంటున్నారు. కొసమెరుపేమంటే ఇవన్నీ చిలుక పలుకుల్లాగా వినటానికే ప్రాముఖ్యతనిస్తే ఇంతే సంగతులు. అనుభవపూర్వకంగా ఆ శ్రీవేంకటేశుని తెలియాలి. అప్పుడే బ్రహ్మానందం కలుగుతుంది అంటున్నారు.

భావ వివరణ:

ఓ శ్రీహరీ! సకల జీవులలో అంతర్యామిగా నెలకొనియున్న నిన్ను ఆత్మయందు నిలిపి ధ్యానించగలుగుటయే గొప్ప యోగము (సిద్ధి). అది అందరికీ దక్కేది కాదు. శరణాగత రక్షామణి (శరణన్నవారికి రక్షణనిచ్చే మణి) వంటి నిన్నే శరణనేదే తుదిపదము (మోక్షమార్గము).

దేవా! సచరాచరము (కదలికగలిగినవి, కదలికలేనివి) రెండూ నీయందేవున్నవి. వింతలలోకి వింతయేమంటే నీవునూ వాటియందున్నావు. నిత్యమూ కన్నులకు కనుపించుచున్న ఈ సమస్త

చరాచరమందు నీవువున్నావు. ఆ విధముగా పాయక (విడువక) నిన్నే తలపోయుచూ వుండుటయే గొప్ప వైభవము. అదే అన్ని పరమార్థముల సారము. మా శరీరము అందులో వుండే ఆత్మ నీ అధీనములోనే వుంటాయి. ప్రకృతి రూపంలో ఈ కాయాన్నీ (దేహాన్ని) పురుషుని రూపంలో ఆ దేహంలో నెలకొనియున్న దేహిని (ఆత్మను) ఈవిధంగా అనేకమైన మాయలలో ముంచుతున్నావు. కాని మాయ నిన్నేమీ చేయలేదు. మనస్సులో ఇది తలపోసి నీ దాసులైయుండకోరుటే సుజ్ఞానము.

ఇక వేదాంత మంతనము (వేదాంతరహస్యము) గురించి ఆలోచిస్తే, సన్మార్గము అలవడుతుంది. అది అలవడినప్పుడుతన మనస్సులో నీ (పరమాత్మ) పరతత్త్వతత్త్వమున్నదనీ, అదే విధముగా నీ పరతత్త్వంలోనే తానున్నానని ఆ వేదాంతి గ్రహించగలుగుతాడు. నీ తత్త్వం తెలిసినవాడు నీవు ఘనమైనవాటికెల్లా ఘనుడవని, సూక్ష్మమైనవాటికెల్లా సూక్ష్మమైనవాడివని జీవులన్నిటిలోనూ పూసలదండలోని దారమువలె వున్నావని అర్థమవుతుంది. పూసలదండకు ఆధారమైన దారమూ కనబడదు. జగత్కారణమైన నీవూ కనబడవు. ఇదే పరమ రహస్యము.

శ్రీమన్నారాయణుని నిలయమైన వైకుంఠము యెక్కడుందో తెలియునా మన ఆతుమ (ఆత్మలోనే వున్నది). దేవా! మోక్షం అంటే మా ఆత్మ నీవైకుంఠము చేరుటే కదా! మరి మా ఆత్మలో వున్నదాన్ని మేము చేరుట యేమిటి? ఈతల (ఇహలోకంలోనూ) ఆతల (పరలోకంలోను) నీ తత్త్వమును తెలియుటయే బ్రహ్మానందము అనబడింది. పరమాత్మ మనలోనే వున్నాడని గ్రహిస్తే బ్రహ్మానందంకాక మరేముంటుంది? ఇంత జరిగాక శ్రీతరణీ వల్లభుడైన ఓ శ్రీవేంకటేశ్వరా! నీ తత్త్వం తెలిసింది. నీసేవారతి (దాస్యభక్తి)తో నిన్ను భజిస్తూ, నీవే దాతవు నీవే దైవమవు అని తెలిసింది. ప్రభూ! ఈ తత్త్వమునే తలపోస్తూ జీవితాంతం నీ దాసుడనై వుంటాను.

సంపుటి: 4 కీర్తన : ఇతరములన్నియు నడుమంత్రములే యెంచిచూచినను యింతాను

సంఖ్య : 399 పుట : 268 రాగం: గుజ్జరి

గుజ్జరి

49 ఇతరములన్నియు నడుమంత్రములే యెంచిచూచినను యింతాను
హితవగుబందుగుఁ డీశ్వరుఁడొకఁడే యితని మరవకుమీ జీవాత్మా
॥ పల్లవి॥

భవకూపంబుల బడలెడినాఁడు పాయనిబంధువుఁ డితఁడొకఁడే
దివిస్వర్గంబునఁ దేలెడినాఁడు తిరుగఁబాయకె (ఁడె?) పు డితఁడొకఁడే
నవనరకంబుల నలఁగెడినాఁడు నటనలఁ బాయఁ డితఁడొకఁడే
యివలనవలహృదయేశుఁడు విష్ణుఁడు యీతని మరవకుమీ జీవాత్మా
॥ఇతర॥

పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయనిబందుగుఁ డితఁడొకఁడే
విశదపుదు:ఖపువేళలనైనా విడువనిబంధువుఁ డితఁడొకఁడే
శిశువైనప్పుడు వృద్ధినప్పుడు చిత్తపుబందుగుఁ డితఁడొకఁడే
దశావతారపు విష్ణుఁడొకఁడే యితఁడని తలఁచుమీ జీవాత్మా ॥ఇతర॥

భావజకేలినిఁ జొక్కినప్పుడును ప్రాణబంధువుఁ డితఁడొకఁడే
యీవల నావల నిహపరములలో నిన్నిటిబంధువుఁ డితఁడొకఁడే
దైవము దానని శరణనియెడు నను దగ్గరికాచెను యితఁడొకఁడే
శ్రీవేంకటగిరి నాయకుఁ డితఁడే చేరి భజించుము జీవాత్మా ॥ఇతర॥399

అవతారిక:

నడమంత్రము అంటే మధ్యలో వచ్చినవి అని అర్థం. ఉన్నట్లుండి వ్యాపారంలో పట్టిందల్లా బంగారమై ఒకడు శ్రీమంతుడవుతాడు. ఒక వెలుగు వెలుగుతాడు. ఒక రోజున ఇంకొక వ్యాపారంలో ఈ వచ్చినదంతా పోతుంది. ఎట్లా వచ్చిందో అట్లా పోతుంది. అందుకనే దాన్ని నడమంత్రపు సిరి అన్నారు. చాలామంది అట్లా సిరి కలిగినప్పుడు కన్నూమిన్నూ తెలియక ప్రవర్తించి ఇతరులను చిన్నచూపు చూచి అదంతా తమ ప్రతిభేననీ, దేవుడు లేడు స్వయంకృషే దేవుడు అని ప్రసంగాలు దంచుతారు. కొంతమంది కుత్సితులై అక్రమాలకు పాల్పడతారు. కొన్నాళ్ళకు ఎలాపైకి వచ్చారో అలాగే ఆరిపోతారు. కీర్తి ప్రతిష్ఠలు, సిరిసంపదలు, హితాభిలాషలూ వస్తూనేవుంటాయి, పోతూనేవుంటాయి. మరియెన్నడూ విడిపోని హితకారి హితాభిలాషి యెవరు? ఇంకెవరు? ఈశ్వరుడొక్కడే. మధ్యమధ్య అజ్ఞానాంధకారంలో పడిపోయే జీవాత్మా! ఈ నేను చెప్పెడి హితవు మరువవద్దు, అంటున్నారు అన్నమాచార్యులవారు. జన్మాంతరాలలో మనకు తోడునీడగా వుండి సంరక్షించేవాడు ఈయనే. స్వర్గ నరకాలలో మన పుణ్యపాపాలనుభవానంతరం కూడా మనని విడువని జన్మాంతర బంధుగుడితడే. మనమశక్తులమైన పశు, జంతు జన్మలలోనూ రక్షకుడితడే. కావున ఈ శ్రీవేంకటేశునికి శరణుజొచ్చి నిశ్చింతగా వుండండి.

భావ వివరణ:

ఓ జీవాత్మా! నీకు హితకరుడైన బందుగు (బంధువు) ఆ ఈశ్వరుడొక్కడే. ఇతరములన్నియు (ఈయన కాక అన్యులెవ్వరూ) నడమంత్రపు సిరివలె మధ్యలో వచ్చి మధ్యలో పోయేవారే. ఈ సంగతిని మరువకుమీ! (జ్ఞప్తియందుంచుకొనుము).

ఓ జీవుడా! ఒక జీవి చావుపుట్టుకలనే భవసాగరంలో పడికొట్టుకుపోతుంటే ఆ భవకూపంలో వడలిపోతుంటే, పాయని బంధువు ఇతడొకడే (ఈ శ్రీహరి ఒక్కడే). ఒకవేళ స్వర్గప్రాప్తి కలిగి ఆ స్వర్గసుఖాలలో దేలెడినాడు సరేలే వీడికీ స్వర్గం చాలు అని తిరుగబాయడు (త్రిప్పి వేయడు) నవనరకంబుల (రౌరవాది తొమ్మిది రకములైన) నరకములలోపడి శిక్షలనుభవించుచూ నలిగిపోతున్ననాడు నటనల నటిస్తూ తెలియనట్లు విడిచిపెట్టుడితడు. ఇవల (ఈ పుడమి మీద) ఆవల (పరలోకాలలోను) హృదయేశ్వరుడు (హృదయంలోవుండి యేలే సర్వేశ్వరుడు) ఈ విష్ణువొక్కడే. ఈతనిని మరువరాదు సుమా!

ఓ జీవాత్మా! నీవు కర్మ వశంబున పశువుగానో మృగపక్షి కీటకాది జాతులలోనో జన్మనెత్తినపుడు నీ ఈ జ్ఞానమంతా నశిస్తుంది. మరి అప్పుడు నీకు దిక్కుయెవరనుకున్నావు? అప్పుడుకూడా నిన్ను పాయని బంధువు (విడవని ఆప్తుడు) ఇతడొక్కడే. నీవు తీరని దుఃఖములో వివశుడవై వుంటే నీకష్టకాలంలో నిన్ను వదిలిపెట్టని బంధువు ఇతడొక్కడే. సమర్థవంతమైన మానవజన్మనెత్తినప్పటికీ వాడిశైశవ దశయందును వృద్ధాప్యదశయందును చిత్తపుబంధువు (ఆత్మబంధువు) ఇతడొకడే. దశావతారములనెత్తి దుష్టశిక్షణ శిష్టరక్షణ చేసిన విష్ణుదేవుడితడొక్కడే అని నీ మనస్సున తలచుకోరాదా!

ఓ జీవుడా! నీవు యౌవనమున భావజకేలిని (శృంగారకామకలాపము) సాగిస్తున్నప్పుడు అలసిజొక్కెదవు. అప్పుడుకూడా నిన్ను విడువక నీ వుద్రేకపు తీవ్రత నిగ్రహించి నీ ప్రాణములను నిలబెట్టు నీప్రాణ బంధువితడొకడే. ఈవల (ఈ భూమిపైనా) ఆవల (ఆ పరలోకంలోను) ఇన్నిటి (నీపాపపుణ్యానుభవమున) బంధువు, ఇతడొక్కడే. తానే దైవమని భావించి శరణుజొచ్చినవారిని, తానే దగ్గరకు జేరి సంరక్షించేవాడు ఇతడు ఒక్కడే. ఈయనే శ్రీవేంకటేశ్వరుడు. ఈ స్వామిని దరిచేరి భజించి తరింపుము.

సంపుటి: 4 కీర్తన : ఏమనవచ్చును చెల్లుచున్నవివె యీశ్వర నీమాయలు

సంఖ్య : 259 పుట : 173 రాగం: గుజ్జరి

గుజ్జరి

50 ఏమనవచ్చును చెల్లుచున్నవివె యీశ్వర నీమాయలు గొన్ని
శ్రీమాధవ నీ చిత్తము కొలఁదిఁక చెప్పెడిదేఁటికి జీవులకు

॥పల్లవి॥

కలిదోషనిరుహరణ కైవల్యాకర హరి
తలఁచినవారిది నేరుపు మిముఁ దలఁచనివారిది నేరమి
కలుషమెడలి సూర్యోదయమైనా కానవు కొన్ని జంతువులు
తెలిసినవారలు కందురు యీతెరఁగ(గు?)లు రెండిటి దినమొకటే

॥ఏమ॥

శరణాగతరక్షణచతుర సర్వాంతరాత్మక యచ్యుత
సరి నిన్నుఁ గొలిచినవారిది పుణ్యము చలమున మానుటే పాపము
సరుగనఁ గాచేటి చల్లని చంద్రుఁడు జారచోరులకుఁ గడు వేఁడి
అరయఁగఁ గలువలకును హితుఁడు అందుకు నిందుకు గురి యితఁడే

॥ఏమ॥

శ్రీవేంకటగిరినిలయా శ్రీసతీశ పురుషోత్తమ
మీవొద్దనుండితే వైకుంఠము మిమ్ము నెడసితే నరకము
భావములోపల నీవే వుండఁగ భక్తి లేదు కొందరికైతే
శ్రీవైష్ణవులకు నిత్యము యీ చింతలు రెంటికి నీ మహిమే

॥ఏమ॥259

అవతారిక:

పరమాత్ముడైన శ్రీవేంకటేశ్వరునితో రాజీకివస్తున్నారు అన్నమాచార్యులవారు. ఓ శ్రీమాధవా! ఈశ్వరుడివైన నీమాయలలో కొన్నింటిని యేమనాలో తెలియటంలేదు. స్వామీ! నీవెట్లా తలచుకుంటే అట్లా చెల్లుబడి అవుతుంది. నీ చిత్తమొచ్చినట్లు చేయవయ్యా! నీకు చెప్పేదేమిటి? అంటున్నారు. ఎందువల్లనోగాని ఈ కీర్తన తుది చరణాలు అంత సులభగ్రాహ్యంగా లేవు. భావములోపల నీవే వుండగ కొందరు ఆపద్ధర్మ భక్తులకు ఎంతసేపు నీమూర్తి యెదుట కూర్చున్నా మనస్సు నీపై నిలువదు. అదే శ్రీవైష్ణవులకైతే నిత్యమూ వారి మనస్సులలో నీవే వుంటావు. మరి ఈ రెండు విధములుగానున్న చింతనలు ఎందుకు కలుగుతున్నాయి? నీ మహిమవల్లనే కలుగుతున్నాయి స్వామీ! అంటున్నారు.

ఆయన కృపలేనివారికి శ్రీవేంకటేశ్వరుడు అంటే నల్లటి పొడవాటి విగ్రహం. ఆయన కృప కలిగినవారికి ఆయన కరుణాసముద్రుడైన వైకుంఠుడు. ఆ తిరుమలే వైకుంఠము "యద్భావం తద్భవతి" అని అందుకే అన్నారు పెద్దలు. ఉన్నదొక్కటే... అది జ్ఞానికి ఒక లాగున అజ్ఞానికి ఇంకొకలాగున కనబడుతుంది. సూర్యోదయమైతే ప్రపంచం మనకు కనబడుతుంది కాని గుడ్లగూబకు కనబడదు కదా! చల్లని ధవళకాంతులీనే చంద్రుడి వెన్నెల జారులకీ చోరులకీ చిరాకు కలిగిస్తుంది కదా!

భావ వివరణ:

ఓ ఈశ్వరా! నీ మాయలు కొన్ని వివరింపనసాధ్యముగానున్నవి. వాటిని యేమనవచ్చును (ఏమనగలము)? ఓ శ్రీమాధవా! ఇక నీ చిత్తము కొలది (నీఇష్టం వచ్చినట్లు) చెయ్యవయ్యా! జీవులకు చెప్పెడిదేమిటి (మాబోటి అల్పులైన జీవులకు నీవు వివరణ ఇవ్వవలసిన పనియేమున్నది తండ్రీ! నీకెలా తోస్తే అలా చేయుము.

కలిదోషనివారకుడవైన ఓ శ్రీహరీ! నీవు కైవల్యాకారుడవు (మోక్షప్రదాతవు). నిన్ను తలచినవారిదే (ధ్యానించినవారిదే) నేరుపు

(చతురత). మిమ్ము తలచనివారిది (ధ్యానించనివారిది) నేరమి (అపచారము). కొన్ని జంతువులు సూర్యోదయమై వెలుతురు వస్తే ప్రపంచాన్ని చూడలేవు. మరి మనిషి సూర్యుడు లేకపోతే చూడలేడు. తెలిసినవారు (జ్ఞానులు) ఈ రెంటికీ (మనిషికి, ఆ జంతువుకు) దినము ఒక్కటే అయినా చూడటంలో ఎలా తేడావున్నదో అలాగే భగవంతుని జ్ఞాని చూడగలడు అజ్ఞాని చూడలేడు. కళ్ళున్నంతమాత్రాన లాభం లేదు. అవునా?

ఓ అచ్యుతా! ఓ సర్వాంతరాత్మకా! ఓ శరణాగత రక్షణా చతురా (శరణాగతులను నేర్పుతో రక్షించువాడా!) నిన్ను కొలిచినవారిదే నిజమైన పుణ్యము. చలమున (అహంకారముతో) నిను కొలువకుండుటే పాపము. ఒక్కొక్కప్పుడు మంచివారు, చెడ్డవారికి చెడుగా కనుపించుచుందురు. పున్నమి రాత్రి చల్లని చంద్రుడు పిండారబోసినట్లు వెన్నెల కాంతినిచ్చి అందరికీ ఆనందం కలుగజేస్తాడు. అవునుకదా! కాని అదే చంద్రుని చూస్తే జారులకు (వ్యభిచారులకు) చోరులకు (దొంగలకు) వేడికలుగు (ఉడుకుమోతు తనంతో కూడిన కోపము వస్తుంది). కాని కలువపూవులు చంద్రుని చూస్తే వికసిస్తాయి. అవునా? అందుకు నిందుకు గురి అయినది ఒకే చంద్రుడు కదా! అట్లే శ్రీహరి ఆశ్రయమే పుణ్యము నిరాదరణే పాపము. అంతే సుమా!

ఓ శ్రీవేంకటేశ్వరా! ఓ శ్రీసతీవల్లభా! ఓ పురుషోత్తమా! మీ వొద్దనుండుటే (నీ సన్నిధిలో వుండుటే) వైకుంఠము. మీ ధ్యాసలేక విముఖులై యెక్కడవున్నా అదే నరకము. కొందరు సాధారణ భక్తులకు నీ దివ్యమంగళాకారమును చూస్తే పొడవైన నల్లని విగ్రహం కనబడుతుంది. మరి మాబోటి కొందరు శ్రీవైష్ణవులకైతే నిత్యమూ నీవే వారి యెదురుగా వున్నట్లుంటుంది. ఈ రెండు రకములైన చింతలకి (భావనలకీ) మూలము నీ ఒకే మూర్తి. అవునా! మరి ఇలా యెందుకు జరుగుతున్నది? అదే నీ మహిమ తండ్రీ!

సంపుటి: 3 కీర్తన : దేవానీవే యిన్ని చందముల తిరముగ మహోపకారివైతివి

సంఖ్య : 240 పుట : 162 రాగం: బౌళి

బౌళి

51 దేవా నీవే యిన్ని చందముల తిరముగ మహోపకారి వైతివి
యేవలనైనా నీవేకాక బువి నింతటివారలు యిఁకఁగలరా ॥ పల్లవి॥

జనులకు నీవే వొక్కకచోటను శాస్త్రార్థములై కడఁగుదువు
తనియక నీవే మరి వారికి బోధకులఁ గొందరినిఁ గల్పింతువు
మనసులో నంతలో వొడఁబడికె చేసి మలయుచు నీవే నిలుతువు
కనుఁగొన నీవే సుజ్ఞానమార్గము కైవసముగాఁ దెలుపుదువు

॥దేవా॥

కడఁగి యప్పటి నీవే యజ్ఞాదికర్మఫలములై వుండుదువు
తడయక నీవే తిరుపతుల దేవతామూర్తులై పొడచూపుదువు
యెడయక నీవే తపోమహిమలై యెదుటనే తార్కాణ లౌదువు
వొడలై నీవే యిహపరములకును వొడిగట్టి సాధింపింతువు.

॥దేవా॥

అవేళ నీవే తత్వనిర్ణయము నాధారమునై యేర్పరతువు
నీవే కమ్మటి ఆచారవిధులకు నియమములెల్లా నేర్పుదువు
భావింప నీవే అలమేల్మంగకుఁ బతివై శ్రీవేంకటేశ రక్షింతువు
జీవుల కంతర్యామివై నీవే శిష్టఁ బరిపాలింతువు

॥దేవా॥ 240

అవతారిక:

ఏ జీవికైన దేహము, దానిలో ప్రాణమువుండటం ఒక ఎత్తయితే దానిలో జ్ఞానముండటం ఇంకొక ఎత్తు. ప్రాణం కూడా లేకపోతే ఆ దేహము శవమే కదా! ఒక జీవికి ఈ మూడూ వుంటే వానిని జ్ఞాని అంటారు. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు ఆ దేవదేవుని కీర్తిస్తూ, దేవా! ఇన్ని విధములుగా నీవు మాకు మహోపకారం చేసే వాడివైనావు.ఈ భువిలో నీవు గాక నీ అంతటివారు ఇంకొకరున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. జీవులకు ఒక్కసారి జ్ఞానం వచ్చాక వారి చిత్త ప్రవృత్తులు వేర్వేరుగా వుంటాయి. కొందరికి శాస్త్ర అధ్యయనంపై మక్కువ వుంటుంది. కొందరికి శాస్త్ర బోధన మీద ఇష్టం వుంటుంది. కొందరికి మనస్సులో నీవే నిలుతువు. కొందరికి నీవే సుజ్ఞానమార్గమును కైవసము జేతువు. అనాదిగా అనేకయుగాలలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసియున్నావు. ఈనాటి కలియుగంలో అల్పజ్ఞానులైన ఈ జీవులను శిష్టులను చేసి పరిపాలించుటకు అలమేల్మంగ సమేతుడవై తిరుమల శ్రీవేంకటేశ్వరుడవైనావు మా అంతర్యామివై కంటికి రెప్పలా కాపాడుతున్నావు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవొక్కడవే ఇన్ని చందముల (విధములుగా) తిరముగ (స్థిరమైన) మహోపకారివైతివి (గొప్ప ఉపకారము నొనరించు, సహాయకుడవైతివి). ఏవలనైనా (ముల్లోకాలలో యెక్కడనైనా) ఈ భువిలో ఇంతటి వారలు (ఇంత ఉదారులు) నీవేకాక మరొకరు కలరా తండ్రీ!

ఓ ప్రభూ! నీవే ఈ జనులకు ఒకొక్కచోట శాస్త్రార్థములను కడగుదువు (అనుసరింపచేతువు) తనియక (తృప్తిలేక) నీవే వారిలోనే కొందరికి విశేషమైన జ్ఞానమునిచ్చి బోధకులను (ప్రవచనకారులను) చేయుచున్నావు. ఇంకా ఈ ధర్మరక్షణ సరిగా జరుగుతుందో లేదోనని మాబోటి భక్తుల మనస్సులలో కూడా అంతలో వొడబడి (చొరబడి) ఆ ప్రయత్నంలో వారి

మనస్సులలో నిలిచియుంటున్నావు. అప్పటికీ అజ్ఞానావర్తనులై అర్జునునివలె సందేహపరులైతే సుజ్ఞానమార్గమును కైవసముగా (సుస్థిరముగా) కనుగొనజేతువు. అందులకు నీ విశ్వరూప సందర్శనము కూడా చేయించినావు కదా!

ప్రభూ అప్పుడు బోధించినట్లు, నీవే యాజ్ఞాదికర్మలయొక్క ఫలములవలె వుందువు. ఆ ఫలములచే ఆ యజ్ఞములను చేసినవారికి సార్వభౌమత్వము, దివ్యలోకవాసము, స్వర్గ సుకానుభవము వంటి దివ్య భాగ్యములను ప్రసాదించుచున్నావు. తడయటక (అంతటితో తృప్తిచెందక) నీవే 108 తిరుపతులలో ఆయాదేవతామూర్తులై పొడచూపుదువు (కనబడుచున్నావు) ఇట్లు లోకమంతా నీ భక్తులను పెంపొందింపజేయుచున్నావు. నీకోసం తపస్సు చేసేవారికి వారి వారి శ్రద్ధననుసరించి వారి యెదుటనే తార్కామణముగా ప్రత్యక్షమవగుచున్నావు. నీవే ఒడిగట్టి (నిర్వహించి) నీ భక్తులచేత ఇహపరములు రెంటినీ సాధింపజేతువు అంతేకాక ఆ సాధించిన కీర్తికూడా మాకే తక్కేట్లో చేస్తావు. ఎంతటి కరుణామూర్తివయ్యా!

దేవా! నీవేతత్త్వ నిర్ణయమునకు ఆధారములై విధి విధానములను నిర్దేశించుచున్నావు. లేనిచో ఒకానొక వ్యక్తి చెప్పిన తత్త్వమును వేల సంవత్సరములు, కోట్లాది మంది ప్రజలు అనుసరించుట సాధ్యపడుతుందా? నీవే ఒక్కొక్క వ్యవస్థాపకుడవై ఆ వ్యవస్థ ఆచారవిధి విధానములను నిర్దేశించుచున్నావు. ఇక నేటి కలగియుగంలో మాబోటి సర్వసామాన్యులు అనుకొన్నది చెప్పరు, చెప్పింది చేయరు, చేసిందే ఇంకొకసారి చేయని అసత్య అధర్మవర్తనులు. నీ సన్నిధిలోనే దురాచారులైపోతున్నారు. భావించి వారిని వుద్ధరించటానికి నీవే అలమేల్మంగపతివై, జీవుల అంతర్యామివైన శ్రీవేంకటేశ్వరుడవై శిష్టులను జేసి పరిపాలించుచున్నావు.

సంపుటి: 3 కీర్తన : విచారించుకోరో యిది(వి) కులాలమెండు
సంఖ్య : 241 పుట : 163 రాగం: ధన్నాసి

ధన్నాసి

52 విచారించుకోరో యిది(వి) కులాల మెండు-
పచారాలు చూచి మీరు భ్రమయకురో. ॥ పల్లవి॥

భావింప నారదునికి బ్రహ్మపట్ట మరుదా
వేవేలైనాఁ గొంచెమని విడిచెఁగాక
దేవతలు తన్నుఁ జూచి దిగ్గన లేచి మొక్కేటి-
ఆవైభవపుపద మందెఁగాక. ॥విచా॥

మిక్కిలి జ్ఞానము గల్గి మించి తమనేరుపెల్లా
చిక్కి సంసారముపాలు సేయవలెనా
యెక్కువ హరిదాసుఁడై యిట్లానే వైకుంఠ-
మెక్కెడితోవ సాధించే దిది మేలుగాక. ॥విచా॥

మూలమని నుడిగితే ముంచి యెవ్వడు గాచెను
పోలించ నెవ్వనినాభిఁ బుట్టె లోకాలు
చాలి యెవ్వనికుక్షి నీజగము లున్నవి మరి
కాలమందే ఆ దేవునిఁ గానవలెఁగాక. ॥విచా॥

యిదియే శ్రీవైష్ణవులు యిలఁ బూర్వాచార్యులు
వెదకి చదివి కన్నవివరమెల్లా
తుదమొద లెరఁగనిదుష్టలకతలు మాని
పదిలమై యిట్టే నమ్మి బ్రదుకుటగాక. ॥విచా॥

సంకుఁజక్రములు మా (నూ?) ని సమానభోగముతోడ
అంకెల శ్రీవేంకటేశునండ నుండరో
పొంకపుబుద్ధి లిమ్మని పొంచి గాయత్రి జపించి
ఇంక బ్రహ్మవేత్త లెంచే దిందుకేకాక. ॥విచా॥241

అవతారిక:

'పచరించు' అంటే అంగడిలో సరుకులు కొని, అమ్ముట అని అర్థం. దీనినుంచే పచారీకొట్టు అనేమాట వచ్చి వుంటుంది. కులాల పచారాలు అంటే నాకులం యెక్కువ నీకులం తక్కువ అనే వాదులాటగా ఇక్కడ నప్పే అర్థం చెప్పుకోవచ్చును. ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు యేమంటున్నారంటే 'ఓ మానవులారా! ఈ సంగతి విచారించుకోండయ్యా! కాస్త ఆలోచించండి. ఈ కులాల పచారాలు చూచి మాది అగ్రకులం మాది సర్వోన్నతమైన వంశం అని భ్రమపడకండి నిజం గ్రహించండి" అంటున్నారు. నీ పూర్వ జన్మలో యెవరివో నీకు తెలుసా? లేదు. పోనీ ఈ శరీరంతో యెంత కాలం వుంటావో తెలుసా? 70 ఏళ్ళక్రిందట ఈ దీక్షితులు లేడు. ఇంకొక 10 ఏళ్ళ తరువాత వుండడు. మధ్యలో వచ్చి మధ్యలో పోయే మనకు నేను బ్రాహ్మణుడిని నీవు కడజాతివాడివి అనే విచక్షణ అవసరమంటారా? హరిదాసుడైన వాడికి వైకుంఠం దక్కుతుంది, అంతులేని మర్యాద దక్కుతుంది అంటున్నారు. తన పొట్టలో పదునాల్గు భువనాలను దాచుకొన్న నారాయణుని గాక ఇంకొకరిని ఆశ్రయించవలసిన అవసరమేమి వుందయ్యా! అంటున్నారు. అతి సాధారణంగా తోచే ఈ కీర్తన వైభవం గురించి యెంత చెప్పినా తక్కువే. జాగ్రత్తగా చదవండి మరి.

భావ వివరణ:

ఓ ప్రజలారా! యిది విచారించుకోరో (ఆలోచించుకోండయ్యా!) మీరు ఈ మెండు కులాల పచారాలు (అగ్రకులాలమనే ప్రచారం) మానుకోండి. భ్రమయకురో (ఆ పిచ్చి భ్రమలో వుండకండయ్యా!)

నారదమహాముని అంటే మిడిమిడి జ్ఞానంతో తంపులమారివాడు అనుకోకండి. మీ తెలివితక్కువతనం బైటపెట్టుకోకండి. భావింప (ఆలోచిస్తే) ఆయనకు బ్రహ్మపట్టం (బ్రహ్మపదవి) అరుదా? ఇట్లాంటి పదవులు వేవేలు (వేలకొలదీ) ఆయన వద్దనుకొని నాకు నారాయణ నామ సంకీర్తనే చాలునని కోరుకున్నాడు. మరి అందుకనే దేవతలైనా, రాక్షసులైనా, చక్రవర్తులైనా ఆయన రావటం చూడగానే 'దిగ్గున' లేచి నిలుచుంటారు, మ్రొక్కుతారు. అది వైభవం కదా! మరి వైభవమంటే ఇంకేమిటి?

మానవుడు యెంతో జ్ఞానం గడిస్తాడు, నేర్పు సంపాదిస్తాడు నిజమే. అది భగవంతుని అనుగ్రహమే కానీ వీడి గొప్పతనం కాదు కదా! అయితే వీడు తన నేర్పంతా సంసారం పాలు చేస్తున్నాడు. అది అవసరమా చెప్పండి? ఈ జ్ఞానాన్ని నేర్పునీ హరిదాసుడై వైకుంఠం సాధించడానికి వుపయోగించవచ్చును కదా! ఆ వైకుంఠపు త్రోవను పట్టుకోవటం మేలుకదా! మళ్ళీ ఇట్లాంటి జన్మ వస్తుందో రాదో తెలియదు కదా! ఉన్న సమయాన్ని వృధా చేసికోవటం న్యాయమా?

ఆనాడు, "మూలకారణంబెవ్వడు... వాని నాత్మభవునే శరణంబే వేడెదన్" అని దీనుడై విలపించిన గజేంద్రుని వంటి ఆర్తులు వేడుకొంటే ముంచి (ఆక్రమించి) యెప్పుడునూ గాచె (యెల్లవేళలా రక్షించాడు). పోలించ (యుక్తముగా) యెవ్వని నాభినుండి లోకములన్నీ వచ్చినవో, యెవ్వని కుక్షి (పొట్ట)లో జగములన్నియూ నెలకొనియున్నవో అటువంటి దేవుని కాలమందే (నీ జీవితకాలంలోనే) గానవలె (దర్శింపజేసికొనవలెను). అంతేకాని నువ్వు చచ్చాక చేయగలిగిందేమిలేదు. ఏదన్నా చేస్తే బ్రతికున్న ఈ నాలుగురోజుల్లోనే చేసికొనవలెను.

ఇదిగో, ఈ శ్రీవైష్ణవులు, వారి పూర్వాచార్యులు మొదలైన పెద్దలు శోధించి, వేదాధ్యయనం చేసి, హరి కథలు విని సర్వము నేర్చిరి. కాని కొందరు దురహంకారులు కన్నుమిన్నుగానని దుష్టులకేమైనదో చదివి తెలిసినవారు, ఆ శ్రీహరిని నమ్మిబ్రతుకుటే పదిలమని గ్రహించిరి.

శ్రీవైష్ణవ దీక్షతీసికొనినవారు తమ రెండు భుజములపై శ్రీమన్నారాయణుని శంఖము చక్రము యొక్క ముద్రలు వేయించుకొంటారు. నుదుట తిరునామము ధరిస్తారు. ఆ పిమ్మట శ్రీవేంకటేశుని అండలో (రక్షణలో) చేరి ఆయనతోపాటు సమానమైన భోగాలు (వైభవములు) అనుభవిస్తూ ఆయన అంకెల (సన్నిధిలో) వుంటారు. మరి బ్రహ్మవేత్తలైన మహానుభావులు, మాకు సుబుద్ధినిమ్ము తల్లీ! అని అనునిత్యం గాయత్రీమంత్రం చదివేది ఇంకెందుకు? ఈ జ్ఞానం కోసమే కదా! ఈ వైష్ణవులకూ దొరికే సిద్ధి అదే కదా!

సంపుటి: 3 కీర్తన : ఎన్నడు మానవు (ను) యీదుర్గుణములు యేది అవుషధము యిందుకును

సంఖ్య : 85 పుట : 57 రాగం: గుజ్జరి

గుజ్జరి

53 ఎన్నఁడు మానవు(ను) యీదుర్గుణములు యేది అవుషధము యిందుకును

కన్నులఁజూచుచుఁ జెవుల వినుచు నేఁ గనియు వినియునిదె కష్టుడ నయ్యా నేను. ॥ పల్లవి॥

హృదయములోపల దేవుఁ డుండఁగా నెఱఁగక భ్రమయుచుఁ గన్నచోటనే వెదకియుఁ గానక అనుమానించేటివేఁదురనయ్యా నేను
చెదరినజననము దుఃఖరూపమని చెప్పఁగ విని యది సుఖమని కోరుచు మది దీపమువట్టక నూఁతఁబడినమత్తునిలెనవయ్యా నేను.
॥ఎన్నఁ॥

పరమగురువులదె భక్తిమార్గమిటు ప్రాణులకెల్ల నుఁ బెట్టిపుండఁగా విరసపుటింద్రియమార్గములఁ దిరుగువీరిడినయ్యా నేను
దరిచేర్పఁగ హరినామము గలిగియు దైన్యము నొందితి సంసారములో పరుసము చేతఁబట్టక తిరిసేటిభ్రాంతునివలెనయ్యా నేను.
॥ఎన్నఁ॥

శ్రీవేంకటపతి యెదుటనుండఁగా సేవింపఁగ సంసారములోపల దావతిఁ బొరలుచు వేసరుచుండేటితగనిజడుడనయ్యా నేను
కైవశమై యీదేవుఁడే యిటు ననుఁ గరుణింపుచు రక్షింపుచు నుండఁగ పూవునుఁ బరిమళమునువలనే నేపొదలుచు నుండెదనయ్యా నేను.
॥ఎనఁ॥ 85

అవతారిక:

ఆత్మన్యూనత వైరాగ్యానికి పరాకాష్ఠ. అందులోనూ భగవంతుని యెదుట ఆత్మన్యూనత వైరాగ్య జనితమై భక్తి పరిమళాన్ని వెదజల్లుతూనే వుంటుంది. ఓ దేవుడా! నా దుర్గుణములు నేను చచ్చేదాకా నన్నువదలవు. దీనికి మందు అనేదే లేదు. కన్నులజూచిన వానిని మరువలేను. చెవుల వినినవానిని మరువలేను. కన్నవీ విన్నవీ మరువక వాటికి కట్టుబడిపోయానయ్యా! అంటున్నారు అన్నమాచార్యులవారు. దీపము చేతిలోవున్నా నూతిలోపడ్డ మత్తుడనయ్యా అని నిందించుకొంటున్నారు. సంసార సాగరపు దరిజేరుటకు నాకు హరినామము దొరికింది. కానీ నా దురదృష్టం కొద్దీ నేను మూర్ఖుడిలాగా పరుసముచేతబట్టి (బంగారము కావాలనే పిచ్చి పట్టి) భ్రాంతితో తిరిగాను. ఎంత దౌర్భాగ్యుడిని!! శ్రీవేంకటేశ్వరుని యెదురుగా పెట్టుకొని "దావతి బొరలుచు వేసరితి" అంటున్నారు. మనం 21వ శతాబ్దంలో వున్నాము కాబట్టి "హలో" అననిదే తెల్లవారదు కాబట్టి తెలుగుమాటలకే అర్థాలు వెతుక్కోవలసిన "తెగులు" పట్టింది. ఏమి చేయగలం చెప్పండి? ప్రవాహానికి యెదురీదగల మొనగాడెవడు? నీ కరుణ వుంటే పూవులను పరిమళం వదలనట్లు నిన్ను అంటిపెట్టుకొనే వుంటానయ్యా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నేను నా దుర్గుణములను యెన్నడూ మానుకోను. పోనీ వాటిని మానుకోవటానికి యేదైనా "అవుషధము" (మందు) వున్నదా అంటే అదీ దొరకటం లేదు. నా కన్నులతో జూచుచూ ఆ కన్న వాటికీ, చెవులతో వింటూ ఆ విన్నవాటికీ కట్టుబడిపోతున్నాను. అయ్యా! దిక్కుతోచుట లేదు.

ఓ అయ్యా! నా హృదయంలోపలనే, అంతర్యామి రూపంలో దేవుడు (సర్వేశ్వరుడు) వుండగా నేను యెఱుగక భ్రమకులోనై, కనబడుతున్న

చోటనే వెదకుచున్నాను. మరి నీవు ఇంకెలా కనుపిస్తావు? నేను అన్నీ అనుమానించేటి వేదురును (పిచ్చివాడిని). మరి ఇకనాకు నీవు యెలా కనుపిస్తావు? చెదరిన జననము (దుఃఖ భాజనమైన పుట్టుక) చాలా సంతాపకరమని చెప్పగా వినటమే కాని, ఆ దుఃఖములోనే సుఖాలను వెదకులాడే దౌర్భాగ్యం పట్టింది. ఇలా జరుగుతుందని వూహించలేదు. పైగా దీపాన్ని చేతిలో బట్టుకొని తిరుగుతూనే కనబడుతున్నా కూడ నూతిలో (బావిలో) పడిపోయిన మత్తుడను (మత్తుయెక్కువైపోయిన వాడను) అయినాను. ఎంత దౌర్భాగ్యుడనయ్యా!

పరమగురువులు (గొప్ప వైష్ణవ గురుపుంగవులు) ఈ విధముగా ప్రాణులందరికీ భక్తి మార్గము శ్రేష్ఠమైనదని బెట్టిరి (నియోగించిరి). మరి నేనేం చేశాను? విరసపుటింద్రియాలు (చెప్పిన మాట వినని ఇంద్రియాలు) చెప్పిన మార్గములో నడచిన వీరిడిని (అవివేకిని) అయ్యాను. దరిజేర్పగ (మోక్ష మార్గమునందించగా) నాకు హరినామము సులభముగా దొరికింది. అయినప్పటికీ నేను దైన్యము నొందితిని (దీనావస్థలోనే వుండిపోయాను). ఎందుకంటే సంసారబద్ధుడనైపోయాను. తాకినంతనే స్వర్ణమయం చేసే, పరుసము (పరుసవేదిని) చేతిలో వుంచుకొని భ్రాంతిపట్టి లేనిపోనివాటికోసం నేను తిరిగానయ్యా! ఎంత మందమతిని!!

శ్రీవేంకటేశ్వరుడు ఇన్నాళ్ళూ నా కన్నుల యెదుటనే వున్నా, సేవించక సంసారపు యావలోబడి సతమతమయ్యాను. దావతి బొరలితినయ్యా! (దుఃఖభాజనుడనయ్యాను). ఎప్పుడూ ఏదో ఒక ఏడుపే. నేను ఆ విధముగా తగని జడుడనయ్యాను (మందమతిని అయిపోయాను). అయితే, ఎట్టకేలకు నా అజ్ఞానం నశించి ఈ దేవుడే (శ్రీవేంకటేశ్వరుడే) నా కైవసమై (స్వాధీనమై) ఈవిధముగా నన్ను కరుణింపుచూ రక్షించినాడు. ఇంకా చెప్పేందుకేమివున్నది? పూవుకు పరిమళం అబ్బినట్లయింది. ఇక నేను పొదలుచూ వుండెదనయ్యా! (వర్ధిల్లుతూ వుంటాను ప్రభూ!)

సంపుటి: 3 కీర్తన : శరణాగతవజ్రపంజరుడితడు
చక్రధరుడసుర సంహారుడు

సంఖ్య : 117 పుట : 79 రాగం: ధన్నాసి

ధన్నాసి

54 శరణాగతవజ్రపంజరుఁ డీతఁడు చక్రధరుఁ డసుర సంహారుఁడు
వెరవుతోడఁ దను శరణువారివెనుబల మీతఁడే రక్షకుఁడు. ॥ పల్లవి॥

హరినామోచ్చారణఁ దెగనికర్మ మవల వేరొకటున్నదా
అరసి యెందు నమ్మికచాలక ప్రాయశ్చిత్తంబులు చెప్పుదురు
ధర నెరఁగనివా రేమనినాఁ దామసులగొడవ యేమిటికి
హరి హరి యంటే దురితము లణఁగెను అతఁడే మాకిఁక రక్షకుఁడు.
॥శర॥

శ్రీపతి దిక్కయి కావఁగ మరియునుఁ జేరనిసంపద లిఁకనేవి
చాపలబుద్ధుల(లు?) నది నమ్మక విచ్చనవిడి నోములు చెప్పుదురు
తీపులు పుట్టించి యెవ్వరేమనినఁ దెలిపి వాదడువ నేమిటికి
శ్రీపతిఁ గొలిచితి చేరె సంపదలు జిగి నితఁడే మారక్షకుఁడు ॥శర॥

అంతరాత్మ శ్రీవేంకటేశ్వరుఁడు అన్యము భజించఁ జో టేది
యింతట నమ్మక దేవతాంతరము లేఁటేఁటివో మరి చెప్పుదురు
యెంత లేదు ప్రాకృతజనముల భ్రమ యెవ్వరిఁ గాదన నేమిటికి
యింతకు శ్రీవేంకటేశుదాసులము యీతఁడే మాకిఁక రక్షకుఁడు.
॥శర॥117

అవతారిక:

శ్రీహరి వైభవాన్ని వేనోళ్ళ వినుతిస్తున్నారు తాళ్ళపాక పద కవితా పితామహులు. శరణు మహాప్రభో! అనగానే గజేంద్రుని "సిరికిన్ జెప్పక

శంఖ చక్రయుగమున్ చేదోలు సంధింపక... పరుగు పరుగున వచ్చి" కాపాడే ఆయన శరణాగత వజ్రపంజరుడు అని అన్నమాచార్యులవారు కీర్తిస్తున్నారు. అంటే వజ్రంతో చేసిన పంజరం (కవచం) ఎలా అభేద్యమై రక్షిస్తుందో అలా తన చక్రాయుధంతో ఆర్తులను వెరవుతోడ వెనుబలమై ఆదుకొంటాడట. అవతారికలోనే అన్నమయ్య కీర్తనను వివరించటం అయ్యేపనికాదు అని తేలిపోయింది కదా! "హరి" అనగానే చేసిన దుష్కర్మల ఫలితం దూరంగా తొలగిపోతుంది... అట్లా "తెగని" కర్మ అంటూ యేదన్నా వుంటుందా... అని అంటున్నారు. ఆయనే శ్రీపతి కుచేలుని వంటి కట్టబట్టలేని ఆశ్రితులకు అక్షయమైన అష్టైశ్వర్యాలను ప్రసాదించే లక్ష్మీవల్లభుడు ఈ నందనందనుడు. అంతరాత్ముడై ప్రతి ప్రాణిలోనూ నెలకొని అనుక్షణం రక్షించే ఈ శ్రీవేంకటేశ్వరుని కాదని చిల్లర రాళ్ళకు మొక్కుతువుంటే చెడిపోదువురో ఒరే ఒరే అన్న సత్యాన్ని పునరుద్ఘాటిస్తున్నారు.

భావ వివరణ:

ఇతడు (ఈ శ్రీహరి) శరణాగత వజ్రపంజరుడు (శరణుజొచ్చిన వారికి వజ్రపు కవచమువలె రక్షకుడు). చక్రధారియై అసురులను తెగటార్చి ఆర్తులను రక్షిస్తాడు. తనను శరణన్న వారిని వెరవుతోడ (ఉపాయముతో) వెనుబలమై (వెన్నెముక వలె బలవర్ధకుడై) రక్షకుడని పిలువదగిన వాడు ఇతడొక్కడే.

అవల (అటుపైన) హరినామమును ఉచ్చరించిన తరువాత కూడా తెగిపోనటువంటి కర్మావశేషము యేదైనా వుంటుందా? ఎన్నటికీ వుండదు. ఆయన గీతావాక్యము యేమని చెప్పాడు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకంశరణం వ్రజ" – అన్నాడు. అయితే నేటికీ అనన్యముగా ఆమాట నమ్మనివారు యేవేవో ప్రాయశ్చిత్తములనొనరించుతూ తమ తప్పులనుంచి

బయటపడాలని చూస్తున్నారు కాని నిజముగా శరణాగతులగుటలేదు. ధరలో హరి తత్త్వము నెరుగనివారు యెన్ని చెప్పినా తామసులతో మనకు గొడవదేనికి? హరి-హరి అంటే దురితములణగును (పాపములు నశిస్తాయి). ఇక మాకు అతడొక్కడే రక్షకుడు.

ఆయన శ్రీపతి (సిరుల రాణి లక్ష్మీవల్లభుడు). మరి ఆయనే స్వయముగా దిక్కయి కాపాడితే ఇక మనని చేరుకోని సంపదలేమైనా వుంటాయా? చాపల్యము గల బుద్ధితో అది నమ్మక యేవేవో వ్రతాలనాచరించమని, యేదేదో కర్మకాండ చెప్పి విచ్చన విడితో (సర్వ స్వాతంత్ర్యంతో) ప్రవర్తిస్తుంటారు. ఎవ్వరెవరో ఏమేమో అంటుంటే తీపులుపుట్టించే (నొప్పించే) ఆ మాటలన్నీ విని వారి పలుకులకు వివరణ వెతుక్కొని వారితో వాదించి వారి వాదన అడువనేటికి (అణచాల్సిన అవసరమేముంది?) వాళ్ళగోల మనకెందుకు? శ్రీపతిని గొలిచితే సర్వసంపదలు చేకూడుతాయి. జిగి (శోభతో) మా రక్షకుడు ఇతడే. మాకు ఇంకొకరితో పనేమిటి?

మాకు అంతరాత్మయై మా అంతరంగంలోనే ప్రతిష్ఠింపబడిన దైవం శ్రీవేంకటేశ్వరుడు ఆయనే మా దిక్కయి తోడుంటే ఇక అన్యులను ఆశ్రయించవలసిన అగత్యమేమిటి చెప్పండి. అయినా ఇదంతా నమ్మక దేవతాంతరములు (అన్యదేవతల) గొప్పతనము గురించి కొందరు పొగడుతుంటారు. ఏవేవో కథలు చెబుతుంటారు. అజ్ఞానులై ప్రాకృతజనము యేవేవో భ్రమలకు లోనై యేవేవో చెబుతుంటారు, యేవేవో చేస్తుంటారు. ఎవ్వరి నేమనగలము చెప్పండి? మేము శ్రీవేంకటేశ్వరుని దాసులము మాకు ఇక ఈతడొక్కడే రక్షకుడు.

సంపుటి: 3 కీర్తన : కనియు గానరు నీమహిమ
కౌరవకంసజరాసంధాదులు
సంఖ్య : 277 పుట : 187 రాగం: బౌళి

బౌళి

55 కనియుఁ గానరు నీ మహిమ కౌరవకంసజరాసంధాదులు
మనుజులు దనుజులఁ జంపిరనఁగ విని మరి నీశరణము చొరవలదా.
॥ పల్లవి॥

పుక్కిటనే లోకములు చూపితి పూతకిచ న్నటు దాగితివి
పక్కననే బండి దన్ని విరిచితివి బాలలు సేసేటిపను లివియా
అక్కరతో తృణావర్తు నణఁచితివి ఆఁబోతులకీ టణఁచితివి
చిక్కించి యనలము చేత మింగితి శిశువులు సేసేటిపను లివియా.
॥కని॥

తొడిఁబడ మద్దులు భువిపైఁ గూలఁగదొబ్బి యఘాసురుఁ జంపితివి
బడినే గోవర్ధనగిరి యెత్తితి పడుచులు సేసేటిపను లివియా
అదరి బ్రహ్మమాయకుఁ బ్రతిమాయలు అట్టే గడించి నిలిచితివి
పిడికిట చాణూరు నేనుగఁ గొట్టితి పిన్నలు సేసేటిపనులివియా.
॥కని॥

కాళింగునిమద మణఁచి దవ్వుగా కడగడలకుఁ బోఁజోఁసితివి
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి గో వాళుసేసేటిపను లివియా
యీలీల శ్రీవేంకటాద్రిమీఁదనే యిందరికిని పొడచూపితివి
బేలుదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసేటిపను లివియా.
॥కని॥277

అవతారిక:

శ్రీకృష్ణలీలామృతాన్ని వీనులవిందుగా వినిపిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఏదో ఒక చరణంలో ఒక కృష్ణ లీల వుండటం కద్దు. కానీ ఇలా పూర్తి కీర్తన, అందులోనూ పొడవుకి పొడవైన కీర్తన కృష్ణలీలలనే గానం చేయడం మన అదృష్టమే. శ్రీకృష్ణుని మరొక గొప్ప లీల ఏమంటే భీష్ముడు, విదురుడు, కుంతి వంటివారు ఆయన పరమాత్ముడని గ్రహించారు, కాని కౌరవులు, కంసజరాసంధాది మదోన్మత్తులైన రాజులు ఆయన లీలలు కనియు, ఆయన పరమాత్ముడని వినియు ఆయన మహిమ గ్రహించలేక ఇంద్రజాలకుడనుకొన్నారు.

మనుష్యులు రాక్షసులను ముక్కుపచ్చలారని వయస్సులో ఒక్క గుద్దుతో చంపడం యెక్కడన్నా సాధ్యమా? ఇది చేసినవాడు భగవంతుడు కాడా అని కొందరు గ్రహించి ఆయన శరణు పొందనేలేకపోయారు. కుచేలునివంటివారు గ్రహించగలిగారు కాని బ్రహ్మదేవుడు, ఇంద్రుడు కూడా భ్రమలోపడి ఆయనను వెఱ్ఱిగొల్లడిగానే పొరబడి భంగపడ్డారు. నేడు కలికాలంలోనూ సుకృతం కొద్ది ఈ తిరుమల శిఖరాలపై శ్రీవేంకటేశ్వరుడవై నిలిచి పొడచూపితివి. బేలుదనంబుల నెంచి చూడ... ఇవి పసిబిడ్డలుచేసే పనులా అని విస్తుపోతున్నారు. ఇట్లాంటి కీర్తన వివరించడం నిజంగా సుకృతమే, మరి. కొసమెరుపేమంటే ఇందులో అన్నమయ్య నుతించిన శ్రీకృష్ణలీలలు విపులంగా వ్రాయాలంటే ఒక పెద్ద గ్రంధమే అవుతుంది.

భావ వివరణ:

ఓ దేవదేవా! అజ్ఞానులు నీ మహిమను కనియు గానరు (చూసికూడా గ్రహించలేరు). ఆనాడు కౌరవులు కంసజరాసంధాదులు నీలీలలను చూచికూడా నీవు ఇంద్రజాల విద్యలు నేర్చిన గొల్లవాడివనే నమ్మారు.

మనుష్యులు రాక్షసులను చంపడం సాధ్యమయ్యే పనియేనా? ఇది విని అయినా నీ మహిమ గుర్తించి నిన్ను శరణు కోరవద్దా? ఎంత దౌర్భాగ్యులు!!

ప్రభూ! నీ లీలలు సామాన్యమైనవా? పుక్కిటనే లోకములు చూపితివి (నీతల్లి యశోదకు) నీ చిన్నారి నోటిలోనే చతుర్దశభువనములను చూపినావు. పూతన చనుబాలు త్రాగినట్లే నటించి ఆమె ప్రాణములను హరించితివి. ఒక పెద్ద బండి ప్రక్కన పడుకోబెడితే చిన్నారి శిశువుగానే అంత పెద్ద బండిని ఒక్క తన్నుతో ముక్కలు ముక్కలక్రింద చేసేశావు. ఇవేమన్నా బాలురు (పసిబిడ్డలు) చేసే పనులటయ్యా!! తృణావర్తుడనే రాక్షసుని, అక్కరతో (ఆవశ్యతకు తగినట్లు విపరీతంగా బరువు పెరిగిపోయి ఊపిరాడకుండాచేసి చంపినావు). ఆంబోతుల కీటణచితివి (కోసల రాజకుమార్తె పేరు నాగ్నజితి. ఆమె తండ్రి తన రాజ్య ప్రజలను పీడించుచున్న ఏడు ఆంబోతులను ఒకేసారి పట్టి వంచి బంధించగలిగినవానికి తన కుమార్తెనిచ్చి పరిణయము జేతునని ప్రకటించెను. శ్రీకృష్ణుడు అవలీలగా ఆ పని సాధించి నాగ్నజితిని తన ఏడవ భార్యగా పెండ్లాడినాడు). ఇది మానవమాత్రులు చేయగల పనియేనా? రేపల్లెను కార్చిచ్చు కబళిస్తుంటే ఆ అనలమును చిక్కించి (చేతితో పట్టుకొని) మింగివేశావు. ఇది శిశువులు చేసే పనియేనా? ఈ పనులు చూశాక కూడా నీవు శ్రీమన్నారాయణుడవని గ్రహించ లేకపోయారే ఇంకేం చెప్పాలి?

ఓ శ్రీకృష్ణా! నీతల్లి యశోద నిన్ను రోటికి కట్టివేస్తే దామోదరుడవైనావు. ఆ రోటిని మెల్లిగా ఈడుస్తూ, తొడిబడన్ (తొట్రుపడునట్లుగా) రెండు పెద్ద మద్ది చెట్ల మధ్యనుంచి ఆ రోటిని లాగి వాటిని నేలపై కూలదొబ్బితివి (కూలునట్లు త్రోసివేశావు). ఆ లీలతో కుబేరుని పుత్రులైన నలకూబర, మణిగ్రీవులకు నారదశాప విమోచనమునిచ్చి అనుగ్రహించావు. చిన్ని పాపడిని రోటికి కట్టేసినందుకు యశోద పశ్చాత్తాపపడి, పడిపోయిన మద్ది చెట్టును చూచి వణికిపోయిందే కాని నీలీల గ్రహించనేలేదు.

అఘాసురుడనే పెద్ద కొండచిలువ రూపంలోవున్న రాక్షసుని సంహరించావు. బడినే (దిట్టతనముతో) గోవర్ధన పర్వతము నెత్తి గోకులము నెల్ల దానిక్రింద ఇంద్రుని వడగండ్లవాన నుంచి రక్షించితివి. ఇది పడుచు కుఱ్ఱవాళ్ళు చేసేపనియేనా? బ్రహ్మదేవుడు, అడరి (అతిశయించి) నిన్ను పరీక్షించాలని మాయతో నీవు కాయుచున్న గోగణమును గోపాలురను మాయం చేశాడు. నీవేమీ తెలియనట్లే ప్రతిమాయ చేసి గోగణముగాను గోపాలురుగాను నీవే మారిపోయి, వారి వారి ఇండ్లకు వెళ్ళి అందరినీ అలరించావు. ఒక దశలో బ్రహ్మకే జరుగుతున్నదేమిటో తెలియక దిగ్భ్రమకలిగింది. చివరికి నీ కాళ్ళ బేరానికి వచ్చాడు బ్రహ్మదేవుడు. ప్రభూ! నీవు అట్టె గడించి నిలిచితివి (దేవదేవుడవు అని కీర్తింపబడితివి. నీ చిన్ని పిడికిలితో కుమ్మి చాణూరుడనే జగత్ప్రసిద్ధుడైన మల్లయోధుని కుప్పగూల్చితివి. అప్పుడే కువలయాపీడనము అనే గొప్ప మదపుటేనుగును కుంభస్థలంపై ఒకే ఒక గుద్దుతో నెత్తురు కక్కించి చంపేశావు. ఓరి నాయనో! పిల్లలు సేసేపనులు ఇవియా? ఏమి మాయకాడవయ్యా!

ప్రభూ! కాళింగుడనే సర్పరాజు యమునా నదిలో చేరి విషం కక్కుతూ నదిని విషమయం చేసి జంతువులను పక్షులను చంపుతుంటే నీవు వాని పడిగెలైనెక్కి నర్తించి నెత్తురు కక్కించి వానిమదము నణచావు. వాని భార్యల ప్రార్థనకు వానిని మన్నించి వానికి గరుత్మంతుని భయం లేకుండా వాడి పడగలమీద నీ కాలి గుర్తులు ముద్రించావు. గోలవై (ముగ్ధుడవై) యజ్ఞపురుషుడవై, యజ్ఞ హవిస్సులను దేవతలకు పంచి యజ్ఞఫలములను ఋత్విక్కులకు అందిస్తావు. గోవాళు (గొల్లవాళ్ళు) చేసే పనులు ఇవేనా? ఏమి విడ్డూరము? ఇందరికీ ఈ లీలనే కలియుగంలో శ్రీవేంకటాద్రిపై పొడచూపావు. నీవు ఆపదమొక్కులవాడవు. బేలుదనంబున (వంచనతో) యెవరన్నా నీ మొక్కు చెల్లించకుంటే వాడి భరతం పడతావు. ఇవన్నీ చిన్న పిల్లలు చేసే పనులా స్వామీ? మేమూ నీ మహిమ గ్రహించామయ్యా!

సంపుటి: 3 కీర్తన : ఏమిచెప్పెడినో శాస్త్రరహస్యము యేమిచెప్పెడినో వేదములు

సంఖ్య : 347 పుట : 288 రాగం: పాడి

పాడి

56 ఏమిచెప్పెడినో శాస్త్రరహస్యము యేమిచెప్పెడినో వేదములు
తామసమై బహునాయకమాయను తత్పమెఱంగఁగఁ దరమేదయ్యా
॥పల్లవి॥

కొన్ని జంతువులు రోసినహేయము కొన్ని జంతువుల కమృతము
కొన్ని జంతువులదివములే రాత్రులు కొన్ని జంతువులకు
అన్నియు నిట్లనె వొక్కటొక్కటికి అన్యోన్యవిరుద్ధములు
పన్నినజీవుల కేకసమ్మతము భావించఁగ మరి ఇఁకనేదయ్యా.
॥ఏమి॥

కొందరు విడిచిన సంసారము మరికొందరికి నది భోగ్యంబు
కొందరివునుకులు పూర్వులోకములు కొందరివునుకులు పాతాళంబు
అందరు నందరె వారివారిరుచు లవిగా దిది(వి?) యనరాదు
కందువజీవులు విచారించేటి కార్యాకార్యము లిఁకనేదయ్యా.
॥ఏమి॥

కొంతభూమి నటు చీఁకటినిండినఁ గొంతభూమి వెన్నెలగాయు
కొంతట సురలును కొంతట నసురలు కోరికై కొనిరి జగమెల్లా
ఇంతట శ్రీ వేంకటేశ్వర నీవే యిందరియంతర్యామివి
చింతలు వాయువు యెవ్వరిమనసునఁ జేరి నీకు శరణంటేఁగాని
॥ఏమి॥346

అవతారిక:

వేదములలో అనేక ధర్మములు చెప్పబడ్డాయి. షట్శాస్త్రములలో మరింత విపులంగా శాస్త్ర రహస్యాలు వివరించబడ్డాయి కానీ ఒకదానికింకొకటి విరుద్ధంగా వుంటున్నాయి అందులో కొన్ని బోధనలు. అటువంటప్పుడు మానవులు యే మార్గమవలంభించాలి? ఏది విడువవలెను? ఈ తత్త్వోపదేశం కూడా బహునాయకమై అప్పుడప్పుడు తామసమును ప్రోత్సహిస్తోంది. ఏది మంచో ఏది చెడో యెరుగుట యెవరితరమయ్యా! అంటున్నారు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. కొన్ని జంతువుల మల విసర్జనమే మరికొన్ని జంతువుల కాహారమవుతున్నది. కొన్ని పగలు నిద్రిస్తె కొన్ని రాత్రి నిద్రిస్తాయి. ఒకదాని బ్రతుకు ఇంకొకదానిచావు. మరి ఇది నీకు సమ్మతమా? ఒకడికి సంసారం గొప్ప ఆనందం. అది ఇంకొకడికి రోత. ఎవరి రుచి వారిది. మరిక ఉచిత కార్యమేది అనుచితకార్యమేది? భూమ్మీద కొంత (సగం) చీకటిగా వుంటే కొంత వెలుతురుగా వుంటుంది.

ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు అందరి మనస్సులలో అంతర్యామివిగా వున్నప్పటికి నీ శరణాగతులొక్కరే మనశ్శాంతితో జీవిస్తున్నారు అంటున్నారు.

భావ వివరణ:

ఓ మానవులారా! ఈ శాస్త్ర రహస్యములన్నియు, ఈ వేదములన్నియునూ ఏమి చెప్పుచున్నవో తెలియాలంటే అంత తేలిక పనికాదు. ఎందుకంటే అవి తామసప్రవృత్తి గల అనేక మందిచే నాయక మాయను (ప్రబోధింపబడినవి). అటువంటప్పుడు సరిఅయిన తత్త్వమేదో కనుగొనుట అంత సులభమైన పనేనటయ్యా? కానేకాదు.

కొన్ని జంతువులయొక్క రోసిన హేయము (అశుద్ధము) మరికొన్ని జంతువులకు అమృతము వంటి భోజ్యము. కొన్ని జంతువులు దేన్ని దివము (పగలు) గా భావిస్తూ తిరుగుతున్నాయో దాన్నే కొన్ని జంతువులు రాత్రిగా భావిస్త నిద్రిస్తున్నాయి. అన్నీ ఇదే విధముగా ఒండారులకు విరుద్ధముగానున్నవి. మరి జీవులన్నిటికీ భావించి చూచిన ఏకసమ్మతము (ఆమోదయోగ్యం) యేదయ్యా?

కొందరు యే సంసారమును రోత అని ఏవగించుకొని విడిచిపుచ్చుచున్నారో అదే సంసారము మరికొందరికి భోగ్యంబు (భోగదాయకమైన స్వర్గం). కొందరి వునికి ఊర్ధ్వలోకాలలోనైతే మరికొందరి వునికి పాతాళము మొదలైన అధోలోకములు. ఈ లోకాలలోవారు ఒకరు గొప్ప ఒకరు కాదు అని చెప్పలేము. అందరూ యెవరికివారే గొప్ప. ఇది అవుననీ అది కాదనీ అనలేము. ఇదిట్లా వుంటే జీవులకు ఉచితకార్యము అనుచుతికార్యము అని దేన్ని యెలా నిర్ణయించగలము. ఇదెట్లా సాధ్యమయ్యా? అసాధ్యము.

కొంతమేర భూమిపై చీకటి తాండవిస్తుంటే కొంత భూమి మీద వెన్నెల విఱగబూస్తుంటుంది. ఇంత జగమును ఈశ్వరుడు సృష్టిస్తే కొంత దేవతలు స్వాధీనం చేసికొనినారు కొంత అసురులు కైవసం చేసికొనినారు. వారి వీరందరి ప్రవృత్తులు వేర్వేరుగా వుంటున్నవి. ఓ శ్రీవేంకటేశ్వరా! వీరందరికీ మళ్ళీ అంతర్యామిగా ప్రవర్తిల్లుతున్నది నీవు వొక్కడవే. వీరంతా పరస్పర ద్వేషంతో అహరహరమూ, చింతతోనే జీవిస్తున్నారు. ఇక మార్గాంతరమేమిటి? ఎవ్వరు మనస్సులు నీపై నిలిపి నీకు శరణని జీవిస్తారో వారు మాత్రమే నిశ్చింతగా వుండగలరు.

సంపుటి: 3 కీర్తన : చెలగి యధర్మము పుట్టింప నీకేల మరి సృష్టింపగ నీకేల

సంఖ్య : 469 పుట : 315 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

57 చెలఁగి యధర్మము పుట్టింప నీకేల సృష్టింపఁగ మరి నీకేల
పులులను లేళ్ల నొక్క కదుపుగా పులుమేపుదురటే మాధవుఁడా
॥ పల్లవి॥

గొనకొని పాషండులదుర్భాషలక్రోధము సహింపరాదు
దనుజులపుట్టువు వారలనుచు నిజతత్వజ్ఞానము నీ వియ్యవు
అనిశముఁ జూచిన వారికి మాకును అంతర్యామివి నీవు
పెనఁచి చీఁకటియు వెలుఁగును నొకచోఁ బెంచెదవేలే ముకుందుఁడా.
॥చెలఁ॥

ఖలుల తామసపుదేవతార్చనలు కనుఁగొని యవి యోర్వఁగరాదు
నెలకొని వారలు నరకవాసులని నీమీఁది భక్తియు నీ వియ్యవు
పొలుపుగ నిందరిలోపలఁ గ్రమ్మరఁ బూజగొనేటివాఁడవు నీవే
చలమునఁ బుణ్యము పాపము నొకచో సరిచేతురటవే గోవిందుఁడా.
॥చెలఁ॥

సతతము నీదాస్యద్రోహులతో సహయోగంబును సహింపదు
క్షితిలో నీవటువంటివారలను సృజింప కేర్పడ మానవు
హితవుగ శ్రీవేంకటేశ్వర నీవే యిహపరములకుఁ గర్తవు
గతి నీశరణాగతి యని నమ్మినఁ గల విందరికిని నారాయణా.
॥చెలఁ॥469

అవతారిక:

భగవానుని సృష్టి లీలను యెత్తిచూపుతున్నారన్నమాచార్యులవారు. సర్వజనుల సద్గుణపారిజాతాలు విరబూయాలన్నదే ఆ పరమాత్మ వుద్దేశ్యమైతే అసలు చెడును సృష్టించాల్సిన అవసరమేమిటి? పోనీ చెడ్డవాళ్ళని కూడా నీవే సృష్టించావు కాబట్టి యేదో వాళ్ళదారిన వాళ్ళని పోనీరాదా? మళ్ళీ వాళ్ళని అంతా చేయటానికి యెత్తరాని జన్మలు యెత్తుతావు. అసలు పుట్టించటం దేనికి? శ్రమపడి అంతం చేయటం దేనికి? అధర్మం పెరిగితే పెరగనీ. పులులను సృష్టించితే లేళ్ళను చంపకుండా వదిలిపెడతాయా? భక్తిమార్గం నీకిష్టమైతే పాషండుల నెందుకు సృష్టించావు? చీకటి వెలుతురు కలిసివుండటం జరిగే పనియేనా? తామసులు చేసే పూజలను కూడా స్వీకరిస్తావు. నరకంలో బాధలుపడేవాడు, ఒక్కనాడు కూడా నేను చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నాననుకోడు. వాడు బాధలు పడుతున్నంతసేపూ నిన్ను నిందిస్తూనే వుంటాడు. మరి వాడి పాపం పెరగక యేమవుతుంది? వాడికీ తండ్రివి నీవే కదయ్యా? మరి వాడి గతి అలా యెందుకుపెట్టావు? నీ దాసుల్ని యేడిపించేవాళ్ళనీ నీవే పుట్టించి మళ్ళీ వాళ్ళని అంతం చేయటానికి అనేక శ్రమలు పడతావు. ఇహపరములు రెంటికీ నీ శరణాగతియే దారి అని తెలుసుకోవటానికే యెన్ని జన్మలు వ్యర్థమైనవో తెలియదు. ఏమిటిస్వామీ! నీ లీల?

భావ వివరణ:

ఓ మాధవుడా! చెలగి (అతిశయముతో) అధర్మమును పుట్టించుట నీకేల? మరి నీవు సృష్టించిన దానిని మళ్ళీ సృష్టించుట (వెల్లడియవునట్లు) చేసెదవేల? ఇదేమి పద్ధతి స్వామీ! పులులను లేళ్ళను ఒకేచోట తిరుగమని చెప్పి బలవంతమైన పులుల్ని మేపుతారటయ్యా?

ఓ ముకుందా! పాషండులను (వేదములను నిరసించే దుర్మతులు) దుర్భాషలాడి నిన్నే నిందిస్తుంటారు. వాళ్ళు క్రోధాన్ని ఏమాత్రమూ సహింపరాదు. నీవే వాళ్ళది దనుజుల పుట్టుక కాబట్టి వారికి నీవు తత్త్వ జ్ఞానమునియ్యవు. ఇదేమి విచిత్రము? ఇటు మావంటి నీ శరణాగతులకు ఆ పాషండులకూ అంతర్యామివి నీవే కదా! అనిశము (ఎప్పుడూ) ఇదియే కదా! సత్యము. చీకటిని వెలుగును ఒకేచోట వుంచటం సాధ్యమయ్యే పనియేనా? వెలుతురు వస్తూనే చీకటి మటుమాయమైపోతుంది కదా! స్వామీ!

ఓ గోవిందుడా! ఖలులు (పాపాత్ములు), తామసులు (తామస ప్రవృత్తిగల నీచులు) ఒకవేళ దేవతార్చనలు చేసినా వాటిని ఓర్వగరాదు (సహించరాదు). అవునా? వాళ్ళు నరకవాసము చేయతగినవారని నిర్ణయించి వారికి నీమీద భక్తి కలిగేటట్లు యెన్నటికీ చేయవు. అయితే, వీరందరి మతిలో తిష్టవేసికొనివారు ఆ విధంగా చేయుటకు కారకుడెవ్వరు? నీవే కదా! క్రమ్మర (మరల) వాళ్ళ పూజలు కూడా స్వీకరిస్తున్నది నీవే కదా! వీరూ, నీ భక్తులూ చేసే పనులు పాపములు పుణ్యములు అయినట్లయితే ఈ రెండిటినీ ఒకచో సరిచేతురటయ్యా? (ఒకేచోట వర్ధిల్లునట్లు చేస్తారుటయ్యా?) ఇదెక్కడి విచిత్రము!!

ఓ నారాయణుడా! నీ దాస్యము, నీ దాస్యద్రోహులను, యేనాటికీ మన్నించదు. వారి సహయోగము యేనాటికీ సహింపరానిది. పోనీ నీవు అట్లాంటి ద్రోహులను సృష్టించుట మానుకొంటావా అంటే... నీవు వాళ్ళనీ భూమ్మీద పుట్టిస్తూనే వున్నావు. అది నీవు మానుకోవు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ ఇహలోకంలో మంచి జరగాలన్నా, ఆ పరలోకంలో సద్గతి దక్కాలన్నా నీ అనుగ్రహం కావలసినదే. వీటికి కర్తవూ నీవే. అయితే, నీ శరణాగతులకు నీమీద నమ్మిక కలుగుతుంది కాని నిన్ను శరణనినివానికి ఒక్కనాటికీ నీకు నమస్కరించాలని కూడా అనిపించదు. అదే నీ మాయ.

సంపుటి: 3 కీర్తన : ఎన్నడు నేనిక బుద్దెరిగేదియీశ్వర నిను దగిలెడిది
సంఖ్య : 88 పుట : 59 రాగం: బౌళి

బౌళి

58 ఎన్నఁడు నే నిఁక బుద్దెరిఁగేది యీశ్వర నిను నేఁ దగిలెడిది
విన్నపమిదియే నీకే భారము వీని గెలువనావసమౌనా. ॥ పల్లవి॥

తగిలెడి నీనయనేంద్రియములు తగఁ జూచినయందెల్లను
తగిలెడినీశ్రవణేంద్రియములు తగినలోకవార్తలకెల్లా
మగుడఁగనేరవు జన్మజన్మలముల మనసు వీనికే సహాయము
తెగ వెన్నటికిని యింద్రియసంపద తీగెలుసొగుచు నొకటొకటి.
॥ఎన్న॥

యెక్కెడిని నానాఁటికి మదమెంతైనా నజ్ఞానమున
యెక్కెడి నీసంసారమే హరియెదుటనే మత్తాయిగొన్నట్లు
చిక్క డెంతయిన మోక్షమార్గమున జీవుఁ డిందుకే లోలుఁడు
దిక్కమెకమువలెఁ గిందికిమీఁదికిఁ దిప్పెడిఁ గర్మము దేహమును.
॥ఎన్న॥

మెఱయుచుఁ బెరిగెడి నీయాసలు గడు మీఁదమీఁద లంపటమగుచు
మఱియునుఁ బెరిగెడి పుణ్యపాపములు మలసి రాసులై పెక్కగుచు
యెఱఁగను శ్రీవేంకటేశ్వర యెంతో ఇఁక నాలోపలిదుర్గ (ర్గు?) ణములు
మఱఁగుచొచ్చితిని నేనిన్నాళ్లకు మరి నా భాగ్యము నీ చిత్తము
॥ఎన్న॥88

అవతారిక:

మానవ జీవితంలో మూడవవంతు నిద్రకే సరిపోతున్నది. మూడవ వంతు జీవన భృతి సంపాదించుకొనుటకు సరిపోతున్నది. ఈ రెండు

వ్యాపారాలలో భగవంతుని తలచుకొనే అవకాశం మానవమాత్రునకెవ్వనికీ వుండదు. ఇక మిగిలిన ఆ కాస్త సమయంలో జీవన సంగ్రామం, సంసార సుఖదుఃఖాలు, సహజీవులయెడ రాగద్వేషాలు, ఇత్యాదివన్నీ. ఇక తత్త్వచింతనకు సమయమేది? కనీసం భగవత్‌శరణాగతికి అవకాశమేది? పెద్దల అభిప్రాయమేమంటే శ్రీహరికృప యేజీవిపై కలుగుతుందో ఆ జీవి మాత్రమే శ్రీహరిని ఆశ్రయిస్తాడు. ఆయనకు కృప లేకపోతే రోజూ ఆ స్వామిని చూస్తున్నా ఒక్కరోజు కూడా ఆయనకు నమస్కరించడు. ఇది నిజం. అద్భుతమైన ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు స్వామీ! నాకు ఇంద్రియాలనిచ్చి వాటికి బానిసను చేశావు. మనస్సునిచ్చి అహంకార మమకారాలపాలుచేశావు. అజ్ఞానమునిచ్చి సంసారమత్తుని చేశావు. మోక్షమార్గం అంటే లోలత్వములేని జీవుణ్ణయినందువలన దిక్కుతెలియని మృగంలా తిరుగుతూనేవున్నాను. అదిగో అప్పుడు నీకృప కలిగి నాలోని దుర్గుణాలనుండి బయటపడి నిన్ను ఆశ్రయించాను. నా భాగ్యము నీ చిత్తము తండ్రీ! అంటున్నారు.

భావ వివరణ:

ఓ ఈశ్వరా! ఇక నేను యెన్నడు నీ బుద్దెరిగేది (నీ గురించిన జ్ఞానమును సంపాదింతును?) నేను నిన్ను యెప్పుడు దగిలెడిది (నీపై రక్తుడనైవుంటాను?) నేను చెప్పబోతున్న ఈ నాశత్రువులను గెలవటం నావలన అవుతుందా? నా విన్నపము ఇదే స్వామీ! వీటిని గెలిచే భారము ఇక నీదే.

ప్రభూ! నా గురించి యెంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. నీవు నాకు నయనేంద్రియముల (కళ్ళను) ఇచ్చావు. నేనేం చేస్తున్నాను? చూచినయందెల్లా తగిలెదను (చూచిన ప్రతిదానిమీదా రక్తిని పెంచుకొంటున్నాను.) నీవు నాకు శ్రవణేంద్రియములను (చెవులను) ఇచ్చావు. వాటితో నేనేం చేస్తున్నాను? లోకంలో నేను వింటున్న

అనవసరమైన వార్తలపట్ల ఆకర్షితుడనవుతున్నాను. జన్మజన్మముల వాసనలను మరువలేని నా మనస్సు మగుడగనేరవు (వాటినుండి ఆసక్తిని మరల్చుకోలేదు). అది వీనికే (ఈ ఇంద్రియములకే) సహాయం చేస్తుంటుంది. ఈ విధముగా ఈ నా ఇంద్రియముల సంపద (వైభోగము) ఒకటొకటి తీగెలుసాగి (లతలవలె పెనవేసుకొని, యెన్నటికీ తెగవు. వాటిని తెంపటం నావల్లనేమవుతుంది స్వామీ!

ఓ దేవదేవా! వీటికి తోడు నాకు బోలెడంత అజ్ఞానం వున్నది. దానివల్ల నానాటికి నాకు మదము యెంతైనా యెక్కువవుతోందే కాని తగ్గటం లేదు. ఓ శ్రీహరీ! మత్తాయిగొన్నట్లు (మత్తు పదార్థాలు సేవించినవాడిలాగా) ఈ సంసారపు వ్యామోహంలో తగులుకు పోయాను. ఇక నీ జీవుడున్నాడే (జీవాత్మ) వాడు ఇందుకే (ఈ సంసార సుఖదుఃఖాలకే) లోలుడై (లోనయి) యెంతయినా (యెన్నటికీ) మోక్షమార్గమున చిక్కడు. ఇంకేముంది నా కర్మము నన్ను పట్టుకొని నాదేహమును దిక్కులుతెలియని జంతువును పరుగులు పెట్టించినట్లు కిందకి మీదకి (భువి దివి మధ్య) పరుగులు పెడుతున్నది (వస్తున్నది పోతున్నది). దీనికెన్నడూ విముక్తి లేదు. ఇక నీదే భారం స్వామీ!

ప్రభూ! తళుక్ తళుక్‌మని మెరిసే నా ఆశలు పెరుగుతున్నాయేగాని తరుగుట లేదు. వాటివల్ల నాకు ఈ లంపటాలన్నీ వరుసగా తగులుకొంటున్నాయి. ఇక ఈ లంపటాల వలన నేను లెక్కలేనట్లు పాపపుణ్యాలు చేస్తూనే వున్నాను. అవి రాసుల్లాగా కుప్పలు తెప్పలుగా పెరిగిపోతూనే వున్నాయి. పాత కర్మఫలితం పూర్తిగా అనుభవించకుండానే కొత్తది "జమ" అయిపోతున్నది. తండ్రీ! నా గతేమిటి? ఓ శ్రీవేంకటేశ్వరా! యెఱగను (నేను తెలియలేకున్నానయ్యా) నాలోపలి దుర్గుణాలెన్ని వున్నాయో నా అంచనాకు అందటం లేదు. నేను ఇన్నాళ్ళకు (ఈనాటికి) నీ మరుగుజొచ్చాను (నిన్నాశ్రయించాను). మరి ఇక నీ చిత్తము నా భాగ్యము (నీదయ నా ప్రాప్తం).

సంపుటి: 2 కీర్తన : అతిసులభం బిదె శ్రీపతి శరణము
అందుకు నారదాదులు సాక్షి
సంఖ్య : 41 పుట : 28 రాగం: బౌళి

బౌళి

59 అతిసులభం బిదె శ్రీపతి శరణము అందుకు నారదాదులు సాక్షి
ప్రతిలే దిదియే నిత్యానందము బహువేదంబులె యివే సాక్షి
॥ పల్లవి॥

వేసరకుమీ జీవుఁడా వెదకివెదకి దైవమును
ఆసపాటుగా హరి యున్నాఁ డిదె అందుకుఁ బ్రహ్లాదుఁడు సాక్షి
మోసపోకుమీ జన్మమా ముంచినయనుమానములను
సేసిన భక్తికిఁ జేటు లేదు యీసేఁత కెల్ల ధ్రువుఁడే సాక్షి ॥అతి॥

తమకించకుమీ దేహమా తగుసుఖదుఃఖంబుల నలసి
అమితము నరహరికరుణ నమ్మితే నందుకు నర్జునుఁడే సాక్షి
భ్రమయకుమీ వివేకమా బహుకాలంబులు యీఁదీఁది
తమితో దాస్యము తను రక్షించును దానికి బలీంద్రుఁడే సాక్షి
॥అతి॥

మరిగివుండుమీ వో జిహ్వో మరి శ్రీవేంకటపతినుతులు
అరయఁగ నిదియే యీడేరించును అందుకు వ్యాసాదులె సాక్షి
తిరుగకుమీ విజ్ఞానమా ద్రిష్టపుమాయలకును లోఁగి
సరిలే దితనిపాదసేవకును సనకాదులబ్రదుకే సాక్షి ॥అతి॥ 41

అవతారిక:

భక్తిరస ప్రధానమైన చక్కటి కీర్తననందిస్తున్నారు అన్నమాచార్యుల వారు. దీనినాస్వాదించి తరిద్దాం. భక్తి మార్గంలో పరమాత్ముడైన

శ్రీమన్నారాయణుని కృపను పొందినవారలనేకులున్నారు. నారదుడు, ప్రహ్లాదుడు, ధ్రువుడు, అర్జునుడు, బలిచక్రవర్తి, వ్యాసుడు, సనకసనందనాది మహర్షులు ఇత్యాదులంతా సాక్షి అంటున్నారు అన్నమయ్య. నవవిధభక్తిమార్గములంటే – శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మనివేదనము. ఒక్కొక్కరు ఒక్కొక్క విధానమునెన్నుకొని పరమాత్మకృపను పొందారు. దారి యేదయినా గమ్యం ఒక్కటే అని నిరూపించారు. ఈ కీర్తన ప్రత్యేకత యేమంటే... భక్తి మార్గాలలో తారతమ్యమున్నా గమ్యం ఒక్కటే అని చెబుతున్నప్పటికీ ఆత్మనివేదనము అనే శరణాగతి సర్వశ్రేష్ఠము అని పెద్దలు చెబుతారు. అలనాడు గజేంద్రుడు యెన్నుకొని ముక్తిని పొందిన మార్గమదే. "నీవే తప్ప నితఃపరంగబెరుగ, మన్నింపన్ దగున్ దీనునిన్" అని మొరబెట్టి వేడితే... "సిరికిన్ జెప్పక, శంఖచక్రయుగమును కూడా చేబట్టక" పరుగు పరుగున వస్తాడట పరమాత్మ. కాకపోతే చిక్కొక్కటే ఆయన మనం గుర్తుపట్టే, నామాలయ్యరూపంలో రాడు. ఆయన యే రూపంలో యెప్పుడు యెట్లా రక్షిస్తాడో వూహకందదు. ఇది సత్యం. హిరణ్య కశిపుడు ప్రహ్లాదుని ప్రశ్నిస్తాడు, "ఏమిరా నిన్ను ఆ శ్రీహరి రక్షిస్తాడుటురా" అని. ప్రహ్లాదుడంటాడు "మరి? నన్నెవరు రక్షిస్తున్నారనుకొంటున్నావు?" ఇదీ భక్తి అంటే. నమ్మకం. ఆ తిరుమలయ్యను నమ్మండి చాలు.

భావ వివరణ:

ఇదె (ఈ మార్గమే) అతి సులభము. అదే శ్రీపతి శరణము (శరణాగతి). అందుకు సాక్షులు వేరేవ్వరో కాదు. నారదుడు మొదలైన వారే సాక్షి. ఈ శరణాగతి ప్రతిలేనిది (సాటిలేనిది). ఇదియే నిత్యానందము (సదా ఆనందమునిచ్చునది). వేదములన్నియూ ఇవే సాక్ష్యమై ఈ విషయాన్ని సమర్థిస్తున్నాయి.

ఓ జీవుడా! దైవమును వెదకి వెదకి వేసరకుము (శ్రమపడవద్దు). ఆ శ్రీహరి, ఆసపాటుగా (నీపై గొప్ప ఆపేక్షతో) వున్నాడు. అందుకు సాక్షి

వేరెవ్వరో కాదు... స్వయంగా ప్రహ్లాదుడే సాక్షి. ఓ జన్మమా! మోసపోవద్దు. శ్రీహరిని యెంత సేవిస్తే అంత ఫలితముంటుంది. నీ భక్తిలో ముంచిన అనుమానములుంటే (అసంఖ్యాకమైన అపనమ్మకములుంటే) అది భక్తికి చేటు. దీనికి సాక్ష్యమెవరో తెలుసా ధ్రువుడు అనే ముక్కుపచ్చలారని బాలుడు. అతడు నారాయణుని దయనెంత పొందాడంటే ధ్రువమండలంలో "తార"యై జగద్విఖ్యాతుడైనాడు.

ఓ దేహమా! తమకించకుమీ (తొందరపడవద్దే). సుఖదుఃఖాలు జీవికి అనివార్యము. అవి వస్తూనే వుంటాయి పోతూనే వుంటాయి. నమ్మితే ఆ నరహరి కరుణ, అమితము (అంతులేనిది). అందుకు సాక్షి వారూ వీరూ కాదు. స్వయంగా అర్జునుడే సాక్షి. ఎన్ని బాణం దెబ్బలు తిన్నాడు ఎంత గాయపడ్డాడు తన సఖుని కోసం? ఓ నా వివేకమా! బహుకాలంబుల ఈ సంసార సాగరాన్ని ఈది ఈది ఇక నీవల్ల కాదని భ్రమపడవద్దు. శ్రీపతి దాస్యమును చేబూనుము. తమితో (ఆసక్తితో) నీవాపని చేస్తే నిన్ను శ్రీపతి తప్పక రక్షిస్తాడు. ఇందుకు బలిచక్రవర్తియే సాక్షి. నారాయణుడే ఆయనకు కావలివాడై రక్షిస్తున్నాడంటే ఈ దాస్యభక్తికి సాటి వున్నదా?

ఓ జిహ్వా! (ఓ నాలుకా!) మరి (ఇంకా) ఈ శ్రీవేంకటేశ్వరుని నుతుల పట్ల (కీర్తనలపట్ల) మరగివుండుము (వ్యసనపడుతూ వుండుము). అరయగ (చూడబోతే) ఇదొక్కటే నిన్ను ఈడేరించును (తరింపజేయును). ఇందుకు సాక్ష్యమెవరో తెలుసా చతుర్దశ పురాణాలను క్రోడీకరించిన వ్యాసమహర్షి మొదలైన గొప్ప గొప్ప ఋషులు. ఓనా విజ్ఞానమా! ద్రిష్టపు మాయలకు (కుశంకలను కలిగించు ఆ దేవదేవుని మాయలకు) లోగి (లోనయి) తిరగకుమీ (దిమ్మరిలాగా తిరుగవద్దు). ఈ శ్రీవేంకటేశ్వరుని పాదసేవకు సరిలేదు (సమానమైనది లేనేలేదు). దీనికి స్వయంగా సనకాదులబ్రతుకే సాక్షి. నేటికీ ఆ సనక సనందనాది ఋషులు అదృశ్యరూపులైవచ్చి ఆ ఏడుకొండలవాడిని సేవిస్తూనేవున్నారు.

సంపుటి: 2 కీర్తన : ఎట్టిదో మీమాయావిలాసము యెఱిగిన నెఱగనీదు

సంఖ్య : 293 పుట : 196 రాగం: లలిత

లలిత

60 ఎట్టిదో మీమాయావిలాసము యెఱిఁగిన నెఱఁగనీదు
అట్టె మాగురుననుమతినే ప్రత్యక్షమవైతివిగాని ॥ పల్లవి॥

కరుణాకరా మిమ్మునుఁ గని తెలియఁగలేను
ధర మీ మహిమలు వినివిని తగ నరుదందుదును
నరహరి నీవు నాలో నుండఁగ నమ్మక పురాణకథలందు
అరయఁగ మీచరితలు చెప్పఁగ నాసతోడ మిముఁ దలంతును ॥ఎట్టి॥

జగదీశా మీనామంబులు జపించనలయుదును
వెగటుగ నీచిత్రసృష్టి చూచి మిము వెదకుదు నింతటను
నగధర మీపై భక్తి సేయఁగ మనంబున నొడఁబడను
పగటున మీరిచ్చువరములకొరకే పలుమారు
మీకు మొక్కుకొందును ॥ఎట్టి॥

శ్రీవేంకటేశా నీమూరితి చింతించి చేపట్టఁగలేను
దేవుఁడ వనియెడువిశ్వాసమునకే తిరముగఁ గొలిచెదను
శ్రీవనితాధిప వేదాలు మిమ్మునుఁ జెప్పఁగా నే తర్కింపుదును
వేవేలుపరుషలు సేవింపఁగ నీవే కర్తవని నిశ్చయింతును ॥ఎట్టి॥293

అవతారిక:

ఇది ఈ "పొడవుకు పొడవైన పురుషోత్తమా"! అనే, అన్నమాచార్యులవారి సంకీర్తనా యజ్ఞంలో 11వ సంపుటములోని

"షష్ఠిపూర్తి కీర్తన". ఈనాడు నా ఆనందం వివరించటానికి నా భాషా జ్ఞానం చాలదు. భగవదేచ్ఛ అన్నట్లు ఈ కీర్తనల ఈనాటి నా మానసిక స్థితిని ప్రతిబింబిస్తున్నది. ఆనందం కృతజ్ఞత కన్నీరు ఉప్పెనలావస్తున్నాయి. ఆ శ్రీనివాసుని నేను యేమని పొగడను? పనికిరాని గడ్డిపువ్వువంటి నాకు ఆయన పాదాలవద్ద చోటిచ్చాడు. ఇంకా కొన్నాళ్ళు బ్రతకటం కాదు నా కోరిక ఈ నా జన్మలోని లోపాలనన్నింటినీ మన్నించి నా ఆత్మ తిరుమల శిఖరాలపై తిరిగి తిరిగి ఏనాటికైనా శ్రీవేంకటేశ్వరుని వద్ద స్థిరపడితే నేను కోరేదింకేమీ లేదు. అదే నాకు ముక్తి ఈ కీర్తనలో అన్నమాచార్యులవారు శ్రీహరితో అంటున్నారు "ప్రభూ! మీ మాయావిలాసము యెటువంటిదో యెఱిగిన నెఱగనీదు... ఆవిధంగా మా గురువులు శ్రీరామానుజులవారి అనుమతి మూలంగానే మీరు మాకు ప్రత్యక్షమయ్యారు" అంటున్నారు. గురుకృపలేనిదే ఈశ్వరునెరుంగుట దుర్లభము. ఆయనకృప లేకపోతే ఎన్నిసార్లు తిరుమల వెళ్ళినా కనబడేది విగ్రహమే, దేవుడు కాదు. ఆ స్వామిని చూచికూడా దర్శించనట్లే. ఓ దేవదేవా! వేదము చదివినా నీ వునికిని తర్కించే దౌర్భాగ్యుడను. అందుకే నీ మూర్తిని చూస్తూ మనస్సులో చింతించి నిలుపలేక పోతున్నాను నీవే దేవుడవనే స్థిరమైన విశ్వాసంతో నిన్నే కొలిచెదను. నీకృప లేక నేను నిన్నెట్లు "చూడగలను" స్వామీ! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! మీమాయావిలాసము యెట్టిదో యెఱిగిన నెఱగనీదు (తెలియాలంటే తెలియనీయదు). అట్టే (ఆవిధంగా) మా గురుని అనుమతినే (మా గురువు శ్రీరామానుజులవారి కృపతోనే) నీవు ప్రత్యక్షమైతివి గానీ, నిన్ను దర్శించుట మా తరమా?

ఓ కరుణాకరా! మిమ్మల్ని యెదురుగా చూస్తూ కూడా మిమ్ము తెలుసుకోలేకున్నాను. మీ మహిమలను గురించి వినికూడా ఆఁ పోదూ ఇవన్నీ అరుదు (జరిగేవికావు) అంటుంటాను. ఓ నరహరీ! నీవు నాలోనే వున్నావని పెద్దలంటుంటే నమ్మక పురాణ కథల్లో చెప్పినట్లు నీవు వుంటావని నిన్ను అలా దర్శించాలని ఆశతో తలంచెదను ఇక నాకు నిన్నెరుగుట యెట్లు సాధ్యపడుతుంది?

ఓ జగదీశ్వరా! కాసేపు నీ నామము స్మరించే సరికే నాకు విపరీతమైన అలసట వచ్చేస్తున్నది. చిత్ర విచిత్రమైన మీ సృష్టి చమత్కారాన్ని చూచి మీ తత్వాన్ని గ్రహించాలని ప్రయత్నిస్తాను. ఇంతటా (ఈ సృష్టిలో) మిమ్ము వెదుకుదును. కాని నిన్ను కనుగొనలేను. ఓ నగధరా! నీపై భక్తి నిలుపుదామంటే మనస్సు పరిపరివిధాల పోతుందేకాని నిన్ను ఒడబడదు (అంగీకరించదు). ఎంతసేపూ నీవేదో వరాలిస్తావనే ఆశతోనే అనేకమార్లు మీకు మ్రొక్కుతానుకాని నిజమైన నిస్వార్థ భక్తితో కాదు. ఇక నేను ఏవిధంగా మోక్షానికి అర్హుడినయ్యా?

ఓ శ్రీవేంకటేశ్వరా! మీ మూర్తిని చింతించి (ధ్యానించి) చేపట్టనశక్తుడను. అయినా నీవే దేవుడవనే స్థిరమైన విశ్వాసంతో నిన్ను కొలిచెదను. ఓ శ్రీవనితావల్లభా! నీవు ఇటువంటి వాడివని వేదము స్పష్టముగా చెబుతుంటే నేను పనికిరాని తర్కములను చేస్తుంటాను. వేవేల పరుషలు (అసంఖ్యాకులైన పురుషులు) నిన్ను సేవించుటకు కర్తవు (కారణభూతుడవు) నీవేనని గ్రహించితిని. అంతయు నీవే హరి పుండరీకాక్షా! అయినా నిన్ను ఇదమిద్ధంగా నెఱుంగుట నా తరమా! శ్రీహరీ! శరణన్న వానికి నీ అంతట నీవే తెలుస్తావు. అంతే మరి.

సంపుటి: 2 కీర్తన : ఇప్పుడే నేనొడబడ మరువగ దగదు జెప్పితి
సంఖ్య : 302 పుట : 202 రాగం: సామంతం

సామంతం

61 ఇప్పుడే నే నొడఁబడ మరవఁగఁదగదుజెప్పితి యెల్లనాఁడు
నెప్పున నేనెంతకల్లరినైనా నీదాసుఁడనని యందురుగా ॥ పల్లవి॥

మఱతునో తలఁతునో నిన్ను మాఁటల నేతప్పు గలుగునో
యెఱఁగక నీదాసులఁజూచి యేమని పలుకుదునో
నెఱసిననాకర్మఫలంబులు నీకు సమర్పణ సేసితిని
మఱి నామీఁదట నేరము లెంచక మాధవ నన్నిటు రక్షించవే ॥ఇప్పు॥

అలతునో సొలతునో నే నీయందు భక్తిసేతునో సేయనో
యెలమిని నీకు నివేదించక యేమేమి భుజియింతునో
తలఁచేటినామనసే నీకును ధనముగాఁ గప్పము వెట్టితిని
పలుమరు నన్నును తగవుకుఁదియ్యక పరమాత్మా ననుఁ గావఁగదే
॥ఇప్పు॥

నేరనో నేర్తునో నీకైంకర్యము నేమము నేమేమి మానితినో
నీరూపము నే సేవించి యొక్కడనే సనుమానించితినో
మేరతోడ మావారు చెప్పఁగా మిమ్మింతట నే నమ్మితిని
వారిఁ జూచైన శ్రీవేంకటేశా వరదుఁడవై మము మన్నించఁ గదవే
॥ఇప్పు॥302

అవతారిక:

'కల్లరి' అంటే అబద్ధాలకోరు అని అర్థం. చీటికిమాటికీ చిన్న చిన్న అబద్ధాలు చెప్పటం నాకు అలవాటయింది స్వామీ కాని నేను నీ దాసుడినయ్యా! దాసుడి తప్పులు దండముతో సరి అంటారు కదా! ఇక దండన మాటెందుకు? నేనెంత కల్లరినైనా, ఇది ఆరువందల సంవత్సరాలనాటి తెలుగు. అందువల్ల కొద్దిగా పదప్రయోగంలో తికమక

అంతే. ఓ ప్రభూ! నాలోని లోపాలనన్నింటిని నాడే నీకు మనవి చేసికొన్నాను. ఇప్పుడు నీవు నన్ను వదిలివేస్తే నేనేమైపోతానయ్యా? నేను నీ ఒడబడను (నీవెలా చెబుతే అలా చేసేస్తుంటాను). నన్ను మరువతగునా స్వామీ? అంటున్నారు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. అలాగని నాలో దుర్గుణాలను చూచి సమర్థించమనికూడా చెప్పలేను. ఒకవేళ నావల్ల తప్పు జరిగినా నేరము లెంచక నన్ను రక్షించు. ఈ రోజంటే నాకు శక్తి వున్నది. తెల్లవారితే జీవించి వుంటానో లేదో తెలియని బ్రతుకునాది. ఈనాడు లక్ష్మీపతివైన నీకు నేనేమి ధనమీయగలను, యెంతని యీయగలను? అందుకని నా మనస్సునే నీకు కప్పముగా (టాక్స్) కట్టేస్తాను. ఇంకా నన్ను వెలివేసి నాతో పోట్లాడితే నేనేమి చేయగలనయ్యా? నీ కైంకర్యమునకు నీ ఆగమాలు యెన్నో విధానాలను పెట్టాయి. నియమాలను విధించాయి. మా గురువులు నీవు దీనజనరక్షకుడవని నీపై నమ్మకం తప్ప నీవు మానుంచి అన్యమేమీ ఆశించవని చెప్పారు. అదిమాత్రం చేయగలను ప్రభూ! నన్ను యేమిచేసినా నీ ఇష్టం. వాళ్ళను (మా గురువులను) చూచి అయినా నన్ను రక్షించు తండ్రీ! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నాడు (ఇదివరకే) యెల్లనేను చెప్పితి (నీకు చెప్పుకొన్నాను). ఇప్పుడు నేను నీ 'ఒడబడను' (దాసుడను). నన్ను మఱవదగదు నేను నెప్పున కల్లరిని (ఏదో ఒక ఉపాయంతో నేను అనేక అబద్ధాలు చెప్పే అలవాటువున్నవాడిని). అయినా నన్ను నీ దాసుడు అనే కదా! అంటారు. అందుకని యేదోవిధంగా నీవే నన్ను అనుగ్రహించాలి.

నిత్యజీవితంలో పెద్దపెద్దవాళ్ళే అనేక తప్పులు చేస్తున్నారు, ఇక నేనెంత? నిన్ను తలతునో మరతునో తెలియదు. అనుకోకుండా నీ గురించి యేమన్నా తప్పు మాట్లాడతానేమో? ఒకవేళ నీదాసులను యేమైనా పొరబాటున అని నొప్పిస్తానేమో? నీవు ఆనాడు గీతలో

చెప్పినట్లు నా కర్మఫలములన్నీ నీకే అర్పణ చేసేను. ఓ మాధవా! ఇంకా నన్ను దోషము లెంచక రక్షించు స్వామీ!

నేను కూడా మానవమాత్రుడనైనందుచేత త్వరగా అలసిపోవుట నాకు సహజము. సరిగ్గా తగిన సమయానికి నేను నా ప్రేమను భక్తినీ నీపై ప్రకటించగలనో లేదో? నాకు అనారోగ్యంవల్లనో మరెందుచేతనో నీకు నివేదించకనే (నైవేద్యం పెట్టకుండానే) భుజిస్తానో యేమో? ఒక్కొక్కప్పుడు అతి సంతోషంలో నన్ను నేను మరచి కూడా నేనా పొరబాటు చేయవచ్చును. అందుకనే తలచేటి నా మనస్సును (ఆలోచించగల నా మేధస్సును) నీకు ధనముగా కప్పము కట్టితిని స్వామీ! ఓ పరమాత్మా! పలుమరు (చీటికీమాటికీ) నన్నును తగవుకు దియ్యక (నాతో పోట్లాట పెట్టుకోకుండా) నన్ను గావగదే (సంరక్షింపుము స్వామీ!)

ప్రభూ! నేను నీకు కైంకర్యము (ఊడిగము) చేసేమాట వాస్తవమే. కానీ అందులోని నేమములన్నింటినీ (నియమములన్నింటినీ) సరిగా అనుసరిస్తానో లేదో, ఒకవేళ కష్టము అని మానివేస్తానేమో? నీ రూపమునాయెదుట వున్నా, నిన్ను సేవిస్తానో లేక అనుమానముతో దీనివల్ల నాకేమి ఉపయోగమని సరియైన సమయానికి విడిచిపెడతానేమో? మేరతో (క్రమక్రమముగా) మావారు (వైష్ణవగురువులు) చెప్పగా చెప్పగా మిమ్ము (దేవదేవుడవైన నిన్ను) నేను నమ్మితిని. ఓ శ్రీవేంకటేశ్వరా! నేనెటువంటివాడనైనా, వారిని (మా గురువులని) చూచియైనా నీవు వరదుడవైనందున మమ్ము మన్నించగదవే (క్షమించరాదుటయ్యా?) పోనీ వీడు కల్లరిలే అనుకొని అయినా నన్ను మన్నించు తండ్రీ!

సంపుటి: 19 కీర్తన : మానరా నవ్వు మానరా వద్దు మానరా
సంఖ్య : 403 పుట : 269 రాగం: సామంతం

సామంతం

62 మానరా నవ్వు మానరావద్దు మానరా
మాతో మానరా యేల మానరా నీవు
మానకుంటే నిన్ను నిందకు వినగా
మాటల దిద్దిక మానరా ॥పల్లవి॥

వారివీరితోడ వావులు చెప్పెంపే-
వట్టిదోసమేల కట్టేవురా
తేరకొన నన్నుఁ జూచి వట్టి యాస-
దేర నుస్సుర నేఁటికి రా
పోరి పోరి నీవే నిజమరి నంటా
బొంకుచు నన్నేల ముట్టేవురా
కోరి వూరకున్నవారి కింతేసి-
కొడిమె లేఁటికి వచ్చీరా ॥మాన॥

చక్కనివారికి నీయెదుట నే॥పల్లవి॥డు
సారె నిలువరాదటరా
వొక్కమాఁటలోనే నీవింత గరఁగి
వొళ్లు చెమరించనేఁటికిరా
చిక్కనిచన్నులు నాకుఁ గలిగితే
చింతఁ బొరలఁగక నీ కేలరా
మొక్కలాన నీవు సేసేరోఁతలకు
మొదలనే నాకు సిగ్గవురా ॥మాన॥

కారణములేక వూరివారితోడ
కాలుదొక్క నేలవచ్చేవురా
నీరువంక తుంగవంటీవాఁడ వింతే
నీతోడిపొందుకు నేనోపరా
కూరిమితోడుత శ్రీవేంకటేశ్వర
కూడితివి నిన్ను నేమందురా
కోరినకోరికలెల్లాఁ దలకూడె
గోరనన్ను నూఁదనేఁటికిరా **॥మాన॥403**

అవతారిక:

ఈ సరస శృంగార కీర్తనలో అన్నమాచార్యులవారు నాయికయై నాయకుడైన స్వామివారితో తనతో యెగతాళిగా నవ్వటం మానమని ప్రాధేయపడుతున్నారు. నీ మాటలతో మమ్ము హింసించటం మానమని అంటున్నారు. అలనాటి జానపద తెలుగు అయినందువలన ఈ కీర్తన అంత తేలికగా అర్థంకాదు. వారితోటి వీరితోటి వాపులు చెప్పి పంపేవు. అట్టి దోసముయేల కట్టేవురా అని అడుగుతున్నారు. కోరి వూరకున్నవారితో ఇంత కొడిమెలేటికి వచ్చీరా అని అడుగుతున్నారు. కాస్త అందంగా కనబడితే ఆమెనీయెదుట నిలువరాదటరా? ఒక్కమాటతో నన్ను కరిగించి వేస్తావే నీకిటుకులు వ్యూహాలు నాకు తెలియవని అనుకొంటున్నావా? అసలే నాకు సిగ్గు ఎక్కువ. దానికితోడు నీ ప్రవర్తన శృతిమించుతున్నది. నిష్కారణంగా వూరి వారితో కాలుదొక్కనేలరా అని నిష్కారంగా అంటున్నారు.

ఓ శ్రీవేంకటేశ్వరా! కూరిమితో నన్ను కూడినావు ఇక నేను కోరిన కోరికలన్నీ తలకూడినవి. ఇంకేమీ కోర నన్ను నూదనేటికిరా అని ప్రశ్నిస్తున్నారు. ఇదీసంగతి. ఆనాటి తెలుగుకు ఈనాడు నిఘంటువులవసరమయ్యాయి. ఏమి చేస్తాం చెప్పండి? ఆనాటి తెలుగు మాటలు నేటి నుడికారంలో యెలామారిపోయాయో గమనించండి.

భావ వివరణ:

ఓ ప్రియా! నీకొంటె నవ్వులు మానరా, మాతో ఈ విరసము నీకు దగదు, ఇదంతా యెందులకు? నీవు నీ ప్రవర్తన మార్చుకోకుంటే, మేము

నీపై నిందలను సహింపలేము. ఇంకా నీవు నీ మాటలతో శిక్షించుట మానరా! మా మాటలు వినరా!

నీవు వారితో (వారితోను, వీరితోను) వావులు చెప్పంపేవు (నీకు నాకూ యేదో వావీవరుసా వుందని అందరికీ చెబుతున్నావు. అట్టి దోసమేల కట్టేవురా (అటువంటి తప్పుడు మాటలు యెందుకు చెబుతున్నావయ్యా? నన్ను తేరకొనచూచి (తేరిపారచూచి) వట్టియాస (వ్యర్థమైన ఆశ)తో, వుస్సురనయేటికిరా (వుస్సురుమని నీవు నిట్టూర్చడం వలన ప్రయోజనమేమిటి?) పోరిపోరి (పోయిపోయి) నీవే నిజమరినంటా (సత్యహరిశ్చంద్రుడనన్నంతగా) బొంకుచు (పచ్చి అబద్ధాలు చెబుతూ) నన్నేల ముట్టేవురా (నన్నెందుకు తాకుతావయ్యా?) కోరివూరకున్న వారితో కొడిమెలేటికి వచ్చీరా (పాపపు కొంటెపనులు యెందుకు చేస్తావయ్యా?)

నేడు (ఈనాడు) చక్కనివారు నీ యెదుట నిలువరాదటరా (అందమైన ఆడది నీ కళ్ళలో పడకూడదటయ్యా?) నీవు అందగాడవే వొప్పుకుంటాను. అంతమాత్రాన నాబోటి బేలను కరిగించి (మైమరపించి) నా ఒళ్ళు చెమర్చునట్లు చేయవలెనా? నాకు చిక్కని చన్నులు కలిగితే (బింకమైన స్తనయుగ్మమున్నంతమాత్రాన) నాగురించిన చింత నీకెందుకయ్యా? మొక్కలాన (మోసపూరితంగా) నీవు చేసే రోత కలిగించు పనులు తలుచుకుంటుంటేనే నాకు అంతులేని సిగ్గు కలుగుతుందయ్యా!

ఓ రసికశిఖామణీ! నిష్కారణంగా వూరివారితో (పరాయివారితో) కాలుదొక్కనేలవచ్చేవురా (దగ్గరవుతావెందుకురా?) నీవు నీరువంక తుంగవంటివాడవు (నీటిలో కొట్టుకుపోయే కట్టెపుల్లలలాంటివాడివి). నీకు స్థిరత్వం లేనేలేదు. నీతోటి పొందు వద్దనే వద్దు. నిన్ను నేనేమాత్రం సహించలేను. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నన్ను కూరిమితో (ప్రేమతో) కూడితివి (చేరువయితివి), నిన్ను నేనే మనగలనయ్యా! నేను కోరుకున్న కోర్కెలన్నీ నెరవేరినవి. కోరనన్నున్ ఊదనేటికిరా (నాకు యేల ఈర్ష్యను కలిగింతువయ్యా!)

సంపుటి: 2 కీర్తన : ఉపకారిదేవుడు అపకారిగాడు
సంఖ్య : 384 పుట : 258 రాగం: గుజ్జరి

గుజ్జరి

63 ఉపకారి దేవుఁడు అపకారి గాఁడు ॥ పల్లవి॥

దేహం బొసఁగెను దేవుఁడు తనుఁ దెలియఁగ శాస్త్రము గడియించె
దేహాంతరాత్ముఁడు మరి దేహచైతన్యుఁడా దాను
దేహి యేలోకంబున కేఁగిన దేవుఁడు దా వెంటనే యేగును
దేహి కోరినట్టే కమ్మర దేవుఁ డనుమతి ఇచ్చీఁగాన ॥ఉప॥

చేయుటకును చేయకమానుటకును జీవుఁడు స్వతంత్రుఁడాయంటేను
కాయపుసుఖములు గోరఁగఁ గర్తట కడగనుటకుఁ గర్తగాఁడా
యాయెడ నాయెడ నంతర్యామే యిన్నిటికినిఁ బ్రేరకుఁ డింతే
దాయక పాయక తనతలఁపుకొలఁదీ దైవమేసృజియించీఁగాన ॥ఉప॥

ఇవి యెఁరిగి చిత్తమా నీ వితనందే అభిరతి సేయుము
సదయుఁడు మనశ్రీవేంకటగిరిసర్వేశ్వరుఁడు సత్యుఁడు
మొదలనే యీయర్థము కిరీటితో మొగి నానతి ఇచ్చినాఁడు
అదే "సమోऽహం సర్వభూతేషు" అని గీతలో నున్నది గాన
॥ఉప॥ 384

అవతారిక:

కొంతమంది అజ్ఞానులు అద్భుతమైన భగవద్గీత భగవత్తత్వాన్ని చెబుతుంటే దాన్ని వక్రీకరించి దేవుడు యేదో కఠినాతి కఠినమైన శిక్షలనమలు చేసే న్యాయాధిపతి అని దయా దాక్షిణ్యాలు లేని "ఎక్జిక్యూషనర్" అనే అభిప్రాయం కలిగిస్తుంటారు. ఈ కీర్తనలో

అన్నమాచార్యులవారు అది తప్పు అభిప్రాయమనీ, దేవుడు ఉపకారియే కాని పగసాధించే అపకారి కాదని బోధిస్తున్నారు. ఏ కారణం వల్లనో కానీ తరచుగా రెండు చరణాలుండవలసిన "పల్లవి'లో ఒక్క చరణం మాత్రమే వున్నది. దీనికి నేడు మనం చేయగలిగిందేమీ లేదు. ఎక్కడెక్కడో తిరుగుతున్న ఆత్మకు తగిన దేహము నిచ్చు జన్మనిచ్చేవాడెవరు? దేవుడే కదా! అంతేకాదు వాడికి జ్ఞానం కలిగించి శాస్త్రము నేర్పి అనుక్షణం అంతర్యామివలె మంచిచెడ్డలు విడమరచి దేహి వెంటనే వుంటూ వాడి ప్రాణోత్కర్షణ దాకా వాడి (జీవుడి) వెంటనేవుండే వాడే దేవుడు. అంతెందుకు వాడికి రాబోయే జన్మకూడా వాడి ఆఖరిక్షణపు ఇచ్ఛ ప్రకారమే వస్తుందంటున్నారు. అన్ని జీవులలోనూ వుండేది శ్రీవేంకటేశ్వరుడే కాబట్టి ఓ చిత్తమా! నువ్వు ఇతనంటే అభిరతి (ఆపేక్ష) చేయుము అని బోధిస్తున్నారు. ఇది నేడు అన్నమయ్య చెబుతున్నమాటకాదు, స్వయంగా పరమాత్మే కిరీటి (అర్జునుడి)తో చెప్పాడు "సమోऽహం సర్వ భూతేషు" అని. అన్ని జీవులలోనూ అంతరాత్మగా నేనేవున్నానని ఆ గీతావాక్యానికి అర్థం.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ఇది గ్రహించండి సర్వేశ్వరుడైన ఆ దేవుడు మన తండ్రి. ఆయన మనకు ఉపకారిమాత్రమే, అపకారి యెన్నటికీ కాడు.

మనం తల్లి కడుపులో ఈ రూపంతో "పడుతున్నామా? లేదే స్త్రీ పురుష జీవకణాలసంగమం మూలంగా పిండోత్పత్తి జరుగుతోంది. దానికి మనం కర్తలం కాదు కదా! మరి మనతల్లి కడుపులోనే మనకు ఒక దేహము నిస్తున్నదెవరు? దేవుడే కదా! తల్లి కడుపులో వుండగానే ఈ జీవుడికి శాస్త్ర జ్ఞానమును బోధిస్తున్నదెవరు? ఆ దేవుడే. పిండరూపి ఒక ప్రాణి ఆకారం దాల్చిన తరువాత ఆ ఆకారంలోకి ప్రాణాన్ని జొప్పించేదెవడు? ఇంకెవరు

ఆ సర్వాంతర్యామే కదా! అప్పుడు ఆ బిడ్డ అమ్మకడుపులో కదలుతూ గర్భవాస నరకాన్ని అనుభవిస్తుంది. ఇక ఆపై ఆ దేహి యేలోకం వెళ్ళితే దేవుడు కూడా వాడి వెంటే వెళతాడు. అనుక్షణం వాడికి హితవు బోధిస్తుంటాడు. అయితే అహంకారంతో వాడు వినడు అన్నమాట వేరే విషయం. దేహియెలా కోరుకుంటే దేవుడు వానికి అలా జీవించటానికి, కమ్మర (మరల) అనుమతిస్తాడు, ఆ దేవుడు. అందుకే కొందరు యోగులు, కొందరు భోగులు అవుతున్నారు. అయితే వారి కర్మఫలం అనుభవించేటప్పుడు మాత్రం వారికే స్వాతంత్ర్యం వుండదు.

ఏదన్నా కర్మ చేయుటకైనా, చేయకుండుటకైనా జీవుడు స్వతంత్రుడా? అంటే అదీ చెప్పుట సాధ్యముకాదు. కాయపు సుఖములు (తన శరీరంతో పొందవలసిన సుఖములు పొందటానికి వాడికి అనుమతి నిచ్చిన దేవుడు, వాటిని అనుభవింపజేసే కర్తకూడా తానే కదా! కాదంటే యెలా నమ్ముతాము? కాబట్టి ఈయెడ (ఈ ఇహలోకంలోను, ఆ పరలోకంలోను అన్నిటినీ ప్రేరేపించేవాడు అంతర్యామి వొక్కడే. ఆ అంతర్యామి కూడా సాక్షీభూతుడే. అతను కూడా, దాయకపాయక ఈ దేహికి దగ్గరాకాడు, దూరమూ కాడు తన ఆలోచనకు తగ్గట్లు దేవుడే ఆ జీవుణ్ణి సృజియించి వాడికి అరిషడ్వర్గాలను అంటగడుతుంటాడు.

ఇది అంతా నేర్చిన ఓ చిత్తమా! నీవు ఇతనంటే అభిరతి సేయము (ఆపేక్ష చూపుము). మన శ్రీవేంకటగిరి సర్వేశ్వరుడు, సదయుడు (అపారమైన దయగలవాడు), సత్యుడు (సత్యవాక్పరిపాలకుడు.) ఆయన మొదలనే (ద్వాపరయుగమునాడే) కిరీటితో (అర్జునునితో) మొగినానతిచ్చెను (పూనికతో గీతావాక్యముగా అనుమతిచ్చాడు). ఏమని? "ఓ అర్జునా! సర్వభూతములయందు నేనే అంతర్యామిగానున్నాను". మరి మనకీ భేదభావమెందుకు చెప్పండి, మరి?

సంపుటి: 2 కీర్తన : జీవుని కేకొలము శ్రీహరి చేరువబంధువుదీతడు
సంఖ్య : 393 పుట : 264 రాగం: సాళంగనాట

సాళంగనాట

64 జీవుని కేకాలము శ్రీహరి చేరువబంధువుఁ దీతఁడు
భావములోపలిపెరరేఁపకుఁడై భక్తి చేకొనును యీతఁడు ॥ పల్లవి॥

పరమున నిహమున వెంటవెంటనే పాయనిబంధువుఁ దీతఁడు
ధరఁ దనుఁదలఁచిన మారుకుమారై తా రక్షించును యీతఁడు
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతఁడు
వురగతిఁ జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతఁడు
॥జీపు॥

పడిఁ గలకాలము యిరువదియొక్కటవాపులబంధువుఁ దీతఁడు
బడిబడిఁ జైతన్యంబై యిన్నిటఁ బనులకు నొదగును యీతఁడు
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్తుఁ దీతఁడు
పొడలుచు వైదికలౌకికముల నొకపొత్తునఁ గుడుచును యీతఁడు
॥జీపు॥

ఘననిధినిక్షేపములిచ్చేటివుపకారపుబంధువుఁ దీతఁడు
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతఁడు
ననిచిన శ్రీవేంకటేశ్వరుఁడై యిటు నాపాలఁ గలుగు నీతఁడు
పనివడి అరులను సూడువట్టి కడుఁ బగసాధించును యీతఁడు
॥జీపు॥

అవతారిక:

"పెరరేచుట" అంటే ప్రేరేపించుట అని అర్థం. ఏకాలముననైనా జీవునికి శ్రీహరి యొక్కడే దగ్గరబంధువు. ఈతడెక్కడో వైకుంఠంలో

వుండడు. మన భావములోనే వుండి అన్నీ తానే ప్రేరేపిస్తాడు. ఆ క్రమంలో తనపై భక్తిస్థిరపడ్డవారిని చేరువయై ఇతడే చేకొంటాడు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ కీర్తనలోని చాలా చరణాలు చర్వితచరణమే. జీవులకు వారివారి కర్మానుసారముగా తనకొక్కడికే తెలిసిన శ్రేష్ఠమైన పద్ధతిలో దేహములు అనునట్టి వుడుగరలిస్తాడట ఈతడు. చాలా వేగముగా కదలిపోయే కాలములో ఇరువదియొక్క విధములుగా ప్రాప్తించే బంధువు ఈతడు. జీవులందరిలో చైతన్యం రూపంలో నెలకొనివుండే సర్వాంతర్యామి ఈతడే. జీవులచేత వైదికమైన పనులు చేయించేదీ ఈయనే లౌకికమైన పనులు చేయించేదీ ఈయనే. భ్రమవల్ల అవన్నీ మనమే చేశాం అనుకొంటూంటాము. కానీ చేయించే అంతర్యామిని గుర్తించం.

భావ వివరణ:

ఏకాలమును (యెప్పుడైనా) శ్రీహరి చేరువ బంధువు (దగ్గరచుట్టము). ఈతడు భావములోన (అంతరంగమున) పెరరేపకుడై (ప్రేరేపకుడై) భక్తిమార్గము ద్వారా మనల్ని చేకొనును (అనుగ్రహిస్తాడు).

ఇతడు ఈ జీవులకు పరమున (పరలోకములందును) ఇహమున (ఈ ప్రపంచమునందుననూ) పాయని బంధువు (ఎన్నడు తోడు విడిచిపెట్టని బంధువు). ఈతడు ధరన్ (ఈ భూమిమీద) తను దలచిన (ఆయనను ధ్యానించిన) తాను మారుకుమారై (మాటిమాటికీ) రక్షిస్తాడు. అంటే, వీడు చేసే భక్తికి ఒక్కసారి రక్షిస్తే చాలులే అని వూరకుండడు, యెన్నిసార్లైనా రక్షిస్తాడు. తరుణ ప్రాయంలో జీవి ఇంద్రియ విషయాసక్తుడై యుండుట సహజము. ఆ సమయంలోమ జీవికి విషయవాంఛపెంచి చక్కగా భోగించునట్లుజేసి రకరకములైన అనుభవములను విందులు వెట్టును

(ఆస్వాదింపజేస్తాడు). ఉరుగతి (తనకొక్కడికే తెలిసిన శ్రేష్ఠమైన విధానమున) ఈతడు (ఈ దేవదేవుడు) చిత్రవిచిత్రములైన ఆకారములు గల దేహపుటడుగరలు (దేహములు అనునట్టి కానుకలను) ఇస్తాడు.

ఈతడు (ఈశ్రీహరి) వడిగలకాలమున (వేగముగా కదలిపోవు కాలమున) ఇరువది యొక్కటి విధాలుగా అవాపుల బంధువు (ప్రాప్తించెడి బంధువు). ఈతడు బడిబడి (తోడు నీడై వుంటూ) ఇన్నిటా (ఈజీవులన్నిటిలో) చైతన్యస్వరూపుడై పనులకు నొదగును (ఆ జీవి చేసే చిత్త వికారముతో కూడిన పనులన్నీ తానే చేస్తున్నట్లు భ్రమ కల్పిస్తాడు). అయితే నిజానికి ఆయనకే వికారములూ వుండవు. జడిగొని (యెన్నోశ్రమలకోర్చి) జీవుడు ఒంటరిగా లోకాంతరవాసములు చేస్తుంటే మతిసంగతి (ఆజీవి మతిలోనే వుంటూ) కాపాడే ఆప్తుడీతడు. లౌకిక వ్యవహారములనేకాక, ఈతడు వైదిక ధర్మమునుకూడా నిలిపి ఒకే పొత్తున యెవరికి కావలసింది వారు ఆచరించునట్లు చేస్తాడు.

ఈ ఐహికప్రపంచంలో సుఖంగా జీవించాలంటే ఘనమైన నిధినిక్షేపాలుండాలి. ఈతడు వాటిని కూడా సమకూర్చే ఉపకారపు బంధువు. అనయము (ఎల్లప్పుడూ) భయపడవద్దని యే సమయమునైనా అభయము నొసగే రక్షకుడితడే. ననిచిన (చిగురించిన) శ్రీవేంకటేశ్వరుడై ఈతడు నాపాలగలుగు (నాయందు అనుగ్రహంతో వున్నాడు.) ఈతడు నా అరులను (కామక్రోధాధి అరిషడ్వర్గమును), కడుసూడువట్టి (గొప్పగా పగసాధించి) అంతమొందిస్తాడు.

సంపుటి: 2 కీర్తన : కలుగుట కలిగిననాడే నే ఘనపాపములకు దొలంగీనా

సంఖ్య : 424 పుట : 286 రాగం: గుండక్రియ

గుండక్రియ

65 కలుగుట గలిగిననాఁడే నే ఘనపాపములకు దొలంగీనా
యెలమి నేనిపుడే యెరిఁగితిని యిన్నాళ్లీమతి లేదు ॥ పల్లవి॥

జనియించిననే నిటకమునుపుసకలయోనిగతజన్మములు
కనుఁగొని యవె నే సారెకుఁ బలుమరు ఘనవర్ణాశ్రమధర్మములు
అనుభవించినవే సకలార్థంబులు అయిహికవిషయములన్నియును
మనసున వాకున శ్రీహరి నొకని నే మఱచియుఁ దలఁచుట లేదు
॥కలు॥

తిరిగినవే నే నాసలకొరకును దిక్కు లన్నియును నేను
యిరవుగ తొల్లియు నెఱిఁగినవే యీసంసారపుసుఖము లివి
పొరలినవే నేఁ గామినీజనులపొందుల సుఖములభోగములు
యెరవులడొకటే శ్రీహరిదాస్యం బిది గతియని యెరుఁగుటలేదు
॥కలు॥

గడియించినవే నేఁ బూర్వకాలమున ఘనమగుసంపద లిన్నియును
నొడిగినవే నే శబ్దజాలములు నోరఁ గొలఁదు లివి యిన్నియును
తడఁబడి నే నిటు సకలోపాయపుధర్మము లిన్నియుఁ జూచితిని
యెడపక శ్రీవేంకటేశ్వరు శరణం బిటువలెఁ జేరుటలేదు
॥కలు॥ 424

అవతారిక:

కలుగుట కలిగిన నాడే నేఘనపాపములకు దొలంగీనా అనే పల్లవిలోనే కొంత తికమక కనబడుతున్నది. ఈ దేహికి ఒకానొక దేహము కలుగుట,

కలిగిన నాటినుంచే నేను ఘోరమైన పాపములను చేయుటకు శ్రీకారం చుట్టాను. ఈ ధర్మసూక్ష్మం నేను ఇప్పుడే గ్రహించాను. ఇన్నాళ్ళూ నాకా తెలివి లేదు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఇంతకుమునుపు కలిగిన నా గత జన్మలలో అనేక యోనులయందు నా జన్మలు జరిగినవి. ఆయా జన్మలలో ఆయా వర్ణాశ్రమధర్మాలను పాటించాను. సకలార్థములను అనుభవించాను. ఐహిక విషయ సుఖములను అనుభవించాను. వింతలలోకెల్లా వింతయేమిటంటే శ్రీహరిని మనోవాక్కులద్వారా తలచనందువల్లనే ఒకసారి ఆయనను మఱచితే మళ్లీ ధ్యానించుట జరుగుట లేదు. అజ్ఞానాంధకారంలో నిరంతరం మగ్గిపోతూనే వున్నాను. ఎన్నిసార్లు పుట్టినా తినడం తిరగడం పెరగడం కామక్రోధవశుడనై తిరగటం ఆ భ్రాంతితోనే చివరి శ్వాస వదలటం. ఎప్పుడూ జరుగుతున్నదిదే. ఏ జన్మలోనైనా నీ శరణుపొందితేగాని దీనికి అంతువుండదు. మరి నా గతేమిటి తండ్రీ!

భావ వివరణ:

ఓ జీవులారా! కలుగుట కలిగిననాడే (ఈ దేహికి యేదో ఒక దేహము కలుగుట సంభవించిననాడే) నేను ఘనపాపములకు (ఘోరమైన దుష్కృత్యములకు) తొలంగీని (సమాయత్తమయ్యాను). దురదృష్టమేమంటే యెలమి (పూనుకొని) ఇవన్నీ నేను ఇపుడే యెరిగితిని. నాకు ఈ మతి (జ్ఞానం) ఇన్నాళ్లూ లేదు.

గత జన్మములలో నేను ఇటకు మునుపు (ఇదివరలో) సకలయోని జనియించినాను (యెంతోమంది గర్భవాసంలో పెరిగి వారికి పుట్టినాను). సారెకు (జన్మించిన ప్రతిసారీ) అనేకమార్లు ఆయా వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తూ జీవించాను. సకలార్థంబులు (ధర్మార్థ కామములనే పురుషార్థములను) అయిహిక విషయ సౌఖ్యములను అనుభవించినవే

మరల మరల అనుభవించాను. సరే ఇవన్నీ అజ్ఞానజనిత జీవలక్షణాలని, సర్దిచెప్పుకుందామనుకొంటే నా మనస్సున మరియు వాక్కున శ్రీహరిని మఱచి, తలచుటయే మానివేశాను. దీని ఫలితమేమిటో తెలియునా? మళ్ళీ జన్మలు మళ్ళీపీకులాటలు మళ్ళీ రోగాలు మళ్ళీ చావు.

ఈ దిక్కులున్నాయి చూశారా? ఎన్నాళ్ళనుంచో ఇవి ఇలాగేవున్నాయి. ఏ మార్పూ లేదు. నేను నా ఆశలు తీర్చుకొనుట కొరకు వీటిల్లో తెగ తిరిగాను. ఇప్పుడు నేను పొందుతున్న ఈ సంసారసుఖాలు మాత్రం కొత్తవా? కావు తొల్లియు (ఇదివరలోనూ) నేను ఇరవుగ (సుస్థిరంగా) నెరిగినవే. నేను కామినీ జనుల పొందులతో శారీరక సుఖములను భోగములను అనుభవించుచూ పొరలినవే (తలమునకలయినవే). ఈనాడు ఇందులో కొత్తేమీ లేదు. సమయానికి ఎరవులాగా ఆదుకొనే దొక్కటే వున్నది. అదే శ్రీహరి దాస్యము. అయితే దురదృష్టమేమంటే ఈ విషయం జీవుడు గ్రహించుట లేదు.

ఇన్నియు సంపదలునూ, నేను పూర్వకాలమున ఘనముగా గడియించినవే. ఇందులో క్రొత్తయేమీలేదు. ఈ శబ్దజాలములన్నియు (సమ్మోహనపరచే శబ్దములన్నియు) ఒడిగినవే (ఇదివరకే అనుభవించినవే). నానోటితో పలికినవే. ఈ విధముగా అనేక జన్మలలో తడబడి మెల్లిమెల్లిగా సకలోపాయ ధర్మములను మరల మరల సాధించినవే. ఇదంతా ప్రతిజన్మలోనూ యెడపక (యెడతెరపిలేక) జరుగుతున్నదే. కానీ ఓ శ్రీవేంకటేశ్వరా! నా దౌర్భాగ్యమేమిటిది తండ్రీ! ఏ జన్మలోనూ నిన్ను ఆశ్రయించి శరణుపొందుట లేదు.

మరేమిటి నా గతి?

సంపుటి: 2 కీర్తన : సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము

సంఖ్య : 412 పుట : 278 రాగం: సాళంగనాట

సాళంగనాట

66 సకలోపాసకులకు నందును సగుణంబే
సకలమునీంద్రులు పూజించే యీసాకారమె ప్రమాణము ॥పల్లవి॥

సగుణంబని నినుఁ గొందరు సరి నిర్గుణమని కొందరు
వగలఁ బెక్కుగతిఁ జదివినకొలఁదుల వారికివారే వాదింతురు
అగణితస్వతంత్రుఁడవుగాన అల వాల్మీకి ఇట్టిట్టనకే
అగు "నిర్గుణాయ గుణాత్మనే" యని ఆనతి ఇచ్చుటే ప్రమాణము
॥సక॥

"సోహం" బని కొందరు "దాసోహం" బని కొందరు
సాహసవృత్తుల రెండుదెరంగుల సకలవివేకులు భజింతురు
దేహధారియై "దాసోహం" బని తేరి శుకుఁడు మీలోఁ గలసె
సోహపుభావన సర్వజగత్తులఁ జూపిన దేప్రమాణము? ॥సక॥

అరుశాస్త్రముల నారుమతంబుల నారుగర్మములనైనాను
యీరీతిల మిము శరణని కొలువక యెవ్వరి కుపాయము లేదు
నారదాదులగుభక్తు లిందరును నానాగతు లరసి చూచి
సారపుశ్రీవేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము ॥సక॥ 412

అవతారిక:

ఈ కీర్తనకి యెంత వివరణ ఇచ్చినా, పరిపూర్ణ వివరణ కాదు. మనబోటి సామాన్యులు ఆ రీతి దుస్సాహసం చేయటం మంచిదికాదు. శ్రుతి వాక్యాలకు వివరణ ఇవ్వజూడటం, చురకత్తి (చాకు)తో చెట్టుకొమ్మను నరకాలనుకొనేటంత అవివేకమే. పరిపక్వదశలో

అన్నమాచార్యులవారు చెప్పిన ఈ కీర్తనలో అనేకమైన భగవదుపాసనలలో సాకార నిరాకారరూపునిగా రకరకాలవారు ఆశ్రయిస్తున్నా సాకారునిగా శ్రీహరి శరణు పొందటమే శ్రేష్ఠమంటున్నారు. శుక, నారద వాల్మీకి, శౌనికాదిమునులకు భగవంతుని నిర్గుణ నిరాకారరూపం తెలియదా? మరి వారెందుకు యుగయుగాలలో ఆయనను సాకారుడుగా అర్చించారు. అదెటువంటి ప్రమాణము? శ్రుతి వాక్యం "సోహం" భావన కాధారమేమిటి? ఆత్మయే. తాను అనే భావన. "నేను" అని అంతా భావిస్తున్న ఈ శరీరం, నిజానికి "నేను" కాదు. ఇది అనిత్యమై గుణములచే పరివృతమై కాలపరిమాణము కలిగి కాలానుగుణముగా మార్పులు చెంది నశించునది. దీనిలో ఆత్మవున్నంతవరకే ఇది "నేను" కనుక ఆ చైతన్యమే నేను, నేనే ఆ చైతన్యము. అది లేక నేను లేను. ఇది ఒక పద్ధతిగా అర్థంకాని తత్వాన్ని అర్థం చేసికొనే ప్రయత్నం జరుగుతోంది. నిర్గుణమే ఆత్మ గుణముగా వుండటం అంటే ఒక్క మాటలో చెప్పగలిగినది కాదు. మానవ సహజమైన గుణముల కతీతుడు ఈ శ్రీవేంకటేశ్వరుడు. సరే, మరి భక్త వాత్సల్యమేమిటి? ఆశ్రితపక్షపాతమేమిటి? స్తోత్రప్రియత్వమేమిటి? ఏది నిజం? నేటికి అతి సామాన్యుని వేధిస్తున్నవీ సందేహాలే.

భావ వివరణ:

సకలములైన వుపాయములలో సగుణమే (విశిష్ఠ గుణములున్న కరుణానిధిగా) కీర్తించుటే ప్రమాణము (సర్వోన్నతముగా నిర్దేశించబడినది). ఎందుకంటే ధ్యానయోగంలో నిష్ణాతులైన మునీంద్రులు కూడా ఈ దేవదేవుని, సాకార రూపునిగానే (ఒక విశిష్ఠమైన ఆకారం వున్న స్వామిగానే) పూజించినారు. ఇదియే ప్రమాణము వేఱొండు ప్రమాణమేల?

ఓ శ్రీహరీ! నిను సగుణంబని (సర్వోన్నతగుణములు కలవాడవని) కొందరు భావించారు. కొందరు నిర్గుణమని తలచారు (యే గుణమూ లేనివాడివని భావించారు. వగలన్ (కౌశలముతో) అనేక విధములగు

చదువులు చదివినవారు వారిలో వారే వాదించుకొని ఏవేవో నిశ్చితాభిప్రాయాలతో వుంటారు. ఓ పరమాత్మ! నీవు అగణితస్వతంత్రుడవు (చెప్పలేనంత స్వాతంత్రం కలవాడవు). అందుకే, అలనాడు వాల్మీకి మహర్షి అట్టిట్టని సంశయాత్మకంగా చెప్పకుండా నిన్ను "నిర్గుణాయ గుణాత్మనే" (యేగుణములకు లోనుగాని ఆత్మయే గుణముగాగల) సర్వోన్నతుడవని కీర్తించాడు. ఇదియే ప్రమాణము. ఇంతకు మించి వేరొకటి కావలెనా?

కొందరు జ్ఞానులు "సోహం"బని పరమాత్ముని ధ్యానించారు. ఆత్మయే నేను, నేనే ఆత్మ, రెండు లేవు. ఉన్నది అద్వైతమే, అని నిశ్చయించారు. కొందరు ఓ దేవదేవా! నీవే ఆదియునూ అంతమునూకూడా. నీకు "దాసోహం" (నేను సదా భృత్యుడనే) అనే భావనతో కొందరు ఆరాధిస్తుంటారు. కాని శుకమహర్షి వంటి మహనీయులు దేహధారులైకూడా, దేహరహితులవలె నిర్గుణులై నీకు దాసోహమని, సోహం భావన దాసోహ పరాకాష్ఠయే అని నిరూపించారు. సర్వ జగత్తునకు వారట్లు చూపినదే ప్రమాణము. ఇంతకు మించి ప్రమాణమేమున్నది?

ఆరు శాస్త్రములు (తర్క, వ్యాకరణ, ధర్మ, మీమాంస, వైద్య, జ్యోతిషములు), ఆరుమతములు (వైష్ణవము, శైవము, శాక్తేయము, గాణపతము, సౌరము, కాపాలికము), షట్కర్మములు (యజనము, యాజనము, అధ్యయనము, అధ్యాపనము, దానము, ప్రతిగ్రహము) – మొదలైనవి యెన్ని చేసినా యేమి చేసినా, ఓ ప్రభూ! నీకు శరణు అనక యేరీతిని యేవుపాయమూ కడదాకా రక్షించలేదు. ఎందుకంటే యెక్కడ సంశయం పుడుతుందో, జ్ఞానం అక్కడ చస్తుంది. అందుకే నారదాదులు అనేక రకాలుగా ఆలోచించి భక్తియే సులభమని చాటినారు. సారముగల ఓ శ్రీవేంకటేశ్వరా! అందుకే నేనూ నీ శరణమే ప్రమాణము అని భావించి స్వీకరించాను.

సంపుటి: 15 కీర్తన : కొండా చూతము రారో కొండుక
తిరుమలకొండా
సంఖ్య : 460 పుట : 309 రాగం: భూపాళం

భూపాళం

67 కొండా చూతము రారో కొండుక తిరుమలకొండా
కొండని యడిగిన వరము లొసఁగు మా కొండల తిమ్మయ కొండా
॥పల్లవి॥

మేరువు మును స్తుతియింపఁగను వారిజసంభవుఁడూ
పేరు కలుగు నవరత్నంబులు బంగారము కల్పతరువూ
మేరకు మీఱఁ గని నెలవున నారుగ నిడెనొకో యనఁగా
ధారుణి బ్రహ్మాండములకు నాధారంబగు మా కొండా ॥కొండా॥

గరుడాచలం బనఁగా శ్రీవేంకటశైలం బనఁగా
గిరులకు నేలికె యగు ననంతగిరి దా నీ గిరి యనఁగా
సిరులాయఁ జనమగు యంజన శబరి యనెడి నామములా
పరగఁగ నాలుగు యుగముల వెలసిన ప్రబలంబగు మా కొండా
॥కొండా॥

పొదలూ సొంపగు నింపుల పూఁబొదలూ వాసన నదులూ
కొదలూ గల తామరకొలఁకులపై మెదలుఁ దుమ్మెదలూ
కదలి మలయానిలు వలపులపస కదళీవనములనూ
మొదలుగా నెల్లప్పుడు నీ సంపదలు గల మా కొండా ॥కొండా॥

జంతువులెల్లను మునులూ సకలమైన దేవతలూ
జంతువుల యెలుఁగులు వేదసారంబగు హరినుతులూ
చింతామణులట రాళ్లెల్లను సిరులనెలవు లా గుహలూ
సంతతసౌభాగ్యంబుల నొప్పెడు సందడిగల మా కొండా ॥కొండా॥

వొకచో బ్రహ్మాదులు మునులును వొకచో నింద్రాదులునూ
వొకచో భాగవతులు యతులు శ్రుతులు వొకచోఁ జంద్రార్కులు
వొకచో తీర్థంబులు గిరులను వొకచో యోగీశ్వరులూ
అకలంకత తనుఁ గోరి తపము సేయ నాస లెఱుఁగు మా కొండా
॥కొండా॥

శుకములతోఁ జదువుదురా శుకబ్రహ్మాదులు శ్రుతులూ
తకదిమ్మని యాడించు మయూరతతిని యోగీశ్వరులూ
సకలపురాణంబులు విందురు మఱి పికశారికలచే మునులూ
పకటితముగ నీ విద్యల నొప్పెడు భాగ్యముకల మా కొండా
॥కొండా॥

స్వామితీర్థములకును స్వామిపుష్కరిణియునూ
పామరులా యమరులఁ జేయును పాపవినాశనమూ
తా మహిఁ గోరిక లిచ్చుఁ గుమారధారయు పాండవసరసీ
కామితఫలదాయిని ఆకాశగంగయుఁ గల మా కొండా ॥కొండా॥

యిదియె క్షీరాంబుధి యనుచు మరి యిదియె ద్వారక యనుచు
యిదియె నందవ్రజ మనుచును మరి యిది దా నయోధ్య యనుచూ
యిదియె వైకుంఠం బనుచును యిది పరతత్త్వంబనుచు
యిదియె పరమపదం బనుచు వేదములు యెన్నఁగఁ గల మా కొండా
॥కొండా॥

తలఁచిన శుకశౌనకాదులకు తలఁచిన తలఁ పొసఁగినా
తలఁపులోపల నెలకొన్నా దయతో నన్నేలినా
చెలువుఁడు మా వేంకటరాయుఁడు సిరులనెలవు చేకొన్నా
కలియుగ వైకుంఠం బను నామము గలిగి వెలయు మా కొండా
॥కొండా॥

అవతారిక:

ఇది అన్నమాచార్యులవారి సుపుత్రుడైన పెదతిరుమలాచార్యులవారు చెప్పిన పొడవుకు పొడవైన కీర్తన. పురుషోత్తముని తిరుమలకొండ వైభవాన్ని కీర్తిస్తున్నారు. కలియుగవైకుంఠమని కొనియాడబడుతున్న ఈ కొండ. "తిమ్మయ్య కొండా! నీవు వరములొసగే కొండవు కదా! మమ్మల్ని కూడా కటాక్షించు అంటే కోరిన కోర్కెలనెల్లా తీర్చే కొండ ఇది అంటున్నారు. "రారో కొండుక" అంటే సంతోషంతో రాండి... అని అర్థం.

ఇక చాలామందికి తెలిసిన సంగతేమంటే జానపదులు శ్రీవేంకటేశ్వరుని, కొండల తిమ్మయ్య అని పిలుస్తారు. "కొండమీదకోతి" అని ఆ పదానికి అర్థం. ఒక్కసారి కోతి మన వస్తువును పట్టుకొన్నదంటే... తనతోపాటు గుంజుకెళ్ళిపోతుంది. తన ఇష్టమైతేనే వదలిపెడుతుంది. ఒకవేళ మనం అరచిగోలచేస్తే విసిరిపుచ్చి పడేసి తన దారిన తను పోతుంది. ఈ కొండల రాయుడిది కూడా అదే తత్త్వం. ఒక్కసారి వదిలేశాడంటే చివరికి చేతికంటగట్టినా విదలించి పారేస్తాడు. ఎంత ఆలోచిస్తే అన్ని కొంగ్రొత్త భావజాలమును నెలకొనునట్లు చేస్తుందీ కీర్తన. శుక శౌనకాది ఋషులకు అయినా ఈ శ్రీవేంకటేశ్వరుని కొండమీద వుంటే ఆ వైకుంఠంలో వున్నట్లే కదా! అనిపింపజేసే అద్భుతమైన కొండ సుమండీ! అంటున్నారు. నిజానికి ఇంతదూరం రానక్కరలేదు... తలపులలో దీనిని తలచుకొన్నా చాలును. నిజమైన స్నేహితుడైన ఆ కొండల తిమ్మయ్య తన దయనంతా కురిపిస్తాడు అంటున్నారు.

భావ వివరణ:

ఓ భక్తులారా! కొండను దర్శిద్దాము కొండుక రారో (సంతోషంతో రాండయ్యా!). ఇదియే తిరుమల కొండ. ఇది కొండల తిమ్మయ్య అని పిలువబడుతున్న మా శ్రీవేంకటేశ్వరుని కొండ. నీవు కొండవు కదా! మాకు కొండంత వరములు కావాలి దయచేసి ఇవ్వు అనంగానే ఆ వరాలనిచ్చే కొండేనండీ ఇది.

పూర్వకాలమున మేరుపర్వతము బ్రహ్మదేవుని పరమభక్తితో కొలిచి తన కోరికదీర ఈ శైలమును కన్నది. ఆరు భాగములుగానున్న ఈ సుదూర

సువిశాలమైన కొండపై పేరుబొందిన నవరత్నములు, బంగారము కల్పతరువూ కూడా వున్నాయని ప్రతీతి. అయ్యలారా! ధారుణి (ఈభూమిమీద) అండపిండ బ్రహ్మాండములకు ఆధారభూతమైనది ఈ కొండయే సుమా!

ప్రజలారా! ఈ కొండ ఈనాటిది కాదు. ప్రబలంబగు (మిక్కిలి దృఢమైన) ఈ కొండ నాలుగు యుగముల క్రితమే వెలసినది. ఈ కొండ ఆరు ముఖ్య శిఖరములను ఆరు పేర్లతో పిలుస్తారు. గరుడాచలము, వేంకటాచలము, గిరులకు యేలికయైన అంజనా చలము, వృషభాచలము, శేషాచలము, శబరి అచలము అని వివిధ నామములతో సుప్రసిద్ధమైనదీ కొండ. అంతులేని సిరిసంపదలు ఈ కొండమీద వున్నాయని వేరే చెప్పాలా!

అందమైన పొదరిండ్లు, చూడచక్కనై గుబాళించే పూపొదలున్న ఒడ్లు గల నదములు, కొదలూగల తామరకొలనులు (అతిశయించుచున్న తామరపూవులు నిండిన) కొలనులున్నవి. ఆ తామరలపై తుమ్మెదలు అశేషముగా మెదలుతూనే వుంటాయి. ఆ కొలనులపై మలయానిలయము వీస్తూనేవుంటుంది. వలపు భావనలునూ చిగురిస్తాయి. ఇక దీనిపై (కొండపై) నున్న కదళీ (అరటిపండ్ల) తోటలు సంపదలనిస్తూనే వుంటాయి.

అయ్యలారా! అనాదికాలంనాటి 'మునులు' ప్రశాంతత కోసం ఈ కొండమీద జంతువుల రూపంలో తిరుగుతుంటారు. వారిని జూచి దేవతలూ అదే పనిచేస్తున్నారు. అందుకనే ఈ కొండపై జంతువుల అరుపులు గర్జనలు కావు, వేదఘోషలు. సిరులుసింగారించుకొనిన ఈ కొండ గుహలలోని రాళ్ళన్నీ కూడా చింతామణి వంటి విలువైన రత్నాకరములు. ఎల్లప్పుడు సందడి తాండవించే ఈ కొండ, నిరంతరమూ సౌభాగ్యములనిస్తూనే వుంటుంది.

ఈ కొండమీద ఒక్కొక్కప్పుడు కోరి కోరి బ్రహ్మాది దేవతలు, ఇంద్రాది దిక్పాలకులు, మునులు, భాగవతులు, యతీంద్రులు, వేదములు, తపస్సు చేసుకొంటుంటారు. చంద్రుడు సూర్యదేవుడు కూడా సాకారులై ఈ కొండమీద గల తీర్థములవద్ద తపస్సు చేస్తుంటారు. ఈ కొండమీద శిలా

రూపంలో యోగీశ్వరులు తపస్సమాధిలో వుంటారు. వారందరి కోరికా నిష్కళంకమైన తపస్సమాధియే. ఇంత విశిష్టమైనది మా తిరుమల కొండ.

ఈ కొండపై పక్షులకు కూడా గొప్ప ప్రాబల్యమున్నది. శుక మహర్షివంటివారు చిలుకలకు కూడా చదువుచెబుతుంటారు. బ్రహ్మాది దేవతలు వాటికి వేదములు వినిపిస్తారు. యోగీశ్వరులు విశ్రాంతికై ఈ కొండమీది నెమళ్ళకు నృత్యములు నేర్పుతుంటారు. మునులు కూడా ఆటవిడుపుగా, చిలుకా గోరింకలు తమని అనుకరిస్తూ వల్లించే పురాణాలను వాటి కంఠస్వరంలో విని ఆనందిస్తుంటారు. ఈ కొండమీద ఇటువంటి విద్యా ప్రదర్శనలు జరుగుతూనే వుంటాయి.

ఇక ఈ కొండమీదనున్న తీర్థములన్నియు పావనములే, సకల తీర్థములకు స్వామి (ప్రభువు) యైన స్వామిపుష్కరిణి, అనే కోనేరు పాపనాశనమనే స్వచ్ఛమైన జలపాతము, కుమారధార అనే జలధార, పాండవుల సరసీ అనే సరస్సు మొదలైన అనేక జలధారలతోపాటు ఆకాశగంగవంటి కామితఫలప్రదాయియైన తీర్థములు ఈ తిరుమల కొండపై లెక్కకు మిక్కుటముగా నున్నవి.

ఈ తిరుమల కొండ పవిత్రతతో క్షీరసాగరమునుబోలినది. శ్రీకృష్ణుని ద్వారకా నగరమువలె సురక్షితమైనది. ఇది నందవ్రజమువలె జానపదుల స్వర్గము. అయోధ్యా నగరమువలె జగత్ప్రసిద్ధమైనది. ఇది వైకుంఠమువలె ఆదినారాయణుని ఆవాసము. ఇదియే పరతత్త్వము అనికూడా చెప్పబడినది. ఇదియే వేదములు గోషించు పరమపదము అను కైవల్యధామము. ఈ కొండవంటి మోక్షస్థానము లేనే లేదు.

ఈ దేవదేవుడు శుకశౌనకాది మహర్షుల తలపులలో తలచిన తలపు నొసగెడివాడు (ఆయనను ధ్యానించాలనే ఆలోచన కలిగించినాడు). ధ్యానించినంతమాత్రాన దయతో అనవరతమూ నన్నేలిన చెలువుడు (స్నేహశీలి) మా వేంకటరాయుడు, సిరులనెలవైన అలమేల్మంగ చేకొన్న (ఆవాసము చేసికొనిన) కలియుగ వైకుంఠమనే పేరుతో వెలసిన ఈ మా కొండయే తిరుమలకొండ.

సంపుటి: 2 కీర్తన : సత్యముసేయగవచ్చును సర్వేశ్వర యీమాటకు

సంఖ్య : 269 పుట : 180 రాగం: బౌళి

బౌళి

68 సత్యముసేయఁగవచ్చును సర్వేశ్వర యీమాటకు
నిత్యము నీవే యెఱుఁగుదు నేనేమీ నెఱఁగఁజుమీ ॥ పల్లవి॥

సులభుఁడవౌదువు వొకమరి చూడఁగ దుర్లభుఁడవౌదువు
తలఁపింతువు మఱపింతువు తగఁ బ్రాణములోనుండి
పలికింతువు అక్షరముల పరగ నవే వ్రాయింతువు
వెలియఁగ నీవే వెలిగా వేరొకటి నేఁ జేయఁజుమీ ॥సత్య॥

వొనరఁగఁ బూజలు గొందువు వొక్కొకపరి మానుదు వటు
కను మా యింతువు నిదురలఁ గదు మేల్కొలుపుదువు
ఘనముగ నజ్ఞానిఁ జేతువు కరునతో జ్ఞానిఁ జేతువు
ననుఁ బుట్టించితి నీవే నా కాపని గాదుసుమీ ॥సత్య॥

నాలో నుందువు వొకపరి నగి శ్రీవేంకటగిరి నుందువు
పాలింతువు లాలింతువు భవమీదేరింతువు
పోలింప సంసారిఁ జేతువు భువి నీదాసునిఁ జేతువు
కాలముఁ గర్మము నీవే కపటము నే నేరఁజుమీ ॥సత్య॥269

అవతారిక:

ఏది సత్యము ఏదసత్యము? ఏదిన్యాయము? యేది అన్యాయము? ఏది సవ్యము ఏది అపసవ్యము? ఈ ప్రశ్నల పరంపరకు సరియైన వివరణ నివ్వగలిగినవారెవరు? ఆ సర్వేశ్వరుడే కదా! నిత్యమూ ఈ విషయమును మాబోటి అజ్ఞానులకు యెఱుక జెప్పుదువు. ఎట్లా యెఱుకచెబుతాడు? వారివారి అనుభవాలద్వారా. మరి ఎవరి అనుభవం వారిదే. ఓ దేవదేవా!

నేనేమి యెఱుగను సుమా! అన్నీ తెలిసినవాడవు నీవే అంటున్నారు అన్నమాచార్యులవారు. తనయెదలోని ఉత్తుంగతరంగాల్లా యెగిసిపడుతున్న భావజాలాన్ని చక్కని కీర్తనలో ఇమిడ్చారు. ఆ సర్వాంతర్యామి ఒకసారి తిరుమల శిఖరాలపై వుంటాడు. ఇంకోసారి తన హృదయంలోనే వుంటాడు. ఒక్కోసారి తనే మనల్ని లాలించి పాలిస్తాడు. భవసాగరం దాటింపజేస్తాడు. ఒకసారి (అంటే ఒక జన్మలో) సంసార సాగరంలో తలమునకలయ్యేట్లు జేస్తాడు. ఇంకో జన్మలో నీపై భక్తి కుదిరి నీ దాసుడయ్యేట్లు చేస్తావు. నేనే కపటమునూ యెరుగనయ్యా! నా కాలమూ కర్మమూ రెండూ నీ చేతుల్లోనే వున్నాయి అంటున్నారు. నామాట నమ్మండి ఈ కీర్తనకి ఇదే క్రమంలో పదిరకాల వివరణనివ్వవచ్చును.

భావ వివరణ:

ఓ సర్వేశ్వరా! యీ నేను చెప్పబోవు మాటలు సత్యవచనములు. అయితే వాటిని నీవు ఒకపరి అబద్ధంకూడా చేస్తావు. ఒకప్పుడు వాటినే నిజం చేస్తావు. మరి యెప్పుడు సత్యము చేస్తావో, యెప్పుడు చేయవో, అది నిత్యమూ నీవే యెఱుగుదువు. నేనేమాత్రమూ యెఱుగను సుమా!

ఒకమరి (ఒకజన్మలో) సులభముగా నీ దర్శనమిస్తావు. మరొకసారి నిన్ను చూడాలంటేనే దుర్లభమౌతుంది. ఒకసారి వున్నట్లుండి నీ తలపు (స్మరణ) కలుగునట్లు చేస్తావు. ఒకసారి యేవేవో అనవసరమైన విషయాలు గుర్తుకు వస్తాయి కాని "శ్రీవేంకటేశమ్ శరణం ప్రపద్యే" అని గుర్తుకు రానే రాదు. ఒకసారి నాలో ప్రాణ స్వరూపుడవై నాతో పలికిస్తుంటావు. అందరూ ఈ పలుకులు నావి అనుకొంటున్నారు. కానీ అవినీవు పలికించినవే. నేను పలికిన ఆ మాటలను అక్షరముల రూపములలో నీవే వ్రాయించుచున్నావు. చూచువారికి ఈ కీర్తనలు నేను వ్రాస్తున్నట్లు వుంటుంది. కానీ నేనేమీ వెలిగా (వేరేవిడిగా) యేమీ చేయుటలేదు. కానీ నేను వేఱుగ యేమీ చేయజాలనుసుమా! కదలువాడవు కదలించువాడవు కూడా, నీవే.

ఒకసారి నీపై భక్తి కలుగుతుంది. అప్పుడు నిన్ను వున్నట్లుండి పూజిస్తుంటాను. నీవూ చిరునవ్వుతో నా పూజలను స్వీకరిస్తావు. ఒకసారి యేదోముంచుకుపోయినట్లు అనవసరమైన "యావ"తో కళ్ళెదురుగావున్న నీకు నమస్కరించక తిరుగుతుంటాను. మేము కనుమూసి నిద్రించుటకు, కనుతెరిచి "ఆహా! యెంత చక్కగా నిద్రపట్టింది" అని మేల్కొనుటకు కారకుడవు నీవే ప్రభూ! ఒక పర్యాయము వీడెంత మూర్ఖుడురా అని నలుగురూ అనుకొనేటంత అజ్ఞానిని చేస్తావు. మళ్ళీ నీవే నాపై కరుణతో జ్ఞానిని చేస్తావు. ఇవన్నీ అటుంచి అసలు నన్ను పుట్టించింది యెవరు? నీవే కదా! నాతల్లీదండ్రిని నేను కలిపానా? నేనే అమ్మకడుపులో చేరానా? నేనే పెరిగి బయటకు వచ్చానా? నేనే దినదిన గండం నూరేళ్ళ ఆయుస్సులాగా పెరిగి ఈనాటికి దీన్ని వ్రాసే స్థితికి వచ్చానా? ఇవన్నీ చేసింది నేను అని భ్రాంతి కలిగించి అన్నీ నీవే చేస్తున్నావు. రేపు "నేను" వుండను. అది చేసేదికూడా నీవే. నాకాపని గాదు సుమా!

ఓ శ్రీవేంకటేశ్వరా! ఒకపరి నాలోనే అంతర్యామిగా వుందువు. ఒకపరి తిరుమల శిఖరాలపై సర్వాంతర్యామిగానుందువు. ఒకపరి నన్ను పరిపాలింతువు. ఒకపరి చిన్నిపాబీయిని బుజ్జగించినట్లు బుజ్జగిస్తావు. భవమీడేరింతువు, (జన్మచరితార్థంబవునట్లు చేస్తావు). పోలింప (యుక్తమనిపించునట్లు) నీవే మమ్మల్ని సంసార వ్యామోహంలో కట్టిపడవేస్తావు. ఉన్నట్లుండి ఈ నిర్భాగ్యుడిపై జాలి కలిగి నీవే "ఇక ఈ ఆటచాలును లేరా!" అన్నట్లు నీదాసుణ్ణి చేసికొంటావు. అప్పటికి నా కాలము కర్మము కలిసొచ్చాయన్నమాట. నీవే దిక్కనే జ్ఞానం సుస్థిరంగా వుండేట్లు చేసే శక్తీ నీకే వున్నది. నీ కృపలేకపోతే మళ్ళీ మొదటికే వస్తాను. తండ్రీ! నేనే కపటమును యెరుగ జుమ్మీ! (నాకేమోసమూ తెలియదు స్వామీ!) నన్నేలుకోవయ్యా!

సంపుటి: 15 కీర్తన : ఇది నీ మాయో యింద్రజాలమో యేమియు నెఱుంగను

సంఖ్య : 410 పుట : 276 రాగం: దేసాక్షి

దేసాక్షి

69 ఇది నీ మాయో యింద్రజాలమో యేమియు నెఱుంగను
సదరపు నా కర్మవశంబున నే సంకల్పించెదనో యెఱుంగను
॥పల్లవి॥

నరకము లనుభవించే యప్పుడు నా యాతనాదేహంబు
నరములతో నఱకుదురు యమభటులు నలియ దప్పటిఁ జరుగును
సరి నసిపత్రములు నాఁటు సమయ దెంతైనాఁ జిగిరింపుచుండు
వరుసఁ దప్తలోహ తైలంబులలో వైతురు పోవదు వెను తగులు
॥ఇది॥

అంతట నొకతల్లికడుపునఁ బుట్టుదు అతికోమలమగుమేను మోచుకొని
వంతుల బాల్య కౌమారయౌవన వయసులఁ బెక్కు భావము కాదు
కాంతలఁ గవయుదు రక్తమాంసములుఁ గమ్మటి నూరునుయేమిటాఁ
వింతగా నాహారంబులు గొందును వెస నాఁకలియునుఁ దీరదు
॥ఇది॥

మెఱయఁగఁ గలలోన నన్నియుఁ గందును మేలుకాంచితే సటలౌను
మఱచితిఁ దలఁచితి సర్వాపరాధములు మతి యున్నియు నేఁ జేసితిని
తఱితో శ్రీవేంకటేశ నాపాలిటి దైవము యలమేల్మంగపతి
గుఱిగా నా విన్నప మవధరించు గోవింద గోవింద గోవిందా ॥ఇది॥

అవతారిక:

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు చెప్పిన ఈ అధ్యాత్మ కీర్తన నాస్వాదించండి. మామూలు ఇంద్రజాలికులు చేసే కనికట్టు విద్య చూచి

అబ్బురపడిపోతుంటారు సామాన్యులు కాని ఈ దేవదేవుడు అందరివంటి మోళికాడు అని భ్రమపడకండి. ఈయన మాయనుగాని, ఇంద్రజాలమునుగాని ఎరిగినవారెవ్వరునూ లేరు. మరి ఇక నేనెట్టెరుగుదనయ్యా! నేనే కర్మలను చేస్తూ వాటి ఫలితమును అనుభవిస్తున్నట్లు పైకి కనుపించుచున్నా నిజానికి ఇవన్నీ నేను సంకల్పించెదనా? నేనేమీ యెరుంగనయ్యా! బహుశా నా కర్మవశమున నీవే సంకల్పిస్తావు కాబోలును అంటున్నారు. నా విన్నపమును అవధరించవయ్యా! యాతనాశరీరంతో నేను నరక బాధలనుభవిస్తున్నప్పుడు, నాకీ సౌమ్యత నీపై భక్తీ వుంటాయా? అందరిలాగ నేను కూడా, బాధ తాళలేక నిన్ను నిందిస్తానేమో? తండ్రీ! అర్భకుడిని అనినాపై దాక్షిణ్యం చూపించవయ్యా! పోనీ ఆ గండం గడిస్తే... మళ్ళీ నన్ను ఇంకొక అమ్మకడుపులో పడేస్తావు. మళ్ళీ పుట్టుక బాల్యము కౌమారము యవ్వనము వృద్ధాప్యమూ మరణమూ ఇంతేనా? మళ్ళీమళ్ళీ ఇదేనా? నీవే యేదో చేసి నన్నీ పీడనుంచి వదిలించవయ్యా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఇది (ఈ ప్రపంచము) నీ ఇంద్రజాలము వలన కల్పింపబడిన మాయయా? నేనేమియు యెఱుంగలేకున్నాను. సదరపు (సమానమైన) నా కర్మకొలదీ నేనే సంకల్పించుచున్నానో లేక భగవత్ ప్రేరేపితమో నేనెఱుంగను.

ఇప్పుడు జరుగుచున్న నా జన్మగురించే ఆలోచిద్దాం. నేను చనిపోగానే నరకమే సంప్రాప్తించవచ్చును. ఆ నరకమును అనుభవించేటప్పుడు నాకు ఒక యాతనా శరీరమునిస్తారట. ఆ శరీరాన్ని కాలిస్తే మంట పుడుతుందేకాని తగలబడిపోదు. దాన్ని కోస్తే తీవ్రమైన నొప్పి కలుగుతుందేకాని నెత్తురు రాదట. కఱ్ఱలతో కొడితే ఎముకలు విరిగినంత బాధ కలుగుతుంది కానీ ఒక్క యెముక కూడా విరగదట. ఆహా!

యమభటులు నరకములు తెగునట్లు ఈ యాతనా శరీరాన్ని నరుకుతారుట "అసిపత్రము"లని కత్తులవంటి ఆకులుగల చెట్లు ఆ నరకంలో అసంఖ్యాకంగా వుంటాయట. నన్ను ఆ చెట్లు యెక్కిస్తారట. వరుస దప్పకుండా లోహపు పాత్రలలో మరుగుతున్న నూనెలో ఈ యాతనా శరీరాన్ని వేపుతారట (వేయించెదరట) అట్లా చేస్తేనేకాని, వెనుతగులు (గత జన్మకర్మ) పోవదు (తీరదు). అసిపత్రవనంలో ఈడ్చినా ఆయాతనాశరీరం, సమయదు (నశించదు), అలిసిపోదు, అప్పటి (మరల మరల) యాతన అనుభవించడానికి సిద్ధమే. ఓ పరమాత్మా! ఇంత శిక్ష అవసరమా ప్రభూ! మొదటనే మాకు చెడు అంటకుండా చేయరాదా?

సరే, యమలోకబాధలయ్యాక, మళ్ళీ ఈ జీవిని ఇంకొక తల్లి కడుపులో ప్రవేశపెడతావు. ఆ తరువాత నిర్ణీత సమాయానికి అతి కోమలమైన లేత శరీరం మోస్తూ నేలపై చేరుతాను. వంతుల (వరుసగా) బాల్యము, కౌమారము, యౌవనము అను వయస్సులలో ఆయా దశలకు సహజమైన భావావేశములను పొందుతుంటాను. అనేకమంది కాంతలను గూడుదును. ఆ శరీరంలో రక్త మాంసములున్నంత వరకు ఆ ఆకలి తీరేది కాదు. ఏరోజుకారోజే పరగడుపు. ఆ తృష్ణకు అంతే వుండదు.

నిద్రించినపుడు యేవికారము భ్రాంతి, రాగద్వేషములు లేని నిశ్చలుడనే. కలలో కూడా అంతే. కానీ మేల్కొనగానే సటలౌను (కపటము మొదలవుతుంది). అన్ని వికారాలు అరిషడ్వార్గాలూ మళ్ళీ అంతా యధాతధంగా జరుగుతూనే వుంటాయి. అన్ని అపరాధాలూ నావల్లనే జరుగుతాయి. ఇవన్నీ మతివుండి నేను జేసినవే. వీటికి నేను బాధ్యుడను కానని యెలా అనగలను? ఓ శ్రీవేంకటేశ్వరా! తఱితో (ప్రయత్నముతో) నేను నీ దాసుడనైనాను. అలమేల్మంగ విభుడవైన ఓ ప్రభూ! నాపాలి దైవము నీవేనయ్యా! గుఱితో నా విన్నపమును మన్నింపుమయ్యా! ఓ గోవిందుడా! అవధరింపుమయ్యా! (అనుగ్రహింపుమయ్యా!)

సంపుటి: 2 కీర్తన : ఇదియే కావలెనని తాఁ గైకొని యిచ్చగించువాఁడే ఘనుఁడు

సంఖ్య : 209 పుట : 140 రాగం: శ్రీరాగం

శ్రీరాగం

70 ఇదియే కావలెనని తాఁ గైకొని యిచ్చగించువాఁడే ఘనుఁడు
వదలకురో హరిదాసులమత మిది వర్ణించెద నోవివేకులాలా

॥పల్లవి॥

దేవుఁడుగలఁడని మదిలోఁ దెలియుటే జన్మఫలంబు
తావుగ నాతని నెప్పుడు దలఁచుటే తన భాగ్యము
శ్రీవైష్ణవ ధర్మము దప్పక చెలఁగుటయే వైభవము
దేవతాంతరంబులన్నియు మానినదియే సుకృతంబు ॥ఇది॥

కామక్రోధము లుజ్జగించుటయే కల్యాణానుభవము
చేముంచి పాపము సేయకమానుటే చెప్పఁగ లాభము
నేమముతోడుత విరక్తుఁడగుటే నిర్మలానందము
వేమరు నాచార్యసేవసేయుటే విచారింపఁగ దాఁచినధనము

॥ఇది॥

ప్రకృతివికారములకుఁ జొరకుండుటే పరమమైనసాత్వికము
సకలబంధములఁ బెడఁబాసినదే సామ్రాజ్యపదము
ప్రకటింపఁగ నలమేలుమంగకును పతియగు శ్రీవేంకటవిభుని
అకలంకుఁడై కొలిచియుండుటే యనంతమహిమాతిశయంబు

॥ఇది॥209

అవతారిక:

'ఇచ్చగించుట' అంటే అంగీకరించుట అని అర్థం. మనస్ఫూర్తిగా నాకు ఇదే కావాలి అని శ్రీహరిశరణాగతి స్వీకరించినవాడే ఘనుడు. హరిదాసుల మతమైన ఈ శరణాగతిని యెట్టి పరిస్థితుల్లోను వదలకురో! అని మరీ మరీ చెబుతున్నారు అన్నమాచార్యులవారు. ఈ విషయాన్ని మీకు వర్ణించి మరీ చెబుతాను. ఓ వివేకులారా! నన్ను నమ్మండయ్యా! అంటున్నారు. శ్రీవైష్ణవుల సిద్ధాంతమైన శ్రీహరి సర్వాంతర్యామి అనే సత్యాన్ని నమ్మండి. దేవతాంతరములను వదలివైచి గొప్ప సుకృతమును పొందండి. గురువుల సేవ చేయుటకంటే మనము భవిష్యత్ జన్మల కొరకు దాచుకొన్న ధనము వుండదు, అని అంటున్నారు. అలమేల్మంగా రమణుడైన శ్రీవేంకటేశ్వరుని నిష్కళంకుడై సేవిస్తూ వుండటమే అనేక మహిమాన్వితుడై యుండుట. ఈ కీర్తనలో ఆచార్యులవారి భావాన్ని వివరించాలంటే ఒక వాక్యం సరిపోదు.

భావ వివరణ:

శ్రీవైష్ణవ ధర్మాన్ని స్వీకరించి, ఏదోవిధిలేక వున్నట్లు కాకుండా, ఇదియే నాకు కావాలి అని గైకొని (స్వీకరించి), యిచ్చగించువాడే (మనస్ఫూర్తిగా అంగీకారముతో) శరణాగత దీక్షాపరుడైన వాడే, ఘనుడు. ఓ వివేకవంతులారా! ఈ వివరం మీకు వర్ణించి చెబుతాను, కానీ హరిదాసులమతమైన ఈ వైష్ణవమును వదలకురో! (వదలిపెట్టవద్దు సుమా!)

మానవజన్మనెత్తిన దానిఫలితమేమిటి? జంతువులకు లేనిది, పక్షి కీటకాలకు రానిది అయిన భగవంతుని స్మృతిని పొందటం. కొందరికి మానవజన్మనెత్తినా దైవచింతనలేకయే నూరేళ్ళు గడిచిపోతుంది. స్మృతి కలుగుట ఒక యెత్తయితే తావుగ (సుస్థిరంగా) యెప్పుడు నాతని (ఆశ్రీహరిని) ధ్యానించుటయే నిజమైన భాగ్యము. ఇక "వైభవము"

అనిదేన్నంటారా తెలుసా? పదిమంది ముఖస్తుతి చేస్తుంటే ఠీవిగా పోవటం కానేకాదు. మనోవాక్కాయకర్మలా శ్రీవైష్ణవ ధర్మమును తప్పక పాటించుటయే నిజమైన వైభవము. సుకృతము అంటే యేమిటో గ్రహించి చూస్తే శ్రీహరియే సర్వస్వంబని, దేవతాంతరంబులు పాటించిన ఫలితం శూన్యమని గ్రహించుటయే సుకృతము. అది కలుగనంతవరకు హరియే హరుడో అని గింజుకుంటూనే వుంటారు.

మా శ్రీవైష్ణవులకు సకలకళ్యానుభవమేమిటో తెలియునా? కామక్రోధములను వుజ్జగించుటయే (తొలగించుకొనుటయే). ఏమి జరిగినా అందులో మాకు లాభమేమిటి? అని ఆలోచిస్తారు కొంతమంది. కాని మాకు ఈ శ్రీహరి దాస్యము వలన కలిగే లాభమేమిటంటే.. చేముంచి (కావాలని) పాపములను సలుపకుండుటయే. ఇక నిర్మలానందము అని పెద్దపెద్దమాటలు చెబుతుంటారు. అదెక్కడోలేదు. విరక్తి భావనలోనే వున్నది. నియమబద్ధుడై విరక్తుడై జీవించుటయే నిర్మలానందము. లౌకిక జీవనానికి, ధనం కావాలి మరి ఈ శ్రీవైష్ణవులకు దాచివుంచిన ధనం యేమన్నావున్నదా? వేమరు (పలుమార్లు) తమ ఆచార్యుల (గురువుల) సేవచేయుటయే మాకు మూలధనము.

ఇక వైష్ణవ దీక్ష స్వీకరించాక కూడా, సహజమైన ప్రకృతి వికారములకు లోనుగాకుండుటయే మేము నమ్మే పరమసాత్విక జీవనము. మాకు వైష్ణవ సామ్రాజ్యపదములో చోటు దక్కినదంటే మేము మాకు జన్మవలనగాని జీవనమువలనగాని సంక్రమించిన సంబంధ బాంధవ్యములనన్నింటినీ విడనాడుటయే. ఇక బాహాటంగా ప్రకటించాలంటే దేవి అలమేల్మంగ మనోవల్లభుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! శ్రీవైష్ణవులకు అనంత మహిమాతిశయముతో ఒప్పుట అంటే కనికట్టు విద్యలు చేయుటకాదు, అకలంకుడై (నిష్కళంకుడై) శ్రీహరినే కొలుస్తూ జీవించటం.

సంపుటి: 15 కీర్తన : సకల దేవతలు నీ శరీరమని సర్వేశ్వర నినుదలచుట

సంఖ్య : 409 పుట : 275 రాగం: రామక్రియ

రామక్రియ

71 సకలదేవతలు నీ శరీరమని సర్వేశ్వర నిను దలఁచుట మేలు
వికట మేల నిను యేకాగ్రబుద్ధిని వేడుకతో సేవించే నిఁకను
॥పల్లవి॥

శివదుర్గారవిగణాధిప క్షేత్రపాలక సహితముగా
భువిలో మిమ్మును పంచపూజగాఁ బూజింతురు కొందరు
తివిరి యిందరును బంతినే పొత్తుల దేవరలై పొరి చూపు సేతు రని
వివరముగా నిన్నేఁ గొలిచితి నీ వే వహించుకొని రక్షించవే ॥సకల॥

బహువిద్యాధర బేతాళ బ్రహ్మరాక్షసగణాదుల
సహచరుఁగా మిమ్ముఁ గామ్యకర్మముల సారె భజింతురు కొందరు
మహిమలు చూపుచు వేల్పులదండై మనసులవంతులు
వెదకుదు రనుచును
విహితధర్మమని నిను శరణంటిని వెలయఁగ ననుఁ దయఁజూడఁ గదే
॥సకల॥

అతిమాయాయంత్రతంత్రమంత్రాంతరసాధనయుక్తముగా
యితరులు గొందరు చిల్లరతెరువుల యెనయించి మిమ్ము నర్చింతురు
తతి నివి తమలో నన్యోన్యవిరుద్ధము లని యపాయసహితము
లనియును
గతి యంటిని యలమేలుమంగకును పతి శ్రీవేంకటేశుఁడ కావవే
॥సకల॥

అవతారిక:

దేవతాంతరములు పాటించువారు మా దేవుడు గొప్ప మీ దేవుడు తక్కువ లేదా మీదేవుళ్ళందరూ మాదేవి భృత్యులే అని వాదించుకొంటూ వారి వారి భావాలకనుగుణంగా పురాణ గాధలతో సమర్థిస్తూ భక్తిమార్గాన్ని గాలికి వదలివేసి కర్మకాండలు, పూజలు, శాంతులు, హోమాలతో పబ్బంగడుపుతున్నారు. అత్యవసరమైన ఏకాగ్రబుద్ధి (ఒకే ఒక లక్ష్యంపై మనస్సు) లోపిస్తున్నది. శ్రీమన్నారాయణుడు విరాట్పురుషుడు. సమస్త దేవతలు ఆయన శరీరం నుంచి అంకురించినవారే. ఆ సర్వేశ్వరుని ఆ విధంగా దలచుట మేలుకదా! అంటున్నారు పెద తిరుమలాచార్యులవారు. ఆయనను ఏకాగ్రత కలిగిన మనస్సుతో సంతోషపూర్వకంగా సేవించుట మేలు కదా! వికటమైన ఆలోచనలు వైషమ్యములెందుకు అంటున్నారు. శివుడు దుర్గ అని వేర్వేరు దేవతలను పూజిస్తున్నారు. మనబోటి వారము అల్పులము. మనకు వరబలోపేతులైన రాక్షసులు కూడా పీడించుటకు లేరు. ఓ ప్రభూ! మాకు జీవనం సజావుగా సాగి నీపై దృఢమైన భక్తి కలిగితే అదే పదివేలు. నిన్ను శరణంటే భూత, భేతాళ బ్రహ్మరాక్షస గణములు కూడా యేమీ చేయలేవు. మరి వాటి సాయంకోరి అశాస్త్రీయ విధానాలతో అర్చించే వారినేమనగలము?

భావ వివరణ:

ఓ సర్వేశ్వరా! సమస్త దేవతలు నీ శరీరమె (నీ శరీరం నుండి ఆవిర్భవించినవారే). అటువంటప్పుడు పేరుపేరునా వారందరినీ ఆరాధించే బదులు నిన్నొక్కని సేవిస్తే చాలదా? వికటమేల (వికటముగా ఆలోచించుట దేనికి?) ఇకను (ఇకపై) నిన్నే ఏకాగ్రబుద్ధితో (కేంద్రీకరింపబడిన బుద్ధితో) వేడుకతో (సంతోషముగా) సేవించేను.

కొందరు శివుడు, దుర్గ, సూర్యుడు, గణపతి – ఆయాక్షేత్రములకు పాలకులను భావనతో పంచపూజగా ఈ లోకంలో ఆరాధిస్తున్నారు. కానీ తివిరి (ప్రయత్నంతో) ఆలోచిస్తే, బంతినే (వరుసగా) వారు వారివారి

పొత్తులలో దేవతలై, పొరిచూపుసేతురు (సంరక్షించుచున్నారు). ఇవన్నీ ముందే గ్రహించి, మేము వివరముగా (సక్రమముగా) మిమ్మే (శ్రీహరివైన తమరినే) గొలిచితిమి. మరి నేను శాస్త్ర ధర్మములనెరిగిన ప్రజ్ఞాశాలిని గాను. అతి సామాన్యుడను. నాలోని లోటుపాట్లను సహించి నా భారము నీవే వహించి నన్ను రక్షించు ప్రభూ!

ఇంకా కొంతమంది వుంటారు. వారు విద్యాధరులనే మాయామర్మములు తెలిసిన దేవతలను పూజిస్తారు. మరి కొందరుంటారు వారు భేతాళ బ్రహ్మరాక్షసులవంటి క్షుద్ర గణములను వుపాసిస్తారు. అటువంటివారు మిమ్ము కూడా కామ్య కర్మల సాధనకోసమే (ఇష్టమైన భౌతిక సుఖాపేక్షకోసమే) పూజిస్తారు. వారంతా మహిమతో నీవు వారి వాంఛలను నెరవేరుస్తావనే ఆశతోనే నీ వెంటపడుతున్నారు. అటువంటి మహిమల దండ (వరుస) గా యెవరు యెక్కడ ప్రదర్శిస్తే ఈ "భక్తజనం" తండోపతండాలుగా అక్కడికి పరుగులుపెడుతుంటారు. వారు విహిత ధర్మమును పాటించరు. ఇట్టివారల గోల నాకేలనని నేను నిన్నే శరణు మహాప్రభో! అన్నాను. వెలయగ (వర్ధిల్లునట్లుగా) నన్ను అనుగ్రహించు స్వామీ!

అతి గొప్ప మాయను ప్రదర్శించు మరికొందరు మంత్రతంత్రోపాసకులు నోరుతిరగని యేవేవో మంత్రాలతోను రక్షరేకులువంటి యంత్రములను కట్టి నమ్మించి చిల్లరదేవుళ్ళను కొలుస్తుంటారు. వీరికి కావలసినది ఇష్టకామ్యఫలసిద్ధి. ప్రపంచపు మంచి చెడ్డలు వీరికి అక్కరలేదు. కాని ఇటువంటి క్షుద్రవిద్యలన్నీ ఏదోఒకనాడు వారి కొంపనే ముంచుతాయి. అపాయమువాటి వెన్నంటే వుంటుంది. పైగా అవి శాస్త్రవిరుద్ధము కూడా. ఓ శ్రీవేంకటేశ్వరా! ఓ అలమేల్మంగపతీ! మాకు యెందుకయ్యా! ఈ తలనొప్పి. నాకు దిక్కు నీవే అని నిన్ను ఆశ్రయించాను. ఇక పాలముంచినా నీట ముంచినా నీ దయ నా ప్రాప్తం. అంతే.

సంపుటి: 2 కీర్తన : ఇదియే ఉపాయమిక నాకు
నిందుల కంటె మరి లేదు.
సంఖ్య : 210 పుట : 141 రాగం: కేదారగౌళ

కేదారగౌళ

72 ఇదియే ఉపాయ మిఁక నాకు నిందులకంటె మఱి లేదు
మది నితనిదాసులదాసుఁడనై మహిమలతోఁ గడుమెఱసేఁగాక

॥ పల్లవి॥

కడచితినా నాజన్మములు గక్కున మానిసినైనంతనే
విడిచితినా పాపముసేయక వేవేలుచదివినయంతనే
అడఁచితినా సంసారవారధి అఖిల దేవతలఁ గొలిచినయంతనే
బడిబడి హరినామము నుతించి నేఁబావనమయ్యేఁగాక

॥ఇది॥

గెలిచితినా యీమాయను నేఁ గెరలి తపంబులు నేసినంతనే
తలఁగితినా నరకములు చొరక ధరయెల్లా నేలినంతనే
తెలిసితినా తత్వరహస్యము తిరముగ కులజుఁడనయినంతనే
యిలలో శ్రీపతి శరణుచొచ్చి నేనిన్నిటఁ బుణ్యుఁడ నయ్యేఁ గాక

॥ఇది॥

వదలితినా నాదుర్గుణములు వరుసతోఁ జుట్టాలు గలిగినంతనే
వెదకితినా ముక్తి మార్గమును విద్య లెఱిఁగినేర్చినంతనే
యిదివో శ్రీవేంకటేశుఁడు నాకును యేలికయై మన్నించఁగను
పదిలముగా నాతనిసేవచేసి పరమానందుఁడ నయ్యేఁగాక

॥ఇది॥210

అవతారిక:

అజ్ఞానం అంధకారంవంటిదైతే జ్ఞానం దీపము వంటిది. రెండోది రాకుండా మొదటిది పోదు. జ్ఞానం చదువువలన వచ్చేమాట నిజమేకాని భక్తిలేని చదువువల్ల వచ్చే జ్ఞానం అహంకారదోహదమే కాక, భక్తి మార్గానికి అవరోధమే అవుతుంది.

అందుకే విశిష్ట మతాచార్యులు దాస్యయే సరియైన దారి. శరణాగతియే పరమోపాయమని చెప్పారు. ఎన్ని జన్మలెత్తినా, యెంతమంది గర్భవాస నరకం అనుభవించినా, యెన్నిసార్లు తనువు చాలించినా ఈ జీవి నేర్చుకొనేదేమీ వుండదు. ఎప్పటికప్పుడు పరగడుపే. ఏ ఒక్క జన్మలోనూ ఎన్ని విద్యలు నేర్చినా ముక్తి మార్గం పట్టుకోలేకపోయాను, అంటున్నారు అన్నమాచార్యులవారు. శ్రీవేంకటేశ్వరుని ఆశ్రయంలో చేరి శరణాగతితో ఆతని సేవచేస్తూ జీవిస్తేనే పరమానందమనేముక్తి దక్కుతుంది. లేకపోతే యెన్నాళ్ళయినా ఇదేపీకులాట. ఇదే భ్రాంతి, ఇదే అజ్ఞానం, ఇదే అహంకారం, ఇవే జననమరణాలు, ఇవే కౌగిళ్ళూ, ఇవే కన్నీళ్ళూ, ఇవే సుఖదుఃఖాలు. దీని దుంపతెగ దీనికి అంతూలేదు, పొంతూ లేదు.

భావ వివరణ:

ఓ భక్తులారా! నాకు ఇదియే (ఈ శ్రీవేంకటేశ్వరుని శరణాగతియే) ఉపాయము. ఇందుల కంటే (ఇంతకంటే) మరిలేదు (మరింకొకటి లేనేలేదు). నామదిలో కూడా ఇతని దాసుల (హరిదాసుల) దాసుడనై యెన్నో మహిమలతో శోభించెదను గాక!

ఈనాడు నాకు మానవజన్మ దొరికింది. నా జన్మంబు గడచితినా (ఈ జన్మల చక్రభ్రమణం దాటితినా?) అబ్బేలేదు. మానవ జన్మ వచ్చిన వెంటనే నా అజ్ఞానం పోలేదే? వేవేల చదువుల (అనేకమైన శాస్త్రములను చదివినంతమాత్రాన) పాపము సేయక విడిచితినా? అబ్బే లేదే. అఖిల

దేవతలను కొలిచినంతమాత్రాన సంసారవారధిని (సంసార జలధిని) అడచితినా (దాటగలిగానా?) అవెన్ని చేసినా యేమీ కాలేదు. బడిబడి (క్రమక్రమముగా) శ్రీహరినాశ్రయించి హరినామాన్ని పట్టుకొన్నాను. ఆ హరినామం నుతించి పావనుణ్ణయ్యాను కానీ లేకపోతే ఈ జన్మల సుడిగుండాల్లో పడి తిరుగుతూనే వుండేవాడిని.

సరే, ఏదో జన్మలో తపస్సును కూడా చేసే వుంటాను. అంతమాత్రాన కెరలితినా (అతిశయించానా?) పోనీ ఈ విష్ణుమాయను గెలిచితినా? లేనేలేదు. ఏదో ఒక జన్మలో రాజ్యంకూడా పొంది పరిపాలించి వుంటాను. "రాజ్యంతే నరకంధ్రువం" అన్నట్లు రాజ్యపాలనలో యెన్ని పాపాలు చేశానో, ఎన్ని నరకములలో తగిలితినో (తప్పించుకొన్నానో?) తిరముగ (స్థిరముగా) అగ్రకులజుడనై జన్మించినంతమాత్రాన, విబూధికట్లు పంగనామాలూ పెట్టుకొన్నంత మాత్రాన తత్త్వరహస్యము తెలుసుకొన్నానా? అబ్బే లేదే. ఇదిగో ఈ శ్రీపతి శరణాగతి వలన, నేను ఇన్ని విధములా పాపవిముక్తుడనై, పుణ్యుడనైతిని.

నాకు ఎంతోమంది గొప్ప గొప్ప వ్యక్తులు చుట్టాలు అయ్యారు. అందువల్ల నాకు ఒరిగినదేమిటి చెప్పండి? వరుసగానున్న నా దుర్గుణాలలో ఒక్కటంటే ఒక్కదాన్నయినా వదలిపెట్టానా? అనేక విద్యలు నేర్చాను. అనేక ధర్మాలు నేర్చాను. ఏమిలాభము? యెన్నడైనా ముక్తి మార్గం పొందుదామని తలపెట్టానా? ఇదిగో మన కళ్ళయెదుట వున్నాడే ఈ మహానుభావుడు శ్రీవేంకటేశ్వరుడు, ఈయన నాకు యేలికయై నన్ను మన్నించాడు. ఇంకేముంది? పరమానందుడనై మోక్షగామినై, పదిలముగా (జాగ్రత్తగా) ఆయన సేవచేస్తూ తరిస్తున్నాను. ఇంకా ఇంతకంటే ఇంకేమికావాలి చెప్పండి.

సంపుటి: 15 కీర్తన : వెదకి వెదకి చొప్పు లెత్తుచును
విచారించితి నిన్నాళ్లు
సంఖ్య : 411 పుట : 276 రాగం: సాళంగనాట

సాళంగనాట

73 వెదకి వెదకి చొప్పు లెత్తుచును విచారించితి నిన్నాళ్లు
యిదివో కంటిని శ్రీవేంకటగిరి యెదుటనే నీ శ్రీపాదములు
॥ పల్లవి॥

ఘనతులసీకాననంబులో కాఁపురముసేతు వనఁగాను
అనిశమ్ముఁ బద్మవనంబునను ఆడుచునుండుదు వనఁగాను
నిను నీ దాసులు పాడేచోట్ల నెలవై యాలింతు వనఁగాను
యినమండలమున నుండుదు వనఁగా యీ మాట విని నేను
॥వెదకి॥

పైకొని క్షీరాంబుధిలో నెప్పుడు పవళించివుందు వనఁగాను
వైకుంఠంబున వెలుఁగొందుచు సర్వము భావించే వనఁగాను
దాకొని జీవులలో నెప్పుడు నంతర్యామివై వుందు వనఁగాను
లోకము నీవై వుండదు వనఁగా లోలత నీమాట విని నేను ॥వెదకి॥

పరమయోగీంద్రులు తలపోయుచునున్న భావముతో నుందువనఁగాను
పరిపరివిధముల పుణ్యకర్మము పాయక చరింతు వనఁగాను
గరిమల నెప్పుడు అలమేల్మంగ కౌఁగిటిలో వాఁడ వనఁగాను
యిరవుగ శ్రీవేంకటేశుఁడ వనఁగా యీ మాట విని నేను ॥వెదకి॥

అవతారిక:

వెదకి వెదకి చొప్పులు యెత్తుచు ఇన్నాళ్ళూ విచారించితిని, ఇదిగో ఇన్నాళ్ళకు శ్రీవేంకటగిరి మీద నీ పాదములు కంటిని – అంటున్నారు

తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు పల్లవిలో. అంటే యేమిటి? "ఓ శ్రీవేంకటేశ్వరా! వెదకి వెదకి నీ జాడ వివరములను విచారించి ఈ వేంకటగిరి మీద నీ శ్రీపాదములను కనుగొన్నానయ్యా!" అని ఆ పల్లవి అర్థం. మనం నేడు వాడుతున్న తెలుగునకు అన్నమయ్య కాలంనాటి తెలుగునకు యెంత వ్యత్యాసం వున్నదో గమనించండి. ఏయే పరిస్థితుల్లో తను శ్రీహరిని వెతికాడో కూడా వివరిస్తున్నారు. ఆయన సర్వాంతర్యామి. ఎక్కడైనా వుంటాడు, ఎలాగైనా వుంటాడు. పరమయోగీంద్రుల హృదయపంజరాలలో వుంటాడు. పద్మవనంలో శ్రీనివాసుడై సుందరీమణులతో నృత్యం సలుపుతూ వుంటాడు. ప్రతి జీవిలోనూ దాగికొని అంతర్యామివలె వుంటాడు. ఈ లోకమే నీవైనప్పుడు నీవీ లోకంలో యెక్కడుంటావో యెలా వుంటావో యెవరు చెప్పగలరు? యెలా చెప్పగలరు? అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! చొప్పులు యెత్తుచును (నీజాడ వివరములను) ఇన్నాళ్ళు వెదకి వెదకి విచారించితిని (వాకబు చేశాను). ఇదివో ఈ శ్రీవేంకటగిరి యెదుటనే నీ శ్రీపాదములను (మంగళకరమైన పాద పద్మములను) కంటిని (దర్శించాను). ధన్యుడినయ్యాను తండ్రీ!

దేవా! కొంతమంది యేమన్నారంటే, ఈ స్వామి తిరుమల శిఖరాలపైనున్న తులసీవనంలో కాపురముంటాడు అన్నారు. వారట్లనగా విని అక్కడంతా వెదికాను. మరికొందరు ఈ స్వామి, అనిశమ్ము (యెల్లప్పుడూ) పద్మవనములో సుందరమైన వనితల నడుమ చలోక్తులాడుతూ కనబడతాడన్నారు. ఆ వనమంతా అణువణువు గాలించాను. అటుపైన ఇంకొందరు లేదు లేదు ఈయన నాదబ్రహ్మ, గాన ప్రియుడు కాబట్టి ఈయన దాసులు యెక్కడ ఈయన కీర్తనలు

మధురంగా పాడుతుంటారో ఈయన అక్కడే తిష్ఠ వేసికొని కూర్చొని తన్మయత్వంతో వింటుంటావన్నారు. నీ కీర్తనలు పాడే చోట్లకు పరుగులెత్తి గాలించాను. ఇంకొక గడుసువాడు స్వామి యినమండలము (సూర్యమండలంలో) వుండటం నేను విన్నానన్నాడు. ప్రభూ! నాకు నిన్ను సూర్యమండలంలో వెదికే సత్తావున్నదా? కానీ నా అదృష్టం కొద్దీ ఈ శ్రీవేంకటగిరి మీదనే నీ పాదములను కనుగొన్నాను.

ఓ శ్రీనివాసా! పురాణేతిహాసాలను చెప్పే ఒకాయన మీరు పురాణాలు వినరా? స్వామి క్షీరసాగరమున ఆదిశేషునిపై పవళించియుంటాడు, యెప్పుడూ అక్కడ వెదకమన్నారు. మరి కొందరు నీవు భూమ్మీదసాగరమే దాటలేవు చాలు చాల్లే ఆయన వైకుంఠంలో వెలుగొందుతుంటాడు అక్కడనుండే భావనలో నీ భావనా శక్తిచేత సర్వము గమనిస్తుంటావని అన్నారు. ఇంకొక వేదాంతి యేమన్నాడంటే, ఈయన దాకొని (దాగికొని) సర్వజీవులలో యెప్పుడు అంతర్యామిగా (ఆత్మరూపంలో) వుంటాడు అన్నారు. ఇంకొకాయన లోకమే పరమాత్మ. పరమాత్మయే లోకము. లోకంలో ప్రతిచోటా ఆయన వుంటాడన్నారు. ఎన్నిచోట్లు వెదకను? ఇదిగో ఈ వేంకటగిరిపై నావెదకులాట ఆపేశాను.

జ్ఞానులైన కొందరు "యోగిహృద్యాన గమ్యం" అనేమాట వినలేదా? ఈస్వామి, పరమయోగీంద్రుల తలపోతల భావనా రూపుడవై వుంటావన్నారు. పరిపరివిధములైన (అనేక రకములైన) పుణ్యకర్మలు (యజ్ఞయాగాది క్రతువులు) చేసే చోట, పాయక (విదలకుండా) చరింతువన్నారు (తిరుగుతుంటావన్నారు). ఇంకొక శృంగార ప్రియుడైన కవి ఈయన యెప్పుడూ దేవి అలమేల్మంగ కౌగిలిలో యెప్పుడు వాడక (నిశ్చింతగా) వుంటావన్నారు. ఇరవుగా శ్రీవేంకటేశ్వరుడు, ఈయనే అన్నారు. మరి నేను ఇంకాయెక్కడో వెదకటందేనికి?

సంపుటి: 15 కీర్తన : ఆ మూరితియే యీ మూరితి అందునిందు భేదములేదు

సంఖ్య : 441 పుట : 296 రాగం: వరాళి

వరాళి

74 ఆ మూరితియే యీ మూరితి అందునిందు భేదములేదు
సోమార్కనేత్రుఁడ విశ్వరూపములు చూచినవారమే మును నేము

॥ పల్లవి॥

బలిమితోడ వత్సాపహరణమున బ్రహ్మకు నీమాయ చూపితివి
విలసిల్లఁగ రణభూమిని నరునకు విశ్వరూప మటు చూపితివి
అలరిన నీ రూపు జలమధ్యంబున అక్రూరున కటు చూపితివి
చెలఁగి కుమారస్వామికి నారూపు శ్రీవేంకటగిరిఁ జూపితివి

॥ఆ మూరితి॥

దైవికముగ దుర్యోధనుసభను ప్రతాపము నీ రూపు చూపితివి
ఆ విధముననే నీ రూప ముందంకునాశ్రమమున నటు చూపితివి
నీవిధ మెఱుఁగని భీష్మకునకు మఱి నిర్మలరూపము చూపితివి
శ్రీవేంకటగిరి నా రూపంబే చేరి పరుషలకుఁ జూపితివి

॥ఆ మూరితి॥

పుట్టినపుడే వసుదేవునకు చతుర్భుజముల నీ రూపు చూపితివి
జట్టిగ గొల్లెతలకు రూపము రాసక్రీడలలోఁ జూపితివి
యిట్టే నారదునకు ద్వారకలో యింటింట నీరూపు జూపితివి
పట్టుగ శ్రీవేంకటేశ్వర ఆ రూపమె మాకిప్పుడు చూపితివి

॥ఆ మూరితి॥

అవతారిక:

తనయెదుట కనుపిస్తున్న సుందరమూరితియైన శ్రీవేంకటేశ్వరుని నిలువెత్తు మూర్తిని చూస్తూ పులకితగాత్రుడైన పెదతిరుమలాచార్యులవారు పాడిన రమణీయమైన కీర్తన నాస్వాదించండి. ఆనాడు రేపల్లెలో అన్ని లీలలను చూపిన ఆ మూరితి (ఆ శ్రీకృష్ణమూర్తి) ఈ మూరితీ ఒక్కరే. అందునిందు భేదములేదు అని ధృవీకరిస్తున్నారు. మేము కూడా భాగవత గాథలు చదివాము. ఓ రవిచంద్ర నేత్రుడా! నీ విశ్వరూపమును గూర్చి మేమూ విన్నాములే స్వామీ! అని కీర్తిస్తున్నారు. నారాయణతత్త్వము నెఱింగిన వాడినని నారదమహర్షికి గొప్ప గర్వం వుండేది. పరమాత్మ తత్త్వమేమంటే తన ప్రియ భక్తుడు చెడిపోతుంటే చూస్తూవూరుకోడు. వాడిని తిరిగి సక్రమమైన దారిలో పెట్టేదాకా ఆయన విశ్రమించడు. నారదుని మనసులో శ్రీకృష్ణునిపై శంకమొదలయింది. పదియారువేలమంది రాచకన్నెలను నరకాసురుని చెఱనుండి విముక్తి ప్రసాదించాడు శ్రీకృష్ణుడు. కాని, వారు చెఱబట్టబడిన మమ్ము చెఱవిడిపించిన రక్షకుడవుగాన మాకు భర్తవై మమ్ము వుద్ధరించమన్నారు. తనకే కోర్కెలేకపోయినా వారి విన్నపమును మన్నించి పరిణయమాడినాడు స్వామి. కానీ పదియారువేలమందికి భర్తగా న్యాయం చేయగలడా అనే సందేహం నారదునికీ వచ్చింది. ఆయన తిన్నగా ద్వారకవెళ్ళి నిజం నిగ్గు తేల్చాలనుకొన్నాడు. కాని నారదుని దిమ్మతిరిగినంత పనయింది. ద్వారకలో పదివేలమంది కృష్ణులు పదివేల ఇండ్లలో పదివేల రకాలైన గృహస్థాశ్రమధర్మాలు నిర్వహిస్తూ కనుపించాడు. అదీ కృష్ణలీల అంటే.

భావ వివరణ:

ఆ మూరితియే (అలనాడు రేపల్లెలో ద్వాపరయుగంలో శ్రీకృష్ణలీలలను ప్రదర్శించిన ఆ మూర్తియే) యీమూరితి (ఈనాడు ఈ తిరుమల శిఖరాలమీద పొడవుకు పొడవైన పురుషోత్తమునివలె దృగ్గోచరమవుతున్న

శ్రీవేంకటరమణమూర్తి). అందునిందు భేదములేదు. మేమూ, భాగవత కథా శ్రవణముచేత మును (పూర్వము) సూర్యచంద్రులే నేత్రములుగా విలసిల్లిన విశ్వరూపుని మా హృదయమున చూచిన వారమే (దర్శించినవారమే). కావాలంటే ఆ లీలల్లో కొన్నింటిని పునశ్చరణ చేస్తాను విని తరించండి.

ఓ దేవా! బ్రహ్మదేవుడు, వత్సాపహరణమును చేశాడు. (నీవు బాలకృష్ణునివలె ఆవుదూడలను కాస్తుంటే, నిన్నేడిపించాలని లేగదూడలను గోపాలురను మాయం చేశాడు.) నెల రోజులపాటు రేపల్లెలో ప్రతి గోపబాలుని ఇంట్లో కృష్ణుడు తానే ఆ బాలుడైవుండి ఆనందపరచాడు. అసలేం జరుగుతున్నదో అర్థంకాని బ్రహ్మ కాళ్ళబేరానికి రాక తప్పలేదు. ఆనాడు బ్రహ్మకు నీమాయ చూపితివి. కురుక్షేత్ర రణరంగమున అర్జునునకు జ్ఞానమొసంగుటకు నీవిశ్వరూపమును ప్రదర్శించితివి. అక్రూరుడు కృష్ణుని కంసునివద్దకు కొనిపోవుచున్న సమయమున రథమునందును అక్రూరుడు అర్ఘ్యమిచ్చుచున్న యమునలోనూ ఒకే సమయమున, కనుపించి ఈతడు మానవమాత్రుడు కాదని తెలియజేసినాడు. ఒకనాడు శివపార్వతీనందనుడైన కుమారస్వామి వైకుంఠంలో శ్రీహరిని దర్శిద్దామని వెళుతుంటే, తాను ఈ కలియుగమున శ్రీవేంకటగిరిపైననే వున్నానని శ్రమపడి వైకుంఠం రావలసిన అవసరం లేదనీ శ్రీవేంకటగిరిపైననే తన దివ్యదర్శనమిచ్చాడు.

అలనాడు కురుసభలో రారాజు దుర్యోధనుడు శ్రీకృష్ణుని బంధించి పాండవులకు కృష్ణుని అండ రూపుమాపాలని సంకల్పించాడు. ఆనాడు ఆగ్రహోదగ్రుడైన శ్రీకృష్ణుని కనీసం తేరిపార చూడలేకపోయింది దుష్ట చతుష్టయం. మరి ఆ దేవదేవుని ప్రతాపమట్టిది. ఉదంకుడను మహర్షికి

ఈగోపబాలుడు వెర్రి గొల్లవాడు కాదు విష్ణుమూర్తియేనని స్ఫురింప జేసినాడు. శ్రీకృష్ణుని మామగారు రుక్మిణీదేవి తండ్రికి కూడా రుక్మిణీదేవిని అపహరించిన యాదవుడు కృష్ణుడు తన పుత్రుడైన రుక్మిని సగము మీసము గొరిగి అవమానించాడని వైషమ్యం వుండేది. అది అతనిముక్తికి అవరోధమయిందని కరుణతో తన శ్రీహరిరూపము చూపి, నిర్మల చిత్తునిచేసి, మరీ మోక్షమిచ్చాడు. అదే రూపాన్ని ఈనాడు నాబోటి అనామకులు కూడా చూచి తరించేటందుకు మానవమాత్రులందరికీ నీ వరదహస్తం చూపి పాపవిముక్తులను చేస్తున్నావు.

మూడు జన్మలలో నీకు తండ్రియై నీ ప్రేమానురాగములను పొందిన వసుదేవునకు నీవు శిశువువై జన్మించిన మరుక్షణముననే అతని పుణ్యవిశేషమున శ్రీమన్నారాయణుడే స్వయంగా తనకు పుత్రుడైనాడనే స్ఫురణనిచ్చినాడు. ఆనాడు రాసక్రీడాసమయమున పండు వెన్నెలలో యమునా తటివద్ద, నారీ నారీనడుమ ఒక మురారియై, హరికీ హరికీ మధ్య ఒక వయ్యారియై అది స్త్రీ పురుష సంగమము కాదనీ ఆత్మపరమాత్మల సంగమమని వారికి దివ్యానుభవం కలిగించాడు. ఒకనాడు నారదుడంతటి మహర్షికి భ్రమ కలిగి పదివేలమంది రాచకన్నెలను పరిణయమాడిన కృష్ణుడు వారికి పతిగా న్యాయమెలా చేయగలడని శంక కలిగింది. పరీక్షించుటకు ద్వారకయ వెళ్ళిన నారదునికి ఇంటింటా ఒక కృష్ణుడు భర్త బాధ్యతలు నెరవేరుస్తూ కనుపించి కనువిప్పు కలిగించాడు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఆనాటి భాగవతులంతా నీ మహిమ దర్శించుటకు అన్ని తిప్పలు పడ్డారు. కాని మేము నేడు సునాయాసంగా తిరుమలలో ఆ భాగ్యాన్ని పొందుతున్నాము.

సంపుటి: 15 కీర్తన : ఎక్కడ వోయెనో జాతస్మరత్వము
యేమిసేయగలవాడను నేను
సంఖ్య : 437 పుట : 294 రాగం: గుజ్జరి

గుజ్జరి

75 ఎక్కడ వోయెనో జాతస్మరత్వము యేమిసేయఁగలఁవాఁడను నేను
దిక్కు నీవే హరి నన్నుఁ గాచుటకు దేవదేవ యిఁక బోధించవే

॥పల్లవి॥

తిరముగ జన్మాంతరమున సంపాదించిన సుజ్ఞానంబున
స్మరించి యీ పుట్టుగునఁ గడమ నే సాధించెడ నని యంటినా
అరయఁ దల్లిగర్భంబున వెడలినయపుడే అన్నియు మఱచితిని
ధరలోపల నే విడువక ద్రావిన మరులుఁబాలు నను మంకుఁజేసెను

॥ఎక్కడ॥

అంతట నేఁ బెద్దపెరిగి బుద్ధెతిఁగి అటు నీమాయాప్రపంచమునను
చెంతల బహువిధసృష్టిలోఁ దగిలి చిక్కువడుచు నే భ్రమసితిని
చింతించే నే మతిపెక్కులు చదువుచు చిత్తములో
బహుసంశయములఁబడి
అంతట నంతట జరగి జరగి కడు నజ్ఞానముపాలైతిని

॥ఎక్కడ॥

ముదిసినపిమ్మట లోభమోహములు ముంచుకొనఁగ నటు లోలుఁడ నైతి
వదలక భువిపై బ్రహ్మదేవుఁ డటు వ్రాసినవ్రాతలు నిజమాయె
చెదరక యలమేల్మంగ విన్నపముచేకొని శ్రీవేంకటేశ కాచితివి
బ్రదికితి నిఁక నాచార్యునియానతి ఫలియించెను నా భాగ్యమువలన

॥ఎక్కడ॥

అవతారిక:

ఓ శ్రీహరీ! నేనేమి చేయగలనయ్యా! జన్మాంతరములనుండి నేను సంతరించుకొన్న జ్ఞానం ఎక్కడికి పోయింది? ఇట్టి పరిస్థితుల్లో నాకు దిక్కు దేవదేవుడవైన నీవే కదా! పోనీ ఈ జన్మలో నేను సంపాదించిన సుజ్ఞానం నాకు వచ్చే జన్మలోనన్నా ఉపయోగపడుతుందిలే అనుకొందామంటే ఇంకొక అమ్మకడుపులో పడగానే క్రితం జన్మవరకూ నేను సంపాదించిన జ్ఞానమంతా ఇగిరిపోతున్నది, అని వాపోతున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. మరుజన్మలో జ్ఞానం లభ్యమవటం అటుంచి ఈ మాయా ప్రపంచంలో గల పెక్కు భ్రమలనుండి బయటపడి చదివిన చదువుల సారం గ్రహించి చిత్తములోగల పెక్కు సంశయములను నివర్తించుకోలేకనే పోయాను. జీవితం గడుస్తున్నకొద్దీ నా అజ్ఞానము పెరిగిందే కాని తరుగలేదు. వయసు పెరుగుతున్న కొద్దీ లోభమోహములు కూడా పెరిగి ముంచేశాయే కాని తక్కువకాలేదు. చివరికి మా ఆచార్యులవారి కృపవలన నా భాగ్యము ఫలించి శ్రీవేంకటేశుని దారినబడి బ్రతికిపోయాను అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నా జాతస్మరత్వము (పుట్టుకతో వచ్చిన స్మరణ) ఎక్కడ వోయనో (యెక్కడకు పోయిందో) తెలియదు. నేను యేమి చేయగలవాడను? నన్ను గాచుటకు (రక్షించుటకు) ఓ శ్రీహరీ! నాకు దిక్కునీవేయై ఈ సుజ్ఞానమును బోధించవయ్యా!

నేను నా గత జన్మలలో నేర్చిన సుజ్ఞానమును, తిరముగ (స్థిరముగా) స్మరించి ఈ జన్మలో సాధించెదములే అనుకొంటే అది జరిగే పనిలా నాకు కనబడటం లేదు. ఈ జన్మలో నాతల్లి కడుపులోనుంచి బయటకు పడగానే

అన్నీ మఱచిపోయాను. నా గత జన్మస్మృతి ఒక్కటి కూడా మిగలలేదు. ధరలో (ఈభూమిపై) కొత్తతల్లి చనుబాలు త్రాగుతూనే నేను విడువక మంకుజేసేను (మొండిపట్టుదల, ఏడ్చి అయినా సాధించుకోవాలనే మనస్తత్వం) దినదిన ప్రవర్ధమానమైనది.

అంతట (ఆపైన) నేను పెద్దగా పెరుగుతున్న కొలదీ బుద్దెఱుగుట (మంచి చెడ్డలు తెలియుట) మొదలయ్యింది. అటు (ఆ విధముగా) నీమాయా ప్రపంచంలో, బహువిధములైన నీ సృష్టి వైచిత్రిలో తగులుకొని చిక్కువడుచుయ నేను భ్రమసితిని (భ్రమలోపడి చేతకానివాడనయ్యాను).

భ్రమలోపడి గొప్ప పండితుడనవ్వాలని కనబడ్డ శాస్త్రాలన్నీ చదివాను. పెక్కులు చింతించి (అనేకమైన విషయములను నేర్చినాను.) దానివల్ల నా సంశయములు ఇబ్బడికి ముబ్బడి అయినాయే గానీ నాకేమీ మేలు కలుగలేదు. సందేహాలతో, తర్క కుతర్కాలతో ముందుకు సాగిన కొలదీ ఇంకా యెక్కువ అజ్ఞానంపాలైతిని. ఈ చక్రభ్రమణంలో అనేక దుర్గుణాలూ వచ్చి చేరుతాయి. సరే, చూస్తుండంగానే ముదిసిన పిమ్మట (వయస్సు పెరుగుతున్నకొలదీ) లోభము మోహమూ నన్ను తగులుకొని ముంచుకొనగ (యేమార్చగా) అటు (ఆ విధముగా) లోలుడనైతిని (స్వాధీనుడనై పోయాను). ఆ విధముగా బ్రహ్మదేవుడు పట్టుబట్టి వ్రాసిన నా నుదుటి వ్రాతలు నిజమైనవి. అయినదేదో అయినది, నేను భయపడక మా అమ్మ అలమేల్మంగకు అనేక విన్నపములు చేసి ఆమె నాధుడైన శ్రీవేంకటేశుని నన్ను కాస్త కరుణించమని మా స్వామికి చెప్పమని మొఱబెట్టుకొన్నాను. అప్పుడు ఆ స్వామి నన్ను రక్షించాడు. ఇక బ్రతికిపోయాను. మా ఆచార్యుని ఆజ్ఞ ఫలించింది. నా భాగ్యమువలన నేను ధన్యుడనయ్యాను.

సంపుటి: 15 కీర్తన : జగన్నాథా నీకొక్కనికి శరణు చొచ్చితిమి కావగదే

సంఖ్య : 403 పుట : 271 రాగం: భూపాళం

భూపాళం

76 జగన్నాథా నీ కొక్కనికి శరణు చొచ్చితిమి కావఁగదే
అగపడి మాలో నున్నాఁడ వనుచు నానతియిచ్చెను మా గురుఁడు

॥పల్లవి॥

కలదు వొకానొకయదృష్ట మందురు కనుఁగొనలే రెవ్వరును
తొలుతు జనించిన జన్మము లెంతురు తెలియ నశక్యములు
యెలమిని స్వర్గము గలదట ముందర కెక్కడనున్నదో మిన్నులపై
వెలుపల నిట్టి విశేషంబులు నే వెతకఁగ నా తరమా

॥జగ॥

పొదుగుకొన్న దిదే కర్మమెయందురు పొడచూపులలేదెక్కడను
యెదిటిది మాయాకల్పితమే యట యెట్లు గురుతుపడు మాకును
కదిసి చరాచరములకు నెప్పుడును కాచుకొన్నది విధియని చెప్పేరు
విదితము లైనవి యెక్కడెక్కడని వెతకఁగ నా తరమా

॥జగ॥

అనుభవించువాఁ డాత్ముఁడే యందురు అణురూపం బని తలఁచఁగ రాదు
తనువు సాధనము సర్వంబున కట తగులిదె కంటిమి దృష్టముగా
ననయంబును శ్రీవేంకటేశ్వరా యలమేల్మంగవిభుఁడా
నినుఁ గొలిచితి నిన్నిటికీ సెలవుగా నీమహి మెఱుఁగఁగ నా తరమా

॥జగ॥

అవతారిక:

భగవంతుడైన శ్రీమన్నారాయణుడు యెక్కడో వైకుంఠపురంలో మందారవన ప్రాంతంలో రమాదేవితో వినోదంగా పాచికలాడుతూ వుండడు. ఆయన యోగి హృదయావనములలో సంచరించెడు పరమహంస. జగన్నాథుడైన ఆయనొక్కని ఆశ్రయిస్తే చాలదా? అందుకనే తనతండ్రి అన్నమాచార్యులవారి వలెనే తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు కూడా ఓ జగన్నాథా! నీకొక్కనికే శరణు జొచ్చితినయ్యా! నన్ను కావగదే అని వినమ్రులై వేడుకొంటున్నారు. మా గురుపుంగవులు యేమి చెప్పారో తెలుసునా స్వామీ! నీవు వైకుంఠంలోనూ లేవు యోగుల హృదయాలలోనూ లేవు. నీవు మాలోనే అంతర్యామిగానున్నావు. నీకోసం అక్కడ ఇక్కడా వెదకుట అర్థంలేని పని. ఈ పౌరాణిక విశ్వాసంతో స్వర్గం కోసం ఆశించడం యెంత అర్థంలేని పని? ఈ మాయాపరివృతమైన జగములో అన్నీ అనిత్యాలే. చరాచరమైన యన్నిటిని ప్రేరేపించి నడిపించునది "విధి"యట మరి ఆ విధి లీలలను అర్థం చేసికొనుటకు యెక్కడెక్కడని వెతకను? సరే ఈ విధికి భోక్త (అనుభవించువాడు) ఆత్మ అయితే మరి అతనెక్కడుంటాడు? యెలావుంటాడు? ఓ తిరువేంకటేశ్వరా! అనవసరమైన ఈ జ్ఞానంతో అజ్ఞానినైపోతానేమో? అయ్యా! వీటన్నిటినీ అర్థం చేసుకొనే శక్తి నాకున్నదా? అంటున్నారు.

భావ వివరణ:

ఓ జగన్నాథా! నేను అశక్తుడనయ్యా! నీ మహిమ నీ లీలావిలాసము నెరుగుటకు నేనెంతవాడనయ్యా! నీకొక్కనికి నేను శరణుజొచ్చితిని. నన్ను గావగదే (రక్షింపగదే!) మా గురువులు నీవు మాలోనే వున్నావని ఆనతిచ్చినారు. మరి మాకొకసారి నీ అనుభవము కలిగించరాదా స్వామీ!

అదృష్టమనేది కలదు కలదనే పెద్దలంతా చెబుతున్నారు. కాని అదెవ్వరికినీ కనబడుట లేదు. ఈ అదృష్టము మన తొలి జన్మములలో

చేసికొన్న పుణ్యవిశేషమే... ఈ జన్మలో అదృష్టం వలె వున్నట్లుండి దర్శనమిస్తుందంటున్నారు. మరి దాని తీరుతెన్నులు తెలిసికొనుటకు శక్యమగుటలేదు. కొంతమందేమంటున్నారంటే యెలమి (వికాసముతో) మంచి పనులు చేసి ఆ స్వర్గంలో చక్కగా సుఖాలు అనుభవించండయ్యా! అంటున్నారు. అదెక్కడో మిన్నుల (ఆకాశంలో) వుందట. ఓ సర్వేశ్వరా! వెలుపల (ఆ నింగిలో) ఇటువంటి విశేషాలను పనివేళా వెదకుట నావలన అవుతుందా తండ్రీ!

ఇదిట్లావుండగా మరికొంతమంది వుంటారు. వారు మంచి జరిగినా చెడు జరిగినా నీ కర్మ వశంబుననే జరిగిందంటున్నారు. ఏదో ఒకటి జరుగకుండా యెలావుంటుంది చెప్పండి. సాధ్యంకాదు కదా! మన యెదుటునున్న ఈ ప్రపంచమంతా మాయా కల్పితమట. సరే, బాగానేవున్నది మరి మేము, ఈ మాయను యెట్లు గుర్తించగలము? చరాచరమైన ఈ జగత్తులో "విధి" అనే అభేద్యుడు యెప్పుడూ కాచుకొని కాటువేయటానికి సిద్ధంగా వుంటాడట. ఆ కాటునుంచి తప్పించుకోవటం యెవరి తరమూ కాదట. ఈ విధంగా ఈ విధి గురించి చెబుతుంటే దీనికోసం నేను యెక్కడెక్కడని వెదకను? అది నా తరము అవుతుందా తండ్రీ!

పెద్దలు అనుభవజ్ఞులూ యేమి చెబుతున్నారంటే, భోక్త (కర్మఫలముననుభవించేవాడు) ఆత్మయేనట. వాడు అణురూపంలో దేహమంతా నిండివుంటాడట. కానీ తనువు (ఒక శరీరం) లేకపోతే జీవి తన కర్మఫలముగా వచ్చే సుఖదుఃఖాలను యెలా అనుభవించగలడు? తగువిదె (వచ్చిన చిక్కుముడి ఇదే). ఓ శ్రీవేంకటేశ్వరా! అలమేల్మంగమ్మ మనోవల్లభా! అనయంబు (సదా) నిన్ను గొలిచితిని. ఇన్నిటికీ (ఈ జరుగుతున్న వాటన్నిటికీ) నీ మహిమే సెలవు (ఆజ్ఞ) వంటిది. దానిని యెఱుగుట నా తరమా ప్రభూ!

సంపుటి: 15 కీర్తన : కాదని తోయగ నెంతటివారలు
ఘనసంసారులు నరులను సురలును

సంఖ్య : 267 పుట : 181 రాగం: బౌళి

బౌళి

77 కాదని తోయఁగ నెంతటివారలు ఘనసంసారులు నరులును సురలును
నీ దాసులతో సంగతిసేయఁగ నిర్మలచిత్తం బయ్యెఁగాక ॥పల్లవి॥

హరి నీ మాయె విజృంభించు నట నడఁచే మన నెవ్వరితరము
దరిగొని నీకె మొక్కఁగ తానే మన్నించీఁగాక
నిరతి నీ యాజ్ఞ జగతిఁ జెల్లునట నెట్టన నిది గడచేవా రెవ్వరు
ధరణిలో నీ వారమని యీడుకొనఁగ తప్పులుపట్టక కాచీఁగాక
॥కాదని॥

ధాత నీ సుతుఁడు పుట్టించువాఁడట తగదని తోయగ నెవ్వఁడోపునిఁక
అతుమలో నిను ధ్యానము సేయఁగ నతఁడే మొగమోడీఁగాక
ఘాతల మదనుఁడు మదమురేఁచునట కాదని గెలువఁగఁగలరా యెవ్వరు
రాతిరిఁ బగలును నిన్నె జపించఁగ రతిఁ గైవస మయ్యెఁగాక
॥కాదని॥

నీ కల్పిత మగు కర్మమంటునట నెఱి విడిపించఁగ సమర్థులెవ్వరు
చేకొని నీవేగతి యని యుండఁగ చిక్కులఁబెట్టక చనుఁగాక
యీ కడ శ్రీవేంకటేశ్వర నీవే యెందుఁ జూచినా నంతరాత్మ వట
పైకొని నిన్నే నమ్మివుండఁగాఁ బ్రసన్నుఁడవు నీవయ్యేవుగాక
॥కాదని॥

అవతారిక:

ఎంతటివారలకైనా ఈ సంసారము నిత్యము, సత్యము, సంతుష్టము అనే అనిపిస్తుంది. ఎన్ని కష్టాలుపడుతున్నా ఇదంతా మా ప్రారబ్ధం

అనుకొంటారేగాని, లోపం అది కల్పించే మాయలోవుందని గ్రహించలేరు. కానీ శ్రీవేంకటేశుని దాసులు మాత్రం ఈ ఝంఝూటము నుంచి బయటపడి నిర్మలాంతఃకరణతో విలసిల్లుతారంటున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు.

వైరాగ్యం కలగాలంటే శ్రీహరి కృప కావలసిందే. ఆయన దయలేకపోతే ఈ సంసారం మీద యేనాటికీ విరక్తి కలుగదు. అయ్యో! ఇట్లా చేసివుంటేబాగుండేదే? ఇదంతా ఆ దుర్మార్గుడివల్ల అయింది, అనే వైషమ్యభావాలతో తను శాంతితో వుండడు, ఇంకొకరిని శాంతితో వుండనీయడు. ఇదంతా హరిమాయయే. మాకెంత జ్ఞానవైరాగ్యాలున్నా నీ కొడుకులతో వస్తున్నదయ్యా! చిక్కంతా. మీ పెద్దబ్బాయి బ్రహ్మయ్యగారు వ్రాసినవ్రాత కాదనగలమొనగాడెవరయ్యా! పోనీ మీ చిన్నబ్బాయి మదనుని నిగ్రహించగల ధీరుడున్నాడా? రేయింబవళ్ళూ నీ ధ్యాసవుంటే యేమోగాని మామూలు మానవమాత్రులు రతిగైవసముకాకుందురా? ఓ దేవదేవా! నీవే అంతర్యామివని సుస్థిరమైన నమ్మికతో వుంటే గాని నీవు మాయందు ప్రసన్నుడవగుట అనునది అంత తేలికగా జరిగేపని కాదు స్వామీ! అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నరులకైనా సురులకైనా, మరి వారెంతటివారైనా నీమాయావృత ఘన సంసారమును తరించుటకు సాధ్యమా? ఎంతటివారలకైనా దీనిని కాదని తోయగ (నిరాకరించుట) సాధ్యమా? కానేకాదు. కాకపోతే ఒక సౌలభ్యమేమంటే నీ దాసులతో సంగతిసేయగ (స్నేహపూర్వకమైన సేవ చేస్తే) నిర్మలచిత్తం బయ్యాగాక! (పరిశుద్ధ చిత్తము గలవారై రాగద్వేష రహితులై వుండగలరు).

ఓ శ్రీహరీ! నీమాయ విజృంభించునైజము కలదియట, మరి దానిని అణచటం యెవరి తరము అవుతుంది? దరిగొని (దానిని ఆశ్రయించి, శరణని) నీకే మొక్కంగ నీ మాయ తానే మమ్మల్ని మన్నించి

అనుగ్రహిస్తుంది.. నీవు నిరతితో (కావాలని విధించిన) ఆజ్ఞలను కాదనగల సామర్థ్యమెవ్వరికి వుంటుందయ్యా! నెట్టన (అనివార్యమైన) ఇది నీ ఆజ్ఞను వుల్లంఘించుట యెవరితరమవుతుంది ప్రభూ! మరి ఇక దారేమిటి? ధరణిలో (ఈ భూమ్మీద) నీవారమని (నీ దాసులమని) యాడుకొనగ (చెప్పుకొంటూ సన్మార్గంలో వుంటే) అప్పుడు నువ్వు తప్పులు పట్టక (మా నేరము లెంచక) కాచేవు (రక్షిస్తావు).

నీ సుతుడు అయిన ధాత (బ్రహ్మదేవుడు) పుట్టించువాడట. అదీ నీ ఆజ్ఞ ప్రకారమే. మరి ఇక ఆయన వ్రాసిన వ్రాతను తగదని తోయగా (వద్దని నిరాకరించటం) యెవడికి సాధ్యం? నిన్ను దేవదేవుడని నా ఆత్మలో మనస్ఫూర్తిగా నమ్మి నీ ధ్యానము చేస్తే, అతడే మొగమోడీగాక! (నీ కృపకు పాత్రుడవుతాడు). ఆ శ్రీహరికి ఇంకో ఘాతలమైన (ఘోరమైన) కొడుకు వున్నాడు. వాడిపేరు మదనుడు (మన్మధుడు). వాడి వుద్యోగమే మదమును పెంచుట. "కామాతురాణాం నభయం నలజ్జా" వాడినెవ్వరూ గెలువలేరు. పైగా వాడి వశమైతే సిగ్గూ మర్యాదకూడా వదలివేస్తారు. మరి ఆ రతీదేవి మొగుడు అజేయుడా? రేయింబవళ్ళు నిన్నే (శ్రీహరినే) జపించగ ఆ మన్మధుడు కైవసమవుతాడు (స్వాధీనమవుతాడు).

ఓ ప్రభూ! నీవు కల్పించిన ఈ కర్మము ఒక్కసారి అంటుకొన్నదంటే ఇక జిడ్డులాగ వదలదు. దాని నుండి మమ్మల్ని విడిపించగల సమర్థులెవరయ్యా? చేకొని (దానిని భరించి) అయిందేదో అయింది, స్వామీ నీ దయ మా ప్రాప్తం, నీవేగతి, అనివుంటే ఆయన చూసి చూడనట్లు వదలివేస్తే చిక్కులు బెట్టక చనుగొని (పోతుందేమోగాని) ఆ కర్మను నిరోధించడం యెవరి తరమవుతుంది? ఓ శ్రీవేంకటేశ్వరా! యెందుజూచినా నీవే మా అంతర్యామిగా వున్నావు. పైకొని (పూనుకొని) నిన్నే నమ్ముకొని వుంటే నీవు ప్రసన్నుడవయ్యేవు. అంతే ఇంకో దారి లేనే లేదు.

సంపుటి: 15 కీర్తన : విన్నప మిదియే వేవేలకు గోవిందా
సంఖ్య : 459 పుట : 303 రాగం: గుజ్జరి

గుజ్జరి

78 విన్నప మిదియే వేవేలకు గోవిందా
సన్నుతించెదను నావలనఁగలుగు సర్వాపరాధము లెంచకుమీ

॥పల్లవి॥

యెఱుఁగమినాది యెఱుక నీపని యేమరి సంసారినైన యిన్నాళ్లును
మఱతును నేను మఱవవు నీవు మదమున సిరు లుప్పతిల్లఁగా
కొఱగాను నేను కొఱగలవునీవు కొమ్మలవలపులఁ దగిలితిఁ గనక
మఱి నీవేగతి రక్షింపుము నామర్మము నీచేతనున్నది సుమ్మీ

॥విన్నప॥

నేరమి నాది నేరుపు నీది నేఁ బుట్టుగులకు లో నైనయపుడే
కోరుదు నేను కోరవు నీవు గొనకొని యాపదలు పైకొనఁగా
దూరుదు నేను దూరవు నీవు తొరలి పురాకృతకర్మము లప్పుడు
యే రీతినైనా నీవే దిక్కింక యిదె నీకు శరణుచొచ్చితిఁజుమ్మీ

॥విన్నప॥

తలచమి నాది తలఁపు నీది యిటు తగ నంతర్యామివి గతకాలము
కొలుచుట నాది కొలువుగొనుట నీది కూరిమితో నే నీకు మొక్కఁగా
ఫలము నాది నాఫలదుఁడవు నీవు పరికింపఁగా శ్రీవేంకటేశ్వర
బలువుఁడవు నీవు నన్ను నేలు నా పాలిదైవమవు నీవే సుమ్మీ

॥విన్నప॥

అవతారిక:

ఓ గోవిందుడా! నీకు నా విన్నపమిదేనయ్యా! నిన్ను సన్నుతించెదనుగాని, నావలన కలుగు సర్వాపరాధములను మన్నించవయ్యా! అని కీర్తిస్తున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. ఎఱుగమి అంటే అజ్ఞానం అని అర్థం. ఓ సర్వేశ్వరా! నాదంతా అజ్ఞానం నాకు జ్ఞానము నిచ్చుటయే నీపని. ఈ సంసారబంధాలలో కట్టుబడి వుక్కిరిబిక్కిరి అయిపోయి యిన్నాళ్ళూ యేమరుపాటనేవున్నాను నేను. అయినా నీవు నన్ను మరువలేదు. నేరమంతా నాదే. నేరుపంతానీది. నీవే కోరిక లేని వాడివి. నాకోరికలకు అంతూ పొంతూ లేదు. ఎలాగైనా నీవే దిక్కువలె నన్ను కాపాడాలి. నాఫలప్రదాతవు నీవే అని గ్రహించేసరికి కాలమంతా గడచిపోయింది. ఏదో విధంగా నాపాలదైవమువై నీవే నన్ను కరుణించాలి. ఏలననగా నీవు లోకపాలకుడవైన శ్రీవేంకటేశ్వరుడవు నేను నీ దాసానుదాసుడను.

భావ వివరణ:

ఓ గోవిందుడా! నా విన్నపము ఇదేనయ్యా! నిన్ను వేవేలకు (అనేక విధముల) సన్నుతించెదను. నావలన గలుగు సర్వాపరాధములను (నా అపరాధములనన్నింటినీ) యెంచకుమీ (పరిగణించకుమయ్యా!) నన్ను మన్నింపుము.

ఓ ప్రభూ! ఎఱుగమి నాది (అజ్ఞానమంతా నాదే). నీపని యెఱుక (మాబోటివారికి జ్ఞానమునీయుటయే నీ వ్యాపనము). ఇన్నాళ్ళూ నేను సంసారలంపటంలో ఏమరి (మదపుతో) వున్నాను. నిన్ను మఱచిపోయాను. కాని నీవు నన్ను మఱువవు. ఈలోగా నేను ఐశ్వర్యవంతుడనయ్యాను. నెత్తిమీదకి కళ్ళువచ్చినట్లయింది నాకు. నేను కొఱగాను (అప్రయోజకుడనైపోయాను). కాని నీవు మాత్రం కొరగలవు

(ప్రయోజకుడవే). ఎందుకంటే కన్నుమిన్నుగానక, కొమ్మలవలపుల దగిలితిని (స్త్రీలతో శృంగార కలాపములను జరిపాను). ఇప్పుడు నా మర్మము నీచేత నున్నది (నాయొక్క బలహీనతలనన్నింటినీ నీకు చెప్పివేశాను). నాహృదయం తేలికబడింది. మఱి నీవేగతి. నన్ను రక్షించను నీచేతనున్నది. రావయ్యా! నన్ను కాపాడు.

ఓదేవా! నాది నేరమి (అజ్ఞానము). నీది నేరుపు (ఆర్తులను సమయానికి ఆదుకొనే ప్రజ్ఞ). పుట్టుకకు లోనైనయప్పుడే (జన్మను పొందుతూనే) కోరుదునేను (నా బుర్రనిండా) కోరికలే. (తల్లి స్తన్యం ఒకటి త్రాగుతూనే ఇంకోదాన్ని భద్రంగా చేత్తో దాచుకొంటాను). అంత కాపీనం నాకు పుట్టుకతోనే ఇచ్చావు). నీవు ఏ కోరికా లేని నిర్మోహివి. నేను ఈ కోరికలవల్ల అంతులేని ఆపదలను కొనితెచ్చుకొంటున్నాను. నా కోరికలకు అడ్డంవచ్చారని కనబడ్డవాడినల్లా దూరుదును (నిందిస్తాను). నీకు శత్రువే లేడు కనుక నీవెవ్వరినీ నిందించవు. దీనివల్ల పురాకృతకర్మలు నాకు అంటుకొంటున్నాయి. దీంట్లోంచి బయట పడటం నాతరం కావటంలేదు. ఇక నీవే దిక్కూ అని నీ శరణుచొచ్చితిని.

స్వామీ! నాది తలచమి (ధ్యానించకపోవుట అనే అపరాధము). నీది (నీ వ్యాపారము) మాకు నీపై తలపు కలిగించుట. మేము ఆ తలుచుకోవటం కూడా మానేస్తామేమోనని మా అంతర్యామిగానేవుంటూ అనుక్షణం గుర్తుచేస్తూనేవుంటావు. గత కాలమునుంచీ నీవు అలాగే వున్నావు. మరి నిన్ను కొలుచుట నాకర్తవ్యమేకదా! ప్రేమతో మాసేవలు స్వీకరించటం నీపని. నీకు భక్తితో మ్రొక్కితే మోక్షము అనే గొప్పఫలమునిస్తావు. మరి ఆ ఫలమునాదే కదా! నీవు మాత్రం నిష్కాముడవైన ఫలప్రదాతవు. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదంతా పరికింపగా నాకేమితోస్తున్నదంటే నీవు బలవుడవు (సర్వసమర్థుడవు). నన్ను యేలే నాపాలిదైవము నీవేతండ్రీ!

సంపుటి: 15 కీర్తన : ఎంతగాలంబైనదప్పదు యెవ్వరికి నేమనగ వచ్చును

సంఖ్య : 275 పుట : 185 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

79 ఎంతగాలంబైనఁ దప్పదు యెవ్వరికి నేమనఁగ వచ్చును
దొంతికడవలలోని కొలుచులు తొలుత పుణ్యములు ॥ పల్లవి॥

కలిమి గలదని వుబ్బ వలవదు కడఁగి లేదని సగ్గ వలవదు
కలసి కలలోఁ గన్న సుఖదుఃఖముల చందములు
వలనుగా రాట్నంపు గుండ్రలవరుస లీ జన్మంబు లెల్లను
చెలఁగి దైవము మున్నె సృష్టించినది యీవిధము ॥ఎంత॥

నేరనని దైన్యం బదేటికి నేర్తునని గర్వం బదేటికి
నారుకొను వడగండ్లగుళ్ళవి నమ్మనే రాదు
కోరి మనసునఁ బాలు దాగినగుఱుతు లీ భోగంబు లెల్లను
వారివారికి నాత్మగుణములు వసుధ నిలిచినవి ॥ఎంత॥

పెద్దదొర నని మీఱఁ దగదు పేద నని తా దాఁగఁదగదు
పొద్దువొద్దును చంద్రబింబముపోల్కి వెలసినది
అద్దుకొని శ్రీవేంకటేశ్వరుఁ డన్నిటికిఁ దను నేలి కావఁగ
బుద్ధి యెఱుఁగుచు లోకపూజ్యతఁ బొసఁగుటే శుభము ॥ఎంత॥

అవతారిక:

ఎవ్వనికైనాగానీ యెంతకాలమైనగానీ ఈ కర్మఫలమును అనుభవించక తప్పదుగాకతప్పదు అంటున్నారు. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. దీనిని యేమనగలము. తొలిజన్మలలో చేసిన పుణ్యములున్నాయే అవి

దొంతిగా బెట్టిన కడవలలో, కొలిచిపెట్టబడిన పదార్ధములవలె యేకుండలో యెంత అనుభవించటానికి వుంటుందో యెవ్వరికీ తెలియని పరిస్థితి. ఏది ఎంతకాలం అనుభవిస్తామో తెలియదు. అందుకని వివేకవంతులు కలిమికి వుబ్బరు, లేమికి నిబ్బరం కోల్పోరు. అజ్ఞానినని దైన్యం పనికిరాదు. జ్ఞానినని విఱ్ఱవీగే గర్విష్టి యెంత అధోగతి పాలవుతాడో అజ్ఞానిననుకొనే రికామికూడా సంఘానికి చేటే. వడగండ్లు పడితే యెవరికైనా అపకారం జరుగవచ్చును యెందుకంటే వడగండ్లు పడటానికి ఒక పద్ధతి ఒక ప్రాతిపదిక యేమీ వుండదు కదా! ఎవ్వడు యెంతటివాడైనా శ్రీవేంకటేశ్వరుని కృపవుంటేనే బుద్ధిమంతుడై లోకపూజ్యత సంపాదిస్తాడు శుభములను పొందుతాడు. హరికృప లేకపోతే యెంతయెత్తుకెదిగినా అక్కడనుంచే అధః పాతాళానికి పడిపోతాడు.

భావ వివరణ:

ఎంతకాలంబైనను, జీవులకు తొల్లిటి కర్మఫలమును అనుభవించక తప్పదు. ఎవ్వరికిని (ఎవ్వరినైనా) యేమనగవచ్చును (యేమని అనగలము?) తొలుత పుణ్యంబులు (తొలి జన్మలలో చేసిన పుణ్యకార్యములు) దొంతికడవలలోని (ఒకదానిపై ఇంకొకటి దొంతరగా పేర్చిన కుండలలోని) కొలుచులు (కొలిచియుంచబడిన పదార్ధములు). దేంట్లో, యేది యెంత వున్నదో యెవ్వరికీ తెలియదు.

కలిమి గలదని వుబ్బి (పొంగిపోవుట) వలవదు (తగదు). కడగి (యెంతప్రయత్నించినా) కలిమి లేదని సగ్గవలవదు (క్షీణించియుండుట తగదు). ఈ సిరి సంపదలున్నాయే, ఇవి కలలోగాంచిన సుఖదుఃఖములవంటివి. కలలో ఐశ్వర్యమైనా క్షణికమే దుఃఖమైనా క్షణికమే. అవునా? వాటి చందముగానే (మాదిరిగానే) ఇవి

శాశ్వతమనుకోరాదు. ఈ జన్మలున్నాయే, ఇవి రాట్నంపు గుండ్రల వరుసలు (రాట్నం గుండ్రముగా తిరుగుతున్నప్పుడు ఒకసారి వున్నతమైన యెత్తుకెళ్ళిన 'కమ్మీ' ఇంకోసారి అన్నిటికంటే అడుగునకు పోతుంది.) మానవుని విజృంభణలు వెలవెలబోవుటలు – రెండూ తాత్కాలికమే. ఏది యెప్పుడు, యెలా జరుగవలెనో దైవముమున్నె (ఇదివరకే) సృష్టించి (నిశ్చయించి) ఈ విధమును నిర్దేశించినాడు.

నేరనని (నేనేమియు నెరుంగనని) దైన్యమదేటికి (దీనత్వమెందులకు?) అట్లే, అన్నియూ నేర్చితినని గర్వమెందులకు?) ఎన్నడూ వడగండ్లవాన ఆరుకొనినదని (తగ్గుమొగం పట్టిందని నమ్మి) బయటకు పోగూడదు. ఉన్నట్లుండి మళ్ళీ పడితే చచ్చామన్నమాటే. మనిషి అనుభవించే భోగాలున్నాయే... అవి మనస్సులో పాలుత్రాగినట్లు స్మృతియేమన్నా వుంటుందేమో కాని, అది సంతోషాన్నివ్వదు. ఆ అనుభవాలన్నీ ఆత్మానుభవాలు. అవే ఆత్మ గుణములులన్నట్లు భ్రమ కలిగిస్తాయి. నిజానికి ఆత్మ నిర్గుణి.

శ్రీవేంకటేశ్వరుడు దేవదేవుడు, సర్వోన్నతుడు, పురుషోత్తముడు. ఆయనముందు నేను పెద్ద దొరనని యేరాజ్యాధిపతియైనా, విఱ్ఱవీగ వచ్చునా? అట్లే నేనేమిలేని కుచేలుడనని దాగతగదు (క్రుంగిపోయి వుండుటయూ తగదు). చంద్రబింబం పౌర్ణమినాటి తన వెలుగుని ఆకారాన్ని చూసికొని అదే శాశ్వతము నేనెప్పుడూ ఇలాగేవుంటాననుకొంటే అదియెంత నిజమో నిమ్మోన్నతాలు భగవత్ప్రసాదములు, (మననిపైకితెచ్చేవాడూ ఆ శ్రీపతే. అదఃపాతాళానికి తొక్కేసేవాడూ శ్రీనాథుడే.) మన ప్రారబ్ధకర్మననుసరించి అవి వస్తుంటాయి. పోతుంటాయి. జగములన్నింటికి నియామకుడు, యేలిక శ్రీవేంకటేశుడే. మనం అస్వతంత్రులము. ఇది జ్ఞప్తియందు వుంచుకొని లోకపూజ్యుడై వర్ధిల్లుటయే శుభము. లేదా ఎంత వున్నతిపొందినా ఒక రోజున "ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే వున్నాను" అనవలసివస్తుంది.

సంపుటి: 3 కీర్తన : ఇందుకంటే మరి యికలేదు
హితోపదేశము వోమనసా
సంఖ్య : 101 పుట : 68 రాగం: బౌళి

బౌళి

80 ఇందుకంటే మరి యిఁకలేదు హితోపదేశము వోమనసా
అంది సర్వసంపన్నుఁడు దేవుఁడు అతనికంటే నేరుతుమా ॥పల్లవి॥

కల దొకఁటే ధర్మము కల్పాంతమునకు నిలిచినది
తలఁకక మీశరణుచొచ్చి మీదాసుఁడ ననెడి దొకమాఁట
వలవనిజోలే యింతాను వడి నిదిగాక యేమిసేసినను
సులభ మిందునే తొల్లిటివారలు చూరలుగొని రదేమోక్షంబు
॥ఇందు॥

మొదలొకటే యిన్నిటికి ముందర వెనకా వచ్చేది
వొదుగుచు గోవిందునిదాసులకు నొక్కమాటే మొక్కినఁజాలు
తుదకెక్కనివే యితరములు దొరకొని మరేమిసేసినను
బదికి తిరిందునే పరమవైష్ణవులు పలుచదువులలో వినరాదా
॥ఇందు॥

తగులొకటే విడువరానిది తతి నెన్నటికినిఁ జెడనిది
వొగి శ్రీవేంకటపతినామజపము వొకమాటే అబ్బినఁ జాలు
నగుబాటే యింతాను నానాఁటి కేమేమిసేసినను
తగునీబుద్ధుల నడచిరి మున్నిటిదైవజ్ఞులు పూర్వాచార్యులును
॥ఇందు॥ 101

అవతారిక:

ఓ మనసా! ఇంతకంటే చక్కని హితోపదేశము ఇంకొకటుండదు. సర్వసంపదలను అనుగ్రహించగలిగిన సత్తా వున్న దేవుడెవరయ్యా అంటే

ఈ శ్రీహరియే. ఘటనాఘటన సమర్థుడు. పదునాల్గు భువనములను ఉదరములో దాచుకొనిన నారాయణునికంటే గొప్పదైవమును నేరుతుమా? అని ప్రశ్నిస్తున్నారు అన్నమాచార్యులవారు. ఎవరెవరో ఏవేవో ధర్మాలు చెబుతున్నారు. ప్రచారం చేస్తున్నారు. వాటిని శ్రీహరియే నియమించాడని కూడా చెప్పుకొంటున్నారు. నీరు పల్లమెరుగు నిజము దేవుడెరుగు అన్నారు. నిజమేదో మాకెలా తెలుస్తుందయ్యా? కానీ నీ దాసులు అవలంభిస్తున్న శరణాగతియే అత్యుత్తమమైనదని నేనూ నమ్ముతున్నాను. పరమవైష్ణవులు శరణాగతితో సరిపోల్చదగిన మోక్షసాధనను కనిపెట్టారయ్యా! గోవిందుని దాసుల దాస్యమును స్వీకరించితే వారి ప్రవచనాలను వింటూ సంసారబంధ విముక్తుడై శ్రీవైష్ణవులు చెప్పే విష్ణు తత్త్వమునర్థం చేసికొంటే మోక్షం దానంతటదే సిద్ధించదా? వారి సాంగత్యంలో ఒక్కసారి శ్రీవేంకటపతి నామజపము యొక్క రుచి తెలిసి ఆ నామజపము అలవాటయిందంటే మోక్షం దానంతటదే సిద్ధిస్తుంది. పూర్వాచార్యులందరూ నడచినబాట అదే సుమా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ మనసా! ఇందు (త) కంటే చక్కటి హితోపదేశము, ఇకలేదు (ఇంకొకటి లేదు). అది గ్రహించి సర్వసంపన్నుడు (సమస్త సంపదలనీయగలవాడు), దేవుడు (దేవదేవుడైన శ్రీహరి) ఆతనికంటే నేరుతుమా (నేర్చినవారమా), కాదే?.

నిలిచి, కల్పాంతమువరకు మానవులకు పాటించదగిన ధర్మము ఒక్కటే కలదు. దానిని పాటించియే తీరవలెను. తలకక (భయపడకుండా) మీ శరణాగతి చొచ్చిన మీదాసుడనని త్రికరణశుద్ధిగా నమ్మియుండుటే చాలును. నీదాసుడననే ఒక్కమాట వలననిజోలె (యెన్నడూ యెండిపోని చద్దిమూట వంటిది). వడి (శీఘ్రముగా) ఇంతకంటే యేమిచేసినను

సులభముగా మోక్షము సిద్ధించదు. తొల్లిటివారు (పూర్వకాలమునాటి ఋషులు యోగులు) ఇదే చూరగొనిరి (ఈ పద్ధతినే కొల్లవెట్టి) మోక్షమును సాధించిరి.

మొదలొకటే ఇన్నిటికి (ప్రతిదానికీ ఆరంభం యెక్కడో వొకచోట వుంటుంది). మనముందర, మనవెనుక వచ్చే తోడు యెవరనుకొంటున్నారు? ఒదుగుచు (శ్రద్ధతో అణకువతో) నీవు గోవిందుని నామమే జపించెడి ఆతని దాసులకు ఒక్కమాటు మ్రొక్కితే జాలును. ఇతర మార్గములన్నియు తుదకెక్కనిలే (కడతేర్చలేనివే). దొరకొని (పూనుకొని) ఇతరములు మరేమి సేసినను పెద్ద ఉపయోగం వుండదు. పరమవైష్ణవులందరూ బతికితిరిందుననే (ఈ శ్రీహరి దాస్యమువలననే బ్రతికిరి). పలుచదువులలో (వేదములన్నింటిలోనూ) వినరాదా? (ఈవిషయాన్నే ఘోషిస్తుంటాయి కదా!)

అయ్యా తగులొకటే విడరానిది (విషయములయందు ఆసక్తి విడచిపెట్టలేనిది). తతి (నీపై ఆసక్తి మాత్రము) యెప్పటికినీ చెడనిది. ఒక్కమాటు శ్రీవేంకటేశ్వరుని నామజపమునందు అభిరుచి అబ్బిన జాలును, జన్మసార్థకమయితీరుతుంది. ఇదిగాక ఇతరోపాయములు యెన్ని చేసినా యేమి చేసినా యింతానూ నగుబాటే (ఇదంతా నవ్వులపాలయ్యే కసరత్తు మాత్రమే). నానాటికి (యెన్నాళ్ళకైనా) యేమేమిసేసినా ప్రయోజనం శూన్యమే. తగు నీ బుద్ధుల నడచిరి. మున్నిటి (పూర్వకాలమునాటి) దైవజ్ఞులు (దివ్యజ్ఞానముగలవారు). పూర్వాచార్యులు (పూర్వ కాలంనాటి ఆచార్యులందరూ) ఈ మార్గముననుసరించే ముక్తిని పొందిరి.

సంపుటి: 3 కీర్తన : నారాయణనే నస్వతంత్రుడను నాకు పనిగా దేనియును

సంఖ్య : 392 పుట : 264 రాగం: భూపాళం

భూపాళం

81 నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగా దేవియును
ధారుణిలోపలఁ బుట్టించితివి తరువాతిపనులు నీకే సెలవు.॥ పల్లవి॥

శ్రీపతి నీకే సమర్పితంబై శేషంబైనది యాతుమ దొల్లే
యేపున విషయములందులోఁ దగిలి యేమయిన నీకే సెలవు
చూపర బసురము తొరలు వోయినను సొమ్ముగలుగునాఁడే పరవంజుక
పైపైఁ దానే వెదకి తెచ్చి కాపాడఁగ నతనికి భారముగాన

॥నారా॥

యీడులేక శ్రీహరి నీవుండెడియీ దేహపునీపరికరమూఁ
బాడిగఁ బంచేంద్రియములు పట్టుక బడిఁదిప్పెడి నీకే సెలవు
వోడక యధికులు తమ దాసులు మరివొకరిపంపు లటు సేయఁగను
చూడరు తమబలములనే విడిపించుక తామే రక్షింతురు గాని

॥నారా॥

శ్రీవేంకటపతి నీవే నన్నిటు సృష్టించిన జీవుఁడ నింతే
కావిరి నజ్ఞానము నన్నిటువలెఁ గప్పిన నది నీకే సెలవు
ధావతిఁ దలిదండ్రులు తమబిడ్డలతనువులఁ బంకము లంటినను
యేవిధముల నీరార్చి పెంతు రటు ఇన్నిట నీవే గతినాకు.

॥నారా॥ 392

అవతారిక:

మానవుడు అస్వతంత్రుడు. వాడి పురాకృత కర్మానుసారమే వాడి క్రొత్త జన్మ క్రొత్త దేహము కలుగుతున్నాయి. మానవ జన్మనెత్తిన రెండు జీవులలో ఒకడు దేహధారుఢ్యంతో ఆరోగ్యంతో ఆనందంగా వుండవచ్చును.

ఇంకొకడు భూమిమీద పడ్డదాదిగా వుసూరుమని నిత్యరోగియై జీవించవచ్చును. ఎవరికేది ప్రాప్తమో యెవ్వరు చెప్పగలరు? మానవునికే విధమైన స్వాతంత్ర్యమూ ఇందులో లేదు. అయినా దీని గురించి ఆలోచించటం నాపని కాదు అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ ధారుణిలో మమ్మల్ని పుట్టించినవాడవు నీవు. తరువాత మాచేత యేమి చేయిస్తావో నీకే సెలవు. నీఇష్టం మా ప్రాప్తం. ఈ ఆత్మకి ఈ బంధాలు పీకులాటలు తగిలించినవాడవు నీవే విషయములలో పడి నిన్ను మఱచునట్లుకూడా నీవే చేస్తావు. ఇంట్లో గొడ్డు వొకటి దారితప్పి యెక్కడికోపోతే యజమానిదానిదారిన దానిని వదలివేస్తాడా ప్రభూ! దాన్ని నాలుగు దెబ్బలు వేసి యైనా ఇంటికి తెచ్చుకోవాలికదా! స్వామీ! ఈదేహానికి పంచేంద్రియములద్వారా జ్ఞానం నీవు కల్పించావు. కాని దీన్ని వాటికి లొంగకుండా కాపాడవలసిన భారముకూడా నీదే. ఈ తిప్పలనుంచి మమ్ము కాపాడగలిగినవారు నీదాసులే. ఇతరులకా శక్తియేదీ? చివరిగా అద్భుతమైన మెలిక పెడుతున్నారు అన్నమయ్య. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను అజ్ఞానినే, అసమర్థుడినే కాదనను. తమ బిడ్డలు అసమర్థులని తల్లీదండ్రీ వారిని వదలివేస్తారటయ్యా! ఇదెక్కడి అన్యాయం? తనబిడ్డ అశుద్ధమంటించుకొంటే తల్లి వాడిని చక్కగా కడిగి సాంబ్రాణివేసి బాగుచేయాలా లేక ఆ ముఖికిలోనే అఘోరించు అని వదలివేయాలా? నీవే చెప్పవయ్యా! అన్నమయ్యకు సాటిలేరు. రారు. రాబోరు.

భావ వివరణ:

ఓ నారాయణుడా! నేను అస్వతంత్రుడను. ఇవేవీ నాకుగానే చేసినపనులు కానేకావు. ధారుణిలో (ఈ భూమ్మీద) నన్ను పుట్టించింది మొదలు, తరువాత నా పనులన్నీ నీకే సెలవు (నీ చిత్తము ప్రకారమే జరిగాయి). నాకు మంచి జరిగినా నీవే చేశావు చెడు జరిగినా నీవే చేశావు. నేను నిమిత్తమాత్రుడను.

ఓ శ్రీపతీ! ఈ నా ఆత్మవున్నదే... ఇది అశేషముగా (కొంచెంకూడా దాచుకోకుండా) తల్లె (ఇదివరకే) నీకే సమర్పితమైనది. ఏపున (సమృద్ధిగా)

దానికి విషయసుఖములను అంటగట్టావు. ఇక ఇదియేమవుతుందో, దీని గతేమిటో నీకే సెలవు (నీకే తెలియాలి). స్వామీ! కాస్త ఆలోచించు. ఒక పశువుల కాపరి వుంటాడనుకో. వాడి గొడ్డు ఒకటి తొరలువోయిన (దారితప్పిపోతే), అది పరవంజుక (పరాధీనమైనదిలే అని దాని యజమాని దాన్ని వదలివేస్తాడా? సొమ్ముగలుగునాడైనా విడిపించుకొంటాడు కదా! నేను కూడా దారి తప్పి బందిలిదొడ్లో పడ్డాను తండ్రీ! ఆ యజమాని పైపై దానే వెదకి తెచ్చిదాన్ని కాపాడుకోడా? అది అతని భారముగాన ఈ గొడ్డును కాపాడే భారమూ నీదేనయ్యా!

ఓ శ్రీహరీ! నీవు యీడులేక (అనాదిగా) వుండెడి దేహపు పరికరము (సాధనము). దీనిలో (ఈ దేహాన్ని) బాడిగకు (వాడుకోడానికి) తీసికొని పంచేంద్రియములు అనే దుర్మార్గులు, బడిపట్టుక (ఒడిసిపట్టుకొని) దిప్పెడిని (తమ ఇష్టంవచ్చినట్లు ఆడిస్తున్నారు). నీకే సెలవు (నీ చిత్తము మా ప్రాప్తము). ఇందులో మేము చేయగలిగింది కూడా యేమీ లేదు. నా ఒక్క మనవి ఆలకించుము స్వామీ! తమరి దాసులను అవతలవాడెవడో వుపయోగించుకొంటుంటే యజమాని చూస్తూ వూరకుండవచ్చునా? తమ బలగములను పంపి తమ దాసులని అవతల దుర్మార్గులనుంచి విడిపించుకోవాలా వద్దా? వారిని రక్షించేది పోయి అవతలి వారికి వదలివేస్తారా స్వామీ! అన్యాయం కదా!

ఓ శ్రీవేంకటేశ్వరా! ఈ జీవుడిని సృష్టించింది నువ్వు. నిజానికి వీడుకూడా జ్యోతిస్వరూపుడే. కాకపోతే ఈ జీవుడిని కావిరి (నల్లని) అజ్ఞానము అనే పొర కప్పివేసింది. అన్నిటివలెనే (అందరిలాగానే) ఈ జీవి అజ్ఞానంతో సతమతమైపోతున్నాడు. ఇక నీకే సెలవు (ఆపై నీదయ మా ప్రాప్తం). స్వామీ! ధావతి (దిట్టతనముతో) తల్లిదండ్రులు తమ బిడ్డలు ఆడుకొంటూ బురదలో పడిపోతే, నామాట వినలేదు కాబట్టి వీడికి తగిన శాస్తి అయిందని కసితో వదలివేస్తారటయ్యా! వాళ్ళని ప్రేమగా కడిగి, తుడిచి పెంచరటయ్యా? ఇన్నిటా నీవే నాకు గతి అని యేనాడో చెప్పాను కదా!

సంపుటి: 3 కీర్తన : నీవొక్కడవే సర్వాధారము నిన్నే నెరిగిన నన్నియు నెరుగుట

సంఖ్య : 222 పుట : 149 రాగం: బౌళి

బౌళి

82 నీవొక్కఁడవే సర్వాధారము నిన్నే యెరిఁగిన నన్నియు నెఱఁగుట
భావించి యింతయుఁ దెలియఁగవలసిన బ్రహ్మవేత్తలకు నిదిదెరువు.
॥ పల్లవి॥

నీయందె బ్రహ్మయు రుద్రుఁడు నింద్రుఁడు నీయందె దిక్పాలకులు
నీయందె మనువులు వసువులు రుషులు నీయందె విశ్వాఖ్యదేవతలు
నీయందె వురగులు యక్షరాక్షసులు నీయందె గరుఁడగంధర్వులు
నీయందె పితరలు సిద్ధసాధ్యులు నీయందె ద్వాదశాదిత్యులు
॥నీవో॥

నీవలననె కిన్నరకింపురుషులు నీవలననె విద్యాధరులు
నీవలననె యచ్చరలు చారణులు నీవలననె నక్షత్రములు
నీవలననె గ్రహములు చంద్రుఁడును నీవలన (నె?) నభోంతరిక్షములు
నీవలననె జలధులు పవమానుఁడు నీవలననె గిరులును భూమియును.
॥నీవో॥

నీలోననె నదులును నగ్నియు నీలోననె సచరాచరములును
నీలోననె వేదశాస్త్రము మొదలగు నిఖిలశబ్దమయము
నీలోననె అన్నియు నిన్నర్చించిన నిఖిలతృప్తికరము
శ్రీలల నాధిప శ్రీవేంకటేశ్వర శ్రీవైష్ణవులకు నిది మతము.
॥నీవో॥ 222

అవతారిక:

బ్రహ్మవేత్త అంటే పరబ్రహ్మతత్త్వమునెరిగిన ఘనుడని అర్థం. సర్వులకు ఆధారము శ్రీహరియే. ఆయననొక్కనీ యెరిగిన అన్నియును యెరిగినట్లే

అంటున్నారు అన్నమాచార్యులవారు. ఇదంతా భావించి తెలియవలసిన బ్రహ్మవేత్తలకు నిదియే తెరువు అంటున్నారు. అంటే, బ్రహ్మవేత్తలందరి గమ్యమూ ఆ శ్రీహరియే అని అర్థం. శ్రీహరిని దెలియకుండా ఎంత శాస్త్రజ్ఞానమున్నా వ్యర్థమే. మరి ఆ పరబ్రహ్మ తత్త్వమెటువంటిది? అది అనంతం. ఆదిమధ్యాంతరహితం. అది విరాట్ రూపం. ఆ విశ్వరూపంలోనే సమస్త దేవతలు, ఋషులు, మనువులు, విశ్వాఖ్యదేవతలు, యక్షరాక్షసులు, పితృదేవతలు మొదలైనవారంతా వున్నారు. ఆ మహానుభావుని వలననే కిన్నెర కింపురుషులు విద్యాధరులు అప్సరసలు, గ్రహములు, సాగరములు, వాయుదేవుడు, సూర్యచంద్రులు కూడా ఈ జగతిలో ఆవిర్భవించినవి. అగ్ని, నదులు సమస్త చరాచరములన్ని నీలోననే యున్నవి. వేదశాస్త్రము మొదలైన శబ్దమయమైన విద్య అంతయూ నీలోననే వున్నది. ఓ శ్రీసతీవల్లభా! మా శ్రీవైష్ణవులకు ఇదియే మతము తండ్రీ! అన్యమేదియు లేదు అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఈ సమస్త విశ్వమునకు, నీవొక్కడవే సర్వాధారము. నిన్నొక్కని నెరిగిన అన్నియును యెఱుగుటతో సమానము. బ్రహ్మవేత్తలయినవారి లక్షణమేమంటే, ఇంతయునూ (ఇదంతా) భావించి తెలియవలసిన జ్ఞానం వారికుంటుంది. వారికి ఈ పరబ్రహ్మమే తెరువు (గమ్యము).

ఓ విశ్వరూపా! నీయందే బ్రహ్మదేవుడు, రుద్రుడు, ఇంద్రుడు కూడా వున్నారు నీయందే అష్టదిక్పాలకులూ వున్నారు. నీయందే మనువులు, వసువులు, సమస్త ఋషులూ వున్నారు. నీయందే సమస్త వురగ జాతులు (సర్పములు మొదలైన జాతులు అన్నియునూ వున్నవి. యక్షరాక్షసులు కూడా నీయందే వున్నారు. పక్షిజాతికి చెందిన గరుడులు, గంధర్వులూ, విశ్వాఖ్య దేవతలు నీయందేవున్నారు. సమస్త పితరులు (పితృదేవతలూ)

సిద్ధులు సాధ్యులూ నీయందేవున్నారు. ఓ విరాట్ రూపా! ద్వాదశాదిత్యులు (పన్నెండుమంది ఆదిత్యులు) నీయందేవున్నారు.

ఓ అనంతా! కిన్నెరలు కింపురుషులు అనే దేవ గణములు (నరశరీరము, అశ్వపుతలలతో గానవిద్యయందు ఈ దేవగణములు నిష్ణాతులు. వీరికి కుబేరుడు యేలిక) సదా నీకు ఉల్లాసమును కలిగింతురు. విద్యాధరులనే గంధర్వులు చదువులలో దిట్టలు, పండితులు. వీరు అనేక స్తోత్రములను ఆశువుగా చెప్పుచుందురు. దేవనర్తకీమణులైన అప్సరసలు నీవలననే జన్మించిరి. చారణులు అనే దేవగణముల కర్తవ్యము ఆకాశమున సంచరించుచు వార్తా సేకరణము, వార్తావ్యాపనము. వీరు నిరంతరము ఆ దేవసమాచారమును విస్తరింపజేతురు. దేవా! ఇంకా చెప్పేందుకేమున్నది? ఓ సర్వేశ్వరా! చంద్రుడు, గ్రహములు, నక్షత్రములు అనంతాకాశంలో అనంతకాలము నుండి ఒక నియమానుసారముగా నిర్ణీత కక్ష్యలలో సంచరించుచున్నవంటే నీవలన కాదా? సాగరములన్నియు చెలియలికట్టకు కట్టుబడివున్నది నీవలన కాదా! పవమానుడు (వాయుదేవుడు) నీ ఆజ్ఞానువర్తియే కదా! కులపర్వతములను ఒక గాడిన పెట్టినవాడవు నీవు. ఈ భూభ్రమణ నియంత నీవు కాక వేరొకరున్నారు?

ఓ విరాడ్రూపా! అగ్ని, నదీనదములు, సమస్త చరాచరములు (చలనము గలిగినవి చలనము లేనివి) నీలోనే వున్నవి. సమస్త వేదశాస్త్రములు నీనుండే ఆవిర్భవించాయి. నిఖిల శబ్దము (ఓంకారము) నీనుండియే పుట్టినది. ఈ విధముగా అన్నీ నీలోనుంచి ఆవిర్భవించినవి కనుక నిన్నర్చించిన నిఖిలమంతయు తృప్తిచెందును అనుట వాస్తవమగును కదా! అందుకనే ఓ శ్రీరమణీవల్లభా! శ్రీవేంకటేశ్వరా! మేము శ్రీవైష్ణవులము. మాకు సర్వం విష్ణుమయమే. ఇదే మా మతము.

సంపుటి: 3 కీర్తన : ఎక్కడిదివివేక మెంతవారికిని
యిన్నియు నీమాయదోయక లేదు
సంఖ్య : 326 పుట : 220 రాగం: సాళంగనాట

సాళంగనాట

83 ఎక్కడిదివివేక మెంతవారికిని యిన్నియు నీమాయఁ దోయక లేదు
పక్కన అజ్ఞానపుజీవులయీపాప మిట్లనే వుండఁగను. ॥పల్లవి॥

విచ్చనవిడి నటు కౌరవులెదుటను విశ్వరూపు చూపినయపుడు
యిచ్చల నిను నమ్మఁగలేకేకా యింద్రజాలమనిరి
తచ్చన నిప్పటి నాస్తికజనులును తగునీసాకారము చూచి
నిచ్చలుఁ గల్లని నిరాకారము నిజమని తర్కించక మానుదురా

॥ఎక్క॥

గరుడవాహనము శంఖచక్రములు కనియుండియు ద్వాపరజనులు
ధరలో నినుహరిఁమూర్తిని తెలియక తమయాదవుఁ డొకఁడితఁడనిరి
సరుస దేవతాంతరములఁ గొలిచేటిచంచలచిత్తులు ఇఁక నిన్నే
పరదైవంబననేరరు సరిగా బ్రహ్మాదులలో నొకఁడవందురు.

॥ఎక్క॥

యెఱిఁగినదాసులు యెఱుఁగుదురు నీ వెక్కుడనుచు యేకాలమును
యెఱఁగనిపామరు లెఱఁగరు నిను మతి నెంతైనా నాఁడు నేఁడును
తఱితో శ్రీవేంకటేశ్వర నినుఁగని తగుశరణాగతులున్నట్లు
మఱుఁగున నుండిన ప్రాకృతులకు నీమహిమలు గానఁగఁదరమవునా

॥ఎక్క॥ 326

అవతారిక:

ఓ దేవదేవా! యెంతవారికైనా వివేకమెక్కడుంటుంది. నీమాయను తోయగ నసాధ్యము. అజ్ఞానం యెవరి పక్కన విడువకనుంటుందో ఆ జీవులు పాపముచేస్తూనే వుంటారు. వారి జీవనం ఇట్లానే వుంటుంది. అంటున్నారు అన్నమాచార్యులవారు. పురాకృతకర్మ యెలావుంటుందంటే అది దిక్కుతోచనివ్వదు. ఉదాహరణకు కౌరవులనే తీసికోండి. శ్రీకృష్ణుని మహిమను వారు నమ్మక ఇంద్రజాలం చేస్తున్నాడన్నారు. గొల్లవాడేమిటి విశ్వరూపమేమిటి? అని ఆక్షేపించారు. గరుత్మంతుని, శంఖ చక్రాలను, నరకాసురుని వధ నాడు ద్వారకావాసులను చూసిగూడ వీడు కృష్ణుడు కాడు విష్ణుడు అని గ్రహించలేకపోయారే! యాదవులంతా యెవరెవర్నో ఇంద్రుడిలాంటివారిని పూజించారు కానీ ఈ శ్రీహరి మాదిక్కని స్వామిని మోక్షం కోరలేదే? శ్రీహరి శరణాగతి బొందిన దాసులకు మాత్రమే ఆ జ్ఞానం వుంటుంది. మిగతా వారందరికీ అజ్ఞానం వుంటుంది. అంతే తేడా ఆయనను శరణననివారు యేనాటికీ ప్రాకృతులుగానే వుండిపోతారు. వాళ్ళకి సమస్తమూ ప్రకృతి ద్వారా పుడుతుంది. కలియుగలంలో రోజులు గడుస్తున్నకొలదీ అటువంటి తార్కికులెక్కువవుతారు.

భావ వివరణ:

ఓ శ్రీహరీ! ఇన్నియు (సృష్టిలో జరుగుచున్న విపరీతములన్నియు) నీ మాయవలననే ఆవిర్భవించినవి. కాని ఒక్కరికి కూడా తగిన సమయానికి ఆ విషయం తోచదు. ఎంతవారికైనా, ఆ వివేకమంతా యేమైపోతుందో తెలియదు. వారి పక్కనే అజ్ఞానులైన జీవులు అష్టకష్టాలూ అనుభవిస్తూ దేవుణ్ణి తిట్టుకొంటారే కాని యీ పాపం ఇట్లా వుండటానికి నా ప్రారబ్ధం కారణమనుకోడు.

ప్రభూ! ఆనాడు కురు సభలో విచ్చనవిడినట్లు (సర్వస్వతంత్రుడవై) నీవు నీ అనంత విశ్వరూపమును ప్రదర్శిస్తే దుర్యోధనాదులు నీవు ఇంద్రజాలం

ప్రదర్శిస్తున్నావనుకొన్నారు. ఒక్కడన్నా ఈతడే శ్రీహరి అని నమ్మాడా? మరి ఇప్పటి నాస్తికులు హేతువాదులు యేమి చేస్తున్నారు? అసలు భగవంతుడికి రూపం వుంటుందా? వున్నా ఆయన నీ మొక్కుబళ్ళకు మొహం వాచి వుంటాడా? అన్యమతస్థులు కూడా వైకుంఠం పోతారా అని తర్కించి నవ్వుకొంటారు. ప్రభూ! నీదయ లేకపోతే నీవిచ్చిన మానవ జన్మ అంతా అలా అడవిగాచిన వెన్నెల వలె వ్యర్థమైపోతుంది.

ఆనాడు నీవు శ్రీకృష్ణుడివై విశ్వకర్మచేత సముద్రమధ్యంలో ద్వారకా నగరాన్ని నిర్మింపజేస్తే నీ యాదవులంతా యెగిరి గంతులు వేశారే కాని ఈ గరుత్మంతుడేమిటీ, గదశంఖచక్రాలేమిటీ, నరకాసురుడంతటి రాక్షసుణ్ణి చంపటమేమిటి? ఈయన విష్ణువే అని ఒక్కడన్నా నిన్ను మోక్షం కావాలని అడిగాడా! ఇకపోతే మరి కొంతమంది దేవతాంతరములులు (ఒక దేవుడు గొప్ప, ఒకరు అంత గొప్పకాదు అని) పాటిస్తుంటారు. నీవే పరదైవము (పరమాత్మ)వని వారెన్నటికీ గుర్తించలేరు. సరిగా (సరి కదా!) ఆc యేముందీ ఈయన జగతిని రక్షణ బాధ్యత చేపట్టిన త్రిమూర్తులలో ఒకడు అంటారు. వారికి నీవు ముక్తినెలా ఇస్తావు తండ్రీ! ఇవ్వలేవు.

నీకు శరణుజొచ్చిన నీదాసులు యేకాలముననైనా నీవేదిక్కని చివరికి నీ సాయిజ్యం పొందుతున్నారు. వారు నీ భగవత్తత్వమును యెరిగినవారు. ఇక నీ తత్వమునెరుగని పామరులు యేనాటికీ నీ మహిమను గుర్తించలేరు. నాడును (ఆ ద్వాపరయుగంలోనూ) నేడునూ ఈ కలియుగంలోను వారు నీ తత్వము నెరుగనేలేదు. ఓ శ్రీవేంకటేశ్వరా! తఱితో (నీకోసం మథనపడ్డవారికే) నీ శరణాగతి లభిస్తుంది. వారంతా నీ మరుగున వుండటానికి నిన్ను ఆశ్రయించి ముక్తిని పొందుతారు. కాని ప్రాకృతులు (పామరులు) వున్నారే.... వారు తిర్కిస్తూనే తనువు చాలిస్తారు. వారికి నీ మహిమ గానగ తరమా (గ్రహింపసాధ్యమా?) కానేకాదు.

సంపుటి: 2 కీర్తన : నీకెటు వలసె నటుసేఇ నీచిత్తము నా భాగ్యము

సంఖ్య : 373 పుట : 251 రాగం: మలహరి

మలహరి

84 నీకెటు వలసె నటుసేఇ నీ చిత్తము నా భాగ్యము
యేకడనైనా లక్ష్మీకాంతుఁడ ఇదియే పో నావిన్నపము ॥ పల్లవి॥

నాగుణములే యెంచితినా నరకకూపములు చాలవు
ఆగతినే నాకర్మములూ అనుభవించి తీర్చెనంటే
నీగుణములే యెంచితివా నిఖిలసంపదలు చాలవు
యీగి ననుఁ గరుణించి యెపుడు నీవిచ్చేనంటేను. ॥నీకె॥

నా పాపములే లెక్కించితినా నదులయిసుకలును జాలవు
యేపున నెంతైనాఁ గలదు అది యెన్నఁడు దీరును దేవా
చేపట్టి నీవు రక్షించినయాజీవుల నెంచితివా తొల్లి
చూపట్టెడియీయాకసంబుపై చుక్కలకంటే ఘనము ॥నీకె॥

మఱి నాసుద్దులు యెంచఁగ నెంచఁగ మంచముకిందే నూయి
గుఱి నీకథలివి వినబోతే నివే కొండలుఁ గోటానఁగోట్లు
నెఱవుగ శ్రీవేంకటేశ్వర నీకే నే శరణాగతి చొచ్చితిని
తఱి దరిచేర్పఁగఁ గూడువెట్టఁగా దైవము నీకే భారము.॥నీకె॥ 373

అవతారిక:

"అన్యధా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అనే భావనకు వచ్చేసిన అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో నీకెట్లా తోస్తే అట్లా చెయ్యవయ్యా! నీదయ మా ప్రాప్తం అంటున్నారు. ఓ లక్ష్మీవల్లభా! యెట్లాగైనా ఇక నా విన్నపమంటూ వుంటే ఇదేనయ్యా! ఇంకా నన్నేం చెప్పమంటావు? నా గుణములనెంచటానికి యేమీ లేదు. నా కర్మలు చూద్దామంటే యెన్ని నరకాలనుభవించినా నే చేసిన పాపములు చాలవు.

ఇక నీ గుణాలను చూద్దామంటే సకల సద్గుణాభిరాముడవు నీవు. ఏ సంపదనైనా ఈయగలవు నీవు నన్ను కూడా కాస్త కరుణించవయ్యా అంటున్నారు. ఇక నేనెన్ని పాపాలు చేశానో లెక్కించడం యెవరివల్ల నవుతుంది? మనదేశంలోని నదులలోవున్న ఇసుకలో యెన్ని ఇసుకరేణువులున్నాయో అన్ని పాపాలైనా చేసి వుంటాను. లేకపోతే నాకు ఇన్ని కన్నీళ్ళెందుకు విధిస్తావు? అంతా నా తప్పే ప్రభూ! నీవు జగద్రక్షకుడవు ఆకాశంలో యెన్ని నక్షత్రాలున్నాయో అంతమంది జీవులనన్నా నీవు రక్షించివుంటావు కదా! మరి నన్నెందుకు వదిలేశావు? తండ్రీ! నేనేం పాపం చేసినా నన్ను రక్షించాల్సింది నీవే కదా! నా కథలు విప్పి చెప్పాలంటే మంచము నూతిపై వేసికొని పడుకున్న పిచ్చివాడి కథలా వుంటుంది. ఆ పిచ్చోడు యెప్పుడు భావిలోపడతాడో యెవరు చెప్పగలరు? ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకా మాటలెందుకయ్యా! శరణు మహానుభావా! శరణు. నన్ను దగ్గరకు తీసుకొంటావో తిండికూడా పెడతావో పెట్టవో నీ ఇష్టం ప్రభూ! నీదయ నా భాగ్యం. నా భారం నీదే తండ్రీ!

భావ వివరణ:

ఓ దేవదేవా! నీకెటువలసె నటు సెఇ (నీకెట్లా కావాలంటే అట్లా యేయవయ్యా! నీ చిత్తము నా భాగ్యము (నీ ఇష్టము నా ప్రాప్తము.) ఓ లక్ష్మీవల్లభా! యేవిధంగానైనా నీ ఇష్టమేనయ్యా! కానీ నా విన్నపము మాత్రం ఇదే. నన్ను కాస్త దయా దృష్టితో చూడు.

ప్రభూ! పోనీ నా గుణములనెంచి చూద్దామంటే నన్ను వుంచడానికి రౌరవాది నరకకూపాలెన్నివున్నా నన్ను శిక్షించుటకు చాలవు. ఆ గతినే (అదే విధంగా) నా కర్మలన్నీ అనుభవించి కర్మ విముక్తుడనవ్వాలంటే ఎన్ని నరకయాతనలు అనుభవించి తీరుద్దామన్నా నేను చేసిన కర్మలను సరితూచలేము. సరే! ఇక నీ గుణములనెంచుదామంటే నీవు సకల సద్గుణాభిరాముడవు. సృష్టిలోని సంపదనంతటినీ ఇచ్చినా నీ అంత

సంపద సరితూగదు. నన్ను కరుణించి యెప్పుడు నీవు నీ కృప ఇచ్చావంటే మాత్రమే నేను బ్రతుకుతాను. లేదా నాగతి అధోగతే.

ఓ దేవా! పోనీ నేను చేసిన పాపాలేమన్నా తక్కువగా వున్నాయిలే అని తృప్తిపడదామా అంటే అబ్బో! యేమి చెప్పమంటావు స్వామీ! ఈ ప్రపంచంలో వున్న నదుల ఒడ్డులలో యెంత ఇసుక వున్నదో, దాంట్లో యెన్ని ఇసుక రేణువులున్నాయో యెవరన్నా చెప్పగలరా? వాటిని లెక్కించ సాధ్యమా? నా పాపాలు కూడా అంతే స్వామీ! నేను అన్ని పాపాలు చేసి వుంటాను ప్రభూ! ఏపున యెంతైనా గలదు. దేవా (చక్కగా చెప్పాలంటే యెంతైనా వున్నది స్వామీ!) ఓ ప్రభూ! నీవు చేపట్టి (నిర్వహించి) రక్షించిన ప్రాణులెన్నో చెప్పాలంటే యెవ్వరివల్ల నవుతుంది? తొల్లి చూపట్టెడి (అనాదిగా కనిపిస్తున్న) ఈ ఆకాశంలో యెన్ని చుక్కలున్నాయో యెవరు చెప్పగలరు? కానీ ఆ చుక్కల (నక్షత్రాల) కంటే ఘనము (యెక్కువ) నీవు అనుక్షణం రక్షించే ఈ ప్రాణుల సంఖ్య.

దేవా! మఱి నా సుద్దులు (పాతకథలను) చెప్పాలంటే, నాకే చిన్నతనంగా వుంటుంది. ఎవరన్నా పరుండిన మంచముక్రింద నుయ్యి (బావి) వుందనుకోండి, వారెంత భయం భయంగా పడుకొంటారు. నా సంగతీ అంతే. అనుక్షణం చావు భయంతోనే బ్రతికాను. నాగుఱి (ధ్యాస) నీపై మరల్చి నీ కథలను విందామంటే అవి కొండలవలె కోటానుకోట్లు వున్నాయి. అందుకనే ఓ శ్రీవేంకటేశ్వరా! నేను నిన్ను నెఱవుగా (అధికుడవని) శరణాగతి చొచ్చితిని (శరణార్థినయ్యాను). దైవమ (ఓ దేవా!) నీకే భారము (అంతా నీదే భారమయ్యా!) తఱి (సరైన సమయానికి) దరిజేర్చగ (నన్ను ఒడ్డుకు చేర్చే) భారం నీదే. నాకు "కూడువెట్టగ" (తిండిపెట్టే) బాధ్యత కూడా నీదే తండ్రీ! లేకపోతే నాగతేమిటి ప్రభూ!

సంపుటి: 3 కీర్తన : కమ్మరను జీవునికిని ఇది కారణమేమియు లేదట

సంఖ్య : 257 పుట : 174 రాగం: బౌళి

బౌళి

85 కమ్మరను జీవునికిని ఇది కారణ మేమియు లేదట
ఇమ్ముల రాజూ నెరఁగని వెట్టెట యెవ్వరికెక్కును నారాయణా.

॥పల్లవి॥

యిలలో జీవునివిషయభోగమున నెందునుఁ బొరయనివాఁడవట
చలమా యేల పుట్టించితివీ సంసారవారధిని
కలకాలము నీగర్భగోళమునఁ గాఁపురముండఁగ నిటు చేసి
ఫల మేమిగట్టుకొంటివి భావము దెలుపవే నారాయణా.

॥కమ్మ॥

నడపెడి యాజగము లన్నియు నటనలు నీవట తొలుతనే
యెడయక యిందే వినోదించెదవు యెడ్డతనంబా నీ కేమి
జడియక నీవే సేసినచేఁతలు సర్వమును నిలుపఁగవలదా
కడుగఁగనేఁటికి నెంగిలిబూరెట కడవేయనేల(?) నారాయణా.

॥కమ్మ॥

పరగినయీకర్మమార్గములు బంధహేతువని చెప్పితివి
యిరవుగను వేదమార్గములు నేలా కాచుక తిరిగెదవు
గరిమల శ్రీవేంకటేశ్వర యిచ్చాకల్పితములు యిన్నియు నీకు
సరినెరిగించితి వింకనీచిత్తము సర్వేశ్వర వోనారాయణా.

॥కమ్మ॥ 257

అవతారిక:

ఈ కీర్తనలో పల్లవిని సమన్వయపరచటం కొంచెం కష్టమే. కమ్మరను అనే పదానికి మరల అని అర్థం వున్నది. జీవుడు మరల మరల పుట్టుటకు ఇది కారణము కానే కాదట. రాజు యెవడవుతున్నాడు వెట్టివాడు యెవడవుతున్నాడు తెలిసేదెవరికి? ఓ నారాయణుడా! ఈ విషయం యెవ్వరికర్థమవుతుంది? నీకొక్కడికే ఈ చిక్కుముడి విడుతుంది. ఎందుకంటే యేజీవుడు యెప్పుడు, యెవ్వరికి జన్మిస్తాడు అనేదానిమీద ఒక నిర్ణీత నిర్దిష్ట సూత్రములేవీ వుండవు. మేమందరం జీవాత్మల రూపంలో నీ గర్భగోళములో హాయిగా వున్నాం. అట్లాంటి మమ్ముల్ని హాయిగా నీ బొజ్జ లేనేవుండనీయక అనవసరంగా మమ్మల్ని పుట్టించడం దేనికి? అన్ని బాధలు పెట్టడం దేనికి? పోనీ నీవు నడుపుతున్న ఈ జగములు నిత్యములు, సత్యములు అనుకొందామా అంటే యెంతమాత్రం కాదు. ఎవడన్నా యెంగిలి బూరెలు కడుక్కుని తింటాడా నారాయణా! కర్మమార్గమెప్పుడూ బంధహేతువే. ఆ బంధాలు చచ్చేదాక వదలవు. అందుకనే జ్ఞానమార్గమే మోక్షహేతువు. జ్ఞానం నీదయ లేక రాదు. సర్వేశ్వరుడవైన శ్రీవేంకటేశ్వరా! ఈ సృష్టి అంతా నీ ఇచ్ఛాకల్పితము. నీ చిత్తము మా ప్రాప్తము అంటున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

ఓ నారాయణుడా! ఈ నేను చెప్పబోయే 'తత్త్వము' యెవ్వరికెక్కును (యెవడికర్థమవుతుందీ?) మన శాస్త్రమేమి చెబుతున్నది? కమ్మరను (మరల) జీవునికిని, ఇది (వాడి పుట్టుక) కారణము (వాడి జీవన విధానానికి నిదర్శనము కానే కాదట.) రాజుగా పుట్టినా వెట్టివాడు (బానిస) గా పుట్టినా వాడిజీవితం అలాగే వుంటుందని చెప్పలేము.

ఓ నారాయణా! ఆత్మరూపియైన జీవునికి, ఇలలో (ఈ లోకంలో) విషయ భోగాలమీద (వైవాహిక సుఖములపై) ఆసక్తియే వుండదట. మరి పెద్దవుతున్న కొలదీ చలము (మత్సరము) పెరిగి వాడికి ఈ సంసార

సాగరాన్ని అంటగడుతున్నావు. వాడు (ఆ జీవాత్మ) కలకాలము నీ గర్భగోళంలో ప్రశాంతంగా కాపురముండనివ్వవచ్చును కదా! ఇటుసేసి ఫలమేమి గట్టుకొంటివి? (ఇట్లా పుట్టించి, వాడి కనేక భ్రమలు కల్పించి, భ్రష్టుణ్ణి చేసి నీవేమి లాభం పొందావు?) అసలు నీ భావము యేమిటో చెప్పవయ్యా!

ఈ చతుర్దశ భువనాలూ నీవు నడుపుతున్నవే. ఇవన్నీ నీవు ఆడించినట్టే ఆడుతున్నాయి. ఇందులో అణుమాత్రం సందేహం లేదు. నీవు అక్కడ కూర్చొని తొలుతనె (మొదటినుంచీ) వినోదించెదవు (ఈ జగన్నాటకమును చూస్తూ హాయిగా ఆనందపడుతున్నావు). నీకేమీ యెడ్డెతనంబు ప్రభూ! (నీకీ మొండితనం, మంకుపట్టు యెందుకు తండ్రీ!) నీవు జడియవలసిన (భయపడనక్కర) లేదు కదా! నీవు చేసిన పొరబాట్లను నీవు సరిచేసుకోవచ్చు కదా! నిన్ను కాదనేవాడెవడు? సర్వమునూ నిలిపివేసి సవరిస్తే కాదనేదెవడు? ఓ నారాయణుడా! ఎవడన్నా యెంగిలి బూరెలు కడుక్కుని తింటాడా? ఎవడి కర్మో నాకు అంటడమేమిటి? వాడితోపాటు నేను బాధలు పడటం యేమిటి?

స్వామీ! పోనీ ఇదంతా, నిజం కాదు అనుకొందామా అంటే భగవద్గీతలో నీవే చెప్పావు. కర్మమార్గము కూడా మోక్షసాధనమే అయినప్పటికీ అది బంధహేతువు (అనేక బంధములను కల్పించి వాటితో కట్టుబడిపోయేట్లు చేస్తుంది). అటువంటివన్నీ ఆపి జ్ఞానమార్గమే స్థిరపడునట్లు చేసి ఈ జీవికి మరల జన్మలేకుండా చేయవచ్చును కదా! వేదమార్గాన్ని కాచుకొని తిరిగినవాడివి దాన్నే నిలపవచ్చును కదా! గరిమల (మహిమాన్వితుడవైన) ఓ శ్రీవేంకటేశ్వరా! ఇవన్నీ నీ ఇచ్ఛాకల్పితములు (నీవు కావాలనే కల్పించినవి). నీవు సర్వేశ్వరుడవైన నారాయణుడవు. నేటికి నాకు సరి నెరిగించితివి. ఇక నీ చిత్తము మా ప్రాప్తము.

సంపుటి: 3 కీర్తన : ఇతని మరచితిమి యెదుటనే యుండగా
సంఖ్య : 306 పుట : 207 రాగం: గుజ్జరి

గుజ్జరి

86 ఇతని మఱచితిమి యెదుటనే యుండఁగ యిన్నాళ్లును నే మెరఁగక
ప్రతిలే దితనికి జీవకోట్లకుఁ బ్రాణబంధుఁ డితఁడు ॥పల్లవి॥

ముందు నేను ఘనగర్భనరకమున మునిఁగియున్ననాఁడు
బొందితోడనే సుఖదుఃఖంబులఁ బొరయు తోడునీడితఁడు
అంది స్వర్గనరకాదులు చొచ్చిన అక్కడఁ దానెనువెంటనే
చందపునాయాతుమలోఁ బాయనిసర్వాత్మకుఁ డితడే. ॥ఇత॥

ఆనిపట్టి నేఁ బాపపుణ్యములు అనుభవించవలెనన్నప్పుడు
మానుపనొల్లఁడు తాఁ బెరరేఁచును మతి కనుకూలం బితఁడు
నానావిధులనుఁ బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు
తాను ఆ పరిణామంబులకు తగులైవుండును యీతఁడు ॥ఇత॥

తలచిన దగ్గరుఁ దడవక యుండిన దవ్వయివుండు నితఁడు
కలిసి మెలసి ఇహపరము లొసంగఁగఁ గాచుకవుండును యీతఁడు
మెలఁగుచు సాకారముతో నున్నాఁడు మేటిశ్రీవేంకటపతి యితఁడు
వలసిన వావులరూపులు దాల్చినవాఁ డొకఁడేపో యీతఁడు.

॥ఇత॥306

అవతారిక:

జీవుడు జన్మించాలంటే తల్లిగర్భవాసము తప్పదు. అది ఒక నరక కూపము. ఎంతటివారికైనా ఆ గర్భనకరంలో నవమాసములుండక తప్పదు. అప్పుడు వాడికి ఆ యాతనలో తోడు నీడా యెవరు? ఆ శిశువు

జన్మించాక వాడికి జీవితాంతమూ సుఖ దుఃఖాలలో తోడు నీడా యెవరు ఆ పరంధాముడే. వాడు చచ్చాక స్వర్గమొచ్చినా నరకమొచ్చినా వాడి ఆత్మకు తోడు శ్రీహరే. ఈ విధంగా సాగే ఈ అద్భుతమైన కీర్తనలో అన్నమాచార్యులవారు జీవకోట్లన్నిటికీ ప్రాణ బంధువైన ఇతనికి ప్రతి లేదు అంటున్నారు. మరి అటువంటి ఈ మహానుభావుని మఱచిపోతే మనము క్షమార్హులము కానేకాదు. మనం పాపపుణ్యాలను అనుభవిస్తున్నప్పుడు కూడా మనకు సద్భావనలు కలుగునట్లు ప్రేరేపించే రక్షకుడితడే నంటున్నారు. తనను తలచిన వారికి దగ్గరవాడు తలవని వారికి దవ్వులవాడు అంటున్నారు. "వలసిన వావుల రూపులు దాల్చిన వాడొకడేపో యీతడు" అంటున్నారు. అంటే యేమిటో కాస్త ఆలోచించండి. బుర్రకు పదునుపెట్టండి. శ్రీవేంకటేశ్వరుని తలుచుకోండి. అంత శ్రమ వద్దనుకొంటే... భావవివరణ చదవండి.

భావ వివరణ:

ఇన్నాళ్ళునూ యెదుటనే యుండగా, యేమీ యెరుగక ఇతనిని మఱచితిమి. కానీ ఇతనికి ప్రతిలేదని (సాటివారెవరూ లేరని) ఇతడు సృష్టిలోని జీవకోట్లకు ప్రాణబంధువని అర్థమయింది.

ముందు (అలనాడు) నేను ఆనాటి నాతల్లి గర్భకుహరము అనే నరకంలో ఆ వుమ్మనీటిలో మునిగి తేలుతూ తొమ్మిది నెలలు ఓదేవదేవా నన్ను రక్షించు. ఈ గర్భ నరకం నుంచి నాకు విముక్తి కలిగించు. ఈ జన్మలో అసలు యెన్నటికీ తప్పులు చేయను అని మౌనంగా రోదిస్తుంటే, బుజ్జగించి నా బొందితోనే ఆత్మరూపివై తోడుండి నా సుఖదుఃఖాలను పంచుకొని, పొరయు (వర్ధిల్లెడి) తోడునీడ ఈ ప్రభువే. అంతకుముందు నేను స్వర్గంలో వున్నానో నరకంలో వున్నానో నాకు తెలియదు కాని అక్కడ కూడా నేను చొచ్చినప్పుడు (ప్రవేశించినపుడు) తాన్ వెనువెంటనే వుండి నా ఆత్మ చందమున (నా ఆత్మారామునివలె) ఒక్కక్షణమైనా నన్ను బాయని

(విడువని) సర్వాత్మకుడు (సర్వులలో ఆత్మరూపియైన పరంజ్యోతి) ఈతడే. ఇతనిని మఱువతగునా?

ఆనిపట్టి (ధరించి) నేను తొల్లింటజేసిన పాపపుణ్యములను అనుభవించక తప్పదు అన్నప్పుడు తాను మానుపనొల్లడు (వాటిని మాన్పించి తప్పించడు). కాని నాకు ధైర్యస్థైర్యములనిచ్చి, యెంతటివారికైనా చేసిన కర్మ అనుభవించక తప్పదు నాన్నా! అని ఓదార్చి నా మతిని దానికి అనుకూలము చేస్తాడితడు. అంతెందుకు, నాదైనందిక జీవితంలో కూడా ఏరోజుకారోజు నేను అనేక విధములుగా నిద్రిస్తుంటే తాను కూడా ఆ 'సుషప్తిని' అనుభవించి నిద్రలో యేవేవో లోకాలలో విహరిస్తున్న నా ఆత్మను నాకు మెలకువ రాగానే తిరిగి దాన్ని నా బొందిలో ప్రవేశపెట్టేవాడెవరున్నారు ఈతడే సుమా! అటా నాకు తగులైవుండెడితోడు ఈ దేవదేవుడే.

అదటుంచి ఈ స్వామిది ఒక వింత విధానము. తనను తలచిన దగ్గరుండును. తనను తలవకయుండిన దవ్వననేవుండును (దూరంగానే వుంటాడు). మనకు ఇహలోకమున ఈప్సితములు పరలోకమున మోక్షము ఇవ్వవలసి వచ్చినప్పుడు తదనుగుణంగా నిష్పక్షపాతముగా ఇహపరముల నొసంగువాడు ఈతడే. మాబోటి సామాన్యులు ఈ పరాత్పరుని నిరాకార రూపం దర్శించలేరని తిరుమలశిఖరాలపై సాకారముతో మెలగుచునున్న ఈ మేటి వేరెవ్వరో కాదు మన శ్రీవేంకటేశ్వరుడే. ఇతడు "వలసిన వావులరూపులు దాల్చిన వాడు" (మనము కోరుకున్న చుట్టరికంతో ఆవిర్భవించి ఆ రూపములో ఆ జన్మయందు అందరినీ అలరిస్తాడు.) అటువంటివాడే... పో... ఈ దేవదేవుడు.

సంపుటి: 3 కీర్తన: వెఱ్ఱిమానుపరెవ్వరు వేదురు నాయంత విడువను

సంఖ్య : 75 పుట : 49 రాగం: గుజ్జరి

గుజ్జరి

87 వెఱ్ఱి మానుప రెవ్వరు వేఁదురు నాయంత విడువడు (ను?)
ముట్టఁబాలలోఁ బుట్టిన ముంచిన వెఱ్ఱెయ్యా. ॥పల్లవి॥

జగములు రక్షించఁ బాల్పడి సర్వేశ్వరుఁడే వుండఁగ
అగణితుఁ డాతనిశక్తి యల్పముగాఁ దెలిసి
జిగి నాసంసారరక్షణ సేసెదనంచునుఁ దిరిగెద
నగుఁబాట్ల యల్పుఁడ నే నావెఱ్ఱిదేయయ్యా.

॥వెఱ్ఱి॥

అంతర్యామై దేవుఁడు అటు సుఖదుఃఖము లొసఁగఁగ
అంతయు మనుజులు సేసేరని నేఁ దిరిగితిని
బంతినే నావంటిజీవులబడిఁ దిరిగాడుచుఁ గర్మపు-
దొంతులఁ జిక్కినా వెఱ్ఱితోడనే యిదేయయ్యా.

॥వెఱ్ఱి॥

శ్రీవేంకటపతి యెదుటనే చేకొని వరము లొసఁగఁగ
దావతిపడి యితరుల నేఁ దగులుచు నడిగితిని
యీవేళనే నాగురుఁడును యీ దైవము నిటు చూఁపగ
తో వెరిఁగిటు నే బతికితి తొల్లెల్ల వెఱ్ఱినయ్యా.

॥వెఱ్ఱి॥72

అవతారిక:

పుట్టిన ప్రతిమనిషికి వేపకాయంత వెట్టి వుంటుందట, పెద్దల చలోక్తి ఇది. ఇందులో నిజం యెంతుందో తెలియదు కాని మామూలు పరిస్థితుల్లో జ్ఞానులవలె ప్రవర్తించే వారంతా ఒత్తిడికి గురి అయినప్పుడు వింతగా వెట్టివారివలె ప్రవర్తిస్తుంటారు. నేనూ అంతే. వేదురును (పిచ్చివానివలెనే ప్రవర్తిస్తుంటాను). నా వెట్టిని మాన్పేవాడూ లేడు, పోనీ నేను నాయంతట నేను మానుకుంటానా అంటే అది జరిగే పనికాదు అని తేలిపోయింది. ఈ వెట్టి యెటువంటిదో తెలుసా? ముట్టబాలలో బుట్టినది. అంటే భూమ్మీదపడగానే నాతల్లి తాపిన మొట్టమొదటి స్తన్యంతోనే ముంచినవెట్టి ఓ అయ్యా ఇది నేను చచ్చినా నన్ను వదలదు. సరే మనమంతా వెట్టి వాళ్ళమే అనుకొందాం మరి ఈ వెట్టి మాన్పగలిగిందెవరు? దైవమును మనకు సాక్షాత్కరింపజేసి అజ్ఞానం పోగొట్టి వెట్టి మానుపగలిగిన వైష్ణవ గురువులు సాయం చేస్తే మనం ఈ వెట్టి నుంచి బయటపడగలము అంటున్నారు అన్నమాచార్యులవారు. తనదెటువంటి వెట్టితనమో కవి వర్ణించిన తీరు వున్నదే.. అది నభూతో నభవిష్యతి. చదివితే మీకే తెలుస్తుంది.

భావ వివరణ:

ఎవ్వరూ నా వెట్టితనమును మానుపలేకున్నారు. పైగా వేదురు నన్ను (నన్ను వేదింతురు). పోనీ ఈ నా వెట్టితనాన్ని నా అంతట నేను విడిచిపెడతానా అంటే, విడిచిపెట్టను, ఓ సర్వేశ్వరా! ఇది ముట్టబాలతో (తల్లి కడుపులోంచి శిశువు బయటపడగానే తల్లికి చేపే చనుబాలతో) పుట్టిన వెట్టవేషాలు. ఓ అయ్యా! ఇది ముంచినవెట్టి (వివశుణ్ణి చేసే వెట్టితనము).

అహో! చతుర్దశభువనాలను రక్షించుటకు పాల్పడి (సిద్ధపడి) ఆతడువుండగా సర్వేశ్వరుడైనప్పటికీ, అగణితుడు (యెన్నుటకు అసాధ్యంబైన) ఆతని శక్తిని ఆల్పముగా (భావించి) జిగి (శోభాయమానంగా) నా సంసార రక్షణ చేసెదనటంచు తిరిగెద (ప్రయత్నముతో పరుగులు బెట్టుచుంటిని). నేను అల్పుడనయ్యా! ఎన్ని నగుబాట్లు పొందినా నాకు బుద్ధిరాదు. నా వెట్టి ఇదేనయ్యా!

అంతర్యామియై దేవుడు నాలోనే వుండి నాకు సుఖదుఃఖములను రెంటినీ ఇస్తుంటే సత్యం తెలుసుకోలేక అంతయూ మనుజులు సేసేరని నేను అనేకమందిని వ్యర్థముగా నిందించుచున్నాను. బంతినే (వరుసగా) నావంటి జీవులబడి (సాంగత్యంలో) తిరుగాడుచూ, దొంతికర్మల (ప్రారబ్ద కర్మలు, దైవిక కర్మలు అను రెండు రకముల కర్మలలో) తగులుకొని చిక్కువడి వెట్టివాడనై ఇదే తిరుగుతున్నానయ్యా!

ఈ శ్రీవేంకటేశ్వరుడు నాయెదుటనే నిలుచుండి చేకొని (పూనుకొని) వరము లొసగగా (వరములననుగ్రహిస్తుంటే) దావతిపడి (కక్కుర్తిపడి) ఇతరులను నేను తగులుచు (తగులుకొని) అడిగితిని (యాచించితిని). ఈవేళనే (ఈరోజే) ఈ గురువు యేమని సెలవిచ్చారో తెలియునా? ఈ దైవము నిటుచూడగా (ఈ దేవదేవుని దర్శించినంత మాత్రమున) తోవనెరిగి నా జీవనగమ్యము తెలిసి నేను బ్రతికితిని. లేకుంటే నా తొల్లెల్ల (తొలి జన్మలన్నీ) వెట్టినయ్యా! (మూర్ఖునివలె తిరుగాడితినయ్యా!)

సంపుటి: 3 కీర్తన : అక్కడ నెక్కడినరకము ఆమాటే కల్లా
సంఖ్య : 340 పుట : 229 రాగం: ధన్యాసి

ధన్యాసి

88 అక్కడ నెక్కడినరకము ఆమాటే కల్లా
దిక్కుల ని(నిం?) దె ఇన్నియుఁ దీరుచుకొంటిమయ్యా. ।। పల్లవి।।

తనువిది మలమూత్రంబుల (లు?) దాకొనియుండినపట్టము
దినదినమును వుచ్చిష్టపుదిడ్డఁ దూరెదము
జననము నెత్తురు నెమ్ములు సారెకు నూరెడిగుంతలు
మని మని నరకము చొచ్చిన మనుజుల మిదె నేము. ।।అక్క।।

మదనజలంబులకాలువ మా పెద్దలపూర్వంబులు (?)
పొదలినపుత్రులయిసిళ్లపుట్టలు వెట్టెదము
యెదుటనె సంసారంబులు యెడయనికారాగృహములు
మది మది నరకముచవిగొనుమనుజుల మిదె నేము. ।।అక్క।।

పుట్టినదే నగ్నత్వము బూతో బండో యెరఁగము
చిట్టంట్లవాచవులగుజీవుల మ్రింగెదము
నెట్టన శ్రీవేంకటేశ్వర నీతోఁ గూడఁగ జగములు
మట్టినచోటేమట్టేమనుజుల మిదె నేము. ।।అక్క।। 340

అవతారిక:

జీవితచరమాంకంలో తను అప్పటివరకు నమ్మిన ధర్మాలు, న్యాయాలూ, పురాణాలూ కేవలం మానవకల్పితాలని స్వర్గనరకాలు మానవుని ఒక సక్రమ మార్గంలో పెట్టడానికి మానవుడే కల్పించుకొన్న అబద్ధాలే. ఇవేవీ నిజం కావు. ఇవన్నీ మా కల్పితాలే. కానీ ఒక్కటే నిజం.

జగత్తు శ్రీహరి ప్రేరణతో తనకు తానే ప్రకృతి రూపంలోవ విస్తరిస్తోంది. తనకు తానే నశిస్తోంది. తనకు తానే వృద్ధి చెందుతున్నది. తనకు తనే అని యెందుకంటున్నామంటే సృష్టి స్థితి లయలు మానవ కల్పితం అని భ్రమ కలిగినా ప్రకృతి ద్వారా ఆ మూడు వ్యవహారాలు జరుగుతుంటే మానవుడు కేవలం నిమిత్తమాత్రుడైన ప్రేక్షకుడు. పుట్టేడప్పుడు బట్టలేకుండా పుట్టి, దహనమయ్యేటప్పుడు బట్టలేకుండానే దహనమయ్యే మనిషికి మధ్యలో ఇదే నగ్నత్వము "బూతు" అయిపోయింది. మరి మదనజలంబుల కాలువలలో మునిగి తేలుతున్ననాడు ఈ 'బూతు' గుర్తుకు రాలేదా? అసలు నీపుట్టుక యెటువంటిది? నీ తల్లి కడుపులో నీ మలమూత్రాలమధ్య నీ వుచ్చిష్టము (చొల్లు) నీవే తాగుతూ యెంత హేయంగా పుట్టావు? నెత్తురు ముద్దలా బ్రతికిన రోజులు గుర్తులేవా? మరి యేమి చూసుకొని నీ మిడిసిపాటు. ఇంకా నీవు అశక్తుడవని అర్ధంకాలేదా? ఇంకా శ్రీవేంకటేశుని దిక్కనవా? అయితే నీ చావు నువ్వు చావు, అన్న ధోరణిలో ఈ కీర్తన చెప్పారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

అక్కడనెక్కడ నరకము? (నరకమనేది అక్కడెక్కడో వున్నదా?) ఈ మాటే కల్లా (పరమ అసత్యం), అయ్యా! (ఓ దేవదేవా!) ఇందే (ఈ భూలోకంలోనే) దిక్కులను (ఈ యెనిమిది దిక్కుల మధ్యనే) ఇన్నియు దీరుచు కొంటిమి (మా పాప పుణ్యాలకు మేమే ఫలితం అనుభవిస్తున్నాం. సంతోషంగా వున్నప్పుడు స్వర్గం అనుకొంటూ, యేడుస్తున్నప్పుడు నరకం అనుకొంటున్నాము. అంతేనయ్యా!

మా పుట్టుక యెటువంటిది? మల మూత్రముల మధ్య దాకొని (నివసిస్తూ), దినదినమూ మా ఉచ్చిష్టము (ఉమ్మి) మేమే తాగుతూ, మా తల్లి కడుపులో యెంత హేయముగా దూరివున్నాము? అప్పటి నా రూపం

నేను గుర్తుకు చేసికొంటే గర్వపడేందుకేమున్నది? నా జననమెట్టిది? నెత్తురోడుతున్న యెముకలగూడు. ఈ అందానికి తగ్గట్లు దీంట్లో తొమ్మిది రంధ్రాలు. చుట్టూ చిమ్మచీకటి. దుర్గంధం. ఉమ్మనీటిలో తేలుతూ తొమ్మిది నెలలు ఆ నరకం అనుభవించినా బుద్ధిరాలేదు. మళ్ళీ మళ్ళీ అదే విధమైన నరకం అనుభవిస్తూ యెన్నిసార్లు పుట్టానో లెక్కే లేదు. ఓ అయ్యా! నేను అంత సిగ్గుమాలిన మనుజుడినయ్యా!

మదనజలములతో నిండి పొర్లుతున్న కాలువలలో జలక్రీడలాడటంలో మా పెద్దలంతా అఘుండులు. వారికి వారే సాటి. మేము అటువంటి గ్రంధసాంగుల వంశంలో జన్మించి మేమేమీ తక్కువ తినలేదన్నట్లు వారి దురలవాట్లనే పుట్టలు పెట్టినట్టు పెంచుకొంటూ ఇంకా ఇంకా చెడు వ్యవహారాలు నడిపేము. ఈ సంసారము విడిపించుకోలేని కారాగృహమని అర్ధమయ్యే సరికి అంతా అయిపోయింది. ఇప్పుడు నరకము ఆపైన యెక్కడో లేదు, మా మనస్సుల్లోనే వున్న మనుజులమని అర్ధమయింది. అయ్యా! ఇప్పుడు నేను చేయగలిగింది కూడా యేమీ లేదయ్యా!

ఓ దేవా! మేము పుట్టినదే నగ్నత్వముతో. మా పుట్టుకకు కారణమే బూతుపని. అది మంచో చెడో తెలియకుండానే వెంపర్లాడి సాధ్యమైనంతవరకు అనుభవించాము. మా కోపతాపాలను యేమాత్రమూ అణుచుకోలేము. మాకు వాచాలత్వము అధికము. మాతోటి జీవులనే మింగేసే స్వభావం గల క్రూరులము. ఎన్ని పుట్టుకలైనా ఎన్ని తడవలైనా ఇదే దరిద్రం. దీనికి తెరిపిలేదు. అదిగో ఒకానొక జన్మలో నీ కృప మాపై ప్రసరించింది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీతో గూడగా, మట్టినచోటే మట్టే (చచ్చినచోటే మళ్ళీ చచ్చే) మనుజులమైనప్పటికీ ఇదే మేము నీ శరణుజొచ్చాము.

సంపుటి: 15 కీర్తన : ఏమని చెప్పుట మా యజ్ఞానము
యెఱిగి యెఱిగి తెలియగ లేము
సంఖ్య : 257 పుట : 173 రాగం: లలిత

లలిత

89 ఏమనిచెప్పుట మా యజ్ఞానము యెఱిఁగి యెఱిఁగి తెలియఁగ లేము
శ్రీమాధవ నీ మఱుఁగు చొచ్చితిమి చిత్తగించి దయఁ జూడఁగదే
॥పల్లవి॥

నీవు రక్షకుఁడవై భువినుండఁగ నే గడియించే దిఁకనేమీ
జీవాంతరాత్ముఁడవై యుండుదు వట చేకొని కావక మానేవా
వేవేలుగఁ బుట్టించఁ గర్తవట వెలయించఁగ నీ భారముగాదా
భావించనేరక వట్టి స్వతంత్రము పయివేసికొనుచుఁ బరగేము
॥ఏమని॥

పలుతెఱఁగుల నీ నామము లుండగ పాపములకు వెఱవఁగ నేలా
బలిమి నీ ముద్రలు యంతటఁ జెల్లఁగ పైకొనునా యింక నరకములూ
తలఁక కభయహస్తము నీ వెత్తఁగ దాసుల కిఁక నెక్కడిభీతి
నిలుపఁగ నేరక మనసువెంబడి నే నిచ్చనిచ్చలునుఁ బొరలేము
॥ఏమని॥

అది నీ రూపము తిరువారాధనయై యుండఁగ వెదకఁగ నేలా
పదిలపుటాచార్యుఁడు గలుగఁగ నిహపరముల త్రో వడుగఁగ నేలా
వుదుటున వరములు శ్రీవేంకటేశుఁ డొసఁగఁగ నే కోరఁగ నేలా
తుద మొదలెంచక యిన్నాళ్లు నేమఱి దొరకొని యింక నుతియించేము
॥ఏమని॥257

అవతారిక:

ఓ శ్రీమాధవా! మా అజ్ఞానం గుఱించి ఏమి చెప్పుదునయ్యా! యెఱిగి యెఱిగీ మళ్ళీ అదే అజ్ఞానాంధకారములో బడి కొట్టుమిట్టాడుతున్నాము. మేము జ్ఞానపు తోవను తెలియలేకున్నాము. ఇక చేయునదేమి లేక నీ మఱుగు చొచ్చితిమి. చిత్తగించి మమ్ము దయజూడవయ్యా! అంటున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. నీ రూపము నా ఆరాధనయై యుండగా మా ఆచార్యులవారు ఇహపరములనొసగే నీ త్రోవను మాకు పరిచయము చేశారు. ఓ శ్రీవేంకటేశ్వరా! మాకు కావలసిన వరములన్నీ నీవే ఒసగుతుంటే ఆద్యంతముల గురించి ఆలోచించక మా కోరికలన్నీ నీ చిత్తమునకే వదలివేసి నిన్ను నుతించుచూ యున్నాము అని అంటున్నారు. ఎందుకంటే కోరికలకు ఆది అంతమూ వుండవు. అవి ఉత్తుంగ తరంగాల్లా యెగిసిపడుతూనే వుంటాయి, అంటున్నారు. సర్వపాపములను నివారించు నీ దివ్యనామము మాకు తోడు నీడ వలె వుండగా మాకు పాపముల గురించిన భయము యెందులకు అంటున్నారు.

భావ వివరణ:

ఓ మాధవా! మా అజ్ఞానమును గురించి యేమని చెప్పేది ప్రభూ! ఇది అజ్ఞానము అని యెఱిగి యెఱిగి (తెలిసి తెలిసి) మళ్ళీ అదే తెలియగలేము (మేము అజ్ఞానులవలె ప్రవర్తిస్తున్నామని) తెలుసుకోలేకపోతున్నాము. ఇక మాకు దిక్కు గానరాక నీ మఱుగు చొచ్చితిమి (నిన్ను ఆశ్రయించాము). తండ్రీ! చిత్తగించి దయజూడగదే! (కాస్త మనస్సుపెట్టి కరుణించవయ్యా!)

స్వామీ! నీవు రక్షకుడవై ఈ లోకంలో మాకు వుండగా ఇంకా నేను గడియించేదేమి (సాధించవలసినదేముంది?) అన్ని జీవులలోనూ అంతరాత్మవై నీవే వుంటావంట. మరి నిన్ను నీవు కావక మానేవా (రక్షించుకోకుండా మానేస్తావా?) అందుకనే ప్రతి జీవీ జీవన పోరాటం

చేస్తుంది. ఈ జీవులను అనేక రకాలుగా అనేక సామర్థ్యములతో పుట్టించి పెంచుతున్న కర్తవు నీవేనట. మరి వీటి రక్షణ భారం నీదికాకపోతే ఇంకెవరిదయ్యా! దీంట్లో ఇంత తిరకాసు వుందని భావించలేని మూర్ఖులం ప్రభూ! మాకు మేమే స్వతంత్రులం అని రొమ్ము విరుచుకొంటాము, అన్నీ మాపై వేసికొని చివరికి దిక్కు తెలియక అల్లాడుతాము.

ప్రభూ! నీ నామములు పలుతెఱంగులు (నీవు వేయి నామాల వేలుపువు). అందులో ఏ ఒక్కటైనా మా పాపాలను పటాపంచలు చేస్తుంది. మమ్మల్ని నరకమునకు తీసికొని వెళ్ళే ధైర్యం యెవరు చేస్తారు? ఎందుకంటే ప్రాణాలు లేని మా కళేబరము మీదకూడా నీ శంఖ చక్రముల ముద్రలు కనబడుతూనే వుంటాయి. ఇక యమభటులు మా దగ్గరకు రాగలరా? అదిగో ఎత్తిపట్టుకొన్న నీ అభయహస్తము వుండగా నీ దాసులమైన మాకు భయమెక్కడిది స్వామీ! అయితే తప్పంతా నాదే తండ్రీ! మా మనస్సును నీపై నిలుపలేని అర్భకులము. అట్లా నిలుపలేక, నిచ్చనిచ్చలును బొరలేము, (ప్రతిరోజూ వ్యర్థపరుస్తున్నాము).

దేవా! మంగళప్రదమైన నీ రూపము నా నిత్యారాధనలో నా తోడుండగా నిన్ను యెక్కడెక్కడో వెదకవలసిన అవసరమేమిటయ్యా? మా ఆచార్యుడు పదిలముగా (జాగ్రత్తగా) మాకు సరి అయిన దారి చూపుతుంటే, ఏవేవో వ్యర్థమైన వరములను నిన్ను అడుగుట యెంత పనికిమాలిన పని? శ్రీవేంకటేశ్వరుడు ఇహపరములను రెంటినీ ఈయగల సర్వేశ్వరుడు. ఆ స్వామికి నాకేమివ్వాలో తెలియదా? నేను ప్రత్యేకించి వేరే అడుగవలెనా? అయితే... ఇన్నాళ్ళూనూ తుది మొదలెంచక (అడ్డు అదుపూ లేకుండా) ఏమఱి దొరకొంటిమి (అజాగ్రత్తగా వ్యవహరించాము). అయినదేదో అయినది, ఇక నిన్ను నుతించుచునే జీవింతుము.

సంపుటి: 15 కీర్తన : అలసితిని పుణ్యపాపముల
ఆకలిబడి నేను
సంఖ్య : 384 పుట : 258 రాగం: నాట

నాట

90 అలసితిని పుణ్యపాపముల ఆఁకలిఁబడి నేను
గెలిచితిని నిన్నుఁ గొలిచి యింకఁ గీర్తింపుచు నిర్మలుఁడ నైతిని
॥పల్లవి॥

యింక నేను ఈ పదులనాలుగులోకములు చొచ్చి యెన్నాళ్లు
దప్పించుకొనువాఁడ
యింక నేను నేఁజేసిన దానంబులు చూపి యెందాఁకాఁ బెనఁగెడువాఁడ
యింక నేను నాపుత్రమిత్రులనడుమ నెట్టు దాఁగఁగలవాఁడ
యింక నేను యిల దివ్యతీర్థముల వెంటవెంట నెక్కడని పారేడఁగలవాఁడ
॥అలసితి॥

యింక నేను నానాదేవతల మఱుగునను యేది గొలఁది దొబ్బగలవాఁడ
యింక నేను బహుజంతురూపములు గైకొని యే పగిదిని బొంకఁగలవాఁడ
యింక నేను మంత్రములు జపించి యే రీతి మాయల గెలిచేటివాఁడ
యింక నేను సంసారము చూపి యేమని నమ్మించఁగలవాఁడ
॥అలసితి॥

యింక నేను నీదాసుఁడనై ఇటువలె నుండఁగలవాఁడ
యింక నేను నీవేగతి యని యిహముఁ బరముఁ జేకొనువాఁడ
యింక నేను అలమేలుమంగకు యీశ్వరుఁడవైన శ్రీవేంకటేశా
యింక నేను ఆచార్యుననుమతి హృదయములోపలఁ దలఁచువాఁడ
॥అలసితి॥

అవతారిక:

పాపపుణ్యాలెటువంటివంటే, వాటినాచరిస్తూ జీవుడు అలిసిపోతాడు. ఆకలిని కూడా మఱచి పోతాడు. కాని ఈ ప్రయాణం విశ్రాంతి లేనిది. పుణ్యమే చేసే ప్రయత్నంలో కొంత పాపమాచరించటమూ కద్దు. మరి దీనికి తరుణోపాయం యేమిటి? ఆ సర్వేశ్వరుని గొలుచుటయే. ఆయనను కీర్తించుచూ నిర్మలులైన వారికి ఆ దేవదేవుని కరుణను గెలుచుట పెద్ద విశేషము కాదు. పదునాల్గు భువనాలు తిరిగినా నేనేవోవో దానధర్మాలు చేశానని యెంతకాలం తప్పించుకొని తిరుగుతాను? నా భార్యాపుత్రుల మధ్య యెంతకాలం దాగివుంటాను? ఏదో ఒక జన్మలో ఏదో ఒక జంతువు రూపం దాల్చకుండా యెట్లా వుంటాను? ఈ సంసారమును చూపి నేను యేమని నమ్మించగలవాడ స్వామీ! నేను నీ దాసుడవలెనే జీవించుట కిష్టపడతాను. నా ఆచార్యుని ఆనతిని సదా నా హృదయంలో నిలుపుకొని ఓ శ్రీవేంకటేశ్వరా! సదా నిన్నే ధ్యానించువాడ అంటున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. అంటే ఇప్పటివరకు అయినదేదో అయినది పాపపుణ్యాలు చేస్తూ బ్రతుకు గడిపేసేను. కాని ఇంక వాటితో నాకు పనిలేదు. నిన్ను కీర్తిస్తూ నిర్మలుడనై నీసేవలోనే తరిస్తాను. ఆ విధంగా నిన్ననూ గెలిచెదను అంటున్నారు.

భావ వివరణ:

ఓ సర్వేశ్వరా! ఈ పాపపుణ్యముల ఆకలిబడి (ఆకాంక్షకు చిక్కువడి) నిరంతరమూ అయ్యో! పాపాలు చేస్తున్నాననే బెంగతో, యేవేవో పుణ్యకార్యాలు చేయాలనే తపనతో తిరిగి తిరిగి అలసితినయ్యా! (అలసిపోయాను స్వామీ!) ఎట్టకేలకు నిన్ను కీర్తింపుచు నిర్మలుడనైతిని. నిర్మలచిత్తునకు మోక్షప్రాప్తి సుగమమే కదా! ఆ విధంగా నిన్ను గెలిచితిని.

ప్రభూ! ఇంకా నేను ఈ పదునాల్గు భువనములలో చొచ్చి (దూరి) యెన్నాళ్ళు తప్పించుకొని తిరుగగలను? ఇంకా నేను గతంలో చేసిన దానముల పట్టికజూపి నాకు మళ్ళీ జన్మవద్దని పెనుగులాడెదను? ఇంకా నా పుత్రుల నడుమ మిత్రుల గుంపులో దాగుకొని వీరిని వదలలేనని ఇంకా బ్రతుకుతాననే వ్యామోహం యెట్లా పెంచుకోగలను? ఇంకా నేను యే పుణ్యతీర్థాల వెంట పరుగులు పెట్టగలవాడను. ఓ దేవదేవా! ఇక నావలన కాదు. ఈ పాపపుణ్యాలగోల నాకు వద్దు. నీ శరణుచొచ్చితిని.

దేవా! ఇంకా నేను పలు అన్యదేవతల నాశ్రయించి యేవేవో ఇష్టకామ్యములు పొందుటకు యెందుకు వెంపర్లాడవలెను? ఇంకా నేను యే జంతువుల జన్మలు, పామరులపుట్టుకలు పొంది అబద్ధములాడుతూ ఇదే రొంపిలో పడి కొట్టుమిట్టాడను? ఇంకా నేను యే మంత్రశాస్త్రము చదివి ఉద్ధరింపబడాలి? అది ఒక మాయాజాలం. ఇంకనైనా దానిని గెలవకున్న జీవితమంతా వ్యర్థమే కదా! స్వామీ! ఇంకా నేను ఈ సంసారమును చూపి ఇదే నిత్యసత్యమని యేవిధంగా ఇతరులను నమ్మించగలను. దీన్ని చూచి నిత్యమనుకొనే వెఱ్ఱివాళ్ళు వుంటూనే వుంటారు. అది వేరే విషయము.

ఓ పరాత్పరా! ఇది నా నిశ్చయము. ఇంక నేను నీ దాసుడనై ఇకమీదట జీవిత శేషము గడపగలవాడను. ఇంక నేను ఇహపరములను చేకొని వాటికై నా ప్రయత్నము అనవసరమని నీవే గతియని నమ్మిన అన్నీ నీవే చూసుకొంటావని నిశ్చింత వహించాను. అలమేలుమంగ విభుడైన శ్రీవేంకటేశ్వరుడు ఇంక నా వాడని నమ్మితే యే బెంగా వుండదు. ఇంక నేను నా ఆచార్యుల అనుమతితో హృదయంలో ఈ తిరుమలేశునే ప్రతిష్టించుకొని, ఆ శ్రీహరినే దలచుచూ నా జన్మ చరితార్థము చేసికొంటాను.

సంపుటి: 1 కీర్తన : నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు
నిగమాంతవిదులు వైష్ణవులు
సంఖ్య : 414 పుట : 277 రాగం: మాళవి

మాళవి

91 నిత్యులు ముక్తులు నిర్మలచిత్తులు నిగమాంతవిదులు వైష్ణవులు
సత్యము వీరల శరణని బ్రగుకరో సాటికిఁ బెనఁగక జడులాల

॥పల్లవి॥

సకలోపాయశూన్యులు సమ్యగ్ జ్ఞానపూర్ణులు
అకలంకులు శంఖచక్రలాంఛను లన్నిటఁ బూజ్యులు వైష్ణవులు
వొకటీఁ గోరరు వొరులఁ గొలువరు వొల్లరు బ్రహ్మాదిపట్టములు
అకటా వీరల సరియనఁ బాపం బారుమతంబుల పూఁతకోకలన్

॥నిత్యు॥

మంత్రాంతర సాధనాంతరంబులు మానిన పుణ్యులు విరక్తులు
యంత్రపుమాయలఁ బొరలు పరులకు యెంతైనా మొక్కరు వైష్ణవులు
తంత్రపు కామక్రోధవిదూరులు తమ నిజధర్మము వదలరు
జంత్రపుసంసారులతో వీరల సరియని యెంచఁగఁ బాపమయ్య

॥నిత్యు॥

తప్పరు తమ పట్టినవ్రత మెప్పుడు దైవ మొక్కఁడే గతి యనుచు
వొప్పగు తమ పాతివ్రత్యంబున నుందురు సుఖమున వైష్ణవులు
కప్పిన శ్రీవేంకటపతిదాసులు కర్మవిదూరులు సాత్వికులు
చెప్పకుఁ డితరుల సరిగా వీరికి సేవించఁగ నే ధన్యుఁడ నైతి

॥నిత్యు॥

అవతారిక:

వైష్ణవుల ప్రాశస్త్యాన్ని వర్ణిస్తున్నారు అన్నమాచార్యులవారు. వారు (వైష్ణవులు) నిత్యులు, భవబంధములనుండి ముక్తిని పొందినవారే. నిర్మలాంతఃకరణతో వేదాంత పరిపూర్ణులు మావైష్ణవులని సవినయంగా చెబుతూనే ఓ జడులారా! సాటికి బెనగక వీరల శరణని బ్రతకరో అని నచ్చచెబుతున్నారు. అంటే ఓ తెలివితక్కువ దద్దమ్మల్లారా! నేను అంత గొప్పవాణ్ణి కావాలి, వీడెంతో అంత పేరు సంపాదించాలని పెనగులాడక ఈ వైష్ణవులను శరణని బ్రతకండి. సత్యముగా మీరు కూడా పుణ్యులై ముక్తులవుతారు అంటున్నారు. ఎందుకని ప్రశ్నరాక ముందే ఆయనే సవివరంగా వైష్ణవుల నెందుకు సేవించాలో వివరిస్తున్నారు. జంత్రపు సంసారులతో వీరిని సరిపోల్చవచ్చునా యెంతపాపం మూటకట్టుకొంటున్నారు అని అంటున్నారు. అంటే అసలు అర్థమేమిటంటే సంసారపుయావ గలిగిన మానవులంతా జంత్రపు సంసారులేనట. అంటే సూత్రముచే కట్టబడి ఆడే బొమ్మలు సూత్రం పట్టుకొని ఆడించే వాడి ఇష్టప్రకారం ఆడుతవి కానీ వాటికే స్వాతంత్రం వుంటుంది? అలాగే మనని ఆడిస్తున్నది ఆ శ్రీవేంకటేశ్వరుడు మన మస్వతంత్రులం అని భావము.

భావ వివరణ:

ఓ జడులారా! (మూర్ఖులారా!) సత్యము (నిజముగా) వీరిని (ఈ వైష్ణవులను) శరణని బ్రతుకరో (శరణాగతిని పొంది జీవించండి). సాటికి బెనగక (సాంసారికమైన గొప్పతనము కోసం వెంపర్లాడక, మరీ జీవించండి. ఎందుకంటే ఈ వైష్ణవులు నిత్యులు (చిరంజీవులు), ముక్తులు (బ్రతికి వుండగానే ముక్తిని పొందినవారు), నిర్మలచిత్తులు (పవిత్రమైన అంతఃకరణ కలవారు), నిగమాంతవిదులు (వేదాంత వేద్యులు.)

ఇంకా వీరి లక్షణాలను చెబుతాను, సావధానులై వినండి. వీరు సకలోపాయ శూన్యులు (జీవనోపాధికి కావలసిన కుటిలోపాయములేవీ

తెలియనివారు). సమ్యగ్జ్ఞానపూర్ణులు (ఆత్మజ్ఞానమునందు నిష్ణాతులు). అకలంకులు (కళంకము లేనివారు). శంఖ చక్రముల ముద్రలు లాంఛనములుగా శరీరంపై ధరించియున్నవారు. ఇటువంటి వైష్ణవులు పూజనీయులు కాక మరేమిటి? ఒకటీ గోరరు (వీరికి యేదీ అక్కరలేదు). అన్యులను పూజించరు, బ్రహ్మ మొదలైన పదవులనిచ్చినా వీరు తృణీకరిస్తారు. ప్రపంచంలో వున్న ఆరు రకములైన ఇతర మతములు వీరికి (వైష్ణవులకు) సరియన పాపంబు, అకటా (సమానమనుటయే పాపమయ్యా!) ఎందుకంటే ఆ ఆరుమతములు పూ**ఁతకోకలు (నేడు కట్టుకొని రేపు విడిచేసే చీరెలవంటివి).**

ఈ వైష్ణవులు మంత్రోపాసనలు, వాటి సాధనోపాయములను విసర్జించిన పుణ్యులు. ఎందుకంటే వీరు విరక్తులు (రక్తియే లేనివారు). యంత్రములు తయారుచేయటాన్ని నిరసిస్తారు. విష్ణుదేవునికి వారి గురువులకు తప్ప వేరెవ్వరికీ వీరు మొక్కరు. కామక్రోధములకు ఆలవాలమైన తంత్రవిద్యలనిన వీరికి అసహ్యము. సంసారపు యావ గలిగిన మానవులంతా జంత్రపు సంసారులు (తోలు బొమ్మల్లాగా ఆడే అస్వతంత్రులు). వారితో ఈ వైష్ణవులను పోల్చుటయే మహాపాపము.

విశిష్టమైన వీరి ఇంకొక లక్షణం చెబుతాను వినండి. వీరు తలపట్టిన దీక్షను యెన్నడూ విడువరు. ఎప్పుడూ ఆ పరాత్పరుడే దిక్కు అనే భావనతోనే వుంటారు. ఎలాగైతే పతివ్రత భర్తయే సర్వస్వమను కొంటుందో వీరూ శ్రేష్ఠమైన తమ పాతివ్రత్యముకూడా తమ ఆశయమనే భావనలో సుఖముగా వుంటారు. సర్వజగములను కప్పిన (ఆక్రమించిన) శ్రీవేంకటేశ్వరుని దాసులైన ఈ వైష్ణవులు కర్మలాచరించుటకు విముఖులు. సాత్త్విక ప్రవృత్తి కలిగినవారు. ఇట్టి ఈ వైష్ణవులకు అన్యులు సమానులనికూడా అనరాదు. వీరిని సేవించి నేను ధన్యుడనయ్యాను.

సంపుటి: 15 కీర్తన : సర్వజ్ఞత్వము వెదకఁగ నొల్లను
సందేహింపఁగ నొల్లను
సంఖ్య : 463 పుట : 310 రాగం: దేవగాంధారి

దేవగాంధారి

92 సర్వజ్ఞత్వము వెదకఁగ నొల్లను సందేహింపఁ నొల్లను
సర్వజ్ఞుండును నాచార్యుండే సర్వశేషమే నా జీవనము

॥ పల్లవి॥

యెఱఁగఁగ నొల్లము విజా&ఞనపుగతి యెఱుకలు నే మిటు సోదించి
యెఱిఁగి యితరులను బోధించెద మను యీ పెద్దరికము నొల్లము
యెఱిఁగేటి వాఁడును యాచార్యుండే, యెఱుకయు సర్వేశ్వరుఁడే
యెఱుకయు మఱపును మానివుండుటే యిదియే పో మా విజ్ఞానము

॥సర్వ॥

చదువఁగ నొల్లము సకలశాస్త్రములు సారెకు సారెకు సోదించి
చదివి పరులతో యుక్తివాదములు జగడము గెలువఁగ నొల్లము
చదివేటివాఁడును నాచార్యుండే, చదువును నా యంతర్యామే
చదువుకుఁ జదువమికియుఁ దొలఁగుటే, నానాసాత్వికభావమే నా తెలివి

॥సర్వ॥

అన్నిటికిని నే నధికారిననెడి యహంకారము నొల్లను
కన్నులఁ జూచుచు నందరితో నేఁ గాదని తొలఁగా నొల్లను
మన్నన శ్రీవేంకటేశ్వరుకరుణను మా యాచార్యుఁడే అధికారి
వున్నరీతినే అస్తినాస్తులకు నూరకుండుటే నా తలఁపు

॥సర్వ॥

అవతారిక:

అన్నమాచార్యులవారు ఈ కీర్తనలో తమకి సర్వజ్ఞత్వము అక్కరలేదంటున్నారు. తమ ఆచార్యులవారి మహిమ మీద తమకు యెటువంటి సందేహమూ లేదనీ అలా సర్వజ్ఞుడైన తమ ఆచార్యుడే తమకు సర్వస్వం అంటున్నారు. తన జీవనము సర్వశేషము అంటున్నారు. అంటే తమ జీవితం వారి అనుగ్రహమే అని అర్థం. ఎఱిగేటి వాడు ఆచార్యుడట. ఆయన ఇచ్చిన యెఱుక సర్వేశ్వరుడట. మరి మా సంగతేమిటి? మాకు ఒకసారి యెఱుక వుంటుంది. ఇంకొకసారి మఱపు వుంటుంది. మా విజ్ఞానం అంతకు మించిలేదు. కనుకు గురుకృపలేక తాము అశక్తులం అంటున్నారు. తమకి శ్రీవేంకటేశ్వరుని కృప కలగాలంటే కూడా తమ ఆచార్యులవారి అనుగ్రహం వుండాలి అంటున్నారు. ఆచార్యుడే అధికారియట. ఆస్తినాస్తులకు అంటే భగవంతుని వునికి నిరూపణ కావాలన్నా పరలోకములేదనే మూర్ఖపువాదన సమసిపోవాలన్నా ఆచార్యునికృప కావలసిందే. ఇక నా ఆలోచన యేమింటంటారా? వూరకుండుటయే అని నిష్కర్షగా చెబుతున్నారు అన్నమయ్య.

భావ వివరణ:

ఓ ప్రజలారా! మేము సర్వజ్ఞత్వము (సమస్తం తెలిసినవాడు అనిపించుకొనుటకు) వెదకగ నొల్లము (ప్రయత్నించుట కిష్టపడము). సందేహింపగ నొల్లము (నిత్యశంకితునివలె బ్రతుకనిచ్చగించము). సర్వజ్ఞుడని పిలువదగినవాడు మా ఆచార్యులవారొక్కరే. ఈ నా జీవితమున్నదే, అది సర్వశేషమే (అంతయూ వారి అనుగ్రహమే.)

మేము విజ్ఞానపు తీరుతెన్నులను తెలిసికొనుటకు ప్రయత్నించనుకూడా ప్రయత్నించము. నేము (మేము) ఇటు (ఇకపై) యెఱుకలు సోదించి

(భగవంతుని యెఱుగుటకై వెదకులాడెదను). ఎఱిగి యితరులను బోధించెదము అను మా పెద్దరికము నొల్లము (తెలిసినవారమైనందున మా పెద్దరికము నిలబెట్టుకొనుటకు ఇతరులకు ఆచార్యత్వము నిర్వహించుటకు కూడా మేము అంగీకరించము). ఎఱిగేటివాడు ఆచార్యుడే (ఆచార్యులు మాత్రమే జ్ఞాని అని పిలువదగినవారు). ఆయన అందించే యెఱుకయే (జ్ఞానము కూడా) ఆ సర్వేశ్వరుడే. మరి ఇక నీ విజ్ఞానమేమిటయ్యా! అని నన్ను అడుగుతారేమో... జ్ఞానము అజ్ఞానము గురించిన చింతలన్నీవ విడనాడి మా ఆచార్యులను సేవిస్తూ జీవించటమే, మాకు తెలిసిన విజ్ఞానము.

మూకు ఇంకొక లక్షణము వున్నది. సారెకు సారెకు శోదించి (ప్రతిసారి పరిశోధించి) సకల శాస్త్రములను చదువగ నొల్లము (షట్శాస్త్రములలో పాండిత్యానికి ప్రయత్నించుటకు ఇష్టపడము). ఆ విధంగా చదివి ఇతరులతో తర్కించి యుక్తితో ఇతరులను వాదనలో ఓడించుటకు కూడా మేము ఇష్టపడము. ఎందుకంటే నిజానికి చదివేవాడు మా ఆచార్యుడే ఆ చదువును అర్థం చేసికొనే శక్తివున్నవాడు నాలో అంతర్యామిగావున్న పరమాత్మ. చదవుట చదువకుండుట రెంటినీ విడనాడి అనేక సాత్విక భావనలతో ప్రశాంతంగా జీవించుటయే నా తెలివి (జ్ఞానము).

మాకు ఇంకొక విలక్షణమైన సద్గుణమున్నది. మేమే అన్నిటికీ అధికారులము అనే అహంకారమంటేనే మాకు అసహ్యము. మా కన్నుల యెదుటవున్నవారిని చూచుచు వారిని లెక్కసేయక తొలగిపోయి మా ఔన్నత్యము ప్రకటించుకొనుట అంటే కూడా మాకు అసహ్యమే. సగౌరవంగా శ్రీవేంకటేశ్వరుని కరుణను మాకు అందించటానికి సర్వాధికారి కూడా మా ఆచార్యుడే. ఇక ఆయన రక్షణలో ప్రశాంతంగా ఊరక యుండుటే మా తలపు (ఆలోచన). ఆస్తినాస్తి విచికిత్స... ఇట్లాంటి వ్యర్థమైన ఆలోచనలవల్ల లాభమేమిటి ఆలోచించండి.

సంపుటి: 15 కీర్తన : ఇదె నీ చిత్తం బింక నా భాగ్యము యిన్ని విన్నపము లిందునే వున్నది

సంఖ్య : 318 పుట : 214 రాగం: గౌళ

గౌళ

93 ఇదె నీ చిత్తం బింక నా భాగ్యము యిన్ని విన్నపము లిందునే వున్నది
హృదయములోపల నీ వున్నాఁడవు యెఱుఁగని యర్థం బించుక లేదు
॥ పల్లవి॥

మొగి నాయుష్యము నూరేండ్లు ఇంక ముందరఁజేసెదఁ బుణ్యములనుచును
తగ నా యిచ్చల వలసినట్ల నేఁ దప్పె ననక భోగించితిని
జిగి నొకదేవత ననుచరించను సేసినధర్మం బొకటీఁగానను
నిగిడి వృద్ధునైతి నింతలోనను నీ ముందర నే నిలిచితిని
॥ఇదె॥

అనేకకాలము బ్రహ్మకల్పము నడలయందు నే జన్మించి ముక్తి వడతునని
పొనుఁగుచు నిహమే కోరుచు నాసల పుట్టుగులకు నొడిగట్టితిని
అనిశము మునులను అవలంబించను ఆధార మొక్కటి సంపాదించను
తనిసి యిదివో దుర్బలుఁడనైతి నీ దయాదృష్టినే తగిలితిని
॥ఇదె॥

శ్రీవేంకటగిరి పరమపావనము చేరియందు నీ సేవ సేతునని
త్రోవచూచుకొని యిన్నాళ్ళ (?) దనుక దొరకొని వేడ్కల మెలఁగితిని
భావములో నొక యుక్తియు వెదకను పరులు నాకు రక్షకులని తలఁచను
చేవమీతి నిర్భరుఁడ నైతిని శ్రీసంకల్పాశ్రితుఁడ నైతిని
॥ఇదె॥

అవతారిక:

ఓ దేవదేవా! ఇకపై నీ చిత్తము నా భాగ్యము. నేను అశక్తుడను. నీవు వున్నది నా హృదయంలోనే కదా! ఇక నీకు తెలియని నా ఆలోచన యేమివుంటుంది తండ్రీ! నా విన్నపములను కూడా నోటితో చేయవలసిన పనియే లేదు. నీవు సర్వజ్ఞుడవు. నీకు అర్థంకానిదేముంటుంది ప్రభూ! అంటున్నారు తాళ్ళపాక పెద తిరుమలాచార్యులవారు. ఈ కీర్తన వింటుంటే వృద్ధులైన అన్నమాచార్యులవారి ఆత్మవారి ఆత్మజునిలా పాడుతున్నట్లుంది. నూరేళ్ళాయువు వున్నదిలే అనుకొని భోగాన్వేషణలోనే బ్రతికాను. చూస్తుండగానే జుట్టు నెరిసింది. పళ్ళు వూడిపోయాయి. ముసలి ఒగ్గునైపోయి నీ ముందు నిలిచాను. ఇక నా గతేమిటి ప్రభూ! అయిందేదో అయిపోయింది. ఇన్నాళ్ళూ ఏదో ఒక రోజు శ్రీవేంకటగిరి చేరి అక్కడ నీ సేవ చేసికుంటూ వుందాములే అని రోజులు దొర్లించేశాను. ఏవేవో వేడుకలతో కాలం వెళ్ళబుచ్చాను. కాని ఈనాటికి జ్ఞానోదయమయ్యింది. ఇక పరులెవ్వరూ నా రక్షకులని భావించనుగాక భావించను. "నేను చేవమీఱి నిర్భరుడనైతిని శ్రీసంకల్పాశ్రితుడనైతిని" – అంటున్నారు. అంటే యేమిటి? మరి ఆ తండ్రికొడుకు కదా! అంత తేలికగా కవిత్వం చెబుతాడా? మీకు భావ వివరణ వెడకక తప్పేట్లు లేదుమరి.

భావ వివరణ:

ఓ శ్రీహరీ! ఇంక, ఇదె నీ చిత్తము నా భాగ్యము (నీ దయ నా ప్రాప్తము) తండ్రీ! ఇన్ని విన్నపములు (నేను చేయదలచుకొన్న అభ్యర్థనలన్నీ) పూర్తి అయినవి. అన్నీ నా హృదయంలోనే వున్నవి. నీవు అంతర్యామివై నా హృదయంలోనే వుండగా నీవు యెఱుగనిదేదన్నా వుంటుందా?

స్వామీ! నీవు నాకు నూరేండ్ల జీవితము నిచ్చావు. ఆఁ అన్నాళ్ళువుంది కదా! ఇకముందు పుణ్యం చేసెదనులే అని నేను నా ఇచ్ఛవచ్చినట్లు

జీవితం గడిపాను. నేను తప్పేననక భోగించితిని (ఇది తప్పు ఇది ఒప్పు అనే విచక్షణ లేక భోగములనుభవించితిని). కనీసం ఒక్కదైవమూర్తిని కూడా పూజించనైతిని. వారిని అనుసరించలేకపోయాను. పోనీ, ధర్మకార్యాలేమన్నా చేశానా అంటే యేదీ చేయనే లేదు. ఇంతలోనే నేను చూస్తుండగానే వృద్ధాప్యం నన్ను చుట్టుముట్టింది. నేను అశక్తుడనై నీముందు ఇలా నిలబడి పోయాను. ఓ సర్వేశ్వరా! ఇక నీ చిత్తము నా భాగ్యము.

దేవా! ఇదే నా మొదటి జన్మ అందుకనే అలా పొరబాట్లు జరిగాయి అనుకొందామా, అంటే అది నిజం కాదు. అనేక బ్రహ్మ కల్పాల క్రితమే నేను, కాలానుగుణంగా అనేక జన్మలనెత్తాను. ఎంతసేపూ ఇహలోక సుఖాల ధ్యాసయే. ఆశాపాశమే. కోరికలే. నా అదృష్టవశాత్తు ఈ జన్మలో ఈ వృద్ధాప్యంలో ఎట్టకేలకు ముక్తిని పొందాలనే కోరిక పుట్టింది. అయ్యో! మునులు ఇంతకుముందే అందించిన ఒక్క ముక్తిమార్గమునూ ఇంతకాలమూ పట్టుకోలేదని బాధపడ్డాను. వారి ఆధారమునొక్కదానినీ అవలంభించలేకపోయాను. మరి నాకు అంత దీక్ష లేదు కదా! ఇదిగో ఇలా పశ్చాత్తాప పడుతూనే దిగులుతో మరీ దుర్బలుడనైపోయాను. ఇప్పుడు వూరు పొమ్మంటోంది, వల్లకాడు రమ్మంటోంది. నీ దయాదృష్టికోసం తగలితిని (వెంపర్లాడుతున్నాను).

ఓ శ్రీవేంకటేశ్వరా! పరమపావనమైన నీ సప్తగిరిని చేరుకొని అందు నీ సేవ చేతునని ఇన్నాళ్ళనుంచి అనుకొంటూనే కాలం వెళ్ళబుచ్చాను. మళ్ళీ వేడుకలలొ మునిగిపోయాను. ఇది నీ మాయ కాక మరేమిటి తండ్రీ! మనస్సులో కూడా నవవిధ భక్తి మార్గములలో ఒక్కదానిని అయినా అవలంభించలేదు. అప్పుడు పరులు నాకు రక్షకులు కారనే జ్ఞానోదయమైనది. నా రక్షకుడవు నీవేనని గ్రహించితిని. చేవమీఱి నిర్భరుడనైతిని (నేను పెల్లుబికిపోయాను). శ్రీ సంకల్పాశ్రితుడనైతిని (మంగళకరమైన భగవత్ చింతనతో నిన్ను ఆశ్రయించాను). నేను ధన్యజీవినయ్యాను.

సంపుటి: 15 కీర్తన : ఏమఱఁజనదు బ్రతికేటికాలము
యెఱిఁగిన మహాత్ములకును
సంఖ్య : 267 పుట : 180 రాగం: బౌళి

బౌళి

94 ఏమఱఁజనదు బ్రతికేటికాలము యెఱిఁగిన మహాత్ములకును
శ్రీమంతుఁడగు హరినే తలఁచిన చీఁకటు లన్నియుఁ బెడఁబాయు
॥పల్లవి॥

చేరి వుండెడిది బ్రహ్మలోకమట శ్వేతుఁడను రాజట భువిమీఁదికి
కారణమున నేతెంచి నిత్యమును కళేబరం బట తన కాహారము
అరయ సంపద లే పనికి వచ్చునట లోకాంతరగతి నే మున్నది
శ్రీరమణునికే శరణుచొచ్చినను చెడనిభోగములు చేచేతఁగలుగు
॥ఏమఱఁ॥

చేసినక్రతువులు నూఱట నహుషుఁడు చెలఁగుచు దేవేంద్రపట్ట
మేలెనట
దోస మించుకంతకుఁగా భువిపైఁ దూలుచుఁ బామై పడియెనటా
ఆసలఁ గర్మము నెట్టునమ్మెడిది అమరత్వము ఫలమది యెట్లించుట
వాసుదేవునిఁ గొలిచి తా నతనివాఁడై యుండిన నెలకొను శుభము
॥ఏమఱఁ॥

వెలయఁగ త్రిశంకుఁ డనియెడి రాజట విశ్వామిత్రుని పరిగ్రహం బట
అలరిన చండాలత్వ మొందె నట యంతరిక్షమున నుండెనటా
బలుములు యెందాక వెంటవచ్చు నుపాయంబులు మఱి చెప్పఁగనేలా
యిలధరుఁడగు శ్రీవేంకటేశ్వరుని నెఱిఁగి దాసుఁ డగుటే సత్ఫలము
॥ఏమఱఁ॥

అవతారిక:

ఈ కీర్తనలో తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు పురాణగాథలను వుటంకిస్తున్నారు. తన తండ్రి అన్నమాచార్యులవలనే ఈయన పౌరాణిక గాథల ప్రస్తావన గొప్ప ప్రహేళికలావుంటుంది. మామూలు పాఠకులకు అంత సులభగ్రాహ్యం కాదు. కాలము విలువ తెలిసిన మహాత్ములు ఏమఱుపాటు విడనాడి తాము బ్రతికి వున్న కాలమంతా చక్కగ సద్వినియోగం చేసికొనుటకే ప్రయత్నిస్తారు. లక్ష్మీవల్లభుడైన శ్రీహరి ధ్యానించగానే అజ్ఞానాంధకారము తొలగిపోతుంది అంటున్నారు. ఈ కీర్తనలోని పురాణగాథలు అందరికీ తెలిసినవి కానందువల్ల వాటిని వివరించాలనివున్నా స్థలాభావనచేత వివరింపలేని పరిస్థితి వచ్చింది. పురాణ కాలంలో బ్రహ్మలోకవాసియైన ఒక రాజు వుండేవాడట. ఆయనపేరు శ్వేతుడు కానీ ఆయన నిత్యమూ భూలోకానికొచ్చి ఒక మానవ కళేబరాన్ని ఆహారంగా తీసికొంటూవుండేవాడట. లోకాంతరస్థితిని పొందిన ఆ రాజుగారికి యెన్ని సిరిసంపదలున్నా నిరుపయోగమే కదా! ఆ రాజు ముందే శ్రీహరి శరణు పొందియుంటే ఆయనకా తిప్పలన్నీ తప్పేవి కదా! అంటున్నారు పెదతిరుమలయ్య. ఈ విధంగా ఈ కీర్తనలో ఇంకా నహుషుడి గాధ, త్రిశంకుడి గాధ కూడా ప్రస్తావించబడ్డాయి. అవికూడా విపులంగా వివరించాలంటే ఇక్కడ సాధ్యపడదు. చదువరి నన్ను మన్నించక తప్పదు, మరి.

భావ వివరణ:

ఓ ప్రజలారా! యెఱిగినమహాత్ములకును (భగవత్ తత్వము తెలిసిన మహానుభావులకు) కాలము ఏమఱజనదు (కాలము యొక్క ప్రభావమును

మరువతగదు). ఎంతటివారినైనా కాలము కబళించి వేస్తుంది. బ్రతికియున్న కాలమును శ్రీమంతుడైన శ్రీహరినే తలచుచు సద్వినియోగము చేసికొనవలెను. అట్లు చేసిన చీకటులన్నియు (అజ్ఞానాంధకారము) యెడబాయును (మనలను విడిచిపెడుతుంది).

ఒక పురాణగాధను విని ఈ నా మాట యెంత సత్యమో గ్రహించండి. పూర్వకాలంలో శ్వేతుడు అనేరాజు వుండేవాడు. ఆయన బ్రహ్మదేవునికి ప్రీతిని కలిగించి, ఆ బ్రహ్మవద్దనే వుండెడివాడు. కానీ ఆయన పురాకృత కర్మననుభవించుటకు అనునిత్యమూ భూలోకమునకు వచ్చి ఒక మానవ కళేబరాన్ని (శవమును) ఆహారముగా స్వీకరించేవాడు. మరి ఆయన సిరి సంపదలలో శ్రీమంతుడు. ఏలోకమైనా యధేచ్ఛగా వెళ్ళగలిగిన శక్తి ఆతనికున్నది. ఇక అటువంటి అసామాన్యుడి గతి యేమయినదో చూశారా? అటువంటి భోగాలు యెందుకయ్యా? శ్రీరమణుడైన శ్రీహరిని శరణుచొచ్చిన వారికి యెన్నటికీ చెడని భోగములు కోకొల్లలుగా సమకూడుతాయి. మరి బ్రహ్మలోక వాసము లెందుకు శవాల్ని పీక్కుతినటం యెందుకు చెప్పండి.

పూర్వం నహుషుడనే మహర్షి నూరు క్రతువులు చేసి దేవతలకు ప్రీతిపాత్రుడుగా వుండేవాడు. ఒకానొక శాపం చేత దేవేంద్రుడు తన పదవినీ, లోకాన్ని వదలిపెట్టవలసి వచ్చింది. దేవతలు ఋషులు నహుషుణ్ణి దేవేంద్ర పదవిలో వుంచారు. గర్వం తలకెక్కిన అతడు ఒకనాడు ఇంద్రుడి భార్య శచీదేవి కూడా తనకు కావాలన్నాడు. నారదుని సలహా మేరకు ఆవిడ సప్తఋషులు మోస్తున్న పల్లకీనెక్కివస్తే అతని కోరిక తీరుస్తానన్నది. ఆ కామాతురుడు అంతపనీ చేశాడు. పైగా వారిలో పొట్టివాడైన

దుర్వాసుడు వేగంగా పోవటంలేదని "సర్పసర్ప" అని కాలితో తన్నాడు. ఆగ్రహోదగ్రుడైన ఋషి వాణ్ణి సర్పము అవుదువుగాక అని శపించి వాడి పీడను నివారించాడు. కాబట్టి అమరత్వము దక్కినా గర్వం నెత్తికెక్కటం తప్ప లాభమేమిటి? చేసిన కర్మనెట్లా నమ్మేది? దాన్ని అనుభవించక తప్పదు కదా! మరి ఈ గోల అంతా యెందుకు? వాసుదేవుని కొలిచి అతనివాడైవుంటే సర్వశుభములు కలుగుతాయి కదా!

పూర్వం ఇక్ష్వాకువంశజుడైన త్రిశంకుడు అనే చక్రవర్తి వుండేవాడు. వాడికి సశరీరంగా స్వర్గం వెళ్ళాలనే కోరిక కలిగి గురువు వసిష్ఠుని అభ్యర్థించాడు. ఆయన వాడిని మందలించాడు. వాడు విశ్వామిత్రుని ఆశ్రయించాడు. వశిష్ఠుడిపై మత్సరంతో విశ్వామిత్రుడు వాణ్ణి తన తపశ్శక్తినంతా వెచ్చించి స్వర్గం చూపించాడు. వాణ్ణి దేవేంద్రుడు చండాలుణ్ణి చేసి ఒక్క తన్నుతో తలక్రిందులుగా భూమిపై పడేట్లు చేశాడు. విశ్వామిత్రుడు మూర్ఖపు పట్టుదలతో త్రిశంకుని కోసం త్రిశంకు స్వర్గాన్నే సృష్టించాడు. చివరికి తన తపోబలమంతా పోగొట్టుకొన్నాడు కాబట్టి మన తపోబలమైనా మననెంతవరకు ఉద్ధరిస్తుంది చెప్పండి. మరి ఈ ఉపాయాలన్నీ వ్యర్థమే కదా! భూవల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని తెలుసుకొని ఆయన దాసులైతే సత్ఫలితములన్నీ అసంఖ్యాంగా కలుగుతాయి. ఇది నిజం.

సంపుటి: 15 కీర్తన : వేగిర మేటికిని వేసట లేటికిని విష్ణుని సొలయగ నేల

సంఖ్య : 151 పుట : 100 రాగం: పాడి

పాడి

95 వేగిర మేఁటికిని వేసట లేఁటికిని విష్ణుని సొలయఁగ నేల
సాగిలిమొక్క నతఁడు మన్ననలు జరపినపాటి జరపీఁగాక ॥ పల్లవి॥

తనవేలే తన కన్నుదాఁకినను తా నెవ్వనిఁ గోపించీని
తన కర్మమే తన్నుఁ జేయఁగ దైవము దూరఁగనేల
అనుభవింపుచును హరినే కొలిచిన అలమట లన్నియు హరిచూచి
పొనుఁగక తమలో దుర్దోషంబులు పొమ్మున్నపుడే పోయిఁగాక

॥వేగిర॥

కడుపులోపలికి మింగిన రత్నము కడుచోట్ల వెదకఁగ నేల
బడిఁదన యంతర్యామి దా మఱచి పలువేల్పులఁ గొలువఁగ నేల
విడువక శ్రీపతినామమంత్రమే వేడుకఁ దలఁచఁగఁ దలఁచఁగను
చెడకుండా నతఁడు పావనము సేసినప్పుడే సేసీగాక

॥వేగిర॥

కర్మము నతఁడే కార్యము నతఁడే కడఁగిన శ్రీవేంకటవిభుఁడూ
నిర్మించినట్లవు నిన్నియు మరి నేఁ దనుమానము లేల
ధర్మం బితనికి యే కాలంబును దాసుల రక్షించే బిరుదు
అర్మిలి యితనిఁ గొలిచినఁ జాలును అందనిపదవులు నందీఁగాక

॥వేగిర॥

అవతారిక:

ఓ భక్తులారా! మీరెందుకు తొందరపడుతున్నారు? యెందుకు శ్రమపడుతున్నారు. మీ కస్టాలన్నిటికీ కారణం మీరు విష్ణుని మరచుటయే.

ఆయన మనందరి తండ్రి అమిత దయాళువు. కేవలం సాష్టాంగనమస్కారమునాచరించిన మాత్రమున ఆయన తనకు మన్ననలను జరిపినట్లే భావిస్తాడు – అంటున్నారు తాళ్ళపాక పెద తిరుమలాచార్యులవారు. ఇది నిజమని నీవెట్లా చెప్పగలవు అని అంటారేమో.... నే చెప్పేది వినండి, పొరబాటున మనవ్రేలు తగిలి కన్ను గాయపడితే ఆవ్రేలిపై కోపించి యెవడన్నా దాన్ని చితకకొట్టుకుంటాడా? వ్రేలూ వాడిదే, కన్నూ వాడిదే. అందుకని వదలివేస్తాడు. అవునా? ఆ స్వామి యెవరినైనా యెందుకు శిక్షిస్తాడు? మానవుని కర్మము వలన దైవము నిష్పక్షపాతంగా మన్నిస్తాడు లేదా తన్నిస్తాడు. తన్నించాడని స్వామిని నిందించుట తగునా? మన పిల్లవాడు ఒకవేళ రత్నాన్ని మింగితే, పోనీలే అది వాడి కడుపులో భద్రంగా వుంటుందిలే అని ఊరుకొంటామా? అది యెంత విలువైన రత్నమైనా కడుపులోకి పోతే మృత్యువే. దానికోసం ఎక్కడెక్కడో వెదకితే లాభంలేదు. కడుపులోనే వెదకాలి, ఎలాగైనా బయటకు తీయాలి. అంతర్యామియై నీలోనే ఆ శ్రీహరివుంటే యెక్కడెక్కడో గుళ్ళుగోపురాల చుట్టూతా తిరుగుతావు. యెంత వెఱ్ఱివాడివిరా! అంటున్నారు.

భావ వివరణ:

ఓ భక్తులారా! వేగిరమేటికి (మీరెందుకు తొందరపడుతున్నారు?) వేసట లేటికిని (యెందుకింత శ్రమపడుతున్నారు?) విష్ణుని సొలయగనేల? (నారాయణుని మఱువ తగునా?) అతడు (ఆ శ్రీహరి) సాగిలిమొక్కన్ (ఒక సాష్టాంగ నమస్కారమును చేసినంత మాత్రమున) మన్ననలు జరిపినపాటి జరిపీగాక (తనను మన్నించినట్లే భావిస్తాడు).

తన వేలు పొరబాటున తనకంటిని పొడిచిందని కోపించి యెవడన్నా దాన్ని చితకకొట్టుకుంటాడా? మరి తాను చేసిన కర్మవలన తాను చిక్కులు తెచ్చుకొని కష్టాలు పడుతుంటే అందుకు దేవుని దూరుగనేలా (నిందించుట యెందులకు?) తమ కర్మఫలము తామనుభవించుచూ

శ్రీహరి ధ్యాస విడువక కొలిచిన, ఆయనే అలమటలన్నీ (చింతలన్నీ) చూచి, వారిలోని దుర్దోషములు (చెడు పాపములను) తొలగిపోండి అన్నప్పుడు ఆ పాపములు వాటంతట అవే తొలగిపోతాయి. హరికృప కలిగేదాకా పాపాలు చేసేవాడికి తాను పాపము చేస్తున్నా యేదో గొప్పవని చేస్తున్నట్లు పశ్చాత్తాపం కూడా పొందడు.

మన పిల్లవాడు పొరబాటున ఒక రత్నాన్ని మింగితే, పోనీలే విలువైనదాన్నే మింగాడు దాన్ని వాడి కడుపులోనే వుండనిద్దాములే అనుకొని వూరకుంటారా? వాడి కడుపులోంచి దాన్ని బయటకు తెప్పిస్తారు కదా! విలువైనది కదా! అని యెక్కడెక్కడో వెదుకుతారా? శ్రీమన్నారాయణుడు అంతర్యామివలె మనదేహంలోనే వుండీ అనుక్షణం కంటికి రెప్పలా కాపాడుతుంటే, యేమఱుపాటుతో అర్థం లేకుండా రకరకాల పరదేవతలను ఆరాధించుట నిరుపయోగము కదా! మనము చేయవలసినదల్లా, శ్రీపతినామ మంత్రమును సంతోషముతో ధ్యానించగా యేదో ఒకనాటికి ఆస్వామే తప్పక మనని పుణ్యాత్ములను చేస్తాడు. అంతదాకా మనము చేయవలసిందల్లా, ఆయనపై విశ్వాసం సడలకవుండుటయే.

ఇంకొక గొప్ప రహస్యమేమంటే జీవుల కర్మము వేరెవరో కాదు ఆ శ్రీహరియే. ఆ కర్మవశమున వారు చేయు కార్యములు కూడా ఆ శ్రీహరియే. ఇవన్నీ కూడా పూనుకొని శ్రీవేంకటేశ్వరుడే నిర్మించినట్లు అవుతాయి. ఇందులో ఈషణ్మాత్రమైనా అనుమానము లేదు. ఈతడు నిర్వధికంగా నిర్వహించే ఇంకొక ధర్మమువున్నది. అదేమిటంటే, యేకాలంబును (యేనాడైనా) తన దాసులను తప్పక రక్షించుటయే. ఇతనిని అర్మిలి (ఆపేక్షతే) గొలిచిన చాలును అందుకోటానికి అసాధ్యమైన అనేక పదవులను ఆయనే అందిస్తాడు. ఈ మాట పరమసత్యము.

సంపుటి: 2 కీర్తన : ఆనతియ్యగదవే అందుకే కాచుకున్నాడను
సంఖ్య : 301 పుట : 201 రాగం: సామంతం

సామంతం

96 ఆనతియ్యఁగదవే అందుకే కాచుకున్నాఁడను
పూనుక నీ వెంతనేర్పరివైనా భువి మనసు పేదను నేను
॥పల్లవి॥

కొలిచేమనేబంట్లు నీకుఁ గోటానఁగోట్లు గలరు నిన్నుఁ
దెలిసేమనేజ్ఞానులు తెందేప లున్నారు
తలఁచి వరములడిగేవారలు తలవెంట్రుకలందరు వారె
యిల సందడిలో నాకొలవు యెటువలె నెక్కినో ॥ఆన॥

పనులకుఁ బాల్పడినవారు బ్రహ్మాదిదేవతలట
వినుతులు సేయఁదొడంగినవె వేదరాసులట
మనుకొని ధ్యానించువారు మునులెందరైనాఁ గలరట
వినయపు నామనవి సనవులకు వేళ లెపుడు గలిగీనో ॥ఆన॥

వున్నతితోడుత నిన్ను మోఁచుటకు వున్నారు గరుఁడఁడు శేషుఁడు నీకు
అన్నిటాను నీకాఁగిటిలోపల నలరీ నలమేల్మంగ
యెన్నఁగ శ్రీవేంకటేశా నన్నును యేలితి వింతటిలోనె
పన్ననామొక్కులు నీ కేబాగులఁ జేరీనో ॥ఆన॥

అవతారిక:

ఓ సర్వేశ్వరా! నీకు కొదవేమున్నది తండ్రీ! నీవు తలుచుకొంటే కానిదేమున్నది? నీవు యెంతనేర్పరివైనా నాబోటి అల్పుడిని రక్షించటానికి

నీఅంతటివాడు శ్రమపడనక్కరలేదయ్యా! నీవు వృత్తిగా ఆనతిస్తేచాలు కోటానుకోట్లైన నీ పరివారములో యెవరో ఒకరు నన్ను ఆదుకొంటారులే అనే ధీమాతో వున్నాను. స్వామీ! నేను మనసు పేదను కూడా అంటున్నారు అన్నమాచార్యులవారు. బ్రహ్మాది దేవతలంతటివాళ్ళు నీ కోసం పడిగాపులు కాస్తుంటే నాబోటి అనామకుడిని పట్టించుకొనేవాళ్ళెవరయ్యా! అంటున్నారు. ఇక నీ వాహనమైన ఖగేంద్రుడు గరుత్మంతుడున్నాడే ఆయన నిన్ను యెక్కడకు కావాలంటే అక్కడకు క్షణాలమీద తీసికొని వెళ్తాడు. ఆదిశేషుడు నీకు రక్షణ కవచంగా వుండే పానుపు కూడా. క్షణం కూడా నిన్ను వీడని నీ దేవేరి అలమేలుమంగ మాకు కన్నతల్లికంటె యెక్కువ ప్రేమను పంచిపెడుతుంటుంది. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే నన్ను యేలితివి. ఇంకా నేను కోరుకొనేదేముంది? "పన్నిన నా మొక్కులు నీకే బాగుల జేరీనో" అంటున్నారు. అంటే యేమిటి?

భావ వివరణ:

ఓ దేవదేవా! నీ అనుజ్ఞ కోసమే కాచుకొని వున్నానయ్యా, నీవెంత నేర్పరివైనా ఈ లోకంలో అనేకమందివలె నేనూ మనసు పేదనైతినయ్యా! (మనస్సు నీకర్పించి నాదంటూ యేమీలేని నిరుపేదనయ్యాను). పూనుకొని నన్ను రక్షించే భారము నీదే.

ఓ ప్రభూ! మేము నీ దాసులమయ్యా! నిన్ను సేవించుటయే మా పని అనే బంట్లు నీకు కోట్లాదిమంది వున్నారు. నిన్ను నీ తత్వాన్నీ బాగా అర్థం చేసికొన్నామయ్యా! అనే జ్ఞానులు తెందేపలున్నారు (తండోపతండాలుగా వున్నారు). నిన్ను తలచి (ధ్యానించి) స్వామీ! మాకు ఇది కావాలి, స్వామీ! మాకు అది కావాలి అని యాచించే భక్తులు తలలో యెన్ని

వెంట్రుకలున్నాయో అంతమంది వుంటారయ్యా! ఇల (ఈ లోకంలో) అందరూ సందడి చేసేవారే. మరి ఆ హడావిడిలో నీకు, నా కొలువు యెటువలెనెక్కీనీ (నా సేవ ఏవిధంగా గుర్తుంటుంది తండ్రీ!)

ఓ సర్వేశ్వరా! స్వయంగా బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలైన దేవతలు, నీ పనులకు బాల్పడినవారే (నీ సేవకు సిద్ధమైనవారేనయ్యా!) వేదరాసులు (చతుర్వేదములు) నీకు వినతులు సేయ దొడంగినవే (నీకు విన్నపములు సేయుటకు నిర్దేశింపబడినవే సుమా!) ఇకపోతే, మునుకొని (ప్రప్రథమంగా యెంచుకొని) నీవే సర్వస్వమని భావించి సదా నిన్నే ధ్యానించే మునులు యెందరైనా గలరు (అసంఖ్యాకంగా వున్నారు). ఓ దేవా! వినయముతో కూడిన నామనవి, సనవులకు (కోరికలకు) నీకు వేళయెపుడు కలిగీనో (దొరుకుతుందో కదా!)

స్వామీ! నిన్ను వున్నతితో మోచుటకు (ఉన్నతముగా మోయుటకు నీకు ఇద్దరు యెల్లప్పుడూ సిద్ధముగా వుంటారు. అందులో మొదటివాడు గరుత్మంతుడు. స్వామిని వాయువేగ మనోవేగాలతో ఆయనకు కావలసిన చోటికి తీసికొని వెళ్తాడితడు. ఇక రెండవవాడు ఆదిశేషుడు. స్వామి సుఖంగా చుట్టలు చుట్టుకొనియున్న ఆదిశేషుడే తల్పముగా పడుకొని యుంటాడు. ఇక నీ దేవేరి అలమేలుమంగ అణుకువతో నీ కౌగిట నిండుగా అలరియుంటుంది. ఇంతటిలోనే (వీరందరితో పాటు ఇంతలోనే) నన్నుకూడా ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వున్నతితో యేలితివి. పన్నిన నా మొక్కులు (నేను అనుకొన్న నా మొక్కుబడులన్నియునూ) నీకే బాగుల జేరీనో (సక్రమముగా చేరుతాయో లేదో)?

సంపుటి: 2 కీర్తన : ఎట్టు సేయగలవాడనో యిక నీచేతిది నావునికి

సంఖ్య : 296 పుట : 198 రాగం: లలిత

లలిత

97 ఎట్టు సేయఁగలవాడనో యిఁక నీచేతిది నావునికి
నెట్టన నీదాసుఁడనైతిని నీచిత్తం బిఁకను ॥ పల్లవి॥

సారెకుఁ గొలువుసేతు చనవులు నీ విత్తు వోయనుచు
నేరకున్నాఁ బాడుదును నీవు మెత్తువనుచు
వోరిచి వుపవాసములుండుదు నొగి దయదలంతువో యనుచు
చేరి వాకిలిగాచుకుండుదు చిత్తమురావలెననుచు

॥ఎట్టు॥

కమ్మటి నిచ్చకములు నెరపుదు కైవసముగావలెననుచు
వుమ్మడి నీగుణాలు వొగడుదు వూరక మొగమోడుదువనుచు
నెమ్మది మొక్కులు నే మొక్కుదు నేరములెంచక కాతువని
నమ్మి నిన్ను నేఁ బూజింతు నను నీ వీడేరింతువని

॥ఎట్టు॥

ఆసతో నిను భావింతు అన్నిట నన్నేలుదువనుచు
వేసరక నీమంత్రము నుడుగుదు వేగమే వరమొసఁగుదువనుచు
రాసికి నెక్కఁగ శ్రీవేంకటేశా రక్షించితి విప్పుడు నన్ను
వాసితోడ నే నిన్నుఁ దగులుదును వదలక నాపాలఁ గలవనుచు

॥ఎట్టు॥

అవతారిక:

ఇది ఒక శరణాగతి కీర్తన అనే చెప్పుకోవాలి. నవీన కాలంనాటి తెలుగుభాషలో చెప్పాలంటే ఈ విధంగా చెప్పవచ్చును. "నీవెట్లా చేస్తావో కాని, నా వునికే నీ చేతులలో వుంది ప్రభూ! ఆఖరికి నీ దాసుడనయ్యాను తండ్రీ! ఇకపై నీ చిత్తము నా ప్రాప్తము". అన్నమాచార్యులవారి ఈ కీర్తన మనస్సుని పిండేస్తుందంటే అది అతిశయోక్తి కాదని నా భావన. అట్లాగే ఆ స్వామి దయనుపొందటానికి తాను యేమేమి చేయగలరో కూడా హృద్యంగా వివరిస్తున్నారు. నీవాకిటిముందు పడిగాపులు కాస్తానయ్యా ష నీదయ రావాలనే నా ప్రయత్నాలన్నీ అంటున్నారు. నేను చేసిన నేరాలు అసంఖ్యాకంగా వున్నమాట నిజమే కానీ నీవే నా నేరములెంచి నాపై కక్ష సాధిస్తే నేనెవరితో చెప్పుకోగలను స్వామీ! ఇక చిట్ట చివరిగా తిరుగులేని అస్త్రం సంధిస్తున్నారు. శ్రీవేంకటేశ్వరా! నీవు రాసికినెక్కినవాడివి. నన్ను ఇప్పుడు నీవు రక్షించటానికి సిద్ధపడ్డావు. ఇంకా నేను కోరుకునేదేముంటుంది స్వామీ! నీవు నాపాలగలవని. వాసితో నిన్ను దగులుదు అంటున్నారు. భావవివరణ చదివితే సందేహాలన్నీ పటాపంచలైపోతాయి మరి.

భావ వివరణ:

ఓ దేవదేవా! ఎట్టు సేయగలవాడవో (ఏవిధముగా చేయనిశ్చయించితివో) ఇక నావునికి నీచేతిది (నా జీవితం, నీ చేతుల్లో వున్నది స్వామీ!) ఇన్నాళ్ళకు నేను నెట్టన (అనివార్యముగా) నీ దాసుడనైతిని. ఇక నా భారం నీదే. నన్నేం చేస్తావో ఇక నీచిత్తము (ఇక నీ దయ నా ప్రాప్తము).

స్వామీ! చనవులు నీవిత్తువోయనుచు (నా కోరికలను నీవు తీరుస్తావని) సారెకు గొలుతును (ప్రతిసారి నిన్ను సేవిస్తాను). నేరకున్నా (అంతబాగా

చేతకాకపోయినా) నీవు మెత్తువనుచు (మెచ్చుకుంటావని) నీ కీర్తనలను పాడుతున్నాను. ఒగి దయతలంతువని (పూనుకొని నాపై కనికరం చూపిస్తావని) వోరిచి (ఓర్పు వహించి) యెన్నియో ఉపవాస దీక్షలు చేపట్టాను. ఇదిగో ఇప్పటికి నీ వాకిట చేరి కాచుకొనివుండి, నీ చిత్తము నా భాగ్యమనుచు శరణాగతితో వున్నాను.

ప్రభూ! మరి నీవు నాకోసం యేమి చేస్తున్నావురా! అంటావేమో? నే చెప్పేది విను. నీవు నా కైవసము (స్వాధీనము) కావాలని కమ్మటి నిచ్చకముల నెరపుదును (తీపి తీపి ప్రియవచనములను చెప్పెదను). ఊరక మొగమోడుదువని (కాస్త దాక్షిణ్యము చూపింతువని) నీ గుణములను వుమ్మడి వొగడుదు (అదేపనిగా కీర్తింతును). నా గత నేరముల గురించి దెప్పక నన్ను గాతువని (రక్షించెదవని) నీకు నెమ్మదిని (నా మనస్సులో) మొక్కులు మొక్కెదను. నన్ను నీవు ఈడేరింతువని (వర్ధిల్లజేసెదవని) నమ్మి నిన్ను సదా పూజించెదను.

ఓ దేవా! అన్ని విధములా నన్ను యేలుకొంటావని ఆశతో నిన్ను భావింతును (నా భావనలలో నిలుపుకొందును). వేగమే నే కోరిన వరములననుగ్రహింతువని, వేసరక (విసుగు లేక) నీ నామ మంత్రమును పఠింతును. అందుచేత అమిత కరుణామయుడవైన ఓ శ్రీవేంకటేశ్వరా! రాసికి నెక్కగ (నన్ను ప్రసిద్ధునిజేసి) ఇప్పుడు నన్ను రక్షించితివి. నీవు వదలక నాపాల (యందు) గలవనుచు, వాసితోడ (శ్రేష్ఠతతో) నిన్ను దగులుదును (ఆశ్రయిస్తాను). నన్ను కృపజూడు తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : దైవమా నీపెరరేఁపణ లివి తప్పక వున్నవి జీవులకు

సంఖ్య : 190 పుట : 127 రాగం: మలహరి

మలహరి

98 దైవమా నీపెరరేఁపణ లివి తప్పక వున్నవి జీవులకు
భావించి కాదనిదొబ్బి దీకొనఁగ బ్రహ్మాదులకైనను వసమా
॥పల్లవి॥

యెక్కడ సిద్ధించు బ్రహ్మచర్యము యెదుటనే కాంతలఁ జూచినవేళను
చక్కఁగా మనోవ్యభిచారంబునఁ జలియించుఁగాక
చిక్కునే విరతి ధనధాన్యంబులు చేతికి లోనయినఁ జూచి
వొక్కటియై తా నుండే మగ్నమునొందిం చుఁగాక ॥దైవ॥

కలుగునే తనివి బహుపదార్థములు గక్కన నంగళ్లనుఁ జూచి
కొలఁదిమీఱఁ గడుతరితీపులతో కోరుచు నోరూరుఁగాక
వలనుగ సమాధి యెటువలె దొరకొను వాజివారణంబులఁ జూచి
యెలమితోడ ముంగిళ్లనెల్లఁ జరియింపించుఁ గాక ॥దైవ॥

యేరీతి నెలకొను నీమీఁదితలఁపు యిహలోకపుసౌఖ్యము చూచి
భారపులంపటములు పైఁ దగిలించి పనులకుఁ బురికొలుపుఁ గాక
ధారుణి నే నివి గెలుచుట యెన్నఁడు తగ శ్రీవేంకటనాయక నీవే
గారవించి రక్షింపుము నీ కిది కడునుపకారంబౌఁగాక
॥దైవ॥190

అవతారిక:

జీవులు మంచి చేయాలన్నా చెడు చేయాలన్నా ప్రేరణ కలిగించేదెవరు? వానిలో అంతర్యామిగా వున్నదేవుడు. అందుకనే

దుర్మార్గులు కూడా మంచి చేస్తుంటారొక్కొక్కప్పుడు. మంచివారు కూడా అకృత్యాలు చేస్తుంటారు. మరి ఆయన విధానమేమిటో భావించి నేను చెడు చేయనుగాక చేయను అని దానిని దొబ్బి (గెంటేసి), దీకొనగ (ఠీకొనగా) బ్రహ్మదేవుడి తరమవుతుందా స్వామీ! అంటున్నారు అన్నమాచార్యులవారు. ఈ కలికాలంలో ఇంత విశృంఖలత్వంతో కాంతలతో మనోవ్యభిచారం చేసే గ్రంధసాంగులుండగా బ్రహ్మచర్యదీక్ష గురించి యెవడన్నా మాట్లాడితే పక్కున నవ్వురాకుండా యెట్లావుంటుంది చెప్పండి? అంగడిలో తీపి పదార్థాలు చూచి నోరూరెడివానికి వాటిని తినకుండా తనివితీరుతుందా? ఇహలోక సౌఖ్యాలకు ఆశపడేవానికి లంపటములు తగులుకొనే పనులు చేయక తప్పదు కదా? శ్రీవేంకటేశుడు మనలను గారవించి రక్షించితే సరేసరి. లేకపోతే ఈ జీవుల గతి అధోగతే, అంటున్నారు.

భావ వివరణ:

ఓ దైవమా (దేవదేవా!) ఇవి నీ పెరరేపణలు (మానవులకు కలిగే ఈ భావనలన్నియూ, ప్రేరేపణలన్నియూ) నీ ఇచ్ఛానుసారమే కలుగుచున్నవి. ఇవి జీవులకు తప్పక వున్నవి. వీనిని భావించి (ఊహించి) కాదని దొబ్బివేయుటకు (త్రోసివేయుటకు), దీకొనగ (ఠీకొని యెదిరించుటకు) బ్రహ్మోదులకైనను, వసమా (సాధ్యమా?)

స్త్రీలతో సాంగత్యముపెట్టుకొని, వాళ్ళను యెదుటనే చూచిన వేళను (చూపులు వారితో కలుపగానే) బ్రహ్మచర్యము యెక్కడ సిద్ధించును? అప్పుడేమవుతుందో తెలుసునా? మనోవ్యభిచారము (మానసిక వ్యభిచారము) ఆ స్త్రీలతో చక్కగ సలుపుచూ చలియించుగాక (చలించిపోతాడు గాని స్థిరచిత్తుడు కాగలడా?) ధనధాన్యంబులను జూచి వాటి చేతికి లోనయిన (లొంగిపోయిన) వానికి విరతి (విరక్తి) చిక్కనే

(దొరుకుతుందా?) దొరకదుగాక దొరకదు. ఈపై జెప్పిన వాటి లక్షణమేమంటే మనిషిని వాటియందే మగ్నము గావించును (నిమగ్నమై లొంగిపోవునట్లు చేస్తాయి.)

విషణివీధికి వెడలి అక్కడి అంగడులను (సరుకులమ్మే కొట్లలో) బహుపదార్థములను గక్కునే (వెంటనే) చూచినంతమాత్రాన కలుగునే తనివి (తృప్తితీరుతుందా?) కొలదిమీరి (అసంఖ్యాకంగావున్న) మధుర పదార్థాలను కోరుతూ అక్కడనే నిలుచుండిపోతే ఆనందం కలుగుతుందా? లేక మనకు నచ్చినదానిని తింటే తృప్తి కలుగుతుందా? ఎవడికైనా "వాజివారువములు" (అశ్వమేధయాగంబులను) చేసినంత మాత్రాన యోగసమాధి ఎట్లా సమకూడుతుంది? దానికి అకుంఠితదీక్ష, భగవత్కృప కావాలి కదా! యాగాలు చేసేవాడు ముంగిళ్ళలో యెలమితో చరిస్తుంటాడు (సంతోషంతో తిరుగుతుంటాడు.) అంతే.

ఓ శ్రీహరీ! ఇహలోకపు సుఖములలో మునిగి తేలేవారికి తలపు (ధ్యాస) నీమీద నెలకొను నేరీతి (స్థిరపడి యేవిధంగా వుంటుంది?) వాళ్ళగతేమిటో తెలియునా స్వామీ? దుస్సహమైన అనేక లంపటాలలో (పీకులాటల్లో) తగులుకొని యేవేవో నిరుపయోగమైన పనులు చేస్తూనే క్షణం తీరిక లేక వుంటారు. మరి నేనూ అటువంటి మానవమాత్రుడినే కదా! ధారుణిలో ఈ లోకంలో నేను వాటిని గెలచుట యెన్నడు జరిగేను? ఓ శ్రీవేంకటేశ్వరా! తగ (తగు విధముగా) నీవు నన్ను గౌరవించి రక్షింపుము నీ ఉపకారము యేనాటికీ మరువను తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : అతడు లోకోన్నతు డాదిమపురుషుడు అన్నిటాను పరిపూర్ణుడు

సంఖ్య : 313 పుట : 209 రాగం: నాదరామక్రియ

నాదరామక్రియ

99 అతడు లోకోన్నతుఁ డాదిమపురుషుఁడు అన్నిటాను పరిపూర్ణుఁడు చతురుఁ డితఁడే రక్షించఁగలవాఁడు శరణనిబ్రదుకవో వోమనసా

॥ పల్లవి॥

మరుతండ్రిఁ జూచిన మంచికన్నులను మరొకరిఁ జూచిన నింపౌనా
సిరివరునామమునొడిగిననోరను చిక్కినపేరులు యితవౌనా
పరమాత్ముఁదలఁచినమనసులోపలను పరులఁ దలచితే నొడఁబడునా
కరుణానిధిపుణ్యకథలువినినచెవుల కడలసుద్దులు వినసమ్మతించునా

॥అతఁ॥

నరహరిఁబూజించినయట్టికరములు నరులసేవసేయ నరుహములా
మురహరు శరణని మొక్కినశిరసున మూఢులకు మొక్క నుచితములా
హరిమందిరమునకరిగెడుపదములు అధములిండ్లకేఁగఁగ నలవడునా
పురుషోత్తము లాంఛనము మోచినమేను భువిహీన వృత్తికిఁ బొసఁగీనా

॥అతఁ॥

గోవిందుఁడే దిక్కైవుండుఘనులకు కొలిపీనా దేవతాంతరంబులు
భూవల్లభుదెసఁ బుట్టినజ్ఞానము పొంది వేరొకట నిలిచీనా
శ్రీవేంకటపతిపై నిడినభక్తి చెలులపై నునుపఁగఁ దగవవునా
దేవకినందనుఁ డితనిదాసుల దెలియఁగ జడులకుఁ దరమయ్యీనా

॥అతఁ॥

అవతారిక:

భక్తిరసప్రధానమైన ఇటువంటి కీర్తనలను అన్నమాచార్యులవారు లెక్కకుమిక్కుటముగా నుటంకించారు. కాకపోతే దేనిప్రత్యేకత దానిదేనని మనం గ్రహించాలి. ఆ దేవదేవుడు లోకోన్నతుడు, ఆదిపురుషుడు, అన్ని విధములా పరిపూర్ణత గలిగినవాడు. పైగా చతురుడు. అంటే సమయస్ఫూర్తి కలవాడు ఆయన గజాసురుడు, భస్మాసురుడు, జరాసంధుడు మొదలైన దానవులను మట్టుబెట్టిన విధానములను స్మరణకు తెచ్చుకోండి. నేను చెప్పేదంతా సత్యమేనని మీకే తెలుస్తుంది. అవతలివారి చావు తన చేతిలో లేదన్నప్పుడూ, వారు గోవులరూపంలో వున్నప్పుడూ ఆస్వామి ఇంకొకరితో ఆ దానవులను మట్టుబెట్టించే వైనం పరమాద్భుతంగా వుంటుంది. అందుకే ఆ స్వామి జగద్రక్షకుడు. ఆయన కోసం నీవు ప్రత్యేకించి యేమీ చేయవలసిన పనిలేదు. శరణు మహాప్రభో! అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ అని బ్రతికితే చాలును అంటున్నారు. కరుణానిధి పుణ్యకథలను విన్న చెవులు అడ్డమైన వారి 'కడల సుద్దులు' వినవనిచ్చగించునా అంటున్నారు. కాల్చుకొని పురుషోత్తముని లాంఛనములు ధరించిన శరీరం హీనవృత్తిని స్వీకరిస్తుందా అంటున్నారు. జడులైనవారికి ఈ దేవకీనందనుని దాసుల ఔన్నత్యం యెట్లా తెలుస్తుందయ్యా! అంటున్నారు.

భావ వివరణ:

అతడు (ఆ దేవదేవుడు) లోకోన్నతుడు (లోకములో అందరికంటే అధికుడు). అతడు ఆదిమపురుషుడు అన్నిటాను (అన్నిటియందును) పరిపూర్ణతగలవాడు. అతడు చతురత గలిగినవాడు (సమయస్ఫూర్తిగలవాడు). సర్వులను రక్షించగలవాడునూ అతడే. అందుకే ఓ మనసా! అతనిని శరణని బ్రతుకరాదా?

మరుతండ్రిని (మన్మధుని తండ్రియైన శ్రీహరిని) చూచినట్టి కన్నులతో మరొకరిని జూచిన ఇంపౌనా (బాగా వుంటుందా?) సిరివరు (శ్రీనాథుని) నామమును పలికిన నోటితో చిక్కిన పేర్లను (యెవరెవరివో నోటికి వచ్చిన పేర్లను పలికిన యితవౌనా (హితవవుతుందా?) పరమాత్ముడైన ఈ దేవుని తలచిన మనస్సులో పరులను దలచిన ఒడబడునా (సమకూడుతుందా?) కరుణానిధియైన ఈ కమలనాభుని కథలను వినిన చెవులతో కడలసుద్దులు (ప్రక్కవాళ్ళ సంగతులు) విన సమ్మతమా (వినుటకు అంగీకరిస్తామా?) అది సాధ్యం కాదు.

నరహరియైన విష్ణుని పూజించిన చేతులతో నరాధముల సేవచేయవచ్చునా? ముర అనే రాక్షసుని హరించిన హరిని శరణని మొక్కాలికానీ ఆయనకు మొక్కిన శిరసుతో మూఢులైన మానవులకు మొక్కుట ఉచితమైన పనియేనా? శ్రీహరి ఆలయమునకు పోవుటకు నియోగించబడిన పాదములు అధముల ఇండ్లకు పోవుటకు అలవాటుపడతాయా? పురుషోత్తముడైన శ్రీపతి లాంఛనములు (వైష్ణవులు ధరించు శంఖచక్రముల ముద్రలు) మోచిన (ధరించిన) శరీరంతో ఈ భూమిపై హీనవృత్తికి పొసగీనా (చెడుపనులు చేయవచ్చునా)?

గోవిందుడే దిక్కని నమ్మిన వారికి ఆయనవుండగా దేవతాంతరములు (అన్యదేవతలు) ఘనులకు కొలిపీనా (గొప్పవారనే భావన కలుగుతుందా?) భూరమణుడైన శౌరి నెరుగుటకు కలిగిన జ్ఞానమును పొంది అది వేరొక దానికై వినియోగించవచ్చునా? శ్రీవేంకటేశునిపై కుదిరిన భక్తిని స్త్రీల కొరకు వ్యర్థము చేసికొనుట, తగవవునా (న్యాయమవుతుందా?) దేవకీనందనుడైన ఈ సర్వేశ్వరుని దాసుల దెలియుచు వుండాలన్నా జడులకు (పనికిమాలిన వారికి) తరమయ్యీనా (సాధ్యమవుతుందా)? కానేకాదు.

సంపుటి: 2 కీర్తన : ఎదురుమాటులాడితినీకు యీతప్పులు లోగొను నీవు

సంఖ్య : 299 పుట : 200 రాగం:

100 ఎదురుమాటలాడితి నీకు యీతప్పులు లోఁగొను నీవు
పదరఁగఁదగదు నీకు పంతములిచ్చితిఁ గావఁగదే ॥ పల్లవి॥

మునుపే నే విన్నవించితిని విన నవధరించితివి నీవు
వెనకవేసుకో శరణు చొచ్చితిని విడువకు నన్ననుచు
ననుఁజూచి 'దేహి' యంటే 'నాస్తి' యనరాదు నీకు
ఘనయాచకుఁడను నేను కడుదాతవు నీవు ॥ఎదు॥

వెదకి నిను వేఁడుకొంటిని విచ్చేసితివి మాయింటికి
పదలఁదగదు నీ భక్తి యొసఁగు నీవాఁడను పాయకుమనుచు
పదిలంబుగ మొక్కినచేతులు బలిమిఁ గోయరాదు
యిదివో బంటును నేను యేలినవాఁడవు నీవు ॥ఎదు॥

మరిగి నీముద్రలు మోచితిని మన్నించితి విటు నను నీవు
కరుణతోడ నాయపరాధంబులు కడపు కావుమనుచు
యిరవై నీపేరు వెట్టితే నియ్యకొనక పోరాదు
నరమాత్రుఁడ నే శ్రీవేంకటేశ నాయకుఁడవు నీవు

॥ఎదు॥ 299

అవతారిక:

అన్నమాచార్యులవారి ఈ కీర్తనకు ఏ రాగము పేరూ సూచించబడలేదు. అందుకే నేనూ ఆ సాహసం చేయలేదు. నా భావన

యేమంటే ఆచార్యులవారి ఆఖరి దశలో రచించిన కీర్తనకావచ్చును. ఎందుకంటే "ఇంతవరకూ నీకు యెదురు చెప్పాను యీ తప్పులు నీమనస్సులో పెట్టుకొని నన్ను కరుణించు. నీతో ఇన్నాళ్ళూ యెదురుచెప్పాను కాబట్టి ఈనాడు ఈ దీనునిపై పదరగన్ తగదు అంటే ఆగ్రహించుట తగినపనికాదు" అంటున్నారు. స్వామీ! "దేహి" అని అర్థించినవారికి "నాస్తి" అని మొండిచెయ్యిచూపించవచ్చునా. మరి ఈ యాచకుడిమీద నీకు చిన్నచూపు దేనికయ్యా అంటున్నారు. పదిలముగా నీకు మొక్కుతున్న ఈ నా జవసత్త్వాలు లేని చేతులను నీవే నరికేస్తే నేనెవరితో చెప్పుకోను తండ్రీ! నీ కీర్తనలను యెలా వ్రాయగలను? వ్రాయకుండా యెలా బ్రతికివుండగలను? వీడు నా ముద్రలు ధరించిన దాసుడులే అని నన్ను మన్నించావు. నేను నేడు నిన్ను పేరువెట్టితే (స్తుతిస్తుంటే) ఇయ్యకొనక పోరాదు, అంటున్నారు. ఓ శ్రీవేంకటేశ్వరా! నేను మానవమాత్రుడనయ్యా! నీవు లోకనాయకుడవు అంటున్నారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీకు ఎదురు మాటలాడితి (కాదని యెదురు చెప్పాను). నీవు ఈ నా తప్పులను లోగొనుము (మన్నింపుము). ఈ దీనునిపై పదరగన్ తగదు (ఆగ్రహింప తగదు). నా అజ్ఞానం కొద్దీ నీకు పంతములిచ్చితి (నీపై పంతము వహించాను). కావగదే (నన్ను రక్షించు ప్రభూ)

నేను ఇదివరకే నా బాధలను నీకు విన్నవించితిని. నీవు విని అవధరించితివి (అనుగ్రహించితివి). నన్ను విడువవలదు స్వామీ! అని నీకు శరణు చొచ్చితిని. నన్ను వెనక వేసుకో (నన్ను ఆదుకో). "దేహి" అని నిన్ను యాచిస్తే "నాస్తి" (లేదు) అని నన్ను నిరాకరించకు ప్రభూ!

యాచించడం నావృత్తి అనుగ్రహించడం నీ ప్రవృత్తి. మనమధ్య ఇంకొక సంబంధం వుంది స్వామీ! నేను ఘనయాచకుడను (ప్రసిద్ధి చెందిన యాచకుడను). నీవు కడు దాతవు (గొప్పదాతవు).

ఓ సర్వేశ్వరా! నిన్ను పెనుప్రయత్నమున వెదకి, కనుగొని మాఇంటికి విచ్చేసి నన్ను అనుగ్రహించమని వినయపూర్వకముగా వేడుకొంటిని. నీవు నా విన్నపములాలకించి మా ఇంటికి విచ్చేసితివి. నాకు నీ భక్తియే చాలునయ్యా! ఇతరములు నాకు అవసరంలేదు. నేను నీ వాడను ప్రభూ! నన్ను ఇకపై విడువ తగదు. నన్ను వదలి వేయకుమయ్యా! అని పదిలంబుగ (జాగ్రత్తగా) మొక్కిన చేతులను బలిమిని (బలవంతంగా) కోయుట తగునా స్వామీ! ఇదిగో నేను నీ బంటును (దాసుడను) నీవు నన్ను ఏలినవాడవు. నీవుకాక నన్నెవరు రక్షిస్తారు?

ప్రభూ! నేను విశిష్టాద్వైతినై నీ శంఖ చక్రముల ముద్రలను మోచితిని (ధరించితిని) వారిలో నన్ను ఆచార్యునిచేసి గొప్ప మన్ననొసగితివి. కరుణతో నా యొక్క అపరాధములను కడపు (త్రోలి పారవేయుము). నేను నిన్ను కావమనుచు (రక్షించమనుచు) యిరవై (నెలకొని) నీపేరువెట్టితే (నిన్ను స్తుతిస్తూవుంటే) ఇయ్యకొనక పోరాదు (నన్ను ఒట్టి చేతులతో త్రిప్పి పంపడం భావ్యము కాదు). ఎందుకంటే నీవు శ్రీవేంకటేశ్వరుడవు సర్వలోక నాయకుడవు. మరి నేనో నరమాత్రుడను (మానవమాత్రుడను). నీవు ఇచ్చేవాడవు నేను పుచ్చుకొనేవాడను.

సంపుటి: 1 కీర్తన : నీవు సర్వగుణసంపన్నుడవు నేనొక దుర్గుణిని
సంఖ్య : 514 పుట : 347 రాగం: మాళవిగౌళ

మాళవిగౌళ

101 నీవు సర్వగుణసంపన్నుఁడవు నేనొక దుర్గుణిని
మానవు నన్నొకయెదురుచేసుకొని మనసుచూడనేలా అయ్యా
॥పల్లవి॥

యేలినవాఁడవు నీవు ఇటు నేఁ గొలిచినవాఁడ
పోలింపఁగ నీవే దేవుఁడవు భువి నే నొక జీవుఁడను
పాలించేవాఁడవు నీవు బ్రదికేవాఁడను నేను
తాలిమి నన్నొకసరిచేసుక ననుఁ దప్పు లెంచనేలా అయ్యా
॥నీవు॥

అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను
చింతింపఁగ నీవే స్వతంత్రుఁడవు జిగి నేఁ బరతంత్రుఁడను
ఇంత నీవే దయఁగలవాఁడవు యెప్పుడు నే నిర్దయుఁడను
చెంతల నన్నొక మొనసేసుక నాచేఁత లెంచనేలా అయ్యా
॥నీవు॥

శ్రీవేంకటేశ్వరుఁడవు నీవు సేవకుఁడను ఇటు నేను
ఆవలనీవల దాతవు నీవు యాచకుఁడను నేను
నీవే కావఁగఁ గర్తవు నేనే శరణాగతుఁడను
కైవశమగు నను ప్రతివెట్టుక నాకథలు యెంచనేలా అయ్యా
॥నీవు॥514

అవతారిక:

మేము మానవమాత్రులం. సత్త్వరజస్తమోగుణోపేతులం అని పేరుకేగాని ఎక్కువపాళ్ళు తమోగుణాధికులం. కామక్రోధాది అరిషడ్వర్గ

పీడితులం. వాటిపీడవదలించుకోవటం మా తరముగావటంలేదు. మా పంచేంద్రియాలూ మామాట వినటంలేదు. ఏదో మాపై కనికరం వహించి ఇన్ని జీవరాసుల్లో శ్రేష్ఠమైన మానవజన్మనిచ్చావు. దానిని పూర్తిగా వ్యర్థం చేసికొన్నాను. నేడు కాటికి కాళ్ళుచాచుకొని కూర్చున్నాను. ఈ ఊపిరి యెప్పుడు ఆగిపోతుందో తెలియదు. ఎందుకిలా జరిగింది. నా పురాకృతకర్మ అన్నది శాస్త్రం. అది తెలుసుకొనీ నాకేమి వుపయోగం. ఓ సర్వేశ్వరా! జీవితచరమాకంలో నేనేమిటో నాకర్థమయింది. నేను దుర్గుణోపేతుడైన మానవుడను. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు పట్టుకొంటాననే నిస్సిగ్గరిని. పోనీ మానసికంగా మంచివాడేలే అనికూడా చెప్పలేం. అయ్యా! నన్నెదురుగా బెట్టుకొని నా మనసుని చూచినా పరమనీచము. ఇక ఏ మొగము పెట్టుకొని నిన్ను అభ్యర్థించగలను? ఓ శ్రీవేంకటేశ్వరా! శరణు. నీవే తప్ప నితఃపరంబెరుగ. నీవు సర్వ సద్గుణ సంపన్నుడవు. జగద్రక్షకుడవు, మా అంతర్యామివి, కరుణామయుడవు. నేను నీ దాసుడను. దాసుని తప్పులు దండముతో సరి అంటారు కదా! నన్ను రక్షించు తండ్రీ. నాగత చరిత్రనెంచకు. దయతో నన్ను ఈ జననమరణ చక్రబంధం నుంచి విడిపించు, అని దీనంగా వేడుకొంటున్నారు అన్నమాచార్యులవారు.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు సర్వసద్గుణ సంపన్నుడవు. మరి నేనో...? నేను ఒక దుర్గుణిని (దుర్మార్గుడను), మానవమాత్రుడను. నన్ను యెదురు చేసుకొని (నిలదీసి) మనసు చూడనేల (చంచలము హీనగుణోపేతమూ అయిన నా మనస్సును చూచి లాభమేమిటయ్యా!)

అయినదేదో అయినది. ఇక నేడు నా విన్నపము లాలకించుము స్వామీ! నీకూ నాకూ పోలిక యేమిటయ్యా! నీవు యేలినవాడవు (పరిపాలకుడవు). నేను ఇటు (ఈ విధంగా) కొలిచే భృత్యుడను.

పోలించగా (పోల్చి చూస్తే) నీవు దేవుడవు. మరి నేనో.. ఈ భూమిపైకి నీ ద్వారా తెప్పించబడిన జీవుడను. నీవు పాలించేవాడవు (సర్వజీవులపరిపాలకుడవు). మరి నేనో... నీ దయాదాక్షిణ్యములపై బ్రతుకుతున్నవాడను. అట్టి నన్ను తాలిమితో (క్షమాగుణంతో) నన్ను సరిచేసికొనవలెను. అంతేకాని తప్పులెంచి నన్ను నిందించి దూరముచేయనేలనయ్యా!

సరే! ఇంకొక విషయం చెబుతాను, వినవయ్యా! నేను "అంగమాత్రుడను" యెముకలు, రక్తమాంసములూ వున్న కళేబరాన్ని. నీవు నా అంతర్యామివైన జీవుడవు. నీవులేకపోతే ఈ నా శరీరాన్ని మరుక్షణమే తగులబెట్టి వదలించుకొంటారు. నీవు సర్వ స్వతంత్రుడవు. మమ్ము పెంచాలన్నా త్రుంచాలన్నా నీ చిత్తము. చింతింపగ (ఆలోచిస్తే) నీవు జగన్నియంతవు. నేను పరతంత్రుడను (నీ దయాదాక్షిణ్యాలపై బ్రతికే భృత్యుడను). నీవు కరుణాసాగరుడవు. నేను దయాదాక్షిణ్యములేని నిర్దయుడను. స్వామీ! చెంతల (నన్ను నిశితంగా చూచి) నన్నొక మొనసేసుకొని (నన్ను సూటిగా ప్రశ్నించి) నా చేతలెంచనేలయ్యా! నా పనులను నిందించి లాభమేమిటి ప్రభూ!

ఇకపోతే ఇది జగమెరిగిన సత్యమే. నీవు లోకపాలకుడవైన శ్రీవేంకటేశ్వరుడవు. ఇటుచూస్తే నేను నీసేవకుడను. నీవు ఆవల నీవల దాతవు (ఇహపరములనొసగే దాతవు). నేను నీ దయ యెప్పుడొస్తుందా అని యెదురుచూసే యాచకుడను. నీవే కావగ (రక్షించుటకు) కర్తవు (కారకుడవు). నేనేమో నీ శరణార్థిని. ఇందులో మార్పేమీ లేదు. కైవసమగు (నీకు లొంగిపోయిన) నన్ను ప్రతివెట్టుక (ప్రతిపనికీ నేరములెంచి) నా కథలను (గత చరిత్రను) యెంచనేల (లెక్కించుటెందులకు) తండ్రీ!

సంపుటి: 15 కీర్తన : ఇంచుకంత ధర్ముములో నున్నది యిందరిమేలును గీడును

సంఖ్య : 400 పుట : 269 రాగం: గుండక్రియ

గుండక్రియ

102 ఇంచుకంత ధర్ముములో నున్నది యిందరిమేలునుఁ గీడును
వంచనతోడుతఁ గైకొనఁదలఁచిన వారల నేరుపు లింతేకాని

॥పల్లవి॥

నరకము లనుభవించితి నని తలఁచిన నలిఁజెడుఁ
బ్రారబ్ధకర్ముములు
పరదారాదులఁ గలయఁ దలఁచిన పాపము లెల్లనుఁ జుట్టుకొను
సురలచరిత్రము వినినయంతలో సుకృతియై వెలయుఁ బురుషుఁడు
దురతచిత్తుల విధంబులు వింటే దుష్కృత్యములకును గుఱియగును

॥ఇంచు॥

చచ్చినభావమె బ్రతికినయప్పుడు శరీరసుఖములు మఱచిన
ముక్తుఁడు
యిచ్చల మృతునకు విభవముసేసిన యేడకు నెక్కుదు వృథా వృథా
యెచ్చుగ నొరులకు నిచ్చినయర్థము మీఁదమీఁద ఫలియించు
తెచ్చి లోభమున దాఁచిన ధనములు తీరక భూగతమై యుండు

॥ఇంచు॥

యిలువేలుపైన శ్రీవేంకటేశ్వరు నెఱిఁగి కొలిచినను భవ మీదేరును
పలుకర్మంబుల నెంత దొరలినా ప్రయాసములే కడుఘనము
అలమేల్మంగ పురుషకారమున ఆచార్యుననుమతి మెలఁగును
వలవని లావుల వశగతుఁడైనను వానిచందములు హరియే

॥ఇంచు॥

అవతారిక:

కొద్దిపాటి ధర్మము చేసినా అది చివరికి మేలు కలిగిస్తుంది. అదే వంచన చేసినచో వారికి కీడు తప్పదు. ఏదికావాలో అది పొందాలంటే ఎవరివలనా అయ్యేపనికాదు. ఈ అనుభవించిన పాపం చాలును, అని పశ్చాత్తాపంతో పాపమునకు దూరముగా వుండేవానికి ప్రారబ్ధకర్మల బెడద వుండదు. అదే దుర్మార్గుల విధానమే వింటుంటే వీడూ దుస్కృత్యములే చేస్తుంటాడు. లోభి తనుతినడు పరులకు పెట్టడు. వాడిధనము భూమిపాలే అయితీరుతుంది అంటున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. చేసిన పాపము తొలగిపోవాలంటే శ్రీవేంకటేశ్వరుని కరుణ లభించకపోతే సాధ్యమే కాదు. ఆచార్యుని అనుమతితో అలమేల్మంగావిభుని భక్తితో సేవించినవారికి జన్మ ధన్యమవుతుంది. ఇందులో అణుమాత్రం సందేహం లేదు. చచ్చి శవమైనవాడికి యెంత అలంకరణ చేసినా వృథాయే కదా! అలాగే భగవద్భక్తి లేనివాడు యెన్నడూ ఆస్వామికృపను పొందలేడు. ఆయన కృపలేకపోతే యెన్ని మానవప్రయత్నాలైనా వృథా వృథా అంటున్నారు.

భావ వివరణ:

ఓ ప్రజలారా! ప్రపంచంలో మీఅందరికీ కొన్ని మేళ్ళూ కొన్ని కీళ్ళూ జరుగుతుంటాయి. ఎందుకో తెలుసా? మీరు ధర్మమును ఇంచుకంత (కొద్దిపాటి) చేసినా మీకు మేలు జరుగుతుంది. అదే పరులను వంచనతో గైకొన (మీవశము చేసికొని) దలచినచో వారల చాకచక్యమంతా చివరికి నిరుపయోగమవుతుంది.

అయో! ఏనాడో ఏపాపమో చేశాను, ఈనాడు దాని పర్యవసానంగా నరకము (శిక్షలు) అనుభవిస్తున్నాను) అని పశ్చాత్తాపంతో వున్నవాడికి ప్రారబ్ధ కర్మలపీడ బాధించదు. పరస్త్రీవ్యామోహముగలవానికి

సమస్తపాపములూ చుట్టుకొంటాయి. సత్కార్యములు చేసి ధర్మము నిలబెట్టిన దేవతల పుణ్యకథలను వింటూ కాలము సాత్వికంగా గడిపేవారికి అది సుకృతియై (పుణ్యమై) పరిణమిస్తుంది. కానీ పురుషుడు దురితచిత్తులు (పాపాత్ముల) విధంబును వింటూ వుంటే వాటి ఉద్ధతివలన వీడూ దుష్కృత్యములు (చెడుపనులు) చేస్తుంటాడు. ఇది లోకపురీతి.

బ్రతికినయప్పుడె (జీవించివుండగానే) నేను జీవించిలేను అనే భావనతో దేహాభిమానమును వదలివైచి శరీరసుఖములను మఱచినచో ఆతడు తప్పక ముక్తుడగును. వాడికి తిరిగి జన్మించనవసరమే లేదు. మృతునకు (చచ్చినవానికి) యిచ్చల విభవము సేసిన (యెంతో వైభవంతో అలంకరణ చేస్తే) యేడకునెక్కుదు (యేమి వుపయోగము)? అదంతా వృథావృథా (శుద్ధదండుగ). ఒరులకు మెచ్చుగ (ఇతరులను మెచ్చుకొంటూ) ధనసహాయము చేస్తే, అది మీద మీద ఫలంబులనిచ్చును (అధికమైన ఫలితమునిస్తుంది). అదే లోభముతో పరులకివ్వక తాను దినక కూడబెట్టినధనము, తీరక (నిరుపయోగమై) భూగతమైవుండు (భూమిలోనేవుండి) యేనాడో యెవరికో దొరుకుతుంది. అంతే.

మనందరి ఇలవేల్పు అయిన శ్రీవేంకటేశ్వరుని తెలుసుకొని కొలిచినవానికి, భవమీదేరు (జన్మవుండదు). ఆ విధంగా కాక కర్మిష్ఠియై యెన్ని వైదిక కర్మలు చేసిన ప్రయాసములే కడు ఘనము (గొప్ప శ్రమ మాత్రమే మిగులుతుంది.) మహా అయితే ఇంకొక కర్మిష్ఠి జన్మ లభిస్తుందేమో? అలమేల్మంగ విభుని, ఆచార్యులు చెప్పినట్లు మెలగుచూ సేవించిన యేమి జరుగుతుందో తెలియునా? వలవని లావుల వశగతుడై (అనవసరమైన దర్పమునకు వశుడై) భ్రష్టుడైనవాని నడతలు హరియే సవరించగలడు.

సంపుటి: 2 కీర్తన : సరిగాదు వీడున వలదు జగమున
రాజు వలసినది దేవులు
సంఖ్య : 298 పుట : 199 రాగం: సామంతం

సామంతం

103 సరిగాఁడు వీఁడన వలదు జగమున రాజు వలసినది దేవులు
ఇరవుగ నందరు లోకములోపల యిది నానుడి మాట ॥పల్లవి॥

జగదేకబంధుఁడవట సకలజీవులకును, గుఱుతుగ
మొగముచూపవయ్యా మీకు మొక్కెదనిదె నేను
తగులైనచుట్టరికము దాఁచఁగ నిఁకనేలా
తెగరానిమమకారము తెలుపఁగవలెఁగాని ॥సరి॥

యితవైనప్రాణమవట యాచరాచరములకు, అభయము
సతత మియ్యవయ్యా మాకును సన్నుతింతు నిన్ను
మతిఁ బాయనికూటంబులు మానుప మరి యాలా
జతనంబునఁ జాలాఁబ్రియములు జరపఁగవలెఁగాని ॥సరి॥

నెలవైనయేలికెవట నీదాసులకెల్లా, వేళలు
దెలియఁజెప్పవయ్యా మిమ్మును తిరముగఁ గొలిచెదను
బలువయిన శ్రీవేంకటేశ పరాకు లిఁకనేలా
చెలరేఁగి నీసులభత్వమే చెల్లింపవలెఁగాని ॥సరి॥298

అవతారిక:

తావలచినది రంభ తామునిగినది గంగ అన్నారు పెద్దలు. అదే కోవలో ఒక చక్కటి నానుడితో ఈ కీర్తననాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు.

"ఓ దేవదేవా! లోకంలో ఒక నానుడి వుందయ్యా! రాజుగారు వలచినదే పట్టపురాణి. అందుకని నన్ను వీడు సరియైనవాడు కాదని వదలక నన్ను ఆదరించవయ్యా! నిన్ను కాదనే మొనగాడు యెవడున్నాడు?" అంటున్నారు. నీవు సకల జీవులకు జగదేక బంధువవు. నామీదకూడా అంతులేని మమకారం చూపించాలి కానీ ఇలా నన్ను నిరాదరణకు గురిచేయవచ్చునా? నేను నీనుంచి ఆశించేది పెద్దగా యేమీ లేదు స్వామీ! నిన్ను విడిచి వుండలేనయ్యా! మరి నా కూటమిని నిరాకరించటం దేనికి ప్రభూ! నాపైకూడా కాస్త ప్రేమ చూపించవచ్చును కదా అంటున్నారు. నీవు నీ దాసులను విడనాడవట. పోనీ నాకంత అదృష్టం లేకపోయినా నిన్ను నేను యెప్పుడుసేవించుకోగలనో కాస్త ముందే చెబుతే నీకు ఇబ్బంది లేకుండా నీసేవ చేసుకుంటాను. నామీద పరాకేల తండ్రీ! అంటున్నారు.

భావ వివరణ:

ఓ ప్రభూ! వీడు సరిగాదు అనవలదు (ఇతడు తగినవాడు కాదు అని అనవద్దు). నీవు అవునంటే నన్ను కాదనే ధైర్యం యెవరికి వుంటుంది? ప్రపంచంలో రాజుగారు వలచిన వనితే దేవుల (దేవేరి) అవుతుంది కదా! రాజు గారిని కాదనగలిగినదెవరు? ఈ లోకంలో ఇరవుగ (సుస్థిరముగా) అందరూ అవుననే నానుడిమాట (సామెత) ఇదే కదా!

స్వామీ నీవు సకల జీవులకు జగదేక బంధుడవట. ఆ మాటకు గుర్తుగా సమ్మోహనకరమైన నీ మొగమును (వదనమును) చూపవయ్యా! నేను ఇదే మీకు మొక్కెదను. ఇక తగులైన (ఆపేక్షగల) చుట్టరికమును (మన బంధుత్వమును) దాచగనేలా (దాచిపెట్టుట యెందులకు?) తెగరాని మమకారము (తెగిపోని అనుబంధము) తెలుపగవలెగాని (బహిర్గతము చేయవలెను కాని) నీలో నీవే దాచిపెట్టుకోవటం దేనికి స్వామీ!

దేవదేవా! నీసృష్టిలో చరములు (కదలికగలిగినవి) అచరములు (కదలిక లేనివి) అని రెండు రకముల ప్రాణులున్నవి. ఈ రెండిటికీ యితవైన (హితుడవైన) నీవే ప్రాణమట. స్వామీ! సతతము (యెల్లప్పుడు) సన్నుతింతు (నిన్ను ఆరాధించెదను) మాకును అభయము నీయవయ్యా! నీలో నా కూటంబులు (కలయికలు) మతిబాయనివి (నేను యెన్నటికీ మఱువలేనివి. మరి వాటిని జతనంబున (గొప్ప ప్రయత్నంతో) మానుపయాలా (నిరోధించుట యెందులకు) తండ్రీ! నావంటి ఆశ్రితునితో చాలా ప్రియములు (యెన్నో ప్రియసంభాషణలు) జరుపగవలెగాని (జరుపవలెను గాని) ఈవిధముగా నన్ను తృణీకరించవచ్చునా? ఇది తగదు స్వామీ!

ఓ తిరుమలనాయకా! నీవు నీదాసులకెల్లా నెలవైన యేలికవట (పరిచయమైన పరిపాలకుడవట). నీ యేలుబడిలోవున్న ప్రతి ఒక్క ప్రాణి గురించి నీకు తెలియును. నీకు కోటానుకోట్ల సంఖ్యలో అర్చించేవారు వున్నారు. మరి నాబోటి సామాన్యుడికి కూడా నిన్ను సేవించే అవకాశము రావాలి కదా! నాకు వేళలు తెలియజెప్పవయ్యా! (నిన్నెప్పుడు సేవించుకోవచ్చో తెలియజెప్పవయ్యా!) అప్పుడే మిమ్ము తిరముగా (స్థిరముగా) గొలిచెదను (పూజించుకొంటాను). బలువైన (బలవంతుడవైన) ఓ శ్రీవేంకటేశ్వరా! ఇంకా నీకు పరాకులు (నిర్లక్ష్యం) యేలనయ్యా! (యెందుకు స్వామీ?) చెలరేగి (విజృంభించి) నీ సులభత్వమే (భక్తి సులభుడవనే నీ బిరుదు) నిలబెట్టుకోవయ్యా! ఇట్లా మా పంతము చెల్లింపవలెగాని మమ్ము నిర్లక్ష్యం చేయదగునా ప్రభూ!

సంపుటి: 2 కీర్తన : ఏదిగతి నేనొక్కడనే యెందరి కోపుదును
సంఖ్య : 300 పుట : 201 రాగం: సామంతం

సామంతం

104 ఏదిగతి నేనొక్కఁడనే యెందరి కోపుదును
నీదయతో మన్నించఁగదవే నీరజనాభా ॥ పల్లవి॥

మోహాంధకారము యెక్కడచూచిన ముంచుకవున్నది
దేహాభిమానము అందుకుఁ దోడు దీకొనివచ్చీని
సాహసభూతము ఘనహింసలకే చాఁపించీఁ జేయి
దాహపుటాసలు వెనకముందరల తరవులువెట్టీని ॥ఏది॥

కోపాగ్నికణములు సారెకుఁ జుట్టుక గుబ్బతిలఁదొడఁగె
పైపై వయోవికారంబులు చలపట్టుక తిరిగీని
చాపలగర్వము యెవ్వరినైనా సాధింపించీని
తీపులధనములు మీఁది మీఁదనే తీదీపులు రేఁచీని ॥ఏది॥

భావజవిలాస మప్పటప్పటికి బలుములు చూపీని
వేవేలుసంపద లెందుచూచినా వేడుక సేసీని
శ్రీవేంకటేశ యలమేల్మంగను చేకొనుదేవుఁడా
యీవేళను నన్నేలితివి నాకు నిన్నియు తగ వసమయ్యీని
॥ఏది॥300

అవతారిక:

భగవంతుని శరణాగతినొందని మానవునికి నిష్కృతి లేదు. కామక్రోదవశుడై గొప్ప మోహాంధకారంలోపడి కొట్టుమిట్టాడుతుంటాడు.

వాడికోపమే అగ్ని కణాలవలె వాడిని దహించి వేస్తుంటాయి. దానికి తోడుగా గర్వమనే మాయరోగంవాడు బాగు పడతానన్నా బాగుపడనీయదు. యవ్వనం రాగానే మన్మథుడు వాడి ప్రతాపమునంతా వీడిపైననే చూపిస్తుంటాడు. ఒకవేళ వీడి అదృష్టవశమున సంపదలు లభిస్తే వీడికి దేవుడి ధ్యాసే వుండదు. రాత్రీ పగలు అనే తేడా లేకుండా ఒకటే భోగాసక్తి. ఇంత ఘోరమైన పరిస్థితులలో ఆ శ్రీవేంకటేశ్వరుడి కృప తనపై వర్షించి ఆయన తనను తన యేలుబడిలోనికి తీసికొన్నాడని అంటున్నారు తాళ్ళపాక అన్నమాచార్యులవారు. అందుకనే ఓ పద్మనాభా! నేనొక్కడనే యెంతమందికి ఓపుదును అంటున్నారు. అంటే స్వామీ! నేను ఒంటరిగా యెంతమందికి చాలుతానయ్యా! నాకు యెంతోమంది శత్రువులున్నారు నీ దయతో నీవే నన్ను అనుగ్రహించాలి అంటున్నారు.

భావ వివరణ:

ఓ నీరజనాభా! (పద్మనాభా!) నేనొక్కడనే ఒంటరిగా, యెందరికి ఓపుదును (సరితూగుగలను). నాకు గతి యేదయ్యా? (తరుణోపాయం యేమిటి స్వామీ?) నీదయతో నన్ను మన్నించగదవే (నన్ను కరుణింపుము ప్రభూ!)

నా అవస్థ యెటువంటిదో యేమి చెప్పమంటావు స్వామీ! ఈ ప్రపంచంలో యెక్కడ చూచిన మోహాంధకారము తాండవిస్తున్నది. అందుకు తోడు దేహాభిమానము (నా దేహముపై నాకు సహజముగా వుండే అభిమానము) దీకొని వచ్చీని (ఠీ కొట్టుటకు సిద్ధముగా వుండనే వున్నది). నాచేత అనవసరమైన సాహసాలు చేయించే భూతం ఒకటి యెప్పుడూ నా సంయమనం చెడగొట్టి, నాచేయి ఘనహింసలకు చాపించి

(నన్ను ఘోరహింసలు చేయుటకు ప్రోత్సహిస్తున్నది). దాహపుటాసలు (దహించివేసే కోరికలు) నన్ను వెనకనుంచి, ముందరనుంచి, తరవులు వెట్టీని (తరుముకొని వస్తున్నాయి.) ఈ పీడ భరించలేను ప్రభూ!

దేవా! సారెకు (ప్రతిసారీ) నాకు కోపము వస్తుంటుంది. అది యెటువంటిదంటే దాని అగ్నికణములు నన్ను జుట్టుక (చుట్టుముట్టి) గుబ్బతిలదొడగె (అతిశయింపజేయుచున్నది). పైపై వయోవికారములు (సులభముగా అలవడే యౌవన వికారములు) చలపట్టుక (మత్సరమును పెంచి) తిరిగీని (నన్ను ఇష్టమొచ్చినట్లు తిప్పింది). చాపల్యంతో (చపలత్వంతో) కూడిన గర్వము యెవ్వరినైనా సాధించగలదు. దానికి నేనొక లెక్కనా? తీపుల ధనములు (యాతనలు పెట్టే ధన సంపదలు) మీదిమీదనే (పైపైనే) తీదీపులరేచీనీ (మదమును రెచ్చగొడుతుంది). ఈ హింస భరించలేకున్నాను ప్రభూ!

భావజ విలాసము (మన్మథుని యొక్క విలాసము) అప్పటప్పటికి (అప్పుడప్పుడూ) తన బలములు చూపీని (తనయొక్క ఉద్ధతిని చూపించినది). వేవేలు సంపదలు (అనేక వైభవములు) ఎచ్చట జూచినా వేడుకల నందించినవి. దేవి అలమేల్మంగను చేకొను (చేపట్టిన) దేవుడా! ఓ శ్రీవేంకటేశ్వరా! యీవేళ నన్నేలితివి. నాకు ఇన్నియును (ఇహపరములు రెండుకూడా) వసమయ్యానీ (వశమైనవి). నేను ధన్యుడనైతిని తండ్రీ!

సంపుటి: 2 కీర్తన : జగన్మోహనాకార చతురుడవు
పురుషోత్తముడవు
సంఖ్య : 375 పుట : 252 రాగం: బౌళి

బౌళి

105 జగన్మోహనాకార చతురుఁడవు పురుషోత్తముఁడవు
వెగటునాసోదంబు ఇది నీవెలితో నావెలితో ॥ పల్లవి॥

యెన్ని మారులు సేవించినఁ గన్నులూ దనియవు
విన్ననీకథామృతమున వీనులుఁ దనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వయుఁ దనియదు
విన్న కన్నది గాదు ఇది నావెలితో నీవెలితో ॥జగ॥

కడఁగి నీప్రసాదమే కొని కాయమూఁ దనియదు
బడిఁ బ్రదక్షిణములుసేసి పాదములు నివిఁ దనియవు
నుడివి సాష్టాంగంబు చేసి నుదురునాఁ దనియదు
వెడఁగుఁదన మిది గలిగె నిది నావెలితో నీవెలితో ॥జగ॥

చెలఁగి నిను నేఁ బూజించి చేతులూఁ దనియవు
చెలువు సింగారంబు దలఁచి చిత్తమూఁ దనియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర అత్మ నను మోహించఁజేసితి
వెలయు నన్నియుఁ దేరె మును నీవెలితో నావెలితో

॥జగ॥ 375

అవతారిక:

అతిమనోహరమైన కీర్తననాలపిస్తున్నారు అన్నమాచార్యులవారు. మనిషికి పారవశ్యం కలిగినప్పుడు శరీరంలో కొన్ని మార్పులు జరుగుతాయి. మనస్సులో కలిగిన ఆ గాఢమైన పారవశ్యమే

శరీరమంతటా కనబడుతుంటుంది. గాఢమైన ఆ భావము యెవరికి వారు అనుభవించాలేగాని ఇట్లా వుంటుందని వివరించలేము. దీనినే అన్నమయ్యకాలంలో "ఆసోదము" అనేవారు. వెలితి అంటే లోపము అని చెప్పుకోవాలి. ఈ పల్లవికి అర్థమేమంటే ఓ జగన్మోహనాకారా! నీవు గొప్ప చాతుర్యం కలవాడవే. పురుషోత్తముడని పిలువదగినవాడవూ నీవే. అది జగమెరిగిన సత్యమే. కానీ నిన్ను చూడగానే కళ్ళకుకట్టినట్లు నాలో కలిగే మార్పులు కొద్దిగా వెగటుగా కనుపించినా అది నాలోపమో మరి నీ లోపమో నాకు అంతుచిక్కకుండా వున్నది. కానీ ఒక్కటి మాత్రం నిజం. నిన్నెంత సేపు చూచినా తనివి తీరటం లేదు. నిన్నెన్నిసార్లు కీర్తించినా తనివి తీరటంలేదు. నా మోహానికి అంతేలేదు. ఓ వేంకటేశ్వరా! ఇది నీవెలితో నా వెలితో తెలియటం లేదు తండ్రీ! అంటున్నారు, అన్నమయ్య. ఇంతకీ తనియుట అంటే యేమిటో తెలుసా? తృప్తి చెందుట.

భావ వివరణ:

ఓ దేవదేవా! నీవు జగన్మోహనాకారుడవు (ముజ్జగంబులను మోహింపజేయగల సౌందర్య రూపము గలవాడు), చతురుడవు (సమయస్ఫూర్తితో నీ శత్రువులనణచినవాడవు), పురుషోత్తముడని వేదము ఘోషించే మహానుభావుడవు. కానీ నిన్ను చూడగానే ప్రస్ఫుటంగా నాలో కనుపించే, వెగటున్ ఆసోదంబు (కొద్దిగా వెగటనిపించే నాలోని మార్పులు) నీవెలితో నావెలితో (నీ లోపమో నాలోపమో) అర్థం కాకుండా వున్నది ప్రభూ!

తండ్రీ! నిన్ను యెన్ని మారులు (పర్యాయములు) సేవించినా నా కన్నులు తనియవు (తృప్తిని చెందనే చెందవు). ఇక నా వీనులు (చెవులు) తక్కువ తిన్నాయా? నీ భాగవత కథామృతమును యెన్నిసార్లు వినినప్పటికీ అవి తనియవు. మీ సన్నిధిని జేరి యెంత స్తుతించినా ఈ జిహ్వ (నాలుక) తనియదు.

విన్నకన్నదిగాదు (నీ లీల యెంత వినినా యెంతకనినా అర్థం కాకుండా వున్నది). ప్రభూ! ఇది నీవెలితో (లోపమో) నావెలితో (లోపమో) తెలియవచ్చుటలేదు.

మధురమైన నీ ప్రసాదమును యెంత స్వీకరించినా నా దేహము తృప్తి చెందుట లేదు. నీ ఆలయమును చేరి బడి బ్రదక్షిణములు (క్రమముగా ఆలయ ప్రదక్షిణలు) యెన్ని చేసినా నా పాదములు తనియవు. నీకు సాష్టాంగనమస్కారం చేస్తూ నా నుదురును భూమికి భక్తితో తాకిస్తుంటాను. కానీ అదేమిచిత్రమో! యెన్నిసార్లు నా నుదురు భూమిని తాకినా నాకు తృప్తి కలుగుట లేదు. నేను చూపించే నా వింత ప్రవర్తన కొందరికి వెడగుగా (వికారముగా) తోపవచ్చును. కానీ అది నాలోపమో లేక నన్ను వివశుని జేసి అట్లా చేయిస్తున్న నీ లోపమో, నాకు యేమాత్రం అర్థం కావటం లేదయ్యా!

ఇకపోతే నా ఈ చేతులున్నాయే ఇవి మాత్రం తక్కువ అనుకోకు. వీటికి యెన్నిసార్లు నిన్ను బూజించినా తృప్తి కలుగదు. మనిషి అన్ని అంగాలలోకి మనస్సు చక్రవర్తి వంటిది. అంతా దాని ఇష్టమే నంటుంది. ఈ నా చిత్తము (మనస్సు) నీ చెలవు సింగారములను (సుందరమైన అలంకారములను) యెంత తలచుకొనినా తృప్తి చెందదు. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నా ఆత్మలో సుస్థిరుడవై నన్ను అనుక్షణమూ మోహింపజేయుచున్నావు. ఇవన్నీ ఈనాడు నాకు వచ్చిన తిప్పలు కావు. ఇన్నియు, మును వెలియన్ తేరే (ఇవన్నీ ఇదివరకే నాలో పైకితేరి కనుపించుచునే వున్నవి తండ్రీ!)

సంపుటి: 15 కీర్తన : ఎన్నిలేవు యీ యింద్రజాలములు
యెట్టు నమ్మెడిది వో సర్వేశ్వర
సంఖ్య : 317 పుట : 213 రాగం: శుద్ధ వసంతం

శుద్ధ వసంతం

106 ఎన్నిలేవు యీ యింద్రజాలములు యెట్టు నమ్మెడి వో సర్వేశ్వర
మన్నించి నన్నిటు బోధింపఁగదవె మాయాతీతుఁడ విన్నిటను
॥ పల్లవి॥

తామసునకుఁ బుట్టిన సుజ్ఞానము తత్త్వవాదమునకే మొదలు
కామునకుఁ దోఁచిన వివేకము కాంతాళములకే సెలవవును
పామరునకుఁ బొడమిన వైరాగ్యము పరదూషణకే పనియవును
సామాన్యున కటువచ్చిన చదువులు సాధింపవు మోక్షముతెరువు
॥ఎన్ని॥

జగతి నాస్తికున కొదవిన సత్యము శపథంబులకే గుఱియౌను
మగటిమి దుర్జనుఁ డెఱిఁగినమంత్రము మారణాదులకే సాధనము
పగటున లోభి యొనర్చిన పుణ్యము ప్రత్యవాయముల కాలయము
వెగటునఁ గ్రూరుఁడు చేసిన తపమది వీరిడితనముల కాకరము
॥ఎన్ని॥

సరిఁబాపికిఁ గల దాక్షిణ్యము జారచోరులకు సహాయము
విరసవర్తనున కాచార మబ్బిన విపరీతంబులే దొరకొనును
దురితచిత్తునకుఁ జిక్కినయుక్తులు తుచ్ఛంబులపాలుగఁ జేయున్
చిరముగ శ్రీవేంకటేశ మిమ్ముఁ గొలిచినవారలే యిల నతిఘనులు
॥ఎన్ని॥

అవతారిక:

ఓ సర్వేశ్వరా! నీవు మాయా తీతుడవు. మాయ నిన్నేమీ చేయలేదు. నేను మానవ మాత్రుడను. మాయను నిర్జించటం నావల్ల అయ్యేపనేనా? ఇవన్నీ ఇంద్రజాలము వంటివి. గారడీవాడు ఇంద్రజాలం చేస్తుంటే అదంతా నిజంగా జరుగుతున్నదనే భ్రమ కలగటం సహజమే కదా! అట్లా కొన్నిటిని నమ్మి మోసపోయాను. కాని ఇంకా యెట్లా నమ్మేదయ్యా? కానీ ఈ నీమాయను గెలువగలిగినట్లు నన్ను మన్నించి నాకు బోధించితివి. సర్వదా నీకు కృతజ్ఞుడను. ఒక జ్ఞానికి చదువుతోడయితే గొప్ప మేలు జరుగుతుంది. ఎందుకంటే ఆ జ్ఞాని మోక్షమునకు కృషి చేసి దానిని సాధించగలుగుతాడు. సాత్వికులు తపోమార్గమునవలంభించి భగవంతుని కృపకుపాత్రులు కావలెను కానీ రజోగుణము కలవారు, తమోగుణము కలవారు పట్టుదలతో తపోసాధన జేసి భగవత్సాక్షాత్కారము పొందినా రావణ భస్మాసురుల వలె భ్రష్టులవుతారు గాని లోక కళ్యాణం సాధించలేరు. ఏదో విధంగా మానవమాత్రులను తృప్తిపరచటం వల్ల ఒరిగేదేమీ వుండదు. ఏవేవో సాధనల ద్వారా యెన్ని ఘనతలు పొందినా అది నిరుపయోగమే. కానీ ఆ దీక్ష పట్టుదల శ్రీవేంకటేశ్వరుని కొలుచుటకు వినియోగిస్తే అతిఘనులు కాక ఇంకేమవుతారు అంటున్నారు తాళ్ళపాక పెదతిరుమలాచార్యులవారు. మరి అన్నమయ్య సుపుత్రడేకదా!

భావ వివరణ:

ఓ సర్వేశ్వరా! ఈ లోకంలో మానవమాత్రులమైన మమ్ము వశపరచుకోగల ఇంద్రజాలములు యెన్ని లేవయ్యా? వాటిని అధిగమించడం నావల్ల అవుతుందా? వీటిని యేవిధంగా నమ్మగలనయ్యా? నీవు మాయాతీతుడవు (మాయకు లొంగనివాడవు). ఇన్నిటను (వీటన్నిటిలో) నన్ను మన్నించి నాకు సరియైన జ్ఞానమును బోధింపుము ప్రభూ!

స్వామీ! తామసునకు (తామసగుణముకలవానికి) సుజ్ఞానము కలిగినా ప్రయోజనము గురించి వాదన చేయుటకే వినియోగిస్తాడు. కాముకునికి

వివేకము దోచిన (తెలివితేటలు కలిగితే) కాంతాళములకే (స్త్రీ సాంగత్యానికే) ఉపయోగిస్తాడు. పామరుడికి (జడునికి) వైరాగ్యము కలిగితే దాన్ని పరదూషణకు (ఇతరులను నిందించటానికి) ఉపయోగిస్తాడు. జ్ఞానికాని సామాన్యునికి, అటు చదువులు వచ్చిన (విద్య లభించిన) మోక్షముతెరువు (ముక్తి మార్గము) సాధించుటకు ఉపయోగించవు. అవి పాండిత్య ప్రదర్శనకు సన్మానాలు పొందటానికి వినియోగిస్తాడు.

జగతిని (ప్రపంచంలో) నాస్తికుడు సత్యము చెప్పుట అలవాటు చేసికొంటే దానివలన ప్రయోజనమేమీ వుండదు. ఎందుకంటే వాడు దానిని ప్రతిజ్ఞలు చేయటానికి వుపయోగిస్తాడు. దుర్జనుడు (దుర్మార్గుడు) మగటిమి (ప్రతాపము) కలవాడైతే మంత్రతంత్రములకు మారణాదులకు (వినాశనమునకు) వినియోగిస్తాడు. లోభియైనవాడు పగటున (బాహాటముగా) పుణ్యము చేసినా అది ప్రత్యవాయములకు (పాపముగానే) పరిణమిస్తుంది, ఆ పాపమునకు ఆలయమవుతుంది. వెగటున (ద్వేషముతో) క్రూర స్వభావము గలవాడు తపస్సు చేసినప్పటికీ అది వీరిడితనములకు ఆకరము (అవివేకముతో కూడిన వరములడుగుటకే వుపయోగపడుతుంది).

పాపాత్మునకు దాక్షిణ్యమే వుండదు. ఒకవేళ వున్నా వాడి దాక్షిణ్య జారులకు (వ్యభిచారులకు), చోరులకు (దొంగలకు) సహాయపడుతుంది కాని మరేమీ కాదు. విరస వర్తనము గలవాడు ఆచారవంతుడైతే విపరీతముగా ప్రవర్తిస్తాడుగాని మరొకలా ప్రవర్తించడు. దురిత చిత్తునకు (పాపచింతన కలిగిన వానికి) యుక్తులు జిక్కిన (యుక్తిమంతుడైతే) ఆ యుక్తులన్నీ తుచ్ఛమైన పనులు చేయటానికే వినియోగిస్తాడు. ఓ శ్రీవేంకటేశ్వరా! చిరముగ (చిరకాలముగా) మిమ్ము భక్తితో కొలిచెడివారికే వసుధలో చాలా గొప్పవారనే కీర్తి దక్కుతుంది.

సంపుటి: 1 కీర్తన : కోరుదు నామది ననిశము గుణాధరు నిర్గుణు కృష్ణుని

సంఖ్య : 141 పుట : 96 రాగం: మలహరి

మలహరి

107 కోరుదునామది ననిశము గుణాధరు నిర్గుణు కృష్ణుని
నారాయణు విశ్వంభరు నవనీతాహారుని॥ ॥పల్లవి॥

కుండలిమణిమయ భూషణు కువలయదళ వర్ణాంగుని
అండజపతి వాహనుని అగణిత భవహరుని
మండనచోరక దమనుని మాలాలంకృత వక్షుని
నిండుకృపాంబుధి చంద్రుని నిత్యానందునిని॥ ॥కోరు॥

ఆగమపుంజ పదార్థుని అపత్సఖ సంభూతుని
నాగేంద్రాయత తల్పుని నానా కల్పునిని
సాగబ్రహ్మమయాఖ్యుని సంతత గాన విలోలుని
వాగీశ్వర సంస్తోత్రుని వైకుంఠోత్తముని ॥కోరు॥

కుంకుమవసంత కాముని గోపాంగన కుచలిప్తుని
శంకర సతీమణి నుతుని సర్వాత్ముని సముని
శంకనినాద మృదంగుని చక్రాయుధ విదీప్తుని
వేంకటగిరి నిజవాసుని విభవ విధాయకుని ॥కోరు ॥

అవతారిక:

అనిశము అంటే యెల్లప్పుడూ అని అర్థం. ఈ శ్రీకృష్ణుడు యెటువంటివాడు? సకల సద్గుణములను ధరించినవాడు. అంతేకాకుండ ఈయన నిర్గుణుడు, నారాయణుడు, విశ్వమంతయూ నిండిన దేవదేవుడు. నేడు మనల్ని నవనీతాహారుడై మురిపిస్తున్నాడు. అంతే కాదు నేను యెల్లప్పుడూ నామనస్సులో ఈయననే కోరుదును అంటున్నారు

అన్నమాచార్యులవారు. ఈ కీర్తనలో తాళ్ళపాకవారు వాడిన విశేషణాలూ, వర్ణనలు రమ్యాతిరమ్యములు. ఉదాహరణకు కువలయ దళవర్ణాంగుడు అంటే యెవరు? నల్లకలువపువ్వుల దళములవంటి రంగుగల శరీరాంగములు కలిగినవాడు. అంటే శ్రీకృష్ణుడు. ఏమిటారంగు ప్రత్యేకత? అది వుత్తనలుపుకాదు ఒక విధమైన మెరుపుకల నలుపు. అంత నిశిత వర్ణన ఆచార్యులవారి ప్రత్యేకత. ఈ కీర్తనలో ఇంకొక ప్రత్యేకతయేమిటంటే చాలా పదాలకు నిఘంటువు లేకపోతే అర్థం తెలియదు. అదట్టావుంచి కొన్ని పదాలకు నిఘంటువు వున్నా అర్థం తెలియదు. భావించాల్సిందే. దీనికి తోడు పదములు అటూ ఇటైనవి. "మండన చోరకదమనుడు" అనే విశేషణాలూ వున్నా "సాగ బ్రహ్మమయాఖ్యుడు" అనే మాటలు సులభగ్రాహ్యంకాదు. ఆ మాటకు పరబ్రహ్మ అని విఖ్యాతి చెందినవాడు అని అర్థం. సరే! తినబోతూ రుచి అడగటం దేనికి? భావవివరణ అతి జాగ్రత్తగా చదవండి.

భావ వివరణ:

నామదిలో అనిశము (యెల్లప్పుడూ) కృష్ణుని కోరెదను. ఈయన యెటువంటివాడంటే గుణధరుడు (సకల సద్గుణములను ధరించినవాడు). అయినప్పటికీ నిర్గుణుడు (గుణాతీతుడు). ఇతడే నారాయణుడు (మానవ రూపం ధరించిన శ్రీమన్నారాయణుడు). అందుచేత విశ్వంభరుడు (విశ్వమంతా నిండియున్నవాడు. ఇన్నివిధాల పరమాత్ముడైనప్పటికీ ఈయన ప్రత్యేకతేమంటే ఈతడే నవనీతచోరుడు (వెన్నదొంగ).

ఈ స్వామి యెటువంటివాడంటే మణిమయ కుండల భూషణుడు (మణులతో నిండిన చెవి కుండలములు ధరించినవాడు). ఈయన కువలయదళవర్ణాంగుడు (నల్ల కలువదళములవంటి రంగుకల అవయవములు కలవాడు). ఈయన అండజపతి (పక్షులకు రాజైన

గరుత్మంతుని) వాహనముగా కలవాడు. అగణితభవహరుడు (అసంఖ్యాకమైన పాపములను హరించువాడు). మండన చోరక దమనుడు (చోరకళ అలంకారముగ కలవాడు). మాలాలంకృత వక్షుడు (తులసిదళముల మాలలచే అలంకరింపబడిన వక్షస్థలము గలవాడు) నిండు కృపాంబుధి చంద్రుడు (దయాసాగరమున వుద్భవించిన పూర్ణచంద్రుడు). నిత్యానందుడు (నిత్యము బ్రహ్మానందములో వుండేవాడు)

ఈ దేవదేవుడు, ఆగమ పూజ పదార్థుడు (వేదరాశికి అర్థమై భాసిల్లెడివాడు), ఆ పత్సఖసంభూతుడు (ఆపదలలో వున్నవారికి ప్రియ స్నేహితుడు). నాగేంద్రాయత తల్పుని (నాగేంద్రుడైన ఆదిశేషుని పరుపుగా కలవాడు). నానాకల్పుని అసంఖ్యాకమైన కల్పముల నెఱిగినవాడు). సాగబ్రహ్మమయాఖ్యు (పరబ్రహ్మ అని విఖ్యాతిచెందినవాడు). సంతత గానవిలోలుని (యెల్లప్పుడు మధురమైన, గానామృతమున వోలలాడువాడు). వాగీశ్వర సంస్తోత్రుడు (బ్రహ్మదేవుని చేత కీర్తింపబడువాడు). వైకుంఠోత్తమ (ఉత్తమమైన వైకుంఠమును మోక్షార్థులకు ప్రసాదించువాడు).

ఈ మహానుభావుడు ఇంకా యెటువంటివాడంటే... కుంకుమ వసంత కాముడు. (కుంకుమ, వసంతము అనిన యెక్కువ మక్కువ కలవాడు). గోపాంగనాకుచలిప్తుడు (గోపికారమణుల స్తనగిరులయందు విరాజిల్లెడి వాడు). శంకరుని సతీమణియైన పార్వతీదేవిచేత నుతింపబడువాడు. సర్వాత్ముని సముని (సర్వేశ్వరునితో సమానమైన వానిని), శంకనినాదమృదంగుడు. (మృదంగమువలె భీకరమైన ధ్వనిని వెడలించు పాంచజన్యమను శంఖము హస్తమున కలవాడు). చక్రాయుధవిదీప్తుడు (సుదర్శనము అను చక్రము ఆయుధముగా వెలుగొందువాడు). ఈయన శ్రీవేంకటాచలము నిజస్థానముగాకల శ్రీవేంకటేశ్వరుడు. విభవ విధాయకుడు (సమస్త వైభవములు విధాయకముగా కలవాడు).

సంపుటి: 7 కీర్తన : మేడలెక్కి నిన్నుఁజూచి కూడేననే యాసతోడ
సంఖ్య : 223 పుట : 237 రాగం: రేవతి

రేవతి

108 మేడలెక్కి నిన్నుఁ జూచి కూడేననే యాసతోడ
వాడుదేరి వుస్సురందురా వెంకటేశ
యాడనుంటి విందాఁకానురా ॥పల్లవి॥

పిక్కటిల్లు చన్నులపై చొక్కపు నీ వుంగరము
గక్కన నేనద్దుకొందురా వెంకటేశ
లక్కవలె ముద్రలంటెరా ॥ ॥మేడ॥

దప్పిగొంటివని నీకు కప్పుర ముపారమిచ్చి
ముప్పిరి నీ విరహానను వెంకటేశ
నిప్పనుచు భ్రమసితిరా॥ ॥మేడ॥

నిండఁబూచిన మానిపై గండుకోవిల కూయఁగా
నిండిన నీ యెలుఁగంటాను వెంకటేశ
అండకు నిన్ను రమ్మంటిరా ॥ ॥మేడ॥

వుదయచందురుఁ జూచి అదె నీ పంజని సవి
యెదురుకోనే వచ్చితిరా వెంకటేశ
బెదరి మారుమాటైతిరా ॥ ॥మేడ॥

మిన్నక కేళాకూళిలో వున్న తమ్మివిరులు నీ
కన్నులంటాఁ జేరబోఁగాను వెంకటేశ
పన్ని మరునమ్ములాయరా ॥ ॥మేడ॥

ఆనిన తుమ్మిదలు నీమేని కాంతిఁబోలునని
పూని చేతఁబట్టఁబోఁగాను వెంకటేశ
సూనాస్త్రుని వేగులాయరా ॥ ॥మేడ॥

కందువ మై చెమరించి గందవొడి చల్లుకొని
పొందనిన్నుఁ దలఁచితిరా వెంకటేశ
అంది చొక్కుమందు లాయరా ॥ ॥మేడ॥

బొండుమల్లె పానుపుపై నుండి నిన్ను పాడిపాడి
నిండు జాగరము లుంటిరా వెంకటేశ
యెండలాయ వెన్నెలలురా ॥ ॥మేడ॥

నిద్దిరించి నీవు నాకు వొద్దనుండ కలగంటి
చద్దివేఁడి వలపాయరా వెంకటేశ
యెండలాయ వెన్నెలలురా ॥ ॥మేడ॥

నిద్దిరించి నీవు నాకు వొద్దనుండ కలగంటి
చద్దివేఁడి వలపాయరా వెంకటేశ
సుద్దలింకా నేమి సేసేవో ॥ ॥మేడ॥

మల్లెపూవు కొనదాఁకి ఝల్లనను పులకించి
వుల్లము నీ కొప్పించితిరా వెంకటేశ
కల్లగాదు మమ్ముఁగావరా ॥ ॥మేడ॥

జోడుగూడి నీవు నేను నాడుకొన్న మాటలెల్లా
గోడలేని చిత్తరువులై వెంకటేశ
యాడా నామతిఁ బాయవురా ॥ ॥మేడ॥

అద్దము నీడలు చూచి ముద్దుమోవి గంటుండగా
కొద్దిలేని కాఁకతోడను వెంకటేశ
పొద్దువోక తమకింతురా ॥ ॥మేడ॥

పావురమురెక్కఁ జీటి నీవొద్దికిఁ గట్టి యంపి
దేవరకే మొక్కుకొందురా వెంకటేశ
నీవిందు రావలెనంటాను ॥ ॥మేడ॥

బంగారు పీఁటపై నుండి ముంగిటికి నీవు రాఁగా
తొంగి చూచి నిలుచుండఁగా వెంకటేశ
యెంగిలి మోవేలడిగేవు ॥ ॥మేడ॥

వున్నతి శ్రీవెంకటేశ మన్నించి కూడితివిదే
నన్ను నెంత మెచ్చు మెచ్చేవు వెంకటేశ
కన్నుల పండువలాయరా ॥ ॥మేడ॥

అవతారిక:

అన్నమాచార్య కీర్తనా సాగరమధనం దీనితో పూర్తి అవుతున్నది. ఇది శ్రీవేంకటేశ్వరుడు నాచేత చేయించిన 1116 వ సంకీర్తనా విశ్లేషణము. నావంటి అనామకుడికి ఇంత సుకృతం కల్పించిన ఆ స్వామిని ఏమని పొగడుదును? ఏనాటి పుణ్యమో! ఇది ఏతపఃఫలమో! ఏ జన్మ ఋణమో! ఇది ఎప్పటి బంధమో! నా ప్రమేయమేమీ లేకుండానే ఈ 1116 వ కీర్తన గొప్ప జానపద కీర్తనగా రూపుదిద్దుకొన్నది. ఇది ఇలా వివరించడమే నేను చేసిన పూజాఫలం అని మనసా, వాచా, కర్మణా నమ్ముతున్నాను. వీటిని జానపదులు "ఏల" పాటలు అంటారు. నాయిక స్వామికోసం యెదురు చూచింది. ఆమె భ్రమ చెందుతున్నది. అందుకని ఏమంటున్నదో వినండి "ఓ వేంకటేశా! నిన్ను చూచి కూడెదనని ఆశతో మేడలెక్కి వాడిపోయి వున్నురందునురా. నీవు ఇందాకా ఏడనుంటివిరా?", అని అడుగుతున్నది.

అతి మధురమైన కీర్తన. అవునా? ఇదే కీర్తనను అధ్యాత్మిక దృష్టితో చూస్తే... మేడలెక్కటం అంటే షట్చక్రాలను జాగృతం చేసికొని సహస్రారం చేరటం. అక్కడ శ్రీవేంకటేశ్వరుడు పరమాత్మవలె వుంటాడు. ఈ జీవుడు ఆ దేవుని కలయుటే మోక్షప్రాప్తి. అయితే ఇదంతా చెప్పినంత తేలిక వ్యవహారం కాదు. సాధనయే తగిన విధానము. భక్తియే యుక్తి మరియు శక్తి. శరణాగతియే, అది కూడా మరణం దాకా, సరియైన తరుణోపాయం. ఇది నిజం. ముమ్మాటికీ నిజం. అన్నమాచార్యులవారి

దారిననుసరిద్దాం. హరిని శరణందాము. కర్ణపేయమైన రేవతి రాగంలో మీరు ఈ కీర్తన మధురంగా పాడితే ఆ వేంకటరమణుడు పరవశించడా?

భావ వివరణ:

ఓ వెంకటేశ! (శ్రీవేంకటేశ్వరా!) నిన్ను చూచి కూడేనని (కలసెదనని) ఆసతోడ (కోరికతో) మేడలెక్కి (మేడలపైనెక్కి) వాడుదేరి (వడలిపోయి) వుస్సురందురా (ఉస్సురమని నిట్టూర్చానురా!) ఇందాకాను (ఇప్పటిదాకా) యాడనుంటివిరా (యెక్కడవున్నావురా!).

ఓ వేంకటేశ! పిక్కటిల్లు (వుప్పొంగిన) నా కుచములపై చొక్కపు (అందమైన) నీ అంగుళీకమును గబుక్కున నేను అద్దుకొన్నానురా! అప్పుడేమైనదో తెలియునా లక్కమీద అంటుకొన్నట్లు ఆ ముద్రలు అంటుకొన్నాయిరా!

ఆ రోజుల్లో దారినబోయేవాళ్ళు దాహం వేస్తున్నదంటే నేటికాలంలో కొద్దిగా వక్కపొడి పెట్టినట్లు ఆ రోజుల్లో కర్పూరపు పలుకులు పెట్టేవారన్నమాట. ఇక్కడ నాయిక కూడా స్వామి దాహం వేస్తున్నదంటే కాస్త కర్పూరం పలుకులు పెట్టిందట అదే దెప్పుతున్నది. ఓ వేంకటేశ! నీవు దప్పిగొంటివని (దాహముతో వున్నావని) నీకు కర్పూరము వుపారము (నోట్లో వుంచుకోటానికి) ఇచ్చి నీవిరహమనే అగ్నిలో ముప్పిరి (మూడు దశలు పొందటం – అద్భుతము, కౌతుకము, మోదము) నేను నిప్పులో బడ్డానేమో అని భ్రమపడ్డానురా! అంతవేదన కలిగించావు.

ఓ వెంకటేశ! నిండా బూచిన, చిగురుమావి కొమ్మలపై గండు కోయిల (మగ కోకిల) కూయగా నీ యెలుగంటాను (నీ కంఠస్వరం అనుకొన్నానురా!) అందుకే నిన్ను రమ్మని పిలిచినానురా! ఓ వేంకటేశ! ఆకాశంలో చంద్రుడు ఉదయిస్తున్నాడు. వాడిని చూచి అదే నీముఖము దొంగతనంగా నన్ను తొంగి చూస్తున్నది, యెదురువెళ్ళి తీసుకువద్దామని

ప్రయత్నించానురా! కానీ తీరా చూస్తే అక్కడ యెవ్వరూ లేరు. బెదిరిపోయి మారుమోమైతిరా (పెడమొగమైనానురా!)

ఓ వెంకటేశ! కేళాకూళిలో (క్రీడా సరస్సులో) తమ్మివిరులు (పద్మములు) వుంటే, వాటిని జూచి అందమైన నీ కన్నులనుకొని నీవు స్నానం చేస్తున్నావని నేను చేరబోయానురా! కానీ ఆ పద్మములే మరుని అమ్ములాయరా (మన్మధుని బాణాలై నన్ను బాధించాయిరా!).

ఓ వెంకటేశ! ఆనిన తుమ్మెదలు (ముసురుకొన్న భ్రమరములు) నీ శరీరకాంతిని బోలియున్నవి. నేను నీ శరీరమేమో అనుకొని తాకబోయాను. అవి చివరికి యేమైనవో తెలుసా? సూనాస్త్రుని వేగులాయెనురా! (పుష్పబాణుడైన మన్మధుని అమ్ములై నన్ను తాకినవి).

ఓ వెంకటేశ! కందుప (వ) మై చెవరించగ (అబ్బురంగా నా శరీరం చెమరించింది). చెమటగావుందని నేను గంధపుపొడి చల్లి మెత్తుకొన్నాను. ఆ తరువాత నిన్ను కలుద్దామనుకొన్నానురా! అయితే ఆ గంధపు పొడి, చొక్కమందు (నేటికాలంలో లావెండర్ పౌడర్) లాగా పరిణమించిందిరా!

ఓ వెంకటేశ! నేను బొండుమల్లెపూలు పరచిన పానుపుపై పడుకొని, నిన్ను పాడిపాడి (నీపై విరహగీతాలనాలపిస్తూనే) వున్నాను. రాత్రంతా నిండు జాగారము (నిద్రలేక) వున్నానురా! అప్పుడు నాకు చల్లని వెన్నెలలే, మండే యెండలుగా తోచినాయిరా!

ఓ వెంకటేశ! నేను నిద్రించగానే నీవు నావద్దనున్నట్లు కలవచ్చిందిరా! ఇక నా వలపు చద్దివేడిదైనది (కాసేపు సంతోషపెడుతుంది కాసేపు మండిస్తుంది). ఇంకా ఆ కథలు యేమి చెప్పమంటావురా!

ఓ వెంకటేశ! మల్లెపూవు కొన (వాడియైన కొన) నాకు గుచ్చుకొని నా ఒళ్ళంతా ఒక్కసారి ఝల్లుమన్నదిరా! వెంటనే నేను పులకించిపోయాను. నా వుల్లము (మనస్సు) నీకు అర్పించానురా! నేను చెప్పేది అబద్ధం కాదురా! నన్ను రక్షించరా!

ఓ వెంకటేశ! జోడుగూడి (జతగా కలిసి) నీవు నేను ఆడుకొన్న మాటలన్నీ తగిలించటానికి వీలులేని చిత్తరువులై నిరాధారమైనవిరా! నేడు ఆ మాటలవుపయోగమే లేదు. ఇంత అయ్యాక కూడా నీవు నామతి బాయవురా! నా ఆలోచనలన్నీ నీ చుట్టూనే పరిభ్రమిస్తుంటాయి.

ఓ వెంకటేశ! అద్దములో నా ముఖము ప్రతిబింబం చూసుకొన్నాను. ముద్దులొలికే నా మోవిపై (పెదవిపై) ఆ గాట్లేమిటిరా! కొద్దిలేనికాకతోడ (విపరీతమైన కోపము వచ్చి) పొద్దువోక తమకింతురా! (నిద్దుర పట్టక చలించి పోయానురా!)

ఓ వెంకటేశ! నేను ఈలోగా ఇంకొకపని చేశాను. ఒక పావురానికి రెక్కలకు చీటీకట్టి నీవొద్దికి పంపించానురా! అయితే ఆ లేఖ నీకు సక్రమంగా చేరుతుందో లేదో తెలియదు. అది తప్పకుండా నీకు చేరాలని ఆ దేవుడికి మొక్కుకొంటూనే వున్నానురా! అది నీకు దొరకాలని దాన్ని చూచి నీవు ఇక్కడకు రావాలని నేను మొక్కని దేవుడు లేడురా!

ఓ వెంకటేశ! నీవు కూర్చుండే బంగారు పీటపైనుండి లేచి నా ముంగిటిలోనికి వచ్చావు నేను తొంగి చూచి నిశ్చేష్టనై అలాగే నిలుచుండిపోయానురా! నన్ను నేనే నీకర్పించుకొంటుంటే ఈలోగా నా యెంగిలిమోవి (పెదవి) కోసం ఆరాటమెందుకురా!

ఉన్నతోన్నతుడవైన వెంకటేశ! (పొడవుకు పొడవైన పురుషోత్తమా!) ఇదే నీవు నన్ను మన్నించి కూడితివి. నన్ను యెంత మెచ్చుకోలుతో మెచ్చుకొంటున్నావురా! నా కన్నులకు పండుగలాయెనురా! నా జీవితం సార్థకమైనదిరా! జీవాత్మనైన నేను పరమాత్మవైన నిన్ను చేరి మోక్షప్రాప్తి పొందానురా! నా జన్మ ధన్యమైనదిరా!

మంగళా శాసనం

1. శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినామ్
శ్రీవేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

2. లక్ష్మీసవిభ్రమాలోక సుభ్రూవిభ్రమ చక్షుషే
చక్షుషే సర్వలోకానాం వేంకటేశాయ మంగళం.

3. సర్వావయవ సౌందర్య సంపదా సర్వచేతసామ్
సదా సమ్మోహనాయాస్తు వేంకటేశాయ మంగళమ్

4. నిత్యాయ నిరవద్యాయ సత్యానంద చిదాత్మనే
సర్వాంతరాత్మనే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్

5. వైకుంఠ విరక్తాయ స్వామిపుష్కరిణీతటే
రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్

6. శ్రీమత్సుందర జామాతృమునిమానస వాసినే
సర్వలోక నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్

7. మంగళాశాసనపరైః మదాచార్యపురోగమైః
సర్వైశ్చపూర్వై రాచార్యైః సత్కృతాయాస్తు మంగళమ్

పద్మావతీ సమేత శ్రీశ్రీనివాస పరబ్రహ్మణేనమః



శ్రీరస్తు

శుభమస్తు అవిఘ్నమస్తు

ఏలుకో శృంగార రాయ

ఎన్నుకొన్న
అన్నమాచార్యుల
సరస శృంగార సంకీర్తనలకు
ఉపోద్ఘాతము

మరియు

తాత్పర్యము

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.

ఏలుకో శృంగార రాయ

మొదటి ప్రచురణ
జూన్ 2012

రచన
అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు
M.Tech.
Cell: 9393021360

వెల : అమూల్యం

ప్రతులకు :
ఫ్లాట్ నెం. 5, ప్లాట్ నెం.61, సిద్ధార్థ నగర్,
హైదరాబాద్ - 38. ఫోన్ : 093930 21360

డి.టి.పి. & ప్రింటింగ్ :
కె. మురళీ కృష్ణ
9848 51 51 09

అంకితము

మా అమ్మ అలమేల్ మంగకు

కం॥ హరి కరగి మురియు తరుణము
నరయుచు వివరింపవమ్మ! అరవిరి కనులన్
మరిమరి ధరునికి నామొర
నెరిగింపవె అంకితమ్ము నిడుదును తల్లీ!

ఏలుకో శృంగార రాయా

అన్నమయ్య సరస శృంగార సంకీర్తనలకు

విషయ సూచిక

క్ర.సం.	విషయం	పేజి
1.	అంగనకు నీవే అఖిల సామ్రాజ్యము	143
2.	అంబుజాక్ష నమో ప్రహ్లాద వరద	61
3.	అటు చూడు సతి నేర్పులవుభళేశ	27
4.	అలమేలు మంగ యీకె ఆనుకవద్ద	93
5.	అదెరాముడు సువేలాద్రి	155
6.	అయ్యో! నీకు వగచినదే	165
7.	అపెనా చెల్లెలు గాదా అందుకేమీ	11
8.	ఆనలేలయ్యా! నీవాడినట్టే	169
9.	ఆసలింకామానవా ప్రహ్లాదవరదా	185
10.	ఇంకనేలే మాటలు యెఱుగుదు	189
11.	ఇంకా నీ మనసెట్టో యెఱగజుమ్మీ	193
12.	ఇంతలాయ వింతలాయనెందాకా	167
13.	ఇందాకా సరి వచ్చెనింపులెల్లాను	83
14.	ఇందుకంటె నున్నదదే యెంచగ	51
15.	ఇంకానేల వెరపు యెదుటనే	13
16.	ఇట్టె కరుణించవయ్యా	37
17.	ఇదివో చెలియా భావమిక	187

18.	ఇద్దరు నిద్దరే మనమేమి చెప్పేదే	91
19.	ఇన్నియు నీయందే కంటిమి నొకచోట	95
20.	ఇన్నియు నీవే నేరుతువిక	7
21.	ఊరకున్నవారితో	5
22.	ఎందరి బెండ్లాడినా నీకేమాయె	57
23.	ఎందాకా వేసరించేవు	111
24.	ఎటువంటి యాగడీడు	49
25.	ఎప్పుడునూ నాకు లోనై	175
26.	ఎఱిగిన పనులకు	143
27.	ఏకాలమేది దనకెట్టు	131
28.	ఏమని చెప్పుదునె	75
29.	ఏల నీవు సిగ్గు పడేవు	103
30.	ఏల చెప్పేవు నీ సుద్దులు	119
31.	ఏలే అగదానికి యెమ్మలింత	89
32.	ఐతినే ఏలిక సానివి	23
33.	ఒక్కరీతివుండవు	161
34.	ఓరుపే నేరుపందువు విదలకు	71
35.	కన్నులజుచేవు మాతో	141
36.	కన్నుల మొక్కేము నీకు గడపరాయ	59
37.	కలదిందేమాట కంతునియాట	139
38.	కుందనపు బిల్లగోవి	199

39.	కేరడమాడగలనా	191
40.	కోడెగాడు వీడు గదె	81
41.	కొమ్మలాల యిదె మంచి కొలువు	109
42.	కోరికలీడరే నేడు కోనేటిరాయా	197
43.	కోరినట్టే నీకు జెల్లె గోవిందరాజ	181
44.	గొల్లెతలైతేనే కొఱతా	97
45.	గోవిందుడీ బాలుడు గోపాలుడు	53
46.	చక్కదనాల మించీ నిచ్చట గృష్ణుడు	65
47.	చవిగంటే విడువడు సారె సారె	101
48.	చాలుజాలునీతోడి సరసాలు	135
49.	చిన్ననాడు ముద్దులు వంచన	123
50.	చిత్తగించి చూడవయ్య	85
51.	చూతువురావయ్యా సుదతి	25
52.	చెల్లునా నీకీపనులు చెన్నకేశ	153
53.	చేకొనుమీ నల్లబల్లి చెన్నకేశవా	117
54.	చేరినీవు చెప్పినట్టే సేసితి	151
55.	చేవదేరి వలపులు చేతిలోన వీడెము	67
56.	చొల్లెపు జుట్టవో చొక్కనాథా	1
57.	జలముల బాసిన జలజాప్తుని	149
58.	తనకు నాకు నెప్పుడు తగులె	121
59.	తనకే తెలుసునమ్మతమకపు	107

60.	తాను చేసిన చేత తరుణిమేన	115
61.	నడుమజెమట బవనాశియేరు	99
62.	నమ్మినవారి పాలిటి నచ్చిన చింతామణి	15
63.	నాకెంతప్రియము చెప్పేనాటకీడు	33
64.	నిచ్చలు నా బ్రతుకెల్లా నీచేతిది	179
65.	నిచ్చా నిచ్చా విట్టలా	171
66.	పట్టపు గట్టితిఇంక బ్రతుకరయ్య	3
67.	పురాణ పురుషుడు భువినవతరించెను	47
68.	పూవుబోణులకొలువే పుష్పయాగము	105
69.	పూవుటమ్ముల మరుడు	159
70.	పెక్కునిచ్చకళ్యాణాల పెండ్లికొడుకు	183
71.	పెక్కు సతులపెండ్లాడి బెరసిన	137
72.	పేగులు జంద్యాలు వేసి పెంచపు	127
73.	పోనీ పోనీ ఇకనేలపోయిన నీటికి	163
74.	బండిదొక్కె బామునెక్కే	133
75.	బలవంతుడీతని బంట్లమై	79
76.	మగడాడు మెచ్చు	63
77.	మగువను దయజూడమగపాడి	31
78.	మదనుని తండ్రికి మజ్జనవేళ	113
79.	మెచ్చిరి గొల్లెతలు మీదమీదను	39
80.	మేమేమి సేతుము మాకు	17

81. రామా రామా రాజీవనయనా 195
82. ఱట్టు సేయక రావె యిట్టె 9
83. లంజకాడవౌదువు 129
84. వరుసకు రాకుంటే వా విదప్పీనా 157
85. వలపు నిలుపలేనివారము 125
86. వినవమ్మా యశోదమ్మా! 145
87. వినోదకాడైనాడు విట్ఠలేశుడు 55
88. విన్న పమిదేపోవింటివో వినవో 177
89. వీదుల నెల్లా దానె గోవిందరాజు 73
90. వూరకే దక్కునోటవే వుడివోని వలపు 43
91. వెరవయ్యా నీ చేతకు విట్ఠలేశ్వరా 77
92. వేడుక కాడవౌదువు 19
93. వేడుక గాడుగదమ్మ విజయనగరములోన 21
94. విన్నపములికనేల వేగినంతాను 95
95. సగము మానిసి రూపము 69
96. సముఖాఅవధారు సర్వేశరాఘవ 45
97. సతికిని బతికిని చలము లేల 41
98. సిగ్గువడడిదివో చెలులాల 29
99. సిగ్గుతోడ గొంకితేను చిక్కునామగపాడి 85
100. సింగార రాయడ వౌదు చెన్నకేశ 173
101. సోబాన బాడేము మేము 201

ప్రార్థన

కం॥ శ్రీ లలనను భూకాంతను
వీలుగ నిరుగడల దాల్చి వింటూ దీనిన్
కాలుని "కాసేపాగని"
ఏలాగో సర్దిచెప్పు, యెంకన్న దొరా!

సీ॥ తాళ్ళపాకన్నయ్య తాజెప్పె వేలాది
కీర్తనల్ నీలీల నార్తిపాడె
శృంగార రాయ! నీ అంగనలను నిన్ను
మురిపించె తరియించ తరతరాలు
ఏనాటి బంధమో యేను నాతని బాట-
తొక్కి కొల్చితి నిన్ను తోయజాక్ష!
ఇద్దాని బిలిచెద "ఏలుకో శృంగార-
రాయ" ని కొండలరాయ! వినుము

తే॥ అతని శృంగార కీర్తన లనువదించి
వాని తాత్పర్యమెరిగించ బూనుకొంటి
తప్పులెంచకుమోరయ్య! దయను జూపి
స్థిరపు చిత్తమునీయుమా శ్రీనివాస!

తే॥ తొల్లి జయదేవుడెక్కిన త్రోవ ఇదియె
వెనుక శ్రీనాథుడెంచిన విధము నిదియె
అన్నమార్యుడు జేసిన యెన్నిక ఇదె
సరస శృంగారమే హరిన్ మురియ జేయు

ఉ॥ తేలికజేసి నీచుడని తిట్టిన నవ్వెద, స్వామిచేయు ఆ
లీలలు బూతనే మతికి లేదిక మోక్షము ఈ ధరాతలిన్
ఆలిని కూడియే మగడు ఆతని బిడ్డకు జన్మనిచ్చు; ఆ
లీలకు 'నీలి' నీడనిడు లేకి తలంపును ద్రుంచు శ్రీహరీ!

కం॥ సిరులేమి చేతు నేనిక
మరులేటికి? సుఖములేల? మాన్యత లేలా?
కురిసిన నీదయ చాలును
వరములు నాకెందుకయ్య! వనరుహనాభా!

ఆ.వె॥ బూతు తోడబుట్టి బూతుతో పుట్టించు
బూతు చేయ సుతుల ప్రోత్సహించు
బూతు కొరకె హరియు బుట్టించె మదనుని
బూతు 'తలపు' తప్పు భూతమదియె.

తే॥ చాచినానురా కాళ్ళను 'చావు కొరకు'
నీ తలంపుతోనే నేను 'నివురునవుదు',
చివరి క్షణముదాకా నాదు చిత్తమందు
నిలువుమా శౌరి! అన్యంబువలదు నాకు.

చం॥ పదకవితా పితామహుడు మాన్యుడు నౌ మన అన్నమయ్య నా
యెద వసియించుగాత! జగదీశ్వరుడౌ తిరువేంకటేశుడున్
అదనుగ పాల సంద్రసుత నన్నులమిన్నను కౌగలించుచున్
ముదమున నాదు యీ రచన ముద్దిడిమెచ్చిన చాలు ధన్యుడన్.

మ॥ కలయో వైష్ణవమాయయో? తెలియగా కాకున్న దో శ్రీహరీ!
తొలిజన్మంబుల భాగ్యమేమికలదో? తోడైసదా నామదిన్
కొలువై ఇత్తరి అన్నమయ్య చెలగన్ కూర్చేను తాత్పర్యముల్
పలుశృంగారపు కీర్తనంబులకు నా భావంబు జోడించుచున్

ఆ.వె॥ అన్నమయ్య తెలుగు ఆనాటిదౌట చే
అంతు చిక్కదాయె అతని వూహ
ఏ నిఘంటువైన యెత్తేసె చేతులు
యేమి చేతునయ్య యెంకటేశ !

మనసులో మాట

ఇదివరలో "భావయామి వేంకటేశమ్" అని పిలిచి 606 అన్నమాచార్యుల వారి కీర్తనలకు మున్నుడి (INTRODUCTION) భావామృతం (చరణాలక్రమములో భావ వివరణము) కీర్తనలతోపాటు వ్రాసి అన్నమాచార్యులవారికి అంకితము జేసి శ్రీ వేంకటేశ్వరునికి అర్పించి చరితార్థుడనయ్యాను. భక్తి, శృంగారం, వైరాగ్యం, జ్ఞానబోధ, కళ్యాణం, దశావతార వర్ణన, జానపదం, భజన, అలమేల్మంగ, అన్నమయ్య తత్త్వచింత, శ్రీమన్నారాయణుడు, సంస్కృత కీర్తనలు, హనుమంతుడు, శ్రీకృష్ణుడు, శ్రీ రామచంద్రుడు, నృసింహుడు, తిరుమల, బ్రహ్మోత్సవములు, శ్రీ వేంకటేశ్వరుడు, గోవిందరాజస్వామి... వంటి విభిన్న అంశములతో కీర్తనలనెన్నుకొని ప్రకటించాను. పరిమిత సంఖ్యలో కంప్యూటర్ ప్రింట్ తీయించి మొత్తము 6 సంపుములచ్చు వేయించాను. ఈ జన్మకిదిచాలు అనుకొన్నాను.

కాని ఇది చాలదురా... అన్నాడు ఏడుకొండలవాడు. ఇప్పుడు "ఏలుకో శృంగార రాయా" అనే ఈ అనంత యాత్రలో అన్నమాచార్యులవారి సరస శృంగార కీర్తనలకు చిన్న ఉపోద్ఘాతముతో కూడిన తాత్పర్యమునందించే ప్రయత్నం చేస్తున్నాను. ఆ పురుషోత్తముడు పక్షవాత పీడితుడనని నాపై జాలితో పుర్రచేతి వ్రాతను నేర్పాడు. ఏజన్మదో స్ఫురణనిచ్చాడు. బ్రతికే ధైర్యమిచ్చాడు. అవసరమైన ఆర్థిక స్థోమతనిచ్చాడు. అన్నిటికన్నా మిన్నయైన విరక్తినిచ్చాడు. మంచి మిత్రులనిచ్చాడు. పట్టులేని కాళ్ళు చేతులిచ్చినా పట్టుదలనిచ్చాడు. ఈ రచనలో ఎదురయ్యే కొన్ని ఇబ్బందులను వివరిస్తాను. రాగి రేకులపై అన్నమయ్య కీర్తనలను ఆనాటి రాజు చెక్కించి ధన్యుడయ్యాడు. కొన్ని రాగి రేకులు చిలుము బట్టి నేటి పండితులకు కూడా అంతుబట్టకున్నాయి. కొంతమంది రాగిరేకులపై చెక్కడంలో చేసిన పొరబాట్లు గందరగోళంగా మారాయి. ఆనాటి కొన్ని వాడుక పదములు నేడు 'లుప్తమై' పోయాయి. ఆ ప్రాంతంలో (రాయలసీమలో) కన్నడ, తమిళ భాషల వాడుకకు

లోనై పరివర్తన చెందిన తెలుగు పదాలను అన్నమయ్య వాడటం వలన కొన్ని పదాలనర్ధం చేసికోవటం గగనమవుతున్నది. అరసున్న లేకుండా కొన్ని ఆనాటి అన్నమయ్య తెలుగు పదములను ఉపయోగిస్తే వాటి అర్ధం తారుమారయ్యే ప్రమాదమున్నది. నేటి కాలంలో ఆ పదాలలో వాడే 'ఱం' (శకట రేఫము) నేడు, వాడిక తగ్గిపోయింది. అన్నిటికంటె గొప్పతంటా యేమిటంటే... ఒక్కొక్కమాటకు మూడు లేక నాలుగు అర్ధాలున్నప్పుడు అన్నమయ్య వేర్వేరు చోట్ల వేర్వేరు అర్ధాలలో ఆ మాటను వాడారు. ఒక్కొక్కప్పుడు సందర్భాన్ని బట్టి సరిపోయే అర్ధం చెప్పుకోవాలి. ఉదాహరణకి దోమటి, అసోదము, గజరు, పల్లదము... ఇలా అనేక పదములున్నాయి.

నేనుకూడా చేసేదేమిలేనప్పుడు, చేతులెత్తేసి సందర్భానుసారం అతికిన అర్ధం వాడవలసి వచ్చింది. ఇది ఎటువంటిదంటే, దూరంనుంచి చూచి నున్నగా చిన్నగా వుందని భ్రమించి, దగ్గరకెళ్ళి కైలాస పర్వతం ఎక్కాలనుకొన్న వెఱ్ఱివాడి పరిస్థితే నాదీ అయిది. ఇది కైలాస పర్వతం. దీన్ని ఎక్కగలనా? ఇది మహోదధి దీనినీదగలనా? ఇది అనంతాకాశం. దీనిలోని చుక్కలను లెక్కించగలనా? ఇది సువిశాల కీకారణ్యం, నేను కడతేరగలనా? ఏమో... తెలియదు. అయినా, నా నిరంతర ప్రయత్నం నేను చేస్తూనే వుంటాను.

ఈ ప్రయత్నానికి ఆరంభం వుంటుంది. గాని... అంతం వుండదు. శృంగార కీర్తనల అనంతరం నాచేత ఆ దేవదేవుడు ఏమి చేయిస్తాడో ఆయనకే తెలియాలి.

నాకు పద్యం చెప్పటమంటే ప్రీతి. అందులోను శబ్దాలంకారాలతో చెప్పటం ఇంకా ఇష్టం. కానీ ఆ ప్రయత్నాలన్నీ నా ఆత్మానందాన్ని మాత్రమే నాకు ఇస్తున్నాయి. మనం చెప్పేది ఎదుటివానికి అర్ధం కానప్పుడు దానివలన ఉపయోగమేమిటి? నేను ఇప్పటికిప్పుడీ పద్యం చెబితే దీని వలన ప్రయోజనమేమి?

కం॥ ఇది మొదలిడి వొదవుటయే
కుదిరినదని ముదమునంది కొదలేదనుచున్
యెదగొని సదమదమగుచును
చెదరక తుదిలేదననచు సేవింతు హరీ!

అందుచేత "ఏలుకో శృంగార రాయా!" వచనానికే పరిమితం చేశాను.

నా పరిమిత మతికి తట్టిన ఒక సత్యం వెల్లడిస్తాను. వైష్ణవతత్త్వం ప్రభోదించే అన్నమాచార్యులవారు జగతికే తల్లిదండ్రులైన శ్రీ వేంకటేశ్వరుడు అలమేలుమంగలపై ఎందుకు శృంగారం కుమ్మరించారు? వారి కూటముల నెందుకు మాటిమాటికీ వివరించారు. పైకి శృంగారమే అయినా ఇది ఆధ్యాత్మ తత్త్వం. శ్రీ వేంకటేశ్వరుడు పరమాత్మ. అలమేలుమంగ, గోపికలు, ఆయనను వలచిన వారంతా... ఆత్మలు. ఇవన్నీ ఆ పరమాత్మలో లీనమవ్వాలని తహతహలాడుతూ భక్తితో పారవశ్యంతో ఎదురు తెన్నులు చూస్తున్నాయి. ఏ జామున ఆయన యెవరిననుగ్రహిస్తాడో తెలియదు. అందరికీ ఆ స్వామి తమతో రమిస్తాడనే... ఆశ. ఏ తీరుగ నను దయజూచెదవో... అని రామదాసులాంటివారు వేడుకొన్నారు. ఎందుకు దయరాదురా అని త్యాగరాజులాంటివారు విలపించి తపించారు. ఆ పరమాత్మ ఏ ఆత్మని దగ్గర తీసికొంటే దానికి మోక్షం సిద్ధిస్తుంది. కాకపోతే.. అది యెన్నడు, యెవరికి, ఏవిధంగా దక్కుతుందో ఏడుకొండలవాడికొక్కడికే తెలుసు. మనపని యెదురు తెన్నులు చూడటమే.

సప్తగిరీంద్రుని సరసశృంగారం సాధ్యమైనంత నర్మగర్భంగా చెప్పాను. కానీ యెక్కడన్నా మర్యాద నతిక్రమిస్తే పెద్దలు నిందించక నా అజ్ఞానాన్ని మన్నించండి.

శృంగార కీర్తనల భ్రమలో మనసు చలించుట మానవ సహజం. అందుకని మధ్య మధ్య "హరి" సంకీర్తనలను పేర్చాను. శ్రీ రాముడో నారసింహుడో, శ్రీ మహావిష్ణువో-ఎవరో ఒకరైనా కరుణించరా?

అన్నమయ్య కీర్తనలకే కాదు అనేకమంది దివ్యుల స్తోత్రాలకోసం.. Please Visit my website..... www.geetadeeksha.com.

సంపుటి : 21 కీర్తన : చొల్లెపు జుట్ల వో చొక్కనాథా

సంఖ్య : 436 పుట : 291 - రాగం : వరాళి

1. చొల్లెపుఁజుట్ల వో చొక్కనాథా నీ-
చుల్లరిచేఁతలు గంటిఁ జొక్కనాథా ॥పల్లవి॥

చూడ వేగన్నులు నిన్నుఁ జొక్కనాథా నీకు
జోడు భూమియును లక్ష్మిఁ జొక్కనాథా
సూడిదె నాపాయమిదె చొక్కనాథా నీతో
సూడువట్టీ నారతులు చొక్కనాథా ॥చొల్లె॥

చొక్కపుసింగారాల చొక్కనాథా! మోవిఁ
జుక్కలు నించె నెవ్వతో చొక్కనాథా
చొక్కించితి గోపికలఁ జొక్కనాథా! నాతో
సుక్కులమాట లేలోయి చొక్కనాథా ॥చొల్లె॥

సొమ్ములతో విఱ్ఱవిఁగేచొక్కనాథా! పోదు-
సుమ్మీ నీకు నాకుఁ జొక్కనాథా
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిటు నీవు గూడఁగాను
జుమ్మన మై పులకించెఁ జొక్కనాథా ॥చొల్లె॥ 436/21

ఉపోద్ఘాతము :

తెలుగు నాట చొక్కరావులు, చొక్కయ్యలు, చు(చొ)క్కమ్మలు విస్తృతంగా కనిపిస్తుంటారు. ఇవి మన పూర్వీకులు పెట్టుకొన్న ముద్దు పేర్లు. నాకు తెలిసిన, తెలివిగల తెలుగువాడికెవరికీ దీని అర్థం తెలియదు.

చొక్కనాథుడంటే "దోషరహితు"డని అర్థం.
శ్రీమన్నారాయణుడు 'అస్ఖలితుడు', 'నిర్మోహి'

తాత్పర్యము :

చొల్లెపు జుట్ల (జడవేసి జుట్టు చుట్టగా చుట్టి అలంకరించుకొనిన) ఓ చొక్కనాథా! (దోషరహితుడవైన నాథుడా!) నీవు చుల్లరి (ఎగతాళి కూడిన) చేతలవాడవు (చేష్టలు చేయు చొక్కనాథుడవు).

ఓ చొక్కనాథా! నీవు చూడబోతే వేయికన్నులవాడవు. నీకు జోడు (జంట) అయిన వారు భూదేవి లక్ష్మీదేవి. ఓ చొక్కనాథా! నీకు 'సూడిదె ఇదె నాపాయము (నా కానుక నీకు నా వయస్సు). నీకు ఆరతులు సూడువట్టుచున్నాము (హారతులెత్తుచున్నాము).

చొక్కపు సింగారాల (దోషము చూపలేని సింగారములు గల) ఓ చొక్కనాథా! యెవ్వతో నీ మోవిపై (పెదవిపై) చుక్కలు నించె (పంటిగాట్ల గుర్తులన వదలినది). ఓ చొక్కనాథా! నీవు మా గోపికలను విపరీతముగా చొక్కించితివి (శ్రమ పెట్టితివి). నీవన్నీ సుక్కులమాటలు (మాయదారిమాటలు). అవి యేలోయీ యెందుకయ్యా! చొక్కనాథా!

ఓ చొక్కనాథా! నీ నగలన్నింటిని ధరించి విఱ్ఱవీగుచున్నావు.
నీకు నాకు పోదు సుమ్మీ! (పొసగదు సుమా!)
ఇమ్ముల(ఇంపైన) శ్రీవేంకటేశ్వరా! నీవు నన్నిట్లు కూడితివి.
ఇక నా తనువు 'జుమ్మని' పులకించినదయ్యా!

సంపుటి : 21 కీర్తన : పట్టము గట్టితివింక బ్రతుకరయ్యా

సంఖ్య : 152 పుట : 102 - రాగం : సాళంగ నాట

2. పట్టము గట్టితి వింక బ్రతుకరయ్యా
చిట్టకాలు లేవు మీకు శ్రీవేంకటేశుఁడా ॥పల్లవి॥

అలమేలుమంగకు సింహ్వా(హా?)సనము నీవురము
కలితహారములే సింగారపుదండలు
తొలఁకు నీహస్తములే తోరణగంభములు
చెలిరాజ్యమే నీవు శ్రీ వేంకటేశుఁడా ॥పట్ట॥

పరగుతులసిదండ పచ్చతోరణ మాపెకు
మెరుఁగుఁగౌస్తుభమణి మించుటద్దము
గరిమ నీసొబగులు కప్పములుఁగానికలు
సిరులు నీకూరిములు శ్రీ వేంకటేశుఁడా ॥పట్ట॥

సంతతమైన విందులు సారె నీమోవితేనెలు
వింతరతిభోగములు వినోదాలు
కొంత నియ్యారును బొడ్డు కుంచెయుఁ గాళాఁజి
చెంతల నన్నీ నమరె శ్రీ వేంకటేశుఁడా ॥పట్ట॥ 152

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటశ్వరునికి ధన్యవాదాలు చెబుతున్నారు అన్నమయ్య. మాకు పట్టము గట్టితివయ్యా! ధన్యులము అంటున్నారు. మీకు చిట్టకాలు లేవు (నీ లీలలకు పరిమితియే లేదు) అంటున్నారు.

తాత్పర్యము :

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవు మాకు పట్టము గట్టితివి (వైభవము నొసంగితివి). బతుకరయ్య(ధన్యులమైతిమి).మీకు చిట్టకాలకు లేవు (నీ లీలలకు పరిమితియే లేదు).

అలమేలు మంగమ్మకు నీ వురము సింహాసనము. అందమైన ఆమెచేతి దండలే నీకు అమరిన హారములు. తొలకు (చలించు) నీ హస్తములే ఆమె పాలిటి తోరణ స్తంభములు. ఓ శ్రీ వేంకటేశా! నీవే ఆమె రాజ్యము.

ఓ శ్రీ వేంకటేశ్వరా! ఆమెకు నీమెడలోని తులసిమాల ఆకు పచ్చని తోరణమువలె భాసిల్లుచున్నది. మెరయుచున్న నీ కౌస్తుభమణి ఆమెపాలిటి అద్దమై ప్రకాశించినది అనిపించుచున్నది. నీ అద్భుతమైన సొగసులు ఆమెకు నీవిచ్చిన కప్పములు, కానుకలు. నీ వలపులే ఆమెకు సిరిసంపదలు.

ప్రభూ! నీ మోవి తేనె (అధర సుధ) ఆమెకు ప్రతిసారి శాశ్వతమైన విందు భోజనము. అచ్చెరువు గొలుపు రతిభోగములు అనేకమైన వినోదములు. ఓ శ్రీవేంకటేశా! కొంచెము కొంచెముగా నీ ఎఱ్ఱటి తమ్మి (తాంబూలపు వుమ్మి) వూయుటకు పాత్ర (బొడ్డు కుంచెము) నీ కొరకు అమర్చబడినది.

సంపుటి : 21 కీర్తన : ఊరకున్న వారితోడ వూరు

సంఖ్య : 161 పుట : 108 - రాగం : దేశాళం

3. ఊరకున్న వారితోడ వూరు నోప దెఱఁగవా
చేరి నాతో సుద్దులెల్లాఁ జెప్పేవుగాక ॥పల్లవి॥

వద్దని నీతో నేను వాదులడిచేనా
గద్దించి యప్పటి నిన్నుఁ గాదనేనా
తిద్ది నీగుణాలు నేఁడు తీరుచవచ్చేనా
వొద్దనే నీ వెట్టుండినా నుంటివిగాక ॥ఊర॥

చలపట్టి నిను నేను సాధించవచ్చేనా
కలవి లేనివి తారుకాణించేనా
నిలువుకు నిలువే నిన్ను నేరాలెంచేనా
వెలి నెంతనవ్వినా నవ్వితివిగాక ॥ఊర॥

పంతమాడి సారెసారెఁ బంగించదొరకొనేనా
వంతులకు నంతేసి వాసిపట్టేనా
యింతలో శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
యెంత చనవిచ్చినాను ఇచ్చేవుగాక ॥ఊర॥ 161

ఉపోద్ఘాతము :

ఆమె స్వామితో నిష్ఠూరాలాడుతోంది. నేడు నావద్ద చేరి యేవేవో కతలు చెబుతున్నావు. ఊరకున్న వాళ్ళని వూరు ఒప్పదు అనే మాట నెరుగవా?

తాత్పర్యము :

ఊరకున్న వాళ్ళతో ఊరు ఒప్పదు. స్వామీ! నీవా మాట నెరుగవా? నేడు నావద్ద చేరి యేవేవో సుద్దులు (కథలు) చెబుతున్నావు కదా!

నీతో వలదని నేను వాదన లణగింతునా? నిన్ను, పోనీ, అప్పటికి గద్దించి తిరస్కరింతునా? నేటికి నేడు నీ గుణాలను తిద్ది (సవరించి) తీర్చవత్తునా? నీవెట్లుంటే నాకేమిటికయ్యా?

చలపట్టి (మత్సరముతో) నిన్ను సాధించవత్తునా? అయినవీ కానివీ నీకు ఋజువు చేసికొనుటయే నా పనియా? నిలబడిన వాడినలాగే నిలబెట్టి నిన్ను నేరాలెంచుతూ బాధించితినా? ఏదో పైకి నవ్వుతున్నావుగాని నీవెంత నవ్వినా అది నిజమైన నవ్వా? పంతమాడి మాటి మాటికీ నన్ను బంగించ దొరకొనేనా (వంచించ పూనుకొందువా... అని ఊహ...) వంతు పెట్టుకొని అంతటి ఆధిక్యము చూపింతువా?

ఓ శ్రీ వేంకటేశ్వరా! ఇంతలోనే ఈ విధముగా నన్ను యెనసితివి (పొందితివి). నాకు ఎంత చనువు కావాలంటే అంత చనువు ఇచ్చెదవు గాక!

సంపుటి : 21 కీర్తన : ఇన్నియు నీవే నేరుతువిక నెన్నడు

సంఖ్య : 41 పుట : 29 - రాగం : ఆహిరి

4. ఇన్నియు నీవే నేరుతు విఁక నెన్నఁడు
పన్నిన సటలెల్లాఁ జేసి పాలార్చవయ్యా ॥పల్లవి॥

కాంతకు నీబుజము రేకలు చూచినంతనుండి
చింతతోడ చెక్కులెల్లాఁ జెమరించెను
మంతనానకుఁ బిలిచి మనసుమర్మము సోఁక
పొంతనే నీవానవెట్టి బొంకఁగదవయ్యా ॥ఇన్ని॥

కొమ్మ నీతురుము చూచి కొత్త పూవులెల్లాఁ జూచి
తమి మోము వంచుకొని తడఁబడీని
నెమ్మనమలర నీవు నేరుపులెల్లా మెరసి
సమ్మతించేయట్టుగాను సత్యాలు చూపవయ్యా ॥ఇన్ని॥

అలమేలుమంగ నీవాడేటిప్రియాలు చూచి
కలసి మోవిచ్చె శ్రీవేంకటేశ్వరుఁడా
వెలయ నింకా నీవు వేవేలుచందముల
పలుసాకిరులు చెప్పి భ్రమయించవయ్యా ॥ఇన్ని॥ 41/21

ఉపోద్ఘాతము :

ఓ శ్రీ వేంకటేశ్వరా! నిన్ను నీ భుజంమీది ఈ రేఖలు, నీ కొప్పులోనున్న కొత్త కొత్త పూలు, నీవాలకం చూస్తేనే అసలు సంగతి తెలిసిపోతోంది. నీవునేర్వని విద్య వున్నదా? పన్నిన సటలెల్లాజేసి (మాయచేయటంలో నినున మించిన వారెవరు?) పాలార్చవయ్యా (ఆమె చిరాకును ఉపేక్షించవయ్యా!)

తాత్పర్యము :

ఇన్నియు నీవే నేరుతవు (ఈ విద్యలన్నీ నీకు తెలిసినవే). ఇక ఎన్నడో 'పన్నిన సటలెల్లా' (పన్నుగడలతో కూడిన మాయలన్నీ) చేసి, పాలార్చవయ్యా (ఓపిక ప్రదర్శించవయ్యా!) చివరికి ఆవిడే నీదారికి వస్తుంది.

కాంతకు (అలమేలుమంగమ్మకు) నీ భుజము మీద ఈ రేకలు (గుర్తులు) చూచిన దగ్గరనుంచి దిగులుతో బుగ్గలన్నీ చెమటతో తడిసిపోయాయి. మంతనానకు బిలిచి (ఏకాంతంగా ఆమెను పిలిచి) నీ మనస్సులోని మర్మమెల్లనూ విప్పజెప్పవయ్యా! నీ దగ్గర జేర్చుకొని ఏవన్నా ఒట్లు పెట్టుకొని, అబద్ధాలాడియైన ఆమెను అనునయించవయ్యా!

ఈ భామిని నీ కొప్పులో నున్న కొత్త కొత్త పూలను చూచి అనుమానంతో సతమతమవుతున్నది. పైకి యేమీ అనలేక తన మొకము వంచుకొని తడబడుచున్నది. ఆమె మనస్సు కుదుటబడునట్లు జేసి నీ నేర్పునంతయు జూపి ఆమె నీతో సమ్మతించునట్లు కొన్నైనా నిజాలు చెప్పవయ్యా!

ఓ శ్రీ వేంకటేశ్వరా! ఈ అలమేలుమంగ నీవు జెప్పే ప్రియములు (ప్రేమ చూపు మాయ మాటలు) విని, కఱగిపోయి నిన్ను కలసి తన మధురాధరం నీకందిస్తుంది. ఇంక నీవు విజృంభించి అనేక రములైన 'సాకిరులు' (సాక్ష్యాలు) చెప్పి ఆమెను భ్రమలో ముంచవయ్యా! నిన్ను కాదనే వారెవరు?

సంపుటి : 14 కీర్తన : అట్టు సేయక రావే యిట్టె నీవు

సంఖ్య : 557 పుట : 322 - రాగం : సింధురామ క్రియ

5. అట్టు సేయక రావె యిట్టె నీవు
గట్టిగా వచ్చేవంటాఁ గాచుకున్న వాఁడు ॥పల్లవి॥

చెలిమి చేసినవారు చేతికిలోను గావలె
చలములు సాధించ సంగతిగాదు
వలచిన వారలు వద్దఁ బాయకుండవలె
పొలయలుకలు చూపఁ బొసఁగ చెప్పుడును ॥అట్టు॥

సరస మాడేటివారు సమ్మతించి వుండవలె
నెరసులు పట్టేది నేరుపుగాదు
మరుతంత్రములవారు మంతనాన నుండవలె
విరసాన రచ్చలుంటే వేడుక గాదు ॥అట్టు॥

వొడఁబాటు గలవారు వొద్దికతో నుండవలె
అడియాసలఁ బొరలే దందము గాదు
అదరి శ్రీ వేంకటేశుఁడలమేల్మంగవు నీవు
తడియక కూడితివి తగులాయ మోహము ॥అట్టు॥

ఉపోద్ఘాతము :

అలమేలు మంగమ్మ చెలికత్తెయై, ఆమెకు హితవు చెబుతున్నారు అన్నమయ్య. ఆమె చేయవలసిన పనులు, చేయరాని పనులు వివరిస్తున్నారు. స్వామిని వలచిన వారికి సవతి పోరు తప్పదు. చంద్రుని చల్లదనం, సూర్యుడి వెలుగు నాకొక్కరికే కావాలంటే ఎలా కుదురుతుంది. ఆయన అందరివాడు. అందనివాడు. అందరాని వాడు. అందగాడు. అందెగాడు (ఆరితేరినవాడు).

తాత్పర్యము :

ఓ నెచ్చెలీ! నీవు అట్టు సేయక (నిందించకుండా) యిట్టే నీ ప్రియుని వద్దకు రావే. నీవు గట్టిగా (ధృడ నిశ్చయంతో) వచ్చెదవా అని ఆ కాచుకొని యున్నవాడు అనుమానిస్తాడు. కావున త్వరపడు.

పురుషులతో చెలిమి చేసిన వారు, వారి చేతిలో లొంగి వుండవలసి వస్తుంది. "చలములు సాధించ సంగతి కాదు" పట్టుదలలకు పోకూడదు. వలచిన వారిని యెన్నడూ వదలియుండరాదు. ఎప్పుడూ, పొలి యలుకలు చూప (రుస రుస లాడుట) పొసగదు (సరిపోదు).

సరసములాడుకొనే ప్రేయసీ ప్రియులు ఒకరిమాట ఇంకొకరు వినుటకు సిద్ధపడి వుండాలి. "నెరసులు పట్టేది" (ఒకరి తప్పులింకొకరు యెత్తి చూపటం), నేరుపు కాదు (తెలివైన పనికాదు). మరు తంత్రములవారు (శృంగార తంత్రములు వాడదలచినవారు) మంతనాలనుండవలె (ఒకరితో ఇంకొకరు మాట్లాడుకోవాలి గాని పోట్లాడుకోరాదు). సరసం విరసంగా మారి బజారుకెక్కారంటే అది మీకు సంతోషం కాదు కదా!

పరులసొమ్మునాసించువారు వినయ విధేయతలతో వుండవలెను. వారు అడియాస (ప్రత్యుపకారము జరుగుతుందనే ఆశతో) బొరలిన (వ్యవహరించుట) అందమైన పనికాదు. అలమేలుమంగవైన నీవు శ్రీ వేంకటేశ్వరునితో, అదరి (అతిశయించి) తడయక (తడబడకుండా) కూడినావు. ఇక మోహములు తగులాయెను (ఆసక్తికరములైనవి).

సంపుటి : 14 కీర్తన : ఆపెనా చెల్లెలు గాదా అందుకేమి

సంఖ్య : 491 పుట : 284 - రాగం : నారాయణి

6. **ఆపె నా చెల్లెలు గాదా అందుకేమి**
నా పొందు విడువ నని నమ్మించేవు నీవు **॥పల్లవి॥**

ప్రేమము గలిగినాపె ప్రియపడి మాటాడఁగా
నామోము చూచి యేమి నవ్వేవు నీవు
వేమరు గడ్డము వట్టి వేడుకొని పిలువఁగా
ఆముకొని నన్నేలప్పణడి గేవు నీవు **॥ఆపె॥**

వావి గలసినయాపె వలపులు చల్లఁగాను
సోవలుగా నా కేఁటికిఁ జూపేవు నీవు
కావరించి యిక్కువకు గనుసన్న సేయఁగా
భావించి నన్నెంత వొడఁబరచేవు నీవు **॥ఆపె॥**

పొరుగున నున్నయాపె భుజముపైఁ జెయి వేయఁగా
అరసి నన్నిట్టుగూడే వప్పటి నీవు
నిరతి శ్రీ వేంకటేశ నే నలమేలుమంగను
సిరుల నిచ్చకా లెన్ని సేసేవు నీవు **॥ఆపె॥**

ఉపోద్ఘాతము :

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవెన్ని చెప్పినా నీ పట్టపురాణిని నేనే. నిన్ను వలచి వలపించుకొన్నవారు వేలాది యుండవచ్చును. నాకేమి! నీపై ప్రేమతో ఎవ్వత్తైనా మాట్లాడితే పోనీ నాకేల? ఆమె నాకు చెల్లెలే అవుతుంది. మన పెళ్ళినాడు నా పొందు విడువనని 'నాతిచరామి' అని ఒట్టేశావు కదా! నన్ను నమ్మించావు గదా! ఆ పుణ్యం నీవే కట్టుకో.

తాత్పర్యము :

ఆమె నా చెల్లెలు అని, ఇచ్చకాలు యెన్నైనా చెబుతావు, దానకేముందిలే. నీకు వరుస అయినదని, చెప్పకనే, నాకు చెబుతున్నావు. పైగా నా పొందు (జంట) విడువనని నమ్మించటానికి మాయ మాటలు చెబుతున్నావు.

ఆమె నీ ప్రేయసి. అందుకని పరవశించి నీతో ప్రేమగా మాట్లాడుతుంది. దానికేం. కానీ ఆమె నీతో అట్లా మాట్లాడితే నా మొగములోకి చూచి ఎందుకు నవ్వుతావు? నిన్ను గడ్డము పట్టుకొని బ్రతిమిలాడుతోందని, ఆముకొని (మిక్కిలి చొరవతో) నన్నేల, అప్పణ (అనుమతి) అడుగుతావు? ఇదెక్కడి చోద్యం?

నీకు ఆమెకు వావి (చుట్టరికం) కలిసివుండవచ్చును గాక! ఆమె నీపై సోవలు (వలపులు) కుమ్మరించుతున్నదని, నాకెందుకు బుజువులు చూపిస్తున్నావు? ఆవిడకు కావరించి (మదమెక్కి) ఇక్కడికి రమ్మని సైగలు చేస్తే, దానికి భావము అది కాదని నన్నెందుకు నచ్చజెప్పాలని చూస్తావు ఎవరెట్లా పోతే నాకేమి?

ఆమె నీ పొరుగున వున్నదని చనువుగా ఆమె నీ భుజముపై చేయి వేయగానే, అరసి (పరవశించి) నన్ను ఈ విధముగా, అప్పటి (మరల మరల) కూడేవు. నిరతి (మిక్కిలి ఆసక్తిగల) ఓ శ్రీ వేంకటేశ్వరా! నేను అలమేలు మంగను. నీవు సిరులన్ ఇచ్చకాలు యన్నిసేసేవు? (వైభవోపేతమైన ఇచ్చకాలు యెన్ని ఆడుతున్నావు స్వామీ?

సంపుటి :14 కీర్తన : ఇంకనేల వెరపు యెదుటనే వున్నారము

సంఖ్య : 15 పుట : 10 - రాగం : మలహరి

7. ఇంకనేల వెరపు యెదుటనే వున్నారము
వంకలొత్తకిఁక మఱి వద్దు వద్దు ఇపుడు ॥పల్లవి॥

వావులు నీ కెంచనేల వాడల గొల్లెతలకు
దేవరపు గావా తెలిసినదే
యీవల మావంక నిట్టె యేమి చూచేవు తప్పక
మోవనాడితి మిదివో మొదలనే నేము ॥ఇంక॥

చందాలు చెప్పఁగ నేల సతినెత్తుక వచ్చితి-
విందుకు రాజవు గావా యెరిఁగినదే
దిందుపడి మమ్ము నేల తిట్టేవు పెదవులను
నిందవేసితి మిదివో నిన్ననే నేము ॥ఇంక॥

వెలినవ్వేల పదారు వేలఁ బెండ్లాడితివి
బలిమికాఁడవు గావా భావించినదే
చెలఁగి పులివిందల శ్రీ రంగదేవుఁడ వని
కలసితి మిదె శ్రీ వేంకటరాయ నేము. ॥ఇంక॥

ఉపోద్ఘాతము :

నేటి కడపజిల్లా పులివెందులలో నాడు వెలసిన శ్రీ రంగనాథ స్వామిపై శృంగార కీర్తన ఇది. పదియారు వేల భామలను పెండ్లాడిన వెలి నవ్వుల (ప్రకాశవంతమైన నవ్వులు) గల దిట్టవు కదా! నీ భావాలకు తగినట్లే ద్యోతక మవుతున్నావు. ఇంకా నీకు భయమెందుకు? మేము నీ ఎదుటనే వున్నాము. ఇప్పుడు మఱి వంకలు పెట్టొద్దు. వద్దు స్వామీ అంటున్నారు అన్నమయ్య. చాలా మాటలకు అర్థాలు యే నిఘంటువులోను దొరకలేదు.

తాత్పర్యము :

ఓ రంగనాథస్వామీ! ఇంకనేల వెరపు? (ఇంకా భయమెందుకు)? మేము నీ యెదుటనే వున్నారముకదా! మఱి ఇక వంకలు పెట్టవద్దు. ఇప్పుడు వంకలు పెట్టి లాభమేమి? స్వామీ!

మేమెంత? గొల్లవాడలలో వుండే గోపికలము. ఇక తెలిసినదే, నీవు దేవరవు గావా? (నీవు దేవ దేవుడవనే సంగతి తెలిసినదే కదా!) మఱి వావులు నీకెంచనేల? (మా వావి వరుస యెంచితే నీకు వొరిగేదేమిటి?) నేము (మేము) మొదలనే "మోవనాడితిమి" (నోటి మాటగా చెప్పాము... ఆ విషయం) ఈ వల (ఇప్పుడు) ఇట్లా మా వంక ఏమి చూచెదవు? ఇక నీ చందాలు (పద్ధతులు) చెప్పగనేల (చెప్పవలసిన అవసరమే లేదు) (అది యెరిగినదే. ఆనాడు సతినెత్తుక వచ్చేశావు). ఇందుకు రాజవు గావా? (ఇందులో నీవే మొనగాడివి, నీకు సాటిలేరు). మేమెవరికైనా నీ అఘాయిత్యం చెప్పామా? దిందువడి (నీచానికి దిగజారిపోయి) పెదవులతో మమ్మెందుకు నిందిస్తావు? నేము (మేము) నిన్ననే నిందవేసితిమి. (నీ మీద నింద గురించి చెప్పాము). ఇదిగో మమ్మల్ననవద్దు.

పులివెందులలో వెలసిన ఓ రంగనాథా! నీవు వెలినవ్వుల (ప్రకాశవంతమైన నవ్వులతోనున్న) బలిమికాడవు గావా? (మొనగాడివి కదా!) ఇట్లా గని మేము భావించినదే (వూహించినదే). అట్లు చెలగిన (వెల్లివిరిసిన) నిన్నే మేము ఈ తిరుమలలోనూ వేంకటరాయనిగా కలిసితిమి. ఇది మా భాగ్యము.

సంపుటి :14 కీర్తన : నమ్మినవారి పాలిటి నచ్చిన చింతామణి

సంఖ్య : 386 పుట : 224 - రాగం : దేసాక్షి

8. నమ్మినవారి పాలిటి నచ్చిన చింతామణి
నమ్మి వరాలిచ్చే విదే పదవేమి గడమా ॥పల్లవి॥

పూచిన తంగెడువంటి పొలిఁతి నీవురమున-
నేచినది నీ సింగార మేమి చెప్పేది
కాచి పండిన కల్పవృక్షమువలె నీ మేను
చేచేత దొరకెనిదె సిరులేమి గడమా ॥నమ్మి॥

అరచేతిమాణిక్యమై యాపె నీ పొత్తున
యెరుక సే శారగించీ నేమి చెప్పేది
గురుతైన నీలాల కొండవలె నీవు నీవు (?)
జరుగుచు నున్నారు జయమేమి గడమా ॥నమ్మి॥

ముంగిట నిధానమైన మోహపుటలమేల్మంగ
అంగమందే కొలువున్న దదివో నీకు
సంగతి శ్రీ వేంకటేశ సరిఁ బరుసవేదివై
సంగడి నున్నారు మాకు చనమే(వే?)మి గడమా ॥నమ్మి॥

ఉపోద్ఘాతము :

క్షీరసాగర మధనము జరిగినప్పుడు శ్రీ వేంకటేశ్వరుడైన నారాయణుని పరిణయమాడిన లక్ష్మీదేవి వుద్భవించినది. ఆనాడు ఆమెతోపాటు అనేక దివ్యసంపదలు తోడబుట్టినవి. చింతామణి, కల్పవృక్షము, పరుసవేది అట్టివే అందుచే దుర్లభమైనవి. కానీ ఈ స్వామి సులభుడు. ఈయన తోడుంటే "చనవేమి గడమా? (కోరిక తీరుట అనేదానికి కొరత వుంటుందా?) అంటున్నారు అన్నమయ్య.

తాత్పర్యము :

ఈ శ్రీ వేంకటేశ్వరుడు, నమ్మినవారి పాలిటి చింతామణి. నమ్మినవారికి నచ్చిన వరాలిచ్చేటటువంటి మహానుభావుడీయన. ఇదే ఈయన నాశ్రయించండి. "పదవేమి గడమా?" (ఆశించిన పదవి దొరకటం ఒక లెక్కా?)

ఓ ప్రభూ! నీ వురముపై పూచిన తంగేడు పుష్పము వంటి (ఎఱ్ఱని) పొలతిని యేచితివి (స్త్రీని ధరించావు), నీ శోభనేమని వర్ణించను? కాచి పండిన (రక్షించే) కల్పవృక్షమువంటి, నీ మేను (విగ్రహము) చేచేత (వెంటనే) దొరికినది. ఇక మాకే సిరి సంపదలు కొరవడతాయి? మాకేం తక్కువ.

అరచేతిలో మాణిక్యం వుంటే యెంత నిబ్బరంగా వుంటుంది? నీ పొత్తున (పక్కన) ఆమె (లక్ష్మీదేవి) యెరుకసేసి (తన వునికి తెలుపుతూ) ఆరగించీని (మా నివేదన స్వీకరిస్తోంది). మా భాగ్యమేమని వర్ణించను? నీవు ప్రసిద్ధి చెందిన ఇంద్రనీలమణి కొండవలెనున్నావు. మీరు వూరేగింపుగా జరుగుచున్నారు. ఇక మాకు జయము నీకు కొదవేముంటుంది?

ప్రభూ! నీముంగిట (యెదురుగా) నిధానము వలె (పెన్నిధివలె) సమ్మోహకరమైన అలమేల్మంగ, అంగమంది (సాకారముగా) కొలువైవున్నది. ఓ శ్రీ వేంకటేశ్వరా! అదివో నీకు సరి సంగతి (జోడై) వున్న ఆమెతో కూడిన నీవు, మాకు పరుసవేది (స్పర్శవేది... దానితో ముట్టుకుంటే ఏదైనా బంగారం అవుతుంది) వలె నున్నారు. ఇక మాకు చనవు (కోరిక తీరుటకు) యేమి కొరత అవుతుంది తండ్రీ?

సంపుటి :14 కీర్తన : మేమేమి సేతుము మాకు మీరే

సంఖ్య : 454 పుట : 263 - రాగం : దేసాక్షి

9. **మే మేమి సేతుము మాకు మీరే దిక్కు**
చేముట్టిరా దితనిఁ జిత్తగించవమ్మా **॥పల్లవి॥**

వోయశోద నీ కొడుకు వూరిపడుచులుఁ దాను
ఖోయని వుట్లు గొట్టీఁ గోలలఁగొని
చాయల జోరునఁ గారీ చమరుఁ బాలుఁ బెరుగు
సోయగపు నీ కన్నులఁ జూతువు రావమ్మా **॥మేమే॥**

కొత్త జవ్వను లైన కొమ్మలచన్నులు తేనె-
దుత్తలంటా పొందించ దొరకొనీని
మొత్తములై యున్నారు ముంగిళ్ళ నెల్లాఁ దామే
గుత్తముగ నీవే కనుఁగొందువు రావమ్మా **॥మేమే॥**

చేరలమేల్మంగఁ గూడి శ్రీ వేంకటాద్రిమీఁద
వీరుఁడె యేఁగీని వీది వీథుల
కూరిమి మేము నవ్వితే గుట్టున సన్నలు సేసీ
తేరకొన యిది నీవే తిలకించవమ్మా **॥మేమే॥**

ఉపోద్ఘాతము :

రేపల్లెలోని గోపికలు వచ్చి యశోద దగ్గర మొరపెట్టుకుంటున్నారు. కృష్ణయ్య పాలు, వెన్న దొంగతనం చేస్తున్నాడనే కాదు, గోపెమ్మలతో అఘాయిత్యం చేస్తున్నాడని. వేంకటేశ్వరుడు తిరుమల వీధులలో వూరేగుతుంటే అన్నమయ్య పాడుతున్న ఈ కీర్తనలో యౌవన తొలకరిలోనున్న నల్లనయ్య చేసిన కొంటె చేష్టలెలా వున్నాయో చూడండి.

తాత్పర్యము :

ఓ యశోదాదేవీ! మీరు పెద్దవాళ్ళు. మేము చిన్నవాళ్ళము. మేము నీకేమని చెప్పము. మేమేమి చేయగలము? మాకు మీరే దిక్కు. ఈ కృష్ణుడున్నాడే... ఇతనిని చేతులతో పట్టుకోవటం అసాధ్యం. మా బాధలను కాస్త చిత్తగించవమ్మా!

ఓ యశోదా! నీ కొడుకు వూరి పడుచుల చాయల దాగి "ఖో"యని వులిక్కిపడేట్లు చేసి, వారి ఉట్లు తన కోలలతో (కర్రలతో) పగులకొడతాడు. వాటిలో దాచిన పాలు పెరుగు జోరుగా కారిపోతుంటే వాటిని చమరుతాడు, (తన అరచేత్తో కొట్టి నేలసంతా చిత్తడి చేస్తాడు). సోయగపు (అందమైన) నీ కళ్ళతో నీవే చూద్దువుగాని రావమ్మా!

ఓ యశోదా! అప్పుడే పుష్పవతులైన అమ్మాయిల తొమ్ములను "తేనె కుండలు బాగున్నాయే.." అంటూ పొందికగా పట్టుకొంటాడు. వాడి బాధపడలేని వాళ్ళంతా నీ ముంగిట జేరి మొత్తుకుంటున్నారు. తామంతా గుత్తముగా (గుంపుగా) చేరి నీ దగ్గరకొచ్చారు. రావమ్మా! నీ కళ్ళతో నీవే చూడు!

చేసినవన్నీ చేసి, నేడు బుద్ధిమంతుడిలా అలమేల్మంగతో చేరి శ్రీ వేంకటేశ్వరుడైన వీరాధివీరుడేవాడు. చూడండి ఈ తిరుమల వీధి వీధులలో యేగీని (వూరేగుతున్నాడు). మేము ఆయనను చూచి నవ్వితే.. మాకు కూడా గుట్టున (రహస్యముగా) సన్నలు సేసీని (సైగలు చేస్తున్నాడు). నేడు నీవే వకుళాదేవివి కదా! తేరకొని (నిదానంగా) ఇది నీవే చూడవమ్మా! ఆనాటి చిలిపితనం ఇంకా పోనేలేదు.

సంపుటి :14 కీర్తన : వేడుక కాడవొదువు విట్ఠలేశా నాకు

సంఖ్య : 281 పుట : 164 - రాగం : లలిత

10. వేడుక కాఁడవొదువు విట్ఠలేశా నాకు
వీడేమిచ్చేవప్పటిని విట్ఠలేశా ॥పల్లవి॥

వాసితో నీవద్ద దలవంచుకొంటేనంతలోనే
వేసేవు పూవులఁ గొని విట్ఠలేశా
ఆసపడి నీమీఁద నాకానలేల పెట్టేవు
వీసమంత పనికైన విట్ఠలేశా ॥వేడు॥

సన్నల నీవద్ద నేను సమ్మతించకుండఁగానే
వెన్నెల నవ్వు నవ్వేవు విట్ఠలేశా
చన్నులంటి వూరకైనా సరసములాడేవు
విన్న కన్న సుద్దిగాడు విట్ఠలేశా ॥వేడు॥

పలుకకుండితే నాతో బండుఁబూతుఁ గెలసేవు
వెలయ శ్రీ వేంకటాద్రివిట్ఠలేశా
బలిమి నన్నుఁగూడఁగా బనులెల్లాఁ జక్కనాయ
వెలుపలే లోనాయ విట్ఠలేశా ॥వేడు॥

ఉపోద్ఘాతము :

వేడుకకాడు (విలసపురుషుడు) అయిన విట్ఠలేశుని పై అన్నమయ్య శృంగార కీర్తన చెబుతున్నారు. నాయిక పాడుతున్న ఈ కీర్తనలో తను (నాయిక) మౌనవ్రతం పట్టితే విట్ఠలేశుడు బండ బూతులు తిడతాడట. నన్ను కూడితే నీ పనులన్నీ చక్కబడతాయి అని నచ్చ చెబుతున్నారు, స్వామికి.

తాత్పర్యము :

ఓ విట్ఠలేశా! నీవు గొప్ప వేడుక కాడవయ్యా! (విలాస పురుషుడవు) నాకు అప్పటికి (మళ్ళీ) వీడెమిచ్చేవు (రమ్మనమని తాంబూలమిచ్చి ఆహ్వానించుచున్నావు).

వాసితో (నీ ఆధిక్యతను గుర్తించి) నేను నీ వద్ద తలవంచాను. అంతలోనే నీవు పూవులను తీసికొని నాపై వేసినావు. నా చేత ఇప్పుడు ఏ చిన్నపని చేయించుకోవాలన్నా నీమీద 'ఒట్లు' పెట్టుకొంటావు. ఓ విట్ఠలేశా! నేను నీపై ఆశపడిన మాట వాస్తవమే... కాని నాపై ఇంత దాష్టీకం తగదు.

నీ దగ్గర నేనింకా నీ సైగలను ఆమోదించనే లేదు. నీవు వెన్నెలనవ్వులు (మనోహరమైన చల్లని నవ్వులు వెదజల్లుతున్నావు). నా కుచములను వూరకే, చీటికీ మాటికీ తాకుతూ సరసోక్తులు పలుకుతావు. విట్ఠలేశా! నీవు విన్న కన్న సుద్దికాడు (గొప్పమాటకారివి, ఎన్నడు వినలేదు చూడలేదు.. ఇటువంటి వాడిని).

నీ ప్రవర్తనకు నేను విసిగిపోయి, మాట్లాడటం మానేశానంటే వరుస బెట్టి బండు బూతులు (అసహ్యమైన తిట్లు) తిడతావు. స్త్రీనని కూడా ఆలోచించవు. నీవు శ్రీ వేంకటాద్రి మీద వెలసిన విట్ఠలేశుడవు. నన్ను నీవు బలవంతుడవై కూడితివి. నా పనులన్నీ జక్కనాయ (నెరవేరినవి). వెలుపలే లోనాయ (నేను బహిరంగంగానే... నీకు లొంగిపోయాను). ఓ విట్ఠలేశా! నీకు లొంగని వారెవరు ప్రభూ!

సంపుటి :14 కీర్తన : వేడుక కాడుదమ్మ విజనగరములోన

సంఖ్య : 294 పుట : 171 - రాగం : సామంతం

11. వేడుక కాఁడు గదమ్మ విజనగరములోన
వేడె వెట్టీ సతులను వెన్న ముద్ద కృష్ణఁడు ॥పల్లవి॥

ఇంటిలో నా మొగఁడు నే నిద్దరమునున్న వేళ
వొంటినే తాఁజొచ్చి వచ్చీనోయమ్మలాల
దంట తనమున నేను తనకన్నులు మాసితే
చంటికి చేతులు చాఁచీ జాణఁడే యీ కృష్ణుడు ॥వేడు॥

కమ్మర మాయాతఁడు నేఁ గాఁగిలించుకుండఁగాను
వుమ్మడిఁ దా మోవి యిచ్చీనోయమమలాల
చిమ్ముచు నే నంతలోన సిగ్గువడితే నాపక్క
నిమ్ముసేసుకొని పండీనిదివో యీ కృష్ణుడు ॥వేడు॥

పేరుకొని నా విభునిఁ బిలిచితేనూ ఁకొని
వూరకె తా వచ్చికూడె నోయమ్మలాల
యీరీతి శ్రీ వేంకటాద్రినిరవై యీడా నాడ
కూరిములు వెదచల్లీ గోపాలకృష్ణుడు ॥వేడు॥

ఉపోద్ఘాతము :

విజయనగరంలో వెలసిన గోపాలకృష్ణుని కొంటె చేష్టలు వివరిస్తున్నారు అన్నమయ్య. ఆ గోపాల కృష్ణుడు వేడుకగాడట. వెన్నముద్దలు తినే ఈ కృష్ణుడు వెట్టి సతులను (గొల్లభామలను) వెన్న కావాలని వేడుకొన్నాడట. ఇక భర్తచాటున భార్యల్ని కూడా తన చిలిపి పనులతో వేధించాడట. ఏమా పనులు?

తాత్పర్యము :

ఓ ఇంతులారా! విజయ నగరములో వెలసిన ఈ గోపాలకృష్ణుడు వెన్నముద్దలు తినే వేడుకకాడు (విలాస పురుషుడు) కదటమ్మా! ఆ వెన్నముద్దలను కూడా వెట్టి సతుల (వెట్టి చాకిరీ చేసే గోపికల దగ్గర) వేడె (యాచిస్తాడు).

మా ఇంటిలో, నేను నా మొగుడు ఇద్దరము వున్న వేళ తాను ఒంటరిగా నక్కి వస్తాడమ్మా! ఈ కృష్ణుడు. దంటతనమున (నేర్పరితనంతో) నేను అతని కళ్ళు వెనకనుంచి మూస్తే... వెనక్కి చేతులు చాచి నాకు కుచములను పట్టు కొంటాడు. ఈ కృష్ణుడ గొప్ప జాణడు (చతురుడు, నంగనాచి).

ఓయమ్మలారా! కమ్మర (మళ్ళీ ఒకసారి) మాయాతడు (మా ఆయన) నేను కౌగలించుకుని వుంటే... తను మధ్యలో దూరి తన పెదవులు నాకందించాడు. నా వెట్టి మొగుడికి జరిగింది తెలియలేదు కానీ, నేను సిగ్గుతో చితికి పోయాను. అంతతో వదిలాడా.. ఇమ్ము సేసుకొని (మెల్లిగా నా పక్కన చోటు చేసుకొని) ఇదిగో ఈ కృష్ణుడు పడుకున్నాడు, (ఎవరన్నా చూస్తే నా గతి ఏమయ్యేది?)

ఓయమ్మలారా! నేను నా మొగుడ్ని పేరు పెట్టి పిలిస్తే ఆయన బదులు ఈ గోపాలకృష్ణుడు 'ఊ కొని' (ఊ కొట్టి) అనవసరంగా తను వచ్చి నాతో రమించాడు. ఇట్లాంటి చిలిపివాడు. ఇక్కడ విజయనగరంలోనే కాదు, అక్కడ శ్రీ వేంకటాద్రి మీద కూడా ఉన్నాడు. ఈ దేవదేవుడు కూరిములను (ప్రేమలను) వెదజల్లుతాడు. ఇదంతా మన అదృష్టమే సుమా!

సంపుటి :13 కీర్తన : ఐతివే యేలికెసాని వందరికిని

సంఖ్య : 151 పుట : 91 - రాగం : ఆహిరి

12. ఐతివే యేలికెసాని వందరికిని
నీతితో సవతులెల్ల నీకు లోనే యిఁకను ॥పల్లవి॥

ఆరసి నీ కాతఁడు అరవడమచ్చునే
పేరు రాన నేపొద్దుఁ బెట్టుకున్నాఁడు
సారెకు నీవు మంచి సకినాన వచ్చితివే
యీరాని చనవులెల్లా నిచ్చినాఁడు నీకు ॥ఐతివే॥

పొందుల నీకాతనికి పొంతనాలు గూడునే
మందలించి నీవాడినమాట దోయఁడు
యెందును నీమొకమాయ మందు యెటువంటిదే
కందువ నీ మోవికే కాచుకున్నాఁ డిపుడు ॥ఐతివే॥

చెలఁగి మంచివేళనే సేస నీవు వెట్టితివే
కలసి పాయఁడు శ్రీ వేంకటేశ్వరుడు
అలరి మమ్మేలెనాతఁడప్పణ నీవిచ్చితివే
వలపించ నేరుతువే వసమాయ నతఁడు ॥ఐతివే॥

ఉపోద్ఘాతము :

స్వామిపై మరులు గొనిన నాయికను హెచ్చరించి హితవు చెబుతున్నారు అన్నమయ్య. నీవు అందరికీ 'యేలికసాని' (రాజవేశ్య) వయ్యావు. ఇపడు నీకు ఆయన వలపు కత్తెలందరూ సవతులే. నీతితో ఆలోచిస్తే వాళ్ళంతా నీకు 'లోనే' (లొంగియుండవలసినవారే). మా కందరికీ 'ఏలిక' అయిన స్వామికి నిన్ను నీవే అర్పించుకొన్నావు. వలచి వలపించుకోవటం తెలిసినదానివి అందుకే నీకు ఆయన వశమైపోయాడు. అని కితాబునిస్తున్నారు.

తాత్పర్యము :

(ఓ చెలియా!) మొత్తానికి అందరికిని (స్వామిని వలచిన వారందరికీ) నీవు 'యేలికసాని' (రాజవేశ్య)వైపోయావు. ఆయనను వలచిన మా బోటి సామాన్యులందరూ నీ సవతులు. ఇక నీతో (న్యాయప్రకారము) ఈ సవతులందరూ నీకు 'లోనే' లొంగియుండవలసినవారే.

నీకు (నిన్ను) ఆయన కావాలని 'ఏపొద్దూ' (అన్నివేళలా), అచ్చునే (అచ్చముగా), 'పేరురాన' (ప్రేమతో) అరవడము పెట్టుకొన్నాడు (వుంచుకున్నాడు) ఆయన ఇష్టం. నీవు సారెకు (ఈ పర్యాయము) మంచి 'సకినాన వచ్చితివి. (శకునం చూసి వచ్చినట్లున్నావు), నీకు ఆయన ఇయ్యకూడని స్వాతంత్ర్యము ఇచ్చాడు. ఇకనేం.. యేలికసానివైపోయావు.

నీకు ఆయనకు పొందుల (కూటములలో) పొంతనాలు గూడునే (మంచి స్నేహము కలిసినది). నీవాడిన మాటను ఆయన దోయడు (మందలించి కాదనలేడు). యెందును (ఇక యెప్పుడైనా), ఆయనకు నీమొకమాయ మందు (నీ అందమైన ముఖము మందు అయిపోయింది). ఎటువంటిదే.. ఇప్పుడు నీ తీయటి అధరామృతం కోసం కాచుకొనియున్నాడు.

ఓ సఖీ! చెలగి (ఉత్సుకతతో) నీవు మంచివేళనే, సేసవెట్టితివి (ఆ స్వామి ఆశీర్వాదం పొందినావు). ఈ శ్రీవేంకటేశ్వరుడు నిన్ను కలసి పాయడు (నీపొందు విడువడు). నీ పొందువలన అలరి (తృప్తుడై) స్వామి మిమ్మల్ని కూడా యేలె (మన్నించినాడు). ఆయన అందరినీ ఏలే శృంగారరాయడు కదా!

సంపుటి :13 కీర్తన : చూతువు రావయ్యా సుదతిలాగు

సంఖ్య : 38 పుట : 23 - రాగం : శ్రీరాగం

13. చూతువు రావయ్యా సుదతిలాగు
చేతిమీఁది చెక్కుతోడ సిగ్గువడి వున్నది ॥పల్లవి॥

చెప్ప రానిమాటలు చెలి విన్నవించరాక
వుప్పతిల్లువలపుల నూరకున్నది
ఇప్పుడు నీవే విచ్చేసి యేకతాన నన్నీ విను
దప్పిదేరే మోముతోడ తలవంచుకున్నది ॥చూతు॥

భావములో కోరికలు బయలుసేయఁగ రాక
సోవలచెమటతోడ జొబ్బిలున్నది
వోవరిలోనికి వచ్చి వొరసి నీవే యడుగు
కావిరి నివ్వెరఁగులఁ గమ్ముకొని వున్నది ॥చూతువు॥

రతిలో రహస్యములు రవ్వలు సేయఁగ రాక
అతితమకముతోడ నలశున్నది
తతి శ్రీ వేంకటేశుఁడ దండనుండి కూడితివి
మతి నీవే యాసవపడి మంచముపై నున్నది ॥చూతు॥

ఉపోద్ఘాతము :

నాయికదైన్యావస్థను వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఆమెకు రతి రహస్యాలు రవ్వలు సేయగ రాక (వెలువరించలేక) అతి తన్మయత్వంతో అలసిపోయి వున్నద. ఈ సుదతి అవస్థ చూతువుగాని రావయ్యా! చేతిమీద చెక్కుతోడ సిగ్గుపడి వున్నది, అంటున్నారు. ప్రాసకోసం అలా అన్నప్పటికీ ఆమె చెక్కిలి మీదనే చెయ్యివేసుకొని సిగ్గుపడి వున్నది.

తాత్పర్యము :

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవే చూతువు రావయ్యా! ఈమెకు నీపై ఎంతలాగు (ఆకర్షణ) కలిగివున్నదో చూడుము. ఈమె తన చెక్కిలిపై చేయి వేసికొని మిక్కిలి సిగ్గుపడి వున్నది.

తల వలపులు వుప్పతిల్లుచుండగా (ఉత్పత్తియగుచుండగా) ఆమె వాటిని నీకు విన్నవించుట చేతకాక, మాటలలో చెప్పలేక మౌనముగానుండి పోయినది. ఇప్పుడు నీవే విచ్చేసి ఏకాగ్రతతో ఆమె చెప్పేదంతా విను. దప్పిదేరే (తనివి తీరిన) ముఖము కలిగినదై తలవంచుకొని యున్నది.

తన భావనలలో నున్న కోరికలను బహిర్గతము చేయలేక చిరు చెమటలలో చిత్తడి అయిపోయినది. కావాలంటే వోవరిలోనికి వచ్చి (అంతఃపురంలోకి వచ్చి) వొరసి (చూచి) నీవే అడుగు ఆమెను. ఆమె కావిరి (దట్టమైన) నివ్వెరగుల (పారవశ్యము) కమ్ముకొని యున్నది.

ఈ సుదతి (యువతి) రతి రహస్యములను రవ్వలు సేయగరాక (బహిర్గతము జేయలేక) మిక్కిలి తన్మయత్వంతో అలసిపోయివున్నది. ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవు దండ నుండి (ఆమె సమీపముననే యుండి) ఆమెను నీవే మతి (సమ్మతించి) కూడితివి. ఆమె యెట్లున్నదో చూచితివా ప్రభూ! యాసవపడి (యాసపడి... (అయివుంటుంది...) మంచముపై నీ కొరకు నిరీక్షించుచున్నది.

నోట్ : ఇది నా వూహకు తట్టిన వివరణము.

సంపుటి :13 కీర్తన : అటు చూడు సతి నేర్పులవుభళేశ

సంఖ్య : 471 పుట : 283 - రాగం : రామక్రియ

14. అటు చూడు సతినేర్పు లవుభళేశ
అటమటములు గావు అవుభళేశా ॥పల్లవి॥

యెదురుఁ గొండలమీఁద నెక్కినట్టి లకిమమ్మ
అదివో నీతొడ యెక్కెనౌభళేశ
వుదుటున నంతలోనే వురముపై నెలకొని
అదిమీఁ జన్నుల నిన్ను నౌభళేశా ॥అటు॥

ముంగోపముతోడను మొక్కలీఁడవైన నిన్ను
నంగన గద్దెపైఁ బెట్టె నౌభళేశ
కంగక వేదాద్రి నిన్ను గరుడాద్రికిఁ దీసె
అంగాలంటె నింటిలోన నౌభళేశా ॥అటు॥

చేరి నీవు నవ నారసింహరూపులైతేఁ జెలి
ఆ రీతుల నిన్నుఁగూడె నౌభళేశ
గారవాన నీవు శ్రీ వేంకటముపై నుండఁగాను
ఆరసి రతి మెప్పించె నౌభళేశా ॥అటు॥

ఉపోద్ఘాతము :

అహోబల నవనారసింహునిపై సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆయన నవరూపులవాడైతే 'లకిమమ్మ' (ఆదిలక్ష్మి) కూడా ఆయనను నవ విధములుగా అలరించిందట. ఆ సతి నేర్పులు అటు చూడవయ్యా అవుభళేశా! (అహోబలేశ్వరా!) అటమటలుగావు (ఆమెప్రేమ నిజమైనది వంచనలు లేని నిర్మలమైన ప్రేమ). నీవే, వేంకట గిరిపైనున్నావని, నీ వురముపై నెలకొని రతి మెప్పించినదట.

తాత్పర్యము :

ఓ అవుభళేశ! (అహోబల నారసింహా!) నీ సతి నేర్పును అటు వొక్కసారి చూడవయ్యా! ఆమె నీపై చూపించు వలపు స్వచ్ఛమైనది. అటమటలు గావు (అందులో వంచనలు లేవు).

అదివో ఎదురు కొండలమీదనెక్కిన లకుమమ్మ (అదిగో నీ అహోబలపు యెదురుగానున్న గరుడాద్రి కొండలపై లక్ష్మీదేవి). ఆమె నీ తొడపై యెక్కి కూర్చున్నది. అంతలోనే వుదటన (గర్వముతో) నీ వురముపై నెలకొని నిను తన కుచయుగ్మముతో అదుముచున్నది. ఓ అవుభళేశా! ఆమె ఆ విధముగా నిన్ను అలరించుచున్నది.

ఓ అవుభళేశా! మొక్కలీడువైన (శూరుడవైన) నీవు గద్దెపై (సింహాసనముపై) కూర్చుండగా నీవు ముంగోపముతో నున్నావని అంగన (లక్ష్మీదేవి) నీతో చేరగా నీ భక్తులను కరుణించుచున్నావు. వెనుదీయక వేదాద్రిపై నిన్ను గరుడాద్రికి తెచ్చి, ఇంటిలో (పడకటింటిలో), అంగాలంటె (కౌగలించినది).

ఓ ఔబలేశా! నీవు అహోబలమున చేరియుండి నవ విధములైన నారసింహునిగా వెలసితివి. నీతోపాటు నీ అంగనకూడా ఆ రీతుల జేరి నిన్ను గూడెను. నీవు గారవాన (గౌరవముతో) శ్రీ వేంకటాద్రిపై శ్రీ వేంకటేశ్వరునిగా నుండగా నీదేవేరి కూడా అలమేలు మంగయై నిన్ను రతిలో మెప్పించినది. ఓ ఔబలేశా! అమె నీకు తగిన జంట, ప్రభూ!

సంపుటి :13 కీర్తన : సిగ్గువడ డిదివో చెలులాల

సంఖ్య : 128 పుట : 77 - రాగం : సాళంగనాట

15. సిగ్గువడc డిదివో చెలులాల
వెగ్గలపు సంతోసాన విఱ్ఱవీcగీని ॥పల్లవి॥

వాcడివో గోవిందరాజు వలపులు చల్లుతాను
పోcడిమితోc బవ్వళించి భోగించీని
కోcడి కోcడి(?) చూపులను కొమ్మలు చూడcగాను
నాcడు నేcడు వొక్కరీతి నవ్వు నవ్వీని ॥సిగ్గు

సంకుc జక్రములతోడ చంద్రగావి రెంటెముతో
కంకణముల చాcచిన కరములతో
వుంకువ కానికలు వువిదలియ్యcగాను
సంకెలేక మోవితేనె చవి చూపీని ॥సిగ్గు॥

బంగారు కటారమదే పానుపు శేషుcడు వాcడే
సింగారపు వేడుకలc జెలcగీ నదే
చెంగటc బెండ్లాడుతాను శ్రీ వేంకటేశుcడు దానే
వుంగరపు వేలు చూపి వొద్దికయ్యీని ॥సిగ్గు॥

ఉపోద్ఘాతము :

గోవిందరాజస్వామిని తిరుపతిలో సేవిస్తూ అన్నమయ్య చెప్పిన శృంగార కీర్తన ఇది.ఒకటి రెండు పదాలకి ఇదమిత్థంగా అర్థం తెలియకపోయినప్పటికీ సందర్భానుసారంగా ఆ పదములకర్థం భావించవలసి వచ్చింది. ఎందుకంటే అన్నమయ్య రాయలసీమలో ఆనాటి ప్రజల భాషను వాడినారు. కన్నడ, తమిళ భాషల ఒరవడి ఆయన వాడిన పదాలలో కనిపిస్తుంది. రాగి రేకులపై వ్రాసిన వారి

పొరబాట్లు వుండనే వున్నాయి. తాటియాకులపై వ్రాసిన వారి పొరబాట్లు వాటికి తోడై కొన్ని పదాలకు అర్థం వూహించవలసి వస్తున్నది.

తాత్పర్యము :

ఓ సఖియలారా! ఈ గోవిందరాజ స్వామిని చూచితిరా! ఇదిగో ఏమాత్రమూ సిగ్గుపడని ఈ స్వామి వెగ్గలపు సంతోసాన (మిక్కిలి ఆనందముతో) విఱ్ఱ వీగుచున్నాడు.

ఓ చెలియలారా! వాడివో గోవిందరాజు (వాడేనమ్మా గోవిందరాజంటే). ఆయన వలపులు చిందిస్తూ పోడిమితో (సౌఖ్యముతో) పవళించి భోగించుచున్నాడు. కోcడి కోcడి చూపులు (ఆ ప్రక్కా, ఈ ప్రక్కా వాటుగా అటూ ఇటూ కనుగుడ్లు తిప్పుతూ చూచుట) తన ఇద్దరు కొమ్మలను (స్త్రీలను... శ్రీదేవి భూదేవీలను) చూస్తూ, నాడు (పురాణికాలంలోనూ) నేడూ (ఈరోజున) ఒకేవిధంగా నవ్వుతూ పడుకొనియున్నాడు.

ఈ గోవిందరాజు సంకుజక్రములతో (శంఖ చక్రములు) ధరించియున్నాడు. చంద్రగావి రెంటెముతో వున్నాడు. (సింధూరపు రంగు గల జంట వస్త్రములు ధరించి యున్నాడు). చాచిన చేతులకు కంకణములు ధరించియున్నాడు. ఉంకువ కానికలు (వసూలు చేసిన కానుకలను) వనితలు (శ్రీదేవి భూదేవి) ఆయన కర్పించగా లెక్కలేనన్ని పర్యాయములు వారి అధరామృతములను జుర్రుకొనుచున్నాడు.

ఈ స్వామి శేషతల్పశాయియై బంగారు కటారము (పెద్ద ఖడ్గము) ధరించి యున్నాడు. శృంగార లీలలను ప్రదర్శించుచున్నాడు. తన కాంతలకు దగ్గరయై పెండ్లాడుచున్నాడు. తానే శ్రీ వేంకటేశ్వరుడునూ అవుటజేత ఇదిగో ఇక్కడ తన వుంగరం వేలు చూపిస్తూ నేను మీవాడినే అని నమ్మకంగా చెబుతున్నాడు.

సంపుటి :13 కీర్తన : మగువను దయజూడు మగవాడి

సంఖ్య : 265 పుట : 159 - రాగం : శోక వరాళి

16. మగువను దయఁజూడు మగపాడి
యిగురుమోవి యిచ్చుటిది మగపాడి ॥పల్లవి॥

చెక్కిటి చేతితోడి చెలి సిగ్గుదేరిచి
మక్కువ సేయించుకుంటే మగపాడి
అక్కజపు విరహాన నసురుసురై యుండఁగ
ఇక్కువలంటి మన్నించుటిది మగపాడి ॥మగువ॥

చినుకుఁ జెమట మేని చింతతోడ నున్నదాని
మనసు రంజిలించుటే మగపాడి
తనివోని కోరికతో తలవంచుకుండఁగాను
యెనసి నవ్వు నవ్వించుటిది మగపాడ ॥మగువ॥

చాటుచు నీకుఁ బ్రియాలు సారెసారెఁ జెప్పఁగాను
మాటలాలించి వినుటే మగపాడి
ఆఁటదని చిత్తగించి అట్టే యీకెఁ గూడితివి
యీటున శ్రీ వేంకటేశ యిది మగపాడి ॥మగువ॥

ఉపోద్ఘాతము :

'మోగపాడి' (మొగతనం) అంటే మీసాలు మెలేసి, అహంకారం ప్రదర్శిస్తూ పెళ్ళాన్ని 'చెప్పుల్లాగా' వాడుకోవటం కాదు. భార్యని సుఖపెట్టగలవాడే భర్త. ఆమె మనస్సు నెరిగి రంజింపచేయాలి. ఈమె (అలమేల్మంగ) ను అట్టే గూడితివి యీటున, శ్రీ వేంకటేశ ఇదయ్యా 'మగపాడి' అంటే అని నిశ్చయించారు అన్నమయ్య. మగువని దయతో చూడటమే మొగతనం కానీ పదిమంది పిల్లల్ని పుట్టించడం కాదు.

తాత్పర్యము :

ఓ శ్రీవేంకటేశ్వరా! మగువను (భార్యను) దయగ జూచుట మగపాడి (మొగతనం) అనిపించుకొంటుంది. ప్రతి రేయీ ఆమెకు ప్రేమతో యిగురుమోవి (లేత అధరము) నందించుట మగపాడి.

ప్రభూ! తన చెక్కిళ్ళకు చేతినడ్డుపెట్టి సిగ్గుపడే చెలియను సిగ్గులనుండి దూరంచేసి ప్రేమింపచేసికొనుటే మగపాడి. ఆ విరహోత్కంఠిత, అచ్చెరువు కలిగించు విరహమున యసురుసరని (ఉస్సురుమని) నిట్టూర్చుచుండగా, ఇక్కువలంటి (ఆవైన తెలిసికొని) ఆమెను మన్నించుట, మొగతనము. ఆమెను లెక్క చేయనివాడేం మొగాడు?

ప్రభూ! భర్త ఇంకా రాడేమిటో అనే వ్యధతో మేనిపై చెమటలు చినుకులు వెల రాలుతుంటే దాని నాదరించి, ఆమె మనస్సును రంజింపచేయుట (సంతోష పెట్టుట) మగపాడి. తనివి దీరని కాంక్షతో తరుణి తలవంచికొని తహతహ లాడుతుంటే, యెనసి (పొంది) ఆమెను సుఖపెట్టి నవ్వులు నవ్వించుట మగపాడి అనిపించుకుంటుంది. (ఆరు అడుగుల పొడవు, ఆరి తేరిన కండలు కాదు మగపాడి అంటే...)

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీకు తనప్రేమలను మాటి మాటికీ చెప్పుకొనే చిన్నదానిని మాట్లాడించి, ఆమె తన 'మనోగతం' తనే చాటుచుండగా వినుటయే మగపాడి. ఆటదాని (స్త్రీయని) చిత్తగించి (ఆమెను అర్థం చేసికొని) (ఈకెను) ఈమెను అట్టే గూడితివి. ఈటున (ఇక్కడ 'ఈటు' అనే మాట ఈ విధముగా అనే అర్థంలో వాడబడింది), తిరుమలేశా! ఇదయ్యా మగపాడి అంటే.

సంపుటి :13 కీర్తన : నాకెంత ప్రియము చెప్పీ నాటకీడు

సంఖ్య : 501 పుట : 301 - రాగం : మాళవ గౌళ

17. నాకెంత ప్రియము చెప్పీ నాఁటకీఁడు
కైకొని పొదిగీ నట్టే కాతరీఁడు ॥పల్లవి॥

వన్నెలఁ జెరఁగువట్టి వద్దఁగూచుండఁ బెట్టుక
యెన్ని మాటలాడి నాతో నెమ్మోకాఁడు
కిన్నెర నాచేతికిచ్చి కిణకిణ వాయింపించి
అన్నిటా మెచ్చీఁగదె ఆసోదకాఁడు ॥నాకెంత॥

వూరకే నేనుండఁగాను వొళ్ళిమీఁదఁ జేయివేసి
సారెకెంత నవ్వీనే జాణకాఁడు
మేరమీఱి జూజాలాడి మిక్కిలి తానే వోడి
కూరిమేమి గొసరీనే కోడెకాఁడు ॥నాకెంత॥

తనివిదీరక వచ్చి తనకు నే మొక్కఁగాను
పనులెన్ని చెప్పీనే పంతగాఁడు
చనవిచ్చి శ్రీ వేంకటేశ్వరుడు తానె నన్నేలె
ననుపు తానెంత సేసీ నాలికాఁడు ॥నాకెంత॥

ఉపోద్ఘాతము :

నాయిక శ్రీ వేంకటేశ్వరుని యేమంటోందో వినండి. ఆయన నాటకీడట, కాతరీడట, నెమ్మోకాడట, జాణకాడట, కోడెకాడట, పంతగాడట, నాలికాడట, ఆసోదకాడట, అలా యెందుకంటున్నాడో వివరిస్తున్నారు, అన్నమయ్య. దురదృష్టమేమంటే ఆనాటి తెలుగు అర్థం చేసికోవడం అంత తేలిక కాదు.

తాత్పర్యము :

ఆహా! నాటకీడు (నాటకాలరాయుడు) నాకెంత ప్రియము చెప్పీ (ప్రేమ గుమ్మరించే మాటలు చెబుతాడు!!) ఆ కాతరీడు (కలతపెట్టు స్వభావం కలవాడు) నన్ను కైకొని (పూనుకొని) అట్టే (తేలికగా) పొదిగీని (ఆక్రమించుకొంటాడు).

ఈ నెమ్మికాడు (ప్రేమికుడు) రంగులీను నా చీరకొంగు పట్టుకొని తనవద్ద కూర్చుండబెట్టుకొని యెన్ని మాయ మాటలు చెబుతాడు!! నా చేతికి కిన్నెర అనే వాయిద్యం ఇచ్చి దానిని కిణకిణ అనేట్లు మ్రోగింపజేసి, భళీ! యెంత అద్భుతంగా వాయించావు అని నన్ను వుబ్బిస్తాడు. ఎంత ఆసోదికాడు (అసాధ్యుడు)!! ఎంత చతురుడు!

ఈ జాణకాడు (టక్కరివాడు) వూరకే నా మానాన నేను వుంటే నామీద చేయి వేసి, మాటి మాటికీ నవ్వులు చిలికిస్తాడు. మేరమీరి (లెక్క లేకుండా) జూజాలాడి (జూదమాడి) బాగా ఓడిపోయి ఏమి కూరిమి గొసరని (ఏమి ప్రేమ కుమ్మరిస్తున్నాడండీ) ఈ కోడెకాడు (కోడెగిత్తలాంటి కుర్రవాడు)

ఇదిట్లావుండగా నేనాయనకు లొంగిపోయి తనకో నమస్కారం పెట్టగానే తృప్తి దీరక ఆ పంతగాడు (మొండిపట్టువాడు) యెన్ని చెప్పరాని పనులు చేస్తాడు!! ఈ శ్రీ వేంకటేశ్వరుడు నాకు చనవిచ్చి (ఆదరించి) తానే నన్నేలె (నన్ను ఏలుకొన్నాడు) ఈ నాలికాడు (జిత్తులమారి శ్రీనివాసుడు) ననుపు తానెంతజేసీ (ఎంత అనురాగము చేస్తాడు!!) ఎంత ప్రేమిస్తాడు!!)

సంపుటి :13 కీర్తన : ఇన్నియు నీయందే కంటిమిక నొకచోట

సంఖ్య : 524 పుట : 316 - రాగం : మంగళకౌశిక

18. ఇన్నియు నీయందే కంటి మిఁక నొకచోటఁ గాదు
సన్నల చాయల నేము సంతోషించేమయ్యా ॥పల్లవి॥

మగవానికేడ సిగ్గు మగువలు వద్దనుంటే
తగిలి కాఁగలించఁగఁ దమకింతురు
యెగసక్కేలాడేవారి నెరఁగరు చెలరేఁగి
పగటు వయోమదము పచరింతురు ॥ఇన్ని॥

కోడెకానికేడ వేళ కొమ్మలు మాటలాడితే
యేడనైనాఁ గూడుమంటూ నెచ్చరింతురు
ఆడికెకు వెరవరు అండవారిఁ జూడరు
వీడెపు మోవితేనెకు వేఁడుకొందురు ॥ఇన్ని॥

మొక్కలీనికేడ నీతి ముదితలఁ బొడగంటే
గక్కునఁగాఁగిట నించి కరగింతురు
మక్కువ శ్రీ వేంకటేశ మండెమురాయఁడవై
యిక్కడ నన్నేలితివి యింతా నెరుఁగుదురు ॥ఇన్ని॥

ఉపోద్ఘాతము :

మండెము అనుగ్రామమున వెలసిన నారసింహునిపై సరసశృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. మొక్కలీనికి (తెగించిన ముష్కరునికి) స్త్రీల వద్ద నీతియేమిటి? అంటున్నారు. ఈ తెంపరితనం లాంటి ఇన్ని గుణాలూ నీ వొక్కడిలోనే

చూశామయ్యా! కాని మేము చీకటిపడంగానే నీ చిలిపి సైగలు చూచి కోపగించుటగాక మిక్కిలి సంతసించుచున్నాము. ఏమిటీ విడ్డూరం?

తాత్పర్యము :

ఓ మండెము రాయా! ఈ గుణాలన్నీ కూడా నీవొక్కడిలోనే చూస్తున్నాము. సన్నల చాయల నొకచోట గాదు (రేయింబగళ్ళు వెదకినా ఒక్కచోట, ఇవన్నీ చూడాలంటే సాధ్యమేకాదు.) మేమెక్కడా చూడలేదు. కానీ నీలో చూచి మేము సంతోషించామయ్యా!

స్త్రీ వద్దనుండే మగవాడికి సిగ్గెందుకయ్యా? వాళ్ళని తగులుకొని కౌగలించి తమకింతురు (మైమరపింతురు) చెలరేగిపోయి పగటు వయోమదమున (లావణ్యము కనబడే కోడెవయస్సు మదముతో) పచరింతురు (ప్రవర్తిస్తుంటారు). స్త్రీలతో పరాచికాలాడుతుంటారు. ఓ మండెము రాయా! ఇవి నీకు తెలియవా?

కోడె ప్రాయములో వున్నవారికి వేళాపాళా వుంటుందా? ఆడవాళ్లు కనబడగానే యెక్కడ పడితే అక్కడ రమిద్దామని బలవంతం చేస్తూనే వుంటారు. స్త్రీలు వారితో మాటలాడితే వదలరు. ఆడికెకు వెరువరు (తిట్టినా దులపరించుకొని పోతారు). అండవారి జూడరు (దగ్గర యెవ్వరున్నారో కూడా చూసికొనరు). తాంబూలం వేసికొన్న అధరామృతం కావాలని వేడుకొంటారు. నీకివన్నీ తెలుసుకదయ్యా!

ఓ మండెమురాయా! మొక్కలీడుకి (తెగించిన చాటు మాటు ప్రియుడికి) ఆడవాళ్ళ దగ్గర నీతియేమిటయ్యా! చటుక్కున కౌగలించి కరగించివేస్తారు. నీవే తిరుమల శ్రీ వేంకటేశ్వరుడవు కూడా కాబట్టి, ఇక్కడ (ఈ మండెములో) నన్ను యేలుకొనినావు. ఇంతా (ఇక్కడున్న వీళ్ళంతా) దీనిని యెరుగుదురు.

సంపుటి :13 కీర్తన : ఇట్టే కరుణించవయ్యా యింతిని జూచి

సంఖ్య : 301 పుట : 181 - రాగం : ఆహిరి

19. **ఇట్టే కరుణించవయ్యా యింతినిఁ జూచి**
దట్టమాయ వలపులు తమకమువల్లను ॥పల్లవి॥

నొసలి కస్తూరిబొట్టు నునుఁజెమటఁ దడిసి
యసలాయ నిన్నుఁ బాసినందువల్లను
వుసురు నూరుపులచే నూఁగఁజొచ్చెఁ బయ్యద
వెస నలయించినట్టి విరహమువల్లను ॥ఇట్టే॥

పూసిన గందపుఁబూత పులకలచేఁ జిటిలి
రాసివడెఁ బాసిన రారాఁపువల్లను
వేసటతోఁ బొరలఁగా వీడి వున్నది తురుము
పోసరించినట్టి తలపోఁతలవల్లను ॥ఇట్టే॥

తట్టుపునుగు చెక్కులఁ దతి కాఁకలఁ గరఁగి
వుట్టిపడీ నిన్ను! బాసి వున్న వల్లను
గట్టిగా శ్రీ వేంకటేశ కలసితి వింతలోనే
వెట్టదీరిన రతుల వేడుకలవల్లను ॥ఇట్టే॥

ఉపోద్ఘాతము :

నాయిక విరహావస్థను వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఈ యింతిని చూచి ఇట్టే కరుణించవయ్యా! అని స్వామిని వేడుకొంటున్నారు. తమకమువల్ల (అనురాగము వలన) ఆమెకు ఆయనపై ప్రేమలు దట్టమైనవి (ఇనుమడించినవని) అంటున్నారు. ఆ దశలో ఆమె అవస్థను వర్ణిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వరుని వేడుకొంటున్నారు.

తాత్పర్యము :

ఓ ప్రభూ! ఈ ఇంతిని ఇట్టే (ఇప్పుడే) కరుణించవయ్యా! నీపై తమకము (అనురాగము) వలన ఆమెకు దట్టమాయవలపులు (ప్రేమలు అధికమైని). నీవే పరికింపుము.

ఆమె నుదుటిపై లోజెమట వలన తడిసి నొసలిపై నున్న కస్తూరీ తిలకము అస్తవ్యస్తమైనది. నిన్ను బాసినందువలన (విడిచియున్నందున) ఆవేదనచే ఆ చెమటలు అసలారినవి (అతిశయించినవి). ఆమె పైట వడి వడి నిట్టూర్పులచే వూగి పోతున్నది. ఓప లేని విరహము ఆమెను వెస (శ్రీఘ్రంగా) అలయించినది (అలసిపోవునట్లు చేసినది).

ప్రభూ! మేని పులకరింతల వలన, ఆమె పూసికొనిన గంధపు పూత చిట్లి పొడి పొడిగా రాలిపోయింది. దాదాపు (మిక్కిలి వ్యధ) బాసిన వలన (నీవు ఆమెను వీడినందువల్ల) ఆమెకు కలిగినది. వేసట (అలసట) వలన అటూ ఇటూ పొరలి ఆమె తురుము (కొప్పు) ముడి వూడిపోయినది. ఈ అవస్థ ఆమెకు యెందుకు కలిగినది? పోసరించిన (ఇక్కడ.. మత్తెక్కిన.. అని చెప్పుకోవాలి) ఆలోచనలు నీపై కలిగిన కారణము వలన.

ప్రభూ! నిన్ను వీడుట వలన ఆమె చెక్కిళ్ళు వేడెక్కి వాటిపై రాసిన తట్టు పునుగు (ఒక సుగంధ ద్రవ్యము) కరిగి వుట్టిపడి (బైటకు వచ్చేసింది). ఓ శ్రీ వేంకటేశ్వరా! అప్పుడు ఆమె తిప్పలు చూడలేక నీవామెను ఇంతలోనే (శీఘ్రముగా) గట్టిగా వెట్టదీరిన (తాపము నశించునట్లు రతుల కూడితివి. నీ రతుల వేడుకవల్ల ఆమెకు ఉపశమనము కలిగినది తండ్రీ!

సంపుటి :13 కీర్తన : మెచ్చిరి గొల్లెతలెల్ల మీద మీదను

సంఖ్య : 80 పుట : 48 - రాగం : దేసాళం

20. మెచ్చిరి గొల్లెతలెల్ల మీఁద మీఁదను
యిచ్చిరి చనవులు నీవిట్టే బతుకవయ్యా ॥పల్లవి॥

అంగనలై తేఁ జాలు నట్టే దయ దలఁతువు
యెంగిలి మోవులని యెంచవు
కంగులే కెప్పుడు మెడఁగట్టు కొనే వుందువు
యింగితపురతులు నీకేమి గడమయ్యా ॥మెచ్చి॥

వెలఁదులైతేఁ జాలు వేడుకఁ బెండ్లాడుదువు
పొలసి వారేమిచ్చినాఁబూసుకొందువు
నెలకొని యేపొద్దు నెత్తిఁ బెట్టుకొందువు
వలపులనోము నీకు ఫలియించెనయ్యా ॥మెచ్చి॥

మానినులై తేఁ జాలు మర్మములు చూతువు
అనుక వీఁపున మోచు కలరుదువు
నే నలమేలుమంగను నీవు శ్రీ వేంకటేశుఁడ-
వీనిజాన నిన్నుఁ గూడితింక నేలుకోవయ్యా ॥మెచ్చి॥

ఉపోద్ఘాతము :

గోపాలకృష్ణునిపై చెప్పిన ఈ సరస శృంగారకీర్తనలో గోపికలు ఆ నల్లనయ్యను మెచ్చుటచేత ఆయనకు మీద మీదను (అతి తేలికగా) చనవులు యిచ్చిరి (అనురాగము చూపారు). ఇదే అదనుగా ఆయన రకరకాల చిలిపి చేష్టలతో వారిని అలరించాడు. అన్నమయ్య వేంకటకృష్ణయ్యతో 'నీవిట్టే బతుకవయ్యా! (నీవిలాగే వీరిని అలరించవయ్యా!) అని ఉత్సుకించుచున్నారు. చివరికి అలమేల్మంగ యేమంటున్నదో వినండి.

తాత్పర్యము :

ఓ గోపాలకృష్ణా! నిన్ను గోపికలందరు మెచ్చుకొనినారు. నీకు మీద మీదను (అతి తేలికగా) చనవులు (వారి వలపులను) ఇచ్చారు. నీవు ఇలాగే బ్రతుకవయ్యా! నీవు వారిని "ఏలుకో శృంగార రాయా!"

అంగనలైతే (స్త్రీలైతే) చాలును. వారిని సులభముగా దయజూచెదవు. ఎంగిలి అనికూడా చూడక అధరామృతము నాసిస్తావు. జంకు గొంకులేక వారిని పరిష్వంగముల నూరింతువు. అయినా నీవు 'జారు' డవు గావు. ఇంగితపు రతుల (ఔచిత్యముగల కూటముల) నారితేరినావు. నీకేమిలోటయ్యా?

కాంతలైతే జాలు కళ్యాణమునకు సిద్ధమవుతావు. నీకు బెండ్లి వొక వేడుక. వారు మంచిగంధమిచ్చినా, గొల్ల కంపునిచ్చినా ప్రేమగా పూసుకొంటావు. వారిని నీనెత్తిన బెట్టుకొని మన్నిస్తావు. నీవు అతి నిష్ఠతో చేసే ఈ 'వలపులనోము' ఫలించకుండా ఉంటుందా? ఫలించిందయ్యా! వారు నీవు లేక జీవించలేని స్థితికి వచ్చేశారు.

మరి, నీవు మాత్రం తక్కువ తిన్నావా? మానినులైతే చాలు (అమ్మాయిలైతే చాలు) మర్మములు చూతువు (వారి రహస్యాంగములను చూచెదవు). అటు పిమ్మట నీ వీపుపై వారిని మోని అలరించెదవు. అది.. ఆనాటిమాట. నేడు నీవు శ్రీ వేంకటేశ్వరుడవు. నేనే అలమేల్మంగను. ఇదే నిజం. నిన్ను నేను కూడితిని. ప్రభూ! నన్ను ఏలుకోవయ్యా! శృంగారరాయా!

సంపుటి :13 కీర్తన : సతికిని బతికిని చలములేల

సంఖ్య : 156 పుట : 94 - రాగం : నారాయణి

21. సతికినిఁ బతికిని చలములేల
రతివేడుకలనే రమించుటగాక ॥పల్లవి॥

బింకములే తఱచై తే ప్రియములేరీతి మించు
జంకెన లెక్కుడైతేను శాంతములేవి
మంకులే మెరసితే మర్మములెట్టు గరఁగు
లంకెలై వొకరొకరు లాలించుట గాక ॥సతికి॥

నాలితనము నేర్చితే ననుపులెక్కడ నుండు
తూలపోవ నాడితే సంతోసమేడది
కేలనే వొడ్డు కొంటేను క్రియలెట్టు సమకూరు
తాలిమితో నవ్వులను దైవారుటగాక ॥సతికి॥

యెమ్మెలే మిక్కుటమైతే యియ్యకోలెట్ల నౌను
దొమ్ములే నెరపితే పొందులెట్టు గల్గు
కొమ్మ నిన్నలమేల్మంగ కూడె శ్రీ వేంకటేశుఁడ
వుమ్మడి సరసముల నోలాడుట గాక ॥సతికి॥

ఉపోద్ఘాతము :

భార్యాభర్తలమధ్య చలము (ద్వేషము) వుండవచ్చునా? సతిపతులు సతతము రతి కౌతుకమున నుండవలె. రమించుటయందే సమయము గడుపవలె అంటున్నారు అన్నమయ్య. శ్రీవేంకటేశ్వరునికి ఆయన దేవేరికి కూడా అదే సలహా నిచ్చివుమ్మడి సరసముల నోలాడుటేగాక! ఇంకా చెప్పేదేముంది స్వామీ! అంటున్నారు. కొత్తగా పెళ్ళయిన జంటే కాదు, షష్ఠిపూర్తి చేసికొన్న ముసలి దంపతులు కూడా దీనిని చదివి లెంపలేసుకోవలసిందే.. మరి.

తాత్పర్యము :

ఓ ప్రభూ! భార్యా భర్తల మధ్య పొరపొచ్చాలుండదగునా? అసలు వారి మధ్య చలములు (ద్వేషభావము) లెందులకు? వారి ధ్యాస రతి సౌఖ్యములపైనుండవలెను. గాని మత్సరము పనికిరాదు.

సతిపతులమధ్య పట్టుదలలు తఱచుగా వస్తుంటే, ఇక ప్రేమలెట్లా పెరుగుతాయి? జంకెనలు (బెదిరింపులు) అతి అయితే వారు శాంతంగా యెలా వుంటారు? మంకు పట్టుదల లెక్కువైతే ఒకరి గురించి ఇంకొకరు రహస్యాలు విప్పిచెప్పుకోగలరా? అందుకనే భార్యాభర్తలు లంకెలై (ఒకరినొకరు పెనవైచికొని) లాలించుకొనుచు (బుజ్జగించుకొంటూ) వుండాలి.

స్వామీ! సతిపతులు నాలితనము (కుత్సితము) నేర్చితే ననుపెలెక్కడ? వారి మధ్య అనురాగము యెట్లా మిగులుతుంది? ఒకరినొకరు నిందించుకొంటుంటే సంతోషం యెక్కడుంటుంది. చేతులతో అడ్డగిస్తే పనులెట్లా జరుగుతాయి? ఇక... దారేమిటి? నిబ్బరంగా నవ్వి దైవారవలెను (అతిశయించవలెను. ఇదిగాక ఇంకో దారి లేదు.)

ప్రభూ! భార్యాభర్తలమధ్య 'యెమ్మెలు' (నేను అందగాణ్ణి), నేను అందగత్తెను అనే విలాసవంతమైన ఆలోచనలు) యియ్యకోలు (ఇచ్చి పుచ్చుకోవటాలెలా జరుగుతాయి) ఎలా జరుగుతాయి? దొమ్ములు (ఒకరితో నొకరు బాహాబాహి ముష్టియుద్ధం చేసికొంటే ఇంకా రతులెట్లా సాధ్యం అవుతాయి? ఓ శ్రీవేంకటేశ్వరా! నిన్ను కొమ్మ (అందాల యువతి) అలమేల్మంగ కూడినది. ఇక ఉమ్మడి సరసముల (ఒకరితో నొకరు సరస సల్లాపాలాడుకొంటూ) వుండండి. అట్లు ఓలాడుట (ఓలలాడుట) గాక ఇంకా చెప్పేదేముంది తండ్రీ!

సంపుటి :12 కీర్తన : వూరకే దక్కునటవే వుడివోని వలపు
సంఖ్య : 252 పుట : 146 - రాగం : శుద్ధవసంతం

22. వూరకే దక్కునటవే వుడివోని వలపు
గారవించి యాతని c గౌగిలించఁగదవే ॥పల్లవి॥

మంచిమాట లాడితేను మరిగి నమ్మిక పుట్టు
ఇంచుకంత నవ్వినాను యియ్యకో లవును
వంచనతో మొక్కితేను వడి మొగమాట గల్గు
మించుగాఁబొగడితేను మేలెల్లా దైవారును ॥వూర॥

మళ్ళి మళ్ళి చూచితేను మనసులు గరఁగును
వెల్లివిరిc గొసరితే వేడుక లవును
వొల్లనే వీడె మిచ్చితే వుప్పతిల్లుc దమకము
చెల్లుబడి గలిగితే సిగ్గు లెల్లాc దేరునూ ॥వూర॥

యిచ్చకమై వుండితేను యింపు లొను రతులెల్లా
పచ్చిదేరఁగూడితేను బలుసు నాస
యిచ్చట శ్రీ వేంకటేశుఁడే నలమేలు మంగను
తచ్చన లేక యేలెc దలఁపు లీడేరెనూ. ॥వూర॥

ఉపోద్ఘాతము :

అలమేలుమంగమ్మ చెలికత్తెగా అవతరించిన అన్నమయ్య అమ్మవారితో అంటున్నారు. "ఓ చెలియా! వుడివోని వలపు (యెన్నడూ క్షీణించని ప్రేమ), వూరకే దక్కుతుందే? నీవు చేయాల్సింది యేమిటో తెలుసా? ఆతని (శ్రీ వేంకటేశ్వరుని) గౌరవంతో ఆహ్వానించి కౌగలించాలి కదటే? (చూస్తూ కూర్చుంటే సరిపోతుందా?) అంటున్నారు. అంతేకాదు కొన్ని కిటుకులు కూడా చెబుతున్నారు.

తాత్పర్యము :

ఓ సఖీ! అలమేల్మంగా! వుడివోని వలపులు (యెన్నడూ తరిగిపోని ప్రేమలు) వూరకే దొరుకుతాయటే. ఆతని (నీ భర్తయైన శ్రీనివాసుని) గౌరవంతో ఆహ్వానించి కౌగలించుకోవద్దా!! (నేను చెప్పేది జాగ్రత్తగా విను.)

స్త్రీ మంచిగా మాట్లాడితే పురుషుడు మరిగి (పరవశించి) అతనికి నమ్మకం కలుగుతుంది. కొంచెము నవ్వగానే తన అంగీకారం తెలియజేస్తాడు. వంచనతో నమస్కరిస్తే సంకోచం కలుగుతుంది. పురుషుని యెంత పొగిడితే అంత మేలు (వలపు) దైవారును (అతిశయించి కలుగుతుంది). ఓ దేవీ! ఈ కిటుకులు తెలియవలెనమ్మా!

పురుషుని, మళ్ళీ మళ్ళీ చూచితేను (కొసరి కొసరి స్త్రీ చూచిందంటే) అతని మనస్సు కరిగిపోతుంది. బ్రతిమిలాడి వద్దంటుంటే అతనికి వేడుక కలుగుతుంది. ఒల్లన (తిన్నగా నోటి) తాంబూలమునిస్తే అతనికి తమకము వుప్పతిల్లుతుంది. (పరవశత్వం కలుగుతుంది). చెల్లుబడి కలిగితే (అతనిపై కొద్దిగా అధికారం వస్తే) నీ సిగ్గులన్నీ పోయి చనువు వస్తుంది. (అప్పుడు మరింత దగ్గరవుతావు).

ఓ దేవీ! యెంత అనుకూలవతివైవుంటే సంభోగములంత మధురముగా నుంటాయి. పచ్చిదేర (అరమరికలు లేక) కూడితేనే ఆశలు బలిష్టమవుతాయి. ఇక్కడ స్వయంగా శ్రీ వేంకటేశ్వరుడే, అలమేల్మంగను తచ్చనలేక (పరిహాసముగా కాకుండా) యేలె (యేలుకున్నాడు.) మనస్ఫూర్తిగా ఆ స్వామి ఆమెను ఏలుకున్నందువల్ల ఆమె తలపులు ఈడేరినని (ఆమె కోరికలు ఫలించినవి).

సంపుటి :12 కీర్తన : సముఖా అవధారు సర్వేశ రాఘవేంద్ర
సంఖ్య : 527 పుట : 302 - రాగం : సాళంగనాట

23. సముఖా అవధారు సర్వేశ రాఘవేంద్ర
అమరులు వా రివో చిత్తావధానా ॥పల్లవి॥

రాముఁడు గొలువున్నాఁడు రాజులాల కొలువుఁడు
వామదేవ సేవించు వసిష్ఠకను
సామజములవా రవో జవనాశ్వములవార
మీమీ పౌఁజులతో నిరుమేలా నిలువరో ॥సముఖా॥

భరత గొడుగువట్టు బాగాలిమ్ము శత్రుఘ్ను
సరుస లక్షణుఁడ వింజాము రిడుము
సొరిది నిలుచుండుడు సుగ్రీవాంగదులాల
వెరపుతో విభీషణ విన్నపాలు సేయవో ॥సముఖా॥

వానరులాల మొక్కుడు వాయుజ పాదము లొత్తు
నానా దేశాధీశులాల కానుక లిండు
పూని శ్రీవేంకటాద్రిపైఁ బొంచి సీతాసమేతుఁడై
శ్రీనిధియై వరా లిచ్చి చేకొనరో ప్రజలు. ॥సముఖా॥

ఉపోద్ఘాతము :

రాఘవేంద్రుడైన శ్రీరామచంద్రునిపై కీర్తన నాలాపిస్తున్నారు అన్నమయ్య. "సముఖా! అవధారు సర్వేశ.." అంటే ఈ సర్వేశుని సముఖము అవధరించి హెచ్చరికగానుండుడు. వారివో (అదిగో వారే) అమరులు చిత్తగించియున్నారు, అని అర్ధం. శ్రీరామచంద్రుని దర్బారును వర్ణిస్తున్నారు.ఇది శృంగార కీర్తన కాకపోయినా ఈ సంపుటి 12లో వెలువరించబడినందును. దీని నెన్నుకొనుట తటస్థించినది. కన్నులకు కట్టినట్లున్న వర్ణన అంటే ఇదియే.

తాత్పర్యము :

ఇది రాఘవేంద్రుడైన శ్రీరామచంద్రుని సముఖము. అవధరించి అందరూ హెచ్చరికతోనుండండి. వారివో (అదిగో వారే) దేవతలు. చిత్తావధానా (చిత్తగించండి)

శ్రీరామచంద్రుడు కొలువు దీరి యున్నాడు. సామంతరాజులారా ఆయనను కొలవండి. ఓ వామదేవా! సేవించుకొనుము. ఓ వసిష్ఠా! నీవు ఆయనని చూచి ఆశీర్వదించు. మహత్తరమైన గజసేన అదిగో. వారే జవనాశ్వములను నడపునది (మంచి యౌవనమున నున్న అశ్వసేన నడుపువారు). మీమీ పౌజులతో (సేనలతో) సభకిరువైపులా నిలిచి సిద్ధంగా వుండండి.

ఓ భరతుడా నీవు రాజారామునకు గొడుగుపట్టి నిలువుము. ఓ శత్రుఘ్నా! బాగాలిమ్ము (వక్కపొడి అందించుము). ప్రక్కనే నిలబడిన లక్ష్మణా! నీవు వింజామరతో రాజారామునికి విసరుము. సుగ్రీవాంగదులారా! సొరిది నిలుచుండుడు. (ఒక క్రమములో నిలువుడు). అంత పెద్దదానవ రాజ్యాన్ని పాలించగలనా అని భీతిల్లు విభీషణా! నీవు విన్నవించేదేమన్నా వుంటే చేసికొనుము.

ఓ వానరులారా! అంతాముక్కుండి. మారుతీ! నీకిష్టమైన రాముని పాదములను ఒత్తుము. వివిధ దేశాధిపతులారా! మీరు తెచ్చిన కానుకల నందించండి. సిద్ధమై వేంకటాద్రిపై వెలసి సీతాసమేతుడవై శ్రీనిధియై (శ్రీ వేంకటేశ్వరుడై) అనేక వరముల ననుగ్రహించి చేకొనరో (అనుగ్రహించి రక్షించండి).

సంపుటి :12 కీర్తన : పురాణ పురుషుడు భువినవతరించేను
సంఖ్య : 383 పుట : 219 - రాగం : ప్రతాపనాట

24. పురాణ పురుషుడు భువి నవతరించెను
సిరుల జయంతి నేడు సేయరో పండుగలూ ॥పురాణ॥

శ్రావణ బహుళాష్టమిఁ జందురుఁ డుదయించెను
ఆవేళ రోహిణిని అద్దమరాతిరికాడ
దేవకి కృష్ణునిఁ గాంచె దేవతలు నుతియించ
చేవ దేరెఁబనులెల్లా సేయరో పండుగలూ ॥పురాణ॥

నందుని మందకు నేఁగినాఁడే వసుదేవుఁడు
కందువఁగృష్ణునెశోదకడఁ బెట్టి మాయఁ దెచ్చి
యిందమని కంసుచేతి కిచ్చితే మాయాదేవి
చెంది విడిపించుకొనె సేయరో పండుగలూ ॥పురాణ॥

చిన్నకృష్ణుడై పెరిగి చేరి కంసుఁ బొరిగొని
యెన్న శ్రీవేంకటేశుఁడౌ ఇందరిఁగాచీ నిటె
వున్నది యలమేల్మంగ వురమున నితనికి
చెన్నుమీఱి దాసులెల్ల సేయరో పండగలు. ॥పురాణ॥

ఉపోద్ఘాతము :

ఒకానొక శ్రీకృష్ణ జయంతి సందర్భంగా అన్నమయ్య వినిపించిన అద్భుతమైన కీర్తన ఇది. శిశువైన పరమాత్మను వసుదేవుడు రేపల్లె చేర్చటం. యశోద పక్కలోని శిశువును (మాయాదేవి) మధురచేర్చటం, కీర్తన ఇతివృత్తం. అన్నమయ్యముద్ర ఏమంటే శ్రావణ బహుళాష్టమినాడు నడిరేయి పుట్టిన ఆ శిశువు నేడు శ్రీ వేంకటేశుడౌ ఇంతమందినీ కాపాడుతున్నాడట. ఇక అలమేల్మంగ ఆయన వురముపైనెక్కి చెన్నుమీరి కూర్చుందట. హరిదాసుల్లారా! పండుగ చేసికొనుడు అంటున్నారు.

తాత్పర్యము :

ఆదికినాదియైన పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు. ఆయనే స్వయంగా పుడమినవతరించిన, సిరుల జయంతి (వైభవోపేతమైన జన్మదినము) నేడే. ఓ ప్రజలారా! మీరు పండుగ చేసికోండి.

ఈరోజు శ్రావణ బహుళ అష్టమి. చంద్రోదయం అవుతున్నది. ఆవేళ రోహిణీ నక్షత్రయుక్త 'అద్దమరాతిరి' (నడిరేయిలో) దేవకీదేవి కృష్ణుని ప్రసవించింది. దేవతలందరు ఆయనను సన్నుతించారు. ఈరోజు చేవదీర (సంబరముతో... అని చెప్పుకోవాలి) ఇక్కడ బనులెల్లా సేయరో పండుగలు. (పండుగ పనులన్నీ చేయుడు).

అప్పుడు వసుదేవుడు, నందగోపుడుండే మందకు (రేపల్లెకు) వెళ్ళినాడు. చాకచక్యంతో చిన్నారికృష్ణుని యశోద చెంతనుంచాడు. ఆమెకు పుట్టిన మాయాదేవి నెత్తుకొనివచ్చి, యిందమని (ఇదిగో తీసికో అని) కంసునికి ఇచ్చాడు. అప్పుడా మాయాదేవి వాడి పట్టునుంచి విడిపించుకొని ఆకాశంలో మెరిసింది. ఓ జనులారా! పండుగలు చేసికోండి.

ఆపైన ఆ బాలుడు చిన్నారి కృష్ణయ్యయై పెరిగి పెద్దవాడై కంసుని పొరిగొని (సంహరించి)... యెన్న (అతిశయించి), నేడు శ్రీ వేంకటేశ్వరుడై ఇదే, ఇంతమందినీ రక్షించుచున్నాడు. అలమేల్మంగకూడా విడువక ఆయన వురము నధిష్టించి చెన్నుమీర (శోభాయమానంగా) నున్నది. దాసులెల్లా వీరిదాసులైనవారందరూ పండుగలు చేసికొనండయ్యా!

సంపుటి :12 కీర్తన : యెటువంటియాగడీడే యీ కృష్ణుడు
సంఖ్య : 384 పుట : 220 - రాగం : బౌళి

25. యెటువంటి యాగడీఁడే యీ కృష్ణుఁడు
జొటజొటఁగారఁగానే జుట్టీ మీఁగడలు ॥పల్లవి॥

కొట్టెఁగృష్ణుడు వాఁడె కోల లెత్తి వుట్లపై
దట్టముగ గొల్లెతలు దాఁచినపాలు
చుట్టిన చక్కిలములు చొక్కపు నురుగులునుఁ
బెట్టిన కాఁగులతోనే పెంచులుగఁజేసీనే ॥యెటు॥

దొంతులు దించి దించి దొరకొనీ కృష్ణుడు
బంతిఁ జక్కెర వెట్టీ గోపాలుల కెల్ల
మంతనాన వద్దని మానుపఁబోతేఁ దాను
కొంత వారినోరఁ బెరుగులు చమరీనే ॥యెటు॥

వీదు లెల్లఁ దానె శ్రీ వేంకటాద్రి కృష్ణుఁడు
ఆదిగొని మెసగీని యడుకు లెల్ల
కాదని పెనఁగితేను కౌఁగిలించీ గొల్లెతల
సోదించి కుచములంటి సొంపుగాఁ గూడీనే. ॥యెటు॥

ఉపోద్ఘాతము :

నేటికాలంలో 'ఆగడీడు', 'చమరీనీ' లాంటి పదముల వాడుక లేనందు వల్ల ఈ కీర్తనకి తాత్పర్య వివరణ కావలసి వచ్చింది కానీ, లేకపోతే సరళమైన తెలుగు కీర్తన ఇది. ఆ కొంటెకృష్ణుడు 'జొటజొట' మీగడలు కారిపోతుంటే వాటిని జుఱ్ఱుకొన్నాడట. ఇది చదువుతుంటే ఆనందం కలుగదా? ఆ చిలిపి కుఱ్ఱవాడు యౌవనం తొంగిచూడగానే గొల్లెతలని యెలా అలరించాడో వినండి.

తాత్పర్యము :

(ఓ యశోదమ్మా!) ఈ కృష్ణుడు యెటువంటి "యాగడీడే? (అల్లరివాడే)!? వీడు మీగడలు జొట జొట కారిపోతుంటే వాటిని అమాంతం జుఱ్ఱుకొంటాడు.

ఈ కృష్ణయ్య తన చేతికఱ్ఱనెత్తి రేపల్లె గొల్లభామలు దట్టముగా (ధైర్యంగా) దాచికొనిన పాలు కారిపోయేట్లు కొడతాడు. వాళ్ళు కాగుల్లో (వెడల్పుమూతిగల బిందెలలో) పెట్టుకొనిన చుట్టిన చక్కిలాలును (చక్కిలములు), చొక్కపు (చక్కటి) నురుగులును పెంచులుగా (చిన్న చిన్న ముక్కలయ్యేట్లు) నుగ్గు నుగ్గు చేస్తాడు. (తినడానికి వీలుకాకుండా చేస్తాడు.)

దొంతులుగా పేర్చిపెట్టుకొనిన కుండలను బాగుగా దించి ఈ కృష్ణుడు గోపాలురనందరిని బంతిలో నిలబెట్టి మేము దాచికొనిన చక్కెరనంతా తినబెడతాడు. మేము మంచిగా వాడిని కూర్చోబెట్టి వద్దు నాయనా! అని బ్రతిమాలి మానిపించబోతే, కొంత పెరుగును మా నోటికి చమరీనే (రాసేస్తాడు). వాని ఆగడాలను యేమని చెప్పమంటావమ్మా!

ఇప్పుడు మీ పిల్లవాడు పెరిగి శ్రీవేంకటాద్రి కృష్ణుడైనాడు. ఈయన ఘనకార్యమేమిటో తెలుసునా? ప్రతి వీధిలోనూ తానేయై గొల్లవారి ఇళ్ళల్లో అటుకులపై ఆదిగొని (కన్నువేసి) వాటిని మెసగీని (మెక్కుతాడు). వాళ్ళు కాదని పెనుగులాడితే ఆ గోపికలను చటుక్కున కౌగలించుకొని, సోదించి (బలవంతాన) కుచములనంటి బహు సొంపుగా రమిస్తాడు. ఇంకా యేమి చెప్పమంటావు తల్లీ!

సంపుటి :12 కీర్తన : ఇందుకంటె నున్నదదే యెంచగ మూలధనము
సంఖ్య : 511 పుట : 293 - రాగం : రామక్రియ

26. యిందుకంటె నున్న దదే యెంచఁగ మూలధనము
కందువ తలపోఁతలే కడుమూలధనము ॥పల్లవి॥

వనితకుఁ బతిమీఁదివలపే మూలధనము
మునుకొన్న తమకమే మూలధనము
కనుఁగొనే నెమ్మోముకళలే మూలధనము
వినయపుఁజేతలే వెసమూలధనము ॥యిందు॥

నేసవెట్టి పెండ్లాడినసిగ్గులే మూలధనము
మోసులైన పులకలే మూలధనము
ఆసపడి చూచే చూపే అన్నిటా మూలధనము
రాసికెక్క చిఱునవ్వే రతిమూలధనము ॥యిందు॥

కప్పుకొన్న వేడుకల కౌఁగిలే మూలధనము
ముప్పిరి మోవితేనెలే మూలధనము
యిప్పుడే శ్రీ వేంకటేశుఁ డింతలోనే, చెలిఁ గూడె
చెప్పరాని భోగములే జిగిమూలధనము. ॥యిందు॥

ఉపోద్ఘాతము :

పురాతన కాలంలో ధనాన్ని ఒకమూల త్రవ్వి దాచివుంచేవారు. తమకు మాత్రమే తెలిసేటట్లు ఏదో గుర్తుకూడా పెట్టుకొనేవారు. పెద్దమొత్తం అయితే ఒక బిందెలో దాచివుంచేవారు. ఒకవేళ ఒకటికంటే యెక్కువ బిందెలుంటే, వాటికి 'లంకె' (కలిపికట్టు) ఒకటి కట్టి, విడిపోకుండా చూసేవారు. వాటినే లంకెబిందెలంటారు. ఆ మూలధనం వల్ల ఉపయోగమేమంటే, యెప్పుడు కావాలంటే అప్పుడు దాన్నిత్రవ్వి తీసికొని వాడుకోవచ్చు. అన్నమయ్య లౌకికులకు ఏవేవి, మూలధనమో వివరిస్తున్నారు.

తాత్పర్యము :

(ఓ నెచ్చెలీ!) యెంచగా (ఆలోచిస్తే...) యిందుకంటె నున్నది (ఇదిగాక ఇంకొకటుంటే...) అదే మూలధనము. వలచినవారికి కందువ తలపోతలే (ఏకాంతములో ప్రియుల గూర్చిన) ఆలోచనలే అంతులేని మూలధనము.

స్త్రీకి తన భర్తపై నున్న వలపే (ప్రేమయే) గొప్ప మూలధనము. మునుకొన్న (అన్నిటికంటె ముందున్న) పారవశ్యమే, ఆ వలపునకు మూలధనము. ఆ పారవశ్యానికి మూలధనమేమంటే, ఆమె నెమ్మోము కళలే (పరిపూర్ణ చంద్రునివంటి మొగము కళలే). దానికంటే మూలధనమేమిటో తెలియునా? వెస మూలధనము. ఆమె వినయపు జేతలే (నమ్రతతో చేసే పనులే) నేస (నేస... అయివుంటుంది)

నేసవెట్టి పెండ్లాడిన సిగ్గే (పెండ్లినాటి సిగ్గులే, ఆ జంటకు) మూలధనము. మోసులైన (మొలకలెత్తిన) పులకరింతలు ఆ సిగ్గులకు మూలధనము. ఆ పులకరింతలకు మూలధనమేమిటో తెలియునా? ఆశతో తన ప్రియుడెప్పుడొస్తాడోనని ఆమె అన్నివైపుల చూస్తున్నది. ఆ చూపులే... ఆ పులకలకు మూలధనము. రతిరాసికెక్కిన (మనోహరమైన) ఆయన చిరునవ్వే వాటన్నిటికీ మూలధనము.

పైజెప్పిన వాటన్నింటికీ మూలధనమేమంటే అతిశయించిన వేడుకతో కౌగిలించి ఆయన ఇచ్చిన మధురాధరమే. ఇంతలోనే ఈ శ్రీవేంకటేశుడు ఇప్పుడే ఆ చెలియను గూడినాడు... చెప్పుటకు సాధ్యముకాని వారి భోగములే దేదీప్యమానమైన మూలధనము.

సంపుటి :12 కీర్తన : గోవిందుడీ బాలుడు గోపాలుడు
సంఖ్య : 137 పుట : 79 - రాగం : సాళంగనాట

27. గోవిందుఁడీ బాలుఁడు గోపాలుడు
కావింప రేపల్లెలోని కాంతాలోలుఁడు ॥పల్లవి॥

జనియించెఁ గృష్ణుఁడు సర్వలోకజిష్ణుఁడు
పనివడి సజ్జనుల పాలికి వర్ధిష్ణుఁడు
సనకాదులమతుల సంచరిష్ణుఁడు ॥గోవిందుఁ॥

పెరిగెఁ గంసజైత్రుఁడు భీషణ తేజమిత్రుఁడు
వరవసు దేవదేవకీ పుత్రుఁడు
సరస భావించి చూడ సర్వజీవగాత్రుఁడు
సరగ రుక్మిణీసత్యభామా కళత్రుఁడు ॥గోవిందుఁ॥

వెలసె భూధరుఁడు విశ్వలోక గురుఁడు
సులలిత బలభద్ర సోదరుఁడు
కలితనిశ్చల శ్రీవేంకటగిరి సంచారుఁడు
కలసిన యలమేల్మంగా మనోహరుఁడు. ॥గోవిందుఁ॥

ఉపోద్ఘాతము :

అన్నమయ్య వాడిన విశిష్ట పదము సంచరిష్ణుడు. సనకాది ఋషుల మనములలో సంచరిష్ణుడట. అంటే సంచరించువాడని భావము. కళత్రము అంటే పెండ్లాము అని అర్థము. కళత్రుడు అని నిఘుంటువులో కానరాదు. కానీ రుక్మిణీ సత్యభామా కళత్రుడు అనే పదము వాడారు అన్నమయ్య. కావింప రేపల్లెలోని కాంతా లోలుడట ఈ గోవిందుడు. కావింప అంటే కాజేయటం అని అర్థం. రేపల్లెలో

కాంతలను (పడుచుల మనస్సులను) దొంగిలించే స్త్రీలోలుడట. ఔరా! ఎంతమాట అన్నారు!! సర్వజీవగాత్రుడు, విశ్వలోకగురుడు, నేడు శ్రీ వేంకటేశ్వరుడు కూడా ఈ శ్రీమన్నారాయణుడే.

తాత్పర్యము :

(ఓ చెలియలారా!) ఈ బాలుడు యెవ్వరనుకొన్నారు? ఇతడే గోవిందుడు. గోపాలుడైన కృష్ణయ్య కూడా ఇతడే. వీడు రేపల్లెలో కాంతలను (స్త్రీలను) కావింప (కాజేయటంలో) లోలుడు (మిక్కిలి కోరిక గలవాడు).

పుడమినవతరించిన ఈ కృష్ణుడు. సర్వలోక జిష్ణుడు (లోకముల నన్నింటినీ గెలిచినవాడు). ఈతడే రాక్షసాంతకుడైన శ్రీ మహావిష్ణువు. సజ్జనులను కాపాడుటకు అవతరించిన వర్ధిష్ణుడు (వృద్ధిబొందు త్రివిక్రముడు). ఈతడే సనక, సనందనాది ఋషుల మానసాకాశంలో సంచరించు సంచరిష్ణుడు.

ఈతడే కంస జైత్రుడు (కంసుని జయించువాడగుటకై) పెరిగినాడు. గొప్పతేజముగల లోకమిత్రుడు. వసుదేవునికి దేవకీదేవికి వరముగా జన్మించిన కుమారుడు. సరుస (సరస... అంటే చేరువయై అని అర్థం) భావించి చూచినచో 'సర్వజీవగాత్రుడు' (జీవాత్మయై సర్వజీవులలో యేదో ఒక శరీరం ధరించివున్నవాడు కూడా ఈ దేవదేవుడే). పెద్దవాడయ్యాక ద్వారకలో రుక్మిణీ సత్యభామలకు కళత్రుడు(పెనిమిటి) ఈయనే.

ఈ భూకాంతుడే, విశ్వలోకగురుడు (సృష్టిలోని లోకములన్నింటికీ గురుడు (తండ్రి). బలభద్రుడు అని పేరుగాంచిన బలరామునికి సులలిత సోదరుడు (చక్కని సౌకుమార్యం గల తమ్ముడు). నేడు ఈయనే నిశ్చలమైన శ్రీవేంకటగిరియందు సంచరించు వానిగా కలితుడు (ఎఱుగ బడినవాడు). పుడమికి వచ్చి అలమేలు మంగయై కలిసిన శ్రీతరుణి మనోహరుడు కూడా ఈ నల్లనయ్యయే.

సంపుటి :18 కీర్తన : వినోదకాడైనాడు విట్ఠలేశుడ
సంఖ్య : 301 పుట : 202 - రాగం : మాళవి

28. వినోదకాఁడై నాఁడు విట్ఠలేశుఁడు
అనాదిదేవుఁడనేయాతఁ డీతఁడా ॥పల్లవి॥

మాయరోలఁ గట్టువడి మద్దులు విరిచివేసి
ఆయతమైయున్న యట్టియాతఁ డీతఁడా
పేయలఁ గాచినాఁడు పెరుగువంటకములు
ఆయెడ నారగించినయాతఁడీతఁడా ॥వినో॥

తల్లిబిడ్డలైన గొల్ల తరుణుల నెల్లాఁ గూడి
అల్లుకొనఁజేసె వావు లాతఁ డీతఁడా
తొల్లి గోవర్ధనమెత్తి దొరతనాలెల్లాఁజేసి
అల్లవాఁడె నిలుచున్నాఁ డాతఁ డీతఁడా ॥వినో॥

చందముగ రుకుమిణి సత్యభామాదిసతుల
నందంద పెండ్లాడిన ఆతఁడీతఁడా
ఇందిరయుఁ దానుఁగూడి ఇదె శ్రీ వేంకటాద్రిపై
నందరికి వరాలిచ్చీ నాతఁడీతఁడా ॥వినో॥

ఉపోద్ఘాతము :

విట్ఠల దేవుడిపై అన్నమయ్య చెప్పిన చక్కటి కీర్తన ఇది. ఈ విట్ఠల దేవుడు రేపల్లె వినోదకాడు. మరి జగద్గురువని అనాది దేవుడని కీర్తించబడిన దెవరు? ఆతడే ఈతడా? అని ప్రశ్నిస్తున్నారు. ఆరూపంలో రుక్మిణీ సత్యభామల్ని పెళ్ళాడినదీ నేడు శ్రీ వేంకటేశ్వరుడై ఇందిరన గూడినదీ ఒక్కరేనా? ఆతడీతడేనా... అంటున్నారు.

తాత్పర్యము :

ఈ విట్ఠలేశుడు గొప్ప వినోదకాడు (విలాసపురుషుడు). అనాది దేవుడనే ఆతడే (ఆదిదేవుడు ఆది లేని దేవుడు అయిన ఆ శ్రీమన్నారాయణుడు, ఇతడేనా?

ఆనాడు రేపల్లెలో మాయామానుష బాలుడై తల్లి యశోద చేత రోటికి బంధించబడి అంతపెద్ద రోటితో రెండు మద్ది వృక్షములను గూల్చి, ఆయత్తమై యున్నట్టి (కనబడినటువంటి) ఆతడే (నందనందనుడే) ఇతడు (ఈ విట్ఠల దేవుడు). ఆనాడు నంద వ్రజమున పేయలను (దూడలను) కాచి వాళ్ళమ్మ చేసిన పెరుగుపచ్చడి వంటి వంటకములను తినిన ఆతడే (గోపాలకృష్ణయ్యే) మన యెదురుగానున్న ఈ విట్ఠలుడా?

వావివరుసలు, సాధ్యాసాధ్యాలు మానవమాత్రులకేగాని పరమాత్మకుండవని నిరూపించుటకా! యన్నట్లు తల్లికూతుళ్ళైన గోపికలను కూడి అల్లుకొన్న ఆతడే (ఆ గోపీకృష్ణుడే) ఈ విట్ఠలేశుడా? తొల్లి ఇంద్రుని రాళ్ళ వర్షంనుండి గోకులమును రక్షించుటకు గోవర్ధన పర్వతమును తన చిటికెన వ్రేలిపై యెత్తి దానిక్రింద గోవులను గోపాలురను రక్షించిన ఆ గిరిధరుడే ఈ విట్ఠలుడా?

ఆనాడు ద్వారకలో శోభాయమానంగా రుక్మిణీ, సత్యభామలను అందందు (అక్కడక్కడే) పెండ్లాడిన ఆ శ్రీకృష్ణుడే ఈ విట్ఠలుడా? ఇదే (ఈ సమయంలోనే) ఇందిరయైన అలమేల్మంగతోకూడి శ్రీ వేంకటాద్రిపై తన ఆశ్రితులకు వరములిచ్చే ఆతడే (శ్రీ వేంకటేశ్వరుడే) ఈతడా ఈ విట్ఠలేశుడా?

సంపుటి :18 కీర్తన : ఎందరి బెండ్లాడినా నీకే మాయను
సంఖ్య : 24 పుట : 17 - రాగం : గౌళ

29. ఎందరి బెండ్లాడినా నీకేమాయను
అందుకుఁగా నే నిన్ను నౌఁగాదనేనా ॥పల్లవి॥

వలచి వచ్చితినని వనిత వేఁడుకొనఁగా
చెలిమి సేయక యేల సిగ్గువడేవు
సొలపుఁజూపుల నిన్నుఁజూచిచూచి కొసరఁగా
తలవంచుకొని యేల తప్పించుకొనేవు ॥ఎంద॥

కాఁపురము సేయవచ్చి కాచుకొని యాపె వుండఁగా
యేపున నీవు సెలవి నేల నవ్వేవు
పైపై నీతమ్ములానకు భామ చేయిచాఁచఁగాను
రాఁపుజాణతనా లేల రచ్చలో నాడేవు ॥ఎంద॥

వేడుకతో నాపె నీకు వెసఁ బాదాలొ త్తరాఁగా
కూడుదువు గాక యేల గుట్టుచూపేవు
యీడనె శ్రీవేంకటేశ యిటు నన్నుఁగూడితిఇ
వీడెమిచ్చేసతి నేల వింతసేసేవు ॥ఎంద॥

ఉపోద్ఘాతము :

"నీవు జగన్నాధుడవు, శృంగారరాయడవు యెంతమందిని పెండ్లాడినా యేమవుతుంది? పాపం అందుకోసమే నిన్ను ఔగాదనలేకున్నాను. (అడ్డు చెప్పలేకపోతున్నవి,) పైగా ఆమె పట్ల నీ ప్రవర్తనకూడా అదొకలాగ వున్నది అంటున్నారు) అన్నమయ్య. వనిత తనంత తా వలచి వచ్చిన చుల్కనగాదె?

తాత్పర్యము :

ఓ ప్రభూ! నీవు జగన్నాథుడవు. ఎంతమందిని పెండ్లాడినా నీకేమి? నిన్ను కాదనువారెవరు? ఆమాత్రం దానికే నేను నిన్ను ఔగాదు (నిరాకరించుట) అనగలనా!

నీవు షోడశకళానిధివి. నేను ఆడుదానను. స్త్రీ తనంత తాను వలచి వచ్చి వేడుకొంటే ఆమెను మన్నించి చెలిమి చేయక సిగ్గుపడుతున్నావు. ఇది భావ్యమా? పరవశించి నిన్ను చూచి చూచి నావంటి తరుణి కొసరగా (తన కోరిక తెలుపగా) నీవు తలవంచుకొని నన్నెందుకు తప్పించుకొని తిరిగేవు? నేనంత కాని దాననయ్యానా?

నీ పక్కనే వున్న ఆ అందాల రాసిని చూశావా? ఆమె నీతో కాపురము చేద్దామని వచ్చి కాచుకొని నిరీక్షిస్తున్నది. నీవేమో యేపున (విజృంభించి) సెలవి నవ్వులు (చిరునవ్వులు) చిందిస్తున్నావు. నీ తమ్ములానకు భామ (పద్మావతీదేవి) పైపై చేయిజాచగాను (అనురాగబద్ధయై నిన్ను వేడుకొంటే) "రచ్చలో రాఁపు జాణతనాలు యేల ఆడేవు?" (పదిమంది ముందు నీ నయగారితనము యేల చూపించెదవు?)

ఆమె నీకు వేడుకతో పాదాలొత్తగా, కూడుదువుగాక! అంతమాత్రాన గుట్టురట్టు చేయవలెనా? అదటుంచి ఇప్పుడిక్కక నన్నుకూడా కూడితివి. ఓ శ్రీవేంకటేశ్వరా! ఇదేమిటయ్యా! వీడె మిచ్చే సతిని యేల వింతసేసేవు? రోజూ నీకు తాంబూలమిచ్చే సతిని... నీ భార్యతో వింతగా ప్రవర్తిస్తున్నావు.) ఇదేమిటి ప్రభూ!

సంపుటి :18 కీర్తన : కన్నుల మొక్కేము నీకు గడపరాయ
సంఖ్య : 472 పుట : 316 - రాగం : సామంతం

30. కన్నుల మొక్కేము నీకుఁ గడపరాయ నన్నుఁ
గన్నెనాఁడె యేలితివి కడపరాయ ॥పల్లవి॥

కందర్ప గురుఁడ వోకడపరాయా మాకు
గంద మీయఁగదవోయి కడపరాయా
కందము నీగుణములు కడపరాయా తొంటి
కందువకు రాఁగవోయి కడపరాయా ॥కన్ను॥

కలువపూవుల వేసి కడపరాయా నేఁ
గలికి నంటా మెచ్చేవు కడపరాయా
కలకాలముఁ బాయకు కడపరాయా నీ
కలపుకో లెరుఁగుదుఁ గడపరాయా ॥కన్ను॥

గరిమ శ్రీ వేంకటాద్రి కడపరాయా నన్నుఁ
గరుణించి కూడితివి కడపరాయా
గరిమెలు నేరుతువు కడపరాయా నా
గరువ మీడేర్చితివి కడపరాయా ॥కన్ను॥

ఉపోద్ఘాతము :

నేటి కడపను అన్నమయ్య కాలంలో దేవుని గడప అనేవారు. అక్కడ వెలసిన శ్రీ వేంకటేశుని కడపరాయుడంటారు. ఈ కీర్తనలో అన్నమయ్య ఒక దాసియై తనను స్వామి కన్నె ప్రాయంనుండే ఏలినాడంటున్నారు. తనను విడచి కలకాలము వుండవద్దు స్వామీ! అని వేడుకుంటున్నారు.

తాత్పర్యము :

ఓ కడపరాయా! నా కన్నులతోటే నీకు మ్రొక్కెదను. నీకు నాకు అనుబంధమీనాటిది కాదు. నీవు నా కన్నె ప్రాయము నుండియే నాకు యేలికవైనావు.

ఓ కడపరాయా! నీవు కందర్ప గురుడవు (వలపుల తేడు అయినట్టి మన్మథుని కన్నతండ్రివి.) (నీ అందమే వానికి వచ్చింది). మాకు (నాకు) గంధము నిచ్చినా వలపు నంగీకరించుము ప్రభూ! నీ గుణములు, కందము (మబ్బువలె నిలకడలేనివి. అంటే! నీకు యెప్పుడు యెవరిపై అనురాగం కలుగుతుందోచెప్పలేం). తొంటి కందువకు రాగదవో (తొలిసారి నన్ను కరుణించిన, ఏకాంత ప్రదేశానికి రా స్వామీ! (నీకోసం నాకళ్ళు కాయలు కాచునట్లు నిరీక్షిస్తుంటాను).

ఓ కడపరాయా! ఆనాడు నాపై కలువపూవులు వేసి నా అందాన్ని మెచ్చుకొని, నేను కలికిని (మనోహరమైనదానను) అని అన్నావు. నన్ను మెచ్చుకొన్నావు. మరి అందువల్ల నన్ను యేనాడూ బాయకు(విడువవద్దు ప్రభూ!) నీ కలుపుకోలుతనం నేనెరుగుదునులే స్వామీ! నీవు యెప్పుడు, యెక్కడ, యెవరి, నెందుకు, యెలా అనుగ్రహిస్తావో యెవడు చెప్పగలడు?

గరిమ (మహిమాన్వితోపేతమైన) శ్రీ వేంకటాద్రిపై వెలసిన కడపరాయా! నన్ను కనికరించి కూడితివి (చేరువయైతివి). నీవు గరిమెలు నేరుతువు (మాయలు నేర్చిన వాడవు). నా గరువమీడేర్చితివి (నా స్వాభిమానాన్ని నిలబెట్టావు). నీకు సదా కృతజ్ఞురాలను, దేవదేవా!

సంపుటి :18 కీర్తన : అంబుజాక్ష నమోప్రహ్లాదవరద
సంఖ్య : 300 పుట : 201 - రాగం : సాళంగనాట

31. అంబుజాక్ష నమో ప్రహ్లాద వదర పీ
తాంబరధర ప్రహ్లాద వరద ॥పల్లవి॥

హరివేషావతార ప్రహ్లాద వరద
హరి(ర?) విరించినుత ప్రహ్లాదవరద
పరమపురుష నమో ప్రహ్లాద వరద ॥అంబు॥

అమిత గుణాకర ప్రహ్లాదవరద
అమరవందిత ప్రహ్లాద వరద
అమృతమయరూప ప్రహ్లాద వరద
ప్రమదాంక నమో ప్రహ్లాద వరద ॥అంబు॥

అహిరాజ శయన ప్రహ్లాదవరద
అహోబలేశ ప్రహ్లాద వరద
సహజ శ్రీవేంకటాచల నివాస నిత్య
బహురవితేజ నమో ప్రహ్లాద వరద

ఉపోద్ఘాతము :

అహోబలేశ్వరుడైన నారసింహుని, ప్రహ్లాద వరదా అని కీర్తిస్తున్నారు అన్నమయ్య. అంబుజాక్షుడు, పీతాంబరధరుడైన ఆ దేవదేవునికి నమస్కరిస్తున్నారు. ఆయన హర, విరించి నుతుడంటే బ్రహ్మ మహేశ్వరులు కొలుచునట్టి ప్రహ్లాద వరదుడట. నిత్యమూ వేంకటాచలంపై నివాసముంటాడట.

తాత్పర్యము :

ప్రహ్లాదుని అనుగ్రహించిన ఓ నరసింహా! పద్మదళ నేత్రుడవైన నీకు నమస్కరించుచున్నాను. పీతాంబరధరుడవు (పసుపుపచ్చని పట్టు వస్త్రమును) ధరించిన నీకు ఇవే, నా వందనములు.

హరి వేషావతార (సింహము యొక్క రూపమున అవతరించిన) నీవు ప్రహ్లాదుని రక్షించితివి. ప్రభూ! నీవు హర విరించి నుతుడవు. (శంకరుని చేతను, చతుర్ముఖ బ్రహ్మ చేతను కీర్తింపబడు మహానుభావుడవు.) శత్రువులైన దానవులను అంతమొందించిన వాడవు. పరమ పురుషుడవు. అట్టి ఓ ప్రహ్లాద వరదా! నీకు నమస్కరించుచున్నాను.

ఓ ప్రహ్లాద వరదా! నీవు అమిత గుణాకరుడవు. భీభత్సముగా హిరణ్యకశిపుని తుదముట్టించి, భయంకరంగా వాని అనుచరులను పరిమార్చి, కరుణతో ప్రహ్లాదుని రక్షించి, శాంతముతో దేవతలకు వరములిచ్చి, శృంగారముతో శ్రీలక్ష్మిని అలరించిన అమిత గుణాకరుడు. ఆయన రూపము అమృతమయము. ఆయన ప్రమదను (భార్యయైన లక్ష్మీదేవిని) అంకమున (తొడపై) కూర్చుండబెట్టుకొనినాడు. అట్టి స్వామికి నమస్కరింతును.

ఓ ప్రహ్లాద వరదా! నీవు అహిరాజ శయుడవు(సర్పముల రాజైన ఆదిశేషునిపై పవళింతువు.) అహోబలమునకు అధినాథుండవు. సహజముగా (అనాదిగా) నిత్యము శ్రీవేంకటాచలము నివాసముగానున్న శ్రీ వేంకటేశుడు కూడ నీవే. అనేక సూర్యుల దివ్య తేజస్సు గలవాడవు. అట్టి నీకు అనేక నమస్కారములు. ఓ దేవదేవా! మమ్ము అనుగ్రహింపుము, తండ్రీ!

సంపుటి :18 కీర్తన : మగవాడు మెత్తనైతే మరి
సంఖ్య : 502 పుట : 336 - రాగం : బౌళి

32. మగవాఁడు మెత్తనైతే మరి యపకీర్తి గాదా
తగవు నెరపకుంటే తరుణులు మెత్తురా ॥పల్లవి॥

నీ పదాలు వాడి ఇంతి నిన్నుఁ గాఁగిలించెనంటా
కోపగించి నీదేవులు కొంగు వట్టెను
చూపెట్టుక వున్నాఁడవు చొక్కి విడిపించవద్దా
యీపాటివాఁడవైతే యెవ్వరు నమ్మేరు ॥మగ॥

సేవ సేసేఆఁటది చేరి పాదా లొత్తెనంటా
వోవరిలోఁ దనవద్దనుంచుకొన్నది
నీవద్దికి నంపుమని నేఁ డాపెకుఁ జెప్పకుంటే
యీవలావలిపొందు లెట్టు జరగీని ॥మగ॥

నాటక్క(క?) సాలమగువ నవ్వి నిన్ను ఁ గూడెనంటా
మేటియలమేల్మంగ మీరనియ్యదు
నీటున శ్రీ వేంకటేశ నీవె తెచ్చుకొనవలె
మాటపట్టు లెటువలె మచ్చిక రేఁచీని ॥మగ॥

ఉపోద్ఘాతము :

మగవాడు ధైర్యంగా దిట్టతనంతో ఉండాలి గాని మెతకవాడైతే అప్రతిష్ట పాలవుతాడు అంటున్నారు అన్నమయ్య. సహజంగానే స్త్రీలు కలహిస్తుంటారు. మగవాడు వారి తగవు దీర్చి సమాధానపరచాలి. అట్లు చేయకుంటే తరుణులు మెచ్చుకోరట. ఆ గోల వినండి కాకపోతే ఇది నా పరిమిత మతికందినంతవరకే సుమండీ!

తాత్పర్యము :

ఓ ప్రభూ! పురుషుడు మెతకవాడయితే (భోళాతనము కలిగివుంటే) చెడ్డపేరు రాదా? అతడు ఇద్దరు స్త్రీల మధ్య వచ్చిన తగవును నేరుపుతో తీర్చే మొనగాడై వుండాలి. లేకుంటే వానిని స్త్రీలు మెచ్చెదరా? మెచ్చరు.

నీ మాటల వలన ఒక ఇంతి నిన్ను కౌగలించినదని గ్రహించి నీ దేవులు (పట్టపుదేవియైన అలమేలుమంగ) కోపగించి కొంగువట్టెను (బలాత్కారముగా ఆమెను నిలదీసినది). నీవేమో చొక్కి (వినోదముతో పరవశించి) చూపెట్టకవున్నావు. (పట్టించుకోకుండా వున్నావు.) నీవు విడిపించి ఆమెనుండి ఈమెను రక్షించవద్దా? నువ్వు ఈపాటివాడవైతే (ఇట్లాంటి వాడవైతే) నిన్ను ఎవ్వరు నమ్ముతారయ్యా?

నీ దేవేరి ఒక సేవసేసే ఆడుదానిని తన పాదములను ఒత్తుతుందిలే అని తనవద్ద పెట్టుకొన్నది. అదీ తన వోవరిలో (పడకటింట్లో) ఆ చెలికత్తెను వుంచుకొన్నది. నేడు ఆపెకు (ఆమెను) నీ వద్దకు పంపమని చెప్పకపోతే ఇక్కడా అక్కడా పొందులు (మీ కలయికలు) యెట్లు జరుగుతాయి ప్రభూ!

నాట్యశాలలో ఒక చిన్నది చిరునవ్వుతో నిన్ను కూడినదిట. అది తెలిసిన జాణ అయిన దేవి అలమేలుమంగ నీవు హద్దుమీరనియ్యక జాగరూకతో గమనిస్తుంటుంది. నీటున (మురిపెముతో) ఓ శ్రీ వేంకటేశ్వరా! నీవే ఆమెను (నీ దేవేరిని) నీ దారికి తెచ్చుకోవలెను. మాటపట్టింపులకు పోయి ఆమెతో బిగదీసుకొంటే మచ్చికలు (అనునయములు) యెట్లు రేచీని(అధికమవుతాయి)?

సంపుటి :18 కీర్తన : చక్కదనాలమించీ నిచ్చట గృష్ణుడు
సంఖ్య : 370 పుట : 248 - రాగం : మాళవి గౌళ

33. చక్కఁదనాల మించీ నిచ్చటఁ గృష్ణుడు
వెక్కసీఁడు గదవమ్మ వెన్నముద్ద కృష్ణుడు ॥పల్లవి॥

గొల్లెతలఁ గొంగువట్టీఁ గోరి కోరి కృష్ణుడు
వెల్లవిరిగా నవ్వీ వేడుకతోఁ గృష్ణుఁడు
వెల్లివలపులు చల్లీ వెన్నముద్దకృష్ణుడు ॥చక్కఁ॥

మంతనములాడుతానే మరిగించీఁ గృష్ణుఁడు
బంతిమోవు లడిగీని బాలకృష్ణుఁడు
దొంతివెట్టి ముద్దులెల్ల దొరకొనీఁ గృష్ణుఁడు
వింతనేర్పులెల్లాఁ జూపీ వెన్నముద్ద కృష్ణుఁడు ॥చక్కఁ॥

బలిమిఁ గాఁగిట నించీ పాయకిదే కృష్ణుఁడు
తిలకించి చూపు చూచీ దిట్టకృష్ణుఁడు
కలసి మన్నించె నిదే కైవసమై కృష్ణుఁడు
వెలసె శ్రీ వేంకటాద్రి వెన్నముద్దకృష్ణుఁడు ॥చక్కఁ॥

ఉపోద్ఘాతము :

వెన్నముద్దలంటే వల్ల మాలిన ఇష్టం వున్న బాలకృష్ణుడు, కృష్ణమోహనుడయ్యాడు. గొల్లెతల కొంగులు వదలడు. దొంతివెట్టి ముద్దులు దొరకొంటాడట. బలంగా కౌగలించుకొంటాడట. ఈ చిలిపి కోడెగాడే నేడు శ్రీ వేంకటాద్రి మీద వెన్నముద్ద కృష్ణుడుగా వెలసినాడట. అన్నమయ్య వూహకందని వాగ్గేయకారుడు.

తాత్పర్యము :

ఇచ్చటనున్న ఈ కృష్ణుడు సౌందర్యములో మించిపోయి మనోహరముగా నున్నాడు. వీడి అందము జూచి మోసపోవద్దమ్మా! ఎందుకంటే ఈ వెన్నముద్ద కృష్ణుడు వెక్కసీడు (దుస్సహమైనవాడు).

ఈ కృష్ణుడు గోపకన్నెల కొంగులు పట్టుకొని వేడుకతో వెల్లివిరిగా (విపరీతంగా) నవ్వుతున్నాడు. కోరరాని కోరికలు కోరుతున్నాడు. పల్లదపు మదమున పచ్చిదేరాడు. (యౌవన గర్వముతో ముదిరిపోయినాడీ కృష్ణుడు). నేడు గోపికలపై వెల్లి వలపు (వెల్లివిరిసిన ప్రేమ) వెదజల్లుతున్నాడు ఈ కృష్ణుడు.

ఈ కృష్ణమూర్తి మంతనములాడుతూనే గోపికలను మరిగించీను (మచ్చిక చేసికొంటాడు). ఇతడు బాలకృష్ణుడనుకోకండి బంతిమోవులడిగీని (వరుసలో నిలబెట్టి మరీ అదరములనందుకొంటాడు). గుంపులో నున్నాకూడా ముద్దు పెట్టుకోకుండా వదలడు. ఈ వెన్నముద్ద కృష్ణుడు వింతగొలిపే నేర్పులన్నీ ప్రదర్శిస్తాడు.

ఈ కృష్ణుడు పాయక (వదలక) బలిష్టమైన తన బిగి కౌగిట బంధిస్తాడు. పైగా యేమాత్రమూ సిగ్గు లేకుండా అదే పనిగా కళ్ళల్లో కళ్ళుపెట్టి ఎలావుంది అన్నట్లు చూస్తాడు. నేడు మన సుకృతము వలన మనకు కైవసమై (స్వాధీనమై) మన్నించి ఇదే మనని కూడినాడు. వెన్నముద్దలు తినే ఆ కృష్ణుడే నేడు శ్రీవేంకటాద్రిపై వెలసి యెల్లరను అనుగ్రహించుచున్నాడు.

సంపుటి :18 కీర్తన : చేవదేరె వలపులు చే

సంఖ్య : 371 పుట : 248 - రాగం : మాళవి గౌళ

34. చేవదేరె వలపులు చేతిలోని వీడెము
తేవోయి భూపతిచెర్వుతిరువెంగళప్పఁడా ॥చేవ॥

బీరములాడఁగ నీతోఁ బెనఁగులాడేమా
చేరి నీవు నవ్వఁగానే చెనకేఁ గాక
రారాదా ఇంకనైన రంతులేల మాయింటికి
ధీరుఁడ విన్నిటా నీవు తిరువెంగళప్పఁడా ॥చేవ॥

గుట్టుతోడ నుండఁగాను కొంగువట్టి తీసేమా
జట్టిగొని పెండ్లాడఁగా జరసేఁ గాక
పొట్టఁ బొరుగబ్బె నీకు పొత్తునఁ గూచుండవోయి
దిట్టవౌదు వన్నిటాను తిరువెంగళప్పఁడా ॥చేవ॥

చలపట్టితే నీతో సారె బలిమి సేసేమా
అలరి కాఁగిలించఁగా నలమేఁ గాక
సులభమాయఁగదోయి చొక్కపునాతోడిరతి
తెలిసి(సె?) శ్రీ వేంకటాద్రి తిరువెంగళప్పఁడా ॥చేవ॥

ఉపోద్ఘాతము :

భూపతి చెర్వు అనే ప్రదేశమున వెలసిన తిరువేంగళప్ప (శ్రీవేంకటేశ్వరుని)పై శృంగార కీర్తన చెబుతున్నారన్నమయ్య. ఆస్వామి చేతిలో వీడెము (తాంబూలము) పట్టుకొని ఏ ముద్దుగుమ్మకిద్దామా అని యెదురు చూస్తూ వున్నాడు. ఎవరికా భాగ్యం దక్కుతుందో.. మరి.

తాత్పర్యము :

భూపతి చెఱువు అనే వూరిలో నెలకొన్న తిరువేంగళప్పా! (శ్రీవేంకటేశ్వరా!) నీ వలపులు చేవదీరినవి (పాకానపడ్డాయి). ఇక వీడెముతేవోయీ (తాంబూలము ఇయ్యవయ్యా!) నీ ప్రవర్తనకు విసిగిపోయాము.

మేము, బీరములాడగ (బింకముతో) నీతో పెనగులాడితే నీవు నవ్వుతావు. వెంటనే మేము చెనకేము (పరవశించి సోలి పోతాము). ఓ తిరువేంగళప్పా! ఇకనైనా నీవు మా వద్దకు రారాదా? నీకు రంతులేల (ఈ విధముగా ఆటపట్టించుట దేనికి?) నేనంటే పిటికిని. నీవు అన్ని విధములా ధీరుడవు. మరి నన్ను కనికరించరాదా? స్వామీ!

యేదో గుట్టుగా మా దారిన మేముంటే, వూరక వుండవు. మా కొంగుబట్టి లాగి. జట్టిగొని (కన్యాశుల్కం చెల్లించి) పెండ్లాడెదనని, జరసేవు (ఉరకలెత్తుతావు). నీకు పొట్ట బొరుగు అబ్బెనయ్యా! (నీకు చేరువగుట జరిగింది.) ఇకనేం, మాతో కలిసిపోయి మాతోబాటు కూర్చొనుమయ్యా! ఓ తిరువేంగళప్పా! నీవు అన్ని విధములా దిట్టయైన వాడివేనయ్యా!

ఓ ప్రభూ! ప్రతిసారీ, నీవు చలపట్టితే (అలిగితే) మేము బలిమిసేసేమా (బలవంతం చేయుదమా?) మేము సంతోషంతో నిన్ను కౌగిలించగానే... అలమే గాక! (అల్లుకుపోవాలి... అంతేగాని బెట్టు పనికిరాదు). నీవు బెట్టు మానేస్తే, నాతో చక్కటి రతిసౌఖ్యం సులభమై, నిన్ను అలరిస్తుంది. శ్రీవేంకటాద్రిపైనున్న తిరువేంగళప్పా! అప్పుడు అందులోని ఆనందం నీకు తెలుస్తుంది.

సంపుటి :18 కీర్తన : సగము మానిసిరూపు సగము మెగము
సంఖ్య : 209 పుట : 140 - రాగం : నాట

35. సగము మానిసిరూపు సగము మెగము రూపు
అగణిత ప్రతాపుఁ డహోబలేశుఁడు ॥పల్లవి॥

గద్దెమీఁదఁ గూచున్నాఁడు కంబములోఁ బుట్టినాఁడు
కొద్దిమీరఁ గడునవ్వుకొంటా నున్నాఁడు
వొద్దనె శ్రీ సతిచన్ను లొరయుచు నున్నవాఁడు
అద్దివో చూడరమ్మ అహోబలేశుఁడు ॥సగ॥

పెనుమీసాలవాఁడు పెదపెదగోళ్ళవాఁడు
ఘనునిఁగాఁ బ్రహ్లాదునిఁ గాచుకున్నాఁడు
మనసిచ్చినసురలతో మాటలాడుచున్నవాఁడు
అనుపమతేజుఁడమ్మ అహోబలేశుఁడు ॥సగ॥

వేవేలు చేతులవాఁడు వెన్నెల చాయలవాఁడు
భావించి కొల్చినవారి పాలిటివాఁడు
శ్రీ వేంకటగిరిమీఁదఁ జేరి భవనాశిదండ
నావల నీవల మించె నహోబలేశుఁడు ॥సగ॥

ఉపోద్ఘాతము :

అహోబల నృసింహుని కీర్తిస్తున్నారు అన్నమయ్య. మనసిచ్చిన సురలతో అంటే మనస్ఫూర్తిగా నమ్మిన దేవతలతో మాట్లాడుతున్నాడట. వెన్నెల చాయల వాడంటే తెల్లని శరీరం కలవాడని భావము. ఆవల నీవల మించె... అంటే అక్కడ వేంకటగిరి మీద ఇక్కడ అహోబలగిరిమీద కూడ అధికుడై వున్నాడట ఆ దేవదేవుడు.

తాత్పర్యము :

అగణిత ప్రతాపశాలి (లెక్కించుటకు సాధ్యముకానంత ప్రతాపముగల) ఈ అహోబల నృసింహుడు, సగము మనుష్యరూపము సగము మృగము (సింహము) రూపము కలవాడు.

ఈ స్వామి గద్దెపై (సింహాసనముపై) కూర్చొనియున్నాడు. ఈయన స్తంభము నందుండి పుట్టినాడు. అంతులేకుండా పెదవుల అంచులనుండి నవ్వులను కురిపిస్తున్నాడు. తన సమీపముననే యున్న శ్రీదేవి స్తనయుగ్మమును రాపిడికి గురిజేయుచున్నాడు. ఓ సతులారా! అల్లదిగో ఈ అహోబల నృసింహుని వీక్షింపుడమ్మా!

ఈ స్వామి బాగా పెంచిన మీసములు కలిగియున్నాడు. పెద్ద పెద్ద గోళ్ళను కలిగియున్నాడు. తన భక్తుడైన ప్రహ్లాదుని ఘనమైన నరసింగముగా రక్షించినాడు. మనస్ఫూర్తిగా తనను నమ్మిన దేవతలతో మాటలాడుచున్నవాడీ స్వామి. ఓ అమ్మలారా! ఈ అహోబలేశ్వరుడు సాటిలేని తేజోమూర్తి.

ఈ స్వామికి అనేకములైన చేతులున్నవి. ఈయన వెన్నెల చాయలవాడు. (వెన్నెలవలె తెల్లని దేహఛాయ గలవాడు). తనను భావించి (ధ్యానించి) కొలిచిన వారి పాలిటివాడు (స్వంతమైనవాడు). ఆవల (అక్కడ) శ్రీవేంకటగిరిమీద, ఈవల (ఇక్కడ) భవనాశి దండ (భవనాశి నదీతీరమున) యున్న అహోబలమున ఈ స్వామియే మించె (మిన్నయై యున్నాడు).

సంపుటి :18 కీర్తన : ఓరుపే నేరుపందురు వువిదలకు
సంఖ్య : 469 పుట : 314 - రాగం : నారాయణి

36. ఓరుపే నేరుపందురు వువిదలకు
తారుకాణించేఁ గాన తడవకురే ॥పల్లవి॥

మొగము చూచినాఁడు ముచ్చటాడక మానీనా
నగినవాఁ డిందురాక నాలిసేసీనా
మగువలాల మనమనసు చూచీ నతఁడు
వెగటుగా మీ రింక వెంగెములాడకురే ॥ఓరు॥

చేసన్న చేసినవాఁడు చెప్పకుండీనా ప్రియము
ఆసకొనినవాఁడు ఆదరించఁడా
యీసులేలే చెలులాల యేఁటికో వున్నాఁడతఁడు
రాసికెక్కించి మీరిఁక రాఁపులు సేయకురే ॥ఓరు॥

చేయిచాఁచినవాఁడు సేస చల్లక లోఁగీనా
కాయము ముట్టినవాఁడు కళరేచఁడా
యీయెడ శ్రీవేంకటేశుఁ డేలె నన్ను నింతలోనె
చాయల సన్నల నింక సాదించకురే ॥ఓరు॥

ఉపోద్ఘాతము :

తాను కూడా స్వామికోసం తపించే ఒక విరహిణియై తనతోటి తరుణులతో హితవు చెబుతున్నారు అన్నమయ్య. నిఘంటువులను అవపోసనపట్టినా కొన్ని అన్నమయ్య పదాలకు అర్థం సందర్భాన్ని బట్టి చెప్పుకోవలసివస్తుంది. చాయల సన్నల నింక సాధించకురే... అంటే రేయింబవళ్ళు నన్ను దెప్పిపొడవకండే, అని అర్థం.

తాత్పర్యము :

ఓ భామలారా! ఓర్పులోనే నేర్పువున్నదనే సామెత మీరు వినలేదా? ఏనాడో పెద్దలీమాట తారుకాణించారు (నిరూపించారు). గాన మీరు తడవకురే (విచారించుట మానండి).

ఓ మగువలాలా! మన మనస్సునెరిగిన ఆ రమణుని గురించి, వెంగెములాడకురే (ఎకసెక్కెములాడకండి). ఓర్పు వహించండి.. ఆయన జగన్నాథుడు. ఆయన కోసం నిరీక్షిస్తూ విచారగ్రస్తమైన మన మొగము చూచినవాడు, ఎందుకిలా వున్నావని ముచ్చటలాడడా? అప్పుడు మనల్ని చూచి కాస్త నవ్వడా? నవ్వినవాడు మన దగ్గరకు రాకపోతాడా? నాలిసేసీనా? (వంచిస్తాడా?) ఆయనకు మనమనస్సు తెలీదా?

ఓ చెలులాలా! ఈసులేల? (అసూయ యెందుకే?) అదిగో చూచినారా యెలా చేసన్నలు (చేతితో సైగలు) చేస్తున్నాడో!! అట్లా సైగలు చేసేవాడు యేదోమాట చెప్పకుండా వుంటాడా? మనపై ప్రియము ఆసకొనినవాడు (ప్రేమతో ఆశపడ్డవాడు) ఆదరించకుండా వుంటాడా? ఏటికోవున్నాడు (ఎందుకో ఆమెవద్దవున్నాడు) మీరు ఇంకా ఆయనను రాసికెక్కించి (బయటపెట్టి) రావులు సేయకురే (రాద్ధాంతం చేయకండమ్మా!)

ఓ వనితలారా! చేయిచాచినవాడు (సిద్ధపడినవాడు) సేసచల్లకలోగీనా (అక్షింతలు చల్లకుండా వుంటాడా?) ఒక్కసారి ఒంటిమీద చేయివేసినవాడు, కళలు రేచడా (మన్మథావస్థలకు గురిచేయక వదిలిపెడతాడా? ఈ సారి అదృష్టం నన్ను వరించింది. ఆ శ్రీవేంకటేశుడు నన్ను యేలినాడు. ఇంతలోనే మీకెందుకే అసూయ? చాయల సన్నలనింక సాధించకురే (రేయింబవళ్ళు అస్తమానమూ నన్ను సాధించకండే...)

సంపుటి :18 కీర్తన : వీధుల నెల్లాతానే గోవిందరాజు
సంఖ్య : 331 పుట : 222 - రాగం :

37. వీధులనెల్లాఁ దానే గోవిందరాజు
ఆదిగొని సేసచల్లీ నదె గోవిందరాజు ॥పల్లవి॥

చెక్కుటద్దము లిద్దరు చెలులకుఁ జూపుతాను
వెక్కసమై మెరసీ గోవిందరాజు
చిక్కని వెన్ను తేట సెలవులఁ జిందుతాను
అక్కరతో మాఁటలాడీ నదె గోవిందరాజు ॥వీధు॥

కదిసి చను మొనలఁ గాయమొరసుకుంటాను
వెదచల్లీ వలపు గోవిందరాజు
వదనాంబుజము మోవివాసనలు చూపుతాను
అదిమీఁ దొడలు చేత నదె గోవిందరాజు ॥వీధు॥

పరిమళములు చూచి పడఁతుల తురుములు
విరుల వేసీని గోవిందరాజు
సురతమర్మములెల్లాఁ జూపి కాఁగిళ్ళనుఁ గూడీ-
నరుడై శ్రీ వేంకటాద్రి నదె గోవిందరాజు ॥వీధు॥

ఉపోద్ఘాతము :

తిరుపతిలో వూరేగింపుగా పోతున్న శ్రీ గోవిందరాజస్వామిపై అన్నమయ్య చెబుతున్న చక్కని కీర్తన. తన సతులైన శ్రీదేవి భూదేవిలకు తన కౌగిళ్ళలో సురతి మర్మములెల్ల నేర్పాడట ఈ శృంగార రాయడు. తన పడతుల కొప్పులలోని పూమాలల పరిమళమును ఆఘ్రాణిస్తున్నాడట ఈ గోవిందరాజు.

తాత్పర్యము :

తిరుపతిలోని ఈ తిరువీధులన్నింటిలోను తానే అయ్యాడు ఈ గోవిందరాజు. ఆదిగొని (కన్నువేసి) తన భామలపై ఆయన సేసచల్లీ (అక్షింతలు చల్లుచున్నాడు). అదిగో చూచి తరించండి.

తన ఇద్దరు సఖియలకు (భూదేవి శ్రీదేవి) ఆయన తన చెక్కుటద్దములను (అద్దముల వలె మెరయుచున్న చెక్కిళ్ళను) చూపుతూ, వెక్కసమై (అధికముగా) మెరిసిపోతున్నాడు. దట్టమైన వెన్నెల వంటి స్వచ్ఛమైన నవ్వులను చిందిస్తున్నాడీ గోవిందరాజు. అక్కరతో (అత్యవసరమైనట్లు) అదే తన సతులతో మాట్లాడుతున్నాడు.

కదిసి (చేరువయై) తన భామల కుచాగ్రములు గుచ్చుకొనునట్లు ఒరసుకొంటూ కూర్చొని వారిపై వలపులు వెదచల్లుచున్నాడు. పద్మము వంటి తన వదనము దగ్గరకు చేర్చి పరిమళ భరితమైన తన పెదవుల వాసన వారికి చూపుచూ తన తొడలతో వారిని అదుముచున్నాడు. అదిగో ఈ గోవిందరాజు ఎంతటి రసికుడో చూడండి.

ఈ గోవిందరాజు తన పడతుల (భార్యల) కొప్పులలోని విరుల పరిమళములనాఘ్రాణించి వారిపై కొన్ని పూవులను చల్లినాడు. తన కౌగిళ్ళలోవారికి సురతమర్మములను చూపి వారిని గవయుచున్నాడు. అరుదైన ఈ దేవదేవుడే శ్రీ వేంకటాద్రిపైననూ చేరి జగములనేలుచున్నాడు.

సంపుటి :18 కీర్తన : ఏమని చెప్పదునే వీడెమ్మెకాడు.
సంఖ్య : 105 పుట : 71 - రాగం : హిందోళ వసంతం

38. ఏమని చెప్పుదునే వీఁడెమ్మెఁకాఁడు
చేముట్టి వేఁడుకొనీనే చెలిమికాఁడు ॥పల్లవి॥

చలపాదిసరసాలజాజరకాఁడు
వలపులు చల్లీఁ బెక్కువలపుకాఁడు
తలఁపించీఁ దనపొందు దాయగాఁడు
వెలయించీ నన్ను నింత వేడుకకాఁడు ॥ఏమ॥

బచ్చనపరాకులపంతగాఁడు
కొచ్చి కొచ్చి చెనకీని కోడెకాఁడు
అచ్చుగా నాసరులంటీ నాసోదకాఁడు
యిచ్చటనే కాచుకునాఁ డెలయింపుకాఁడు ॥ఏమని॥

వద్దనుండే యెలయించీ వన్నెకాఁడు
అద్దుకొనీఁ గాఁగిట నందగాఁడు
వొద్దికై శ్రీవేంకటేశుఁ డుబ్బరికాఁడు
పెద్దరికపులాబాలబేరగాఁడు ॥ఏమ॥

ఉపోద్ఘాతము :

నాయిక తన చెలికత్తెతో చెబుతున్నది. ఏమని చెప్పమంటావే? వీడు యెమ్మెకాడు. ఈ చెలిమికాడు చేముట్టి వేడుకొనీనే. వీడు వలపుకాడు, దాయగాడు, వేడుక కాడు,పంతగాడు, కోడెగాడు, ఆసోదికాడు, యెలయింపుకాడు, వన్నెకాడు, అందగాడు, ఉబ్బరికాడు, పెద్దరికపు లాబాల బేరగాడు– అంటున్నారు అన్నమయ్య. ఎవరిని? శ్రీవేంకటేశ్వరుని. అంటే ఏమిటో తెలియాలంటే నిఘంటువులు వెతకవలసిందే.

తాత్పర్యము :

ఓ సఖీ! నన్నేమి చెప్పమంటావే. ఈ నా స్వామి ఉన్నాడే... ఆయన గొప్ప యెమ్మెకాడు (విలాసవంతుడు), నా చెలిమికాడు (సఖుడు) చేముట్టి (నాకు వినయంగా నమస్కరించి) వేడకొనీనే (బ్రతిమిలాడుకొంటాడే).

ఈయన గురించి యేమి చెప్పమంటావే? ఈయన, చలపాది సరసాల జాజరకాడు (అనేకములైన ప్రేమ వ్యవహారాలు నడుపుతున్నాడు). ఈ దాయగాడు (దుర్మార్గుడైన శత్రువు) విరామం లేకుండా తనతోనా మధురానుభావాలనే తలపింపజేయుచున్నాడు. ఈ వేడుకగాడు నన్ను ఇంత వెలయించీ (ఇంతగా ప్రసన్నురాలిని చేశాడు).

ఈయన, బచ్చన పరాకుల పంతగాడు (పైకొన్న ఆశతో పట్టుదల గలవాడు). ఈ కోడెగాడు (వురకలు వేసే వయస్సుగల యువకుడు) నన్ను కొచ్చికొచ్చి చెనకీని (గోళ్ళతో గిచ్చి గిచ్చి పెడతాడు). ఈయన అచ్చుగా నా సరులంటే ఆ సోదిగాడు (స్వతంత్రంగా నా కొప్పుపై చేయి వేయగల అసాధ్యుడు). ఈ యెలయింపుకాడు (సరసుడు) నా కోసం ఇక్కడే కాచుకొని యుంటాడు.

ఈ వన్నెకాడు (పగలమారివాడు). నన్ను సమీపించి మరీ చేరువయైనాడు. ఆ అందగాడు నన్ను హత్తుకొని కౌగిలించుకొనినాడు. ఈ శ్రీ వేంకటేశ్వరుడు ఉబ్బరికాడు (అతిశయించినవాడు). ఈయన ఒద్దికయై (అనుకూలుడై) యున్నాడు. ఈ బేరగాడు (చేసికొన్న వారికి చేసికొన్నంత ఫలమును మాత్రమే ప్రసాదించే ఆసామి) పెద్దరికపు లాబాలవాడు. అంటే సన్మార్గులకు మంచి, దుర్మార్గులకు చెడునిచ్చేవాడు. కాని ఎవరికేది, యెంత, యెందుకు, యెప్పుడిస్తాడో తెలియనివ్వని గొప్ప వ్యాపారవేత్త.

సంపుటి :18 కీర్తన : వెరగయ్యా నీచేఁతకువిట్ఠలేశ్వరా
సంఖ్య : 216 పుట : 145 - రాగం : శంకరాభరణం

39. వెరగయ్యా నీచేఁతకు విట్ఠలేశ్వరా
విరులు చల్లే వప్పటి విట్ఠలేశ్వరా ॥పల్లవి॥

వేడుక కాఁడవు నీవు విట్ఠలేశ్వరా మాకు
వీడె మియ్యఁగదవోయి విట్ఠలేశ్వరా
వీడవు మనపొందులు విట్ఠలేశ్వరా
వీడుదోడాడీ వలపు విట్ఠలేశ్వరా ॥వెర॥

వెన్న దిన్న నోరితోడి విట్ఠలేశ్వరా
వెన్నెల నవ్వు నవ్వేవు విట్ఠలేశ్వరా
వెన్నుఁడ నీకు మొక్కేము విట్ఠలేశ్వరా మా –
విన్నపము లాలించు విట్ఠలేశ్వరా ॥వెర॥

విచ్చేయు మా యింటికి విట్ఠలేశ్వరా యెంత
విచ్చి చెప్పేవు కతలు విట్ఠలేశ్వరా
కుచ్చి శ్రీ వేంకటాద్రిపైఁ గూడితివి నన్ను
విచ్చనవిడాయ నిఁక విట్ఠలేశ్వరా ॥వెర॥

ఉపోద్ఘాతము :

విట్ఠల దేవునిపై సరసశృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. నీవు చేసే చిలిపిపనులు భయం పుట్టిస్తున్నాయంటున్నారు. నేటి తెలుగు నుడికారానికి అన్నమయ్య కాలం నాటి తెలుగు నుడికారానికి గల బేధము వల్ల కొన్ని మాటలకి నిఘంటువులో కూడా అర్థము తెలియదు. ఉదాహరణకి ఈ కీర్తనలోని

"విచ్చనవిడాయ" అనే మాటకి అర్థం యొక్కడా దొరకదు. అది "విచ్చల విడి ఆయె" అని భావించగలిగితేనే సాధ్యం.

తాత్పర్యము :

ఓ విట్ఠలదేవా! నీ చేతకు (నీవు చేసే పనులకు) వెరగయ్యా (భయము కలుగుతున్నది). నీవు అప్పటి (మరల మరల) విరులు చల్లేవు (పూవులను చల్లుతున్నావు).

ఓ విట్ఠలేశ్వరా! నీవు గొప్ప సరదా యున్న విలాస పురుషుడవు. నాకు వీడెము తాంబూలము ఈయవయ్యా! నీవు మా పొందును యేనాటికీ విడనాడవు. నీ వలపు "వీడుదో(జో) డాడీ" నయ్యా! (సరియైనది కాదయ్యా!) ఎందుకంటే నీవు ఎవరిని, ఎప్పుడు, ఎందుకు, ఎక్కడ, ఎలా అనుగ్రహిస్తావో తెలియదు.

ఓ విట్ఠలేశ్వరా! వెన్నదిన్న ఆనోటితోనే వెన్నెల వంటి నవ్వులు చిందిస్తావు. నీవు వెన్నుడవు, దేవదేవుడవు. నీకు వినమ్రులమై మ్రొక్కెదమయ్యా! ఓ విట్ఠలదేవా! మా విన్నపముల నాలకించుము స్వామీ!

ఓ విట్ఠల దేవా! మా ఇంటికి విచ్చేయవయ్యా! నీ శృంగారలీలలను అడిగినతోడనే పూసగుచ్చినట్లు విచ్చి చెప్పేవు (విప్పిచెబుతావు కదా!) ఈ శ్రీవేంకటాద్రిపై నన్ను కుచ్చి కూడితివి (బిగి కౌగిలించి నన్ను కూడితివి). ఇది నీ నెలవు. నిన్ను అడ్డువారెవరు? నీకు "విచ్చనవిడాయ" (విచ్చల విడి అయిపోయింది). నీవు ఆడింది ఆట పాడింది పాట అయింది స్వామీ!

సంపుటి :18 కీర్తన : బలవంతుడీతని బంట్లమై బ్రతుకుదుము
సంఖ్య : 302 పుట : 202 - రాగం : రామక్రియ

40. బలవంతుడీతని బంట్లమై బ్రతుకుదుము
కిల కిల నవ్వీ సుగ్రీవ నరసింహుడు ॥బల॥

దేవదేవుఁ డితఁడు తేజోరాశి యితఁడు
భావించ నలవిగాని బ్రహ్మ మీతఁడు
శ్రీవల్లభుఁ డితఁడు జీవరక్షకుఁ డితఁడు
కేవలమయినసుగ్రీవ నరసింహుఁడు ॥బల॥

పరమాత్ముఁ డితఁడు భయహరుఁ డితఁడు
నిరుపమగుణముల నిత్యుఁ డితఁడు
వరదుఁ డితఁడు సర్వవంద్యుఁడు నీతఁడు
గిరి గుహలోని సుగ్రీవ నరసింహుఁడు ॥బల॥

కాలరూపుఁ డితఁడు కరుణానిధి ఇతఁడు
మేలిమి జగత్తులకు మేఁటి యీతఁడు
మూలమై శ్రీ వేంకటశైల నిలయుఁడితఁడు
కీలక మిన్నిటికి సుగ్రీవ నరసింహుడు ॥బల॥

ఉపోద్ఘాతము :

సుగ్రీవ నరసింహుని స్తుతిస్తున్నారు అన్నమయ్య. చక్కటి మెడ (కంఠము) గల నృసింహుడీస్వామి. గొప్ప బలవంతుడు. అంత భయంకరంగా హిరణ్యకశిపుని చంపిన స్వామి కూడా శ్రీ దేవిని చూచి కిలకిలమని నవ్వుతున్నాడట. ఈ కీర్తనలో "లరూపుడితడు" అని ముద్రితమయ్యింది. బహుశా అది రాగి రేకుల వ్రాయసకాండ్ర

లోపము అయివుండవచ్చును. ప్రాసనానుసరించి నా ఊహకి అది "కాలరూపుడు" అనిపించింది. ఏది ఏమయినా మనం ఈయన బంట్లమై (భృత్యులమై) బ్రతుకుదాం.

తాత్పర్యము :

ఈ నరసింహుడు, చక్కని కంఠముగల స్వామి. గొప్ప బలవంతుడైన ఈతని భృత్యులమై జీవించెదముగాక! తన తొడపై శ్రీదేవుండినందున కాబోలు ఈయన కిలకిల నవ్వుతున్నాడు.

ఈయన దేవదేవుడు. గొప్పతేజస్సు రాశీభూతమైనవాడు.ఊహించుటకు సాధ్యముకాని పరబ్రహ్మస్వరూపుడు. శ్రీపతియైన ఈయన సర్వజీవరక్షకుడు. ఈ సుగ్రీవనరసింహుడు కేవలమయిన వాడు (పరమాత్మ).

ఈ నృసింహుడు భయమును నివారించు పరమాత్మ స్వరూపుడు. సాటిలేని గుణ గణములు కలిగినవాడు. నిత్యుడు (సృష్టికి ఆదిలోనే గాక అంత్యము నందుకూడా వుండే జగద్రక్షకుడు. కోరుకున్న వరములననుగ్రహించువాడితడే. ఈయన సర్వవంద్యుడు (జీవులందరిచే కీర్తింపబడువాడు). ఈ సుగ్రీవ నరసింహుడు తన నివాసము కొండగుహలలో చేసికొనియున్నాడు.

ఈయన కాలస్వరూపుడు, కరుణాంతరంగుడు. మేలిమి జగత్తులకు (ఉత్కృష్టమైన లోకములకు) ఈయన మేటి (అధిపతి). ఈయనే మూలము అయిన శ్రీవేంకటాద్రినాథుడు. ఇన్నిటికీ (సృష్టి స్థితి లయలకు) కీలకము (కారణము). అంతేకాదు కీలకము అంటే పశువులను కట్టివేసే గుంజ (స్తంభం) అనికూడా అర్థమున్నది. మనం పశువులమే కదా! ఈ స్వామికి కట్టబడినంతవరకు క్షేమమే. లేకపోతే... అంతే సంగతులు.

సంపుటి :18 కీర్తన : కోడెకాడు వీడుగదె గోవిందరాజు
సంఖ్య : 479 పుట : 320 - రాగం : సాళంగనాట

41. కోడెకాఁడు వీఁడుగదె గోవిందరాజు
జోడైన సకులుఁదాను చొక్కుచున్నాఁడు

పరగఁగ మేలుకొని పవ్వళించి వున్నవాఁడు
తరుణుల రతులెల్లాఁదలపోయుచున్నాఁడు **॥కోడె॥**

చెప్పరాని సిరులతో సింగారించుకున్నాఁడు
వుప్పతిల్లుఁదమకాన నుబ్బుచున్నాఁడు
కుప్పెఁదుజవ్వాది మేనఁగుప్పళించుకున్నవాఁడు
అప్పసము సరసములాడుచున్నాఁడు **॥కోడె॥**

సారె సారె వలపులు చల్లుకొంటానున్నవాఁడు
వూరడించందరిఁగలయుచున్నాఁడు
యీరీతి శ్రీ వేంకటాద్రి నిరవై తిరుపతిలో
కూరిములు నెరుపుచు కొలువున్నాఁడు **॥కోడె॥**

ఉపోద్ఘాతము :

తిరుపతిలో నెలకొన్న గోవిందరాజ స్వామిపై సరస శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. కోడెగాడు అంటే విటుడు అని అర్థం. ఇక్కడ శృంగారరాయుడు అని చెప్పుకోవచ్చు. ఈ గోవిందరాజు కోడెకాడు అంటున్నారు. తన జంటయైన ఇద్దరు సకులతో (సఖియలైన శ్రీదేవి భూదేవులతో) పరవశముననున్నాడు అంటున్నారు.

తాత్పర్యము :

ఈ గోవిందరాజ స్వామి కోడెకాడు (విటుడు లేక శృంగారరాయడు) కదటే.. ఇటు చూడండి జోడైన సకులతో (ఇద్దరు జంటగావున్న సఖియలతో) తాను చొక్కుచున్నాడు. (పరవశముతోనున్నాడు).

ఈయన పవ్వళించియున్నా మేలుకొని జరిగేదంతా గమనిస్తూనే వున్నాడు. సొదిరి దేవుళ్ళకు వరుసగా తనను సేవించే దేవేరులకు) తన పాదముల చెంత చోటిచ్చినాడు. ఇప్పుడు ఆయన దేని కోసం యెదురు చూచుచున్నాడో తెలిసిందా, మోవి విందులకోసం (తన భార్యల అధరామృతం కోసం). మరి అంత పరవశమెందుకంటే... వారితో రతులను తలపోయుచున్నాడు కదా!

ఆయన సింగారించుకొన్న విధము వర్ణనాతీతము. ఆయన ఉప్పతిల్లు తమకాన (ఓర్వలేని మైమరపుతో) ఉబ్బుచున్నాడు (సంతోషముగా వున్నాడు). ఆయన కుప్పెదు జవ్వాదిని (గుప్పెళ్ళతో జవ్వాదిని) తన శరీరంపై గుప్పళించుకొన్నాడు. (కుమ్మరించుకొనినాడు). ఆయన అప్పసము (ఎప్పుడూ వారితో సరసములాడుతూనే వుంటాడు.

ఆయన మాటిమాటికీ వలపులు వెదచల్లుతూనే ఉంటాడు. అందరినీ (తనను కోరిన వారిని) వూరడించి దరిజేర్చుకొంటాడు. ఈ విధముగా తిరుపతి పట్టణములోని శ్రీ వేంకటాద్రిన్ ఇరవై (వేంకటగిరి స్థానమై) కూరిముల నెరపుచు (అనురాగము ప్రదర్శిస్తూ) కొలువుదీరియున్నాడు). ఈ మహానుభావుని సేవించి తరించండి.

సంపుటి :18 కీర్తన : ఇందాఁకా సరివచ్చె నింపులెల్లాలను
సంఖ్య : 478 పుట : 320 - రాగం : భవుళి

42. **ఇందాఁకా సరివచ్చె నింపులెల్లాను**
కందువు నీజాడ లిఁకఁ గనుఁగొనేఁగాని **॥పల్లవి॥**

నెమ్మిఁ బెండ్లాడినదాఁకా నీచేయి మీఁదైన దాఁకా
నమ్మిక లిచ్చితి విట్టె నాకు నీవు
దొమ్మి సతులు గూడిరి దొరతనమెక్కె నేఁడు
యెమ్మెల నీతలపోఁత లీడ నెట్టోకాని **॥ఇందా఼॥**

చివ్వనఁ గరఁగుదాఁకా సిగ్గులు వీడినదాఁకా
నవ్వులు నవ్వితివిగా నాతో నీవు
జవ్వనము నాకు నిండె జాణఁడవైతి విపుడు
ఇవ్వల నీపొందులెట్లా నీడేరీనో కాని **॥ఇందా఼॥**

కళలు రేఁగినదాఁకా కైవసమైనదాఁకా
నలుగడఁ గూడితివి నన్ను నీవు
అలమేలుమంగను నీవదె శ్రీ వేంకటేశుఁడ
విల నీరతు లేరీతి హెచ్చీనో కాని **॥ఇందా఼॥**

ఉపోద్ఘాతము :

"ఓ శ్రీ వేంకటేశ్వరాఁ ఇప్పటిదాకా నీ ఇంపులు (ఇష్టము) సరివచ్చె (బాగానే వున్నది) కానీ ఇప్పుడు పెండ్లాన్నయిపోయాను. ఇప్పుడు నీ అసలు ప్రేమేమిటో తెలుస్తుంది." అని అమ్మవారు దెప్పి పొడుస్తున్నది. ఇప్పుడె చూడాలి నీరతు లేరీతి హెచ్చీనోకాని... అంటున్నది. అన్నమయ్య సాటి అన్నమయ్యే, ఇంకలేనేలేరు.

తాత్పర్యము :

ఓ ప్రభూ! ఇప్పటిదాకా నీ ఇంపులు (ప్రేమలు) సరివచ్చె బాగానే వున్నాయి. ఇప్పుడు నీ జాడలు నాకు ఆనాటివలె కానవచ్చుటలేదు. (నీవు మారిపోయావు)

నన్ను నెమ్మి (నెమ్మదిగా) పెండ్లాడినదాకా, నీచేయి పైచెయ్యి అయ్యేదాకా నాకు ఇట్టే (తేలికగా) నమ్మించితివి. మరి ఇప్పుడు చూడు. దొమ్మి సతులు గూడిరి (దురుసుగా ప్రవర్తించే సవతులను) నాకు అంటగట్టావు.నేడు నీకు దొరతనమెక్కె (జగన్నాథుడ వయ్యావు). నీ ఎమ్మెలతలపోతలు (నీగురించిన మధురమైన ఆలోచనలు) ఇక్కడ నన్ను ఎట్టెట్లో వేధిస్తున్నవి.

చివ్వ(వ్వు)న (తొందరగా) కరిగిపోయేలా చేస్తావు. నా అంతట నేనే సిగ్గులను విడనాడేదాకా చేస్తావు. నాతో నవ్వుతూ గడుపుతావు. నాకు యవ్వనం పరిమళించే సమయంలో ఇప్పుడు జాణడ (నేర్పరి) వైతివి. ఇకపై నీ చెలిమి యెట్లా ఈడేరుతుంది స్వామీ!

ఓ ప్రభూ! నాలో కళలన్నీ వికాసమైనదాకా అలరింతువు. నన్ను కైవసమొనర్చుకొని అన్ని వైపులనుంచి కూడితివి. నేను అలమేలుమంగను. ఓ శ్రీవేంకటేశ్వరా నీ రతి లీలలు ఏవిధముగా విజృంభించుచున్నవో కాని నేను విడమరచి చెప్పలేకున్నాను, ప్రభూ!

సంపుటి :18 కీర్తన : చిత్తగించి చూడవయ్య
సంఖ్య : 30 పుట : 21 - రాగం : రామక్రియ

43. చిత్తగించి చూడవయ్య సిగ్గువడ నీకేఁటికి
బత్తిసేసీ నాకె నీపై భావించవయ్యా ॥పల్లవి॥

సెలవుల నవ్వుతాను చేరి మాఁటలాడుతాను
పలువరుసలు చూపీఁ బడఁతి నీకు
నిలుగునివ్వెరగుతో నిండు సింగారములెల్లాఁ
బలుమారు నీ ముందరఁ బచరించీని ॥చిత్త॥

కొప్పు చక్కఁబెట్టుకొంటా కొలువులు సేసుకుంటా
నెప్పునఁ జన్నుల నొత్తీ నెలఁత నిన్ను
వుప్పతిల్లుఁగళలతో నుడివోనిజవ్వనాన
కుప్పళించి వలపులు గురిసీ నీయెదుట ॥చిత్త॥

సరులు దిద్దుకొనుచు చవులెల్లా మోవిఁ జూపి
మరిగించీ నలమేలుమంగ నిన్నును
ఇరవై శ్రీ వేంకటేశ యిటు నన్ను నేలితివి
వురముపై నుండి యాపె వుబ్బించీ నీమనసు ॥చిత్త॥

ఉపోద్ఘాతము :

స్వామి సిగ్గులొలకబోస్తున్నట్లు భావిస్తున్నారు అన్నమయ్య ఎందుకయ్యా సిగ్గుపడతావు? ఆమె(అలమేలుమంగ) భక్తితో నిన్ను తనభావనలలో నిలుపుకొన్నది. ఆమె వలపులను చిత్తగించవయ్యా! అంటున్నారు. సరసశృంగారం పెల్లుబికే కీర్తన అవటం చేత తాత్పర్యంలో గాని అన్నమయ్య నేర్పు తెలిసే అవకాశం లేదు. వలపులలో స్వామిని మరగిస్తుందట అమ్మవారు.

తాత్పర్యము :

ఓ ప్రభూ! అలమేల్మంగమ్మకు నీపై యెనలేని బత్తి (భక్తి). నీపై ఆకె (ఆమె) ఆ భక్తిచేత నిన్ను సేవిస్తున్నది. నిన్ను వలచినది. ఆమెను చిత్తగించి (మన్నించి) ఒకసారి చూడవయ్యా! నీవెందుకు సిగ్గుపడతావు? ఆమె భావజాలమును అర్థము చేసికొనవయ్యా!

ఆ పడతి చక్కటి మందహాసముతో తన పలువరుసలు (దంతములు) చూపించేవిధంగా మాట్లాడుతున్నది. నిన్ను ఒక్కసారిగా చూచి ఆమె నిలుగునివ్వెరగుతో (నిలువునా కలిగిన తత్తరపాటు)తో కనిపిస్తోంది. తన నిండు సింగారింపులు అనేకమార్లు నీ ముందర పచరించీని (ప్రదర్శించుచున్నది).

ఆమె చేయుచున్న శృంగారకళలను ఒకసారి చూడవయ్యా! తన కొప్పును చక్కబెట్టుకొంటున్నది. నీకు సేవలు చేసికొనే వేళ్ళ ఆ నెలత (దేవి) నెప్పున జన్నులనొత్తీ (నేర్పుతో కుచములను తాకించుచున్నది). ఉప్పతిల్లుకళలతో (ద్యోతకమగు కళలతో) ఉడివోని జవ్వనాన (తొలగని యౌవనము) నీ యెదుట కుప్పళించి వలపులు కురిసీ (అంతులేని వలపు చేష్టలను ప్రదర్శించుచున్నది).

ఆమె తన నగలను సవరించుకొంటున్నది. తేనెలూరు తన అదరమును చూపి నిన్ను మరిగించీని (ఆశపడునట్లు చేయుచున్నది). అట్టి అలమేల్మంగతో ఇరవై (నెలకొని) ఓ శ్రీ వేంకటేశ్వరా! ఇటునన్ను యేలితివి (అనుగ్రహించితివి). నీ వక్షస్థలమును నివాసము చేసి కొనిన ఆమె నీ మనస్సును వుబ్బించీ (ఆనందంతో వుప్పొంగునట్లు చేయుచున్నది).

సంపుటి :18 కీర్తన : సిగ్గుతోడ గొంకితేను చిక్కునా
సంఖ్య : 161 పుట : 108 - రాగం : సాళంగనాట

44. సిగ్గుతోడ గొంకితేను చిక్కునా మగవాఁడు
బిగ్గిఁ గాఁగిలించుకొని పెనఁగినఁగాక ॥పల్లవి॥

పెదవి పై మాటలఁ బ్రియములు వుట్టునా
వుదుటుగుబ్బలఁ బతి నూఁదినఁగాక
సదరపుఁజెనకుల చవులు వుట్టీనా
సదమదముగ రతి సలిపినఁగాక ॥సిగ్గు॥

సెలవుల నవ్వితేనే చిత్తము గరఁగునా
సొలయుచు మోవిచవి చూపినఁగాక
ములువాఁడి చూపుల మోహములు వుట్టునా
లలిఁ దమ్ములము పొత్తు గలసినఁగాక ॥సిగ్గు॥

సరసములాడితేనే సంగాతా లెనయునా
సరుసఁ దనువు లొక్కజ (జం?) ట్టైనఁగాక
యిరవై శ్రీ వేంకటేశుఁ డింతలోనె నిన్నుఁ గూడె
పరపుపైనే చాలునా వురమెక్కినఁగాక ॥సిగ్గు॥

ఉపోద్ఘాతము :

సిగ్గు, బిడియము, జంకు స్త్రీకి సహజ స్వభావాలు. తొలిరోజుల్లో భర్తవద్ద సిగ్గుతో గొంకుట (సంకోచించుట) సతులకు స్వాభావికమే. కాని అలా వుంటే, మగవాడు చిక్కునా? అని అమ్మవారికి సలహా ఇస్తున్నారు అన్నమయ్య. మరి

ఎలావుంటే చిక్కునో ఈ కీర్తనలో చెబుతున్నారు. పరపుపైనే (పురుపుమీద మాత్రమే) ఆయన్ని లొంగదీసికొంటే చాలదమ్మా! ఆయన వురమెక్కినగాక (హృదయంపై తిష్టవేసికొంటే) గాని నీ లక్ష్యం నెరవేరదు అని చెబుతున్నారు.

తాత్పర్యము :

ఓ దేవీ! సిగ్గుతో గొంకితేను (సంకోచిస్తే) మగవాడు చిక్కునా (స్వాధీనమవుతాడా?) పెనగులాడాలి. అప్పుడు కాని ఆయన నీకు లొంగడు.

దేవీ! ఊరకనే పెదవులు కదల్చి ఆయనతో మాటలాడినంత మాత్రాన ప్రియములు పుట్టునా (ప్రేమ పుడుతుందటమ్మా!) పొంగిన ఉరోజములను, ఆయనకు ఊదిన (అదిమిన), చవులుపుట్టీనా (కోరిక కలుగుతాయా?) నలిగిపోవునట్లు రమించవలెగాక!

అమ్మా! పెదవుల చివరినుంచి నవ్వినంతమాత్రాన స్వామి మనసు కరగిపోతుందటమ్మా!? పరవశించిపోతూ మధురాధరము నందించవలెను. గుచ్చుకొనేవాడి చూపులతో ఆయన కేసి చూసినంతమాత్రాన నీకు ఒరిగేదేముంది? లలిన్ (ఉత్సాహముతో) తమ్ములము పొత్తు గలసినగాక! (ఒకరినోటిలోని తాంబూలమింకొకరు ఆస్వాదించాలి). అట్లుగాక వుత్తి కౌగిలింతలతో నీ పని సానుకూలపడదు.

ఓ అలివేణీ! చలోక్తులాడినంతమాత్రాన సంగాతములు (చెలిమి) యెనయునా? (పుడుతుందా?) దగ్గరజేరి తనువులొకేజంటగా అయిపోవాలి. ఇన్ని చేస్తే ఆ వేంకటేశుడు నిన్నుకూడి పరవశింపజేస్తాడు. పరపుపైనే చాలునా ప్రక్కమీద ఆయనను లొంగదీసికొనినంత మాత్రాన చాలదమ్మా!) ఆయన గుండెలపై నెక్కి తిష్టవేసికోవాలి. అప్పుడు కాని నీ లక్ష్యం నెరవేరదు తల్లీ!

సంపుటి :18 కీర్తన : ఏల ఆటదానికి యెమ్మెలింతేసి
సంఖ్య : 147 పుట : 98 - రాగం : ముఖారి

45. ఏలే ఆఁటదానికి యెమ్మెలింతేసి
వోలిఁ గడుగుట్టుతోడ నుండవలెఁగాక ॥పల్లవి॥

జవ్వాది యెంతపూసేవే చన్నులేల మూసేవే
చివ్వన నెన్ని చేఁతలు సేసేవే
నవ్వులేమి నవ్వేవే నలిఁ గొప్పేమిదువ్వేవే
రవ్వలాయ నీవలపు రమణునియెదుట ॥ఏలే॥

సిగ్గులేల విడిచేవే చెమటేల తుడిచేవే
మొగ్గవిరు లిన్నేల ముడిచేవే
వొగ్గి కాలేల తొక్కేవే వూరకేల మొక్కేవే
యొగ్గులుఁదప్పు లెవ్వరి నెంచనివాఁ డతఁడు ॥ఏలే॥

మఱి యెందాఁకాఁ బాడేవే మాటలెన్ని యాడేవే
గుఱిగాఁ గాఁగిట నెంత కూడేవే
యెఱుకతో శ్రీ వేంకటేశుఁడు నన్నిటు గూడె
మెఱసి యాతనికేల మేకులు సేసేవే ॥ఏలే॥

ఉపోద్ఘాతము :

అన్నమయ్య తానొక చెలికత్తెయై అమ్మ అలమేల్మంగను మందలిస్తున్నారు. ఆయన చెప్పిన ఇటువంటి కీర్తనలన్నీ దాదాపు ఒకేలా వున్నా దేనిమాధుర్యందానిదే. ఆడదానికి ఇంత ఎమ్మెలు (విలాసము) పనికిరాదు. స్త్రీకి గుట్టు ఉండాలి. సంబంధం వున్నా నలుగురూ చెప్పుకొనేట్టు ప్రవర్తించరాదు.

తాత్పర్యము :

ఓ దేవీ! అలమేల్మంగా! ఆడదానికి ఇంతలేసి యెమ్మెలు (వయ్యారపు విలాసములు) తగునా? ఇంకొకరితో సంబంధం పెట్టుకొనినవారు దాని విషయములో గుట్టు వుండద్దా? నలుగురిలో అప్రతిష్ట తెచ్చుకొంటారా?

నీవు ఎంత జవ్వాది (సుగంధ ద్రవ్యము) మెత్తుకొన్నావో గమనించావా? కచ బంధమును అంతగా బిగించావు యెందుకు? శీఘ్రముగా యెన్ని చేష్టలను సేయుచున్నావు! యేమి నవ్వులొలకబోయుచున్నావు? నీకొప్పును యెంత దువ్వి సింగారింతువు! నీ వలపులు నీ రమణుని ముందు నగుబాటైనవి.

ఓ దేవీ! నీ సిగ్గులనేల విడనాడెదవు? కురియుచున్న చెమటలనేల (ఎంతగా) తుడుచుకొందువు! నీ తలలో ఇన్ని విరులనేల ముడిచెదవు? ఊరకనే ఆయనెందుకు అన్నిసార్లు మొక్కుతావు? ఆయన యెవ్వరి దోసములనూ యెంచడు.

ఓ రమణీ! నీ రమణుని ప్రీతికోసం ఎందాకా పాడెదవు? ఎన్ని మాటలను చెబుతావు? అదే లక్ష్యమన్నట్లు ఎంత గాఢమైన కౌగిలిలో ఎంత రమించెదవు? శ్రీ వేంకటేశ్వరుడు అన్నీ తెలిసిన వాడైనందున నాపై కరుణతో నన్నునూ కూడినాడు. నీవెందుకు బయటపడి మేకులు సేసేవే (నీ పెద్దరికం చూపించుకుంటున్నావే?)

సంపుటి : 8 కీర్తన : ఇద్దరూ నిద్దరే మనమేమి చెప్పేదే
సంఖ్య : 140 పుట : 82 - రాగం : శంకరాభరణం

46. ఇద్దరూ నిద్దరే మనమేమి చెప్పేదే
బద్దుగా దాపెను మెచ్చెఁ బ్రహ్లాదవరదుఁడు ॥పల్లవి॥

చక్కని మొకముచూపి సారె సారె మాటలాడి
చిక్కించెనాపె తొలుత చేరియాతని
మిక్కిలి మేలుదియై మేను చెమరించఁగాను
పక్కన నాపెను నవ్వెఁబ్రహ్లాదవరదుఁడు ॥ఇద్ద॥

పీఁటమీఁదఁ గూచుండి ప్రియములు చెప్పి చెప్పి
దూఁటి చన్నుల నొత్తెను తొలుతాతని
పాటించి యాతని మోవిపండు చూచి నోరూరఁగా
బాటగానాపెను నవ్వెఁ బ్రహ్లాదవరదుఁడు ॥ఇద్ద॥

కాఁగిలించుక యిందిర కన్నులవలపు చల్లి
ఆఁగెను శ్రీ వేంకటేశు నౌభళానను
చే!గదేరఁ జొక్కియాపెఁజూచి అతఁడె తానై
పాఁగినరతుల నవ్వెఁ బ్రహ్లాదవరదుడు ॥ఇద్ద॥

ఉపోద్ఘాతము :

అహోబలంలోని నరసింహుడు ప్రహ్లాద వరదుడు. ఆయనపై అనేకానేక కీర్తనలు చెప్పారు అన్నమయ్య. ఒక చెలికత్తెగా తనని తాను భావించుకొని తోటి చెలికత్తెలతో చెబుతున్నారు. ఈ ప్రహ్లాద వరదుడు మరియు ఆయన అర్ధాంగి శ్రీలక్ష్మి, ఇద్దరికీ మనమేం చెప్పగలము అంటున్నారు.

తాత్పర్యము :

ఓ చెలియా! మనమేమి చెప్పగలవారమే? ఆ ఇద్దరూ (అహోబల నృసింహుడు, శ్రీలక్ష్మి) ఇద్దరే. వారికి వారే సాటి. ఆ ప్రహ్లాదవరదుడు ఆమెను బద్దుగా (వశుడై) దాపెను (దగ్గరయ్యెను).

ఆ దేవి చక్కని తన వదనమును జూపి, ఆయనతో మాటలు కలిపి, మాటిమాటికీ మాటలాడినది. ఆయనను మొదట్లోనే చేరికయై చిక్కించెను, (వశుడౌనట్లు చేసినది). మిక్కిలి వలచినదై తన తనువు పులకరించిచెమర్చగా ఆయన పక్కన (ఒకవైపు) చేరినది. ఆమెను జూచి ఆ ప్రహ్లాదవరదుడు ఆనందంతో నవ్వుతున్నాడు.

ఆ దేవి పీటమీద గూచుండి (ఆయనతోపాటు సింహాసనం అధిష్టించి) ప్రియవచనములు మళ్ళీ మళ్ళీ చెప్పి, దూటిచన్నుల నొత్తెను (నిశితకుచాగ్రముల నాయనకు ఒత్తి పులకరింపు నిచ్చినది). దొండపండువంటి తన అధరముజూపి నోరూరించినది. ఆమెను జూచి ఆ ప్రహ్లాదవరదుడు పాటగా (లీలగా) నవ్వినాడు.

ఆ ఇందిరాదేవి కన్నుల వలపు జల్లి (ఆమె కన్నులకు ఆయన సింహ వదనుడుగా కాక మదనమోహనుడైన శ్రీ వేంకటేశ్వరునిగా కనిపించుచున్నాడేమో!) కౌగిలించినాడు. ఔబళమునను (అహోబలమునందుకూడా) శ్రీ వేంకటేశ్వరుడే చేగదీర జొక్కి (ధైర్యముగా వశుడై) ఆమెను జూచి ఆతడే తానై (ఆ వేంకటేశ్వరుడే అహోబలేశ్వరుడై, పాగినరతుల (మధురమైన రతుల) దేలి ఈ ప్రహ్లాద వరదుడు నవ్వులొలక బోయుచున్నాడు.

సంపుటి : 8 కీర్తన : అలమేలుమంగయీకె ఆనుక వద్దనుండని
సంఖ్య : 90 పుట : 54 - రాగం : శుద్ధ వసంతం

47. అలమేలుమంగ యీకె ఆనుక వద్దనుండది
చెలరేఁగి కందువలు చిత్తగించవయ్యా ॥పల్లవి॥

తరుణిదేహమే నీకు తగుదివ్యరథము
గరుడధ్వజంబాపె కప్పుపయ్యద
తురగములు రతులఁ దోలెడు కోరికెలు
సరినెక్కి వలపులు జయించవయ్యా ॥అల॥

దిండు కలపిఱుఁదులు తేరుబండికండ్లు
అండనే పువ్వులగుత్తులాపెచన్నులు
కొండవంటి శృంగారము కోపునఁగల సొబగు
నిండుకొని దిక్కులెల్లా నీవేగెలువవయ్యా ॥అల॥

వెలఁదికంఠము నీకు విజయశంఖమదిగో
నిలువెల్ల సాధనాలు నీకునాపె
యెలమి శ్రీ వేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
పలుజయముల నిట్టే పరగవయ్యా ॥అల॥

ఉపోద్ఘాతము :

అలమేల్మంగ సొబగులను వర్ణిస్తున్నారు అన్నమయ్య. ఈకె కందువలు చెలరేగీ, ఆనుకవద్దనుండది, చిత్తగించవయ్యా! అంటున్నారు. ఇది అన్నమయ్య కాలంనాటి తెలుగు. అంతతేలికకాదు. ఆమె అంగాంగముల శోభ స్వామికి విజయ సంకేతములే అంటున్నారు. ఆ వివరములను వినండి.

తాత్పర్యము :

ఓ ప్రభూ! ఈకె (ఈమె) అలమేలుమంగ. నీకు ఈమె ఆనుకొని నీచెంతయున్నది. అది (అందుచేత) కందువలు (అనేక సంకేతములు) చెలరేగీ (చెలరేగినవి). వీటిని చిత్తగించవయ్యా! (గమనించవయ్యా!)

ఈ తరుణి దేహమే నీకు సమకూడిన దివ్య రథము. ఆమె ఆచ్ఛాదనముగా కప్పుకొనిన పైట చెంగు నీపాలిటి గరుడుధ్వజము. రతివైభవమున ఆమెలో దోలెడు కోరికలు (చెలరేగినవాంఛలే) తురగములు (ఆ దివ్య రథమున కమర్చిన గుఱ్ఱములు) ఓ దేవదేవా! సరినెక్కి (ఆ రథమునధిరోహించి) ఆమె వలపును జయించవయ్యా!

దిండ్లవంటి ఆమె పిఱుదులు ఆయన రథమునకమర్చిన బండికండ్లు (జంటకన్నులవలె లోనివారు బయటి దృశ్యము చూచుటకేర్పరచిన, గుండ్రటి కిటికీలు) వాటికి అండనే (అక్కడే) అమర్చిన పూల గుత్తులు ఆమె చనుగవ వలెనున్నవి. ఆమెచేసికొనిన అందమైన సింగారము రథపుకోపున (కమ్మీలకు అమర్చిన) సొబగు (అలంకరణము). ఈ విధముగా నిండుకొనిన ఓ దేవా! నీవు దిక్కులన్నీ గెలువుమయ్యా!

ఆమె కంఠధ్వని నీ విజయ శంఖారావము వలెనున్నది. నిలువెల్ల ఆమె నీకు పురుషార్థసాధనములే. మరి ఇక ఇటువంటి మీరిద్దరూ ఒకటైనారు. ఎలమి (సంతోషముతో) అనేక విజయములు నీకు కలుగకుండ ఎలా వుంటాయి? ఇట్టే (సులువుగా) పరగవయ్యా (వర్ధిల్లవయ్యా!)

సంపుటి : 8 కీర్తన : విన్నపములికనేల వేగినంతాను
సంఖ్య : 62 పుట : 38 - రాగం : దేసాళం

48. విన్నపము లిఁకనేల వేగినంతాను
మన్నించకిఁకనుంటే మఱియేది త్రాణ ॥పల్లవి॥

కాంతకు నీవు చూచిన కనుచూపులే త్రాణ
మంతనాన నీవాడిన మాటలే త్రాణ
పొంత నీపై తలపోఁత పొద్దువోకలే త్రాణ
యింతట నీవురాకున్న నిఁకనేది త్రాణ ॥విన్న॥

నలినాక్షికపుడు నీ నవ్విన నవ్వులే త్రాణ
పలుమారుఁ జేసినట్టి బాసలే త్రాణ
పొలసి నీవు వేసిన పువ్వులచెండే త్రాణ
పిలుపించకిఁకనుంటే పిక్కటిల్లుఁద్రాణ ॥విన్న॥

సతికి నీకూటమిలో చనవిచ్చుటలె త్రాణ
వ్రతముగా నీవింటికి వచ్చుటే త్రాణ
గతియై శ్రీ వేంకటేశ కాఁగిలించినదె త్రాణ
తతినిట్టె కూడకుంటే తగనేది త్రాణ ॥విన్న॥

ఉపోద్ఘాతము :

త్రాణ అంటే శక్తి. ఆహారం లేనివాడికి ఆహారం తినగానే కలిగేది త్రాణ. అలమేలుమంగమ్మకు త్రాణ ఆ శ్రీవేంకటేశ్వరుడే. ఆయన దయ కనుమరుగైతే ఇక త్రాణయేది అంటున్నారు అన్నమయ్య. నిజానికి ఆ దేవికేగాదు ఏ సృష్టిలో ఏ జీవికైనా

ఆయన మన్నింపులేకపోతే మరి త్రాణు యేది? చరాచర సృష్ఠికంతా త్రాణ ఆ చక్కనయ్యేకదా! ఒక్కొక్కప్పుడు అన్నమయ్య పల్లవి అసలు అర్థం కాదు.

తాత్పర్యము :

ఓ ప్రభూ! ఇంకా యెంతని విన్నపములను చేసికొనవలెను? ఆమె నీ విరహాగ్నిలో వేగినంతసేపు నీ మన్ననే ఆమెకు త్రాణ (జీవశక్తి). నీమన్ననలేకపోతే ఇక ఆమెకు త్రాణ యేది స్వామీ?

ఆ అలమేల్మంగకు నీవు ప్రేమతో జూచిన కనుచూపులే త్రాణ. మంతనాన (ఏకాంతములో) నీవామెకు చెప్పినమాటలే త్రాణ. నీపై పొంతతలపోతతో (పొందుచున్నట్లు ఆలోచనలతో) పొద్దుబుచ్చుటయే ఆ దేవికి త్రాణ? ఇంతట (ఇప్పుడు) నీవు రాకున్నచో ఆమెకు త్రాణయేది స్వామీ!

ఆ పద్మదళాయతాక్షి నీ సన్నిధిలో నీవు నవ్విన చిరునవ్వులే ఆమెకు త్రాణ. నీవు అనేక పర్యాయములు ఆమెకు చేసిన బాసలు వాగ్దానములు కూడ నీపై ఆమెకు నమ్మిక కలిగించు త్రాణ. పొలసి (ఆమెకు చేరువయై) నీవు ఆమెపై జల్లిన పుష్పములే ఆ దేవికి త్రాణ. ఇక (ఇంకా) ఆమెను నీ వద్దకు పిలిపించుకోకుంటే ఆమెకు త్రాణయేది తండ్రీ!

సతికి (నీ భార్యకు) నీ సమాగమములో నీవామెకిచ్చు చనువులే ఆమెకు త్రాణ. వ్రతముగా (దీక్షాబద్ధునిగా) నీవు ఆమె గృహమునకేతెంచుటే ఆమెకు త్రాణ. ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే ఆమెకు గతియై కౌగలించుటయే ఆమెకు త్రాణ. తలన్ (వ్యాపించి) ఇట్టే (త్వరగా) ఆమెను కూడకున్నచో అవసరమైన త్రాణ యేది ప్రభూ!

సంపుటి : 8 కీర్తన : గొల్లెతలైతేనె కొఱతా
సంఖ్య : 289 పుట : 168 - రాగం : శ్రీ రాగం

49. గొల్లెతలైతేనె కొఱతా
పల్లదపు నీచే పడిరిగాకా ॥పల్లవి॥

కంచుఁబదనుల కాంతల నేఁడిట్టె
వంచుకొన నీకువసమా
పంచబాణముల దారికి లోనై
ముంచి చేతులెత్తి మొక్కిరిగాకా ॥గొల్లె॥

కోడెవయసు కొమెరలేమల
వాడికెకుఁ దేనువసమా
కూడఁగూడఁ బిల్లఁగోవి రాగాలకు
వాడవారు వెంటవచ్చిరిగాకా ॥గొల్లె॥

కొలఁదిలేనట్టి గుబ్బెతలనెల్ల
వలపించుకొనవసమా
యెలమి శ్రీవేంకటేశ కూడఁగాను
సొలసి చనవుచూపిరిగాకా ॥గొల్లె॥

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటేశ్వరుని నందనందనునిగా భావించి అన్నమయ్య ఈ కీర్తన చెబుతున్నారు. గొల్లభామలైతే మాత్రం నీకేం కొరత? పల్లదపు అంటే దృష్ట స్వభావముగల నీ చేతులో పడ్డాక ఇంకా చేసేదేముంది? అని దెప్పిపొడుస్తున్నారు.

కంచు బదనులైన కాంతలు అంటే పెళుసు స్వభావంగల భామలని ఏ నిఘంటువు లోనూ నేరుగా లేదు కాని బాగా ఆలోచిస్తే తట్టింది.

తాత్పర్యము :

ఓ ప్రభూ! వీరు అన్నెం పున్నెం యెరుగని గొల్లభామలైతే నేమి, నీకేం కొఱత (నీకుపోయిందేముంది?) పల్లదపు (దుష్ట స్వభావంగల) నీచేతుల్లో బడినాక వారు చేయగలిగిందేముంది?

కంచుబదనులైన కాంతలు (పెళుసు ప్రవర్తన గల భామినులను) నేడు ఇట్టే లొంగతీసికొనుట నీకు వశమైనదే కదా! నీ వలపు చేతలవల్ల పంచబాణుని (మన్మథుని పీడకు లోనై, ముంచి (వశులై) చేతులెత్తి నీకు మొక్కి వేడుకొన్నారు గదా!

యౌవనంలోకి అడుగిడుచున్న ముద్దుగుమ్మలను వాడికెకుదేను (అలవాటు చేసికొనుట) వసమా (అంత తేలికగా సాధ్యమయ్యే పనియేనా?) కొడగూడ (ఆ గొల్లెతలంతా గుంపుగా చేరి) నీ పిల్లగోవి (వేణువు) రాగాలకు వశులై గొల్లవాడవారంతా నీ వెంటబడి వచ్చారు గదా?

కొలదిలేనట్టి (అశక్యమైన) పయోధర ములుగల గోపికలనందరినీ వలపించుకొనుట అంత తేలికా? ఎలమి (వికాసముగల) ఓ శ్రీ వేంకటేశ్వరా! నీ అంతటి వాడు, వారిని కూడిన పిదప సొలసి (పరవశులై) నీకు చనవు చూపిరి గాక! (నీకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చేశారు).

సంపుటి : 8 కీర్తన : నడుమ జెమట భవనోయేరు మీకునబ్బె
సంఖ్య : 141 పుట : 83 - రాగం : సాళంగనాట

50. నడుమఁ జెమట భవనాశియేరు మీకునబ్బె
ఆడియాలముగ లోలోనందెఁగా మీవలపు ॥పల్లవి॥

యెదురుఁ గొండపై నెక్కి యిందిర నీపై ఁగుచము
లెదురుచాఁచి వొత్తెనేడకు నేడ
కదిసి శ్రీ నరసింహ కాఁగలించితి వాపెను
అదన నిందుకు నందు నందెఁగా నీ వలపు ॥నడుమ॥

యీడనుండి తన పాదమింతి నీతొడపై జాఁచి
యీడుజోడుగాఁ గూచుండెనిచ్చ యెరిఁగి
వేడుక నీమోవినాపె విందుగా మోవంటితివి
ఆడానీడా దోఁటిగా నేఁడందెఁగా మీ వలపు ॥నడుమ॥

నీనీడ ఆపెపైఁబారి నీపై నాపెనీడవారి
తానకమై రెంటా మీరు తగిలితిరి
పూని యహోబలమునఁబొంచి శ్రీ వెంకటేశుఁడ
ఆనకమై రెంటాఁ బెంగ్లై యంటెఁగా మీవలపు. ॥నడుమ॥

ఉపోద్ఘాతము :

అహోబల నృసింహుడు ఆయన దేవేరి లక్ష్మీదేవిపై సరసశృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. దీని పల్లవికూడా అడియాలముగానే వున్నది. అనగా గుర్తుగా వున్నది. భవనాశియేరు (నది) మీకు నడుమన్‌చెమటన్‌గాన్ అబ్బె (లభించింది). మీ ఇద్దరి వలపు లోలోన అడియాలముగ (దానికి గుర్తుగా) అన్నమయ్య మనోగతం ఈని ఆనకమై చెప్పలేము,ధంకామోగించి చెప్పే శక్తి సామాన్యునికి శక్యమా?

తాత్పర్యము :

ఓ ప్రభూ! నీవు అహోబల నృసింహుడవై శ్రీదేవిని గూడితివి. గరుడాద్రిపై నీవు, దానియెదురుగా కొండపై శ్రీలక్ష్మి వెలసి ఒకరిపై నొకరు వలపులు వెదజల్లుకొనుచున్నారు. రెండు కొండల నడుమ 'భవనాశియేరు' (నది) ముప్పిరి గొన్న మీ చెమటల వలె ప్రవహించుచు మీకున్ అబ్బె (లభించినది). మీ వలపు, అడియాలముగ (మీ వలపు గుర్తుగా) లోలోనందెగా (లోపల లోపలనే వెల్లివిరిసినది).

గరుడాద్రి యెదుటికొండపైనెక్కి ఇందిర (శ్రీలక్ష్మి) నీపై కుచములు యెదురుచాచి వొత్తెన్, ఏడకునేడ (తనకుచాగ్రములచే నిన్నొత్తినది). కదిసి (చేరువయై) ఆపెను శ్రీ నరసింహా! నీవు కాగిలించితివి. మీ వలపు అక్కడికక్కడే పెల్లుబికినది.

ఈ కొండపైనుండి ఇంతి (లక్ష్మీదేవి) తన పాదమును నీతొడపై జాచి ఈడుజోడుగా ఇచ్చనెరిగి (ఒకరిపై ఇంకొకరికి గల కోర్కెనెఱిగి) కూర్చొనియున్నారు. సంతోషముతో ఆమె నీవు ఒండారుల అధరామృతాస్వాదనానంతరము ఆడానీడ (ఆ కొండపైన, ఈ కొండపైన) తోటిగానేడందెగా మీ వలపు, (ఒకేసారి మీ వలపులు ఉధృతములైనవి).

ఓ ప్రభూ! మీరిరువురూ కొండలపై నెదురెదురుగానుండుటచేత నీనీడ ఆమెపైనను, ఆమె నీడ నీపైనను పారి (పడి) రెంటా తానకమై (రెండు చోట్లా సుస్థిరమై) మీరు తగిలిరి, ఒకరినొకరు తగులుకొని యున్నారు). అందుచేత ఇక్కడ ఈ అహోబలమునన్ పొంచి శ్రీ వేంకటేశుడా, ఆనకమై (భేరీనినాదములు) రెండుచోట్లా చెలరేగగా మీ వలపు విరహము వలె పరణమించినది.

సంపుటి : 7 కీర్తన : చనిగంటె విడువడు సారె సాకె నే పనులు
సంఖ్య : 87 పుట : 54 - రాగం : దేసాక్ష

51. చవి గంటి (టే?) విడువఁడు సారెసారె నే పనులు
యివల నీతనిపొందులెట్టు సేసేదే ॥పల్లవి॥

పాలమీఁద! బవ్వళించి పాలవారియింటఁబుట్టి
పాలుదొంగిలించినట్టి బాలుఁడీతఁడు
గాలికూటివాని మెట్టి గాలిరాకాసునిఁగొట్టి
గాలిబిడ్డ తమ్మునిసంగడినాడె నీతఁడు ॥చవి॥

వసుల యేలికనేలి పసులకు మారుదెచ్చి
పసులఁ గాచిన యట్టి బాలుఁడీతఁడు
వసుధభారము దించి వసుధకొడుకుఁ గొట్టి
వసుధ యేలినయట్టివాఁడుగదె వీఁడు ॥చవి॥

బండిబోయుఁడైవచ్చి బండిగాలికత్తి వట్టి
బండి విఱిచినయట్టి బాలుఁడీతఁడు
కొండయెత్తి కొండదచ్చి గురుతై శ్రీవేంకటాద్రి
కొండపై నలమేల్ మంగఁ గూడినాఁడిఁతడు ॥చవి॥

ఉపోద్ఘాతము :

పురాణాలమీద ఇతిహాసములమీద గొప్ప పట్టువుంటే కాని అర్థం కాని కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. బండిబోయుడనేమాట ఏ నిఘంటువును వెదకినా అర్థం దొరకదు. బండిగాలికత్తివట్టి అంటే ఏమిటో తెలిసిన వానికి పురాణ బ్రహ్మ అనే బిరుదు ఇవ్వవచ్చేమో! ఇటువంటి కీర్తన వివరించిన నా జన్మకూడా తరించింది.

తాత్పర్యము :

ఇతడు (శ్రీవేంకటేశ్వరుడు), చవిగంటే విడువడు (నీయందు అనురక్తుడైతే వదిలిపెట్టడు). సారెసారెన్ (మాటిమాటికీ) ఏ పనులును ఇవలన్ ఈతని పొందులు (ఏపని చేసినా ఇతను కరుణిస్తేనే జరుగుతాయి). ఎట్టు సేసేదే? (ఎట్లా చెప్పేదమ్మా!)

పాలమీద బవ్వళించి (పాలసముద్రంపై పరుండి), పాలవారి ఇంటబుట్టి (గొల్లవారింట్లో జన్మించి), పాలు దొంగిలించిన పిల్లవాడు ఈ దేవదేవుడు. గాలికూటివాని మెట్టి (పాముల శ్రేష్ముడైన ఆదిశేషునిపై నెక్కి,) గాలిరాకాసిని గొట్టి (సుడిగాలిలా వచ్చి ఎత్తుకు పోబోయిన తృణావర్తుని సంహరించి) ఇతడు గాలిబడ్డ తమ్ముని సంగడినాడె (వాయుదేవుని పుత్రుడై భీముని తమ్ముడైన అర్జునునితో పాటు ఆడుకొన్నాడు.)

పసులయేలికన్ (భూతనాధుడైన శంకరుని) ఏలి సంరక్షించి (భస్మాసురుని బారినుండి రక్షించాడు), పసులకు మారుదెచ్చి (బృందావనంలో గోవులను గోపాలురను బ్రహ్మదేవుడు అంతర్ధానం చేస్తే తానే వారై బ్రహ్మ గర్వమును ఖర్వముజేసినాడు), పసుల గాచినయట్టి గోవిందుడీబాలుడు. వసుధ భారము దించి (భూభారమును తగ్గించి), వసుధ కొడుకుని గొట్టి (నరకాసురుని చంపి, భూరమణుడైన విష్ణువు ఈ బాలుడు.

బండిబోయుడైవచ్చి (రథసారధిగా అర్జునునితోపాటు వచ్చి), బండిగాలి కత్తికట్టి (కాలిబొటనవ్రేలితో రథాన్ని క్రుంగించి కర్ణుని శక్తి అనే అస్త్రం నుంచి కిరీటిని రక్షించి), బండివిరిచినయట్టి (శకటాసురుని చంపిన) చిన్నారి బాలుడీస్వామి. కొండయెత్తి (గోవర్ధన పర్వతమునెత్తి), కొండదచ్చి (కూర్మరూపుడై క్షీరసాగరమధనం, మందరగిరితో చేయించి), ప్రసిద్ధి జెందిన శ్రీవేంకటగిరిపై అలమేలుమంగతో కూడియున్న జగన్నాథుడు ఇతడే.

సంపుటి : 7 కీర్తన : ఏలనీవు సిగ్గుపడే వింతలోనను
సంఖ్య : 197 పుట : 120 - రాగం : పాడి

52. ఏల నీవు సిగ్గువడే వింతలోనను
మేలిమియిల్లాల నీకు మించి నేనేకాదా ॥పల్లవి॥

ఎక్కడఁ దిరిగినా మా యింటికే వత్తువు నీవు
తొక్కుమెట్టాడి నిన్ను దూరనేఁటికి
పుక్కట తుమ్మిదకును పువ్వులెన్ని కలిగినా
తక్కినచుట్టపు పొందు తామరే కాదా ॥ఏల॥

తలఁపు నీకేడనున్న తనువు నాపై వేతువు
చెలరేఁగి నిన్ను రట్టు సేయనేఁటికి
సొలసి చల్లగాలికి చోట్లెన్ని గలిగినా
మలయఁ బేరై నచోటు మలయాద్రిగాదా ॥ఏల॥

నింద నీకెంత మోచినా నీవె నన్నుఁ గూడితివి
కందువ నీ గుణాల పొగడనేఁటికి
యెందరు శ్రీ వేంకటేశ యింతులు గలిగినాను
యిందిరను నీ యిల్లు నా యెదలోనె కాదా ॥ఏల॥

ఉపోద్ఘాతము :

ఇందిరాదేవి సాధికారంగా స్వామితో చెబుతున్నది, "నీవెందుకు సిగ్గు పడెదవు స్వామీ! నిన్ను వలచినవారు, వలపించుకొన్నవారూ యెంతమందివుంటే నాకేమయ్యా! నీకు బంగారం వంటి పెండ్లాము నేనే కదా! ఆ తల్లి ఆభిజాత్యం చూడండి.

"నా ఇల్లు నీ హృదయమే ప్రభూ!" అంటున్నది. అన్నమయ్యకు సాటి రారు, లేరు. ఇటువంటి సేవ ఆ తల్లికి చేయడానికి నేను చేసిన సుకృతమేమో తెలియదు.

తాత్పర్యము :

ప్రభూ! నిన్ను వలచిన వారెందరో! వలపించుకొన్నవారు లేక పోలేదు. ఇంతలోనే నీవు యేల సిగ్గు పడేవు (సిగ్గు పడెదవు)? మించి (అతిశయించి), నీకు మేలిమి బంగారం వంటిమేలైన ఇల్లాలను నేనేకాదా? మరి ఇకనేమి?

నీవు ఎక్కడ యెవ్వరితో తిరిగినా నీవు చివరకు వచ్చేది మా ఇంటికే కదా! తొక్కుమెట్టాడి (కష్టపెట్టి) నిన్ను నిందించుటవల్ల ప్రయోజనమేమిటి?తుమ్మెదకు యథాలాపంగా వాలడానికి తోటలో తక్కిన పూలు యెన్నివున్నా, చుట్టపు పొందు (ఆత్మీయతగల అనుబంధం) తామరపూవుతోనే కదా!

తలపు నీకేడ నున్నా తనువు నాపైనేతువు (నీ మనస్సులో ఆర్తజనులు అసంఖ్యాకులు, కానీ నీ శారీరక అనుబంధం నాతోనేకదా!) ఈ మాత్రం దానికి చెలరేగి నిన్ను బయటపెట్టి యాగీ చేసినందువలన లాభమేమిటి? చల్లగాలికి జగతిలో యెంత స్థానం వున్నప్పటికీ మలయ మారుతమునకు పుట్టిల్లు మలయపర్వతమేకదా!

నిన్ను యెందరు యెన్ని విధములుగా మోచినా (వాంఛించినప్పటికినీ) నీవు కూడునది నన్ను మాత్రమే. కందువ (ఏకాంతమున) నీ గుణములను నేను పొగడవలసినపని యేమున్నది? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవెందరు సుందరీమణులను పొందినా నీ డెందము ఇందిరకు (లక్ష్మీదేవికి) చెందినదే. ఇందులో సందేహం వుందా? నీఇల్లు నాయెదలోనే కాదా!

(అదండీ... ఆ తల్లికి తనమీద తనకున్న నమ్మకం. సెబాసో... సెబాసు).

సంపుటి : 7 కీర్తన : పూవుబోణుల కొలువే పుష్పయాగము
సంఖ్య : 60 పుట : 38 - రాగం : గౌళి

53. పూవుఁబోణుల కొలువే పుష్పయాగము
పూవక పూచె నీకిట్టి పుష్పయాగము ॥పల్లవి॥

కలువ రేకులవంటి ఘనమైన కన్నుల
పొలఁతుల చూపులె నీ పుష్పయాగము
తలఁచి తలఁచి నిన్ను ఁ దమమేనులఁ బొడమే
పులక జొంపములె నీ పుష్పయాగము ॥పూవు॥

కరకమలములను కందువగోపికలెల్లా
పొరసి నినుఁ జూపుటే పుష్పయాగము
సరసపుమాటలే సారెనాడి తమనవ్వు
పొరి నీపైఁ జల్లుటే పుష్పయాగము ॥పూవు॥

గాఁటపుఁ గొలనిదండఁ గాంతలు సిగ్గున నిన్ను
బూటకానకుఁ దిట్టుటే పుష్పయాగము
యీటున శ్రీ వేంకటేశ యిట్టె యలమేలుమంగ
పూఁటపూటరతులివి పుష్పయాగము. ॥పూవు॥

ఉపోద్ఘాతము :

పూవుబోడి – అంటే పుష్పమువలె మృదువైన శరీరముగల స్త్రీ అని అర్థము. ఓ ప్రభూ! నీవు పూవక పూచేవాడివి. అంటే.. మొగ్గ తొడిగి అది పుష్పం అవటం. ఇదంతా వుండదు. నీకరుణ ఒకేసారి ఆవిర్భవిస్తుంది. అంతదాకా నీవు

మా మొరవింటున్నావో లేదో కూడా మాకు తెలియదు. రకరకాల పూలతో నీకు చేసే పూజయే పుష్పయాగం. ఆ వివరాలనందిస్తున్నారు అన్నమయ్య.

తాత్పర్యము :

ఓ శృంగారరాయా! అనేకమంది పూబోడులు (స్త్రీలు) చేసిన కొలువే (సేవయే) నీకు పుష్పయాగమైనది. పూయుచున్నట్లు తెలియకుండానే ఒకేసారి పూచిన పుష్పం వంటి కరుణగల దయాసింధువు నీవు. అట్టి నీకు ఇవన్నీ పుష్పయాగములే.

కలువరేకులవంటి కళ్ళున్న పొలతుల (స్త్రీల) గొప్పకనుచూపులే, నీకు పుష్పయాగము. నీ ఆలోచనలవల్ల ఆ తరుణులలో కలిగిన పులకల మొలకలే నీకు ఒక పుష్పయాగము.

ఆనాడు రేపల్లెలో గోపికలంతా కమలములవంటి ఎఱ్ఱని తమ చేతులు, నిను పొరసి జూపుటే (నిన్నుపొంది నీకు తమ చేతులు) చూపించుటయే ఒక పుష్పయాగము. అనేక సరసోక్తులనాడుచూవారు ఆనాడు మాటిమాటికీ తమ నవ్వుల పువ్వులను నీపై విరజిమ్మేరు. అంతకంటే గొప్ప పుష్పయాగం నీకేముంది నందనందనా!

ఓ చిలిపికృష్ణా! గాటపు గొలనిదండనే (పెద్దకోనేటి ఒడ్డున) కాంతలు, నీవు వాళ్ళ వస్త్రములనపహరించినావని బూటకానకు దిట్టేరు (లోపల నీ చిలిపి తనమునకు సంతోషించినా పైకి నటిస్తూ తిట్టినారు).

ఆ తిట్లే నీకు ఒక గొప్ప పుష్పయాగము. ఈటెన (ఇటుపైన) ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు నిత్య పెళ్ళికొడుకువై మా అమ్మ అలమేల్మంగమ్మను పూటపూటకు రతుల నోలలాడించుచున్నావు. ఆరతులేమా ఆరతులై నీకు ఒక గొప్ప పుష్పయాగం అయింది తండ్రీ!

సంపుటి : 7 కీర్తన : తనకే తెలుసునమ్మ తమకపు వేడుకలు
సంఖ్య : 195 పుట : 119 - రాగం : శ్రీరాగం

54. తనకే తెలుసునమ్మ తమకపు వేడుకలు
కొనచూపుల నవ్వీని గోవిందరాజు ॥పల్లవి॥

పడఁతులిద్దరు తనపాదములొత్తఁగాను
నడుమఁ గొడుకుఁగనె నగుతాఁ దాను
పొడమి కాంతలకుఁగా పురుషుఁడు బిడ్డఁగన్న
కొడిమెలు గట్టుకొనె గోవిందరాజు ॥తనకే॥

సేదదేరి యీ చెలుల చేతి చెమటలఁ దోఁగి
పాదాలఁ గూఁతురుఁగనెఁ బై పైఁ దాను
ఆదిగొని మగవాఁడు ఆఁడువారికి వేఁకటై
సాదుఁదనము మోచెనిచ్చట గోవిందరాజు ॥తనకే॥

పెనఁగి లక్ష్మీభూముల ప్రేమపుటంగాలు సోఁకి
మనసున బిడ్డఁగనె మరిగి తాను
వనితలకు మగఁడు వరుసకానుపుగనె
కొనబు శ్రీ వేంకటాద్రి గోవిందరాజు ॥తనకే॥

ఉపోద్ఘాతము :

తిరుపతిలో నెలకొన్న శ్రీ గోవిందరాజస్వామిపై సరసశృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. "పెనగి లక్ష్మీభూముల ప్రేమపుటంగాలు సోకి మనసున బిడ్డగనె మరిగితాను, వరుస కానుపులు గనె వనితలకు మగడు" అంటున్నారు. ఏదో అర్థమవుతోంది అనిపించినా...యేమీ అర్థం కాని కీర్తన ఇది. తోటి చెలికత్తెలతో తానూ ఒకతెయై చెబుతున్నారు అన్నమయ్య.

తాత్పర్యము :

ఓ చెలియా! తమకము (శృంగార పారవశ్యము)న కలిగే వేడుకలు యెట్లాంటివో, తనకు మాత్రమే తెలుసునమ్మా! అందుకనే నర్మగర్భంగా ఈ గోవిందరాజస్వామి కొనచూపుల (క్రీగంట) నవ్వులొలికిస్తున్నాడు.

భూదేవి శ్రీదేవి అనే ఇద్దరు భార్యల ముద్దుల మగడు ఆ స్వామి. ఆ ఇద్దరూ ఆయన పాదాలు ఒత్తుతున్నారు. నడుమ (ఈ మధ్యలో) నవ్వుతూనే ఈయన ఒక బిడ్డను కన్నాడు.కాంతలకు బదులు పురుషుడు బిడ్డను కనటం యెక్కడైనా వున్నదా? ఈ గోవిందరాజు ఆ కొడిమెలు (అపఖ్యాతులను) కూడా పొందాడు. ఎవరికోసం? మనకోసం. ఆ బిడ్డే బ్రహ్మదేవుడు. ఆయన (బ్రహ్మ) వలననే సృష్టి జరుగుతోంది కదా!

శృంగారంలో అలసిన ఈ వనితల చేతి చెమటలలో మునిగిన ఈస్వామి పాదాలనుండి ఆ చెమట వరదలా పారింది. అదే సురగంగకి (ఆకాశగంగానదికి ఆవిధంగా ఆయన తండ్రి అయ్యాడు.) పైపై (తనమీదనుంచే) తాను ఆడువారికి వేకటై (గర్భము ధరించి) ఇచ్చగ ఈగోవిందరాజు సాదుతనము మోచె (మంచి భర్త అయ్యాడు).

ఇదేమిటయ్యా! మేమూ బిడ్డల తల్లులమవుతామంటే మంచికి, చెడుకి, ఆయనే కారణం కాబట్టి, పెనగి (ఉద్యుక్తుడై) లక్ష్మీదేవికి, భూదేవికీ ప్రేమపు, అంగములను స్పృశించి తన మనోశక్తితో తాను మరిగి బిడ్డను గనె (వారలకు బిడ్డలను ప్రసాదించాడు). అదీ వరుస కానుపులలో భూదేవికి నరకాసురుని, శ్రీదేవికి మన్మథుని ప్రసాదించాడు. మరి ఈ గోవిందరాజు నిజానికి యెవరు? శ్రీ వేంకటాద్రి కొనబు(పు) వాడు (శిఖరమువాడు). ధన్యోస్మి...

సంపుటి : 7 కీర్తన : కొమ్మలాల యిదె మంచి కొలువువేళ
సంఖ్య : 449 పుట : 276 - రాగం : గౌళ

55. కొమ్మలాల యిదె మంచి కొలువు వేళ
చిమ్ముచు విన్నపాలెల్లఁ జేయరే యిపుడు ॥పల్లవి॥

భామఁ దొడపైనిడుక ప్రహ్లాద వరదుఁడు
ఆముకొని సరసములాడుచున్నాఁడు
దోమటి వలపులను తొప్పఁదోఁగి చెమటల
ఆమని వేడుకలనోలలాడుచున్నాఁడు ॥కొమ్మ॥

చెలి విడెమియ్యఁగాను శ్రీ నారసింహుఁడు
నలువంకఁ బకపక నవ్వుచున్నాఁడు
పులకల జొంపముల పవ్వుదండలతోడ
చెలరేఁగి మచ్చికలు సేయుచున్నాడు ॥కొమ్మ॥

పొంది లకిమమ్మతోడ బొమ్మి రెడ్డిచెర్ల హరి
యిందరి శ్రీ వేంకటేశుఁ డేలుచున్నాఁడు
సందడిరతులఁ జొక్కి జవ్వనమదము మించి
మందె మేళాము సేసుక మన్నింపుచున్నాఁడు ॥కొమ్మ॥

ఉపోద్ఘాతము :

బొమ్మిరెడ్డి చెర్ల అను గ్రామమున నెలకొన్న నృసింహదేవునిపై సరసశృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. లకిమమ్మ (లక్ష్మీదేవితో) కూడి ఈ శ్రీహరియే శ్రీవేంకటేశుడై "మందెమేళము సేసుక మన్నింపుచున్నాడు" అంటున్నారు. అంటే యేమిటి అని అడుగనేల? తాత్పర్యం చదివితే సరిపోదా? జవ్వన మదమున సందడి రతుల జొక్కియున్నాడట ఆ "సింగమలై".

తాత్పర్యము :

ఓ కొమ్మలాల (కోమలులారా!) ఇదిగో ఇదే మంచి సుముహూర్తము. శ్రీ నృసింహుడు కొలువుదీరియున్నాడు. చిమ్ముచు (ఉత్సాహముతో) మన విన్నపములను యెల్లా చేయుదము రారండు.

ఆ ప్రహ్లాద వరదుడు భామన్ (శ్రీలక్ష్మిని) తన తొడపై నిడుకొని (కూర్చుండ బెట్టుకొని) ఆముకొని (క్రమ్ముకొని) సరసముల నాడుచున్నాడు. దోమటి వలపులను (సమ్మోహనముచేయు వలపుల అలసటతో) చెమటల వెల్లువలో తడిసియున్నాడు. ఆమని వేడుకల (వసంతోత్సవముల వేడుకలో) ఓలలాడుచున్నాడు. ఈయనను సేవించి తరించండి.

శ్రీదేవి ఆయనను ఆహ్వానించి విడెమియ్యగా (తాంబూలమునిచ్చి షోడశోపచారముల జేయగానే) ఆనందముతో పకపకమని నవ్వుచున్నాడు. సంతోషంతో ఆయన తనువు పులకల జొంపముల (అధికముగా పూచిన పులకరింతల వెల్లువలో చెలరేగి (విజృంభించి) ఆమెతో మచ్చికలు సేయుచున్నాడు. (స్వాధీనము జేసికొనుచున్నాడు.)

ఈ బొమ్మిరెడ్డి చెర్ల అనే గ్రామమునకు చెందిన) హరి (నృసింహుడు) లకిమమ్మ (లక్ష్మీదేవితో) పొంది (కూడినవాడై), ఇందరినీ యేలుచున్నాడు. శ్రీ వేంకటేశ్వరుడూ తానేయై మించి (అధికుడై) యౌవన గర్వముతో. సందడి రతుల (అతిశయించిన శృంగారలీలతో) జొక్కియున్నాడు (అలసిపోయి వున్నాడు). మందెమేళము సేసుక (స్నేహభావన లెల్లా చూపించుచూ) తన భక్తులను మన్నింపుచున్నాడు. ఈ దేవదేవుని సేవించి తరించండి.

సంపుటి : 7 కీర్తన : ఎందాకా వేసరించేనిదివో నిన్ను
సంఖ్య : 492 పుట : 302 - రాగం : సాళంగనాట

56. ఎందాక వేసరించేనిదివో నిన్ను
పొందితే నీకాఁగిటిలో పొసఁగేదే కాకా ॥పల్లవి॥

చిగురుఁ గొమ్మకు నెంత చేగలెక్కినా మేలే
మగువనెంత వెంచినా మాకుమేలే
జగడాల కేమి వని సాదువలెనుండి నీవు
మొగము చూచినంతలో మొక్కేదే కాక ॥ఎందా॥

వలరాజునమ్ము కెంత వాఁడివెట్టినా మేలే
చెలిని నీవెంత సింగారించినా మేలే
చలపోర మరియేల చనవుకొలఁదినే
పలిచినప్పుడే నీతోఁ బెనఁగేదే కాక ॥ఎందా॥

బంగారు ప్రతిమ కెంత ప్రాణము వోసినా మేలే
అంగనకెంత లోనైనా మేలే
సంగతి శ్రీ వెంకటేశ సరి నన్నుఁ గూడితివి
పొంగి నీవు చెనకితే భోగించుటే కాక ॥ఎందా॥

ఉపోద్ఘాతము :

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునికి చక్కటి ఉపాయము చెబుతున్నారు. ఇదిగో ఓ స్వామీ! నిన్ను అడవి యెంతదాక సాధిస్తుంది? ఒక్కసారి నీ కౌగిటి సుఖం పొందితే నీకు పొసగదా! అందులోనూ ఆమె నివాసమే నీయెద. నీవు ఆమెనొక్కసారి తాకితే భోగించుటగాక ఇంకా ఇంకేముంటుంది!

తాత్పర్యము :

ఓ ప్రభూ! నేను (అలమేల్మంగ) నిన్ను యెందాక ఇట్లు వేసరించేను (కష్టపెడతాను? నిన్ను కలిసిన పిమ్మట యెలాగైనా నీ కౌగిటిలో కరిగిపోయేదేకదా!

చిగురుబోడియైన ఆడది యెంత చేగలెక్కినా (చేవ పొందినా?) మగువ, "నెంత మాకు వెంచినా" (యెంత మంకుతనము పెంచినా) నీకు మేలే. ఎందుకంటే ఎంత జగడాలమారియైనా నీ మొగము జూచినంతనే సాధువువలె నీకు మొక్కేదేకదా! మరి ఇంకా నీకు దిగులెందుకు స్వామీ!

ఆ వలరాజు (మన్మథుడు) తన అమ్ముకు (బాణమునకు) ఎంత పదును బెడితే నీకు అంతమేలే. నన్ను నీవెంత సింగారిస్తే నీకు అంతమేలు కలుగుతుంది. నేను చలపోర (మత్సరముతో యెంత పోట్లాడినా) నీవు చనువు జూపి పిలిచినప్పుడు నీతో పెనగేదే కాక (పెనగులాడేదే కదా!)

బంగారు బొమ్మకు యెంతప్రాణం పోస్తే నీకు అంత మంచిది కదా! మొగవాడు రతిలో ఆడదానికి యెంత లొంగినా మేలేకదా! ఓ శ్రీవేంకటేశ్వరా! సరి సంగతి (సమభోగములో) నన్ను కూడితివి. నీవు పొంగి (అతిశయించి) చెనకితే (తాకితే) భోగించుటేకాక! (ఇక శృంగారమున సుఖించుటే కదా!

సంపుటి : 7 కీర్తన : మదనుని తండ్రికి మజ్జనవేళ
సంఖ్య : 493 పుట : 302 - రాగం : శ్రీరాగం

57. మదనుని తండ్రికి మజ్జన వేళ
పొదిగొనీ సింగారపు భోగములెల్లాను ॥పల్లవి॥

పడఁతుల నవ్వులెల్లా పైనంటుకొన్నట్టు
కడలేక పొగడొందెఁ గప్పురకాపు
నిడవిఁ గల్పవృక్షము నిండాఁ బూచినట్టు
కడుఁ దెల్లనై యమరెఁ గప్పురకాపు ॥మదను॥

సుదతుల చూపులు సొరిది పైఁగప్పినట్టు
పొదిగొని జొబ్బిలీని పుణుఁగుకాపు
అదన నల్లగలువలట్టె ముంచుకొన్నట్టు
పొదలెఁ దిరుమేనను పుణుఁగుకాపు ॥మదను॥

అలమేలుమంగ పురమందుండి యనురాగము
కులికినట్టు పన్నీరుఁగుంకుమకాపు
యెలమి శ్రీ వెంకటేశుఁడిన్ని సొమ్ములు నించుక
కొలువెల్లా నిండుకొని (నీఁగుం?) కుంకుమకాపు. ॥మదను॥

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటేశ్వరునికి ఆయన దేవేరులకు మజ్జనానంతరం కర్పూరకాపువేసి, పుణుగుకాపువేసి, పన్నీరు కుంకుమ కాపువేసి సేవచేసేవారు అన్నమయ్య. అందాల మన్మథుని తండ్రిగారైన ఆ దేవదేవునకు సింగారము వైభోగంగా జరుగుతుంది.

అలమేల్మంగను ఉదరమున దాల్చిన స్వామికి యెన్నో సొమ్ములు(నగలు) ధరింపచేసి పరవశిస్తారు భక్తులు. మనమూ అదేపని చేద్దాం.

తాత్పర్యము :

సాక్షాత్తు మన్మథుని యంతటి అందగానికి జన్మనిచ్చిన తండ్రి శ్రీమన్నారాయణుడు. ఆయనకు మజ్జనవేళ (స్నానముచేయించు సమయమున), సింగారములు (అలంకరణలు) భోగములు (వస్త్రాలంకరణము, భూషణాలంకారము, నైవేద్యము మొదలైనవి) యెల్లా పొదిగీని (అన్నీ జరుగుతున్నాయి).

ఆయన దేవేరుల నవ్వులన్నీ ఆయన శరీరానికి అంటుకొన్నట్లున్న కప్పురకాపు (కర్పూరపు పూత) కడలేక (అంతులేక) పొగడొందె (కొనియాడబడినది). దివిలోని కల్పవృక్షము విస్తృతంగా పూలు పూచినట్లు యెంతయో తెల్లదనముతో ఆ కప్పురకాపు స్వామికి అమరియున్నది.

సుదతుల (శ్రీదేవి భూదేవి) చూపులే చక్కగా ఆయనపై గప్పినట్టి పుణుగుకాపు (పునుగు పిల్లినుంచి వచ్చిన సుగంధ ద్రవ్యముతో వేసిన పూత) వలెనున్నది. అది పొదిగొని జొబ్బిలీని (అధికమై స్రవించుచున్నది). అందుచేత ఆ దేవేరులు నల్ల కలువల వలె శోభిల్లుచున్నారు. పవిత్రమైన వారి శరీరాలపై ఆ పుణుగుకాపు అందములొలుకుచున్నది.

అలమేలు మంగమ్మ ఆయన వురముపై అనురాగముతో కులుకుచూ వున్నట్లు పన్నీటితో తడిసిన కుంకుమపూత స్వామికి వేసినారు. ఎలమి (సంతోషముతోనున్న) శ్రీ వేంకటేశ్వరుడు సొమ్ములు నించుక (నగలన్నీధరించి) కుంకుమ కాపుతో తన సభలో కొలువుదీరియున్నాడు. ఈ మహానుభావుని సేవించి తరించండి.

సంపుటి : 7 కీర్తన : తాను చేసినచేత తరుణి మేనను నిండె
సంఖ్య : 561 పుట : 343 - రాగం : శంకరాభరణం

58. తాను చేసినచేఁత తరుణిమేనను నిండె
వీనులు చల్లఁగ నిట్టె విన్నవించరే ॥పల్లవి॥

జక్కవ గుబ్బలమీఁద చంద్రోదయములాయ
చుక్కలు మొలచెనిదె సొంపు మోవిని
అక్కజపుతురుమున నద్దమరేతిరి నిండె
వెక్కసపుపతికిది వేళ చెప్పరే ॥తాను॥

కనుచూపు తామెరల గక్కుననుఁ దెల్లవారె
యెనయని తలపోఁతనెండలు గాసె
పనివడి విరహాన పట్టపగలై తోఁచె
ననిచిన పతికి సన్నలు సేయరే ॥తాను॥

వడిగొన్న జవ్వనాన వసంతకాలము వచ్చె
పొడవైన కళలను పున్నమ గూడె
యెడమిచ్చి శ్రీ వేంకటేశుఁడింతలోఁ గూడె
బడివాయకుండఁ దన్ను బాసగొనరే. ॥తాను॥

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటేశ్వరుడు చేసే చిలిపి చేష్టలతో తరుణి దేహం నొచ్చింది. మా చెవులు చల్లబడుతున్నట్లు ఆ సంగతులన్నీ చెప్పండే– అని చెప్పుకొంటున్నారు, అమ్మవారి చెలికత్తెలు. అన్నమయ్య కూడా ఒక చెలికత్తెయై యెంతరసవత్తరంగా చెబుతున్నారో వినండి.

తాత్పర్యము :

ఆ స్వామి, తాను చేసిన చేతలన్నీ (చిలిపి పనులన్నీ) ఆ తరుణి మేనను (శరీరంపై) నిండియున్నాయి. మా చెవులు చల్లబడునట్లు, ఇట్టే అవన్నీ వివరించండమ్మా!

జక్కువ పిట్టలవంటి పొంకమైన స్తనయుగ్మం మీద చంద్రోదయమైనది (అర్ధచంద్రాకారపు గాట్లు తేలినవి.) సొంపైన అధరముపై దంతక్షతములను చుక్కలు మొలచినవి. సంభ్రమము కలిగించు కేశపాశము అర్ధరాత్రి పెనుచీకటివలె వ్యాపించినది. వెక్కసపు పతికి (సర్వాధికుడైన ఆ వేంకటపతికి) వేళ అయిందని చెప్పండమ్మా!

గభీలుమని తెల్లవారింది. ఆయన గురించి అంతులేని ఆలోచనలను యెండలు విపరీతముగా కాసినవి. అదేపని అన్నట్లు విరహముతో పట్టపగగా యేమిటిది? అనిపించింది. మరి పట్టపగలు తామరపూలు విచ్చుకొనవా? ఆమె పద్మముల వంటి తన కన్నులను విచ్చినది. ఇక ననిచిన (అతిశయించిన) ఆ వేంకటపతికి సన్నలు సేయరే (సైగలు చేసి) రమ్మని చెప్పండమ్మా!

విజృంభించిన ఆమె యౌవనమున ఆమని వెలసినది. అంతులేని కళలతో పున్నమి పూచినది. ఇంతసేపు యెడబాటునిచ్చి ఆమెను వేపిన శ్రీ వేంకటేశ్వరుడు ఇంతలోనే ఆమెను కూడినాడు. ఆమెను బడివాయకుండా ఆయనవద్ద బాస తీసికోండమ్మా! (త్వరగా... మళ్ళీ చిక్కుతాడో లేదో..)

సంపుటి : 7 కీర్తన : చేకొనుమీ నల్లబల్లి చెన్నకేశవా
సంఖ్య : 534 పుట : 327 - రాగం : సాళంగ నాట

59. చేకొనుమీ నల్లఁబల్లి చెన్నకేశవా
యీకడ నీ కిన్నిటికినిదివో మొక్కేను ॥పల్లవి॥

పొంచినీవు విలిచితే బొమ్మల జంకించితిని
మంచముపై నుండితిని మన్ననలను
కంచముపొత్తుకుఁ దియ్యగా నీతోఁ బెనఁగితి
యెంచకు మీ యీనేరాలిదివో మొక్కేను ॥చేకొను॥

సరసము నీవాడితే సారెసారెఁ దిట్టితిని
సిరులఁ జెనకితేనే చెలఁగితిని
శిరసు వంచుకొంటిని చెరఁగు నీవు వట్టితే
యెరవు సేయకు నన్నునిదివో మొక్కేను ॥చేకొను॥

సెలవి నీవు నవ్వితే సిగ్గులు పైఁజల్లితిని
సొలసి చెక్కు నొక్కితే చొక్కితి నేను
కలసితివిదె శ్రీ వెంకటగిరినుండి వచ్చి
యెలమిఁ దమకించకు యిదివో మొక్కేను. ॥చేకొ॥

ఉపోద్ఘాతము :

నేటి కడపజిల్లాలోని నల్లబల్లిలో నెలకొన్న చెన్నకేశవస్వామిపై సరస శృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. మమ్మల్ని దరిజేర్చుకొని అనుగ్రహించవయ్యా! ఇదిగో వీటన్నిటికీ నీకు మొక్కేము అని అంటున్నారు. నీకు మొక్కుతాము కానీ మమ్మల్ని తమకించకయ్యా! అంటున్నారు అంటే ఏమిటి? మామూలుగానే అన్నమయ్య

కూడా స్వామిని వలచిన జవ్వనియే! పాపం ఆ యువతి ఈ చెన్నకేశవునితో వేగలేక యేమంటోందో వినండి.

తాత్పర్యము :

నల్లబల్లి గ్రామములో వెలసిన చెన్నకేశవా! నన్ను చేకొనుమీ (అనుగ్రహింపుము ప్రభూ!) నీకిన్నిటికిన్ (లీల లన్నిటికీ) ఇదివో ఈకడ (ఇదిగో ఇక) మొక్కుతున్నాము. మమ్ము కనికరింపుము స్వామీ!

ప్రభూ! నీవు చాటుగా నన్ను విలిచితే (పిలిస్తే) నేను బొమ్మల జంకించితిని (కనబొమ్మలతోనే నిన్ను బెదిరించాను.) నీతో మన్ననలను మంచముపై నుండితి (మంచి పక్కమీదకి కూడా చేరాను). కలిసి ఒకే కంచంలో తిన్నప్పుడు కలహించాను కూడా. ఇదిగో స్వామీ! ఇవన్నీ నేరాలుగా పరగణించకు. నీక మొక్కుతానయ్యా!

స్వామీ! బాహాటంగా నాతో సరసాలాడితే మాటిమాటికీ నిన్ను తిట్టాను. ఎక్కడెక్కడో స్పృశిస్తే చెలరేగిపోయాను. నన్ను చేరి పట్టుకోగానే సిగ్గుతో శిరసువంచుకొన్నాను. అందుకుగాను నన్ను ఎరవు సేయకు (విభేదించకు). ఇదిగో ఇక నీకు మొక్కెదను ప్రభూ!

ప్రభూ! నీవు నర్మగర్భముగా సెలవి నవ్వితే (చిరునవ్వు నవ్వితే) నా సిగ్గులన్నీ నీపై వెదజల్లాను. నా చెక్కిళ్ళు నొక్కితే సొక్కి పరవశించాను. శ్రీ వేంకటగిరినుండి ఈ నల్లబల్లి వచ్చి నన్ను, ఎలమి (సంతోషముతో) తమకించకు (తొందరపెట్టకు). నీకు ఒక నమస్కారం పెడతాను. నీతో నేను వేగలేనయ్యా చెన్నకేశవా!

సంపుటి : 7 కీర్తన : ఏల చెప్పేవు నీ సుద్దులు ఎందాకా మాతోను
సంఖ్య : 207 పుట : 126 - రాగం : బౌళి

60. ఏల చెప్పేవు నీ సుద్దులు యెందాఁకా మాతోను
పాలు మాలకింతలోనే బమ్మచారివైతివి ॥పల్లవి॥

ఎలమి గొల్లెతలను యెన్నాళ్ళు పొంది పొంది
తొలఁగి మధురలోన దొరవైతివి
కొలఁది ఆవులఁగాచి గొల్లవాఁడవై యుండి
వలవంత నేఁడు రాచవాఁడవైతివి ॥ఏల॥

వేడుకలకింటింట వెన్నదొంగిలి నేఁడు
ఆడ ద్వారకలో సోమయాజివైతివి
వోడక రుక్మిణీదేవినూరకే యెత్తుకవచ్చి
పాడితోనగ్రపూజకు పాత్రుఁడవైతవి ॥ఏల॥

రక్కసుల కాఁవురాలు రచ్చలకెక్కఁ జెరచి
పెక్కు ధర్మాలు నిలిపి పెద్దవైతివి
చిక్కువాసి నన్నుఁగూడి శ్రీ వేంకటాద్రిమీఁద
దిక్కుల నిందరిపాలి దేవరవునైతివి. ॥ఏల॥

ఉపోద్ఘాతము :

ఓ దేవదేవా! నీ కథలు యెన్నని యెంతని చెప్పెదనయ్యా! అని శ్రీ కృష్ణపరమాత్మ అయిన శ్రీ వేంకటేశ్వరునితో చెబుతున్నారు అన్నమయ్య! పరీక్షిత్తు మృతశిశువుగా జన్మించాడు. అస్ఖలిత బ్రహ్మచారి ఆ బిడ్డనెత్తుకుంటే తిరిగి జీవిస్తాడన్నాడు వ్యాసుడు. భీష్ముడు కూడా తనకా 'అర్భత' లేదన్నాడు. శ్రీ కృష్ణుడు ఎత్తుకొంటే కేరుకేరుమని

బిడ్డ ఏడ్చాడు. ఈయన బ్రహ్మచారా!! అని నాబోటివాళ్ళు నోరు వెళ్లబెట్టారు. అన్నమయ్య ఈ కీర్తనే అందుకున్నాడు. మరి ఈ వేంకట కృష్ణుని లీల వినండి.

తాత్పర్యము :

ఓ దేవదేవా! నీ సుద్దులు (కథలు) మాతోను యెందాక చెప్పేవు? ఇంతలోనే పొలుమాలకి (పొరబాటున) బ్రహ్మచారివైపోయినావు. (ఈ గొల్లెతలు-నీ అష్ట భార్యలు-పదియారు వేలమంది రాచకన్నెలు... వీరి సంగతేమిటి?)

ఎలమి (సంతోషముతో) నందవ్రజములోని గొల్లెతలందరిని యెన్నాళ్ళు రమించావు? అక్కడనుంచి తొలగిపోయి మధురకు ఏలికవైనావు. కొలది (కొన్ని) ఆవులను రేపల్లెలో కాచుకొనేవాడివి నేడు వలవంత (విరహము) నిచ్చే రాచబిడ్డవైనావు.

వేడుకలకు (అవసరం లేకపోయినా సరదాకి) ఇంటింటికీ పోయి వెన్నను దొంగిలించావు. ఆడ (అక్కడ) ద్వారకానగరంలో సోమయాజివైతివి (యజ్ఞములు నిర్వహించిన యజ్ఞనారాయణుడవైనావు). ఓడక (ఓటమినెరుగక) ఊరకనే రుక్మిణీ దేవిని యెత్తుకొని వచ్చినవాడివి, పాడితో (సగౌరవంగా) రాజసూయ యాగానంతరం అగ్రపూజకు అర్హుడవైనావు.

అనేకమంది రాక్షసుల కండకావరాన్ని బజారుకీడ్చి చెరిచావు. ఆర్షధర్మాన్ని నిలబెట్టి పెద్దవైతివి, (సర్వాధికుడవయినావు). నేడు చిక్కువాసి (సంకటములన్నీ తీరి) శ్రీ వేంకటగిరిపైన నన్ను కలిసి ఇంతమంది పాలిటి దిక్కువై, దేవుడవై అనుగ్రహించుచున్నావు. "అన్యధా శరణం నాస్తి, త్వమేవ శరణం మమ".

సంపుటి : 7 కీర్తన : తనకు నాకు నెప్పుడు తగులేకదే
సంఖ్య : 562 పుట : 344 - రాగం : పాడి

61. తనకు నాకు నెప్పుడు తగులేకదే
మనసు మర్మమునకు మందిదే కదే ॥పల్లవి॥

మొక్కలాన నటు చను మొనలు నే మోపితేనే
వెక్కసీఁడు తనకిఁక వెరపేఁటికే
జక్కవపిట్టలు నావి జవ్వన వనమె తాను
యెక్కడపోవును వాని కిరవే కదే ॥తనకు॥

సంతోసపుఁ జూపులచక్కెర నేఁజల్లితేను
పంతగాఁడు తానేల భ్రమసీనే
కంతువిండ్లు నా బొమలు గవిశన తనమేను
పొంతనెంచి చూచుకొంటే పొందులే కదే ॥తనకు॥

బలిమి కాఁగిటఁ దనపైఁ జేతుల వేసితేను
యెలమి శ్రీ వెంటేశుఁడేల నవ్వీనే
జలజములివి నావి సరవిఁ బూజ తనది
నిలుకడలకు నివి నిజమే కదే ॥తనకు॥

ఉపోద్ఘాతము :

ఈ కీర్తనలో పదములను కూర్చుకొని అర్థం సమన్వయం చేసుకొనవలెను. లేకుంటే ఒక పట్టాన అర్థం కాదు. అలమేల్మంగ తన చెలికత్తెతో (అన్నమయ్యతో) తనకి (శ్రీవారికి) నాకు (దేవికి) ఎప్పుడూ పోట్లాటేకదుటే! అంటున్నది. నా మనసులోని

మర్మమునకు మంచిదేకదా! అంటున్నది. కవి హృదయం అంత తేలికగా అర్థంకావటం లేదు. బాగుగా అనుసంధానించాక నాకు తట్టిన భావము వివరిస్తున్నాను. ఆచార్యుల వారి ఆలోచన వేరయితే... అది నా మట్టిబుఱ్ఱకి తట్టలేదని నిట్టూర్చటం తప్ప నేను చేయగలిగిందేముంది?

తాత్పర్యము :

ఓ చెలీ! తనకూ నాకూ యెప్పుడూ తగులే (ఒకరితో ఇంకొకరికి పోటీ) కదుటే! నా మనసులోని మర్మము (దాగినమాట) నీకు చెప్పుకుంటాను. అది మంచిదే కదే!

నేను మొక్కలాన (కొంటెతనముతో) నా స్తనాగ్రములను ఆయనపై మోపుతాను. ఆయన వెక్కసీడు (ధీరుడు) కదా! తనకు వెరపేటికి (జంకెందుకు)? నావి (నా కుచములు) జక్కువ పిట్టలు, ఆయన యౌవనమే సాకారమైన వనము. మరి ఆ జక్కువ పిట్టలు ఆయన దగ్గరకు పోక యెక్కడికి పోతాయి? ఆయనే వాటికి ఇరవు (గమ్యస్థానము)

సరే! నేను ఆయనను చూచినాననే సంతోషంతో,నా చూపులు అను చక్కెర జల్లు కురిపించాను. అంతమాత్రాన అంత పట్టుదల గల ఆయన భ్రమపడుట యెందుకో, మరి? పోనీ.. నా కనుబొమ్మలు 'కంతువిండ్లు' (మన్మథుని విల్లులే) అను కొందాము. మరి నల్లని ఆయన మేను (శరీరము), గవిశన (విల్లంబులు దాచియుంచు చీకటి కొట్టు) వలె యున్నది కదా! పొంతన (పోలిక) చూచుకొంటే సరిపోయింది కదా!

తన గాఢ పరిష్వంగములో నేను వివశురాలనై ఆయన పై చేతులు వేస్తే ఈ శ్రీ వేంకటేశ్వరుడు కొంటెగా ఎందుకు నవ్వుతాడే? నావి (నా చేతులు) ఇవి... జలజములు (తామరపూలు) వాటి ఉపయోగమేమిటి? ఆయన పూజకి కాకపోతే అవెందుకు? నిలుకడలకున్ (వాటి ఉనికియే) ఆయనకదా! ఇది నిజమే కదా!

సంపుటి : 5 కీర్తన : చిన్ననాడు మద్దులు వంచిన వాడుతా
సంఖ్య : 156 పుట : 106 - రాగం : ముఖారి

62. చిన్ననాఁడు మద్దులు వంచినవాఁడు తా
నున్నవాఁడే యిపుడు నాయెడయఁడై నేఁడు ॥పల్లవి॥

గోవులఁ గాచినవాఁడు గొల్లెతల మేనిగబ్బుఁ
దావుల పెనుభ్రమలఁదగులువాఁడు
కోవిదుఁడెట్లనాయఁ గోమలులఁబదియారు
వేవురను వలపించే వెరవరెట్టాయెనే ॥చిన్న॥

వెన్నలారగించువాఁడు విడువక వెకలియై
కన్నచోనే తిరిగేటి గద్దరీఁడు
వన్నెకాఁడెట్టానాయపడి గోపవనితల
నెన్నరాని చేఁతలెల్ల నెట్టు సేసినాఁడే ॥చిన్న॥

కొండలెక్కి దాఁటువాఁడు కొండమోచునట్టివాఁడు
కొండలే నెలవుగాఁ గైకొన్నవాఁడు
కొండుక సాయపువాఁడు గుబురైన తిరుమల
కొండమీఁద నెలకొన్న కోనేటివాఁడు. ॥చిన్న॥

ఉపోద్ఘాతము :

బాలకృష్ణునిపై మధురమైన కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. బాలునిగా నున్నప్పుడే తనను కట్టేసిన తోటిని రెండు మద్దివృక్షాల మధ్యగుండా ఈడ్చుకొని వెళ్ళి ఆ మద్దులను గూల్చి మద్దుల వలెనున్న నలకూబరునికి మణికంధరుడికి (కుబేరుని కొడుకులు) శాపవిమోచనం కలిగించినవాడు ఆ దేవదేవుడు. అట్టున్నవాడు ఇప్పుడు నాయెడయడై వున్నాడంటున్నారు. కొండలెక్కి దాటినవాడు,

కొండమోచినవాడు కొండుకపాయపువాడు, తిరుమలకొండమీద కోనేటివాడట. అంటే యేమిటో తెలిసీ తెలియనట్లుగా వుంది కదా! ఇంతకీ ఒడయడు అంటే ప్రియుడని అర్థం. కొండలే నెలవైన వాడట, యెవరో తెలుసా? ఇటువంటి కీర్తనలను తక్కువ అంచనా వేయకూడదు.. మరి.

తాత్పర్యము :

చిన్ననాడే (పారాడే బాలునిగా వున్నప్పుడే) రెండు మద్దిచెట్లను వంచిన (మద్దిచెట్ల మధ్యలో తోలును లాగుటవలన అవి వంగి విరిగిపోయినవి అని భావము) వాడు, నేడు (యిపుడు) నా యెడయడై (నామగడై) తాను యెదుటనే వున్నాడు.

ఈ చిన్నవాడెటువంటివాడంటే.. రేపల్లెలో గోవులు కాచినవాడు. గొల్లభామల వంటిపై నుండి వచ్చే 'గొల్లకంపు'పై గొప్ప భ్రమతోనుండేవాడు. అట్టివాడు గొప్ప పండితుడెట్లయినాడే? పదియారువేలమంది కోమలులైన రాచకన్నెలను యెట్లు వలపించుకొని పెండ్లియాడినట్టి, వెరవరి (జీవనదాత) యెట్లాయెను? గొప్ప ఆశ్చర్యముగానున్నది.

దొంగతనంగా వెన్నలారగించిన ఈ అల్లరి పిల్లాడు నేడు వెకలియై (వ్యామోహితుడై) కన్నెలవెన్నంటి తిరిగే దగ్గరీడు (గడుగ్గాయి). నేడు మనం చూస్తుండగానే వన్నెకాడు (అందాలయువకుడు) ఎట్లయ్యాడు? గోపికలతో చెప్పరాని చిలిపి చేష్టలెట్లు చేయుచున్నాడే?

ఇంకా చెప్పాలంటే వీడు, కొండలరాయడు. (ఆంధ్రదేశంలో కొండలరావు పేరు ఈయనదే) ఈయనేం చేశాడో తెలుసునా? కొండలెక్కి దాటుకొంటూ గోవులను కాశాడు. కొండను యెత్తినవాడు (గోవర్ధనగిరిని చిటికెన వ్రేలిపై యెత్తినవాడు) కొండలే నెలవుగా (వాసముగా) గైకొన్నవాడు (నృసింహమూర్తి), కొండుక పాయమువాడు (కోడెవయసు చిన్నవాడు). నేడు గుబురైన (దట్టమైన) తిరుమలకొండపై ఆవాసమైయున్న కోనేటిరాయుడైన శ్రీవేంకటేశ్వరుడైయున్నాడు.

సంపుటి : 5 కీర్తన : వలపు నిలుపలేని వారమునేమటుగాన

సంఖ్య : 77 పుట : 53 - రాగం : ఆహిరి

63. వలపు నిలుపలేని వారము నేమటుగాన
పలుమారుఁ బట్టుకొన్నఁ బయికొనవేలరా ॥పల్లవి॥

ఒత్తి నీవాడినమాటకోరువఁ జాలక నే-
ముత్తరమిత్తుము గాని ఊరకుండలేములరా
బత్తి గొట్టానఁ బెట్టఁగఁ బనిలేదు వోరి నీ-
చిత్తమింతేకాని యిఁకఁ జెప్పనేమున్నదిరా ॥వలపు॥

కాఁకలఁ బెరిగినట్టి కళవళమున నిన్నుఁ
దాఁకనాడుదుము గాని తడవుండలేములరా
యేఁకటఁ జెందినయట్టి యింతుల మాటకు నీవు
సోఁకోరువవలెఁ గాక చురుకనరాదురా ॥వలపు॥

సారెకు నీవెడసిన సైఁచలేము నీవు
చేరువనలిగి మమ్ముఁ జేకొనవేరా
ధీరుఁడవు కోనేటితిరువెంకటేశ నన్ను
గారవించి యిట్లానే కరుణించఁగదరా ॥వలపు॥

ఉపోద్ఘాతము :

శృంగారరాయని వలచిన నేరానికి ఆయనని యెంతో బ్రతిమిలాడవలసి వస్తున్నది. అన్నమయ్య తానే నాయికయై ఆ తిరుమలేశుని యెంత బ్రతిమిలాడుతున్నారో చూడండి. మేము వలపు నిలుపలేని వారము. ఎన్నో పర్యాయములు పట్టుకొని నీపైకి లాగుకొంటే మేము చేయగలిగిందేముంది? అట్లు పైకొనవేలరా అని ప్రశ్నిస్తున్నారు.

ప్రణయ కోపంలో తాపమెక్కిన నాయిక 'రా' కొట్టినా తప్పు పట్టవలసిన పనిలేదు. అందరూ చేసేదదే. అంతా అయ్యాక.. ఆగ్రహం చల్లబడినాక తనను ఇట్టానే కరుణించగదరా! అంటున్నారు.

తాత్పర్యము :

ఓ రాయడా! మేము నిన్ను వలచిన వారమేగాక వలపు నిలువరించలేని వారముకూడా. అందుచేత మమ్మల్ని అనేకమార్లు పట్టుకొని పైకొనవేలరా (ఆక్రమించుకోవేమి?)

ప్రభూ! నిస్సంకోచంగా మరీ మరీ ఒత్తి నీవు అనిన మాటలకోర్వలేక ప్రత్యుత్తరము యిచ్చాము. నిజమే. ఊరకవుండిపోలేదు. అంతమాత్రాన మా బత్తి (భక్తిని) గొట్టానబెట్టగ బనిలేదు (న్యాయపరీక్షకు పెట్టవలసిన పనిలేదు). ఓరీ! నీ చిత్తము ఇంతేననుకొని యుందుము. ఇంకా చేప్పేది యేమున్నదిరా?

ప్రభూ! నీ ప్రవర్తనకు 'కాకలు పెరిగి' (మేము ఆగ్రహించి) కళవళమున (చికాకుజెంది) నిన్నున్ తాకన్ ఆడుదుము (నొప్పించెదము). ఊరకనే వుండలేము కదా! ఏకటజెందిన (నీరాకకోసం మొఖము వాచిన) ఆడది యేదో కోపం పట్టలేక నాలుగుమాటలంటే... నీవు సోకోరువవలె (కాసేపు ఓర్చుకోవాలి). అంతేకాని చురుకనరాదురా (మళ్ళీ కోపంతోనే చురుక్కుమని నొప్పించరాదు). అన్నీ తెలిసిన నీకు చెప్పేదేముందిరా!

ప్రభూ! నీవు మాపై వెడసిన (ఆగ్రహించిన) సైచలేము (ఓర్వలేమయ్యా!) మాకు దగ్గరయై చేకొనవేమయ్యా! నీవు ధైర్యముగలవాడవు. తిరుమలలోని కోనేటిరాయడవు (శ్రీవేంకటేశ్వరుడవు). ఇట్లానే (ఇదే మాదిరిగా) నన్ను గారవించి (మన్నించి) కరుణించగదరా!

సంపుటి : 5 కీర్తన : పేగుల జంద్యాలు వేసి పెంచపునమలిపురి
సంఖ్య : 254 పుట : 173 - రాగం : కాంభోది

64. పేగుల జంద్యాలు వేసి పెంచపునమలిపురి
పాగగాఁ జుట్టిన నాబాఁపనయ్య వీఁడివో ॥పల్లవి॥

బిత్తలై పరువులిడి పిన్నబోడితలతోడ
కొత్తబొమ్మచారియై గోచిగట్టెను
నెత్తురుదానమునేసి నిండిన జడలతోడ
బత్తుఁడైన చక్కని నాబాఁపనయ్య వీఁడివో ॥పేగు॥

కఱవిద్యబాఁపనిచేఁ గఱచె నేరుపులెల్ల
గుఱుతుబాఁపనిఁ గనెఁ గొడుకుఁగాను
తఱితోడ సందెపొద్దు దప్పనీక జలధిలోఁ
బఱపుగాఁ బండిన నాబాఁపనయ్య వీఁడివో ॥పేగు॥

పచ్చియిట్టి తోలుచొచ్చి బడలి చొరనిచోటు
చొచ్చి తెచ్చె వేదాలు చూడరమ్మా
మచ్చిక వేంకటగిరి మరిగి నాకొఁగిట
పచ్చనిదోవతి నాబాపనయ్య వీఁడివో.

ఉపోద్ఘాతము :

అచ్చతెలుగులో నారాయణుని వైభవాన్ని వర్ణిస్తే మనబోటి తెలుగువారికి కొరుకుడు పడదని ఇట్లాంటికీర్తనలు చెప్పి అన్నమయ్య మరొక్కమారు నిరూపిస్తున్నారు. బాపనయ్య అంటే బ్రాహ్మణుడు అని అర్థం. అసలు పుట్టుకే లేని ఆది దేవుడికి కులమేమిటి? అందుకని 'ఆర్యుడు' అని భావించాలి. మరి ఈ బాపనయ్య వేదాలు చదివాడు, శస్త్రాస్త్ర విద్యలు నేర్చాడు, చేయిజాచి యాచించాడు, ధర్మరక్షకుడైనాడు, శత్రువుని చంపి వాడిపేగులు జంద్యాలుగా వేసుకొన్నాడు, నెమలి పించం

తలపాగావలె చుట్టి అలంకరించుకొన్నాడు. వీడివో నా బాపనయ్య పచ్చని దోవతివాడు అంటున్నారు.బాగుగా ఆలోచిస్తేనే అర్థమవుతుంది. ఇది దశావతారలీలలను వర్ణించే కీర్తన అని అర్థమయింది అప్పుడు.

తాత్పర్యము :

ఓ భక్తులారా! నా బాపనయ్యను చూచినారా? వీడివో (ఇదిగోవీడే), పేగులను (హిరణ్యకశిపుని పేగులను) జంద్యాలుగా వేసికొనినాడు(నృసింహుడు). పెంచపు నమలిపురి(నెమలి పించమును) పాగగా (శిరసున అలంకారముగా) చుట్టుకొనినాడు.

"కొత్తబొమ్మచారియై గోచిగట్టెను" (నూతన వటువై గోచీ పెట్టుకొని బలిచక్రవర్తిని యాచించాడు) గుండు వున్న ఈ చిన్న వాడి, "బత్తలై " (నగ్నముగా) పరువువిడినాడు (బుద్ధుడు). నెత్తుటిలో తానముసేసిన (స్నానమాడిన) ఇతడు జటాజూటము ధరించి చక్కని బత్తుడై (ముని అయ్యాడు) (పరశురాముడు). అటువంటి బాపనయ్యవీడు.

ఇతడు కఱవిద్య బాపనిచే (శస్త్రాస్త్ర విద్యలు నేర్చిన విశ్వామిత్రుని వద్ద) సకల విద్యలను నేర్చిన వాడితడు (శ్రీరామచంద్రుడు). ఈ బాపనయ్య గురుతుబాపనిగనె కొడుకుగా (మన్మథుని అవతారమైన ప్రద్యుమ్నుని కన్న శ్రీ కృష్ణుడు). "తఱితోడ సందెపొద్దు దప్పనీక జలధిలో బఱపుగా బండిన బాపనయ్య" సృష్ట్యాదియైన పగటివేళ, సృష్ట్యంతమైన పెనుచీకటిలోనూ నీరధిలో బవ్వళించి యోగనిద్రనున్న శ్రీమన్నారాయణుడు ఈ బాపనయ్య.

(పచ్చి యిట్టి అంటే కిశోర ప్రాయంలో ఒంటిపై మచ్చలున్న లేడిపిల్ల అని అర్థం. కానీ అన్నమయ్య ఈ మాటకి ఒంటిపై పొలుసులున్న చేపగా భావించినట్లు నేను అనుకొంటున్నాను). పొలుసులు గల మత్స్యరూపియై చొరలేని చోటైన సముద్ర గర్భంలోకి చొచ్చి సోమకాసురుని జంపి వేదములను దెచ్చి జగతి నుద్ధరించిన ఈ దేవదేవుని చూడరమ్మా! ఇప్పుడు శ్రీ వేంకటగిరిపై నాకు (అలమేల్మంగకు, లేదా, అన్నమయ్యకు) మచ్చికయై నా కౌగిలిలో మరిగి (ఆశించి), ఈ బాపనయ్య పచ్చని దోవతి గట్టినవాడు (పీతాంబరధరుడు).

సంపుటి : 5 కీర్తన : లంజకాడవౌదువురా నీలాగులెల్లగానవచ్చే
సంఖ్య : 84 పుట : 58 - రాగం : ఆహిరి

65. లంజకాఁడవౌదువురా

లంజకాడవౌదువు నీలాగులెల్లఁ గానవచ్చె
ముంజేతఁ బెట్టిన సొమ్ములకద్దమేలరా ॥పల్లవి॥

కొంకక యెవ్వతో కాని కోరి నీ బుజము మీఁద
కంకణాల చేయి వేసి కౌఁగిలించఁ బోలును
వంకలైన వొత్తులెల్ల వడిఁగానవచ్చె నింక
బొంక నేమిటికిరా నీ బూమెలెల్లఁ గంటిమి ॥లంజ॥

ఒద్దిక నెవ్వతో గాని వోరి నీవురము మీఁద
నిద్దిరించఁ గంటమాల నీలములొత్తినది
తిద్దిన జాణవుగాన తిరిగి తిరిగి మాతో
బద్దనేఁటికిరా నేఁ బచ్చి సేయఁ జాలను ॥లంజ॥

వేడుక నెవ్వతో తిరువేంకటేశ్వర నిన్ను
కూడిన నీమేనితావి కొల్లవట్టుకొన్నది
తోడనె నా కౌఁగిటిలో దొరకొంటి విఁక నిన్ను
నాడ నేమిటికిరా నాయలపెల్లఁ దీరెను ॥లంజ॥

ఉపోద్ఘాతము :

'లంజ' అంటే వేశ్య అని అర్థం. లాగు అంటే ప్రేమ. వేశ్య చూపించే ప్రేమ నటనయేకాని నిజం కాదు. ఈ సత్యం ఎంత తేటతెల్లమంటే, మోచేతికి పెట్టుకొన్న ఆభరణాలు చూసి కొనుటకు ఎట్లు అద్దము అక్కరలేదో ఆ సత్యం తెలుసుకోవానికి పెద్ద తెలివి తేటలు అక్కరలేదు. "శ్రీ వేంకటేశ్వరా! నీ భుజాల మీదవున్న ఆమె

కంకణాల నొక్కుడు గుర్తులు, నీ వక్షస్థలం మీద ఇంకెవ్వతెవో కంఠహారం నొక్కుడుగుర్తులు కనబడుతూనే వున్నాయి". అన్ని విధాల దెప్పిపొడిచిన ఆ నాయిక చివరికి ఎలా సమాధానపడిందో తెలియాలంటే కీర్తన తాత్పర్యం చదవక తప్పదు. లేకపోతే మీతో నేనూ 'పచ్చి' అంతే...

తాత్పర్యము :

ఓ వేంకటేశ్వరా! నీవు లంజకాడవౌదువురా? (వేశ్యవలె వ్యవహరింతువా?) నీ ఈ దొంగ ప్రేమలు కానవచ్చె (పైకి తెలిసిపోతూనే వున్నాయి) ముంజేతికి (మణికట్టుకి మోచేతులకి) పెట్టుకొన్న ఆభరణాల అందం చూడాలంటే వేరే అద్దము కావాలా? (నీ వ్యవహారం గురించి వేరే ఇంకెవరో చెప్పవలెనా? నిన్ను చూస్తేనే తెలిసిపోతోంది).

జంకూగొంకూ లేకుండా యెవ్వతోకాని నీ భుజం చుట్టూ తన కంకణాల చేతులు వేసి బిగియార కౌగలించినట్టున్నది. వంకర టింకరగా నున్న ఆ నొక్కుళ్ళు పైకి కానవస్తూనే వున్నాయి కదా! బొంకనేమిటికిరా (అబద్ధాలు చెప్పటం దేనికిరా). నీ బూమెలెల్లా (వంచనలన్నీ) చూస్తూనే వున్నాము. ఇంకా మోసగించకు.

ఓరీ! యెవ్వతో గాని నీకు అతుక్కొని నీగుండెలమీద నిద్రించింది. అప్పుడు దాని కంఠహారంలోని నీలమణులు నీవురమును వొత్తినవి. నీవు తిద్దిన జాణవు (ఆరితేరిన నయగారివి). తిరిగి తిరిగి మాతో బద్దనేటికిరా (చీలిక లెందుకురా)? పోనీ నేను నీతో 'పచ్చి' సేయజాలను (నీతో నా అనుబంధం తెంచుకోలేను... యేం చేస్తాను?)

ఇదంతా ఒక యెత్తయితే, ఓ తిరువేంకటేశ్వరా! ఎవ్వతో ఇంకో అసాధ్యురాలు (ఇంకెవరు అమ్మ అలమేల్మంగ) ధైర్యంగా నీతో రమించినది. నీ అధరామృతం కొల్లగొట్టినది. ఇక నేను మాత్రం తక్కువా? నీవూ నన్ను నీ కౌగిటిలో ధరించితివి. ఇంక నిన్ననే ఆడనేమిటికి (మాటలనవలసిన పనేముంది?) నా అలపెల్లా తీరినది (నా అలసట తొలగిపోయినది. నేనెప్పటికీ నీదాననే...).

సంపుటి : 5 కీర్తన : ఏకాలమేది దనకెట్ల సుఖమైయుండు
సంఖ్య : 255 పుట : 174 - రాగం : సామంతం

66. ఏకాలమేది దనకెట్ల సుఖమైయుండు
నాకాలవశతఁ దానట్లుండవలసె ॥పల్లవి॥

బలువియోగాగ్ని దలఁపంగ నెట్టిదొకాని
చలిగాలి యెండనుచు జాలిఁ బడవలసె
వలరాజుకోపమెటువంటిదో పడఁతులకు
తలిరాకు చేఁదనుచుఁ దలపోయవలసె ॥ఏకా॥

భావంబు తలపోఁత బలిమెట్టిదోకాని
నోవి దోఁపనిచోట నొచ్చెననవలసె
ఈ విరహపరితాపమిఁకనెట్టిదో కాని
కోవిలల కూఁతలకుఁ గోపించవలసె ॥ఏకా॥

తిరువేంకటేశకృప తియ్యమెట్టిదొ కాని
చిరునవ్వు మోవిపైఁ జెరలాడవలసె
సురత సౌభాగ్యముల సొంపులెట్టివొ కాని
మురిపెంపుఁ గనుచూపు ముయ్యఁగావలసె ॥ఏకా॥

ఉపోద్ఘాతము :

తన సంతోషమె స్వర్గము, తన దుఃఖమె సరకమంద్రు – అని పెద్దలన్నారు. సంతోషంతో వున్నవారికి యుగమొక క్షణంలాగాను, విరహతాపంలో వున్నవారికి క్షణం ఒక యుగంలాగాలను గడవటం సహజమే కదా! అదే చెబుతున్నారు

అన్నమయ్య. తనకు ఏ కాలమున ఎట్లు సుఖముంటుందో ఆ కాలానుగుణముగా అట్లే వుండవలసియున్నది. అంటే అప్పుడు చలిగాలి వేడిఅనిపించినా సహించి వూరడిల్లాలి. ఇదంతే అనుకోవాలి.

తాత్పర్యము :

ఓ వేంకటేశ్వరా! తనకు ఏ కాలమునకు ఎట్లు సుఖముంటుందో ఆ వ్యక్తి ఆ కాలానుగుణంగా (ఆ కాలానికి అనుకూలంగా) అట్లాగే వుండవలసియున్నది. కాలగమనం, మానసిక స్థితిని బట్టి మారుతుంటుంది.

తలపంగ (ఆలోచించిచూస్తే) బలమైన వియోగాగ్ని (నీ విరహ తాపము) యెట్టిదోకాని అదొక మాయ. దానితో తపించే వారు చల్లగాలిలో వున్నా మండే యెండలో వున్నట్లే. వారిపై జాలికలుగుతుంది. వలరాజు (మన్మథుని) ఆగ్రహమెటువంటిదంటే... తలిరాకు (లేత తమలపాకు) చేదుగా అనిపిస్తుంది.

భావంబు తలపోత (మనోవికారము కలిగినప్పుడు వేదించే ఆలోచన) బలమెట్టిదో చెప్పలేము. నోవి దోపని చోట (నొప్పి అనిపించనివే) నొచ్చననవలసె (నొప్పిరాబాబూ! అని అనవలసి వస్తుంది). ఇక ఈ విరహ వేదన యెటువంటిదంటే... కోవిలల కూతలకు గోపించవలసె (కోకిల మధురంగా కూయని కూస్తుంటే వాటిపై విపరీతమైన కోపం వస్తుంది). అదే కాలమహిమ.

శ్రీ వేంకటేశ్వరుని కృపామృతము కలిగించే తియ్యము (తియ్యందనము) యెట్టిదంటే మనమోవిపై (పెదువులపై) చిరునవ్వు చెలరేగక తప్పదు. ఇక అనుభవేక వేద్యమైన విషయమేమంటే సురత సౌఖ్యము యొక్క సొంపులెట్టివోగాని, కనులను పారవశ్యమున మూయక తప్పదు... అదంతే...

సంపుటి : 5 కీర్తన : బండెదొక్కె బామునెక్కె బనులెల్లాదక్కె
సంఖ్య : 48 పుట : 33 - రాగం : లలిత

67. బండిదొక్కెఁ బామునెక్కెఁ బనులెల్లాఁ దక్కె
అండఁ జిక్కె గోపికలకందరికి మొక్కె ॥పల్లవి॥

ఈతఁడు దొంగిలె వెన్న యీతఁడు నాకంటెఁ బిన్న
నేతఁ బాల నోలలాడె నిన్నమొన్న
పాతకపు రాకాసిపల్లెలు చూరలుగొన్న-
యేతరిపై నేరమి మాకేఁటికిఁక నెన్న ॥బండి॥

కూరిమినీతఁడు దొల్లి కొనగొనలనే తల్లి (?)
మారిపిళ్ళాడించెనే మారుదల్లి
ఆరుమూరు సేసి విద్యలందరికిఁ బారఁజల్లి
పారితెంచి వోలలాడెఁ బాలవెల్లి ॥బండి॥

ముచ్చువలె నిప్పుడుండె మూఁడులోకములు నిండె
రచ్చసేసెఁ జూడరే రాతిగుండె
తచ్చి తచ్చి వింటినారి దనుజులనెల్లాఁజెండె
పచ్చిదేర వేంకటాద్రి పానుపుగాఁ బండె ॥బండి॥

ఉపోద్ఘాతము :

శ్రీ కృష్ణలీలామృతాన్ని పునశ్చరణ జేస్తున్నారు అన్నమయ్య. ఈ కీర్తన నూరుసార్లు చదివినా నూటికి నూరుపాళ్ళు అన్నమయ్య మనోగతాన్ని విప్పి చెప్పటం సాధ్యమయ్యేపనికాదు.

నా వివరణే సరియైనది అనే దుస్సాహసం చేసే ధైర్యం నాకు లేదు. ఇది నాకు 'తట్టిన' భావము. ఆచార్యులవారి కొన్ని పదములకర్థం యే నిఘంటువులోనూ

దొరకదు. వాటిని తగినట్లు భావించాల్సిందే. "ముచ్చువలె నిప్పుడుండ..." అంటే... ఇప్పుడు దొంగవలె మూడు లోకాలలో నిండిపోయాడు అని అర్థం చెప్పుకొంటే... మనల్ని మనమే చెప్పుతో కొట్టుకోవాలి, అవునా... అందుకే యెప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికామాటలాడి అన్నారు పెద్దలు.

తాత్పర్యము :

ఈ మహానుభావుడు చేసిన చేతలనేమని వర్ణింతును? బండిదొక్కె (శకటాసురుని సంహరించాడు), పామునెక్కె (కాళీయునిపై నెక్కి మర్ధించాడు), పనులెల్లా దక్కె (బృందావనంలో పనులన్నీ చక్కబడ్డాయి. గోపికలకు అండజిక్కె (ప్రియుడు దొరికాడు). ఆ తరువాత యెనిమిది పెళ్ళిళ్ళు చేసికొని పెద్దలందరికీ మొక్కి సంతోషపెట్టాడు.

ఇతడు వెన్నను దొంగిలించాడు, ఇతడు మా అందరికంటే చిన్నిపాపడు. కానీ నెయ్యిపాలు పారబోసి వాటిలో ఓలలాడినాడు. పాతకి పూతన పల్లెల్లో పాపాయిలను చంపివేస్తుంటే, ఆ ఏతరిపై (అన్యాయంచేసేదానిపై) చూరలు గొనినాడు. (పొడి పొడి చేసినాడు... అంటే.. పిప్పి చేశాడు.) ఇంకా వాడి నేరాల నెన్నడం యెంత తెలివి తక్కువపని? మాకేమిటికి?

కూరిమితో ఈ బాలుడు, తన కొనగొనలతో (లీల ప్రదర్శించి) తన మారుతల్లి (పెంచినతల్లియైన యశోదను) మారుపిళ్ళాడించె (కలయో వైష్ణవమాయో... అని అబ్బుర పడేట్లు చేసినాడు). విద్యలు (వేదములు) యెత్తుకెళ్ళిన, సోమకాసురుని ఆరుమూరుసేసి (నానా తిప్పలు పెట్టి) చంపి వాటిని దెచ్చి, మళ్ళీ పాల జలధిలో ఓలలాడినాడు.

ఇన్ని లీలలను చేసిన ఈ దేవదేవుడు, ఇప్పుడు ఈ వేంకటాద్రిపై ముచ్చువలె (దొంగవలె) ముల్లోకములలో ప్రసిద్ధుడై మా హృదయములను కొల్లగొట్టి, రాతిగ+ఉండె (విగ్రహం వలెనుండి) రచ్చసేసె (వడ్డీకాసులు గుంజుతున్నాడు), చూడరే (చూడండయ్యా), తన వింటినారిని మ్రోగిస్తూ వెదకి వెదకి దుష్ట శిక్షణ చేస్తున్నాడు. శ్రీ వేంకటాద్రిని పానుపుగా చేసికొని పచ్చిదేర (ప్రసిద్ధుడయ్యెను).

సంపుటి : 5 కీర్తన : చాలు జాలు నీతోడి సరసాలు
సంఖ్య : 364 పుట : 247 - రాగం : రామక్రియ

68. చాలుc జాలు నీతోడి సరసాలు యిట్టె
పాలిండ్లకొంగుజారి బయటc బడితిమి ॥పల్లవి॥

సిగ్గువడితిమిర నీ చేసిన చేcతలకు
నగ్గమైతిమిర మరునమ్ములకును
దగ్గరి నీకాcకలc దగులcబట్టి నేcడు
బగ్గన నిందరిలోనc బలచనైతిమి ॥చాలు॥

నొగిలితిమిర నేము నోcచిన నోములకు
పొగిలితిమిర నీ పొందులకును
తెగి నీవు నన్ను రతిcదేలించి తేలించి నాకు
పగలు బిగువులెల్లc బచ్చిగాc జేసితివి ॥చాలు॥

దప్పిcబడితిమిర నీతాలిములనే కడు
నొప్పిc బడితిమిర నీ వొక్కుcజేతల
ఇప్పుడిట్టె తిరువేంకటేశుcడ నీవు నా
కొప్పు సవరము దీసి కొల్లగొంటి మానము.

ఉపోద్ఘాతము :

స్వామి ప్రవర్తనకు విసిగిపోయిన నాయిక, కసురుకుంటున్నది. అన్నమయ్య తానే నాయిక అయ్యారు. ఏదో పొరబాటున పాలిండ్లపై కొంగుజారిపోయి బయట పడ్డామే అనుకో, నీవు చిలిపి సేతలతో సరసములాడవలెనా? చాలు చాల్లేవయా నీ సరసాలు. "నీతాలిముల చేత కడు దప్పి బడితిమిరా" అని అంటున్నారు. నీ తెంపరితనము వలన మేము (నేను) యెంతో శ్రమపడ్డామయ్యా అని

విసుగుకొంటున్నారు. ఇవి అన్నమయ్య కాలంలో సర్వసాధారణ తెలుగుమాటలే అయినప్పటికీ నేటి నవీనకాలంలో నిఘంటువు అవసరమైన పరిస్థితి యేర్పడింది. ఆ సాహితీ సౌగంధిక వనంలో సౌరభాస్వాదన చేసి వీలయితే పదిమందిని చేయించి తరించాలనే నా ఆశ.

తాత్పర్యము :

ప్రభూ! నీతోడి సరసాలు చాల్చాలు లేవయ్యా! ఇలా మా పాలిండ్లపై కొంగు జారినందున బయటబడితిమి (అల్లరి పాలయ్యాము) అంతమాత్రాన నీవిట్లు చేయతగునా?

నీవు చేసిన చేతలకు (చిలిపి పనులకు) సిగ్గుపడ్డామయ్యా! మరునమ్మునకు (మన్మథుని బాణాల దెబ్బకు) అగ్గమైతిమిరా (లొంగిపోయాముర). నేడు నీ చేరికచే కాకలము (తాపము) కలిగి, నలుగురిలో ఒక్కసారిగా పలుచనైపోయామయ్యా!

నీకోసం మేము యెన్ని నోములు నోచితిమి? యెంత నొగిలితిమి (బాధపడ్డాము)? నీ పొందులకు (చేరికకోసం) యెంత పొగిలితిమిరా? (పరితపించినాముర?). తెగి (తెగించినవాడివై) నీవు నన్ను రతులలో దేలించి తేలించి నా బెట్టుసరిని సడలింపజేసినావు. నేనెట్లు నిన్ను నిరోధించగలను?

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీ తాలిములచే (నీ తెంపరితనముచేత), కడు దప్పిబడితిమిరా (యెంతో శ్రమ పడ్డామయ్యా!) నీ నొక్కుజేత (నీవు అదుము కొనుటజేత) నొప్పిబడితిమిరా (నొప్పికూడా కలిగినది). ఇప్పుడు నీవు, ఇట్టే (అతి సులభముగా) నాకొప్పులోని సవరమును తీసివైచి నా మానమును కొల్లగొనినావు. (తరుణి కేశపాశమును సడలించి, సవరించగలిగినప్పుడు ఇక చేయనిది చేయలేనిది యేముందయ్యా శృంగార రాయా!)

సంపుటి : 12 కీర్తన : పెక్కుసతుల పెండ్లాడి బెరసిన వాడుతాను
సంఖ్య : 518 పుట : 297 - రాగం : రామక్రియ

69. పెక్కు సతులఁ బెండ్లాడి బెరసినవాఁడు తాను
వెక్కసము లెంతైనా వేసరకు మనవే ॥పల్లవి॥

మొలచిన తమకము మోసులువారకుండునా
కలసినవావులు కడ నుండునా
నలిరేఁగి సారె సారె నవ్వితిఁ దనతో నేను
వెలలేని వెన్నైనా వేసరకు మనవే ॥పెక్కు॥

చిగిరించిన వలపుచెట్టు కట్ట కుండునా
తగులైన పొందులు దాఁచవచ్చునా
అగపడి సరసము లాడితిఁ దనతో నేను
వెగటెంతైనా నాయ వేసరకు మనవే ॥పెక్కు॥

గుదిగొన్న ననుపులు కుప్పలు గాకుండునా
చెదర నీమోవితీపు చెప్పవచ్చునా
అదన శ్రీ వేంకటేశుఁడలమేల్మంగను నేను
వెదకివచ్చి నన్నేలె వేసరకు మనవే. ॥పెక్కు॥

ఉపోద్ఘాతము :

అలమేలుమంగమ్మ తన చెలికత్తెతో ఈ కీర్తన చెబుతున్నది. అన్నమయ్యే చెలికత్తె అవటంతో అది వినే భాగ్యం మనకి కలిగింది. లెక్కలేనంత మంది సతులను పెండ్లాడి పొందినవాడికి వెక్కసములెంతైనా వేసరకు మనవే అంటున్నదా తల్లి (యెంత గొప్పతనం వున్నా నన్ను అంత విసుగుకొనవద్దని చెప్పవే...). నేను అలమేల్మంగను. క్షీరసాగర కన్యకనైన నన్ను వెదకి మరీ నా స్వయంవరానికి వచ్చి నన్నేలినాడు. ఆయనకి క్షణం తీరికలేని మాటా నిజమే.. కాని వేసరకు మనవే అంటున్నదాతల్లి.

తాత్పర్యము :

పెక్కు సతులను (అసంఖ్యాకమైన కాంతలను) పెండ్లాడి ఆ శృంగారరాయుడు బెరసినాడు (విలసిల్లుచున్నాడు). తాను వెక్కసములెంతైనా (ఎంతజగన్నాథుడైనా)... వేసరకుమనవే (విసుగుకొనవద్దని చెప్పవే).

ఆ స్వామిని కూడా తప్పు పట్టటకు వీల్లేదు లేవే... యెందుకంటే... ఒక్కసారి అయన యెవత్తెనన్నా ఇష్టపడితే.. తమకము (మైమరపు) వారికి కలుగుతుంది. అది మోసులు వారకుండునా (మొలక లెత్తదా?) ఒక్కసారి కలయిక జరిగాక అది కడనుండునా (ఒక చివర ఊరుకుంటుందా?) నేను కూడా అంతేకదా! మాటి మాటికి నలిరేగి (నలిగిపోయి) తనతో నవ్వితిని (పరాచికంగా మాట్లాడాను) అవన్నీ వెలలేనివి (అర్థం లేని చేతలు). ఆ మాత్రానికే వేసరకు మనవే (విసుక్కోవద్దని చెప్పవే)

అయినా నా పిచ్చిగానీ... వలపు చెట్టు (ప్రేమ అనే వృక్షము) ఒకసారి చిగురించాక 'మాను' అవకుండా వుంటుందా? ఒక్కసారి పొందులు మొదలయ్యాక ఆ వ్యవహారం దాగుతుందా? నేనూ అంతే కదా! తనతో నేనూ అగపడి సరసములాడితిని (కనబడేట్లు సరసమాడాను.) ఒకవేళ ఆయనకది వెగలాయెనేమో (రోతగా అనిపించిందేమో?) వేసరకుమనవే (చికాకు పడవద్దని చెప్పవే)

ఓ చెలియా! గుడిగొన్న ననుపులు (అతిశయించిన అనురాగము) కుప్పలుగాకుండునా (సమృద్ధిగాకుండా వుంటుందా?) అప్పుడు నీ అధరమెంత మధురమో మాటల్లో చెప్పవచ్చునా. కానీ.. నేను అలమేల్మంగను ఈ సమయంలో, ఓ శ్రీవేంకటేశ్వరా! నీవు వెదకి వచ్చి క్షీరసాగరకన్యనైన నా స్వయంవరానికి వెదకివచ్చి... నన్ను చేపట్టి యేలుకొంటివి... నాకు యెదపై స్థానమిచ్చిన వానిని నేసరకుమనవే...

సంపుటి : 9 కీర్తన : కలదింతేమాట కంతునియాట

సంఖ్య : 16 పుట : 10 - రాగం : లలిత

70. కలదింతె మాఁట కంతుని యాఁట
తెలుసుకో నీలోనిదియె పూఁటపూఁట ॥పల్లవి॥

అలమేలుమంగా హరియంతరంగా
కలితనాట్యరంగ కరుణాపాంగ
చెలువుఁడు వీఁడె చేకొను నేఁడె
వలరాజుతూపులివి వాఁడిమీఁది (ద?) వాఁడి ॥కల॥

అలినీలవేణి యంబుజపాణి
వెలయంగ జగదేకవిభునిరాణి
కలయు నీ పతి వచ్చె గక్కన నిన్నిదె మెచ్చె
పలికీని చిలుకలు పచ్చి మీఁదఁబచ్చి ।కల॥

సితచంద్రవదనా సింగారసదనా
చతురదాడి మబీజచయరదనా
యితవైన శ్రీ వేంకటేశుఁడు నిన్నిదె కూడె
తతిఁ దలపోఁతలు తలకూడెఁ గూడె. ॥కల॥

ఉపోద్ఘాతము :

అమ్మవారి మీద మధురాతి మధురమైన కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఈ అలమేలుమంగ మరెవరో కాదు. శ్రీహరి అంతరంగమే జగదేక విభునికే రాణి అయిన ఆమె, పూట పూట ఇలా వేదనకు యెందుకు గురియవుతున్నది? తెలుసుకోవమ్మా! నీ మనస్సులోనిదే ఇదే ఆ మాటకలదు. ఇది అంతా ఆ కంతుని ఆట" (మన్మథుని మాయాజాలం). 'లలిత' రాగంలో తేనెలు జాలువారే ఈ కీర్తన

అర్థం చెప్పటం ఆషామాషీకాదంటే నన్ను నమ్మండి. "చతుర దాడిమ బీజ చయరదనా" అంటే యేమిటో తెలియాలంటే అంత తేలిక కాదు. తెలివితోపాటు గీర్వాణిలో మెలికలు తెలియాలి. లేకపోతే తాత్పర్యం చదవాలి. అది చదివి అన్నమయ్యని మెచ్చుకుంటూ.

తాత్పర్యము :

ఇంతే మాటకలదు. ఇది 'కంతునిఆట' (మన్మథలీల) తెలుసుకోతల్లీ! వాడు యెక్కడో లేడు. వాడు మనసిజుడు. నీ మనస్సులోనే వుంటాడు. పూట పూట నీ మనస్సును వేదనకు గురి చేస్తాడు.

ఓ అలమేలుమంగా! నీవు హరి అంతరంగవు. (ఆ శ్రీహరి హృదయంలోనే నివాసముగానున్నదానవు). నాట్యరంగంలో కలితవు (విఖ్యాతి చెందినదానవు). కరుణాపాంగవు (కరుణామూర్తివి). వీడే (ఈ వేంకటరమణుడే) నీ చెలువుడు (ప్రియుడు). ఆయన నేడే నిన్ను చేకొంటాడు. తప్పదమ్మా! యెందుకంటే.. వలరాజు తూపులివి మన్మథుని యొక్కు ఆ ఐదుబాణాలున్నాయే... అవి వాడిమీద వాడి (ఒకదానిని మించి ఇంకోటి పదునైనవి.

ఓ అలినీలవేణీ! (నల్లని తుమ్మెదలవంటి కేశపాశముకలదానా!) అంబుజపాణీ! (కమలహస్తా!) నీవు జగదేకవిభుడైన శ్రీ వేంకటేశ్వరుని రాణివి. నిన్ను కలియుటకై వచ్చిన నీపతి నిన్ను గక్కున మెచ్చె (వెంటనే బాగుబాగని మెచ్చుకొనినాడు). అప్పుడు నీ పెంపుడు చిలుకలకి కోపం వచ్చింది. అవి నీకు పచ్చిమీదపచ్చి చెప్పాయి (ఒకదాని తరువాత ఇంకొకటి నీ స్నేహం వుండమని 'పచ్చి' కొట్టాయి.

తల్లీ! నీవు సితచంద్రవదనవు (తెల్లని చంద్రునివంటి వదనము కలదానవు) సింగార సదనవు (శృంగారమునకు ఆవాసమైన దానవు), చతురదాడిమ బీజ చయరదనవు, చతురవు, దాడిమబీజ చయరదనవు (అనగా నేర్పరివి మరియు దానిమ్మ గింజలవంటి పలువరుసవున్నదానవు... అని అర్థం). ఇతవైన (హితుడైన) శ్రీ వేంకటేశ్వరుడు, ఇదే నిన్ను కూడినాడు. అతిశయించిన తలపోతలు (ఆయనమీద ఆలోచనలు) తలకూడెగూడె (కలిగినవి... కలిగినవి).

సంపుటి : 9 కీర్తన : కన్నులజూచేవు మాతో కందువమాటేడేవు
సంఖ్య : 174 పుట : 100 - రాగం : బౌళి

71. కన్ను లc జూచేవు మాతో కందువ మాటలాడేవు
కొన్నదికోలు నీకిcక గోవిందరాజా ॥పల్లవి॥

పవ్వళించేయప్పుడూను పాదాలొత్తే వారిద్దరు
యివ్వల నే నీతో నవ్వ నేకతమేది
దవ్వుల నుండే మమ్ముc దడవేవు నీవొళ్ళ
కువ్వలాయ వలపులు గోవిందరాజా ॥కన్నుల॥

యిద్దిరి చే నిమ్మపండ(డ్ల?) వేమి సేయవచ్చు నిన్ను
అద్ది నీతో మాటలాడ ననువయ్యీనా
చద్దికి వేcడి కప్పటి జాణతనా లాడేవు
కొద్దిcబడవు పనులు గోవిందరాజా ॥కన్నుల॥

యిరుమొనసూదివి యెవ్వరివాcడ వందుము
దొరవై నన్ను c గూడితి తొల్లె నీవు
తరవాతి చేcతలెల్ల దక్కె నీకు నిందరిలో
గొరబై శ్రీ వెంకటాద్రి గోవిందరాజా. ॥కన్నుల॥

ఉపోద్ఘాతము :

గోవిందరాజస్వామి వారిపై అసంఖ్యాకమైన శృంగారకీర్తనలు చెప్పారు అన్నమయ్య. తిరుపతిలో ఆ స్వామి పవ్వళించి వుంటే శ్రీదేవి, భూదేవి ఆయన పాదాలు ఒత్తుతూ సపర్యలు చేస్తుంటారు. స్వామి, వారిద్దరి చేనిమ్మపండట) మొనసూదియట.. యేమి సేయవచ్చును అంటున్నారు. నేను అదే అంటున్నాను. ఏ నిఘంటువులోనూ వీటికి అర్థము దొరకదు. కొన్ని మాటలు లుప్తమైపోయాయి. కొన్ని రూపం మార్చుకొన్నాయి. "నీ వొళ్ళ కువ్వలాయ వలపులు" అంటే యెలా

చెప్పటం? అందుకనే... తింటేగాని రుచి, దిగితేకాని లోతు, అనుభవిస్తేగాని కష్టమూ తెలియదన్నారు పెద్దలు. అన్నమయ్య కూడా ఒక వలపు కత్తెయై ఈ కీర్తన పాడుతున్నారు. తెల్లవారుజామున నా భావనాకాశంలో తళుక్కుమని తటిల్లతల వలె అర్థాలు స్ఫురింపచేస్తాడు స్వామి. తరువాత వాటి అర్థం నాకూ తెలియదు. వేంకటరమణుడిపై ఆన.

తాత్పర్యము :

ఓ గోవిందరాజా! అరవిచ్చిన కన్నులతో మమ్ము చూచేవు. మాతో కందువ (చమత్కరిస్తూ) మాటలాడేవు. నీకిక 'కోలు'.. కొన్నది. (అంటే నీ కొలువు దీరినది అని అర్థం)

వారిద్దరూ శ్రీదేవి, భూదేవి) నీవు పవ్వళించేటప్పుడు నీ పాదాలు వొత్తేరు. ఇప్పుడు నీవు వారిద్దరినీ చూచి నీవు మర్మగర్భంగా నవ్వుతున్నావు. యేకతయేమి? (కారణమేమిటి)? దూరంనుంచే మమ్ము తడవేవు (స్పృశిస్తున్నావు) అందుచేత "నీవొళ్ళకువ్వలాయ వలపులు" (నీ ఒంట్లో ప్రేమ చెలరేగింది.) ఓ గోవిందరాజా! మాకూ అదే పరిస్థితి.

ఓ ప్రభూ! నీవు ఇద్దరికీ చేనిమ్మ పండువు. (నిమ్మకాయ అవసరం వుండని ఆడది వుంటుందా?) కాని నీవు చేతిలోనే వున్న నిమ్మ పండువు). ఏమిసేయవచ్చును (మేము చేయగలిగిందేముంది?) నీవు చద్దికి వేడికీ అప్పటి జాణతనాలాడేవు (రాత్రీ, పగలు అనే తేడాలేక... అప్పటికవసరమైన తెలివితేటలు ప్రదర్శిస్తావు). అది నీతో మాట్లాడ అనువయ్యీనా (చేతనవుతుందా?) ఓ గోవిందరాజా! పనులు కొద్దిబడవు (కుదరవు) నిన్ను సాధించలేమయ్యా!

ఓ స్వామీ! నీవు యిరుమొనసూదివి. (రెండు వైపులా 'మొన' వున్న సూదివి. ఎటువైపు నుంచైనా వుపమోగపడతావు. నన్ను (అన్నమయ్యను) నీవు తొల్లె (ఇదివరకే) దొరవై (నా యజమానివై) నన్ను చేబడితివి. ఇందరిలో నేడు గొరబై శ్రీ వేంకటాద్రి చేరితివి (కొలువై శ్రీ వేంకటగిరిపై కూడా చేరినావు). నీ తరవాతి చేతలెల్లా (అనుసరించేపనులన్నీ... అంటే... మావంటి దీనజనరక్షణ వంటి కార్యక్రమములు) నీకు దక్కెన్ (నీ బాధ్యతలయ్యాయి).

సంపుటి : 9 కీర్తన : ఎఱిగిన పనులకు నికనేటికి నీకు
సంఖ్య : 175 పుట : 101 - రాగం : హిజ్జిజి

72. ఎఱిఁగిన పనులకు నిఁకనేఁటికి నీకుఁ
దఱితో నవ్వేవారె తగు నింతేకాకా ॥పల్లవి॥

మగువలు వద్దనుంటె మఱుతు వన్నిపనులు
తగిలి వెనకముందు తలపోసేవా
వెగటుగ నేము సేసే విన్నప మెందుకెక్కును
బగివాయకుండేవారి భాగ్య మింతేకాక ॥ఎరిగిన॥

కొంగువట్టి తీసితేనె గొబ్బున లోనౌదువు
పంగించిచెప్ప నీ కొక్కపాటి వున్నదా
పొంగి నీ బాసలు నేఁడు పొగడఁగ నేమున్నది
వుంగరపు వేలివారి వోపి కింతేకాక ॥ఎరిగిన॥

కాఁగలించి కూడితేనె కరఁగుదు వంతలోనె
దాఁగి పెనఁగఁగ నీకు తగవున్నదా
చేఁగదేరఁ గలసితి శ్రీ వేంకటేశ నన్ను
వీఁగక నిలుచువారి వెర వింతేకాకా. ॥ఎరిగిన॥

ఉపోద్ఘాతము :

వలచిన వనితలు తమ విభుని నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించలేరు. ఈ కీర్తనలో స్వామిని వలచిన చిన్నదిగా మారిపోయిన అన్నమయ్య ఆయనను దెప్పిపొడుస్తున్నది. "నీవు చేసే పనులు యెవరికి తెలియదయ్యా? ఇంకా నీతో నాకేమిటి? నీకు పూసుకొని తిరుగుతూ నవ్వేవారుంటే చాలునీకు. ఇంతేకాక ఇంకేమిటి? అసలు నీకొక్కపాటి

యున్నదా?" అని ఉక్రోషం వెళ్ళగక్కుతున్నారు. స్వామికూడా ఈ కీర్తనలో నాయిక ఉడుకుమోతుతనానికి పకపక నవ్వి వుంటాడు. ఈ కీర్తన వివరించడం అనుకున్నంత తేలిక కాదని స్వామి కృపలేక సాధ్యమయ్యేపనికాదని నా పరిమితమతికి తట్టిన అభిప్రాయము.

తాత్పర్యము :

స్వామీ! నీవన్నీ మేమెరిగిన పనులే కదా! ఇక నేటికి (ఇంకెందుకు) నీకున్ తఱితో (అతుక్కుపోయి) నవ్వేవారు కాక నాబోటివారెందుకు నచ్చుతారు?

నీకు మగువలు దగ్గరుంటే చాలును. అన్నీ మరచిపోతావు. వెనుకా ముందూ చూసుకుంటావా? నేను వెగటున (విరసముతో) చేసే విన్నపముఎందుకు తలకెక్కుతుంది? నీబగివాయివారక (తోడు వదిలిపెట్టకుండా) వుండేవారిదే భాగ్యం. అంతగాక మరేమిటి?

నీవు కొంగుజారవేసే 'టక్కులాడికి' గొబ్బున లోనౌదువు (శీఘ్రముగా లొంగిపోతావు). నీకు పంగించి (భయపెట్టి) చెప్పేపాటి (దమ్ము) యెవ్వరికుంది? నీవు చెప్పే మాయ మాటలు, బాసలు నేడు పొగడటానికి యేమున్నది? ఉంగరపు వేలివారి (నీతో ఉంగరాలు తొడిగించుకొన్నవారి ఓపికకు జోహార్లు. మాకు అంత ఓపిక లేదు మహా ప్రభో! మమ్మల్ని మా గతికి వదిలేయవయ్యా!

ప్రభూ! నిన్ను కౌగలించి కలిసిన చాలును. అంతలోనే కఱగిపోతావు. నీకు అందక దాగికొని పెనగగ (నిరోధించగ) తగవున్నదా (తగినదేనా?) ఇక నిన్ను చేగదీర (చేవతో) కలిసినాను. ఓ శ్రీ వేంకటేశ్వరా! నేనంటే భయంలేని వారి, వెరవు (యుక్తి కుయుక్తి).. అంతే కదా! అంతకాక మరేమిటి స్వామీ!

సంపుటి : 9 కీర్తన : వినవమ్మ యశోద గోవింద కృష్ణుడు
సంఖ్య : 176 పుట : 100 - రాగం : దేసాక్షి

73. వినవమ్మ యశోద గోవింద కృష్ణుఁడు
చెనకి యెన్ని పనులు చేసెనమ్మ కృష్ణుడు ॥పల్లవి॥

వుట్టులు దాఁ గొట్టఁగాను వువిదలు దిట్టఁగాను
అట్టాయ వీథులలో నుఱక కృష్ణుఁడు
పట్టినకోలల గొల్లపౌఁజు లిరువంకరాఁగ
పట్టుకొన్న గొల్లెతల భ్రమయించీఁ గృష్ణుఁడు ॥వినవమ్మ॥

పాలు దనపైఁ గారఁగా పడఁతులు నవ్వఁగాను
గేలికి లోనాయను జంగిలి కృష్ణుఁడు
ఆలరి యెలుఁగులతో నడ్డమువచ్చినవారి
మేలపు చేఁతలు చేసి మెప్పించీఁ గృష్ణుఁడు ॥వినవమ్మ॥

యిందులు దాఁజొరఁగాను యింతులు పై కొనఁగాను
బందుకు లోనాయను గోపాలకృష్ణుఁడు
అండనె శ్రీవెంకటాద్రి నలమేలుమంగఁ గూడి
దుండగపుఁ జేఁతలనె దొరాయఁ గృష్ణుఁడు ॥వినవమ్మ॥

ఉపోద్ఘాతము :

శ్రీ కృష్ణలీలామృతాన్ని ఆస్వాదింపచేస్తున్నారు అన్నమయ్య. గోపికలు యశోదకు శ్రీ కృష్ణుని అల్లరిని వినిపిస్తున్నారు. ఈ కీర్తనలో 'జంగిలి కృష్ణుడు'' గేలికి లోనయ్యాడన్నారు. అంటే గోవులను కాచే కృష్ణయ్య నవ్వుల పాలయ్యాడట. బహుశా ఉట్టిపైన వున్నపాలు కాజేద్దామనుకొంటే... ఆ తొందరలోకుండపగిలి పాలతో తలతడిసిపోయి బిత్తరపోయాడేమో, అదిచూచి ఆడవాళ్ళంతా పకపక నవ్వారట.

పరమాత్మ యెందరిని యెన్ని విధాల నవ్విస్తాడో చూడండి. వేంకటాద్రి కృష్ణుడు మాత్రం తన దేవి అలమేల్మంగను కూడి తన దుండగంపు పనులు వదలి దొరాయె (లోకపాలకుడు అయ్యాడు) అంటున్నారు. ఇంకా చాలా మెలికలున్నాయి.

తాత్పర్యము :

ఓ యశోదమ్మా! మాగోడు వినవమ్మా! ఈ గోవిందకృష్ణుడు, చెనకి (యెవరిని పడితే వారిని యెదిరించి) యెన్ని పనులు చేసినాడమ్మా! ఆ వివరాలు వినవమ్మా!

మీవాడు తమ వుట్లు పగులగొడితే గోపికలందరూ వాణ్ణి తిట్టిపోశారు. వీధులలో అట్టాయె (నానా అల్లరి అయింది). మీ కృష్ణుడు వీధిలో వుఱకలు పెట్టి పారిపోయాడు. తనకిరు ప్రక్కలా గొల్లపిల్లల మూకను పెట్టుకొని చేతులలో కోలల (చిన్నచిన్న కఱ్ఱలను) పట్టుకొని, తనను పట్టుకొన్న గోపికలను భ్రమింపచేశాడు.పట్టుకొన్నా వాణ్ణి కొట్టబుద్ధికావటం లేదు.

ఒకచోట పాలు దొంగతనంగా త్రాగబోయాడు. ఆ గొడవలో పాలకుండ పగిలిందేమో.. పాలన్నీ మీ వాడి నెత్తిపై కారిపోయాయి. ఆడాళ్ళంతా గొల్లుమని నవ్వారు. వాళ్ళు మీ వాణ్ణి గేలి చేశారు. అట్లా గేలికి గురైనాడు. మీ జంగిలి కృష్ణుడు (గోవులను కాచుకొనే కృష్ణయ్య). ఆలరి యెలుగులతో (అల్లరి కేకలతో) యెవరు అడ్డం వస్తే వారిని మేలపు చేతల (పరాచికాలతో) తన మూకలను మెప్పించీ (మెచ్చుకొనునట్లు చేశాడు) మీ కృష్ణుడు. మీ వాడిని ఇంతులు (గోపికలు) పైకొనినారు (పైన బడి పట్టుకొన్నారు). గోపాలకృష్ణుడు బందుకు లోనాయెను (బండబూతు తిట్లకు లోనయ్యాడు). అక్కడనుంచి శ్రీ వేంకటాద్రి చేరుకొని అలమేల్మంగ కూటమిలో ఆ దుండగపు పనులు వదలివైచి వేంకటకృష్ణుడై లోకాలన్నింటికీ దొర(ఏలిక) అయినాడు.

సంపుటి : 9 కీర్తన : అంగనకు నీవె అఖిల సామ్రాజ్యము
సంఖ్య : 299 పుట : 172 - రాగం : గౌళ

74. అంగనకు నీవె అఖిల సామ్రాజ్యము
శ్రింగారరాయఁడ నీకు శ్రీసతినిధానము ॥పల్లవి॥

కమలాలపానుపు కాంతకు నీవురము
ప్రమదపు నీ మనసు పాలజలధి
అమరు నీభుజాంతర మట్టె తీగెపొదరిల్లు
రమణీయ (ప్ర)హారాలు రత్నాల మేడలు ॥అంగనకు॥

సతికి నీమెడ రతిసాము సేసేకంబము
ప్రతిలేని వయ్యాళి బయలు నీవు
మతించిన కౌస్తుభమణి నిలువుటద్దము
మితిలేని శ్రీవత్సము మించుబండారుముద్ర ॥అంగనకు॥

నెమ్మి నలమేల్ మంగ నీ కాఁగిలి పెండ్లిపీఁట
చిమ్ముల చందనచర్చ సేసపాలు
వుమ్మడి మెడనూళ్ళు వుయ్యాలసరపణులు
పమ్మి శ్రీ వెంకటేశ నీ భావమే భోగము. ॥అంగనకు॥

ఉపోద్ఘాతము :

నేడు మనం విస్తృతంగా వుపయోగించే కొన్ని మాటలు కొన్నాళ్ళు పోయాక వాడకంలో మరుగుపడి అర్ధం తెలీని పదములవుతాయి. ఉదాహరణకు "పాళీ". మా చిన్నప్పుడు కలముతో వ్రాసేటప్పుడు "పాళీ" (Nib) విరిగేది. కలమును పారవేయకుండా 'పాళీ' ఒక్కటే మార్చుకొనేవాళ్ళం. ఇప్పుడా అగత్యంలేదు. నేటి పిల్లలకి 'పాళీ' అంటే యేమిటో తెలియదుకదా! అన్నమయ్య ఈ కీర్తనలో వాడిన

'బండారుముద్ర', 'వయ్యాళి', 'సేసపాలు', వుయ్యాలసరపణి... వంటి మాటలు కాల ప్రవాహంలో మరుగుపడిపోయాయి. కొంచెం శ్రమతీసుకుని అర్ధం తెలిసికొంటే ఉపమాలంకార భూయిష్టమైన ఈ కీర్తన ఏడుకొండలవాడి 'All time favourite' కీర్తన అయివుంటుందన్న నా నమ్మకం వమ్ముకాదని మీకూ అనిపిస్తుంది.

తాత్పర్యము :

ఓ శృంగార రాయా! అంగనకు (అలవేల్మంగమ్మకు) నీవే సర్వంసహాసామ్రాజ్యము. ఆమే అప్రతిహత మహారాణి. ఇకపోతే ఆ శ్రీసతి నీకు నిధానము (పాతరలో దాచివుంచిన సంపద).

ఓ ప్రభూ! కాంతకు (ఆ శ్రీదేవికి) నీ వురము (ఎదురురొమ్ము) పద్మములు పేర్చిన పానుపు. ప్రమదపు నీ మనసు (సంతోషముతో నిండిన నీ మనస్సు) ఆమెకు పాలసముద్రమువంటిది. నీ భుజాంతరము (ఒడి), అదేవిధంగా లతలతో అల్లిన పొదరిల్లు. నీ మెడలోని ఎత్తైన హారములు ఆమెనివసించు రతనాల మేడలు. అందుకే నీవామెకు అఖి సామ్రాజ్యమనుటలో అతిశయోక్తిలేదు.

ఓ శ్రీనివాసా! నీ సతికి నీ మెడయెటువంటిదో తెలియునా? రతిసాము (మన్మథ పెనగులాట) చేసే స్థంభము. ఇక నీవే ఆమెకు సాటిలేని వయ్యాళి బయలు (విహరించే మైదానము). మతించిన (అంచనా వేసినచో) నీ కౌస్తుభమణి ఆమెకు చక్కని నిలువుటద్దము. నీ వీపున నున్న మితిలేని (చెప్పనలవికాని) శ్రీ వత్సము అను పుట్టుమచ్చ ఆమెకు మించిన బండారుముద్ర (నేటి నవీన భాషలో చెప్పాలంటే (President's Stamp) అన్నమాట.)

ఓ శ్రీ వేంకటేశ్వరా! అలమేల్మంగమ్మకు నీ నెమ్మిన్ కౌగిలి (ప్రేమాస్పదమైన ఆలింగనము) ఒక పెండ్లిపీటవలె అలరారుచున్నది. నీమేనిపై నున్న చందన చర్చ (గంధపుపూత) చూచుటకు, చిమ్ముల సేసపాలు (దట్టముగా జల్లబడిన అక్షింతలకప్పు) వలెనున్నది. ఉమ్మడిగా ఇద్దరి మెడలో కట్టి మెడనూలు అను బంగారు తీగెల దండలు మీరిద్దరూ వూగుటక కట్టిన ఊయల సరపణులు (జంటతాళ్ళు) వలెనున్నవి. ఓ దేవదేవా! పమ్మిన (అతిశయించిన) నీ భావమే (స్వభావమే) ఒక గొప్ప వైభోగము.

సంపుటి : 9 కీర్తన : జలముల బాసిన జలజాప్తుని చే
సంఖ్య : 37 పుట : 22 - రాగం : హిజ్జిజి

75. జలములc బాసిన జలజాప్తునిచే
జలజము నొగిలిన 'చందంబాయ ॥పల్లవి॥

చక్కని యాపతి సతిc బెడcబాసిన
వెక్కసపు మనసే వేcడాయ
చెక్కు చేతితోc జింత్తించిన నది
అక్కట మదనుని యడిదంబాయ ॥జలములు॥

రమణి పతికడకు రాక నిలిచినా
తమి నిట్టూర్పులు దగులాయ
తమకంబున సతి దలపోయంగా
భ్రమసి చూచురెప్పలు నొప్పాయ ॥జలములు॥

యింతలో నిద్దరి కెడ మాటాడcగ
అంతట వీనుల కాసాయ
యింతయు శ్రీ వెంకటేశ్వరుc గూడcగ
యింతేసి యిందాcక నేమేమోఆయ. ॥జలములు॥

ఉపోద్ఘాతము :

ఈ కీర్తన పల్లవిని చూడగానే "జలజములు నీటబాసిన.." అనే సుమతీశతక పద్యం గుర్తుకురాక మానదు. సూర్యుడు జలజములకు ప్రియుడే కాని ఒకసారి ఆ జలజము తన స్థావరమైన జలమును వదలగానే.. అతడే శత్రువై వాటిని (జలజములను) వాడిపోయేట్లు చేస్తాడు. అలాగే ఈ వేంకటరమణుడి కూటమి తనకి జీవరక్షయైనప్పటికీ ఈయన ఒకసారి తన యిల్లు వదలగానే ఆయనే (ఆయన ఆలోచనే) తపింపచేస్తున్నాడు... అని అంటున్నారు.

తన సతి వచ్చిందేమోననే భ్రమతో చూచీచూచీ పాపం స్వామి రెప్పలు నొప్పిపుట్టాయట. ఎంత అద్భుతం... గమిచంద్రనేత్రుడైన స్వామి గతే ఇట్లయితే మనబోటివారి గతి... యేమిటి?

తాత్పర్యము :

జలజాప్తునిచేత (సూర్యునిచేత) జలముల బాసిన జలజములు (నీటిని వదలిన పద్మాలు) ఒగిలిన (యెండిపోయిన) చందంబాయె (విధమునజరిగినది). ఆమెకు స్వామి యోచన ఇంతవరకు తన జీవనాధారమే, కాని అదే ఇప్పుడు తపింపజేస్తున్నది.

జగన్మోహనుడైన ఈ పతి, తనసతిని విడివడగానే... వెక్కసపు మనసే (దుస్సహమైన మనస్సుకూడా) వేడెక్కిపోయినది. తన చెక్కిలి పై చేయి జేర్చి ఆయననే చింతించుతున్నప్పటికీ.. అక్కటా! (అయ్యో!) అదే (ఆ చెయ్యే) మదనుని అడిదంబాయె (మన్మథుని కత్తివలె) తనని కోయుచున్నది. ఇక ఈవిడ పరిస్థితి ఇలావుంటే అక్కడ స్వామి యెలావున్నాడు? చూడండి మరి...

రమణి పతి కడకు రాక నిలిచినా... ఆమెపై అపేక్ష వలన నిట్టూర్పుల తగులాయె (తాకిడియెక్కువైనది). ఇక ఆయనకేమయిందో తెలుసా? తమకంబున (తన్మయత్వంతో) తనసతి గురించి తలపోయగానే... ఇదిగో వచ్చింది, అదిగో వచ్చిందని తన రెప్పలనెత్తి చూచీచూచీ పాపం... స్వామికి రెప్పలు నెప్పిపుడుతున్నాయి. భ్రమ స్వామినికూడా బాధిస్తున్నదికదా!

అమ్మయ్య! నిరీక్షణ అంతమైనది. ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకొన్నారు. వారిచే వీనుల ఆకాంక్ష నెరవేరినది. ఆపైన చెప్పేదేమున్నది? ఒక్కసారి ఆమె శ్రీ వేంకటేశ్వరుని కూడగనే.. ఇందాకా, యింతేసి యేమేమో అయినది.

(అదేమిటో అరవిందాక్షునికే తెలియాలి, లేదా అన్నమయ్యకు తెలియాలి.... అమరవాదికి తెలియవు.)

సంపుటి : 9 కీర్తన : చేరి నీవు చెప్పినట్లు సేసితి నేనూ
సంఖ్య : 21 పుట : 13 - రాగం : మంగళకౌశిక

76. చేరి నీవు చెప్పినట్టు సేసితి నేనూ
వారివీరివలె మఱువకుమీ నన్ననూ ॥పల్లవి॥

జలధి దచ్చి లక్ష్మిని సంగడిఁ బెండ్లాడునాడు
అలరి రుక్మిణిఁ బెండ్లి ఆడెనాఁడు
సెలసువిల్లు విఱిచి సీతఁ బెండ్లియాడునాఁడు
పలికి బొంకనిమాఁటపట్టు నాకు నిమ్మీ ॥చేరి॥

సరుసఁ బదారువేలు సతులఁ బెండ్లాడునాఁడు
అరసి భూసతిఁ బెండ్లియాడు నాఁడు
పరగ రేపల్లె గోపభామలఁ బెండ్లాడునాఁడు
యిరవై యిచ్చినబాస యిమ్మీ నాకు ॥చేరి॥

అదె శ్రీ వెంకటపతి అలమేలుమంగ నిట్టె
అదన నీవు పెండ్లియాడునాడూ
యిదె నన్నుఁ గూడితివి యెక్కువగా మన్నించి
యెదుట నమ్మించినవి యెంచుమీ నాకు ॥చేరి॥

ఉపోద్ఘాతము :

"ఓ దేవదేవా! నీకు అనేకమంది భార్యలు, అనేకమంది ప్రియురాళ్ళు, నాలాగా నీకు బానిసవలె... చెప్పినట్లు చేసే పిచ్చి వలపుకత్తెలు కూడా అనేకులు వుండి వుండవచ్చును. నీవు వాళ్ళందరిని మరచిపోయావు. నన్ను కూడా అట్లాగే మరువకు ప్రభూ!" అని ఆ శ్రీవేంకటేశ్వరుని వేడుకొంటున్నది అన్నమయ్య భావనావనిలో పరిమళాలను వెదజల్లుతున్న నాయిక. "యెదుట నమ్మించినవి యెంచుమీ నాకు" అంటే యేమిటి? ఎక్కడో ఒకచోట మెలికపెట్టక వదలరు అన్నమయ్య.

తాత్పర్యము :

ఓ తిరుమలేశా! నేను నీకు సర్వస్వం అర్పించిన వలపుకత్తెను. మనోవాక్కర్మలా, నీవు చెప్పినట్లే చేశాను. తనంత తాను వలచి వచ్చిన దానిని మఱువని మగవాడుంటాడా? వారి సంగతినాకు యెందుకు? నీవు మాత్రం వారి, వీరివలె నన్ను మరువకుమీ.

స్వయంవరంలో ఆనాడు క్షీరసాగరమథనమున జనించిన లక్ష్మీదేవిని పెండ్లాడినావు. ద్వాపరయుగంలో రుక్మిణిని యెత్తుకొనిపోయి పెండ్లాడినావు. శివుని విల్లు విరిచి త్రేతాయుగంలో సీతాదేవిని వేదోక్తంగా పెండ్లాడినావు. నీవు పలికిబొంకని మాట పట్టులాడవు(సత్యవాక్పరిపాలనా దీక్షాదక్షుడవు). నాకును ఇమ్మీ... (నాకు కూడా మాట ఇయ్యవయ్యా!)

ఆనాడు నరకాసురుని చెఱనుంచి తప్పించిన పదారువేలమంది రాచకన్నెలను పెండ్లాడిన నాడు, అందరికీ సమానమైన సుఖమునిచ్చావు. నీవు కృతయుగంలో వరాహమూర్తివై భూదేవిని రక్షించి పెండ్లాడిన వాడవు. రేపల్లెలో గొల్లెతల నెల్లా పేరుపేరున పెండ్లాడి ప్రేమను నారి నారికీ ఒక హరివై పంచిననాడు యెన్ని "నాతిచరామి" బాసల చేసి వుంటావు? ఈనాడు నాకు కూడా ఒక్కటంటే ఒక్కబాస చేయరాదా?

కలియుగంలో నేడు శ్రీ వేంకటపతివై అలమేల్మంగను ఇట్లే పెండ్లాడుతూ కూడా... ఇదే నన్ననూ కూడినావు. ఇంతకంటే మన్నన (గౌరవం) ఏ ప్రాణి పొందగలదు స్వామీ! నేనే నీకు అందరికంటే యెక్కువని, యెదుట నమ్మించినావు (ప్రత్యక్షంగా నమ్మించినావు) మరి నన్నిక వదలక నాకు యెంచుమీ (నన్ను ఉన్నతురాలిగా భావించి ఆదరింపుము ప్రభూ!)

సంపుటి : 20 కీర్తన : చెల్లునా నీకీ పనులు చెన్నకేశా
సంఖ్య : 50 పుట: 34 - రాగం : ముఖారి

77. చెల్లునా నీ కీపనులు చెన్నకేశా

కొల్లకాఁడ వౌర గండిగోటచెన్న కేశా ॥పల్లవి॥

అంగవించి మగనాలి కాసపడే విందరిలోఁ
జెంగలింపుఁజూపులతోఁ జెన్నకేశ
రంగుమీర నిరువంక రమణు లిద్దరుండఁగా
అంగన లింకానా ఔరా చెన్నకేశా ॥చెల్లు॥

కమ్మటి మానవు మమ్ముఁ గరఁగించే వూరకైనా
చిమ్ముఁదేనెమాటలతోఁ జెన్నకేశ
దొమ్మిసేసి మగువల తొల్లె యాఱిడిఁ బెట్టితి-
వమ్మరో నీకు వెరతుమౌర చెన్నకేశా ॥చెల్లు॥

వావి గద్దంటా నాతో వచ్చి వచ్చి నవ్వేవు
శ్రీ వేంకటాద్రిమీఁదఁ జెన్నకేశ
కావిమోవి గంటిసేసి కమ్మి నన్నుఁ గూడితివి
ఆవేళ నేమననైతి (నే మనసైతి?) చెన్నకేశా ॥చెల్లు॥

ఉపోద్ఘాతము :

గండికోట అనే గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి పైన ఈ సరసశృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఆయన కొల్లకాడట అంటే కొల్లగొట్టేవాడని అర్థం. ఓ చెన్నకేశవా! నీకీ పనులు చెల్లుతాయా అని అడుగుతున్నది నాయిక. నీకూ నాకూ

వావివరుస (చుట్టరికము) వుందని నాకు దగ్గరై నవ్వుతావు నీవు శ్రీ వేంకటాద్రి చెన్నకేశుడవు. నీవు నన్ను కూడినప్పుడు నిన్ను ఆవేళ ఏమీ అననైతిని ఇప్పుడెన్ని అనుకొని లాభమేమిటి! బహుచక్కని శృంగార కీర్తన ఇది.

తాత్పర్యము :

ఓ చెన్నకేశవా! నీకు ఈ పనులు చెల్లునా (తగినవేనా)? ఔరా!! నీవు కొల్లకాడవు (కొల్లగొట్టేదొంగవు). నీవు గండికోటలో వెలసిన చెన్నకేశవుడవు.

ఇందరిలో (ఇంతమందిమి వుంటే) నువ్వు మగనాలికి (మగడున్న ఆడుదానికి) చెంగలింపు జూపులతో (ఆబగా చూస్తూ) అంగలించి (బాహాటంగా) ఆశపడుతున్నావు. చెన్నకేశవా! ఇదేమి న్యాయము? నీకు ఇరువైపులా రుక్మిణీ సత్యభామలున్నారు. రంగుమీరి (శోభస్కరంగా) ఆ ఇద్దరు గాక నీకు ఇంకా స్త్రీలు... అదీ పెళ్ళయినవాళ్ళు కావాలా? యెంత అన్యాయం. ఔరా! యెంత తెంపరివయ్యా చెన్నకేశవా?

స్వామీ! నువ్వు కమ్మటి (వుడికించటం) మానవు. మమ్మల్ని వూరకనే నీ తేనె చిమ్మే తీపి మాటలతో నన్ను కరగించివేస్తావు. ఔరా! చెన్నకేశవా! తొల్లె (ఆదిలోనే), నువ్వు మగువలను ఆరడిబెట్టి (అల్లరికి గురిచేసి) దొమ్మిసేసి (జులుము చేసి) ఏడిపిస్తావు. అమ్మరో!! (అమ్మో) నీవంటేమాకు భయం బాబూ!

శ్రీవేంకటాద్రిమీదనున్న చెన్నకేశవా! (శ్రీవేంకటేశ్వరా!) వావి కద్దంటూ (నీకు నాకు చుట్టరికం వున్నదని) నా దగ్గర చేరి మరీ మరీ నవ్వుతావు. కావి రంగు పెదవులనాక్రమించి గంటిసేసి (గాట్లు పెట్టి) నాతో రమిస్తావు. ఆ వేళ నీకు యెదురు చెప్పలేకపోయాను. ఓ చెన్నకేశవా! నేనేం చేయగలను? నేను నీ అధీనురాలను.

సంపుటి : 20 కీర్తన : అదె రాముడు సువేలాద్రిపై నిలిచె
సంఖ్య : 178 పుట : 119 - రాగం : సాళంగం

78. అదేరాముఁడు సువేలాద్రిపై నిలిచె
యెదిరితివి సీత యిఁక నేమమ్మా ॥పల్లవి॥

దనుజులు వారేరు తలఁకేరు లంకలో
వనజాప్తకులుఁడు వచ్చెనమ్మా
వినవచ్చెను కపివీరుల యార్పులు
వెనుకొని పవుఁజులు విడిసెనమ్మా ॥అదే॥

కదనములో కుంభకర్నా (ర్ణా?)ది వీరులు
మదమున బయిపడి మడిసిరమ్మా
చిరుమఁగ రావణుచేతులుఁ దలలు
నిదులనెల్లా విన్ను నిండెనమ్మా ॥అదే॥

పతి విభీషణునిఁ బట్టముగట్టెనమ్మా
అతఁడు నిన్నుఁ బిలువనంపీనమ్మా
కతగా శ్రీవేంకటగిరిమీఁదను
యితవుగఁ గూడరొ యిపుడేమమ్మా ॥అదే॥

ఉపోద్ఘాతము :

విప్లవాత్మకమైన మార్పులను చేశారు అన్నమయ్య. అవి యెంత హృద్యమంగా వుంటాయంటే ఈ కీర్తనే ఒక మచ్చు వుదాహరణ. తల్లీ! సీతమ్మా! అదిగో చూశావా సువేలాద్రి పర్వతంపై నిలుచున్న రాముడు ఎలా పరికిస్తున్నాడో చూడవమ్మా! ఆయన వస్తాడని దుష్టరావణుని 'యెదిరితివి' (యెదిరి చూచావు). ఇకనేమమ్మా? అంటున్నారు. ఎవరు?

తనను తాను హనుమంతునిగా భావించుకొనుచున్న అన్నమయ్య. ఇంతవరకు ఇటువంటి కీర్తన యెవరన్న చెప్పారా? వూహించారా? నభూతో నభవిష్యతి. నిస్సందేహంగా.

తాత్పర్యము :

ఓ సీతమ్మతల్లీ! అదిగో ఆ సువేలాద్రి పర్వతం పైనెక్కి నిన్నా దుష్టరావణుడెక్కడ వుంచాడా అని పరికిస్తున్న ఆ త్రిజగన్మోహనుని చూడవమ్మా! ఆయన వస్తాడని ఇంతకాలం యెదిరితివి, (యెదురు చూచినావు). ఇకనేమమా?

తల్లీ! దనుజులు వారేరు (పారిపోవుచున్నారు). లంకలో తలకేరు (భయపడి పోతున్నారు). సూర్యవంశీయుడైన శ్రీరామచంద్రుడు వచ్చేశాడమ్మా! ఇంక భయంలేదు తల్లీ! అదిగో కపివీరుల యార్పులు (కేకలు) వినవచ్చుచున్నవి కదా! శ్రీరాముని వెనుకొని (అనుసరించి) వచ్చిన పవుజుల (సైన్యము) విడిసెనమ్మా! సాగరతీరమున యెట్లు విడిది చేశాయో నీవే చూడవమ్మా!

తల్లీ! ఆ రామరావణ యుద్ధంలో కుంభకర్ణుడు మొదలైన రాక్షసవీరుల బయిపడి (బయటపడి) మరణించినారమ్మా! శ్రీరాముడు రణరంగంలో రావణుని ఇరువది చేతులు, పదితలలు, వైభవములను చిరుమగ (ఛిన్నాభిన్నం చేయగా) విన్ను (ఆకాశము) నిండిపోయినదమ్మా! ఇక నీవు తృప్తి జెందుము తల్లీ!

నీ భర్త, విభీషణుని లంకారాజ్యమునకు పట్టము గట్టెనమ్మా! అతడు నిన్ను సర్వాలాంఛనాలతో.. నీ భర్తవద్దకు పంపుటకు ఏర్పాట్లు చేస్తున్నాడమ్మా! ఇక ఈ కలియుగంలో... కతగా ఇది రామాయణగాథగా ప్రసిద్ధమవగా మీరు శ్రీ వేంకటాద్రిపై హితముగొలుపుచు కూడరో (కూడినారు కదా!) ఇపుడేమమ్మా! (ఇంక మాకు భయమెందుకు తల్లీ!)

సంపుటి : 20 కీర్తన : వరుసకు రాకుంటే వావి దప్పీనా
సంఖ్య : 283 పుట : 189 - రాగం : సౌరాష్ట్రం

79. వరుసకు రాకుంటే వావిదప్పీనా
వెర విందు కేది గోవిందరాజా ॥పల్లవి॥

చిందేటి తేనె మోవితో చెలి నీతో మాటలాడె-
నందుకంటె నేమి సేసు నది చాలదా
ముందే మొల్ల చూపులను ముంచి చల్లఁగాఁ జూచె
కందువైన దిందుకంటె కలదా ప్రియము ॥వరు॥

వెన్నెల సెలవితోడ వెలఁది నీతో నవ్వె
యిన్నిటా నీయాసోద మిఁక నెంతయ్యా
అన్ను వచంద్రునివంటి ఆననము నీకుఁజూపె
యిన్నేసిచేఁతలు సేసె నిఁక నేమి గడమ ॥వరు॥

చిగురుఁ దీగెలవంటి చేతులు నీపై వేసె
త గవులన్నియుఁ దేరె తారుకాణేలా
పగటు శ్రీవేంకటాద్రిపతి నిట్టె కూడితివి
జగదాలిన్నియుఁ బాసె చనవింత చాలదా ॥వరు॥

ఉపోద్ఘాతము :

అన్నమాచార్యులవారి కీర్తన అంతా ఒకయెత్తు, పల్లవి ఒక ఎత్తు. వారి పల్లవి ఒక్కొక్కప్పుడు బుఱ్ఱబద్దలుకొట్టుకున్నా ఇదమిత్థంగా అర్థం కాదు. ఈ పల్లవినే చూడండి "ఓ గోవిందరాజా! నీతో వరుస కలుపకుంటే (జతచేరకపోతే) వావిదప్పీనా మన బంధుత్వమే మరచెదవా? వెరవిందుకేది? (ఇదేమి పద్ధతి?) కాస్త నీకు సహకరించ కుంటే... మరీ ఇంత కోపమా?" అని నేను భావిస్తున్నాను. ఇంకొక విధముగా భావించినా, దానిని కూడా అన్వయించవచ్చును. ఇది యింతేనని చెప్పనేరము.

అన్నమయ్య పల్లవి వారి భావనా ఝరిలో ఉత్తుంగ తరంగం. అది యెంతయెత్తు కెగసిపడుతుందో యెవరికెరుక? గోవిందరాజస్వామికొక్కడికే అది సాధ్యం.

తాత్పర్యము :

ఓ గోవిందరాజా! ఇది యెంత అన్యాయం? నీతో ఆమె వరుసకు రాకుంటే (జతచేరకపోయినంతమాత్రాన) వావి దప్పీనా? (మీ మధ్య బంధుత్వం మాయమై పోతుందా?) వెరవిందుకేది (ఇదేమి పద్ధతి ప్రభూ!) కాస్త నీకు సహకరించకపోతే ఆమెపై ఇంతకోపమా? ఆమె వలపు ఇంతలో మఱుతువా?

నీ చెలి తేనెలూరు పెదవులతో మధరముగా నీతో మాటలాడగలదు. అంతకంటే ఆ బేల యేమి చేయగలదు? అది చాలదా? ఆమె నీకంటే ముందే మొ(మె)ల్ల చూపులను చల్లగాచూచి (తిన్నని చూపులతో నిన్ను నేరుగాచూచి) నీకు దగ్గరైనది. ఇందుకంటే కలదా ప్రియము? (ఇంతకంటే తన ప్రేమను యెట్లు విప్పిచెప్పగలదు? భామినులంతకుమించి బరితెగింతురా?

ఆమె వెన్నెల జల్లు చిలకరించునట్లు తన లేత పెదవులతో నవ్వినది. నీ యాసోదము (నేటి కాలములో... నీ అసాధ్యం కూలా... అని మనం వ్యవహరిస్తున్నాం) ఇక నెంతయ్యా? (ఇంకా ఏమి అఘాయిత్యం చేలగలవు?) చంద్రుని వంటి తన మొగము నీకు అన్నువ చూపినది (కొద్దిగా చూపించినది). నీకోసం ఇన్ని చేతలు చేసినది. ఇంకానేమి కడమ? (మరి ఇంకేమి తక్కువైనదయ్యా!)

ఆమె లేత చిగురులవంటి కోమలమైన చేతులు నీపై వేసినది. అంతే అలుకలన్నీ తీరినవి. తగవులన్నీ తెగినవి. తారుకాణములన్నీ (నీ ప్రేమను నిదర్శనములతో ఆమెకు) చూపినావు కాబోలు. శ్రీ వేంకటాద్రిపతివై ఆమెనిట్టే (సునాయాసంగా) కూడితివి. పగటు వేంకటేశ్వరుడవు (లావణ్యమూర్తివైన తిరుమలేశ్వరుడవు). నీతో ఆమె కలహములన్నీ కరిగిపోయినవి. ఆమె నీపై జూపు చనవు చాలదా ప్రభూ! ఆమె ముగ్ధకదా!

సంపుటి : 20 కీర్తన : పూవుటమ్ములు మరుడు పూచినాడే మరుడు
సంఖ్య : 179 పుట : 120 - రాగం : మాళనిగౌళ

80. పూవుటమ్ములు మరుఁడు పూఁచినాఁ డేమరఁడు
రావే నామాఁట విని రవ్వపడనేఁటికే ॥పల్లవి॥

వద్దే నీచలము వలపించఁగలము । నీ-
కొద్ది దెలిసినదాఁకా గొంకే మింతే
అద్దో యిటువలె నలిగేవా నెంతలేదు
చద్దికి వేఁడికి నవి సాగ వింతేగాక ॥పూవు॥

యింతేలే నీ కోపము యిందుకెల్లా నోపము । నీ-
పంతము చూచినదాఁకా పాటించేనింతే
యెంతో బిగువుతోడ యెలయించే దెంతలేదు
సంతతము పతివద్ద జరగదుగాక ॥పూవు॥

మానవే నీ బిరుదు మాకు నివి యరుదు
నానఁబెట్టి కొంతవడి నవ్వితి నింతే
నేనే శ్రీ వేంకటగిరినిలయుఁడఁ గూడితిని
దానికేమి నీకు నాకుఁదగు లింతేకాక ॥పూవు॥

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటనాథుడు తనసతికొరకు ఈ విరహగీతం పాడుతున్నాడు. "పూలబాణాల వాడైన మరుడు ఏమరడు (మఱచిపోడు). నా మదిలో మరులు రేపుతున్నాడే. రావే నామాటవినవే. పోట్లాటయెందుకే... అని మదనతాపంతో వేడుకొంటున్నాడు. నీ బిరుదుమానవే. ఇట్లాంటివి (తనని కాదనటం) నాకు అరుదు. నేను శ్రీ వేంకటేశ్వరుడనే నిన్ను కూడుటకు యేతెంచితిని. దానికేమి (ఈ చిలిపి కజ్జాలకేమి) నీకు నాకు తగులు తప్పదుకదా!" అన్నమయ్య భావనా పరిధి అనంతం.

జగదేకపతికి విరహవేదన యేమిటి? చిరంతనునికి స్త్రీ వ్యామోహమేమిటి? తెలుగులో రవ్వ అనే మాటలేదు. అది అవ్వ అంటే నింద అని అర్థం.

తాత్పర్యము :

ఓ భామినీ! మరుడు (మన్మథుడు) పూలబాణములు ఏమరక (మఱువకుండా) పూచీనీ (వేయుచున్నాడే) నామాట వినిరావే. ఏటికి (ఎందుకు) రవ్వ పడను? (ఎందుకు తిట్లు తింటావు?) అంటే.. ప్రణయ కలహంలో పరస్పర నింద సహజమే కదా!

నీ చలము వద్దే, (ఇంత మత్సరము పనికిరాదే). నీచేత మేము వలపించుకోగలము. నీకేం తక్కువైనదో తెలుసుకొనేదాక కొద్దిగా గొంకేము (జంగుతున్నాము) అంతే. అద్దో (అదిగో) ఈ విధంగా అలిగితే చద్దికీవేడికీ (రేయింబవళ్ళూ) ఆ అలుకలు చెల్లుతాయా? ఇంతకాక మరేమి? ఆసయెంతలేదు? (నీమీద నాకు ఎంత ఆశవున్నదో నీకు తెలియదా?) కాబట్టి చిట్టి పొట్టి అలుకలు మానవే.

నీ ఇంత కోపానికి మేము నోపము (తగము). నీ పంతము (పట్టుదల) యెంతటిదో చూచేదాకా నేనూ పాటించేను (భరించెదను) ఇంతే.. ఒకమాట చెబుతాను వినవే. ఎంతో బిగువుతోడ (బెట్టుసరితో) ఎలయించేది (వుసిగొలిపేది) ఎంతయూలేదు. పతివద్ద సంతతము జరుగదుగాక! (నీ మొగని వద్ద ఎప్పుడూ నీమాట చెల్లుతుందనుకొంటే ఎప్పుడో దెబ్బతింటావు).

(బిరుదు అంటే ప్రతిజ్ఞకాని ఇక్కడ బిగింపు అని అర్థం చెప్పుకోవాలి). ఓదేవీ! నీ బిగింపులు మానవే. మాకు ఇవి అరుదు (అలవాటులేదు). నిన్ను కొంతసేపు నానబెట్టి (వుడికించి) నవ్వితిని (నవ్వుకొన్నాను). అంతేకాని నీపై నేను కోపించగలనా? నేను శ్రీ వేంకటేశ్వరుడను. నిన్ను ఇట్లు ఉడికించి పొందితిని. దానికేమిలేవే... నీకూ నాకూ తగులు (పొసగినది). మొగుడూ పెళ్ళాలకు ఇదెప్పుడూ వుండేదే కదా! ఇంతకాక మరేమిటి?

సంపుటి : 20 కీర్తన : ఒక్కరీతినుండదోయీ ఓ విట్ఠలా
సంఖ్య : 68 పుట : 46 - రాగం : సామంతం

81. ఒక్కరీతినుండదోయి వో విట్ఠలా
వుక్కువంటి నీ చిత్తము వో విట్ఠలా ॥పల్లవి॥

పొద్దువోయి వచ్చేవు పూఁచి బాసలు సేసేవు
వొద్దన్నా మానవేల వో విట్ఠలా
కొద్దిమాలి తిరిగేవు కొంగువట్టేవు మమ్ము
వుద్దండా లేలోయి వో విట్ఠలా ॥ఒక్క॥

వెడనవ్వు నవ్వేవు వీదులెల్లా నేఁగేవు
వొడఁబాటు లింకానా వో విట్ఠలా
కడుఁబరాకయ్యేవు కదిసేవు కమ్మరాను
వొడలు మోపకు వోయి వో విట్ఠలా ॥ఒక్క॥

కప్పురాలు చల్లేవు కాఁగిటిలో భ్రమసేవు
వొప్పితి నీసుద్దులకే వో విట్ఠలా
యిప్పుడె శ్రీ వేంకటాద్రి ఎతవై కూడితి విదె
వుప్పటింపజాల నింక వో విట్ఠలా ॥ఒక్క॥

ఉపోద్ఘాతము :

విట్ఠలనాథునిపై అన్నమయ్య సరస శృంగార కీర్తన వినిపిస్తున్నారు. అన్నమయ్య వాడిన కొన్ని మాటలు మనం ఇంకొకరి కవిత్వంలో చూడముకూడా చూడము. ఓ విట్ఠలా? నీవు ఒక పద్ధతిలో నుండవు. నీ మనస్సు ఉక్కువలె కఠినమైనది. (మా దీనావస్థను చూచినా అది కరుగదు.) మళ్ళీ నీవే మా కొంగుపట్టి కవ్విస్తావు.

ఓ విట్ఠలా! వేంకటాద్రి ఎతవై కూడితివిదె.... వుప్పటింపజాలనింక అంటున్నారు. అంటే యేమిటో తెలిసీ తెలీనట్లుగానేవుంటుంది.

తాత్పర్యము :

ఓ విట్ఠలా! నీవు ఒక్క పద్ధతిలో నుండవు. ఒకసారి నీ శృంగారహేలలో మమ్ము వోలలాడించేవు. ఒకసారి కడు పరాకుఅయ్యేవు. నీ చిత్తము (మనస్సు) ఉక్కువలె కఠినమైనది ప్రభూ!

ఓ విట్ఠలా! నీవు మావద్దకు పొద్దుపోయివస్తావు. పూచి (ఆశలు చిగురించే) బాసలు చేసేసేవు (ఒట్లు పెట్టుకొంటావు). చాలు చాలు మమ్మల్ని మా దారిన వదిలేయి... అంటే వినవు. కొద్దిమాలి (అంతులేకుండా) మా వెంటబడి తిరుగుతావు. మాపైట కొంగులు పట్టి లాగుతావు. ఈ ఉద్దండాలేల... ఓయి విట్ఠలా! (నీవు మరీ యెక్కువ చేస్తున్నావు ఎందుకయ్యా!.. నేటి కాలంలో "టూ మచ్ చేస్తున్నావు".. అంటున్నాము).

ఓ విట్ఠలా! వీధులెల్లా నేగేవు (జులాయి లాగా వీధులలో తిరిగెదవు. వెడనవ్వు నవ్వేవు (వికటాట్టహాసం చేస్తుంటావు). నీతో ఒడబాటులింకానా? (ఇంకా నీతో ఒడంబడికలేమిటి?) ఓ విట్ఠలా! కడు పరాకయ్యేవు (మరీ ప్రమాదము కలిగించు, కుటిలుడు అయ్యేవు). కమ్మరాన కదిసేవు (బాగుగా మరగించి దగ్గరయ్యేవు).

ఓ విట్ఠలా! ఓ విట్ఠలా! నాపై కప్పురాలు (కర్పూర ధూళి) చల్లెదవు. బిగి కౌగిట భ్రమింపజేతువు. నీవు చెప్పే "కతల" నన్నిటినీ ఒప్పుకుంటూనే వున్నాను. మరి ఇప్పుడేమి చేస్తున్నావు? శ్రీ వేంకటాద్రిపై నుండే ఎతవై (ఎత్తైన వాడవై) నన్ను కూడితివి. ఓ విట్ఠలా! ఇక నేను ఉప్పటింపజాలను (ఓర్వలేను). నీ దాసాను దాసురాలైన నీ అధీనను.

సంపుటి : 20 కీర్తన : పోనీ పోనీ ఇకనేల పోయిన నీళ్లకు గట్ట
సంఖ్య : 282 పుట : 189 - రాగం : నాదరామక్రియ

82. పోనీ పోనీ ఇఁకనేల పోయిన నీళ్ళకుఁ గట్ట
నేనే యింతకుఁ జొచ్చితే నిన్నుఁ బారనిత్తునా ॥పల్లవి॥

పదవోయి నీమాఁటపట్టు నీకే వచ్చెను
వదల కెప్పుడును నీవారమే నేము
కదిసి నీ విందుకొరకా వలపించితివి
యిది నే నెఱిఁగితేను యింతా మెచ్చుసేయనా ॥పోనీ॥

చాలునోయి యిందాఁకా నీసరితలే చూచితిమి
యీలాగుల నీకు నే మీఁదె త్తితి మేను
తాలిమి నీచేసన్న లింతకు వచ్చెనా నేఁడు
నాలినీగుణము గంటే నాఁడే మెచ్చు సేయనా ॥పోనీ॥

తగునోయి నీకు-నాకుఁ దతివచ్చె మితివచ్చె
మొగి నిన్ను నేడఁగన్నా... మొక్కేము నేము
ఆగడు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నిగిడి నన్నుఁ గూడితి నీకే మెచ్చుసేయనా ॥పోనీ॥

ఉపోద్ఘాతము :

నాయిక ఈ కీర్తనలో తానే అలమేల్మంగను అని ప్రకటించుకొంటున్నది. నదిలో అడ్డుకట్ట కట్టుట దేనికి? నీరు వ్యర్థంగోపోకుండా. మరి పోయిన నీటికి ఇంకా అడ్డుకట్టటం యెందుకు? పోయిన నీళ్ళు యెలాగో పోయాయి. పోతేపోనీ, నాకే ఇంత 'చొరవ' వుంటే నిన్ను బారనిత్తునా అని దెప్పిపొడుస్తున్నది. అన్నమయ్య పదలాలిత్యం చెప్పనలవికాదు. నిగిడి నన్ను గూడితి నీకే మెచ్చుసేయనా.. అంటున్నది. నాయిక జాణతనం కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది.

ఈ కీర్తనలో భావ సముదాయాన్ని ఒకదానితరువాత ఇంకొక దానిని ఒక క్రమంలో నేటి భాషలో చెప్పటం నాశక్తికి మించిన పనిఅయిందని నా మనవి.

తాత్పర్యము :

(స్వామీ!) పోతే పోనీలే. ప్రవాహంలో కొట్టుకుపోయిన నీళ్ళకోసం బాధపడటం దేనికి? పోయిన నీళ్ళకి అడ్డుకట్ట వెయ్యగలమా? నేనే ఇంతకు జొచ్చితే (నాకే ఇంత చొరవ వుంటే) నిన్నున్ పారనిత్తునా? (బరితెగించిపోనిత్తునా?)

ఓ స్వామీ! పదవోయీ... (పోవయ్యా) నీమాట పట్టింపు నీకే చెల్లింది. మేము నీవారమేనయ్యా! మమ్మల్ని యెప్పుడూ త్యజించబోకు. ప్రభూ! ఒకమాట చెప్పుము. నన్ను నీవు దీనికోసమే ప్రేమించావా? నీ సంగతంతా తెలిసికూడా.. మెచ్చుసేయనా (నిన్ను సమర్థించ మంటావా?) నీకు నేను చెప్పదగినదాననా?

ప్రభూ! చాలునోయీ (ఇక చాలునయ్యా!) నీ సరితలే చూచితిమి యిందాకా (ఇప్పటిదాకా.. నీ చరిత్రలు చాలా చూచాము.) నీపై నాకున్న లాగు (మమకారము) నీకేమి లెక్క? నేడు నా సమక్షముననే (వేరొకదానికి) చేసన్నలు (చేతిసైగలు) చేయుచున్నావు. నీది నాలిగుణము. నీ మనసులో ఏముందో యెవరికీ తెలీదు. నీ సంగతి తెలిస్తే... ఆనాడే మెచ్చుసేయనా? (వ్యంగ్యంగా దెప్పిపొడుస్తున్నది).

దేవా! నీకూ నాకూ తగునోయీ (సరిపోయిందయ్యా!) తతి వచ్చె మితివచ్చె (ఒకరికొకరము సమ వుజ్జీ అయినవారమే). నీవు ఆది దేవుడవని గ్రహించి మొక్కేము ప్రభూ! గంభీరుడవైన శ్రీ వేంకటేశ్వరా! నేనే అలమేల్మంగను. నిగిడి (వ్యాపించి) నన్ను కూడితివి. నీకే మెచ్చుసేసేను (నిన్ను ఆరాధించెదను స్వామీ)!

సంపుటి : 20 కీర్తన : అయ్యో! నీకు వగచినదే దోసమా
సంఖ్య : 120 పుట : 81 - రాగం : సామంతం

83. అయ్యో నీకు వగచినదే దోసమా
ఇయ్యడ నీకు వలచుటిదే దోసమా ॥పల్లవి॥

వాలాయించి మొక్కేవు వాదులకే నిక్కేవు
ఔలే నీతో నవ్వినదే దోసమా
సోలగిలc జూచేవు చొక్కి చొక్కి లాచేవు
యీలాగై నీవద్దనుండే దిదే దోసమా ॥అయ్యో॥

బొమ్మల జంకించేవు పూcటపూcటకు మించేవు
అమ్మరో నీయాలనైన దదే దోసమా
రమ్మనుచు మరపేవు రాజసాలు నెరపేవు
యిమ్ముల నిన్ను నమ్మినదిదే దోసమా ॥అయ్యో॥

యేకతానకుc దీసేవు యేమన్నా నోరుమూసేవు
ఆకుమడిచి యిచ్చిన దదే దోసమా
పైకొని శ్రీవేంకటేశ పచ్చిగా నన్నుcగూడేవు
యీకడ నీవే నేనై తిదే దోసమా ॥అయ్యో॥

ఉపోద్ఘాతము :

అన్నమయ్య కాలం నాటి తెలుగు నుడికారం, నేటి తెలుగుతో పోల్చితే వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. అయ్యో! నీకు వగచినదే దోసమా అంటున్నారు. నేటి కాలంలో అయ్యో! నీకోసం వగచుటే దోషమా అని అంటున్నాం. బొమ్మల జంకించేవు, పూటపూటకు మించేవు, రాజసాలు నెరపేవు యేకతానకు దీసేవు, ఆకుమడిచి

ఇచ్చేవు.. వంటి మాటలు నేటి తెలుగులో కనుమరుగయ్యాయి. పచ్చిగా కూడుట అంటే వింతగానే వుంటుంది. ఒక్కసారి వివరణ చదివితే... ఇంతేనా అనిపిస్తుంది.

తాత్పర్యము :

అయ్యో! ఇదెక్కడి అన్యాయం? నీకోసం వగచుటిది (ఇలా బాధపడుటయే) దోసమా (తప్పా?) ఇయ్యడ (ఇప్పుడు) నిన్ను ప్రేమించుటయే నానేరమా?

స్వామీ! నీవు చేసేది మాత్రం ఏమిబాగున్నది? నీవు వాలాయించి (బలవంతం చేసి) మొక్కేవు. (దండములు పెడతావు), అట్లు కాదని వాదిస్తే నిక్కేవు (అలుగుతావు). ఔలే (ఔరా!) నీతో కలిసి నవ్వటమే తప్పా? సోలగిల చూచేవు (నేను వివశురాల నవునట్లు చూచెదవు), చొక్కి చొక్కి లాచేవు (మాటి మాటికీ పరవశత్వంతో (సిగ్గు తెప్పిస్తావు). ఇట్లా నీ దగ్గర వుండటమే నా నేరమా యేమిటి?

స్వామీ! బొమ్మల జంకించేవు (నీ కనుబొమ్మలు ముడివేసి నన్ను భయపెడుతావు), పూట పూటకు మించేవు (అతిశయించేవు); అమ్మరో (అమ్మయ్యో!) నీ పెళ్ళాన్నవటమే నా తప్పులా వుందే? నన్నెలాగో మరపించి రమ్మని బలవంతం చేస్తావు. వచ్చాక రాజసాలు నెరపేవు (నీ రాచఠీవినంతా నాపై చూపిస్తావు); ఇమ్ముల (ఎక్కువగా) నిన్ను నమ్మటమే నా పాపంలా వున్నదే!!

స్వామీ! ఏకతానకున్ తీసేవు (నీతో ఏకాంతమునకు ఆహ్వానింతువు); నేనేమన్నా నానోరు మూయించేస్తావు. నేనే నీకు ఆకుముడిచి యిచ్చినదే దోసమా (నీకు తాంబూలమిచ్చి ఆహ్వానించినదే నా తప్పా!!) ఓ శ్రీవేంకటేశ్వరా! నన్ను పైకొని (ఆక్రమించుకొని) పచ్చిగా గూడితివి (యేమాత్రము మరుగులేక నన్ను కూడినావు). ఈ విధముగా నీవే నేనయిపోయాను. నాకు "త్వమేవాహం" భావన వచ్చేసింది. ఇందులో నాతప్పేముంది ప్రభూ!

సంపుటి : 20 కీర్తన : ఇంతలాయ వింతలాయ నెందాక
సంఖ్య : 284 పుట : 190 - రాగం : వరాళి

84. ఇంతలాయ వింతలాయ నెందాఁక సరసాలు
చెంతలఁ జేరఁగరాదా చెలి జవ్వనమున ॥పల్లవి॥

చిత్తరువు వ్రాతఁలాయ చెలి నివ్వెరగులు
ముత్తెపుముగ్గులాయను మోహములెల్లా
పొత్తుల తేనియలాయ పొలఁతిపలుకులెల్ల
చిత్తగించి చూడరాదా చెలియభావములు ॥ఇంత॥

విడువని జడులాయ వెలఁది మెయిచెమటలు
తడఁబడే సంపదాయ తమక మది
కడివోనివిరులాయ కందువకోరిక లివి
తొడిఁబడఁ జూడరాదా తొయ్యలిచందములు ॥ఇంత॥

పూచిన వెన్నెలలాయ పొలఁతి సెలవినవ్వు
చూచినటల్లానాయ సొంపుకళలు
యేచిన శ్రీవేంకటేశ ఇట్టె ఇంతిఁ గూడితివి
రాచిలుక వంటిదాయ రమణి నీరతిని ॥ఇంత॥

ఉపోద్ఘాతము :

అద్భుతమైన శృంగార కీర్తన నాలపిస్తున్నారు అన్నమయ్య. కళాస్రష్టయైన శ్రీవేంకటేశ్వరునికి శృంగార కళ, వినిపిస్తున్నారు. స్వామీ! నీ సరసాలు ఇంతింతైనవి. వింతగా కూడా వున్నాయి. ఇంకా యెంతదాక నీ సరసాలు. నీ చెలి జవ్వన తాపముతో నున్నది. ఆమెచెంత చేరరాదా? ఆమె అవస్థ చూడవయ్యా! అని స్వామికి నచ్చజెబుతున్నారు. రమణి ఇనీరతిని రాచిలుకవంటిదాయ... అని కొసమెఱుపు నందిస్తున్నారు. అంటే యేమిటో భావించాలి అంటే.. కొంత కవితాహృదయంతోపాటు అపరిమితమైన వేంకటరమణుని కృప వుండాలి.

తాత్పర్యము :

ఓ ప్రభూ! నీవా దేవితో ఆడే సరసాలు ఇంతలాయ.... వింతలాయ (ఇంతింతేసి అధికముగా నున్నవి. వింతగా కూడా వున్నవి). జవ్వనమున చెలి సతమతమగుచున్నది ఇకనైన నీవామె చెంతకు చేరగరాదా?

స్వామీ! ఈ చెలి నివ్వెరగులు (అచ్చెరువందినప్పుడు) చిత్రకారుని సజీవ చిత్రమువలె తోపుచున్నది. ఆమె మోహ పారవశ్యతనొందినప్పుడు ఆ మోహములు... ముత్యాల ముగ్గులవలె బహుసొగసుగా నున్నవి. మీరు మాటలాడుకొనుచున్నప్పుడు ఆ పొలతి (సుందరి) పలుకులు తేనెజల్లులాయెను. ఆ చెలి భావావేశమును గమనించి చిత్తగించరాదా? అది నీ చేతిలోని పనియే కదా!

ఓ దేవా! ఈ వెలది (సుందరి) మెయిచెమటలు (శరీరంపైన ముప్పిరిగొన్న స్వేదము) విడువని జడులాయ (నిరంతరము కురియు వర్షము వలె తోపుచున్నది. ఆమె తమకము (పరవశత్వము) తడబడునటువంటి సంపదయైనది. కందువ కోరికలు (ఆమె చిలిపి కోర్కెలు) కడివోని విరులాయ (వాసనవాడని సుగంధ సుమములైనవి). ఈ తొయ్యలి (సుందరి) చందము పద్ధతి తొడిబిడన్ చూడరాదా? (చలించిపోవు చున్నదని నీవు చూడలేకున్నావా?

ఓ శ్రీ వేంకటేశ్వరా! ఈ పొలతి (సుందరి) సెలవి నవ్వులు (లేనవ్వులు) పూచిన వెన్నెలలాయ (విరబూచిన వెన్నెలల వలె తోచుచున్నవి). సొంపైన ఆమె కళలు (సొబగులు) చూచినటల్లానాయ (అనగా చూచినవారికి వారి చూపులకు తగినట్లున్నది). నీవు యేచని (అతిశయించిన) ప్రియుడవైనందున ఆ ఇంతిని ఇట్టే కూడితివి. (నీ సంభోగ సంభ్రమమున) ఆమె రాచిలుకయైనది (మధురోక్తులను పలుకు రామచిలుకయైనది) స్వామీ!

సంపుటి : 20 కీర్తన : ఆనలేలయ్య నీవాడినట్టె ఆడేము
సంఖ్య : 177 పుట : 119 - రాగం : కాంబోది

85. ఆనలేలయ్య నీవాడినట్టె ఆడేము
పూనిననీమనసులో పూఁపక మేదయ్యా ॥పల్లవి॥

సన్నల నాకెకు నీకు సాకిరి చెప్పుమనేవు
అన్నట్టే నీమాట లవిగోవయ్య
మిన్నక తిట్టే వందుకుమించి వెంగెములంటా
యిన్నిటా దొరవు నిన్ను నేమనందునయ్యా ॥ఆన॥

అప్పటి మొక్కించుమనే వాకెనే నీముందట
చెప్పినట్టెల్లా నింకఁ జేసేమయ్యా
రెప్ప వెట్టక చూచేవు రేసు నెరపేనంటా
దెప్పరాలు నీకునీవే తెలుసుకోవయ్యా ॥ఆన॥

కందువ నీ వెదురేఁగి కాఁగిలించితి వాకెను
అందరికి వొక్కమన సాయనయ్యా
అందపు శ్రీ వేంకటేశ అంతలో మమ్ము మెచ్చేవు
విందువంటిమావంక వెలుతు లేవయ్యా ॥ఆన॥

ఉపోద్ఘాతము :

నాయిక శ్రీ వేంకటశ్వరునికి బ్రతిమిలాడుతూ నచ్చజెబుతున్నది. అన్నమయ్య తానూ ఒక నాయిక అయి పూనిన నీ మనస్సులో పూపకమేదయ్యా అంటున్నారు. పూపకము అనే మాటకు నిఘంటువులో అర్థం దొరకలేదు. 'పూపు' అంటే పూనిక (termination) అన్నమాట. కాబట్టి పూపకము అంటే నిశ్చయము అని భావిస్తున్నాను. ఓ ప్రభూ! నీవు చెప్పినట్టల్లా ఆడినాము కదా! ఇంకా ఏవేవో వొట్టు పెట్టుకొని మమ్మెందుకు బాధిస్తున్నావు? అసలు నీ మనస్సులో నన్ను అనుగ్రహించాలనే

నిశ్చయమే లేదయ్యె... ఇంకె యెన్ననుకొంటేనేం, యేమనుకొంటేనేం? అంటున్నారు. ఆనాటి తెలుగు అవటం వల్ల మనకు కొత్తగా వుంటుంది. "విందువంటి మావంక వెలుతులేవయ్యా" అంటే యేమిటి?

తాత్పర్యము :

ఓ శ్రీ వేంకటేశ్వరా! నీమీద 'ఒట్లు' పెట్టుకొని నన్నెందుకు బాధిస్తావు? నీవాడినట్లే (చెప్పినట్టే) ఆడేము (చేసితిమికదా!) మరి ఇక పూనిన నీమనస్సులో నాపై) పూపకము (నన్ను అనుగ్రహించాలనే నిశ్చయం) యేదయ్యా!

స్వామీ! మీరూ మీరూ కలహించుకొంటుంటే మధ్య నన్ను సాకిరి చెప్పుమనేవు. (నన్ను నీ తరపున సాక్ష్యం) చెప్పమంటావు). సరే... నేనూ నీవు చెప్పినట్టే చేశాను. ఆవిడ అలిగింది. నీవేమో నన్ను తిట్టుతున్నావు. అందుకు మించి ఆవిడతో నాపై వెంగెములాడేవు (చులకనగా, వ్యంగ్యంగా అనరాని మాటలు నన్నంటూ అవమానించావు). నీవు ఇన్నిటా 'దొరవు. నిన్నేమనగలము? నీకు నీవే ఇది న్యాయమేమో ఆలోచించుకో.

ప్రభూ! ఆమెపై నీవు అలిగి, ఆకెను (ఆమెను) నీ ముందుకు తీసికొనివచ్చి మొక్కించమంటావు. నిన్ను శాంతింపజేయటానికి మేమూ నీవు చెప్పినట్లే చేసేము. ఇంకా నువ్వు శాంతించలేదు. రెప్ప వెట్టక (కనురెప్పలు వాల్చక) బెదరించునట్లు చూస్తున్నావు; రేసు నెరపేవు (చులకన చేస్తున్నావు). దెప్పరాలు (దెప్పుట) కూడా మానవు. నీవేం అటువంటి ఇటువంటి వాడవా? నీకు నీవే తెలుసుకోవయ్యా!

దేవా! నేడు మీ గొడవలు సద్దుమణిగి నీవు యెదురు వెళ్ళి ఆమెను కౌగలించుకొని స్వాంతనపరిచావు. అమ్మయ్య! అని ఒక్క మనసుతో (మనస్ఫూర్తిగా) అందరికీ ఆనందం కలిగింది. అందమైన ఓ తిరుమల నాయకా! అంతలోనే మమ్మూ మెచ్చేవు. విందువంటి మావంక వెలుతులేవయ్యా!) (చుట్టము వంటి నా వంక నీదయ ప్రసరింప చేస్తావు లేవయ్యా! నీవుండగా మాకేం భయం?

సంపుటి : 20 కీర్తన : నిచ్చానిచ్చా విట్ఠలా నీకేలయీ అట్టు
సంఖ్య : 140 పుట : 94 - రాగం : సామంతం

86. నిచ్చా నిచ్చా విట్ఠలా నీకేల యీ అట్టు
మచ్చము నే! జూపితేను మాతోనే నవ్వులా ॥పల్లవి॥

వల్లెవాటు పైఁ డిచీర వనిత శ్రీసతి నీకు
చల్లలమ్మే వారితోడ జాణతనాలా
చెల్లఁబో కొండ గొడుగుచేసి యె త్తేనీవు
గొల్లెతల చీరలెల్లాఁ గోరి ముచ్చిలేదా ॥నిచ్చా॥

అందరి నేలే గోపనందనుఁడవై ననీవు
చెంది చీఁకటితప్పులు సేయఁబొయ్యేదా
గొందినే దేవతలు గొనియాడేదట నిన్ను
మందవారిపాలఁ జిక్కి నిందలఁ బడేదా ॥నిచ్చా॥

కొనబుకాఁడవు నీవు కొమిరెవయసు నేను
పనిలేక వొంటినుం టేఁ బై కొనేదా
ననుపై శ్రీ వేంకటేశ నన్ను నిట్టె కూడితివి
మనలోఁ దగవు దేరె మరియింకాఁ గొసరా ॥నిచ్చా॥

ఉపోద్ఘాతము :

విట్ఠలేశ్వరునిపై శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. అచ్చతెలుగు పదాల అల్లిక అయినందువల్ల అంత తేలికగా అర్థం కాదు. ఆనాటి కొన్ని నుడికారములు మనల్ని తికమక పెడతాయి. "గొల్లెతల చీరలెల్లా గోరిముచ్చిలేదా" అంటున్నారు. కావాలని గోపికల చీరెలను దొంగిలించేదా... అని చెప్పుకోవాలి. అంటే నేను దొంగిలించేదా అని కాదు, దొంగిలించేపని చేస్తావా? అని అర్థం. చెంది చీకటి తప్పులు సెయ్యబొయ్యేదా.. అంటే నన్ను చేరి చీకటి తప్పులు

చేయపూనుకొంటావా? అని అర్థం. ఆనాటి నుడికారాలు తేడావలన కొద్దిపాటి తికమక కలిగినా మధురమైన కీర్తన ఇది. "కొనబుకాడు".. అంటే ఏమిటో నాకెక్కడా దొరకలేదు.

తాత్పర్యము :

ఓ విట్ఠలా! నిచ్చా నిచ్చా (ప్రతిపూటా) నీకు ఈ అట్టు యేలనయ్యా! (ఈ తిట్లన్నీ యెందుకయ్యా! స్వామీ!) నేను మచ్చము జూపితే (మేము నీ అల్లరి నిరూపిస్తే) మాతోనే నవ్వేవు (నవ్వుతాలుగా తీసుకొంటావు).

బంగారుతో చేసిన వల్లెవాటు (పైట) గల చీరె ధరించిన శ్రీదేవి నీకు భార్య. మరి ఇంకా ఈ చల్ల కంపు కొట్టే చల్లలమ్మేవాళ్ళతో జాణతనాలా (సరసాలా?) చెల్లబో (వామ్మో!!) కొండ (గోవర్ధన పర్వతమును) గొడుగు పట్టుకొని ఆబాలగోపాలమును రక్షించిన గోవిందుడు, కోరి గొల్లభామల చీరలెత్తికెళ్ళినాడా? ఇదెక్కడి వింత!!

అందరినీ యేలునట్టి (నందవ్రజమునకు నాయకుడైన నందగోపుని కుమారుడవైన) నీవు, చెంది (తెలిసి తెలిసీ) చీకటి తప్పులు (రేతిరినేరాలు) చేస్తావా? తప్పుకాదా స్వామీ? నలకూబరుడు, నారదుడు, ఇంద్రుడువంటి దేవతలు వచ్చి నీకు మొక్కి నిన్ను కీర్తించిపోతుంటారే.. అట్లాంటి నీవు మందబుద్ధులైన గొల్లవాళ్ళకు చిక్కితిట్లుతింటావా? ఇదేమి చోద్యం?

ప్రభూ! నీవు కొనబుకాడవు (కోడెవయసు చిన్నవాడవు.. అని నేను భావిస్తున్నాను...). నేను కొమిరెవయసు దానను (యౌవనంలో వున్న అమ్మాయిని). నేను ఒంటరిగా పనేమీ లేక వున్నానని నాపై బడి ఆక్రమించు కొంటావా? అనుకూలం చేసుకొని శ్రీ వేంకటేశ్వరా! ఇట్టే నన్ను కూడితివి. మనలో మనకున్న పోట్లాటలన్నీ తీరిపోయాయి కదా! మరి ఇంకా కొసరా? మళ్ళీ మొదటికే వచ్చిందా? హతవిధీ!!

సంపుటి : 20 కీర్తన : సింగారరాయడవేదు చెన్నకేశా యింక
సంఖ్య : 157 పుట : 105 - రాగం : నాదరామక్రియ

87. సింగారరాయఁడ వౌదు చెన్నకేశా! యింకఁ
జెంగకుమీ మారతుల చెన్నకేశా ॥పల్లవి॥

చిమ్ములచుట్లతోనే చెన్నకేశా! మాకు
చిమ్మిరేఁచేవు వలపు చెన్నకేశా
చెమ్మఁజెమటచెక్కుల చెన్నకేశా! మాపైఁ
జిమ్మకు గోళ్ళ నీవు చెన్నకేశా ॥సింగా॥

సెలవి లేనగవుల చెన్నకేశా! మాకే
సెలవనేవు వయసు చెన్నకేశా
చెలఁగి పసిడిదట్టి చెన్నకేశా! యీ-
చెలువము నీకే చెల్లె చెన్నకేశా

చెప్పరాని మహిమల చెన్నకేశా! మాకు!
చెప్పిలేమోవి యిచ్చితి చెన్నకేశా
యిప్పుడే శ్రీ వేంకటాద్రి నిందుమాచనవోలిలో
చెప్పఁగా నన్నేలితివి చెన్నకేశా ॥సింగా॥

ఉపోద్ఘాతము :

మాచవోలు అనే గ్రామంలో వెలసిన చెన్నకేశవ స్వామిపై సరసశృంగారకీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. ఆ సింగారరాయలు తనకు వలపును చిమ్మిరేచు తున్నాడట. గోళ్ళతో చిమ్ముతున్నాడట. పసిడి దట్టివాడట. మారతుల చెంగకుమీ చెన్నకేశా! అంటున్నారు. ఇదివరలో చెప్పినట్లు కేశి అనే రాక్షసుని చంపినందువల్ల

శ్రీ కృష్ణునికి కేశవుడని పేరు వచ్చినప్పటికీ ఆయన కేశపాశము చెన్నగా(అందముగా) వుంటుందట. అందుకే చెన్నకేశవుడైనాడు. ఇంతటి చెలువము ఆయనకే చెల్లిందట.

తాత్పర్యము :

ఓ చెన్నకేశవా! నీవు శృంగార రాయడవుదువు. మా రతుల చెంగకు మీ (మాతోటి రతిక్రీడల నతిశయించకుమయ్యా!)

ఈ చెన్నకేశవుడు చిమ్ముల చుట్లతోనున్నాడు. (విశేషముగా పెరిగిన జుట్టును చక్కటి చుట్లు చుట్టుకొన్నాడన్న మాట). మాకు (ఆ యువతికి) వలపు చిమ్మిరేచేవు (అంటే.. ప్రేమను 'మీటి' రెచ్చగొడుతున్నాడన్నమాట..) ఈ చెన్నకేశవుని చెక్కులపై (చెక్కిళ్ళపై) చెమట చెమ్మగిల్లినదట. మాపై నీవు గోళ్ళతో చిమ్మకు (గాట్లు పెట్టకు). ఎందుకంటే శృంగారరాయడుకదా! నఖక్షతముల కిటుకు నెరిగినవాడు మరి.

ఈ చెన్నకేశవుడు సెలవి లేనగవులవాడు (తన పెదవుల అంచులలో లేత నవ్వులను విరజిమ్ము అందగాడు.) వయసు వురకలేస్తున్న నీవు మాకే సెలవుయనేవు (మమ్మల్నే ఆజ్ఞాపించుచున్నావు). ఓ చెన్నకేశవా! పసిడిదట్టితో (పీతాంబరముతో) చెలగియున్నావు (శోభిల్లుచున్నావు). ఓ చెన్నకేశవా! ఈ చెలువములన్నీ (అందములన్నీ) నీకే చెల్లినవి ప్రభూ!

ఓ చెన్నకేశవా! నీవు చెప్పరాని మహిమలు గలవాడవు. మాకు చెప్పిలేమోవి ఇచ్చావు. 'ఇదిగో చూడు' అని చెప్పి మరీ మధురాధరము నిచ్చావు. ఇప్పుడే.. శ్రీ వేంకటాద్రిపై కూడా వున్నాడు. ఎవరు? ఇంకెవరు? ఈ మాచనవోలు గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి. ఏమి చేశాడయ్యా! చెప్పగా నన్నేలినాడు (ఆయనపై కీర్తన చెప్పగా నన్ను పాలించి అనుగ్రహించినాడు)

సంపుటి : 20 కీర్తన : ఎప్పుడును నాకు లోనైయేరా కృష్ణా
సంఖ్య : 417 పుట : 279 - రాగం : పాడి

88. ఎప్పుడును నాకు లోనె(నై?) యేరా కృష్ణా
చెప్పేవు ప్రియ మప్పుడే చెలువపుఁగృష్ణా ॥పల్లవి॥

చన్నుల నొరిసితిని సాదించేననుచు నిన్ను
వెన్నలేల దొంగిలేవు వేసాలకృష్ణా
కన్నుల జంకించితిని కాఁగిటఁ బట్టేనని
పన్న నేల మాయ లింత బాలకృష్ణా ॥ఎప్పు॥

మాటల నిన్నొరసితి మంతనానకు రమ్మని
చాటేవేల రసాలు జంగిలికృష్ణా
యీటుతోనే నవ్వితిని యిద్దర మొక్కటేయని
వోటమి నీ కెందూ లేదు వున్నతపుకృష్ణా ॥ఎప్పు॥

కూడితి కాఁగిట నిన్ను గుఱుతులు నించి నించి
జాడలు దప్పకుమీ జాణకృష్ణా
వీడె మిచ్చితిని శ్రీ వేంకటాద్రిపయి నీకు
వాడికలు మనసొమ్ము వన్నెల వోకృష్ణా ॥ఎప్పు॥

ఉపోద్ఘాతము :

నాయిక శ్రీకృష్ణునితో అంటున్నది. కృష్ణా! వద్దనుకుంటూనే ప్రతిసారీ నీకు లొంగిపోతాను. అప్పుడే ప్రియములు చెప్పేవు... అప్పటికప్పుడు ఇచ్చకాలమాటలు చెబుతావు... నీవు చెలువపు కృష్ణుడవు... మనోజ్ఞమూర్తివి. అన్నమయ్య సరిగ్గా ఇటువంటి కీర్తనే ఇదివరలో చాలా చెప్పారు. అయినా దేనిమాధుర్యం దానిదే.

ఓ వన్నెల కృష్ణా! మనసొమ్ము "వాడికలు" అంటున్నారు. 'వాడికలు' అంటే దాచిపెట్టి నేనడిగినప్పుడు నాకు ఇవ్వవలసినది అని చెప్పిదాచుకొన్న వస్తువు. మనసొమ్ము యెందుకు వాడికలయిందంటే... నేను నీకు తాంబూలంతోపాటు అర్పించుకొన్నాను కదా! స్వామీ!

తాత్పర్యము :

ఓ శ్రీకృష్ణా! నేను యెప్పుడూ నీకు లోనైయేరా!! నామీద నీదెప్పటికినీ పైచెయ్యే. నీవు చెలువపు కృష్ణుడవు (అందాల కృష్ణయ్యవు). చెప్పేవు ప్రియములప్పుడే (అప్పటికప్పుడు యేవేవో ఇచ్చకాలమాటల చెప్పి నన్ను మభ్యపెడతావు.

కృష్ణా! మొండిగా నిన్ను సాధిస్తున్నానని నా స్తనములను ఒరసిపట్టుకొంటావు. (బిగించి పట్టుకొంటావు).మరి దొంగవేషాలు వేసి వెన్నలెందుకు దొంగిలిస్తావు? నన్ను బిగియార కౌగిలిస్తున్నావని కన్నులతోనే నిన్ను జంకించాను (బెదరించాను). ఓ బాలకృష్ణా! ఇన్ని మాయలు నాపైన పన్నుట యెందుకు స్వామీ!

నాతో మంతనాలకు (సర్దుబాటు ఒప్పందాలకు) రమ్మని, నిన్నుమాటలన్ ఒరసితిని (సాధించాను). నేను నీతో ఆడిన సరసాలన్నీ చాటేవేలనయ్యా! నీవు జంగిలికృష్ణుడవు (గొడ్లుకాచుకొనేవాడివి). నీతోటి గొల్లకుఱ్ఱకారుతో నీకివే మాటలేమో మరి. కాని నేనే నిన్ను మనిద్దరమూ ఒకటే కృష్ణా! అని యీటుతో నవ్వేట్లు చేస్తావు (ఊరకనే నవ్వునట్లు మాయచేస్తావు). నీకు యెప్పుడూ ఓడిపోవడం అనేది లేదయ్యా! కృష్ణా!

ఓ కృష్ణా! గాఢ పరిష్వంగములతో నిన్నుకూడినందువలన, ఆ గుర్తులన్నీ చెప్పకనే జరిగిందేమిటో చెప్పేస్తున్నాయి. ఇప్పుడు నువ్వు జాడలు దప్పుట న్యాయం కాదు. శ్రీ వేంకటాద్రి మీద నాకు వీడెమిచ్చి (తాంబూలమిచ్చి) స్వీకరించావు. ఓ వన్నెల (శోభలీనునట్టి) వేంకటకృష్ణా! మనసొమ్ము (నాకున్నదంతా) నీవాడికమే (నేను నీ దగ్గర దాచుకొన్న నీ సర్వ భుక్త హక్కు అయిన నా మనస్సే...)

సంపుటి : 20 కీర్తన : విన్నపమిదెపో వింటివో వినవో కాని
సంఖ్య : 158 పుట : 106 - రాగం : సామంతం

89. విన్నపమిదెపో వింటివో వినవో కాని
కన్ను గిరిపే వేమికారణమో కాని ॥పల్లవి॥

మాఁటలివి మంచివేపో మనసే తెలియఁగాని
ఆఁటదానఁ బుణ్యపాప మంది నీదేపో
నాఁటిన సెలవులను నవ్వులు నవ్వే విది యౌఁబో
యేఁటికౌఁతా వెనకముం దెంచలేము గాని ॥విన్నప॥

ననుపెల్లా మంచిదేపో నడవ డెఱఁగఁగాని
యెనసితి పరభారా లిఁక నీవేపో
నను నీవు సారెసారె నమ్మించే విది యౌఁబో
కొనయౌతా మొదలౌతా గుట్టెఱఁగఁగాని ॥విన్నప॥

పాయమిది మంచిదేపో పంతము లెఱఁగఁగాని
ఆయమంటి కూడితి నీయాసఁ గంటిఁబో
యీయెడ శ్రీ వేంకటేశ యిన్నిటా నన్నేలితివి
రేయి-పగ లిదియని రీతెఱఁగఁగాని ॥విన్న॥

ఉపోద్ఘాతము :

కొండలరాయనికి కోటి విన్నపాలు చేసికొనని వారు యెవరుంటారు? కాకపోతే ఆయన ఆ విన్నపాలు వింటాడో వినడో చెప్పటం కష్టమే. ఆయన కన్నుగీటినా అది నిజంగా ప్రేమయో లేక ఆటపట్టిస్తున్నాడో నాయికకు తెలియుటలేదు. ఇక్కడ అన్నమయ్యే ఆ అయోమయంలో పడిన నాయిక. నేను ఆడదాన్ని ప్రభూ! నేనే నిన్ను వలపిస్తున్నానో లేక నీవే నన్ను మాయ చేస్తున్నావో... ఆ పాప పుణ్యాలు నీకే వదిలేస్తున్నాను. నా పాయము (ప్రాయము) మంచిదే ప్రణయంలో పంతం

నెగ్గించుకొనే జాణ తనంకూడా నాకు లేదు. కాని నావంటి దాన్నికూడా ఆయము లంటికూడినావు. నాకు రేబవళ్ళకు తేడా లేకపోయింది స్వామీ! అంటున్నారు. ఈ బేల మాటలకు మనస్సు కఱిగి నీరు అవుతున్నది.

తాత్పర్యము :

ప్రభూ! ఇది నీకు నా విన్నపము. అది వింటావో, వినవో కానీ పో... నీ ఇష్టం. నాకేసి చూసి కన్నుగీటుతావు. దానికి ఏమి కారణమో తెలియనిబేలు.. నేను.

స్వామీ! నీ మాటలు వినుటకు మంచివేగానే వున్నాయి. పో... కాని మనసే తెలియుటలేదు. నేను ఆడుదానను. పాపపుణ్యాలెరుగనిదానను. అదంతా నీకే తెలియాలి. మనస్సులో నాటుకొనిపోయే చిరునవ్వులు వెదజల్లుతావు. అది నీ సమ్మతియో కాదో తెలియదు. నేను యెందుకు వెనుక ముందులాడుతున్నానో నాకే తెలియుటలేదు. ఏమి చేయవలెనో యెరుగను.

స్వామీ! నీ ననుపెల్లా మంచిదే పో...(నీ అనురాగం మంచిదిగానే అనిపిస్తున్నది). కానీ నీ నడవడి (ప్రవర్తన) అనుమానం కలిగిస్తున్నది. నిన్ను నేను యెనసితి (పొందాను). ఇక పరభారాలు నీవే (నా బరువు బాధ్యతలన్నీ నీవే ప్రభూ!) నన్ను ప్రతిసారీ నమ్మించివేస్తావు. ఇది అవునోకాదో యెరుగను. మన ప్రయాణానికి ఇది ఆరంభమో... అంతమో? ఆ గుట్టు యెరుగలేకున్నాను. నన్ను పాలముంచినా, నీటముంచినా నీదే భారము.

మనిషి జీవితంలో పాయము (యౌవనము) మంచిదే. పోతే.. చిక్కంతా అది కలిగించే మనోవైకల్యములదే. ప్రణయంలో పంతాలు పట్టింపులు యెటువంటివో కూడా నేనెరుగను. అటువంటి నన్ను ఆయములనంటి కూడితివి (నా మర్మములను తాకి రమించితివి). నీ ఆశ యెంతటి బలమైనదో యెరింగితిని. ఓ శ్రీ వేంకటేశ్వరా! ఇన్ని విధముల నన్ను పాలించి అనుగ్రహించితివి. నాకు రాత్రింబవళ్ళు యెరుక రాకున్నది. త్వమేవాహం... అని నీలో కరిగిపోతిని.

సంపుటి : 20 కీర్తన : నిచ్చలు నా బ్రతుకెల్ల నీ చేతిది; నీ
సంఖ్య : 476 పుట : 318 - రాగం : కన్నడగౌళ

90. నిచ్చలు నాబతుకెల్ల నీచేతిది; నీ-
యిచ్చవచ్చినట్టు సేయు మెదురాడ నిఁకను ॥పల్లవి॥

పలికితి నీతోడఁబంతములు సారె సారె
సొలసితిఁ గొంతగొంత చూపులలోను
అలసితి నిఁకనోప నన్నిటా నీ చిత్తమునఁ
గలిగియట్లఁ చేయు కాదన నే నిఁకను ॥నిచ్చలు॥

కక్కసించితిని నిన్ను ఘనమైనరతులను
వెక్కసానఁ గొసరితి వేసరించితి
మొక్కెద నిఁక నే నేర మొదలనుపాయాలు
మక్కువగలట్టే సేయు మఱఁగేల యిఁకను ॥నిచ్చలు॥

కరఁగించితి మనసు కాఁగిటిరతుల నిన్ను
సిరుల శ్రీ వేంకటేశ సేవచేసితి
అరమఱచితి; నవ్వే నలమేలుమంగ నేను
తరవాత నన్నీఁజేయు తమకించ నిఁకను ॥నిచ్చలు॥

ఉపోద్ఘాతము :

స్వామిపై అలిగి, సాధించి, నొప్పించి, నొప్పింపబడి ఇకచేతులెత్తి శరణంటోంది అలమేల్మంగమ్మ. నీకు సేవచేసి అరమరచితిని ప్రభూ! తరువాత నన్నీజేయు... తమకించనికను అంటున్నది. వాణి ఆ తల్లిదయినా భావన మాత్రం అన్నమయ్యదే. ఆరువందల యేళ్ళ క్రిందటి వాడుక భాష అవటం దీనికి వివరణ ఇవ్వాల్సి వస్తోంది

కానీ సామాన్య జనులు వుపయోగించే తెలుగులోనే అన్నమయ్య కీర్తనలు చెప్పారు. తేడా యేమిటంటే నుడికారం కొద్దిగా మారింది అంతే... మక్కువగలట్టే సేయు మఱఁగేల యికను అంటున్నారు. (ఇంకా దాపరికం దేనికి నీ ఇష్టం వచ్చినట్లు చేయుము... అని నేటికాలంలో అంటున్నాం. అంతే తేడా.

తాత్పర్యము :

ఓ ప్రభూ! నా బ్రతుకెల్ల నిచ్చలు నీది. (నా జీవితమంతా నిత్యమూ నీదే). ఇకను యెదురాడ (ఇంక నీకుయెదురు జెప్పను). నీ ఇచ్చవచ్చినట్లు సేయుము (నీ ఇష్టం వచ్చినట్లు చేయవయ్యా!)

స్వామీ! నీతో పంతానికి పోయి, మాటిమాటికి పోట్లాడి అలసిపోయాను. చూపులతోను కొంత కొంత సొలసిపోయాను. ఇక నోపను (నాకిక ఓపికలేదు) అన్నిటా నీ చిత్తము (అంతా నీ ఇష్టం). కలిగినయట్లు చేయుము. (నీకెట్లాతోస్తే అలా చేయుము). నేనిక కాదనను.

స్వామీ! ఘనమైన రతులతో నిన్ను కక్కసించితిని (ఇబ్బందిపెట్టాను). అధికముగా కొసరి కొసరి నిన్ను వేసరించితి (విసిగించాను). ఇక నీకు దండము పెడతాను. నేనే ఉపాయములనూ యెరుంగను. ఇంకా నీకు మరుగేల (ఇంకా నీకు దాపరికాలెందుకయ్యా! మక్కువ గలట్టే సేయుము (నీ ఇష్టం వచ్చినట్లు చేయుము ప్రభూ!)

ఓ వేంకటేశ్వరా! గాఢ పరిష్వంగములతో కూడిన రతులతో నీ మనస్సును కరిగించితిని. సిరుల సేవ సేసితి (అనేక వైభవములతో నిన్ను సేవించితిని). అరమఱచితిని (నిన్ను పూర్తిగా నమ్మితిని). నేను వేరెవరినో కాదు ప్రభూ! నీ నవ్వుల అలమేలు మంగను తరవాత అన్నియును నెరపి నన్ను తమకించుము (వేగిరపఱచుము) స్వామీ!

సంపుటి : 20 కీర్తన : కోరినట్టే నీకు జెల్లె గోవిందుడా
సంఖ్య : 3 పుట : 3 - రాగం : సామంతం

91. కోరినట్టే నీకుఁ జెల్లె గోవిందుఁడా మా-
కూరిములు మాకు దక్కె గోవిందుఁడా ॥పల్లవి॥

కొలనికఱుత నీవు గోవిందుఁడా । మము
గులుగు రేఁచకువోయి గోవిందుఁడా
కొలముఁ గొలముఁ గూడె గోవిందుఁడా । ఇంత
కులికి నవ్వకువోయి గోవిఁదుఁడా ॥కోరి॥

కోకలేల తీసితివి గోవిందుఁడా । నీకుఁ
గోకో ఇదివో మొక్కు గోవిందుఁడా
గోకులమిందరిలోన గోవిందుఁడా । సిగ్గు
కూకులు వత్తులు నాయ గోవిందుఁడా ॥కోరి॥

కొప్పు దాఁకించకువోయి గోవిందుఁడా । మా
కుప్పెసవరము వీడీ గోవిందుఁడా
గొప్ప శ్రీ వేంకటగిరి గోవిందుఁడా । మేలు
కుప్పళించి కూడితివి గోవిందుఁడా ॥కోరి॥

ఉపోద్ఘాతము :

గోవిందరాజస్వామిపై లలిత శృంగార కీర్తన వినిపిస్తున్నారు అన్నమయ్య. స్వామికి మొండి పట్టుదల యెక్కువ. అన్నీ ఆయన కోరుకున్నట్లే జరగాలి. భజన పద్ధతిలో కొనసాగుతుందీ కీర్తన. ఇందులో కఱుత, గులుగు, కోవోమొక్కుట, కుప్పళించుట వంటి యెన్నో తెలుగుమాటలు ఈనాడు వాడుకలో లేవు. జాగ్రత్తగా ఆకళింపు జేసుకోవాలి. అంటే ఏమిటి? అని అడిగేవారికి నేనేం చెప్పగలను?

తాత్పర్యము :

ఓ గోవిందరాజా! నీవు అనుకొన్నది సాధిస్తావు. నీకు అంతా కోరినట్లే చెల్లుతుంది. దానివల్ల మాకు లాభమే కలిగింది. మాకు నీ కూరిములు (వలపులు) దక్కినవి ప్రభూ!

గోవిందుడా! నీవు కొలని కఱుతవు (కోనేటి ఒడ్డున వున్న దుండగీడువు. మము గులుగురేచకు (మాకు గిలిగింతలు పెట్టకు). కొలమున్ కొలము గూడె (మా కులములో వాళ్ళంతా గుమి గూడి నీపై పితూరీ చేయటానికి వచ్చారు). మరి నువ్వేం చేస్తున్నావు? ఏమాత్రం లెక్కసేయక ఒక కులుకు కులికి పకపకా నవ్వుతున్నావు.

ఓ గోవిందుడా! కోకలెల్లా తీసితివి (చీరెలన్నీ యెత్తుకెళ్ళావు). నీకున్ ఇదివో కోకో మొక్కేము. (కో కొల్లలుగా నమస్కరిస్తాము). ఓ స్వామీ! ఇంతమంది గోకులం వాసులలో మా సిగ్గు "కూకలు వత్తలు" నాయె. (తుత్తునియలైపోయింది... అంటే మా సిగ్గు చితికిపోయింది అని అర్థం).

ఓ గోవిందుడా! అది నీకు అలవాటైతే అవుగాక! కానీ మా కొప్పులు తాకించకు (కావాలని మా కొప్పులపై చేతులు వేయకు). మా కుప్పె సవరము వూడిపోతుంది. గొప్పదైన శ్రీ వేంకటగిరిపై చేరిన గోవిందుడా (శ్రీ వేంకటేశ్వరా!) నీవు మాకు మేలు కుప్పళించి (కుప్పలు తెప్పలుగా ఉపకారములను చేయుచూ) కూడితివి మాతో చేరియున్నావు.

సంపుటి : 21 కీర్తన : పెక్కునిచ్చ కల్యాణాల పెండ్లికొడుకు
సంఖ్య : 482 పుట : 322 - రాగం : గౌళ

92. పెక్కునిచ్చకల్యాణాల పెండ్లికొడుకా
మిక్కిలి జాణఁడవయ్యా మేలయ్య నీకు ॥పల్లవి॥

చెలులు పదారువేల సేసవెట్టినచేతుల
చెలఁగి నాకు మొక్కేవు చెల్లునా నీకు
కలఁగక గొల్లెతలకాలుదొక్కే పాదమున
అలరి నాకాలుదొక్కే వౌనయ్య నీవు ॥పెక్కు॥

పురకాంతలఁగూడ బోడించినమాటల
ధర సరసమాడేవు తగునా నీవు
పరగఁ గొలనిలోని పచ్చితనపు చూపుల
వొరసి మమ్ముఁ జూచేవు వోయయ్య నీవు ॥పెక్కు॥

కడుబలిమి రుక్మిణిఁగాఁగిలించిన కాఁగిట
యెడయక కాఁగిలించే విదిలో నన్ను
కడఁగి శ్రీ వేంకటాద్రిఘనుఁడ నీకు నాకు
బడినే శోభనములు పైకొనెనయ్యా ॥పెక్కు॥

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటేశ్వరుడు నిత్య పెళ్ళికొడుకు. అంతేకాదు.. మిక్కిలి జాణ. ఉన్న ఒక్క భార్యను సమాధాన పరచుకోలేక మనం తిప్పలు పడుతుంటే స్వామి అంతమంది భార్యలతోనూ, అంతకు అనంతమైన వలపుకత్తెలతోనూ, అన్నమయ్యవంటి భావనా

ప్రపంచంలో పరమాత్మతో రమించే అన్నులమిన్నలతోను.. నిత్యమూ శోభిల్లుతున్నాడు. రుక్మిణీదేవి గాఢాలింగనంలో బిగిస్తే కడుబలిమి యెడయక కాగిలించేవు నన్నునూ అంటున్నది అన్నమయ్య భావనా భామిని.

తాత్పర్యము :

పెక్కు నిత్య కల్యాణాల పెండ్లికొడుకా! నీవు మిక్కిలి జాణడవయ్యా! నీకు మేలు కలుగుతుందయ్యా! నీ ఆనందమే మాకు పరమానందం.

పదియారువేల మందిపై తలంబ్రాలు చల్లిన చేతులతో నేడు నాకు మ్రొక్కుతున్నావు. ఇది నీకు చెల్లునా ప్రభూ! ఆనాడు అదరు బెదురు లేక గొల్లభామల కాలు దొక్కేవు. (దగ్గరయ్యేవు) నేడు నాతోనూ కాలు ద్రొక్కుతున్నావు. ఏమి నా భాగ్యము!!

ప్రభూ! ఆనాడు మధురాపురంలో కుబ్జవంటి పురకాంతలను కూడుటకు నీవాడిన బోడించిన మాటలు (అప్పటి కప్పుడు పబ్బంగడుపుకొనే మాటలు) మాట్లాడి నేడు నాతోనూ సరసమాడేవు. ఇది నీకు తగినపనియేనా? ఆనాడు కొలనిలోని గోపికలను చూచిన 'పచ్చి' చూపులు మాపైననూ ఒరసి (పరీక్షగా) చూచుచున్నావు. ఏలనయ్యా?

ఓ శ్రీవేంకటేశ్వరా! ఆనాడు రుక్మిణీదేవిని గాఢాలింగనంలో బిగించినట్లే నేడు విడువక నన్నునూ నీ బిగికౌగిట కరగించినావు. కడగి (ఉద్యమించి) నీకు నాకు బడినే (శీఘ్రముగా) శోభనములు (మంగళకరసమాగమములు) పైకొనెనయ్యా! (కలిగినవి ప్రభూ!) నేను ధన్యురాలను స్వామీ!

సంపుటి : 21 కీర్తన : ఆనలింకామానవా ప్రహ్లాదవరదా
సంఖ్య : 477 పుట : 318 - రాగం : రామక్రియ

93. ఆన లింకా మానవా ప్రహ్లాదవరదా
నానెఁ జెమటఁ చెక్కులు నవ్వులింత చాలదా ॥పల్లవి॥

పిప్పిచేసితివి మోవి బెదరించితివి నీవి
అప్పటి నాసోదమా ప్రహ్లాదవరదా
కొప్పు జారఁజేసితివి కొంగువట్టి తీసితివి
రెప్పలెత్తి చూచే వింకా రేసెంత గలదో ॥ఆన॥

మానముపైఁ దిట్టితివి మర్మము చేముట్టితి
ఐన నింతచాలదా ప్రహ్లాదవరదా
మేనెల్లఁ జొక్కించితివి మేకుల దక్కించితివి
శేననవ్వులు నవ్వేవు సేఁత లింత చాలదా ॥ఆన॥

చెక్కుఁ గడునొక్కితివి చేతెలెత్తి మొక్కితివి
అక్కరింకానేఁటికి ప్రహ్లాదవరదా
యెక్కువ శ్రీ వేంకటాద్రి నిరవైనదేవుఁడవు
దక్కి నన్నుఁగూడితివి తమి యెంతగలదో ॥ఆన॥

ఉపోద్ఘాతము :

హిరణ్యకశిపుని చీల్చిచెండాడి పేగులు మెడలో జంద్యాల వలె వేసికొనిన నృసింహదేవుని సరసశృంగార నాయకుని వలె భావించే అన్నమయ్య భావసౌందర్యానికి జోహారు. తన హృదయేశ్వరియైన శ్రీలక్ష్మికి ఆయన యెన్నో ఆనలు పెడతాడట (ఆజ్ఞలు విధిస్తాడు). చెమటతో నా చెక్కిళ్ళు నానిపోతున్నాయి

అని ఆ ప్రహ్లాదవరదునికి విజ్ఞప్తిని చేస్తోందిట ఆ తల్లి. నా మోవి పిప్పిచేసితివి, నీవి బెదిరించితివి... నీవు అప్పటి నాసోదమా ప్రహ్లాదవరదా! అంటున్నది. అంటే యేమిటో తెలియాలంటే... తాత్పర్యం చదవాలి, తప్పదు.

తాత్పర్యము :

ప్రహ్లాదవరదుడవైన ఓ నృసింహా! నీ ఆనలు (ఆజ్ఞలు) ఇంకా మానవు. దేవి చెక్కిళ్ళు చెమటతో నానిపోతున్నాయి. (కొండ గుహలలో ఎంత చెమట పట్టుతుంది?) కాని స్వామి దేవేరి చిరునవ్వు వదలలేదు. ఆ నవ్వులు చాలవా ప్రహ్లాదవరదా!

స్వామీ! ఆమె మోవి (అధరమును) పిప్పిజేసితివి. ఆమె 'నీవి' బెదరించితివి. (ఆమె చీరెముడి సడలించితివి). ఓ ప్రహ్లాదవరదా! అప్పటి నా సోదమా (అప్పటిన్+ఆసోదమా)... అంటే.. ఆమెకు కలిగే శృంగార భావనలు పైకే ద్విగుణీకృతమై కనబడుతున్నాయి). ఆమె కొప్పుజారిపోవునట్లు చేసితివి. కొంగుపట్టి దగ్గరకు తీసికొనినావు. నీ కనురెప్పలెత్తి చూచినావు. నీకు రెసెంతకలదయ్యా! (ఎంతచులకన!!)

స్వామీ! మన్ననలేక నిందింతువు. మర్మాంగములనంటెదవు. అయినను శాంతింపవు. ఇంతచేసినను, చాలదా? నీవు నా శరీరమంతా పరవశించునట్లు చేతువు. తన్మయత్వం కలిగింతువు. స్వామీ! నీవు శేన (చానా...అంటే మరీ ఎక్కువ)గా నవ్వుతున్నావు. నీవు చేసే ఈ పనులు చాలవా)?

ఓ ప్రహ్లాదవరదా! నీవు నా చెక్కిళ్ళు విపరీతముగా నొక్కివేయుచున్నావు. నీకింత అక్కర (అపేక్ష) యేలనయ్యా! నన్ను ప్రసన్నను చేసికొంటివి. ఎక్కువైన శ్రీ వేంకటాద్రి ఇరవైన (సంస్థానమైన) ఓ దేవా! నీవు నాకు దక్కి నన్ను కూడితివి. నీకు నాపై యెంత తమి (అపేక్ష) యున్నదయ్యా? నేను ధన్యను ప్రభూ!

సంపుటి : 21 కీర్తన : ఇదివో చెలియా భావమిక నీచిత్తమెట్టో
సంఖ్య : 478 పుట : 139 - రాగం : భైరవి

94. ఇదివో చెలియభావ మిఁక నీ చిత్త మెట్టో
పెదవులు మోఁపి మోఁపి పేరుకొనిపాడును ॥పల్లవి॥

నీవు వచ్చేవని చెలి నిలుచుండినిలుచుండి
తోవకెదురుగ వచ్చి తొంగిచూచును
భావములో నీరూపు భావించిభావించి
నీవి జారఁ గరఁగును నివ్వెరగు నొందును ॥ఇది॥

యెవ్వరు మాఁటాడినా నీయెలుఁగని సారెసారె
అవ్వల నివ్వలఁ జూచి యాలకించును
జవ్వని గాలివెట్టినచప్పు డట్టె వినివిని
మవ్వపుఁగళవళాన మాటలాడును ॥ఇది॥

యింతలో శ్రీ వేంకటాద్రి యెక్కి ప్రహ్లాద వరద
కాంత నిన్నుఁ గూడి కవకవ నవ్వెను
చింతదీర నీవు మేనఁ జేసినరేకలు చూచి
వంతుల నీమేనఁ జేయవలెనని యెంచును ॥ఇది॥

ఉపోద్ఘాతము :

ఉగ్రనరసింహుడంటే ఉర్విలో వారందరికీ వణుకు కావచ్చును, కాని ఆయన హృదయేశ్వరి ఆదిలక్ష్మికేమి భయం? ఆమె ఆయనను కూడి 'కవకవ' నవ్వుతుందట. ఆయన ఆవిడ వంటిపై ఏవేవో రేఖలు చిలిపిగా గీస్తే, ఆవిడకూడా వంతులుగ తానూ గీస్తుందట. ఇదిగో ఆ చెలియ ఆలోచనేమిటో నీ ఇష్టం స్వామీ! ఆమె మాత్రం తన పెదవులు మోపి మోపి (నీవంటికి ఆనించి, ఆనించి) నిన్ను పేరుకొని

(స్తుతించుచు) పాడుచున్నది. జగద్వల్లభుడవు నీకింకొకరు చెప్పాలాస్వామీ! అంటున్నారు, అన్నమయ్య. ఏ జన్మలో చేసికొన్న అదృష్టమో ఆరువందల ఏళ్ళ తర్వాత నాచేత ఇది మళ్ళీ వింటున్నాడు ఆ దేవదేవుడు.

తాత్పర్యము :

ఇదిగో స్వామీ! ఆ చెలియ (ఆదిలక్ష్మి) భావము (ఆలోచన) నీ చిత్తము యెట్టిదో మాకెట్లా తెలుస్తుంది? ఆమె మాత్రం తన పెదవులను మోపి మోపి (నీవంటికి ఆనించి, ఆనించి) పేరుకొని (నిన్ను స్తుతించుచూ) పాడేను (పాటలు పాడుతున్నది).

ఆ చెలియ నీవు వస్తున్నావేమోనని నిలుచుని, నిలుచుని వేచి చూస్తూ తోవకెదురుగా వచ్చి తొంగిచూచి నిరాశ చెందుతున్నది. మదనమనోహరమైన నీ నారాయణుని రూపం తన భావనలలో భావించి భావించీ తన యొక్క నీవిజార (చీరెముడి సడలగా) కరగుచు (పరవశించుచూ) ఎందుకిట్లయ్యెనో అని నివ్వెరగైనది (సంభ్రమము జెందినది).

ఎవ్వరిమాటవిన్నా, నీ గొంతేమోనని మాటిమాటికీ అటూ ఇటూ చూచి చెవులు రిక్కిరించి వింటుంటుంది. ఆ జవ్వని గాలివీచిన చప్పుడునకు కూడ ఉలికిపడి, మవ్వపు కళవళాన (సున్నితంగా తొట్రుపడి) మాటలాడుచున్నది (ఏమేమో మాటలాడుచున్నది).

ఓ ప్రహ్లాద వరదా! ఇంతలో నీయొక్క శ్రీ వేంకటాద్రిని యెక్కి ఆ శ్రీకాంత నిన్ను కూడినది. తనచింతన దీర (అమ్మయ్య.. నా భర్త ఉగ్రమూర్తికాదు జగన్మోహనుడని) 'కవకవ' నవ్వినది. ఇంతలో నీవు ఆమె వంటిపై ఏవేవో రేకలు (గీతలు) గీస్తుంటే... నేనేం తక్కువ... అని ఆమెకూడా వంతులకు పోయి తానూ నీవంటిపై అలాగే చేయాలని అనుకొన్నది.

సంపుటి : 21 కీర్తన : ఇంకనేలా మాటలు ఎఱుగుదు నేనన్నియు
సంఖ్య : 39 పుట : 27 - రాగం : రామక్రియ

95. ఇంకనేలే మాటలు యెఱుఁగుదు నేనన్నియు
కంకిగా నీతోఁ దారుకాణించితిఁ జాలదా ॥పల్లవి॥

సెలవి నీవు నవ్వఁగా సిగ్గువడి ఇంతి నిన్ను
కలువపూవున వేసెఁ గద్దో లేదో
నిలువుటద్దములో నీ నీడ నీవు చూచుకోఁగా
కలిగి కాఁగిటఁబట్టె కద్దో లేదో ॥ఇంక॥

అందముగా నీవు దన్ను ఆయములు చెనకఁగా
గందము నీపైఁ బూసె కద్దో లేదో
సందడిఁ గొలువులోన సరిఁ బరాకై యుండఁగా
కందువలు నిన్ను నంటెఁ గద్దో లేదో ॥ఇంక॥

నిక్కి నీవు చూడఁగాను నిన్నుఁ జేయివట్టి తీసి
గక్కున రతులఁ గూడె కద్దో లేదో
యిక్కడ శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
కక్కసించి జంకించెఁ గద్దో లేదో ॥ఇంక॥

ఉపోద్ఘాతము :

నాయిక (అన్నమయ్య) గద్దించి స్వామితో ఇంకానీతో నాకు మాటలేమిటయ్యా నేనన్నియు నెఱుగుదును. కంకిగా యెన్నో తార్కాణాలు చూపించాను. ఇంకా కావాలా? ఇది చాలదా? అని దెప్పిపొడుస్తున్నది. కద్దో లేదో.. అని అడుగుతున్నది. నేటి భాషలో అవునా? కాదా? అని అడగటం అన్నమాట. చివరికి స్వామీ! ఆమె నీవు

నన్ను కూడినావని కక్కసించి జంకించినది అవునా? కాదా? అంటున్నది. ఏదో అర్థమైనట్లే వున్నా... వివరించలేము కద్దో లేదో? అందుకని తాత్పర్యం చదవండి.

తాత్పర్యము :

స్వామీ! ఇంకనేలా మాటలు? నేనన్నియును యెరుగుదును. నీతో కంకిగా (గద్దించి) అన్నీ తారుకాణించితిని (నిరూపించాను). ఇది చాలదా?

ఇదిచెప్పవయ్యా! ఆమె (స్వామిని వలచిన మరొక చిన్నది) నీవు చిరునవ్వు నవ్వగానే సిగ్గుపడి తన చేతిలో నున్న కలువపూవును నీపై విసిరేసింది. కద్దో లేదో (అవునా? కాదా?) నిలువుటద్దములో నీ ప్రతిబింబం నీవు చూచుకొంటుంటే వెనుకనుంచి వచ్చి నిన్ను కౌగలించుకొనినదా లేదా?

స్వామీ! అందముగా నీవామె సున్నితమైన అవయవములనంటగా... తాళలేక నీపై గంధము పూసినదట. అవునా? కాదా? సందడిగావున్న నీ రాచసభలో నీవు యేదో సమస్యవల్ల కాస్త పరధ్యానంగా వుంటే... అదెవత్తో వచ్చి నీ కందువలు అంటెనట (నీ ఏకాగ్రతను భగ్నం చేసినదట. అవునా? కాదా? ముందు ఇది తేల్చి చెప్పవయ్యా!

అవన్నీ అట్లావుంచి, ఇది చెప్పవయ్యా! నీవు రహస్యంగా ఆమెను చూడగానే నీ చేయివట్టి... తీసి (ఆపైన) గక్కున (వెంటనే) నీతో రతిని గలిసినదా? లేదా? ఓ శ్రీ వేంకటేశా! ఇక్కడ (ఈ తిరుమలపై) ఇట్లా నన్ను (నాయిక రూపంలో వున్న అన్నమయ్యను) కూడా కక్కసించి (ఇబ్బందిపెట్టి) జంకించి (బెదరగొట్టి) కూడినావు. కద్దో... లేదో చెప్పవయ్యా! శృంగారరాయా!

సంపుటి : 21 కీర్తన : కేరడమాడగలనా కేశవరాయా
సంఖ్య : 495 పుట : 330 - రాగం : గుండక్రియ

96. కేరడమాడఁ గలనా కేశవరాయా
చూరగొని మర్మములు సోఁకింతుఁగాక ॥పల్లవి॥

పంతమాడితే నీతోఁ బతి యాడఁగలనా
కాంతలతోఁ జెప్పి నవ్వఁగలఁగాక
దొంతి సాకిరివెట్టేవు తొలమనఁగలఁగాక
కొంత మోముమూసుక సిగ్గున నుందుఁగాక ॥కేర॥

వట్టియెమ్మె మెరసితే వద్దనే నేఁ గలనా
చుట్టపుమొకమోటానఁ జూతుఁగాక
వెట్టినీచేఁతలకు వేఁగై మాడఁగలనా
కిట్టి మరునికి నొప్పగించఁగలఁగాక ॥కేర॥

కాఁగిలించితే నిన్నుఁ గాదనఁగఁగలనా
లోఁగి యందులకే చొక్కి లోనౌదుఁగాక
నాఁగులెల్లఁ దీర మాఁచనవోలిచెన్నుఁడవై
మూఁగితి శ్రీ వేంకటేశ మోవి యిచ్చేఁగాక ॥కేర॥

ఉపోద్ఘాతము :

మాచనవోలులో వెలసిన చెన్నకేశవ స్వామిపై సరసశృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. నాగులెల్లదీర మూగితి..శ్రీవేంకటేశా! మోవి యిచ్చేగాక... అంటున్నారు. కేవలం ఒక నిఘంటువుతో కీర్తనను వివరించడం కష్టం. భావించాలి. ఇది నా భావన. నాలుగు అంటే... వడ్డీగా ధ్యానముతో ఇంకొక సగం ధ్యానం ఇవ్వటం. ఇక్కడ అర్థం ఎలా చెప్పుకోవాలి అంటే...

ఓ వేంకటేశ్వరా! మాచనవోలిలోని చెన్నకేశుడవూ నీవేయై మూగితివి. నీకు ఇవ్వవలసినది అంతా ఇచ్చేశాను గనుక నాకు నీ మధురాధరమును అందింతువుగాక! ఇంత తిరకాసువున్నది, ఈ కీర్తనలో...

తాత్పర్యము :

ఓ కేశవరాయా! (చెన్నకేశవా) నేనెంతదానను? నీతో కేరడమాడగలనా? (తిరస్కారపుమాటలు) మాట్లాడగలనా? చూరగొని (కొల్లగొట్టి) నా మర్మావయవములను స్పర్శింతువు. ఇది తగునా?

ఓ చెన్నకేశవా! నీవు నాతో పంతం పడితే నేను తిరిగి అదే పని చేయగలనా? నీవు ఇతర స్త్రీలతో నా గురించి చెప్పి కించపరచినా, నవ్వుకొన్నా నవ్వుకుందువుగాక! నాతో దొంతిసాకిరి (అగని చాకిరీ) చేయించినా కాదనను. నేనా చాకిరిలో తలమునకలైనా కాదనను. నీవలా చేయించావని కొంత చిన్నబుచ్చుకొందునేమో!! అయితే ఔగాక!

స్వామీ! నీవు నాపై వట్టి యెమ్మెలు (ఉత్తుత్తి ఇష్టాలు) చూపిస్తే కూడ నిన్ను కాదనగలనా? దూరపు చుట్టాలపై చూపు మొగమాటములను చూపింతువుగాక! నిరర్థకమైన నీ పనులకు, వేగైమాడగలనా (తపించగలనా?) కిట్టిమరునికి (సమీపించి బాధించు మన్మథునికి) నన్ను నేను ఒప్పగించుకొందును గాక!

ప్రభూ! నీవు నన్ను గుచ్చి కౌగలించితే కాదనగలనా? నీకు లోగి (లొంగిపోయి) అందుకు చొక్కి (పరవశించి) లోనౌదుగాని (లొంగిపోతాను గానీ!) నిన్ను నిరాశ పరచగలనా? మాచనవోలులో వెలసిన ఓ చెన్నకేశవా! నీవే తిరుమల శ్రీ వేంకటేశుడవు కదా! నాగులు యెల్లన్ తీరిపోగా (నీకు కట్టవలసిన పన్నులన్నీ కట్టేస్తాను). నా మధురాధరము నీకందింతును గాక!

సంపుటి : 21 కీర్తన : ఇంకా నీ మనసెట్టో యెఱగజుమ్మీ
సంఖ్య : 494 పుట : 330 - రాగం : ఆహిరి

97. ఇంకా నీమనసెట్టో యెఱఁగజుమ్మీ
కొంకితి నింతే నేఁగొసరఁజుమ్మీ ॥పల్లవి॥

చుక్కలు గాయఁగా నేఁ జూడఁ దలెత్తితి నింతె
ఇక్కడ నేముండుతా నే నెఱఁగజుమ్మీ
చిక్కువడ్డముత్యములు చేతులఁబట్టితి నింతే
అక్కర నివేఁటివని యడుగఁజుమ్మీ ॥ఇంకా॥

తుమ్మిదలు బెదరఁగా దోడ నే నవ్వితి నింతే
తమ్మి మోవి నిన్ను నేమీఁ దడవఁజుమ్మీ
వుమ్మ గాలివిసరఁగా నొంటి నేఁ బండితి నింతే
అమ్మరో నీతో నే నలుగఁజుమ్మీ ॥ఇంకా॥

చీకాకు రేకలు చూచి చే గోరగీరితి నింతే
చేకొని నీమేను పచ్చి సేయఁజుమ్మీ
యీకడ శ్రీ వేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
పైకొని చొక్కితి నింతే పదరఁజుమ్మీ ॥ఇంకా॥

ఉపోద్ఘాతము :

"స్వామీ! నీ మనసెటువంటిదో యెరుగనైతిని. నేను కోరికయెంతవున్నా సంకోచము వలననే వెనుకంజ వేస్తున్నాను సుమా! నీవంటే నాకిష్టం లేకకాదు.. శ్రీరమణుని వలచిన రమణిగా తనని తాను భావించుకొని అన్నమయ్య ఆలపించిన సరసశృంగార కీర్తన ఇది. స్వామిలో ఆమె చీకాకు రేకలు చూచిందట.

అందుకని నీపని ఇలాగుండా అని గోటితో గీరిందట... ఇప్పుడు చెప్పండి అన్నమయ్య సాటియైన లలిత శృంగార కవి దొరుకుతాడా?

తాత్పర్యము :

ప్రభూ! ఇంకా నీ మనస్సేమిటో నేను యెరుంగను జుమ్మీ!! (సుమా!) కొంకితిన్‌యెంతో (ఎంతయో సంకోచించుచుంటిని) నేన్ కొసరన్ జుమ్మీ! (కోర్కెను మెండుచేయలేకున్నాను). అంటే... కోరిక నాకెంతున్నా బహిరంగం చేయలేకున్నానని భావము.

స్వామీ! ఆకాశంలో నక్షత్రాలు వచ్చేశాయా అని తలెత్తి చూచాను. ఇక్కడ నేముండుతా నేనెఱుగను (ఇక్కడ యేమిజరుగుతున్నదో, యెంతజాము గడించిందో నాకేమీ తెలియదు ప్రభూ!) నీ మెడలో ముత్యాలహారాలు చిక్కుపడ్డాయి యేమిటా అని వాటిని చేతితో పట్టి సవరించాను. అంతే, అక్కర నివేటివని యడుగ జుమ్మీ!! (ఇట్లా జరుగాల్సిన అవసరమేమిటని అడుగలేదు సుమా!)

ప్రభూ! నీ పెదవులపై మకరందమున్నదని కొన్ని తుమ్మెదలు మూగినవి. అది చూచి నవ్వు వచ్చి నేనూ నవ్వాను. అది తమ్మిమోవి (తామరలవంటి పెదవులని) సమాధానపడ్డాను కానీ నేన్ తడవన్ జుమ్మీ! (నేనేమీ వాకబు చేయలేదు కదా!) ఉక్కపోస్తున్నదని గాలికోసం కాస్త ఒంటరిగా పడుకున్నాను. అమ్మరో! (అమ్మయ్యో!) నీపై అలుగలేదు సుమా!

స్వామీ! నీ వదనములో చీకాకురేకలు (చిరాకుపడుతున్న చిహ్నములను) చూచి అది సరికాదని నా గోటితో కొద్దిగా గీరి మందలించుటకు యత్నించాను. నీ శరీరంపై గాయము చేయుటకు కాదుసుమా! అంతెందుకు.. ఇప్పుడు ఓ శ్రీ వేంకటేశ్వరా! ఇట్లు నన్నుకూడినావు కదా! దానికి నేనుపైకొని (అతిశయించి) చిక్కితిని (పరవశించితిని). అంతేకాని పదరను జుమ్మీ!! (తొందరపడను సుమా!)

సంపుటి : 26 కీర్తన : రామారామా రాజీవ నయనా
సంఖ్య : 44 పుట : 32 - రాగం : ఆహిరినాట

98. రామా రామా రాజీవనయనా
కామించి నినుఁ జూచె గక్కన మా చెలియ ॥పల్లవి॥

యింతి పిలువనంపె నెడమాటలేలా
యింతలో విచ్చేయు ఎన్నికగాక
చెంత నిందులకుఁగా సెలవి నవ్వేలా
పంతముతో నాకెఁ బాలింతు గాక ॥రామా॥

తరుణి పూవుల వేసె తలవంచనేలా
సరి నీవు మోహమే చల్లుదుగాక
నిరతి నిందుకుఁగా నివ్వెరగేలా
మరిగి యాకెను నీవే మన్నింతుగాక ॥రామా॥

మగువ కాఁగిటఁ గూడె మరి సిగ్గులేలా
వెగటురతుల విఱ్ఱవీఁగుదుగాక
వగల శ్రీ వేంకటేశ వావిలిపాటిరామ
మిగుల సీతతో మెఱతువుగాక ॥రామా॥

ఉపోద్ఘాతము :

నేటి కడప జిల్లాలోని వావిలిపాడులో వెలసిన శ్రీరామచంద్రునిపై సరసశృంగార కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. తానే చెలికత్తెయై రాజీవాక్షునితో విన్నవించుకొంటున్నారు. నీకు మరెన్నో రాచకార్యాలుంటే వుండుగాక యింతి (సీతాదేవి) పిలువనంపెన్ యెడమాటలేలా వెంటనే రావయ్యా! ఎన్నికగాక అంటున్నారు. ఎన్నికగాక... అంటే ఆక్షేపించక... అని అర్థం.

మగువ కౌగిట గూడె, ఇంకా సిగ్గులెందుకు వెగటురతుల విఱ్ఱవీగుదుగాక అంటున్నారు అన్నమయ్య రామచంద్రుని ఇలా సన్నుతించుట అరుదైన విషయమే.

తాత్పర్యము :

రాజీవ నయనుడవైన శ్రీరామచంద్రా! మా చెలియ (సీతాదేవి) కామించి (విరహోద్విగ్నయై) నిన్ను చూచినది. గక్కన (వెనువెంటనే) విచ్చేయవయ్యా!

ఇంతి పిలువనంపె (సీతాదేవి నిన్నురమ్మని పిలుపును పంపింది). ఎడమాటలేల (తిరస్కారపుమాటలెందుకు). ఎన్నికగాక (ఆమెను ఆక్షేపించక) ఇంతలో (ఉన్నవాడివున్నట్లే) విచ్చేయవయ్యా! ఇందులకుగా (దీనికోసం... అంటే ఆవిడే పిలువనంపిందని) సెలవి నవ్వేలా (చిరునవ్వులు ఏల చిందిస్తున్నావు). పంతముతో (దీక్షాదక్షుడవై) ఆమెను ఏలుకోవయ్యా!

ఆ దేవినీపై పూవులు వేసె (మరు విరులు చల్లింది) అంతమాత్రాన నీవు తలవంచనేల? నీవు కూడ అందుకు సరియగునట్లు మోహమును ఆమెపై చల్లెదవుగాక! ఆమె వలపుకోసం ఇంత పారవశ్యం తగదు. ఆమెను నీవు గాఢంగా ప్రేమించిన వాడవైనందున ఆమెను మన్నింతువుగాక!

స్వామీ! ఆ మగువ నిన్ను కౌగిలింతలో గూడినది. మరింక సిగ్గులేలనయ్యా! వెగటురతుల (విరసత్వము గల) రతులతో విజృంభింతువు గాక! శృంగారకళలతో నెలకొన్న వావిలిపాటి రామచంద్రా! నీవు స్వయానా, మా తిరు వేంకటేశ్వరుడవే. నీవు నేడు ఈ వావిలిపాడులో సీతాదేవితో శోభింతువుగాక!

సంపుటి : 26 కీర్తన : కోరిక లీడేరె నేడు కోనేటిరాయ
సంఖ్య : 299 పుట : 210 - రాగం : సామంతం

99. కోరికె లీడేరె నేఁడు కోనేటిరాయ । ఇట్టె
కూరిముల వూటుకూరి కోనేటిరాయ ॥పల్లవి॥

కుమ్మరించేవు సిగ్గులు కోనేటిరాయ । యీ...
కొమ్మలెల్లఁ జూడఁగాను కోనేటిరాయ
కొమ్మువంటి కొనగోరఁ గోనేటిరాయ । మేను
కుమ్మెలుగా నొత్తకుమీ కోనేటిరాయ ॥కోరి॥

కొప్పుగడు వెడజారె కోనేటిరాయ । నిండా
గుప్పేవు సెలవినవ్వు కోనేటిరాయా
కుప్పళింపుఁ జెమటలగోనేటిరాయ । యెంత
గొప్పవాఁడవయ్య నీవు కోనేటి రాయ ॥కోరి॥

కొండికపాయ మమరెఁ గోనేటిరాయ । పైఁడి
గొండెలపచ్చడముతో గోనేటిరాయ
అండనే శ్రీ వేంకటాద్రి నలరి నన్నేలితివి
కొండలలో నెలకొన్న కోనేటిరాయ ॥కోరి॥

ఉపోద్ఘాతము :

నేటి కడపజిల్లాలోని రాజంపేటకు, తాళ్ళపాకకు సమీపంలో వున్న గ్రామం ఊటుకూరు. అక్కడ వెలసిన దేవుని కోనేటిరాయడు అని వ్యవహరించి యెన్నో కీర్తనలు చెప్పారు అన్నమయ్య. "కొండలలో నెలకొన్న కోనేటి రాయడువాడు, కొండలంత వరములు గుప్పెడివాడు.." అనే సుప్రసిద్ధకీర్తన ఇక్కడిదే. నేడు

నాకోరికలన్నియును ఈడేరినవి. మా కూరిములు ప్రేమలుకూడా ఇట్టే నెరవేరినాయి.. అంటున్నారు. శ్రీ వేంకటాద్రి నలరించిన కోనేటిరాయా! నీవు కొండలలో నెలకొని నన్నేలితివి అంటున్నారు.

తాత్పర్యము :

కోనేటిరాయుడవైన శ్రీ వేంకటేశ్వరా! నేడు మా కోరికలన్నియున్ ఈడేరినవి (నెరవేరినవి)... ఊటుకూరిలో నెలకొన్న ఓ కోనేటిరాయా! మా ప్రేమలు ఫలించినవి స్వామీ!

కొమ్మలెల్ల జూడగా (స్త్రీలందరూ చూచుచున్నప్పుడు)సిగ్గులొలకబోస్తున్నావు. వాడియైన కొమ్ములవంటి కొనగోళ్ళతో గోసేవు (రక్కిపెడతావు). ఓ కోనేటిరాయా! నా మేను (శరీరము) కుమ్మెలుగా (గాయమగునట్లు) ఒత్తకుమీ (నొక్కిపట్టవద్దు) నాకు నొప్పి కలుగుతుంది స్వామీ!

ఓ కోనేటిరాయా! నా కొప్పు ముడి సడలి జారిపోయినది. అట్లా యెందుకు జరిగిందో గుర్తుకువచ్చి నీవు నిండైన చిరునవ్వులు చిందిస్తున్నావు... కుప్పళింపు జెమటల (ధారగా కారిపోయే చెమటలుగల) కోనేటిరాయా! నీవు ఎంత గొప్పవాడవయ్యా!!

ఓ కోనేటిరాయా! ఇంతా చేసి నీవు కొండికపాయముడవు (బాలుడవు) పైడికొండెల పచ్చడము వాడవు. (మేరు పర్వతమువలె సువర్ణపురంగు గల పీతాంబరమును ధరించినవాడవు). అండనే (అక్కడే) వున్న శ్రీ వేంకటాద్రిపై నెలకొనిన శ్రీ వేంకటేశ్వరా! నీవు నన్నునుగ్రహించి యేలుకొంటివి. అందుకే నిన్ను "కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు"... అని కీర్తిస్తున్నాను.

సంపుటి : 26 కీర్తన : కుందనపు బిల్లగోవి గోపీనాథా
సంఖ్య : 186 పుట : 131 - రాగం : దేశాళం

100. కుందనపుఁబిల్లఁగోవి గోపీనాథా । మాపైఁ
జిందేవు మోహరసాలు చిన్నిగోపీనాథ ॥పల్లవి॥

కొలనిలోపలిమాతో గోపీనాథా । యేల
కులికి నవ్వు నవ్వేవు గోపీనాథా
కొలువు మొక్కు మొక్కేము గోపీనాథా । నీ
చలము చల్లితేఁ జాలు జాణ గోపీనాథా ॥కుంద॥

గొబ్బున మాచీరలిమ్ము గోపీనాథా । మా
గుబ్బలపైఁ గాకరేఁగె గోపీనాథా
గుబ్బతిల్లీఁ దమకమే గోపీనాథా । నీ
కబ్బితి మేమైనఁ జేయవయ్య గోపీనాథా ॥కుంద॥

కుప్పవడె మాసిగ్గు గోపీనాథా । మా
కొప్పు జారె ముడువుమా గోపీనాథా
వొప్పుగ శ్రీ వేంకటాద్రినుండి వచ్చి కూడితివి
అప్ప తొండామారేగుళ్ల ఆదిగోపీనాథా ॥కుంద॥

ఉపోద్ఘాతము :

తొండమారేగుళ్ళ అనే వూరిలో వెలసిన గోపీనాథునిపై ఈ కీర్తన చెబుతున్నారు అన్నమయ్య. ఇదమిద్ధంగా ఇదెక్కడున్నదో తెలియరావటంలేదు. కాలగర్భంలో అనేక మార్పిడి చేర్పిడులు జరిగి వుండవచ్చును. అన్నమయ్య కాలంలో ఆ స్వామికి బంగారంతో చేసిన పిల్లగోవి (మురళి) వుండి వుంటుంది. మాపై మోహములుప్పొంగే

మోహరసాలు చిందిస్తున్నావయ్యా! అని కీర్తిస్తున్నారు. కొలనులో గోపికలు స్నానం చేస్తుంటే చీరలెత్తుకుపోయిన కొంటె గోపీనాథుని గోపికలు వేడుకొంటున్నారు.

తాత్పర్యము :

కుందనపు బిల్లగోవి (బంగారు మురళి) కలిగిన ఓ గోపీనాథా! నీవు మాపై మోహరసమును చిందించుచున్న చిన్నారి గోపీనాథుడవు.

ఓ గోపీనాథా! మేము కొలనులోపల నగ్నంగా స్నానం చేస్తుంటే మాతో నీవు శృంగారపు నవ్వులను, యేలకులికేవు (ఎందుకు వెదజల్లుతున్నావు). స్వామీ! నీకు కొలువు మొక్కు మొక్కేము (రాజాస్థానములో రాజుకి సేవకులు వినయంతో మ్రొక్కునట్లు మ్రొక్కెదము). జాణవైన గోపీనాథా! నా చలము (మత్సరము) చెల్లితే చాలును.

ఓ గోపీనాథా! గొబ్బున (గొబ్బున... అంటే... శీఘ్రముగా) మా చీరెలు మాకు ఇచ్చేయవయ్యా! మా గుబ్బలపై కాకరేగెనయ్యా! (పాలిండ్లు వేడైనవి). ఓ గోపీనాథా! తమకము గుబ్బతిల్లెన్ (పారవశ్యము పరిధులు దాటినది). నీకు అబ్బితిమి (ప్రాప్తించితిమి). నీ ఇచ్చవచ్చినట్లు యేమైనా జేయుమయ్యా!

ఓ గోపీనాథా! మా సిగ్గు కుప్పవడె (కుమ్మరింతకు గురైనది). అయిందేదో అయింది. ఇకనీ జారిన మా కొప్పును సవరించి ముడిచే బాధ్యతకూడా నీదే. ఎందుకంటే... నీవు ఆ శ్రీవేంకటాద్రిపై నుంచి మా కోసం వచ్చి గొప్పగా కూడినావు. ఇక్కడ ఈ తొండామారేగుళ్ళలో ఆది గోపీనాథుడవు (తొల్లిటి గోపికా రమణుడవైన) అప్పవు మా తండ్రివి.

సంపుటి : 21 కీర్తన : సోబాన బాడేము మేము సుదతులము
సంఖ్య : 40 పుట : 27 - రాగం : లలిత

101. సోబానc బాడేము మేము సుదతులము
యీ బుద్దులు మీకుc జెల్లు నిద్దరికి నయ్యా ॥పల్లవి॥

చూపులనే వుంకువలు సుదతికిc బెట్టితివి
పూపనవ్వులు మించే కప్పురవిడేలు
యేపుమీరి నవ్వులనే యెదురుతెర వేసితి-
వీపొద్దే పెండ్లాయను మీకిద్దరికినయ్యా ॥సోబా॥

తరితీపుమాటలనే తలcబాలు వోసితి
గరిమ సరసములే కంకణాలు
గొరబైన వలపుల కొంగులు ముళ్లువేసితి
విరవాయ వేడుకలు ఇద్దరికినయ్యా ॥సోబా॥

పొంచినకెమ్మోవినే బువ్వపువిందు వెట్టితి
మంచముపై కాcగిలే మంచిచవికె
అంచల శ్రీవేంకటేశ అలమేలుమంగ నీవు
యెంచి కూడితిరి తగు నిద్దరికినయ్యా ॥సోబా॥

ఉపోద్ఘాతము :

శ్రీ వేంకటేశ్వరుడు అలమేల్మంగను పరిణయమాడుతున్నాడు. మంగళగీతములు పాడుతున్నారు ముత్తైదువలు. అన్నమయ్య తానూ ఒకతెయై పరవశించి ఆలపిస్తున్నారు. మీకు ఇద్దరికీ ఈ బుద్దులు జెల్లు అంటున్నారు. సాధారణ వధూవరులకు బుద్ధులు (హితవు) చెప్పాలికానీ జగతికే మాతాపితలకు మనం చెప్పే బుద్దులేముంటాయి? అయినా సాంప్రదాయంగా పాడుతున్నాం.

వధూవరులకు చవిక (శోభనమునకు అమర్చిన పడకగది) యేమిటో తెలుసా?... మంచముపై కాగిలే అంటున్నారు. ఆనాటి పదములు ఈనాడు వాడుకలో లేవు. అదో సమస్య.

తాత్పర్యము :

సుదతులము (ముత్తైదువులము) అయిన మేము సోబాన బాడేము (మంగళ గీతికలను పాడుచున్నాము). మాకు తోచిన హిత వాక్యములను చెబుతున్నాము. అయ్యా! (స్వామీ!) మీ ఇద్దరికి యీ బుద్దులు జెల్లు. మేము వేరే చెప్పవలెనా?

ప్రభూ! నీవు ఈ సుదతికి (దేవికి) పెట్టిన ఉంకువలు (కన్యాశుల్కము) యేమిటో తెలియునా? నీవు చూసే మనోహరమైన నీ చూపులే. విరిసిన నీ నవ్వులే ఆమెకు నీవిచ్చే కర్పూర తాంబూలము. మీకు అమర్చిన ఎదురుతెర (వధూవరుల మధ్య వుంచెడి తెర) యేమిటంటే యేపు మీరిన (అతిశయించిన) మీ నవ్వులే, ఈ విధంగా మీ ఇద్దరికీ ఈ పొద్దున పెండ్లాయెను.

ప్రభూ! తరితీపుమాటలే (ఆడపెళ్ళివారు మొగపెళ్లివారు పలుకరించుకొను మాటలే, మీ తలంబ్రాలు.) ఒకరితో నింకొకరు ఆడుకొనే పరాచికాలే మీ కంకణాలు (వధూవరులకు కట్టే తోరణాలు). అప్పుడు నీవామెకు గాఢమైన వలపులనే కొంగుముళ్ళు వేసినావు. ఇప్పుడు మీ ఇద్దరికీ వేడుకలు విరివాయె (అధికములైనవి).

స్వామీ! వివాహానంతరం బువ్వలు (విందు భోజనం) వుంటుంది కదా! మీ మధురాధర పానమే మీకు కావలసిన విందు భోజనం. శోభనపు శయ్యపై మీ గాఢాలింగనమే, మీ చవికె (శోభనమండపము). ఓ శ్రీవేంకటేశ్వరా! నీవూ అలమేల్మంగ నేడు అంచల (ఈవైపున) కూడినారు. మీ ఇద్దరికీ ఈ కూటమి తగినదయ్యా!

శ్లో॥ శ్రియః కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్ ।
శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥

ప్రత్యేక కృతజ్ఞతలు

సర్వశ్రీ....

1. డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ

2. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు

3. నేదునూరి కృష్ణమూర్తి గారు

4. గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు

5. గరికపాటి వెంకట్ గారు

6. గురు కొండవీటి జ్యోతిర్మయి గారు

7. శోభారాజ్ గారు (అన్నమయ్య ప్రేరణ వీరివల్లనే)

8. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారు

9. శంకర చంద్ర పవన్

ఇంకా ఎందరో, మరెందరో... వారందరికీ